# వావిలాల సోమయాజులు

## సాహిత్యం-3

## అనువాదాలు

## బాలసాహిత్యం

ఎమెస్కో

**Vavilala Somayajulu Saahityam- 3**
**ANUVAADAALU, BAALA SAAHITYAM**
**వావిలాల సోమయాజులు సాహిత్యం - 3**
**అనువాదాలు, బాలసాహిత్యం**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **మార్చి, 2018**

మూల్యం: రూ. **500/-**

ISBN: 978-93-86763-68-6

ముఖచిత్రం: **స్టార్ మీడియా సర్వీసెస్**, హైదరాబాద్

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

# ముందుమాట

శ్రీ వావిలాల సోమయాజులు (19.1.1918 – 9.1.1992) గుంటూరు జిల్లా విప్రులపల్లె అగ్రహారంలో జన్మించారు. తండ్రి సింగరావధానులుగారు, తల్లి మాణిక్యాంబ గారు. నరసరావుపేట, గుంటూరులో వారి విద్యాభ్యాసం జరిగింది. భార్య కైకమ్మగారు.

సోమయాజులుగారు 1940–46 మధ్య గుంటూరులోని శ్రీ శారదానికేతన ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆ తర్వాత 1976లో పదవీవిరమణ పొందేవరకు గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగా పనిచేశారు.

సోమయాజులుగారి జీవితం పూర్తిగా సాహిత్య రచనకు, సాహిత్య ప్రచారానికే అంకితమై పోయింది. తనకు ఇరవయ్యేళ్లు నిండీ నిండకముందే సాహిత్య సంస్థలలో సభ్యుడిగా సాహిత్య సేవ ప్రారంభించారు. 1939 నుండి సాహితీ సమితి సభ్యులు. ఈ సమితికి సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా వ్యవహరించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు సహాయ కార్యదర్శి. 'ప్రతిభ' పత్రికకు రచనలను ఎంపిక చేసే నిర్ణాయక సంఘంలో సభ్యుడు. 1963–73 మధ్య ఒక దశాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు.

సోమయాజులుగారు సంస్కృతాంధ్రాంగ్లాలలోను, హిందీలోను గొప్ప పండితులు. ఈ నాలుగు భాషల్లోనూ ఏ భాష నుండి మరే భాషలోనికయినా అనువాదం చేయగలిగిన సమర్థత కలిగినవారు. వచనాన్నే కాదు పద్యాన్ని పద్యరూపంలోనే అనువదించడంలో సిద్ధహస్తులు. ఆయన సహజంగానే కవి కావడంవల్ల అనువాదంలోనూ మూలకావ్యం లోని కవిత్వాంశను సంపూర్ణంగా ప్రదర్శించగలిగిన కవితా హృదయాన్ని సొంతం చేసుకున్నారు.

సోమయాజులుగారి సాహిత్య సృజనా జీవితం బహువిపులమైంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రారంభమైన వారి సాహిత్య సేవ జీవితాంతం కొనసాగింది. ఇంత బహుళంగా రచనలు చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. అందులోనూ ఇన్ని ప్రక్రియలలో రచనలు చేసినవారు మరీ అరుదు. ఆయన కవిత్వం రాశారు. అందులో పద్యరచనలూ

ఉన్నాయి, గేయ రచనలూ ఉన్నాయి. అతిసాధారణ వచనాన్ని కూడా అటు పద్యంలోనూ, ఇటు గేయంలోనూ ఇమిడ్చి మనోహరంగా రచింపగలిగిన శక్తి వారిది. నాటకాలు రాశారు, నాటికలు రాశారు. పద్య నాటికలు రాశారు, గేయనాటికలు రాశారు, సంగీత రూపకాలు రచించారు. శ్రవ్య నాటికలు రాశారు. నవలలు రాశారు. ఆంగ్లం నుండి నాటకాలూ, నవలలూ అనువదించారు. వీటిలో షేక్స్పియర్ నాటకానువాదాలు తెలుగులో వావిలాల వారివే బహుజనాదరణ పొందాయి. హిందీ నుండి మహాకవి జయశంకర ప్రసాద్ కావ్యాలు 'కామాయని', 'ఆంసూ' లను అతిమధురంగా పద్యకావ్య రూపంలో అనువదించారు.

ప్రౌఢ కవి అయిఉండీ పిల్లలకోసం సరళవచనంలో నవలలూ, దేశనాయకుల, దేశభక్తుల, చారిత్రక వ్యక్తుల, కవుల జీవిత గాథలూ రచించారు.

ఆయన పద్యరచన ఎంత విపులమో గద్యరచనకూడా అంతే విపులం. కథలు, జీవితగాథలు, నాటకాలు, నవలలను పక్కన బెడితే ఆయన సృష్టించిన వ్యాస సాహిత్యం అపారం. పరిశోధనాత్మక వ్యాసాలెన్నో రచించిన సోమయాజులుగారు సృజనాత్మక వ్యాసాలూ విస్తృతంగా రాశారు. ఆయన ఎంపిక చేసుకున్న విషయాలే మనల్ని విస్మయ పరుస్తాయి. డజనుకు పైగా వ్యాసాలు వివాహం పైనే అంటే ఆయనకు ప్రజల సాంఘిక జీవనం మీద, ఆచార వ్యవహారాల మీద ఉన్న పట్టును, అవగాహనను మనం అర్థం చేసుకోవచ్చు, మూడుపదుల వయస్సులో ఆయన వాత్స్యాయన కామసూత్రాలపై సాతవాహన సంచికలో రాసిన బృహద్వ్యాసం నేటికీ పరిశోధన వ్యాసానికి ఉదాహరణ ప్రాయంగా నిలుస్తుంది. ఆయన ఏమి రాసినా అది ప్రామాణికమే. తాను చెప్పే ప్రతి విషయానికీ ఆయన ఆధారం చూపుతారు.

సోమయాజులు గారి రచనలకు మరోపార్శ్వం కూడా ఉంది. ఆధ్యాత్మికంగా భారతీయ దార్శనికతా ప్రియుడైన ఆయన బహాయీ సాహిత్యాన్ని అనువదించారు. క్రైస్తవ రచనలను అనువదించారు.

సోమయాజులుగారు ఇంగ్లీషులో కూడా కొన్ని వ్యాసాలు రచించారు.

సాహిత్యాచార్య, సాహిత్యరత్న, సాహిత్య బంధు, మధురకవి, కవి భూషణ, కుమార ధూర్జటి, పద్యవిద్యాధర వంటి అనేక బిరుదాలతో ఆంధ్ర సాహిత్యలోకం వావిలాల సోమయాజులు గారిని సమ్మానించింది. ఈ బిరుదులు ఆయన రచయితగా ఒకవైపు, సాహిత్య సేవకుడుగా మరోవైపు చేసిన కృషికి అద్దం పడతాయి.

ఐదు దశాబ్దాలకు పైబడిన సాహిత్య జీవితంలో సోమయాజులుగారు చేసిన అసంఖ్యాక రచనల్లో ఎన్నో అలభ్యంగా ఉండిపోయాయి. కొన్ని అముద్రితాలుగా ఉండిపోయాయి. లభించిన రచనల్లో ముద్రితా ముద్రితాలన్నింటిని కలిపి ఇప్పుడు ఆయన లభ్యరచనల సమగ్ర సంపుటాలను ప్రచురించే ప్రయత్నం చేస్తున్నాం.

ఈ సంపుటులలో ఇది మూడవది.

19వ శతాబ్దం ద్వితీయార్ధంలోనే తెలుగులో నాటకరచన ప్రారంభమైనది. స్వతంత్ర నాటకాలు తక్కువగానూ, అనువాద నాటకాలు ఎక్కువగానూ మొదట్లో వచ్చేవి. అనువాదాల్లో ఎక్కువ భాగం సంస్కృత నాటకాలకు అనువాదాలు. తెలుగువారికి ఆంగ్ల సాహిత్యంతో పరిచయం ఏర్పడడంతో షేక్స్పియర్ వంటి నాటకకర్తల నాటకాలను తెలుగులోకి తేవాలన్న కాంక్ష ఏర్పడింది. ఆ రోజుల్లో ఆంగ్లాధికారులు, కళాశాలల ప్రధానాచార్యులుగా ఉన్న ఆంగ్లేయులు ఆంగ్ల నాటకాల ప్రదర్శనలు చేయించారు. వాటిలో ముఖ్యమైనవి షేక్స్పియర్ నాటకాలే. షేక్స్పియర్ నాటకానువాదకులలో మొదట చెప్పుకోదగినవాడు వావిలాల వాసుదేవ శాస్త్రి. మన వావిలాల వారితో ఇంటిపేరు కలిసింది. తరువాత గురజాడ శ్రీరామమూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు తదితరులు షేక్స్పియర్ నాటకాలను అనువదించారు. అనువాదంలోనూ భిన్న పద్ధతులు అనుసరించారు. కొందరు మొత్తం నాటకాన్ని ద్విపద తేటగీతి వంటి ఛందస్సులలో రాయగా, మరికొందరు గద్య పద్య మిశ్రంగా కేవలం గద్యరూపంలోనూ రచించారు. కొందరు స్థలాల పేర్లు, పాత్రల పేర్లు మార్చి నాటకాన్ని ప్రాంతీయం చేసారు. కొందరు యథాతథంగా అనువదించారు. కొందరు గ్రాంధిక భాష వాడితే, మరికొందరు వ్యావహారికం వాడారు.

వావిలాల సోమయాజులు గారు మూడు షేక్స్పియర్ నాటకాలను అనువదించారు. అవి జూలియస్ సీజర్, ఆంటోని – క్లియోపాత్రా, మేక్బెత్. ఈ మూడు నాటకాలకూ ఆయన విపులమైన పరిచయం రాసారు. అథోజ్ఞాపికలు ఇచ్చారు. నాటకాన్ని అర్థం చేసుకోవడానికి కావలసిన సామగ్రి అంతా ఇచ్చారు.

నాటకాన్ని బహుసరళంగా పాత్రోచితమైన వాడుకభాషలో దాదాపు మొత్తం గద్యరూపంలోనే రచించారు. ఎక్కడో అవసరమైన కొద్దిమాత్రపు గీతాలను వాడారు. బహుశ తెలుగులో ప్రదర్శన యోగ్యంగానూ, ఆధునిక భాషలోనూ, యథామాతృకం గానూ షేక్స్పియర్ నాటకాలను అనువదించడంలో మొదటివారు సోమయాజులుగారే.

ఇంగ్లీషులో రాబర్ట్ లూయి స్టీవెన్సన్ రచించిన నవల 'డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్'. ఆ కాలంలో ఈ నవల పాఠకలోకాన్ని ఎంతగానో ఆకర్షించింది. వ్యక్తిలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది. వ్యక్తిలోని మంచి ఒక పాత్రగానూ, చెడు మరొక పాత్రగానూ ఉన్నట్లయితే ఎలా ఉంటుంది. ఒక వ్యక్తే భిన్న సమయాలలో మంచివాడుగానూ, చెడ్డవాడుగానూ ప్రవర్తిస్తే ఎలా ఉంటుంది. మనిషిలోని చెడు స్వభావమే మంచి స్వభావాన్ని కూడా పూర్తిగా ఆక్రమించుకుంటే ఆ మనిషి జీవితం ఏమవుతుంది తెలియజెప్పేదే ఈ నవల.

ప్రౌఢ కవి విమర్శకులు పిల్లలకోసం సరళంగా సాహిత్య సృజన చేయడం చాలా కష్టం. వారికి అలవాటైన శైలి వారు పిల్లలకోసం రాసేదానిలోకీ చొరబడుతుంది. అలా కాకుండా సోమయాజులుగారు పిల్లలకోసం సరళమైన భాషలో 'ఆండ్రూ కార్నెగీ' జీవిత కథను రచించారు. ఒక ఉత్తమ విద్యార్థి కథను 'నాలంద' అన్న నవలికగా తీర్చిదిద్దారు. వీరు 'అగ్రగాములు' అన్న పుస్తకంలో ఝాన్సీ లక్ష్మీబాయి, లోకమాన్య తిలక్, గాంధీజీ, నేతాజీల జీవిత గాథలను పిల్లలకోసం రచించారు. ఈ నలుగురు స్వాతంత్ర్య సమర యోధుల కథలు పిల్లలలో దేశభక్తిని పెంపొందింపజేస్తాయి.

కదంబములో ఆరు కథలున్నాయి. వీటిలో త్యాగము, భ్రాతృప్రేమ, అహింస, ధర్మబుద్ధి, దేశాభిమానము ముఖ్య నీతులు. పిల్లలలో మంచి నీతిని పెంపొందించడానికి ఉద్దేశించిన కథలివి.

స్వాభావికంగా అధ్యాపకులైన వావిలాల సోమయాజులు గారు ఒకవైపు ప్రౌఢ సాహిత్యాన్ని సృష్టిస్తూనే మరోవైపు అంతర్జాతీయ ఖ్యాతిపొందిన షేక్స్పియర్ నాటకాలను అనువదించడం, అదే సమయంలో బాలబాలికల కోసం నీతికథలను రచించడం, వారికి భావి భారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దాలనే అభిలాషను తెలియజేస్తుంది.

**డి. చంద్రశేఖర రెడ్డి**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| **1.** | **జూలియస్ సీజర్** | **9-134** |
| **2.** | **ఆంటోని - క్లియోపాత్రా** | **135-322** |
| **3.** | **మేక్బెత్** | **323-458** |
| **4.** | **డాక్టర్ జెకిల్ - మిస్టర్ హైడ్** | **459-554** |
| **5.** | **బాలసాహిత్యం** | **555-911** |
| | 1) ఆంధ్రూ కార్నెగీ | 557-704 |
| | 2) నాలంద | 705-790 |
| | 3) అగ్రగాములు | 791-870 |
| | 4) కదంబము | 871-911 |

# జూలియస్ సీజర్

షేక్స్పియర్ మహాకవి కృతము

# భూమిక

## కవి జీవితవిశేషాలు

'ప్రపంచాగ్రగణ్యుడైన నాటకకర్త' అని ఖ్యాతివహించిన విలియం షేక్స్‌పియర్ క్రీ.శ. 1564 ఏప్రిల్ మాసంలో ఆంగ్లదేశంలోని స్ట్రాఫర్డ్ – ఆన్ – ఆవన్ అనే నగరంలో జన్మించాడు. తన పదునాల్గోసంవత్సరం దాకా స్వల్పంగా విద్యాగ్రహణం చేసి, తండ్రి జాన్ షేక్స్‌పియర్‌కు వ్యాపారంలో తోడ్పడటానికని విద్యార్జనకు స్వస్తి చెప్పాడు. పదునెనిమిదవ ఏట తనకంటే ఏడు సంవత్సరాలు పెద్దదైన ఆనీహాథ్‌వే అనే కన్యను వివాహమాడాడు.

యౌవనారంభదశలో సర్ జాన్ లూసీ అనే ధనికునితో పేచీ, వైవాహిక జీవిత వైఫల్యం షేక్స్‌పియర్‌ను జన్మసీమకు దూరం చేశాయి. క్రీ.శ. 1584లో అలా అతడు లండన్ మహానగరం చేరుకున్నాడు. 'గ్లోబ్' నాటకశాలలో మొదట 'అశ్వబాలుడు', 'ఆమంత్రణ – బాలుడు' ఉద్యోగాలు చేసి, క్రమంగా ఆ నాటకశాలలోనే నటకుడు, నాటకరచయితగా పదోన్నతి పొందాడు. ప్రారంభదశల్లో అతడు ఇతరుల నాటకాలను ప్రదర్శనీయంగా మలిచాడు. కాలక్రమాన అనుభవాన్ని స్వీయ నాటకరచన ద్వారా సమకాలీన నాటకకర్తల్లో అగ్రగణ్యుడనిపించుకున్నాడు. తన 24 సంవత్సరాల సాహితీ జీవితంలో 37 నాటకాలు రచించాడు. నటకుడుగా షేక్స్‌పియర్ ప్రజ్ఞావిశేషాలు ఏ స్థాయిని తాకినవో తెలియరాలేదు.

ఆత్మశక్తివల్ల నిత్యాభివృద్ధి పొందుతూ ప్రసిద్ధుడై ధనార్జనం చేసి, ప్రభువర్గంలో చేరి ఎసెక్సు, సౌతాంప్టన్ ఎరల్స్, పెంబ్రోక్ ప్రభువులతో మైత్రి సంపాదించి వారికి సరివాడనిపించాడు. ఎలిజిబెత్ రాణి, జాన్ రాజు ఆయన నాటకాలపై ఆసక్తులై బిరుదులతో గౌరవించారు. లౌకిక జీవితంలో కూడా విజయాలను సాధించి లోకజ్ఞుడనిపించుకొన్న షేక్స్‌పియర్, జీవిత చరమాంకంలో తన సంపదతో జన్మప్రాంతమైన స్ట్రాఫర్డ్‌కు వచ్చి ప్రశాంత జీవితాన్ని గడిపి, 23 ఏప్రిల్ 1616 తేదీన తనువు చాలించాడు.

## నాటక రచన, వివిధ దశలు

1588 మొదలు 1612 వరకు సాగించిన 24 సంవత్సరాల సాహితీజీవితంలో షేక్స్పియర్ 37 నాటకాలు, రెండు మహాకావ్యాలు, కొన్ని ఖండకావ్యాలు రచించాడు. షేక్స్పియర్ నాటక రచనాకాలాన్ని విమర్శకులు నాలుగు దశలుగా విభజించారు.

**ప్రథమదశ (1588–1595):** ఈ దశ నాటకాల్లో చరిత్రాత్మకాలు, విషాదాంత, సుఖాంతాలూ. వీటిలో ప్రసిద్ధమైనవి హెన్రీ VI మూడుభాగాలు, మూడవ రిచర్డ్, రెండవ రిచర్డ్, రోమియో–జూలియట్, వేసవినాటి రాత్రికల మొదలైనవి. వీటిలో భాషాపటిమే గాని భావగాంభీర్యం తక్కువ.

**ద్వితీయదశ (1595 - 1601):** ఈ దశలో షేక్స్పియర్ కొన్ని సుప్రసిద్ధ సుఖాంతనాటకాలు, చరిత్రాత్మక నాటకాలు రచించాడు. వెనిస్ వర్తకుడు, జాన్ రాజు, నాల్గవ హెన్రీ రెండుభాగాలు, ఐదవ హెన్రీ ఈ కాలంనాటివి. ఈ దశలోని నాటక రచనాకాలం నాటికి షేక్స్పియర్ మహాకవి మనస్సు పరిపక్వం కావటం ప్రారంభించింది. వీటిలో ప్రపంచానుభవం, మనస్తత్త్వ పరిశీలనం, గత నాటకాలలో కన్నా ఎక్కువ.

**తృతీయదశ (1601–1608):** ఈ దశలో జన్మించినవే జూలియస్ సీజర్, ఆంటోనీ క్లియోపాత్రా, కోరియలానస్ అనే మూడు రోమ్‌దేశ చరిత్రాత్మక నాటకాలు. హామ్లెట్, ఒథెల్లో, లియర్, మాక్బెత్ – అనే విషాదాంత చతుష్టయం కూడా యీ దశలోనివే. ట్రాయిలస్ – క్రెసిడా వంటి సుఖాంత నాటకాలు కొన్ని ఉన్నప్పటికీ విమర్శకులు ఈ దశను 'విషాదాంత దశ' గానే పేర్కొన్నారు. ఈ దశలో మహాకవి షేక్స్పియర్ విలాసం, ప్రణయం, యుద్ధవైభవాదులమీదకు పోయే బుద్ధిని మానవ హృదయకుహరాంతరాలకు మళ్ళించి, అంధకారం ఆవరించిన అక్కడి మానవ దౌష్ట్య స్వరూప స్వభావాదులను దర్శించి అవకర్షణ చేసి ప్రదర్శించాడు.

**చతుర్థదశ (1608 - 1611):** తుది దశ. ఇది ఒక నవచైతన్య దశ. శీతకాల కథ, సింబలైన్, తుపాను, పెరికిల్స్ ఈ దశలో పుట్టిన రూపకాలు. ఈ నాటకాల్లో ప్రశాంతచిత్తం, సుఖదుఃఖాదుల యెడ సమబుద్ధి ప్రకటితాలౌతుంటవి. దీన్ని విమర్శకులు షేక్స్పియర్ పరిపక్వదశగా భావిస్తుంటారు.

## రోమను నాటకాలు

తన తృతీయదశలో షేక్స్‌పియర్ చెప్పిన జూలియస్ సీజర్, ఆంటోనీ – క్లియోపాత్రా, కొరియలాసస్ అన్న మూడు నాటకాలకూ ఆధారం రోమను చరిత్ర. ఈ మూడు నాటకాలూ విషాదాంతాలు. మూడింటికీ ప్లూటార్క్ "జీవితాలు" ఆధారం. షేక్స్‌పియర్ మహాకవి కొరియలాసస్ నాటకంలో వివిధవర్గాలవారు ఔన్నత్యానికోసం తమ అనంతశక్తిని ధారవోస్తూ కలహిస్తున్న రోమును, సీజర్‌లో సిద్ధాంతాల మధ్య కలిగిన సంఘర్షణవల్ల అనతికాలంలో ఛిద్రం కానున్న మహత్తర సంపత్సమృద్ధమైన రోమును, ఆంటోనీ – క్లియోపాత్రాలో వ్యక్తుల స్వార్థపరత్వం వల్ల కొల్లబోవటానికి సంసిద్ధమైన అధికార ప్రాభవాలు గల రోమును ప్రదర్శించాడు. రోమక నాటక త్రయంలోని నాయకులు ముగ్గురూ గొప్ప వ్యక్తులు. సీజర్ నాటకానికి నాయకుడైన బ్రూటస్ స్వార్థరహితుడైన దేశభక్తుడు. ఆంటోనీ – క్లియోపాత్రాలో నాయకుడైన ఆంటోనీ విలాస ప్రియత్వంతో అధఃపతితుడైన మహాసేనాని. కొరియలాసస్‌లోని నాయకుడు దేశభక్తి ద్వారా సద్గుణాలను అధిగమించిన స్వార్థపరత్వం వల్ల దెబ్బతిన్న మహాగర్వి, ఆత్మాభిమాని. ఈ నాటకత్రయం రోము దేశ చరిత్రకు ముకురాలు. ఈ మూటిలోను జూలియస్ సీజర్ ఉత్తమోత్తమం.

## కథాకాలం నాటి రోము

కథాకాలం నాటి రోము మహత్తర విజయాలను సాధిస్తున్నా, వర్గకలహాలతోనూ, అంతర్యుద్ధాలతోనూ నిండి ఉండేది. రోమను సామ్రాజ్య పాలనను ప్రాచీన రోమను ప్రభు కుటుంబాలవారే సాగించాలని కొందరు, పౌరులకు, ఇతర ప్రజలకు సమానత్వాన్ని ప్రసాదించే పాలనను రూపొందించాలని కొందరు, ఈ ప్రజాస్వామిక విధానాలతో మీ కెటువంటి ప్రమేయం లేదు, శక్తిమంతుడైన ఒక పాలకుని క్రింద అభ్యుదయాన్ని పొందటమే మా ఆశయమని కొందరూ భిన్నాభిప్రాయాలు వహిస్తూ పరస్పరం వైమనస్యాలను వెళ్ళబోసుకుంటున్నారు. వీళ్ళకు నిత్య చాంచల్యం గల సామాన్య జనసముదాయం వివక్షారహితంగా తోడ్పడుతూ వస్తున్నది. సక్రమ ప్రజాస్వామికానికి ఆవశ్యకాలైన ముఖ్యసూత్రాలు చెదిరిపోయినవి. రోముకు కావలసింది శక్తిమంతమూ, జ్ఞానోపేతమూ అయిన సుస్థిర ప్రభుత్వం. ఇటువంటిదాన్ని ఆ నాటి ప్రజలు కల్పించుకోగలరా అన్నది ప్రశ్న.

రోమనులు ప్రధానంగా 'పెట్రీషియన్లు' (ప్రభువర్గం), 'ప్లెబియన్లు' (జన సామాన్యవర్గం) అని రెండు తెగలు. ఇంటి బానిసలు, యుద్ధ బానిసలు, అండదండలు

లేని విదేశీయులు ఇతర బానిసలూ, దుష్క్రియలు చేయటానికి స్వేచ్ఛ గల స్వతంత్రులూ ఈ జనసామాన్యవర్గంలో వారు. వీరు ధర్మాధికారులమీదా, సంరక్షకుల మీద తిరుగబడి హత్యలు చేస్తుంటారు. ధర్మానికి కట్టుబడేవారు కారు. పాంపే విజయంతో వచ్చినప్పుడు ఆయన్ను గౌరవించి ఆహ్వానించారు. అతణ్ణి చంపివచ్చిన సీజర్‌కు ఘనస్వాగతం చెప్పారు. సీజర్‌ను హత్యచేసిన బ్రూటస్‌ను 'సీజర్'ను చేద్దామనుకున్నారు. వారి నాయకులు చేకొన్న విజయం విదేశీయులమీద నైనా, స్వదేశీయులమీద నైనా వారికి ఒకటే. విషయగ్రహణశక్తి లేనివారిని, ప్రసంగ ప్రావీణ్యమున్న వక్తలు తమ వక్తృత్వశక్తితో కీలుబొమ్మలను చేసి ఆడిస్తుండేవాళ్ళు. వారు స్వేచ్ఛాస్వరూపాన్నే మరిచిపోయారు. జనసామాన్యవర్గస్థితి ఇలా ఉంటే ప్రభు వర్గస్థితిగతులు ఇంతకంటే అధ్వాన్నంగా ఉన్నవి. సభాభవనంలో వక్తలు ఒకరినొకరు తిట్టుకోవటం, ఒకరి ముఖాన ఒకరు ఉమ్మేసుకోవటం, ఎన్నికల సమయంలో అసభ్యంగా ప్రవర్తిస్తూ పెద్ద మనుష్యులు వీథుల్లోకి రావటానికి వీల్లేనంతగా అల్లరులు చేస్తూ, చేయిస్తూ ఉండటం వారికి నిత్యలక్షణాలైనవి. సభాభవనంలోనే తములయుద్ధాలూ, హత్యలూ జరిగించేవాళ్ళు. ఇటువంటి రోములో ప్రజాస్వామికానికి తావెక్కడుంది? సీజరిజం (నిరంకుశత్వం) తప్ప మార్గాంతరం లేదు. రోము అటువంటి నిరంకుశుని ఆగమనం కోసం ఎదురు చూస్తున్నది.

సీజర్ తగిన అర్హతలతో ఉద్భవించాడు. ఆహారవినోదాలను కల్పిస్తే తృప్తిపడి ఎటువంటి ప్రభుత్వ విధానమైనా పట్టించుకోకుండా తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోవటానికి సంసిద్ధులై ఉన్నారు రోము సామాన్య ప్రజలు. కానీ ప్రభు కుటుంబాలలోనికొందరు వ్యక్తుల హృదయాలలో కొంత వ్యక్తిగతేర్ష్యవల్ల నైతేనేం, కొంత జితించిన స్వాతంత్ర్య ప్రియత్వం వల్ల నైతేనేం సీజర్ యెడ వ్యతిరేకత ఉంది. ఈ వ్యతిరేకతకు ఫలితమే సీజర్ వధ. సీజర్ వధాఫలితాలే ప్రజాక్రోధం, బ్రూటస్ – కాషియస్‌ల పలాయనం. ఫిలిప్పీ యుద్ధభూమిలో వారికి అకారణ నిరాశానిస్పృహలు, సంపూర్ణ పరాజయం, బ్రూటస్ ఆత్మహత్యతో 'సీజరిజం'కు పరిపూర్ణవిజయం, స్వాతంత్ర్యేచ్ఛకు స్వస్తి చేకూరాయి. ప్రజల రాచరిక ప్రియత్వం బయటపడ్డది. రోమక సామ్రాజ్యంలోని రాజకీయ, సాంఘికశక్తుల సంఘర్షణ అంతరించింది. ఆక్టేవియస్ సీజర్ సైనిక రాచరికాన్ని స్థాపించి రోమక మహాసామ్రాజ్యాధినేత యైనాడు.

## కథాసంగ్రహం

లూపర్ కేలియో ఉత్సవదినంనాడు రోములో సామాన్యజనులైన ప్లీబన్లు, ముండా అనే ప్రదేశంలో జరిగిన యుద్ధంలో అతని ప్రబలశత్రువులైన పాంపే కుమారులమీద

విజయాన్ని చేకొని వస్తున్న సీజర్‌ను మహావైభవంతో ఆహ్వానించటానికి, ఆ నాటిని సెలవు దినంగా భావించి వీథుల్లో గుంపులుగా చేరుకుంటారు. ప్రజాధర్మాధికారులైన ఫ్లేవియస్, మారులస్ పాంపేయెడ వారి కృతఘ్నుతకు నిందిస్తూ చెదరగొడతారు (అం1-దృ1). లూపర్ కేలియో ఉత్సవాలకు వెడుతున్న జనసమూహానికి ముందు సీజర్ పరివారంతో నడుస్తుంటాడు. ఒక శకునజ్ఞుడు అతణ్ణి 'మార్చి పదిహేనో నాడు జాగ్రత్త!' అని హెచ్చరిస్తాడు. సీజర్ అతణ్ణి 'ఎవరో స్వాప్నికు'డని త్రోసిపుచ్చి క్రీడలను చూడటానికి వెళ్ళిపొమ్మంటాడు. కాషియస్ బ్రూటస్‌ను ప్రక్కకు తీసికోపోయి సీజర్ జీవితంమీద జరిగే కుట్రలో చేరవలసిందని ఉద్బోధిస్తాడు. క్రీడలైపోయి సీజర్ వెళ్ళిపోతున్నప్పుడు వాళ్ళతో కాస్కా చేరి, సీజర్ ఆంటోనీ అర్పించిన రాజకిరీటాన్ని ఎలా ముమ్మారు త్రోసి పుచ్చాడో వివరిస్తాడు. బ్రూటస్ మనస్సులో సీజర్ ఆశాపరత్వాన్ని గురించిన ఆలోచన ఆరంభమౌతుంది. (అం1-దృ2). కాస్కా సిసెరోను కలుసుకొని కనిపించిన దుశ్శకునాల నన్నింటినీ వివరిస్తాడు. సిసెరో వెళ్ళిపోయిన తరువాత కాషియస్ అతణ్ణి కలుసుకొని, అంతకు పూర్వమే దుశ్శకునాలకు కలవరపడుతున్న అతని మనస్సుకు నచ్చచెప్పి, హంతకవర్గంలో చేర్చుకుంటాడు. అక్కడికి వచ్చిన సిన్నా కూడా వారిలో చేరుతాడు. ముగ్గురూ బ్రూటస్‌ను తమవాణ్ణి చేసుకోవటానికి పథకం వేస్తారు (అం1-దృ3)

సీజర్ ఆశాపరత్వం రోముకు ప్రమాదకారి అని భావిస్తూ మానసికాందోళనతో బ్రూటస్ తన ఫలోద్యానంలో రాత్రి నంతటినీ గడుపుతుంటాడు. హంతకులు వాతాయనంగుండా పడవేసిన ఉత్తరాలను చూచి రోము క్రూరపాలనకు పాల్పడకుండా చేయటంకోసం 'సీజర్‌ను ఆరంభదశలోనే హతమార్చటానికి' నిర్ణయిస్తాడు. విద్రోహకవర్గం ఆయన్ను కలుసుకున్న తరువాత చర్చించి హత్యాపథక వివరాలను నిర్ణయిస్తారు. ప్రమాణాలు తీసుకోవాలెననీ, ఆంటోనీని కూడా తుదముట్టించాలెననీ, సిసెరోను కలుపుకోవాలెననీ కాషియస్ చేసిన సూచనలను బ్రూటస్ వ్యతిరేకిస్తాడు. కాషియస్ లొంగిపోతాడు. సభాభవనంలో సీజర్‌ను మరునాడు చంపటానికి అంతా అంగీకరించి వెళ్ళిపోయిన తరువాత, బ్రూటస్ భార్య పోర్షియా వచ్చి ఆ రహస్య సమాలోచన లేమిటో, కళవళపెట్టే విశేషాలేమిటో తెలియజేయవలసిందని ప్రార్థిస్తుంది (అం. 2-దృ1). మర్నాడు సీజర్ భార్య కల్పూర్నియా శకునజ్ఞుని సూచననూ, రాత్రి తనకు వచ్చిన కలనూ చెప్పి, సీజర్‌ను సభాభవనానికి వెళ్ళకుండా నిర్బంధిస్తుంది. సభాసభ్యుల్లో ఒకడైన డెసియస్ వచ్చి కల్పూర్నియా కల సవ్యమైనదని చెప్పి మరొక

వ్యాఖ్యానాన్ని చేసి సీజర్ సభకు వచ్చేటట్లు చేస్తాడు. సభాభవనానికి తీసుకుపొయ్యే ఉద్దేశంతో బ్రూటస్ ప్రభృతులు సీజర్ ప్రాసాదానికి వస్తారు (అం2-దృ2). ఆర్టిమిడోరస్ సీజర్‌ను జాగ్రత్తగా ప్రవర్తించవలసిందనే సూచికాపత్రాన్ని చదువుతాడు (అం2-దృ3). భర్త రహస్యాలను తెలుసుకున్న పోర్షియా మానసిక వ్యధను భరించలేక సేవకుణ్ణి సభాభవనానికి వెళ్ళి బ్రూటస్ క్షేమ సమాచారాన్ని తెలుసుకోరావలసిందని పంపిస్తుంది (అం2-దృ4).

శకునజ్ఞులు ఇచ్చిన సూచనలను తిరస్కరించి ఆర్టిమిడోరస్, సీజర్ సభాభవనంలో ప్రవేశిస్తాడు. తాము పూర్వం ఏర్పాటు చేసుకొన్న క్రమాన్ని అనుసరించి, విద్రోహకవర్గంలో ఒకడైన మెటిల్లిస్ సింబర్, దేశబహిష్కృతుడైన తన అన్నను తిరిగి దేశానికి పిలిపించవలసిందని పెట్టుకొన్న వినతిపత్రాన్ని సీజర్‌కు సమర్పిస్తాడు. సీజర్ అందుకు వ్యతిరేకాభిప్రాయాన్ని ప్రకటించగా బ్రూటస్ ప్రభృతులు జోక్యం కలిగించుకుంటారు. సీజర్ హత్య జరుగుతుంది. ఈ కల్లోలంలో ఇంటికి పారిపోయిన ఆంటోనీ తిరిగి వచ్చి, తన భావాలను గుప్తంగా ఉంచి సీజర్ అంత్యక్రియోపన్యాసాన్ని ఇచ్చేటందుకు బ్రూటస్ అనుజ్ఞను పొందుతాడు. ఆక్టేవియస్ సీజర్ రోము దగ్గిరవరకూ వచ్చినట్లు వార్తవస్తుంది (అం. 3-దృ1). సీజర్‌కు తాను ఎందుకు వ్యతిరేకంగా తిరిగి అతణ్ణి హత్య చేయవలసి వచ్చిందో ఆ కారణాలను తెలుపుతూ, బ్రూటస్ విపణి ప్రదేశంలో ఉపన్యసిస్తాడు. ప్రజలు సంతృప్తి వహించి బ్రూటస్‌ను మహోదాత్తుడని శ్లాఘిస్తారు. తరువాత మార్క్ ఆంటోనీ సీజర్ మృతి కళేబరంతో ప్రవేశించి ప్రజలను ఉద్రేక పూరితులను గావించే ప్రసంగం చేసి విద్రోహులమీదికి వారు దండెత్తి గృహదహనం చేసేటట్లు చేస్తాడు. బ్రూటస్, కాషియస్ రోము నగరాన్ని వదిలి పెట్టి పారిపోతారు (అం. 3-దృ3). కోపోద్రిక్తమైన సామాన్య జనసముదాయం సిన్నాకవిని చూచి అతడు విద్రోహియైన సిన్నా అని భ్రాంతిపడి అతణ్ణి చీల్చివేస్తారు (అం. 3-దృ3).

రోముపాలన వీరత్రయ కూటమి - ఆక్టేవియస్, ఆంటోనీ, లెపిడస్‌ల హస్తగతమౌతుంది. వారు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి హతమార్చవలసిన సభాసభ్యుల జాబితాను తయారుచేస్తారు. బ్రూటస్, కాషియస్‌లను వెన్నాడి ఓడించటానికి పథకం వేస్తారు

(అం. 4-దృ1). సార్డిస్ రంగస్థలంలో బ్రూటస్, కాషియస్‌ల మధ్య కలహం ఏర్పడుతుంది (అం. 4-దృ2). బ్రూటస్ తన శిబిరానికి వచ్చిన కాషియస్‌ను లంచాలు

తీసుకున్నావనీ, ప్రజలను హింసించి ధనం దోచుకున్నావనీ నిందిస్తాడు. అనతికాలంలోనే ఇరువురి మధ్యా సంధి కుదురుతుంది. వెంటనే బ్రూటస్ తన భార్య పోర్షియా మరణాన్ని గురించి కాషియస్‌కు తెలియజేస్తాడు. తరువాత కాషియస్ సలహాను అతిక్రమించి బ్రూటస్ సైన్యాలతో ఫిలిప్పీవరకూ ఎదురువెళ్ళి శత్రువులను ఎదుర్కోవలెనని నిర్ణయిస్తాడు. ఏకాంతంగా ఉన్న బ్రూటస్‌కు సీజర్ భూతరూపం కనిపించి అతడికి తిరిగి ఫిలిప్పీ యుద్ధభూమిలో దర్శనమిస్తానని చెప్పిపోతుంది (అం. 4–దృ3).

ఉభయసైన్యాలు మాసిడోనియాలోని ఫిలిప్పీవద్ద కలుసుకుంటాయి. ఉభయపక్షాల నాయకులు మాట్లాడుకుంటారు. కాని నిష్ప్రయోజన మౌతుంది. తుదిసారిగా కాషియస్ బ్రూటస్ లిరువురూ కలుసుకొని పరస్పరం వీడ్కోలులు స్వీకరిస్తూ అవసరమైతే ఆత్మహత్యకు సంసిద్ధులైనట్టు వెల్లడించుకుంటారు (అం. 5 దృ1). బ్రూటస్ తన సైన్యాలకు అనుజ్ఞ ఇచ్చి అవతల వైపున ఉన్న సైన్యాలను హఠాత్తుగా ఆక్టేవియస్ మీదికి పంపించేటట్లు చేయమని మోసెల్లాను పంపుతాడు (అం. 5 దృ2). పొరబాటు వల్ల పిండారస్‌తో ప్రథమయుద్ధంలో కాషియస్ సైన్యాలు ఓడిపోతవి. అతడు దూరం నుంచి వచ్చేవి మిత్రసైన్యాలో శత్రుసైన్యాలో చూచిరావలసిందని టిటినియస్‌లను పంపిస్తాడు. టిటినియస్ పట్టుపడ్డట్లు వార్త తెస్తాడు. కాషియస్ నిరాశ చెంది సేవకుడిచేత పొడిపించుకొని మరణిస్తాడు. టిటినియస్ తిరిగి వచ్చి జరిగినది చూచి తానూ ఆత్మహత్య చేసుకుంటాడు. బ్రూటస్ జరిగిన ఈ ఉదంతాన్నంతటినీ మోసెల్లా వల్ల విని కాషియస్ టిటినియస్‌లను మహోదాత్తులైన తుదిరోమనులని పొగిడి, వారి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయిస్తాడు (అం. 5–దృ3). యుద్ధభూమికి వెళ్ళి బ్రూటస్ తిరిగి ఒక యత్నం చేస్తాడు. ఆంటోనీ సైనికులు లూసిలియస్‌ను పట్టుకొని అతడే బ్రూటస్ అనే భ్రాంతితో తమ నాయకుడిదగ్గరికి తీసుకోపోతారు. ఆంటోనీ సత్యాన్ని గ్రహిస్తాడు (అం. 5–దృ4). తనకు విజయం అలభ్యమైపోయిందని నిర్ణయించుకున్న బ్రూటస్, తన్ను చంపవలసిందని మిత్రులను అర్థిస్తాడు. చివరకు 'స్ట్రాటో' అనే అతణ్ణి బలవంతపెట్టి అతడు కత్తిని పట్టుకోగా తాను దానిమీదపడి ప్రాణాలు తీసుకొంటాడు. ఆ స్థలానికి ఆంటోనీ, ఆక్టేవియస్ వచ్చి బ్రూటస్‌ను స్తుతించి ఆయనకుచిత మర్యాదలతో అంత్యక్రియలు జరిపిస్తామని ప్రకటిస్తారు కీర్తిప్రతిష్ఠలను పంచుకోవటానికి నిష్క్రమిస్తారు.

## నాటక నామకరణం

సీజర్ ఈ నాటకంలో మూడు దృశ్యాలలో తప్ప కనిపించదనీ, అప్పుడైనా కొన్ని గర్వోద్ధత వాక్యాలు తప్ప ప్రసంగించదనీ, నాటకానికి నిజమైన నాయకుడు బ్రూటస్ కావటం వల్ల దీనికి 'మార్కస్ బ్రూటస్' అని నామకరణం చేయటం ఉచితమనీ విమర్శకులు కొందరు సూచిస్తున్నారు.

'జూలియస్ సీజర్' నాటకానికి నాయకుడు బ్రూటస్ ఐనప్పటికీ షేక్స్పియర్ ఈ నాటకానికి ఉచితంగానే నామకరణం చేసినట్లు కన్పిస్తున్నాడు. సీజర్ చరిత్రాత్మకంగా సుప్రసిద్ధుడు బ్రూటస్ పేరు ప్రేక్షకలోకంలో ఎక్కువమందికి తెలియదు. ఇది చరిత్రాత్మక నాటకం. ఈ జాతి నాటకాలకు సర్వసామాన్యంగా మహారాజుల పేర్లు, చక్రవర్తుల నామాలు ఉంచటం పరిపాటి. సీజర్ను సమ్రాట్టు గానే జనసామాన్యం భావిస్తుంటుంది. కనక సీజర్కు సంబంధించిన నాటకానికి "జూలియస్ సీజర్" అని నామకరణం చేయటమే సమంజసమని షేక్స్పియర్ భావించి ఉంటాడు. అంతే కాదు, నాటకంలో బ్రూటస్ నాయకుడుగా దృశ్యమానుడౌతున్నా, దీనికి సీజరే 'అశరీర నాయకుడు'. విద్రోహవర్గం సీజర్ వధకు పథకాలను వేసుకొంటున్నప్పుడు "మన మందరం సీజర్ తత్త్వాన్ని ఎదుర్కొందాం" అని అనటమూ, తృతీయాంక ప్రథమ దృశ్యంలోనే సీజర్ వధ జరిగిపోయినప్పటికీ, తదనంతరకథ నంతటినీ అతడి ప్రభావం నడిపించటమూ, నిరంకుశత్వంతో వ్యవహరించిన అతని భూతమూర్తి, 'మరణించినా సీజర్, నీవు బలవంతుడవే' అని ఆత్మహత్య చేసుకోబోతూ కాషియస్ చేసిన ప్రశంస మొదలైనవి 'జూలియస్ సీజర్' అని నాటకానికి నామకరణం చేయటంలో గల సామంజస్యాన్ని వెల్లడిస్తున్నవి. నిజానికి నాటక కథాచక్రపరివర్తనకు ఆధారం సీజర్ నిరంకుశత్వం. అతడు దేహంతో పాల్గొనటం అప్రధానం. నాటకాంతంలో విజయాన్ని పొందింది ఆక్టేవియస్ కాదు ఈ నిరంకుశత్వమే. అందువల్ల 'జూలియస్ సీజర్' అన్న నామం ఈ నాటకానికి తగి ఉందని చెప్పటంలో ఎట్టి విప్రతిపత్తీ లేదు.

## జూలియస్ సీజర్ – ఆధారాలు

జూలియస్ సీజర్లోని కథావస్తువు సార్వజనీనమూ, సార్వకాలికమూను. సార్వదేశాలల్లో, సర్వకాలాలలో నివసించే ప్రజలకు ఇది ఒక పాఠాన్ని నేర్పుతున్నది. ఇట్టి కథావస్తువు మీదికి మహాకవి షేక్స్పియర్ దృష్టి ప్రసరించింది 'జూలియస్

సీజర్' నాటకం అవతరించింది. ఈ నాటక రచనకు షేక్స్‌పియర్ కొన్ని ఆధారాల సహాయాన్ని తీసుకున్నాడు.

షేక్స్‌పియర్‌కు జూలియస్ సీజర్ నాటక రచనలో తోడ్పడ్డ ఆధార గ్రంథాలలో ప్రధానమైనది ప్లూటార్క్ చరిత్రకారుడి 'జీవితాలు'. ఆయనకు గ్రీక్, లాటిన్ భాషలు బాగా రావు. అందువల్ల ప్లూటార్క్ జీవితాలన్న గ్రంథానికి నార్త్ అనువాదాన్ని ఆధారం చేసుకొని ఉంటాడు. ఆ అనువాదంలోని దోషాలు కొన్ని షేక్స్‌పియర్ నాటకాలలోనూ కూడా కనిపిస్తున్నవని, కొందరు విమర్శకులంటున్నారు. సీజర్ ఇచ్ఛాపత్రాన్ని వినిపించే సందర్భంలోను ఆంటోనీ, బ్రూటస్, లెపిడస్ చేసిన ప్రసంగాలకు కావలసిన అంశాలను షేక్స్‌పియర్ ఏప్పియన్ వ్రాసిన 'రోమను యుద్ధాలు' అన్న గ్రంథం నుంచి గ్రహించాడు. సీజర్‌ను హత్య చేసినప్పుడు బ్రూటస్‌ను చూసి 'నీవు కూడానా?' అని షేక్స్‌పియర్ చేత అనిపించాడు. ఇందుకు ప్లూటార్క్‌లో ఎట్టి ఆధారం లేదు. అతణ్ణి కాస్కా హత్య చేయగానే లాటిన్ భాషలో సీజర్ "ఓరీ అధమ ద్రోహీ, కాస్కా! ఏం చేశావు?" అన్నట్లుంది. కానీ సీజర్ గ్రీక్ భాషలో బ్రూటస్‌తో "నీవు కూడానా నా తండ్రీ?" అన్నట్లు సుయటోనియస్ రచనవల్ల తెలుస్తున్నది. ఇతడి రచనను ఆధారంగా చేసుకొని ఒక లాటిన్ నాటకం జన్మించిందని, దానివల్ల షేక్స్‌పియర్ జూలియస్ సీజర్‌కు ముందే పుట్టిన అనేక రచనల్లో 'నీవు కూడానా బ్రూటస్' అన్న లాటిన్ వాక్యం ప్రసిద్ధమైందనీ, దాన్నే ఆయన గ్రహించి ఉంటాడనీ విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. షేక్స్‌పియర్ సీజర్ హత్యను దేవమందిరంలో (కాపిటోల్) పెట్టాడు. అది సత్యానికి పాంపే నాటకశాలావలభీ ప్రదేశానికీ ప్రక్కనే ఉన్న 'క్యూరియా పాంపేనియా'లో జరిగింది. ఈ మార్పు ఛాసర్ మహాకవి 'మంక్స్ టేల్' లోనే ఉంది. ఆచారంగా వస్తూ ఉన్న ఇది దోషమైనా, సీజర్ వధను మహానగరోపకంఠసీమలో ఉన్న దేవమందిరంలోనే కల్పించటం వల్ల నాటకంలో ఆ సన్నివేశానికి ఉత్కర్ష చేకూరుతుందని భావించి షేక్స్‌పియర్ అనుసరించి ఉంటాడు. కొందరు షేక్స్‌పియర్ జూపిటర్ దేవమందిరాన్నే 'సభాభవన' మని భ్రమపడ్డాడంటారు.

## షేక్స్‌పియర్ : ప్లూటార్క్

జూలియస్ సీజర్ నాటకంలో ప్రదర్శితమయ్యే నాటకకర్త ప్రతిభ తప్ప తక్కిన సమస్తం షేక్స్‌పియర్‌కు ప్లూటార్కు చేకూర్చి ఇచ్చాడు. ప్లూటార్క్ రచనతో ఈ నాటకాన్ని పోల్చి చూస్తే సమస్తం అందులో గోచరిస్తుంది. షేక్స్‌పియర్ మహాకవి తాను వ్రాసిన ఆంగ్లదేశచరిత్రకు సంబంధించిన నాటకాలల్లో తీసుకున్న స్వేచ్ఛను ఈ

నాటకవిషయంలో గానీ, ఇతర రోమక నాటకాల విషయంలో గాని తీసుకోలేదు. షేక్స్పియర్ చెప్పిన ఆంగ్లదేశ చారిత్రక నాటకాలకు కావలసిన వస్తువులిచ్చిన హోలిన్షెడ్‌కు, రోమక చారిత్రక నాటకాలకు కావలసిన వస్తువునిచ్చిన ప్లూటార్క్‌కు ఎంతో విభేదం ఉంది. ఈ విషయాన్నే ఒక అనుభవజ్ఞుడు ఇలా చెప్పాడు : "షేక్స్పియర్‌కు హోలిన్షెడ్ తరువాత కాల్చి బాగు చేసుకోవలసిన అపరిష్కృతలోహాన్నిస్తే, కవి కళాదుడు తీర్చిదిద్దవలసిన నగిషీ మినహాగా సర్వం ప్లూటార్క్ తానే ఏరి కూర్చి ఇచ్చాడు. అందువల్ల షేక్స్పియర్‌కు స్వల్పమైన మార్పులు చేసి సీజర్, బ్రూటస్, ఆంటోనీల జీవితాలలోనుంచి పుట తరువాత పుట దించుకోవటం తప్ప వేరే పనిలేకపోయింది"

షేక్స్పియర్ ప్లూటార్క్ దగ్గరనుంచీ మొత్తం కథను గ్రహించాడు. లూషియస్ తప్ప మిగిలిన పాత్రల నందరినీ స్వీకరించాడు. నాటకంలో కనిపించే పాంపే పుత్రులపై సీజర్ విజయం, ఇరువురు ధర్మాధికారులు (మరులియస్, ఫ్లేవియస్) ప్రజలను నిందించి చెదరగొట్టటం, లూపర్ కేలియా ఉత్సవాలు, ఆంటోనీ సీజరుకు చేసిన కిరీట ప్రదానం, బ్రూటస్ పోర్షియాల సంభాషణ, సీజర్ పతనాన్ని సూచించే శకునాలు, కల్పూర్నియా పట్టుదల, డెసియస్ బ్రూటస్ సీజర్‌ను ఒప్పించటం, శకునజ్ఞుడు, ఆర్టిమిడోరస్ సీజర్‌కు చేసిన సూచనలు, హత్య, ఆంటోనీ ప్రసంగం, ఇచ్ఛాపత్రపఠనం. సిన్నామరణం, సీజర్ భూతరూపదర్శనం, ఫిలిప్పీయుద్ధం, కాషియస్ బ్రూటస్‌ల మరణం అన్నీ ప్లూటార్క్‌లో ఉన్నవే. సీజర్ సుస్తి, మూఢనమ్మకాలమీద అభిమానం, ఆంటోనీ విలాసప్రియత్వం, సిసెరో గ్రీక్ భాషాభిమానం, కాసియస్ 'పలచని ఆకలి చూపు', అతని ఎపిక్యురస్ అనుయాయిత్వం, అతని కోపస్వభావం అన్నీ ప్లూటార్క్‌నుంచి సంగ్రహించినవే.

షేక్స్పియర్ ప్లూటార్క్‌కి భిన్నంగా కొన్ని కల్పనలు చేశాడు. ఆరు నెలలనాడే (సెప్టెంబర్ 45 క్రీ.పూ.) సీజర్ 'విజయయాత్ర'నుంచి తిరిగివస్తే ఈ అంశాన్ని షేక్స్పియర్ లూపర్‌కల్ ఉత్సవం నాటికి 15 మార్చి 44 క్రీ.పూ. అని మార్చినాడు. సీజర్ హత్య క్యూరియాపాంపేలో జరిగితే దాన్ని దేవమందిరానికి మార్చాడు. హత్య మార్చి 15న, 'ఇచ్ఛాపత్ర ప్రచురణ' మార్చి 18న, అంత్యక్రియలు మార్చి 19న జరిగినవి. ఆక్టేవియస్ మే నెల దాకా రాలేదు. షేక్స్పియర్ అన్నీ ఒకనాడే జరిగినట్లు కల్పించాడు. 'వీరత్రయకూటమి' బోలోనియాలో కలుసుకుంటే షేక్స్పియర్ ఆ సంఘటన రోములోనే జరిగినట్లు చెప్పాడు. ఫిలిప్పీలో జరిగిన రెండు యుద్ధాలకూ మధ్య ఇరవై

రోజుల వ్యవధి ఉంది. షేక్స్‌పియర్ దాన్ని ఎత్తివేశాడు. కాలవ్యవధిని, సన్నివేశ బాహుళ్యాన్ని తగ్గించి విషాదాంతస్థాయిని పట్టటం కోసం నాటకతత్త్వాభిజ్ఞుఁడైన షేక్స్‌పియర్ ఈ మార్పులు చేసి ఉంటాడు. ప్లూటార్క్‌లో కేవలం పట్టికగా ఇచ్చిన శకునాలను, హఠాత్సంభవాలనూ అతినైపుణ్యంతో షేక్స్‌పియర్ సమయోచితంగా ఉపయోగించుకొన్నాడు. ప్లూటార్క్‌లోని బ్రూటస్ క్రూరశక్తినే షేక్స్‌పియర్ సీజర్ భూతాకృతితో సమన్వయించాడు. ప్లూటార్క్ ఇచ్చిన కొద్ది సూచనలో ఆంటోనీ మహాప్రసంగాన్ని కల్పించటం, పోర్షియావర్ణనలోనూ, పాత్ర పోషణలోనూ కన్పించే ప్రావీణ్యం, సిన్నా హత్యలో ద్యోతకమయ్యే పరిహాసరేఖలు, అక్కడ ప్రదర్శించిన జనసామాన్య స్వభావ చిత్రణమూ ఇత్యాదులన్నీ షేక్స్‌పియర్ ప్లూటార్క్‌పై దిద్దిన వన్నెచిన్నెలు.

## షేక్స్‌పియర్ పాత్రోన్మీలనం – మార్పులు

షేక్స్‌పియర్ చిత్రించిన సీజర్ చరిత్రలో కన్పించే ప్రపంచాగ్రగామియైన మహావీరుడు, మహారాజనీతిజ్ఞుడు కాడు. అతడికి వైభవ ప్రియత్వం, గర్వోన్మత్తత, ఔద్ధత్యం, స్తోత్రప్రియత, కొన్ని శారీరక మానసిక దౌర్బల్యాలను షేక్స్‌పియర్ మహాకవి కల్పించాడు. నిజానికి చరిత్రలో తోచే సీజర్‌నే చిత్రిస్తే ప్రేక్షకులకు విద్రోహవర్గంమీద అణుమాత్రమైనా అభిమానం ఉండటానికి తావుండదు. బ్రూటస్, కాషియస్‌లకు ఆదర్శాన్నిచ్చి షేక్స్‌పియర్ వారి పాత్రలను పోషించాడు. సీజర్ సామ్రాజ్యతత్త్వ ప్రవక్త అతడికి ప్రతిగా ప్రజాస్వామికతత్త్వప్రవక్తనుగా బ్రూటస్‌ను తీర్చిదిద్ది, షేక్స్‌పియర్ ప్లూటార్క్‌లో కనిపించే అతడి లోపాలనన్నింటినీ వదిలివేశాడు. మహానగర రక్షణాధికారవిషయంలో బ్రూటస్, కాషియస్ ప్రత్యర్థులు. అందువల్ల వారిద్దరి మధ్యా సన్నిహితత్వం లేదు. ప్లూటార్క్‌లో కన్పించే ఈ అంశాన్ని కొంతగా గ్రహించి వారిద్దరి మధ్య అసన్నిహితత్వాన్ని ప్రథమాంక ద్వితీయదృశ్యంలో ప్రదర్శించాడు గాని షేక్స్‌పియర్ అందుకు బ్రూటస్ మహాశయుని హృదయాంతర్యుద్ధాన్ని కారణంగా కల్పించాడు. అంతేకాక బ్రూటస్‌ను సీజర్‌కు సన్నిహిత మిత్రుణ్ణి చేశాడు. దీనివల్ల బ్రూటస్‌ను ఒక ఆదర్శం కోసం నిలిచి మిత్రుణ్ణి కూడా హత్య చేయటానికి వెనుకాడని వీరపురుషుడుగా చిత్రించటం జరిగింది. పోర్షియా బ్రూటస్‌ను వివాహమాడటానికి పూర్వం బిబులస్ అనే భర్తను చేపట్టి అతడివల్ల ఒక కుమారుణ్ణి పొందినట్లూ, అతడు కథాకాలంనాటికి యవ్వనదశ ననుభవిస్తున్నట్లూ ప్లూటార్క్‌లో ఉంది. బ్రూటస్ వంటి అత్యుత్తమ వ్యక్తికిది కళంకాపాదకం కాబట్టి తొలగించి, బ్రూటస్ దంపతుల ప్రణయాన్ని ఆదర్శయుతంగా

చిత్రించాడు షేక్స్పియర్. చతుర్థాంకంలోని బ్రూటస్ కాషియస్‌ల కలహం మానవత్వసముపేతమై మహోదాత్తంగా నడవటానికి కారణం షేక్స్పియర్ ప్రతిభే. సీజర్‌కు ప్రథమానుచరుడుగా ఉన్న ఆంటోనీ పాత్రను ప్లూటార్కులో ఉన్న ఆంటోనీ పాత్రకంటే ఉదాత్తంగా సృష్టించి షేక్స్పియర్ వన్నె పెట్టాడు.

లూషియస్ పాత్ర సృష్టి, అతడికి యజమాని ఐన బ్రూటస్‌కు మధ్య ఉన్న సంబంధం నాటకకర్త కల్పనే. షేక్స్పియర్ చిత్రించిన కాస్కా పాత్రకు ప్లూటార్క్‌లో ఆధారం లేదు. ద్వితీయాంక ప్రథమదృశ్యంలోని బ్రూటస్ స్వగతం నాటకకర్త ప్రతిభాజన్యం. ప్లేటో తత్వాన్ని అనుసరించే బ్రూటస్ సీజర్‌ను హత్య చేయటానికి పూనుకొనేటందుకు ఇది ఎంతో తోడ్పడ్డది. ఆర్టిమిడోరస్‌కు సీజర్ సమాధానాలు, కాషియస్ తప్ప మిగిలిన విద్రోహ వర్గంలో అందరూ కలిసి సీజర్‌ను సభాభవనానికి తీసుకుపోవటానికి ఆయన ఇంటికి కలిసిరావటం, ఇతన్ని గురించిన కాషియస్ సంభాషణం, వధాదృశ్యంలో సీజర్ సంభాషణ, సీజర్ మానసిక శారీరక దౌర్బల్యం, నాలుగో అంకంలో సంగీతాన్ని ప్రవేశపెట్టి సేనాపతుల మధ్య కలిగిన కల్లోలాన్ని కప్పిపుచ్చటం, బ్రూటస్ కాషియస్‌ల వీడ్కోలు సంభాషణలు, టిటినియిస్ కాషియస్‌ను మాలాలంకృతుణ్ణి చేయటం ఇత్యాది కల్పనలన్నీ షేక్స్పియర్‌వే. నాటకీయ ప్రదర్శనాపరిపుష్టికోసం, పాత్రపోషణకోసం షేక్స్పియర్ చేసిన మార్పులవల్లనే "జూలియస్ సీజర్" ఒక అద్భుత దృశ్యకావ్యంగా పరిణమించి, సార్వకాలీనమైన సాహిత్యసృష్టి అయినదనటంలో ఎటువంటి సందేహం లేదు.

**నాటక నిర్మాణం**

నిర్మాణ విషయంలో ఎట్టి క్లిష్టతా లేకపోవటంలో జూలియస్ సీజర్ విశిష్టమైన నాటకం. ఇది ఏకవస్తుకము ప్రాసంగికాదులు లేవు. ఇందులో సన్నివేశాలు బహుస్వల్పాలు అలాగే పాత్రలూను. ఈ విషయాలల్లో ఇది మేక్బెత్‌ను పోలి ఉంది. షేక్స్పియర్ మహాకవికృతాలైన లియర్, ఆంటోనీ – క్లియోపాత్రాలవంటి విషాదాంత నాటకాలకు ఇది చాలా భిన్నమైంది. లియర్ రాజులో ప్రాసంగిక కథావస్తువు ఉంది ఆంటోనీ క్లియోపాత్రాలో క్లిష్టసన్నివేశ బాహుళ్యం కనిపిస్తున్నది.

నిరంకుశ ప్రభువైన సీజర్ వధవరకూ విద్రోహవర్గానికి తాత్కాలిక విజయమైనా, వారి పతనంతో, రోము పౌరుల స్వాతంత్ర్య వినాశనంతో, రాచరికం పునరుద్ధరింప బడటం చేత అంతంలో దానికి పరాజయం అన్నది జూలియస్ సీజర్ నాటకానికి వస్తువు.

'సీజర్ హత్య, బ్రూటస్ మరణం' లేదా 'సీజర్ హత్య, ప్రతీకారం' – అనే రెండు విభాగాలుగా నాటకం నడిచింది. కాబట్టి ఇది నిర్మాణాత్మకమైన దోషమని విమర్శకులు కొందరు పదే పదే సూచిస్తూ వచ్చారు. కానీ నిర్మాణంలో వారు భావించేటంతటి అనిబద్ధత గోచరించటం లేదు. కొందరు సూచించినట్లు 'బ్రూటస్' అని నాటకాన్ని వ్యవహరించినంత మాత్రం చేత గూడా, ఈ అనిబద్ధత తొలగిపోయి వస్త్వైక్యం చేకూరదు. షేక్స్పియర్ ప్లూటార్క్‌లో లభించిన వస్తువును యథాతథంగా గ్రహించి నాటకీకరణం చేశాడే గాని, నిర్మాణ విషయం మీద దృష్టి నిల్పినట్లు కన్పించదు. అయినా నాటకమంతటిలోనూ అనుస్యూతంగా ఒక సూత్రం గోచరిస్తున్నది. అదే నిత్యాభివృద్ధిని పొందుతున్న అనివార్యమైన రాచరికపుశక్తి. ఇది నాటకానికి నిర్మాణ సంబంధమైన ఐక్యతను ఇచ్చినదని చెప్పవచ్చు. 'ప్రాయశ్చిత్త' మనే భావం నాటకంలో సర్వేసర్వత్రా గోచరిస్తున్నది. 'చేసిన క్రియకు ఫలాన్ని అనుభవించి తీరాలి' – పాంపేపుత్రుల వధించి విజయం చేకొన్నానన్న గర్వాహంకారాలకు తగ్గ ప్రాయశ్చిత్తాన్ని సీజర్ అనుభవించాడు. విద్రోహవర్గం సీజర్‌ను వధించి తగ్గ ప్రాయశ్చిత్తాన్ని పొందారు. అందువల్ల ఈ ప్రాయశ్చిత్తభావం కూడా నిర్మాణైక్యాన్ని కొంతవరకు చేకూరుస్తున్నది.

## రాజకీయభావం : గుణపాఠం

'జూలియస్ సీజర్' వల్ల అభివ్యక్తమయ్యే రాజకీయభావం ఏమిటి? ఈ ప్రశ్నకు విమర్శకులు ఇలా సమాధానం చెబుతున్నారు. "ప్రతిజాతికీ దాని యోగ్యతను బట్టి ఉత్తమ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఒక క్రూరపాలకుణ్ణి హత్య చేసినందువల్ల ప్రయోజనం ఏమీ ఉండదు అతడి స్థానే మరొకరు వస్తాడు. భ్రమ ప్రమాదరాహిత్యం వల్ల పాలకుల శీలంలో పరివర్తన కలగదు. జాతి నిర్మించిన రాజకీయ సంస్థలో మార్పు కలగాలెనంటే జాతిలోని జన సముదాయమంతటిలోనూ శీలపరివర్తన జరిగి తీరవలసిందే." 'జూలియస్ సీజర్' నాటకంలో ప్రజాస్వామికం పతనమై నిరంకుశత్వం తలయెత్తటం ప్రదర్శితమైంది. జనసామాన్య బుద్ధిహీనతను దీర్ఘదృష్టితో దర్శించిన మహామేధావి సీజర్, తాను నిరంకుశుడు కావటానికి ప్రయత్నాలారంభించాడు. ప్రజలు రాచరికం వంక మొగ్గు చూపటం వల్ల ప్రజాస్వామికానికి ప్రమాదం ఉందని భ్రాంతి వహించి, బ్రూటస్ సీజర్‌ను హతమార్చాడు. ప్రజాస్వామిక విధాన స్వరూపం జీర్ణం కాని ప్రజలు అతణ్ణే సీజర్‌ను చేయటానికి ఉద్దేశపడ్డారు. తుదకు ప్రజల చిత్త చాంచల్యం వల్ల ప్రజాస్వామికోద్ధరణ యత్నం వీగిపోయింది నిరంకుశత్వం విజయం పొందింది. హత్యవల్ల ఒక సీజర్‌ను తొలగిస్తే మరో సీజర్ ఆ స్థానాన్ని ఆక్రమించాడు. రోమనులు

మహత్తర సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న తరువాత, ఇంకా ప్రజాస్వామిక విధానాన్ని నిలుపుకోటానికి యత్నించటమే దోషం. హత్య మహాదోషం  దానికి ఫలాన్ని అనుభవించవలసిందే. అందులో రాజకీయహత్య దేశసౌభాగ్యానికే దెబ్బ. జూలియస్ సీజర్ వధానంతరం ప్రమాదోపేతాలైన తత్ఫలితాలను రోము అనుభవించక తప్పింది కాదు.

## 'పాత్ర గత' గుణపాఠం

సీజర్ వధ, తత్ఫలితాలను కథావస్తువులుగా గల సీజర్ నాటకానికి విషాదాంత నాయకుడు బ్రూటస్. అతడు హృదయాశయ సౌందర్యాలు రెంటినీ కలిగిన అభ్యుదాత్తుడైన వ్యక్తి అని అందరూ అంగీకరించి తీరవలసిందే. ప్రబల శత్రువైన ఆంటోనీ కూడా అంగీకరించాడు. కానీ అతడు తాను చేసినది హత్య అనీ, తాను హంతకుడననీ ఊహించనైనా లేదు. కారణం రాజకీయ మైతేనేం, మరేదైతేనేం హత్య హత్యే. దాని ఫలితాన్ని అనుభవించి తీరవలసిందే. భగవంతుని ఆజ్ఞ, మానవధర్మశాస్త్రం రెండూ దాన్ని నిషేధించాయి. మహోత్తముడైన బ్రూటస్ ఈ హత్య అనే ఏకైకదోషం వల్ల తన జీవితనౌకాభంగానికే గాకుండా జాతి జీవిత సాంయాత్రికతకు మహాభంగాన్ని కల్పించాడు. బ్రూటస్ చేసిన నేరానికి అనుభవించిన శిక్ష కేవలం కాలం, చరిత్ర కల్పించినవి కావు  షేక్స్పియర్ సృష్టించింది అంతకంటే కాదు. భగవత్ప్రేరణవల్ల సంఘనైతిక శాసనం విధించింది. 'దౌష్ట్యంవల్ల సౌభాగ్యం ఏ నాడూ చేకూరదు చేకూరినా అది తాత్కాలికమే గాని సుస్థిరమైంది కాదు' అన్నది షేక్స్పియర్ మహాకవి, బ్రూటస్ పాత్రమూలంగా లోకానికి నేర్పిన నిత్యసత్యమైన గుణపాఠం.

# పాత్రలు

## సీజర్

రోమక చరిత్రలో కనిపించే సీజర్ ధీరోదాత్తుడు, మహాసేనాని, రాజకీయ ప్రజ్ఞాధురంధురుడు. జూలియస్ సీజర్ నాటకంలో మహాకవి షేక్స్పియర్ సీజర్‌ను కొంతగా లోపాలకు లోనైనవానినిగా చిత్రించాడు. ఇందులో సీజర్ వ్యాధిగ్రస్తుడు, దుర్బలుడు, కాషియస్‌తో ఈతలో ఓడిపోవటం, సుస్తీ చేసినపుడు ఆడపిల్లలా ఏడవటం, చెవుడు, కిరీట ప్రదానసమయంలో మూర్ఛపోవటం, బహుశః కాషియస్‌ను చూచి భయపడటం అతని కంటే బలహీనుడు కావటం వల్లనేమో! ఇందుకు నిదర్శనాలు. భుజశక్తితో ప్రబలులైన శత్రువులను ఎందరినో జయించినా అతడికి అంధవిశ్వాసాలు తప్పలేదు. 'లూపర్ కేలియా' ఉత్సవాలలో ఆంటోనీని కల్పూర్నియాను స్పృశించమని కోరాడు. యాజ్ఞికులు శకునాలు అనుకూలంగా లేవని చెప్పించినప్పుడు అంతకు పూర్వమే కల్పూర్నియా కలను గురించి భయపడుతున్న అతడు సభా భవన ప్రయాణాన్ని మానుకున్నాడు. సభా సభ్యులు కిరీట ప్రదానం చేద్దామని నిర్ణయించుకున్నట్లు డెసియస్ బ్రూటస్ తెలియజేసిన తరువాత, అతని రాజ్యాధికార లోభం, ఆశాపరత్వం అతణ్ణి సభకు రప్పించాయి. స్తోత్రపాఠమంటే తనకు గిట్టనట్లు ప్రసంగాలలో పదేపదే ప్రకటించుకున్నా, అతడికి స్తోత్ర పాఠమన్నా, స్తోత్ర పాఠకులన్నా మహాభిలాష. 'మీకు స్తోత్ర పాఠమంటే గిట్టదని నేనంటే స్తోత్ర ప్రియుడై అతడు ఔనంటాడు' (అం2-దృ1) అన్న డెసియస్ బ్రూటస్ వాక్యం ఇందుకు నిదర్శనం. సభాభవనంలో అతడి ప్రవర్తన, సభా సభ్యులతో అతడు నడిపిన సంభాషణలు సీజర్ గర్వోన్మత్తతనూ, ఔద్ధత్యాన్ని, నిరంకుశత్వాన్ని, నిరసన భావాన్నీ నిరూపిస్తున్నవి.

ఇంతమాత్రం చేత షేక్స్పియర్ సీజర్‌ను సంపూర్ణంగా లోపభూయిష్ఠుడుగా చిత్రించ దలచాడని భ్రాంతి పడరాదు. ఆయన ఘనతను కూడా చిత్రించాడు. అయితే ఈ చిత్రణలో సీజర్‌ను 'ఆత్మనిష్ఠుణ్ణి' చేసి, తన అధిక్యాన్ని తానే విశేషంగా వ్యక్తీకరించుకొనే నిరంకుశుణ్ణి చేశాడు. కొన్ని లోపాలున్నప్పటికీ షేక్స్పియర్ చిత్రించిన సీజర్‌కు ఇతరులను ఆకర్షించే రూపంగానీ, వ్యక్తిత్వం గానీ లేకపోలేదు. వీటితో

అతడు ఇతరులను భయభ్రాంతులను చేయగలడు. రోమక సామ్రాజ్యంలో అతడు ప్రథమవ్యక్తి. పూర్వం అతడు చేకొన్న విజయాలు అతడికి అట్టి అద్వితీయ స్థానాన్ని కల్పించాయి. ప్రభువర్గం, సామాన్యజనం ఇరువురూ అతడి ప్రభావానికి ప్రస్తుతం తల ఒగ్గుతున్నారు. అతడికోపం వారికి ప్రళయం, ఆంటోనీ "సీజర్ ఇది చేయమంటే అది జరిగిపోయినట్లే" అని అనటం, కాస్కా సీజర్ మాట్లాడబోయే ముందు ఏదో దేవవాణి వినిపించనున్నట్లు "శాంతించింది సీజర్ మాట్లాడుతున్నా" డనటం, మెటిల్లస్ సింబర్ అతణ్ణి దేవతామూర్తిగా భావించి వ్యవహరించటం, కాషియస్ చేసిన 'ఎందుకయ్యా! అతడు కోలోసస్‌లాగా...' ఇత్యాది ప్రసంగం ద్వారా, సీజర్ ప్రభువర్గం మీద ఎట్టి ప్రభావాన్ని కలిగించాడో ఊహించటానికి కొన్ని నిదర్శనాలు. ఇక సామాన్యజనానికి అతడు లేని రోమక సామ్రాజ్యమే లేదు. వారికి సీజర్ ఉండి తీరవలసిందే. సీజర్ వ్యక్తిత్వానికి, ఘనతకూ 'సీజర్! నీవు మరణించినా కేవలం నిన్ను చంపిన కత్తితోనే ప్రతీకారాన్ని పొందావు నీవు మరణించినా బలవంతుడవే' అన్న మరణ సమయంలోని బ్రూటస్ కాషియస్ వాక్యాల కంటే ప్రబలనిదర్శనాలింకేమి కావాలి? అతడి శరీరాన్ని రూపుమాపినా అతడి శక్తి జీవించి విజయం చేకొన్నదని రోములోని యావన్మందీ అంగీకరించారు. షేక్స్‌పియర్ సీజర్ పాత్రకు శారీరక మానసిక, నైతిక దౌర్బల్యాలను కొన్నిటిని కల్పించటం విద్రోహక వర్గంమీద కొంతగా అభిమానాన్ని కల్పించటం కోసం కావచ్చు.

కొందరు విమర్శకులు సరియైన సీజర్‌కు 'జూలియస్ సీజర్'లో సీజర్ భీరుత్వం, అస్థిరత్వం, చిత్తచాంచల్యాలతో కూడిన పరిహాసరూపమని భావించారు. అది పొరబాటు. భార్య ప్రార్థన మీద సభాభవనానికి పోనని మాట ఇచ్చి, తరువాత డెసియస్ బ్రూటస్ ప్రసంగం వల్ల మారిపోవటం చేత ఇలా తోచినా, అందులో చిత్తచాపల్యంగాని, అస్థిరత్వం గాని, భీరుత్వం గాని లేవు. భార్యను సంతోషపెట్టటానికి మొదట మాటిచ్చాడు. తరువాత కిరీటం మీది ఆశాపరత్వంవల్ల నైతేనేం నిర్భీరుత్వ, వ్యక్తిత్వ ప్రకటనల కోసమైతేనేం సమస్తాన్నీ ధిక్కరించి సభాభవనానికి వచ్చాడు.

షేక్స్‌పియర్ సీజర్ ఘనతను ఎరగనివాడు కాడు. ఆయన అతణ్ణి వాతావరణం మీద ఆధారపడని స్వయంవ్యక్తినిగా సృజించాడు. అతడికి జన్మతః సంభవించిన అధికారాధిక్యాన్ని, నిర్భీరుత్వాన్ని, సర్వవ్యాపిత్వాన్ని, సార్వభౌమత్వాన్నీ ఆపాదించాడు. ఎప్పుడైనా ఇంచుక భీరుత్వం, చాంచల్యం గోచరిస్తే అది అతడిలోని మానవత్వావేశం వల్లనే. మానవుడై ఉండి తనకు దివ్యత్వాన్ని ఆపాదించుకొని దెబ్బ తిన్న వ్యక్తి సీజర్.

### బ్రూటస్

విజ్ఞాని, దేశభక్తుడు, నీతిప్రవర్తకుడు, ప్రియహృదయుడు, ఉదాత్తమానవుడు. నీతి నియమాలతో శౌచగుణ భూయిష్ఠుడై ప్లేటో తత్వశాస్త్ర మార్గాన్ని గవేషిస్తూ తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్న మహోదారమూర్తి బ్రూటస్. ఉత్తమాశయుడు. ఆశయసాధనలో అచంచల దీక్షాన్వితుడు. వ్యక్తిగత రాగద్వేషాలకు లొంగి ఉదాత్తాశయానికి స్వస్తి చెప్పని మహనీయుడు. మానవస్వభావ పరిగణనంలో ప్రజ్ఞాలోపం వల్ల దెబ్బతిన్న వ్యక్తి. మానవనీతికి వెరచి ఆంటోనీ ప్రాణహరణానికి ఒప్పుకోక పోవటం వల్ల, అతడికి ప్రమాదం చేకూరింది. ఆంటోనీ శక్తిని అపార్థం చేసుకొన్నాడు. ఇతరులను అతినిశితమైన నైతికనిబంధనలతో కొలిచి చూసే స్వభావం గల ఇతడు, సీజర్ హత్య తనకొక రాజకీయ కర్తవ్యమని భావించి నిర్వహించాడేగానీ, నైతిక శాస్త్రదృష్ట్యా తానొక 'హంతకు'డన్న ఊహ ఆయనకు కలగలేదు. బ్రూటస్ కేవలం స్వాప్నికుడు, ఆదర్శారాధకుడు. కాషియస్ కున్న రాజనీతిజ్ఞతలో ఏ కొంత భాగమున్నా, ఆయనకు అపజయం చేకూరేది కాదు. అయితే ఇప్పటివలె ఉదాత్త మానవుడని అనిపించుకోగలిగి ఉండేవాడు కాడు. స్వభావతః తన ప్రవృత్తికి విరుద్ధమైన రాజకీయాదర్శ సంపాదనకు పూనుకొని, క్లేశాన్ని తెచ్చి పెట్టుకొన్నాడు. అపజయాన్ని పొందాడు. అయినా విజయాన్ని సాధించిన ఆక్టేవియస్ ఆంటోనీలకంటె అత్యధికంగా యుగయుగాల మానవహృదయాలను ఆకర్షించి అభిమానాన్ని చూరగొన్నాడు. బ్రూటస్ నామానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో దృఢానుబంధం ఏర్పడి అతడికి ప్రపంచ మానవస్వేచ్ఛా ప్రయత్న చరిత్రలో నిత్యత్వాన్ని కల్పించింది.

ఆత్మమిత్రుడైన సీజర్‌ను రోము స్వేచ్ఛకోసం బలి ఇవ్వటానికి ఎంతో ఆత్మబలం, దేశాభిమానం అవసరం. "సీజర్‌ను హత్య చేసింది నేను. అతణ్ణి తక్కువగా ప్రేమిస్తున్నానని కాదు  రోమును అంతకంటే అధికంగా ప్రేమించటం వల్ల" అన్న ఆయన మాటల్లో అసత్యం అణుమాత్రమూ లేదు. ఇందుకు ఆయనకు శత్రువైన ఆంటోనీ బ్రూటస్ మృతకళేబరాన్ని చూచి చేసిన ప్రసంగంలోని "సంఘ సంక్షేమాన్ని భావించి వీరిలో (విద్రోహక వర్గంలో) చేరింది ఇతడొక్కడే" అన్న వాక్యాలు నిదర్శనం. ఆ ఆంటోనీయే బ్రూటస్‌ను సద్గుణసంపన్నుడని శ్లాఘించాడు. బ్రూటస్ ఆదర్శజీవి. విద్రోహక వర్గంలోని ఇతర సభ్యులందరూ తనవలెనే మహోత్తమాశయసిద్ధికోసం తనవంటి పవిత్ర హృదయంతోనే సీజర్ హత్యకు పూనుకుంటున్నారని భ్రమపడ్డాడు. వారి వ్యక్తిగత విద్వేషాలను ఈర్ష్యాది దుర్గుణాలను గమనించలేకపొయ్యాడు. వారికి

నిరంకుశత్వ నిర్మూలనం కంటే సీజర్ మృతి కావాలి. అతడికి అవకాశం ఉంటే సీజర్‌ను సజీవుణ్ణిగా నిల్పి అతడి నిరంకుశతత్వాన్ని వినాశనం చేస్తే చాలు. ఈ ఆదర్శ ప్రియత్వం వల్లనే ఆంటోనీని కూడా చంపాలన్న కాషియస్ భావంతో ఏకీభవించక త్రోసివేయటం. 'సీజర్ అంత్యక్రియల్లో ప్రసంగించటానికి ఆంటోనికి అనుజ్ఞ ఇవ్వటం, కాషియస్ సలహాను త్రోసిరాజని కేవలం ఫిలిప్పీ యుద్ధంలోనే తమ సర్వస్వాన్నీ ఒడ్డటం' మొదలైన కొన్ని దోషాలు చేశాడు.

బ్రూటస్ ప్రజాస్వామ్యపక్షపాతి. రోముకు రాజనే పేరునే అతడు సహించలేడు. అంతశ్శుద్ధితో తనపూర్వుడైన బ్రూటస్ చర్యను (టార్క్విన్సును పారద్రోలటం) ఆదర్శంగా పెట్టుకొని సీజర్ విషసర్పాన్ని 'అండంలోనే అవియించటానికి' పూనుకొన్నాడు. బ్రూటస్ ఉద్వేగాలకు లొంగని విజ్ఞాని. అందువల్లనే సీజర్ హత్యానిర్ణయానికి పూర్వం ఆయన మనస్సు డోలాందోళితమైంది. అందులో మహత్తరమైన అంతర్యుద్ధం చెలరేగింది. ఈ ఉద్వేగరాహిత్యం వల్లనే విపణిలో ఆయన చేసిన అనుద్వేగకర ప్రసంగం, ఆంటోనీ చేసిన ఉద్రేకపూరితమైన గంభీరోపన్యాసం ముందు పేలవమై పోయింది.

ఎటువంటి విషమ జీవిత సంఘటనలనైనా అతిప్రశాంతంగా, సహనంతో భరించి, సుఖదుఃఖాలకు అతీతంగా ప్రవర్తించటాన్ని నేర్పే స్టోయిక్ తత్త్వశాస్త్రాభిమాని బ్రూటస్. కానీ కథా సందర్భాలు అట్టి తత్త్వశాస్త్రంతో పరిచయం గల అతణ్ణి కూడా కళవళపెట్టాయి. మిత్రుడి హత్యను గురించి నిర్ణయించుకుండేటప్పుడు చిత్తం అంతర్యుద్ధావిద్ధమైంది. రాజకీయ రహస్యాలను భార్యకు చెప్పకుండా దాచలేకపోయాడు. యుద్ధసమయంలో కోపాన్ని తెచ్చుకొన్నప్పుడు కాషియస్ "అనుభవంలో లేకపోతే మీరు చేసిన తత్వశాస్త్రజిజ్ఞాస వల్ల ప్రయోజనమేమిటి?" అని అడగటానికి అవకాశం కలిగింది.

కొన్ని విపరీత పరిస్థితుల్లో అతడిలో తత్త్వశాస్త్రదృష్టి తొలగటం వల్లనే మానవత్వం బహిర్గతమైనది. బ్రూటస్ కరుణా హృదయుడు. ప్రేమించగలడు. ఇతరుల ప్రేమను చూరగొనగలడు. భార్యయెడ, మిత్రులయెడ, స్నేహితుల యెడ అతడి ప్రవర్తన ఈ విషయాలను సుస్పష్టంగా సర్వేసర్వత్రా అభివ్యక్తం చేస్తున్నది.

పఠనాభిమానం, సంగీతరసికత బ్రూటస్‌ను మహోత్తముడుగా తీర్చి దిద్దాయి. ఆశయపావిత్ర్యం, నైతిక విజయం మరపురాని మహోదారునిగా భావియుగశుభ్ర చరిత్రల్లో అతడికి స్థానాన్ని కల్పించాయి. ఆంటోనీ అన్నట్లు భూతాలన్నీ ఏకమై "మానవుడంటే ఇతడు" అని చెప్పదగ్గ సద్గుణపుంజం బ్రూటస్.

## కాషియస్

కాషియస్ స్వభావం చేత, శిక్షణవల్లా ఎపిక్యూరస్  తత్త్వం కలవాడు. పునర్జన్మ మీద నమ్మకం అతడికి లేదు. 'మానవజీవితాలమీద దేవతల కెట్టి ప్రభావం లేదు' అని అతని విశ్వాసం. మరణానికి ఇంచుక పూర్వం తన అభిప్రాయాలను మార్చుకున్నా, అతడు శకునాలంలే నమ్మడు. బ్రూటస్ కష్టసుఖాలకు అతీతుడుగా ఉండలేనివాడు. అతికోపస్వభావం కలవాడు. ఈ గుణాన్ని తల్లివల్ల పొందానని తానే బ్రూటస్‌తో చెప్పుకున్నాడు.

ప్రజాస్వామికమంటే అతడికి ప్రియమైనదే. కానీ ఆ ప్రేమ ఒక విశాల సిద్ధాంతంమీద ఆధారపడి ఉండదు. తాత్కాలిక ప్రయోజనం చేకూరితే అది తృప్తి పడుతుంది. అరాజకానికి దారితీస్తున్నానేమో అన్న భయం దానికి లేదు. బ్రూటస్ సిద్ధాంతాన్ని అనుసరించి వ్యవహరిస్తే కాషియస్ కేవలం ఉద్రేకాన్ని బట్టి నడుచుకుంటాడు. అతడు ఉదాత్త సిద్ధాంత ప్రబోధకుడు  ఇతడు రాజనీతి చతురుడు. కాషియస్‌లో ఉదాత్తదుష్ట ప్రకృతులు రెండూ సమ్మేళనాన్ని పొందాయి. సీజర్ ఘనతయెడ ఈర్ష్య వహించాడు. కానీ కేవలం ఈర్ష్య వల్లనే ఇతడు సీజర్ యెడ విద్రోహ వర్గాన్ని కల్పించటంలో సమాహర్త యైనాడనటానికి వీల్లేదు. ఇతడికి ప్రజాస్వామ్యాభిమానం లేకపోలేదు  అయితే అది సంకుచితమైంది. అయినప్పటికీ ఇతడు దాని కోసం తన ప్రాణాలు అర్పించి, తన దోషాల నన్నింటినీ దగ్ధం చేసుకొన్నాడు.

తనకు అంతశ్శక్తి, క్రమశిక్షణ లేదని కాషియస్ ఆత్మపరీక్షల వల్ల తెలుసుకున్నవాడు కావటం వల్లనే నాయకత్వాన్ని బ్రూటస్ పరంచేసితాను అనుచరుడైనాడు. తన నిర్ణయాలు సక్రమమైనవనీ, కార్యసాధకాలైనవనీ అతడికి తెలిసినా, బ్రూటస్‌కున్న నైతికబలం తనకు లేకపోవటం వల్ల ఎల్లవేళలా లొంగిపోతుండేవాడు. బ్రూటస్ కంటే కాషియస్ నైతికంగా తక్కువవాడైనా రాజకీయంగా ఎక్కువవాడు. రాజకీయాలలో అతడి బుద్ధి అతినిశితంగా వ్యవహరిస్తుంది.

అతడు వ్యవహారదక్షుడైన రాజకీయవేత్త. వ్యక్తులను అతినిశితంగా పరిశీలిస్తాడు. మానవస్వభావ పరిశీలనలో అందెవేసిన చేయి. తన యుక్తితో, చాతుర్యంతో సీజర్ మీద విద్రోహాన్ని చేసి క్రమంగా ఒక్కొక్కరినీ ఆ వర్గంలోకి చేర్చగలిగాడు. బ్రూటస్ వంటి మహోత్తముణ్ణి తనపక్షానికి చేర్చుకోటానికి క్రమమైన విధానాన్ని అనుసరించి సాధించాడు. అతడు క్రమమైన రాజకీయవేత్త. లక్ష్యమే ముఖ్యం కాని అతడికి సాధన ఎటువంటిదైనా సరే. సీజర్‌తోబాటు ఆంటోనీని కూడా చంపవలసిన అగత్యాన్ని

దూరదృష్టితో గమనించి సూచించాడు. సీజర్ అంత్యక్రియల్లో ఆంటోనీ ప్రసంగానికి అవకాశం కల్పించటం ప్రమాదకారి అని పలకటం అతని బుద్ధి నైశిత్యానికి, విషయోన్నయనానికీ నిదర్శనం. సిసెరోను తమ పక్షంలో చేర్చుకోవలసిన ఆగత్యాన్ని దర్శించి సూచించాడు. అతడు ఉన్నట్లైతే బహుశః ఆంటోనీ వక్తృత్వ ప్రభావాన్ని తగ్గింపగలిగి ఉండేవాడు. బ్రూటస్‌తో సంబంధం లేకుండా ఉంటే కాషియస్ విద్రోహవర్గానికి విజయాన్ని చేకూర్చగలిగి ఉండేవాడనిపిస్తుంది.

కాషియస్‌లో బ్రూటస్ చూపించిన లంచగొండితనం మొదలైన నైతికదోషాలు రాజకీయ ప్రయోజనదృష్టితో చూస్తే దోషాలే కావు. క్లిష్టపరిస్థితుల్లో ఎవరైనా చేయక తప్పనివి. ఇతడు ఎంతటి రాజకీయ ప్రవీణుడో అంతటి యుద్ధతంత్ర ప్రవీణుడు. ఎదురుపోయి శత్రువును ఎదుర్కోటం కంటే శత్రువునే రానివ్వటం మంచిది అన్న అతడు చేసిన సమంజసమైన సూచనను బ్రూటస్ త్రోసిపుచ్చాడు. అందువల్లనే కాషియస్ చెప్పినట్లు విద్రోహవర్గంవారు ఫిలిప్పీయుద్ధరంగంలో వారి సర్వస్వాతంత్ర్యాలూ కోల్పోవలసి వచ్చింది. తత్వవేత్త యైన బ్రూటస్ రాజకీయ చతురుడు, యుద్ధతంత్ర ప్రవీణుడైన కాషియస్ సలహాలను త్రోసి రాజనటంతో చేటుమూడింది.

బ్రూటస్ అనేకరీతుల తన్ను త్రోసిపుచ్చుతున్నా కాషియస్ అచంచలభక్తితో ఆయన్ను అనుసరించాడు. బ్రూటస్ ఉత్తమవ్యక్తిత్వానికి తాను ముగ్ధుడు కావటమే ఇందుకు కారణం. వారిద్దరి మధ్య చెలరేగిన మనస్పర్ధలకు అతడు ఎంతో నొచ్చుకున్నాడు సంధి జరిగిన తరువాత మనసార కౌగిలించుకున్నాడు. పోర్షియా మరణానికి ఎంతో చింతించాడు. బ్రూటస్ పట్టుబడ్డాడన్న అబద్ధవార్త విన్నప్పుడు 'నా కంటిముందు నా ప్రియమిత్రుడు పట్టుబడ్డ తరువాత నేనింకా బ్రతికి ఉన్నా' నని బాధపడ్డాడు.

ఇంతగా బ్రూటస్ యెడ అభిమానాన్ని వహించి లొంగిపోయిన కాషియస్‌ను చూసి, సీజర్ "ఇట్టి ఆకలి కళ్ళతో చూచే బక్కపలచనివారు తమకంటె అధికులైనవారిని చూచి ఈర్ష్య వహిస్తుంటారు" అని ఆంటోనీతో అనటం సమంజసంగా లేదు. అతడి రాజకీయాలకు ఒక నైతికసిద్ధాంతం ఆధారంగా లేకపోవటం తప్ప కాషియస్‌లో వేరే దోషమేమీ లేదు. అతడే దోషభూయిష్ఠుడైతే బ్రూటస్ అతణ్ణి ప్రేమించేవాడే కాదు దుష్టత్వం, ఈర్ష్యాపరత లక్షణాలైతే మరణపర్యంతం అనుసరించే అనుయాయులు కొందరు అతడికి ఏర్పడేవారు కారు. అతడిలో కొన్ని లోపాలున్నా ఉదాత్తగుణాలు లేనివాడు కాడు. బ్రూటస్ అతణ్ణి మరణానంతరం "రోమనులలో తుదివా"డనీ, నిన్ను బోలిన వ్యక్తులిక రోములో జన్మించరని ప్రశంసించేవాడు కాడు.

## ఆంటోనీ

ఆంటోనీ మేధావి, భావోద్వేగి, ధైర్యసాహసాలు కలవాడు, ఎట్టి క్లిష్టపరిస్థితినైనా తన కనుకూలంగా త్రిప్పుకోగల ప్రవీణుఁడు. గౌరవాధికారాలపై ఆసక్తి కలవాఁడు. విలాసప్రియుడు. వినోదశీలి. సీజర్ ఎడ అతని భక్తిభావం అచంచలం, అమలినం, పరిపూర్ణం. ప్రభువర్గతత్త్వం అతడిలో జీతించిన గుణం. అతడు పన్నుగడలు పన్నగల కుశాగ్రబుద్ధి. హృదయార్ద్రతకంటె విధానానుసరణం మీద అతడికి దృష్టి విశేషం. కానీ ఇతరుల ఉదాత్తతయెడ అంధుడు మాత్రం కాదు. బ్రూటస్ వలె ఇతడు నీతిసూత్రాలతో కొలిచి ఇతరులకు విలువ కట్టడు. ఆంటోనీ రాజకీయజ్ఞుడే కాని అతడి రాజకీయాలకు వ్యక్తిగతకారణాలు సుస్థిరసూత్రమేదీ ఆధారం కాదు. అందువల్లనే అతడు తదనంతర చరిత్రలో పరాజితుడైనాడు.

సీజరంటే అతనికి అపారభక్తి. 'సీజర్ ఏదైనా చెయ్యమంటే అది జరిగినట్లే' అన్న అతడి వాక్యంలో అణుమాత్రమైన స్తోత్రప్రియత్వం లేదు. సీజర్ మీద భక్తే అతణ్ణి వధానంతరం హంతకుల మధ్యకు నడిపించింది. సీజర్‌కు జరిగిన మహాద్రోహం అతడిలో నిస్సీమమైన ఉద్రేకాన్ని కల్పించి దౌష్ట్యాచరణకు ప్రేరేపించింది. విజయాన్ని చేకొన్న విద్రోహులతో స్నేహం చేసుకొని అధికారాన్ని పంచుకోవటానికి పూనుకోకపోవటమే ఆంటోనీ స్వార్థరహితమైన స్వామిభక్తిని ప్రకటిస్తుంది.

అతడు రాజకీయాలలో నీతివిరహితుడు. ప్రజలను వక్తృత్వంతో ఉద్రేకపరచి "ఇది ఇక వ్యహరించుగాక! దౌష్ట్యమా! నీవు పయనమారంభించావు స్వేచ్ఛాను సారంగా విహరించు" అని అనటం వల్ల అతడి హృదయకౌటిల్యం వక్తమౌతున్నది. ప్రజలకు సీజర్ ఇచ్ఛాపత్రంలోని ప్రజాదానాల గురించి తెలియజేసి, తరువాత వాటిలోని ఆ భాగాలను తొలగించి ప్రజలను మోసగించటానికి లెపిడస్ చేత ఇచ్ఛాపత్రాన్ని తెప్పించటం, వీరత్రయకూటమిలో సభ్యుడైన లెపిడస్‌ను గురించి అతడు ఆక్టేవియస్‌తో వెల్లడించిన భావాలు, మాటలకు మనస్సుకూ గల అసంబద్ధతను తెలియజేస్తున్నవి. తనతో సమానుడైన వీరుడు గదా లెపిడస్! అతడు భారవహనానికి పనికివచ్చే గార్దభమట! అతడిది ఎంతటి కుటిలహృదయం!

అతని క్రీడాభిరతి, విలాసప్రియత్వం, కొంతవరకు సహించ దగ్గవైనా అతని క్రూరత్వం, హృదయ రాహిత్యం క్షంతవ్యాలు కానివి. లెపిడస్ కోరితే తన మేనల్లుని "ఒక్క చుక్కతో తుడిచిపెడుతున్నా" నన్నాడు.

షేక్స్‌పియర్ చిత్రించిన సీజర్ నాటకంలోని ఆంటోనీని చూచినప్పుడు, కాలం ఒక దుష్టుణ్ణి దేవతను చేసి కూర్చోపెట్టిందనీ, అతడే చెప్పిన ఆంటోనీ క్లియోపాత్రాలోని ఆంటోనీని చూచినప్పుడు ఆ దేవతామూర్తి దుష్టుడుగా పరిణమించాడనీ అనిపిస్తుంది. సీజర్ నాటకంలోని ఆంటోనీ వక్తృత్వశక్తితో రోమను ప్రజను 'తాను పలికించినట్లు పలికే పిల్లన గ్రోవి'నిగా చేసుకుంటే, ఆంటోనీ – క్లియోపాత్రాలోని ఆంటోనీని 'ఆ ఈజిప్టు సమ్మోహిని, (క్లియోపాత్రా) తన ఇష్టానుసారంగా పలికించుకున్నది' అని ఒక విమర్శకుడు పలికిన వాక్యాలు ఎంతో సముచితాలైనవి.

ఇన్ని దోషాలున్నా ఆంటోనీ సమర్థుడు. ఆత్మసంయమనం కలవాడు. క్లిష్టస్థితిలో చిత్తస్థైర్యాన్ని అచంచలంగా నిలుపుకోగల గంభీరుడు. ఉపాయశాలి. శిలలకు ప్రాణంపోసి తన పనులు నెరవేర్చుకోగల ప్రజ్ఞాశాలి. కార్యనిర్వహణ దక్షుడు. కాషియస్ సీజర్ ఎడ విద్రోహవర్గాన్ని కూర్చి వధతో విజయాన్ని పొందితే విద్రోహవర్గానికి ప్రతివర్గాన్ని సృష్టించి విజయాన్ని సాధించిన మహామేధావి. యుద్ధతంత్రజ్ఞుడు. ఉదాత్తగుణాలు తనకు లేకపోయినా బ్రూటస్‌లోని నైతికాధిక్యాన్ని గమనించి "మానవుడంటే ఇతడే" అని శ్లాఘించటం, సీజర్ ఎడ అచంచల భక్తిప్రపత్తులు ప్రకటించటం ఈ కుటిలపాత్రకు గల రెండు మధురగుణాలు.

## స్త్రీ పాత్రలు

సీజర్ నాటకంలో స్త్రీ పాత్రలు ఇరువురు. ఇందులో పోర్షియా స్త్రీ రూపంలో ఉన్న బ్రూటస్. అత్యుదాత్త అయిన రోమను నారీమణి. ఉత్తమ ధర్మపత్ని. భార్యకు గల హక్కులను కర్తవ్యాలను ఎరిగిన వ్యక్తి. తన చిత్తదార్ఢ్య నిరూపణ కోసం ఊరువులో గాయాన్ని కల్పించుకొని భర్తకు తన పౌరుషశీలాన్ని ప్రకటించిన వీరనారి. అయితేనేం? ఆమె కేవలం స్త్రీమూర్తిగానే వ్యవహరించింది. భర్త యుద్ధభూమిలో ఉండటం వల్ల కలిగిన వియోగాన్ని భరించలేక మరణించిన ఆమె, స్త్రీ జనసహజమైన హృదయ దౌర్బల్యాన్ని జయించలేకపోయిందనే చెప్పవచ్చు. కాని వ్యక్తిత్వం గల స్త్రీ.

కల్పూర్నియా సీజర్ భార్య. వ్యక్తిత్వం లేని వ్యక్తి. అంతటి మహావీరునికి పత్ని అయి ఉన్నా, అంధవిశ్వాసాలమీద అపరిమితమైన నమ్మకం కలది. తన దుఃస్వప్నానికి వెరచి భర్తను సభాభవనానికి వెళ్ళవద్దని తొలుత ప్రార్థించినా, ఆయన వెళ్ళటానికి నిశ్చయించుకొన్నప్పుడు హృదయ దార్ఢ్యంతో ఈమె ఎదురునిల్వలేదు. పోర్షియావలె తనకున్న వైవాహిక సత్యాలను గురించి పట్టుబట్టకపోయినా వాటి ప్రశంసైనా చేయలేదు.

నిరంకుశునికి పత్ని అయిన ఆమె తనకున్న సత్యాలనే ఎరగదో, తెలిసి మరపునకు అలవాటు పడిందో! లేక శకునాలకు ఒక వంక జంకుతున్నా భర్తకు లభించనున్న రాజకిరీటం మీద ఆమెకు కూడా అభిమాన ముందేమో! లేకపోతే తన ప్రార్థనలను సీజర్ తిరస్కరించి వెళ్ళుతుంటే నోరైనా ఎత్తకుండా ఉంటుందా? కల్పూర్నియా లోకసామాన్యురాలైన స్త్రీయే గాని పోర్షియా వలె విశిష్టమూర్తి కాదు.

పోర్షియా, కల్పూర్నియా ఇరువురూ ఉత్తమపత్నులే కాని, కల్పూర్నియా సీజర్‌కోసమే జీవించింది. పోర్షియా బ్రూటస్ కోసం జీవిస్తూ కొంత తనకోసం కూడా జీవించింది. భర్తృహృదయసాన్నిహిత్య సంపాదనలో పోర్షియాకున్న ప్రజ్ఞ కల్పూర్నియాకు లేనట్లు కనిపిస్తుంది. ఇందుకు కారణాలైన గుణదోషాలు భర్తలవో, భార్యలవో?

## రోమను ప్రజ

జ్ఞానహీనులు, చంచలస్వభావులు, ఉద్రేకపూరితులు అయిన రోమను ప్రజను మహాకవి షేక్స్‌పియర్ తన అనంతప్రతిభతో ఈ సీజర్ నాటకంలో చిత్రించి చూపించాడు. నాటకాన్ని వారితో ఆరంభించాడు. ధర్మాధికారులు వారి మతిభ్రమణాన్ని, కృతఘ్నతను, చంచలశీలాన్ని నిందిస్తూ పారద్రోలితే దోషులైనట్లు కిక్కురుమనకుండా వారు వెళ్ళిపోయారు.

సీజర్ వధాసందర్భంలో వీరి చంచలత్వాన్ని షేక్స్‌పియర్ ఇంకా స్పష్టంగా నిరూపించాడు. సీజర్‌ను హత్య చేసినందుకు విద్రోహవర్గంమీద వెర్రికోపాన్ని పొంది మింగేసేటట్లు వచ్చారు. కానీ కారణాలను చెప్పి సంతృప్తి పరిస్తే చాలునని ఏకకంఠంగా పలికారు. బ్రూటస్ ఇచ్చిన సమాధానాన్ని విన్నారు. ఇంచుకైనా స్తిమితచిత్తాన్ని వహించి, ఆ సమాధానాన్ని పరిశీలించి అవగతం చేసుకోకుండానే సంతృప్తిని పొంది, బ్రూటస్‌ను స్వాతంత్ర్య సముద్ధర్తనుగా నిర్ణయించి కీర్తించారు. సీజర్‌ను వధించటానికి బ్రూటస్‌ను ప్రేరేపించిన ప్రజాస్వామ్య సిద్ధాంతం, వారికి అణుమాత్రమైనా విజ్ఞానభూయిష్ఠమైన బ్రూటస్ ప్రసంగం వల్ల తెలిసిందని అనుకోటానికి అవకాశం లేదు. అయితేనేం? ఆయన ఎడ అపార ప్రేమానురాగాలను ప్రకటించి 'సీజర్‌ను కూడా చేద్దా'మనుకొన్నారు. నిరంకుశత్వాన్ని రూపుమాపటానికి నాయకత్వాన్ని వహించిన వ్యక్తినే నిరంకుశ పదవికి ఎన్నుకోదలచటం కంటే ప్రజల మౌఢ్యానికి, అజ్ఞానానికీ మరో నిదర్శనం ఏం కావాలి?

బ్రూటస్ ప్రసంగానికి పూర్వం ప్రజ సీజర్ యెడ అచంచల విశ్వాసాన్ని ప్రకటించింది. తరువాత బ్రూటస్ పక్షం వహించింది. ఆంటోనీ ప్రసంగించాడు.

మళ్ళీ అందర్నీ సీజర్ వంకకు త్రిప్పాడు. జనచిత్తచాంచల్య పరిగణనలో నిధి అయిన ఆంటోనీ వారిని విద్రోహవర్గంమీదికి దండెత్తించి విజయం చేకొన్నాడు. బ్రూటస్ నిరూపించిన సమంజసమైన కారణాలతో వారి కేమి పని? ఆంటోనీ చేసిన భావోద్రేక సంఘర్షణ వారిమీద పనిచేసింది. ఇక వారు తలపెట్టి సాగించని దౌష్ట్యమంటూ లేదు. నేను సిన్నా కవిని, సిన్నాకవిని అని ఎంత మొరపెట్టు కుంటున్నా వినిపించుకోక, హంతకుల్లో ఒకడైన సిన్నాతో నామసామ్యం గల సిన్నా కవిని చీల్చివేయటంతో వారి క్రోధోన్మత్తత పరాకాష్ఠ నందుకున్నది. నిరంకుశత్వ ప్రజాస్వామ్యాలల్లో వారేవంకకు మ్రొగ్గుతారో! “ఇట్టి చిత్తప్రవృత్తిగల సామాన్యప్రజపై షేక్స్పియర్‌కు అభిమానం విశేషం. అందువల్లనే అతడు హృదయపూర్వకంగా వారితో క్రీడించాడు. దీర్ఘకాలంమీద వారినే ధర్మనిర్ణేతలనుగా తీర్చిదిద్ది రోమక ప్రభువర్గం కంటే ఉన్నతస్థానాన్ని వహించినవారినిగా వారిని నిరూపించాడు.”

ఇట్టి అపూర్వపాత్ర సృష్టితోనే కాక, కాషియస్ బ్రూటస్ హృదయంలో విద్రోహబీజాలను నాటిన ప్రథమాంక ద్వితీయ దృశ్యం, విద్రోహవర్గజనదృశ్యం, పోర్షియా బ్రూటస్‌ల సమావేశంతో ఒప్పిన ద్వితీయాంక ప్రథమ దృశ్యం, ఆంటోనీ ప్రసంగ సన్నివేశం, బ్రూటస్, కాషియస్‌ల కలహ సన్నివేశం, బ్రూటస్ కాషియస్‌ల సంభాషణం మొదలైన మహత్తర, మనోజ్ఞ సన్నివేశాలతో షేక్స్పియర్ మహాకవి తన పరిణిత కళావైదగ్ధ్యాన్ని ప్రకటించిన సీజర్ నాటకం సమకాలీనుల్లోనే విఖ్యాతి గడించి, నేడు ఆ నాటి రోమకచరిత్ర కొక చక్కని ప్రతిబింబంగా ప్రవర్తిస్తూ వస్తున్నది.

‘ప్రతిజాతికీ దాని యోగ్యతను బట్టి ఉత్తమ ప్రభుత్వం ఏర్పడుతుంది. జాతి నిర్మించుకొన్న రాజకీయ సంస్థల్లో మార్పు కలగాలంటే, అందులోని జనసముదాయ మంతటిలోనూ శీలపరివర్తన కలగవలసిందే. అంతవరకూ ఒక క్రూరపాలకుణ్ణి తొలగిస్తే మరొకడు ఆ స్థానాన్ని ఆక్రమిస్తాడు. హత్య మహాదోషం. రాజకీయాశయం కోసమైనా హత్య చేసింది వ్యక్తి ఐతే వ్యక్తి, జాతి ఐతే జాతి తత్ఫలితాన్ని అనుభవించక తీరదు. ఉదాత్తలక్ష్యసిద్ధికి ఉదాత్త సాధనాన్నే ఉపయోగించాలి’

అన్నవి ఈ నాటకం నేర్పే గుణపాఠాలు. ఇవి సార్వజనీనాలు, సార్వకాలీనాలు. ఈ ‘నిత్య సత్య ప్రవచనం’ వల్ల సీజర్ నాటకం విశ్వసాహిత్యంలో సుస్థిరమైన విశిష్టస్థానాన్ని పొందినదనటంలో అతిశయోక్తి అణుమాత్రమైనా లేదు.

# పాత్రలు

**జూలియస్ సీజర్ :** మహాసేనాని, రోమక సామ్రాజ్యాధి నేత

**మార్కస్ బ్రూటస్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**కాషియస్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**కాస్కా :** విద్రోహ వర్గ సభ్యుడు

**ట్రెబోనియస్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**ఆక్టేవియస్ సీజర్ :** సీజర్ వధానంతరం ఏర్పడ్డ వీరత్రయ కూటమి సభ్యుడు

**మార్క్ ఆంటోనీ :** సీజర్ వధానంతరం ఏర్పడ్డ వీరత్రయ కూటమి సభ్యుడు

**లెపిడస్ :** సీజర్ వధానంతరం ఏర్పడ్డ వీరత్రయ కూటమి సభ్యుడు

**సిసెరో :** శాసనసభా సభ్యుడు

**పబ్లియస్ :** శాసనసభా సభ్యుడు

**పొపిలియస్ లేనా :** శాసనసభా సభ్యుడు

**లిగారియస్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**డెషియస్ బ్రూటస్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**మెటిల్లస్ సింబర్ :** విద్రోహ వర్గ సభ్యుడు

**సిన్నా :** విద్రోహ వర్గ సభ్యుడు

**ఫ్లేవియస్, మరులియస్ :** ప్రజా ధర్మాధికారులు

**ఆర్టిమిడోరస్ :** ఛందశ్శాస్త్రోపాధ్యాయుఁడు

**సిన్నా :** కవి, మరొక కవి

లుసిల్లియస్, టిటినియస్, మెసెల్లా, యువకేటో వొలిమ్నియస్ బ్రూటస్ మిత్రులు క్లిటస్, వర్రో, క్లాడియస్, స్ట్రాటో, లూషియస్, డార్డానియస్ బ్రూటస్ సేవకులు. పిండారస్ కాషియస్ సేవకుడు శాసనసభా సభ్యులు, పౌరులు, రక్షకులు, పార్శ్వచరులు, తదితరులు.

**స్త్రీలు**

**కల్పూర్నియా :** జూలియస్ సీజర్ భార్య

**పోర్షియా :** బ్రూటస్ భార్య

# ప్రథమాంకము

## ఒకటో దృశ్యం

**రోము మహానగరంలో ఒకవీథి.**
**ఫ్లేవియస్, మరులియస్, కొందరు పౌరులు ప్రవేశిస్తారు.**

**ఫ్లేవియస్ :** వెళ్ళిపొండి! పనిపందల్లారా! మీ మీ ఇళ్ళకు వెళ్ళిపొండి. ఏమిటి? మీకేం తెలియదా? మీ మీ వృత్తిచిహ్నాలు లేకుండా ఈ శ్రమదినంనాడు ఇలా తిరగరాదని మీకు తెలియదా? ఏమోయ్, నీ వృత్తేమిటి?

**ప్రథమ పౌరుడు :** ఎందుకు బాబూ? నేనో వడ్రంగిని.

**మరులియస్ :** అయితే నీ వక్షస్త్రాణమేది?[1] దారుదండమేది?

ఇంత మంచిదుస్తులు ధరించి తిరుగుతున్నావేం? నిన్నేనయ్యా! నీ వృత్తేమిటి?

**ద్వితీయ పౌరుడు :** బాబూ, నిజం చెపితే నిపుణుడైన శ్రామికునితో పోల్చి నన్ను ప్రావీణ్యం లేనివాడని మీరంటారు.

**మరులియస్ :** కావచ్చు. నీ వృత్తేమిటో సూటిగా చెప్పు.

**ద్వితీయ పౌరుడు :** నా వృత్తా బాబూ, భయరహితంగా చెప్పవచ్చునను కుంటాను, నిజం చెపితే, చెడ్డ చర్మాలను[2] బాగు చేయటమే నా వృత్తి.

**మరులియస్ :** ఓరి తులువా! తల బిరుసెక్కిందా? నీదేం వృత్తి?

**ద్వితీయ పౌరుడు :** వద్దు, కోపగించకండి బాబూ! నేను మీ చర్మాన్ని కూడా బాగుచేస్తాను.

**మరులియస్ :** అంటే నీ అభిప్రాయం? నా చర్మం కూడా బాగు చేస్తావా, ఓరి పెంకివెధవా?

**ద్వితీయపౌరుడు :** ఎందుకు కోపగిస్తారు బాబూ, మీ అతకలను కూడా బాగుచేస్తాను.

**మరులియస్ :** అయితే నీవు చర్మకారుడి వన్నమాట! అంతేనా?

**ద్వితీయపౌరుడు :** నిజం చెపుతున్నాను బాబూ! నేను నా ఆరెతోనే జీవిస్తున్నాను. మరోవృత్తిగల వాళ్ళతో గాని, స్త్రీల విషయాల్లో గాని నేను ఎటువంటి జోక్యం కలిగించుకోవటం లేదు. అయితే, సత్యం చెపుతున్నాను, ఆపదలో ఉన్న పాత చర్మాలకు నేను ఘనవైద్యుణ్ణి. తగ్గ చికిత్స చేస్తాను. అందమైన చర్మాలు వేసుకొని నడుస్తున్నవాళ్ళు ఎవరు కన్పించినా వారు నా నైపుణ్యంవల్ల తయారైన చర్మాలను ఉపయోగిస్తున్నారన్న మాటే!

**ఫ్లేవియస్ :** అయితే, ఈ నాడు మీరంతా మీ మీ కర్మాగారాలలో పనిమానేశారా? ప్రజల నందరినీ గుంపులుగా నడిపించుకుంటూ వీథుల్లో ఇలా తిరుగుతున్నారేం?

**ద్వితీయ పౌరుడు :** వాళ్ళ చర్మాలు అరిగిపోవటానికి నాకు మరింతపని దొరకటానికి – కాదు బాబూ! సీజర్ను చూడటానికీ, అతడి విజయానికి ఆనందించటానికీ ఇవాళ మేము సెలవు తీసుకొన్నాం.

**మరులియస్ :** ఆనందించటానికా! ఏముంది కనక? అతడు ఏం విజయాలు నెత్తికెత్తుకో వచ్చాడని? కప్పాలు చెల్లించగల బందీలను రథానికి కట్టి వెంటబెట్టుకుని రోముకు నడిపించుకో వస్తున్నాడనా!

వీళ్ళు వట్టి మూర్ఖులు! రాతిగుండెలు!! భావహీనులు!!!... ఓ శిలాహృదయులారా! రోము నగర క్రూరపౌరులారా!! పాంపేను[3] అప్పుడే మరిచిపోయినారా? రోము నగర మహావీథుల్లో అతడు విజయపరంపరలతో వచ్చి యాత్ర చేస్తున్నప్పుడు అతని దర్శనంకోసం మీరు ఘనకుడ్యాలు, కోటకొత్తళాలు, హర్మ్యశిఖరాలు ఎగబ్రాకి ఎక్కి చేతుల్లోని పసిపాపల్తో, దీర్ఘమైన దినమంతా, ప్రశాంతంగా ఆశతో ఎన్నిమార్లు వేచి ఉన్నారో మరిచిపోయినారా? అతడి రథం కనబడీ కనబడక ముందే మీరంతా ఒక్కమారుగా చరిచిన కరతాళాల ప్రతిధ్వనులకు శూన్యతీర భూమితో టైబరునది[4] వణికిపోవడం మరిచిపోయినారా?

ఆ! మీరు ఈ నాడు అత్యుత్తమమైన దుస్తులు ధరించారా? ఆ మీరు ఈనాటిని సెలవు దినంగా ఎన్నుకున్నారా? ఆ మీరు పాంపే సంతానరక్తంతో చేకొన్న విజయాన్ని తెస్తున్నవాడి మార్గాలను పుష్పాలతో అలంకరిస్తున్నారా?

పొండి! వెళ్ళిపొండి!! మీ మీ ఇళ్ళకు పరుగెత్తి పొండి!! తాను చూపిన కృతఘ్నతను ఇలా బహిరంగంగా ప్రకటించుకొనే ఈ మహామారిని కొంతకాలం ఆపవలసిందని మీమీ దేవతలముందు మోకరిల్లి వేడుకోండి! పొండి!!

**ఫ్లేవియస్ :** వెళ్ళిపొండి! ఉదాత్తులారా! దేశీయులారా! పొండి! దీన్ని ఆనందసమయంగా చేసుకొన్న మీ దోషానికి ప్రతిక్రియగా మీబోటి దీనులనందర్నీ గుంపు చేయండి. టైబరు నదీతీరానికి వెళ్ళండి! ఆ నదీవేణికలో మీ కన్నీటిని క్రుమ్మరించి ఆ తరంగిణి సర్వోన్నతతీర భూములనూ చుంబించేటట్లు చెయ్యండి!

**(పౌరులు నిష్క్రమిస్తారు)**

చూడు, వారి అల్పలక్షణం నా ప్రసంగం వల్ల మారిందో లేదో. చూడు దోషులు కావటం వల్ల కిక్కురుమనకుండా వెళ్ళిపోతున్నారు.

నీవు సభామందిరం[5]వైపు వెళ్ళు, నేను ఇలా పోతాను. ప్రతిమలకు ఏమైనా ఉత్సవాలంకరణలు కనిపిస్తే ఒలిచివెయ్.

**మరులియస్ :** ఆ పని మనం చెయ్యవచ్చా? ఇప్పుడు లూపర్‌కల్[6] ఉత్సవాలు జరుగుతున్నవని నీకు తెలుసుననుకుంటాను?

**ఫ్లేవియస్ :** ఇందులో దోషమేమీ లేదు. సీజర్ విజయ గౌరవ చిహ్నాలతో ఏ ప్రతిమా అలంకరింపబడరాదు. నే వెళ్ళి వీథుల్లో గుంపులుచేరే జనాన్ని చెదరగొడతాను. దట్టంగా జనం మూగి ఉన్నట్లు కనిపిస్తే నీవూ చెదరగొడుతూ వెళ్ళు.

సీజర్ రెక్కలమీద మొలుచుకొస్తున్న ఈకలను ఇలా పెరికి వేస్తే అతడూ సామాన్యంగానే ఎగరగలుగుతాడు. లేకపోతే మన అందరి చూపులకూ అందకుండా అతడు విహాయస వీథుల్లో విహరిస్తూ మనలనందరినీ దాస్యభయంలో ముంచెత్తుతాడు.

**(నిష్క్రమిస్తారు)**

## రెండోదృశ్యం

ఒక ప్రజాప్రదేశం. సంగీత విజయోత్సవాలతో సీజర్ ప్రవేశిస్తాడు. ఉత్సవాచారాలకూ ఆంటోనీ, కల్పూర్నియా,[7] పోర్షియా, డెసియస్, సిసెరో, బ్రూటస్, కాషియస్, కాస్కా ప్రవేశిస్తారు. వారివెంట ఒకమూక, అందులో ఒక శకునజ్ఞుడు ఉంటాడు.

**సీజర్ :** కల్పూర్నియా!

**కాస్కా :** నిశ్శబ్దం! సీజర్ ప్రవేశిస్తున్నాడు.

**(సంగీతం క్రమంగా అంతరిస్తుంది)**

**సీజర్ :** కల్ఫూర్నియా!

**కల్ఫూర్నియా :** ప్రభూ! ఇక్కడున్నాను.

**సీజర్ :** ఆంటోనియస్ పయనించే పవిత్ర మార్గంలో సూటిగా నిలు. ఆంటోనియస్!

**ఆంటోనీ :** సీజర్ మహాప్రభూ!

**సీజర్ :** నీ ధావనవేగంలో కల్ఫూర్నియాను స్పృశించటం మరచిపోకు. అతిపవిత్రమైన ఈ వేటలో స్పృశింపబడ్డ స్త్రీకి వంధ్యత్వశాపం తొలగిపోతుందని పెద్దలు చెపుతుంటారు.

**ఆంటోనీ :** తప్పక జ్ఞాపకం పెట్టుకుంటాను. సీజర్ 'ఈ పని చెయ్య' మని కోరితే ఆ పని జరిగిపోయినట్లే!

**సీజర్ :** ఇక బయలుదేరు. ఏ ఆచారభాగాన్నీ విడిచిపెట్టకు.

**(సంగీతం వినిపిస్తుంది)**

**శకునజ్ఞుడు :** సీజర్!

**సీజర్ :** ఆఁ. ఎవరు, నన్ను పిలుస్తున్నారు?

**కాస్కా :** సర్వధ్వనులూ అంతరించాలి. వెనుకటిలా నిశ్శబ్దంగా ఉండాలి.

**(సంగీతం ఆగిపోతుంది)**

**సీజర్ :** ఆ గుంపులోనుంచి ఎవరు పిలిచింది? ఈ సంగీతం అంతకంటే అవ్యక్తమైన ఒక కలస్వనం ఈ గుంపులోనుంచి నన్ను పిలచినట్లు వినిపించింది. అదెవరు? మాట్లాడు. సీజరు ఈ వంకకు తిరిగి వినటానికి సిద్ధంగా ఉన్నాడు.

**శకునజ్ఞుడు :** మార్చి పదిహేనో నాడు జాగ్రత్త!

**సీజర్ :** ఎవరది?

**బ్రూటస్ :** ఒక శకునజ్ఞుడు మిమ్మల్ని 'మార్చి పదిహేను నాడు జాగ్రత్త' అని సూచిస్తున్నాడు.

**సీజర్ :** అతడి ముఖాన్ని చూడాలి, నా ముందుకు తీసుకోరండి.

**కాషియస్ :** గుంపులోనుంచి ముందుకు రావయ్యా! సీజర్‌ను దర్శించు.

**సీజర్ :** నీవు నాకు సూచించిందేమిటి? ఏదీ, మళ్ళీ ఒకమారు చెప్పు.

**శకునజ్ఞుడు :** మార్చి పదిహేనో నాడు జాగ్రత్త!

**సీజర్ :** ఇతడెవరో స్వాప్నికుడు. అతణ్ణి వదిలెయ్యండి. పోదాం కదలండి.

**ఒక తుత్తారధ్వని వినిపిస్తుంది. బ్రూటస్, కాషియస్ తప్ప మిగిలిన వారందరూ నిష్క్రమిస్తారు.**

**కాషియస్ :** మీరు వెళ్ళి 'ఆ పవిత్రధావనాన్ని' తిలకిస్తారా?

**బ్రూటస్ :** లేదు.

**కాషియస్ :** వెళ్ళి చూడవలసిందని నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

**బ్రూటస్ :** క్రీడలంటే నాకిష్టం లేదు. ఆంటోనీలో ఉన్న ఉద్వేగం నాలో లేదు. నీ కోరికలకు నేనేం ఆటంక పడనులే. నిన్ను వదలిపెట్టి వెళ్ళిపోతాను.

**కాషియస్ :** బ్రూటస్! కొంతకాలంనుంచీ మీ కళ్ళలో నాకు వెనకటి ఆప్యాయత ఎందుకోగాని కనిపించటం లేదు. మిమ్మల్ని మనసార ప్రేమించే మిత్రుడిమీద ఎందుకంత వినూత్నంగానూ, కఠినంగానూ ఉంటున్నారు?

**బ్రూటస్ :** కాషియస్, మోసపోకు. నీకు అపరిచితమైన భావంతో నా ముఖం కప్పుకోపోయి ఉంటే ఆ బాధంతా కేవలం నాకోసమే. ఇతరులకు ఎట్టి సంబంధమూ లేని విషయాల వల్ల నాలో పరస్పర విరుద్ధోద్వేగాలు కలిగి నన్ను అలయించాయి. ఇదే బహుశః నా విచిత్రప్రవర్తనకు మూలకారణమై ఉంటుంది. అందువల్ల నాలో ద్యోతకమయ్యే మార్పునకు నా ముఖ్యస్నేహితులు చింతపడరనుకుంటాను. వెర్రి బ్రూటస్, తన అంతరాత్మలో జరుగుతున్న అంతర్యుద్ధం వల్ల, ఇతరుల ఎడ చూపవలసిన ప్రేమాభిమానాలను ప్రకటించటం కూడా మరిచిపోతున్నాడని అనుకుంటారు గాని, అంతకుమించి ఏమీ ఆలోచించరనుకుంటాను. నా ఆప్తమిత్రుల్లో నీవూ ఒకడివి.

**కాషియస్ :** బ్రూటస్! అయితే మీ మానసికోద్వేగాన్ని అపార్థం చేసుకున్నా నన్నమాట! తర్కించవలసిన అభిప్రాయాలను ఎన్నిటినో ఇన్నాళ్ళబట్టీ నా మనస్సులోనే దాచి ఉంచాను. మిమ్మల్ని గురించి మీకు బాగా తెలుసా బ్రూటస్?

**బ్రూటస్ :** లేదు, కాషియస్! అద్దంలో ప్రతిబింబాన్ని తిలకించటం వల్లనో లేదా మరోరీతిగానో తప్ప కన్ను తన్ను తాను చూచుకోగలుగుతుందా?

**కాషియస్ :** సత్యం చెప్పారు. మీలో గుప్తంగా ఉన్న శక్తిని ప్రతిబింబించి మీ కంటిముందు నిలిపి నిజరూపాన్ని మీరు చూచుకొనే అవకాశాన్ని కల్పించగల అద్దాలు మీకు లేవని అంతా ఎంతగానో చింతిస్తున్నారు. దివ్యపురుషుడు సీజర్ తప్ప రోము మహానగరంలోని మహనీయులందరూ బ్రూటస్ మహాశయుడు తన్ను తాను దర్శించవలెనని వాంఛిస్తున్నారు. వారందరూ ఈ యుగంలోని క్రూరపాలన భారాన్ని మోయలేక మూల్గుతున్నారు.

**బ్రూటస్ :** నాలో గుప్తంగా ఏదో మహాయోగ్యత ఉన్నదని, దాన్ని వెదకమనీ ఉద్బోధించి నన్ను ఏ ప్రమాదాలలోకి నడిపిస్తున్నావో నీవు అర్థం చేసుకున్నావా? అట్టి శక్తి ఏదీ నాలో లేదని నాకు తెలుసు.

**కాషియస్ :** అయితే, బ్రూటస్, వినటానికి సిద్ధపడండి. ఎంత యత్నించినా మీ ప్రతిబింబంతో తుల్యంగా మిమ్మల్ని మీరు తిలకించలేరు. నేను మీకు ముకురా న్నౌతాను. అత్యుక్తి లేకుండా మిమ్మల్ని గురించి మీరెరుగని పర్వాన్ని ద్యోతకం చేస్తాను.

బ్రూటస్ మహాశయా! నన్ను అనుమానించకండి. నన్ను గురించి సామాన్య పరిహాసకుడని విన్నా, సాధారణ ప్రమాణశుల్కానికి ప్రేమనటించే ప్రతినూతన వ్యక్తికీ మైత్రినిస్తానని తెలుసుకున్నా, స్తోత్రపాఠాలకు లొంగి తొలుతగా కౌగిలించి తరువాత తిడతానని, సామాన్య జనానురాగాన్ని చూరగొంటానికి ఆరాటపడతాననీ తెలుసుకొన్నా నన్ను ప్రమాదకారినిగా భావించండి.

**(కోలాహలం, కరతాళధ్వనులు వినిపిస్తవి)**

**బ్రూటస్ :** ఈ కోలాహలానికీ, కరతాళధ్వనులకూ అర్థమేమిటి? ప్రజలు సీజర్‌ను రాజుగా ఎన్నుకుంటున్నారేమో. భయం వేస్తున్నది.

**కాషియస్ :** ఏమిటి? నిజంగా మీరు భయపడుతున్నారా? అలా జరగకూడదని మీరు వాంఛిస్తున్నట్లు నేను నమ్మవలసిందే.

**బ్రూటస్ :** ఔను కాషియస్, అలా జరగకూడదు. అయినా, అతడంటే నాకెంతో అనురాగం. అయితే నీవు ఎందుకు నన్నింతసేపు ఇక్కడ ఆపుతున్నావు? ఏమైనా చెప్పదలచుకున్నావా? అది సమష్టి స్వశ్రేయసానికి సంబంధించిందైతే మృత్యుగౌరవాలు రెండూ చెరొకవంక దర్శనమిచ్చినా, రెంటినీ సమదృష్టితో పరిశీలిస్తాను. మృత్యుభయాన్ని తొలగించి నాకు గౌరవం మీద అభిమానాన్ని ప్రసాదించి దేవతలు అభ్యుదయాన్ని చేకూర్చెదరు గాక!

**కాషియస్ :** బ్రూటస్! అంతటి మహోదారగుణం మీలో ఉందని మీ బాహ్యరూపాన్నైన నాకు తెలుసు  బాగుంది. వినండి. గౌరవమే నా కథనానికి వస్తువు. మీరూ, ఇతరులూ ఈ నాటి మన జీవితాన్ని గురించి ఏమనుకుంటున్నారో నేను చెప్పలేను. సర్వరీతులా నన్ను బోలిన ఒక వ్యక్తివల్ల కలుగుతున్న భయంతో బ్రతకటం కంటే మరణించటమే మంచిదని నాకు నేను భావిస్తున్నాను.

నేను సీజర్‌లా స్వతంత్రుణ్ణిగా జన్మించాను. మీరూ అలాగే జన్మించారు. అతనితో తుల్యంగానే మన మిద్దరం పోషణను పొందాం. అతనిలాగానే శీతకాలపు చలిని మన మిర్వురం భరించగలం.

ఎందువల్లనంటారా, ఒకప్పుడు, ఒక శీతలమైన తుపాను నాటిరాత్రి, పొంగులువారే టైబరునది తన ఒడ్లమీద క్రోధాన్ని వెళ్ళగ్రక్కుతున్నప్పుడు, సీజర్ నాతో "కాషియస్! ఈ క్రోధోన్మత్త తరంగిణిలో దూకి ఆ లక్ష్యం వరకూ నాతోబాటు ఈదటానికి నీకు ధైర్యముందా?" అని అడిగాడు. మరుక్షణంలోనే నేను ఉన్న దుస్తులతోటే నదిలోకి దుమికి అనుసరించమని అతణ్ణి ఆజ్ఞాపించాను. అతడు అనుసరించాడు. ప్రవాహం అతిభయంకరంగా గర్జిస్తున్నది. శక్తితో నీరాన్ని చిమ్మివేస్తూ, మనోధైర్యంతో నదీవేగానికి అడ్డునిలుస్తూ ఇద్దరం ఈదుతున్నాం. ఇంకా మా లక్ష్యం దూరాన ఉంది. "కాషియస్! నాకు సాయపడు, లేదా నేను మునిగిపోతాను" అని సీజర్ దీనంగా కేకపెట్టాడు. ట్రాయ్ అగ్నిజ్వాలల్లోనుంచి మన పూర్వుడు ఏయ్‌నియస్[8] తన భుజస్కంధాలమీద ఆన్‌ఛెసిస్‌ను మోసినట్లు టైబర్ అలలమీద అలిసిపోయిన సీజర్‌ను నేను మోసి బయటపడేశాను.

అతడు ఈ నాడు మనకో దేవుడై కూర్చున్నాడు. కాషియస్ ఒక అల్పప్రాణి! అలక్ష్యంతో సీజర్ తల పంకిస్తుంటే నేను వినమ్రభావంతో శరీరాన్ని వంచవలసి వచ్చింది.

స్పెయిన్‌లో ఉండగా అతడికోమారు సుస్తీ చేసింది. దాని తీవ్రతలో అతడెలా వణికిపోయాడో నేను కళ్ళార చూచాను. ఈ నాటి దేవుడు ఆ నాడు గజగజలాడాడు. ఇది సత్యం. అతడి పెదవుల రంగు అదృశ్యమైపోయింది. సమస్తప్రపంచానికీ భయోత్పాతాన్ని కలిగిస్తున్న ఆ కన్నులు తమ కాంతిని కోల్పోయాయి. గాద్గద్యంతో కంపించిపోయిన ఆ నాటి అతని కంఠాన్ని నేను విన్నాను. తన ఆజ్ఞాపనలన్నింటినీ రోమకపౌరులు అధికాసక్తితో వినేటట్లు చేస్తూ, తానిచ్చే ఉపన్యాసాలను వారిచేత కంఠస్థం చేయిస్తూ ఉన్న ఆ నాలుక, అప్పుడు, అయ్యో, జబ్బుపడ్డ ఒక ఆడపిల్లలా, 'టిటినియస్![9] ఏదైనా పానీయాన్నివ్వు!' అని దీనంగా అర్థించింది.

నాకెంతో ఆశ్చర్యం వేస్తున్నది. ఓ దేవతలారా! ఆ దుర్బలుడే ఈ నాడు ప్రపంచాగ్రగామియై ఎక్కటివీరుడైనాడు.

**(కోలాహలమూ, కరతాళ ధ్వనులూ చెలరేగి వినిపిస్తవి)**

**బ్రూటస్ :** మరో కోలాహలం! ఈ కరతాళధ్వనులుకు సీజర్‌కు అబ్బిన నూతన గౌరవ చిహ్నాలని నానమ్మకం.

**కాషియస్ :** ఎందుకయ్యా! అతడీ క్షుద్రప్రపంచం మీద కోలోసస్[10]లాగా నిలుచుంటే అల్పప్రాణులమైన మనమంతా అతడి వరిష్ఠ పాదాల క్రిందుగా నడుస్తాం అంతే కాదు. గౌరవ రహితాలైన మన శ్మశానశిబిరా లెక్కడున్నవా అని వెదకటం కోసం వంగి వంగి ప్రాకిపోతాము.

కొన్ని సందర్భాలలో మానవులు తమ అదృష్టాలకు తామే అధికారులౌ తుంటారు. నెచ్చెలీ, బ్రూటస్! ఈ దోషం మన నక్షత్రాలది కాదు. మనదే. మనం అల్పులం.

బ్రూటస్! సీజర్!! ఆ 'సీజర్' అన్న నామంలో విశేషం ఏముంది కనక? అది మీ నామంకంటే ఎందుకు అధికంగా ఉచ్చరింపబడాలి? రెంటినీ జతచేసి వ్రాసిచూడండి. ఆ పేరెంత మధురమైందో మీదీ అంతే మధురమైంది. ఉచ్చారణసౌలభ్యం దానికున్నట్లు దీనికీ ఉంది. తూచండి రెంటిభారం సమానమే. ఏదీ ఒకమారు రెంటినీ అభిమంత్రణం చేసి చూడండి. సీజర్ నామం ఎంత వేగంగా ఒక శక్తిని ఉద్భవింపజేయ గలుగుతుందో, బ్రూటస్ నామం కూడా అంత వేగంగానే ఒక శక్తిని ఉద్భవింపజేయగలుగుతుంది. సర్వదేవతల నామోచ్చారణం చేసి ఒకటి నేనడుగుతున్నాను : ఏం భుజించటం వల్ల సీజర్ ఇంత ఘనుడైనాడు?

కాలమా? నీవు అవమానిత వైనావు. రోము మహానగరమా! నీవు మహోదాత్తులకు జన్మభూమివి కావటం మానివేశావు. మహాప్రళయానంతరం[11] నుంచి ఏ యుగం అనేక ఘనులు జన్మించిన ఖ్యాతిని పొందకుండా గడచిపోయింది. రోము నగరం గర్వించదగ్గ పుత్రుడీతడొక్కడే అని ఒక వ్యక్తిని గురించి, ఎన్నడైనా దాని ఘనకీర్తిని శ్లాఘించేవారు చెప్పుకున్నారా? ఈ నాడు ఒకే ఒక వ్యక్తికి తప్ప తాను తావీయకుండా అతి విచిత్రమైనదైపోయింది రోము.

ఈ రోమును ఒకడు రాజై పాలించేదానికంటే ఒక పెనుభూతం ఇందులో విశృంఖలవిహారం చేసినా సహిస్తానని, పూర్వం ఒకానొకప్పుడు[12] ఒక బ్రూటస్ పలికి తదనుగుణంగా ప్రవర్తించినట్లు పెద్దలు చెప్పుకుంటే మీరూ, నేనూ కథగా వినలేదూ?

**బ్రూటస్ :** నీకు నా యెడ అనురాగం అపారం. ఇందులో అణుమాత్రమైనా నాకే అనుమానం లేదు. ఏమీ చేయవలసిందని నీవు నన్ను ప్రేరేపిస్తున్నావో, కాషియస్, అది నాకు కొంతకొంతగా బోధపడుతున్నది. ఈ విషయాన్ని గురించీ, ప్రస్తుత కాలగమనాన్ని గురించీ పూర్వం నేనేమేమి తలపోశానో నీకు తర్వాత తెలియజేస్తాను. నిన్ను ప్రేమపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. దాన్ని ఇప్పుడే వెల్లడించ వలసిందని కోరకు. నీవు సూచించటానికి యత్నించిన నా కర్తవ్యాన్ని గురించి నేను వివేచిస్తాను. ఇంకా నీవేమైనా వినిపించదలచుకుంటే ఓపికతో వింటాను. ఇటువంటి ప్రధానవిషయాలను వినటానికీ, సమాధానాలు చెప్పటానికీ తగ్గసమయాన్ని ఏర్పాటు చేస్తాను. అంతవరకూ ఓ నా పరమమిత్రుడా! ఈ విషయాన్ని గురించి యోచన చేస్తూ ఉండు. కాలం తెచ్చిపెట్టిన ఈ కఠినస్థితిని భరిస్తూ రోము నగరపుత్రుడనే ఖ్యాతిని వహించటం కంటే ఈ బ్రూటస్ పల్లీయుడని అనిపించుకోవటానికైనా ఇష్టపడతాడు.

**కాషియస్ :** సంతోషం! శక్తిహీనాలైన నా మాటలు బ్రూటస్ మహాశయుని ముఖంనుంచి ఇంతటి అగ్నిజ్వాలలను వెలికిచిమ్మించ గలిగినందుకు సంతోషం.

**బ్రూటస్ :** క్రీడలన్నీ ఐపోయినట్లున్నయ్. సీజర్ తిరిగి వచ్చేస్తున్నాడు.

**కాషియస్ :** వారీమార్గాన వెళ్ళేటప్పుడు కాస్కాను టోగా[13]కొనపట్టి పిలవండి. మనం గమనించవలసిన విశేషాలు ఈ నాడు అక్కడ ఏమి జరిగాయో దాపరికం లేకుండా చెప్పేస్తాడు.

**(సీజర్, అతని పరివారం తిరిగి ప్రవేశిస్తారు.)**

**బ్రూటస్ :** అలాగే చేస్తాను. గమనించు, కాషియస్! సీజర్ ముఖం మీద ఏవో కోపరేఖలు కనిపిస్తున్నట్లున్నాయి? మిగిలిన పరివారమంతా గట్టిగా తిట్లు తిన్నట్లున్నారు? కల్పూర్నియా చుబుకం పాలిపోయినట్లు తోచటం లేదూ? సభాభవనంలో సభ్యులు తన్ను వ్యతిరేకించినప్పుడు కనిపించే ధోరణిలో సిసిరో రక్తారుణనేత్రాలతో ద్యోతకమౌతున్నాడు కదూ?

**కాషియస్ :** కాస్కా వచ్చి విశేషమేమి జరిగిందో వినిపిస్తాడుగా.

**సీజర్ :** ఆంటోనియస్!

**ఆంటోని :** సీజర్!

**సీజర్ :** నాకు అంగరక్షకులుగా బలిష్ఠులను, రాత్రులు గాఢనిద్రను పొందేవారిని కాపుంచు, అడుగో, దూరంగా బక్కపలచని ఆకలికళ్ళతో చూస్తున్నాడు కాషియస్. అతడెప్పుడూ అతిగా ఆలోచిస్తుంటాడు. అటువంటి వారివల్ల అధికప్రమాదం.

**ఆంటోనీ :** అతడంటే భయపడకండి సీజర్! అతడివల్ల ప్రమాదమేమీ ఉండదు. అతడు మహోదారుడైన రోము పౌరుడు. అత్యుత్తముడు.

**సీజర్ :** ఇంతకంటే అతడు[14] బలిసి ఉంటే నేను భయపడేవాణ్ణి కాను. కానీ నేను అతడంటే జంకటం లేదు. అయితే భయం వల్ల సీజర్ ఎవరికైనా తొలగి ఉండటమంటూ సంభవిస్తే అతడు ఆ పలచని కాషియస్ మాత్రమే. అతడు అతితీక్ష్ణంగా గమనిస్తుంటాడు. వ్యక్తులు చేసే బాహ్యకృత్యాలను బట్టి అతడు వారి అంతస్సుల్లోని అభిప్రాయాలను దర్శిస్తుంటాడు. నీవలె అతడికి ఆటలంటే అభిలాష లేదు. సంగీతమంటే ఆసక్తి అంతకంటే లేదు. ఎప్పుడోగాని చిరునవ్వెరగడు. అదైనా నవ్వటమనే తన బలహీనతను గురించి అసహ్యించుకున్నట్లుంది. తమకంటే అధికులైనవారిని చూస్తే అటువంటివారు హృదయశాంతి వహించలేరు. అందువల్ల వారు చాలా ప్రమాదకారులు. నేనెప్పుడూ భయరహితుడైన సీజర్నే. కానీ నేను భయపడే దానికంటే భయపడవలసిందేమిటో నీకు తెలియజేస్తున్నాను.

ఈ నా చెవికి చెవుడు కదూ, ఇలా కుడివైపుకు రా. అతణ్ణి గురించి నీ వేమనుకుంటున్నావో నాకు సత్యం చెప్పు.

**తుత్తారధ్వని వినిపిస్తుంది. సీజర్, కాస్కా తప్ప మిగిలిన పరివారమంతటితో, నిష్క్రమిస్తాడు.**

**కాస్కా :** నా టోగాను పట్టిలాగి నన్ను పిలిచారు. నాతో మాట్లాడదలిచారా?

**బ్రూటస్ :** కాస్కా! సీజర్ అంతగా చింతాక్రాంతుడై ఉన్నాడు. ఏం జరిగిందేమిటి?

**కాస్కా :** అదేమిటి? మీరూ ఆయన వెంటనే ఉన్నారుగా? లేరూ?

**బ్రూటస్ :** ఉంటే ఏం జరిగిందని నేను అడుగనే అడుగను.

**కాస్కా :** ఏముంది, అతడికి రాజకిరీటాన్ని సమర్పించారు. అతడు తన హస్తకరభంతో ఇలా వెనక్కు నెట్టాడు. అప్పుడు ప్రజలు కరతాళధ్వనులతో ముంచెత్తారు.

**బ్రూటస్ :** మరి రెండో కోలాహలం ఎందుకు జరిగింది?

**కాస్కా :** ఎందుకా? అదీ అందుకే.

**కాషియస్ :** వాళ్ళు ముమ్మారు కరతాళధ్వని చేశారు. చివరసారి ధ్వనులు ఎందుకో?

**కాస్కా :** అవీ అందుకే.

**బ్రూటస్ :** అయితే అతనికి కిరీటాన్ని ముమ్మారు సమర్పించారా?

**కాస్కా :** అవును, ముమ్మారు సమర్పించారు. ఒకమారుకంటే మరొకమారు మరింత నింపాదిగా దాన్ని అతడు అవతల పెట్టాడు. దాన్ని స్వీకరించటానికి అతడు తిరస్కరించినప్పుడల్లా ప్రజలు కరతాళధ్వనులు చేశారు.

**కాషియస్ :** అతడికి కిరీటాన్ని ఎవరు సమర్పించారు?

**కాస్కా :** అలా అడుగుతున్నావేమిటి? ఆంటోనీ!

**బ్రూటస్ :** సౌమ్యుడా, కాస్కా! అదంతా ఎలా జరిగిందో మాకు తెలియజేయ్.

**కాస్కా :** అది ఎలా జరిగిందో చెప్పటమంటే ఉరి వేయించుకోటమన్నమాట! అదంతా నేను బాగా గమనించలేదు. అది ఒక విచిత్ర నాటకం. అతడికి మార్కు ఆంటోనీ కిరీటాన్ని అర్పించటం మాత్రం చూచాను. అయినా అది రాజకిరీటం కూడా కాదు. కేవలం 'పత్రకిరీటం'. మీకు పూర్వం చెప్పినట్లుగా అర్పించిన కిరీటాన్ని ఆయన అవతల పెట్టాడు. కానీ అతడు చాలాసంతోషంతో దాన్ని స్వీకరించేవాడని నా అభిప్రాయం. ఆంటోనీ మళ్ళీ దాన్ని అర్పించాడు. అతడు మళ్లీ అవతల పెట్టాడు. మళ్లీ అవతల పెట్టేటప్పుడు అతడి వ్రేళ్ళలో లోభం కనిపించింది. అప్పుడు ఆంటోనీ మూడో మారు సమర్పించాడు. మూడోమారు కూడా అతడు అవతల పెట్టాడు. అప్పుడు ప్రజానీకం పొంగులువారి కరతాళ ధ్వనులు చేశారు. వారి చేతులు బీటలువారి పోయినాయి. వారు చెమటతో తడిసిన రేకులాయీలు విసిరారు. సీజర్ కిరీటాన్ని తిరస్కరించాడని అతడు మూర్ఛలో మునిగిపోయేటంతగా గవులు నిట్టూర్పులు విడిచారు. అతడు అంతటితో మూర్ఛిల్లి క్రిందపడ్డాడు. పెదవులు తెరిస్తే దుర్గంధం ఎక్కడ ప్రవేశిస్తుందో అన్న భయంతో నేనుమాత్రం నవ్వటం కూడా మానేశాను.

**కాషియస్ :** నెమ్మదిగా మాట్లాడు. నిన్ను ప్రార్థిస్తున్నా! ఏమిటి, సీజర్ మూర్ఛపోయాడా?

**కాస్కా :** అవును. విపణి ప్రదేశంలో పడిపోయి నురగలు క్రక్కుకున్నాడు. నోట మాట రాలేదు.

**బ్రూటస్ :** కావచ్చు. అతడికి మూర్ఛలవ్యాధి ఉంది.

**కాషియస్ :** పొరబాటు. ఈ వ్యాధి అతనికి లేదు. మీకు, నాకు, సత్యప్రియుడైన కాస్కాకు ఈ మూర్ఛలవ్యాధి ఉంది.

**కాస్కా :** అంటే నీ అభిప్రాయమేమిటో నాకేమీ అర్థం కావటం లేదు. కానీ ఇదిమాత్రం సత్యం. సీజర్ పడిపోయినాడు. రంగస్థలంమీద నటకులు తమకు సంతృప్తినీ, అసంతృప్తినీ కలిగించినప్పుడు జనం కరతాళధ్వనులు చేయటం గేలిచేయటం చేసినట్లు సీజర్ ఎడ ప్రజానీకం ప్రవర్తించారని నేను చెప్పింది జరక్కపోయినట్లయితే, నేను సత్యసంధుణ్ణే కాదు.

**బ్రూటస్ :** స్మృతి వచ్చిన తరువాత అతడేమన్నాడు?

**కాస్కా :** మూర్ఛపోబొయ్యేముందు అతడు కిరీటాన్ని పలుమారు తిరస్కరిస్తున్నప్పుడు ప్రజానీకం తమ ఆనందాన్ని ప్రకటిస్తుంటే, ప్రచ్ఛదాన్ని విప్పమని నన్ను ఆజ్ఞాపించి, వారికి ఉత్తరించటం కోసం కుత్తికను అందించాడు సుమా! ఆ సామాన్య జనంలో నేనూ ఒక కర్మకారుడి నైనట్లయితే అతడి కోరిక సత్యమైందను కోని, అతడి కంఠాన్ని ఉత్తరించకపోతే తులువలతో పాటు నరకానికి వెళ్ళేవాణ్ణే.

అతడు మూర్ఛపోయినాడు. తిరిగి స్మృతి వచ్చిన తరువాత తానేమైనా పొరబాట్లు చేసినా, చేయరాని ప్రసంగాలు చేసినా అవి తన అస్వస్థతల వల్ల జరిగినట్లు భావించవలసిందని ప్రజను ప్రార్థించాడు. నేను నిలుచున్నచోట ముగ్గురు నలుగురు దాసీముండలు 'పాపం! ఉత్తమాత్మ' అని అతణ్ణి పొగిడి హృదయపూర్వకంగా క్షమించారు కూడాను. కానీ వాళ్ళేమిటి? సీజర్ ఆ ప్రజానీకంలోని అందరి తల్లులనూ పొడిచి చంపినా అలాగే ప్రవర్తించేవాళ్లు వాళ్ళు.

**బ్రూటస్ :** అయితే అతడు తరువాత అలాగే చింతాక్రాంతుడై వచ్చేశాడా?

**కాస్కా :** అవును.

**కాషియస్ :** సిసెరో ఏమీ మాట్లాడలేదా?

**కాస్కా :** లేకేం, ఏదో మాట్లాడాడు, గ్రీకుభాష. అది నాకు[15]గ్రీకుగానే ఉంది.

**కాషియస్ :** దానివల్ల ఏం ప్రయోజనం?

**కాస్కా :** అది నాకర్థమైందని అబద్ధమాడను ముందు నీ ముఖం చూడకుండా ఉండిపోలేను. అయితే అతడు మాట్లాడిందేమిటో అర్థం చేసుకున్న వాళ్ళు ఒకరిముఖం

ఒకరు చూసుకొని నవ్వుకున్నారు  తలలు పంకించారు. అయితే అది నాకు మాత్రం గ్రీకుభాషగానే ఉండిపోయింది. ఇంతకంటే విశేషాలు మీకు నేనేం చెప్పగలను? సీజర్ విగ్రహాలమీద అలంకరణాలను ఒలిచి వేసినందుకు మరులియస్, ఫ్లేవియస్‌లకు ఉద్యోగాల్లో నుంచి ఉద్వాసన చెప్పారు. వెధవ జ్ఞాపకశక్తి, నాకు లేదు! ఉంటేనా అక్కడ జరిగిన నాటకాన్ని గురించి మీకు ఇంకా ఎంతో చెప్పేవాణ్ణి.

**కాషియస్ :** కాస్కా! ఇవాళ రాత్రికి నీ భోజనం మా ఇంట్లో.

**కాస్కా :** వీల్లేదు. ఇదివరకే మరొకరికి మాటిచ్చాను.

**కాషియస్ :** అయితే, మరి, రేపు నీవు నాతో కలిసి భోంచేస్తావా?

**కాస్కా :** తప్పకుండా – నేను బ్రతికి ఉంటే, నీ మనస్సు మారకపోతే, పైపెచ్చు నీ విచ్చేవిందు పుచ్చుకోదగ్గదైతే.

**కాషియస్ :** మంచిది. నీ కోసం రేపు ఎదురు చూస్తుంటాను.

**కాస్కా :** సరే. మీ ఇద్దరికీ శుభం!

**(నిష్క్రమిస్తాడు)**

**బ్రూటస్ :** వీడెంత బండగా తయారైనాడు! పాఠశాలకు వెళ్ళే దినాల్లో చాలా చురుకైనవాడు.

**కాషియస్ :** రూపంలో ఇప్పుడు బండగా కనిపించినా, సాహసంలో గానీ లేదా ఉదాత్త కార్యకరణంలోగానీ వీడు ఈనాడూ అంతటి చురుకైనవాడే. ఈ బండతనం వీడి హాస్యాన్ని జీర్ణం చేసుకోను అవసరమైన వ్యంజనంగా పని  చేస్తుంటుంది.

**బ్రూటస్ :** ఔను నిజమే. నీవు రేపు నాతో మాట్లాడదలచుకుంటే మీ ఇంటికి వస్తాను. లేదా నీకు ఇష్టమైతే మా ఇంటికి రా. నీకోసమే వేచి ఉంటాను.

**కాషియస్ :** తప్పక వస్తాను. అందాకా ప్రపంచాన్ని గురించి ఆలోచిస్తూ ఉండండి.

**(బ్రూటస్ నిష్క్రమిస్తాడు)**

బాగుంది. బ్రూటస్! నీవు అత్యున్నతుడవు. నీ ఉన్నతస్వభావ ధాతువును, అతిమెత్తని లోహంలా, ఇష్టం వచ్చినట్లు తీర్చిదిద్దుకోటానికి వీలున్నట్లు కనిపిస్తున్నది. ఎప్పుడూ ఉత్తములు ఉత్తములతో సాంగత్యం చేయటం మంచిది. ఎందువల్లనంటే : మలినం కానంతటి దార్ఢ్యం ఎవరికుంది?

సీజర్‌కు నేనంటే అసహ్యం. కానీ బ్రూటస్‌ను ప్రేమిస్తాడు. ఇటువంటి స్థితిలో నేనే బ్రూటస్‌నై బ్రూటస్ కాషియస్ ఐతే అతడు నన్ను ప్రభావితం చేయటానికి యత్నించనే కూడదు.

నేను ఈ రాత్రే అనేక సహస్ర పౌరుల దగ్గరనుంచీ వచ్చినట్లుగా భిన్నహస్తాక్షరాలతో బ్రూటస్ వాతాయనం గుండా అతని ఇంట్లోకి లేఖలు పడవేయిస్తాను. వాటిలో లీలగా సీజర్ దురాశ ద్యోతక మయ్యేటట్లూ, రోము మహానగరమంతా, బ్రూటస్‌మీదనే ఎంతటి గౌరవాన్ని నిలిపిందో తెలిపేటట్లూ లిఖిస్తాను. ఆ తరువాత సీజర్ భద్రంగా కూర్చోగలుగుతాడో! లేక అతణ్ణి పెకలిస్తున్నాం గనక దుర్దినాలను అనుభవిస్తాడో!!

**(నిష్క్రమిస్తాడు)**

## మూడో దృశ్యం

**ఒకవీథి. ఉరుములు, మెరుపులు. ఒరనుండి దూసిన కత్తితో కాస్కా, సిసెరో ఎదురుమళ్ళగా ప్రవేశిస్తారు.**

**సిసెరో :** సుసాయంతనం కాస్కా! సీజర్‌ను ఇంటికి తీసుకోవచ్చావా? అదేమిటి, అలా నిట్టూరుస్తున్నావు? ఎగాదిగా అలా చూస్తున్నావేమిటి?

**కాస్కా :** అస్థిరవస్తువులా భూమండలమంతా ఇలా కదలిపోతుంటే, నీవేం చలించటం లేదా? సిసెరో! తిట్టిపోస్తూ పెనుగాలులు మెలితిరిగిన ఓకు వృక్షాలను చీల్చే పెనుతుపానులను ఎన్నింటినో చూచాను. భయభ్రాంతిని కల్పించగల వారివాహాలతో తుల్యమైన ఔన్నత్యాన్ని పొందటం కోసం, సముద్రం ఉవ్వెత్తుగా ఉప్పొంగి క్రోధంతో నురగలు గ్రక్కుతూ ఉండడం చూచాను. అయితే, ఈ నాటి రాత్రి వరకూ, ఇంతవరకూ, అగ్నిపుంజాలను వర్షించే తుపానులను నే నెక్కడా చూడలేదు. స్వర్గంలో ఏదో అంతర్యుద్ధం వచ్చి ఉంటుంది. లేదా ప్రపంచం దేవతల యెడ అపచారం చేసి ప్రచండప్రళయాన్ని పంపించేటంతటి క్రోధాన్నైనా కల్పించి ఉంటుంది.

**సిసెరో :** ఎందువల్ల? ఆశ్చర్యకరాలైన విశేషాలేమైనా చూశావా?

**కాస్కా :** ఒక సామాన్యబానిస, చూస్తే నీవు అతణ్ణి వెంటనే గుర్తుపట్టగలవు కూడా. ఇరవై కాగడాలు జోడించినట్లు వెలుగుతున్న అతని వామహస్తాన్ని చూచాడు అతడికి అగ్నిభయం ఉన్నట్లు అణుమాత్రం కనుపించలేదు.

అంతేకాదు. అప్పుడు దూసిన నా కత్తిని మళ్లీ ఒరలో నిలుపలేదు. సభాభవనానికి ఎదర నేనో సింహాన్ని కలుసుకున్నాను. అది నన్ను తేరిపారచూచి, కళవళ పెట్టకుండానే హఠాత్తుగా అదృశ్యమైంది. ఆ దృశ్యాన్ని చూచిన నూరుమంది స్త్రీలు కుప్పకూలారు. వారు వీథుల్లో కణకణలాడే నిప్పుల మీద అటూ ఇటూ ముందువెనకలకు బహుపర్యాయాలు పచార్లు చేసిన పురుషులను చూచారట! ప్రమాణం చేసి చెప్పారు. దివాంధ మొకటి నిన్నటి మధ్యందినాన్నే విపణిలో వింతగా అరుస్తూ కూతలు పెట్టింది. ఇన్ని అపశకునాలు ఒక్కమాటుగా సంభవించాయి. అయినా సామాన్యులు 'ఇవి వాటి లక్షణాలు, వాటి స్వభావం' అని అంటారేమో! అనకూడదు. ఇవన్నీ వాటి లక్ష్యమైన ఒక స్థితికి భవిష్యత్సూచ కాలని నా నమ్మకం.

**సిసెరో :** నిజంగా అంతే. ఇది చాలా విచిత్రమైన కాలంగా ఉంది. అయితే కలిగిన ఈ విషయాలన్నింటిని ఈ దృష్ట్యా కాకుండా, జనం వారి వారి బుద్ధిబలాన్ని అనుసరించి భావిస్తుంటారు. సీజర్ రేపు సభాభవనానికి వస్తున్నాడా?

**కాస్కా :** తప్పక వస్తాడు. ఈ విషయం నీకు తెలియజేయవలసిందిగా ఆంటోనియోను ఆజ్ఞాపించాడు కూడాను.

**సిసెరో :** అయితే కాస్కా! శుభం. శాంతిరహితమైన ఈ వాతావరణం ఎంతమాత్రం తిరగదగ్గదిగా కన్పించటం లేదు.

**కాస్కా :** సిసెరో! శుభమగుకాక!

**(సిసెరో నిష్క్రమిస్తాడు కాషియస్ ప్రవేశిస్తాడు)**

**కాషియస్ :** ఎవరక్కడ?

**కాస్కా :** ఒక రోము నగర పౌరుడు.

**కాషియస్ :** గొంతుకనుబట్టి ఊహిస్తున్నా. అది కాస్కా ఏనా?

**కాస్కా :** నీవి మిక్కిలి చక్కని చెవులు. కాషియస్! ఇదేమి రాత్రోయ్.

**కాషియస్ :** సత్యప్రియులైనవారికి ఇది చాలా ఆనందదాయకమైన రాత్రి.

**కాస్కా :** స్వర్గం ఇంతగా కోపించగలదని పూర్వం ఎవరన్నా ఊహించారా?

**కాషియస్ :** ఈ భూమి దోషభూయిష్ఠమై పోయిందని గమనించినవాళ్ళు ఊహించారు.

నా మటుకు నేను, ఇలాగే, ఇప్పుడు నీవు చూస్తున్నట్లు, మైమరువు లేకుండా రొమ్మును పడే పిడుగులకు ఒప్పజెప్పి, ఈ భయంకరకాళరాత్రిలో వీథుల వెంట విశృంఖలంగా విహరించాను. ఒకానొక శంప తన శాఖాద్వయంతో నీలాతినీలమై అనుకంపా రహితంగా ఆకాశగర్భాన్ని చీలుస్తున్నప్పుడు నేను దాని లక్ష్యసీమలో నిలిచాను. దాని కాంతిలో నిలిచాను.

**కాస్కా :** తమ బలాధిక్యాన్ని చూపి మానవులమైన మనను ఆశ్చర్యమగ్నులను చేయటానికి దేవతలు తమ భయంకర ప్రతినిధులను పంపిస్తున్నారు. జనానీకం భయోద్వేగంతో వణికిపోతున్నదే, నీవు ఇంతగా ఎందుకా దేవతలను తిరస్కరించి తిరిగావు కాషియస్!

**కాషియస్ :** కాస్కా! నీవు వట్టి మందబుద్ధివి. రోమునగర నివాసిలో ఉండవలసిన జీవితాగ్ని కణాలు నీలో లేవో, ఉన్నా అవి ప్రజ్వరిల్లటం లేదో. ఉంటే దేవతల కోపోద్రేకాన్ని చూచి ఇలా పాలిపోయి ఎగాదిగా చూస్తూ భయభ్రాంతుడివీ, ఆశ్చర్యమగ్నుడివీ కావు. ఈ మహాగ్ని పాతాలెందుకో, ఈ భూతాకృతుల విహారాలెందుకో, వృద్ధులు ఉన్మత్తులుగానూ, బాలురు విజ్ఞానులు గానూ ప్రవర్తించట మెందుకో – ఇలా సర్వసత్త్వాలూ సహజగుణాలకు భిన్నంగా, ఉద్దిష్టాలకు విరుద్ధంగా రాక్షసప్రవృత్తిని ధరించట మెందుకో మూలకారణాన్ని అన్వేషించదలచకుంటే స్వర్గం భూలోకంలో ఒక తామసికసృష్టిని కల్పించదలచుకోని ఇట్టి శక్తులిచ్చి భయసూచనసాధనాలుగా ఉపయోగించటానికి ఉద్దేశించినట్లు అర్థమౌతుంది. అతడు కార్యాచరణదక్షతలో నీకంటే లేదా నాకంటే శక్తిమంతుడు కాకపోయినా, ఈ నాటి భయంకరకాళరాత్రిలా ఉరుముతూ, మెరుస్తూ, సమాధులు తెరుస్తూ, సభాభవనమందు గర్జిస్తూ కన్పించిన సింహం లాగానూ, ఈ మహోత్పాతాలలాగాను భయంకరుడై మహాభూతరూపంలో పెరిగిపోయి ఉన్న ఒక వ్యక్తి పేరు చెపుతాను.

**కాస్కా :** అది 'సీజర్' అనేనా నీ అభిప్రాయం? అంతేనా కాషియస్?

**కాషియస్ :** అది ఎవరైతేనేం! మన పూర్వులకున్నట్లే ఈ నాటి రోము వాసుల మైన మనకూ కండరాలు, అవయవాలున్నాయి. అయ్యో! ఎంత చెడుకాలం దాపురించింది. మనలో మన పితృపితామహుల[16] మనఃప్రవృత్తి మరణించింది. మాతృదేవతాశక్తులు మనలను పాలిస్తున్నవి. మనమెడమీది కాడి, బాధాసహనశీలం, మన స్త్రీత్వాన్నే వెల్లడిస్తున్నవి.

**కాస్కా :** సభాసభ్యులు రేపు సీజర్‌ను రాజును చేస్తారని వారంటున్నారు. ఇది నిజం. ఇటలీలో తప్ప అతడు సముద్రాలమీదా, భూమిమీదా కిరీటాన్ని ధరించి తిరుగుతాడట!

**కాషియస్ :** అయితే ఈ ఛురికను నిలపటానికి స్థానమేదో నాకు తెలుసు. కాషియస్ బానిసత్వంలోంచి కాషియస్‌ను ఉద్ధరించుకోగలడు. ఓ దేవతల్లారా!ఈ యత్నంలో దుర్బలులను బలశాలులనుగా తీర్చిదిద్దండి. క్రూరపాలకులకు అపజయాన్ని కల్పించండి. రాతిబురుజులు, కంచుగోడలు, గాలిచొరని చీకటికొట్లు, ఇనుపసంకెళ్లు, ఉత్సాహబలాన్ని బంధించలేవు. అయినా, జీవితం ప్రాపంచిక బంధనాలవల్ల అలసిపోయినా, తన్ను తాను విడిపించుకోలేనంతటి అబల కాదు. ఈ అంశాన్ని తెలుసుకుంటున్నాను. అవగతమైన తత్‌క్షణమే నేడు నేను భరిస్తున్న క్రూరపాలనను స్వేచ్ఛానుసారంగా తొలగద్రోసుకోగలనని ప్రపంచానికి ప్రకటిస్తాను.

**కాస్కా :** నేనూ అంతే. ఇదే రీతిగా ప్రతి బానిసకూ తన బానిసత్వాన్ని రద్దు చేసుకొనే శక్తి హస్తగతమై ఉంది.

**కాషియస్ :** అయితే సీజర్ ఎందుకు క్రూరపాలకుడుగా ఉంటున్నాడు? వెర్రివాడు! అతడు తోడేలు కాదని నాకు తెలుసు  కానీ రోము ప్రజలను అతడు గొర్రెలనుగా చూస్తున్నాడు. రోము ప్రజలు వేటకుక్కలు కాకపోతే అతడు సింహమెలా కాగలుగుతాడు? మహాగ్నిని జ్వలింపజేయ దలచుకున్నవారు ఎండుగడ్డి పోచలతో ఆ పనిని ఆరంభిస్తారు. సీజర్ వంటి క్రూరుడికి ఖ్యాతి కల్పించి ప్రకాశింప జేయదలచుకొని రోము ఎంత నికృష్టమైపోయింది! ఎంతటి నింద్యపదార్థ మైపోయింది!!

ఓ దుఃఖదేవతా! నీవు నన్నెక్కడికి నడిపిస్తున్నావో! నేను ఇదంతా ఇచ్ఛాపూర్వకంగా బానిసనైపోయినవాడి ముందు చెప్పాననుకుంటాను. అవసరమైతే తగ్గ సమాధానం చెప్పటానికి నేను సంసిద్ధుడనై ఉండాలి. అందుకే ఆయుధధారణం చేశాను. రాబొయ్యే ఆపదలతో నాకెట్టి ప్రమేయం లేదు.

**కాస్కా :** కాషియస్! మాటలు మోయటం అలవాటు కాని కాస్కాతోటే నీవు ప్రసంగించావు. మన దుఃఖాన్ని పటాపంచలు చేయటానికి ఒక పక్షాన్ని స్థాపించు. నేను సుదూరం నడిచే అగ్రగామిని, తుదిదాకా అనుసరిస్తాను. ఇదిగో ప్రతిజ్ఞ చేస్తున్నాను.

**కాషియస్ :** ఇందుకు నాకు అంగీకారమే. కాస్కా, ఒక రహస్యం చెపుతున్నాను. గమనించు. గౌరవప్రదమూ, భయోపేతమూ అయిన ఒకానొక సాహసకృత్యానికి నాకు తోడ్పాటు ఇవ్వవలసిందని ఇంతకు కొంతపూర్వమే కొందరు ఉదాత్తప్రకృతి

గల రోము నివాసులను కదిలించాను. వారు నా కోసం పాంపే ద్వారతోరణం దగ్గర వేచి ఉంటారు. ఈ భయంకర రాత్రి వీథుల్లో సంచలనం గాని, సంచారముగాని లేదు. మేము తలపెట్టిన పనిలా రక్తోపేతమై భయానకంగా ఉంది భౌతికస్థితి.

**కాస్కా :** ఎవరో అతివేగంగా ఒక వ్యక్తి ఇటు వస్తున్నాడు. దగ్గిరగా నిలు.

**కాషియస్ :** నడకనుబట్టే తెలుస్తున్నది. అది సిన్నా, మన మిత్రుడు.

**(సిన్నా ప్రవేశిస్తాడు)**

సిన్నా! ఎక్కడికి అంత వేగంగా వెళ్ళుతున్నావు?

**సిన్నా :** మీరెక్కడ ఉన్నారో తెలుసుకుందామనే. ఎవరిది? మెటిల్లస్ సింబర్?

**కాషియస్ :** కాదు, కాస్కా. మన యత్నాలలో ఒక సహచరుడు. సిన్నా! వాళ్ళందరూ నాకోసం వేచి ఉంటారనుకుంటాను.

**సిన్నా :** ఈ నాడు నాకెంతో సంతోషంగా ఉంది. అబ్బా! ఎంత భయంకరమైన రాత్రి! మాలో ఇద్దరు ముగ్గురం అతివిచిత్రమైన దృశ్యాలు చూచాం.

**కాషియస్ :** చెప్పు. వాళ్ళు నా కోసం వేచి ఉండలేదూ?

**సిన్నా :** అవును. నీవు మహోదాత్తుడైన బ్రూటస్‌ను మన పక్షానికి చేర్చటంలో విజయాన్ని పొందితే.

**కాషియస్ :** తృప్తివహించు. సిన్నా! ఇవిగో ఈ పత్రాలందుకో. చూడు. బ్రూటస్‌కు తప్ప ఇతరులెవ్వరికీ కనిపించని రీతిగా దీన్ని ఆ న్యాయాధికారి ఆసనం మీద ఉంచు. దీన్ని అతని వాతాయనం ద్వారా లోపల పడవెయ్యి. దీన్ని వృద్ధ బ్రూటస్ ప్రతిమీద మైనంతో అంటించిరా. ఈ పని ముగించుకొని పాంపే ద్వారతోరణం దగ్గరికి తిరిగిరా. అక్కడ మేమందరం ఉంటాము. డెసియస్ బ్రూటస్, ట్రెబోనియస్ అక్కడ ఉన్నారా?

**సిన్నా :** మెటిల్లస్ సింబర్ తప్ప అందరూ ఉన్నారు. అతడు నీ కోసం మీ ఇంటికి వెళ్ళాడు. సరే. నేను పరుగుల మీద ఈ పత్రాలను నీవు ఆజ్ఞాపించినట్లు చేస్తాను.

**కాషియస్ :** పాంపే నాట్యశాలకు రావటం మరిచిపొయ్యేవు.

**(సిన్నా నిష్క్రమిస్తాడు)**

కాస్కా! నాతో రా. నీవూ, నేనూ బ్రూటస్‌ను అతడి ఇంటిదగ్గిర కలుసుకుందాం. అతడు ఇప్పటికే మూడుపాళ్ళు మనవాడు. మళ్ళీ మనం కలుసుకుంటే పూర్తిగా మనవాడౌతాడు.

**కాస్కా :** అతడు సమస్త ప్రజాహృదయాలల్లో మహోన్నతపీఠాన్ని అధిష్ఠించిన వ్యక్తి. అతడి తోడ్పాటు ఘనమైన రసాయనమై మన దోషాలుగా కనిపించేవాటిని అన్నింటినీ గుణాలుగా, సుగుణాలుగా పరివర్తన చేస్తుంది.

**కాషియస్ :** బలే. అతణ్ణీ, అతడి శక్తినీ, మనకు అతడి ఆవశ్యకతనూ చాలా జాగ్రత్తగా గమనించావు! అర్ధరాత్రి గడిచింది. ఇక మనం వెడదాం. తెల్లవారక ముందే అతణ్ణి మేల్కొల్పి గట్టి చేసుకుందాం.

**(ఇరువురూ నిష్క్రమిస్తారు)**

# ద్వితీయాంకం

## ఒకటో దృశ్యం

**బ్రూటస్ ఫలోద్యానవనం, బ్రూటస్ ప్రవేశిస్తాడు.**

**బ్రూటస్ :** ఏమిటి! లూషియస్! మేల్కో. నక్షత్ర గమనాన్ని బట్టి ఉదయానికి ఇంకా ఎంత ప్రొద్దు ఉందో లెక్కించలేకుండా ఉన్నాను. లూషియస్! నిజం చెప్పనా? ఇంత గాఢంగా నిద్రపోవటంతో నేనెంతో దోషం చేసినట్లు భావిస్తున్నాను. ఎప్పుడు లూషియస్, ఎప్పుడు? మేల్కో సంగతేమిటి లూషియస్!

**లూషియస్ :** పిలిచారా ప్రభూ!

**బ్రూటస్ :** నా విద్యాకక్ష్యలో దీపం వెలిగించు. తరువాత ఇక్కడికి వచ్చి నన్ను పిలుచుకో వెళ్ళు.

**లూషియస్ :** చిత్తం

**(నిష్క్రమిస్తాడు)**

**బ్రూటస్ :** అది అతని మృతివల్ల జరగవలసిందే. అందరి కోసం తప్ప అతనిమీద నాకు వ్యక్తిగతంగా అణుమాత్రమైనా క్రోధం లేదు. అతణ్ణి కిరీటాలంకృతుని చేస్తారు అని ఊహిద్దాం. అందువల్ల అతని స్వభావం ఎలా మారుతుంది అన్నది ప్రశ్న. మంచి ఎండ[17] కాసే రోజు సర్పం విషాన్ని వెలిజిమ్ముతుంది.

ఉచ్చదశ వ్యక్తి సత్యస్వరూపాన్ని వెల్లడిస్తుంది. అందువల్ల అతి జాగరూకతతో పయనించవలసిందే. కిరీటాలంకృతుని చేస్తారు చేస్తే? అతడికొక కొండి ఇచ్చినట్లౌతుంది. దాంతో అతడు కోరుకున్నప్పుడు ప్రమాదాన్ని కల్పిస్తాడు. అధికారం నుంచి దయను విడదీసినప్పుడే అది దుష్ప్రయోగ మహత్త్వమౌతుంది.

సీజర్‌ను గురించి సత్యం చెప్పాలంటే అతడి తార్కికప్రతిభమీద అనురాగం, అధికారం నెరపినట్లు నేనెన్నడూ గమనించిన జ్ఞాపకం లేదు. అణకువ యౌవనప్రాయంలో ఉన్న ఆశకు నిశ్రేణిక. దాన్ని ఎక్కేవాడు ఎప్పుడూ పైకే చూస్తుంటాడు. అతడు తుదిమెట్టు

చేరుకున్న తరువాత నిచ్చెన వైపు వీపు నిలిపి, ఎక్కి వచ్చిన మెట్లన్నిటినీ చూచి అసహ్యించుకుంటూ మేఘాలలోకి తిలకిస్తుంటాడు. సీజర్ కూడా ఇలాగే ప్రవర్తించవచ్చు. అందువల్ల అతని పురోగమనాన్ని ఆపివేద్దాం. అయితే అతడి ప్రవర్తన నేడు మన శత్రుత్వానికి అనుగుణంగా ప్రదర్శితం కావటం లేదు. అందువల్ల అతణ్ణి స్వేచ్ఛగా వ్యవహరించనిస్తే పై ప్రమాదాలు తప్పవని నిరూపిద్దాం. అతడొక సర్పాండం. పొదగబడ్డ తరువాత అది తన స్వభావానికి తగ్గట్టే సహజదుష్టత్వంతో పెరిగిపోతుంది. కాబట్టి దాన్ని అండంలోనే అవియించటం క్షేమం.

**(లూషియస్ తిరిగి ప్రవేశిస్తాడు)**

**లూషియస్ :** ప్రభూ! మీ విద్యాకక్ష్యలో దీపాన్ని వెలిగించి వచ్చాను. శిలాశకలం కోసం మీ వాతాయనంలో వెతుకుతుండగా అంటించి ఉన్న ఈ పత్రం కనిపించింది. మొదట నేను నిద్రించటానికి శయ్యమీదికి వెళ్ళినప్పుడు అది అక్కడ లేదు గట్టిగా చెప్పగలను.

**(లేఖను అందిస్తాడు)**

**బ్రూటస్ :** ఇంకా తెల్లవారలేదు. నీవు వెళ్ళి నిద్రపో... లూషియస్! మార్చి పదిహేను రేపే కదూ?

**లూషియస్ :** అది నాకు తెలియదు ప్రభూ!

**బ్రూటస్ :** పట్టికలు చూచి వచ్చి నాకు ఏ సంగతీ చెప్పు.

**లూషియస్ :** చిత్తం ప్రభూ!

**(నిష్క్రమిస్తాడు)**

**బ్రూటస్ :** ఈ తోకచుక్కలు లేఖను చదవటానికి తగ్గ వెలుగునిస్తున్నవి.

**(లేఖను విప్పి చదువుతాడు)**

"బ్రూటస్! మీరు నిద్రిస్తున్నారు. మేల్కొండి. స్వయంగా దర్శించండి. ప్రవచించండి. ఛేదించండి. ఉద్ధరించండి!"

"బ్రూటస్. మీరు నిద్రిస్తున్నారు. మేల్కొండి" ఇలా వ్రాసి పడవేసిన ఉద్బోధనలను ఎన్నింటినో ఎత్తుకొన్నాను. "రోము ఇత్యాది'' బహుశః దీని అర్థాన్ని ఇలా వ్యాఖ్యానించుకోవాలనుకుంటాను. ఒక రోము వ్యక్తి భయంతో ఉండిపోవలసిందేనా?

ఏమిటి? రోము! కేవలం రాజునని చెప్పుకున్నంత మాత్రానికి మా పితరులు టార్విన్నును ఈ రోము నగరవీథుల గుండా తరిమివేశారు. "ప్రవచించండి, ఛేదించండి, ఉద్ధరించండి" నన్ను ప్రవచించమనీ, ఛేదించమనీ, ఉద్ధరించమనీ అర్థిస్తున్నారు. ఓ రోము! ఇదిగో ప్రతిజ్ఞ గైకొంటున్నాను. నిన్ను ఉద్ధరించటానికోసం బ్రూటస్ తన సర్వస్వాన్నీ అర్పించటానికి సంసిద్ధుడైనాడు.

**(లూషియస్ తిరిగి ప్రవేశిస్తాడు)**

**లూషియస్ :** ప్రభూ! మార్చిలో పద్నాలుగు రోజులు గడిచిపోయాయి.

**బ్రూటస్ :** మంచిది. (లోపల చప్పుడు) ద్వారం దగ్గరికి వెళ్ళు. ఎవరో తలుపు తడుతున్నారు.

**(లూషియస్ నిష్క్రమిస్తాడు)**

కాషియస్! తొలుతగా నీవు నన్ను జాగృతం చేసింది మొదలు నిద్రన్నది ఎరగను. ఒక మహాభయంకర కార్యకరణానికి, ప్రథమారంభానికీ మధ్యకాలం ఒక పెనుభూతంగానో, ఒక భయానక స్వప్నం లాగానో ఉంటుంది. మేధ మానవసాధనాలతో సభ తీరుస్తుంది. మానవరాష్ట్రం, ఒక చిన్న రాజ్యంలా, విప్లవాల పాలౌతుంది.

**(లూషియస్ తిరిగి ప్రవేశిస్తాడు)**

**లూషియస్ :** ప్రభూ! ద్వారందగ్గిర ఉన్నది మీ బావమరది[18] కాషియస్. మిమ్మల్ని చూడగోరుతున్నాడు.

**బ్రూటస్ :** అతడు ఒంటరిగానే ఉన్నాడా?

**లూషియస్ :** లేదు ప్రభూ! వారివెంట ఇంకా కొందరున్నారు.

**బ్రూటస్ :** వారెవరో నీకు తెలుసునా?

**లూషియస్ :** లేదు ప్రభూ! టోపీలతో వారు చెవులదాకా కప్పేసుకున్నారు. వారి ముఖాలు సగంవరకూ దుస్తుల్లో మడిగి ఉన్నాయి. అందువల్ల వారిని గుర్తించడానికి నాకు ఏ చిహ్నం చిక్కలేదు.

**బ్రూటస్ :** వారిని ప్రవేశపెట్టు.

**(లూషియస్ నిష్క్రమిస్తాడు)**

వారే విద్రోహవర్గం. ఓ విద్రోహ దేవతా! దుష్టభూతాలు స్వైరవిహారం చేస్తున్న సమయంలో, ఈ రాత్రివేళ ఆపత్తుతో కూడిన నీ కనుబొమలను చూపించటానికి సిగ్గుపడుతున్నావా? అయ్యో! అయితే, నీ రాకాసిరూపాన్ని కప్పి పుచ్చుకోవటానికి పగటివేళ కారుచీకట్లు నిండిన గుహాగహ్వరం నీ కెక్కడ లభిస్తుంది?

విద్రోహమా! అన్యసహాయాన్ని అపేక్షించకు. నీ చిరునవ్వులో, నీ కృతజ్ఞతా ప్రకటనలో సర్వం కప్పిపుచ్చు. సహజరూపంతో నీవు పయనిస్తే ఎరుబస్ నరకంలోని అంధకారానికి కూడా నిన్ను కప్పిపుచ్చే శక్తి లేదు.

**కాషియస్, కాస్కా, డెషియస్, సిన్నా, మెటిల్లస్ సింబర్, ట్రైబోనియస్ ప్రవేశిస్తారు.**

**కాషియస్ :** సుప్రభాతం, బ్రూటస్! మీ ప్రశాంతికి భంగం కల్పించటానికి చాలా సాహసించామనుకుంటాను. ఏమైనా శ్రమ కలిగిస్తున్నామా?

**బ్రూటస్ :** నేను ఇంతవరకూ రాత్రంతా మేల్కొనే ఉన్నాను. నీ వెంటవచ్చిన వీరందరూ ఎవరో నేను తెలుసుకోవచ్చునా?

**కాషియస్ :** తప్పకుండా. ఇందులో ప్రతి ఒక్కరినీ మీరు తెలుసుకోవచ్చు. మీ మీద గౌరవం లేనివాడు వీళ్ళలో ఒక్కడూ లేడు. ఉదాత్తుడైన ప్రతి రోము పౌరుడూ మీ మీద ఎటువంటి అభిప్రాయాన్ని కలిగి ఉన్నాడో, మీరు కూడా మీ మీద అటువంటి అభిప్రాయాన్ని కలిగి ఉండాలెనని వీరిలో ప్రతిఒక్కరూ వాంఛిస్తున్నారు. – ఇతడు ట్రెబోనియస్.

**బ్రూటస్ :** ఇదే నా స్వాగతం.

**కాషియస్ :** ఇతడు డెషియస్ బ్రూటస్.

**బ్రూటస్ :** ఇతనికీ నా స్వాగతం.

**కాషియస్ :** ఇతడు కాస్కా, ఇతడు సిన్నా, ఇతడు మెటిల్లస్ సింబర్.

**బ్రూటస్ :** వీరందరికీ నా స్వాగతం. కళవళ పెట్టే ఏ భావాలు మీ నిద్రకు అంతరాయాన్ని కలిగిస్తున్నాయో అడగవచ్చునా?

**కాషియస్ :** నీతో ఒక్క మాట చెప్పాలి.

**(బ్రూటస్, కాషియస్ గుసగుసలాడుతారు)**

**డెషియస్:** ఇదే తూర్పు. ఇక్కడే సూర్యోదయమౌతుంది.

**కాస్కా :** కాదు.

**సిన్నా :** క్షమించండి. ఇక్కడే ఉదయమౌతుంది. అవిగో, దూరంగా మేఘపుంజాలమీద కోపం క్రక్కుతూ, అవిగో అరుణరేఖలు దివాదేవి వార్తావహులు.

**కాస్కా :** మీరు ఇరువురూ మోసపోయారు  ఈ విషయం అంగీకరిస్తారు కూడాను. నేను నా కత్తిని చూపించేవంక, వత్సరయౌవ్వనకాలాన్ని బట్టి పరిశీలించండి. ఇంకా సుదూరాన, దక్షిణాన సూర్యుడు ఉదయిస్తాడు. ఇంకా రెండు నెలలకు ఎంతో ఎత్తున ఉత్తరాన అతడు తన కాంతిపుంజాలతో ప్రకాశిస్తాడు. నిజమైన తూర్పుదిక్కు ఇక్కడికి సభాభవనంలా సూటిగా ఉంది.

**బ్రూటస్ :** ఒకరి తరువాత ఒకరు నాతో కరచాలనం చెయ్యండి.

**కాషియస్ :** మన నిర్ణయాన్ని గురించి శపథం చేద్దాం.

**బ్రూటస్ :**  ఎందుకు. శపథంతో పని లేదు. మన ముఖాలల్లో వ్యథ వ్యక్తం కాకపోతే, ఆత్మల్లో అశాంతి ప్రబలకపోతే, కాలంలో దౌష్ట్యం కలతపెట్టకపోతే, – ఈ రీతి కారణాలన్నీ బలహీనాలైతే – ఇంకా మనం ముందుకు పయనించక ముందే మాంద్యం వహించి మన శయ్యాగారాలను చేరుకుందాం. ఒక్కొక్కరివంతు వచ్చి పూర్తిగా మనం రాలిపోయే దాకా దీర్ఘదృష్టి గల క్రూరపాలనను కొనసాగనిద్దాం. ఈ మూలకారణాలే శక్తిమంతాలైతే, కాకేం – శక్తిమంతాలే, పిరికిపందలను మహావీరులనుగా రగులుస్తాయి. కరిగిపోయే స్త్రీల హృదయ భావాలకు పౌరుషకవచా లౌతాయి. దేశీయులారా! మనను మనం ఉద్ధరించుకోటానికి ప్రేరేపించిన మన కారణాలు తప్ప వేరే శపథాలతో గాని, మరో వాటితో గాని మనకు పనేముంది? రహస్య గోపనంలో ఖ్యాతిగన్న రోము ప్రజల మాట, కల్లబొల్లి కానిమాట, చాలదూ? 'సత్యసంధులు సత్యసంధులతో ఇది చేసి తీరాలి  చచ్చి తీరాలి' అని చెప్పిన మాట చాలదూ? మరో బంధమెందుకు? ఛాందసులు, పిరికిపందలు, మోసకారులు, నిరుపయోగులు, ఇలాగే ఇంకా చెడుగులను ఆహ్వానించే వ్యథితహృదయులూ శపథం చేస్తుంటారు. మానవులను అనుమానించే వ్యక్తులు దుష్ట చర్యలకు పూనుకున్నప్పుడు శపథం చేస్తుంటారు. మన కారణాలు గాని,  ఆభరణ విధానాలు గాని శపథాన్ని ఆశిస్తవని భావించి మన సాహసకృత్య సద్గుణాన్ని గాని, అణచరాని మన అనంత ధైర్యాన్ని గాని కళంకితం చెయ్యవద్దు. రోము పౌరుని నోట వెలువడిన శపథంలో ఏ అణుమాత్రం తప్పినా అతడు

మహోదాత్తంగా శరీరంలో వహించే రక్తంలోని ప్రతిబిందువు లోనూ ఏదో నైచ్యం ఉన్నదన్నమాట!

**కాషియస్ :** అయితే సిసెరో సంగతేమిటి? వాణ్ణి కూడా మనం కదిలించి చూద్దామా? అతడు మనతో అతిగాఢంగా తుదిదాకా నిలుస్తాడనే నా నమ్మకం.

**కాస్కా :** వాణ్ణి మనం వదిలిపెట్టకూడదు.

**సిన్నా :** నిజమే. తప్పక వదిలిపెట్టకూడదు!

**మెటిల్లస్ :** అతడు మనలో తప్పకుండా ఉండితీరాలి. వాడి నెరిసిన జుట్టువల్ల మనకు ప్రజాభిప్రాయం ఎంతో అనుకూలమౌతుంది. మనం చేసే కృత్యాలను కీర్తించే గొంతుకలు దొరుకుతాయి. బుద్ధిబలం వల్ల అతడు ఆలోచించి నిర్ణయించిన దాన్నే మనమంతా ఆచరిస్తున్నామని జనం అనుకుంటారు. మన యౌవనోద్రేకాలు అతని గాంభీర్యమనే కప్పుక్రింద ఒదిగి ఉంటాయి.

**బ్రూటస్ :** అతడి పేరు చెప్పకండి. మన మహాకార్యాన్ని అతనికి తెలియ జేయకూడదు. అతడు ఎన్నడూ ఇతరులు ఆరంభించినదాన్ని అంగీకరించి అనుసరించే స్వభావం కలవాడు కాడు.

**కాషియస్ :** అయితే మనం అతణ్ణి వదిలి వేయవలసిందే.

**కాస్కా :** అవును. నిజం. వాడు ఇందుకు తగినవాడు కూడా కాడు.

**డెషియస్ :** సీజర్‌ను తప్ప మనం మరి ఇతరులను ఎవరినీ ముట్టుకోకూడదు.

**కాషియస్ :** సందర్భోచితంగా జ్ఞప్తికి తెచ్చావు. సీజర్ మరణానంతరం అతడికి అతి ప్రియుడైన మార్క్ ఆంటోనీ సజీవుడై ఉండరాదు. ఉంటే అతడు మహామేధావి. మంచి అవకాశాలు కలవాడు. అతడు సమీకరిస్తే మన కెన్నైనా గట్టి చిక్కులు తెచ్చిపెట్టగలడు. అటువంటి పరిస్థితి రాకుండా చేసుకోవటానికి మనం సీజర్ ఆంటోనీలను ఇరువురినీ ఏకకాలంలో తొలగించాలి.

**బ్రూటస్ :** కైయస్ కాషియస్! ఇలా అయితే మన మార్గం మరింత రక్తోపేతంగా కనిపిస్తుంది. సీజర్‌కు ఆంటోనీ కేవలం ఒక అవయవం. చంపటంతో కోపం చల్లారుతుంటే ఇంకా ఈర్ష్యతో మోదటమెందుకు! శిరస్సును ఖండించిన తరువాత అవయవాలను చిత్రవధ చేయటమెందుకు?

కైయస్! యజ్ఞకర్తల మౌదామగాని మనం కసాయివాళ్ళం కావద్దు. మనమందరమూ సీజర్ తత్త్వానికి వ్యతిరేకులం కాని అతడికి వ్యతిరేకులం కాదు. మానవుల తత్త్వాలకు రక్తమంటూ లేదు. సీజర్ తత్త్వాన్ని తొలగించటానికి మరోమార్గమంటూ ఉంటే అతణ్ణి చంపవలసిన అగత్యమే మనకుండేది కాదు. కానీ, అందువల్ల, అయ్యో! సీజర్ రక్తాన్ని ఒలికించవలసి వస్తున్నది.

ప్రియమిత్రులారా! మనం సీజర్‌ను ధైర్యంతో అంతమొందించాలి. అంతేగాని కోపోద్రేకంతో చంపరాదు. అతణ్ణి దేవతలు స్వీకరించటానికి యోగ్యమైన హవిస్సుగా తుదముట్టిద్దాం. వేటకుక్కలకు ఆహారంగా పరిణమించే కబంధాన్ని చేయకూడదు. మన హృదయాలు జిత్తులమారి యజమాని సేవకులచేత కోపోద్రిక్తకృత్యాలను చేయించి తరువాత శిక్షించేటట్లుగా ప్రవర్తించాలి. ఇలా వర్తిస్తే మనం అవసరం వల్ల ఇట్టి చర్య తీసుకున్నామే గాని ఈర్ష్యవల్ల కాదని వెల్లడౌతుంది. జనసామాన్య నేత్రాల కిలా కన్పించడం వల్ల మనం పవిత్రకార్యకర్తల మౌతామే కాని హంతకులం కాము. మార్క్ ఆంటోనీని గురించి మనం ఆలోచించవలసిన పనిలేదు. సీజర్ శిరస్సును ఛేదించినపుడు అతని హస్తం ఏమీ చేయలేక ఎలా పడిపోతుందో అతడూ అలాగే అయిపోతాడు.

**కాషియస్ :** అయినా, నాకు అతడంటే భయం. అతడు తన హృదయాంతరాన్ని తొలిచి అందులో సీజర్ మీది ప్రేమను నిబద్ధం చేశాడు.

**బ్రూటస్ :** ప్రియమైన కాషియస్! అతణ్ణిగురించి ఇక ఆలోచించకు. సీజర్‌మీద అతడికి అంత గాఢానురాగం ఉన్నా అతడు చేయగలిగిందేమిటి? పదే పదే సీజర్‌ను గురించి ఆలోచించుకొని అతడికోసం మరణించటమే. క్రీడలన్నా, తిరుగుబోతుతనమన్నా, గోష్ఠులన్నా ఎప్పుడూ అతడికి ఆసక్తి అధికం. అంత పని చేయనే చేయడు.

**ట్రెబోనియస్ :** అతడివల్ల ఏ ప్రమాదమూ ఉండదు. అతడి మృతి మనకనవసరం. బ్రతికి అతడు తరువాత దీనికి పరిహాసమాడుతాడు.

**(ఘంటిక మ్రోగుతుంది)**

**బ్రూటస్ :** నిశ్శబ్దం! ఎన్ని కొట్టిందో లెక్కించండి.

**కాషియస్ :** మూడు కొట్టింది.

**ట్రెబోనియస్ :** ఇక మనం విడివడిపోవటానికి సమయమైంది.

**కాషియస్ :** కానీ సీజర్ ఇవాళ వస్తాడా అన్నదే ఇంకా అనుమానంగా ఉంది. ఒకప్పుడు అతడికున్న భావాలకు భిన్నంగా ఇప్పుడతనికి భూతాలన్నా, కలలన్నా, శకునాలన్నా చాదస్తం పట్టుకొని బలిసిపోయింది. ఇంత స్పష్టంగా గోచరించే ఈ శకునాలు, అసాధారణమైన ఈ నిశీథిని కల్పించిన భయం, శకునజ్ఞుల నిర్బంధం – ఇవన్నీ ఏకమై అతణ్ణి సభాభవనానికి రానీయకుండా నిలిపివేయవచ్చు.

**డెషియస్ :** అందుకు మీరేం భయపడవద్దు. ఒకవేళ అతడు రానని తీర్మానించుకున్నా నేను అతణ్ణి త్రిప్పేయగలను. శృంగాశ్వాలను[19] చెట్లతో, భల్లూకాలను అద్దాలతో, ఏనుగులను గర్తాలతో, సింహాలను వాగురులతో, మానవులను స్తుతి పాఠకులతో మోసగించవచ్చునని చెపితే అతడు ఎంతో సంతోషంగా వింటుంటాడు. అతణ్ణి మిక్కిలిగా స్తుతించి మీకు స్తుతి పాఠకులంటే చాలా అసహ్యం అన్నప్పుడు అతడు అవునని అంగీకరిస్తాడు. అతణ్ణి సభాభవనానికి రప్పించే పని నాకు ఒప్పచెప్పండి. చిత్త ప్రవృత్తికి తగ్గ దోహదం చేసి అతణ్ణి నేను సభాభవనానికి తీసుకోవస్తాను.

**కాస్కా :** అంతెందుకు? అతణ్ణి తీసుకురావటానికి మనమందరం వెడదాం.

**బ్రూటస్ :** ఎనిమిది గంటలకు. అంతకు మించకూడదు కదూ?

**సిన్నా :** మించకూడదు  తప్పకూడదు కూడాను.

**మెటిల్లస్ :** పాంపేను గురించి మంచిగా మాట్లాడాడని సీజర్ అతణ్ణి కోపించాడట! కెయస్ లిగారియస్‌కు[20] అతడి మీద గుర్రుగా ఉంది. మీలో ఎవరూ అతణ్ణి గురించి ఆలోచించకపోవటం నాకు వింతగా ఉంది.

**బ్రూటస్ :** ప్రియమిత్రుడా, మెటిల్లస్! నీవు అతడి ఇంటి మీదుగా వెళ్ళు. అతడికి నేనంటే ఎంతో అనురాగం. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. అతణ్ణి నా దగ్గరకే పంపించు. నేను తగ్గట్టుగా అతణ్ణి తీర్చి దిద్దుతా.

**కాషియస్ :** ఇక మనకు తెల్లవారింది. బ్రూటస్! మేము సెలవు తీసుకుంటాము. ప్రియమిత్రులారా! మీరు వెళ్ళండి. నిజమైన రోమను పౌరుల్లాగా వ్యవహరించండి.

**బ్రూటస్ :** మిత్రులారా! మీరందరూ ఉత్సాహంతో, మహానందానుభూతిని పొందుతున్నట్లుగా కన్పించాలి. మీ చూపులవల్ల మన ఉద్యమం ఎక్కడా బయట పడిపోరాదు సుమా! మీరు అలసటలేని ఉత్సాహంతో, నిత్యాభ్యస్తమైన నైపుణ్యంతో రోమునటకుల్లా ప్రవర్తించాలి. మీలో ప్రతి ఒక్కరికీ రేపు సుప్రభాతం.

**(బ్రూటస్ తప్ప మిగిలినవారందరూ నిష్క్రమిస్తారు)**

ఒరేయ్, లూషియస్! మంచినిద్రలో ఉన్నావా? పోనీలే. నిద్రాదేవి నీకిచ్చే మరందమాధుర్యాన్ని అనుభవించు. నిరంతరం ఆందోళన పెట్టే జాగరూకతలు మానవుల బుద్ధికుడ్యాలమీద గీసే చిత్రాలవంటి భూతాకృతులు నీకు లేవు. అందుకనే నీవు గాఢనిద్రలో ఉన్నావు.

**పోర్షియా ప్రవేశిస్తుంది.**

**పోర్షియా :** ప్రభూ! బ్రూటస్!!

**బ్రూటస్ :** పోర్షియా! ఎందుకింత పెందలకడ మేల్కొన్నావు? బలహీనంగా ఉన్న నీవు ఇటువంటి ఉదయకాల శీతలపవనాలలో తిరగటం ఆరోగ్యానికి ఎంతమాత్రం తగదు.

**పోర్షియా :** ఇది మీకు తగిందేనా మరి? ఔదార్యరహితంగా నాశయ్యనుంచి జారుకొచ్చేశారు. రాత్రి, భోజనసమయంలో హఠాత్తుగా లేచి, చేతులు కట్టుకొని, ఏమేమో ఆలోచిస్తూ, నిట్టూరుస్తూ, పచార్లు చేశారు. విషయమేమిటని అడిగితే నా వంక అనుదాత్తనేత్రాలతో తిలకించారు. నేను పట్టుపట్టి అడిగాను. మీరు శిరఃకంపం చేశారు ఎంతో అశాంతితో అరికాలు నేలకు తాటించారు. ఇంకా నేను పట్టి పట్టి అడిగాను. అయినా మీరు నాకేమీ సమాధానం చెప్పలేదు. అతికోపంతో మిమ్మల్ని వదలిపెట్టి వెళ్ళవలసిందని సంజ్ఞగా హస్తచాలనం చేశారు. సుస్పష్టంగా అభివ్యక్తమయ్యే మీ అశాంతి ఇంకా పుష్టిని చేకూర్చుకుంటున్నదన్న భయంతోనూ, ప్రతివ్యక్తికీ ఎప్పుడో ఒకప్పుడు ధాతుసంచలనవిపర్యాసం వల్ల కలిగే స్థితిగతి తప్ప మరేమీ కాదని ఊహించుకోవటం వల్లనూ, మీరు కోరినట్లు మిమ్మల్ని ఏకాంతంగా వదలిపెట్టి వెళ్ళాను.

కానీ ఆ స్థితి మిమ్మల్ని భోజనం చెయ్యనివ్వటం లేదు, మాట్లాడనివ్వటం లేదు. అది మీ మనస్సుమీద ఎంతగా పనిచేస్తున్నదో అంతగా బాహ్యరూపంమీద కూడా పనిచేస్తే, నేను మిమ్మల్ని గుర్తుపట్టగలిగేదాన్నే కాదు. ప్రియప్రభూ! మీ దుఃఖకారణ మేమిటో నాకు తెలియజేయండి.

**బ్రూటస్ :** నా ఆరోగ్యమంత బాగాలేదు అంతే.

**పోర్షియా :** బ్రూటస్ బుద్ధికుశలుడు ఆరోగ్యం బాగుండకపోతే తగ్గ చర్యలు చేసి దాన్ని జయిస్తాడు.

**బ్రూటస్ :** జయించటం లేదని నీకు అనుమాన మెందుకు కలిగింది? అలాగే చేస్తున్నాను. – ప్రియా, పోర్షియా! నీవు వెళ్ళి శయనించు.

**పోర్షియా :** సుస్తీగా ఉన్నదంటున్నారు. నిజమైతే గుండీలు లేకుండా[21] ఇలా ఉదయకాలపు చలిగాలిని పీలుస్తారా మరి? మీకే సుస్తీగా ఉంటే సౌఖ్యదాయకమైన శయ్యనుంచి జారుకొని రాత్రివేళ సాహసించి, ఎదుర్కోటానికి తడిగా ఉన్న విషవాయువులను ఆహ్వానించి జాడ్యాన్ని వృద్ధి చేసుకుంటారా?

లేదు. ప్రియా! బ్రూటస్! మిమ్మల్నేదో మానసికవ్యథ వేధిస్తున్నది. నాకున్న సత్వాన్ని బట్టీ, నా స్థానాన్ని బట్టీ అదేమిటో నేను తెలిసికోక తప్పదు. ఇదిగో, మీ ముందు మోకరిల్లుతున్నాను. ఒకనాడు మీరు స్తుతించిన నా సౌందర్యం మీద, సమస్త ప్రణయ ప్రతిజ్ఞల మీద, మన ఇరువురినీ ఏకం చేసిన ఆ మహాప్రతిజ్ఞ మీద ఒట్టుపెట్టి మిమ్మల్ని వేడుకొంటున్నాను. మీ హృదయభారమేమిటో, ఎవరో ఆరేడుగురు చీకటికి కూడా ఎరుకపడకుండా ముఖాలు కప్పుకొని వచ్చారు, ఈ రాత్రి మీతో గోష్ఠి చేసిన ఆ వారెవరో, మీ అర్ధాంగినైన, నాకు తెలియజెప్పండి.

**బ్రూటస్ :** ప్రియా, పోర్షియా! మోకరిల్లకు.

**పోర్షియా :** మీరు ఉదాత్తులైన బ్రూటస్ అయినంతవరకూ నాకు మోకరిల్లవలసిన పని లేదు. మీకు సంబంధించిన రహస్యాలేమో నేను వినకూడదని మన వివాహ బంధంలో ఎక్కడైనా ఉందా? మీతో భుజించటానికి, శయనించటానికి, లేదా కొన్ని సందర్భాలలో ప్రసంగించటానికి మాత్రమేనా నేను మీ అర్ధాంగిని? మీ హృదయ బాహ్యభూమిలో మాత్రమే నేను వర్తిస్తున్నాన్నమాట! నేను ఇంతకంటే అధికస్థితి వహించకపోతే పోర్షియా బ్రూటస్‌కు ఉంపుడు కత్తె కానీ ధర్మపత్ని కాదు.

**బ్రూటస్ :** పోర్షియా! నా హృదయంలో ఉన్న వేడినెత్తురు బొట్లల్లా నీవు నాకు ప్రియమైనదానివి. సత్యం వచిస్తున్నాను, నీవు నా గౌరవనీయమైన ధర్మపత్నివి.

**పోర్షియా :** మీరు పలికేది సత్యమైతే మీ ఈ రహస్యం నాకు తెలిసి ఉండవలసింది కదూ? నేను ఒక స్త్రీనని అంగీకరిస్తాను. కానీ, ప్రభువు బ్రూటస్‌కు పత్నినైన స్త్రీని. నేను ఒక స్త్రీనని అంగీకరిస్తాను కానీ ప్రశస్తి కెక్కినదాన్ని, కేటో పుత్రికను. అటువంటి తండ్రికి కుమార్తెనూ, ఇటువంటి భర్తకు భార్యనూ అయిన నన్నే నా జాతి సామాన్యులకంటే ప్రబలను కానని భావిస్తున్నారా?

ప్రభూ! మీ రహస్యాలేమో నాకు చెప్పండి. వాటిని నేను బయటపెట్టను. ఇందుకు ఆవశ్యకమైన నిశ్చలత నాకున్నదని నిరూపించటం కోసం ఇదుగో, ఈ ఊరువులో గాయాన్ని కల్పించుకుంటున్నాను. దీన్ని ఓర్పుతో భరించగలదాన్ని మీ రహస్యాలను భరించలేనేమో పరికించండి.

**బ్రూటస్ :** ఓ దేవతల్లారా! ఇంతటి ఉదాత్తప్రకృతి గల పత్నికి తగ్గ భర్తనుగా నన్ను తీర్చి దిద్దండి.

**(లోపల తలుపుచప్పుడు)**

వింటున్నావా, పోర్షియా, ఎవరో తలుపు తడుతున్నారు. నీవు కొంచెంసేపు లోపలికి వెళ్లు. నా రహస్యాలేమో నీకు కొద్దికాలంలో తెలియజేస్తాను. నా ప్రవర్తనసర్వస్వాన్ని నీకు వెల్లడిస్తాను. దీనమై తోచే నా ముఖలక్షణానికి కారణం వినిపిస్తాను. – త్వరగా లోపలికి వెళ్ళు. (పోర్షియా నిష్క్రమిస్తుంది) లూషియస్, ఆ తలుపు తట్టేది ఎవరు?

**(లిగారియస్‌తో తిరిగి లూషియస్ ప్రవేశిస్తాడు)**

**లూషియస్ :** ఎవరో జబ్బుమనిషి మీతో మాట్లాడాలట!

**బ్రూటస్ :** మెటిల్లస్ చెప్పిన కేయస్ లిగేరియస్ ఇతడే అయి ఉంటాడు. లూషియస్, నీవు పక్కగా తొలుగు. కేయస్ లిగేరియస్! ఏమిటిది?

**లిగేరియస్ :** బలహీనమైన నా కంఠం పలికే ప్రణామ వాక్యాలను స్వీకరించండి.

**బ్రూటస్ :** కేయస్, సాహసికుడవైన నీవు జబ్బు పడటానికి బలే మంచి సమయాన్ని చూచుకున్నావే!

**లిగేరియస్ :** గౌరవప్రదమైన ఒక సాహసకృత్యానికి బ్రూటస్ పూనుకుంటే నేను జబ్బుపడ్డట్లే కాదు. నాకు జబ్బే ఉండదు.

**బ్రూటస్ :** నేను అట్టి చర్యకు పూనుకున్నాను. నీకు ఆరోగ్యం బాగా ఉండి ఉన్నట్లయితే అంతా విశదంగా చెప్పేవాణ్ణి.

**లిగేరియస్ :** నిత్యం రోము నివాసులు ప్రణమిల్లే దేవతల సాక్షిగా నేను నా రుగ్మతను పరిత్యజిస్తున్నాను. మీరు రోముకు అంతరాత్మలు. గౌరవనీయులైన మాతాపితరులకు జన్మించిన వీరపుత్రులు. ఒక ఇంద్రజాలికుడిలాగా వ్యథిత హృదయుడనైన నాకు

ఉత్తేజాన్ని ప్రసాదిస్తున్నారు. మీరు నన్ను పరుగెత్తమని ఆజ్ఞాపించండి. దేనినైనా వెనకపడేసేటట్లు పరుగెత్తుతాను. ఏమి చెయ్యమంటారో సెలవీయండి.

**బ్రూటస్ :** ఏదైనా సరే, అనారోగ్యవంతులకు ఆరోగ్యమిచ్చేది, నిర్జీవులకు జీవం పోసేదీ అయిన ఒక చర్య చెయ్యి.

**లిగేరియస్ :** అయితే జీవించి ఉన్న కొందరిని నిర్జీవులను చెయ్యటం మన కేమన్నా అవసరమా?

**బ్రూటస్ :** అవును. అది కూడా నిర్వర్తించవలసి ఉంది. కేయస్! మనం ఎవరికి ప్రమాదాన్ని కల్పించదలచుకున్నామో, అతడి ఇంటికి వెళ్ళేటప్పుడు దాన్ని గురించి సవిస్తరంగా తెలియజేస్తాను.

**లిగేరియస్ :** అయితే నడిపించండి. నవ్యోత్తేజాన్ని పొందిన హృదయంతో నేను అనుసరిస్తాను. నేనేం చెయ్యటానికి వెళ్లుతున్నానో నాకే తెలియదు అవసరం లేదు కూడాను. కానీ, బ్రూటస్ మహాశయుడు నన్ను నడిపిస్తున్నాడని మాత్రం నాకు తెలిస్తే చాలు.

**బ్రూటస్ :** అయితే, అనుసరించు.

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

సీజర్ ప్రాసాదంలో ఒక ఘనకక్ష్య, ఉరుములు, మెరుపులు, సీజర్ రాత్రి దుస్తులతో ప్రవేశిస్తాడు.

**సీజర్ :** ఈ రాత్రి భూమ్యాకాశాల రెంటిమీదా ఎక్కడా శాంతి ఉన్నట్లు గోచరించటం లేదు. "అయ్యో! సాయపడండి!! వారు సీజర్‌ను హత్య చేస్తున్నారు" అని కల్పూర్నియా ముమ్మారు నిద్రలో కేకలు పెట్టింది. – ఎవరక్కడ?

**(సేవకుడు ప్రవేశిస్తాడు.)**

**సేవకుడు :** ప్రభూ!

**సీజర్ :** వెళ్ళు. 'వెంటనే దేవతలకు బలి ఇచ్చి నా విజయాన్ని గురించిన వార్తలను తెలుసుకో' మని చెప్పు. వారు వినిపించే వార్తలను తీసుకోరా.

**సేవకుడు :** చిత్తం, ప్రభూ!

**(నిష్క్రమిస్తాడు)**

**కల్పూర్నియా ప్రవేశిస్తుంది.**

**కల్పూర్నియా :** ఏమిటి, ఎక్కడికైనా వెళ్ళటానికి నిశ్చయించారా? మీరు ప్రాసాదాన్ని వదలి ఈ నాడు ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు.

**సీజర్ :** సీజర్ తప్పక వెళ్ళి తీరాలి. నా ఎదట నిల్చి ఇంత వరకూ ఎవరూ, ఏదీ, నన్నెదిరించలేదు. నీవు ఇంతగా భయపడుతూ ఉన్న భయంకర విషయాలన్నీ నా ముఖం చూచేటప్పటికి అదృశ్యమైపోతాయి.

**కల్పూర్నియా :** సీజర్! నేను ఎన్నడూ శకునాలను చూచి ఇంతవరకూ భయపడ్డదాన్ని కాను. కానీ, అవి ఈ నాడు నన్ను కళవళ పెడుతున్నవి. కొన్నింటిని గురించి మనం విన్నాం మరికొన్నింటిని కళ్ళారా కన్నాం. మన ప్రాసాదపాలకులు చూచినట్లు చెప్పేవి ఇంకా మరికొన్ని ఉన్నాయి. ఒక సింహం ప్రజావీథుల్లో విచ్చలవిడిగా సంచరించి సంతానాన్ని ప్రసవించిందట! శ్మశానభూముల్లో సమాధులు ఆవులిస్తే అందులో నుంచి మృతిపొందినవారు లేచివచ్చారట! యుద్ధోచిత వేషాలతో సైనికులు భయంకరంగా బారులు తీర్చి మేఘమండలాల్లో పోరాటాలు సాగించారట!! అందువల్లనే సభాభవనం మీద రక్తవర్షం కురిసిందట!! యుద్ధధ్వనులు ఆకాశమంతా అలముకున్నాయి. అశ్వాలు భయంకరంగా హేషించాయి. మరణించేవారి ఆక్రోశ కంఠాలు వినిపించాయి. భూతాలు వికటాట్టహాసాలతో వీథుల్లో విచ్చలవిడిగా సంచరించాయట! సీజర్, ఇవన్నీ ఎంత అసహజమైన అంశాలు! నాకు భయం వేస్తున్నది.

**సీజర్ :** దేవతలు ప్రబలులు. వారి ఉద్దేశాలను ఎదుర్కొనే శక్తి ఎవరికుంది? అయినా, సీజర్ వెళ్ళితీరాలి. ఈ అపశకునాలన్నీ సీజర్ ఒక్కడికేనా? ఇవి ప్రపంచ మంతటికీ సమానమైనవి.

**కల్పూర్నియా :** భిక్షుకులు మరణించేటప్పుడు తోకచుక్కలు కన్పించవు రాజపుత్రుల మృతినే వినువీథి వెలిగి సూచిస్తుంది.

**సీజర్ :** భీరువులు మృతికి పూర్వం ఎన్నోమార్లు మరణిస్తుంటారు. వీరులు ఒక్కమారుతప్ప మరణపు రుచిని చూడరు. నా జీవితంలో ఎన్నో వింతలు విన్నాను. మృత్యువు

రావలసినప్పుడు వస్తుందనీ, అది తమకు అత్యావశ్యకమైన అంతమనీ గమనించకుండా, మానవులు దానికోసం భీతివహించటమే నాకు అతివిచిత్ర విషయంగా గోచరిస్తున్నది.

**(సేవకుడు తిరిగి ప్రవేశిస్తాడు.)**

కాలజ్ఞులు ఏమన్నారు?

**సేవకుడు :** మీరీనాడు ప్రాసాదాన్ని వదలి ఎక్కడికి వెళ్ళటానికి వారు ఇష్టపడటం లేదు. బలిపశువును విశసనం చేసి చూచినప్పుడు దాని గుండె వారికి కనిపించలేదట!

**సీజర్ :** తమ భీరుత్వాన్ని చూచుకొని మానవులు సిగ్గు పడటం కోసం దేవతలు ఇలాగే చేస్తుంటారు. భయంవల్ల సీజర్ ఈ నాడు తన ప్రాసాదంలోనే ఉండిపోతే, అతడు గుండె లేని పశువౌతాడు! వీల్లేదు. సీజర్ పశువు కావటానికి వీల్లేదు. అపాయానికి సీజర్ తనకంటే అపాయకరమైనవాడని తెలుసు. నేనూ, ఆ అపాయం ఒకనాడే జన్మించాం. ఇరువురం సింహాలం. మా ఇరువురిలో నేనే పెద్దను. నేనే భయంకరుణ్ణి. – సీజర్ వెళ్ళి తీరవలసిందే!

**కల్పూర్నియా :** ప్రభూ! మీ విశ్వాసం జ్ఞానశక్తిని వినాశం చేస్తున్నది. ఈ నాడు మీరు ఎక్కడికీ వెళ్ళవద్దు. మిమ్మల్ని మీ భయం కాదు, నా భయం ఆపివేసిందని ప్రకటించండి. మనం మార్క్ ఆంటోనీని సభాభవనానికి పంపుదాం. అతడు మీకు ఈ నాడు శరీరస్వస్థత లేదని నివేదిస్తాడు. ఇదిగో, మీ ముందు మోకరిల్లి వేడుకొంటున్నాను, ఈ విషయంలో నాకు లొంగిపోండి.

**సీజర్ :** కల్పూర్నియా! నీ ఇష్టాన్ని తీర్చటానికి నేను నా ఇంటివద్దనే ఉండిపోతాను. మార్క్ ఆంటోనీ వెళ్ళి నాకు స్వస్థత లేదని వారికి చెపుతాడు.

**(డెషియస్ ప్రవేశిస్తాడు)**

అదుగో డెషియస్. అతడు వారికీ విషయం చెపుతాడు.

**డెషియస్ :** మహోదారపురుషా, సీజర్! శుభం. సుప్రభాతం. నేను మిమ్మల్ని సభాభవనానికి తీసుకోవెళ్ళటానికి వచ్చాను.

**సీజర్ :** సభాసభ్యులకు నా ఆకాంక్షను తెలియజేయటానికి నీవు సరిగా సమయానికి వచ్చావు. నేను ఈ నాడు సభకు రానని వారితో చెప్పు. రాజాల ననకు అది అబద్ధం. రావటానికి ధైర్యం లేదనకు. అది అంతకంటే అబద్ధం. డెషియస్! ఈ నాడు రానని చెప్పు.

**కల్పూర్నియా :** వారికి సుస్తీగా ఉందని చెప్పు.

**సీజర్ :** సీజర్‌కు అసత్యాన్ని చెప్పిపంపవలసిన పనేముంది? ఈ గడ్డాలు నెరసిన వృద్ధులందరికీ అసత్యాలు చెప్పి పంపటానికీ, భయపడటానికేనా జైత్రయాత్రల్లో విశ్రాంతిని ఎరుగకుండా నా బాహుదండాలను అలయించింది? డెషియస్, వెళ్ళు. వారికి సీజర్ రాడని చెప్పు.

**డెషియస్ :** మహాబలశాలీ, సీజర్! నాకేదైనా ఒక కారణం చెప్పండి. లేకుంటే మీరు చెప్పమన్నట్లు చెబితే వారందరూ నన్ను పరిహాసం చేస్తారు.

**సీజర్ :** కారణమా? నా ఇచ్ఛే ఇందుకు కారణం. నేను రాను. సభను తృప్తి పరచటానికి ఇది చాలు. కానీ, నీవు నాకు ప్రేమపాత్రుడివి కనుక నిజమైన కారణాన్ని నీకోసం చెపుతున్నాను. కల్పూర్నియా నన్ను ఇంటివద్ద ఆపివేస్తున్నది. గడచిన రాత్రి నా ప్రతిమ ఒక జలధారలా నూరునాళికలతో స్వచ్ఛమైన రక్తాన్ని చిమ్మినట్లు ఆమె కలగన్నది. అనేక లోభులైన రోమన్లు ఆ రక్తంలో తమ తమ చేతులు ముంచెత్తారట! ఈ శకునాలు రాబొయ్యే అశుభానికి సూచకాలని ఆమె వ్యాఖ్యానించింది. ప్రణమిల్లి ఈ నాడు ఇంటివద్దనే ఉండి పొమ్మని ప్రార్థించింది.

**డెసియస్ :** కల అపమార్గంలో వ్యాఖ్యానితమైంది. ఈ దృశ్యం ఎంతో రమణీయమైంది అంతే కాదు  శుభప్రదమైంది. అనేకులైన రోమన్లు తమ చేతులు ముంచేటట్లు మీ ప్రతిమ ఒక జలధార వలె రక్తమెగజిమ్మిందంటే మీనుంచి రోము పునరుజ్జీవాన్ని పొందే రక్తాన్ని పావనం చేస్తున్నదన్న మాట! పెద్దవాళ్ళందరూ మీ జ్ఞాపకార్థాలైన పట్టికలు, చిహ్నాలు ఇతర స్మృతి చిహ్నాలైన వస్తువులకోసం మీ చుట్టూ మూగుతారన్నమాట! ఇదీ కల్పూర్నియా దేవి స్వప్నానికి క్రమమైన అర్థం.

**సీజర్ :** ఆ స్వప్నానికి ఇది నిజంగా రమణీయమైన వ్యాఖ్యానం.

**డెషియస్ :** నేను చెప్పినదాన్ని మీరు విన్నారంటేనే చాలు, నేను సవ్యంగా వ్యాఖ్యానించానన్నమాట! ఇంకా నేను చెప్పవలసింది కొంత ఉంది. వినమని ప్రార్థిస్తున్నాను. మహాబలశాలి అయిన సీజర్ మహాశయులకు కిరీటప్రదానం చెయ్యాలని సభ నిర్ణయించింది. 'నేను రాను' అని మీరు వార్త పంపిస్తే వారి మనస్సు మారిపోవచ్చు. అంతే కాదు. 'సీజర్ భార్యామణికి ఇంకా మంచి కల వచ్చేదాకా సభను వాయిదా వెయ్యండి' అని ఎవరైనా పరిహాసమాడటానికి కూడా అవకాశముంది. ఇలా దాక్కుంటే

'అయ్యో! సీజర్ పిరికిపడ్డాడని గుసగుసలాడరూ? క్షమించండి! ప్రస్తుతం నా బుద్ధిబలాన్ని త్రోసిరాజని నాకు మీ మీద, మీ కార్యనిర్వహణ మీద ఉన్న ప్రేమ మీతో ఇంత స్వేచ్ఛగా మాట్లాడటానికి ప్రేరేపించి ఆజ్ఞాపిస్తున్నది.

**సీజర్ :** కల్పూర్నియా! నీ భయం ఎంతటి అర్థరహితమైందో ఇప్పుడు అవగతం చేసుకున్నావా? దానికి నేను లొంగిపోయినందుకు నాకెంతో సిగ్గు వేస్తున్నది., నేను వెళ్ళి తీరుతాను. ఏవీ నా దుస్తులు?

**పబ్లియస్, బ్రూటస్, లిగారియస్, మెటిల్లస్, కాస్కా,**
**ట్రెబోనియస్, సిన్నా ప్రవేశిస్తారు.**

అడుగో, చూడు  పబ్లియస్ నన్ను తీసుకోవెళ్ళటానికని వచ్చాడు.

**పబ్లియస్ :** సుప్రభాతం, సీజర్!

**సీజర్ :** స్వాగతం, పబ్లియస్!... ఏమిటి? బ్రూటస్, మీరు కూడా ఇంత పెందలకడే బయలుదేరారు. సుప్రభాతం, కాస్కా, కేయస్ లిగారియస్! ఇంతగా సన్నబడే జబ్బు నీకెంత శత్రువైంది. సీజర్ నీకెప్పుడూ ఇంతటి శత్రువు కాలేదు. కాలమెంతైంది?

**బ్రూటస్ :** ఎనిమిది కొట్టారు.

**సీజర్ :** మీరు తీసుకున్న శ్రమకూ, కృతజ్ఞతకూ నా అభివాదనాలు.

**ఆంటోని ప్రవేశిస్తాడు.**

అటు చూడండి. ఆంటోనీ, రాత్రి ఎంతో ప్రొద్దుపోయేదాకా విలాసాలతో గడిపేవాడు కూడా అప్పుడే మేల్కొని వచ్చేశాడు. ఆంటోనీ, సుప్రభాతం!

**ఆంటోనీ :** సీజర్ మహోదారా! సుప్రభాతం.

**సీజర్ :** వారిని అందరినీ సిద్ధపడమని ఆజ్ఞాపించు. మీ అందరికీ ఆలస్యాన్ని కలిగిస్తున్నందకు నిందాపాత్రుణ్ణి నేనే. సిన్నా! మెటిల్లస్!! ట్రెబోనియస్ నేను మీతో ఒక అరగంట సేపు మాట్లాడాలి. మరిచిపోకు. ఈ నాడే నన్ను పిలిచి మళ్ళీ జ్ఞప్తి చెయ్. కాదు, నీవు నా ప్రక్కనే ఉండు. ఈ విషయం నాకే జ్ఞప్తికి వస్తుంది.

**ట్రెబోనియస్ :** అలాగే సీజర్! (స్వగతం) నీ ఆప్తస్నేహితులు కొంతైనా దూరంగా ఉంటే బాగుంటుందనుకొనేటంత సన్నిహితంగా ఉంటాను.

**సీజర్ :** ప్రియమిత్రులారా! లోపలికి రండి. నాతో కలిసి కొంత ద్రాక్షాసవాన్ని సేవిద్దురుగాని. తరువాత మనం ఉత్తమమిత్రుల్లాగా సభాభవనానికి కలిసి వెడదాం.

**బ్రూటస్ :** (స్వగతం) సీజర్! ఒకలా నటించి మరొకలా ఉండటం బ్రూటస్‌ను ఎప్పుడూ బాధపెడుతుంది.

**(నిష్క్రమిస్తాడు)**

## మూడో దృశ్యం

**సభాభవనం దగ్గిర ఒక వీథి. ఒక పత్రాన్ని చదువుతూ ఆర్టిమిడోరస్ ప్రవేశిస్తాడు.**

**ఆర్టిమిడోరస్ :** "సీజర్! బ్రూటస్‌ను గురించి జాగరూకత వహించు. కాషియస్‌ను గమనించు. కాస్కాను దగ్గిరకు రానీకు. సిన్నామీద ఒక కన్ను వేసి ఉండు. ట్రెబోనియస్‌ను నమ్మకు. మెటిల్లస్ సింబర్‌ను బాగా గుర్తుపెట్టుకో. డెషియస్ బ్రూటస్‌కు నీ మీద అనురాగం లేదు. కెయస్ లిగారియస్‌కు నీవు అపరాధం చేశావు. ఈ వ్యక్తులందరిదీ ఒకటే మనస్సు. అది సీజర్‌కు వ్యతిరేకంగా ఉంది. 'నేను దివ్యుడను' అని అనుకోకపోతే నిన్ను గురించి ఆలోచించుకో. భద్రభావం ద్రోహానికి దారితీస్తుంది. బలవంతులైన దేవతలు నిన్ను రక్షింతురుగాక! – భవదీయానురాగి, ఆర్టిమిడోరస్"

సీజర్ ఇటు వెళ్ళేదాకా ఇక్కడే నే నిలిచి ఉంటాను. ఈ పత్రాన్ని ఒక నివేదనగా అతని చేతికి అందజేస్తాను. ఈర్ష్యాళువైన శత్రుత్వపుకోరలనుంచి తప్పించుకొని ఉదాత్తగుణం బ్రతకలేకపోతున్నదని నా హృదయం ఎంతో దుఃఖపడుతున్నది. సీజర్! దీన్ని నీవు చదివితే, విధి ద్రోహులతో సహకరించకుండా ఉంటే నీవు బ్రతకవచ్చు.

**(నిష్క్రమిస్తాడు)**

## నాలుగో దృశ్యం

**బ్రూటస్ ఇంటిముందు వీథిలో మరో భాగం. పోర్షియా, లూషియస్ ప్రవేశిస్తారు.**

**పోర్షియా :** లూషియస్, కాలహరణం చెయ్యకు! సభాభవనానికి పరుగెత్తుకో వెళ్ళు. నాకే సమాధానాలూ చెప్పనవసరం లేదు వెళ్ళు. ఇంక నిలుచున్నావేం? వెళ్లు.

**లూషియస్ :** అమ్మా, వెళ్ళి నే నేం చెయ్యాలో తెలుసుకుందామని నిలుచున్నా.

**పోర్షియా :** నీవు ఏమి చెయ్యాలో చెప్పేలోగానే నీవు అక్కడికి వెళ్ళి రావాలని నా ఉద్దేశం. (స్వగతం) స్థైర్యమా! నాకు బలాన్ని చేకూర్చు. నా హృదయానికీ, మనస్సుకూ మధ్య మహా పర్వతాలను నిలుపు. నాకు పురుషులకు ఉండవలసిన మనస్సుంది. అయితే నా శక్తి స్త్రీ సహజమైంది. రహస్యాన్ని దాచటం స్త్రీల కెంత కష్టం? – ఇంకా నీవు ఇక్కడనే ఉన్నావా?

**లూషియస్ :** అమ్మా! నేనేం చెయ్యను? సభాభవనానికి పరుగెత్తటమేనా? ఇంకేం చెయ్యనవసరం లేదా? మళ్ళీ తిరిగిరావటమేనా? ఇంకేం లేదా?

**పోర్షియా :** ఇంట్లోనుంచి ఏదో వ్యథతో వెళ్ళారు! మీ ప్రభువు కుశలంగా కనిపిస్తున్నారో లేదో వార్త తీసుకుని రా. సీజర్ ఏం చేస్తున్నాడో, అతడి ఆప్తులు అతణ్ణి ఏమి చెయ్యమని ప్రబోధిస్తున్నారో బాగా గమనించిరా... ఆ కోలాహల మేమిటి?

**లూషియస్ :** కోలాహలమా? నాకేమీ వినిపించటం లేదు.

**పోర్షియా :** ఒక జగడం జరుగుతున్నట్లు నాకేదో రొద వినిపిస్తున్నది. సభాభవనం వైపు నుంచి వచ్చే గాలి దాన్ని తీసుకో వస్తున్నది. లూషియస్, అదిగో జాగ్రత్తగా విను.

**లూషియస్ :** సత్యం తల్లీ! నాకేమీ వినిపించటం లేదు.

**శకునజ్ఞుడు ప్రవేశిస్తాడు.**

**పోర్షియా :** రావయ్యా! ఎక్కడనుంచి వస్తున్నావు?

**శకునజ్ఞుడు :** మా ఇంటినుంచేనమ్మా!

**పోర్షియా :** ఇప్పుడు కాలమెంతైంది?

**శకునజ్ఞుడు :** తొమ్మిదిగంటలు కావస్తున్నది.

**పోర్షియా :** ఈ సమయానికి సీజర్ సభాభవనానికి వెళ్ళి ఉంటాడా?

**శకునజ్ఞుడు :** అమ్మా! ఇంకా వెళ్ళలేదు అతడు సభాభవనానికి వెళ్ళే సమయంలో అతణ్ణి చూడటం కోసం నేను నిలువబడటానికి వీథిలోకి వెళ్ళుతాను.

**పోర్షియా :** ఆయనకు నివేదించుకోవలసిందేదో నీకుంది గదూ?

**శకునజ్ఞుడు :** అవును తల్లీ! తన విషయం జాగ్రత్తపడవలసిందని నివేదించ దలచుకున్నాను. నా ప్రార్థన వింటే ఆయనకు ఎంతో మేలు జరుగుతుంది.

**పోర్షియా :** ఏం, అతడిమీద ఉద్దేశింపబడ్డ ఉపద్రవాన్ని గురించి నీకేమైనా తెలుసునా?

**శకునజ్ఞుడు :** స్పష్టంగా నాకు తెలియదు. ఏదైనా జరగవచ్చునని నా భయం. సుప్రభాతం, తల్లీ! ఇక్కడ వీథి చాలా ఇరుగ్గా ఉంది. సీజర్ వెంట పాదచారులై వచ్చే గుంపు, సభాసభ్యులు, చోపుదార్లు, సామాన్యజనం, బలహీనుణ్ణి నన్ను మరణపర్యంతం నొక్కివేస్తారు. నేను విశాలంగా ఉన్న ఒక ప్రదేశానికి చేరి ఘనుడైన సీజర్ వస్తున్నప్పుడు అతనితో మాట్లాడుతాను.

**(నిష్క్రమిస్తాడు)**

**పోర్షియా :** నేనూ వెళ్ళిపోవాలి. (స్వగతం) అయ్యో! స్త్రీ హృదయం ఎంత బలహీనమైంది? బ్రూటస్! సాహసకృత్యంలో నీకు దేవతలు తోడ్పడెదరు కాక! నిజం, నేను చెప్పింది లూషియస్ వినిపించుకున్నాడు.

బ్రూటస్ చేసే ఒక నివేదిక ఉంది  దానికి సీజర్ ఇష్టపడడు. అయ్యో! నా శరీరం తిరిగిపోతున్నది. లూషియస్! పరుగెత్తుకో వెళ్ళి బ్రూటస్‌తో నన్ను గురించి చెప్పు. ఆనందంతో ఉన్నానని చెప్పు. నీతో ఆయన ఏమన్నారో తిరిగి వచ్చి నాతో చెప్పు.

**(ఒంటరిగా నిష్క్రమిస్తుంది.)**

# తృతీయాంకం

## ఒకటో దృశ్యం

సభాభవనం ముందు సభ్యులు పైన సభ జరుపుతుంటారు సభాభవనానికి వెళ్ళే జనసమూహం వారిలో ఆర్టిమిడోరస్, శకునజ్ఞుడు ఉంటారు తుత్తారస్వరం వినిపిస్తుంటుంది. సీజర్ బ్రూటస్, కాషియస్, కాస్కా, డెనిషియస్, మెటిల్లస్, ట్రెబోనియస్, సిన్నా, ఆంటోనీ, లెపిడస్, పొపిలియస్, పబ్లియస్ తదితరులూ ఉంటారు.

**సీజర్ :** మార్చి పదిహేను వచ్చింది.

**శకునజ్ఞుడు :** ఔను! ఇంకా గడవలేదు.

**ఆర్టిమిడోరస్ :** సీజర్! ఈ వినతిపత్రాన్ని చదువు.

**డెషియస్ :** ట్రెబోనియస్ తన వినతిపత్రాన్ని అమూల్యమైన మీ విశ్రాంతి కాలంలో వినిపించమని అర్థిస్తున్నాడు.

**ఆర్టిమిడోరస్ :** సీజర్! నా పత్రాన్ని ముందు తిలకించండి. దీనితో సీజర్‌కు మిక్కిలి సన్నిహిత సంబంధం ఉంది. తప్పక చదవండి సీజర్!

**సీజర్ :** నాకు సంబంధం ఉన్నదాన్ని అన్నిటికంటే చివరకు చూడాలి.

**ఆర్టిమిడోరస్ :** సీజర్! ఆలస్యం చెయ్యకండి. వెంటనే చదవండి.

**సీజర్ :** ఏమిటి? ఇతడికేమైనా వెర్రి ఎక్కిందా?

**పబ్లియస్ :** ఏయ్! ప్రక్కకు తొలుగు.

**కాషియస్ :** ఈ పత్రాలను సమర్పించటానికి మీకు వీధి దొరికిందా? ఏమా తొందర? సభాభవనానికి రండి.

**సీజర్ సభాభవనానికి వెళ్ళుతుంటాడు; అందరూ అనుసరిస్తారు.**

**పొపిలియస్ :** ఇవాళ మీ సమస్తోద్యోగాలకూ విజయం చేకూరుగాక!

**కాషియస్ :** ఏమి ఉద్యోగమోయ్, పొపిలియస్!

**పొపిలియస్ :** విజయం చేకూరుగాక!

**బ్రూటస్ :** అది పొపిలియసేనా? ఏమిటి అంటున్నాడు?

**కాషియస్ :** ఈ నాటి మీ ఉద్యోగాలన్నిటికీ విజయం చేకూరుగాక అని అంటున్నాడు. మన ఉద్దేశం బయటపడి పోయిందేమో అని నాకు అనుమానంగా ఉంది.

**(సీజర్‌ను అనుసరిస్తాడు)**

**బ్రూటస్ :** గమనించు. అతడు సీజర్ దగ్గిరికి ఎలా వెడుతున్నాడో గమనించు.

**కాషియస్ :** కాస్కా, హఠాత్తుగా ప్రవర్తించాలి మనను కనిపెట్టారేమోనని అనుమానంగా ఉంది. బ్రూటస్ మహాశయా! మనకు కర్తవ్య మేమిటి? ఇది తెలిసిపోయిందా, కాషియస్ మళ్ళీ తిరిగి వెళ్ళడు. నన్ను నేనే చంపుకుంటాను.

**బ్రూటస్ :** కాషియస్! స్థైర్యం వహించు. పొపిలియస్ లేదా సీజర్‌తో మన ఉద్దేశాన్ని గురించి మాట్లాడినట్లు కనిపించటం లేదు.

**కాషియస్ :** ట్రెబోనియస్‌కు నిర్ణీతకాలం తెలుసు. చూడు, అతడు సమయానికి మార్క్ ఆంటోనీని అవతలికి తీసుకోపోతున్నాడు.

**(ఆంటోనీ, ట్రెబోనియస్ నిష్క్రమిస్తారు)**

**డెషియస్ :** మెటిల్లస్ సింబర్ ఏడి? అతణ్ణి వెళ్ళమనండి. సీజర్‌కు వెంటనే అతడి వినతిని సమర్పించమనండి.

**బ్రూటస్ :** అతడు సిద్ధంగానే ఉన్నాడు. దగ్గరకురా. అతడికి సాయం వెళ్ళు.

**సిన్నా :** కాస్కా, నీవు మొదటిపోటు పొడవాలి.

**సీజర్ :** మనమందరం సిద్ధమేనా? సీజర్, అతడి సభాజనం సరిదిద్దవలసిన లోపాలేమిటి?

**మెటిల్లస్ :** ఘనకీర్తీ, బలశాలీ, సాహసీ, సీజర్! మెటిల్లస్ సింబర్ సవినయంగా మీ మహాసనానికి తన హృదయాన్ని నివేదనగా ఇచ్చి... (వంగుతాడు)

**సీజర్ :** సింబర్, ఈ రీతిగా నీవు ప్రణమిల్లటాన్ని[22] నేను అంగీకరించరాదు. ఇలా వినమ్రం కావటం వల్లా, ప్రణామాలర్పించటం వల్లా ఎవరైనా జన సామాన్యులు, పసిబిడ్డల్లా, తొలిగా తాము చేసుకొన్న నిర్ణయాలను మార్చుకుంటే మార్చుకోవచ్చు.

కానీ సీజర్ యెడ ఇటువంటివి నిష్ప్రయోజనాలు. తీయని ఉపోద్ఘాతాలు, వినమ్రప్రణామాలు, గోమాయువినయాలు మొదలైన ఆచారాలు అల్పబుద్ధులను కరిగించి నిర్ణయాలను మార్చుకొనేటట్లు చేయగలుగుతున్నవి గదా అనే ఉద్దేశంతో ప్రయోగిస్తున్నట్లున్నావు! వాటికి లొంగే రక్తం సీజర్ శరీరంలో ఉందని భావించి భ్రమపడకు. దీర్ఘంగా ఆలోచించి నిర్ణయించే మీ అన్నను దేశభ్రష్టుణ్ణి చేశాం. అతడికోసం నీవు ఇలా వంగి ప్రణమిల్లుతుంటే నిన్ను నేనడిచే మార్గంలో ఉన్న ఒక గజ్జికుక్కగా అసహ్యించుకుంటాను. అంటే సీజర్ తప్పిదం చెయ్యడనీ, తగిన కారణంలేకుండా అతడు సంతృప్తిని పొందడనీ తెలుసుకో.

**మెటిల్లస్ :** దేశబహిష్కృతుడైన మా అన్నమీది అభిశంసనాన్ని రద్దు చేయవలసిందని అర్థించటానికి, సీజర్ చెవులకు నా కంఠంకంటే మధురంగా వినిపించే మరో కంఠం ఈ సభలో ఏదీ లేదా?

**బ్రూటస్:** సీజర్, నీ హస్తాన్ని చుంబిస్తున్నాను. ఇది నిన్ను స్తోత్రం చేయటానికి కాదు. పబ్లియస్ సింబర్ మీది అభిశంసనాన్ని తక్షణం రద్దుచేసి, అతడికి స్వాతంత్ర్య ప్రదానం చెయ్యటానికి.

**సీజర్ :** ఏమంటావు బ్రూటస్?

**కాషియస్ :** సీజర్! క్షమించు. పబ్లియస్ సింబర్ స్వేచ్ఛ కోసం కాషియస్ మీ పాదపర్యంతం వినమ్రుడౌతున్నాడు.

**సీజర్ :** నేను మీరే అయి ఉంటే కరిగిపోయి చలించేవాణ్ణి. ఇతరుల మనస్సులు కరగటానికి నేను ప్రార్థించేవాణ్ణి అయి ఉన్నట్లయితే ఇతరుల ప్రార్థనలకు నేను కరిగేవాణ్ణి. కానీ నేను ధ్రువతారలా నిశ్చలుణ్ణి. అన్నీ అగ్నిగోళాలే. ప్రకాశవంతాలే. ఆకాశమంతా ఈ అగ్నిగోళాలతోనే అలంకృతమై ఉంటుంది. అయితే, ధ్రువతార సుస్థిరస్థానాన్ని ఆక్రమించగల సామర్థ్యం వీటిలో దేనికీ లేదు. ఇదేరీతిగా ప్రపంచమంతా మానవులతో నిండి ఉంది. వీరు చర్మరక్తోపేతులు, విజ్ఞానవంతులు. అయితేనేం? వీరందరిలో ఎట్టి భయం లేకుండా నిశ్చలంగా తన స్థానాన్ని నిలుపుకుంటున్న ఒక్క వ్యక్తిని నే నెరుగుదును. ఆ వ్యక్తిని నేనే. ఈ విషయంలో, సింబర్‌ను బహిష్కృతుని చేయటంలో కూడా, నేను అచంచలుడనని నన్ను నిరూపించనివ్వండి.

**సిన్నా :** సీజర్, ప్రభూ...!

**సీజర్ :** మీరు ఇక్కడినుంచి వెళ్ళిపొండి, ఒలింపస్[23] పర్వతాన్ని ఎత్తటానికి యత్నిస్తారు!

**డెషియ‌ున్ :** బ్రూటన్ మహాశయుని ప్రణామం కూడా ప్రయోజన రహితమైపోతుందని మీరు గమనిస్తున్నారా?

**కాస్కా :** ఇక నా నోరు మాటాడదు  చేతులే పూనుకుంటాయి.

సీజర్‌ను మొదట కాస్కా, తరువాత ఇతర విద్రోహ వర్గసభ్యులు మార్కస్ బ్రూటస్ పొడుస్తారు :

**సీజర్ :** నీవు కూడానా బ్రూటస్? సీజర్, ఇక ఒరిగిపో.

**సిన్నా :** స్వేచ్ఛ! స్వాతంత్ర్యం!! నిరంకుశత్వం వినాశమైపోయింది. ప్రజలారా! ఇక్కడినుంచి వేగంగా వెళ్ళిపొండి. ఈ వార్తను వీథివీథులా ప్రకటించండి.

**కాస్కా :** కొందరు ప్రజావేదికల దగ్గిరకు వెళ్ళండి.'స్వేచ్ఛ లభించింది, స్వాతంత్ర్యం చేకూరింది. సత్త్వం లభ్యమైంది' అని కేక పెట్టండి.

**బ్రూటస్ :** ప్రజలారా! సభాసభ్యులారా!! భయపడకండి. పరిగెత్తిపోకండి. మా ఆశ, మా ఆశయం, లభించింది.

**కాస్కా :** బ్రూటస్, మీరు వేదికమీదికి వెళ్ళండి.

**డెషియస్ :** కాషియస్, నీవు కూడా.

**బ్రూటస్ :** పబ్లియస్! ఏడీ?

**సిన్నా :** ఇదుగో, ఇక్కడ ఈ విప్లవానికి విస్తుపోయి నిలుచున్నాడు.

**మెటిల్లస్ :** ఇక్కడ మనమందరం గుమిగూడి నిలుచుందాం. లేకపోతే సీజర్ మిత్రులెవరైనా...

**బ్రూటస్ :** గుమిగూడి నిలుచోటాన్ని గురించి చెప్పకు. పబ్లియస్, సంతోషంతో ఉండు. నీ శరీరానికి ఏ ప్రమాదం లేదు. నీకే కాదు  మరే రోమనుపౌరుడికీ ఎట్టి ప్రమాదం లేదు. ప్రజలకలా ప్రకటించు.

**కాస్కా :** మా దగ్గిరనుంచీ వెళ్ళిపో పబ్లియస్! లేకపోతే మీ మీదికి వచ్చే ప్రజావృద్ధుడవైన నీకు కూడా ప్రమాదాన్ని కల్గించవచ్చు.

**బ్రూటస్ :** నిజం. అలా చెయ్యి. మేము చేసిన ఈ కృత్యానికి మేము తప్ప ఇతరులెవ్వరూ బాధను పొందవద్దు.

**ట్రెబోనియస్ తిరిగి ప్రవేశిస్తాడు.**

**కాస్కా :** ఆంటోనీ ఎక్కడ?

**ట్రెబోనియస్ :** ఆశ్చర్యపడి ఇంటికి పారిపోయినాడు. పురుషులు, స్త్రీలు, బాలురు అందరూ దీన్ని ఒక మహాప్రళయ[24] సమయంగా భావించి భయంతో పారిపోతున్నారు.

**బ్రూటస్ :** విధికన్యల్లారా! మీరు మమ్మల్ని ఏం చేయదలిచారో మేము ఎరుగుదుము. మేమూ మరణించవలసి ఉందని మాకు తెలుసు. ఇంకా ఈ భూమిమీద ఎన్నాళ్ళు మృత్యువుకోసం వేచి ఉండాలె నన్నదే మానవుల బాధ.

**కాషియస్ :** బ్రూటస్! మానవులు ఇంకా జీవించవలసిన కాలాన్ని గురించి ఎందుకు బాధపడాలి. ఒకరి ఇరవై సంవత్సరాల జీవితాన్ని త్రుంచిన వ్యక్తి తన మరణభయానికి గల కారణాన్ని కూడా త్రుంచివేయగలడు.

**బ్రూటస్ :** అయితే మరణమే మానవులకు క్షేమకరమని అంగీకరిస్తున్నా మన్నమాట! అతని మరణభయకాలాన్ని తగ్గించి అతడికి మనం మిత్రులుగా ప్రవర్తించామన్నమాట! నమ్రులు కండి. ఓ రోమను పౌరులారా! నమ్రులు కండి. మన మందరం మోచేతులదాకా హస్తాలను సీజర్ రక్తంలో ముంచెత్తుదాం. అతని రక్తంతో మనకత్తులకు మలామాచేద్దాం. తరువాత 'శాంతి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం' అని కేకలు పెడుతూ, మన రక్తారుణకౌశేయాలను శిరస్సులపై కెత్తి జళిపిస్తూ విపణివరకూ పురోగమిద్దాం.

**కాస్కా :** అయితే, నమ్రులు కండి. హస్తాలను క్షాళనం చెయ్యండి. భవిష్యద్యుగాలలో, ఇంకా పుట్టని రాజ్యాలలో, పుట్టనిభాషలు గల ప్రజలో, ఈ నాటి దృశ్యాలను మరింకెన్నాళ్ళకు అభినయిస్తారో!

**బ్రూటస్ :** ధూళిలో, ప్రణామం చేస్తూ, పాంపే ప్రతిమపాదదేశంలో ఈ నాడు చచ్చిపడి ఉన్న సీజర్ రక్తం రంగస్థలాల మీద ఇకముందు రూపకాలలో ఎన్నిమార్లు స్రవిస్తుందో!

**కాస్కా :** అవును. ఎన్నిమార్లు ఈ దృశ్యం అభినయింపబడుతుందో అన్నిమారు మన బృందాన్ని దేశ స్వాతంత్ర్యప్రదాతలుగా, స్వేచ్ఛాసముద్ధర్తలుగా కీర్తిస్తారు.

**డెషియస్ :** ముందు మన కర్తవ్యమేమిటి?

**కాస్కా :** మనం అందరం వెళ్ళిపోవాలి. బ్రూటస్ మనకు నాయకుడై మనలను నడిపిస్తాడు. అత్యుత్తమ సాహసోపేతాలైన రోమను పౌరజనహృదయాలతో, అతని అడుగుజాడలను మనం అనుసరించి గౌరవిద్దాం.

**(ఒక సేవకుని ప్రవేశం)**

**బ్రూటస్ :** నిశ్శబ్దం. ఎవరో వస్తున్నారు. ఆంటోనీకి మిత్రుడిలా ఉన్నాడు.

**సేవకుడు :** బ్రూటస్ మహాశయా! ఈ రీతిగా మా యజమాని మీ యెడ వినమ్రభావాన్ని ప్రకటించమని ఆదేశించాడు. ఇలా భూస్పర్శగా మీకు ప్రణమిల్లమన్నాడు. ఇలా నివేదించ మన్నాడు.

"బ్రూటస్ ఉదాత్తుడు. విజ్ఞాని. వీరుడు, సత్యసంధుడు. సీజర్ మహాబలశాలి. సాహసోపేతుడు. రాచఠీవిగలవాడు, ప్రియమైనవాడు. అందువల్ల నేను బ్రూటస్‌ను గౌరవిస్తున్నాను, ప్రేమిస్తున్నాను. సీజరంటే నాకు భయముండేదనీ, అందువల్ల అతణ్ణి ప్రేమించాననీ, గౌరవించాననీ చెప్పు. భద్రంగా ఆంటోనీ తనవద్దకు రావటానికీ, సీజర్ మృత్యు శయ్యను చేరటానికీ యోగ్యుడని భావించి అనుజ్ఞనిస్తే, మార్క్ ఆంటోనీ సజీవుడైన బ్రూటస్ కంటే మృతుడైన సీజర్‌ను అధికంగా ప్రేమించడని చెప్పమనీ నన్ను కోరాడు. ఉదాత్తుడైన బ్రూటస్‌ను అతడికి సర్వవ్యవహారాలలో, మంచిచెడ్డల్లో, సత్ప్రవర్తనతో ఒక్కటై అనుసరిస్తానని చెప్పు" మని మా యజమాని మార్క్ ఆంటోనీ చెప్పి పంపాడు.

**బ్రూటస్ :** మీ యజమాని తెలివిగలవాడు రోమన్ వీరుడు. అతణ్ని గురించి నాకెపుడూ ఎటువంటి దురభిప్రాయం లేదు. ఇక్కడికి రావటం అతడికి అభీష్టమైతే సీజర్‌ను తుదముట్టించినందుకు తగ్గ కారణాలను వినగలడనీ, క్షేమంగా తిరిగి వెళ్ళగలడనీ నా గౌరవం మీద ప్రమాణం చేసి చెప్పానని చెప్పు.

**సేవకుడు :** వెళ్ళి వారిని వెంటనే ఇక్కడికి తీసుకోవస్తాను.

**(నిష్క్రమిస్తాడు)**

**బ్రూటస్ :** అతణ్ణి మిత్రుణ్ణి చేసుకోవటం మనకు అవసరమనీ, క్షేమమనీ నాకు తెలుసు.

**కాషియస్ :** అదే నా అభీష్టం కూడాను. కానీ అతడు మనకు మిత్రుడుగా ఉంటాడా అని అనుమానంగా ఉంది. అదీగాక నా అనుమానాలు సర్వవేళలా సత్యాలౌతున్నవి.

**(ఆంటోనీ పునఃప్రవేశిస్తాడు)**

**బ్రూటస్ :** అడుగో ఆంటోనీ ఇక్కడికి వస్తున్నాడు... మార్క్ ఆంటోనీ, నీకిదే స్వాగతం!

**ఆంటోనీ :** మహాబలశాలీ, సీజర్! నీకింతటి పతనం సంభవించిందా? నీ జైత్రయాత్రలు, కీర్తిప్రతిష్ఠలు, విజయాలూ సర్వం నిన్ను ఈ దుఃస్థితికి తీసికోవచ్చాయా? నీకు వీడ్కోలు!

ఓ మహోదారులారా! మీ మహాశయాలేమిటో, ఇంకా ఎవరెవరి రక్తం స్రవించాలో నాకు తెలియదు. మీరు అందులో నన్ను ఒకణ్ణిగా భావిస్తే సీజర్ మరణించిన ఈ సమయంకంటే మంచిది నాకెక్కడ లభిస్తుంది? ప్రపంచంలో కెల్లా మహోదారమైన రక్తాన్ని మైపూత గావించుకొన్న మీ శస్త్రాలకంటే నా మృతికి మంచి సాధనా లెక్కడ దొరుకుతాయి? నా మీద మీకేమైనా ఉంటే రక్తారుణమైన మీ హస్తాలతడి ఆరకముందే మీ ఆనందాన్ని తీర్చుకోండి. నేను ఇంకా వేయి సంవత్సరాలు జీవించినా మరణించటానికి ఇంతకంటే సుసమయం నాకు కలగదు. సీజర్‌తో పాటు మరణించే అవకాశాన్ని ప్రసాదించగల ఈ ప్రదేశం కంటే మరో తావు నాకు తృప్తిని కలిగించలేదు. ఈ యుగం ఎన్నుకున్న ఉత్తములూ, మహోదారాశయులూ అయిన మీ సాధనాల కంటే, సీజర్ మృతికి సాధనాలైన సాధనాలకంటే, మంచివి నా కెప్పుడూ లభించవు.

**బ్రూటస్ :** ఆంటోనీ! మరణదానం చెయ్యండని మమ్మల్ని అర్థించవద్దు. ప్రస్తుతం మేము నిర్వర్తించిన ఈ కృత్యం వల్ల మమ్మల్ని రక్తపిపాసువులుగా, క్రూరులుగా ప్రదర్శించే మా హస్తాలు మాత్రమే నీకు కనిపిస్తాయి  కానీ మా హృదయాలు గోచరించవు. అవి కరుణారసపూరితాలు. రోముకు జరుగుతూ వచ్చిన అపచార విషయంలో అవి కరుణారసపూరితాలు. ఒక అగ్ని మరో అగ్నిని తరిమివేసినట్లు ఒక కరుణ మరో కరుణను తరిమివేసింది. రోము ప్రజలమీది మా కరుణ సీజర్ మీది కరుణను పారద్రోలింది  సీజర్ యెడ ఈ కృత్యాన్ని చేయించింది. నీ యెడ మా ఖడ్గాలు బండవారినవి. వాటికి అంచులు తప్పినవి. మా శస్త్రాలు నిరంకుశత్వం విషయంలో ఈర్ష్యాయుతాలు. మా హృదయాలు నీ యెడ భ్రాతృప్రేమ వహిస్తున్నవి. నిన్ను ప్రేమతో, గౌరవంతో, సదుద్దేశంతో ఆహ్వానిస్తున్నవి.

**కాస్కా :** ఉద్యోగ ప్రదానాలలోనూ, పోషణత్వ పాలనలోనూ మా అందరితో తుల్యంగా నీ మాట చెల్లుబడి ఔతుంది.

**బ్రూటస్ :** ఇక్కడ గుమిగూడిన జనానికి భయాన్ని పోగొట్టి ప్రశాంతిని కల్పించేటంతవరకూ కొంచెం ఓపిక పట్టు. నీకు కారణాలను వినిపిస్తాము. సీజర్ యెడ అంతటి ప్రేమగల నేనుగూడా ఎందుకతడి యెడ ఇలా ప్రవర్తించానో తెలియ జెపుతాను.

**ఆంటోని :** మీ విజ్ఞానాతిశయంమీద నా కెన్నడూ సంశయం లేదు. మీలో ప్రతి ఒక్కరూ రక్తప్లావితమైన హస్తాలను నాకందివ్వండి. కరచాలనం చేస్తాను. మొదట

మార్కస్ బ్రూటస్, తరువాత కేయస్ కాషియస్, పిమ్మట డెషియస్ బ్రూటస్, మెటిల్లస్, సిన్నా, వీరాధివీరుడవైన[25] నా కాస్కా! ఇప్పుడు నీ హస్తాన్ని అందించు. తుదిదైనా అనురాగంలో ప్రథమమైన నీ హస్తమేది ట్రెబోనియస్? – మీరందరూ ఉదాత్తవ్యక్తులు.

అయ్యో! మీతో నేనేమి సంభాషించాలో నాకు తెలియటం లేదు. నా కీర్తికి నిలువ నీడ తప్పింది. సీజర్‌ను పరిత్యజిస్తున్నందుకు మీరు నన్ను భీరువుననైనా భావిస్తారు, లేదా స్తోత్ర పాఠకుడినని అయినా అనుకుంటారు. రెండు రీతులా చెడుగానే తలపోస్తారు.

సీజర్! నిన్ను నేను సత్యంగా ప్రేమించాను. ఇప్పుడు మమ్మల్ని చూస్తే, నీ కళేబరం ముందే, నీ ఆంటోనీ, నీ శత్రువుల రక్తహస్తాలతో కరచాలనం చెయ్యటం చూస్తే, నీ అంతరాత్మ మరణ సమయంలో పొందిన వేదనకంటే, ఓ మహోదారా! అధికవ్యథ పొందకుండా ఉండగలుగుతుందా? నీ శరీరం మీద పడ్డ పోట్లన్ని కన్నులు నాకుంటే, నీ గాయాలు రక్తాన్ని చిమ్మినట్లు అవి కన్నీరు కారుస్తుంటే, నీ శత్రువులతో మైత్రికంటే నా కటువంటి స్థితే ఎంతో ఆనందదాయకమైంది కదా!

జూలియస్! నన్ను క్షమించు. ఓ వీరమృగమా! నిన్ను ఇక్కడివారందరూ చుట్టుముట్టారు ఇక్కడ నీవు భూమిమీది కొరిగావు. నిన్ను వేటాడినవారు ఇక్కడే నీ మీద పొందిన విజయ చిహ్నమైన నీ అరుణారుణరక్తకాంతితో నిలిచి ఉన్నారు. ఓ ప్రపంచమా! నీవనే అరణ్యంలో సీజర్ మహామృగం అతిస్వేచ్ఛగా సంచరించింది. ఈ మృగమే సర్వ ప్రపంచానికీ హృదయమై వర్తించింది. ఓ సీజర్, ఒక హరిణంలా, అనేక రాజకుమారులు ఏకకాలంలో వేటాడి దెబ్బలు కొట్టిన హరిణంలా, ఇక్కడ పడి ఉన్నావా?

**కాషియస్ :** మార్క్ ఆంటోనీ!

**ఆంటోనీ :** కేయస్ కాషియస్ నన్ను క్షమించు. ఈ స్థితిలో సీజర్ పరమశత్రువులు కూడా ఈ మాత్రం పలకకుండా ఊరుకోలేరు ఇక మిత్రుడనైన నా విషయంలో ఇది ఎంత?

**కాషియస్ :** నీవు సీజర్‌ను స్తుతిస్తున్నందుకు నిన్ను నేనేమీ అనటం లేదు. అయితే నీవు మాతో ఎట్టి సంబంధాన్ని పెట్టుకుందామని అనుకుంటున్నావో తెలుసుకుందామని. నిన్ను మా మిత్రుల్లో ఒకణ్ణిగా లెక్కించుకోమన్నావా? లేక నీ జోక్యం పెట్టుకోక మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించమన్నావా?

**ఆంటోనీ :** ఆ జోక్యం కోసమేగదా మీతో మైత్రినాశించి కరచాలనం చేసింది! కానీ దృష్టి సీజర్‌మీద నిలిచినప్పుడు నేను విషయం సర్వం మరిచిపోయినాను. నేను మీ అందరితో మైత్రినే అర్థిస్తున్నాను  అంతే కాదు, మీ యెడ అనురాగం వహిస్తున్నాను ఏ రీతిగా, ఏ కారణంగా సీజర్ అపాయకారి అని మీరు భావించారో నాకు నిరూపిస్తారని ఆశిస్తున్నాను.

**బ్రూటస్ :** కారణాలు చెప్పి మేము నిన్ను తృప్తిపరచలేకపోతే చేసిందొక పాశవిక కృత్య మౌతుంది. మా కారణాలు ఎంతో బలవత్తరమైనవి. నీవే సీజర్‌కు పుత్రుడవై ఉన్నా వాటిని విన్నప్పుడు అవి నిన్ను తృప్తి పరచగలవనే మా నమ్మకం.

**ఆంటోనీ :** నాకు కావలసింది కూడా అదే  మరేమీ మిమ్మల్ని కోరబోను. అంతే కాదు, సీజర్ కళేబరాన్ని విపణి ప్రదేశానికి తీసుకోవెళ్ళి సభావేదికమీద నిల్చి, మిత్రుడికి యోగ్యమైన రీతిగా ఉపన్యసించేటందుకు నా కనుజ్ఞ ఇవ్వవలసిందని మిమ్మల్ని అర్థిస్తున్నాను.

**బ్రూటస్ :** ఆంటోనీ! అందుకు మేము అంగీకరిస్తున్నాం.

**కాషియస్ :** బ్రూటస్! ఒక్కమాట! (అపవారితం) ఏం చేస్తున్నారో మీకు అర్థం కావటంలేదు. సీజర్ అంత్యక్రియల సందర్భంలో ఆంటోనీ ఉపన్యసించ టానికి అంగీకరించకండి. అతడి ప్రసంగం వింటే జనం ఎంతగా చలించిపోతారో మీకు తెలుసునా?

**బ్రూటస్ :** క్షమించు. ముందుగా నేను వేదికెక్కి సీజర్‌ను మన మెందుకు తుదముట్టించామో తెలియజేస్తాను. మా అంగీకారంతోటే ఆంటోనీ ప్రసంగిస్తున్నాడనీ, మా అందరికీ సీజర్ అంత్యక్రియోత్సవాలు సక్రమంగా సాగిపోవటం సంతోషకరమైన విషయమనీ ప్రజలకు ప్రకటిస్తాను. ఇందువల్ల మన సదుద్దేశాలు వారికి అర్థమైపోతాయి. మనకెంతో ప్రయోజనం చేకూరుతుంది.

**కాషియస్ :** ఈ పనివల్ల ఏం జరగనున్నదో నాకేమీ బోధ పడటం లేదు  కానీ ఇది నాకు అణుమాత్రం మనస్కరించటం లేదు.

**బ్రూటస్ :** మార్క్ ఆంటోనీ! ఇదిగో, సీజర్ మృతకళేబరం. విపణి ప్రదేశానికి తీసుకోపో. నీ  ఉపన్యాసంలో మామీద దోషారోపణలు చేయరాదు సుమా! సీజర్‌ను గురించి ఎంతైనా మంచి చెప్పు. – అంతేకాదు, మా అనుజ్ఞతో మాట్లాడుతున్నానని ప్రజలకు

ప్రకటించు. లేకపోతే[26] అతడి అంత్యక్రియోత్సవాలలో నీకు ఎట్టి స్థానముండదు. నేను మాట్లాడిన వేదికమీదనే, నా ప్రసంగం ముగిసిన తరువాతనే నీవు మాట్లాడవలసి ఉంటుంది.

**ఆంటోనీ :** అలాగే కానివ్వండి. అంతకంటే నాకేమీ అవసరం లేదు కూడాను.

**బ్రూటస్ :** అయితే సీజర్ శరీరాన్ని అంత్యక్రియోత్సవాలకు అనుగుణంగా అలంకరించు. మమ్మల్ని అనుసరించు.

**(ఆంటోనీ తప్ప తదితరులంతా నిష్క్రమిస్తారు)**

**ఆంటోనీ :** క్షమించు. రక్తస్రవంతివైన ఓ సీజర్ మృతశరీరమా! నన్ను క్షమించు. ఈ కరకు కసాయివారియెడ పిరికినై మెత్తబడ్డాను క్షమించు. కాలపు ఆటుపోటుల్లో జీవించిన సమస్త మానవకోటిలో ప్రథమోదాత్తుని శిథిలరూపానివి నీవు. నీ అమూల్యరక్తాన్ని ఇలా చిందించిన ఆ హస్తాలకు వినాశం కలుగుగాక! నీ గాయాలు మూగనోళ్ళతో నా కంఠాన్ని విప్పి మాట్లాడమని నన్ను ప్రార్థిస్తున్నవి. ఈ క్షతసంచయం సాక్షిగా మానవజాతి జీవితాల కొక మహాశాపం సంభవింపబోతున్నదని నేను జోస్యం చెపుతున్నాను. ఇటలీ దేశసర్వసీమలనూ అంతర్యుద్ధచ్ఛాయ లాచ్ఛాదితం చేస్తాయి. రక్తపాతం, వినాశం కలుగుతాయి. మహాదారుణ కృత్యాలు సర్వసామాన్యాలై పోతాయి. యుద్ధహస్తాలలో బిడ్డలు చిక్కుబడి, మరణించటం మొదలైన క్రూరచేష్టలు నిత్యోత్పన్నాలు కావటం వల్ల, తల్లులకు వికటాట్టహాసం తప్పనిదౌతుంది. ప్రతీకారవాంఛతో సీజర్ అంతరాత్మ నరకం నుంచీ విచ్చేసే ఏతీ[27] అనే ప్రతీకారదేవత తోడురాగా సర్వసీమల్లో స్వేచ్ఛాసంచారం చేస్తుంది. 'సర్వనాశన' మని క్షాత్రోన్మత్తకంఠంతో వికృతనినాదాలు వెళ్ళబోస్తుంది. అంత్యక్రియలకోసం ఆక్రోశించే మృతకళేబరాల ఆర్తనాదాలతో సమస్త ధరిత్రీమండలం మీద 'సీజర్ హత్య' అనే ఈ నీచకృత్యం వాసిస్తుంది.

**(సేవకుడు ప్రవేశిస్తాడు.)**

నీవు ఆక్టేవిస్ సీజర్ సేవకుడివి కదూ?

**సేవకుడు :** అవును. మార్క్ ఆంటోనీ!

**అంటోనీ :** అతణ్ణి రోముకు రావలసిందని సీజర్ ఉత్తరం వ్రాశాడు కదూ?

**సేవకుడు :** అవును. అది చేరింది. ఆయన వస్తున్నాడు. ఆయన నోటి మాటగా మీతో చెప్పమన్నాడు. (సీజర్ కళేబరాన్ని చూస్తూ) అయ్యో! సీజర్ మహాశయా!

**ఆంటోనీ :** నీ హృదయం అతివిశాలమైందిగా కనిపిస్తున్నది. అవతలికివెళ్ళి సీజర్‌కోసం దుఃఖించు. దుఃఖం అంటువ్యాధి వంటిది. నీ కన్నులను చూచి నా కన్నులు కూడా నీరు కారుస్తున్నవి. మీ ప్రభువు రోముకు వస్తున్నాడా?

**సేవకుడు :** వారు ఈ రాత్రి రోము నగరానికి ఏడు లీగుల దూరంలో ఉంటారు.

**ఆంటోని :** అతివేగంగా వెళ్ళిపో! ఇక్కడ ఏం జరిగిందో చెప్పు. రోము

దుఃఖసముద్రంలో మునిగి ఉంది. మహాప్రమాదకారిగా ఉంది. ఆక్టేవియస్ ప్రవేశించటానికి ఇంకా రోము ప్రమాదరహితం[28] కాదని అతడికి నివేదించు. వెళ్ళు.

కానీ, కొంచెమాగు నేను ఈ మృతశరీరాన్ని విపణి ప్రదేశానికి తీసికోవెళ్ళేదాకా నీవు వెళ్ళవద్దు. అక్కడ నేను నా గంభీరోపన్యాసం మూలంగా రక్తపిపాసువులైన వీరు చేసిన చేష్టను ప్రజలేరీతిగా స్వీకరిస్తారో ప్రయత్నించి చూస్తాను. అది చూచి అనుగుణంగా నీవు యువకుడైన ఆక్టేవియస్‌తో మాట్లాడవచ్చు. ఈ కళేబరాన్ని అక్కడికి చేర్చటానికి నాకు తోడ్పడు.

**(సీజర్ శవంతో నిష్క్రమిస్తాడు)**

## రెండో దృశ్యం

**విపణి ప్రదేశం. బ్రూటస్, కాషియస్ జనసమూహం ప్రవేశిస్తారు.**

**నగరనివాసులు :** మమ్మల్ని తృప్తి పరచాలి తృప్తి పరచండి.

**బ్రూటస్ :** మిత్రులారా! నన్ను అనుసరించండి. నా ప్రసంగం వినండి. కాషియస్, నీవు మరోవీధికి వెళ్ళు. జనాన్ని గుంపులుగా చేరకుండా పంపివెయ్యి. నన్ను వినదలచినవారు ఇక్కడ ఉండండి. కాషియస్ వెంట వెళ్ళదలచనివారు వెళ్ళిపొండి. సీజర్ వధకు కారణాలను బహిరంగం చేస్తాము.

**ప్రథమ పౌరుడు :** నేను బ్రూటస్ ప్రసంగాన్ని వింటాను.

**ద్వితీయ పౌరుడు :** నేను కాషియస్ ప్రసంగాన్ని వింటాను.

**(కాషియస్ కొందరు పౌరులతో నిష్క్రమిస్తాడు.**
**బ్రూటస్ వేదికమీదకు వెళ్ళుతాడు.)**

**తృతీయపౌరుడు :** మహోదారుడు బ్రూటస్ వేదికమీదికి వచ్చాడు. నిశ్శబ్దం.

**బ్రూటస్ :** తుదివరకూ ప్రశాంతంగా ఉండండి. రోము నగర నివాసులారా! దేశీయులారా!! ప్రియులారా!!! నేను వినిపించవలసిన కారణాలకోసం నా ప్రసంగాన్ని నిశ్శబ్దంగా వినండి. నామీద మీకున్న గౌరవాన్ని నిల్పి వినండి. మీరు విశ్వసించటంకోసం నా గౌరవాన్ని గౌరవించండి. విజ్ఞానంతో నా ప్రసంగాన్ని పరిశీలించండి. ఉత్తమరీతిని అవగతం చేసుకోవటానికి మీ జ్ఞాపకశక్తిని మేల్కొల్పండి. ఈ సభాసదుల్లో సీజర్కు మిత్రుడెవరైనా ఉంటే అతడికి నే చెప్పేమాటలివి : “సీజర్ మీద నీకున్న ప్రేమకంటే అతడిమీద నాకున్న ప్రేమ అణుమాత్రం తీసిపోదు.” అయితే ఆ మిత్రుడు నీవు సీజర్కు ఎందుకు వ్యతిరేకంగా తిరిగావని ప్రశ్నిస్తే అతనికి నా సమాధానమిది. ‘నేను వ్యతిరేకంగా తిరిగింది అతడిమీద తక్కువ ప్రేమ ఉండటంవల్ల కాదు రోముమీద అంతకంటే అధికమైన ప్రేమ ఉండటం వల్ల.’ సీజర్ సజీవుడై ఉండి మీరంతా బానిసలుగా మరణించాలని కోరుకుంటున్నారా? సీజర్ ఒకడే మరణించి మీరంతా స్వతంత్రులై జీవించాలె నని కోరుకుంటున్నారా? సీజర్ నన్ను ప్రేమించాడు కనుక అతడి కోసం నేను దుఃఖిస్తాను. అతడు అదృష్టవంతుడైనాడు నేను ఆనందిస్తాను. అతడు వీరగుణోపేతుడు కనుక గౌరవిస్తాను. అతడు ఆశాపరుడైనాడు కనుక అంతమొందించాను. అతడి ప్రేమకు కన్నీరు, అదృష్టానికి ఆనందం, వీరగుణానికి గౌరవం, ఆశాపరతకు మృత్యువు – అన్నీ నాలో ఉన్నాయి. బానిసగా జీవించదలచిన నీచుడిక్కడ ఎవడైనా ఉన్నాడా? ఉంటే రావచ్చు. మాటాడవచ్చు. అతణ్ణి నేను అవమానించి ఆహ్వానిస్తున్నాను. స్వతంత్ర రోమునివాసిగా ఉండదలచుకోని మందబుద్ధి మీలో ఎవరైనా ఉన్నాడా? ఉంటే, రావచ్చు. మాటాడవచ్చు. అతణ్ణి నేను అవమానించి ఆహ్వానిస్తున్నాను. మాతృదేశాన్ని మన్నించి ప్రేమించని ఆటవికుడెవడైనా మీలో ఉన్నాడా? ఉంటే అతడు రావచ్చు. మాటాడవచ్చు. అతణ్ణి పరాభవించి నేనాహ్వానిస్తున్నాను – సమాధానం కోసం క్షణకాలం వేచి ఉంటాను.

**అందరు :** ఎవరూ లేరు, బ్రూటస్, ఎవరూ లేరు!

**బ్రూటస్ :** అయితే నేను ఎవర్నీ, అవమానించలేదన్నమాట! అత్యాశాపరుడ నైనప్పుడు నన్ను మీరందరూ ఏం చేస్తారో అంతకుమించి సీజర్ను నేనేం చెయ్యలేదన్నమాట! ఎట్టి పరిస్థితుల్లో అతడికి మరణాన్ని కల్పించామో ఆ విషయమంతా సభాభవనంలో

గ్రంథస్థం చేసే ఉంచాం. సీజర్ కీర్తిప్రతిష్ఠలను అణుమాత్రమైనా తగ్గించలేదు. మరణాన్ని తెచ్చిపెట్టిన అతడి దోషాలను విశేషంగా ఉటంకించనూ లేదు.

**(సీజర్ మృతకళేబరంతో ఆంటోనీ, ఇతరులూ ప్రవేశిస్తారు.)**

అదిగో, సీజర్ మృతకళేబరం వస్తున్నది. వెంట ఆంటోనీ దుఃఖిస్తూ వస్తున్నాడు. అతడికి సీజర్ వధతో ఎట్టి సంబంధం లేకపోయినా, అతడు మన గణతంత్ర రాజ్యంలో ఉచితపాత్ర వహిస్తాడు. ఆ రాజ్యంలో మీలో ఉచితపాత్ర వహించనివారెవరు గనక? రోము సంక్షేమంకోసం నన్ను అత్యధికంగా ప్రేమించే వ్యక్తిని వధించాను. దేశం కోరుకుంటే నా మరణం కోసం కూడా ఉపయోగించటానికి అదే ఆయుధాన్ని దాచి ఉంచుతాను.

**పౌరులు :** బహుకాలం జీవించు బ్రూటస్, బహుకాలం జీవించు.

**ప్రథమ పౌరుడు :** విజయోత్సవాలతో బ్రూటస్‌ను అతడి ఇంటివరకూ అనుసరిద్దాం.

**ద్వితీయ పౌరుడు :** అతడి వంశీయుల వరుసలో బ్రూటస్‌కు ఒక ప్రతిమను నిలుపుదాం.

**తృతీయ పౌరుడు :** అతణ్ణే సీజర్‌ను చేద్దాం.

**చతుర్థ పౌరుడు :** సీజర్ కుండవలసిన గుణాలన్నీ బ్రూటస్‌ను వరించాయి.

**ప్రథమ పౌరుడు :** కరతాళధ్వనులతో, హర్షనాదాలతో, అతడి ఇంటిదాకా మనం బ్రూటస్‌ను అనుసరిద్దాం.

**బ్రూటస్ :** స్వదేశీయులారా!...

**ద్వితీయపౌరుడు :** ప్రశాంతి. నిశ్శబ్దం. బ్రూటస్ ప్రసంగిస్తున్నాడు.

**ప్రథమ పౌరుడు :** నిశ్శబ్దం! నిశ్శబ్దం!!

**బ్రూటస్ :** గుణవంతులైన దేశీయులారా! నన్ను ఒంటరిగా ఇంటికి వెళ్ళనివ్వండి. మీరు నన్ను అనుసరించనవసరం లేదు. మా అనుజ్ఞ పొంది ఆంటోనీ ప్రసంగిస్తున్నాడు. నాకోసం మీరు అందరూ అతడి ప్రసంగాన్ని వినండి. సీజర్ మృతకళేబరాన్ని గౌరవించండి. నేనొకణ్ణి తప్ప ఆంటోనీ తన ఉపన్యాసాన్ని ముగించేటంతవరకూ ఎవరూ వెళ్ళిపోకండి. మిమ్మల్ని నేను ప్రార్థిస్తున్నాను.

**ప్రథమ పౌరుడు :** సోదరులారా! ఆగండి, మార్క్ ఆంటోనీ ప్రసంగాన్ని విందాం.

**తృతీయ పౌరుడు :** అతడు వేదికను అలంకరించుగాక! మహాశయా, ఆంటోనీ! ప్రజాసనాన్ని స్వీకరించు.

**ఆంటోనీ :** బ్రూటస్ మహాశయునికోసం నేను ప్రసంగించవలసి వచ్చింది.

**(వేదిక మీదికి వెళ్ళుతాడు)**

**చతుర్థ పౌరుడు :** బ్రూటస్‌ను గురించి ఏమిటో అంటున్నాడు.

**తృతీయపౌరుడు :** బ్రూటస్ కోసం తాను ప్రసంగం చేయవలసి వచ్చిందంటున్నాడు.

**చతుర్థ పౌరుడు :** అతడు బ్రూటస్‌కు వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకుండా ఉంటే ఎంతో మంచిది.

**ప్రథమ పౌరుడు :** ఈ సీజర్ నిరంకుశుడు.

**తృతీయ పౌరుడు:** రోముకు ఇతనిపీడ వదలిపోవటం మన అదృష్టం.

**ద్వితీయ పౌరుడు :** నిశ్శబ్దం. ఆంటోనీ ఏం చెపుతాడో విందాం.

**ఆంటోనీ :** మహాశయులారా! రోము పౌరులారా!!

**పౌరులు :** నిశ్శబ్దం. మనం అతడు చెప్పింది విందాం.

**ఆంటోనీ :** మిత్రులారా![29] రోము పౌరులారా!! దేశీయులారా!! ఇంచుక కర్ణదానం చెయ్యండి. మీ శ్రవస్సులకు శ్రమ కలిగిస్తున్నాను. నేను సీజర్ అంత్యక్రియలను జరపటానికి వచ్చాను. ఆయన్ను కీర్తించటానికి రాలేదు. మానవులు చేసే చెడుగులు వారితో అంతరించవు. అవి తదనంతరం కూడా జీవిస్తాయి. కానీ వారి మంచి మరణంతోనే గతిస్తుంది. సీజర్ విషయంలో కూడా ఇంతే ఔగాక! సీజర్ ఆశాపరుడని మహాశయుడు బ్రూటస్ మీకు వెల్లడించాడు. అది నిజమైతే నిజంగా బాధాకరమైన దోషమే! అంతే కాదు, సీజర్ అందుకు బాధాకరమైన ప్రతిఫలాన్ని అనుభవించాడు.

బ్రూటస్, ఆయన అనుచరులైన ఇతరుల అనుజ్ఞతోటే నేను సీజర్ అంత్యక్రియల్లో ప్రసంగించటానికి వచ్చాను.

బ్రూటస్ గౌరవనీయుడు, ఆయన అనుచరులైన ఇతరులందరూ గౌరవనీయులు. సీజర్ నా నెచ్చెలి. విశ్వాస పాత్రుడు. అయినా బ్రూటస్ ఆయన్ను ఆశాపరుడంటున్నాడు

బ్రూటస్ గౌరవనీయుడు. సీజర్ ఎందరినో బందీలను గా రోము నగరానికి కొనివచ్చాడు. వారి ప్రాణపరిహార ద్రవ్యాన్నంతటినీ ప్రజాకోశానికి జమకట్టి దాన్ని నింపివేశాడు. ఇది సీజర్ ఆశాపరత్వమా? దరిద్రులు దుఃఖిస్తే సీజర్ దుఃఖించాడు. ఆశాపరత్వం ఇంతకంటే దారుణమైంది కదా? అయితేనేం బ్రూటస్ ఆయన్ను ఆశాపరుడంటున్నాడు. బ్రూటస్ గౌరవనీయుడు. లూపరకల్ ఉత్సవాలలో ముమ్మారు నేను ఆయనకు రాజకిరీటాన్ని అర్పిస్తే ఆయన ముమ్మారు తిరస్కరించటం మీరు కళ్ళారా చూచారు. ఇది ఆశాపరత్వానికి లక్షణమేనా? అయితేనేం? బ్రూటస్ ఆయన్ను ఆశాపరుడంటున్నాడు  బ్రూటస్ గౌరవనీయుడు. బ్రూటస్ మాట్లాడింది కాదని నిరూపించటానికి నేను ఇక్కడికి రాలేదు  నాకేం తెలుసునో చెప్పటానికి మాత్రమే వచ్చాను. మీరంతా ఒకప్పుడు సీజర్‌ను మనసిచ్చి ప్రేమించారు. కారణం లేకుండా ప్రేమించారా? నేడు మీరు ఆయన మరణానికి దుఃఖించటం లేదు. ఇలా మిమ్మల్ని అరికట్టిన ఆ ప్రబలమైన కారణమేమై ఉంటుంది. నిర్ణయమా! నీవీనాడు వన్యమృగాలను ఆశ్రయించావా?  మానవులు తమ విచక్షణజ్ఞానాన్ని కోల్పోయారా? కాసేపు నా ప్రసంగాన్ని సహించండి. నా హృదయం అదిగో, అక్కడ, ఆ శవపేటికలో సీజర్‌తో బాటు నిలిచిపోయింది.

**ప్రథమ పౌరుడు :** అతడు చెప్పేదాంట్లో ఏదో కొంత నిమిత్త మున్నట్లు నాకు గోచరిస్తున్నది.

**ద్వితీయ పౌరుడు :** విషయాన్ని, నీవు ఉచితరీతిని పరిశీలిస్తే సీజర్‌లో ఏదో దొడ్డదోషం ఉన్నట్లు అవగతమౌతుంది.

**తృతీయ పౌరుడు :** అలాగా! అంతకంటే దుష్టుడైన నిరంకుశుడు అతడి స్థానాన్ని ఆక్రమిస్తాడేమోనని నాకు భయమేస్తున్నది.

**చతుర్థ పౌరుడు :** "అతడు కిరీటాన్ని తిరస్కరించాడు" అన్న ఆంటోనీ మాటను గమనించావా? సీజర్ ఆశాపరుడు కాడనటానికి ఇది నిదర్శనం.

**ప్రథమ పౌరుడు :** సీజర్ ఆశాపరుడు కాదన్న అంశం నిరూపితమైతే, హంతకులు తమ అకృత్యానికి తగ్గ అపరాధాన్ని చెల్లించి తీరవలసిందే.

**ద్వితీయ పౌరుడు :** పాపం! ఏడ్చి ఏడ్చి ఆంటోనీ కన్నులు ఎంత ఎర్రబడి పోయాయి!

**తృతీయపౌరుడు :** ఆంటోనిని మించిన మహోదాత్తుడు రోములేనే లేడు.

**చతుర్థ పౌరుడు :** అడుగో! అతడు మళ్ళీ ప్రసంగాన్ని ప్రారంభించాడు.

**ఆంటోనీ :** కానీ, నిన్నటివరకూ ప్రపంచమంతటా ఒకటైనా సీజర్ మాట నిల్వగలిగింది. ఈ నాడో అతిదీనంగా అతడు తన్ను గౌరవించేవారైనా లేకుండా ఇక్కడ పడి ఉన్నాడు. నేను మీ హృదయాలలో, మనస్సుల్లో విప్లవాన్ని, క్రోధాన్ని రెక్కెల్పే ఉద్దేశం కలవాణ్ణి కాదు. ఐతే బ్రూటస్ యెడ ద్రోహం చేసినవాణ్ణౌతాను కాషియస్ యెడ ద్రోహం చేసినవాణ్ణౌతాను. వారు ఇరువురూ గౌరవనీయులు – మీరందరూ ఎరుగుదురు. నేను వారికి ద్రోహం చెయ్యను. అది నాకిష్టం లేదు. అంతకంటే నేను మరణించిన సీజర్‌కు ద్రోహం చెయ్యటానికీ, నాకు ద్రోహం చేసుకోటానికీ, మీకు ద్రోహం చెయ్యటానికీ ఇష్టపడతాను. ఇదిగో! ఇది సీజర్ ముద్రాంకితమైన అజచర్మలేఖనం.[30] ఆయన అంతర్గృహంలో దొరికింది. ఇది ఆయన ఇచ్ఛాపత్రం! క్షమించండి. కానీ దీన్ని నేను చదవబోవటం లేదు. ఇందులోని విశేషాలు మీరంతా వింటే వెంటనే వెళ్ళి సీజర్ క్షతాలంకృతమైన మృతకళేబరాన్ని ముద్దెట్టుకుంటారు. ఆయన పవిత్రరక్తంలో మీ హస్తవసనాలను ముంచెత్తుకుంటారు. అంతే కాదు, అతని ఒక కేశఖండాన్ని జ్ఞాపకార్థ మర్థిస్తారు. మరణ సమయంలో వ్రాసి ఇచ్చే శాసనపత్రాలల్లో మీ మీ సంతానానికి ఇచ్చిపోతూ ఉన్న అమూల్య వారసత్వంగా దీన్ని తరువాత మీరు పేర్కొంటారు.

**చతుర్థ పౌరుడు :** మార్క్ ఆంటోనీ! మేమా పత్రాన్ని వినాలి. చదువు.

**అందరూ :** ఇచ్ఛాపత్రం! మేము దాన్ని విని తీరాలి.

**ఆంటోనీ :** ప్రియసోదరులారా! శాంతి వహించండి. దాన్ని నేను చదవకూడదు. సీజర్ మిమ్మల్ని ఎంత గాఢంగా ప్రేమించాడో తెలుసుకోవటం సమంజసం కాదు. మీరేమీ దారుమూర్తులుగానీ, శిలాఖండాలు కాని కాదు మానవులు! మానవులు కావటం వల్ల సీజర్ ఇచ్ఛాపత్రాన్ని వింటే ఉద్రేకపూరితు లౌతారు. అది మిమ్మల్ని ఉన్మత్తులను చేస్తుంది. మీరు ఆయనకు వారసులు కారని తెలుసుకోకుండా ఉండటమే మీకెంతో క్షేమాన్ని చేకూరుస్తుంది. ఎందువల్ల నంటారా? విన్నారనుకోండి. అయ్యో! దాని వల్ల ఫలితమేమిటి?

**చతుర్థ పౌరుడు :** ఇచ్ఛాపత్రాన్ని చదువు ఆంటోనీ, అది మేము వినదలిచాం. సీజర్ ఇచ్ఛాపత్రాన్ని చదివి తీరాలి.

**ఆంటోనీ :** మీరు ప్రశాంత చిత్తంతో ప్రవర్తిస్తారా? మరికొంతసేపు శాంతి వహిస్తారా? మీతో ఈ పత్రప్రస్తావన తెచ్చి నేను చాలా హద్దు మీరాను. ఎవరి ఛురికలు సీజర్‌ను పొడిచాయో, ఆ గౌరవనీయులయెడ అపచారం చేస్తున్నానని నాకెంతో భయం వేస్తున్నది.

**చతుర్థ పౌరుడు :** వారు గౌరవనీయులా? ద్రోహులు!

**అందరు :** సీజర్ ఇచ్ఛాపత్రం! ఆయన మరణశాసనం!

**ద్వితీయ పౌరుడు :** వారు ద్రోహులు, హంతకులు. ఇచ్ఛాపత్రమేది? చదువు.

**ఆంటోనీ :** మీరు నన్నీ ఇచ్ఛాపత్రాన్ని చదివి తీరాలని నిర్బంధిస్తున్నారా? అయితే మీరంతా చక్రాకృతిగా సీజర్ కళేబరం చుట్టూ చేరండి. ఈ ఇచ్ఛాపత్రాన్ని వ్రాసిన మహోదారుణ్ని మీకు చూపించటానికి నాకు అవకాశాన్ని కల్పించండి. నేను దిగి రానా? మీరు నాకు అనుజ్ఞ నిస్తున్నారా?

**అందరూ :** దిగిరా!

**ద్వితీయ పౌరుడు :** దిగిరా!

**తృతీయపౌరుడు :** మాకందరికీ ఇది అంగీకారమే.

**చతుర్థ పౌరుడు :** మనమందరం చక్రాకృతిగా నిలుద్దాము.

**ప్రథమ పౌరుడు :** శవపేటికకూ, కళేబరానికీ కొంతదూరంగా నిలవండి.

**ద్వితీయ పౌరుడు :** మహాశయుడు ఆంటోనికి దారి ఇవ్వండి.

**ఆంటోనీ :** మీరు నాకింత సన్నిహితంగా రావద్దు  కొంతదూరంగా ఉండండి.

**ద్వితీయ పౌరుడు :** కొంత వెనక్కు సర్దుకోండి. స్థలం చేయండి. వెనక్కు జరగాలి.

**ఆంటోనీ :** మీకు కన్నీరుందా? ఉంటే కార్చటానికి సిద్ధపడండి. ఈ మహోత్తరీయం మీకు చిరపరిచితమైందే. తొలుతగా సీజర్ దీన్ని ఎప్పుడు ధరించాడో నాకు బాగా జ్ఞాపకం.[31] నెర్వైలమీద విజయాన్ని చేకొన్నరోజున, తన శిబిరంలో ఒకనాటి గ్రీష్మకాలసాయంసమయాన ఆయన దీన్ని ధరించాడు. చూడండి. కాషియస్ ఛురిక దూసుకోపోయింది ఇక్కడే. ఈర్ష్యాపరుడైనా కాస్కా ఎంతటి ఘాతాన్ని కల్పించాడో చూడండి. దీని ద్వారానే అతిప్రియుడైన బ్రూటస్ పొడిచింది. బ్రూటస్ తన ఛురికను బయటికి లాగగానే ఇంత కరుణారహితంగా పొడిచింది బ్రూటస్ ఔనో కాదో తెలుసుకుందామని హఠాత్తుగా తలుపులు తెరుచుకుని వచ్చినట్లు చిమ్మింది సీజర్

రక్తం. ఎందువల్లనంటే మీ అందరికీ తెలుసు  సీజర్‌కు బ్రూటస్ ద్వితీయ రూపమే గదా! ఓ దేవతలారా! నిర్ణయించండి. ఇదే అన్నింటిలోకి అతికరుణావిహీనమైన ఘాతుకమహోదాత్తుడు సీజర్ బ్రూటస్ తన్ను పొడవటం చూచాడు.

కృతఘ్నత ద్రోహుల బాహుదండాలకంటే బలవత్తరంగా కన్పించి తన్ను లోగొంటంవల్ల ఆయన హృదయం బద్దలైపోయింది. తన రక్తంతో ప్లావితమై తడిసి ఉన్న పాంపే ప్రతిమకు అది పాదదేశం అయినప్పటికీ మహత్తరుడు సీజర్ ఒరిగిపడిపోయాడు. ఈ పతనంతో నేనూ, మీరూ, ఇంకా ఇతరులు అందరూ పతనమైనారు. రక్తారుణమైన రాజద్రోహం మనమీద విజయం చేకొన్నది.

అయ్యో! మీరు ఇప్పుడు దుఃఖిస్తున్నారు. మీరందరూ కరుణారసప్రభావానికి లొంగిపోతున్నారా? మీ కన్నీరు ఎంత పవిత్రమైంది? ఓ కరుణారస పూరిత హృదయుల్లారా! ఏమిటి? సీజర్ ఉత్తరీయానికి తగిలిన గాయాలను చూచినంత మాత్రానికే ఇంతగా దుఃఖిస్తున్నారా? చూడండి. హంతకులు పిండలిచేసిన ఆయన్నే చూడండి.

**(ఉత్తరీయాన్ని తొలగిస్తాడు)**

**ప్రథమ పౌరుడు :** ఎంత కరుణాన్విత దృశ్యమిది?

**ద్వితీయపౌరుడు :** మహోదారా! సీజర్ మహాశయా!

**తృతీయ పౌరుడు :** ఎంత దారుణమైన దినమిది?

**చతుర్థ పౌరుడు :** ఓ రాజద్రోహులారా! ఓ కుటిల హంతకులారా!!

**ప్రథమ పౌరుడు :** అతిక్రూర దృశ్యం!

**ద్వితీయ పౌరుడు :** ప్రతీకారం జరిగి తీరవలసిందే!

**అందరు :** ప్రతీకారం! వెతకండి!! వెన్నాడండి!! చంపండి!! హతమార్చండి!! ఈ హంతకులను, ద్రోహులను బ్రతకనివ్వరాదు.

**ప్రథమ పౌరుడు :** శాంతి వహించండి. మహోదాత్తుడు ఆంటోనీ ఏమో అంటున్నాడు వినండి.

**ద్వితీయ పౌరుడు :** అతడు చెప్పేది విందాం  అతణ్ణి అనుసరిద్దాం. అతడితో బాటు అవసరమైతే మరణిద్దాం.

**ఆంటోనీ :** ఉత్తమ మిత్రులారా! ప్రియ స్నేహితులారా!! నన్ను ఇంతటి విప్లవవాహినిని మేల్కొల్పినవాణ్ణిగా చేయవద్దు. ఉద్రేకపడవద్దు.

ఈ కృత్యాన్ని చేసినవారందరూ గౌరవనీయులు. ఈ పనిని చేయటానికి వ్యక్తిగతాలైన వ్యథలు వారి కేమున్నవో నాకు తెలియదు. వారు విజ్ఞానులు : అంతేకాదు గౌరవనీయులు. వారు మనకు తగిన సమాధానాలు చెప్పగలరనే నా నమ్మకం.

మిత్రులారా! నేను మీ హృదయాలను దోచుకోపోవటానికి రాలేదు. బ్రూటస్ మహాశయునివలె నేనేమీ వక్తను కాదు. స్నేహితుణ్ణి గాఢంగా ప్రేమించిన కుటిలవర్తనలేని సూటైన మొరటువాణ్ణి. నాకు బుద్ధిబలం లేదు  మాటలు రావు. విలువ లేనివాణ్ణి కార్యాచరణ శూన్యుణ్ణి. చెప్పలేను. ప్రజారక్తాన్ని ఉడుకెత్తించగల ప్రసంగ ప్రావీణ్యం నాకు లేదు. ఇదంతా వారికి తెలుసు. అందువల్లనే సీజర్‌ను గురించి ప్రసంగించటానికి వారు నాకనుజ్ఞ నిచ్చారు. నేను సూటిగా మాత్రమే మాట్లాడగలను. మీకు తెలిసిన విశేషమే, అయినా చెపుతున్నాను. మీతో నా బదులుగా మాట్లాడమని మధురహృదయుడూ, ప్రియుడూ అయిన సీజర్ మహాశయుని మూగనోళ్ళయిన గాయాలను చూపిస్తున్నాను. కానీ, నేనే బ్రూటస్‌నై, బ్రూటసే ఆంటోనీ అయితే ఆ ఆంటోనీ సీజర్ ప్రతి గాయానికీ ప్రాణం పోసి ఒక నాలుకిచ్చి పలికించి రోములోని శిలాఖండాల నన్నింటికీ చైతన్యాన్ని కల్పించి తిరుగుబాటు చేయింపగలిగి ఉండేవాడు.

**అందరు :** ఇప్పుడు మేమూ విప్లవం చేస్తాం.

**ప్రథమపౌరుడు :** బ్రూటస్ గృహాన్ని దగ్ధం చేస్తాం.

**ద్వితీయపౌరుడు :** అయితే, పదండి! ద్రోహులను వెదకండి.

**ఆంటోనీ :** అయినా, నా మాట వినండి, నన్ను మాట్లాడనివ్వండి.

**అందరు :** శాంతించండి. ఆంటోనీ ప్రసంగం వినండి. అత్యుదాత్తుడు ఆంటోనీని వినండి.

**ఆంటోనీ :** మిత్రులారా! మీరంతా విషయం ఏమిటో తెలుసుకోకుండా ఏమో చేయటానికి వెళ్ళుతున్నారు. సీజర్ మీకు ప్రేమపాత్రుడు ఎందుకైనాడో తెలుసుకున్నారా? అయ్యో! మీకది తెలియదు. ఏమైతేనేం! మీకు నేను దాన్ని తెలియజేస్తాను. మీరు మీ ఉద్రేకంలో నేను చెప్పిన ఇచ్ఛాపత్రాన్ని గురించి మరచిపోయారు.

**అందరు :** సత్యం. ఏది ఆ ఇచ్ఛాపత్రం? మేమందరం ఆగి వింటాం.

**ఆంటోనీ :** ఇదిగో, సీజర్ ముద్రాంకితమైన ఆయన ఇచ్ఛాపత్రం. ప్రతి ఒక్క రోము పౌరుడికీ ఆయన కొంత ఇచ్చి వెళ్ళాడు. వ్యక్తిగతంగా ప్రతి పౌరుడికీ ఆయన డెబ్బది ఐదు డ్రాక్మాల ధనమిచ్చాడు.

**ద్వితీయ పౌరుడు :** అత్యుదాత్తా! సీజర్ మహాశయా!! మే మాయన ఘోర మరణానికి తగ్గ ప్రతీకారాన్ని పొంది తీరుతాం.

**తృతీయపౌరుడు :** రాజఠీవిగల సీజర్ మహాశయా!

**ఆంటోనీ :** ప్రశాంత చిత్తంతో వినండి.

**అందరు :** నిశ్శబ్దం! నిశ్శబ్దం!!

**ఆంటోనీ :** ఆయన తన స్థలాలనన్నిటినీ, తన ఏకాంత ప్రదేశాల నన్నిటినీ, టైబర్ నది ఆవలి ఒడ్డున క్రొత్తగా నాటించుకొన్న వనాల నన్నిటినీ మీ కోసం, మీ భవిష్యత్సంతతివారి కోసం సమష్టి విహారభూములుగా ఇచ్చిపోయాడు. ఆ మహాదానం చేసిన సీజర్ ఇదుగో! ఇటువంటి సీజర్ మళ్లీ ఎప్పుడు జన్మిస్తాడు ఎప్పుడు వస్తాడు?

**ప్రథమ పౌరుడు :** ఎన్నడూ రాడు, రండి! పదండి ఆయన శరీరానికి [32]ఒక పవిత్ర స్థలంలో దహన సంస్కారాన్ని కల్పించి, ఆ కొరువులతో ద్రోహుల గృహాలను దహించి వేద్దాం. పదండి. సీజర్ కళేబరాన్ని ఎత్తుకోండి.

**ద్వితీయ పౌరుడు :** వెళ్ళి అగ్నిని తీసుకోరా!

**తృతీయ పౌరుడు :** ఈ ఆసనాల నన్నింటినీ గుంజివెయ్యండి.

**చతుర్థ పౌరుడు :** ఆసనాలను, వాతాయనాలను, ఏది చిక్కితే దాన్ని గుంజివెయ్యండి.

**(పౌరులు సీజర్ కళేబరంతో నిష్క్రమిస్తారు)**

**ఆంటోనీ :** ఈ ఉద్రేకం ఇక వ్యవహరించుగాక! ద్వేషమా! నీవు పయన మారంభించావు. స్వేచ్ఛానుసారంగా విహరించు.

**(ఒక సేవకుడు ప్రవేశిస్తాడు.)**

ఇదంతా చూస్తున్నావు గదా! ఎలా ఉంది? నీ అభిప్రాయమేమిటోయ్?

**సేవకుడు :** బాబూ! ఆక్టేవియస్ ప్రభువు రోము నగరానికి వచ్చేశారు.

**ఆంటోనీ :** అతడెక్కడున్నాడు?

**సేవకుడు :** లెపిడస్ సీజర్ ఇంట్లో.

**ఆంటోనీ :** అయితే నేను వెంటనే అతణ్ణి కలుసుకోవాలి. సరిగా అతడు నేను కోరుకొంటున్న సమయానికే వచ్చాడు. అదృష్టదేవత మహానందంతో నర్తిస్తున్నది. ఇప్పుడు మనం ఏమి కోరుకుంటే దాన్ని ఇచ్చి తీరుతుంది.

**సేవకుడు :** బాబూ! బ్రూటస్, కాషియస్ ఇరువురూ ఉన్మత్తవేగంతో రోము నగరం నుంచీ వెళ్ళిపోతున్నారని చెప్పుకుంటుంటే విన్నాను.

**ఆంటోనీ :** బహుశః నేను ఏ విధంగా ప్రజలను ఉద్రేకపరిచానో వారు ముందుగా తెలుసుకొని ఉంటారు. నన్ను ఆక్టేవియస్ దగ్గరికి తీసుకోపో.

## మూడో దృశ్యం

**ఒక వీథి, సిన్నా కవి ప్రవేశిస్తాడు.**

**సిన్నా :** సీజర్‌తోబాటు విందులో పాల్గొంటున్నట్లు రాత్రి నాకొక కల వచ్చింది. రాబొయ్యే ఆపదలను గురించి నా మనస్సు కళవళపడుతున్నది. వీథుల్లో తిరగాలెనని నాకు ఆసక్తి లేదు కాని ఏదో నన్ను ఇలా నడిపిస్తున్నది.

**ప్రథమ పౌరుడు :** నీ పేరేమిటి?

**ద్వితీయ పౌరుడు :** నీవు ఎక్కడికి వెళుతున్నావు?

**తృతీయ పౌరుడు :** నీ నివాసం ఎక్కడ?

**చతుర్థ పౌరుడు :** నీవు వివాహితుడవౌనా? కాదా?

**ద్వితీయ పౌరుడు :** అందరి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పు.

**ప్రథమ పౌరుడు :** ఔను. సంక్షిప్తంగా చెప్పు.

**చతుర్థ పౌరుడు :** యోచించి విజ్ఞానయుతంగా చెప్పు.

**తృతీయ పౌరుడు :** సత్యం చెపుతున్నాం నిజం చెపితే నీకే క్షేమం.

**సిన్నా :** నా పేరేమిటా? నేను ఎక్కడికి వెళ్ళుతున్నానా? ఎక్కడ నివసిస్తున్నానా? వివాహితుడను ఔనా కదా? ప్రతి ఒక్కదానికీ సూటిగా, సంక్షిప్తంగా, జ్ఞానయుతంగా,

సత్యంగా సమాధానాలు చెప్పాలా? – జ్ఞానినై చెపుతున్నాను  నేను వివాహితుడును కాను.

**ద్వితీయ పౌరుడు :** అంటే వివాహం చేసుకున్నవాళ్ళు బుద్ధిహీనులని నీ భావమన్నమాట! ఇలా అయితే నీవు నా చేతిలో దెబ్బలు తింటావు. సూటిగా సమాధానం చెప్పు.

**సిన్నా :** సూటి సమాధానం కావాలా? నేను సీజర్ అంత్యక్రియల దగ్గరికి వెళ్ళుతున్నాను.

**ప్రథమ పౌరుడు :** మిత్రుడివి గానా? శత్రుడిగానా?

**సిన్నా :** మిత్రుడిగానే!

**ద్వితీయ పౌరుడు :** ఈ విషయంలో సూటిగా సమాధానం చెప్పాడు.

**చతుర్థ పౌరుడు :** మరి నీ నివాసం. సూటిగా చెప్పు.

**సిన్నా :** సూటిగానా – సభాభవనం ప్రక్కనే.

**తృతీయ పౌరుడు :** సత్యం చెప్పు, నీ పేరు?

**సిన్నా :** సత్యంగా నా పేరు సిన్నా.

**ప్రథమ పౌరుడు :** ఇతణ్ణి ముక్కల క్రింద చీల్చివేయండి. ఇతడు ఒక హంతకుడు!

**సిన్నా :** నేను సిన్నా కవిని  సిన్నా కవిని.

**చతుర్థ పౌరుడు :** చెడ్డకవిత్వం చెప్పినందుకు అతణ్ణి చీల్చివేయండి. ముక్కల క్రింద చీల్చివేయండి.

**సిన్నా :** నేను ద్రోహినైన సిన్నాను కాను!

**చతుర్థ పౌరుడు :** అయితేనేం? అతడి పేరు సిన్నా. అతడి గుండెలోనుంచి ఆ[33] పేరును లాగివేయండి. ఆ తరువాత వెళ్ళిపోనివ్వండి.

**తృతీయపౌరుడు :** చీల్చండి, చీల్చండి. తెండి, నిప్పుకాగడాలు. బ్రూటస్ ఇంటికి పొండి. కాషియస్ ఇంటికి పొండి. సర్వం దగ్ధం చేద్దాం. కొందరం  డెషియస్ ఇంటికి వెడదాం. కొందరం కాస్కా ఇంటికీ, కొందరం లిగారియస్ ఇంటికీ పోదాం. పదండి! వెళ్ళండి!!

**(అందరు నిష్క్రమిస్తారు)**

# చతుర్థాంకం

## ఒకటో దృశ్యం

రోములో ఒక గృహం. ఆంటోనీ, ఆక్టేవియస్, లెపిడస్ ఒక బల్లముందు కూర్చొని ఉంటారు.

**ఆంటోనీ :** వీరందరూ మరణించి తీరాలి. మరణం కోసం వీరి పేర్లను గుర్తు పెట్టండి.

**ఆక్టేవియస్ :** మీ అన్న కూడా మరణించాలి. అంగీకరించావా లెపిడస్?

**లెపిడస్ :** ఆఁ అంగీకరిస్తున్నాను.

**ఆక్టేవియస్ :** ఆంటోనీ, అతణ్ణి కూడా గుర్తుపెట్టు.

**లెపిడస్ :** ఆంటోనీ మీ మేనల్లుడు పబ్లియస్ సజీవుడుగా ఉండరాదనే షరతు మీద నేను ఇందుకు అంగీకరిస్తున్నాను.

**ఆంటోనీ :** అవును. అతడు సజీవుడై ఉండరాదు. ఇదిగో చూడు. ఒక్క చుక్కతో నేనే వాణ్ణి నాశనం చేస్తున్నాను. అయితే, లెపిడస్, నీవు సీజర్ ప్రాసాదానికి వెళ్ళు. ఆయన ఇచ్ఛాపత్రాన్ని ఇక్కడికి తీసుకోరా. మనం అందులోని వారసత్వాలలో ఒక భాగాన్ని ఎలా రద్దు చేయటమో ఆలోచిద్దాం.

**లెపిడస్ :** మీరు ఇక్కడనే ఉంటారా మరి?

**ఆంటోనీ :** ఇక్కడగానీ, సభాభవనం ముందుగానీ ఉంటాం.

**(లెపిడస్ నిష్క్రమిస్తాడు)**

ఇతడు ఎంతో అయోగ్యుడు. ఇటువంటి[34] పనులకు మాత్రమే పంపదగ్గవాడు. ప్రపంచాన్ని మూడు భాగాలుగా పంచుకొనేటప్పుడు ఇతడు అందులో ఒక భాగానికి అర్హుడౌతాడా?

**ఆక్టేవియస్ :** అలా భావించింది నీవే కదా! ద్రోహులను నిర్ణయించేటప్పుడు పట్టికలో అతడు కోరిన వ్యక్తులను కూడా చేర్చి ఆ యోగ్యతను కల్పించింది నీవే.

**ఆంటోనీ :** ఆక్టేవియస్! లోకంలో నేను నీకంటే ఎక్కువ కాలం జీవించాను. ఎక్కువ అనుభవాన్ని సంపాదించాను. మన అపకీర్తి భారాన్ని తగ్గించుకోవటం కోసం ఇతడికీ

గౌరవాన్ని కల్పించినా, గాడిద బంగారాన్ని మోసే సందర్భంలోలాగా ఇతడికి దాని భారం వల్ల గింజుకోవటం, చెమట పట్టటం తప్ప ఏమీ చెందకుండా ఉండాలి. ఆ భారవహనాన్నైనా మనం చెప్పినట్లు చెయ్యవలసిందే.

**ఆక్టేవియస్ :** నీ ఇష్టానుసారంగా జరిగించు కానీ అతడు కాకలు తేరినవాడు వీరయోధుడు.

**ఆంటోనీ :** నా అశ్వం కూడా అటువంటిదే. అది నాకు చేసే సేవకు నేను దానికి తగినంతగా ఆహారమిస్తాను. పోరాడటం. గాలిలో విహరించటం, ఆగటం, సూటిగా పరిగెత్తటం అన్నీ నేను నేర్పుతాను. దాని సర్వావయవసంచలనాన్నీ నా ఇచ్ఛ పాలిస్తుంది. కొంతవరకు లెపిడస్ కూడా ఇంతే. అతడు ఇట్టి జంతువు మాత్రమే. నా అధికారంలోనే ఉంటున్నాడు. మందబుద్ధి! సర్వం బోధించి, శిక్షణ ఇచ్చి ఇలా నడుచుకోమని ఎవరో ఒకరు ఆజ్ఞాపించవలసిందే. అతడెప్పుడూ ఇతరులు త్రొక్కివిడిచిన పాతపుంతలు పట్టుకొని పయనిస్తుంటాడు  ఇతరులను అనుకరించేవాడేగాని స్వతంత్రశక్తి కలవాడు కాడు. ఇతణ్ణి గురించి ఒక సాధనంగా మాత్రమే భావించి వ్యవహరించు.

ఆక్టేవియస్! కొన్ని మహత్తర విషయాలున్నవి. అవి విను. బ్రూటస్, కాషియస్ సైన్యాల మీద అధికారం వహిస్తున్నారు. మనం వెంటనే వారిని ఎదుర్కోను పోవాలి. ఇందుకోసం మనం ఒక బంధుబృందంగా ఏర్పడాలి. మన మిత్రులెవరో వారినందరినీ సమకట్టాలి. సాధన సామగ్రులను సంతన చెయ్యాలి. రహస్యతంత్రాలను తెలుసుకోటానికీ, బహిరంగంగా ఎదుర్కోనున్న అపాయాలకు ఎదురు నిల్చి సమాధానాలు చెప్పటానికీ మనం వెంటనే ఒక పరిషత్తును ఏర్పాటు చెయ్యాలి.

**ఆక్టేవియస్ :** తప్పకుండా వెంటనే ఏర్పాటు చేయిద్దాం. ఇప్పుడు మనం శత్రువుల మధ్య కట్టుకొయ్యలకు బంధింపబడి, వేటకుక్కలు చుట్టూ నిలువగా ఉన్న ఎలుగుబంట్లలా ఉన్నాం. మనముందు మందహాసం చేసే కొంతమంది హృదయాలలో కోటానకోటి కుతంత్రాలున్నవని నాకు అనుమానంగా కూడా ఉంది.

## రెండో దృశ్యం

బ్రూటస్ శిబిరం ముందు, భేరీధ్వనులు వినిపిస్తుంటాయి. బ్రూటస్, లూసిలియస్, లుసిల్లస్ ఇతర సైనికులు ప్రవేశిస్తారు. టిటినియస్, పిండారస్ వారిని కలుసుకుంటారు.

**బ్రూటస్ :** ఆగండి!

**లూసిలియస్ :** సైన్యాలకు ఆజ్ఞను అందజేయండి  ఆగండి.

**బ్రూటస్ :** కాషియస్ వచ్చేశాడా ఏమిటి?

**లూసిలియస్ :** చాలా దగ్గరకు వచ్చేశాడు. తమ యజమానికి ప్రత్యా మ్నాయంగా మీకు ప్రణతులర్పించటానికి పిండారస్ వచ్చాడు.

**బ్రూటస్ :** అతడు వచ్చి క్రమరీతిని ప్రణతులర్పించవచ్చు. పిండారస్! తనలో కలిగిన మార్పువల్లనో, కొందరు దుష్టోద్యోగుల ప్రేరణవల్లనో, కొన్ని అకృత్యాలు చేసి బాధ కలిగించాడు. అయినా, అతడు దగ్గిర ఉంటే తగ్గ సంజాయిషీ తీసుకుండేవాణ్ణి.

**పిండారస్ :** ఉదాత్తుడైన మా యజమాని స్వతస్సిద్ధమైన ఆయన సుగుణానికి అనుగుణంగానే మహోద్దేశాలు పెట్టుకొని ప్రవర్తించినట్లే కనిపిస్తున్నారు.

**బ్రూటస్ :** ఆ విషయంలో అతని యెడ ఎవరికీ సంశయం లేదు. లూసిలియస్! అతడు నన్ను ఎలా ఆహ్వానించాడో నివేదించు.

**లూసిలియస్ :** తగిన కృతజ్ఞతాగౌరవాలతో ఆహ్వానించాడు గాని, పూర్వం ఆయన చూపించే అతి పరిచయాన్ని గానీ, మిత్రభావాన్ని గానీ ప్రదర్శించలేదు.

**బ్రూటస్ :** ఈ నీ వర్ణనను బట్టి అనురాగ పూర్వకమైన మైత్రి అతడిలో చల్లారిపోతున్నట్లు అర్థమౌతున్నది. లూసిలియస్! గమనించు. ఎప్పుడైతే ప్రేమ చల్లారిపోవటం ప్రారంభిస్తుందో అప్పుడు అది కృత్రిమరూపాన్ని ధరిస్తుంది. స్వచ్ఛమైన మైత్రికి అటువంటి కృత్రిమత్వం అనేది ఉండనే ఉండదు. చేయివేసి ఉంచినంతవరకూ తమ ప్రతిభావిశేషాలను ప్రకటించుకోటం కోసం అశ్వాల్లా అత్యుత్సాహాన్ని ప్రకటిస్తారు. పరీక్షకు నిలవవలసినప్పుడు బోర ముంగిల పారేసి మొండి తట్టులా క్రుంగిపోతారు. కాషియస్ సైన్యంతోటే వస్తున్నాడా?

**లూసిలియస్ :** ఈ రాత్రికి సార్డిన్[35]లో బస చేద్దామన్నాడు. ఆశ్వికసైన్యంలో అధికారం ఆయన వెంటనే ఉన్నది.

**(నేపథ్యంలో ఆశ్విక సైన్యం వస్తున్న ధ్వనులు)**

**బ్రూటస్ :** ఇష్. అతడు వచ్చేశాడు. అతడికోసం ప్రశాంతంగా ఎదురు వెళదాం.

**కాషియస్, అతని సైనికులూ ప్రవేశిస్తారు.**

**కాషియస్ :** ఓహో సైనికులారా! నిలవండి, ఆగిపొండి.

**బ్రూటస్ :** ఓహో సైనికులారా! నిలవండి, ఆగిపొండి. ఆగిపొమ్మనే ఆజ్ఞను సైన్యాల కందజేయండి!

**ప్రథమ సైనికుడు :** ఆగిపొండి!

**ద్వితీయ సైనికుడు :** ఆగిపొండి!

**తృతీయ సైనికుడు :** ఆగిపొండి!

**తృతీయ సైనికుడు :** ఆగిపొండి!

**కాషియస్ :** బావగారూ! మీరు నాకు అపచారం చేశారు.

**బ్రూటస్ :** దేవతలారా! ఈ అభియోగాన్ని మీరు విచారించండి. నా శత్రువులకైనా అపచారం చేయలేనే? అట్టి స్థితిలో నా బావమరదివైన నీకు నేనెలా అపచారం చేయగలుగుతాను?

**కాషియస్ :** మీరు చేసిన చెడ్డపనులకు మీ ప్రశాంత ప్రవర్తన మంచిముసుగులా ఉంది. వాటిని మీరు చేసేటప్పుడు...

**బ్రూటస్ :** కాషియస్! ఉద్రేకాన్ని పొందకు. నీకేవైనా బాధలుంటే ప్రశాంత చిత్తంతో తెలియజెయ్. నిన్ను నేను బాగా ఎరుగుదును. గాఢంగా మనలను ప్రేమించే మన ఉభయ సైన్యాలముందు మనం వివాదపడవద్దు. నీ సైన్యాలను పంపించివెయ్యి. తరువాత నీ బాధలేమిటో చెప్పు నేను వింటాను.

**కాషియస్ :** పిండారస్! మన సేనానాయకులను సైన్యాలను ఈ ప్రదేశానికి కొంతదూరంగా నిలుపమని ఆజ్ఞాపించు.

**బ్రూటస్ :** లూషియస్, మన సైన్యాలను గూడా అలాగే దూరంగా నిలుపు. మా ఇరువురి సంభాషణా పూర్తి అయ్యేదాకా నా శిబిరంలోకి ఎవరినీ ప్రవేశపెట్టవద్దు. ద్వారం వద్ద లుసిల్లియస్, టిటినియస్‌లను కాపలా ఉంచు.

## మూడో దృశ్యం[36]

**బ్రూటస్ గుడారంలో, బ్రూటస్, కాషియస్ ప్రవేశిస్తారు.**

**కాషియస్ :** సార్డియన్ల వద్ద లంచాలు తీసుకొన్నాడని లూషియస్ పెల్లాను[37] దోషిగా భావించి, విచారించి, శిక్ష చెప్పి మీరు నాయెడ ద్రోహం చేశారు. అతడు గౌరవనీయుడని

నాకు తెలియటం వల్ల అతణ్ణి వదలిపెట్టవలసిందని ఎన్నోమార్లు మిమ్మల్ని లేఖల మూలంగా ప్రార్థించాను.

**బ్రూటస్ :** ఈ విషయంలో లేఖలు వ్రాసి నీకు నీవే ద్రోహం చేసుకున్నావు.

**కాషియస్ :** ప్రతి స్వల్ప విషయాన్నీ ఇలా దోషంగా నిరూపించటానికి ఇది తగ్గ సమయం కాదు.

**బ్రూటస్ :** ఈ లంచగొండితనం అనే దోషం నీలో కూడా ఉందని నేను విస్పష్టంగా చెప్పక తప్పదు. బంగారానికి ఆశ పడి నీవు మంచి ఉద్యోగాల నన్నిటినీ అయోగ్యులైన వారికి అమ్మావు.

**కాషియస్ :** ఏమిటీ? నాలో లంచగొండితనముందా? ఈ మాట్లాడేది బ్రూటస్ అని తెలుసుకుంటే మీరు ఇలా పలికేవారు కారు.

**బ్రూటస్ :** కాషియస్ పేరు లంచగొండితనంతో సంబంధం పెట్టుకొని, దానికి గౌరవాన్ని ఆపాదిస్తున్నది. అందువల్ల శిక్షాకాంక్ష సిగ్గుతో తలవంచుకోవలసి వచ్చింది.

**కాషియస్ :** ఏమిటి? శిక్షించటాన్ని గురించి ఆలోచిస్తున్నారా?

**బ్రూటస్ :** ఔను. మార్చి నెల జ్ఞప్తికి తెచ్చుకో. మార్చి పదిహేనును జ్ఞప్తికి తెచ్చుకో. ఘనుడైన జూలియస్ ఆ నాడు న్యాయం కోసమేగదా తన రక్తాన్ని స్రవింపజేసుకొన్నది! న్యాయం కోసం కాక క్రౌర్యంతో అతణ్ణి పొడిచిన ద్రోహి ఆ నాడు ఒక్కడైనా ఉన్నాడా? ప్రపంచంలోకెల్లా ప్రథమ గణ్యుడైన ఆ వ్యక్తిని హతమార్చింది బందిపోటు దొంగలకు సాయపడటం కోసమేనా? మన అనంత గౌరవాన్ని పణం పెట్టి, మన హస్తాలను లంచగొండితనంతో మలినం చేసుకోవటానికేనా? ఆ పని చేసింది ఇందుకే ఐతే నేను అట్టి ఒక రోము పౌరునిమీద పడటం కంటే శ్వానాన్నై జన్మించి చంద్రుణ్ణి[38] చూచి మొరుగుతూ ఉండేవాణ్ణి.

**కాషియస్ :** బ్రూటస్, నన్ను ఒత్తిడి చెయ్యవద్దు  ఇది నేను సహించను. ఎలా నేను వ్యవహరించాలో ఆదేశిస్తూ నీవు నేనెవర్నో మరిచిపోతున్నావు. నేను బహుకాలానుభవం ఉన్న సైనికుణ్ణి. ఏర్పాట్లు చేయటంలో నీకంటే సమర్థుణ్ణి.

**బ్రూటస్ :** కాషియస్, ఇక చాలు. అంతటితో ఆపు. ఈ విషయంలో నీవు సమర్థుడివి కావు.

**కాషియస్ :** నేను సమర్థుణ్ణి!

**బ్రూటస్ :** సమర్థుడివి కావని నా అభిప్రాయం.

**కాషియస్ :** ఇక ఉద్రేకపరచవద్దు. నన్ను నేను మరిచిపోవచ్చు. నీ శరీరవిషయం శ్రద్ధ తీసుకో. నన్ను ఇక విశేషంగా కదిలించకు.

**బ్రూటస్ :** అల్పుడా! ఇక వెళ్ళిపో.

**కాషియస్ :** అది ఎలా సాధ్యపడుతుంది?

**బ్రూటస్ :** అయితే విను. నీ ఉద్రేకాలకు నేను లొంగిపోవలసిందేనా? ఒక ఉన్మత్తుడు ఉరిమిచూస్తే బెదరిపోవలసిందేనా?

**కాషియస్ :** దేవతలారా! ఇదంతా నేను సహించి తీరవలసిందేనా?

**బ్రూటస్ :** ఇంతేనా? ఇంకా సహించవలసి ఉంటుంది. మహాగర్వంతో కన్నులుగానని నీ హృదయం బ్రద్దలయ్యేటంతవరకూ కోపాన్ని వెలిగ్రక్కు. నీకెంతటి కోపశక్తి తీవ్రత ఉందో నీ బానిసలకు చూపించు. వారిని గజగజలాడించు. నేను నీ కోపతాపాలను కనిపెట్టి నడుచుకోవాలా? నీ కోపేచ్ఛానుసారంగా నేను వంగి లేవాలా? దేవతలు సాక్షిగా చెప్పుతున్నాను. ఎంతటి కష్టమైనా సరే నీ ప్లీహం[39]లోని విషాన్ని జీర్ణించుకో! ఈ నాటినుంచీ నీవు కోపం తెచ్చుకున్నప్పుడు నాకు ఉత్సాహాన్ని కల్పించటానికి అలా పరిహాసకుడిలా నటించి నవ్విస్తున్నావని భావిస్తాను.

**కాషియస్ :** అయితే వ్యవహారం ఇంతదాకా వచ్చిందన్నమాట!

**బ్రూటస్ :** నేను నీకంటే గొప్ప యోధుణ్ణన్నావు, నిరూపించు, నీ ప్రగల్భాలు సత్యాలని నిరూపించు. అప్పుడు నేను సంతోషిస్తాను. నా విషయం చెపుతున్నాను, విను నాకంటే ఉదాత్తుడైన వ్యక్తిదగ్గిరనుంచీ నేర్చుకోవటానికి నేనెప్పుడూ సంసిద్ధమే.

**కాషియస్ :** నన్ను అవమానిస్తున్నావు బ్రూటస్! నీవు నన్ను సర్వరీతులా అవమానిస్తున్నావు. నేను నీకంటే వృద్ధ సైనికుడ నన్నాను గొప్ప సైనికుడనని అనలేదు. అన్నానా?

**బ్రూటస్ :** నీవు అన్నా నేనేమీ లక్ష్యం చెయ్యను!

**కాషియస్ :** సీజర్ సజీవుడై ఉన్ననాళ్ళల్లో ఆయనకూడా నాకెప్పుడూ ఇంతగా కోపాన్ని తెప్పించటానికి సాహసించలేదు.

**బ్రూటస్ :** ఆగు. నీవు ఆయనకు కోపం తెప్పించటానికి సాహసించి ఉండవు.

**కాషియస్ :** నేను సాహసించి ఉండేవాణ్ణి కానా?

**బ్రూటస్ :** కావు!

**కాషియస్ :** ఏమిటీ? నేను సాహసించి ఉండేవాణ్ణి కానా?

**బ్రూటస్ :** నీకు జీవితంమీద తీపి ఉండడం వల్ల, సాహసించి ఉండేవాడివి కావు.

**కాషియస్ :** బ్రూటస్! నీయెడ నాకున్న ప్రేమమీద ఎక్కువ ఆశపెట్టుకోకు. తరువాత చింతపడవలసి వచ్చే కృత్యాన్ని దేన్నైనా నేను చెయ్యవచ్చు.

**బ్రూటస్ :** చింతపడదగ్గపనిని పూర్వమే చేశావు. నేను అతిభద్రమైన సత్యకవచాన్ని ధరించాను. కాషియస్, నీ బెదిరింపులకు నేనేమీ బెదరను. అవి వాచాలాలైన వాయువుల్లా నా ముందుగా వెళ్ళిపోతాయి. చెడ్డమార్గాలలో చేకూర్చుకోలేనందువల్ల నేను కొంత ధనంకోసం నీ దగ్గరికి పంపించాను. ఇవ్వటానికి నీవు తిరస్కరించావు. కష్టజీవులైన కర్షకుల వద్దనుంచీ దుష్టమార్గాలలో ధనాన్ని సంపాదించేదాని కంటే, నా హృదయాన్ని, రక్తమాంసాలను నా ప్రాణాలక్రిందికి మారుస్తాను. నా సైన్యాలకు భత్యాలివ్వటానికి ధనంకోసం నీ దగ్గరికి పంపించాను  నీవు నిరాకరించావు. ఈ పనిని కాషియస్‌లాగానే చేశావా? కేయస్ కాషియస్ అడిగితే నేను అలాగే నిరాకరించేవాణ్ణా? మార్కస్ బ్రూటస్ లోభిగా పరిణమించి తుచ్ఛమైన ధనాన్ని గుప్తం చేసేటట్లయితే ఓ దేవతల్లారా! సమస్తమైన ఉల్కలనూ అతడిమీద విసరటానికి సంసిద్ధులు కండి  అతణ్ణి ఛిన్నాభిన్నం చెయ్యండి.

**కాషియస్ :** ధనమివ్వటానికి నేను నిరాకరించలేదు.

**బ్రూటస్ :** నిరాకరించావు.

**కాషియస్ :** నిరాకరించలేదు. నా సమాధానాన్ని మీ దగ్గిరికి తీసుకోవచ్చినవాడు మందబుద్ధి. బ్రూటస్, మీరు నా హృదయాన్ని కలచివేశారు. మిత్రుడైనవాడు స్నేహితుని దోషాలను సహించాలి. కానీ బ్రూటస్ నా దోషాలను ఉన్నవాటికంటే ఎన్నోరెట్లు అధికం చేస్తున్నాడు.

**బ్రూటస్ :** లేదు, నీవు వాటిని నా మీద ప్రయోగించనంతవరకూ చేయలేదు.

**కాషియస్ :** మీరు నన్ను ప్రేమించటం మానివేశారా?

**బ్రూటస్ :** నీ దోషాలంటే నాకిష్టం లేదు.

**కాషియస్ :** మిత్రుని కంటికి ఆ దోషాలు కనిపించనే కనుపించవు.

**బ్రూటస్ :** అవి ఒలింపస్ పర్వతాలవలె దొడ్డవై కనిపిస్తున్నా, స్తుతి పాఠకుడు గమనించడమే కాని, వాటిని సత్యసంధుడైన ఉత్తమమిత్రుడు గుర్తించకుండా ఉండలేడు.

**కాషియస్ :** ఆంటోనీ, రా! యువకుడా, ఆక్టేవియస్ రా! ప్రపంచమంటే కాషియస్ విసిగిపోయాడు. రండి, మీ ప్రతీకారాన్ని తీర్చుకోండి. తాను హృదయ పూర్వకంగా ప్రేమించిన వ్యక్తి, అతడి బావ, అతణ్ణి అసహ్యించుకుంటున్నాడు. అతడి సోదరుడు. అతణ్ణి సేవకుణ్ణి తిట్టినట్లు తిడుతున్నాడు. అతడు నా ముఖాన దులపటానికి నా దోషాల నన్నింటినీ గమనించాడు. గ్రంథస్థం చేశాడు. చదివి కంఠస్థం చేశాడు.

అబ్బా! నేను నా కన్నుల్లోనుంచి జీవనజ్యోతిని తొలగించుకోగలను. ఇదే నా వక్షఃస్థలం. ఇందులో ప్లూటస్‌గని[40] కంటే, కనకం కంటే, ప్రియమైన నా హృదయముంది. ఇదిగో నా ఛురిక! బ్రూటస్ మహాశయా! మీరు రోము పౌరులే అయితే అందుకోండి. దాన్ని అందుకోండి. ధనాన్ని నిరాకరించిన నేను మీకు హృదయాన్నిస్తున్నాను. పొడవండి. మీరు పూర్వం సీజర్ నెలా పొడిచారో అలాగే పొడవండి. నాకు తెలుసు – అతణ్ణి అత్యధికంగా అసహ్యించుకుంటున్నప్పుడే, మీరు కాషియస్‌ను ఎన్నడూ ప్రేమించనంతటి అధికంగా ప్రేమించారు.

**బ్రూటస్ :** నీ ఛురికను ఒరలో నిల్పు. నీవు కోపగించదలచినపుడు కోపగించు. అది స్వేచ్ఛగా వ్యవహరించదలచుకొన్నప్పుడు వ్యవహరించనీ. నీవు నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించు. నీవు చేసిన అప్రతిష్ఠాకరమైన ఏ కృత్యాన్నైనా నేనొక తాత్కాలికచేష్టగా భావిస్తాను. కాషియస్, నీవు గొఱ్ఱెవంటి సౌమ్యునితో జోడుకోడె వైనావు. అతడి కోపం క్షణకాలం. అది చెకుముకి రాయి నిప్పు రవ్వలు ధరించినంత కాలం మాత్రమే ఉంటుంది. చాలా గట్టిగా కొట్టినప్పుడు ఒక రవ్వను పొందుతుంది. వెంటనే చల్లారిపోతుంది.

**కాషియస్ :** కాషియస్ తన దుఃఖంతో, కోపంతో మీకు విలాసాన్నీ, హాస్యాన్నీ కల్పించటానికి జీవించి ఉన్నాడన్న మాట!

**బ్రూటస్ :** ఆ మాట అన్నప్పుడు నా మానసికస్థితి ఏమీ బాగాలేదు.

**కాషియస్ :** ఇంతవరకైనా ఒప్పుకుంటున్నారు. ఏదీ మీ హస్తాన్ని ఇలా అందించండి.

**బ్రూటస్ :** నా హస్తాన్నే కాదు  హృదయాన్ని కూడా అందిస్తాను.

**కాషియస్ :** బ్రూటస్ మహాశయా!

**బ్రూటస్ :** విషయమేమిటి?

**కాషియస్ :** ఈ మీ మిత్రుడికి మాతృగర్భంలోనే అబ్బిన కోపం అతణ్ణి మరిపించిన వేళ కూడా సహించగలిగినంతటి గాఢానురాగం నా మీద మీకు లేదా?

**బ్రూటస్ :** లేకేం? కాషియస్ ఇకముందు నీకు కోపం వస్తే నీ స్నేహితుడు బ్రూటస్ దాన్ని మీ తల్లివల్ల సంక్రమించిన గుణంగా భావించి సహిస్తాడు.

**కవి :** (లోపల) సేనాపతులను చూడటానికి వెళ్ళనివ్వండి. వారిమధ్య ఏదో కలహం వచ్చినట్లుంది. వారిని ఒంటరిగా ఉండనీయటం సమంజసం కాదు.

**లూషియస్:** (లోపల) నీవు వెళ్ళటానికి అనుజ్ఞ లేదు.

**కవి :** (లోపల) మృత్యువు తప్ప నన్నేమీ ఆపలేదు!

**లూసిల్లియస్, టిటినియస్, లూషియస్‌లతో కవి ప్రవేశిస్తాడు.**

**కాషియస్ :** విశేషాలేమిటి? ఎందుకొచ్చారు

**కవి :** మీ ప్రవర్తనకు మీరు సిగ్గుపడండి. సేనాపతులారా! ఇలా కలహించుకోటంలో మీ అభిప్రాయమేమిటి? మీవంటి ఇరువురు వ్యక్తులు ఉండవలసిన రీతిగా ఉండి అన్యోన్యం అనురాగం వహించండి. 'ఎక్కువకాలం బ్రతికినవాణ్ణి  విశేషాలు నే చూచినవాణ్ణి'.

**కాషియస్ :** హఁ, హఁ, హఁ. అంత్యప్రాసతో పాదాలను అతిక్షుద్రంగా పారేశాడు.

**బ్రూటస్ :** ఛీ! అవివేకీ! అవతలికి వెళ్ళిపో!

**కాషియస్ :** బ్రూటస్ మహాశయా! శాంతి వహించండి. సహించండి. ఇది అతడి శైలి.

**బ్రూటస్ :** సమయోచితజ్ఞానం వీడికున్నట్లయితే ఈ హాస్యాన్ని అవగతం చేసుకోగలిగేవాణ్ణి. యుద్ధసమయాలలో బుద్ధిహీనులైన ఇటువంటి హాస్యకవులకు తావులేదు. వెళ్ళవయ్యా, వెళ్ళు!

**కాషియస్ :** వెళ్ళిపోవయ్యా! వెళ్ళు!!

**బ్రూటస్ :** లూసిల్లియస్! టిటినియస్!! ఈ రాత్రి తమ సైన్యాలను నిలపటానికి డెరిజాలను వేయించవలసిందని సేనానాయకులను ఆజ్ఞాపించండి.

**కాషియస్ :** మీరు మీ సెల్లాను వెంటబెట్టుకొని తత్క్షణమే మా దగ్గిరకు రండి.

**(లుసిల్లియస్, టిటినియస్ నిష్క్రమిస్తారు)**

**బ్రూటస్ :** లూషియస్! ఒక చషకంనిండా ద్రాక్షాసవాన్ని తీసుకో రా.

**కాషియస్ :** మీకు ఇంత కోపం వస్తుందని నేను ఎన్నడూ భావించలేదు.

**బ్రూటస్ :** కాషియస్! అనేకబాధలవల్ల నేను మాములుగా లేను.

**కాషియస్ :** ఏవో తాత్కాలికాలైన బాధలకు నీవు లొంగిపోతే తత్త్వజిజ్ఞాసవల్ల మీరు పొందిన ప్రయోజనమేముంది?

**బ్రూటస్ :** కాషియస్! ప్రస్తుతం బ్రూటస్‌కంటే అధికదుఃఖాన్ని ఎవరూ భరించటం లేదు. పోర్షియా మరణించింది –

**కాషియస్ :** ఏమిటి! పోర్షియా మరణించిందా?

**బ్రూటస్ :** అవును. ఆమె మరణించింది.

**కాషియస్ :** ఇందాక మీకు అంతటి కోపాన్ని తెప్పించినప్పుడు నన్ను చంపలేదేమా అని నాకిప్పుడు ఆశ్చర్యం వేస్తున్నది. మీ చేతిలో చావును ఎంతగా తప్పించుకొన్నాను. అబ్బా! ఎంత భరించరాని బాధ! ఇది నా హృదయాన్ని గాయపరుస్తున్నది. జబ్బేమిటి?

**బ్రూటస్ :** నా వియోగాన్ని సహించలేకపోవటం. ఆమె మరణవార్తతోబాటు, యువకుడైన ఆక్టేవియస్, మార్క్ ఆంటోనీతో చేరి, నాకు వ్యతిరేకంగా బలవత్తరుడైనాడన్న వార్త కూడా వచ్చింది. ఆమె ఉన్మత్తురాలైందట. సేవకులు లేనప్పుడు నిప్పు మ్రింగిందట!

**కాషియస్ :** అందువల్ల మరణించిందా?

**బ్రూటస్ :** అవును.

**కాషియస్ :** అమరులారా! దేవతలారా!!

**లూషియస్ ద్రాక్షాసవంతో బాటు కొన్ని లేఖాపత్రాలను**
**కూడా తీసుకొని ప్రవేశిస్తాడు.**

**బ్రూటస్ :** ఆవిడను గురించి ఇంక ప్రస్తావించకు. నాకో పాత్రనిండా ద్రాక్షాసవాన్ని పోసి ఇవ్వు. కాషియస్! దీంతో నీయెడ చూపిన నిర్దాక్షిణ్యతనంతటినీ నిర్మూలించి వేస్తాను.

**(ఆసవాన్ని సేవిస్తాడు)**

**కాషియస్ :** ఈ ఉదాత్త ప్రతిజ్ఞ కోసమే నీ హృదయం విదాహం వహిస్తున్నది. లూషియస్, పాత్రిక పొర్లిపోయే దాకా పానీయాన్ని నింపు. బ్రూటస్ ప్రేమను నేను విపరీతంగా గ్రోలగలను.

**(సేవిస్తాడు)**

**బ్రూటస్ :** లోపలికిరా టిటినియస్!

**(లూషియస్ నిష్క్రమిస్తాడు)**

**మెసెల్లాతో టిటినియస్ ప్రవేశిస్తాడు.**

ఉదాత్తుడా, మెసెల్లా, నీకిదే స్వాగతం. ఈ కొవ్వొత్తి దగ్గిర కూర్చొని మనం కర్తవ్యాలను గురించి సమాలోచిద్దాం.

**కాషియస్ :** పోర్షియా! నీవు వెళ్ళిపోయావా?

**బ్రూటస్ :** ఆమెను గురించి ఇక చాలించు. నిన్ను ప్రార్థిస్తున్నాను. మెసెల్లా! యువకుడైన ఆక్టేవియస్ ఆంటోనీతో కూడా ఫిలిప్పీవైపు జైత్రయాత్రను సాగిస్తూ, మనమీదికి గొప్పసైన్యంతో వస్తున్నట్లు వార్త వచ్చింది.

**మెసెల్లా :** ఇదే ధోరణిలో నాకూ లేఖలు వచ్చాయి.

**బ్రూటస్ :** ఇంకా విశేషాలేమైనా ఉన్నవా?

**మెసెల్లా :** ఆక్టేవియస్, ఆంటోనీ, లెపిడస్ ముగ్గురూ సభాసభ్యులలో[41] నూరుమందిని చట్టవిద్రోహులుగా ప్రకటించి శిక్షించారుట!

**బ్రూటస్ :** మన ఉభయుల లేఖలూ ఇక్కడ భేదిస్తున్నవి. నాకు నచ్చిన లేఖల్లో వారు ప్రాణాలు తీసిన సభాసభ్యులు డెబ్బయి మంది మాత్రమే. వారిలో సిసెరో ఒకడు.

**కాషియస్ :** సిసెరో వాళ్ళలో ఒకడా?

**మెసెల్లా :** సిసెరో అయిపోయినాడు – చట్టవిద్రోహులని వారు చేసిన ప్రకటనవల్లనే. ప్రభూ! మీకు వచ్చిన లేఖలు మీ భార్యగారు వ్రాసినవా?

**బ్రూటస్ :** లేదు మెసెల్లా!

**మెసెల్లా :** ఆమెగారిని గురించి మీకు వచ్చిన లేఖల్లో ఏమీలేదా?

**బ్రూటస్ :** ఏమీ లేదు మెసెల్లా!

**మెసెల్లా :** ఇది చాలా విచిత్రంగా ఉంది.

**బ్రూటస్ :** ఏమి ఇలా ఆమెను గురించి ప్రశ్నించావు. నీకు వచ్చిన లేఖలవల్ల ఆమెను గురించిన విశేషాలేమన్నా తెలుసుకున్నావా?

**మెసెల్లా :** ఏమీలేదు ప్రభూ.

**బ్రూటస్ :** మెసెల్లా! నీవు రోము పౌరుడవు. రోము పౌరుడిలా[42] సత్యం చెప్పు.

**మెసెల్లా :** అయితే రోము పౌరుడిలా సత్యం చెపుతున్నాను. ఆమెగారు మరణించారు. ఇది నిజం. ఆ మరణం సామాన్యరీతిగా సంభవించలేదు.

**బ్రూటస్ :** ఎలాగైతేనేం[43] పోర్షియా గతించింది. ఎప్పుడో ఒకప్పుడు మనకూ మృత్యువు తప్పదు. ఎప్పుడో ఒకప్పుడు ఆమె మరణించి తీరవలసిందే గదా అన్న భావంతోనే శాంతి వహించి ఆమె మరణవార్తను భరిస్తున్నాను.

**మెసెల్లా :** మహనీయులు ఎల్లవేళలా ఇదేరీతిగా తమకు వచ్చిన అన్ని ఆపదలనూ భరిస్తుంటారు.

**కాషియస్ :** సిద్ధాంతదృష్ట్యా నాకూ ఇంతటి ప్రశాంతగుణమంటే ఇష్టమేగాని, కార్యాచరణలో మాత్రం ఇటువంటి కష్టాలను భరించలేను.

**బ్రూటస్ :** సరే! మనం ప్రస్తుతకార్యక్రమానికి వద్దాం. తత్క్షణమే మనం ఫిలిప్పీమీదికి వెళ్ళటాన్ని గురించి నీ అభిప్రాయమేమిటి?

**కాషియస్ :** అది శ్రేయమని నేను భావించను.

**బ్రూటస్ :** ఎందువల్ల?

**కాషియస్ :** వెదుక్కుంటూ శత్రువును మనకోసం రానివ్వటమే మంచిది. అందువల్ల వారి సాధనసంభారాలు తరిగిపోతవి. సైన్యాలకు శ్రమ కలుగుతుంది. ఇక్కడ

కదలకుండా ఉండటం వల్ల మనకు విశ్రాంతి చేకూరుతుంది. రక్షణకు మార్గాలను చేకూర్చుకోవచ్చు. సర్వవిధాలా మనం సిద్ధపడవచ్చు.

**బ్రూటస్ :** నీవు చెప్పిన కారణాలు చాలా మంచివే. కానీ నేను సూచించేవి అంతకంటే మంచివిగా ఉన్నప్పుడు అవి లొంగిపోవలసిందే. ఈ ప్రదేశానికీ, ఫిలిప్పీకీ మధ్యలో ఉన్న ప్రజలు మనను మనఃపూర్వకంగా అనుసరించేటట్లు కన్పించటం లేదు. వారు ఇష్టంతో మన సైన్యాలకేమీ విరాళాలిచ్చినట్లు లేదు. మన శత్రువులను ఈ ప్రదేశం గుండా రానిస్తే వారు వీరిని సైన్యంలో చేర్చుకొని, సంఖ్యను వృద్ధి చేసుకోటానికీ, నూతనోత్తేజాన్ని పొందటానికీ అవకాశం లభిస్తుంది. ఫిలిప్పీ వద్దనే మనం శత్రువులను ఎదుర్కొంటే వారికే అవకాశాలూ కలగకుండా చేయగలం. అంతేకాక ప్రజలు కూడా మనకు అండగా ఉంటారు.

**కాషియస్ :** బావగారూ! నా అభిప్రాయాన్ని మన్నించండి.

**బ్రూటస్ :** క్షమించు. అంతే కాదు. చక్కని మిత్రులను పొందాం సైన్యాలనూ, సాధన సంపత్తినీ చేకూర్చుకున్నాం. మన పథకాలు ఎంతో పరిపక్వమైనవి. శత్రువు ప్రతినిత్యం వృద్ధి పొందుతున్నాడు. ఇట్టి స్థితిగతులున్నా మనం పతనోన్ముఖం కాక తప్పదు. సకాలంలో వ్యవహరిస్తే మానవులను విజయం వరిస్తుంది. లేకపోతే వారి జీవితనౌక భగ్నమై దుర్భర దుఃస్థితిని కల్పిస్తుంది. ఇటువంటి మహాసముద్రంలో మనం ఇప్పుడు ప్రయాణం చేస్తున్నాం. ప్రవాహం మనకు అనుకూలంగా ఉన్నప్పుడే ప్రయోజనాన్ని పొందాలి లేకపోతే మన సాహసం సమస్తం వ్యర్థమౌతుంది.

**కాషియస్:** అయితే, మీ ఇచ్ఛానుసారంగా సైన్యాలను బయలుదేరదీయండి ఫిలిప్పీ వద్దనే శత్రువును ఎదుర్కొందాం.

**బ్రూటస్ :** మన సంభాషణలో రాత్రి ఎంతగా గడిచిపోయిందో గమనించలేదు. కొంత విశ్రాంతి తీసుకోవటం మన శరీరాలకు సహజధర్మం కదా! ఇంకా మాట్లాడు కోవలసిందేమైనా ఉందా?

**కాషియస్ :** ఏమీ లేదు. సునక్తం. రేపు ఉదయమే పెందలకడ సైన్యాలను బయలుదేరదీద్దాం.

**బ్రూటస్ :** లూషియస్! (లూషియస్ ప్రవేశిస్తాడు) నా నిచోళ[44] మేది? శుభాకాంక్షలోయ్ మెసెల్లా మహాశయా! సునక్తం.

**(లూషియస్ నిష్క్రమిస్తాడు)**

ట్రిటినియస్! మహోదాత్తా, కాషియస్! సునక్తం. మంచి విశ్రాంతిని పొందుదువుగాక!

**కాషియస్ :** బ్రూటస్ మహాశయా! ఈ రాత్రి మన మధ్య కలహంతో ఆరంభమైంది మన అంతరాత్మల్లో అటువంటి విభేదాలుండకుండుగాక!

**బ్రూటస్ :** సర్వం శుభోదర్కంగానే ఉంటుంది.

**కాషియస్ :** మహాశయా, సునక్తం!

**బ్రూటస్ :** సునక్తం కాషియస్!

**టిటినియస్ : మెసెల్లా :** సునక్తం బ్రూటస్ ప్రభూ!

**బ్రూటస్ :** అందరికీ నా శుభాకాంక్షలు.

**(బ్రూటస్ తప్ప మిగిలినవారందరూ నిష్క్రమిస్తారు.**
**లూషియస్ నిచోళంతో తిరిగి ప్రవేశిస్తాడు.)**

నా నిచోళాన్ని ఇలా ఇవ్వు. నీ సంగీతసాధన మేది?

**లూషియస్ :** శిబిరంలో ఉంది.

**బ్రూటస్ :** అలా నిద్రమత్తుగా ఉన్నావేమిటి? పాపం వెర్రివాడివి నీ దోషం కాదు. నీవు చాలాసేపు మేల్కొన్నావు. నా మనుష్యులను, క్లాడియస్‌ను, మరికొందర్నీ పిలు.

**లూషియస్ :** వర్రో! క్లాడియస్!!

**(వర్రో, క్లాడియస్ ప్రవేశిస్తారు)**

**వర్రో :** పిలిపించారా ప్రభూ?

**బ్రూటస్ :** మీరు నా శిబిరంలో శయనించి నిద్రపొండి. కాషియస్‌తో పని ఉంది. నేను మిమ్మల్ని అప్పుడప్పుడూ మేల్కొల్పవలసి వస్తుంది.

**వర్రో :** మీకోర్కైతే మేము రాత్రంతా మేల్కొనే ఉంటాము.

**బ్రూటస్ :** అవసరం లేదు మీరు నిద్రపోవచ్చు. మిమ్మల్ని లేపటానికి కూడా నాకు అసలు అవసరం కలగకపోవచ్చు. నేను వెతుక్కొంటున్న పుస్తకం, ఇదిగో, నా జేబులోనే పెట్టుకొన్నాను.

**(వర్రో, క్లాడియస్ విశ్రమిస్తారు)**

**లూషియస్ :** ప్రభూ! మీరు దాన్ని నాకు ఇవ్వనట్లు బాగా గుర్తు.

**బ్రూటస్ :** నేను నిన్నేమన్నదీ మరచిపో. నాకు మరుపు ఎక్కువైంది. కాసేపు మేల్కొని ఒకటి రెండు గీతాలు వినిపించగలవా?

**లూషియస్ :** మీ ఆనందం కోసం తప్పక వినిపిస్తాను.

**బ్రూటస్ :** పాపం! నిన్ను చాలా శ్రమపెడుతున్నట్లున్నాను కానీ నీవు ఇష్టం చూపిస్తున్నావు.

**లూషియస్ :** అది నా కర్తవ్యం కదా ప్రభూ!

**బ్రూటస్ :** శక్తిమించిన కర్తవ్యాన్ని చెయ్యమని నేనెవరినీ బలవంతపెట్టను. యువకులు ఎప్పుడూ విశ్రాంతిని కోరుతుంటారని నాకు తెలుసు.

**లూషియస్ :** ప్రభూ! నేను కొంతగా నిద్రతీసి మేల్కొన్నాను.

**బ్రూటస్ :** మంచి పని చేశావు మళ్ళా నిద్రపోదువుగాని. నిన్ను ఎక్కువసేపు మేల్కొనపెట్టనులే. నేనే బ్రతికి ఉంటే నిన్ను ఎంతో ప్రేమతో చూస్తాను. (సంగీతం ఒక గీతం వినిపిస్తుంది) ఇది బాగా నిద్రవచ్చే ఫణితిలా ఉంది.

నిద్రా, ఓ హంతకీ! మహాభారోపేతమైన అధికారదండాన్ని గీతాలు వినిపించే నా బాలుడిమీద కూడా మోపుతున్నావా? ఒరేయ్, వెర్రివాడా! వెళ్ళు. విశ్రాంతి తీసుకో. నిన్ను మేల్కొని ఉండమనటం మహాపచారం. ఇలాగే తూగుతూ మేల్కొంటే నీవు వీణను కూడా బ్రద్దలు కొట్టుకుంటావు. దాన్ని ఇలాతే. వెళ్ళు. నిద్రపో. నేను చదువుతున్న పుట మారిపోయిందే! చాలా చిత్రంగా ఉంది బాగా మారింది.

**(సీజర్ భూతాకృతి ప్రవేశిస్తుంది.)**

ఈ దీపం ఇలా వణికిపోతూ ప్రకాశిస్తున్న దెందుకు? ఏయ్! ఎవరు? లోపల ప్రవేశించిదెవరు? లేదు. ఇది నా దృష్టిలోపం వల్లనే కలుగుతున్నదనుకుంటాను. భూతరూపం ఏదో గోచరిస్తున్నది. అయ్యో! ఇది నా మీదకే వచ్చేస్తున్నది. నీవు సత్యమైన మూర్తివేనా? లేక కృత్రిమరూపానివా? నా రక్తాన్ని చల్లబడజేస్తూ, నా కేశాలను నిక్కబొడుచుని నిలుచునేటట్లు చేస్తూ ఉన్న నీవు దేవతవా? గంధర్వుడవా? లేక భూతానివా? నీవెవరు? నాతో మాట్లాడు.

**భూతం :** బ్రూటస్! నేను నీ దుష్టాత్మను.[45]

**బ్రూటస్ :** నీవెందు కిక్కడికి వచ్చావు?

**భూతం :** నేను నీకు మళ్ళీ ఫిలిప్పీలో దర్శనమిస్తానని చెప్పిపోవటానికి.

**బ్రూటస్ :** మంచిది. అయితే నిన్ను మళ్లీ అక్కడ చూస్తాను.

**భూతం :** అయితే ఫిలిప్పీ దగ్గర కలుసుకుందాం.

**బ్రూటస్ :** తప్పక. నిన్ను మళ్ళీ ఫిలిప్పీ దగ్గర[46] కలుసుకుంటాను.

**(భూతం నిష్క్రమిస్తుంది)**

నీవు వెళ్ళిపోయావు. నాకు మళ్ళీ ధైర్యం వచ్చింది. ఓ దుష్టభూతమా! నీతో బహుకాలం సంభాషిస్తాను. ఒరేయ్ లూషియస్, వెర్రో, క్లాడియస్, మేల్కొండి, మేల్కొండి.

**లూషియస్ :** ప్రభూ! నా వీణతంత్రులు బాగాలేవు.

**బ్రూటస్ :** పాపం! వీడు ఇంకా తాను వీణ వాయిస్తున్నాననే అనుకుంటున్నాడు.

**లూషియస్ :** ప్రభూ!

**బ్రూటస్ :** ఇలా కేక పెడుతున్నావు? నీవేదైనా కల గంటున్నావా?

**లూషియస్ :** కలా, లేదు ప్రభూ!

**బ్రూటస్ :** మళ్ళీ నిద్ర పో! క్లాడియస్ (వర్రోతో) నిన్నే నోయ్ వర్రో, మేల్కొండి.

**వర్రో :** ప్రభూ!

**క్లాడియస్ :** ప్రభూ!

**బ్రూటస్ :** నిద్రలో మీరు ఎందుకలా కేక పెట్టారు?

**వర్రో : క్లాడియస్ :** నిజమా ప్రభూ?

**బ్రూటస్ :** ఔను. నిద్రలో మీకేమైనా కనిపించిందా?

**వర్రో :** నాకేమీ కనిపించలేదు ప్రభూ!

**క్లాడియస్ :** నాకూ ఏమీ కనిపించలేదు ప్రభూ!

**బ్రూటస్ :** నా అభినందనలు మీ బావమరది కాషియస్‌కు అందజేయండి. అతణ్ణి మనకంటే బాగా ముందుగా సైన్యాలను బయలుదేరదీయమని చెప్పండి. మనం అతణ్ణి అనుసరిద్దాం.

**వర్రో : క్లాడియస్ :** చిత్తం. అలాగే ప్రభూ!

**(నిష్క్రమిస్తారు)**

# పంచమాంకం

## ఒకటో దృశ్యం

**ఫిలిప్పీ మైదానాలు. ఆక్టేవియస్, ఆంటోనీ**
**వారి సైన్యాలతో ప్రవేశిస్తారు.**

**ఆక్టేవియస్ :** ఆంటోనీ! మన ఆశలన్నీ నెరవేరాయి. మన శత్రువులు కొండలను దిగిరారనీ, మైదానపు భూముల్లోనే, ఉపత్యకల్లోనే ఉంటారని నీవన్నావు. అలా జరగటం లేదు. వారి సైన్యాలు అతివేగంతో మనమీదికి వచ్చేస్తున్నాయి. ఈ ఫిలిప్పీ వద్దనే మనమీద పడటానికి వారు వస్తున్నట్లున్నారు. మనకు వారు సమాధానం చెప్పటానికి బదులుగా, మనమే వారికి సమాధానం చెప్పవలసి వచ్చేటట్లు కనిపిస్తున్నది.

**ఆంటోనీ :** వారి మనోభావాలు నాకు బాగా అవగతమైనవే. వారు మనవంకకు రారు. ప్రక్కగా తప్పుకొనిపోవటంతో తృప్తి పడతారు. ఈ దృశ్యం ద్వారా మహావీరుల్లాగా మనమీదికి వచ్చిపడేటట్లు మనకో అభిప్రాయం కలిగించటానికి కనిపిస్తారేగాని, అటువంటి పరాక్రమం వారిదగ్గర లేదు.

**ఒక వార్తావహుడు ప్రవేశిస్తాడు.**

**వార్తావహుడు :** సేనాపతులకు ఆజ్ఞలిచ్చి సిద్ధపడండి. శత్రువులు భయంకర పరాక్రమంతో వచ్చేస్తున్నారు. తమ యుద్ధచిహ్నమైన సిందూర వర్ణకంచుకాన్ని తగిలించుకొని వస్తున్నారు. మీరు వెంటనే ఏమైనా చెయ్యాలి.

**ఆంటోనీ :** ఆక్టేవియస్! ప్రశాంతంగా ఉత్తరభాగపు యుద్ధభూమిని నీవు కాచుకో.

**ఆక్టేవియస్ :** నేను దక్షిణభాగాన ఉంటాను. ఉత్తరభాగాన్ని నీవు కాచుకో.

**ఆంటోనీ :** ఈ క్లిష్టసమయంలో నీవు నాతో వ్యతిరేకిస్తున్నావెందుకు?

**ఆక్టేవియస్ :** నిన్ను వ్యతిరేకించటం కాదు. నేనీ పని చేస్తాను. అంతే!

**(బయలుదేరుతారు)**

**(యుద్ధ దుందుభులధ్వనులు వినిపిస్తుంటవి. బ్రూటస్, కాషియస్,**
**వారి సైన్యాలు, లూసిలియస్, టిటిలియస్, మెసెల్లా , ఇతరులూ ప్రవేశిస్తారు.)**

**బ్రూటస్ :** వారు నిలువబడ్డారు  మనతో సంప్రదించదలచినట్లున్నారు.

**కాషియస్ :** టిటినియస్! ఆగిపో. ముందుకు వెళ్ళి మనం వారితో మాట్లాడాలి.

**ఆక్టేవియస్ :** మనం యుద్ధచిహ్నాన్ని వారికి అందిద్దామా?

**ఆంటోనీ :** లేదు. సీజర్, వారి ఎత్తేమో చూచి సమాధానం చెబుదాం. ముందుకు పోదాం. బ్రూటస్, కాషియస్ సేనాపతులు మనతో మాట్లాడదలచి నట్లున్నారు.

**ఆక్టేవియస్ :** సంజ్ఞ చేసేటంతవరకూ కదలవద్దు.

**బ్రూటస్ :** దేశీయులారా! పోటీలకు ముందు మాటలా?

**ఆక్టేవియస్ :** మాటలంటే మాకు మీ కంటే ఇష్టమని కాదు.

**బ్రూటస్ :** మంచి మాటలు పోటులకంటే మంచివి.

**ఆంటోనీ :** చెడ్డపోటులు పొడిచేటప్పుడు బ్రూటస్, నీవు మంచిమాటలే చెపుతావు. 'చిరంజీవ! జై సీజర్!' అన్న నినాదాలు చేస్తూనే సీజర్‌ను పొడిచిన పోటు ఇందుకు సాక్ష్యం.

**కాషియస్ :** ఆంటోనీ! నీ పోటులు ఏ వంకకు పడతాయో ఇంకా తెలియదు. కానీ నీ మాటలు హైబ్లా[47] తేనెటీగలు దాచుకున్న తేనెనంతటినీ కాజేసి, వాటికి లేకుండా చేసినట్లు కన్పిస్తున్నవి.

**ఆంటోనీ :** తేనె లేకుండా చేయటమే కాదు  కుట్టటం కూడా లేకుండా చేసినట్లున్నవి నీవి.

**బ్రూటస్ :** అవును. వాటి ఝుంకారాన్ని నీవు పుచ్చుకొన్నావు గనక నీవి రొదకూడా కాజేసినట్లున్నవి. కానీ కుట్టబొయ్యేముందు తెలివితేటలతో ప్రవర్తించు.

**ఆంటోనీ :** ద్రోహులారా! నన్ను భయపెడుతున్నారా? మీ ఛురికలు ఒకదానితో ఒకటి సీజర్ శరీరంలో రాచుకొంటున్నప్పుడే మీరు అలా ప్రవర్తించ లేదు. అందుకు ప్రతిగా మీరు కాస్కా పిచ్చిగజ్జికుక్కలా సీజర్ మెడమీద దొంగపోటు వేసినప్పుడు స్తోత్రపాఠకుల్లాగా, మబ్బుల్లా పళ్ళికిలించి, కుక్కల్లా కాళ్ళమీద పడ్డారు.

**కాషియస్ :** బ్రూటస్, ఇందుకు నిన్ను నీవే అభినందించుకోవాలి. కాషియస్ మాట చలామణి ఔతుంటే ఈ నాలుక ఈ నాడిలా కారులు ప్రేలగలిగేదా?

**ఆక్టేవియస్ :** ఈ వ్యర్థభాషణాన్ని చాలిద్దాం. ప్రస్తుతానికి వద్దాం. వాగ్వాదంవల్ల చెమట బిందువులు రాలితే, దాని ఫలితం వల్ల రక్తస్రావం జరుగుతుంది. ఈ హంతకులమీద నేను కత్తిని దూస్తున్నాను. ఇది తిరిగి ఒరలో ఎప్పుడు చేరుతుందో మీకు తెలుసునా? సీజర్‌కు తగిలిన ముప్పది మూడు గాయాలకూ తగిన ప్రతీకారం జరిగేటంతవరకూ పోదు లేదా మరొక సీజర్[48] హంతకద్రోహుల కత్తులకు బలి అయ్యేటంత వరకూ చేరదు.

**బ్రూటస్ :** సీజర్, నీవు అటువంటి వారిని వెంట తెచ్చుకుంటే తప్ప వారిహస్తాలలో మృతి నొందటానికి వీలుండదు.

**ఆక్టేవియస్ :** నేనూ అలాగే అనుకుంటున్నాను. నేను బ్రూటస్ కత్తితో చావటానికి పుట్టలేదు.

**బ్రూటస్ :** నీ వంశంలో నీవు మహోదాత్తుడవై జన్మించినప్పటికీ, నీకు అంతకంటే గౌరవనీయమైన చావు కలుగదు.

**కాషియస్ :** ఒక వేషధారి (మారుమొగం) తో తిని త్రాగి త్రుళ్ళేవాడితో చేరిన బడిపిల్లవాడికి అంతటి గౌరవార్హత కూడానా?

**ఆంటోనీ :** సరిగా పరిహాసకుడవైన కాషియస్‌లా మాట్లాడావు.

**ఆక్టేవియస్ :** వచ్చెయ్ ఆంటోనీ! ఇదిగో మా తిరస్కారం. అందుకోండి. ఎదుర్కోండి. మీకు ధైర్యముంటే ఈ నాడు యుద్ధభూమికి రండి. లేకపోతే మీకు ఇష్టం వచ్చిననాడు రండి.

**(ఆక్టేవియస్, ఆంటోనీ వారి సైన్యాలతో నిష్క్రమిస్తారు)**

**కాషియస్ :** పెనుగాలులు వీచాయి. కల్లోలితాలై అలలు చెలరేగాయి తుపాను వచ్చింది. మన సర్వస్వం ఉన్న నౌకను అలలమీద వదిలాం.

**బ్రూటస్ :** లూషియస్! నీతో కొంత మాట్లాడాలి.

**లూషియస్ :** (నిలువబడి) ప్రభూ!

**(విడిగా బ్రూటస్, లూషియస్ మాట్లాడుతుంటారు)**

**కాషియస్ :** మెసెల్లా!

**మెసెల్లా :** (నిలిచి) సేనాపతుల ఆజ్ఞ ఏమిటి?

**కాషియస్ :** కాషియస్ జన్మించింది ఈ నాడే కనక ఈ నాడు నా జన్మదినం. ఏదీ నీ హస్తం? ఒకనాటి పాంపేలాగా[49], నా ఇష్టానికి వ్యతిరేకంగా, మన సమస్తసాహసాన్నీ ఈ యుద్ధం కోసం పణం పెట్టవలసి వచ్చింది. ఎపిక్యూరస్‌కు నేను[50] అనుయాయినని నీకు తెలుసు. కానీ నేనిప్పుడు నా అభిప్రాయాలను మార్చుకున్నాను. శకునాలు సత్యాలని నమ్ముతున్నాను. సార్డిస్ నుంచి మనం వస్తుండగా[51] భరత పక్షులు రెండు మన ప్రధానధ్వజం మీద వ్రాలాయి. అవి అక్కడ మన సైనికుల హస్తాలను తింటూ కూర్చున్నవి. ఈ పక్షులు మనను పాంపేవరకూ అనుసరించి ఈ ఉదయమే పారిపోయాయి. వాటిస్థానంలో కాకులు, గ్రద్దలు, కాకోలాలు మనను తమ అనిశ్చితాహారంగా భావించి తలలమీద తిరుగుతూ, మృత్యుసూచకాలై ఆచ్ఛాదిస్తున్నవి.

**మెసెల్లా :** మీరు వీటి నన్నింటినీ నమ్మకండి!

**కాషియస్ :** నేను వాటిని కొంతవరకు నమ్ముతాను. నన్నేదో నవచైతన్యం ఆవేశించింది. కానీ నేను నిశ్చలంగా సమస్తమైన ఆపదలనూ దృఢశక్తితో ఎదర్కొంటాను.

**బ్రూటస్ :** (దూరంగా లూసిలియస్‌తో) లూసిలియస్! సర్వదా అలాగే.

**కాషియస్ :** మహోదాత్తా బ్రూటస్! శాంతి సమయంలో స్నేహితులంగా ఉన్న మనం వృద్ధాప్యం వరకూ అలాగే ఉండటానికి ఉంటాం. నిశ్చయంగా దేవతలు మనయెడ మిత్రభావమే వహించారు. కానీ, మానవుల వ్యవహారాలన్నీ అనిశ్చితాలు కనక, ఎంతటి కీడు కలగటానికి వీలుందో అంతా ఊహిద్దాము. ఈ యుద్ధంలో మనకు అపజయమే ప్రాప్తిస్తే మనం ఇర్వురం కలిసి మాటాడుకోటానికి ఇదే తుదిసారి ఔతుంది. మీరేం చేయదలచుకున్నారు?

**బ్రూటస్ :** నేను నేర్చుకొన్న తత్త్వశాస్త్ర ధోరణి ఇది కాదు. భవిష్యత్తులో ఏమి కానున్నదో అన్న భయంతో జీవితకాలాన్ని తగ్గించుకోటం నా తత్త్వం కాదు. ఇందుకే నేను ఆత్మహత్య చేసుకొన్నాడని కేటోను[52] నిందించాను. మనను పాలించే దేవతల నిర్ణయం కోసం నేను ప్రశాంత చిత్తంతో వేచి ఉంటాను.

**కాషియస్ :** ఈ యుద్ధంలో మనం ఓడిపోతే వారు తమ విజయోత్సవ సందర్భాలలో మిమ్మల్ని రోం ఘంటాపథాలలో ఈడ్చుకోపోవటానికి ఇష్టపడుతున్నారా?

**బ్రూటస్ :** లేదు. ఓ ఉదాత్త రోం పౌరుడా, కాషియస్! లేదు. బందీ అయి బ్రూటస్ రోంకు వెళతాడని భావించకు. అతడు మహామనస్వి. మార్చి పదిహేనున ఆరంభమైన పని ఈ నాటితో పరిపూర్ణమౌతుంది. ఈ నాడు గడచి మనం బ్రతుకుతామో లేదో.

అందువల్ల మనం నిత్యమైన వీడ్కోలును పొందుదాం. కాషియస్! సర్వకాలాలకూ నీకు ఇదే నా వీడ్కోలు! మళ్ళీ కలుసుకుంటామనుకో, మందస్మితం చేద్దాం. లేదనుకో. ఈ విప్రయోగం అత్యుత్తమంగా జరిగిపోయిం దౌతుంది.

**కాషియస్ :** సర్వకాలాలకూ ఇదే నా వీడ్కోలు! మనం మళ్ళీ కలుసుకుంటే నిశ్చయంగా మందస్మితం చేద్దాం కదూ! నిజానికి మన వీడ్కోలు అత్యుత్తమంగా జరిగిపోతున్నది.

**బ్రూటస్ :** ఇక ఆలస్యమెందుకు? నడిపించు. ఈ నాటి ఫలితాన్ని గురించి ముందుగా తెలుసుకోటానికి నేనెంతో కుతూహల పడుతున్నాను. ఈ దినం ఏ రీతిగానైనా అంతమొందితే చాలు. ఫలితం తెలిసిపోతుంది. ఇక పద! నడవండి!!

## రెండో దృశ్యం

**(అదే ప్రదేశం యుద్ధభూమి. యుద్ధధ్వనులు వినిపిస్తుంటాయి.**
**బ్రూటస్, మెసెల్లా ప్రవేశిస్తారు.)**

**బ్రూటస్ :** వెళ్ళు మెసెల్లా, వేగంగా వెళ్లు. ఈ వార్తలు అవతలవైపు ఉన్న సైన్యానికి అందించు. (పెద్ద కోలాహలం వినిపిస్తుంది) ఆక్టేవియస్ పక్షంలో శక్తి క్షీణించినట్టు కనిపిస్తున్నది. వెంటనే కాషియస్‌ను సైన్యంతో వారిమీద పడమను. హఠాత్తుగా పైబడితే వారు లొంగిపోతారు. వెళ్ళు. వేగంగా వెళ్ళు. వాళ్ళందరినీ క్రిందికి రమ్మను.

**(నిష్క్రమిస్తాడు)**

## మూడో దృశ్యం

**యుద్ధభూమిలో మరొకభాగం. యుద్ధకోలాహలం వినిపిస్తుంటుంది.**
**కాషియస్, టిటినియస్ ప్రవేశిస్తారు.**

**కాషియస్ :** చూడు టిటినియస్! ద్రోహులు పారిపోతున్నారు. నా మనుష్యులకు నేనే శత్రువుగా ప్రవర్తించాను. నా ధ్వజవాహకుడు పారిపోవటానికి యత్నిస్తుంటే వాణ్ణి చంపి, ఆ ధ్వజాన్ని అందుకున్నాను.

**టిటినియస్ :** కాషియస్! బ్రూటస్ చాలా ముందుగా పైబడమని ఆజ్ఞాపించారు. ఆక్టేవియస్ సన్నగిల్లటాన్ని చూచి వెంటనే విజయం చేకూరుతుందని భ్రాంతిపడి

ఉంటాడాయన. మనను ఆంటోనీ చుట్టివేస్తుంటే, అతడి సైనికులందరూ దోపిడికోసం శత్రుశిబిరాలమీద పడ్డారు

**పిండారస్ ప్రవేశిస్తాడు.**

**పిండారస్ :** ప్రభూ! దూరంగా వెళ్ళిపొండి  దూరంగా వెళ్ళిపొండి. మార్క్ ఆంటోనీ మీ శిబిరాలలో ప్రవేశించాడు. ఉదాత్తుడా, కాషియస్, దూరంగా వెళ్ళిపోండి.

**కాషియస్ :** ఈ కొండ చాలా దూరాన్నే ఉంది. టిటినియస్! చూడు, చూడు! ఆ అగ్ని దగ్ధమౌతున్న శిబిరాలు నావేనా?

**టిటినియస్ :** అవును ప్రభూ! మీవే.

**కాషియస్ :** టిటినియస్! నీకు నామీద ప్రేముంటే అశ్వాన్ని ఆరోహించి తరిమి పరుగెత్తించి పారిపో. ఆ దూరసైన్యాల దగ్గిరికి వెళ్ళి అవి మిత్రసైన్యాలో శత్రుసైన్యాలో తెలుసుకొని, రా.

**టిటినియస్ :** భావవేగంతో వెళ్ళి తిరిగివస్తాను.

**(నిష్క్రమిస్తాడు)**

**కాషియస్ :** పిండారస్! కొండపైకి వెళ్ళు – నాకు చూపు బాగా లేదు. టిటినియస్‌ను చూస్తుండు. యుద్ధభూమిలో జరిగే విశేషాలు నాకు అక్కడినుంచి నివేదిస్తుండు.

**పిండారస్ కొండ ఎక్కుతాడు.**

నేను ఈ నాడే జన్మించాను నేపుట్టిన ఈ నాడే మరణిస్తాను. నా జీవితం తన యాత్రను పూర్తి చేసుకొన్నది. ఒరేయ్! విశేషాలేమిటి?

**పిండారస్ :** (పైనుంచి) ప్రభూ!

**కాషియస్ :** విశేషాలేమిటి?

**పిండారస్ :** టిటినియస్‌ను ఆశ్వికులు చుట్టుముట్టారు. అయినా అతడు ఇంకా అశ్వాన్ని తరుముతూ పరువులు పెట్టిస్తూనే ఉన్నాడు. వారు ఇప్పుడు అతడికి చాలా దగ్గరగా చేరారు. టిటినియస్! పరుగెత్తి పో!! శత్రువుల్లో కొందరు ఆశ్వికులు దిగుతున్నారు. టిటినియస్ కూడా దిగాడు. అయ్యో! వారు అతణ్ణి పట్టుకొన్నారు.

**(దూరం నుంచి హర్షధ్వని వినిపిస్తుంది)**

**కాషియస్ :** దిగి రా. ఇక చూడకు. అయ్యో! నా కళ్ళ ఎదటనే నా ప్రియమిత్రుడు బందీ అయిపోతే నేను ఇంకా బ్రతికే ఉన్నాను. నేనెంత పిరికివాణ్ణి!

**పిండారస్ దిగివస్తాడు.**

ఒరేయ్, ఇక్కడికి రా! పార్థియాలో[53] నిన్ను నేను బందీగా పట్టుకున్నాను. అప్పుడు నీకు ప్రాణదానం చేస్తూ 'మీ ఆజ్ఞలనన్నింటినీ పాలిస్తా'నని నీ చేత ప్రమాణం చేయించాను. రా. నీ ప్రమాణాన్ని నిలువబెట్టుకో. ఇప్పుడు నీవు స్వతంత్రుడివి. ఇదిగో, సీజర్ ఊపిరితిత్తుల్లో దూరిన ఈ కత్తితో నా కడుపును గాలించు. సమాధానం చెప్పటానికి ఆగకు. ఇదిగో! ఊఁ, అందుకో. నేను ఇలా చేతుల్తో మూసుకోగానే కత్తిని కడుపులోకి నడిపించు.

**పిండారస్ అతణ్ణి పొడిచివేస్తాడు.**

సీజర్, నీవు ప్రతీకారాన్ని పుచ్చుకొన్నావు. నిన్ను చంపిన కత్తితోనే ప్రతీకారాన్ని పుచ్చుకొన్నావు.

**(పడిపోతాడు)**

**పిండారస్ :** నేను ఇప్పుడు స్వతంత్రుణ్ణి. కానీ నేను ధైర్యం చేసి స్వతంత్రించి ఆయన్ను కాదని వ్యవహరించినట్లైతే స్వతంత్రుణ్ణయ్యేవాణ్ణి కాను. అయ్యో! కాషియస్ మహాశయా! ఎప్పుడూ ఏ రోము పౌరుడూ నన్ను గుర్తించని ఏ దూరదేశానికో నీ ఈ పిండారస్ పారిపోతున్నాడు.

**టిటినియస్, మెసెల్లా తిరిగి ప్రవేశిస్తారు.**

**మెసెల్లా :** టిటినియస్! ఇది కేవలం స్వల్పమైన మార్పేనా? బ్రూటస్ మహాశయుని సైన్యం ఆక్టేవియస్‌ను జయించింది. కాషియస్ సైన్యాలు ఆంటోని చేజిక్కాయి.

**టిటినియస్ :** ఈ వార్త కాషియస్‌కు సంతోషాన్ని చేకూరుస్తుంది.

**మెసెల్లా :** నీవు అతణ్ణి ఎప్పుడు వదలి పెట్టి వచ్చావు?

**టిటినియస్ :** నేను వదలివచ్చినప్పుడు నిరాశ పూర్ణంగా ఆయన్ను ఆవరించి ఉంది. అప్పుడు ఆయన తన బానిస పిండారస్‌తో ఈ కొండమీద ఉన్నాడు.

**మెసెల్లా :** ఈ నేలమీద పడి ఉంది ఆయన కదూ?

**టిటినియస్ :** సజీవుడుగా ఉన్నట్లు లేదే. అయ్యో! హృదయమా!

**మెసెల్లా :** ఇది ఆయన కాదేమో!

**టిటినియస్ :** పొరబడకు మెసెల్లా! ఇది ఆయనే. ఇక కాషియస్ మనకు లేడు.

ఓ అస్తమించే సూర్యుడా! ఈ రాత్రి అరుణకాంతులతో ఎలా నీవు అస్తమిస్తున్నావో, అలాగే తన అరుణారుణరక్త కాంతులతో కాషియస్ ఈ నాడు అస్తమించాడు. రోమక భానుడు[54] అస్తమించాడు.

మనరోజు గడిచింది. మేఘాలు, పొగమంచు, ఆపదలు ఆవరించాయి. మన పని పూర్తయింది. నే వెళ్ళిన పని విషయంలో ఉన్న అనుమానం ఇంత పని చేసింది.

**మెసెల్లా :** విజయం చేకూరదన్న అనుమానమే ఈ పని చేసింది. ఓ చింతాదేవిదుహితా! నీచదోషమా!! అసత్యదృశ్యాలను అమాయకుల ఎదట ఎందుకు ప్రదర్శిస్తావు? ఓ దోషమా! నీవు చింతామూర్తి హృదయాన జన్మిస్తావు. నీ జన్మవల్ల అందుకు కారణభూతురాలైన నీ మాతృమూర్తి చింతాదేవి నశిస్తుంది.

**టిటినియస్ :** పిండారస్! ఎక్కడున్నావు?

**మెసెల్లా :** టిటినియస్! వీడెక్కడున్నాడో వెతుకు. నేనీవార్తను బ్రూటస్ చెవి కెక్కించి వస్తాను. ఎక్కించటం కాకేమిటి? దూసుకోపోయే కత్తికంటే, విషపుటీటెకంటే ఈ దృశ్యానికి సంబంధించినవార్త ఆయన కెంతో దారుణంగా ఉంటుంది.

**టిటినియస్ :** మెసెల్లా! నేను పిండారస్‌ను వెతుకుతాను. నీవు వెళ్ళు.

**(మెసెల్లా నిష్క్రమిస్తాడు)**

వీరుడా! కాషియస్, మీరు నన్నెందుకు పంపించారు? నేను నా మిత్రులను కలుసుకోలేకపోయినానా? వారు ఈ విజయపుష్పమాలను నాకిచ్చి నీ ఫాలదేశాన్ని అలంకరించమన్నారే! వారి ఆనందకోలాహలాన్ని వినలేదా? అయ్యో! మీరు సమస్తాన్నీ అపార్థం చేసుకొన్నారు. ఇదుగో చూడండి. ఈ పుష్పమాలతో మీ ఫాలాన్ని అలంకరించుకోండి. ఇది మీ కివ్వమని మీ బ్రూటస్ నన్ను ఆజ్ఞాపించాడు. నేను ఆయన ఆజ్ఞను పాలిస్తున్నాను. బ్రూటస్! మహాశయా! రండి! వేగంగా రండి!! చూడండి. నేను కేయస్ కాషియస్‌ను ఎలా గౌరవిస్తున్నానో చూడండి. ఇది రోము పౌరుల ఆచారం. ఓ దేవతలారా! మీ అనుజ్ఞ నివ్వండి. రా, కాషియస్ మహాశయుని కరవాలమా! రా. టిటినియస్ హృదయాన్ని పరిశీలించు.

**(ఆత్మహత్య చేసుకుంటాడు)**

**యుద్ధధ్వనులు వినిపిస్తుంటవి. బ్రూటస్, యువకుడైన కాటో, స్ట్రాటో వొలుమ్నియస్, లూసిలియస్‌లతో మెసెల్లా ప్రవేశిస్తాడు.**

**బ్రూటస్ :** ఎక్కడ? ఎక్కడ? ఏదీ అతని శరీరం?

**మెసెల్లా :** అదిగో, దూరంగా. టిటినియస్ దానిమీద పడి దుఃఖిస్తున్నాడు.

**బ్రూటస్ :** టిటినియస్ ముఖం వెల్లకిలపడి ఉందే!

**కాటో :** అతడు చంపబడ్డాడు!

**బ్రూటస్ :** సీజర్ నీవు మరణాంతరం కూడా బలవంతుడివే. నీ ఆత్మ స్వేచ్ఛగా విహరిస్తూ, మా కడుపుల్లోకి మా కత్తులనే నడిపిస్తున్నది.

**మందంగా యుద్ధధ్వనులు వినిపిస్తుంటవి.**

**కాటో :** వీరుడా టిటినియస్!!... చూడండి. అతడు మరణించిన కాషియస్‌ను కిరీటాలంకృతుణ్ణి చేశాడు.

**బ్రూటస్ :** సజీవులైన వ్యక్తుల్లో ఈ ఇద్దరివంటి రోమను పౌరులు మన కెవరైనా లభిస్తారా? రోము నివాసుల్లో తుది [55]మహోదాత్త వ్యక్తుల్లారా! మీకు వీడ్కోలు. రోములో మీకు సాటి అయినవారు జన్మించటం కల్ల!

మిత్రులారా! ఈ నాడు నే కార్చే కన్నీరు మరణించిన ఈ వ్యక్తి ఋణాన్ని తీర్చుకోలేవు. కాషియస్, సమయం చూచుకొని వచ్చి మరికొంత కన్నీరు కారుస్తాను. పదండి. అతడి శరీరాన్ని థసాస్‌కు[56] పంపించండి. అతని అంత్యక్రియలు మన శిబిరంలోనే జపితే మన పక్షానికి నిరాశ కలుగుతుంది. లూసిలియస్, పద. కేటో యువకా! పద. యుద్ధభూమికి పోదాం పదండి. లేబియో, ఫ్లేవియస్ మన యుద్ధాలను నడిపిస్తారు. ఇప్పుడు [57]మూడైంది. రాత్రి వచ్చేలోగా రెండోమారు యుద్ధంలో మన అదృష్టాన్ని పరీక్షిద్దాం.

**(నిష్క్రమిస్తారు)**

## నాలుగో దృశ్యం

**యుద్ధభూమిలో మరోభాగం యుద్ధధ్వనులు వినిపిస్తుంటవి. ఉభయ సైనికులూ సమరం సాగిస్తుంటారు. తరువాత బ్రూటస్, కేటో, లూసిలియస్, ఇతరులూ ప్రవేశిస్తారు.**

**బ్రూటస్ :** సోదరులారా! ధైర్యం వహించండి.

**కేటో :** ధైర్యాన్ని కోల్పోయేటంతటి నీచులమా మనం? నా వెంట ఎవరు వస్తారు? యుద్ధ భూమిలో నా పేరు నిలువబెట్టుకుంటాను. తెలుసునా? నేను మార్కస్ కేటో కుమారుణ్ణి నిరంకుశులకు శత్రువును. దేశమిత్రులకు మిత్రుణ్ణి.

**బ్రూటస్ :** నేను బ్రూటస్‌ను. మార్కస్ బ్రూటస్‌ను బ్రూటస్ దేశానికి మిత్రుడు. నన్ను బ్రూటస్ అని గ్రహించు.

**(బ్రూటస్ నిష్క్రమిస్తాడు)**

**లూసిలియస్ :** యువ కేటో! పడిపోయినావా? టిటినియస్ వలె వీరుడిలా మరణించావా? నీవు కేటో పుత్రుడవన్న గౌరవాన్ని నిలబెట్టుకున్నావు.

**ప్రథమ సైనికుడు :** లొంగిపో! లేకపోతే మరణిస్తావు!

**లూసిలియస్ :** మరణించటానికి లొంగిపోతాను. ఇదిగో ఈ ధనాన్ని తీసుకో. నన్ను వెంటనే చంపు. (ధనమిస్తాడు). బ్రూటస్‌ను చంపు. ఆయన్ను చంపానన్న గౌరవాన్ని పొందు.

**ప్రథమ సైనికుడు :** నిన్ను జీవగ్రాహంగా పట్టుకోరమ్మని మాకాజ్ఞాపించారు. నీవు ఉదాత్తుడవైన బందీవి.

**ద్వితీయ సైనికుడు :** దారి ఇవ్వండి. ఆంటోనీకి బ్రూటస్ బందీ అయినాడని తెలియజేయండి.

**ప్రథమ సైనికుడు :** నేనీవార్త చెపుతాను. అడుగో మా సేనాపతి వస్తున్నాడు. బ్రూటస్‌ను బందీ చేశాం! బ్రూటస్‌ను బందీ చేశాం!!

**ఆంటోనీ :** అతడెక్కడున్నాడు?

**లూసిలియస్ :** ఆంటోనీ! ఆయన తగినంత భద్రంగా ఉన్నాడు. ఏ శత్రువైనా బ్రూటస్ మహాశయుణ్ణి జీవగ్రాహంగా పట్టుకోలేడు. నేనొక నిర్ణయంగా చెపుతున్నాను విను. దేవతలు ఆయన్ను అట్టి అవమానం నుంచి రక్షించెదరు గాక! ఎట్టి స్థితిగతుల్లోనైనా మీరు ఆయన్ను నిర్జీవుడుగాగాని, సజీవుడుగా గాని చూచినప్పుడు ఆయన ఆ మహోదాత్తుడైన బ్రూటస్‌గానే కనిపిస్తాడు.

**ఆంటోనీ :** మిత్రులారా! ఇతడు బ్రూటస్ కాదు  మీరు పొరబడ్డారు. కానీ ఇతణ్ణి జాగ్రత్తగా చూడండి  ఇతడు బ్రూటస్‌తో తుల్యమైన విలువగలవాడు. ఇతణ్ణి మిక్కిలి కనికరంతో చూడండి. ఇటువంటివాళ్ళు నాకు శత్రువులుగా ఉండటం కంటే మిత్రులుగా ఉండవలెనని ఎంతగానో కోరుకుంటాను. పదండి. బ్రూటస్ సజీవుడో, నిర్జీవుడో వెదకండి. వ్యవహారం ఎలా పరిణమించిందో నాకు వార్తలందజేయండి. మేము ఆక్టేవియస్ గుడారంలో ఉంటాము.

## ఐదో దృశ్యం

**యుద్ధభూమిలో మరోభాగం. బ్రూటస్, డార్డానియస్, క్లిటస్, స్ట్రాటొ, పొటాలినస్ ప్రవేశిస్తారు.**

**బ్రూటస్ :** రండి. మిత్రుల్లో మిగిలిన అల్పసంఖ్యాకులారా! ఈ తిప్పమీద విశ్రాంతి తీసుకొండి.

**క్లిటస్ :** స్టాటిలియస్ కాగడాను చూపించాడే గాని తిరిగి రాలేదు  బహుశః మరణించి ఉంటాడు. శత్రువులు అతణ్ణి బందీనైనా చేసి ఉంటారు, లేకపోతే –

**బ్రూటస్ :** క్లిటస్! కూర్చో. విశ్రాంతి తీసుకో. మరణించటమే ఈ నాటి వార్తయి పోయింది. అది ఆచారమైంది. మనం అనుసరిద్దాము. క్లిటస్!

**(పిలిచి రహస్యంగా సంభాషిస్తాడు)**

**క్లిటస్ :** ఏమన్నారు? మిమ్మల్ని చంపమన్నారా, ప్రభూ? సమస్తప్రపంచాన్ని నాకు కట్టబెట్టినా ఆ పని చేయలేను.

**బ్రూటస్ :** అయితే, గొడవ పెట్టకు.

**క్లిటస్ :** ఇంతకంటే నన్ను నేను చంపుకుంటాను గాని మిమ్మల్ని చంపటమా?

**బ్రూటస్ :** డార్డినస్, ఇలా రా.

**క్లిటస్ :** డార్డినస్!

**డార్డినస్ :** క్లిటస్!

**క్లిటస్ :** బ్రూటస్ నిన్ను ఎంత చెడ్డకోరిక కోరుతున్నారో గమనించావా?

**డార్డినస్ :** ఆయన్ను చంపమంటున్నాడు క్లిటస్! ఆత్మభావచయంలో ఆయన ఎలా మగ్నుడైపోయినాడో చూడు.

**క్లిటస్ :** ఈ బ్రూటస్ హృదయపాత్ర దుఃఖంతో నిండి పొర్లిపోతున్నది. ఆ కన్నీటిని గమనించు.

**బ్రూటస్ :** ఇలారా, వొలుమ్నియస్! నేను చెప్పింది విను.

**వొలుమ్నియస్ :** ఏమంటున్నారు ప్రభూ?

**బ్రూటస్ :** సీజర్ భూతరూపం నాకు రెండుమార్లు దర్శనమిచ్చింది - ఒకమారు సార్డిస్‌లో, మరోమారు రాత్రి ఫిలిప్పీ యుద్ధభూమిలో. నా అంత్యం దగ్గిరకు వచ్చింది నాకు తెలుసు.

**వొలుమ్నియస్ :** లేదు ప్రభూ! అలా అనకండి.

**బ్రూటస్ :** లేదు. నాకు నిశ్చయంగా తెలుసు. వ్యవహారాలెలా నడుస్తున్నవో నీకు తెలుసు. శత్రువులు మనలను గర్తందాకా తరుముకోవచ్చారు. వారు వచ్చి అందులోకి నెట్టేదాకా తారట్లాడటం కంటే ఈ ప్రపాతం నుంచి దుమకటం మనకు క్షేమం.

వొలుమ్నియస్! నీవూ, నేనూ బాల్యమిత్రులం కలిసి బడికివెళ్ళాం. ఆ అపూర్వమైత్రికి సాక్షిగా నీవు నా కత్తిని పట్టుకో. నేను దానిమీదికి పరుగెత్తి ప్రాణాలు కోల్పోతాను.

**వొలుమ్నియస్ :** ఇది మిత్రుడికి ఆదేశింపదగ్గ ఉద్యోగం కాదు ప్రభూ!

**(ఇంకా యుద్ధకోలాహలం వినిపిస్తుంటుంది.)**

**క్లిటస్ :** ఇక్కడ తారాడి ప్రయోజనం లేదు. ప్రభూ! పరుగెత్తిపొండి, పరుగెత్తిపొండి.

**బ్రూటస్ :** మీకు ఇదే నా వీడ్కోలు. నీకు క్లిటస్! నీకు వొలుమ్నియస్! స్ట్రాటో! ఇంతవరకూ నీవు నిద్రలో మునిగున్నావు. నీకూ నా వీడ్కోలు. జీవితంలో ఒకటే నాకు పరమానందం. నా తుదిదాకా నా మిత్రులందరూ నాయెడ సత్యసంధులై వర్తించారు. ప్రయోజనరహితమైన విజయం వల్ల ఆక్టేవియస్, ఆంటోనీ పొందేదానికంటే అపజయం వల్లనే నేను అధికంగా సాధింపగలిగాను. ఇక మీకు, మీ అందరికీ వీడ్కోలు. బ్రూటస్ జీవితచరిత్ర ఇంతటితో అంతమొందినట్లే. రాత్రి నా కనురెప్పలమీద కూర్చున్నది. నా అంతరాత్మ విశ్రాంతి కోసం ఆతురత వహిస్తున్నది. ఇంత కాలం నా శరీరం శ్రమించింది ఈ పుణ్య సమయం కోసమే.

లోపల యుద్ధధ్వనులు, పరిగెత్తిపొండి, పరిగెత్తిపొండి అన్న కేకలు వినిపిస్తున్నవి.

**క్లిటస్ :** పరుగెత్తిపొండి! ప్రభూ, పరుగెత్తిపొండి!

**బ్రూటస్ :** పదండి, నేను అనుసరిస్తున్నాను.

**(క్లిటస్, డార్డినియస్, వొలుమ్నియస్ నిష్క్రమిస్తారు)**

స్ట్రాటో! నిన్ను ప్రార్థిస్తున్నాను. నీ ప్రభువుకు అండగా నిలు. మంచికీర్తిని సంపాదించుకున్నవాడివి. నీ జీవితం నిండా గౌరవామోదం నిబిడమై ఉంది. నా కత్తిని పట్టుకో. నీ ముఖాన్ని ప్రక్కకు త్రిప్పు నేను దానిమీద పడిపోతాను.

**స్ట్రాటో :** ప్రభూ! ముందు మీ హస్తచాలన సౌభాగ్యాన్ని నాకు ప్రసాదించండి. ఇదే మీకు వీడ్కోలు.

**బ్రూటస్ :** ఉత్తముడా, స్ట్రాటో, ఇదే నీకు వీడ్కోలు!

**(బ్రూటస్ కత్తిమీద పడిపోతాడు)**

సీజర్, ఇక శాంతించు. నన్ను నేనే చంపుకుంటున్నప్పటి చిత్తస్ఫూర్తిలో అర్థాంశంతో నైనా నిన్ను నేను చంపలేదు!

**యుద్ధధ్వనులు వినిపిస్తుంటాయి. ఆక్టేవియస్, ఆంటోనీ ప్రవేశిస్తారు. మెసెల్లా, లూసిలియస్, సైన్యాలు ప్రవేశిస్తారు.**

**ఆక్టేవియస్ :** ఆ వ్యక్తి ఎవరు?

**మెసెల్లా :** మా యజమానికి సేవకుడు. స్ట్రాటో! ప్రభువువారెక్కడ?

**స్ట్రాటో :** మెసెల్లా! నీవు పడ్డ బానిసత్వాన్ని తప్పించుకొన్నారు. విజేతలు వారి చితాగ్నిని తప్ప చూడజాలరు. ఆయన తన్ను తానే చంపుకున్నాడు. ఆయనను చంపానని సగర్వంగా చెప్పుకొనే అవకాశం ఎవరికీ లేదు.

**లూసిలియస్ :** మహోదాత్తుడు బ్రూటస్ తన ఆధిక్యానికి అనుగుణంగా ప్రవర్తించాడు. బ్రూటస్ మహాశయా! నీవు లూసిలియస్ అంటున్నట్లే చేశావు.

**ఆక్టేవియస్ :** బ్రూటస్‌ను సేవించేవారందరినీ నేను ఉద్యోగాలిచ్చి పోషిస్తాను. ఏమోయ్! నా సేవలో కుదరటం నీకిష్టమేనా?

**స్ట్రాటో :** మెసెల్లా ఇందుకు అంగీకరిస్తే అలాగే.

**ఆక్టేవియస్ :** ఉత్తముడా మెసెల్లా! అతణ్ణి అలా ఆజ్ఞాపించు.

**మెసెల్లా :** స్ట్రాటో! నా ప్రభువు బ్రూటస్ ఎలా మరణించారు?

**స్ట్రాటో :** నేను కత్తిని నిల్పాను  వారు దానిమీదపడి ప్రాణాలు తీసుకున్నారు.

**మెసెల్లా :** ఆక్టేవియస్ మా ప్రభువుకు తుదిసేవ చేసిన ఇతణ్ణి మీ కొల్వులోకి తీసుకోండి.

**ఆంటోనీ :** వారందరిలో ఇతడే మహోదాత్తుడు. ఇతడు తప్ప మిగిలిన వారందరూ సీజర్‌ను ఈర్ష్యవల్ల హత్య చేశారు. సత్యబుద్ధితో ప్రజాసామాన్య సంక్షేమాన్ని భావించి వారిలో చేరింది ఇతడొక్కడే. ఇతడి జీవితం అతికోమలమైంది. సమస్తభూతాలూ నిలిచి మానవుడంటే ఇతడు అని ప్రపంచానికి చాటిచెప్పదగ్గట్లుగా సర్వసద్గుణాలూ ఇతడిలో సంకలితాలయ్యాయి.

**ఆక్టేవియస్ :** ఇతడి మహోత్తమగుణాల కనుగుణంగానే మనం ఇతణ్ణి గౌరవిద్దాం. మహావీరుడికి యోగ్యమైన సమస్త ఆచారాలతో అంత్యక్రియలు జరుపుదాం. ఇక సైన్యాలను యుద్ధం మాని ప్రశాంతి వహించవలసిందని ఆజ్ఞాపించు. పద. మహానందకరమైన ఈ సుదినం నాటి కీర్తి ప్రతిష్ఠలను పంచుకోవటానికి ఇక మనం నిష్క్రమిద్దాం.

(నిష్క్రమిస్తారు)

# అనుబంధం

1. **వక్షస్త్రాణము :** చర్మపుడాలు – వడ్రంగిపని చేసేటప్పుడు శరీరానికి దెబ్బ తగలకుండా కట్టుకుండేది.

2. **చెడ్డ చర్మాలను :** ఇక్కడ షేక్స్‌పియర్ 'బాడీ సోల్స్' అన్న పదాన్ని ఉపయోగించాడు. సోల్స్ శబ్దానికి చెప్పు అడుగుభాగమనీ, ఆత్మలనీ, ఆంగ్లభాషలో ఉన్న శ్లేషార్థాలు రెండూ ఈ సందర్భంలో వర్తిస్తాయి. ఈ సొగసు అనువాదంలో కనిపింప చేసే అవకాశం లేదు.

3. **పాంపే –** 'వీరత్రయకూటమి' (ట్రయంవిరేట్) క్రీ.పూ. 106–48 గొప్ప సేనాపతి. రోము కోసం అనేక విజయాలను చేకొన్నవాడు. సీజర్‌కు ప్రబలశత్రువు. ఇతణ్ణి ఈజిప్టులో హత్య చేశారు.

4. **టైబర్ –** రోము మహానగరం ఈ నదీతీరాన్నే నిర్మితమైంది.

5. **సభా మందిరం –** కాపిటోలైన్ కొండమీద కట్టిన జూపిటర్ దేవాలయం. జైత్రయాత్ర చేసి విజయాలతో రోము నగరంలో ప్రవేశించిన వీరులందరూ ఉత్సవంతో ఈ ఆలయానికి వచ్చి సర్వదేవతాపిత అయిన జూపిటర్‌కు వినతులు చెల్లిస్తారు. ఇది సభాభవనమని షేక్స్‌పియర్ పొరబడ్డాడు.

6. **లూపర్‌కల్ ఉత్సవాలు –** ఫానస్ అనే దేవతా గౌరవచిహ్నాలుగా ప్రాయశ్చిత్త, పవిత్రీకరణం కోసం రోము మహానగరంలో ఫిబ్రవరి పదిహేనున జరిగే ఉత్సవాలు. యువకులు నిరలంకృతులై నగ్నంగా నగరంలో పరుగెత్తుతూ, తమకు ఇష్టం వచ్చిన వాళ్ళను గట్టిగా చరుస్తూ పరుగెత్తి పోతుంటారు. వారు తట్టినవాళ్ళు గర్భవతులైతే సుఖంగా ప్రసవిస్తారనీ, వంధ్యలైతే గర్భవతులౌతారనీ రోము ప్రజల విశ్వాసం.

7. **కల్పూర్నియా – సీజర్‌**ను క్రీ.పూ. 44లో నాల్గవ భార్యగా వివాహ మాడిన వనిత. కల్పూర్నియాస్ పిసో కుమార్తె.

8. **ఏయనియస్ –** ఒక ట్రాయ్ వీరుడు. ఇడామౌంట్ మీది డార్డానస్‌కు రాజైన ఆన్‌చెసిస్‌కు వీనస్ వల్ల జన్మించాడు. పది సంవత్సరాలు ముట్టడించి గ్రీకులు ట్రాయ్‌ని పట్టుకొని దగ్ధం చేసినప్పుడు, ఇతడు తన తండ్రిని తన భుజాలమీద ఎత్తుకొని, నగరంలోనుండి బయటపడవేసినట్లు వర్జిల్ కవి. 'ఈదడానికి – ఏనిడ్ వల్ల తెలుస్తున్నది' సీజర్ గజ ఈతగాడని ఎన్నో కథలున్నాయి. కానీ షేక్స్‌పియర్ మానసిక శారీరక దౌర్బల్యం గల సీజర్ రోమక సామ్రాజ్యాన్ని ముందుగా కలగని అందుకు యత్నిస్తున్నట్లు చూపించటానికి, చరిత్రకు భిన్నంగా ఇలా కాషియస్‌చే పలికించాడు.

9. **టిటినియస్ –** సీజర్‌కు స్పెయిన్‌లో మిత్రుడు, పారిపార్శ్వకుడు.

10. **కొలోసస్ –** అప్పొలో దేవతకు రోహెడ్సు రేవులో నిల్పిన ఒక వరిష్ఠప్రతిమ. ఈ విగ్రహం పాదాల క్రిందుగా తెరచాపలు దించకుండానే నౌకలు ప్రయాణించ వచ్చునట! రోడ్స్ వద్ద కొలోసస్ అని ప్రఖ్యాతి వహించిన ఈ మూర్తి ప్రపంచ సప్త వైచిత్ర్యాలలో ఒకటి.

11. **మహాప్రళయానంతరం –** క్రీ.పూ. 1403న ఈ ప్రళయం థెస్సలీలో జరిగినట్లు భావింపబడుతున్నది. ప్రొమిథియస్ పుత్రుడైన డ్యూకాలియన్ కాలంలో మానవులు చేసే అపచారాల మీద కలిగిన కోపం వల్ల ఈ ప్రళయాన్ని జూపిటర్ కల్పించాడట! ఈ ప్రళయం నుంచి డ్యూకాలియన్, అతడి భార్య పైరాహా థెమిసిస్ దివ్యవాణి ఇచ్చిన సలహాను అనుసరించి, మౌంట్ పార్నాసస్ మీద నిలిచి బ్రతకగలిగినట్లూ, మానవజాతి నష్టాన్ని తీర్చటంకోసం వాళ్ళు వారి జేజెమ్మ ఎముకలను వెదజల్లారనీ, డ్యూకాలియన్ చల్లినవి పురుషులూ, అతని భార్య చల్లినవి స్త్రీలూ అయినట్లు గ్రీకు పురాణగాథల వల్ల తెలుస్తున్నది.

12. **పూర్వం ఒకానొకప్పుడు ఒక బ్రూటస్ –** ఇది టార్క్విన్సును పారద్రోలి రాచరికాన్ని రద్దు చేయటంలో ప్రముఖపాత్ర వహించిన లూషియస్ జూనియస్ బ్రూటస్. ఇతడు రోముకు మొదటి కాన్సల్ టార్క్విన్స్ రాజ్యపాలనను పునరుద్ధరించటానికి యత్నించిన తన కుమాళ్ళనిద్దరిని చంపుకొన్న దేశాభిమాని. ఇతని తృతీయపుత్రుని సంతతివాడు నాటకం నాటి బ్రూటస్.

**13. టొగాకొన –** రోమనులకు చొక్కా లేదు 'టోగా' అనే పేరు గల ఉత్తరీయాన్ని వారు ధరిస్తారు.

**14. అతడు బలిసి ఉంటే –** బలిసి చియ్యబట్టినవాళ్లు సంతృప్తితో జీవిస్తుంటారనీ, అందువల్ల వాళ్ళు కుట్రలు పన్నరనీ సీజర్ భావం.

**15. నాకు గ్రీక్ గానే ఉంది –** అర్థం కాని అయోమయ సంభాషణ మన్నమాట!

**16. మన పితృపితామహుల –** మన తండ్రితాతల శరీరసౌష్ఠవం మనలను వదలక పోయినా మానసికంగా మనం మన తల్లుల లక్షణాలను పొంది స్త్రీత్వం వహించాము.

## ద్వితీయాంకం

ప్రథమాంకంలో సీజర్ హత్యకు కుట్రలోని ప్రాథమికావస్థలు కనిపిస్తాయి. ద్వితీయాంకంలో కుట్ర పరిపూర్ణమౌతుంది. తృతీయాంకంలో హత్య జరుగుతుంది.

**17. మంచి ఎండ కాసే రోజు –** షేక్స్పియర్ మహాకవి ప్రకృతి పరిశీలనసామర్థ్యానికిది నిదర్శనం.

**18. బావమరది –** కాషియస్ జూనియా అనే బ్రూటస్ సోదరిని వివాహమాడటం వల్ల అతడికి బావమరది.

**19. శృంగాశ్వం :** 'యూనికారన్' అన్న పేరుగల గ్రీకు పురాణాలలోని కల్పిత జంతువు. దీనికి తలమీద కొమ్ముంటుందిట!

**20. లిగారియస్ :** బ్రూటస్‌కు ఆప్తమిత్రుడు. అతడియెడ గురుభావం కలవాడు. ఇతడు క్రీ.పూ. 43లో 'వీరత్రయకూటమి' నిర్ణయాల వల్ల, తన ఇరువురు సోదరులతో బాటు ప్రాణాలను కోల్పోయాడు.

**21. గుండీలు లేకుండా –** షేక్స్పియర్ రోమనులకు ఆంగ్లేయ వస్త్రాలిచ్చాడు. ఇది పొరబాటు.

## తృతీయాంకం

సభాభవనం ముందు – నిజానికి సీజర్ హత్య "క్యూరియోపాంపైయానా'లో జరిగినట్లు ప్లూటార్కు చరిత్రకారుని రచనవల్ల తెలుస్తున్నది. ఇది పాంపే

నాట్యశాలకు ఒక అనుబంధ మందిరం. షేక్స్‌పియర్ జూపిటర్ 'దేవమందిరాన్ని' సభాభవనంగా భావించి భ్రాంతి పడ్డాడు. కానీ సీజర్ హత్యను నగరకంఠమైన ఈ దేవమందిరం ముందు జరిపించటం సమంజసంగానే ఉంది. పాంపే నాట్యశాలలో ఉన్న పాంపే ప్రతిమను గూడా అతడు పొరబడిన సభాభవనానికి మార్చాడు. అయినా, సీజర్ తాను జయించిన తన ప్రబల శత్రువు పాంపే ప్రతిమముందు వధింపబడి ఒరిగిపోవటం, షేక్స్‌పియర్ చేసిన ఉచిత కల్పన అని అనిపించుకుంటున్నది.

**22.** **ఈ రీతిగా ప్రణమిల్లావని –** ఇక్కడ సీజర్ చేసిన ఆత్మ ప్రాతోన్మీలనం గమనింపదగ్గది. ఇందులో చక్రవర్తుల దృష్టి, వర్తనలు ఎలా ఉండాలో ఆయన నిరూపించాడు. ఆయన అభిప్రాయంలో చక్రవర్తి భయరహితుడు, అచంచలుడు, స్వతంత్రుడు – మానవ రూపాన్ని ధరించిన పరమేశ్వరుడు.

**23.** **ఒలింపస్ పర్వతాన్ని –** గ్రీసు దేశంలోని ఒక పర్వతం. ఇది సమస్త గ్రీకు దేవతలకూ నివాసభూమి అని గ్రీకు పురాణగాథలు.

**24.** **మహాప్రళయసమయం –** 'డూమ్స్‌డే'.

**25.** **వీరాధి వీరుడ వైన నాకాస్కా –** ఇందులోని వ్యంగ్యధ్వని గమనార్హం.

**26.** **లేకపోతే –** హంతకులను దూషించకపోవటం, సీజర్‌ను కీర్తించటం తప్ప ఇతరం చేయకపోవటం, బ్రూటస్ అనుజ్ఞతోనే మాట్లాడుతున్నానని సభలో ప్రకటించటం, బ్రూటస్ మాట్లాడిన వేదిక మీదనే ఆయన తరువాత మాట్లాడటం – అన్నవి అంగీకారం కాకపోతే.

**27.** **ఏతీ –** ప్రతీకారాది దోషాలకు మూర్తిత్వం వహించిన గ్రీకు దేవత. జూయస్ అనే పరమేశ్వరుడు ఆయన్ను త్వరపెట్టి ఒక దుష్టకృత్యాన్ని చేయించినందుకు, ఈ దేవతను దేవతానివాసభూమి అయిన ఒలింపస్ నుంచి నరకంలోకి విసరివేసినట్లు గ్రీకు పురాణగాథ.

**28.** **రోము ప్రమాదరహితం కాదని –** జూలియస్ సీజర్‌ను హత్య చేయటం వల్ల హంతకులు ఆక్టేవియస్ సీజర్‌ను కూడా హతమార్చే అవకాశం ఉండటం చేత.

**29.** **మిత్రులారా! –** ఇది జూలియస్ సీజర్ నాటకంలో కెల్లా ప్రపంచ విఖ్యాతి పొందిన ప్రసంగం. పైకి వినయాన్ని ప్రకటిస్తున్నా మార్క్ ఆంటోనీ ఒక జిత్తులమారి రాజకీయ వేత్త అనీ, చతురుడైన వక్త అనీ దీనివల్ల వెల్లడి ఔతున్నది.

**30. అజచర్మలేఖనం –** కాగితాలు లేని ఆ కాలంలో అజచర్మం (మేకచర్మం) మీద వ్రాసేవారు.

**31. నెర్వైలు :** బెల్జిక్ జాతుల్లో మహావీరులని పేరుపొందిన వర్గం. వీరిని సీజర్ క్రీ.పూ. 57లో 'సంబ్రీ' యుద్ధంలో జయించాడు. ఈ యుద్ధం శీతకాలంలో జరిగింది గ్రీష్మకాలంలో జరగలేదు.

నాకు బాగా జ్ఞాపకం – కానీ ఆంటోనీ ఆ యుద్ధభూమిలో లేడు

**32. ఒక పవిత్ర స్థలంలో –** రోమను కాలంలో దహనానికి పవిత్ర స్థలాలంటూ లేవు. ఇది షేక్స్పియర్ ప్రవేశపెట్టిన క్రైస్తవ మత సంబంధమైన భావం. ఇది కాలీనవ్యత్యస్తకం (అనాక్రానిజం).

**33. ఆ పేరును లాగివేయండి –** సీజర్‌ను, హత్యచేసిన వారిలో 'సిన్నా' నామం కలవాడు ఒకడు కావటం వల్ల.

## చతుర్థాంకం

**34. ఇటువంటి పనులకు మాత్రమే పంపదగ్గవాడు :** షేక్స్పియర్ లెపిడస్‌ను ప్రజ్ఞాహీనుణ్ణిగానూ, క్షుద్ర కార్యకరణానికి పంపదగ్గవాణ్ణిగానూ చిత్రించాడే గాని, ఇతడు కాకలు దీరిన కదనవీరుడైనట్లు ప్లూటార్క్ రచనల వల్ల తెలుస్తున్నది. 'వీర త్రయ కూటమి' లో మిగిలిన ఇరువురూ ఇతణ్ణి తమకంటె తక్కువగా చూడటం చరిత్రాత్మకసత్యమే. అందువల్లనే ఇతడు క్రీ.పూ. 43లో తన స్థానాన్ని పొందటానికి తిరుగుబాటు చేసి ఓడిపోయినపుడు ఆక్టేవియస్ ప్రాణదానం చేస్తాడు. ద్రోహులను నిర్ణయించేటప్పుడు – ఈ దృశ్యంలో వీరత్రయ కూటసభ్యులైన ఆక్టేవియస్, ఆంటోనీ, లెపిడస్ అధికారం కోసం ఆత్మబంధువుల సంహరణానికి కూడా ఎలా అంగీకరిస్తున్నారో గమనించదగింది. ఈ సందర్భంలో రోము మహానగరంలో జరిగిన హత్యాకాండ అతిదారుణమైంది.

**35. సార్డిస్ :** ఆసియా మైనర్‌లో ప్రసిద్ధి పొందిన ఒక ప్రాచీన నగరం. రోములో తమమీద ఆంటోనీ వ్యతిరేకత ఫలితంగా తిరుగుబాటు వచ్చినప్పుడు బ్రూటస్, కాషియస్, తూర్పునకు పారిపోయారు. ఆక్టేవియస్, ఆంటోనీ ఇది గమనించి వారిని వెన్నాడుతూ వచ్చారు.

**36.** **ఇదే ప్రసిద్ధమైన కలహదృశ్యం.** మహాకవి షేక్స్‌పియర్ మానవాతీతశక్తి కలవాడని నమ్మటానికి, మిగిలిన అన్ని రచనలకంటె కలహదృశ్యం ఎక్కువగా ఆకర్షించింది. అని సుప్రసిద్ధాంగ్ల విమర్శకుడు, కవి అయిన కోల్‌రిడ్జ్ అన్నాడు.

**37.** **లూషియస్ పెల్లా :** కాషియస్ క్రింది ఉన్నత సైనికోద్యోగి.

**38.** **చంద్రుణ్ణి చూచి మొరుగుతుండేవాణ్ణి –** ఈ పని చేయటం మూర్ఖత్వాన్ని వెల్లడిస్తుంది. చంద్రుణ్ణి చూచి భయపెట్టటానికి మొరిగే కుక్క పిచ్చిది కాకేమిటి?

**39.** **నీ ప్లీహంలోని విషాన్ని జీర్ణించుకో –** నీ కోపాన్ని రూపుమాపు అని అర్థం, ప్లీహం కోపం, ఈర్ష్య, చింతాది దోషాలకు జన్మస్థానమని పూర్వుల అభిప్రాయము.

**40.** **ప్లూటస్ గని –** గ్రీకుల ధనాధిపతి ప్లూటస్. విచక్షణ లేకుండా తన ధనాన్ని ఇస్తూ ఉండటం కోసం జూయస్ అతణ్ణి అంధుణ్ణి చేశాడని గ్రీకు పురాణగాథ.

**41.** **'వీరత్రయ కూటమి'** హననం చేయటానికి గుర్తించిన సభాసభ్యుల సంఖ్య 200 అయినట్లు ప్లూటార్క్.

**42.** **సత్యసంధుడైన –** బ్రూటస్ మెసెల్లాతో తన భార్య పోర్షియాను గురించి ఎటువంటి వార్త రాలేదనటం, బహుశః అతడికి వచ్చిన లేఖల్లో ఆమెను గురించి వివరాలు ఏమై ఉంటాయో తెలుసుకోవటానికై ఉంటుంది.

**43** **ఎలాగైతేనేం :** పోర్షియా గతించింది – ఇది బ్రూటస్ అనుద్వేగానికి ప్రబల నిదర్శనం.

**44.** **రోమనులు ధరించే 'టోగా' ఉత్తరీయం వంటిది.** దానికి జేబులుండవు.

**45.** **నేను నీ దుష్టాత్మను –** ప్లూటార్క్ కూడా భూతాన్ని గురించిన ప్రశంస చేశాడు. కానీ అది సీజర్ భూతాకృతి అని వ్యవహరించలేదు.

**46.** **మళ్ళీ ఫిలిప్పీ దగ్గర కలుసుకుంటాను –** భూతాన్ని చూచి బ్రూటస్ మహాభయభ్రాంతుడై పోయినట్లు ప్లూటార్క్ షేక్స్‌పియర్ పాత్రపోషణ కోసం స్థైర్యమూర్తినిగా చిత్రించాడు.

## పంచమాంకం

**47. హైబ్లా :** సిసిలీలో తేనెకు ప్రసిద్ధి వహించిన ఒక ప్రాంతం.

**48. మరొక సీజర్ :** అతడి పేరు ఆక్టేవియస్ సీజర్ కావటంవల్ల అతడే.

నేను జన్మించింది ఈ నాడే. రోమనులకు జన్మదినోత్సవాలు చేసుకొనే ఆచారం లేదు.

**49. ఒకనాటి పాంపేలాగా –** అనుభవరహితులైన అనుచరులతో థాస్సలీలోన ఫారస్సేలియావద్ద క్రీ.పూ. 48లో పాంపే సుశిక్షితాలై సీజర్ నాయకత్వాన నడిచివచ్చిన సైన్యాలను ఎదుర్కొని ఓడిపోయాడు. అంతటితో సీజర్‌కు రోమను సామ్రాజ్యం మీద ఆధిపత్యం లభించింది.

**50. ఎపిక్యూరస్‌కు అనుయాయి –** ఎపిక్యూరస్ క్రీ.పూ. 241–270లో జీవించి ప్రత్యేక తాత్త్వికశాఖకు మార్గదర్శియైన సుప్రసిద్ధ గ్రీకు తత్త్వవేత్త. దేవతలకు మానవుల జీవితాలమీద ఎట్టి ప్రభావం లేదని, వారికి సదాచార సంపత్తి గల జీవితాన్ని గడిపి ఆనందానుభవాన్ని పొందటమే చరమలక్ష్యమని అతడి తత్త్వసిద్ధాంతాలకు సారం. అతడి దృష్టిలో శకునాలు కేవలం ఇంద్రియవిభ్రాంతులు.

**51 భరతపక్షులు :** 'ఈగిల్స్'. శుభసూచకాలు. కాకులు, గ్రద్దలు, కాకోలాలు దుశ్శకున సూచకాలు.

**52. కేటో :** బ్రూటస్ భార్య పోర్షియాకు తండ్రి. ఫారసేలియా యుద్ధంలో పాంపేవైపు చేరి సీజర్‌కు వ్యతిరేకంగా పోరాడాడు. పాంపే ఓడిపోయిన తరువాత 'ఉటికా' వైపునకు పోయినాడు. అప్పుడు సీజర్ హస్తాలలో పడిపోకుండా ఉండటానికిగాను ఆత్మహత్య చేసుకున్నాడు.

**53. పార్థియాలో నిన్ను నేను –** నేటి ఖారోసాన్‌కు రోమక సామ్రాజ్యంనాటి నామం పార్థియా. కాషియస్, క్రాస్సస్ పార్థియన్లను ఛర్రై అనే యుద్ధంలో ఓడించారు. ఆ సందర్భంలో కాషియస్ పిండారస్‌ను బానిసగా గైకొన్నాడు.

**54. రోము భానుడు అస్తమించాడు –** కాషియస్ మరణంతో రోములో ఆదర్శమైన ప్రజాస్వామిక భావం నశిస్తుంది. అందువల్లనే అతడు 'రోము భానుడు' అయినాడు.

**55. తుది మహోదాత్త రోమను వ్యక్తులారా!** – బానిసత్వం కంటె ఆత్మహత్య ద్వారా గౌరవాన్ని పోషించుకోవటం వల్ల బ్రూటస్ ఇలా వీరిద్దరినీ సంబోధించాడు.

**56. థసాస్** – ఫిలిప్పీకి, థ్రేస్‌కు సన్నిహితంగా ఉన్న ఒక ద్వీపం. కేటో యువకుడు – పోర్షియా తమ్ముడు. బ్రూటస్ బావమరది.

**57. ఇప్పుడు మూడైంది** – పైన అస్తమయసమయమని చెప్పి మళ్ళీ మూడైంది అనటం స్వవచనవ్యాఘాతం.

# ఆంటోని - క్లియోపాత్రా

షేక్స్పియర్ మహాకవి కృతము

"ఓహో! ఈమె తన సౌందర్య సమ్మోహనవిద్యతో
మరో ఆంటోనీని. నిబద్ధుణ్ణి చేయటానికో
అన్నట్లు నిద్రపోతున్నది"

**– సీజర్**

# అంకితము

## శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి

ఎం.ఏ. (ఆక్సుఫర్డు), బారెట్లా,
ఆంధ్రవిశ్వవిద్యాలయము రిజిస్ట్రారు వారికి
గౌరవ పురస్సరముగా

శా. శ్రీ లావణ్యపయోబ్ధివీచికలకున్ చిత్తంబు రంజిల్లఁగా
లీలామోదవిలాసహాసముల కేళీలోలుఁడై శ్రీప్రియా
హేలారమ్యసరోజలోచనరుచిన్ ఈక్షించు నాస్వామి గో
పాలస్వామి బుధాగ్రగణ్య! మిము సర్వశ్రీయుతున్ జేయుతన్.

శా. మర్మజ్ఞుండవు సర్వసత్కళల, ప్రేమజ్యోతి! దక్షుండవున్
ధర్మజ్ఞుండవు పాలనంబునను, విద్యావేత్తవున్, వక్తవున్,
నిర్మాణాత్మకశేముషీవిభవ! ఉన్నిద్రప్రభావుండవున్
కూర్మావంశశశాంక! ఎన్నదగు మాకున్ మిమ్ము సర్వజ్ఞగన్.

మ. కవినో కానొ యెఱుంగనట్టితరి నా కావ్యకృషిన్ జూచి "నీ
వవుదోయీ కవి" వంచు మెచ్చి యెద కాహ్లాదంబు చేకూర్చి ప్రా
భవమేపారఁగ "వీరగాథయగు నా పల్నాటిగాథన్ భవ
త్కవితానైపుణి మీరఁ జెప్పు" మని యాజ్ఞాపింపఁగాఁ జెప్పితిన్.

శా. ఆనాఁడాదిగ సాహితీవ్రతుఁడనై యత్యంత శ్రద్ధారతి
న్నే నానాగుణకావ్యమార్గముల వాణిన్ గొల్చుచున్నాఁడ – మీ
రానాఁ డిచ్చిన దోహదంబు ఘనమార్యా! తల్లతాజన్య మే
నీనాఁ డర్పణసేయ తెచ్చితి నిదే యీపుష్పమున్ బ్రీతితోన్.

ఉ. ఈసుమసౌరభంబులు మహిన్ మును ఖ్యాతి జెలంగినట్టి, వా
శాశల నాంగ్లసత్కవిక నంతయశస్సు గడించినట్టి, వే
నాస యొనర్చి కూర్చుకొని నట్టివి, యోరసికావతంస! మీ
కోసమె యెన్ని తెచ్చినవి కోర్కెమెయిన్ గ్రహియింపఁగాఁ దగున్.

# భూమిక

## చారిత్రిక పూర్వరంగం

బ్రూటస్ నాయకత్వాన ఏర్పడ్డ ప్రజాపక్షం ఫిలిప్పీయుద్ధభూమిలో రూపుమాసింది. విజేతలైన ఆంటోనీ ఆక్టేవియస్‌ల హస్తాలలో హత్యాకాండకు గురికాకుండా ప్రాణాలతో బయటపడ్డవారు కొందరు నూతనప్రభుత్వానికి తలొగ్గారు. కొందరు సిసిలీని జయించి పాలిస్తున్న సెక్టస్ పాంపేను చేరుకున్నారు. రోమక సామ్రాజ్యానికి 'త్రైకూటవీరులు' (ఆక్టేవియస్, ఆంటోనీ, లెపిడస్) ఏర్పడ్డారు. ఫిలిప్పీయుద్ధంలో విజయానికి మూల స్తంభమైన లెపిడస్‌కు ఆఫ్రికాలోని రాజ్యభాగాలను ఇచ్చివేసి, మిగిలిన రోమక సామ్రాజ్యాన్నంతటినీ ఆంటోనీ, ఆక్టేవియస్ అర్ధార్ధంగా పంచుకొన్నారు. ఆంటోనీ ప్రాగ్దేశాలను జయించి సామ్రాజ్యాన్ని వృద్ధి పొందించడం, ఆక్టేవియస్ వృద్ధయోధులను సంతృప్తిపరచటంకోసం కొన్ని భూములను పంచియిచ్చి, వారి సహాయంతో సిసిలీని పాలిస్తున్న సెక్టస్ పాంపేమీద యుద్ధాలను కొనసాగించటం వారిరువురూ చేసుకొన్న ఏర్పాటు. అప్పుడు ఆంటోనీ ద్వితీయ యౌవనంలో ఉన్నాడు. ఆక్టేవియస్‌కు ఇంకా ఇరువది ఒకటో సంవత్సరం నిండలేదు. ఇట్టిస్థితిలో సీజర్ సంపాదించి ఇచ్చిన రోమన్ సామ్రాజ్యానికి సత్యమైనవారసుడు పిత్రీయుడైన ఆక్టేవియసా లేక ఆప్తశిష్యుడైన ఆంటోనియా అన్న అంశం తేలవలసి ఉంది.

ఆంటోనీ క్రీ.పూ. 41 గ్రీసులోను, ఆసియాలోనూ విలాసాలతో గడిపి వేశాడు. తరువాతనే అతడికి సిడ్నస్ నదిమీద క్లియోపాత్రాతో సమావేశం చేకూరింది. అతడు ఆమె ఆప్తగణంలో ఒకడైపోయి, క్రీ.పూ. 41–40 చలికాలాన్నంతటినీ చిలిపిగా గడిపివేస్తున్నాడు. ఆ సమయంలోనే అతని భార్య ఫుల్వియా, అతని సోదరుడు లూషియస్ తొలుత తమలో తాము కలహించి సంధి చేసుకొని, ఇరువురూ ఏకమై, తరువాత ఆక్టేవియస్ మీద తలపడ్డారు. అతని శక్తికి నిలువలేక ఓడిపోయి దేశబహిష్కృతులైనారు. అప్పుడే పార్థియన్లు లెబైనస్ నాయకత్వాన లిబియా, అయోనియాలవరకు దండెత్తివచ్చారు. క్లియోపాత్రా ఇచ్చిన స్వాగతాన్ని, ఆతిథ్యాన్ని అందుకొని అనంతవిలాసాలమధ్య సర్వం మరిచి కాలాన్ని వెళ్లబుచ్చుతున్న ఆంటోనీకి, పైవార్తలు ఒక్కమారుగా వచ్చిపడ్డాయి. ఇట్టి స్థితిలో 'ఆంటోనీ – క్లియోపాత్రా' ప్రారంభమైంది.

తరువాత ఆంటోనీ క్రీ.పూ. 40 వసంతంలో క్లియోపాత్రా బాహుబంధాలలో నుంచీ ఎలాగో బయటపడి, అలెగ్జాండ్రియానుంచి ఆసియాకు, అక్కడినుంచి గ్రీసుకు పయనమైనాడు. అక్కడ ఆక్టేవియస్ పెరూసియాను జయించిన వార్తను తన భార్య ఫుల్వియావల్ల విని, అతడు ఇటలీకి వెళ్లుతుండగా త్రోవలో యుద్ధమంతటికీ మూలకారణం తన భార్య ఫుల్వియాయే అనీ, ఆమె తన్ను ఈజిప్టునుంచి రప్పించటానికి ఇంత చేస్తున్నదనీ తెలుసుకొన్నాడు. ఆంటోనీ – 'అదృష్టంవల్ల' క్రీ.పూ. 40లోనే అతని భార్య ఫుల్వియా మరణించింది. ఆ సంవత్సరమే ఆంటోనీ – ఆక్టేవియన్ల మధ్య బ్రుండూషియం సంధి జరుగుతుంది. రోమక సామ్రాజ్యాన్ని ఇరువురూ తిరిగి పంచుకొంటారు. ప్రాచ్యరాజ్యం ఆంటోనికి వచ్చింది. పార్థియన్ల దగ్గరినుంచీ అతడు ఆసియా మైనరును జయించవలసి ఉంది. పశ్చిమరాజ్యానికి అధినేత అయిన ఆక్టేవియస్ మీద సెక్టస్ పాంపేను రూపమాపవలసిన భారం పడ్డది. ఆక్టేవియస్ చెల్లెలైన ఆక్టేవియాతో ఆంటోనీకి వివాహం జరగటంవల్ల, ఆక్టేవియస్ – ఆంటోనీలమధ్య చక్కనిబాంధవ్యం కూడా ఏర్పడ్డది. క్రీ.పూ. 39లో ఆంటోనీ మైసినందగ్గిర పాంపేతో సంధి చేసుకొని, కొన్ని షరతులమీద సిసిలీ, సార్డీనియాలను అతనికి ఇచ్చి వేశాడు, తరిగానివేళ పార్థియన్ల మీద దండయాత్రను తలపెట్టి విఫలుడైనాడు. ఈ అపజయవార్తలు రోముకు చేరుకున్నాయి. రోమన్ ప్రజల్లో ఒక అలజడి బయలుదేరింది. క్లియోపాత్రాతో అతడు గడుపుతున్న కామైక జీవితం, అతని విలాసోన్మత్తత, భోగలాలసత రోములో పొక్కిపోయాయి. అంతటితో ఆంటోనీ రోములోని ఎందరో ఆప్తమిత్రులను పోగొట్టుకొన్నాడు. క్రీ.పూ. 32లో ఆంటోనీ – ఆక్టేవియాల వివాహం విచ్ఛిన్నమైంది. క్లియోపాత్రామీద ఆక్టేవియస్ యుద్ధాన్ని ప్రకటించాడు. రోమన్ మతానికీ, కుటుంబవ్యవస్థకూ ఆమెవల్ల అనంతనష్టం కలుగుతున్నదన్న ఉద్దేశంతోనూ, ఆతురతతోనూ రోమన్ ప్రజానీకం ఆక్టేవియస్ పక్షం వహించి, అండగా నిలిచారు. ఆంటోనీ – ఆక్టేవియస్ ఇరువురికీ క్రీ.పూ. 31 సెప్టెంబరు మాసంలో ఆక్టియంవద్ద ఘోరయుద్ధం జరిగింది. ఆక్టేవియస్‌కు విజయం చేకూరింది. అపజయంవల్ల అలెగ్జాండ్రియాకు పారిపోయిన తరువాతకూడా ఆంటోనీ – క్లియోపాత్రా వారి కామోన్మత్తవిలాసకేళీలోలతను కొనసాగిస్తూ వచ్చారు. విజయోత్సాహ దోహదంతో ఆక్టేవియస్ మరుసటి సంవత్సరం ఈజిప్టు మీదకే దండెత్తి అలెగ్జాండ్రియాను ముట్టడించడంతో, ఎదుర్కొని పరాజితుడైన ఆంటోనీ ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆత్మప్రాణహననంలో క్లియోపాత్రా 'పతి'యైన అతణ్ణి అనుసరించింది. వివాహం

జరిగినప్పుడు రోములో ఉన్న సమయంలోనే పార్థియన్లను శిక్షించటంకోసం తనక్రింద ఉన్న వెంటిడియస్ అనే ఒక సేనాపతిని పంపించాడు. ఒక జ్యోతిష్కుడు చేసిన సూచన మూలంగా అతడు ఆక్టేవియాతో కలిసి గ్రీసుకు వెళ్ళి కొంతకాలం గడుపుతాడు. వెంటిడియస్ విజయంతో తిరిగివస్తాడు. క్రీ.పూ. 38లో ఆంటోనీ మళ్ళీ ఇటలీకి వస్తాడు. అక్కడ అతడికి ఆక్టేవియా వల్ల ఒక పుత్రుడు జన్మిస్తాడు. తన భార్యను, బిడ్డను ఆక్టేవియస్ దగ్గిర ఉంచి ఆంటోనీ తన దృష్టిని ఆసియావైపునకు మరలించి ప్రయాణమౌతాడు. ఈ ప్రయాణంలో అతడికి క్లియోపాత్రాతో ప్రథమపరిచయం కలిగి, ప్రణయ మారంభమౌతుంది. అతడు ఆమెను మళ్ళీ క్రీ.పూ. 37లో కలుసుకొన్నాడు. అప్పటినుంచీ అతడు ఆ జగదేకసుందరి సౌందర్యవాగురలో చిక్కి, తన వీరగుణసంపదనంతటినీ క్రమక్రమంగా కోల్పోయినాడు. అలెగ్జాండ్రియాలో వసించిన ఈ కాలంలో అతడు ఒక ప్రాగ్దేశ నిరంకుశ పాలకుడుగా కాలం గడిపాడు. ప్రాచ్యసామ్రాజ్యాన్నంతటినీ నానారాజన్యులకు ఏలుకోమని పంచియివ్వటం, క్లియోపాత్రాకు, ఆమె సంతానానికీ ప్రత్యేక రాజ్యాలను కల్పించి పంచి, ప్రదానం చెయ్యటం, జరిపాడు.

## కథావస్తువు – ఆధారాలు

నాటకరచనకు పూనుకొన్నప్పుడు, తా నెన్నుకొన్న కథావస్తువుకు సంబంధించి తన కాలానికి లభ్యమానాలయ్యే సమస్తాధారాలను గ్రహించి వాటిని అనుసంధించి, ఒక అస్థిపంజరాన్ని చేకూర్చుకొనటం, తరువాత తన శిల్పనైపుణ్యంతో స్వీకరించిన కథ నొక సజీవమూర్తిగా చిత్రించటం మహాకవి షేక్స్పియర్‌కు ఆచారం. ఆంటోనీ–క్లియోపాత్రా సృష్టికి ఆయనకు లభించిన ప్రధానాధారం ప్లూటార్క్ రచనలు. చరిత్రకారుడు ప్లూటార్క్ రచించిన 'జీవితాలు' అన్న చరిత్రగ్రంథాన్ని, నార్త్ అనువాదంమూలంగా, షేక్స్పియర్ ఎంతో శ్రద్ధతో పరిశీలించాడు. క్రీ.శ. 16వ శతాబ్దంలో ఐరోపీయ నాటకకర్తలకు 'ఆంటోనీ – క్లియోపాత్రా' కథమీద విశేషాభిమానం ఉన్నట్లు ఫ్రాన్స్‌లోని జోడెల్లీ, గార్నియాల రచనలవల్లనూ, ఇంగ్లండులోని పెంబ్రోక్, డానియల్‌ల రచనలవల్లనూ తెలుస్తున్నది. షేక్స్పియర్ 'ఆంటోనీ – క్లియోపాత్రా' రచనకు ముందుగా పైవాటిలో అధమం పెంబ్రోక్, డానియల్‌ల రచనలైనా చూచి ఉంటాడు. ఈ కథావస్తువుతోనే పుట్టిన సెనికా విషాదాంతనాటకాలనుంచీ, ప్లినీచరిత్రకారుని రచనలకు హోలార్డ్ చేసిన అనువాదాలనుంచీ, పాంపేకు సంబంధించిన అంశాలను 1578 నాటి అప్పియన్ రచనలనుంచీ షేక్స్పియర్ ఎన్నో

విషయాలను గ్రహించి ఉండవచ్చు. క్రీ.శ. 1583లో కిన్థియో అనే ఇటలీరచయిత వ్రాసిన 'క్లియో పాత్రా'కు, షేక్స్పియర్ నాటకానికీ కొన్ని సాదృశ్యాలు కనిపిస్తున్నవి. కానీ ఈ సాదృశ్యాలు ఇరువురూ ప్లూటార్క్ చరిత్రకారుని అనుసరించటం వల్ల కలిగి ఉండవచ్చు. క్రీ.శ. 1595లో ఫ్రెంచి రచయిత మాంట్రియల్ తన 'క్లియోపాత్రా'ను ప్రచురించాడు. కాని దానికీ షేక్స్పియర్ రచనకూ సంబంధం ఉన్నట్లు కన్పించదు. ఒక'నీలవర్ణ'ను గురించి షేక్స్పియర్ కొన్ని మనోహరగేయాలు చెప్పాడు. ఆ గేయరచనకూ, 'ఆంటోనీ-క్లియోపాత్రా'కు కొంత సంబంధముందని విమర్శకాభిప్రాయం. ఆమె ప్రియుని దృష్టిలో సుందరి కావచ్చు. కానీ క్లియోపాత్రా లోకవిఖ్యాతిగన్న జగదేకసుందరి. ప్లూటార్క్ రచనల్లోని క్లియోపాత్రాయే షేక్స్పియర్ దృష్టి నాకర్షించి ఉండవచ్చు. ప్లూటార్క్ క్లియోపాత్రాను అధర్మ ప్రణయానురక్తయైన అపురూప సౌందర్యరాశిగా చిత్రిస్తే షేక్స్పియర్ ఆమెకు రాచరికమైన హృదయాన్ని కూడా ప్రసాదించి తీర్చిదిద్ది చిత్రించాడు. షేక్స్పియర్ మహాకవి కృతాలైన మహోత్తమ రూపకాలలో 'ఆంటోనీ-క్లియోపాత్రా'కొక విశిష్టస్థానముంది. దీనిని మించిన కేవల చారిత్రికరూపకం మరొకటి లేదనటంలో ఎటువంటి భిన్నాభిప్రాయమూ ఉండబోదు. ఇట్టి విశిష్టస్థానాన్ని దానికి కల్పించిన ప్రముఖకారణం ప్రముఖాధారమైన ప్లూటార్క్‌లో లభించిన చారిత్రకాంశాలను ఆధారంగా గ్రహించి, షేక్స్పియర్ కథలోని వ్యక్తుల శీలస్వరూప నిరూపణంలో చూపించిన వైలక్షణ్యం అనవలసివస్తుంది.

## షేక్స్పియర్ - ప్లూటార్క్

స్వోపజ్ఞవల్ల రూపకానికి సంక్రమింపజేసిన విశేషాలకు వెలియైన సమస్తాన్నీ ప్లూటార్క్ రచన షేక్స్పియర్‌కు అందించింది. ప్లూటార్క్ రచనల్లోని చారిత్రికాంశాలను షేక్స్పియర్ ఆంగ్లచరిత్ర లాధారంగా గ్రహించి రచించిన నాటకాలలో ఆంగ్లేయ చరిత్రల్లోను విషయాలను పాటించే దాని కంటే విశేషశ్రద్ధతో పాటించాడు. ప్లూటార్క్ వల్ల షేక్స్పియర్‌కు పరిపూర్ణమైన కథే కాకుండా, పాత్రలకు సంబంధించిన విశేషాలు, వర్ణనలు కూడా లభ్యమైనాయి. ఆంటోనీ గ్రీసులోనూ, ఆసియాలోనూ గడిపిన విలాసమయ జీవితాన్ని గురించీ, సిడ్నస్ నదిమీద క్లియోపాత్రాను కలుసుకొని సమ్మోహితుడై అలెగ్జాండ్రియాలో గడపిన అర్థరహితమైన కాముకజీవితాన్ని గురించీ, ప్లూటార్క్ షేక్స్పియర్‌కు ఎన్నో విశేషాలు ప్రసాదించాడు. క్లియోపాత్రాతోగూడి ఆంటోనీ అర్థరహితంగా నగరసంచారం చెయ్యాలనీ ఊహించటమూ, ఆంటోనీ సోదరుడైన లూషియస్, ఆంటోనీ భార్య ఫుల్వియా తొలుత తమలో తాము కలహించి తరువాత

ఇరువురూ కలిసి, ఆక్టేవియస్ సీజర్ మీద పోరాడి ఓడిపోయి ఇటలీనుంచి బహిష్కృతులైనట్లు వార్త రావటమూ, లిడియా – అయోనియాలవరకూ పార్థియన్లు వచ్చినట్లు తెలియటమూ అన్న ప్రథమాంకంలోని అంశాలన్నీ షేక్స్‌పియర్‌కు ఫ్లూటార్క్‌వల్లనే లభించాయి. ఫుల్వియా చేసిన విప్లవానికి ఆక్టేవియస్ కల్పించిన కారణమూ, విధురుడుగా ఆంటోనీ పరిస్థితీ, పాంపే ఆంటోనీ తల్లి యెడల చూపిన గౌరవాదరాలూ, సంధి కోరి పాంపేకు ఇచ్చిన షరతులు, క్లియోపాత్రాను గురించి ఆంటోనీ మానసికంగా తట్టాడటమూ, ఓడలమీద విందు మొదలైన ద్వితీయాంకంలోని అంశాలకు సంబంధించిన విశేషాలెన్నో షేక్స్పియర్‌కు ఫ్లూటార్కువల్ల లభ్యమైనాయి. విజయోపేతమైన వెంటిడియస్ జైత్రయాత్రల కాటంకం కలగటమూ, అందుకుగల కారణాలు, భర్తకు, సోదరుడికి తన అనురాగాన్ని సమానంగా పంచి యివ్వటానికి ఆక్టేవియా పడ్డ అవస్థ, పాంపే పతనం, లెపిడస్ విరూథనం, క్లియోపాత్రాకు, ఆమె సంతానానికీ ఆంటోనీ రాజ్యప్రదానం చెయ్యటం, యుద్ధభూమిలో క్లియోపాత్రా ఉండకూడదని అభ్యంతర పెట్టి ఎనోబార్బస్, ఆమె కొజ్జాలే యుద్ధాన్ని నడుపుతున్నట్లు లోకం భావిస్తున్నదని తెలియజేయటం, ఆంటోనీ ఆక్టేవియస్‌ను యుద్ధరంగంలో ఎదుర్కోవలసిందని సవాలు చేయటం, సైనికులు భూమిమీదనే పోరాడవలసిందని ఆంటోనీకి నివేదించటమూ, ఆక్టియం యుద్ధానికి సంబంధించిన అనేకవిశేషాంశాలూ, ఆంటోనీ మిత్రులకు తన సంపత్తినిచ్చి వీడ్కోలు చెప్పటమూ, జన్మదినోత్సవాలూ అనే తృతీయాంకంలోని అంశాలెన్నిటికో సంబంధించిన విశేషాలను, ఫ్లూటార్క్ షేక్స్‌పియర్‌కు అందజేశాడు. ఆంటోనీ చేసిన సవాలుకు ఆక్టేవియస్ తెలిపిన సమాధానం, విందువేళ ఆంటోనీ ప్రసంగం, విజయంతో తిరిగివచ్చి కవచబంధాన్ని విప్పనైనా విప్పకముందే ఆంటోనీ క్లియోపాత్రాను కౌగిలించుకోవటము, ఎనోబార్బస్ మృతి, క్లియోపాత్రామీద ఆంటోనీ క్రోధాన్ని వెళ్ళగ్రక్కటం, తన సమాధినిర్మాణం దగ్గరికి క్లియోపాత్రా పారిపోవటం, అన్న చతుర్థాంకంలోని అంశాలు, ఆంటోనీ మృతి, ఈ మరణవార్త ఆక్టేవియస్‌కు తెలియటం, క్లియోపాత్రాను గురించి ఆతని పన్నాగం, క్లియోపాత్రా ఆత్మహత్యాప్రయత్నం, గ్రామీణుడు క్లియోపాత్రాకు అత్తిపళ్ళను తెచ్చిపెట్టటం, మహారాజ్ఞిగా క్లియోపాత్రా తన్ను అలంకరించుకోవటం, ఆక్టేవియస్ సైనికులు రాకముందే క్లియోపాత్రా, ఐరాస్ మరణించటం, తుదిసారిగా ఛార్మియన్ క్లియోపాత్రాను సేవించటం, ఛార్మియన్ మృతి, ఆక్టేవియస్ వచ్చి క్లియోపాత్రా సాహసాన్ని ప్రశంసించి, ఆంటోనీ ప్రక్కనే ఆమెకు అంత్యసంస్కారాన్ని ప్రసాదించటం అన్న పంచమాంకంలోని విషయాలు కూడా షేక్స్‌పియర్‌కు ఫ్లూటార్క్ వల్ల లభించాయి.

సమగ్రదృష్టితో పై అంశాలన్నిటినీ పరిశీలించినప్పుడు, ‘ఆంటోనీ – క్లియోపాత్రా’ రచనవిషయంలో షేక్స్‌పియర్ ఉత్తరార్ధంలో విశేషంగా ప్లూటార్క్‌కు ఋణపడ్డట్లు గోచరిస్తుంది. ఆక్టేవియా విజ్ఞానసౌందర్య వినయాదికాలను, లెపిడిస్‌మాంద్యగుణాన్నీ, అలసట లేని ఆంటోనీ కాముకత్వాన్నీ, అనుక్షణం మార్పునొందే రోమక ప్రజాస్వభావాన్నీ, ఆక్టేవియస్ ప్రదర్శించే కృత్రిమ గౌరవాభిమానాలను, జిత్తులమారితనాన్నీ, క్లియోపాత్రా ఘనతనూ, మొదలైన పాత్రలకు సంబంధించిన గుణవిశేషాల నెన్నింటినో షేక్స్‌పియర్ ప్లూటార్క్‌వల్ల పొందగలిగాడు.

కానీ షేక్స్‌పియర్ గొప్పదనం కథాకల్పనకు సంబంధించింది కాదు. అతడు లభించిన వస్తువిశేషాన్ని ప్రదర్శించటంలోనే తన శిల్పప్రావీణ్యాన్నంతటినీ ప్రదర్శిస్తుంటాడు. పాత్రపోషణ, రూపకోచిత సంభాషణరచన, కవితాపాటవం, ఇత్యాది రూపకగుణవిశేషాలన్నీ షేక్స్‌పియర్ స్వకీయాలు. ఈ గుణవిశేషాలవల్లనే కేవలకథగా చరిత్రలో లభ్యమయ్యే “ఆంటోనీ – క్లియోపాత్రా” ఒక మహాశిల్పి తీర్చిదిద్దిన శిల్పఖండంలా పరిపక్వమైన కళాకౌశలాన్ని ప్రదర్శించి, రసికలోకాన్ని ముగ్ధం చెయ్యగలుగుతున్నది. ఈ పరిశుద్ధవిషాదాంతంతో పోటీకి నిలువదగ్గ రూపకం ఈతని ప్రథమగణ్యరచనలైన లియర్, హామ్లెట్, ఒథెల్లోలలో ఒకటితప్ప అఖిలాంగ్ల సాహిత్య ప్రపంచంలో మరొకటి కన్పించదు.

## మూలాతిక్రమణలు

షేక్స్‌పియర్ ప్లూటార్క్‌వల్ల లభించిన కొన్ని అంశాలను మార్చాడు  కొన్నిటిని వదిలివేశాడు. అతడు రాజకీయప్రాముఖ్యమున్న నూతనాంశాలనొక్క దాన్నయినా చేర్చలేదు. రూపకప్రక్రియకు ముఖ్యలక్షణం కనుక కొన్నిటిమీద తనదృష్టిని కేంద్రీకరించాడు. రూపకాంతంవరకూ క్లియోపాత్రాను గుప్తజాతివనితనుగానే ప్రదర్శించాడు. ఆమె యవనజన్యతను స్మరించలేదు. “నీలవర్ణ” మీద చెప్పిన గీతాలలో అతడు ప్రదర్శించిన దుఃఖం, ఈ ఆంటోనీ – క్లియోపాత్రా రచనాకాలంలో మహోల్బణాలతో అతణ్ణి కళవళ పెట్టినట్లు కనిపిస్తుంది. ‘స్వీయ ప్రణయవిధురతనే షేక్స్‌పియర్ ఆంటోనీ పాత్రకు ప్రసాదించాడా’ అనిపిస్తుంటుంది. లెపిడస్ మెకయ్‌నాస్ ఎగ్రిప్పాల సెలవుతీసుకోటం (ద్వితీయాంకం చతుర్థరంగం) ప్లూటార్క్‌లో కన్పించదు. నాటకీయంగా పరిశీలించినా ఈ దృశ్యానికి విశేష ప్రాముఖ్యమేమీ ఉన్నట్లు తోచదు. కానీ ఈ ఐతిహాసికరూపకంలోని ఈ దృశ్యంవల్ల, త్రైకూటవీరుల్లో ఒకడైన లెపిడస్ అసమర్థత నిరూపితమౌతున్నది. కథలో ఎంతో చక్కగా ఇది ఒదిగిపోవటంవల్ల

అనవసరమని అనలేము. ఆంటోనీకి శకునజ్ఞుడు చేసిన హెచ్చరికలను, సిడ్నస్ నదిమీద నిల్చి ఆంటోనీని సమ్మోహితుని చేసిన క్లియోపాత్రా వర్ణనను నడిపే సందర్భంలో, షేక్స్పియర్ మూలాన్ని కొంత మార్చాడు. పూర్వం ఆంటోనీలో కన్పట్టిన శౌర్యసాహసాదులను గురించి ఆక్టేవియా చేసిన ప్రసంగం ప్లూటార్క్ రచనలో ఎంతో ఘనంగా కనిపిస్తుంటే షేక్స్పియర్ దానిని తరువాతి కాలంలో ఆంటోనీ అనుభవించిన దుఃస్థితికి అనుగుణంగా మార్చి చిత్రించాడు. ఆంటోనీ పాంపేను కలుసుకొన్న తరువాత శకునజ్ఞుడు అతన్ని హెచ్చరించినట్లు మూలంలో ఉంటే, నాటకకర్త ముందే అతడు హెచ్చరించినట్లు మార్పుచేశాడు. ఈ మార్పువల్ల ఆంటోనీ తొందరపాటును సూచించటమే షేక్స్పియర్ సాధించిన ప్రయోజనం.

షేక్స్పియర్ ఈజిప్టుకు సంబంధించిన వర్ణనలన్నింటినీ హాలండ్ అనువదించిన ప్లినీచరిత్రకారుని రచనలవల్ల గ్రహించాడు. పాంపేకు సంబంధించిన విశేషాలెన్నో షేక్స్పియర్‌కు ఏప్పియన్ రచనలవల్ల లభించాయి. ఫుల్వియా మరణం, పాంపే దండయాత్ర అన్న రెండంశాలూ ఫుల్వియా, లూషియస్‌ల విప్లవయుద్ధవార్తతోనూ, పార్థియన్లు దండెత్తి రావటంతోనూ కలిసి తెలియటమనే అంశం, ప్లూటార్క్ రచనకు భిన్నం. ఆంటోనీ ద్వితీయవివాహం, ఆక్టేవియస్‌తో సంపూర్ణంగా శత్రుత్వం ఏర్పడే మధ్యకాలంలో ఆంటోనీ చేసిన ఇటలీ ప్రయాణాన్ని పరిత్యజించటం, సోదరుడికీ, భర్తకు సామరస్యాన్ని కుదర్చటానికి ఆక్టేవియా చేసిన రెండు యత్నాలను ఒకే యత్నంగా నిరూపించటం, ప్లూటార్క్ రచనకు భిన్నాలు. ఇటువంటి స్వల్పమైన మార్పులు కొన్ని గోచరించినా, షేక్స్పియర్ ప్లూటార్క్‌లో కన్పట్టే ప్రధానాంశాలను మార్చలేదు. కథను రూపకోచితంగా చేసేటందుకు తదనుగుణాలైన కొలదిమార్పులను మాత్రమే చేశాడు. ఇట్టి మార్పులతో ఒక అస్థిపంజరాన్ని నిర్మించుకొని తన శిల్పకళానైపుణ్యాన్ని ప్రదర్శించి, షేక్స్పియర్ ఆంటోనీ – క్లియోపాత్రాను ఒక జీవమయచిత్రంగా శిల్పించి, రసికలోకానికి కాన్క పెట్టాడు.

## పాత్రోన్మీలన – మూలాతిక్రమణలు

ఆంటోనీని పరిపూర్ణయోధుడుగా చిత్రించదలచిన షేక్స్పియర్ పార్థియనుల చేతుల్లో అతడు పొందిన ఓటమిమాట ఎత్తుకోకుండా వదలివేశాడు. ప్లూటార్క్ చిత్రించిన ఆంటోనీ క్రీడాలోలుడు, విలాసి. ఆంటోనీలో గోచరించే సాహసౌదార్యాదిసద్గుణాలు ప్లూటార్క్ రచనలోనూ లేకపోలేదు. కాని అందులో దోషపుంజాలమధ్య మరుగుపడి ఉన్న ఆ గుణాలకు షేక్స్పియర్ ప్రాధాన్యమిచ్చి చిత్రించాడు. సర్వనాశనం చేసిన

అతని కామలోలతను సహితం షేక్స్‌పియర్ మనోహరతూలికా విన్యాసాలతో మహోదాత్తంగా ప్రదర్శించి చూపాడు. సీజర్ మరణానంతరం చరిత్రగతినే మార్చగల సాహసౌదార్యాదిసద్గుణాలు గల వీరవ్యక్తిగానే అతడు షేక్స్‌పియర్ రూపకంలో గోచరిస్తున్నాడు. పతనావస్థలోనూ అతడు పరమోజ్జ్వలుడుగా ప్రవర్తించాడు. తంత్రజ్ఞుడైనా మేధావి. నిత్యోత్సాహి. దోషాన్వితుడైనా ప్రజ్ఞావిశేషుడైన ఈ ఆంటోనీ విధివిలసనానికి చిక్కి పోతున్నప్పుడు, పాఠకలోకం జాలి పొందితీరుతుంది. ప్లూటార్క్ చిత్రించిన ఆంటోనీలో ప్రసిద్ధమైన ఆంటోనీ ప్రణయోన్మాదప్రసక్తి లేదు. షేక్స్‌పియర్ నిరూపించిన ఆంటోనీ ప్రపంచ ప్రణయచరిత్రలో విశిష్టరూపరేఖలతో నిలిచి కన్పట్టే నిస్తులప్రియుడు.

షేక్స్‌పియర్ చిత్రించిన క్లియోపాత్రా గుణాదికాలవిషయంలో సర్వవిధాలా చరిత్రలోని క్లియోపాత్రానే పోలి ఉంది. సామాన్య జీవితానికి ఎంతో వ్యతిరిక్తమైంది కావటం వల్ల నైతికదృష్టితో పరిశీలిస్తే, ఆమె జీవితంమీద మనకసహ్యం కలిగితీరుతుంది. ప్లూటార్క్ క్లియోపాత్రా మనలో కలిగించే సంచలనమిదే. షేక్స్‌పియర్ ఆమె నైతికపతనానికి చుట్టూ ఒక రమణీయవాతావరణాన్ని సృజించి ఆమెనొక నిరుపమాన శిల్పమూర్తిగా నిల్పాడు. షేక్స్‌పియర్ క్లియోపాత్రా జీవితం రూపొందిన కవితావిలాసం. అది కర్తవ్యాన్నిగాని, బాధ్యతలనుగాని ఎరుగదు. అపురూప సౌందర్యం, ఆశ్చర్యకరహావభావాది శృంగారవిలాసాలు ఆమె ప్రశస్తికి కారణాలు. విజ్ఞానం, సంస్కృతి దానికి దోహదాలు. ఏ ఆదర్శాన్నీ అంటిపెట్టుకోని ఆమె అనంతభావోల్బణాలు ముగ్ధమనోహరాలు. ఆమె కన్నులు పరమవీరులనైనా పతితులను చేయగల సమ్మోహనవిద్యా రహస్యాలకు విరామ మెరుగని నిలయాలు. తన సమ్మోహన గుణానికామె యెటువంటి అవకుంఠనాన్నీ కల్పించకపోయినా ప్రాగ్దేశరాజ్ఞిగా ప్రణుతి కెక్కింది. నిలువెల్లా కన్పట్టే ఆమెలోని 'రాజఠీవి' మనల నాకట్టుకొని సర్వదోషాలనూ విస్మరించేటట్లు చేస్తుంది. ఆమె అనంత వైవిధ్యం నిరంతరప్రదర్శనలవల్ల ప్రాతవడేది కాదు. ఆమె వయస్సువల్ల వాడేది కాదు.

ప్రాచీన చరిత్రకారులు ఆక్టేవియస్ సీజర్‌ను వీరుడుగా పరిగణించారు. కాని మహాకవి షేక్స్‌పియర్ ఆక్టేవియస్ పాత్రను సృజించటంలో చరిత్రాత్మకంగా అతనికున్న కీర్తిప్రతిష్ఠలను చూసి విస్తుపోలేదు. నిరంతర విజయాలవల్ల అతనికి లభ్యమౌతూ వచ్చిన గౌరవాదులను చొచ్చిచూచి అతణ్ణి ఒక'అల్పమానిసి'నిగా చిత్రించాడు. హృదయ రాహిత్యం, ప్రతీకారేచ్ఛ, గర్వం, సంకుచిత దృష్టి మొదలైన అతని అల్పగుణాలను

వెలికితీసి ప్రదర్శించి, అతని ప్రతియోగం మూలంగా తన కథానాయకుడైన ఆంటోనీకి షేక్స్పియర్ ఔత్కృష్ట్యాన్ని కల్పించాడు. ఈ దృష్టితో ఆక్టేవియస్‌ను చిత్రించదలచిన షేక్స్పియర్, అందుకు అవసరమైన చరిత్రలో కన్పించే అతని గుణాలను కూడా కొన్నిటిని గ్రహించలేక పోలేదు. షేక్స్పియర్ చిత్రించిన ఆక్టేవియస్‌ను చూస్తే చరిత్రలోని ఆక్టేవియస్ లాగా గౌరవార్హుడు, ప్రీతిపాత్రుడు అన్న అభిప్రాయం మనకు కలుగదు.

చరిత్రలో కన్పించే ఆక్టేవియాను షేక్స్పియర్ ఎంతో మరుగుపరచి చిత్రించాడు. ఆమె అచంచలపతిభక్తిని, సౌందర్యగుణాలను విశేషంగా స్వీకరించలేదు. కార్యనిశ్చయపరిజ్ఞానం, సాధనాసామర్థ్యం, ఉత్తమలక్ష్య లగ్నబుద్ధి, మొదలైన ఆమెగుణవిశేషాలను స్వీకరించలేదు. ఆంటోనీ వల్ల ఆమెకు కలిగిన సంతానప్రసక్తి నాటకంలో లేదు. ఆంటోనీపుత్రుడైన ఆంటిల్లస్, క్లియోపాత్రా కుమారుడైన సిజేరియన్ పొందిన దారుణమృతిని చరిత్రలు ఎంతో విపులంగా వర్ణించాయి. షేక్స్పియర్ వాటిని ఒక సందర్భంలో ఉటంకించటంతో ఊరుకొన్నాడు. చరిత్రలో వారి మరణానికి క్లియోపాత్రా ఎంతగానో విలపించటం కనిపిస్తుంటే, షేక్స్పియర్ ఆ ప్రశంసైనా చెయ్యకపోవటం ప్రేమికులైన ఆంటోనీ క్లియోపాత్రాల పరస్పరానురాగపతిష్ఠతను ప్రదర్శించటంకోసమే అని భావించవలసి వుంటుంది.

ప్లూటార్క్‌లో ఎనోబార్బస్‌కు సంబంధించి ఒకటి రెండు వాక్యాల కంటే లేవు. వాటి ఆధారంతో షేక్స్పియర్, దుర్దశావిద్ధుడైన ఆంటోనీని సర్వపరివారం పరిత్యజిస్తున్న సమయంలో అచంచలస్వామిభక్తిని ప్రదర్శించి విశిష్టతను గడించుకొన్న ఒక నూతనవ్యక్తిగా తీర్చిదిద్దాడు. ప్లూటార్క్‌లో ఉన్న స్కారస్‌కు ఒక ప్రత్యేకత అంటూ ఏమీ లేకపోగా, అతడు తన ప్రభువైన ఆంటోనీని వదిలిపెట్టి ఆక్టేవియస్ వంకకు వెళ్లిపోతాడు. 'ఆంటోనీ – క్లియోపాత్రా'లోని స్కారస్ తుదిక్షణందాకా ఆంటోనీని అంటిపెట్టుకొని ఉండి, అతని కడపటి ఆజ్ఞను భక్తితో అనుసరిస్తాడు. క్లియోపాత్రాయెడ ఆంటోనీ ప్రదర్శించిన వ్యామోహాన్ని చూచి సహించలేక ఎంతగా ఖిన్నుడైనా, ఇతడు తుదిదాకా అనుసరించాడే గాని, పరిత్యజించటమనే స్వామిద్రోహానికి పాల్పడలేదు.

## ఆంటోనీ – క్లియోపాత్రా : షేక్స్పియర్ ఆత్మీయత

షేక్స్పియర్ మహాకవి జీవితంలోని యౌవనదశలో ఒక ప్రణయకథ నడిచి భగ్నమైందనీ, ఆ కథకు నాయిక అయిన వ్యక్తినే ఆ కవీంద్రుడు తన గీతాలల్లో (సానెట్లు) 'నీలవర్ణ' అనే పేరుతో వ్యవహరించాడనీ, అతని ప్రణయజీవితకథకూ –

ఆంటోనీ – క్లియోపాత్రాలోని ప్రణయకథకూ కొంత సంబంధమున్నదనీ విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ సంబంధానికి విశేషగౌరవం ఇచ్చే అవకాశం లేదు. షేక్స్పియర్ యౌవనదశలో నడిచిన ప్రణయమూ, ఆంటోనీ ప్రణయమూ రెండూ ధర్మేతరాలు. గీతాలలోని నీలవర్ణ, నాటకంలోని క్లియోపాత్రాకు మూలమని అనటానికి అవకాశం లేదు. ఆమె ప్లూటార్క్లో లభించిన క్లియోపాత్రాయే. అయినా గీతాలలోని నీలవర్ణకు సంబంధించిన స్మృతులు షేక్స్పియర్కు జీవితాలలోని క్లియోపాత్రా పాత్రలోని కవితను వ్యక్తం చేసి ఉండవచ్చు. గీతాలలోని నీలవర్ణలాగానే షేక్స్పియర్ క్లియోపాత్రా నీలవర్ణం అయి ఉండటం గీతాలకూ, నాటకానికీ ఉన్న సామ్యం. ప్రాచ్యమైన జ్యోతిష్మతీత్వంతోను, అపురూప సౌందర్యంతోను, అనన్యసాధారణచంచల విలాసాలతోనూ, భోగపరతంత్రతతోనూ మభ్యపెట్టి, తన దోషాలమీదికి ఆంటోనీ మనస్సును మరలనీయకుండా చేసి, అతణ్ణి పాలించిన 'ప్రాక్తార' క్లియోపాత్రా చరిత్రలోని వ్యక్తే గాని, షేక్స్పియర్ చిత్తాన్ని క్షుభితం చేసిన నీలవర్ణ కాజాలదు. ఆంటోనీ – క్లియోపాత్రాల ప్రణయపరిణామాన్ని చిత్రించటంలో షేక్స్పియర్కు కొంతగా తన ప్రణయకథ తోడ్పడి ఉండవచ్చు. దీనినిబట్టి నాటకంలో ప్రతిబింబితమైన నాటకకర్త ఆత్మీయత ఇంతమాత్రమే అనవచ్చు.

ప్లూటార్క్ ననుసరించి ఆంటోనీ వయస్సు ఏబదిమూడు సంవత్సరాలు. కథారంభం నాటికి అతనికి నలుబది ఆరు సంవత్సరాలు ఉండి ఉండవచ్చు. ఈ నాటక రచనాకాలానికి షేక్స్పియర్ వయస్సు దరిదాపుగా అంతే ఉంది. అతడు యుద్ధరంగాలలో, ఇతడు సాహిత్యరంగాలల్లో సమానంగానే విజయాలు చేకొన్నారు. భవిష్యత్తును గురించి ఇరువురి దృష్టీ ఒకవిధంగా నడవటానికి అవకాశముంది. అయినా షేక్స్పియర్ తనయవ్వన కాల ప్రణయాన్ని స్మృతికి తెచ్చుకొని, నవ్యత నాపాదించి, దాన్ని కొంతగా 'ఆంటోనీ – క్లియోపాత్రా' రచనమూలంగా ప్రదర్శించి ఉండవచ్చు.

## కథావస్తు పరిశీలనం

భుజబుద్ధి సంపన్నత చేత శత్రుసంహారం చేసి రోమకమహాపురుషుల్లో ఒకడని విఖ్యాతిగన్న మార్క్ ఆంటోనీ మహాశయుణ్ణి, ఈజిప్టు రాజ్ఞి క్లియోపాత్రా తన అపురూప సౌందర్యంతో ఆకర్షించి, విలాసప్రియత్వాన్ని నేర్పి, అలెగ్జాండ్రియాలో ఒక కామారాధకుణ్ణి చేసి కట్టిపడేస్తుంది. తన సర్వస్వం ఆ ఈజిప్టు సామ్రాజ్ఞియే అయినా, అతని కప్పుడప్పుడూ సహజ దేశాభిమానంవల్ల రోమకభావాలు కలిగి, కలతపెడుతూ

ఉండేవి. పరిపూర్ణంగా క్లియోపాత్రాను పరిత్యజించటం అతనికి ఇష్టం కాలేదు. అతని భార్య ఫుల్వియయా మృతివల్ల, అతడు తాత్కాలికంగానైనా క్లియోపాత్రా బాహుబంధాలనుంచి బయటపడి రోముకు వెళ్లుతాడు. రాజకీయంగా తన అధికారాన్ని బలవత్తరం చేసుకొందామనే ఉద్దేశం ఏమీ లేకుండానే ఆంటోనీ రోముకు వెళ్ళటంతో, త్రైకూటవీరుల్లో ఒకడైన ఆక్టేవియస్ సీజర్, అతడితో మైత్రి నేర్పరుచుకొని బలం చేకూర్చుకోవటం జరిగింది. వీరిరువురి మధ్య ఆక్టేవియా వివాహం వల్ల, ఏర్పడ్డ మైత్రి మనఃపూర్వకమైంది కాకపోవటం వల్ల, అది తరువాత తొలుత అంతఃకలహానికీ, తుదిని ఆంటోనీ వినాశానికీ దారితీసింది. తన హృదయాన్ని కాజేసిన క్లియోపాత్రాను పరిత్యజించకుండానే ఆంటోనీ ఆక్టేవియస్ సోదరి ఆక్టేవియాను వివాహమాడటం కేవలం అర్థరహితమైన పని. చిక్కిన అవకాశాన్ని ఉపయోగించుకొందామని ఆంటోనీ చేసుకున్న ఈ వివాహంవల్ల, పాంపే మూలంగా ఆక్టేవియస్‌కు కలుగనున్న శ్రమను సర్వాన్నీ తీర్చే భారం అతడిమీద పడ్డది. రోమకరాజ్యంలో ఆక్టేవియస్‌మీద ప్రజలకు గాఢమైన అసంతృప్తి ప్రబలమై ఉన్న దినాలలో, అతడిమీద పడి నాశనం చేయవలసి ఉండగా, ఆంటోనీ అందుకు భిన్నంగా అతని సోదరిని ఆక్టేవియాను వివాహమాడటం వల్ల ఆక్టేవియస్‌కు బలం కలిగి, నిలువత్రొక్కుకోగలిగాడు. వివాహానంతరం ఆంటోనీ – ఆక్టేవియస్‌ల మధ్య విరతి యెరుగని మనస్పర్ధ లేర్పడ్డాయి. ఆంటోనీ ఆక్టేవియాను పరిత్యజించి తిరిగి ఈజిప్టుకు వెళ్ళిపోయి, తన ప్రియురాలైన క్లియోపాత్రాను చేరుకొన్నాడు.

అటు తరవాత కూడా ఆంటోనీకి ఆక్టేవియస్‌మీద విజయాన్ని సాధించటానికి విధి ఎంతో అనుకూలంగా ఉన్నా, అతడేమీ చేయటానికి పూనుకోలేదు. ఆంటోనీ ఆక్టియం యుద్ధంలో ఒకదాని తరవాత ఒకటిగా – ఎన్నో తప్పిదాలు చేశాడు. ఆప్తుడైన ఎనోబార్బస్ ఎంత చెప్పినా వినక, యుద్ధభూమిలో క్లియోపాత్రా ఉండిపోవటానికి అంగీకరించటం, ఆమెను సంతృప్తి పరచటానికి ఎనోబార్బస్, కాసెడియస్ చెప్పిన ఉపపత్తులన్నిటినీ త్రోసిపుచ్చటం, నౌకలతిభారోపేతాలైనవైనా సైనికులు సముద్రయుద్ధ ప్రావీణ్యం లేనివారైనా, ఆక్టేవియస్ కోరగానే అతడితో సముద్రంమీద యుద్ధం చెయ్యటానికి ఒప్పుకోవటం మొదలైనవి ఆంటోనీ తప్పిదాలు. కానీ అతని అసామాన్యనాయకత్వం అతని సైనికులకు మహోత్సాహాన్ని కల్పించి పోరాడించింది. అయితే ఏం ప్రయోజనం? క్లియోపాత్రా పిరికివడి యుద్ధభూమినుంచీ తన అరువదినౌకలతో వలియబారి పారిపోవడంతో అర్థరహితంగా ఆమెను అనుసరించిన ఆంటోనీకి ఆక్టియంలో అపజయం కలిగింది. అంతటితోటే అతని అదృష్టం

వ్యతిరేకించిందని అనలేం. తరువాత అనతికాలంలోనే అతనిపక్షం నుంచి సైనికులు కొందరు వెళ్ళిపోయి శత్రుపక్షంలో చేరినప్పటికీ, ఇంకా అతనికి ఈజిప్టునుంచి ఆక్టేవియస్‌ను ఎదుర్కొనే అంగబలం ఉండనేఉంది. అనాలోచితంగా అతడు సంధియత్నం ఆరంభించాడు. విజేతఅయిన ఆక్టేవియస్ ఆంటోనీని విడిచిపెట్టమని క్లియోపాత్రాను కోరటం, ఆమె నిరాకరించటం, ఆక్టేవియస్ అలెగ్జాండ్రియా మీదికి ఎత్తిరావటం సంభవించాయి. అలెగ్జాండ్రియా యుద్ధంలో తొలినాడు ఆంటోనీకి స్వల్ప విజయం సంప్రాప్తించినా, మరునాడు అతని నౌకలు మోసగించటంవల్ల ఆంటోనీ పూర్తిగా ఓడిపోవటమూ, ఆక్టేవియస్‌కు పరిపూర్ణవిజయం లభించటం జరుగుతుంది. క్లియోపాత్రా అసత్యమరణవార్తను విని ఆంటోనీ ఆత్మహత్యకు పూనుకోవటం, ఖడ్గం సరియైన ఘాతను కల్పించకపోవటం చేత కేవలం బలమైన గాయం తగలటమేగాని, ప్రాణాలు కొంతసేపటిదాకా పోకపోవటం, అతణ్ణి క్లియోపాత్రా ఉన్న సమాధి నిర్మాణం దగ్గరికి చేర్చటం, అతడు క్లియోపాత్రా మరణం అసత్యమని గమనించటం, అక్కడ అతడు క్లియోపాత్రా బాహువుల్లోనే మరణించటం జరుగుతాయి. ఆక్టేవియస్ సీజర్‌కు విజయచిహ్నంగా జీవించదలచుకోక క్లియోపాత్రా ఆంటోనీని అనుసరించటానికి నిశ్చయించి 'కీటకం' చేత కరిపించుకొని ప్రాణపరిత్యాగం చెయ్యటంతో ఆమె జీవితం పరిసమాప్తమవుతుంది. కరుణారసభూయిష్ఠమైన ఆ ప్రదేశానికి వచ్చిన ఆక్టేవియస్, సైనికగౌరవాలతో ఆంటోనీ, క్లియోపాత్రాలకు అంత్యక్రియలను జరిపించటంతో "ఆంటోనీ – క్లియోపాత్రా" రూపకం పరిసమాప్తమవుతుంది.

## నాటక నిర్మాణం

అత్యుత్తమ శ్రేణికి చెందిన షేక్స్పియర్ మహాకవి రచనల్లో 'ఆంటోనీ – క్లియోపాత్రా' ఒక విశిష్టస్థానాన్ని గడించుకొన్నది. ఇంత అప్రయత్నంగా రచయిత అంతరంగంనుంచి వెలువడ్డదిగాని, ఇంతగా చరిత్రాత్మకమైంది గాని షేక్స్పియర్ రచనల్లో మరొకటి లేదని అనిపించుకొన్నది. ఆ రూపకంలోని పాత్రలనే పునః ప్రదర్శించటం చేతనూ, కథాగమన విషయంలో దానికీ దీనికీ అత్యంతసామ్యం, సాన్నిహిత్యం ఉండటంచేతను 'జూలియస్ సీజర్'తో 'ఆంటోనీ – క్లియోపాత్రా'కు కొంత సంబంధం ఉన్నట్లు వ్యక్తమౌతుంది. కానీ దానికీ దీనికీ, స్వభావంలో ఎంతో విభేదముంది. జూలియస్ సీజర్‌లో కర్తవ్య పాలనమనే ఆదర్శం ప్రముఖ స్థానాన్ని వహించింది. ఆంటోనీ – క్లియోపాత్రాలో ఇంద్రియకాముకత్వానికీ, అతిశయమైన స్వార్థపరత్వానికీ జరిగిన సంఘర్షణ ప్రదర్శితమైంది. జూలియస్ సీజర్‌లోని బ్రూటస్‌ను

నడిపించిన ధర్మసూత్రం వంటి సూత్రమొకటి, ఈ నాటకంలోని నాయకుడైన ఆంటోనీకి మార్గదర్శకమై నడిపించినట్లు కన్పించదు. తొలుత ఈతణ్ణి కాముకత్వం, తరువాత స్వార్థపరత్వం ఆవహించి, అనుచరుణ్ణి చేసుకొన్నట్లు ద్యోతకమౌతుంది. అందులోని పోర్షియాకు, ఇందులోని క్లియోపాత్రాకు పోలికేలేదు. ఇరువురూ భిన్నప్రకృతులు. ఇరువురూ పొందిన సంస్కారాలు భిన్నాలు. నిర్మాణ విషయంలో జూలియస్ సీజర్ అతిసామాన్యమైంది బహువిధసన్నివేశ వైవిధ్యంతో ఆంటోనీ – క్లియోపాత్ర అతిక్లిష్టమైంది.

రోమక చరిత్రలో క్రీ.పూ. 40 మొదలు 30 వరకు పది సంవత్సరాల మధ్యకాలంలో జరిగిన ప్రధానాలైన సమస్తచారిత్రిక సన్నివేశాలను షేక్స్‌పియర్ 'ఆంటోనీ – క్లియోపాత్రా'ను నిర్మించటంలో అత్యాశ్చర్యజనకంగా అనుసరించాడు. రూపక శిల్పానుగుణంగా స్వల్పాంశాలను పునర్వర్గీకరించి, వాటికొక నూతనప్రాముఖ్యాన్ని కల్పించి ఉపయోగించుకొన్నాడు. ఇట్టి రచనా ప్రణాళికను అనుసరించటంవల్లనే ఆ మహాకవికి ఆంటోనీ – క్లియోపాత్రాలోని వివిధపాత్రలను విశిష్టగుణభూయిష్ఠాలుగా చిత్రించే అవకాశం లభ్యమైంది. కథావస్తువు ఈజిప్టునుంచి రోముకు, రోమునుంచి మైసినంకు, మైసినంనుంచి ఈజిప్టుకు, ఈజిప్టునుంచి ఆక్టియంకు, అక్కడినుంచి అలెగ్జాండ్రియాకు నిర్విరామంగా పరువులెత్తింది. రోమక రాజ్యాన్ని 'త్రైకూటవీరులు' పంచుకోటం మొదలుగా, వారిలో ఒకడైన ఆక్టేవియస్ మిగిలిన ఇరువురిమీద విజయాన్ని సాధించి రోమక ప్రపంచానికి ఏకైకపాలకుడయ్యేటంతవరకూ నడచిన కార్యవిశేషాలన్నీ, ఈ ఆంటోనీ – క్లియోపాత్రాలో ప్రదర్శితాలైనాయి. వివిధ కథావిశేషాలతో కార్యగమనానికి ఒక వినియోగం ఉన్నట్లు బాహ్యదృష్టికి గోచరించినా, దానికి ఒక కేంద్రం లేకపోలేదు. ఆంటోనీ క్లియోపాత్రాలనే వ్యక్తిద్వయమే ఆ కేంద్రం. ఈ దంపతుల ప్రణయకథమీద పాఠకలోకానికి సానుభూతిని కల్పిద్దామనే ఉద్దేశంతోనే రచయిత చరిత్రలోని పార్థియన్ యుద్ధవిశేషాలను ఎత్తివేశాడు. ఆ యుద్ధంలో ఆంటోనీ పరిత్యక్త కామావ కుంఠనమైన వీరాన్ని ప్రదర్శించాడు. అట్టి రససన్నివేశాన్ని ప్రదర్శించటంవల్ల ఆంటోనీ కాముకత్వం కొంత మరుగుపడటమే ఇందుకు కారణం.

ప్లూటార్క్ రచనలలో ఆంటోనీలోని గుణదోషాలు రెండూ యథాతథంగా గోచరిస్తున్నవి. ఆ చరిత్రకారుడు రెంటినీ సమన్వయించి ఆంటోనీ జీవితలక్ష్యాన్ని నిర్ణయించి చూపటానికి ఎట్టి యత్నమూ చేయలేదు. 'జీవితా'లలోని ఆంటోనీ రూపకంలోని ఆంటోనీలా ఒక గంభీరవ్యక్తి కాడు. చరిత్రలో కన్పించే ఆంటోనీలోని

ఉదాత్తగుణాలన్నిటినీ షేక్స్పియర్ రాశీభూతంచేసి రూపకంలో ప్రదర్శించాడు. పరమోదాత్తమైన అతని వ్యక్తిత్వం పతనావస్థలో సహితం మనలను ఆకర్షిస్తున్నది. ఆంటోనీయెడ ఆక్టేవియా చూపిన భక్తివిశ్వాసాలు మూలంలో విశేషంగా ప్రదర్శితాలైనాయి. వాటిని యథాతథంగా నిరూపిస్తే ఆంటోనీ – క్లియోపాత్రాల ప్రేమబంధానికి విరతి కలుగుతుంది కనుక షేక్స్పియర్ వాటన్నిటినీ విడిచిపెట్టి, నాయికానాయకుల ప్రణయైకజీవితానికి ప్రాచుర్యాన్ని కల్గించే అంశాలకే ప్రాముఖ్యాన్నిచ్చాడు. ఈ కారణంవల్లనే ఆంటోనీ సర్వప్రపంచ సాహిత్యాలల్లోని ప్రేమికులందరిలో అతివిశిష్టుడన్న విఖ్యాతి గడించుకోగలిగాడు.

"షేక్స్పియర్ రచించిన చరిత్రాత్మక నాటకాలన్నిటిలో "ఆంటోనీ – క్లియోపాత్రా" అద్భుతావహమైంది" అన్నాడు కోల్రిడ్జి పండితుడు. ఆయన అన్నట్లు ఇది ఒక చరిత్రాత్మక రూపకం. ఇందులో నాటకకర్త అతి సూక్ష్మాంశాలను గూడా ఎంతో సన్నిహితంగా అనుసరించాడు. ఇది కేవలం చరిత్రే కాదు  ఒక ప్రణయకావ్యం కూడాను. నాయికానాయకుల ప్రణయ ప్రవర్తనలోని నీత్యవినీతులమీదికి మనదృష్టిని అణుమాత్రమైనా ప్రసరించకుండా, ఇంద్రజాలికమైన తన ప్రతిభతో షేక్స్పియర్ ఒక రమణీయమైన యవనికను సృజించి మభ్యపెట్టాడు. ఇందులోని ఆంటోనీ క్లియోపాత్రాలు ఒకరికొకరు దేవతలు. తప్పనిసరియై తానే మృత్యువు నాహ్వానించి లొంగిపోయిన క్లియోపాత్రా కూడా, తుదకు ఏదో విజయాన్ని సాధించిందన్న భ్రాంతి మనకు కలిగించి తీరుతుంది. ధర్మేతరప్రణయాన్ని ఆరాధించిన నాయికానాయకులమీద మనకు గౌరవాభిమానాలు కలిగేటట్టు చేసిన షేక్స్పియర్ అవినీతిప్రవర్తకుడని అనుకోటానికి అవకాశం లేదు. ఆయన అత్యుత్తమ నీతిప్రతిపాదకుడు. బలసౌందర్యాలకైనా కొంత అవధి, కాలం మాత్రం ఉంటాయనీ, చెడువల్ల మంచి ఎప్పుడూ సంప్రాప్తించదనీ, కాంతాసమ్మితతయా ఉపదేశించి ఈ రూపకమూలంగా ఆయన ఒక ఉత్తమనీతినే ప్రబోధించాడు. అయితే ఆయన ఆంటోనీ – క్లియోపాత్రాల కామలౌల్య విలాసవ్యాపారాలకు ఎటువంటి లోటునూ కల్పించలేదు. అది శిల్పదృష్ట్యా ఒక లోపం కూడాను.

## ఆంటోనీ – క్లియోపాత్రా – నేత

రోమక నాటకాలలో చరిత్రికాంశాలను మలచటంలోనూ, తత్కాలీనమైన వాతావరణాన్ని కల్పించటంలోనూ మహాకవి షేక్స్పియర్ విశేషశ్రద్ధ వహించాడు. అయినప్పటికీ కథాకాలంనాటి రోమకవ్యక్తుల మానవత్వాన్ని దర్శించి ప్రదర్శించటమే

ఆయన నాటకరచన ముఖ్యోద్దేశం. ఈ కారణంవల్లనే "షేక్స్పియర్ రోమక నాటకాలలోని నాయకులు తొలుత మానవులు తరువాత రోమనులు" అన్న సూక్తి బయలుదేరింది. 'ఆయన రోమక నాటకాలన్నిటికీ నేత రోమే' అన్న మరొక విమర్శకవాక్యం కూడా లోకంలో విశేషప్రాచుర్యం వహించింది. రోమక నాటకాలకు కొంత రాజకీయ ప్రాముఖ్యం ఉన్నమాట సత్యమే. కానీ ఈ కథావస్తువులలో షేక్స్పియర్ మహాకవిని ఆకర్షించినవి ఆ చరిత్రల్లోని వ్యక్తుల ఆత్మలు.

ఆంటోనీ క్లియోపాత్రా కేవలం విషాదాంతం కాదు అది చరిత్రాత్మక విషాదాంతం లేదా విషాదాంతచరిత్ర. ఈ కథకున్న చారిత్రికసంబంధం కేవలం బాహ్యం అందుచేత ఈ నాటకం ప్లూటార్కునుంచి గ్రహించిన చారిత్రికాంశాలను అనుసరించి నిర్మితమైనప్పటికీ ఇది చరిత్ర కాదు, విషాదాంతం. ఇందులో ప్రాధాన్యం నీతిది. రోమక సచ్ఛీలానికి, సాహసానికీ స్వస్తి చెప్పి సర్వకాల సర్వావస్థల్లోనూ కామవిలాసవిలోలుడై వ్యవహరించటమనే నైతికదోషమే ఆంటోనీలోని గొప్పలోపం. అందువల్లనే అతడికి, అతని ఆదర్శాలకూ భంగపాటు కలిగింది. విషాదాంతాలలో పతనావస్థను పొందిన వ్యక్తులు విజయాన్ని చేకొన్నవారికంటే గౌరవవిషయంలో లోపం కలవాళ్లుగా ఉండనవసరం లేదు. ప్రథమగణ్యతను పొందుతున్న ప్రముఖవ్యక్తుల పతనాన్ని గాని, అభ్యున్నతినిగాని చిత్రించి చూపటమే వాటి ప్రధానకర్తవ్యం. భౌతికాభ్యున్నతిగాని లేదా పతనానికి గాని ఈ విషాదాంత నాటకాలలో ప్రాథమికస్థానం ఉండదు. ప్రాపంచికమైన జీవితంలో ఆక్టేవియస్ పరమైన అభ్యున్నతిని పొందాడు. ఇట్టి స్థితిని పొందటం మనకు బ్రూటస్, ఆంటోనీలపట్ల కన్పించదు. అయినా ఈ వ్యక్తులిద్దరూ రసికలోక గౌరవాభిమానాలను చూరగొంటూనే ఉన్నారు.

మహాకవి షేక్స్పియర్ 'జూలియస్ సీజర్'కు బ్రూటస్‌ను, 'ఆంటోనీ – క్లియోపాత్రా'కు ఆంటోనీని విధిగా పతనావస్థ ననుభవించవలసిన నాయకులనుగా రూపొందించాడు. క్రమశిక్షణం, ఆదర్శప్రియత్వం బ్రూటస్‌లో పరాకాష్ఠ నందుకొన్నది. ఆంటోనీలో అణుమాత్రమైనా సంయమం లేని కాముకత్వం పరాకాష్ఠకు చేరుకుంది. నైతిక సమ్మోహనత్వానికి పోర్షియా, ఇంద్రియా కర్షణకు క్లియోపాత్రా ఆదర్శభూతలైనారు. బ్రూటస్ – పోర్షియాల పరస్పర ప్రణయంలో కనుపించే నైతికోదాత్తత లుప్తమైనా ఆంటోనీ – క్లియోపాత్రాల అధార్మిక ప్రణయం కూడా రసికలోకదాక్షిణ్యానికి పాత్రమౌతున్నది. పోర్షియా నైతికోన్నతి బ్రూటస్‌ను ఆకర్షించినట్లు, బ్రూటస్ ఆదర్శప్రియత్వం పోర్షియాను ఆకర్షించింది. అలాగే

క్లియోపాత్రా సమ్మోహన సౌందర్యాది విశేషాలు ఆంటోనీని ఆకర్షించినట్లు, ఆంటోనీ సాహసౌదార్యాది వీరగుణవిశేషాలు క్లియోపాత్రాలు ఆకర్షించాయి. క్లియోపాత్రాలోని సమస్తదోషాలూ, ఆమె 'తన పతి'ని అనుగమించటానికి మృత్యువును స్వయంగా ఆహ్వానించటంతో క్షాళితాలైపోయినాయి. 'ఆంటోనీ – క్లియోపాత్రా' లోని ఆశయం స్థూలదృష్టికి కామలౌల్యంగా కన్పించినా దాని తీక్ష్ణత మనలను వివశులను చేస్తుందనటంలో ఎట్టి విప్రతిపత్తీ ఉండదు.

'రోమియో–జూలియట్' లాగానే 'ఆంటోనీ' – క్లియోపాత్రా' కూడా ఒక 'ప్రణయ – విషాదాంతం' ఈ జాతివిషాదాంతాలలో నాయకుడికంటే నాయికే కేంద్రమై ఉండటం, నాటకారంభంలోనే నాయకుని పతనానికి కారణమైన అతని కామలౌల్యం ప్రదర్శితమైంది. విషాదాంత నాయకుడైన ఆంటోనీ ఈ దోషంవల్లనే కథాంతంలో పతనమై తీరుతాడన్న భావం తొలుతనే ప్రేక్షకుడికి కలిగి తీరుతుంది.

విషాదాంతనాటకాలన్నిటా ఒక 'విషాదాంత–సంఘర్షణ' గోచరించటం లక్షణం. ఆంటోనీ – క్లియోపాత్రా కథలో ఇట్టి సంఘర్షణ నాటకంలోని రెండు వర్గాలకు చెందిన పాత్రమూలంగా నిరూపితమైంది. దీనికి ఆంటోనీలోని బాహ్యాంతరికశక్తుల మధ్య జరిగే సంఘర్షణ తోడ్పడుతున్నది.

షేక్స్పియర్ విషాదాంతనాటక లక్షణాలనుబట్టి పరిశీలిస్తే, ఆంటోనీ – క్లియోపాత్రా నాటకానికి నాయకుడు ఆంటోనీ. విలాసోన్మత్తత, నిత్యభోగానుభూతి ఈతని విషాదాంత దోషాలు. ఆక్టేవియస్‌లో కన్పట్టే 'హృదయరాహిత్యం, సంకుచితదృష్టి' ఇత్యాది లక్షణాలతో పోల్చి చూస్తే, ఆంటోనీలోని పై లక్షణాలు గుణావిశేషాలుగానే కన్పిస్తున్నవి. అయితే పూర్వచరిత్రకారులు ఆక్టేవియస్‌ను ఘనుడుగా, చిత్రిస్తే, షేక్స్పియర్ చరిత్రల్లో కన్పట్టే ఆ ఘనుడి, కీర్తిప్రతిష్ఠలకు ముగ్ధుడై చిక్కిపోక చొచ్చిచూచి గర్వాతిశయం, ప్రతీకారేచ్ఛ, హృదయనైచ్యం ఇత్యాది దుర్గుణాలను పసికట్టి, అతణ్ణి ఒక 'అల్పమానిసి'గా చిత్రించాడు. ఆంటోనీ – క్లియోపాత్రాల నాటకానికి నాయకుడు ఆంటోనీ నాయిక క్లియోపాత్రా.

# పాత్రలు

## ఆంటోనీ

జూలియస్ సీజర్ నాటకంలో యువకుడైన ఆంటోనీ శీలం కొంతగా చిత్రితమైంది. అర్థరహితంగా పోకిరీ జీవితాన్ని గడుపుతూ కాలహరణం చేసేవాడని ఇతణ్ణిగురించి సామాన్య జనాభిప్రాయం. సీజర్‌ను హతమార్చ తలపెట్టిన విద్రోహులైనా ఇతని శక్తిసామర్థ్యాలను గురించి చాలినంతగా పసికట్టినట్లు కన్పించదు. ఇతడు సీజర్‌కు కేవల మొక అంగమనీ, అతణ్ణి అంతమొందిస్తే శక్తిహీనుడై ఎందుకూ సమర్థుడు కాజాలడనీ, ఇతణ్ణి గురించి విద్రోహ పక్షనాయకుడైన బ్రూటస్ భావించాడు. కాని దూరదృష్టి వ్యావహారికవిజ్ఞానం గల కాషియస్ మాత్రం నిగూఢమైన ఇతడి నిశితబుద్ధిబలాన్ని ఊహించి, ఇతడెంతకైనా సమర్థుడనీ, ఎన్ని కష్టాలనైనా కల్పించగలడనీ, కనుక ఇతణ్ణి కూడా సీజర్‌తోబాటు తుదముట్టించవలసిందేననీ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. విద్రోహుల్లో మిగిలినవారందరూ ఈ విషయంలో బ్రూటస్ భావంతోనే ఏకీభవించటంవల్ల ఇతడు సీజర్ హత్యానంతరం జరిగిన హింసాకాండ నుంచి తప్పించుకొన్నాడు. సీజర్‌కొక సాధనం, విలాసపరవశుడు అని వారికి భ్రాంతిని కల్గించిన ఈ ఆంటోనీ, సీజర్ వధానంతరం తన సమస్తశక్తులతో విజృంభించాడు. దారుణమరణానికి పాలైన తన యజమాని, మిత్రుడు అయిన సీజర్ యెడ తన కృతజ్ఞతను ప్రదర్శించటాని కీతడు పూనుకొని, హంతకులను అనంతకష్టపరంపరలలో ముంచెత్తి తుదకు హతమార్చిగాని నిద్రపోలేదు.

సామాన్యజనానీకాన్ని ఒక వాయులీనంగా చేసుకొని ఇచ్ఛానుసారంగా అపుడు హంతకులయెడ పరమక్రోధాన్ని వెల్గ్రక్కించిన ఈతడు, ఆ సమయంలో ప్రదర్శించిన వక్తృత్వ ప్రావీణ్యం విశ్వవిఖ్యాతి నొందింది. హంతకులకు నగరంలో తావులేకుండా చేసి, బహిష్కృతులు, కాందిశీకులు అయినవారికి ఎన్నెన్నో కష్టాలను కల్పించిన తరువాత, రాజనీతి చతురుడై ఇతడు లెపిడస్, ఆక్టేవియస్‌లతో మైత్రి చేసుకొని 'ద్వితీయత్రైకూటమి'ని కల్పించి అందులో ప్రధానసభ్యుడైనాడు. హంతక బహిష్కారానంతరం జరిపించిన శత్రుజనహత్యాక్రీడలో ఈతడు నిర్దయుడు,

చండశాసనుడు అని అనిపించుకొన్నాడు. పిమ్మట ఫిలిప్పీకడ కాషియస్, బ్రూటస్‌లతో చేసిన యుద్ధసందర్భంలో సాటిలేని సమరవిజ్ఞానీ, కదనయోధుడు అన్న ఖ్యాతి గడించాడు.

ఫిలిప్పీలో పొందిన విజయంతో ఆక్టేవియస్ చేత రోముకు ప్రతిప్రయాణం చేయించితాను గ్రీసుకు వెళ్ళాడు. అక్కడ విద్వద్గోష్ఠులతో, రూపక ప్రదర్శనలను దర్శించటంతో, సామాన్య జనానీకానికి న్యాయప్రదానం చెయ్యటంతో కాలం గడుపుతూ, గ్రీకు ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రుడై, వారు యవనప్రియ అని సంబోధిస్తుంటే సంతోషభరితుడైనాడు. ఏథెన్సునుంచి ఆసియాసీమకు వచ్చినపు డీ ఆంటోనీకి ప్రాచ్యవిలాసాలతో పరిచయమేర్పడ్డది.

తిరిగి ఇతడు తనలో తాత్కాలికంగా నిద్రిస్తున్న విలాసప్రియత్వానికి గురైనాడు. పానగోష్ఠులు మొదలైన తన పరమోల్లాసాల వ్యయంకోసం ప్రజలమీద పన్నులభారాన్ని అధికం చేశాడు. పార్థియన్లమీద యుద్ధాన్ని ప్రకటించబోయేముందు, ఫిలిప్పీయుద్ధకాలంలో తమకు వ్యతిరేకంగా బ్రూటస్ కాషియస్‌లకు సహాయం చేశావన్న నేరాన్ని ఆరోపించి, తగ్గ సమాధానం చెప్పుకోవలసిందని ఈజిప్టు రాజ్ఞి క్లియోపాత్రాను సిసిలీకి పిలిపించాడు. ఆ జగదేకసుందరితో ఈ ఆంటోనీకి సిడ్నస్ నదిమీద ప్రథమసమావేశం సంప్రాప్తించింది. మేధావి, సాహసికుడు, యోధాగ్రేసరుడు అయిన ఈ ఆంటోనీకి ఆ కాలంనుంచీ సర్వస్వం క్లియోపాత్రాయే అయింది. జగద్విజేత అయిన ఈ ఆంటోనీని ఆ ఈజిప్టురాజ్ఞి జయించుకొన్నది.

ఒకనాడు రోమక ప్రజానీకాన్ని వాయులీనం చేసుకొని ఇచ్ఛానుసారంగా పలికించి మించిన ఆంటోనీని, ఆ ఈజిప్టు గాయని తన సౌందర్య సౌకుమార్యబుద్ధిబలవిశేషాలతో ముగ్ధుణ్ణి చేసి, ఇతనిచేత తన శ్రుతుల కనుగుణంగా జీవితపర్యంతం పలికించుకొన్నది. ప్రాక్తార అయిన క్లియోపాత్రా ప్రణయవాగురలో పడిపోయిన ఈ ఆంటోనీ, రోమన్ రాజకీయాల విషయంలో తూష్ణీంభావం వహించటమే కాకుండా వీరోచితాలైన తన సాహసచర్యలన్నింటికీ స్వస్తి చెప్పాడు. భోగలాలసుడై పూర్వగౌరవానురాగాలను ఇతడు కోల్పోవటం ప్రారంభమైన నాటినుంచీ, షేక్స్‌పియర్ ఆంటోనీ – క్లియోపాత్రా నాటకాన్ని ఆరంభించాడు. ఇతడి భార్య ఫుల్వియా మరణవార్త, ఆమె కల్పించిన రాజకీయ క్లిష్టపరిస్థితులకు సంబంధించిన వార్తలు విన్నప్పుడు ఒక భావోద్వేగం ఇతణ్ణి క్రమ్మివేసింది. రోమకభావం ఒక్కుమ్మడిగా ఈ ఆంటోనీని ఆవేశించింది. "సమ్మోహిని అయిన ఈ ఈజిప్టురాజ్ఞి పన్నిన బంధనాలను తెగతెంచుకొని నేను బయటపడితీరాలి"

అని నిశ్చయించాడు. తాత్కాలికంగా నైతేనేం ఇతడిని పూర్వశక్తిసామర్థ్యాలు చేరుకొన్నాయి. ఇతణ్ణి తిరిగి రోముకు వెళ్లనీయకుండా తెలివితేటలతో ఆపివేయాలని నెరజాణ క్లియోపాత్రా తన నేర్పు నెంతగా ప్రదర్శించినా, ఆవేశోన్ముద్రితుడైన ఈ ఆంటోనీయెడ అవన్నీ వ్యర్థయత్నాలైనాయి. రోముకు వచ్చి ఆక్టేవియస్‌ను కలుసుకొన్న సందర్భంలో అతడు మోపిన సత్యమైన నేరాలన్నిటినీ అంగీకరించటం, అసత్యమైనవాటిని వ్యతిరేకించి పట్టుదలతో గౌరవాన్ని కాపాడుకోటం కనుపట్టింది. మర్మరహితంగా, లోటులేని హుందాతనంతో ఆ సందర్భంలో ఈతడు చేసిన ప్రసంగాలు కొంతకాలంనుంచీ కోల్పోయిన గౌరవప్రతిష్ఠలను కొంతగా సంపాదించి ఇచ్చాయనవచ్చు. ఆక్టేవియాను వివాహమాడి ఆమె అన్నతో ఉన్న వైరాన్ని మాన్చుకోటంలో ఆంటోనీ చూపించిన సంసిద్ధత వల్ల, రాజకీయంగా ఇతడు కొంత విరామాన్ని, విశ్రాంతిని పొందటానికి పడుతున్న ఆరాటం అభివ్యక్తమౌతున్నది. ఇందువల్లనే ఇతని స్వభావాన్ని బాగా ఎరిగిన ఇతని అనుచరుడు ఎనోబార్బస్ 'వారిరువురినీ మిత్రులుగా కూర్చిన ఈ (వివాహ) బంధమే వారి స్నేహానికి ఉరి త్రాడౌతుంది' అని అనతికాలానికే అభిప్రాయపడ్డాడు. ఈ ఆంటోనీ, ఆక్టేవియస్ అతిశీతల స్వభావం కలవాడు. దీర్ఘాలోచనాపరుడు, దూరదృష్టి కలవాడు అన్న అంశాన్ని గమనించకపోలేదు. అందువల్లనే అతడితో మైత్రి అట్టేకాలం నిల్చేదికాదని ఎన్నడో ఇతడు తేల్చుకొన్నాడు. అందుకు సంతోషపూర్వకంగా సంసిద్ధుడైనాడు. కానీ కాలం కలిసిరావాలి కదా! రాజకీయమైన కారణాలు కలిసి వచ్చి, ఆక్టేవియాతోనే ఇతడు ఏథెన్సుకు పయనమైనాడు.

ఆక్టేవియాను వివాహమాడటంవల్ల ఇతడు క్లియోపాత్రాతో స్వేచ్ఛగా విహరించే అవకాశానికి కలిగిన ఆటంకం ఒకవంక ఇతణ్ణి కట్టివేసి కలవరపెడుతున్నది. ఆక్టేవియస్ ఇతణ్ణి గురించి తిరస్కారభావాన్ని ప్రదర్శిస్తూ చేసిన ప్రచారంవల్ల కలిగిన క్రోధానికి తోడ్పాటిచ్చింది. ఆక్టేవియస్‌తో తెగబడటానికి సంసిద్ధుడౌతూ, తన క్రోధాన్ని ఒక్కమాటు భార్యముందు వెళ్ళగ్రక్కాడు. సాధు స్వభావి ఆక్టేవియా కలవరపడి అన్నకూ, భర్తకూ సంధి చేయటానికని దౌత్యభారాన్ని తనపై కెత్తుకొన్నది. స్వేచ్ఛగా తాను ఈజిప్టురాజ్ఞి దగ్గరకు వెళ్ళవచ్చును గనుక ఆమె అభ్యర్థనను వెంటనే ఆంటోనీ అంగీకరించాడు. ఇతడు ఈజిప్టుకు వెళ్ళినప్పుడు ఈ ఈజిప్టుయక్షిణి జాణతనంతో ఇతణ్ణి వివశుణ్ణి చేసింది. ఆమె ప్రణయపాశాలకు కట్టుబడి విజ్ఞాన గౌరవాలను, రాజనీతిజ్ఞతను కోల్పోయి ఆక్టేవియస్‌ను ఎదిరించటం, దానితో రోమక ప్రపంచ సర్వాధికారిని నిర్ణయించవలసిన యుద్ధమారంభం కావటం జరిగాయి. ఆక్టేవియస్‌తో సముద్రంమీద

పోరాడాలని క్లియోపాత్రాకొక విలాసేచ్ఛ కలిగింది. తన రణ సాహిత్యానికి గానీ, ఆప్తసైనికుల సలహాకుగాని అణుమాత్రమైనా విలువనీయకుండానే, ఈతడు ఆమె కోరికకు కట్టుబడి, ఆక్టేవియస్‌తో సముద్రం మీదనే పోరాడటానికి నిశ్చయించాడు. యుద్ధమధ్యంలో భయోత్పాతం వల్ల ఆమె పారిపోతుంటే, ఈ కామలోలుడు విజయావకాశాన్ని కూడా వదులుకొని, ఆమె వెంట వెళ్లిపోయాడు. తరువాత ఆమెవల్లనే తన అదృష్టం తారుమారైందనీ, భీరువన్న అపఖ్యాతి కలిగిందనీ అంతరాత్మ ప్రబోధించినప్పుడు, తాత్కాలికక్రోధంతో మిన్నుమన్నేకంగా మెదిపేటంతటి భీమరూపాన్ని ధరించాడు. కాని ప్రయోజనమేముంది? అమృతభ్రాంతిని కల్పించగల అశ్రుబిందువులు రెండు ఆమె నేత్రాలవెంట వెలువడి, ఆ క్రోధోద్రేకాన్ని మటుమాయం చేసి తిరిగి ఆమె కీతణ్ణి దాసుడిగా తీర్చిదిద్దగలిగాయి.

ఆక్టేవియస్‌తో సంధియత్నం చేశాడు. తగ్గ షరతులను పొందలేకపోవటం వల్ల కోల్పోయిన సంపదను సంపాదించటానికి ఇంకోమారు యత్నించాడు. క్లియోపాత్రా పిరికితనంవల్లనే అందులోనూ ఇతని అదృష్టం కలిసిరాలేదు. పరమశత్రువైన ఆక్టేవియస్ దాక్షిణ్యానికి పాల్పడవలసిన స్థితి పట్టినప్పుడు, ఆత్మహత్య తప్ప అన్యమార్గం లేదని అందుకితడు సిద్ధపడ్డాడు. సాహసం, రణపాండిత్యం, దయాదాక్షిణ్యం, మర్మరాహిత్యం, ఉదాత్తత, పరహృదయానురంజనం, సంభాషణ ప్రావీణ్యం ఆంటోనీ గుణాలు. చిత్తచాంచల్యం, ఆశయరాహిత్యం, అసత్య ప్రవర్తన, భోగలాలసత, అతిశయకాముకత్వం ఇత్యాదులు ఇతని దోషాలు. గుణదోషాలు రెండూ విచిత్రరీతిని సమ్మేళనం పొందిన వ్యక్తియైన ఆంటోనీలోని దోషాలు ప్రకోపించి వ్యవహరించటం వల్లనే, అతనికి పతనం సంప్రాప్తమైంది. కానీ సంకుచితదృష్టి, స్వార్థపరత్వం పాలించే ఆక్టేవియస్‌తో ఆంటోనీని పోల్చి చూసినప్పుడు, ఆంటోనీలోని దోషాలు కూడా గుణాలలాగానే ద్యోతకమౌతుంటాయి.

## ఆక్టేవియస్

ఆక్టేవియస్ పాత్రను చిత్రించటంలో మహాకవి షేక్స్‌పియర్ చరిత్రను అనుసరించకుండా తానే కల్పించటానికి పూనుకొన్నట్లయితే, ఆంటోనీకి ప్రతియోగమైన ఇట్టిపాత్రను రూపొందించగలిగి ఉండేవాడు కాడు. ఆంటోనీ మహోద్వేగి ఆక్టేవియస్ శీతలప్రకృతి. అతడు కామలోలుడు, భోగపరాయణుడు. ఇతడు వైభవప్రదర్శకుడే కాని, కీర్తి కాముకత్వాన్నయినా బహిరంగంగా వ్యక్తీకరించటాన్ని మహాపాపంగా పరిగణిస్తున్నట్లు నటించే వ్యక్తి. అతడు కల్మషరహితహృదయంతో మైత్రినాశించే

స్వభావంగల ఉదాత్తుడు, హృదయవాది, సహృదయుడు. కరడుకట్టిన స్వార్థపరత్వంతో కాలంకోసం కనిపెట్టుకొని కూర్చొనే కటికవాడితడు. లక్ష్యసాధనవిషయంలో అతడు చపలచిత్తుడు. ఇత డచంచలదీక్షాదక్షుడు. అతని ప్రతిచేష్టలో మానవత్వం తొణికిసలాడుతుంటుంటే, ఇతని ప్రతిచర్యలో రాజకీయ తంత్రజ్ఞత తారాడుతుంటుంది. అతడు మన అనురాగాన్ని చూరగొంటాడు. ఇతడు మన గౌరవాన్ని సంగ్రహిస్తాడు. ఆక్టేవియస్ ప్రసంగాలలోనూ, ప్రవర్తనలోనూ అపూర్వమైన పూర్వాలోచన, క్రమశిక్షణ కనిపిస్తాయి. కాని ఒక అపూర్వవ్యక్తి అని మాత్రం ఇతడు అనిపించుకోలేడు.

ఆంటోనీతో ఇతడు ప్రథమతః ప్రసంగించినపుడు నీతిపరుడిలా ద్యోతకమౌతాడు. నిజానికి అంతే. ఇతని శీలంలో ఎట్టి కళంకమూ లేదు. అత్యంతనీతిపరుడైన ఈతడు, అవినీతిపరుడని తానెంతో అతిశయంగా అసహ్యించుకోనే ఆంటోనీకి తన ప్రియసోదరి నిచ్చి వివాహం చెయ్యటానికి పూనుకొన్నాడేమని ప్రశ్న కలుగుతుంది. ఆమె సచ్ఛీలాన్ని గురించీ, ఆమెపై తనకు గల ప్రేమాభిమానాలను గురించీ ఎంత గొప్పగానో బహిరంగంగా ప్రసంగించాడే మరి? సూచనను అందుకొన్న మరుక్షణంలోనే ఆంటోనీకి అట్టిసోదరి నిచ్చివేయటానికి, కేవలం ఇతని స్వార్థపరత్వమే కారణమనవచ్చు. సాటి సహచరులలో ఉన్న లాలసత్వం ఇతనిలో లేదు.

పాంపే నౌకలమీద జరిగిన విందు సందర్భంలో సహచరులు తనను అవజ్ఞ చేశాడని అనుకోపోతారని పాల్గొన్నాడు అంతే. త్రాగదలచి కాక తప్పనిసరియై త్రాగాడు. 'అధికంగా ఒకరోజు మధుసేవ చేయటంకంటే నాలుగుదినాలు త్రాగకుండా ఉండటమంటే నా కెంతో ఇష్టం' అన్న ఈతని వాక్యం, ఇతనివంటి వారి విషయంలో ఒక దోషంగానే పరిగణింపబడని మధుపానలోలతను గురించిన ఇతని భావాలను వెల్లడిస్తున్నది. 'తీవ్రతరమైన మన కార్యక్రమం ఈ విలాసప్రియత్వాన్ని విపరీతంగా కోపిస్తున్నది. త్రాగుడువల్ల కలిగిన విపరీతస్థితి మన అందరినీ పరిహాసకులను చేస్తున్నది' అన్న ఆ సందర్భంలోని ఈతని వాక్యాలు, అట్టి సన్నివేశంలోనుంచి ఎంత సాధ్యమైనంత త్వరలో బయటపడదామా అన్న ఇతని మనస్తత్త్వాన్ని వెల్లడిస్తున్నవి. ఆ విలాస ప్రియత్వంలో భాగస్వామి కావటంవల్ల, అపూర్వమైన తన గౌరవానికి ఎంత భంగం కలుగుతున్నదో అన్న శంక ఇతణ్ణి అనుక్షణం బాధిస్తూనే ఉంది.

ఆంటోనీ వెంట ఆక్టేవియాను ఏథెన్సుకు పంపిస్తూ ఇరువురిమీద ఎంతో ప్రేమను ఒలకబోసినా, 'మహోదాత్తుడా ఆంటోనీ! ఈమెయెడ మన ఉభయులకూ ప్రేమ లేకపోతే ఈమె అనే సాధనం లేకుండా మనం ఎంతో అధికంగా అన్యోన్యమైత్రిని కలిగి

ఉండేవాళ్ళం. కాబట్టి మన ఇరువురి స్నేహాన్నీ అనుబంధించి చిరకాలం నిలపటానికి ఉద్దేశిత అయిన ఈ పవిత్రమూర్తి ఆ మన స్నేహసౌధాన్ని భగ్నం చెయ్యటానికి కారణభూతురాలు కాకూడదు సుమా!' అన్న మాటల్లో తన దూరదృష్టిని ప్రదర్శించనే ప్రదర్శించాడు.

ఇతడు ఆంటోనీని గురించి దుష్ప్రచారం ఆరంభించి తిరస్కరించటంతో మనస్పర్ధలేర్పడటం, తనంతట తానే దౌత్యభారాన్ని ఎత్తుకొన్న ఆక్టేవియాను అతిసామాన్యనుగా అన్న దగ్గిరికి పంపటం, తరువాత ఆంటోనీ మళ్ళీ ఈజిప్టు మాంసకుంభాల మధ్య పడి ఆమెకు అపచారం చెయ్యటంతో, కనిపెట్టుకొని కూర్చున్న ఆక్టేవియస్‌కు కాలం కలిసివచ్చింది. ఆక్టేవియాను ఒక సామాన్యవనితను పంపించినట్లు రోముకు పంపించినప్పుడు ఇతనికి కలిగిన కష్టానికి మూలకారణం సోదరిమీద ప్రేమ కాదు తన గౌరవానికి ఆంటోనీ భంగం కలిగించాడన్న భ్రాంతి. “నీవు సీజర్ సోదరిలా రాలేదు. ఆంటోనీ పత్నికి హర్కారా జనంగా ఒక సైనికదళమైనా ఉండితీరాలి. దర్శనమివ్వటానికి ముందుగానే హయహేషలు ఆమె ఆగమనాన్ని తెలియజెయ్యాలి” మొదలైన అతని సంభాషణ వైభవ ప్రదర్శనం మీద ఇతడి కెంతటి అభిమానముందో వ్యక్తం చేస్తున్నది. 'నీకొచ్చిన ఈ అవమానానికి తగ్గ న్యాయాన్ని కల్పించటం కోసం మహాధికులైన దేవతలు నన్నూ, నిన్ను ప్రేమించే ఇతరులనూ తమ ప్రతినిధులనుగా పరిగ్రహింతురు గాక!' అన్న వాక్యాలవల్ల ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆంటోనీని అణగద్రొక్కటానికి పూర్వమే వేసిన పథకాన్ని ఆచరణలో పెట్టటంకోసం ఎంత తహతహపడుతున్నాడో తెలుస్తున్నది. ఆక్టియంయుద్ధంలో ఇతనికి విజయం సంప్రాప్తించింది. అది కారణంగా ఆతనికి తన షరతులతో ఆంటోని క్లియోపాత్రాలను శాసించే అవకాశం లభించింది. ప్రజ్ఞాబలంచేత ఏ నాడైనా ప్రజానురాగాన్ని చూరగొని ప్రపంచపాలకుడు కాగల ఆంటోనీ సజీవుడై ఉండరాదు. అదే ఇతనికి కావలసింది. కనుకనే అతణ్ణి హతమార్చటం ఒక సంధిషరతుగా క్లియోపాత్రాకు చెప్పి పంపించాడు. ఆంటోనీ ఆత్మహత్య చేసుకొన్నప్పుడు ఇతడు చూపిన దుఃఖమంతా ఇతరులను, ముఖ్యంగా క్లియోపాత్రాను, మోసగించటంకోసమే. క్లియోపాత్రాకు ప్రాణదానం చేస్తానని, ఎప్పటిలాగా రాజ్ఞినిగా పరిగణిస్తాననీ దూతను పంపించటం, అతని ఉదాత్తతవల్లగాని, పరమదయాగుణంవల్ల కాని కాదు.

జీవగ్రహంగా ఆమెను పట్టుకోవచ్చి రోముపురవీథుల్లో నడిపించి, ప్రజలకు చూపించి అవమానించి, అందువల్ల తన కీర్తిగౌరవాలను విస్తరింపజేసుకోవటమే అతని

ఎత్తుగడలోని రహస్యం. ఈ అభిప్రాయమే థైరీయస్‌తో అతడు చెప్పిన "అవసరమైతే అఖిలాన్ని ఇస్తామని మాట ఇచ్చిరా. లేకపోతే ఉదారహృదయ ఆమె ఏ ఆత్మహత్యో చేసుకొని, మన ఉద్దేశాన్నే భగ్నం చెయ్యవచ్చు. ఆమెను రోములో నివసించేటట్లు చేయగలిగితే మన విజయానికి నిత్యప్రతిష్ఠ" అన్న మాటలవల్ల వ్యక్తమౌతున్నది. జిత్తులమారియై ఇతడెంత చేసినా, చిత్తశుద్ధితో క్లియోపాత్రా తనపతిని అనుసరించటం కోసం ఆత్మహత్య చేసుకోవటం వల్ల ఇతని నీచమైన ఊహకు భంగం కలిగింది. ఆక్టేవియస్ గౌరవనీయుడే గాని మోసకారి, నీచస్వభావుడు, గర్వి, ప్రతీకారేచ్ఛాతత్పరుడు. ఆంటోనీ ఎంతటి లోపభూయిష్ఠుడైనా ఇతనికంటే అధికుడేనని అనిపిస్తాడు.

## ఎనోబార్బస్

చరిత్రలో ఛాయామంత్రంగా లభించిన ఈ పాత్రను షేక్స్‌పియర్ ఎంతో ఘనంగా చిత్రించటంవల్ల, ఇది 'నవ్యసృష్టే' అని అనవలసి వస్తుంది. మానవత్వ స్వభావపరిశీలన దృష్ట్యా ఎనోబార్బస్ ఎంతగానో చిత్తాకర్షకమైంది. అంతే కాదు. పాత్ర నీతి ప్రతిపాదకమైంది కూడాను. నాటకంలోని పాత్రలాగానే ప్లూటార్క్‌లోని ఎనోబార్బస్ యోధుడు, సాహసికుడు, సత్యప్రియుడు. ఆంటోనీ అపమార్గంలో ప్రవర్తిస్తున్నాడని ఆత్మ నిశ్చయించి చెప్పినంతవరకూ అతణ్ణి అతిభక్తితో అనుసరించాడు. తాత్కాలికోద్రేకం వల్ల మధ్యలో కొంతకాలం అతణ్ణి పరిత్యజించినా, మరణసమయంలోనూ ఆ ఆంటోనీ ఉదారస్వభావాన్నే స్మరిస్తూ శోకపరిక్లిన్న హృదయంతో ఇతడు ప్రాణాలు విడిచాడు. పై సద్గుణాలతో బాటుగా రూపకంలోని ఎనోబార్బస్‌లో వ్యావహారిక విజ్ఞానం, అదుపెరుగని సత్యవాక్ప్రియత్వం, మనస్విత ఇత్యాది గుణాలు సుస్పష్టరూప రేఖలతో గోచరిస్తున్నాయి. సైనికుడు కావటం చేతనో ఏమో, ఇతడు చేసే సంభాషణలో ఇంతైనా చాటు అంటూ లేదు. ఉన్నదున్నట్లుగా పలికి ఇతడు కొన్ని సందర్భాలలో ఇతరులకు ఉద్రేకం తెప్పిస్తుంటాడు. యజమానియైన ఆంటోనీని చిక్కులో పెడుతుంటాడు.

ఆంటోనీ మీది అభిమానం వల్ల ఇతనికి సీజరంటే ఒక నిర్లక్ష్యం ఏర్పడ్డది. సీజర్‌తో ప్రసంగించేటప్పుడు ప్రసన్నమధురంగా సంభాషించమని మీ సేనాధినేతను ప్రార్థించి చెప్పమని లెపిడస్ ఇతణ్ణి కోరిన సందర్భంలో, 'మీ యోగ్యతకు ఉచితమైన రీతిగా ప్రసంగించవలసిందని ఆయన్ను ప్రార్థిస్తాను. కోపగిస్తే సీజర్‌ను ఆయన తప్పక నిర్లక్ష్యంతో పరికించి తీరుతాడు. జూపిటర్ మీద ప్రమాణం చేసి పలుకుతున్నాను. నాకే ఈ సీజర్ వంటి శత్రువువుంటే ఆయన యెడ నాకు గల నిర్లక్ష్యాన్ని వెల్లడించేటందుకు దానికి క్షురకర్మను గూడా కల్పించ'నన్న వాక్యాలు ఇందుకు

నిదర్శనాలు. సైనికుడుగా ఈతడు చక్కని అదృష్టవంతుడు. సైనికులకు తగ్గ గౌరవమిచ్చి ఆదరించి అభిమానించే ఆంటోనీ సేవలో చేరగలిగాడు. అలెగ్జాండ్రియాలో అతనితో బాటుగా సైనికప్రియాలైన అనేకవిలాసాలను అనుభవించగలిగాడు. ఆంటోని క్లియోపాత్రాల ప్రణయజీవితాన్ని ఎనోబార్బస్ కొంతగా అర్థం చేసుకున్న వ్యక్తి. అయినా ఇతనికి స్త్రీల విషయంలో అతి పనికిరాదు. వారిని విలాసవస్తువులనుగా చూచి విడిచిపెట్టవలసిందేగాని అన్ని విషయాలలో, అందులో ముఖ్యంగా రాజ్యవిషయాలల్లో, వారికి స్థానమీయటమంటే ససేమిరా ఇతనికిష్టం లేదు.

ఒక రాజకార్యం జరిగితే ప్రశాంతచిత్తంతో దాని భావిఫలితాన్ని ఊహింపగల ఉజ్జ్వలమైన బుద్ధికుశలత ఈతనికుంది. 'ఇప్పుడు పరస్పరానురాగాన్ని తాత్కాలికంగా మీరు ఎరువుపుచ్చు కుంటే, పాంపేనుగురించిన మాటలు వినబడటం మానేసిన తరువాత, మళ్ళీ మీ వైమనస్యాలను త్రవ్వుకోవచ్చు' అని ఎనోబార్బస్ త్రైకూటవీరులు తాత్కాలికంగా సంధి చేసుకొంటున్న సందర్భంలో అన్నమాట లిందుకు నిదర్శనాలు. స్ఫురించిన సత్యాన్ని చెప్పలేకుండా ఉండటమంటే ఇతనికెంత కష్టమో కూడా ఈ సందర్భంవల్లనే వ్యక్తమౌతుంది. ఇతడన్న విషయం సత్యమేనని ఆక్టేవియస్ అంగీకరించాడు గాని, ప్రసంగపద్ధతికి మాత్రం అభ్యంతరపెట్టాడు. నటనన్నా, మోసగించటమన్నా ఎనోబార్బస్‌కు ఏ నాడూ నచ్చదు. ఇందుకు, ఫుల్వియా మరణవార్త విని కించిత్తుగా ఆంటోనీ ఖిన్నుడైన సందర్భంలో ఇతడు చేసిన ప్రసంగం ఇందుకు ఉదాహరణం.

ఇతడు కొంత మొరటువాడైనా మొగలిపూలతావులు తెలియనివాడు కాదు. సౌందర్యస్థానాలను కనిపెట్టి రసదృష్టితో దర్శించి, తగిన సమీక్ష చేయగలశక్తి ఇతనికి అనంతంగా ఉంది. సిడ్నస్ నదిమీద సర్వజన చిత్తాకర్షకమైన మహనీయమూర్తితో విహరించిన క్లియోపాత్రా సౌందర్య విలాసవిశేషాలను ఇతనికంటె అధికరమణీయంగా ఎవరూ చిత్రించి చెప్పలేరనటంలో ఎట్టి అతిశయోక్తీ లేదు. ఎంతటివాడినైనా మంత్రముగ్ధుణ్ణి చేయగల క్లియోపాత్రా సమ్మోహనగుణశక్తినీ, కమనీయగుణవిశిష్టుడైన ఆంటోనీ కామారాధనాతత్పరతను ఇతడు అర్థం చేసుకున్నాడు. కానీ అన్ని విషయాలలో, ముఖ్యంగా యుద్ధతంత్ర విషయంలో, అతడు ఆమెకు లొంగిపోవటాన్ని మాత్రం సహించలేదు. క్లియోపాత్రా శక్తిసామర్థ్యాలపట్ల ఇతడికి గౌరవం లేకపోలేదు. ఆమె సౌందర్యం వయసువల్ల వాడేది కాదని ఇతడు గమనించాడు. ఆమె ఉజ్జ్వల రసపిపాసయెడ కొంత సానుభూతిని ప్రదర్శించాడు. వ్యవహార ప్రధానుడైనా ఎనోబార్బస్

వైభవప్రియుడు, అందువల్లనే ఉదాత్తుడైన ఆంటోనీలోని యోధాగ్రేసరత్వంతోబాటు రాజసవిలాసప్రియత్వం కూడా ఇతనికి ఇష్టగుణాలైనవి. ఆంటోనీ ఆక్టేవియాను వివాహమాడటం సూటియైన చిత్తప్రవృత్తి గల ఇతనికి ఏ మాత్రం నచ్చలేదు.

కన్యాప్రదానసమయంలో ఆంటోనీ చూపించిన క్షణికోద్రేకాన్ని, ఆక్టేవియస్ ప్రదర్శించిన కృత్రిమ సోదరీప్రణయాన్ని ఇతడు నిరసించాడు. ఆంటోనీ లభించిన సహజావకాశాల నన్నిటినీ ఐచ్ఛికంగానే పోగొట్టుకొంటూ, గుప్తవనితకు దాసానుదాసుడై వర్తించటం ఆరంభించింది మొదలుగా ఆంటోనీయెడ భక్తివిశ్వాసాలీతనికి సడలనారంభించాయి. అంత అధికంగా ఇతడు ఆంటోనీయెడ అభిమాన గౌరవాలను ప్రదర్శించటానికి ఇతడి సహజావబోధ ముఖ్యకారణం. అతని గుణవిశేషాలను బుద్ధితో కూడా కొంత వివేచించకపోలేదు. ఆక్టియం యుద్ధంలో ఆంటోనీకి లభించిన అపజయాని కతడు క్లియోపాత్రాను నిందించలేదు. బుద్ధింకాక కాంక్ష నడిపించేటట్లు నడిచే ఆంటోనీదే దోషం అని తేల్చాడు.

ఓటమివల్ల ఒడలెరుగక ఆంటోనీ ఆక్టేవియస్‌ను ద్వంద్వయుద్ధాని కాహ్వానిస్తున్నప్పుడు, ఇతడు "అందుకు ఆక్టేవియస్ లభించిన అవకాశాలను అవతలపెట్టి ప్రజలు దర్శించటంకోసం ద్వంద్వయుద్ధం చెయ్యటానికి అంగీకరించ"దని ముందే నిర్ణయించాడు. ఆంటోనీ మానసిక గుణవిశేషాలను గూడా అదృష్టం తనవెంట నడిపిస్తున్నదని, సీజర్ ఆంటోనీ నిర్ణాయకశక్తిమీద కూడా విజయం చేకొన్నాడనీ ఆ సందర్భంలో ఇతడు పల్కిన వాక్యాలు ఇతని విషయవివేచనాశక్తికి చక్కని నిదర్శనాలు.

ఎనోబార్బస్ తన యజమానిని తుదిదాకా భక్తివిశ్వాసాలతో కొలిచాడన్న మాట సత్యం. అట్టి భక్తివిశ్వాసాలను ఈతనిలో పురికొల్పగలిగిన ఆంటోనీ ఔదార్యం. అతిశయస్వామిభక్తి పరాయణుడు కావటం వల్లనే, ఇతడు ఆంటోనీ ఆప్తానుచరులైన కానెడియస్ మొదలైనవారు అతణ్ణి విడిచిపెట్టి పరపక్షంలో చేరినతరువాత కూడా, కొంతకాలం అంటిపెట్టుకొని ఉన్నాడు. విధి వ్యతిరేకమని తోచిన సందర్భంలో కూడా వీరోచితంగా పోరాడాడు. పరాజయంవల్ల కలిగిన కళవళపాటు చేత ఆంటోనీ ప్రదర్శించిన క్రోధోన్మత్తప్రవర్తనను జూచినతరువాత, అతని హృదయాన్ని త్రోసిరాజని బుద్ధి విజృంభించి అర్థరహితుడైన తన స్వామిని పరిత్యజించి పరపక్షంలో చేరిపోవాలన్న ప్రబలవాంఛ నీతనికి కల్గింది. బయలుదేరి వెళ్ళాడు గాని స్వామిద్రోహి నన్న భావం అతని హృదయాన్ని వెన్నాడి, కలత పెట్టటంతో ఇతని ఉదాత్తప్రకృతే విజయం పొందింది.

తానొనర్చిన దోషానికి నిష్కృతి ఆత్మహననమే అన్న ఊహ పొడకట్టిన మరుక్షణంలోనే ఇతడు తన జీవితాన్ని అంత మొందించుకున్నాడు. మరణ సమయంలో "ఆంటోనీ మహాశయా! నీ మీద నా తిరుగుబాటు ఎన్ని రెట్లుగా నీచాతినీచమైందో నీవు అంతకంటే ఎన్నో రెట్లుగా మహోదాత్తుడివి. కానీ యజమానిని విడిచిపోయినవాడనీ, పటాలాన్ని వదలి పారిపోయిన సిపాయి అనీ నన్ను లోకం గుర్తించుగాక!" ఈ మొదలుగా ఇతడు పలికిన వాక్యాలు ఇతని సత్స్వభావాన్ని, మనస్వితను వెల్లడిస్తూ, స్వార్థపరులతో సమగ్రమైన ఈ ప్రపంచంలో ఒక వ్యక్తిని తుదిదాకా అనుసరించిన అనుచరుడికి అపూర్వోదాహరణమైన వ్యక్తి ఎనోబార్బస్ అని నిరూపిస్తున్నవి.

## పాత్రలు - స్త్రీలు

### క్లియోపాత్రా

ఇంద్రియమైన ఆకర్షణశక్తికీ, సర్వస్త్రైణగుణసముదాయానికీ ప్రపంచ విఖ్యాతిగన్న అతివ క్లియోపాత్రా. ఈమె ఆంటోనీ మహాశయుని 'పురానైల్ నాగిని'. యౌవనారంభదశలో తొలుత జూలియస్ సీజరుకూ, తరువాత క్నయ్యస్ పాంపేకు ఈమె ప్రియురాలు. ఉన్నతవర్గంలోని వ్యక్తియై ఉండటంవల్ల, ఆశించిన సమస్తాన్నీ ఈమె కాముకప్రకృతి అనుభవించగలిగింది. ఆంటోనీతో ప్రథమపరిచయం కలిగేనాటికి ఈ ఇంతి వయసు ఇరువది ఎనిమిదేండ్లు. ఆంటోనీని కనుగొన్ననాటికి ఈమె సౌందర్యంలో ఇసుమంత వాడ్పు కన్పించినా సంపాదించిన బహువిధకామానుభవ విజ్ఞానం దాన్ని చక్కదిద్దింది. బాలేయమైన సౌకుమార్యానికి కలగిపోవని ఆంటోనీ ఆశించే సరసతకు ఈమె స్థానభూతమైంది. అహరహం ఆనందప్రదానం చేసే అనుక్షణపరిణతమైన చిత్తచాంచల్యం, లక్షణ విశేషాలలోని పరస్పరవైరుధ్యం, వీటికి జోడైన బుద్ధికుశలత, బహుశః ఈమె రూపసౌందర్యం కంటే ఆంటోనిని అత్యధికంగా ఆకర్షించి ఉంటాయి. ఆశయోపేతమైన గార్హస్థ్యంలోని ధార్మిక ప్రణయజీవితంవల్ల కలిగే అరతి, నిత్యమైన స్వభావమాధుర్యం వల్ల కలిగే నీరసత్వం ఆక్టేవియాను వివాహమాడిన నాటినుంచీ అతడు అనంతంగా అనుభవించాడు. అట్టివాని ఆత్మను నిత్యమూ శృంఖలాబద్ధను చేయటానికి అఖిలలోకం అంగీకరించే సద్గుణాలూ నిష్ప్రయోజనాలని ఈ క్లియోపాత్రా గమనించింది. సహజావబోధశక్తివల్లనే ఈ సరసురాలు ఆంటోనీ కాంక్షించేదేమిటో కనిపెట్టగలిగింది. ఆంటోనీ క్లియోపాత్రాల ప్రణయజీవితాన్ని వివేచనతో పరిశీలిస్తే విధి వీరిని ఒకరికోసం మరొకరిని సృష్టించినట్లు

స్ఫురిస్తుంది. ఇంతటి ఆనుకూల్యంతో అధార్మికమైన ప్రణయజీవితాన్ని సాగించి, అన్యోన్యపతనానికి హేతుభూతులైన ప్రియాప్రియులు ఎంత వెదికినా గోచరించరు.

వయసువల్ల వాడని సౌందర్యంతో, నిరంతరశృంగారలీలావిలాస వైవిధ్యంతో జీవితాంతం వరకూ ఆంటోనీని ఏలుకొన్న ఈ క్లియోపాత్రా షేక్స్‌పియర్ సృష్టి కాదు. అపురూపసౌందర్యం, భావనాబలం, బుద్ధినైశిత్యం, నిరాతంక సమ్మోహనశక్తి, నిత్యలీలానురక్తి, చలచిత్తత, విలాసమత్తత, స్తోత్రపాత్రప్రియత్వం, క్షాత్రగర్వం, కాఠిన్యం, హృదయ కోమలత్వం, భీరుత్వం, సత్యప్రియత్వం – ఇత్యాది పరస్పర విరుద్ధ ప్రకృతులన్నీ చరిత్రలో క్లియోపాత్రాలోనే కన్పిస్తున్నాయి. రసికజనచిత్తానురంజనంకోసం గుణదోషాల రెంటినీ కోటికెక్కించి షేక్స్‌పియర్ ఈ ప్రాచ్యరాజ్ఞిని ఒక ఉజ్జ్వల రసాభినేత్రిగా రూపొందించి పునసృష్టించాడు.

ఆంటోనీ, క్లియోపాత్రా కెంతగా లొంగిపోయిందీ కథారంభకాలంలోనే మనకు వ్యక్తమౌతున్నది. రోము నుంచి వచ్చిన వార్తలు తనకు ప్రీతికరాలు కావని ఊహించటంవల్లనే అతడు వార్తాహరులతో అతిగా ప్రసంగించ తలపెట్టలేదు. అశక్తుడవని దెప్పుతూ అతణ్ణి పరిహసించి ఆనందిద్దామన్న ఉద్దేశంతోనూ, ఆ రోములోని వార్తావిశేషాలను అవగతం చేసుకొందామన్న ఊహతోనూ, క్లియోపాత్రా వార్తాహరుల రాక అనే అవకాశాన్ని అమోఘంగా ఉపయోగించుకోదలచింది, బహుశః ఆంటోనీ భార్యకు అతనిమీద కోపం వచ్చి ఉండవచ్చుననీ, యువకుడైన ఆక్టేవియస్ ఏదైనా రాజకార్యాన్ని నిర్వహించవలసిందని ఆదేశించి ఉండవచ్చుననీ కొంటెగా సూచించి, వార్తలను పూర్తిగా వినితీరవలసిందేనని పట్టుపట్టింది. అణుమాత్రంగానైనా అతనిలో రోమకభావం కలిగిందేమోనన్న ఊహ స్ఫురించగానే, 'నా మాయాబంధంలో నుంచి తప్పించుకొని ఆంటోనీ ఆంటోనీ కాబోతున్నా'డని చిలిపిగానే అనేసింది. అప్పటి ఈమె ప్రణయలీలావిలాసాన్ని అర్థంచేసుకొన్న ఆంటోనీ, "కలహశీలా రాజ్ఞీ! నిందించటానికీ, పరిహసించటానికీ, రోదించటానికీ నీకు ఉపయోగించనివంటూ లేవు. నీ భావోల్బణాలలో ప్రతి ఒక్కటీ మనోహరియై నాకు మాననీయమౌతుంటుంది" అన్న సంభాషణలో భంగ్యతరంగా మెచ్చుకొన్నాడు. ఆంటోనీ ఈమెకు లొంగిపోవటమే కాదు ఈమె కూడా అతనికి లొంగిపోయింది. వార్తాహరులు వెళ్ళిపోయిన తరువాత అనతికాలానికే అతని 'స్వల్పకాల వియోగాన్ని' సహించలేక ఈమె చూపిన ప్రవర్తనే ఇందుకు సాక్ష్యం.

ఆ సందర్భంలో ఆంటోనీని పిలుచుకొరమ్మని ఛార్మియన్‌ను తరిమి పంపిస్తూ "తీవ్రాలోచనా నిమగ్నుడై ఉన్నట్లు కన్పిస్తే నేను నృత్యం చేస్తున్నాననీ, వినోదిస్తుంటే హఠాత్తుగా నాకు సుస్తి చేసిందనీ" చెప్పమన్నది.

ఇట్టి ప్రవర్తనతో ఈ రాజ్ఞి ఆంటోనీని సంపూర్ణంగా పోగొట్టుకొంటుందని భయపడ్డ ఛార్మియన్, "ఆయన నిన్ను మనసారా ప్రేమించేటట్లు చేసుకొనే మార్గాన్ని నీవు అనుసరించటం లేదు. సర్వవిషయాలలోనూ ఆయనకు లొంగిపో. ఎందుకూ అభ్యంతరం చెప్పకు" అని సలహా చెప్పింది. ఉదాత్తమానవ హృదయభావ పరిశీలనంలో ప్రౌఢ అయిన ఈ క్లియోపాత్రా, హీనబుద్ధియైన ఛార్మియన్ సూచించిన దాస్యప్రణయాన్ని గురించి "ఆయన్ను కోల్పోవటానికి నీ మార్గం మహా మంచిది" అన్నది.

తరువాత ఒకవంక ఆంటోనీ వస్తుంటే చూడనట్లు నటించి వెళ్ళిపోయింది. అనతికాలానికే కలుసుకొన్నప్పుడు జబ్బువల్ల కసరుబోతైనట్లు నటించ నిశ్చయించింది. ఆంటోనీ ప్రథమవాక్యమే అతడు ఈజిప్టును విడిచి వెళ్ళిపోవటాన్ని సూచించటంవల్ల క్లియోపాత్రా తొలుత మూర్ఛను, తర్వాత తెప్పరిల్లటాన్ని అభినయించి అపస్మారకంగానూ వ్యంగ్యంగానూ దూషణమారంభించింది. 'నావలె ఇంతటి మహత్తరమైన మోసానికి పాలైన మహారాజ్ఞి మరొకతె లేనేలే' దని తన్ను గూర్చి పలికింది. 'మిథ్యాప్రణయజీవి'వని సంబోధించి ఫుల్వియా మరణవార్తను అతిప్రశాంతంగా భరిస్తున్న కృతఘ్నతకు అతణ్ణి నిందింప నారంభించి, 'ఫుల్వియా మరణవార్తను నీవు గ్రహించే రీతినిబట్టి తెలిసింది. ఇప్పుడు తెలిసింది. నా మరణవార్తను గూడా నీవు ఎలా స్వీకరిస్తావో ఇపుడు తెలిసింది' అన్నది. ఫుల్వియామృతికి అభినయపూర్వకంగానైనా దుఃఖించటం ధర్మమని ప్రార్థించి, అతడినొక మహానటుడవనీ, ప్రణయ పారిశుద్ధ్యం లేని వ్యక్తివనీ ఏమేమో పలికి కోపం తెప్పించింది. అతని కోపం ఆమెకో ఉల్లాసమైంది. చివరకు ఆంటోనీ తప్పక రోముకు వెళ్ళి తీరవలసిన పరిస్థితి ఉందని గమనించటంచేత, మనఃస్థితిని మరుక్షణంలోనే మార్చివేసి సమస్త సౌహార్దాన్నీ ప్రకటించి, ప్రియాలైన వీడ్కోలు వాక్యాలు పలికింది. ఆంటోనీ రోముకు వెళ్ళినతరువాత అతడు లేని ఏకాంతత క్లియోపాత్రా హృదయాన్ని కలవరపెడుతుంటే, అతని చేష్టాదికాన్ని మధురాతిమధురంగా భావిస్తూ పూర్వప్రణయస్మృతులతో కాలం వెళ్లబుచ్చుతున్న సమయంలో అతని దగ్గరనుంచి వార్త వచ్చింది.

అతడు ఆక్టేవియాను వివాహమాడిన విషయాన్ని విన్నవించేటంత వరకూ మహోల్లాసంతో వింటున్న ఈమె, హఠాత్తుగా కళవళపాటును పొందింది. అట్టి

దుర్వార్తను తెచ్చిన వార్తాహరిని ఒడలు మరచి తిట్టింది, కొట్టింది. ఇంకా వినవలసింది ఎంతో ఉన్నా ఎదుటినుంచి తరిమివేసింది. క్షుభితమైన చిత్తాన్ని చిక్కబట్టుకొని మరుక్షణంలోనే ఆక్టేవియా సౌందర్యాదికాలను గురించి తెలిసికో రమ్మని పరిచారికను పంపించింది. మళ్ళీ స్వయంగా వార్తాహరివల్ల తానే తెలుసుకోవాలన్న ఊహ కలిగి పిలిచింది. ఎన్నెన్నో ప్రశ్నలు వేసి ఆమెతో ఆంటోనీ బహుకాలం కాపురం చెయ్యడని నిశ్చయించి, దెబ్బతిన్న తన హృదయానికి ఊరట చెప్పుకొన్నది. తిరిగి వచ్చిన ఆంటోనీ క్లియోపాత్రాను కలుసుకొని ధార్మికమే అయినా ఆక్టేవియా చూపిన శీతలప్రణయానికి భిన్నమూ, అనంతవైవిధ్య గుణోపేతమూ అయిన ప్రేమను ఈమెవల్ల అనుభవించి వెనుకటికంటె అధికంగా ఈమెకు దాసుడైనాడు. ఆక్టియం యుద్ధభూమిలో ఈమె ఉండడంవల్ల ఆంటోనీ బుద్ధికి వ్యగ్రత కలుగుతుందన్న భావంతో అతని ఆప్తానుచరుడైన ఎనోబార్బస్ వ్యతిరేకించినప్పుడు, ఈమె అతణ్ణి లక్ష్యపెట్టలేదు. ఆ సందర్భంలో ఆంటోనీ ఈమె ఇచ్ఛానుసారంగా సాగనీయటమే కాకుండా, ఈమె విలాసేచ్ఛననుసరించి ఆక్టోవియస్‌తో సముద్రంమీదనే యుద్ధం చేయడానికి అంగీకరించడం, ఎనోబార్బస్, కానెడియస్ ఎంత వేడుకొన్నా వినిపించుకోకపోవటం, అట్టి క్లిష్టస్థితిలో కూడా ఈ ఈజిప్టుకాముకి అతనిమీద ఎంతటి పరమాధికారాన్ని నెరపుతున్నదో ఊహించటానికి ఉదాహరణలు. ఈ సందర్భంలోనే కానెడియస్ "మన సేనాధినేత నామె అలా నడుపుతున్నది. మనమంతా స్త్రీలకు సేవకులమైనాము" అన్నాడు.

యుద్ధంలో ఈమె భీరుత్వం వల్ల ఓటమి సంప్రాప్తించినపుడు క్షణకాలం ఆంటోనీ క్రోధోన్ముద్రితుడైనాడు. అట్టి అతణ్ణి మళ్ళీ ఎలా వశం చేసుకోవాలో ఈమె ఎరగంది కనుకనా! స్త్రైణమైన దుఃఖాస్త్రాన్ని ప్రయోగించింది.

అతడు దాసుడై అన్నాడు : 'నీ విషాదాశ్రుబిందువు నొకదానినైనా చిందనీయకు. అది నేను జయించి కోల్పోయిన సర్వస్వంతో సమానమైన మూల్యం కలది. ఏదీ ఒక ముద్దు. ఇదైనా చాలు. నే కోల్పోయిన సర్వస్వాన్నీ తిరిగి చెల్లిస్తుంది.' ఆక్టేవియస్‌తో జరిగిన సంధిసంప్రదింపుల సమయంలో తిరిగి ఆంటోనీ పూర్వౌన్నత్యాన్ని సంపాదించలేడన్న నిశ్చయంవల్లనో, కాదని పట్టుబడి వెనువెంటనే కష్టాలపాలు కావలసి వస్తుందన్న భయంవల్లనో లొంగినట్లు అభినయించి మోసగిద్దామన్న ఆలోచనలవల్లనో ఈజిప్టురాజ్ఞి అతడు చెప్పి పంపిన సంధిషరతులకు అణుమాత్రమైనా అడ్డుచెప్పక అంగీకరించింది. బాలుడైన సీజర్ దగ్గరికి ఆంటోనీ నెరసిన తలను గూడా పంపించటానికి ఒప్పుకొన్నది. ఇంతటి కృతఘ్నురాలా మరి? దూతగా వచ్చిన

థైరీయస్‌కు ముద్దిడుకోటానికని తన మృదుహస్తాన్ని అందించింది. మోసగించనేనా? అది ఆంటోనీ ప్రణయపూర్వకంగా ముద్దిడుకొనే హస్తం. థైరీయస్ క్లియోపాత్రా హస్తాన్ని ముద్దిడుకోటమన్న దృశ్యాన్ని చూచి సహించలేక ఆంటోనీ అతణ్ణి కొరడా దెబ్బలు కొట్టించినప్పుడు, తెలివితక్కువతనం వల్ల తానట్టిపని చేసినట్లు నటించి తన ప్రణయ మచంచలమైందని ప్రకటించి, మానసికవ్యథననుభవిస్తున్న అతడికి తాత్కాలికచిత్తశాంతిని చేకూర్చింది.

తరువాత యుద్ధానికి బయలుదేరేటప్పుడు స్వయంగా కవచధారణ చేయించి పంపించింది. మరుసటియుద్ధంలోకూడా క్లియోపాత్రా పారిపోయిరావటం పిరికితనం వల్లనేగాని, మోసగించను కాదు. ఆంటోనీ తరువాత ఏమి చేస్తాడో అన్న భయంవల్లనే తన సమాధినిర్మాణాన్ని చేరుకొని అందులో దాగుకోటం, మరణించినట్లు అతనికి వార్త పంపించటం జరిపించింది. ఆంటోనీ మరణసమయాన తన ప్రేమసర్వస్వాన్ని ఒక్కుమ్మడిగా కుమ్మరించి పరమానందంతో ప్రాణాలను వీడే అవకాశాన్ని అతడికి కల్పించింది. ప్రాణాలతో పట్టుకోబోయి పరాజిత అయిన తనను ఆక్టేవియస్ రోముపురవీథుల్లో ప్రదర్శించి అవమానిస్తాడని బుద్ధికుశలతవల్ల ఎన్నడో ఈమె కనిపెట్టింది. ఆత్మహత్యా మార్గాన్నే ఈమె అనుసరించి, తన 'ప్రియభర్త'ను చేరుకోటానికి ఈమె చిత్తాన్ని సంసిద్ధం చేసుకొన్నది. పురుగుచే కరిపించుకొని ప్రాణపరిత్యాగం చేసే సమయంలో, ఆమె వెల్లడించిన ఉల్లాసోజ్జ్వలాలైన మధురోహలు రసికలోకానికి ఏ నాటికీ మరుపురానివైనవి. ఈ సమయంలో క్లియోపాత్రా ప్రదర్శించిన ప్రణయప్రవర్తనరీతులు సమస్తదోషాలనూ క్షాళితంచేసి ఆమెచేత రూపొందిన కవితలా వర్తింపజేశాయి.

మరణానంతరమైనా తన సమ్మోహనశక్తిని కోల్పోని ఈ ఈజిప్టురాజ్ఞిని తిలకించి 'తన సౌందర్యమనే సమ్మోహనవిద్యతో మరో ఆంటోనీని నిబద్ధుణ్ణి చేయటానికో అన్నట్లు ఈమె నిద్రపోతున్నది' అన్న ఆక్టేవియస్ అభిప్రాయం, మరణం వల్ల కూడా ఒక మనోహరవిజయాన్ని సాధించిన క్లియోపాత్రాకు కీర్తిగీతికలా ఒప్పుతున్నది.

## ఆక్టేవియా

చరిత్రలోని ఆక్టేవియా అపురూపసుందరి. మనోహరమూర్తి. వివేకవతి. నిత్యసత్యప్రియ. పతిభక్తి తత్పర. తనను పరిత్యజించి ఆంటోనీ అలెగ్జాండ్రియాకు వెళ్లిన తరువాత, ఈమె అన్న ఆజ్ఞకు భిన్నంగా ఆంటోనీ ఇంటిలోనే ఒంటిగా ఉంటూ

అతడివల్ల తనకు కలిగిన సంతానాన్నీ, అతడికి ఫుల్వియావల్ల కలిగిన సంతానాన్నీ సమానప్రేమతో పోషించి, పాలించిన మహోదార. ఆంటోనీ క్లియోపాత్రాల మరణానంతరం వారి సంతానాన్ని కూడా ఈమే ప్రేమతో సాకిందట! కానీ షేక్స్పియర్ చరిత్రలోని ఇట్టి ఆక్టేవియాను సహజరూపగుణాలతో చిత్రించలేదు. క్రీడారతుడనీ, విలాసలోలుడనీ, కామప్రవృత్తుడనీ, చలచిత్తుడనీ ఖ్యాతిగన్న ఆంటోనీకి, ఒకానొక రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి అన్న తన్నిచ్చి వివాహం చెయ్యటానికి నిర్ణయిస్తే అవును కాదనకుండా అంగీకరించిన గుణవతినిగా నాటకంలో షేక్స్పియర్ ప్రథమతః ఈమెను ప్రవేశపెట్టాడు. ఆంటోనీ ఆక్టేవియస్‌ల మధ్య మహాఘనాలుగా కన్పించే అల్పవైమనస్యాలు, ప్రమాద పరిస్థితులను వెంటబెట్టుకొని ఉన్నట్లు తోచే గాఢభయాలు, ఈమె వివాహంతో అంతరించి అంతర్ధానమౌతాయని ఇరువురికీ ఆప్తులైన కొందరు ఊహించారు. కానీ వివేచనశీలియైన ఎనోబార్బస్ ఊహించినట్లే ఈ వైవాహికబంధమే అల్పకాలంలో వారిరువురి మైత్రికీ ఉరిత్రాడైంది.

రాజకీయ కారణాల వల్ల ఏథెన్సుకు వెళ్ళుతున్న ఆంటోనీని అనుసరించే సమయంలో ఈమె కంటతడి పెట్టింది. హృదయభావాలను పలుకటానికీమె నాలుక తిరస్కరించింది. భర్తననుసరించటం, అన్నతోనే ఉండటం అన్న పరస్పరవిరుద్ధాలైన ఈమెలోని హృదయోద్వేగాలు ఉన్నతాలైన ఆటుపోటులమీద నిశ్చలంగా వంచి నిలిపిన హంసపక్షాలలాగా చలనరహితతను వహించాయి. తుదకీమె 'భర్తృగృహాన్ని భద్రంగా చూస్తుండవలసిందని' అన్నతో చెప్పి అతని శుభాకాంక్షలతో భర్తను అనుసరించింది. ఆంటోనీ ఆక్టేవియస్ పరస్పర యుద్ధసన్నద్ధులైనారన్న విషయాన్ని విన్న తరువాత, చెదిరిన వారి స్నేహాన్ని చక్కదిద్దటంకోసం దౌత్యభారాన్ని తలపై కెత్తుకొని రోముకు వచ్చినప్పుడు సాధుస్వభావి అయిన ఆక్టేవియా మళ్ళీ మనకు కన్పిస్తుంది. ఈ దౌత్యానికి పూనుకోబోయే ముందూ, వెనుకా ఈమె ఇరువురిమధ్య వైమనస్యా లేర్పడ్డందుకు ఎంతో తత్తరపాటును ప్రదర్శించింది. అన్నను గురించి విన్న వార్తల నన్నింటినీ నమ్మవద్దనీ, నమ్మవలసి వచ్చినా మనస్సుకు పట్టించుకోవద్దనీ వారిరువురి మధ్య యుద్ధాలు ప్రపంచాన్ని ద్విధాకరిస్తే ఆ రెండుఖండాలమధ్య ఏర్పడే పగుళ్ళను పూడ్చటానికి ఆ యుద్ధాలలో మృతులయ్యే మానవులను ఉపయోగించవలసి ఉంటుంది. భర్తతో సమయజ్ఞతను, నీతిని ప్రదర్శిస్తూ ఎంతగానో చెప్పింది. తన ఉన్నతికి అనుగుణంగా ప్రణయపూర్వకమైన స్వాగతాన్ని పలికే అవకాశమీయకుండా ఆంటోనీ తరిమివేస్తే, అతిసామాన్య వనితలా వచ్చావని కోపించిన అన్నతో, తనను అలా వెళ్ళమని

ఎవరూ నిర్బంధించలేదనీ, ఆంటోనీని అభ్యర్థించి తానే వచ్చాననీ చెప్పి, భర్తమీద అతడు ఆరోపించిన దోషాన్ని తొలుతగా తొలగించివేసింది.

తరువాత ఆమె అన్నతో చేసిన ప్రసంగంలో ఈ ఆక్టేవియా తన ఉత్తమ స్త్రీజనసహజమైన ప్రతిభను, ప్రేమను ప్రదర్శించింది. అవకాశం చిక్కింది గదా అని ఆంటోనీని హతమార్చటానికి అన్న నిర్ణయించినప్పుడు 'పరస్పరవిద్రోహాన్ని తలపెట్టుకొన్న ఇరువురు స్నేహితులయెడ సమంగా హృదయప్రేమను పంచియిచ్చిన నేనెంతటి అదృష్టహీన'నని వాపోయింది. సౌందర్యం, సాధుస్వభావం, వివేకం, పావిత్ర్యం ఈ ఆక్టేవియాలో పుంజీభవించి ఉండటంవల్లనే, ఈమెను ఆంటోనీ వివాహమాడాడని విన్న మరుక్షణంలో ఈర్ష్యాళువై క్లియోపాత్రా ఆందోళనపడ్డది. అతిశీతలస్వభావ నిత్యవర్తనలో అతిస్తబ్ధ అని క్రమక్రమంగా తెలిసికొని 'అయితే ఆంటోనీ ఈమెతో బహుకాలం కాపురం చెయ్యడు' అని నిశ్చయించుకొన్నదాకా శాంతి వహించలేదు.

'ఇట్టి స్త్రీ భార్యగా ఉండటాన్ని కోరుకోనివాడంటూ ఎవడైనా ఉంటాడా?".

'ఉండకేం? ఆ స్వభావాలు లేనివాడు అట్టి వనితను భార్యగా కోరుకోడు. మార్క్ ఆంటోనీ అటువంటివాడు. అతడు తిరిగీ తన ఈజిప్టు వంటకం దగ్గిరికే చేరుకొంటాడు' ఒకప్పుడు మెనాస్ ఎనోబార్బస్‌ల మధ్య ఆక్టేవియాను గురించిన ప్రసంగం ఇలా నడిచింది. తాత్కాలిక శాంతికోసం ఆంటోనీ ఆక్టేవియాను వివాహమాడాడు. తరువాత పరిత్యజించాడు. నాటకంలో తగిన స్థానమిచ్చి షేక్స్‌పియర్ ఆక్టేవియా పాత్రను పోషించలేదని కొందరు విమర్శకుల అభిప్రాయం.

ఈ నాటకంలో ఆ మహాకవి ప్రధానంగా చూపదలచుకొన్నది ప్రధానపాత్రలైన ఆంటోనీ క్లియోపాత్రల అధర్మ ప్రణయం, దానివల్ల కలిగిన దుష్ఫలితాలు. ప్రేమ లేని వివాహం వైరానికే కారణమౌతుందని ప్రాసంగికమైన ఆక్టేవియా వివాహకథవల్ల తెలియజేయ తలపెట్టిన షేక్స్‌పియర్‌కు, ఆక్టేవియాను మరొకరీతిగా చిత్రించే అవకాశంలేదు. అందువల్లనే ఆమె భర్తయైన ఆంటోనీ గార్హస్థ్యజీవితంలోకి చొచ్చుకొనిపోలేకపోయింది. కనుకనే ఆక్టేవియా నాటకంలో అచంచల పతిభక్తి గల అతివగా కాక స్వార్థపరురాలైన సోదరిలా మిగిలిపోయింది.

# పాత్రలు

**పురుషులు**

| | | |
|---|---|---|
| **మార్క్ ఆంటోనీ** | : | త్రైకూటమిసభ్యుడు |
| **ఆక్టేవియస్ సీజర్** | : | ” |
| **ఎమ్మిలియస్ లెపిడస్** | : | ” |

ఎనోబార్బస్, వెంటిడియస్, స్కారస్, డెమిట్రియస్, ఐరోస్, డెర్సిటాస్, ఫిలో – ఆంటోనీమిత్రులు, ఆప్తానుచరులు.

మెకయ్‌నాస్, అగ్రిప్పా, డోలబెల్లా, ప్రొక్యులెయ్యస్, థైరియస్ గాలస్ – సీజర్ మిత్రులు, ఆప్తానుచరులు

మెనాస్, మెనక్రేటిస్, వర్రియస్ – పాంపేమిత్రులు, ఆప్తానుచరులు,

| | | |
|---|---|---|
| **టారస్** | : | సీజర్ సేనాపతి |
| **కానెడియస్** | : | ఆంటోనీ సేనాపతి |
| **సిలియస్** | : | వెంటిడియస్ సైన్యంలో ఒక అధికారి |
| **యూఫ్రోనియస్** | : | సీజర్ దగ్గరికి ఆంటోనీ పంపించిన దూత |

ఎలెగ్జాస్, మార్డియన్ (కొజ్జా), సెల్యూకస్, డయొమిడిస్‌లు క్లియోపాత్రా అనుచరులు.

ఒక శకునజ్ఞుడు, ఒక విదూషకుడు

**స్త్రీలు**

| | | |
|---|---|---|
| **క్లియోపాత్రా** | : | ఈజిప్టురాజ్ఞి |
| **ఆక్టేవియా** | : | సీజర్ సోదరి, ఆంటోనీ భార్య |

ఛార్మియన్, ఐరాస్ క్లియోపాత్రా పార్శ్వవర్తినులు

ఉద్యోగులు, సైనికులు, వార్తాహరులు, ఇతర పరిచారకగణం.

# ప్రథమాంకం

## ఒకటో దృశ్యం

**అలెగ్జాండ్రియా, క్లియోపాత్రాప్రాసాదంలో**
**ఒక కక్ష్య. డెమెట్రియస్, ఫిలో ప్రవేశిస్తారు.**

**ఫిలో :** మన సేనాధినేత, కామలౌల్యం విజ్ఞానహీనమై మేరలు మీరిపోయింది. మోహరించి నిలిపిన సైనికనికాయాల మీద పూతమెఱుంగు కవచాన్ని ధరించి కాంతిపుంజాలను పుక్కిలించే అతని నేత్రాలు, నేడు ఆ కపిలవర్ణ[1] ముఖాన్ని కడుభక్తితో సేవిస్తున్నవి. సమరభూముల్లో శత్రువులయెడ తలపడి తారసిల్లేటప్పుడు వక్షఃస్థలంమీది కవచబంధాలను బ్రద్దలుకొడుతూ ఉచ్ఛ్వాసనిశ్వాసాలు చేసే అతని అగ్రేసరహృదయం ఇప్పుడు అదుపుతప్పి ఒక జిప్సీ[2] కామాగ్నిని చల్లార్చే పాణింధమమూ, ప్రకీర్ణకమూ ఔతున్నది.

**(తుత్తారధ్వనులు. ఆంటోనీ, క్లియోపాత్రా, ఆమె స్త్రైణమూ,**
**పరివారమూ, కొజ్జాలు ఆమెకు వృంతాలను విసురుతూ ప్రవేశిస్తారు.)**

వాళ్ళెక్కడికి వస్తున్నారో గమనించు. ఏ సూక్ష్మాంశమూ నీ దృష్టిని తప్పించుకోరాదు. రోమక సామ్రాజ్యానికి తృతీయస్తంభమైన ఒక మహావ్యక్తి ఎలా ఒక బంధకి పరివారగణంలో ఒకడుగా లీనమైపోతూ పరివర్తన పొందుతున్నాడో, అతడిలో నీకు గోచరిస్తుంది. అతిశ్రద్ధతో పరిశీలించు.

**క్లియోపాత్రా :** నాయెడ మీకున్నట్లుగా ప్రకటిస్తున్నదంతా ప్రేమే అయితే దాని విస్తృతి ఎంతో వెల్లడించు.

**ఆంటోనీ :** పరిమితిని పరిగణించటానికి లొంగే ప్రణయం పరమదరిద్ర మైంది.

**క్లియోపాత్రా :** నీ ప్రేమకు నేనో అవధిని కల్పించాలి గదా!

**ఆంటోనీ :** అయితే నీవొక నవ్యస్వర్గాన్ని సంపాదించాలి నూతనభూతలాన్ని సృజించాలి.

**ఒక పరిచారకుడు ప్రవేశిస్తాడు.**

**పరిచారకుడు :** ఉదాత్తప్రభూ! రోమునుంచి వార్తలు వచ్చాయి.

**ఆంటోనీ :** అతిగా చెప్పి విసిగించకు. సంగ్రహంగా కానీ.

**క్లియోపాత్రా :** ఆంటోనీ! అలా కాదు. వాటిని పూర్తిగా వినితీరాలి. బహుశః నీమీద ఫుల్వియాకు కోపం వచ్చి ఉండవచ్చు. "ఈ రాజకార్యాన్ని నిర్వహించు, ఆ రాజ్యస్వాతంత్ర్యాన్ని హరించు. ఈ రాజ్యానికి స్వేచ్ఛాప్రదానం చెయ్యి. ఆ కృత్యాన్ని నెరవేర్చకపోతే నిన్ను హతమారుస్తాను" అని అంకురించే[3] శ్మశ్రువుగల యువకుడైన సీజర్ నిన్ను ఆజ్ఞాపించి ఉండవచ్చు.

**ఆంటోనీ :** ప్రియా! ఏమంటున్నావు?

**క్లియోపాత్రా :** అంతే కాదు. బహుశః, ఏమిటి? జరగవచ్చు కూడాను. బహుకాలం ఇక ఇక్కడ నీవు ఉండటానికి అతడి అంగీకారం ఉండకపోవచ్చు. సీజర్ నిన్ను పదవీచ్యుతుణ్ణి చేసి వుండవచ్చు. కాబట్టి, ఆంటోనీ! అదేమిటో విను. ఏవీ ఫుల్వియా ఆదేశాలు కాదు, సీజర్ ఆదేశాలు. పొరబాటు ఇరువురి ఆదేశాలు. వార్తాహరులను ప్రవేశపెట్టు. నీవు ఎళ్ళిబారిపోతున్నావు ఈజిప్టుకు నేను రాజ్ఞిని అయి ఉండటం ఎంత సత్యమో ఇది అంత సత్యం. రక్తం నీ కపోలసీమల్లోకి చిమ్ముకుంటూ వచ్చి సీజర్‌కు సామంతాన్ని నెరపుతూ ఉన్నది. లేదా ఆ కీచుగొంతుక గల ఫుల్వియా తిడుతుందేమోనని భయంతో కప్పం చెల్లిస్తున్నది. వార్తాహరులేరీ?

**ఆంటోనీ :** రోము మహానగరాన్ని టైబర్[4] నదిలో కలిసిపోనీ! ఘనవినిర్మితమైన రోమకమహాసామ్రాజ్య ధనురాకారాన్ని ఒరిగి సురిగిపోనీ!! నా నివాసభూమి మాత్రమిదే. మహారాజ్యాలు మృణ్మయాలు. జంతువులనూ, మానవులనూ సమానంగా సాకే భూమి భావింపదగ్గదే కాదు, సమస్తజీవితంలో మహోదారమైంది ధనసంపాదన కాదు. అధికారార్జన అంతకంటే కాదు అది పరస్పరప్రణయప్రదానం. లోకంలో అన్యోన్యానురాగం ఉన్న దంపతులంటూ ఎవరైనా ఉంటే, వ్యతిరేకించి అట్టివారు మీరు కాదనటంవల్ల కలిగే శిక్షను కూడా ధిక్కరించి, ఈ విషయంలో మాకు సాటైనవారు లేరని సర్వప్రపంచానికీ చాటుతాను.

**క్లియోపాత్రా :** మహామనోజ్ఞమైన అసత్యం! అయితే ఫుల్వియాను ఎందుకు వివాహమాడావు? ఎందుకు ప్రేమించలేదు? వెఱ్ఱిదాన్ని కాని నేను నీ మాటలు నమ్మితే వెఱ్ఱిదాన్నౌతాను. ఫుల్వియా మోహపాశాలలోనుంచి తప్పించుకొన్నట్లే, అనతికాలంలో నా మాయాబంధంలో నుంచి కూడా తప్పించుకొని ఆంటోనీ ఆంటోనీ కాబోతున్నాడు.

**ఆంటోనీ :** నీ మాట నిజం! అయితే ఆంటోనీ క్లియోపాత్రా ఉద్బోధక మైనప్పుడే ఆ ఆంటోనీ కాగలడు. ప్రణయాధిదేవత ప్రశస్తకాలాన్ని మన మీ మల్లగుల్లాలతో వ్యర్థం చెయ్యవద్దు. ఏదో విలాసం లేకుండా గడిపివేయటానికి యోగ్యమైన క్షణం మనకు ఒక్కటైనా లేదు. ఈ రాత్రికి మరి మన విలాసం ఏమిటి?

**క్లియోపాత్రా :** ఆ వార్తలు విందాం.

**ఆంటోనీ :** సిగ్గు, సిగ్గు! కలహశీలా రాజ్ఞీ! నిందించటానికీ, పరిహసించటానికీ, రోదించటానికీ, నీకు ఉపయోగించనివంటూ లేవు. నీ భావోద్వేగాలలో ప్రతి ఒక్కటీ మనోహరమై నాకు మాననీయ మౌతుంటుంది. నీ వార్తాహరులు తెచ్చేవితప్ప నేను మరి యే యితరులవల్లా ఎట్టి వార్తలనూ వినదలచలేదు. ఈ నాటి రాత్రి మనమిద్దరం ఏకాంతంగా నగరవీథుల్లో సంచారంచేసి ప్రజల గుణవిశేషాలను పరిశీలిద్దాం. లే. రాజ్ఞీ! జ్ఞప్తికుందా, గడిచిన రాత్రి నీవు నన్నిదే కోరిక కోరావు. – ఇక మీరు మాతో సంభాషించవద్దు.

**(ఆంటోనీ, క్లియోపాత్రా వారి పరివారాలతో నిష్క్రమిస్తారు)**

**డెమిట్రియస్ :** ఏమిటి? ఆంటోనీ సీజర్‌ను ఇంత చులకనగా భావించాడా?

**ఫిలో :** ఆర్యా! ఆంటోనీ ఆంటోనీగా లేని కొన్ని సందర్భాలలో సహజసిద్ధమైన అతడి మహోదారప్రవర్తన లోపిస్తుంటుంది.

**డెమిట్రియస్ :** అతణ్ణిగురించి అసత్యవాది అని రోములో అబద్ధాలు చెప్పేవారి మాటలు ఆంటోనీ సత్యాలనిపిస్తున్నందుకు నాకెంతో విచారం కలుగుతున్నది. అతడు రేపటికైనా కొంతగా సత్ప్రవర్తనను ప్రదర్శిస్తాడని ఆశిస్తున్నాను. శుభమగుగాక!

**(నిష్క్రమిస్తారు.)**

## రెండో దృశ్యం

**మరొక కక్ష్య, ఛార్మియన్, ఐరాస్, ఎలెగ్జాస్, ఒక జోస్యుడు ప్రవేశిస్తారు.**

**ఛార్మియన్ :** ఎలెగ్జాస్, మధురమూర్తీ! సర్వరూప, ఎలెగ్జాస్!! సర్వ పరిపూర్ణుడా ఎలెగ్జాస్!! మహారాజ్ఞి ముందు అంతఘనంగా పొగిడావే ఆ జోస్యుడెక్కడున్నాడు?

**ఎలెగ్జాస్ :** జోస్యుడా?

**జోస్యుడు :** మీకేం కావాలి?

**ఛార్మియన్ :** అతడితడేనా? భవిష్యజ్ఞానంకలవారు మీరేనా?

**జోస్యుడు :** ప్రకృతిగుప్తతంత్రంతో నాకు కొంత పరిచయముంది.

**ఎలెగ్జాస్ :** ఆయనకు నీ చేయి చూపించు.

**ఎనోబార్బస్ ప్రవేశిస్తాడు.**

**ఎనోబార్బస్:** ఆలస్యం చేయక విందును తీసుకో రా. క్లియోపాత్రా ఆరోగ్యం కోసం త్రాగటానికి మనకు మరింత ద్రాక్షారసం ఉండాలి సుమా!

**ఛార్మియన్ :** అయ్యా! మీరు నాకు మంచి అదృష్టాన్ని దయ చేయించాలి.

**జోస్యుడు :** దాన్ని నేను సృష్టించలేను. ఉన్నదాన్ని కొంత ముందుగా చూడగలను. అంతే.

**ఛార్మియన్ :** అయితే దయ ఉంచి నా భవిష్యత్తు ఎలా ఉంటుందో చూడండి.

**జోస్యుడు :** ఇప్పుడున్న దానికంటే ముందెంతో సుందరంగా ఉంటావు.

**ఛార్మియన్ :** ఇంతకంటే మంచిరూపం కలుగుతుందని ఆయన అభిప్రాయ మనుకొంటాను.

**ఐరాస్ :** కాదు కాదు. వృద్ధాప్యంలో పొడిని పులుముకొంటావని.

**ఛార్మియన్ :** అటువంటి పూత అవసరమయ్యేటట్లు ముడతలు పడకుండుగాక!

**ఎలెగ్జాస్ :** ఇలా అనుమానించి ఆయన భవిష్యజ్ఞానాన్ని అలయించకు, శ్రద్ధగా విను.

**ఛార్మియన్ :** ఇక చాలించండి.

**జోస్యుడు :** ప్రేమింపబడేదానికంటే నీవే ఎంతో ఎక్కువగా ప్రేమిస్తావు.

**ఛార్మియన్ :** ప్రేమింపబడటమనే బాధను భరించటానికి తప్పత్రాగి నా కార్జానికి వెచ్చదనాన్ని చేకూరుస్తాను.

**ఎలెగ్జాస్ :** ఇలా ఆయన చెప్పేదాన్ని చెదరగొట్టకు. విను.

**ఛార్మియన్ :** ఏమిటి, ఏదైనా మంచి అదృష్టం గోచరించిందా? ప్రజ్ఞావిశేషాన్ని ప్రదర్శించి అద్భుతంగా అభిజిద్వేళల్లో ముగ్గురు రాజులను పెళ్లాడి ముగ్గురికీ విధవనుగా

మిగిలిపోతానా? ఏబదిఏళ్ల వయసులో[5] జూరీ హీరాడ్[6]ను లొంగదీసే కొడుకును కనేట్టు చెయ్యండి. ఆక్టేవియస్ సీజర్‌ను పరిణయమాడి నా యజమానురాలితో సమానమైన సాంఘికగౌరవం పొందేటట్లుగా చెయ్యండి.

**జోస్యుడు :** ఏ ప్రభ్విని ఈ నాడు సేవిస్తున్నావో ఆమె మరణానంతరంకూడా నీవు సజీవవుగానే ఉంటావు.

**ఛార్మియన్ :** మనోజ్ఞమైన విషయం. దీర్ఘకాలజీవితమంటే నాకు అత్తిపళ్ల మీద కంటే అమితాసక్తి.

**జోస్యుడు :** అనుభవించనున్న అదృష్టంకంటే అనుభవించిందే మిక్కిలి మనోహరమైందిగా నాకు తోస్తున్నది.

**ఛార్మియన్ :** అంటే, బహుశః నాకు కలిగే సంతానం తల్రండులెవరో[7] తెలియక పేర్లు లేకుండా ఉంటారన్నమాట! అయ్యా, సెలవీయండి వారిలో మొగవెధవ లెందరు? ఆడముండలెందరు?

**జోస్యుడు:** నీవు కోరిన కోరికల్లా గర్భాన్ని ధరించి ఫలిస్తే పదిలక్షలమంది.

**ఛార్మియన్ :** మూర్ఖుడా! ఇక నడు! ఇంతకంటే నీవు బాగా భవిష్యత్తును చూచి చెప్పలేవు కనుక మాంత్రికురాలిని చేసినట్లు నిన్ను మంటలపాలు చేస్తానని భయపడకు. ఇక చాలు. ఐరాస్ భవిష్యత్తు ఎలా ఉందో చెప్పు చూతాం.

**ఎలెగ్జాస్ :** మా భవిష్యత్తులు ఎలా ఉంటాయో మాకు తెలియనే తెలుసు.

**ఎనోబార్బస్ :** నా అదృష్టంలో, నా బోటి ఇతరుల అదృష్టంలో ఏముంటుంది, తప్ప త్రాగి నిద్రపోవటం తప్ప?

**ఐరాస్ :** ఇతరాలను వేటిని తెలియజేసినా లేకపోయినా, నా హస్తపావిత్ర్యాన్ని వెల్లడించి తీరుతుంది.

**ఛార్మియన్ :** నిండి ప్రవహించే[8] నైల్ క్షామాన్ని సూచిస్తే నీ హస్తం పునీతతను ప్రదర్శిస్తుంది.

**ఐరాస్ :** ఛీ! ఉన్మత్తురాలా! వెళ్లిపో! జోస్యం నీవేం చెప్పగలవు?

**ఛార్మియన్ :** నీ హస్తంవంటి తడిచేయి[9] ఫలకారి అయిందని జోస్యం చెప్పలేకపోతే ఏ స్వల్పవిషయాన్నీ నేను చెయ్యలేనన్నమాట! అయ్యా! మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. దయ ఉంచి దీనికో సర్వసాధారణమైన ఫలితాన్ని సెలవీయండి.

**జోస్యుడు :** మీ ఇరువురి అదృష్టాలూ తుల్యంగానే ఉన్నాయి.

**ఐరాస్ :** అది ఎలా సంభవం? వివరాలు సెలవీయండి.

**జోస్యుడు :** చెప్పాను గదా!

**ఐరాస్ :** దాని అదృష్టం కంటే నాది అణుమాత్రమైనా అధికంగా లేదా?

**ఛార్మియన్ :** దురూహలనుంచీ భగవంతుడు మనలను దూరం చేయుదుగాక! ఎలెగ్జాస్! రావేం. అయ్యా! ఈతని అదృష్టం ఎలా ఉందో. ఓ ఇసిస్ దేవతా! ఇతడు లేచిపోని పెళ్ళాన్ని వివాహమాడుగాక! క్రమంగా ఇతడికి ఒకరికంటే ఒకరు కురూపలైన భార్యలు కలుగుదురుగాక! అందరిలోనూ చివరి పెళ్ళాం ఇతణ్ణి చూసి నవ్వుతూ ఇతని శ్మశానం దగ్గిరికి చేరేదాకా ఈ భార్యాపరంపర సాగిపోవుగాక! ఇంతకంటే అతిశయమైన మరో నా అభ్యర్థనాన్ని ప్రసాదించకపోతే పోనీ ఓ ఇసిస్[10] దేవతా! దీన్నిమాత్రం త్రోసిపుచ్చకు.

**ఐరాస్ :** అట్లే అగుగాక! ప్రియదేవీ!! ఈ ప్రజావాంఛను విందువుగాక!

**ఛార్మియన్ :** దేవీ విందువు గాక!

**ఎనోబార్బస్ :** ఇక చాలించండి. ఆంటోనీ మహాశయుడు వస్తున్నాడు.

**ఛార్మియన్ :** వచ్చేది ఆయన కాదు  మహారాజ్ఞి!

**క్లియోపాత్రా ప్రవేశిస్తుంది.**

**క్లియోపాత్రా :** మీరు నా ప్రభువును చూచారా?

**ఎనోబార్బస్ :** లేదు రాజ్ఞీ!

**క్లియోపాత్రా :** వారు ఇక్కడ లేరా?

**ఛార్మియన్ :** లేరు మహారాజ్ఞీ!

**క్లియోపాత్రా :** ఆయనెప్పుడూ విలాసోన్మత్తుడై ఉంటాడు. అయితే రోమక రాజకీయ వ్యవహారాలు హఠాత్తుగా ఆయన మనస్సును మార్చివేశాయి. ఎనోబార్బస్!

**ఎనోబార్బస్ :** రాజ్ఞీ!

**క్లియోపాత్రా :** ఎక్కడ ఉన్నాడో చూచి ఆయనను ఇక్కడికి తీసుకోరా. ఎలెగ్జాస్ ఎక్కడ?

**ఎలెగ్జాస్ :** తమ సేవార్థినై నేను ఇక్కడనే వేచి ఉన్నాను. అరుగో, ప్రభువు వస్తున్నారు.

**క్లియోపాత్రా :** ఆయనను నేను చూడనట్లు నటిస్తాను. నా వెంట మీరందరూ వచ్చేయండి.

**(నిష్క్రమిస్తుంది)**

**ఒకవార్తాహరి, పరిచారకులూ వెంటరాగా ఆంటోనీ ప్రవేశిస్తాడు.**

**వార్తాహరి :** తమ భార్య ఫుల్వియా[11] తొలుతగా యుద్ధరంగంలో ప్రవేశించింది.

**ఆంటోనీ :** నా సోదరుడు లూషియస్‌కు ప్రతర్థినిగానా?

**వార్తాహరి :** అవును. అయితే అనతికాలంలోనే వారి ఇద్దరిమధ్యా జరిగిన ఘోరమైన పోరు పరిసమాప్తమైంది. దేశంలోని విషమపరిస్థితులవల్ల ఇరువురికీ సఖ్యం కుదిరింది. ఉభయుల సేనలూ ఏకమై సీజర్ మీదికి ఎదురునడిచాయి. తొలి తుములంలోనే ఆయనకు లభించిన విజయం వారిని ఇటలీనుంచి తరిమి వేసింది.

**ఆంటోనీ :** చెప్పవలసిన దుర్వార్తలు ఇంతకంటే ఇంకేమైనా ఉన్నాయా?

**వార్తాహరి :** వినిపించటానికి దుర్వార్తలను తెచ్చినవాడు వాటివల్ల కలిగే అసంతృప్తిలో పాలుపంచుకోవలసి ఉంటుంది.

**ఆంటోనీ :** ఆ వార్తలు ఒక బుద్ధిహీనుడికి లేదా పిరికిపందకూ సంబంధించినవైతే నీవు చెప్పేది సత్యమే. నీవు చెప్పవలసిందంతా వినిపించు. ఆపకు. జరిగిపోయిన విశేషాలేవీ నాలో సంచలనాన్ని కలిగించలేవు. నీవు చెప్పవలసిందంతా చెప్పేయి. ఒక వార్తాహరి చెప్పేది సత్యమైతే, అది మృత్యువు, భీకరమైనవార్తే అయినా నేను స్తోత్రపాఠాన్ని వినిపిస్తున్నప్పటి లాగానే వినగలను.

**వార్తాహరి :** అయితే వినండి. లెబినియస్, – ఈ వార్త మహాపరుషమైంది – యూఫ్రెటిస్[12] మొదలు ఆసియానంతటినీ తన పార్థియన్ సైన్యాలతో ఆక్రమించాడు. సిరియా మొదలు లిడియావరకూ, తరువాత అయోనియావరకూ అతని విజయధ్వజం విర్రవీగుతూ విహరించింది. అయితే అప్పుడు ప్ర.... ప్ర.....

**ఆంటోనీ :** ఆంటోనీ అని వ్యవహరించు.

**వార్తాహరి :** ఓ ప్రభూ!

**ఆంటోనీ :** సూటిగా ప్రసంగించు. వ్యవహారాలను క్లిష్టం చెయ్యకు. రోములో ఆమెను గురించి ఎలా వ్యవహరిస్తారో అలాగే క్లియోపాత్రా అని వ్యవహరించు. ఫుల్వియా

నన్ను నిందిస్తూ ఏ పదబంధాలను ప్రయోగించిందో వాటినే వాడు. నా దోషాలను సత్యదృష్టికి గోచరించినట్లుగానూ, ఈర్ష్య భావించినట్లుగానూ ప్రదర్శించి స్వేచ్ఛగా అవహేళన చెయ్యి. అహల్యలుగా ఉన్నప్పుడు నిశితమైన మనస్సులు కలుపు మొక్కలను కంటాయి. మన దోషాలను మనకు తెలియజేయటమంటే కలుపు మొక్కలను కలియదున్ని పారేయటమన్నమాట – ప్రస్తుతానికి నీవు విశ్రాంతి తీసుకో.

**వార్తాహరి :** అలాగే. మీ ఇచ్ఛానుసారంగానే.

**(నిష్క్రమిస్తాడు)**

**ఆంటోనీ :** సిక్సన్ వార్తలేమిటి?

**ప్రథమపార్శ్వచరుడు :** ఎవరైనా అక్కడ సిక్సన్ నుంచి వచ్చినవారున్నారా?

**ద్వితీయపార్శ్వచరుడు :** అతడిందాకటినుంచీ మీ అనుజ్ఞ కోసమే వేచిఉన్నాడు.

**ఆంటోనీ :** అతణ్ణి ప్రవేశపెట్టు. బలవత్తరాలైన ఈ ఈజిప్టు రాజ్ఞీ బహుళ బంధాలను నేను తెగదెంచివేసుకోవాలి లేకపోతే ఈ అజ్ఞాన విమోహంతో నన్ను నేను నాశనం చేసుకొంటాను!

**మరొక వార్తాహరి ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** విశేష మేమిటి?

**ద్వితీయవార్తాహరి :** ప్రభూ! తమ పత్ని ఫుల్వియా మరణించింది.

**ఆంటోనీ :** ఎక్కడ?

**ద్వితీయ వార్తాహరి :** సిక్సన్‌లో – ఆమె ఎంతకాలం వ్యాధిబాధిత అయిందో, ఇంకా మీరు తెలుసుకోవలసిన విషయాలేమిటో ఇందువల్ల మీకు తెలుస్తాయి.

**(ఒక ఉత్తరాన్ని అందిస్తాడు)**

**ఆంటోనీ :** నన్ను ఒంటరిగా ఉండనీ.

**(ద్వితీయవార్తాహరి నిష్క్రమిస్తాడు)**

ఒక మహోదార మరణించింది. అసహ్యంతో అలక్ష్యం చేసి అవతల పారేసినదాన్నే మరొకప్పుడు తిరిగి అది మనది కావాలని కోరుకుంటుంటాము. ఒకనాటి సంతోషం కాలపరివర్తనవల్ల దుఃఖంగా పరిణమిస్తుంటుంది. ఆమె ఇప్పుడు మరణించి నాకు

మంచిదైంది. ఆమె మృతికోసం అప్పుడు వేగపడ్డ నా హస్తం ఇప్పుడు ఆమెకు ప్రాణం పోయగలుగుతుందా? నేడు మన కానందంగా తోచింది కాలపరివర్తనవల్ల రేపు దాని మూల్యాన్ని కోల్పోయి దుఃఖంగా పరివర్తన పొందుతుంది. సమ్మోహిని అయిన ఈ ఈజిప్టురాజ్ఞి పన్నిన బంధనాలను తెగదెంచుకొని నేను బయటపడి తీరాలి. తెలుసుకొన్న వాటికంటే తెలుసుకోని పదివేల ప్రళయాలను నా మాంద్యం నా కోసంగా పొదిగి పెట్టింది... ఎనోబార్బస్! ఎక్కడున్నావు?

**ఎనోబార్బస్ తిరిగి ప్రవేశిస్తాడు.**

**ఎనోబార్బస్ :** ఏ విలాసాన్ని ఆజ్ఞాపించదలచారు ప్రభూ!

**ఆంటోనీ :** ఇక్కడినుంచి నేను వెంటనే వెళ్ళిపోవాలి.

**ఎనోబార్బస్ :** అయితే ఈ మనస్త్రైణాన్ని మరణాలపాలు చేయదలిచారా? పురుషుల నిర్దయ వారికి ఏ పాటి ప్రళయమో మనమెఱిగిందే కదా? వారు మననిష్క్రమణను అనుభవించటమంటే 'మృత్యువు' పలువురినోట పరిభాషౌతుందన్నమాట!

**ఆంటోని :** కానీ నేను వెళ్ళితీరాలి!

**ఎనోబార్బస్ :** మీ అవసరం అంత బలవత్తరమైనదైతే ఇక మన స్త్రైణానికి మరణం తప్పదు. కేవలమొక స్వల్పం కోసం వారిని త్రోసిపుచ్చటం సత్యానికి శోచనీయమైంది. కానీ బలవత్తరకారణంవల్ల వారిమరణం అవసరమైతే, అప్పుడు వారికో విలువ ఇవ్వవలసిన పనిలేదు. ఈ వార్త ఇంచుకంత పొక్కి క్లియోపాత్రా చెవిసోకితే ఆమె మరుక్షణంలోనే మరణిస్తుంది. ఆమె ఇంతకంటే స్వల్పమైన కారణాలకే ఇరవైమార్లు మరణించటం కళ్ళారా చూచాను. మరణించటానికి ఆమె అంతటి సంసిద్ధతను చూపుతున్నదంటే మృత్యువు విజయవంతంగా ఆమెను ప్రణయప్రభావితం చేసినట్లు గోచరిస్తున్నది.

**ఆంటోనీ :** ఆమె మానవుని ఊహకందనంతటి జిత్తులమారి!

**ఎనోబార్బస్ :** ఆఁ! మీరు పొరబడుతున్నారు ప్రభూ! ఆమెలోని సమస్తమనోద్వేగాలూ స్వచ్ఛప్రేమసంజనితాలు. ఇతర స్త్రీల నిట్టూర్పులీమెలో ప్రభంజనాలు. వారి బాష్పాలు కుంభవృష్టులు. వీటిని మన కాలసూచికలు సూచించలేవు. ఇట్టి ప్రణయోద్రేకాలెన్నటికీ సత్యేతరాలు కాజాలవు. ఆమె నిజంగా కృత్రిమకుంభవృష్టులను కురిపించగలిగితే జ్యౌతోతుల్యురాలన్నమాట!

**ఆంటోనీ :** ఆమెను నేను చూడకుండా ఉన్నట్లయితే ఎంతో బాగుండేది.

**ఎనోబార్బస్ :** ఎంతమాటన్నారు ప్రభూ? ఆమెను మీరు చూచి ఉండకపోతే సృష్టిలోని ఒక అమూల్యకళాఖండాన్ని చూచి ఉండకపొయ్యేవారు. బహుదేశపర్యటనకు ప్రఖ్యాతిగన్న మీకు అది అపకీర్తికారణమై ఉండేది.

**ఆంటోనీ :** ఫుల్వియా మరణించింది.

**ఎనోబార్బస్ :** ప్రభూ, ఏమంటున్నారు?

**ఆంటోనీ :** ఫుల్వియా మరణించింది.

**ఎనోబార్బస్ :** ఏమిటి? ఫుల్వియా మరణించిందా? ఫుల్వియా?

**ఆంటోనీ :** అవును. మరణించింది.

**ఎనోబార్బస్ :** ఐతే కృతజ్ఞతాప్రదర్శకంగా దేవతలకు ఒక యాగాన్ని చేయించండి. ఎప్పుడు దేవతలు ఒక పురుషుడి భార్య ప్రాణాలను అపహరించటానికి ఇష్టపడతారో, అప్పుడు వారు భూలోకంలోని దర్జీలను పోలుతున్నారన్నమాట. పాత దుస్తులు జీర్ణమైతే కొత్తదుస్తులను కల్పించుకోటానికి అవసరమైన వస్తువులున్నాయనే ఊహను వారు కల్పిస్తున్నారు. ఫుల్వియా తప్ప ఇతరస్త్రీలు లేకపోతే ఇది మీకు గొప్పదెబ్బ గానీ, దారుణంగా దుఃఖింపదగినంతటి దుఃఖంగానీ అయి ఉండేది. ఇందువల్ల జీర్ణప్రాయమైన మీ కంచుకం తొలగిపోయి క్రొత్తది లభిస్తున్నది. ఈ దుఃఖంలో కొంత సౌఖ్యం సమాయత్తమై ఉందికూడాను. అందువల్ల మీరు అధికంగా దుఃఖించవలసిన అగత్యం అంతగా లేదు. అయితే ఒకవేళ మీరు దుఃఖించవలసిన అవసరముంటే కంటికి నీరు రావటానికని ఒక ఉల్లిగడ్డను వాసన చూడండి.

**ఆంటోనీ :** ఇటలీలో ఆమె ఆరంభించిన వ్యవహారాలు నేను ఇక అక్కడ లేకపోవటాన్ని సహించవు.

**ఎనోబార్బస్ :** ఇక్కడ మీరు ఆరంభించిన వ్యవహారాలను మీరు లేకపోతే అంతకంటే కొనసాగవు. అందులోనూ ముఖ్యంగా, మీరు ఇక్కడ నివసించటంమీదనే ఆధారపడ్డ క్లియోపాత్రా వ్యవహారం అణుమాత్రం ఆగలేదు.

**ఆంటోనీ :** ఎనోబార్బస్! తేలికగా ప్రసంగించటాన్ని ఇక చాలించు. నిర్వర్తించవలసిందని నేను అభిలషించే అంశాలను మా ఉద్యోగులకు తెలియజెయ్. ఇంత త్వరితంగా

ఈజిప్టును వదలి వెళ్ళటానికి గల కారణాన్ని నేను రాజ్ఞికి నివేదించి, వెంటనే ప్రయాణం చేయటంకోసం ఆమె అనుమతిని పొందుతాను. రోముకు నన్ను రమ్మని పిలిచేది కేవలం ఫుల్వియా మరణమే కాదు మా వ్యక్తిగతవ్యవహారాలు కూడా ఉన్నాయి. మన సంక్షేమాన్ని అభిలషించి అతిరహస్యంగా అక్కడ వ్యవహరిస్తున్న మిత్రుల ఉత్తరాలు కూడా ఇంటికి తిరిగి రమ్మని నన్ను త్వరపెడుతున్నవి. సీజర్‌ను త్రోసిరాజని సెక్టస్ పాంపే[13] సముద్రాలమీద సర్వాధికారి అయికూర్చున్నాడు.

ఇక మన ప్రజలో? బలహీనులు చపలచిత్తులు. ప్రాభవాన్నంతటినీ కోల్పోయిన తరువాతగాని యోగ్యుడి మీద వారిప్రేమ స్థిరపడదు. ఘనుడైన పాంపే పుత్రుడి ఎడ వారు, అతనికి తండ్రికున్న సద్గుణాలన్నీ ఉన్నవని హఠాత్తుగా గుర్తించి, సమస్త గౌరవాలనూ ప్రదర్శిస్తున్నారు. అందువల్లనే కీర్తిలోను, అధికారంలోను, అంతశ్శక్తి సామర్థ్యాలలోనూ సెక్టస్ పాంపే అత్యధికుడై యోధాగ్రేసరుల్లో ప్రథమగణ్యుడైనాడు. ఆ వ్యక్తి విశేషం ఈ రీతిగా సర్వప్రపంచాన్నీ ఆవరించటం లోకానికి మహోపద్రవం. సహజంగా అది విషపూరితం కావటంవల్ల ప్రస్తుతకాలం కల్పిస్తున్న ప్రళయాన్ని సకాలంలో ఎదుర్కోకపోతే అశ్వజాతి కేశాలలాగా[14] అతిప్రమాదకారి అయి తీరుతుంది. నా క్రింది ఉద్యోగులందరికీ మనం అతివేగంగా ఈ దేశాన్ని విడిచివెళ్ళటం నా అభిలాషైనట్లు తెలియజెయ్.

## మూడో దృశ్యం

**అదే ప్రదేశం. మరో కక్ష్య. క్లియోపాత్రా,**
**ఛార్మియన్, ఐరాస్, ఎలెగ్జాస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** ఆయనెక్కడున్నాడు?

**ఛార్మియన్ :** అప్పటినుంచీ నేను ఆయన్ను తిరిగి చూడలేదు.

**క్లియోపాత్రా :** ఎక్కడున్నాడో, వెంట ఎవరున్నారో, ఏం చేస్తున్నాడో చూడు. నిన్ను నేను పంపించానని ఆయనకు తెలియనీయకు. తీవ్రాలోచనానిమగ్నుడై ఉన్నట్లు కన్పిస్తే నేను నృత్యం చేస్తున్నానని చెప్పు. వినోదిస్తుంటే హఠాత్తుగా నాకు సుస్తీ చేసిందని చెప్పు. వెళ్లు. త్వరగా వెళ్లు. తక్షణం తిరిగి రా!

**(ఎలెగ్జాస్ నిష్క్రమిస్తాడు)**

**ఛార్మియన్ :** రాజ్ఞీ! నీవు ఆయన్ను మనసారా ప్రేమిస్తే[15], ప్రేమిస్తున్నావని నేననుకోను, ఆయనలో కూడా అటువంటి ప్రేమను జనింపజేయటానికి యోగ్యమైన మార్గాన్ని నీవు అనుసరించటం లేదు.

**క్లియోపాత్రా :** అయితే నేను చేయవలసిందేమిటి? చేయకూడనిదేమిటి?

**ఛార్మియన్:** సర్వవిషయాల్లోనూ ఆయనకు లొంగిపో. ఎందుకూ అభ్యంతరం చెప్పకు.

**క్లియోపాత్రా :** నీవు నాకు హీనబుద్ధివై బోధిస్తున్నావు. ఆయన్ను కోల్పోవటానికి నీ మార్గం మహా మంచిది.

**ఛార్మియన్ :** అంత అధికంగా ఆయన్ను వ్యతిరేకించవద్దు. ఉద్రేకాన్ని కల్పించే విషయంలో నీవు కొంత సహనం చూపించాలి. అడుగో, ఆంటోనీ ఇక్కడికే వస్తున్నారు.

**ఆంటోనీ ప్రవేశిస్తాడు.**

**క్లియోపాత్రా :** నేను జబ్బుపడి కసరుబోతునైనట్టు నటించదలిచాను.

**ఆంటోనీ :** క్షమించాలి. నా ఉద్దేశాలను మీకు తెలియజేయవలసి ఉంది.

**క్లియోపాత్రా :** ఛార్మియన్, ఎక్కడున్నావు? శయ్య దగ్గరికి నన్ను తీసుకో పో. ఈ దీర్ఘవేదనను బహుకాలం తట్టుకోటం నాకు సాధ్యం కాని పని. నా శరీరం ఈ స్థితిని ఎంతకాలమని భరిస్తుంది? నేను తూలిపడేట్లున్నాను.

**ఆంటోనీ :** ప్రియరాజ్ఞీ!

**క్లియోపాత్రా :** నాకు దూరంగా నిలవండి. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

**ఆంటోనీ :** ఎందువల్ల? విషయమేమిటి?

**క్లియోపాత్రా :** మీకో శుభవార్త వచ్చిందని ఆయా చూపులవల్లనే తెలిసిపోతున్నది. మిమ్మల్ని పెళ్లాడిన ఆమె ఏమంటున్నది? ఆమె దగ్గరికి మీరు వెళ్లవచ్చు. ఆమె మీరిక్కడికి రావటానికే అంగీకరించకుండా ఉండిఉన్నట్లయితే ఎంతో బాగుండేది. నేనిక్కడ మిమ్మల్ని నిలిపివేస్తున్నానని ఆమె నన్ను గురించి ఏమీ అనకూడదు సుమా! మీ మీద నాకేమధికారముంది? మీరు ఆమెవారు. కేవలం ఆమెవారే!

**ఆంటోనీ :** దేవతలకిది బాగా తెలుసు.

**క్లియోపాత్రా :** అయ్యో! నా వలె ఇంతటి మహత్తరమైన మోసానికి పాలైన మహారాజ్ఞి మరొకతె లేనే లేదు. అయినా నా మీద పన్నబడ్డ పన్నాగం నాకు మొదటినుంచీ తెలుసు.

**ఆంటోనీ :** క్లియోపాత్రా –

**క్లియోపాత్రా :** ఫుల్వియాను మోసగించటాన్ని కళ్లారా చూచిన సింహాసనస్థులైన దేవతలనే నీ ప్రణామాలతో చిత్తక్షోభం కల్పించగలిగిన నీవు నా వాడవనీ, నా యెడ సత్యసంధుడివై వర్తిస్తావని నేను ఎందుకు భావించాలి? పలికేటప్పుడే పాటించటానికి ఉద్దేశింపబడని శూన్యప్రమాణాలనే వాగురులలో చిక్కుకోపోవటం కేవలం ఒక ఉన్మాదకృత్యం.

**ఆంటోనీ :** మధురతమా! రాజ్ఞీ!!

**క్లియోపాత్రా :** వద్దు. వద్దు. నిన్ను ప్రార్థిస్తున్నాను. వెళ్లిపోవటానికి సాకు వెదకవద్దు. వీడ్కోలు వాక్యాలు పల్కి వెళ్లిపో. ఇక్కడ ఉంటానికి నీవు నన్ను ప్రార్థించినప్పుడు అది మధుర ప్రసంగాలకు మనోజ్ఞమైన కాలం. వెళ్ళటమనే ప్రశ్నే అప్పుడు లేదు. మన అధరాలు, నేత్రాలు అప్పుడు నిత్యప్రణయైక జీవితానికి నిలయాలైనవి. ధనురాకృతులైన మన కనుబొమలు కమనీయా నందమందిరాలైనవి. స్వర్గ సౌరభ్యసంవాసితం కాకుండా మన ఏ క్షుద్రావయవం కూడా ఆ నాడు నిలువ లేకపోయింది. అయితే అవి ఈ నాడూ అలాగే ఉన్నాయి. కానీ నీవు, ప్రపంచ ప్రథమయోధుడవైన నీవు, లోకోత్తరుడవైన సత్యవాదివిగా పరవర్తన పొందావు.

**ఆంటోనీ :** ప్రియరాజ్ఞీ! ఏమిటిది?

**క్లియోపాత్రా :** నీ ఆకృతిప్రమాణాలు నాకుండి ఉండవలసింది  అప్పుడు ఈజిప్టులో ధైర్యసాహసాలుగల ఒక హృదయం ఉందని నీకు తెలిసి ఉండేది.

ఆంటోని:  ప్రియరాజ్ఞీ! నా పలుకు విను. వర్తమానకాలంలోని అత్యావశ్యకాలైన వ్యవహారాలు నా సేవలను అపేక్షించి ఆజ్ఞాపిస్తున్నాయి. కానీ ప్రణయపూరితమైన నా హృదయం నిరంతరం నిన్నే నమ్మి నీ సన్నిధానంలోనే ఉంటుంది. మా ఇటలీ అంతర్యుద్ధశస్త్రకాంతులతో ఆచ్ఛాదితమైంది. సెక్టస్ పాంపే రోముద్వాఃకవాటాలను చేరుకొంటున్నాడు. దేశీయాలే అయిన రెండు బలాల సమప్రాధాన్యం పరస్పర శంకాసంకులితాలైన కూటాలను సృష్టిస్తున్నది. ఒకనాడు అసహ్యించుకోబడ్డ పక్షం బలాన్ని కూర్చుకోవటం వల్ల క్రొత్తగా ప్రీతిపాత్రమౌతున్నది. ఒకనాడు పరిహృతుడైన[16] పాంపే పితృగౌరవసంపన్నుడై వర్తమానకాలంలో వైభవవిఖ్యాతులెవ్వరూ పొందజాలని

ప్రజాహృదయాలలో పైపైకి ప్రాకిపోతున్నాడు. అతని సంఖ్య అత్యధికం కావటంవల్ల అత్యంత ప్రమాదస్థితి ఏర్పడింది. విశ్రాంతి వ్యాధిగ్రస్త అయిన స్తబ్ధత ఎట్టి ప్రమాదకరమైన మార్పువల్లనైనా సరే, నవజీవనాన్ని పొందాలని ఆశిస్తున్నది. నేను వెళ్లటానికి ఈ సార్వజనీనవ్యవహారాలతో బాటుగా, వ్యక్తిగతమైనదీ, నీ బుద్ధిలో నే వెళ్లటం క్షేమమనిపించుకన్నదీ ఫుల్వియా మరణం.

**క్లియోపాత్రా :** వయస్సు లాలసత్వాన్ని తెగదెంచుకొని బయటపడే స్వేచ్ఛను నాకు ప్రసాదించక పోయినా శైశవస్థితి నుంచి బయటపడే శక్తి నిచ్చింది. ఫుల్వియా మరణించగలదా?

**ఆంటోనీ :** ప్రియరాజ్ఞీ! ఆమె మరణించింది. ఇదిగో చూడు! నీ శ్రీమద్విలాసాలమద్య కొంత విశ్రాంతి లభిస్తే దీన్ని చదువు. ఆమె ఎటువంటి విప్లవాలను ప్రేరేపించిందో గమనించు. ఆమె ఎప్పుడు ఎక్కడ మరణించిందో దీని అంత్యభాగంలో లిఖితమై ఉంది. నీకు ప్రియకరాలైన ఆ అంశాలను కూడా తిలకించు.

**క్లియోపాత్రా:** అయ్యో! మిథ్యాప్రణయజీవి! నీ దుఃఖాశ్రువులను నింపటానికి పవిత్రాలైన కాచపాత్రిక[17] లెక్కడ దొరుకుతాయి? ఫుల్వియా మరణవార్తను నీవు గ్రహించేరీతిని బట్టి, తెలిసింది, ఇప్పుడు తెలిసింది. నా మరణవార్తను కూడా నీవు ఎలా స్వీకరిస్తావో ఇప్పుడు తెలిసింది.

**ఆంటోనీ :** నిందారోపణ లిక మానేయ్! నీకు నేను నిందించటానికి వచ్చిన పనులేవో తెలుసుకొనేందుకు సంసిద్ధురాలివి కా. నీవిచ్చే సలహాలను బట్టి వాటిని జరిగించటమా, జరిగించకపోవటమా అన్నది ఉన్నదే కదా! నైలునది[18] సస్యక్షేత్రాలకు ప్రసాదించిన ఒండుమట్టిమీద కిరణప్రసారం చేసి సారవంతాలుగా చక్కదిద్దే ఆ అంశుమంతుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను ఇక్కడినుంచీ నేను నీ సేవకుణ్ణిగా నిష్క్రమిస్తున్నాను. నీ ఇష్టానుసారంగానే సంధో, సమరమో సాగిస్తాను.

**క్లియోపాత్రా :** ఛార్మియన్! ఇలా రా. ఉచ్ఛ్వాసనిశ్వాసాలకు ఆటంకం కలిగిస్తున్నవి, నా ఈ బంధన పట్టికలను భేదించు. వద్దులే. ఆంటోనీ నన్ను ప్రేమిస్తున్నప్పుడు నాకు బాధంటూ లేనే లేదు.

**ఆంటోనీ :** ఓ అనర్ఘమణీ! రాజ్ఞీ!! నిందాభియోగాలిక నిలిపివెయ్యి. నా ప్రేమ ఎట్టి గౌరవార్హమైన పరీక్షకైనా సంసిద్ధమై ఉంది. పరీక్షించి దాని పారిశుద్ధ్యాన్ని ప్రశంసిస్తూ ఒక యోగ్యతాపత్రాన్ని ప్రసాదించు.

**క్లియోపాత్రా :** అవునౌను. ఫుల్వియా జీవితచరిత్రే నీ ప్రణయపారిశుద్ధ్యాని కొక చక్కని నిదర్శనం. నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. ప్రక్కకు తిరిగి ఆమెకోసం ఇంచుక దుఃఖించు. ఆ కన్నీటిని నాకు చూపించి "ఇవి ఈజిప్టు రాజ్ఞి" వను. ఏదీ నీ అత్యద్భుతమాయా నాటకంలో ఒక దృశ్యాన్ని ప్రదర్శించి చూపు. మహానటుడివి నీవు. నీవు నిర్వహించనున్న ప్రణయపాత్ర పరిపూర్ణ ప్రేమైకజీవిదనిపించాలి సుమా!

**ఆంటోనీ :** రాజ్ఞీ! నీవు నా రక్తాన్నుడుకెత్తిస్తున్నావు. ఇక కట్టిపెట్టు!

**క్లియోపాత్రా :** ఆహా, ఇప్పుడు కోపాన్ని అద్భుతంగా ప్రదర్శించావు నీవు ఇంతకంటే ఎంతో అద్భుతంగా అభినయించగలవు.

**ఆంటోనీ :** ఈ నా కరవాలమే సాక్షిగా –

**క్లియోపాత్రా :** కానీ నీవు నా లక్ష్యం సాక్షిగా అని కూడా చేర్చవలసిఉంది. ఇంకా ఆయన తన కళాకౌశలాన్ని ప్రదర్శిస్తున్నాడు కదూ! అంతే కాదు ఆయన ఇంకా ఎంతో ఘనప్రావీణ్యం కలవాడు. గమనించు ఛార్మియన్! తన వంశకర్త హెర్క్యూల్సును పోలిన ఈ రోమన్ పౌరుడు కోపరసపాత్రను ఎంతటి పరిపూర్ణ కళాభినివేశంతో ప్రదర్శిస్తున్నాడో గమనించు.

**ఆంటోని :** రాజ్ఞీ! నిన్ను విడిచి రోముకు వెళ్ళిపోతున్నాను!

**క్లియోపాత్రా :** కృతజ్ఞుడా! ప్రభూ!! ఒక్కమాట. నీవూ, నేనూ విడివడిపోవలసి వచ్చింది. అయితే నేను చెప్పదలచింది ఇది కాదు. మనమిరువురం అన్యోన్యం ప్రేమించుకొన్నాము. కానీ నా మనోభావం ఇందులో ఇమిడిలేదు. అదేమిటో నీకు సువ్యక్తమే. దీనికి కొంత విశేషప్రాముఖ్యం ముంది. అయ్యో! మతిమరుపా! ఆంటోనీ! నా మతిమరుపు నీ మతిమరుపు వంటిదే. మతిమరుపువే అయిన నీవు నన్ను మరిచిపోవటంవల్ల నేను నిన్ను పూర్తిగా మరిచిపోయాను.

**ఆంటోని :** సర్వానికీ పాలకురాలవైన నీవు రాజ్ఞివై కాలహరణాన్ని పాలితను చేసుకొన్నావనుకొన్నాను. కానీ అర్థరహితమైన సంభాషణవల్ల నీవే మాంద్యానివని గ్రహించగలిగాను.

**క్లియోపాత్రా :** నన్ను గురించి నీ ఇష్టం వచ్చినట్లు అపహాస్యమాడు. నా దోషంగా చెప్పి దేన్ని నీవు మాంద్యమని వ్యవహరిస్తున్నావో దాన్ని భరించటం నాకు భారమనిపిస్తున్నది. హృదయసన్నిహితమై ఆ భావం మహాదుఃఖాన్ని కల్పించి నన్ను

పీడిస్తున్నది. కానీ, ప్రభూ, నన్ను క్షమించు. నీ నేత్రాలకు నచ్చకపోవటం వల్ల ఈ నాడు నా గుణవిశేషాలే నన్ను చంపేస్తున్నవి. నీ గౌరవసముద్ధరణం నిన్ను ఇంటికాహ్వానిస్తున్నది. అందువల్ల కనికరాన్ని పొందని నా దోషాన్ని గురించి పెడచెవిపెట్టు. సర్వదేవతలూ నీకు తోడ్పడెదరు గాక! మాలికాలంకృతయైన విజయదేవత నీ ఖడ్గాసనాన్ని అధిష్ఠించుగాక! విజయం సుగమమై నీ విమలపాదప్రదేశాన వెదజల్లబడుగాక!!

**ఆంటోనీ :** అయితే మనమిక నిష్క్రమిద్దాం. పద. ఒకవంక వియోగాన్ని మనం పొందుతున్నా ఒకరికొకరం సన్నిహితులంగానే ఉంటుంటాం  విడిపోతుంటాం. నీ ఉనికి ఇక్కడైనా నీవు నాతో అక్కడికి వస్తున్నావు  నేను అక్కడికి వెళ్ళిపోతున్నా నీతోనే ఇక్కడ ఉంటున్నాను - ఇక మనం వినోదాలకోసం ఇక్కడినుంచి నిష్క్రమిద్దాం!

**(నిష్క్రమిస్తారు)**

## నాలుగో దృశ్యం

**రోమునగరం, సీజర్ గృహం. ఆక్టేవియస్ సీజర్, ఉత్తరాన్ని చదువుతున్న లెపిడస్, వారి పరివారాలు ప్రవేశిస్తారు.**

**సీజర్ :** మనతో భాగస్వామి అయిన ఆంటోనీని సీజర్ తన సహజదౌర్బల్యం వల్ల నిందించడం లేదని, లెపిడస్, ఈ ఉత్తరాన్ని తిలకిస్తే నీకర్థమౌతుంది. ఇదిగో అలెగ్జాండ్రియా నుంచి వచ్చిన లేఖ. అతడు చేపలు పడుతున్నాడు[19]. తప్పత్రాగు తున్నాడు[20]. నిద్రలేకుండా నిండురాత్రులను విలాసాలతో గడిపేస్తున్నాడు. అతడు ఆ క్లియోపాత్రాను మించిన పురుషత్వాన్నిగానీ, ఆ టోలమీరాజ్ఞి అతణ్ణిమించిన స్త్రీత్వాన్నిగానీ ప్రదర్శించటం లేదు. దర్శనమివ్వటం కూడా కష్టంగా ఉంది. రాష్ట్రపాలనలో భాగస్వాములున్నారన్న అంశం అసలే అతడికి మనసులో ఉన్నట్లు తోచదు. అతడు సమస్త మానవదోష సంగ్రహమైనాడు.

**లెపిడస్ :** అతితీవ్రమైనవైనా ఈ దోషాలు అతని మంచినంతటినీ మటుమాయం చేయగలిగినంతటివి కాజాలవని నా అభిప్రాయం. ఇవి రాత్రివేళల్లో గాఢకాలిమవల్ల అతికాంతిమంతాలుగా కనిపించే నక్షత్రాలవంటివి. ఇవన్నీ అతడు సంపాదించినవి కావు  పితరులనుంచి పొందినవి. అతడు వాటికోసమే పుట్టాడు అందువల్ల మార్చుకోలేడు. అయితే ఇవి అతడు కావాలని సంపాదించినవి మాత్రం కావు.

**సీజర్ :** అతని దోషాలను అన్నింటినీ నీవు అత్యుదారదృష్టితో పరికిస్తున్నావు. టోలమీ శయ్య[21]మీద తొట్రుపాట్లు పడటం దోషం కాదందాము. తనకు ఆనందప్రదానం చేసిన ఆ అతివకు రాజ్యదానం[22] చెయ్యటమూ దోషం కాదందాము. ఒక బానిసతో అర్ధార్ధంగా ఆసవసేవనం చేయటం, మధ్యాహ్నవేళల్లో రాజవీథుల మైమరచి మద్యంకోసం ఎడ్డెమడ్డి జనాలతో బుజాలు రాచుకుంటూ తిరగటం అతని అంతటివాడికి తగినదేమో చెప్పు?

ఇటువంటి అవనతిని కల్పించని అసామాన్య గుణవిశేషాలవల్ల ఏర్పడ్డ అపూర్వవ్యక్తి అతడు. అయినా ఆంటోనీ తనదోషాలను చూచి ఊరుకోరాదు. ఆత్మవిలాస ప్రియత్వం వల్ల మనమీద మహాభారం పడుతున్నది. అటువంటి విలాసవ్యాపారాలతో ఏవో విశ్రాంతివేళలను అతడు గడుపుతున్నట్లయితే వాటి సహజఫలితాలే తగిన శిక్ష వేస్తాయి లెమ్మని నేను సరిపుచ్చుకొనేవాణ్ణి. ఇటువంటి విషమపరిస్థితుల్లో కూడా ఆతడు చేస్తున్న కాలహరణం అతని స్థితినీ, మనఃస్థితినీ నిరంతరం జ్ఞప్తికి తెస్తూ, విలాసోన్మత్తతను మార్చుకోమని చేసే హెచ్చరికలను లెక్కించకపోవటం వల్ల, వయసునుబట్టి వివేకాన్ని సంపాదించినా తాత్కాలికా నందాలకోసం దాన్ని తరిమికొట్టి తన తార్కికప్రతిభమీద తిరుగుబాటు చేసే బాలకుడిలాగా ఆంటోనీ నిందాయోగ్యుడౌతున్నాడు.

**ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు.**

**లెపిడస్ :** ఇంకా కొన్ని వార్తలు వచ్చినట్లున్నాయి.

**వార్తాహరి :** తమ ఆజ్ఞలను నిర్వర్తించాము. సీజర్ మహోదారా! ఇక ప్రతిఘడియనా దూరాన ఏమి జరుగుతున్నదీ మీకు తెలుస్తుంది. సముద్రం మీద పాంపే బలవత్తరుడైనాడు. ప్రేమతో కాక భయంవల్ల ఇంతవరకూ సీజర్‌ను బలపరుస్తున్న వారందరూ పాంపేను ప్రేమిస్తున్నారు. అతణ్ణి చేరుకోటంకోసం మీ యెడ ప్రేమలేనివారందరూ నౌకాశ్రయాలకు చేరిపోతున్నారు. పాంపేనుగురించి వారిలో వారు ప్రసంగించేటప్పుడు ఆయన చాలా అవమానాలపాలైనాడని చెప్పుకొంటున్నారు.

**సీజర్ :** ఇదంతా జరుగుతుందని నేను ఎప్పుడో గమనించి ఉండవలసింది. అధికారం వహించే వ్యక్తి దాన్ని ఆర్జించేటంతవరకూ ప్రజాప్రేమకు పాత్రుడై దాన్ని పొంది ఉంటాడనీ, పతనోన్ముఖుడైన వ్యక్తి అతని ప్రేమపాత్రతకంటే బలాన్ని సర్వం కోల్పోయిందాకా ప్రేమింపబడకుండా, అదృశ్యుడైన తరువాత అతిగా ప్రీతిపాత్రుడౌతాడనీ ఎంతో పూర్వంనుంచీ మనం నేర్చుకొంటున్నదే. ప్రవాహమధ్యంలో

తారట్లాడే తుంగదుబ్బులా ప్రజానీకం ఆటుపోటుల్లో నిరంతరగమనాగమనాలలో కష్టిస్తూ కుమిలి క్రుళ్ళి పోతుంటుంది.

**వార్తాహరి :** సీజర్ మహాశయా! మరోవార్త. మెనక్రేట్స్[23], మెనాస్ అనే సుప్రసిద్ధులైన ఓడదొంగలిద్దరూ సముద్రాలమీద సంపూర్ణాధికారాన్ని వహించి, సమస్తనౌకలనూ చుట్టి ప్రోగేస్తున్నారు. వారు మహాక్రోధంతో ఇటలీ భూభాగంమీదికి దండయాత్రలు సాగిస్తున్నారు. వాటి విషయం తలపులకు వస్తేనే తీరవాసులైన ప్రజలు భయోత్పాతపరికంపితులై పారిపోతున్నారు. వీరోత్సాహంతో యువకులందరూ విప్లవం చేసి వారి కొలువులో నిలవటానికి వెళ్ళిపోతున్నారు. ఎటువంటి నౌకకైనా సముద్రాలలో తొంగిచూచే సాహసం లేదు. అది వారికంట బడ్డదో పట్టుబడిందన్నమాటే! కొంతగానైనా యుద్ధరంగంలో ఎదుర్కొని ఆపటానికి అవకాశమున్న అతని సైన్యాలకంటే కూడా, అత్యధికంగా ఆ పాంపేనామధేయం జనాన్ని భయకంపితులను కావిస్తున్నది.

**సీజర్ :** ఆంటోనీ! నీ కామవిలాసోన్మత్తతను ఇక కట్టిపెట్టు! హిర్టియస్, పన్సాలను ఎక్కడ నీవు హతమార్చావో, ఆమోదెనా నుంచి నిన్ను తరిమివేసినప్పుడు నిన్ను వెన్నాడుతూ క్షామం నీ అడుగుజాడల్లో నడిచింది. బహుళభోగివిగా[24] పెరిగినా, సహనంలో ఆటవికులను అతిశయించి, దాన్ని నీవు భరించి జయించావు. అశ్వాలకిచ్చే మద్యాన్ని ఆస్వాదించగలిగావు. వన్యజంతువులు కూడా వాసన చూచి సకిలించి విడిచిపెట్టే పాచిపట్టిన పడియనీరు త్రాగగలిగావు. మొరటుకంచెల మీది కందగడ్డలు తినటానికి నీ నాలుక నిత్యానురాగం వహించింది. మైదానాలు మూడమంచుతో ముంచుకోపోయినప్పటి దుప్పిలా చెట్లబెరళ్ళు తిని బ్రతకటాన్ని నీవభిలషించావు. ఆల్ప్స్ మీదుగా ప్రయాణం చేస్తున్నప్పుడు, చూచిన మాత్రాన్నే నీ కదనవీరుల్లో కొందరిని మరణించేటట్లు చేసిన జంతువుల విచిత్రామిషాన్ని ఆరగించి బ్రతికావన్నవార్తలు వినిపించాయి. అణుమాత్రమైనా ముఖవికాసపరిపూర్తి సన్నగిల్లని రీతిలో దీన్నంతటినీ నీవు వీరాధివీరుడవై భరించావు. నీ ప్రస్తుతస్థితిని పూర్వస్థితితో పోల్చి నేను చేసే ప్రసంగంవల్ల నిరుపమానమైన నీ ప్రతిష్ఠకెంతో దెబ్బ తగులుతున్నది.

**లెపిడస్ :** ఆంటోనీ దయనీయుడు.

**సీజర్ :** అతణ్నొక లజ్జాభావ మావేశించి ఈజిప్టునుంచి రోముకు త్వరితంగా తరిమివేయుగాక! మనమిర్వురం యుద్ధభూమిలో దర్శనమివ్వవలసిన సమయం వచ్చింది. ఆలస్యం చేయకుండా అందుకోసమని సభ తీరుద్దాం. లేకపోతే మన అలసత్వంవల్ల పాంపే పరంపరాభివృద్ధిని పొందుతాడు.

**లెపిడస్ :** సీజర్ మహాశయా! ఏ సాధనసంపత్తితో ప్రస్తుత పరిస్థితిని వసుమతీవనధుల రెంటిమీదా ఎదుర్కోగలనో, రేపు నేను మీకు సుస్పష్టంగా తెలియచేస్తాను.

**సీజర్ :** సభ జరిగేలోపల నా సాధనసంపత్తి ఎంత ఉందో ఎంచుకోటమే నాకు కర్తవ్యం. సెలవు.

**లెపిడస్ :** సెలవు ప్రభూ! ఈ మధ్యకాలంలో మీకు తెలియవచ్చిన దేశాంతరాలలోని సంచలనాలను గురించిన విశేషాలు నా చెవిని కూడా వేయవలసిందని ప్రార్థన.

**సీజర్ :** ఆ విషయంలో నీకు సందేహమవసరం లేదు. అది నా కర్తవ్యమని నేనెరుగుదును.

**(నిష్క్రమిస్తాడు)**

## అయిదో దృశ్యం

**క్లియోపాత్రా ప్రాసాదం.**
**క్లియోపాత్రా, ఛార్మియన్, ఐరాస్, మార్డియన్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** ఛార్మియన్!

**ఛార్మియన్ :** రాజ్ఞీ!

**క్లియోపాత్రా :** నాకు మాండ్రగోరా[25]ను –

**ఛార్మియన్ :** ఎందుకమ్మా!

**క్లియోపాత్రా :** నా ఆంటోనీకి నన్ను దూరం చేసిన కాలవిలంబాన్ని నిద్రతో గడిపివేయటానికి.

**ఛార్మియన్ :** నీవు ఆయన్నుగురించి అధికంగా ఆలోచిస్తున్నావు.

**క్లియోపాత్రా :** ఆయన్ను గురించి ఆలోచించకపోవటం ద్రోహమని నా అభిప్రాయం.

**ఛార్మియన్ :** రాజ్ఞీ! నా అభిప్రాయం అది కాదు.

**క్లియోపాత్రా :** కొజ్జా! మార్డియన్!!

**మార్డియన్ :** అమ్మా! తమ మనస్సు ఏ విలాసాన్ని అభిలషిస్తున్నది?

**క్లియోపాత్రా :** నీవు గానం చేస్తే వినాలనిపిస్తుందన్నది. ఇప్పుడు కాదులే. ఛార్మియన్! ఇప్పుడు నా ఆంటోనీ ఎక్కడున్నాడంటావు? నిలిచి ఉంటాడా? కూర్చొని ఉంటాడా? నడుస్తుంటాడా? లేక అశ్వాన్ని అధిరోహించి స్వారీ చేస్తుంటాడా? ఓ అశ్వరాజమా! అతని భారాన్ని భరించే అవకాశాన్ని పొందగలిగిన నీవు ఎంతో అదృష్టవంతురాలివి. ఓ అశ్వశ్రేష్ఠమా! వీరాశ్వమా!! నా ఆంటోనీని వహించటంలో నీ పరిపూర్ణప్రావీణ్యాన్ని ప్రదర్శించు. నీవు పయనించేటప్పుడు వీపుమీద ఎవరుంటుంటారో నీవు గుర్తించావా? అతడు ఆంటోనీ. అర్ధఅట్లాస్[26]ను తన బాహువులమీద భరించే బలశాలి. మానవజాతి బాహుద్వయం – శిరస్త్రాణం.

అతడిప్పుడు నాతో ప్రసంగిస్తుంటాడనుకొంటాను. లేదా 'నా పురానైల్ నాగిని ఎక్కడుంది?' అని తనలో తాను సంభాషిస్తుంటాడనుకొంటాను. అలా నన్ను సంబోధించటం అతడికి అలవాటు. ఇప్పుడు స్వాదువైన విషంతో నన్ను నేను పోషించుకొంటున్నాను. ఆ ఫాయిబస్[26A] ప్రణయక్షతాలవల్ల ధూమ్రవర్ణను కాలకల్పిత లలాటగాఢ రేఖాకలితను అయిన నన్ను గురించి అతడాలోచిస్తుంటాడా?

విశాల ఫాలంగల ఓ సీజర్ మహాశయా! అవనీతలం మీద నీవు ఉన్న కాలంలో, నేను ఒక మహారాజభోజనకబళాన్ని మాత్రమే. ఘనుడైన పాంపే[27] నా ఎదుట ఉన్నప్పుడు, నేత్రద్వయాన్ని నా లలాటసీమమీద లగ్నం చేసినట్లుగా ఘటించి, తన జీవితాన్ని అయిన నన్నే చూస్తూ మరణించాడు.

**ఎలెగ్జాస్ ప్రవేశిస్తాడు.**

**ఎలెగ్జాస్ :** ఈజిప్టు మహారాజ్ఞీ! జయము, జయము!

**క్లియోపాత్రా :** మార్క్ ఆంటోనీకంటే నీవు ఎంతో భిన్నమైనవాడివి. అయినా, పరుసవేది[28] అయిన ఆతని దగ్గిరనుంచి రావటం వల్ల ఎలెగ్జాస్, అతడు నిన్ను మలామా చేసి బంగారంలా మార్చి పంపించాడు. మహాసాహసి మా ఆంటోనీ ఎలా ఉన్నాడు?

**ఎలెగ్జాస్ :** ప్రియరాజ్ఞీ! ఆయన చేసిన తుదికృత్యం ఈ ప్రాగ్దేశమౌక్తికాన్ని ముద్దెట్టుకోటం. – పరంపరగా ఆతడు పెట్టుకొన్న ముద్దుల్లో ఇది తుదిది. ఆయన సంభాషణ నా హృదయంలో అతిగాఢంగా హత్తుకోపోయింది.

**క్లియోపాత్రా :** అయితే నా చెవి దాన్ని అక్కడినుంచీ ఆకర్షించాలన్నమాట!

**ఎలెగ్జాస్ :** ఆంటోనీ అన్నాడు : "ప్రియమైన నెచ్చెలీ! ఆమెయెడ భక్తుడీ రోమకవ్యక్తి శుక్తిద్రవిణమైన ఈ మౌక్తికాన్ని కాన్కగా పంపుతున్నాడనీ, దీన్ని స్వీకరణయోగ్యంగా చెయ్యటంకోసం ఆమె సింహాసనానికి మరికొన్ని రాజ్యాలను చేర్చి అధికతర సంపద్యుక్తం చేస్తానని ఈజిప్టు రాజ్ఞి క్లియోపాత్రాతో చెప్పు. ఆమెను సర్వసామ్రాజ్యానికీ సామ్రాజ్ఞిని చేస్తానని చెప్పు" తరువాత ఆయన తలపంకించి ఏదో తీక్ష్ణభావాన్ని ధరించాడు తరువాత దాని హేషార్భటిలో నేనేమి పలికినా వినిపించనిరీతిగా సకిలించిన గంభీరాశ్వాన్ని అధిరోహించాడు.

**క్లియోపాత్రా :** అప్పుడు ఆయన ఆనందంతో ఉన్నాడో, విషాదంతో ఉన్నాడో చెప్పు.

**ఎలెగ్జాస్ :** ఎక్కువ ఎండలు, మిక్కిలిగా చలిగాని లేని సంవత్సరంలోని అప్పటి కాలంలాగా ఆంటోనీ అత్యానందాన్ని గాని, దుఃఖాన్ని గాని ప్రదర్శించలేదు.

**క్లియోపాత్రా :** మనోజ్ఞమైన సమభావాన్ని ప్రకటించాడా? ఛార్మియన్, గమనించు! ఆయన అటువంటి వ్యక్తి, గుర్తించు!! తన్ను తిలకించి తమ ప్రవర్తనలను తీర్చిదిద్దుకొనేవారికోసం అతడెప్పుడూ ముఖాన తేజాన్ని భాసింపచేస్తూ దుఃఖాన్ని బయటపడనీయడు. తన ఆనందానికి నిలయాన్నైన నాతోబాటుగా అతనిమనస్సు ఈజిప్టులో ఉందని ఆప్తవర్గం అర్థం చేసుకోటంకోసం అతడు ఆనందాన్ని ప్రదర్శించడు. ఆంటోనీ! నీలో సుఖదుఃఖాలు రెండూ సమఘాయాలో ఎంత దివ్యంగా సమేళనాన్ని పొందాయి! నీవు సుఖివై ఉంటేనేం, దుఃఖివై ఉంటేనేం! ఈ రెంటివిజృంభణలూ నీలో విశిష్టంగా సాటిలేని రీతితో వర్తించినట్లు మరేవ్యక్తిలోనూ గోచరించవు. వార్తాహరులను నీవు కలుసుకొన్నావా?

**ఎలెగ్జాస్ :** కలుసుకొన్నాను. ఇరవైమందిని కలుసుకొన్నాను. వెంట వెంటనే అంతమందిని పంపించావేమిటి?

**క్లియోపాత్రా :** ఏ దినం నా ఆంటోనీకి నేను శుభాకాంక్షలను పంపించటం మరిచిపోతానో ఆ దినం మహాపాపం చేసుకొన్నదన్నమాట! ఆ దినంనాడు జన్మించినవాడు భిక్షుకుడై మరణించి తీరవలసిందే అని నా నిశ్చయం. ఛార్మియన్! వెంటనే సిరా, కాగితం తీసుకో రా. ఆయనకు తక్షణమే నేను శుభాకాంక్షను పంపించాలి. ఎలెగ్జాస్, నీకు స్వాగతం. ఛార్మియన్! నేను ఆంటోనీని ప్రేమించినంత తీవ్రంగా సీజర్ను[29] ప్రేమించానా?

**ఛార్మియన్ :** మహోదారుడైన సీజర్నేనా?

**క్లియోపాత్రా :** ఆ విశేషాన్ని మరోమారు ఆయన పేరుకు చేర్చి పలికావో, మళ్ళీ నీ ఊపిరి తిరక్కపోవచ్చు. ఆంటోనీని మాత్రమే మహోదారుడని వ్యవహరించు.

**ఛార్మియన్ :** పరాక్రమోపేతుడైన సీజర్‌నా?

**క్లియోపాత్రా :** ఇదిగో! ఇసిస్ దేవతమీద ప్రమాణం చేస్తున్నాను. పురుషపురుషుడైన నా ఆంటోనీని మరొకమారు సీజర్‌తో పోల్చి అతడికి ఆధిక్యం కలిగేట్లు పలికావో, నీ పళ్ళూడగొడతాను.

**ఛార్మియన్ :** ఉదారబుద్ధితో నన్ను మీరు క్షమిస్తే – సీజర్‌ను గురించి నేననేవి మీరన్నమాటే.

**క్లియోపాత్రా :** అది నాయౌవనారంభదశలో అనుభవం లేనప్పుడు నేనన్నమాటల్లో ఒకటి. నా నిర్ణయపరిజ్ఞానం అప్పటికి ఇంకా పరిపక్వం కాలేదు. అప్పుడెప్పుడో నేనన్న మాటలు ఇప్పుడు నీవంటున్నావంటే నీ నెత్తురు కరడుకట్టిందన్నమాట! ఛార్మియన్! పోనీ, వచ్చేయ్! నాకు కాగితం, సిరా తెచ్చిపెట్టు. ప్రతినిత్యం ప్రత్యేకంగా నేను ఆంటోనీ కొరకు నూతనశుభాకాంక్షను పంపిస్తుంటాను. లేదా వార్తాహరులను పంపిస్తూ నా ఈజిప్టురాజ్యాన్ని ప్రజాశూన్యను చేస్తాను.

**(నిష్క్రమిస్తారు)**

# ద్వితీయాంకం

## ఒకటో దృశ్యం

**మెస్సినా. పాంపే గృహం. మెనెక్రేటిస్, మెనాస్ యుద్ధోచితవేషంతో ప్రవేశిస్తారు.**

**పాంపే :** దేవతలు సత్యప్రియులే ఐతే జీవితమార్గాలలో సత్యరతులైనవారు పూనుకొన్న సత్కార్యాలకు తోడ్పడి తీరాలి.

**మెనెక్రేటిస్ :** యోగ్యుడా, పాంపే! వారు సాయపడటంలో ఇంచుక కాలవిలంబం చేస్తారేగాని తోడ్పాటును తిరస్కరించరని తెలుసుకో.

**పాంపే :** ఒకదానికోసం మనం నిరంతరం అభ్యర్థింపవలసివస్తే అది దాన్ని మూల్యాన్ని కోల్పోతుంది.

**మెనెక్రేటిస్ :** బహుసందర్భాలలో ఏది మనకు మేలును చేకూరుస్తుందో తెలుసుకోలేక కీడును కల్గించే దానికోసం మనం దేవతలను ఆర్థిస్తుంటాము. ఈ కారణాన వారిని అర్థించేవాటిని పొందకపోవటంవల్లనే మనకెంతో లాభం చేకూరుతుంది.

**పాంపే :** పరంపరాభివృద్ధిని నేను పొందితీరుతాను. తప్పదు. ప్రజలు నన్ను ప్రేమిస్తున్నారు  సముద్రాధిపత్యం నాది. నా అధికారం నేడు సక్రమంగా సర్వకళలనూ సంపాదిస్తున్నది. అనతికాలంలోనే అది కళాపరిపూర్ణబింబం కాగలదని నా ఆశ జోస్యం చెబుతున్నది. ఆంటోనీ ఈజిప్టులో మాంసకుంభాల మధ్య తిష్ఠన్మూర్తియై తిరుగులేకుండా ఉన్నాడు. ఆ దేశద్వారాలను దాటివచ్చి అతడు యుద్ధం చెయ్యడు. ధనసంపదలను కుప్పలు పోసుకొంటున్నాడే కాని, సీజర్ ప్రజాహృదయాలను పోగొట్టుకొంటున్నాడు. ఇరువురికీ తన స్తోత్రాలు వినిపిస్తూ ఇరువురి స్తుతులనూ తానువింటున్నాడు లెపిడస్. అయితే ఆతడికి ఇరువురిమీదా అనురాగం లేదు. అంతేకాదు. ఆ ఇరువురూ అతణ్ణి పరిగణించరు కూడాను.

**మెనెక్రేటిస్ :** సీజర్, లెపిడస్ ఇరువురూ సిద్ధపడి యుద్ధభూమిలో నీకు ఎదురునిల్చారు. వారివెనుక బలవత్తరమైన సైన్యం నిలిచిఉంది.

**పాంపే :** నీ కీవార్త ఎలా వచ్చింది? ఇది అబద్ధం!

**మెనెక్రేటిస్ :** ప్రభూ! నేను దీన్ని సిల్వియస్‌వల్ల విన్నాను.

**పాంపే :** అతడు కలలు గంటున్నాడు. అంతే. వాళ్ళిద్దరూ రోములో ఆంటోనీకోసం ఎదురు చూస్తున్నారు. నాకు తెలుసు.

ఓ బంధకీ, క్లియోపాత్రా! తొలినాటి కోమలత్వాన్ని కోల్పోయిన నీ అధరానికి సర్వసమ్మోహనవిద్యలూ నవరాగరేఖలు ప్రసాదించుగాక! నీ మాంత్రిక కర్మకౌశలం సౌందర్యంతో నిత్యసాంగత్యాన్ని పొందుగాక! నీవా శృంగారలోలుపుణ్ణి కామకదన భూమిలో కట్టిపడెయ్. మద్యపానీయాలతో ఆతని మతికి మత్తెక్కించు. ఎపిక్యురస్[30] మతానుయాయులైన బానిసీంద్రు తృప్తి అందని రుచులను కల్పించి అతని క్షుధాగ్నిని నిరంతరం రగుల్కొల్పెదరుగాక! తన గౌరవాన్ని పునరుద్ధరించుకోలేని రీతిగా దీర్ఘనిద్ర, అతిభోజనం అతనికి విస్మృతివంటి మాంద్యాన్ని కలిగించుగాక!

**వర్రియస్ ప్రవేశిస్తాడు**

వర్రియస్! విశేషాలేమిటి?

**వర్రియస్ :** నన్నెందుకు నియోగించారో ఆ వార్తలు చెప్పక తప్పదు. మార్క్ ఆంటోనీ ఏ ఘడియనైనా రావచ్చునని రోములో నిరీక్షిస్తున్నారు. ఆయన ఈజిప్టులో బయలుదేరినప్పటినుంచీ, అక్కడినుంచి రోముకు రావటానికి పట్టే కాలంకంటే ఎంతో అదనంగా గడిచిపోయింది.

**పాంపే :** ఇంతకంటే అల్పప్రాముఖ్యమున్న మరో అంశాన్ని దేన్నయినా ఎక్కువ శ్రద్ధతో వినేవాణ్ణి. ఈ స్వల్పయుద్ధంకోసం ఆ శృంగారలోలుడు కవచధారణం చేస్తాడని కలలోనైనా నేననుకోను. అయితే అతని యుద్ధపాండిత్యం వీరిరువురి విజ్ఞానం కంటే రెండింతలు విశేషమైంది. నా విప్లవం కల్పించిన కల్లోలం ఆంటోనీని ఆ ఈజిప్టు విగతభర్తృక[31]ఉత్సంగంనుంచి ఊడబెరికి బయటపడవేసినందుకు, నన్ను గురించినే నెంతగానో గౌరవభావాన్ని వహించటం సమంజసం.

**మెనాస్ :** సీజర్, ఆంటోనీ సక్రమంగా ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుపుకొంటారని నేనూహించను. మరణించిన ఆ ఆంటోనీ భార్య సీజర్‌మీద ఎదురుతిరిగింది. అతనిచేత ప్రేరేపితుడైనవాడు కాడని నాకు తెలుసును  కానీ ఆంటోనీ సోదరుడు సీజర్ మీద యుద్ధం చేశాడు.

**పాంపే :** అయినా మెనాస్! వారందరికీ సమష్టిగా ప్రబలశత్రువైన నేను నిల్చిన ఈ సమయంలో, ఇటువంటి అల్పవైరాలు అడ్డువస్తాయో, మరి రావో నేను చెప్పలేను. వారిమీద నేను ఆయుధాలెత్తి ఉండకపోతే పరస్పరం కత్తులు దూయటానికి కారణాలున్నాయి కాబట్టి ఒకరితో ఒకరు కలహించి ఉండేవారు. మనవల్ల వారికి కలుగుతున్న భయం, ఎంతవరకూ వారి అల్పవైమనస్యాలను అవతల పెట్టించి ఉభయసైన్యాలనూ ఏకముఖం చేస్తుందో, ఇపుడింకా నేను నిర్ణయించి చెప్పలేను. అయితే దేవతలు ఎలా ఉద్దేశిస్తే అలా జరుగుతుంది. పరమప్రయోజనాలు చేకూరేటట్లు మనకున్న ప్రబలబలాలను ప్రయోగించటం మీదనే మన జీవితాలు ఆధారపడి ఉన్నాయి. మెనాస్! ఇక నిష్క్రమిద్దాం. పద!

**(నిష్క్రమిస్తారు)**

## రెండోదృశ్యం

**రోములోని లెపిడస్ గృహంలో ఎనోబార్బస్, లెపిడస్ ప్రవేశిస్తారు.**

**లెపిడస్ :** ఉదాత్తుడా ఎనోబార్బస్! సీజర్‌తో ప్రసంగించేటప్పుడు ప్రసన్నమధురంగా సంభాషించమని మీ సేనాధినేతను ప్రార్థించి చెప్పు. అప్పుడు నీవు నీ గుణానుగుణమైన కృత్యాన్ని నిర్వర్తించినవాడవౌతావు.

**ఎనోబార్బస్ :** కాదు, కాదు. 'మీ యోగ్యతకు ఉచితమైన రీతిగా ప్రసంగించవలసిం'దని ఆయన్ను ప్రార్థిస్తాను. కోపగిస్తే సీజర్‌ను ఆయన తప్పక నిర్లక్ష్యంతో పరికించి తీరుతాడు. యుద్ధదేవత 'మార్సు'లా మహాగంభీరంగా ఉపన్యసిస్తాడు. ఇందులో నాకు అపనమ్మకం అణుమాత్రమైనా లేదు. జూపిటర్[32] మీద ప్రమాణం చేసి పలుకుతున్నాను. నాకే ఈ సీజర్ వంటి శ్మశ్రువుంటే ఆయనయెడ నాకు గల నిర్లక్ష్యాన్ని వెల్లడించేటందుకు దానికి క్షురకర్మను కూడా కల్పించను.

**లెపిడస్ :** వ్యక్తిగతాలైన గర్వాతిశయాలను ప్రకటించుకోటానికి కిది సమయంకాదు.

**ఎనోబార్బస్ :** ఏ కాలమైనా అందులో పుట్టిన అన్ని విషయాలకూ అది యోగ్యమైనదే.

**లెపిడస్ :** కానీ అధికవిషయాలకోసం అల్పాలు దారి తప్పుకోటం ధర్మం.

**ఎనోబార్బస్ :** కానీ అల్పవిషయాల ఆగమనం ముందుగా జరిగితే అలా ఆచరించవలసిన అవసరంలేదు.

**లెపిడస్ :** నీ ప్రసంగం కేవలం క్రోధోన్ముద్రితమైంది. పూర్వవైరాలను స్మృతికి తేవద్దని నిన్ను ప్రార్థిస్తున్నాను. అడుగో, ఉదాత్తుడు ఆంటోనీ వస్తున్నాడు.

**ఆంటోనీ, వెంటిడియస్ ప్రవేశిస్తారు.**

**ఎనోబార్బస్ :** అడుగో, దూరంగా, సీజర్‌కూడా వస్తున్నాడు.

**సీజర్, మెకయ్‌నాస్, అగ్రిప్పా ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** ఫలవంతమైన సంధి ఒక్కటి ఇక్కడ కుదిరితే, మనం పార్థియామీదికి నడుద్దాం. వింటున్నావా వెంటిడియస్?

**సీజర్ :** ఇది నాకు తెలియదు మెకయ్‌నాస్! అగ్రిప్పా!!

**లెపిడస్ :** ఉదాత్తమిత్రులారా! ఇపుడు నిర్వహించవలసిన మహాఘనకృత్యాలు మనసు ఏకముఖం చేస్తున్నవి. అల్పవిషయాలిక మనమధ్య అనైకమత్యాన్ని కల్పించకూడదు. పరస్పరాలైన అభియోగాలను మనం ప్రశాంతంగా విందాము. క్షుద్రవైమనస్యాలను గురించి క్షుభితక్రోధులమై చర్చిస్తే, అల్పక్షతాలను మాన్చుకోటానికి పూనుకొని హత్యలు చేసినవాళ్ళమౌతాము. అందువల్ల ఉదాత్తులైన సామ్రాజ్యసమభాగులారా! మీలోని దుఃస్వభావాలను చెలరేగనీయకండి. విషమ విషయాలను ప్రస్తావించేటప్పుడు మధురమైన భాషను ప్రయోగించవలసిందని మిమ్మల్ని మనఃపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

**ఆంటోనీ :** ఎంతో సరసంగా పలికావు. సైన్యాలను ముందిడుకొని మనం కదనరంగంలో కార్యాచరణకు పూనుకొంటున్నాం. నేను అలాగే ప్రవర్తిస్తాను.

**సీజర్ :** ఆంటోనీ! నీకిదే రోమునగర స్వాగతం!

**ఆంటోనీ :** ఇందుకివే నీకు నా ప్రణామాలు!

**సీజర్ :** అదిగో ఆ ఆసనాన్ని స్వీకరించు.

**ఆంటోనీ :** మహాశయా! ముందు నీవే స్వీకరించు.

**సీజర్ :** అయితే నీవు కోరినట్లే జరిగిస్తాను.

**ఆంటోనీ :** సంబంధంలేని కొన్ని విషయాలను నీవు అపార్థం చేసుకొని అసహ్యించుకొంటున్నట్లు విన్నాను.

**సీజర్ :** అకారణంగా గాని, అల్పవిషయాలకు గాని ప్రపంచంలో, ఎవరిమీదనైనా, అందులో ప్రధానంగా నీ మీద, నేను కోపం తెచ్చుకొన్నట్లయితే నన్ను పరిహసించ వలసిందే. నాకు సంబంధం లేకుండా నీ నామాన్ని ఒక్కమారైనా మానహాని కలిగేరీతిగా ఉచ్చరించి ఉన్నట్లయితే నేను మరింతగా పరిహసింపబడేటందుకు పాత్రతను సంపాదించుకొన్నట్లు.

**ఆంటోనీ :** అయితే ఈజిప్టులోని నా ఉనికితో నీకేం సంబంధం?

**సీజర్ :** నేను రోములో ఉండటంతో నీకెంత సంబంధమో, నీవు ఈజిప్టులో ఉండటంతో నాకు అంతకంటే అధికమైన సంబంధం ఏమీ లేదు. అయినా అక్కడ వుండి నీవు నా రాజ్యంయెడ విద్రోహాన్ని తలపెడితే, నీవు ఆ ఈజిప్టులో ఉన్నప్పటికీ నాకు సంబంధం ఉండకపోదు.

**ఆంటోనీ :** విద్రోహమనటంలో నీ అభిప్రాయం?

**సీజర్ :** ఇక్కడ నాకేమి సంప్రాప్తమైందో దాన్నిబట్టి నా అభిప్రాయాన్ని నీవు గ్రహించవచ్చు. నీ భార్య, నీ సోదరుడు నా మీద యుద్ధాలు నడిపించారు. వారి వైరానికి వస్తువువు నీవే. నీవే ఆ యుద్దానికి సంజ్ఞాపద మైనావు.

**ఆంటోనీ :** ఈ వ్యవహారంలో నీవు పొరబడ్డావు. నా సోదరుడు తానొనర్చిన పనికి నన్ను వస్తువుగా ప్రదర్శించలేదు. నేను విచారణ చేశాను. నమ్మదగ్గ చారులమూలంగా కత్తి దూసి ఎవరు నీ మీదికి తలపడ్డారో తెలుసుకొన్నాను. నీతో అభిన్నమైన లక్ష్యంగల నా అపేక్షకు వ్యతిరేకంగా యుద్ధం చేసి నీ అధికారానికెలాగో అలాగే, నా అధికారానికి కూడా ఆ వ్యక్తి అప్రతిష్ఠను తీసుకోరాలేదా? దీన్నిగురించి నా ఈ లేఖలే నీకు తృప్తినిస్తాయి. నాతో నీవు తగాదా తెచ్చుకోటానికి నిశ్చయిస్తే, అందుకు అవసరంగా ఇంతకంటే మరేదైనా ప్రబలకారణాన్ని వెదకవలసి ఉంటుంది.

**సీజర్ :** నా నిర్ణయాలు దోషభూయిష్ఠాలని ఆరోపించి, నిన్ను నీవు ప్రశంసించు కొంటున్నావు. కానీ నీవు చెప్పే ఈ సాకుల్లో సమగ్రస్ఫూర్తి కన్పించటం లేదు.

**ఆంటోనీ :** పొరబడకు. ఒక లక్ష్యసాధనలో నీతో సమభాగవర్తినైన నేను, నా ప్రశాంతికి భంగం కలిగించిన ఆ యుద్ధాన్ని అంగీకరించటం ఎంతటి కష్టకార్యమో, నీవు గ్రహించవలసిన పరిపూర్ణావశ్యకత ఎంతైనా ఉంది.

ఇక నా భార్యను గురించి, ఆమెకున్న శక్తి, ఆమెతో తుల్య అయిన మరొక వనిత ఉండి ఉండవలసిందని నేను భావిస్తున్నాను. రోమకమహాసామ్రాజ్యంలోని తృతీయభాగానికి నీవు అధికారివి. ప్రశాంతంగా ఉండవలసిందని ఆ రాజ్యాన్నంతటినీ అల్పసూచనలతో శాసింపగలవేమోగాని, ఇటువంటి భార్యకు ఎట్టిమార్గాననైనా గుణపాఠం చెప్పలేవు!

**ఎనోబార్బస్ :** మనందరికీ ఇటువంటి భార్యలుండి సొగసైన యుద్ధాలు జరుగుతుంటే ఎంతో బాగుంటుంది.

**ఆంటోనీ :** సీజర్ మహాశయా! క్షాంతిరహితమై, శిక్షాతీతమైన ఆమె స్వభావం కల్పించిన కల్లోలాల్లోనూ, అనుసరించిన విధానాలలోనూ చాకచక్యం లేకపోయినా, అవి నీ ప్రశాంతికి భంగాన్ని కల్పించాయని నేనెంతో బాధపడుతూ అంగీకరిస్తాను. అయితే ఆ విషయంలో నేను నిస్సహాయుడనని నీవు అంగీకరించక తప్పదని నే నంటాను.

**సీజర్ :** అలెగ్జాండ్రియాలో నీవు విలాసాల్లో మునిగి తేలుతున్నప్పుడు, నీకెన్నెన్నో లేఖలు పంపించాను. వాటినన్నింటినీ నీవు చదవనైనా చదవక అలక్ష్యం చేశావు. అంతే కాదు, నా వార్తాహరిని పరిహసించి సమ్ముఖంనుంచి తరిమికొట్టావు.

**ఆంటోనీ :** మహాశయా! ప్రవేశానికి అనుమతిని పొందకుండానే అతడు సముఖాన నిల్చాడు. అప్పుడే నేను ముగ్గురు రాజులకు విందు చేశాను. ఉదయవేళ నేనుండేటంతటి సమచిత్తంలో లేను. కానీ మరొకనాడు దర్శన మిచ్చినప్పుడు క్రితంనాటి నా స్థితిని క్షమాపణ వేడుకొన్నంతగా వివరించాను. ఈ వార్తాహరిచరిత్ర ఇక నీ నా మధ్య ఆటంకంగా నిలువకుండుగాక! కలహింపవలసిఉంటే ఈ అల్పమానిసి కథ మనకు కారణం కాకుండుగాక!

**సీజర్ :** నీవు చేసిన ప్రయాణంలోని అంశాన్ని భగ్నం చేశావు. నా యెడ అట్టిదోషం ఉందని నీవనలేవు.

**లెపిడస్ :** సీజర్ మహాశయా! మృదువుగా సంభాషించు.

**ఆంటోనీ :** ఆపవద్దు. సీజర్! కానివ్వు. ఆపవద్దు. లెపిడస్, ఆయన్ను స్వేచ్ఛగా మాట్లాడనివ్వు. ఇది పునీతమైన నా గౌరవానికి సంబంధించిన విషయం. అది నాలో లోపించిందని ఆయన భావిస్తున్నాడు. సీజర్! నేను భగ్నంచేశానని నీవు తలపోసిన ఆ ప్రమాణాంశమేదో సెలవియ్యి!

**సీజర్ :** అవసరమైనపుడు నాకు శస్త్రాలనూ, సహాయాన్నీ ఇవ్వటమనే ఆ రెంటినీ నీవు తిరస్కరించావు.

**ఆంటోనీ :** ఇవ్వలేకపోయాననటం సమంజసం. విలాసప్రియత్వం నా జ్ఞాపకశక్తిని దోచుకొని, నా ఔదార్యాన్ని తనకు బానిసను చేసుకొన్నది. ఆ కాలంలో నేను మీకు తోడ్పకలేకపోయినాను కనుక ఇవ్వలేకపోయినాననటం సమంజసం. ఈ వ్యతిక్రమానికి, నాకు గౌరవలోపం కలగనంతటిమేరకు నేను నీ క్షమాపణను అర్థిస్తున్నాను. అయితే ఈ అభ్యర్థనవల్ల నా సత్యరతికి, అధికారానికీ దారిద్ర్యావమానాలను కల్పించడం నేను అంగీకరించను. అవి లేనిది నేను వ్యవహరించలేను. ఇందులోని సత్యం ఇది – ఫుల్వియా నన్ను ఈజిప్టు నుంచి రప్పించటానికి[33] ఇక్కడ యుద్ధాలు చేసింది. అజ్ఞాతంగానే నేను వాటికి కారణమైనాను. నా గౌరవానికి భంగం కలగనిరీతిగా ఇందుకు నేను మీకు క్షమాపణ చెప్పుకొంటున్నాను.

**లెపిడస్ :** మహోదాత్తంగా పలికావు.

**మెకయ్‌నాస్ :** మీలో ఒకరివల్ల ఒకరికి పూర్వం కలిగిన కష్టనష్టాలను గురించి పట్టుపట్టవద్దని నేను సూచించవచ్చుననుకొంటాను. వాటిని మరిచిపోగలిగితే, మీరు ఇరువురూ ప్రస్తుతావసరాలు మీ ఇద్దరి సఖ్యాన్ని ఎంత ఘనంగా కోరుతున్నవో గమనించినవారౌతారు.

**లెపిడస్ :** నీవు అవసరానికి ఎంతో అనుయోగ్యంగా ప్రసంగించావు మెకయ్‌నాస్!

**ఎనోబార్బస్ :** లేదా ఇప్పుడు పరస్పరానురాగాన్ని తాత్కాలికంగా మీరు అరువు పుచ్చుకొంటే, పాంపేను గురించిన మాటలు వినపడటం మానేసిన తరువాత, మళ్లీ మీ వైమనస్యాలను త్రవ్వుకోవచ్చు. మీకప్పుడు మరోపని ఉండదు గనుక, కలహించుకోటానికి కావలసినంతగా కాలం ఉంటుంది కూడాను.

**ఆంటోనీ :** నీవు కేవలం ఒక సైనికుడివి. ఇక విస్తరించి సంభాషించకు.

**ఎనోబార్బస్ :** సత్యం కూడా మూకత వహించవలసిన సమయాలు ఉంటాయని నేను పూర్తిగా మరిచిపోయాను.

**ఆంటోనీ :** ఈ సమావేశానికి నీవు పూర్తిగా అపచారం చేస్తున్నవాడి వౌతున్నావు. కనుక ఇక నీవు నోట మాట రానీయకు!

**ఎనోబార్బస్ :** అయితే మీ ఇష్టంవచ్చినట్లు జరిగించండి. ఆలోచించినా పైకి ఏమీఅనక శిలనై ఉంటాను.

**సీజర్ :** అతడు చెప్పిన విషయాలను గురించి నాకెట్టి అసంతృప్తీ కలగలేదు. అయితే అతనిరీతిలో కొంత స్వేచ్ఛ మాత్రం కనిపించింది. మన ఇరువురి స్వభావాలూ అన్యోన్యవ్యతిరిక్తాలై వ్యవహరిస్తున్నవి. కానీ ఏ బంధం వల్ల మన ఇరువురి స్నేహం సుస్థిరంగా నిరంతరం నిలువగలుగుతుందో దానికోసం ప్రపంచంలోని నలుమూలలా నేను అన్వేషిస్తాను.

**అగ్రిప్పా :** సీజర్ మహాశయా! ఇంచుక నాకు అవకాశమీయండి.

**సీజర్ :** అగ్రిప్పా! నీవు ప్రసంగించవచ్చు.

**అగ్రిప్పా :** మీకు తల్లివంక చెల్లెలు[34]న్నది. ఆమె ప్రశస్తిగన్నది. ఆంటోనీ ఇప్పుడు విధురుడు.

**సీజర్ :** అలా అనకు అగ్రిప్పా! నీ మాటలు క్లియోపాత్రా వింటే నీ తొందరపాటుకు ఆమె నిన్ను తిట్టిఉండేది. ఆ తిట్లకు నీవు యోగ్యుడవౌతావు కూడాను.

**ఆంటోనీ :** సీజర్! ప్రస్తుతం నేను అవివాహితుడనే. అగ్రిప్పాను ఇంకా విశదంగా మాట్లాడనివ్వండి.

**అగ్రిప్పా :** నిరంతరసఖ్యంతో మీ ఇరువురినీ నిలపటానికి, భ్రాతలనుగా ఇరువురినీ బంధించటానికీ, జారిపోని ముడివేసి మీ ఇరువురి హృదయాలనూ కలిపి కట్టివేయటానికీ ఆంటోనీ మహాశయా! నీవు ఆ ఆక్టేవియాను భార్యగా స్వీకరించు. ఆమె పురుషశ్రేష్ఠుణ్ణి భర్తగా పడయదగినంతటి పరమసుందరి. ఆమె శీలసౌభాగ్యం[35], సౌందర్యవిశేషం ఆమెను గురించి మిగిలినవాటి కంటే విశేషంగా చెప్ప సమర్థాలైనవి. ఈ నాడు మహాఘనాలుగా కన్పించే అల్పవైమనస్యాలు, ప్రమాదపరిస్థితులను వెంటబెట్టుకొని ఉన్నట్లు కన్పించే గాఢభయాలు ఈ వివాహంవల్ల మటుమాయ మౌతాయి. కల్పితకథలు ఈ నాడు సత్యాలౌతున్నాయి. అతిసత్యాలే ఈ వివాహం జరిగిననాడు కథలౌతాయి. ఆమె మీది మీ ప్రేమ మీ ఇరువురిని పరస్పరం ఆకర్షిస్తుంది. ఇరువురినీ ఆమెయెడ అనురాగపూరితులను చేస్తుంది. నేను విన్నవించేదానిలో ఏమైనా దోషముంటే క్షమించండి. ఇది ఏదో హఠాత్తుగా తోచిన ఊహ కాదు యోచనచేసి పొందిన అభిప్రాయం. ఇది నా కర్తవ్యానుపాలనంగా తోచి మనస్సులో బహుకాలం మెలిగిన అభిప్రాయం.

**ఆంటోనీ :** సీజర్! ఇందుకు నీ అభిప్రాయమేమిటో వెల్లడిస్తావా?

**సీజర్ :** జరిగిన ప్రసంగాన్ని గురించి ఆంటోనీ ఎట్టి అనుభవాన్ని పొందాడో విన్నదాకా ఏమీ అనలేను.

**ఆంటోనీ :** 'అయితే అగ్రిప్పా, నీ వన్నట్లే అగుగాక!' అని నేనన్నప్పుడు, తన సూచనకు కార్యరూపాన్ని కల్పించటానికి అగ్రిప్పా కేమి అధికారముంది?

**సీజర్ :** సీజర్‌కు ఉన్న అధికారమూ, అంతే కాదు, అతడికి ఆక్టేవియా[36]మీద ఉన్న అధికారమూ అగ్రిప్పాకున్నాయి.

**ఆంటోనీ :** ఫలప్రదాయకంగా కనిపించే ఇటువంటి పరమశ్రేష్ఠకృత్యానికి కలలో కూడా నేను ఆటంకాన్ని కాకుందునుగాక! ఏదీ సీజర్, నీ హస్తాన్ని ఇలా అందించు! ఈ మహోదాత్తకృత్యానికి[37] పరిపూర్తిని కల్పించు!! ఈ క్షణం నుంచీ భ్రాతృప్రేమ మన హృదయాలను పాలిస్తూ ఉన్నతలక్ష్యాల వంకకు మనలను ఏకముఖం చేసి నడిపించుగాక!!

**సీజర్ :** ఇదిగో నా హస్తం. అందుకో! ఏ సోదరుడూ నావలె ఘనంగా ప్రేమించనట్టి సోదరిని నీకిస్తున్నాను. మన రాజ్యాలూ, హృదయాలూ స్నేహానుబంధాలతో చిరకాలం వర్ధిల్లటంకోసం ఆమె చిరంజీవిని ఔగాక! ఎన్నడూ మన అన్యోన్యానురాగం సన్నగిల్లకుండుగాక!!

**లెపిడస్ :** అలాగే అగుగాక! ఇది పరమానందకరమైన పరిణామం!

**ఆంటోనీ :** కొంతకాలంనుంచీ పాంపే నా యెడ అతిశయమూ, అపూర్వమూ అయిన గౌరవాన్ని ప్రకటిస్తున్నాడు[38]. అందువల్ల నేను అతడిమీద కత్తిని దూయదలచలేదు. లేకపోతే నా జ్ఞాపకశక్తిని గురించి దుర్వార్తలు చెలరేగుతాయి. కనుక అతడు నాకు చేసిన మేళ్లకు తొలుతగా కృతజ్ఞతను తెలుపుకొని తరువాత అతణ్ణి ఏకైకంగా ఎదిరిస్తాను.

**లెపిడస్ :** పాంపేను ఎదుర్కోవలసిన సమయం మనను ప్రేరేపిస్తున్నది. అందుకు మనం సిద్ధపడకపోతే, అతడే వెతుక్కుంటూ వచ్చి మనపైన బడతాడు.

**ఆంటోనీ :** అతడు ప్రస్తుతం ఎక్కడున్నాడు?

**సీజర్ :** మైసెనమ్[39] ప్రాంతంలో.

**ఆంటోనీ :** అతని పదాతిబలం ఎంత ఉంటుంది?

**సీజర్ :** అది అతివిస్తృతమైంది. ఇంకా పెరుగుతున్నది కూడాను. అయితే అతడు సముద్రంమీద సర్వాధిపత్యం వహిస్తున్నాడు.

**ఆంటోనీ :** అవును. వదంతి అలాగే ఉంది. ఇంతకు పూర్వమే మనం యుద్ధంలో ఎదురునిల్చి ఉన్నట్లయితే, అతడు అలా ఉండగలిగేవాడు కాదు. సన్నాహాల విషయంలో ఇక మిక్కిలి త్వరపడదాం. శస్త్రధారణం చేసేలోపలనే ఇప్పుడనుకొన్న వ్యవహారాన్ని సమాప్తి చేయిద్దాం.

**సీజర్ :** మహానందంతో. నిన్ను నా వెంట తీసుకోవెళ్ళుతాను  నా సోదరిని చూచివద్దువుగాని.

**ఆంటోనీ :** లెపిడస్! నీవు వెంట మాకు తోడుగా ఉండాలి.

**లెపిడస్ :** వ్యాధి వచ్చినా మీ వెంట వచ్చి తీరుతాను.

**తుత్తారధ్వని, సీజర్, ఆంటోనీ, లెపిడిస్‌లు నిష్క్రమిస్తారు.**

**మెకెయ్‌నాస్ :** ఈజిప్టునుంచి విచ్చేసిన నీకివే నా శుభాకాంక్షలు.

**ఎనోబార్బస్ :** సీజర్‌కు అర్ధహృదయానివి. పూజ్యుడవు. యోగ్యుడా మెకెయ్‌నాస్! నీకివే నా శుభాకాంక్షలు! అగ్రిప్పా! నీకు కూడా.

**అగ్రిప్పా :** ఉదాత్తుడా, ఎనోబార్బస్! నీకు నా శుభాకాంక్షలు.

**మెకెయ్‌నాస్ :** వ్యవహారాలన్నీ ఇంత సుగమంగా పరిష్కృతాలైనాయి.  మనమానందించ టానికి ఇది ఎంతైన కారణంగా కనిపిస్తున్నది. ఈజిప్టులో విలాసాలతో బహు బాగా కాలం గడిపావనుకొంటాను.

**ఎనోబార్బస్ :** పగలంతా నిద్రించి దానికి సిగ్గును కల్పించాము. మా మధుపానగోష్ఠులతో రాత్రికి రమణీయతను నాపాదించి తేలికతనాన్ని తెచ్చిపెట్టాము.

**మెకెయ్‌నాస్ :** ఉదయభోజనానికే ఎనిమిది వనవరాహాలను వ్రేల్చేవారట! విందులో పన్నెండుమందికి మించి ఆరగించేవారుండేవారు కారటగా!

**ఎనోబార్బస్ :** ఈగిల్‌తో పోలిస్తే ఇది ఈగతో సమానం. విందులో ఇంతకంటే ఇంకా మాకు ఎంతో దయ్యపుతిండి ఉండేది. అదంతా చెప్పదగ్గది కాదులెండి!

**మెకెయ్‌నాస్ :** అందినవార్తలు నిజమైతే ఆమె అసాధారణమైన వైభవం ఉన్న అతివట!

**ఎనోబార్బస్ :** తొలుతగా ఆమె ఆంటోనీని సిడ్నస్‌నది[40] మీద కలుసుకొన్నప్పుడు అతని హృదయాన్ని దోచి దాచేసింది.

**అగ్రిప్పా :** అక్కడే ఆమె మహావైభవాన్ని ప్రదర్శించిందని విన్నాను. ఇది అసత్యమైతే నా వార్తాహరి కల్పనాప్రావీణ్యంలో ఘనుడన్నమాట!

**ఎనోబార్బస్ :** ఆ విశేషాలన్నీ మీకు నివేదిస్తాను. ఆమె అధివసించిన ఆసనం ఆ నదీజలాలల్లో బంగారుమలామా చేసిన మహాసనంలా మెరిసింది. దాని పశ్చార్ధనావం విశాలస్వర్ణ పత్రసంశోభితం. నౌకాపటాలు నీలవర్ణ నిలయాలు. పవనాలకు వాటిమీద ప్రణయం జనించిందా అన్నట్లు అవి పరిమళాలను వెదజల్లాయి. ఆ యానపాత్ర క్షేపణాలు అతిస్నిగ్ధరౌప్య వినిర్మితాలు. అవి సుషిరస్వనాలతో లయకల్పి తాము తట్టే నీరానికి శృంగారభావాన్ని కల్పించి చలింపజేశాయా అనిపించాయి. ఇక ఆమెరూపం వర్ణనాతీతం. తపనీయతంతువులతో అల్లిన అమూల్యమంటపంలో, ప్రకృతిని అధఃకరించే భావనాబలంతో స్థపతి శిల్పించి నిల్పిన వీనస్[41] విగ్రహాన్ని ఎన్నో రెట్లుగా మించి ఆమె శయనమూర్తి భాసించింది. ఆమె కిరుపార్శ్వాలా అందమైన గండకూపకాలతో ఇరువురు బాలకులు చిరునవ్వులు చిలుకరిస్తూ మన్మథమూర్తుల్లా నిలిచి, శబలవర్ణ ప్రకీర్ణకాలతో చల్లబడజేసే కోమలకపోలసీమలను కాంతిమంతం చేస్తున్నారు. ఇలా వారు ఉక్కను పోగొట్టుకోటానికి పూనుకొని ఉష్ణిమను కల్పించారు.

**అగ్రిప్పా :** ఆహా! ఆంటోనీ అక్షిద్వయానికి ఎంత అపూర్వమైన దృశ్యం. ఇక ఆమెస్త్రైణం సాగరకన్యలైన నైరైడ్స్[42]లా సర్వావయవాలంకరణశోభితలు. ఎల్లవేళలా ఆమె కనులమీదనే దృష్టి నిలుపుతూ, ఆమె మనోభావాలకు అనుగుణంగా అవయవచాలనం చేస్తూ, వారు ఆమెను కొలుస్తున్నారు. మెర్మైడ్‌లా కనిపిస్తూ ఒక నారీమణి చుక్కానిపట్టి నౌకను నడిపింది. సుమకోమలి అయిన ఆమె హస్తస్పర్శవల్ల కలిగిన గర్వంతో ఉప్పొంగి, ఆ మెత్తని ఉపకరణం అతిలాఘవంతో తన కర్తవ్యాన్ని పాలించింది. ఆ విహారనౌకనుంచి విచిత్రమూ, అదృశ్యమూ అయిన వాసనాద్రవ్యం తీరభూములను తన సుగంధంతో ముంచెత్తింది. తనదర్శనం చేసుకొనేటందుకని ఆమె ఆ మహానగరంలోని సర్వప్రజనూ అక్కడికి నడిపించింది. గాలిలో ఈలలు వేసుకొంటూ ఆంటోనీమాత్రం విపణిప్రదేశంలో ఏకాంతంగా తన ఆసనాన్ని అధిష్ఠించి ఉన్నాడు. శూన్యం అయిపోతుందని అనుకోకపోతే

అతడు కూడా క్లియోపాత్రాను చూడటానికి వెళ్ళి ప్రకృతికి శూన్యతను[43] కల్పించి ఉండేవాడే.

**అగ్రిప్పా :** ఆహా, ఈ ఈజిప్టువనిత ఎంతటి విశిష్ట!

**ఎనోబార్బస్ :** ఆమె భూమిమీదికి అవతరించింది. ఆంటోనీ వార్త పంపించాడు. రాత్రివిందుకు ఆమెను ఆహ్వానించాడు. తాను ప్రార్థిస్తున్నప్పుడు అతడే తనకు అతిథికావటం సమంజసమని సమాధానం పంపించింది. ఎన్నడూ ఏ స్త్రీ కూడా 'లేదు కా'దన్నమాట తనవల్ల అనిపించుకోని స్వభావంగల ఆంటోనీ, ఆమె అభ్యర్థన నంగీకరించి విందునకెళ్లాడు. అతని నేత్రాలు మాత్రమే కుడిచిన విందుకు మూల్యంగా అతడు హృదయాన్ని ఇచ్చుకొని వచ్చాడు.

**అగ్రిప్పా :** ఆహా! క్లియోపాత్రా ఎంతటి రాజసం గల రమణి!

**ఎనోబార్బస్ :** రాజమార్గాన ఆమె నలుబదిఅడుగులు నడవటం ఒకమారు చూచాను. దానికి తరువాత ఆమె ఉపన్యసించలేకపోయింది. ప్రసంగం పూర్తిఅయిన పిమ్మట సోలిపోకుండా ఉండలేకపోయింది. అట్టి లోపం ఆమెకో పరిపూర్ణతను కల్పించింది. నిశ్వాసోచ్ఛ్వసనం స్తంభనంతో ఆమె తన సమ్మోహనశక్తిని ప్రదర్శించింది.

**మెకెయ్‌నాస్ :** అయితే ఇక ఆంటోనీ ఆమెను పరిపూర్ణంగా పరిత్యజించవలసిందే!

**ఎనోబార్బస్ :** ఎన్నడూ ఆయన పరిత్యజించడు. పరిత్యజింపలేడు కూడాను! ఆమె వయస్సువల్ల వాడిపోయేది కాదు. ఆమె అనంతవైవిధ్యం అతిపరిచయం వల్ల పాతబడేది కాదు. ఇతరస్త్రీలు తమను అనుభోగించిన వారికి మొగం మొత్తేటట్లు చేస్తారు. ఆమె తనకడ తృప్తికరంగా భుజించినవాళ్లకే అమితబుభుక్షను కల్పించే అద్భుతసామర్థ్యం కలది. ఆమెకడ ఉన్న ఏ అల్పచేష్ట అయినా మనోమనోజ్ఞ విలాసమౌతుంది. అందువల్లనే ఆమె అవినీతితో వర్తించినా, పునీతులైన పురోహితులు గూడా ఆమెను ఆశీర్వదిస్తుంటారు.

**మెకెయ్‌నాస్ :** సౌందర్యం, సాధుస్వభావం, వివేకం ఆంటోనీని నిశ్చలంగా నిలుపగలిగితే, ఆక్టేవియా అతనికి పందెంలో లభ్యమైన బహుమంచి ఉపహారం.

**అగ్రిప్పా :** ఇక నిష్క్రమిద్దాము. ఉదాత్తుడా, ఎనోబార్బస్! ఇక్కడ ఉన్నంతకాలం నీవు నా అతిథివి సుమా!

**(నిష్క్రమిస్తారు)**

## మూడో దృశ్యం

**రోము నగరం. సీజర్ గృహం.**
**ఆంటోనీ, సీజర్, మధ్య ఆక్టేవియా, పరివారమూ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** రోమక సామ్రాజ్యవ్యవహారాలు, నా ప్రముఖకర్తవ్యాలు కొంతకాలం నీకు నన్ను దూరుణ్ణి చేస్తున్నవి.

**ఆక్టేవియా :** అంత కాలం నేను దేవతలముందు మోకరిల్లి నీ శుభాన్నే అర్థిస్తూ ప్రార్థనలు చేస్తుంటాను.

**ఆంటోనీ :** మహాశయా! సునక్తం. ఆక్టేవియా, ప్రియా! లోకం చెప్పుకొనే వార్తలు విని నన్ను దోషభూయిష్ఠుణ్ణిగా భావించకు. నేను ఎన్నడూ ఆదర్శాన్ని అంటిపెట్టుకొని ఉన్నవాణ్ణి కాను. నిజమే. కానీ భవిష్యత్తులో నా సమస్తజీవితపథాన్నీ నియమానుసారంగా సాగింపదలచాను. ప్రియదేవీ! సునక్తం!! మహాశయా, సీజర్! సునక్తం!!

**(సీజర్, ఆక్టేవియా నిష్క్రమిస్తారు)**

**జోస్యుడు[44] ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** ఏమయ్యా! నీవు ఈజిప్టుకు వెళ్ళిపోదామనుకుంటున్నావట, నిజమేనా?

**జోస్యుడు :** అక్కడినుంచి ముందు నేను ఇక్కడికి రాకుండా ఉంటేనే ఎంతో బాగుండేదని భావిస్తున్నాను.

**ఆంటోనీ :** ఇందుకు కారణమేదైనా ఉందా? ఉంటే చెప్పవచ్చునా?

**జోస్యుడు :** అదేమిటో మాటల్లో నేను చెప్పలేను. కానీ నా అంతరాత్మలో వసిస్తున్నది. త్వరలో తిరిగి ఈజిప్టుకు వెళ్ళిపొమ్మని నీకు నా హెచ్చరిక.

**ఆంటోని :** ఎవరి అదృష్టం ఆరోహణక్రమంలో ఉందో చెప్పు – సీజర్‌దా, నాదా?

**జోస్యుడు :** సీజర్‌దే. అందువల్ల నీవు అతని ప్రక్క నిలువకు. నిన్ను పాలించే ప్రభావశక్తి – నీ ఉనికికి కారణభూతుడైన దేవదూత – ఒంటిగా ఉంటే ఉదాత్తుడు! సాహసోపేతుడు!! మహోన్నతుడు!! నిరుపమానుడు!! సీజర్ శక్తి అంతటివాడు కాదు. కానీ నీవాతని ప్రక్క ఉన్నప్పుడు నీ శక్తి అతని అధికశక్తికి లొంగిపోయేటంతగా

భయభ్రాంతుడౌతున్నాడు. అందువల్ల మీ ఇరువురి మధ్యా ఎంతదూరం ఉండటానికి అవకాశం ఉంటే, అంతటిదూరం ఉండేటట్లు చూడు.

**ఆంటోనీ :** ఇక దీన్నిగురించి విస్తరించి చెప్పకు.

**జోస్యుడు :** నీకు తప్ప మరెవ్వరికీ చెప్పను. దీన్ని నీకై నీవు చెప్పుకుండేటప్పుడు తప్ప మరెప్పుడూ చెప్పను. అతనితో నీవే క్రీడకు పూనుకొన్నా నీకు అపజయం తప్పదు. సహజంగా అదృష్టం అతనిపక్షాన ఉండటంవల్ల గుణవ్యత్యాసాల ఆధిక్యం అమితమై, నీ పజ్జనే ఉన్నా అతడే నిన్ను గెల్చి తీరుతుంటాడు. నీ తేజం మందగిస్తుంటుంది. నీ ప్రక్కన నిల్చినప్పుడల్లా అతడు విరాజమానుడౌతుంటాడు. తిరిగీ హెచ్చరిస్తున్నాను. నీ సంరక్షకశక్తి అతని వెంట వున్న నిన్ను పాలించటానికి భయపడుతున్నాడు. మీ ఇరువురిమధ్యా దూరం ఉన్నప్పుడు అతడు మళ్ళీ మహోదాత్తంగా వర్తిస్తాడు.

**ఆంటోనీ :** ఇక నీవు వెళ్ళిపోవచ్చు. నేను అతడితో మాట్లాడదలిచానని వెంటిడియస్‌కు తెలియజెయ్.

**(జోస్యుడు నిష్క్రమిస్తాడు)**

అతడు పార్థియాకు వెళ్ళాలి. ఇతడు భావికాలపరిజ్ఞానం వల్ల తెలుసుకొని పలికాడో, లేకపోతే వాక్శుద్ధికలవాడు కావటం వల్ల నోట అనేసింది అయి తీరుతుందో! అయితే ఇతను అన్నది మాత్రం సత్యం. ఆటలో వేసిన నా పాచికల్లా అతడికి అనుకూలంగా తిరిగి తీరుతున్నది. ఎంతటి నా ఎత్తయినా సర్వక్రీడల్లో అతని అదృష్టానికి లొంగిపోతున్నది. పందాలలో అదృష్టం కూడా అతనిదే. సర్వవిధాలా ఆధిక్యం నాదే అయి గోచరించే సమయాలలోనూ, కుక్కుట ద్యూతాలలో అతని పుంజులే తుది విజయాన్ని సాధిస్తున్నవి. వ్యత్యాసాల ఆధిక్యం తమకెంత అనుకూలంగా ఉన్నా, రెంటినీ సమానంగానే కట్లతో బిగించినా, అతని లావుకాలే[45] నా పిట్టలను గెలుస్తున్నాయి. నేను ఈజిప్టుకు వెళ్ళితీరాలి! సీజర్‌తో సంధికని నేను ఆ ఆక్టేవియాను వివాహమాడాను. అయితే నా ఆనందసర్వస్వం ఆ ఈజిప్టులోనే ఉంది.

**వెంటిడియస్ ప్రవేశిస్తాడు.**

స్వాగతం వెంటిడియస్! నీవు పార్థియాకు బయలుదేరాలి. అక్కడ వ్యవహారాల నన్నింటినీ చక్కబెట్టటానికి నీకు అధికారాన్నిచ్చే అవసరమైన పత్రాలను అన్నింటినీ సిద్ధం చేయించాను. నావెంటవచ్చి వాటిని పుచ్చుకో.

**(నిష్క్రమిస్తారు)**

## నాలుగో దృశ్యం

**రోములో ఒక వీధి. లెపిడస్, మెకయ్‌నాస్, అగ్రిప్పా ప్రవేశిస్తారు.**

**లెపిడస్ :** ఇక దాన్ని గురించి మీరేమీ కలతపడవద్దు. మీ సేనానాయకులను త్వరపెట్టండి.

**అగ్రిప్పా :** మార్క్ ఆంటోనీ ఆక్టేవియాకు వీడ్కోలు ముద్దు ఇచ్చి రావటానికి వెళ్లాడు. మేము ఆయనను అనుసరించి వస్తాము.

**లెపిడస్ :** మిమ్మల్ని తిరిగీ మా సైనికవేషాలలో చూచేటంతవరకూ వీడ్కోలు.

**మెకెయ్‌నాస్ :** ప్రయాణానికి పట్టే కాలపరిగణనాన్ని బట్టి మీ కంటే ముందు మేమే మైసీనం చేరుకుంటాము.

**లెపిడస్ :** అవును. మీ మార్గం హ్రస్వమైంది. నాకున్న పనులవల్ల చుట్టుదారి తీసుకోవలసి వచ్చింది. నా కంటే రెండుదినాలు ముందుగానే మీరు అక్కడికి చేరుతారు.

**మెకెయ్‌నాస్, అగ్రిప్పా :** ఘనవిజయం కల్గుగాక!

**లెపిడస్ :** శుభమగుగాక!!

**(నిష్క్రమిస్తారు)**

## ఐదో దృశ్యం

**అలెగ్జాండ్రియా, క్లియోపాత్రాప్రాసాదం.**
**క్లియోపాత్రా, ఛార్మియన్, ఐరాస్, ఎలెగ్జాస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** నాకు కొంత సంగీతాన్ని ప్రసాదించండి. ప్రణయ వ్యాపారంలో నిమగ్నులైనవారి చిత్తానికి అది చక్కని ఆహారం.

**పార్శ్వచరులు :** సంగీతం! సంగీతం!! రండి! వినిపించండి!!

**కొజ్జా మార్డియన్ ప్రవేశిస్తాడు.**

**క్లియోపాత్రా :** సంగీతాన్ని వినను. ఛార్మియన్, బిలియర్డ్స్ ఆడుకొందాం రా.

**ఛార్మియన్ :** నా చేతికి గాయం తగిలింది. మార్డియన్‌తో ఆడు. ఒక స్త్రీ మరొక స్త్రీతో ఆడినట్లే కొజ్జాతో కూడా ఆడవచ్చు. రా మార్డియన్! నాతో బిలియర్డ్స్[46] ఆడుతావా?

**మార్డియన్ :** రాజ్ఞీ! చేతనైనరీతిగా ఆడుతాను.

**క్లియోపాత్రా :** ఒక వ్యక్తి సదుద్దేశంతో కార్యాచరణకు పూనుకొంటే అది ఫలవంతం కాకపోయినా, అతడు క్షమార్హి కావచ్చు. వద్దు. నేనా ఆట ఆడను, నా 'మీనదండాన్ని' తెచ్చిపెట్టండి. నది దగ్గిరికి వెళ్లుదాం. వెళ్లి అక్కడ గానం చేస్తూ బూడిదరంగు పొలుసులతో పొలుపారే మత్స్యాలను మోసగిస్తాను. వక్రమైన నా కొంకిని వాటి మెత్తని దవడల్లో గుచ్చుకొనేటట్లు చేసి ఒక్కొక్క దాన్నే బయటకు లాగేస్తాను. ప్రతి మత్స్యాన్నీ ఆంటోనీగా భావించి 'అహ!' 'అహ!' ఆంటోనీ! నీవు పట్టుబడ్డావు' అని పరిహాసవాక్యాలు పలుకుతాను.

**ఛార్మియన్ :** ఆయన పట్టిన చేపలకంటే ఎక్కువగా పడతానని వెనక నీవు పందెం వేసినప్పుడు మాకు మహానందంగా ఉన్నది. మీ ఈతగాడు ఒకమారో ఉప్పుచేపను ఆయన గాలానికి తగిలిస్తే, అది తెలియక ఆతురతతో ఆయన గాలాన్ని బయటికి లాగాడు జ్ఞప్తికుందా?

**క్లియోపాత్రా :** ఆ సమయంలో, ఒక ఆ సమయ మేమిటి, అప్పుడు అనేకసమయాలల్లో, ఉదయవేళల ఎకసక్కాలతో చిత్తశాంతిని చెరిచి, రాత్రివేళల చక్కని సరసాలలో పడేశాను. మరుసటిదినం ఉదయవేళ తొమ్మిదిగంటల ద్రాక్షాసవంలో ముంచి మంచినిద్రలో మునిగిపోయేటట్లు చేశాను. తరువాత నా శిరోవేష్టనాన్నీ, దుస్తులనూ అతడు ధరించేటట్లు చేసి నేనాతని ఫిలిప్పన్‌ను చేతబుచ్చుకున్నాను.

**ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు**

ఇటలీనుంచి వచ్చావా? సద్వార్తలు విని బహుకాలమైంది. త్వరగా నా చెవులకు ప్రయోజనకరాలైన వార్తలను వినిపించు.

**వార్తాహరి :** రాజ్ఞీ! మహారాజ్ఞీ!!

**క్లియోపాత్రా :** ఆంటోనీ మరణించాడా?[47] ఓరి తులువా! ఆ వార్తను వినిపించావంటే మీ మహారాజ్ఞిని చంపుకొంటున్నావని తెలుసుకో! ఆయన క్షేమంగానూ, స్వచ్ఛందవృత్తితోనూ ఉన్నాడని తెలియజేయగలిగితే బంగారం నీకు బహూకృతిగా లభిస్తుంది. అంతే కాదు, అందమైన నీలధమనులకు నిలయమై తమరదనచ్ఛదాలను సోకించి ముద్దెట్టుకొన్నప్పుడు రారాజులే కంపించిన నా కరపల్లవం నీకు ముద్దెట్టుకోటానికి కానుకగా లభిస్తుంది.

**వార్తాహరి :** రాజ్ఞీ! ఆయన క్షేమంగానే ఉన్నారు.

**క్లియోపాత్రా :** ఇదిగో, నీకు కొంత స్వర్ణాన్ని బహూకరిస్తున్నాను. కానీ విను. సర్వబంధాలూ తొలగిపోవటంవల్ల, మనం మరణించిన వ్యక్తిని గురించి కూడా క్షేమంగానే ఉన్నట్లు చెప్పుకొంటుంటాము. ఈ వార్తను నీవు పై అర్థంతో పలికావో ఇచ్చిన బంగారాన్ని కరిగించి నీకిస్తాను. అంతే కాదు, ఈ దుర్వార్త వినిపించినందుకు నీ గొంతుకలో దాన్ని పోస్తాను.

**వార్తాహరి :** ప్రియమైన రాజ్ఞీ! నేచెప్పేది వినవలసిందని ప్రార్థన.

**క్లియోపాత్రా :** మంచిది. వింటాను. మొదలుపెట్టు. కానీ నీ చూపు అరిష్టసూచకంగా ఉంది. ఆంటోనీ నిజంగా సుఖియై స్వతంత్రుడుగానే ఉండి ఉన్నట్లయితే, అంతటి మంచివార్తను చెప్పబోయేటప్పుడు నీ కన్నుల్లో ఆ కషాయవీక్షణం ఉండవలసిన అవసరం లేదు. ఆయన సుక్షేమంగా ఉండకపోతే నీవు సక్రమమైన మానవాకృతితో వచ్చేవాడివా? సర్పకిరీట ఐన ఆఫ్యూరీలా[48] వచ్చి ఉండేవాడివి.

**వార్తాహరి :** దయ ఉంచి నేను చెప్పవచ్చింది వింటారా?

**క్లియోపాత్రా :** మాట్లాడబోయేముందుగానే నిన్ను దండించాలె ననిపిస్తున్నది. అయినా 'ఆంటోనీ సజీవుడుగానే ఉన్నాడు. క్షేమంగానే ఉన్నాడు, సీజర్‌తో మిత్రుడుగానే ఉన్నాడు. అతడికి బానిస కాలేదు' అని చెప్పావో నీమీద బంగారాన్ని వర్షిస్తాను మంచి ముత్యాలల్లో ముంచెత్తుతాను.

**వార్తాహరి :** రాజ్ఞీ! ఆయన క్షేమంగానే ఉన్నాడు.

**క్లియోపాత్రా :** ఇది శుభవార్త!

**వార్తాహరి :** సీజర్‌తో మిత్రుడుగానే ఉన్నాడు.

**క్లియోపాత్రా :** అయితే నీవు సత్యవాదివి.

**వార్తాహరి :** ఆయనా సీజర్ వెనుకటికంటే కూడా అత్యధికమైత్రితో మెలగుతున్నారు.

**క్లియోపాత్రా :** నీకెంత సంపద కావాలో కోరుకో.

**వార్తాహరి :** కానీ –

**క్లియోపాత్రా :** నీ కానీలు నాకు నచ్చవు. తుంటరి కానీ – ఒక కారాగారాధికారి వెంట దోషిని తెచ్చినట్లుగా – ఈ కానీ దుర్వార్తకు ముందు నడుస్తుంటుంది. నిన్ను

ప్రార్థిస్తున్నాను. మంచిచెడ్డల కలగలుపుతో, మిత్రుడా! నీవు తెచ్చినవార్తలన్నిటితో, ఒకేమారు నా చెవులను నింపేయి! ఆయన సీజర్‌తో మిత్రుడుగా ఉన్నాడన్నావు, ఆరోగ్యవంతుడుగా ఉన్నాడన్నావు, స్వతంత్రుడుగా ఉన్నాడన్నావు కదూ?

**వార్తాహరి :** స్వతంత్రుడని నేనన్నానా? లేదు రాజ్ఞీ! ఆయన ఆక్టేవియాతో అనుబంధితుడైనాడు.

**క్లియోపాత్రా :** ఛార్మియన్! ఈ వార్తతో నేనెంతగా పాలిపోయానో గమనించావా?

**వార్తాహరి :** రాజ్ఞీ! ఆయన ఆక్టేవియాను పరిణయమాడాడు.

**క్లియోపాత్రా :** అంటువ్యాధులన్నింటిలోనూ అమితశక్తి గలది నిన్ను ఆవరించుగాక!

**వార్తాహరి :** రాజ్ఞీ! శాంతి వహించండి.

**క్లియోపాత్రా :** ఏమంటున్నావు? ఇక్కడినుంచి వెళ్ళిపో! (తిరిగి కొడుతుంది) ఓరి మహాద్రోహీ! వెళ్ళిపో! లేకపోతే నీ కనుగ్రుడ్లను కాలిముందున్న బంతుల్లా తన్నేస్తాను. తలమీది వెంట్రుకలన్నిటినీ ఊడబెరికిస్తాను. (కురులు పట్టుకొని క్రిందికి పైకీ లేవనెత్తి కూలబడుస్తుంది) తీగతో నిన్ను కొట్టించి, ఉప్పునీటిలో పడేయించి తన్నుకొనేటట్లు చేయిస్తాను.

**వార్తాహరి :** ఔదార్యగుణోపేతా! రాజ్ఞీ!! నేను కేవలం వార్తను తెచ్చినవాణ్ణేగాని, ఆ పెళ్ళి చేయించినవాణ్ణి గాను.

**క్లియోపాత్రా :** అలా కాదు. ఆ వివాహం జరగలేదని చెప్పు నీకో రాజ్యమిస్తాను. ఘనమైన సంపదలిస్తాను. నీవు నాకు కోపం తెప్పించటమనే దోషాన్ని చేశావు. అందుకు నా వల్ల తిన్న దెబ్బలనే శిక్ష సరిపోతుంది. దీనికి తోడుగా ఇంకా నీవు ఏమి కోరుకొంటే అదల్లా ఇస్తాను. ఆ పరిణయం జరగలేదని చెప్పు!

**వార్తాహరి :** రాజ్ఞీ! ఆయన వివాహమాడాడు.

**క్లియోపాత్రా :** ఓరి ద్రోహీ! నీవు ఇప్పటికే బహుకాలం బ్రతికావు!

**(కత్తి దూస్తుంది)**

**వార్తాహరి :** అయితే నేను పారిపోతాను. నేనే తప్పిదమూ చెయ్యలేదు.

**ఛార్మియన్ :** రాజ్ఞీ! నీ మేర మీరవద్దు. అతడు నిర్దోషి.

**క్లియోపాత్రా :** కొందరు నిర్దోషులైనా పిడుగుపాటును తప్పించుకోలేరు. ఈ ఈజిప్టు సమస్తం నైలుగా కరిగిపోవుగాక! పరమసత్త్వస్వభావం గల జంతుకోటి అంతా సర్పజాతిగా రూపపరివర్తన పొందుగాక! ఆ సేవకుణ్ణి మళ్ళీ పిలు. నేను ఉన్మత్తస్థితిని వహించి ఉన్నా అతణ్ణి కరవనులే పిలు.

**(ఛార్మియన్ నిష్క్రమిస్తుంది)**

దీనికంతటికీ కారణాన్ని నేనే. – ఆంటోనీని గాఢంగా ప్రేమించాను. అయ్యో! ఒక అల్పుణ్ణి గట్టిగా కొట్టాను. ఈ నా హస్తాలు ఔదార్యమెరుగవు!

**ఛార్మియన్, వార్తాహరి తిరిగి ప్రవేశిస్తారు.**

ఆయన వివాహం చేసుకొన్నాడా?

**వార్తాహరి :** నేను గౌరవనీయులైన మీ క్షమాపణను అర్థిస్తున్నాను.

**క్లియోపాత్రా :** ఆయన వివాహమాడాడా?

**వార్తాహరి :** మీకు నేను కోపం తెప్పించదలచుకోలేదు. నేను చెప్పేదానిలో ఇప్పుడు క్రొత్తదోషం ఏమీలేదు. కనక దీన్ని అలా భావించవద్దు. ఈ తప్పిదాన్నయినా మీరే నన్ను బలవంతపెట్టి చేయిస్తున్నారు. అందుకు నన్ను శిక్షించటం అన్యాయం. ఆయన ఆక్టేవియాను వివాహమాడాడు.

**క్లియోపాత్రా :** నీవు సహజంగా దోషివి కావయ్యా! ఆయన దోషం నిన్ను దోషిని చేస్తున్నది. ఏమిటి? ఆయన వివాహమాడాడా? నిశ్చయంగా నీకు తెలుసునా? ఇక్కడినుంచి వెళ్ళిపో! రోమునుంచి నీవు తెచ్చిన వస్తుసంభారాలు నాకు విలుచుకోతగ్గవి కావు. అవి నీకే మహాభారాలౌగాక! ఆ ఘనభారాలతో నీవు క్రుంగిపోవుదువుగాక!!

**(వార్తాహరి నిష్క్రమిస్తాడు)**

**ఛార్మియన్ :** మహారాజ్ఞీ! చిత్తశాంతి వహించు.

**క్లియోపాత్రా :** ఆంటోనీని ప్రశంసించి నేను సీజర్‌ను అగౌరవించాను. రావయ్యా! ఇలారా!! సత్యమే అయినా దుర్వార్తను తీసుకురావటం క్షేమం కాదు. ప్రియమైన వార్తను పదివేల నాలుకలతో పలుకు. దుర్వార్తలను అనుభవించటం వల్ల తెలియబడనీ!

**వార్తాహరి :** రాజ్ఞీ! నేను నా కర్తవ్యాన్ని నెరవేర్చాను అంతే.

**క్లియోపాత్రా :** ఆయన వివాహమాడాడా? నీవు 'అవు' నని చెప్పినందువల్ల నిన్ను పూర్వం అసహ్యించుకొన్న దానికంటే అధికంగా అసహ్యించుకొనేది ఇంకేమీ ఉండదు.

**వార్తాహరి :** అవును. ఆయన వివాహమాడాడు.

**క్లియోపాత్రా :** దేవతలు నిన్ను నిర్మూలించెదరుగాక! ఇంకా నీవు అవుననే అంటున్నావా?

**వార్తాహరి :** అయితే, రాజ్ఞీ, అబద్ధమాడమన్నారా మరి?

**క్లియోపాత్రా :** ఈ నా ఈజిప్టులో అర్ధభాగం జలమయమై, పొలుసు పాములకు నిలయమైన కుండికగా మారిపోయినా, ఈ విషయంలో అసత్యమాడమనే నిన్ను అభివాంఛిస్తాను. వెళ్ళిపో! ఇక్కడినుంచి వెళ్ళిపో. నార్సిస్సుయస్[49] వంటి సుందరుడవైనా, నీవు నాకు కురూపివిగా కనిపిస్తుంటావు.

**ఛార్మియన్ :** ఒకమారు కాదు బహుపర్యాయాలు.

**క్లియోపాత్రా :** అందుకు తగినట్లు అనుభవిస్తున్నాను. ఇక్కడనుంచి నన్ను తీసుకుపొండి. నాకు మూర్ఛ వస్తున్నట్లుంది. ఐరాస్! ఛార్మియన్!! పోనీయండి. పరవాలేదు. ఎలెగ్జాస్! వార్తాహారి దగ్గరికి వెళ్లు. ఆ ఆక్టేవియా రూపం, వయస్సు, స్థితిగతులూ తెలియజేయమని చెప్పు. ఆమె జుత్తురంగు ఎలాటిదో చెప్పటం మరిచిపోవద్దను. త్వరగా నాకు సమాధానం తీసుకు రా! (ఎలెగ్జాస్ నిష్క్రమిస్తాడు) ఛార్మియన్! అతణ్ణి నిత్యంగా[50] నా దగ్గిరనుంచి వెళ్ళిపోనీ. కాదు. కాదు. వెళ్ళనివ్వకు. ఒకవంక అతడు గార్గన్‌లా[51] మహాభయంకరుడైనా మరొకవంక మార్సు[52]లా మహోదాత్తుడు. (మార్డియన్‌తో) నీవు వెళ్లి ఆమె ప్రమాణం ఎంతో అది కూడా తెలుసుకోరమ్మని ఎలెగ్జాస్‌ను ఆజ్ఞాపించానని చెప్పు. ఛార్మియన్! నన్ను కనికరించు. అయితే నన్ను పలకరించి మాటాడకు. నా కక్ష్యకు, నడిపించుకు పో.

**(నిష్క్రమిస్తారు)**

## ఆరో దృశ్యం

మెసినమ్ వద్ద, దుందుభి తుత్తారధ్వనులతో పాంపే, మెనాస్ ఒకవంక, సీజర్, ఆంటోనీ, లెపిడస్, ఎనోబార్బస్, మెకయ్‌నాస్ ఒకవంక విన్యాసానుగుణంగా నడుస్తున్న సైనికులతో ప్రవేశిస్తారు.

**పాంపే :** మీ కుదువజనం నా దగ్గిరా నా కుదువజనం మీ దగ్గిరా ఉన్నారు. యుద్ధానికి దిగబొయ్యేముందు మనం కొంత సంభాషించుకోవలసి ఉంది.

**సీజర్ :** తొలుతగా మనం ఇలా సంభాషణకు పూనుకోటం సముచితంగా ఉంది. అందుకోసమే వ్రాతమూలకంగా మా నిబంధనలను మా రాకకు ముందుగానే నీకు చేర్చాము. వాటిని పూర్వమే మీరు పరిశీలించి ఉంటారనుకొంటాము. మరి నీవు విప్లవఖడ్గానికి ఒరచూపించి వెంట తెచ్చిన బలశాలురైన వీరయువకులనందరినీ సిసిలీకి తిరిగి తీసుకోపోతావో, లేకపోతే ఇక్కడ బలి ఇస్తావో తెలియజేస్తావా?

**పాంపే :** ఈ రోమకసామ్రాజ్యానికి ఏకైకపాలకులు, సర్వదేవతా ప్రతినిధులూ అయిన మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను. ఫిలిప్పీ యుద్ధరంగంలో[53] ఉదాత్తుడైన బ్రూటస్‌ను జూలియస్ సీజర్ భూతమై వెన్నాడినప్పుడు మీరు ఆయనకోసం ప్రతీకారాన్ని పొందారు. కుమారుణ్ణీ, మిత్రులను కలిగిఉన్న నా జనకుడు[54] అట్టి ప్రతీకారాన్నే ఎందుకు పొందకూడదు? వివర్ణవీక్షలు గల కాషియస్ సీజర్‌మీద ద్రోహాన్ని ఎందుకు తలపెట్టవలసివచ్చింది? సర్వజన ప్రీతిపాత్రుడు, సత్యసంధుడు అయిన బ్రూటస్[55] శస్త్రధారియై స్వేచ్ఛాపిపాసువుల సహాయంతో సభాభవనాన్ని రక్తపంకిలం చేయటానికి[56] పురికొల్పిందేది? అదే ఈ నాడు దాని భారంవల్ల సముద్రాన్ని క్రోధంతో నురగలు క్రక్కేటట్లు చేసే నౌకాదళాన్ని నిర్మించటానికి ప్రోత్సహించింది. ఈ నౌకాదళంతో, ఉదాత్తుడైన నా తండ్రి యెడ నిర్లక్ష్యం చేసి ప్రకటించిన కృతఘ్నతకు తగ్గ ప్రతీకారాన్ని నేను చేయదలిచాను.

**సీజర్ :** పాంపే! నీవు స్వేచ్ఛగా సంభాషించవచ్చు.

**ఆంటోనీ :** నీ నౌకాదళాన్ని చూపెట్టి, పాంపే, నీవు మమ్మల్ని భయపెట్టలేవు. ఇక నేలమీద నీ కంటే మేమెంత అధికులమో అది నీకు తెలియంది కాదు.

**పాంపే :** నిజం ఆంటోనీ! మా జనకుల సౌధాన్ని[57] సంగ్రహించావు. కనుక నేలమీద మీరు నా కంటే అధికులే. నీ వలెనే నిజంగా కోకిల తనకోసమని ఒక గూడు కట్టుకోదు. మరో శకుంతసదనాన్ని ఆక్రమిస్తుంది. అందులో స్థిరనివాసం చేయటానికి ఇక చేతనైతే యత్నించు.

**లెపిడస్ :** ఈ ప్రసంగానికి వర్తమానంతో ఎట్టి ప్రసక్తీ లేదు. మేము పంపించిన కాన్కలను నీవు ఎలా స్వీకరించావో తెలియజేస్తావా?

**సీజర్ :** అవును. వ్యవహారాన్ని ఇక మనం సాగనివ్వాలి.

**ఆంటోనీ :** మా ప్రార్థనలకు లొంగిమాత్రం వాటిని స్వీకరించవద్దు. పరిగ్రహించటంవల్ల కలిగే ప్రయోజనాలను గురించి ఆలోచించే గ్రహించు.

**సీజర్ :** ఇంతకంటే అధికసంపదను[58] సంపాదించాలని ఆశించి యత్నిస్తే ఫలిత మేమౌతుందోకూడా ఆలోచించు.

**పాంపే :** మీరు సిసిలీ[59], సార్డీనియాలను నాకిస్తామంటున్నారు. ఇందుకు గాను నేను సముద్రాలమీది ఓడదొంగలనందరినీ తరిమివెయ్యాలనీ, కొంత గోధుమను రోముకు సరఫరా చెయ్యాలనీ నిబంధనలను నిర్ణయించారు. ఇందుకు నే నంగీకరిస్తే ఖడ్గపు కణకణలు వినిపించకుండానే, ఒరలు సొట్టలు పడకుండానే తిరిగిపోవచ్చు నన్నారు.

**సీజర్ :** అవును, ఇవే మేము నివేదించే నిబంధనలు.

**పాంపే :** అయితే, వినండి[60], నేను ఇక్కడికి మీ నిబంధనలను అంగీకరించే అభిప్రాయంగల వ్యక్తిగానే వచ్చాను. కానీ ఆంటోనీ నన్ను ఉద్రిక్తుణ్ణి చేశాడు. ఈ చెప్పేదాన్ని వినిపించటం వల్ల నేను విలువను ఎంతగా కోల్పోయినా, ఆంటోనీ, దీన్ని నీకు నేను చెప్పితీరాలి. సీజర్, నీ సోదరుడూ పోరాడుకొన్నప్పుడు  నీ తల్లి సిసిలీకి వచ్చింది  ఆమెకు నా తల్లి స్నేహసౌహార్దకమైన ఆతిథ్యాన్ని ఇచ్చింది.

**ఆంటోనీ :** పాంపే! ఈ విషయాన్ని నేను విన్నాను. ఇందుమూలంగా నీకు ఋణపడ్డ నేను కృతజ్ఞతాప్రణామాలను అర్పించటానికి సంసిద్ధుణ్ణిగానే ఉన్నాను.

**పాంపే :** అయితే నీ హస్తమేదీ? ఆంటోనీ, నేను నిన్ను ఇక్కడ కలుసుకొంటానని అనుకోలేదు.

**ఆంటోనీ :** ప్రాగ్దేశంలోని శయ్యలు పరమసుకుమారాలు. పని ఉన్న దానికంటే ముందుగా నన్ను మీరిక్కడికి రప్పించారు. ఇందువల్ల ఎంతో ఘనమైన ప్రయోజనాన్ని పొందాను. నీకివే నా ప్రణామాలు.

**సీజర్ :** వెనక నేను నిన్ను చూచినప్పటికంటే నీలో ఎంతో మార్పు కనిపిస్తున్నది.

**పాంపే :** అదృష్టం నా ముఖాన ఏ నూతనరేఖలను లిఖించిందో నాకు తెలియదు. కానీ ఆమె నా హృదయంలో ప్రవేశించి నన్ను మాత్రం బానిసను చేసుకోలేదు.

**లెపిడస్ :** మనమంతా ఇక్కడ కలుసుకోగలిగాము  ఎంతో తృప్తిగా ఉంది.

**పాంపే :** లెపిడస్! నేనూ అలాగే భావిస్తున్నాను. మనం కొన్ని నిబంధనలను అనుమతించాము. వాటిని లేఖోక్తాలు చేసి హస్తాక్షరాలతో మనదగ్గిర భద్రపరచుకొందాము.

**సీజర్ :** ఇక జరిగించవలసింది ఇంతే.

**పాంపే :** మనం తిరిగి వెళ్ళబోయేముందు ఒకరికొకరం విందులు చేసుకొందాం. వీటిని ఎవరు ఆరంభించాలో చీట్లు వేద్దాం.

**ఆంటోనీ :** పాంపే! నేను ముందుగా నీకు విందు చేస్తాను.

**పాంపే :** అలా కాదు ఆంటోనీ! చీట్లు వేద్దాం. ముందైతేనేం, వెనకనైతేనేం? విందులకు సంబంధించిన కీర్తిమాత్రం అద్భుతప్రజ్ఞ గల నీ ఈజిప్టు బానిసీంద్రదేలే. అక్కడి విందులను అనుభవించే ఆ జూలియస్ సీజర్ చియ్యబట్టాడని విన్నాను.

**ఆంటోనీ :** చాలా విశేషాలు విన్నావే?

**పాంపే :** ఇందులో నేనేమీ అపార్థాన్ని ఉద్దేశించలేదు.

**ఆంటోనీ :** అయితే తగ్గ పదాలను కూడా ప్రయోగించి ఉండవలసింది.

**పాంపే :** నేను ఇంతపాటిగానే విన్నాను. నేను విన్నది ఎప్పొలొడోరస్ మోసుకోవచ్చి –

**ఎనోబార్బస్ :** ఇక ఆ విషయాన్ని గురించి ఆపివేద్దాం. అవును, అతడలా చేశాడు.

**పాంపే :** ఏం చేశాడు? దయ ఉంచి సెలవీయాలి.

**ఎనోబార్బస్ :** మెత్తని మెత్తలో ఒక రాజ్ఞిని సీజర్ దగ్గిరికి[61] వీపుమీద మోసుకోవచ్చాడు.

**పాంపే :** నీవెవరవో నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చావయ్యా! ఏమయ్యా సైనికుడా! ఎలా ఉంటున్నావు?

**ఎనోబార్బస్ :** సుఖంగా ఉంటున్నాను. ఇంకా సుఖంగా ఉండగోరుతున్నాను – నాకంటిముందు రాబొయ్యే నాలుగు విందులు కనిపిస్తున్నాయి.

**పాంపే :** ఏదీ నీ కరచాలనం! నిన్ను నేనెన్నడూ అసహ్యించుకోలేదు. నీ యుద్ధ ప్రావీణ్యాన్ని ఈర్ష్యవహిస్తూ తిలకించాను.

**ఎనోబార్బస్ :** ప్రభూ! నేను మిమ్మల్ని పూర్వం ఎన్నడూ ప్రేమించలేదు. కానీ ఎన్నోమారులు ప్రస్తుతించాను. స్తుతించినప్పుడల్లా నాకు మీరు పదింతలుగా ప్రస్తుతికి యోగ్యులని అనిపించారు.

**పాంపే :** కాపట్యం లేని నీ కమనీయసంభాషణకు నాకు మహానందం కలుగుతున్నది. ఇది నీకు లోపం కాదు. నా నౌక మీదికి విందారగించను రమ్మని మిమ్మల్ని అందరినీ ఆహ్వానిస్తున్నాను. దారి చూపించండి.

**సీజర్, ఆంటోనీ, లెపిడస్ :** మీరే దారి చూపించండి.

**పాంపే :** అయితే అనుసరించండి.

**(మెనాస్, ఎనోబార్బస్ తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

**మెనాస్ :** (అపవారితంగా) మీ జనకులు పాంపే అయితే ఇటువంటి సంధి చేసేవారు కారు – నీవూ, నేనూ పూర్వం కలుసుకొన్నామనుకొంటాను.

**ఎనోబార్బస్ :** సముద్రంమీద కలుసుకొన్నాం.

**మెనాస్ :** అవును.

**ఎనోబార్బస్ :** నీటిమీద నీవు మంచి ప్రావీణ్యాన్ని ప్రదర్శించావు.

**మెనాస్ :** నీవు నేలమీద మంచి ప్రజ్ఞను ప్రకటించావు.

**ఎనోబార్బస్ :** నేలమీద ప్రదర్శించిన ప్రజ్ఞకు నేను స్తుతియోగ్యుడను కానని తిరస్కరించను గాని, నన్ను స్తుతించి ఏ వ్యక్తినైనా నేను తిరిగి స్తుతించటానికి సంసిద్ధుణ్ణే.

**మెనాస్ :** సముద్రం మీద ప్రకటించిన ప్రావీణ్యానికి నేనూ స్తుతియోగ్యుడను కాదని అనను.

**ఎనోబార్బస్ :** భద్రతకోసం ఏదో ఒకటి ఒదులుకోవాలి కనుక – నీవు సముద్రాలమీద గొప్ప బందిపోటువు.

**మెనాస్ :** నీవు నేలమీద గొప్పదొంగవు.

**ఎనోబార్బస్ :** ఈ విషయంలో నాకు నేలమీద ప్రావీణ్యం ఉందని నేను అంగీకరించను. కానీ, మెనాస్, నీ హస్తమేదీ? మన కన్నులే పాలనాధికారం గలవైతే, ఇరువురు

దొంగలు మిత్రులౌతూ పరస్పరం ముద్దిడుకొనేటప్పుడు వారిని బందీలనుగా ఇప్పుడే పట్టుకోగలవు.

**మెనాస్ :** చేతులెటువంటివైనా వ్యక్తుల ముఖాలు వారి శీలాన్ని వ్యక్తీకరిస్తుంటాయి.

**ఎనోబార్బస్ :** మోసగించని ముఖంగల స్త్రీ ఒక్కతైనా ఉండదు.

**మెనాస్ :** నీవన్నది అభాండం కానే కాదు. అతివలు హృదయాలను అపహరిస్తారు.

**ఎనోబార్బస్ :** మేము నీతో పోరాడటానికని వచ్చాము.

**మెనాస్ :** కానీ, నా అభిప్రాయం చెప్పనా, అది తిని త్రాగటం క్రిందికి దిగింది. పాంపే ఈ నాడు తన అదృష్టంతో పరాచకాలాడుతున్నాడు.[62]

**ఎనోబార్బస్ :** అలా చేసి ఉన్నట్లయితే అతడెంతగా విలపించినా, తరువాత తప్పిపోయిన తన అదృష్టాన్ని తిరిగీ పొందలేడు.

**మెనాస్ :** మీరు సత్యం చెప్పారు. మార్క్ ఆంటోనీ ఇక్కడికి వస్తాడని మేము ఊహించలేదు. క్షమించండి. ఆయన క్లియోపాత్రాను వివాహమాడాడా?

**ఎనోబార్బస్ :** ఆయన పెళ్లాడింది క్లియోపాత్రాను కాదు. సీజర్ సోదరిని, ఆక్టేవియాను.

**మెనాస్ :** అది నిజం. ఆమె కెయస్ మార్సెల్లస్‌కు వెనుక భార్య కదూ?

**ఎనోబార్బస్ :** అయితే ఇప్పుడామె మార్కస్ ఆంటోనీయస్‌కు భార్య అయింది.

**మెనాస్ :** క్షమించాలి! నీవు చెప్పేది –

**ఎనోబార్బస్ :** సత్యం!

**మెనాస్ :** అయితే, ఆంటోనీ, సీజర్ స్థిరానుబంధం ఏర్పరచుకొన్నారన్న మాట!

**ఎనోబార్బస్ :** ఈ అనుబంధాన్ని గురించి జోస్యం చెప్పమని నన్నడిగితే ఇది స్థిరమైందని నేనను.

**మెనాస్ :** వివాహితుల అనురాగం కంటే ఈ పరిణయ విషయంలో రాజకీయ కారణాలు విశేషపాత్ర వహించాయని అనుకొంటాను.

**ఎనోబార్బస్ :** నేనూ అలాగే భావిస్తున్నాను. వారిరువురినీ మిత్రులనుగా కూర్చిన ఈ బంధమే వారి స్నేహానికి ఉరిత్రాడు[63] కావటం ఆనతికాలంలోనే నీవు చూడగలుగుతావు. ఆక్టేవియా పవిత్రురాలు. అతిశీతలస్వభావ, నిత్యవర్తనలో అతిస్తబ్ధ.

**మెనాస్ :** అట్టి స్త్రీ భార్యగా ఉండటాన్ని కోరుకోనివాడంటూ ఎవడైనా ఉంటాడా?

**ఎనోబార్బస్ :** ఉండకేం? ఆ స్వభావాలు లేనివాడు అట్టి వనితను భార్యగా కోరుకోడు. మార్క్ ఆంటోనీ అటువంటి వ్యక్తి. అతడు తిరిగీ తన ఈజిప్టు వంటకం దగ్గరికే చేరుకొని తీరతాడు. అప్పుడు ఆక్టేవియా వేడినిట్టూర్పులు సీజర్ శరీరంలోని రక్తోష్ణమను సంధుక్షణం చేస్తాయి. ఇందాక నేనన్నట్లు నేటివారి స్నేహబలమే తరువాత ప్రబలవైరానికి కారణమౌతుంది. ఆంటోనీ తన ప్రేమ ఎక్కడ ఉందో అక్కడనే సుఖిస్తాడు. ఒక రాజకీయ కారణంవల్ల ఇక్కడ వివాహమాడాడు. అంతే!

**మెనాస్ :** అవును. అలాగే జరగవచ్చు. రా. నౌక మీదికి రావా? నీ ఆరోగ్యానికి నేనో పానీయాన్ని నిర్దేశిస్తాను.

**ఎనోబార్బస్ :** నీవు నిర్దేశించిన పానీయాన్ని నేను తప్పక సేవిస్తాను. ఈజిప్టులోని మధుసేవల్లో మా గొంతుకలకు మహోఘనంగా పని కల్పించాము.

**మెనాస్ :** రా. వెళ్లుదాము.

**(నిష్క్రమిస్తారు)**

## ఏడో దృశ్యం

**సంగీతం వినిపిస్తుంటుంది. ఒక వంటకంతో ఇద్దరో, ముగ్గురో సేవకులు ప్రవేశిస్తారు.**

**ప్రథమసేవకుడు :** ఒరేయ్, వాళ్లిక్కడే ఉంటారు. వారిలో కొందరి అడుగులు అప్పుడే తడబడుతున్నాయి. చిన్న చిరుగాలి వీస్తే చాలు, చిత్తుగా పడిపోతారు.

**ద్వితీయ సైనికుడు :** తాను త్రాగిన ద్రాక్షవల్ల లెపిడస్ ఎఱ్ఱవారిపోయినాడు.

**ప్రథమ సేవకుడు :** ఆసవశేషాన్ని[64] కూడా అతని చేతనే త్రాగించారు.

**ద్వితీయ సైనికుడు :** విలాసోత్సాహంలో వారు ఒకరిభాగాలను మరొకరికి పోస్తూ నిర్బంధ పెడుతున్నప్పుడు, అతడు 'ఇక చాలు. వద్దు!' అని కేకలు పెట్టాడు. అయితే వారి ప్రార్థనలను ఒకవంక తిరస్కరిస్తున్నా మరోవంక సహ్రవతు లిరువురి మధ్య శాంతిని సంధించటం కోసం అతడు తప్పతాగాడు.

**ప్రథమ సైనికుడు :** కానీ ఇది అతనికీ, అతని నిర్ణయానికీ మధ్య పెద్దయుద్ధాన్ని తెచ్చి పెట్టింది.

**ద్వితీయ సైనికుడు :** గొప్పవారిలో ఒకడని పేరుపొందటానికి పాటుపడుతుంటే కలిగే ఫలితాలలో ఇదొకటి. ప్రయోగించను పనికిరాని నేజా[65]మీద ఆధారపడటం కంటే నేను ఒక గడ్డిపోచమీద ఆధారపడతాను.

**ప్రథమసేవకుడు :** నక్షత్రమండలంలో ఒక గ్రహంగా ఉండికూడా సంచారం లేకపోవటం, కపోలాల సౌందర్యాన్ని చెరుస్తూ ఉండే గ్రుడ్డు లేని లొత్తలను పోలి ఉంటుంది.

తుత్తారధ్వని వినిపిస్తుంది. సీజర్, ఆంటోనీ, లెపిడస్, అగ్రిప్పా, మెకయ్‌నాస్, ఎనోబార్బస్, మెనాస్, ఇతర సేనాపతులతో ప్రవేశిస్తారు.

**ఆంటోనీ :** (సీజర్‌తో) వారు అలాగే చేస్తుంటారు. నైలునదిని కొలవటానికి వారు పిరమిడ్లమీద కొలతలు పెట్టారు. ఆ నదీవృద్ధి అల్పమో, మధ్యస్థమో వాటిమూలంగా తెలుసుకొని దేశానికి దుర్భిక్షమో, సుభిక్షమో నిర్ణయిస్తుంటారు. నైలు అధికంగా వస్తే అది సస్యసమృద్ధిని తెలియచేస్తుంది. పోటు తగ్గంగానే కర్షకుడు నది విడిచిపోయిన ఒండు మట్టిమీద విత్తుతాడు. తరువాత అతడికి అధికశ్రమ లేకుండానే పంట పండుతుంది.

**లెపిడస్ :** అక్కడ మీకు విచిత్రమైన సర్పాలు లభ్యమైనాయట!

**ఆంటోనీ :** అవును లెపిడస్!

**లెపిడస్ :** మీ ఈజిప్టు సర్పం మీ సూర్యతేజంవల్ల ఒండుమట్టిలో పుట్టిందట! మీ మొసలికూడా అలాంటిదే అని విన్నాను.

**ఆంటోనీ :** అవును. అవి రెండూ అలాటివే.

**పాంపే :** ఆసనాలను స్వీకరిద్దాము. కొంత పానీయాన్ని సేవిద్దాము. లెపిడస్ ఆరోగ్యం కోసం!

**లెపిడస్ :** నేను ఉండవలసినంత బాగాలేను. కానీ మధుసేవలో లొంగిపోను.

**ఎనోబార్బస్ :** నిద్రపట్టేదాకా అంతవరకూ మధుగోష్ఠిలో పాల్గొంటారు.

**లెపిడస్ :** టోలమీలు[66] నిర్మించిన పిరమిడ్లు మహాద్భుతమైనవని విన్నాను. వాటి విషయంలో ఏ వంక నుంచీ విభిన్నాభిప్రాయం వినిపించలేదు.

**మెనాస్ :** (పాంపేతో - అపవారితంగా) పాంపే మహాశయా! ఒకమాట!

**పాంపే :** (అపవారితంగా - మెనాస్‌తో) నింపాదిగా చెవిలో చెప్పు. ఏమిటిది?

**మెనాస్ :** (పాంపేతో - అపవారితంగా) మీ ఆసనాన్ని విడిచి ఒక్కమారు లేచిరండి, మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఒక్క మాట విని పొండి.

**పాంపే :** (అపవారితంగా -మెనాస్‌తో) వస్తున్నాను. ఒక్క క్షణకాలం క్షమించు. ఈ ద్రాక్షాసవం లెపిడస్ ఆరోగ్యం కోసం!

**లెపిడస్ :** మీ మొసలి ఎటువంటిది?

**ఆంటోనీ :** దాని ఆకారం దాని ఆకారంలాగానే ఉంటుంది. అది ఎంత వెడల్పో దాని వెడల్పు అంత. అది ఎంత ఎత్తో దాని ఎత్తు అంత. అది దాని అవయవాలతోనే సంచరిస్తుంది. దానికి ఏది బలవర్ధకమైన ఆహారమో దానిమీదనే అది జీవిస్తుంది. కానీ దాని ప్రధానద్రవ్యాల్లో అణుమాత్రం మార్పు వచ్చినా అది మరోజంతువుగా[67] మారిపోతుంది.

**లెపిడస్ :** దాని రంగు ఎలా వుంటుంది?

**ఆంటోనీ :** దాని రంగు లాగానే.

**లెపిడస్ :** అయితే అది చాలా విచిత్రమైన జంతువు!

**ఆంటోనీ :** అవును. నీవన్నట్లే. కానీ దాని కన్నీళ్లలో తేమ ఉంది.

**సీజర్ :** అతడికి నీ ఈ వర్ణనవల్ల ఏమైనా తృప్తి కలిగిందా?

**ఆంటోనీ :** అది తృప్తిని కలిగించకపోతే అతని ఆరోగ్యం కోసం పాంపే ఇస్తున్న ఈ ఆసవం తృప్తిని కలిగిస్తుంది. లేకపోతే ఇక అతడికి తృప్తిని కల్గించటం అసాధ్యం.

**పాంపే :** (మెనాస్‌తో అపవారితంగా) నాశనం కానివ్వు! ఎల్లా పోతే అలా పోనీ! అది నాకెందుకు చెపుతావు? నేను నిన్ను ఆజ్ఞాపించినట్లు చెయ్. - లెపిడస్ కోసం నేనాజ్ఞాపించిన చషకమేది?

**మెనాస్ :** (పాంపేతో – అపవారితంగా) మీ యెడ నాకు గల ప్రభుభక్తిని పురస్కరించుకొని నేను చెప్పేది వినండి.

**పాంపే :** (మెనాస్‌తో అపరివారితంగా) నీవు ఉన్మత్తుడవౌతున్నా వనుకొంటాను. విషయ మేమిటి? (లేచి ప్రక్కకు వెళ్ళుతాడు.)

**మెనాస్ :** నేను మిమ్మల్ని నిరంతరం భక్తితో అనుసరించిన అనుచరుణ్ణి.

**పాంపే :** అవును. నీవు నన్ను మహాభక్తితో సేవించావు. చెప్పదలచిన విషయం ఇంకా ఏమైనా ఉందా? (ప్రభువర్గాన్ని ఉద్దేశించి) క్షమించండి. క్షణకాలం మీకు దూరుణ్ణి అవుతున్నాను. ఈ విలాసాన్ని మీరు కొనసాగిస్తుండండి.

**ఆంటోనీ :** లెపిడస్! క్షణక్షణం మారే ఈ నిలకడ లేని పులినాలల్లో నుంచీ నీ ఆత్మనౌకను రక్షించుకో!

**మెనాస్ :** మీరు సర్వప్రపంచాధినేతలు కాదలిచారా?

**పాంపే :** అంటే నీ అభిప్రాయం?

**మెనాస్ :** మీరు సర్వప్రపంచ పాలకులు కాదలిచారా? అంటే అప్పటిరాజ్యం ఇప్పటిదానికి ఇంకా రెండింతలు.

**పాంపే :** అలా జరగటానికి అవకాశం ఎలా కలుగుతుంది?

**మెనాస్ :** మీకు అటువంటి భావం కలిగితే చాలు. మిగిలినదంతా నాకు వదిలెయ్యండి. నన్ను గురించి 'వీడు అల్పు'డన్న భావం మీకుంటే ఉండవచ్చు కానీ నేను సర్వప్రపంచాన్నీ మీకివ్వగల సమర్థుణ్ణి.

**పాంపే :** చెడత్రాగినట్లున్నావు నీవు.

**మెనాస్ :** లేదు. పాంపే మహాశయా! లేదు. లేదు. చషకానికి చాలా దూరంగా ఉండిపోయాను. సాహసిస్తే మీరు భూమండలాని కంతటికీ జౌదేవత[68] లౌతారు. మీరు కోరుకొంటే సముద్రవేష్టితమైన సర్వం, లేదా ఆకాశం ఆచ్ఛాదించిన అఖిలం మీదౌతుంది.

**పాంపే :** ఎలాగో తెలియజెయ్!

**మెనాస్ :** ప్రపంచ సర్వస్వానికీ భాగస్వాములైన ఈ ముప్పురూ మీ నౌకలో ఉన్నారు. ఓడ త్రాళ్ళను తెగగోస్తాను. సముద్రంమీద అది పయనిస్తూ ఉండగా పైబడి అందరి

కుత్తుకలనూ ఉత్తరిద్దాం. విలాసోపభోగాలల్లో ఇక్కడ మునిగి తేలుతున్న వీరందరూ ఇప్పుడు నీ ఆధీనంలో ఉన్నారు.

**పాంపే :** ఓహో! చెప్పకుండానే దీన్ని నీవు చేసి ఉండాల్సింది. నీవే చేసి ఉన్నట్లయితే ఘనమైన ప్రభుసేవ అయ్యేది. నేను నిర్వర్తించే సర్వకృత్యాలూ నా గౌరవాన్ని అనుసరించి నడుస్తుంటాయి. లాభాన్ని అవి లెక్కింపవు. నీవు ఉద్దేశించిన పనిని నిర్వర్తించనీయ కుండా అడ్డుపడి, నీ నోరు ఎప్పుడూ ముందుగా బయటపడుతున్నది. అందుకు పరితపించు. తెలియజేయకుండానే నీ వొకపనిని చేయటం, తరువాత నేను మంచిపని చేశావని గమనించటం మంచిదై ఉండేది. చేయకుండానే ఒక కార్యాన్ని ముందుగా నాకు తెలియచేశావు. కనుక నేను దాన్ని ఖండించక తప్పదు. ఇక ఈ అభిప్రాయాన్ని వదలి పాపగోష్ఠిలో పడిపో!

**మెనాస్ :** (స్వగతం) ఇలా చేసినందుకు అవరోహణక్రమాన్ని అనుసరిస్తున్న అదృష్టంగల నీకు ఇంక నేను అనుచరుణ్ణిగా నిలువలేను. ఇచ్చినప్పుడు పుచ్చుకోలేనివాడికి తరువాత ఏదీ ఎంత వెదికినా దొరకదు.

**పాంపే :** ఈ చషకాన్ని లెపిడస్ సంక్షేమంకోసం సేవిస్తాను.

**మెనాస్ :** ఎనోబార్బస్! ఇదే నా స్వాగతం!

**పాంపే :** అంచులు నిండేటంతవరకూ ఈ చషకాన్ని నింపు.

**ఎనోబార్బస్ :** (లెపిడస్‌ను మోసుకుపోతున్న సేవకుణ్ణి చూపిస్తూ) వాడు మహాబలశాలిలా ఉన్నాడు.

**మెనాస్ :** ఎందువల్ల అలా అన్నావు?

**ఎనోబార్బస్ :** చూడటం లేదా? వాడు ప్రపంచంలోని తృతీయభాగాన్ని మోసుకుపోతున్నాడు.

**మెనాస్ :** అంటే ప్రపంచంలో తృతీయభాగం తప్పత్రాగిందన్నమాట. సర్వం ఇలానే త్రాగితే అది చక్కగా సాగిపోతుంది.

**ఎనోబార్బస్ :** అయితే నీవు కూడా కానివ్వు. ప్రపంచభ్రమణాన్ని వృద్ధి చెయ్!

**మెనాస్ :** వద్దు. వెళ్ళిపోదాము.

**పాంపే :** ఇంకా ఇది అలెగ్జాండ్రియా విందని[69] అనిపించుకోదు.

**ఆంటోనీ :** అనతికాలంలో అలాగే పరిణమించబోతున్నది. ఎవరక్కడ? ఈ ద్రాక్షారసపాత్రల మూతలు విప్పండి. ఇది సీజర్ సంక్షేమం కోసం.

**సీజర్ :** అవసరం లేనప్పుడు నేను ఆసవసేవనం చెయ్యకుండా ఉండగలను. నా మేధను మధువుతో కడిగితే అది మరింత మాలిన్యాన్ని పొందుతుంది.

**ఆంటోనీ :** కాలానికి పసిబిడ్డలా కట్టుబడిపో!

**సీజర్ :** 'దాన్ని కట్టుబాటులో పెట్టి అధికారివి కా' అని నేనంటాను. ఇంత అధికంగా ఒకరోజు మధుసేవ చేయటం కంటే నాలుగు దినాలు త్రాగకుండా ఉపవసించటం నాకిష్టం.

**ఎనోబార్బస్ :** ఓహో వీరసమ్రాట్! (ఆంటోనీతో) మనం ఈజిప్టు[70] బాకస్ విలాసాలను ఆరంభించి మన ఈ పానగోష్ఠికి మహోత్సవస్థితిని కల్పిద్దామా?

**పాంపే :** వీరోత్తమా! అలాగే! ఒకరి హస్తాలను మరొకరం అందు కొందాము. మనం సేవించే పానీయంమీద విజయం చేకొని సుతిమెత్తగా మనం సాంసారికబాధ్యతలను మరిచిపోయేటట్లు నేలను తట్టుదాం.

**ఎనోబార్బస్ :** మనమందరం చేతులు కలుపుదాం. నేను మిమ్మలినందరినీ ఒక క్రమంలో నిలిపేటంతవరకూ వాద్యసంగీతం వినిపిస్తుంది. తరువాత కుఱ్ఱవాడు పాట ప్రారంభిస్తాడు. ప్రతి ఒక్కరూ కంఠమెత్తి తారస్థాయిలో అనాలి.

వాద్యసంగీతం వినిపిస్తుంటుంది. ఎనోబార్బస్ ఒకరిచేతితో ఇంకొకరి చేతిని పట్టిస్తాడు.

**గేయం**

**రా రా రా ద్రాక్షారాజ!!**
**రావయ్యా బాకస్ ప్రభు!**
**అరమూసిన కన్నుల[71]తో**
**తరలిరమ్ము స్థూలకాయ      రా రా రా!**

**నీ ద్రాక్షాద్రోణులపై**
**నిలుచుగాక మీ చింతలు**
**మాకురులకు నీ ద్రాక్షల**
**మహిత వేష్టనము లొనర్ప      రా రా రా!**

**చషకముపై చషక మిమ్ము**
**జగము తిరుగునందాకా**
**జగ మొరిగెడు నందాకా**
**చషకముపై చషక మిమ్ము** **రా రా రా**

**సీజర్ :** ఈ నాటికి చాలిద్దామా? పాంపే! సునక్తం. ప్రియసోదరా! నిన్ను కూడా రమ్మని ప్రార్థించవచ్చునా? తీవ్రతరమైన మన కార్యక్రమం ఈ విలాసప్రియత్వాన్ని విపరీతంగా కోపిస్తున్నది. ఉదాత్తప్రభువులారా! ఇక మనం నిష్క్రమిద్దాం. ద్రాక్షాసవంతో మన పుక్కిళ్ళు పొర్లి ఎర్రవారాయి. ఎనోబార్బస్! మహాసత్త్వుడైనా అతడు ద్రాక్షాసవానికి తల ఒగ్గాడు. నా నాలుక తడ బడుతున్నది. త్రాగుడు వల్ల కలిగిన విపరీతస్థితి మన అందరినీ పరిహాసకులను చేస్తున్నది. ఇంకా చెప్పటమెందుకు? సునక్తం. ఆంటోనీ మహాశయా! ఏదీ నీ హస్తం?

**పాంపే :** ఆసవవిషయంలో నీ ఉపవాస మేమిటో దాన్ని తీరభూమిమీద పరీక్షిస్తాను.

**ఆంటోనీ :** తప్పక అలాగే పరీక్షించవచ్చు. నీ హస్తమేదీ?

**పాంపే :** ఆంటోనీ, నీవు మా జనకుల గృహాన్ని ఆక్రమించావు. అయితేనేం లే, మనం మిత్రులం. నౌకలోకి రా.

**ఎనోబార్బస్ :** పడిపోతారేమో జాగ్రత్త!

**(ఎనోబార్బస్, మెనాస్ తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

మెనాస్! నేను తీరంమీదికి వెళ్ళను.

**మెనాస్ :** వద్దు. వెళ్ళవద్దు. నా కక్ష్యలోకి వెడదాం. ఇంతటి గొప్పవారు నిష్క్రమిస్తుంటే ఈ దుందుభులు, తుత్తారలు, సుషిరాలు అన్నీ ఇంత నిశ్శబ్దంగా ఉన్నవేం? ఈ ఘనులైనవారికి నెప్ట్యూన్‌కు[72] వినపడేటట్లు మనం వీడ్కోలు వినిపిద్దాం. దుందుభులు, తుత్తారలు, సుషిరాలు మ్రోయించండి. సంగీతాన్ని వినిపించటానికి ఇంత ఆలస్యం చేసినందుకు మీరు మహాదోషులు. కానివ్వండి. (తుత్తార ధ్వనులు, దుందుభిస్వనాలు వినిపిస్తాయి.)

**ఎనోబార్బస్ :** హో! అతడెంత బాగా ప్రతిధ్వనిస్తున్నాడు. ప్రభూ! ఇదుగో నా కుళాయి.

**మెనాస్ :** ఉదాత్తసేనానీ! వచ్చేయ్!

**(నిష్క్రమిస్తారు)**

# తృతీయాంకం

## ఒకటో దృశ్యం

సిరియాలో ఒక మైదానం. వెంటిడియస్, జయోపేతునివలె సిలియస్, ఇతర రోమను ఉద్యోగులు, సైనికులతో ప్రవేశిస్తారు. పాకోరస్ [73]కళేబరం తీసుకోరాబడుతుంది.

**వెంటిడియస్ :** పార్థియా! ఎల్లప్పుడూ నీ బల్లాలు ఇతరులను పొడిచేవి. ఇప్పుడు నిన్నే పొడుస్తున్నవి[74]. మార్కస్ క్రాసస్ మరణంకోసం అదృష్టదేవత ఇప్పుడు నన్ను సాధనంగా ఉపయోగించి, ప్రతీకారాన్ని తీర్చుకోవటానికి ఇచ్ఛయిస్తున్నది. ఆ రాజకుమారుడి కళేబరాన్ని మన సైన్యాంతికానికి తీసుకోరండి. ఓర్డిస్! మా మార్కస్ క్రాసస్ మరణానికి నీ కుమారుడు ఈ రీతిగా బదులు చెల్లించుకొన్నాడు.

**సిలియస్ :** ఉదారా, వెంటిడియస్! నీ కౌక్షేయంమీది పార్థియస్ రక్తపుతడి ఇంకా ఆరకముందే కాందిశీకులై పారివచ్చిన పార్థియన్లకు ఆశ్రయమిచ్చే ఆ మిడియా, మెసపొటేమియాల మీదకు కూడా సైన్యాన్ని నడిపించు. మన సేనాధినేత ఆంటోనీ నిన్ను రథారోహుణ్ణి చేసి ఉత్సవాలు జరిపించి శిరోమాలాలంకృతుణ్ణి చేస్తాడు.

**వెంటిడియస్ :** సిలియస్! ఇప్పటికే మించి వ్యవహరించాను. ఒక విషయం గమనించు. తక్కువస్థాయిలో ఉన్నవారికి గొప్ప పనులు చేయటానికి అవకాశాలెన్నయినా ఉన్నవి. మనం సేవించే యజమాని దగ్గిర లేనప్పుడు, సిలియస్, తెలుసుకో, నిర్వర్తించే కృత్యాలవల్ల కలిగే ఘనకీర్తిని పొందటం కంటే, ఆ పనులవంకకు పోకుండా ఉండటం శ్రేయస్కరం. సీజర్, ఆంటోనీ ఇరువురూ స్వయంగా కాక వారి ఉద్యోగుల మూలంగా విశేషకీర్తి నార్జించారు. ఆంటోనీ ప్రతినిధుల్లో సొర్సియస్ ఒకడు. సిరియాలో ప్రతిక్షణం వీరకృత్యాలెన్నెన్నో చేసి అతివేగంగా అతిశయమైన ప్రశస్తి నార్జించాడు. కాని అతడు ఆంటోని అనురాగాన్ని కోల్పోయాడు. ఎవడైతే రణరంగాలలో తన సైన్యాధినేతను అతిశయిస్తాడో, అతడు తన సైన్యాధినేతకు నేత కాగలడు. ఉన్నదానికంటే ఉన్నతస్థితిని ఆశించటం సైనికుడికో ఉత్తమగుణమైనా, తన కీర్తిని ఆచ్ఛాదితం చేసేదాన్ని చేయటం కంటే నష్టానికే ఇష్టపడతాడు. ఆంటోనీకి మేలును చేకూర్చేదాన్ని ఎంతైనా చేయగలను. అయితే అందువల్ల అతనికి కోపం వస్తుంది. కనుక అతడికి కోపం తెప్పించే నా ఘనకృత్యాలను జనం గమనించకపోవటమే నాకు క్షేమం.

**సిలియస్ :** వెంటిడియస్! నీకెంతటి పరిజ్ఞానముంది! ఇది లేకపోతే సైనికుడికీ, అతని ఖడ్గానికీ గల తారతమ్యం వ్యక్తం కానే కాదు. నీవు ఆంటోనీకి లేఖ వ్రాస్తున్నావా?

**వెంటిడియస్ :** యుద్ధవేళల్లో ఇంద్రజాలంలా పనిచేసిన ఆయన నామసహాయం వల్ల నేను కలిగింపగలిగిన భయోత్పాత విషయాన్ని సవినయంగా నీకు నివేదిస్తున్నాను. ఆయన ధ్వజాలతో ప్రవేశించి, సంతృప్తికరాలైన భృత్యాలిచ్చి ఆయన పోషించిన సైన్యాలను మేము నడిపించి ఉండకపోతే, ఎన్నడూ దెబ్బతినటమంటే ఏమో ఎరగని ఆ పార్థియా ఆశ్వికదళాన్ని రణభూమి నుంచీ పనికిమాలిన గుర్రపుతట్టులా తరిమివేయగలిగి ఉండేవాళ్లం కాదని నీకు నివేదిస్తున్నాను.

**సిలియస్ :** అయితే అతడిప్పుడెక్కడున్నాడు?

**వెంటిడియస్ :** ఏథెన్సుకు[75] వెళ్లుదామని ఉద్దేశపడుతున్నాడు. మన వెంటున్న సంభారందృష్ట్యా ఎంతటి పాలును వేగంగా వెంట తీసుకోవెళ్లే అవకాశముందో యోచించి, దానితో మనం ఆయనముందు నిలిచి కనిపిద్దాం. తరలించు. బయలుదేరుదాం పద.

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

**రోము మహానగరం. సిజర్ సౌధంలో ఒక ముందరిగది. అగ్రిప్పా ఒక ద్వారాన, ఎనోబార్బస్ మరొక ద్వారాన ప్రవేశిస్తారు.**

**అగ్రిప్పా :** ఏమిటి? సోదరులిద్దరూ వెళ్ళిపోయినారా?

**ఎనోబార్బస్ :** పాంపేతో వ్యవహారాన్ని ముగించుకొన్నారు వారు వెళ్ళిపోయారు. మిగిలిన ముగ్గురూ[76] సంధిపత్రాలను ముద్రాంకితం చేస్తున్నారు. రోమును విడిచిపెట్టి వెళ్ళేటప్పుడు ఆక్టేవియా కన్నీరు కార్చింది. సోదరి ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నందుకు సీజర్ చింతాక్రాంతుడైనాడు. పాంపే ఇచ్చిన విందునాటినుంచీ లెపిడస్ పాండిమమనే వ్యాధితో బాధపడుతున్నట్లు మెనాస్ తెలియజేశాడు.

**అగ్రిప్పా :** (ఎత్తిపొడుపుగా) లెపిడస్ మహోదాత్తుడు!

**ఎనోబార్బస్ :** చాలామంచివాడు. పాపం! అతడు సీజర్‌ను ఎంత దొడ్డగా ప్రేమిస్తున్నాడు!

**అగ్రిప్పా :** అంతే కాదు. అతడు ఆంటోనీని ఇంకా ఎంతో దొడ్డగా ప్రేమిస్తున్నాడు!

**ఎనోబార్బస్ :** ఇక సీజరా! మానవజాతిలో[77] జూపిటర్.

**అగ్రిప్పా :** మరి ఆంటోనీ జూపిటర్‌కు కూడా దేవత.

**ఎనోబార్బస్ :** సీజర్ గురించి మాటాడవలసివస్తే ఆయన నిరుపమానుడు.

**అగ్రిప్పా :** సీజర్ నిరుపమానుడైతే ఆంటోనీ అరేబియా విహంగము.[78]

**ఎనోబార్బస్ :** సీజర్‌ను నీవు ప్రశంసింపదలిస్తే సీజర్ అని మాత్రమే చెప్పు. ఇంకేమీ చెప్పకు.

**అగ్రిప్పా :** లెపిడస్ వీరిద్దరినీ తుల్యంగా స్తుతిస్తాడు.

**ఎనోబార్బస్ :** కానీ అతడు సీజర్‌ను అధికంగా ప్రేమిస్తాడు. అయినప్పటికీ ఆంటోనీని కూడా ప్రేమిస్తుంటాడు. లెపిడస్ ఆంటోనీని ఎంత గాఢంగా ప్రేమిస్తుంటాడో హృదయాలు భావించలేవు. నాలుకలు పలుకలేవు. వ్రాయసగాండ్రు వ్రాయలేరు. గాయనులు గానం చెయ్యలేరు. కవులు ఛందోబద్ధం చెయ్యలేరు. ఆహా! అతడికి ఆంటోనీమీది ప్రేమ! కానీ సీజర్‌మీద అతనికున్న ప్రేమకు కుంచితులై జనం విస్తుపోతారు. ఆ ప్రేమగాఢతకు మీరూ ఆశ్చర్యపడి పోతుంటారు.

**అగ్రిప్పా :** అతడు ఇద్దర్నీ ప్రేమిస్తుంటాడు.

**ఎనోబార్బస్ :** వారు అతనికి రెక్కలు. అతడో బృహత్కీటకం. (లోపల తుత్తారధ్వనులు వినిపిస్తవి) అవిగో! నన్ను అశ్వాన్నధిరోహించమని అవి సూచనలు. ఉదాత్తుడా! అగ్రిప్పా! మరి సెలవు.

**అగ్రిప్పా :** యోగ్యసైనికుడా! శుభమగుగాక! ఇదే నా వీడ్కోలు.

**సీజర్, ఆంటోనీ, లెపిడస్, ఆక్టేవియా ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** ఒక నీవు శ్రమపడకు. ఆగిపో.

**సీజర్ :** నా సోదరిని నీవు వెంట తీసుకొని వెళ్ళుతుండటంతో నీవు నాలోని అధికాంశాన్ని పట్టుకోపోతున్నావు. నా మీద నీకుగల గౌరవాధిక్యాన్ని ఆమెయెడ చూపే ప్రేమాధిక్యంగా ప్రకటించు. సోదరీ! నీవు ఎట్టి భార్యవుగా వర్తించాలెనని నేను భావించానో నీవు ఆంటోనీకి అట్టి భార్యవై వర్తించు. 'నీవు అట్టిభార్యవే' నని తప్పక నిరూపిస్తావని నేను

ప్రతిజ్ఞ చేయగలను. మహోదాత్తుడా ఆంటోనీ! ఆమెయెడ మన ఉభయులకూ ప్రేమలేకపోతే, ఈమె అనే సాధనం లేకుండా మనం ఎంతో అధికంగా అన్యోన్యమైత్రిని కలిగి ఉండేవాళ్ళం. కాబట్టి మన ఇరువురి స్నేహాన్నీ అనుబంధించి చిరకాలం నిల్పటానికి ఉద్దేశితైన ఈ పవిత్రమూర్తి, ఆ మన స్నేహసౌధాన్ని భగ్నం చేయటానికి కారణభూతురాలు కాకూడదు[79] సుమా!

**ఆంటోనీ :** అనుమానించి నాకు నీవన్యాయం చేస్తున్నావు.

**సీజర్ :** నేను చెప్పవలసిందేదో చెప్పాను.

**ఆంటోనీ :** నీవే విషయాన్ని గురించి ఇంతటి భయభావాన్ని వహిస్తున్నావో అందుకు నీవు చెప్పింది ఎన్నడూ కారణం కాబోదు. దేవతలు నీకు సర్వత్రా సాయపడుదురుగాక! నీ ఆశయ పరిపూర్తికి రోమనులు తోడ్పాటునిచ్చేటట్లు వారు దోహదమొనర్చెదరుగాక! సరే ఇక మనం విడిపోదాం!

**సీజర్ :** ప్రియసోదరీ! నీకిదే నా వీడ్కోలు. శుభమగుగాక! మీ యానవేళ జలాదిభూతకోటి మీకు కృపతో సహకరించుగాక! అవి మీకు మహోల్లాసాన్ని కల్పించుగాక! సోదరీ నీకిదే నా వీడ్కోలు!!

**ఆక్టేవియా :** ఉదాత్తసోదరా!

**ఆంటోనీ :** ఏప్రిల్ మాసంలోని తుషారంలాగా ఆమె కన్నులనిండా నీరు క్రమ్మింది. ఇది సోదరీప్రేమను వెల్లడించే వసంతం. ఏప్రిల్ తుషారాలే కదా వసంతాన్ని తెచ్చేది! ఆక్టేవియా! చింతను తొలగించెయ్యి.

**ఆక్టేవియా :** నా భర్తృగృహాన్ని భద్రంగా చూస్తుండండి, ఇంకా –

**సీజర్ :** ఆక్టేవియా! ఏమంటున్నావు? ఇంకా –

**ఆక్టేవియా :** నీ చెవిలో చెబుతాను.

**ఆంటోనీ :** ఆమె హృదయభావాలను పలకటానికి నాలుక తిరస్కరిస్తున్నది. ఆమె హృదయం నాలుకకే చెప్పలేని స్థితిలో ఉంది. వీడ్కోలు పుచ్చుకొనే ఈ సమయాన ఆమెలోని పరస్పర విరుద్ధాలైన హృదయోద్వేగాలు ఉన్నతాలైన ఆటుపోటులమీద నిశ్చలంగా వంచి నిలిపిన హంసపక్షాలలాగా చలనరహితత వహిస్తున్నవి.

**ఎనోబార్బస్ :** (అగ్రిప్పాతో అపవారితంగా) సీజర్! ఆపుకోలేక రోదించేటట్లున్నాడు.

**అగ్రిప్పా :** (ఎనోబార్బస్‌తో అపవారితంగా) మేఘం వర్షాగమనాన్ని సూచించేటట్లుగా ఆయన దుఃఖదృష్టి బాష్పవృష్టిని సూచిస్తున్నది.

**ఎనోబార్బస్ :** (అగ్రిప్పాతో అపవారితంగా) మొఖాన నల్ల మచ్చ[80] ఉంటే అశ్వమైనా కాకుండా మనుష్యుడు కావటం మరింత దోషం.

**అగ్రిప్పా :** (ఎనోబార్బస్‌తో అపవారితంగా) ఇంతెందుకు? ఎనోబార్బస్! మృతుడైన సీజర్‌ను చూచినప్పుడు ఆంటోనీ మచ్చను కలిగిఉండటమే కాదు గర్జించినట్లు రోదించాడు. ఫిలిప్పీ యుద్ధభూమిలో బ్రూటస్ హతుడైనప్పుడు ఆయన కోసం అతడు అందరికంటే అధికంగా దుఃఖించాడు.

**ఎనోబార్బస్ :** ఆ సంవత్సరం నిజంగా అతడు ర్హ్యూమ్ వ్యాధితో బాధపడుతుండేవాడు. మనసుపడి తాను నాశనం చేసిన బ్రూటస్ సందర్భంలో కూడా అతడు నాకు దుఃఖం పొంగిపొరలేదాకా రోదించాడు.

**సీజర్ :** వద్దు. ప్రియసోదరీ, ఆక్టేవియా! నీవు దుఃఖించకూడదు. నేను నిన్ను మరిచిపోతానని భయపడకు. నిరంతరం నేను నీ క్షేమవార్తలను యోజించటంలో కాలాన్ని గడవనీయను.

**ఆంటోనీ :** మన ప్రణయాలలో ఎవరిది బలవత్తరమైందో పరీక్షించుకొందాం. ఇలా రా. 'నిన్ను గాఢాలింగనం చేసుకొన్నాను. దేవతలు నీయెడ దయార్ద్రహృదయులగుదురు గాక!' అని శుభాకాంక్షలు పలికి నిన్ను నా బాహుబంధంలో నుంచీ ఒదిలి పెడుతున్నాను.

**సీజర్ :** సెలవు. సౌఖ్యపరంపరలు చేకూరుగాక!

**లెపిడస్ :** సమస్తనక్షత్రరాశులూ సంఫుల్లకాంతులతో మీ మార్గాన్ని తేజోవంతం చేసి సుగమం కావించుగాక!

**సీజర్ :** సోదరీ! ఇదే నా వీడ్కోలు! (ఆక్టేవియాను ముద్దు పెట్టుకొంటాడు)

**ఆంటోనీ :** ఇదే నా వీడ్కోలు!!

**(తుత్తారధ్వని వినిపిస్తుంది. నిష్క్రమిస్తారు.)**

## మూడో దృశ్యం

**అలెగ్జాండ్రియాలో క్లియోపాత్రాసౌధం.**
**క్లియోపాత్రా, ఛార్మియన్, ఐరాస్, ఎలెగ్జాస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** వాడు ఏడీ?

**ఎలెగ్జాస్ :** రావటానికి సగం భయపడుతున్నాడు.

**క్లియోపాత్రా :** ఛీ! వాడు భయపడటానికి తగ్గకారణం ఏమీ లేదు.

**వార్తాహరి పూర్వంలాగానే ప్రవేశిస్తాడు**

ఇక్కడికి రావయ్యా!

**ఎలెగ్జాస్ :** మహారాజ్ఞీ! ఉల్లాసంగా ఉన్నప్పుడు తప్ప ఆ హీరాడ్ జూరీ కూడా నీ ముఖంవంక తలెత్తి చూడలేదు. హిరాడ్ వంటి చిత్తోల్బణాలు నాకూ ఉండి ఉన్నట్లయితే ఎంతో బాగుండేది. ఆంటోనీ వెళ్లిపోయినతరువాత వాటిని ఎవరి మూలాన చలాయించేది? దగ్గరికి రావయ్యా!

**వార్తాహరి :** ఘనత వహించిన మహారాజ్ఞీ!

**క్లియోపాత్రా :** నీవు ఆక్టేవియాను చూచావా?

**వార్తాహరి :** అవును మహారాజ్ఞీ!

**క్లియోపాత్రా :** నీవు ఆమెను ఎక్కడ చూచావు?

**వార్తాహరి :** రోములో చూచాను, మహారాజ్ఞీ! సీజర్, ఆంటోనీ ఆమెను తమమధ్య నిల్చుకొని నడిపించుకుంటూ పోతుంటే చూచాను. చాలా సన్నిహితంగా ముఖాన్ని పరికించి చూచాను.

**క్లియోపాత్రా :** ఆమె నా అంత పొడగరేనా?

**వార్తాహరి :** లేదు మహారాజ్ఞీ!

**క్లియోపాత్రా :** ఆమె మాట్లాడుతుండగా విన్నావా? ఆమెది కీచుగొంతా? లేక పలుచని గొంతా?

**వార్తాహరి :** మహారాజ్ఞీ! విన్నాను. ఆమె కంఠం సన్ననిది.

**క్లియోపాత్రా :** అదేమంత మంచి విశేషం కాదులే[81]. ఆయన ఆమెను బహుకాలం ప్రేమించలేడు.

**ఛార్మియన్ :** ప్రేమించటమా? ఇసిస్‌మీద ప్రమాణం చేస్తున్నాను. అది అసంభవం!

**క్లియోపాత్రా :** నేనూ అలాగే భావిస్తున్నాను. ముద్ద గొంతుక. మరుగుజ్జు వేషం. ఆమె నడకలో హుందాతనం ఉందా? హుందాతనాన్ని గురించి నీకేమైనా పూర్వపరిచయం ఉంటే దాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని పోల్చి చెప్పు.

**వార్తాహరి :** ఆమె నడక ప్రాకుతున్నట్లుంటుంది. నడిచినా నిలిచినా ఒకేతీరుగా ఉంటుంది. ఆమెకు శరీరం మాత్రమే ఉన్నట్లుంటుంది. చైతన్యం ఉన్నట్లు తోచదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలున్న ఒక ప్రాణిలా కాకుండా ఒక ప్రతిమలా గోచరిస్తుంటుంది.

**క్లియోపాత్రా :** ఇది సత్యమేనా?

**వార్తాహరి :** కాకపోతే నాకు పరిశీలనపరిజ్ఞానం లేదన్నమాట!

**ఛార్మియన్ :** ఈ సమస్తమైన ఈజిప్టులోనూ పరిశీలనపరిజ్ఞానం ఉన్నవారు ముగ్గురు కూడా ఉండరు.

**క్లియోపాత్రా :** ఇతడు మంచి వివేకం కలవాడు. ఇప్పుడు నాకు బాగా అవగతమైంది ఆమెను గురించి నేను విశేషంగా భయపడవలసిన అగత్యం నాకేమీ లేదు. ఇతడికి మంచి వివేచనశక్తి ఉంది.

**ఛార్మియన్ :** అవును. వీడు అద్భుతమైన వివేచనశక్తి కలవాడు.

**క్లియోపాత్రా :** ఆమె వయస్సు ఏ పాటి ఉంటుందో ఊహించి చెప్పు.

**వార్తాహరి :** మహారాజ్ఞీ! ఆమె భర్తృహీన.

**క్లియోపాత్రా :** విధవా? ఛార్మియన్, గుర్తించావా? గుర్తించు!

**వార్తాహరి :** ఇప్పుడామెకు ముప్పది సంవత్సరాల వయస్సు ఉంటుందను కొంటాను.

**క్లియోపాత్రా :** ఆమె ముఖం ఎలాంటిదో నీ మనస్సుకు జ్ఞప్తి ఉందా? గుండ్రంగానే ఉందా?

**వార్తాహరి :** దోషంగా పరిగణిత మయ్యేటంతటి వర్తులంగా ఉంది.

**క్లియోపాత్రా :** అటువంటి ముఖం గలవారు సర్వసామాన్యంగా మందబుద్ధులు[82]గా ఉంటుంటారు. మరి ఆమె జుత్తు రంగో?

**వార్తాహరి :** గోధుమవన్నె. ఆమె నొసలు ఎంత లోతుగా ఉండటానికి వీలుంటుందో అంత లోతైంది.

**క్లియోపాత్రా :** ఇదిగో, ఈ సువర్ణం నీకు బహూకృతి. పూర్వం నీ యెడ నే ప్రదర్శించిన క్రూరతను నీ మనసులో పెట్టుకోకూడదు సుమా! నీతో నాకు తిరిగి పని ఉంది. నీవు అద్భుతమైన వ్యవహారదక్షుడివిగా కనిపిస్తున్నావు. వెళ్లి మళ్లీ ప్రయాణం చెయ్యటానికి సిద్ధపడు. ఇంతలో లేఖలు సిద్ధం చేయిస్తాను.

**(వార్తాహరి నిష్క్రమిస్తాడు)**

**ఛార్మియన్ :** వీడు చాలా మంచివాడులా కనిపిస్తున్నాడు.

**క్లియోపాత్రా :** అవును. నిజంగా మంచివాడు. ఇతడియెడ నేను మొదట చాలా మొరటుగా ప్రవర్తించినందుకిపుడు పశ్చాత్తాపచిత్త నౌతున్నాను. ఇతడు చెప్పినదాన్ని బట్టి నేను ఈర్ష్యపడవలసినంతగా ఆ జంతువులో ఏమీ ఉన్నట్లు కనిపించటంలేదు.

**ఛార్మియన్ :** ఏమీలేదు, మహారాజ్ఞీ!

**క్లియోపాత్రా :** ఈ వార్తాహరి హుందాతనాన్ని తప్పక ఒక వ్యక్తిలోనైనా చూచి ఉంటాడు. కాబట్టి అది ఇతడెరుగనిది కాదు.

**ఛార్మియన్ :** హుందాతనాన్ని ఈతడు చూచాడా, లేడా అన్న ప్రశ్నకు అవకాశమే లేదు. ఇసిస్ దేవతే ఇందుకు సాక్ష్యం. ఇతడు బహుకాలం మీ కొలువు చేసినవాడు కదా!

**క్లియోపాత్రా :** ఛార్మియన్! ఇతణ్ణి నేను మరొక విషయం ప్రశ్నించవలసి ఉంది. అయితే అది అంత ప్రధానమైంది కాదులే. నీవు ఈ వార్తాహరిని నేను లేఖలు వ్రాసుకొనేచోటికి తీసుకొని రా. సర్వం సుఖప్రదమౌగాక!

**ఛార్మియన్ :** సర్వం సుఖప్రదమౌతుందనే నేను మీకు దృఢంగా చెప్పగలను.

## నాలుగో దృశ్యం

**ఆంటోనీ గృహంలో ఒక కక్ష్య. ప్రవేశం ఆంటోనీ, ఆక్టేవియా.**

**ఆంటోనీ :** కాదు. కాదు. ఆక్టేవియా, ఇంతే కాదు. ఇంకా ఇటువంటివి ఎన్ని వేలైనా క్షమార్హాలే. అయితే అతడు పాంపేమీద నూతనయుద్ధాలు చేశాడు. తన ఇచ్ఛాపత్రాన్ని

వ్రాసి ప్రజలకు చదివి వినిపించాడు. నన్ను గురించి నసుగుతూ వారితో మాటాడాడు. గౌరవ ప్రతిపత్తులను ప్రకటిస్తూ నన్ను గురించి ప్రసంగించమని పరిస్థితులు బలవంతపెట్టిన సందర్భాలలో కూడా అతడు అతిశీతలరుజాగ్రస్త పదజాలంతో పలికాడు. నన్ను కీర్తించటానికి అత్యుత్తమ సమయం సంసిద్ధమైనప్పుడు, దాన్ని ఉపయోగించటానికి తిరస్కరించి నాలుక చివరనుంచి నన్ను గురించి ఏమేమో అనేశాడు. అంతే.

**ఆక్టేవియా :** ప్రియ ప్రభూ! ఇదంతా నమ్మకండి. నమ్మవలసివచ్చినా అన్నింటినీ మనస్సుకు పట్టించుకోకండి. ఒక వేళ మీ ఇరువురి మధ్యా ఇటువంటివి భేదమే సంభవిస్తే, మీ ఉభయుల క్షేమాన్ని అభ్యర్థిస్తూ ప్రార్థనలు చేసే నాబోటి అదృష్టహీన మధ్యవర్తినిగా ఉంటుంది. 'నా భర్తను అనుగ్రహించండి. నా సోదరుణ్ణి అనుగ్రహించండి' అని నేను దేవతలను ప్రార్థిస్తే నన్ను పరిహసిస్తారు. అవహేళనగా "నా సోదరుణ్ణి అనుగ్రహించండి" అని పెద్దగా తిరిగి ఉచ్చరించి నా ప్రార్థనను భంగపరుస్తారు. తొలుతగా 'నా భర్తకు విజయమగుగాక!' అని ప్రార్థించి, తిరిగీ 'నా సోదరుడికి విజయమగు గాక!' అని ప్రార్థిస్తే, ఒక ప్రార్థనతో రెండోదానిని భగ్నం చేసినట్లౌతుంది. ఈ రెంటికీ మధ్యస్థమైన మార్గం మరొకటి లేనే లేదు.

**ఆంటోనీ :** సాధుస్వభావా! ఆక్టేవియా!! ఏ పక్షాన్ని నీ అత్యుత్తమ ప్రణయం పోషించదలచిందో దాన్ని ఆ పక్షానికే ఆయత్తపడనీ! నా గౌరవాన్ని కోల్పోవట మంటే నన్ను నేను కోల్పోయానన్నమాట! నీ వాడనై పొందదగ్గ సర్వాన్నీ కోల్పోవటం కంటే నీ వాడిని కాకుండా ఉండటమే మేలు. అయితే నీవు నన్ను ప్రార్థించిన రీతిగానే వెళ్ళి మా ఇరువురి మధ్యా మధ్యవర్తిత్వాన్ని నెరపుదువుగాని. ఈ మధ్యకాలంలో నేను నీ సోదరుడికి అస్తంగతత్వాన్ని కల్గించే యుద్ధం కోసం సన్నాహపడతాను. ప్రయాణానికి త్వరపడు. మా మధ్య మధ్యవర్తిత్వాన్ని నెరపడమనే నీ కోరిక ఈ రీతిగా సిద్ధించినదౌతుంది.

**ఆక్టేవియా :** ప్రభూ! మీకు నేనెంతో కృతజ్ఞురాలిని. సర్వశక్తిమంతుడు జౌ[83] మీ ఇరువురికీ సంధానకర్త్రినైన నన్ను బలహీనను, అత్యబలను గావించుగాక! మీ ఇరువురిమధ్య యుద్ధాలు ప్రపంచాన్ని రెండు పక్షాలుగా ద్విధాకరిస్తాయి. ఈ రెండు ఖండాలమధ్య ఏర్పడే పగులును పూడ్చటానికి ఆ యుద్ధాలలో మృతులయ్యే మానవులను ఉపయోగించవలసి ఉంటుంది.

**ఆంటోనీ :** ఈ వైరం ఎక్కడ ఆరంభమైందో నీకు గోచరించగానే ప్రేమించటం మాని, ఆ పక్షాన్ని పరిత్యజించు. ఎందువల్లనంటే, మా ఇరువురి దోషాలూ తుల్యప్రణయాన్ని ప్రకటిస్తూ నీవు ఇరువురితో అనువర్తనగా మెలగేటంతటి సమానగుణాలను ఎన్నడూ వహించవు గనుక. ఇక నీవు నీ ప్రయాణానికి ఆయత్తపడు. కోరుకొన్న పరిచారకబృందాన్ని వెంటబెట్టుకొని వెళ్లు, వ్యయాలకని నీవు ఎంత కోరుకొంటావో అంతకు ఆజ్ఞాపించు.

**(నిష్క్రమిస్తారు)**

## ఐదో దృశ్యం

### ఆంటోనీ గృహంలో మరొక కక్ష్య

**ఎనోబార్బస్ :** మిత్రుడా ఇరోస్! వార్తలేమిటి?

**ఐరాస్ :** ఆంటోనీకి అతి విచిత్రమైన వార్తలందాయి.

**ఎనోబార్బస్ :** ఏమిటవి?

**ఐరాస్ :** సీజర్, లెపిడిస్ ఇరువురూ పాంపేమీద యుద్ధాలు చేశారట!

**ఎనోబార్బస్ :** ఇది పాతవార్తే. ఫలితమేమైందో తెలిసిందా?

**ఐరాస్ :** పాంపేమీద చేసిన యుద్ధాలలో అతణ్ణి ఉపయోగించుకొని, తరువాత ఆనతికాలానికే ఆ కార్యాలను నిర్వహించటం వల్ల కలిగిన కీర్తిని పంచుకోనీయలేదట! అంతటితో ఆగక అతడు పూర్వం పాంపేకు లేఖలు వ్రాశాడని నిందించాడట! ఏవో దోషారోపణలు చేసి అతణ్ణి బందీగా పరిగ్రహించాడట! అందువల్ల అదృష్టహీనుడైన ఆ మూడో త్రైకూటవీరుడు[84] బందీ అయినాడు. ఇక అతడికి విమోచన మృత్యువు వల్లనే.

**ఎనోబార్బస్ :** ఓ ప్రపంచమా! ఇక నీకు రక్షకులు ఇరువురే. ఇంతకు మించి లేరు. నీకున్న ఆహారాన్నంతటినీ ఈ ఇరువురు తిరగలిదిమ్మల మధ్య పడేయ్! ఒకదాన్ని ఒకటి ఒరుసుకొనేటట్లు తిరిగి అరగదీసుకొంటాయి. ఆంటోనీ ఎక్కడున్నాడు?

**ఐరాస్ :** ఉద్యానవనంలో, ఇలా తిరుగుతున్నాడు. తన ముందు కనిపించే చెత్తనంతటినీ తన్నిపారేస్తూ తిరుగుతున్నాడు. 'మందబుద్ధీ! లెపిడస్!' అని మధ్యమధ్య పెద్దపెట్టున

బొబ్బలు పెడుతున్నాడు. పాంపేను హత్యచేసిన లెపిడస్ ఉద్యోగి[84A] కుత్తుకను ఉత్తరిస్తానంటూ బెదిరిస్తున్నాడు.

**ఎనోబార్బస్ :** ఘనమైన మన నౌకాసైన్యం సముద్రం మీదికి వెళ్లటానికి సిద్ధపడ్డది.

**ఐరాస్ :** మనం సీజర్ కోసం ఇటలీకి వెళ్ళాలి. డొమిటియస్! నేను చెప్పవలసింది ఇంకా ఉంది. ప్రభువు ఆంటోనీ నిన్ను వెంటనే వచ్చి దర్శనం చేసుకోమన్నాడు. నేను నీకు చెప్పిన వార్తలను అన్నింటికీ తరువాత చెప్పి ఉండవలసింది.

**ఎనోబార్బస్ :** ఇంకా చెప్పవలసినవి అంత ప్రముఖమైనవి కాదనుకొంటాను. సరే కానీ. నన్ను ఆంటోనీ దగ్గరికి తీసుకోవెళ్లు.

**ఐరాస్ :** పద.

**(నిష్క్రమిస్తారు)**

## ఆరో దృశ్యం

**రోములో సీజరు గృహం, సీజర్, ఎగ్రిప్పా, మెకయ్‌నాస్ ప్రవేశిస్తారు.**

**సీజర్ :** రోమును అలక్ష్యం చేసి అలెగ్జాండ్రియాలో ఆంటోనీ ఇంతే కాదు, ఇంకా ఎంతో చేశాడు. విపణి ప్రదేశంలో వెండి మలామా చేసిన వేదికమీద ప్రజలందరి ఎదుటా అతడూ క్లియోపాత్రా బంగారపు ఆసందులను అధిష్ఠించారట! వారి పాదదేశాన, వారు నా తండ్రికి కలిగిన[85] కొమారుడని చెప్పే సీజరియన్, వారి ధర్మేతరసంతానం ఉపవిష్టులైనారట! అతడు ఆమెకు ఈజిప్టు రాజ్యాన్ని ఇచ్చివేశాడట! దక్షిణసిరియా, సిప్రస్, లిడియాలకు ఆమెను సర్వాధికారిణి అయిన రాజ్ఞినిగా అతడు ప్రకటించాడట! అతడి ప్రవర్తనరీతి అంతా ఈ ధోరణిలోనే ఉంది.

**మెకయ్‌నాస్ :** అతడు ఇదంతా చేసింది ప్రజల కన్నుల ఎదుటనేనా?

**సీజర్ :** అవును. వారికి వ్యాయామరంగభూమిగా ఉన్న ప్రజాప్రదేశంలోనే. అక్కడ తన కుమారులను రాజాధిరాజులని ప్రకటించాడు. అలెగ్జాండరుకు బృహన్మీడియా, పార్థియా, ఆర్మీనియాలను ప్రదానం చేశాడు. టోలమీకి సిరియా, సిలీసియా, ఫొనీషియాలను ప్రత్యేకించాడు. చంద్రదైవతమైన ఇసిస్ దుస్తులను ధరించి ఆ నాడామె ప్రజలకు దర్శనమిచ్చింది. ఇలా నూతనచంద్రదేవతలాగా ఆమె ఇంతకు పూర్వమే ఎన్నోమార్లు దర్శనమిచ్చిందట!

**మెకయ్‌నాస్ :** రోమన్ ప్రజల కిదంతా తెలియజేయండి.

**అగ్రిప్పా :** వారు ఆతని గర్వాహంకరణాన్ని గమనించి, అతనిపై తమకు గల సద్భావాన్ని మరల్చుకొంటారు.

**సీజర్ :** ప్రజలింతకుపూర్వమే ఇదంతా తెలుసుకొన్నారు. ఆతడు చేసిన దోషారోపణలు కూడా వారికి ఇప్పుడే అందాయి.

**అగ్రిప్పా :** ఆరోపణలు ఎవరిమీద?

**సీజర్ :** సీజర్‌మీద. అందులోని ప్రధానాంశాలు : సిసిలీలో సెక్టస్ పాంపేను హతమార్చిన తరువాత అతడికి రావలసిన భాగాన్ని నేను లెక్కగట్టి పంచి ఇవ్వలేదట! ఆ యుద్ధానికి తాను కొంత నౌకాదళాన్ని అప్పిస్తే దాన్ని నేను ఇంకా తిరిగి పంపలేదట! చివరి ఆరోపణ – మూడవ త్రైకూటవీరుడైన లెపిడస్‌ను సామ్రాజ్యతృతీయ భాగాధికారంనుంచీ పదచ్యుతుణ్ణి చేసి, అతని ఆదాయాన్నంతటినీ నన్నే ఉంచుకోమని చిరచిరలాడటం.

**అగ్రిప్పా :** ప్రభూ! ఈ ఆరోపణలకు సమాధానం చెప్పితీరవలసిందే!

**సీజర్ :** ఆ పని ఎప్పుడో జరిగింది. సమాధానాలతో వార్తాహరి వెళ్లాడుకూడాను. లెపిడస్ నిరంకుశుడు, క్రూరుడుగా పరిణమించాడనీ, అధికారాన్ని దుర్వినియోగం చెయ్యటంవల్ల జీవితవిపర్యాసానికి యోగ్యతను గడించాడనీ తెలియజేశాను. నేను జయించిన రాజ్యంలో భాగం ఇవ్వటానికి అంగీకరించాను. అదేరీతిగా అతని ఆర్మీనియాలోనూ, అతడు జయించిన ఇతరరాజ్యాలలోనూ భాగస్వామ్యమిస్తావా అని పృచ్ఛించాను.

**మెకయ్‌నాస్ :** అతడు ఇందుకు ఎన్నడూ లొంగడు!

**సీజర్ :** అయితే ఆ పక్షంలో అతడికి నేను కూడా లొంగను!

**అక్టేవియా పరివారంతో ప్రవేశిస్తుంది**

**ఆక్టేవియా :** సీజర్ మహాశయా! జయము. జయము!

**సీజర్ :** 'పతిపరిత్యక్తా!' అని నిన్ను సంబోధించవలసి వచ్చిందేమోనని నేనెంతో బాధపడుతున్నాను.

**ఆక్టేవియా :** అలా సంబోధించలేదు కదా! సంబోధించవలసిన అవసరం లేదు కూడాను.

**సీజర్ :** అయితే, మరి నీవు, ఇలా ఎందుకు ఎరుకపరచకుండా ఇక్కడికి వచ్చేశావు? నీవు సీజర్ సోదరివిలా రాలేదు. ఆంటోనీ పత్నికి హర్కారా జనంగా ఒక సైనికదళమైనా ఉండి తీరాలి. దర్శనమివ్వబోవటానికి ఎంతో ముందుగానే హయహేషలు ఆమె ఆగమనాన్ని తెలియజేయాలి. మార్గాన రెండువైపులా చెట్లు క్రిక్కిరియగా, తనపై ఎక్కిన జనభారాన్ని వహించి ఉండాలి. ఆశతో చూస్తూ నీ ఆగమనాన్ని గురించి పొందే ఉత్కంఠతో నిలిచి నిలిచి ఎంతకూ నీ దర్శనం కాకపోవటం వల్ల జనం మూర్ఛితులై పోవలసి ఉంది. నీ వెంటవచ్చే అసంఖ్యాక సైనికదళితమైన కెంధూళి ఆకాశకోటిని అధిరోహించవలసి ఉంది. కానీ నీవు రోముకు విపణికి వెళ్లే పల్లె యువతిలా వచ్చావు. మా ప్రణయాభిమానాన్ని ప్రకటించుకోటానికి ప్రతిబంధకాన్ని కల్పించావు. ప్రదర్శనావకాశాన్ని ఇవ్వకపోతే ఆ ప్రణయభావానికి అనుభూతే కలగదు. ప్రతి అంతస్తునా అధికాధికంగా ప్రణయస్వాగతాలను పలుకుతూ కడలిమీదా, నేలమీదా నీకు మేము ఎదురునడిచివచ్చి ఉండేవాళ్లం.

**ఆక్టేవియా :** ప్రియసోదరా! ఇక్కడికి ఇలా వెళ్ళమని నన్ను ఎవరూ నిర్బంధించలేదు. నేనే స్వయంగా బయలుదేరి వచ్చాను. మీరు యుద్ధసన్నాహాలు చేస్తున్నారన్న వార్త విన్న వెంటనే, మార్క్ ఆంటోనీ దానిని నా చెవిన వేశారు. నేను ఎంతో బాధపడ్డాను. ఆయనను అభ్యర్థించి మీ కడకు తిరిగివచ్చాను.

**సీజర్ :** అవును, అవును. అతని కామలౌల్యానికీ, అతనికీ మధ్యన నీవు అంతరాయంగా వున్నావు గనుక నీ అభ్యర్థనను అతడు తక్షణమే అంగీకరించి ఉంటాడు.

**ఆక్టేవియా :** ప్రభూ! అలా అనకండి.

**సీజర్ :** నేనాతనిమీద దృష్టిని నిల్పేఉన్నాను. అతడున్నచోటినుంచీ వచ్చే ప్రతినౌకవల్లా అతని వ్యవహారాలు నాకు తెలుస్తూనే ఉన్నవి. అతడిప్పుడెక్క దున్నాడు?

**ఆక్టేవియా :** ప్రభూ! ఏథెన్సులో ఉన్నాడు.

**సీజర్ :** కాదు. అపచరితసోదరీ! అతడు ఏథెన్సులో లేడు. కేవలశిరశ్చాలనం చేత క్లియోపాత్రా అతణ్ణి తన దగ్గిరికి వచ్చి వెయ్యమని ఆజ్ఞాపించింది. రాజ్యంలోని రాజులనందరినీ వారిద్దరూ ఇప్పుడు యుద్ధానికి సన్నద్ధులను చేస్తున్నారు. లిబియా రాజైన బోకస్‌ను, కపడోషియా రాజైన ఆర్కెలాస్‌ను, పాఫ్లగోనియా రాజైన అడల్లాస్‌ను, అరేబియా రాజైన మాల్కస్‌ను, పాంపే రాజును, జూరీ హీరాడ్‌ను, కొమెజీన్ రాజైన మిత్రడేటస్‌ను మీడీ, లైకోనియాల రాజులైన పొలెమన్, ఎమిన్‌టాస్‌లను – ఇంకా ఎందరెందరో రాజులను సమావేశపరిచారు.

**ఆక్టేవియా :** అయ్యో! పరస్పరం విద్రోహాన్ని తలపెట్టుకొన్న ఇరువురు స్నేహితులయెడ సమంగా హృదయప్రేమను పంచి ఇచ్చిన నేనెంతటి అదృష్టహీనను!

**సీజర్ :** ప్రియసోదరీ! నీకిదే నా స్వాగతం! నీయెడ ఇట్టి తప్పిదాన్ని కనులారా చూచేటంతవరకూ, అలసత్వంవల్ల ఇటువంటి ప్రమాదస్థితిలో నేను పడేటంతవరకూ, అతనితో యుద్ధానికి తెగబడకుండా నిలిపినవి నీ లేఖలే. కాలం ఇటువంటి బలవత్తరసాధనాలను ప్రయోగించవలసిన స్థితిని తెచ్చి పెట్టింది. వీటితో నీ మనస్సును కలత పెట్టుకోకు. ఉత్సాహాన్ని కల్పించుకో. ఇక దుఃఖించక విధి నిర్ణయించిన కృత్యాలను నీవు వెంటవెంటనే సాగిపోనీ. రోము నీకు స్వాగతమిస్తున్నది. నాకు నీ కంటే ప్రియమైంది మరేదీ లేదు. భావనకు కూడా అందుబాటులో లేనంతటి అపచారం నీకు జరిగింది. నీచేసిన ఈ అవమానానికి తగ్గ న్యాయాన్ని కల్పించుకోటంకోసం మహాధికులైన దేవతలు నన్నూ, నిన్ను ప్రేమించే ఇతరులనూ తమ ప్రతినిధులుగా పరిగ్రహింతురుగాక! ఎల్లవేళలా నీవు నాకు సౌఖ్యప్రదాయినివి. నిత్యమూ నీకు నా స్వాగతం!

**అగ్రిప్పా :** ప్రభ్వీ! నీకిదే నా స్వాగతం!

**మెకయ్‌నాస్ :** ప్రియప్రభ్వినీ! ఇదే నీకు మా అందరి స్వాగతం! శక్తిమంతాలైన తన అధికార గౌరవాలను రెంటినీ ఒక బంధకిపరం చేసి, నేడు మనమీద ఒక కలకలాన్ని ప్రేరేపిస్తూ మేరలుమీరిన కామవ్యాపారవిద్రోహాలతో నిన్ను గెంటివేసిన అ వ్యభిచారి ఆంటోనీతప్ప, ఈ రోము మహానగరంలో నిన్ను ప్రేమించి నీ యెడ కనికరం వహించని హృదయం ఒక్కటైనా లేదు!

**ఆక్టేవియా :** ఇది సత్యమేనా?

**సీజర్ :** సుసత్యం! సోదరీ! నీకు స్వాగతం ప్రియసోదరీ! శాంతచిత్తవని చిరకీర్తి సంపాదించుకో.

**(నిష్క్రమిస్తాడు)**

## ఏడో దృశ్యం

**ఆక్టియంవద్ద, ఆంటోనీ శిబిరం. క్లియోపాత్రా, ఎనోబార్బస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** అనుమానించకు. నేను నీతోనైనా బయటపడి తీరుతాను.

**ఎనోబార్బస్ :** ఎందుకు మహారాజ్ఞీ?

**క్లియోపాత్రా :** ఈ యుద్ధరంగాలలో నేను ఉండరాదనీ, అది ఉచితం కాదనీ నీవు నాకు వ్యతిరేకంగా ప్రసంగించావు.

**ఎనోబార్బస్ :** అయితే, మరి ఉండటం ఉచితమా?

**క్లియోపాత్రా :** అతడీయుద్ధాలను నా మీదనే ప్రకటించినప్పుడు నేను ఇక్కడ ఎందుకుండగూడదు.

**ఎనోబార్బస్ :** (అపవారితంగా) ఇందుకు నేను సమాధానం చెప్పలేక కాదు.

**క్లియోపాత్రా :** ఏమిటంటున్నావు?

**ఎనోబార్బస్ :** ఇక్కడి ఉనికి ఆంటోనీ మహాశయుణ్ణి ఊరికే కలత పెడుతుంటుంది. వీటిలో దేనినీ ఆయన ఇప్పుడు నీ పరంగా వినియోగించటానికి వీలు లేదు. ఆయన హృదయదౌర్బల్యం కలవాడని ఇప్పటికే అపనింద చెలరేగింది. ఈ యుద్ధాన్నంతటినీ ఫోటానస్ అనే నీ కొజ్జా, నీ అవివాహితస్త్రీలు నడుపుతున్నట్లు రోములో ఇప్పటికే చెప్పుకొంటున్నారు.

**క్లియోపాత్రా :** ఆ రోము సర్వనాశనమగుగాక! మాయెడ వ్యతిరేకంగా నిందాప్రచారం చేసేవాళ్ల నాలుకలు క్రుళ్లిపోవుగాక! యుద్ధవ్యయంలో కొంతభాగాన్ని నేను భరిస్తున్నాను. పురుషుడనైతే నేనెలా యుద్ధభూమిలో ఉండి తీరుతానో, అలాగే నా రాజ్యానికి రాజ్ఞినైన నేను ఇప్పుడీ యుద్ధరంగంలో ఉండితీరుతాను. ఇందుకు వ్యతిరేకంగా చెప్పకు. నేను యుద్ధభూమికి దూరంగా ఎక్కడో ఉండేదాన్ని కాను.

**ఎనోబార్బస్ :** వీలు లేదు. ఇంతకుమించి నేనేమీ అనను. అడుగో! చక్రవర్తి.

**ఆంటోనీ, కానెడియస్ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** కానెడియస్! టారెస్టమ్, బ్రుండూషియం[86]ల గుండా అయోనియా సముద్రాన్ని[87] దాటి టారైనును[88] అతడు పట్టుకోటం అతివిచిత్రమైన విషయం కదూ! ప్రియా! నీవీ విషయాన్ని విన్నావా?

**క్లియోపాత్రా :** జవశక్తిని ఉపేక్షాపరులకంటే ఘనంగా ఎవరూ స్తుతించరు.

**ఆంటోనీ :** ఇది చాలా చక్కని నింద! అశ్రద్ధను నిందించేటప్పుడు ఉత్తమోత్తములు ప్రయోగించటానికి యోగ్యమైన నింద. కానెడియస్! మనం అతడితో సముద్రంమీద పోరాడుదాం.

**క్లియోపాత్రా :** సముద్రంమీదా? కాక మరి?

**కానెడియస్ :** ప్రభువులెందుకలా చేయదలిచారు?

**ఆంటోనీ :** అతడు మనను ఆ సముద్రంమీద ఎదుర్కోమని యుద్ధానికి పిలవటం వల్ల.

**ఎనోబార్బస్ :** అలాగా. ప్రభూ? మీరు అతణ్ని నేలమీద యుద్ధం చెయ్యమని పిలిచారు.

**కానెడియస్ :** అద్దైనా సీజర్ పాంపేతో పోరాడిన ఫారసేలియాలో చెయ్యమని. ఆయనకిది అనుకూలం కాకపోవటంవల్ల ఈ పిలుపును త్రోసిపుచ్చాడు. అలాగే మీరు కూడా ఆయన చేసిన యుద్ధస్థలనిర్దేశాన్ని త్రోసిపుచ్చవలసి ఉంది.

**ఎనోబార్బస్ :** మీ నౌకాదళంలో తగిన ఉద్యోగులు లేరు. మీ కర్ణధారులందరూ గాడిదలను తోలుకొనేవారు గడ్డికోసేవారూను. యోగ్యతాయోగ్యతలను గమనించ కుండానే అతివేగంగా సేవకు చేర్చుకోబడ్డవారు. మరి సీజర్ నౌకాదళంలోని వారో, బహుపర్యాయాలు సీజర్ వెంట పోరాడిన ప్రముఖులు. వారి నౌకలు మిక్కిలి తేలికైనవి. మీవి చాలా బరువైనవి. మనం భూమిమీద పోరాడటానికి సర్వసన్నద్ధులమై ఉన్నాము. కనుక సముద్రంమీద ఎదుర్కోటానికి ఇష్టపడక తిరస్కరించటంవల్ల కలిగే అపకీర్తి, ఏమీ ఉండదు.

**ఆంటోనీ :** నేను సముద్రంమీదనే, సముద్రంమీదనే పోరాడతాను!

**ఎనోబార్బస్ :** గౌరవనీయులైన ప్రభూ! ఇందువల్ల భూమిమీది పోరాటంలో మీకున్న సైనికాతిశయాన్ని అవజ్ఞ చేస్తున్నారన్నమాట! పడవల్లోకి వారిని పంచటంతో మీరు సైన్యాన్ని బలహీనం చేస్తున్నారు. ఇందులో అధికాంశం కదనరంగంలో కాకలు దీరిన కాల్బలం. విఖ్యాతిగన్న మీ భూతలయుద్ధపాండిత్యం అనుపయుక్తమౌతుంది. నిశ్చితవిజయాన్ని చేకూర్చే మార్గాన్ని మీరు పరిపూర్ణంగా వదులుకొంటున్నారు. భద్రతను పరిత్యజించి అనిశ్చయావకాశాలకు, అపాయపరిస్థితులకూ మిమ్మల్ని మీరే ఒప్పచెప్పుకొంటున్నారు.

**ఆంటోనీ :** నేను సముద్రంమీదనే పోరాడతాను!

**క్లియోపాత్రా :** నాకు అరవై నౌకలున్నవి. నాకంటే సీజర్‌కు ఒక నౌకైనా అదనంగా లేదు.

**ఆంటోనీ :** అధికంగా ఉన్న నౌకలన్నింటినీ దగ్ధం చేసి, మిగిలినివాటిని సైన్యాలతో నింపి వాటి సహాయంతో ఆక్టియమ్ అగ్రం వద్దనుంచీ వస్తున్న సీజర్‌ను ఎదుర్కొంటాను. ఒకవేళ మనమే ఓడిపోతే, అప్పుడు మనం అవనీతలయుద్ధం చేద్దాం.

**వార్తాహరి ఒకడు ప్రవేశిస్తాడు.**

నిన్నిక్కడికి రప్పించిన ఆ వ్యవహారమేమిటి?

**వార్తాహరి :** ప్రభూ! సీజర్ రాకను మనచారులు గుర్తిస్తున్నారన్న వార్త సత్యం. అంతే కాదు. ఆయన టొరైనీని పట్టుకొన్నాడన్న వార్త కూడా సత్యం.

**ఆంటోనీ :** అతడు స్వయంగా అక్కడుంటాడా? అవకాశం లేదు. అతడి సైన్యాలు అక్కడున్నాయంటే చాలా చిత్రమైన విషయం. కానెడియస్, మన పందొమ్మిదిపదాతి దళాలకూ, పన్నెండు ఆశ్వికదళాలకూ అధిపతివి నీవు... మనం మన నౌకమీదికి వెళ్లుదాం. – పద ఓ నాథెటిస్[89]! పద.

**ఒక సైనికుడు ప్రవేశిస్తాడు**

యోగ్యసైనికుడా! సంగతేమిటి?

**సైనికుడు :** మహోదాత్తసమ్రాట్! సముద్రంమీద పోరాడకండి. మన నలిగిపోయిన నావలను నమ్మకండి. ఈ ఖడ్గంమీదా, ఈ నా రణకిరణాంకాలమీదా మీకు అపనమ్మకం కలిగిందా? ఈజిప్షియన్లనూ, ఫొనీషియన్లనూ బాతుల్లా పడి ఈదనీయండి! మనం నేలమీద నిలిచి అడుగడుగునా పోరాడటానికి అలవాటు పడ్డవాళ్లం.

**ఆంటోనీ :** మంచిది. నీవు వెళ్ళిపో!

**(ఆంటోనీ, ఎనోబార్బస్, క్లియోపాత్రా నిష్క్రమిస్తారు)**

**సైనికుడు :** హెర్క్యూల్స్ సాక్షిగా నేను నిజం చెబుతున్నాననుకొంటాను.

**కానెడియస్ :** సైనికుడా! నీవు చెప్పేది సత్యమే. యుద్ధవిషయంలో ఆయన సర్వకర్తవ్యాలూ ఆయనకున్న బలాన్ని బట్టి నిర్ణీతాలు కావటంలేదు. మన సేనాధినేతను ఆమె అలా నడుపుతున్నది. ఈ నాడు మనమందరం స్త్రీలకు సేవకులమైనాము.

**సైనికుడు :** అవనీతలంమీది దళాలకూ, ఆశ్విక బలాలకూ అధిపతివి నీవే కదూ!

**కానెడియస్ :** మార్కస్ ఆక్టేవియస్! మార్సియస్ జస్టియస్, పబ్లికోలా కైలియస్ సముద్రదళాలకు అధిపతులు. భూతలంమీది అఖిలబలాలకూ అధిపతిని నేనొక్కణ్ణే. సీజర్ అంతటి శరవేగంతో వస్తున్నాడన్నవార్త నమ్మికకు అందటం లేదు.

**సైనికుడు :** అతడు ఇంకా రోములో ఉండగానే, అతని బలాలు బహురూపాలను ధరించి చారులను మోసగించేరీతిగా వివిధదేశాలకు విచ్చేస్తున్నాయి.

**కానెడియస్ :** ఆయనకు ప్రధానప్రతినిధి ఎవరో నీవు విన్నావా?

**సైనికుడు :** అతడెవరో టారస్[90] అని వారు చెప్పుకొంటున్నారు.

**కానెడియస్ :** అతడు నేనెరిగినవాడే.

**వార్తాహరి ప్రవేశిస్తాడు.**

**వార్తాహరి :** కానెడియస్‌ను చక్రవర్తి పిలుస్తున్నారు.

**కానెడియస్ :** విచిత్రమైన వార్తలతో కాలం మహోఘనమైందిగా ఉంది. ప్రతిక్షణం ఏదో క్రొత్తవార్త పుడుతూనే ఉంది.

## ఎనిమిదో దృశ్యం

**ఆక్టియం దగ్గర ఒకమైదానం.**
**సీజర్, టారస్ పయనిస్తూ ఉన్న సైన్యంతో ప్రవేశిస్తారు.**

**సీజర్ :** టారస్!

**టారస్ :** ప్రభూ!

**సీజర్ :** భూతలంమీద ఎదుర్కోకు. సైన్యాలనన్నిటినీ ఒకచోట సమీకరించు. మేము సముద్రంమీద ఆరంభించే దాక వారిని నేలమీద యుద్ధానికి పురికొల్పకు. ఈ లేఖావలయంలోని ఉత్తరువులను ఎన్నడూ అతిక్రమించకు. మన అదృష్టమంతా ఈ అవకాశం మీదనే ఆధారపడి ఉంది

**(నిష్క్రమిస్తాడు)**

## తొమ్మిదో దృశ్యం

**మైదానంలో మరొక ప్రాంతం. ఆంటోనీ, ఎనోబార్బస్ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** మన ఆశ్వికసైన్యంలోని ప్రధానదళాలను కొండకు అవతలవైపు యుద్ధసన్నద్ధాలైన సీజర్ సైన్యాలకు ముఖాముఖిగా మోహరించు. వచ్చే నౌకాదళసంఖ్యను అక్కడినుంచీ గమనించి, తగ్గట్టుగా కార్యనిశ్చయం చేద్దాము.

# పదో దృశ్యం

మైదానంలో మరొక పార్శ్వం. రణభూమిమీద కానెడియస్ తన అవనీదళాలతో పయనిస్తాడు. సీజర్ ప్రతినిధి అయిన టారస్ పైరీతిగా ఎదురుమళ్లి ప్రయాణం చేస్తుంటాడు. వారు లోపలికి వెళ్ళినతర్వాత సముద్రయుద్ధకలకలం వినిపిస్తుంది. హెచ్చరిక, ఎనోబార్బస్ ప్రవేశిస్తాడు.

**ఎనోబార్బస్ :** నాశనమైంది! సర్వనాశనమైంది! ఈ స్థితిని నేను బహుకాలం సహించలేను. 'ఆంటోనియడ్'[91] అనే ఈజిప్టుపతాక నౌక తన అరువది నౌకలనూ వెంటబెట్టుకొని యుద్ధానికి బయలుదేరటం కోసం, తెరచాపలెత్తి చుక్కాని త్రిప్పుతున్నది. ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న నా కన్నులు కవలిపోతున్నవి.

**స్కారస్ ప్రవేశిస్తాడు.**

**స్కారస్ :** సిగ్గు! సిగ్గు!! సమస్తదేవతలూ, దేవతామతల్లులూ, పరివారదేవతలూ అందరూ యానపాత్ర లెక్కి బయలుదేరారు.

**ఎనోబార్బస్ :** నిన్నంతగా కలవరపెడుతున్న ఆ భావమేమిటయ్యా?

**స్కారస్ :** కేవలం అజ్ఞానంవల్ల ప్రపంచంలో అధికభాగాన్ని కోల్పోవటం జరిగింది. లంపటత్వంవల్ల రాజ్యాలనూ, రాష్ట్రాలనూ మనం పోగొట్టుకొన్నాము.

**ఎనోబార్బస్ :** యుద్ధం ఎలా సాగుతున్నది? మనపక్షాన యుద్ధం ప్లేగువ్యాధి బాధితుల ఒడలిమీద ఎర్రని మచ్చల్లాగా – అవి శీఘ్రమరణానికి దేవతాచిహ్నాలు – సాగిపోతున్నది దానికి కుష్ఠువ్యాధిపీడ తప్పదని నా నమ్మకం. ఉభయపక్షాలకు అవకాశం తుల్యమై కవలల్లా కనిపించినప్పుడు లేదా ఇంచుకంత మొగ్గు మనవైపే ఉన్నప్పుడు, యుద్ధమధ్యంలో ఆ ఈజిప్టు పోకిరి జూన్ నెలలోనే ఆబెయ్యలా, జోరీగ కుట్టినట్లు తెరలెత్తించి పారిపోతూ వచ్చింది.

**ఎనోబార్బస్ :** అది నేను చూచాను. ఇటువంటి దృశ్యాలు ఇంకా ఎన్ని జరుగుతాయో అని భయపడుతూ నా కళ్లు దాన్ని చూచి ఓర్చుకోలేకపోయాయి.

**స్కారస్ :** పారిపోవటానికి ఆమె తన నౌకను గాలివాటంగా మరల్చినప్పుడు ఆమె ఐంద్రజాలికవిద్యవల్ల వినాశనమైన ఆంటోనీ, తానూ అతివేగంగా పరుగెత్తిపోవటానికి తెరలెత్తించాడు. కాముకత్వానికి కట్టుబడ్డ అడవిబాతులా, పరాకోటి నందుకొన్న బవరాన్ని

వదలి, ఆమెవెంట పరుగెత్తుతున్నాడు. ఇంతటి లజ్జాకరమైన కృత్యాన్ని నేనెన్నడూ చూడలేదు. అనుభవం, పౌరుషం, గౌరవం, ఇంతకుపూర్వం ఎన్నడూ తమ్ము తామే ఇలా భగ్నం చేసుకోలేదు.

**ఎనోబార్బస్ :** అయ్యో! అయ్యో!!

**కానెడియస్ ప్రవేశిస్తాడు.**

**కానెడియస్ :** సముద్రంమీద మన అదృష్టం సర్వశోషిల్లిపోయింది. అతిశోచనీయంగా అస్తమిస్తున్నది. తన శక్తిసామర్థ్యాలనుగురించి తానెరిగినంత మట్టుగా మన సేనాధినేత ప్రవర్తించి ఉన్నట్లయితే, అది సక్రమంగానే ఉండగలిగేది. అయ్యో! అతినీచంగా పరువెత్తిపోయి అతడు మనందరికీ పలాయనానికి నిదర్శనమైనాడు.

**ఎనోబార్బస్ :** ఏమిటి? నీ ఊహలు ఇలా నడుస్తున్నవేం? సీజర్‌కు లొంగిపోవటమే నీ ఆలోచనైతే ఇక నిఖిలం మనం కోల్పోయినట్లే!

**కానెడియస్ :** వారు పెలొపొనేసస్ వైపు పారిపొయ్యారు.

**ఎనోబార్బస్ :** అయితే, మనం అక్కడికి వెళ్ళి కలుసుకోటం సముచితం. ఇంకా ఏ ఏ పరిణామాలు రానున్నవో అక్కడ వేచి ఉంటాను.

**కానెడియస్ :** నా పదాతిదళాలనూ[92], అశ్వబలాలనూ సీజర్‌పరం చేస్తాను. ఇప్పటికే ఆరుగురు రాజులు ఇలా లొంగిపోవటంలో నాకు దారి చూపించారు.

**ఎనోబార్బస్ :** నేను చేసే నిర్ణయానికి నా బుద్ధి వ్యతిరేకిస్తున్నది. ఇప్పటికీ నేను భగ్నమైపోతున్న ఆ ఆంటోనీ అదృష్టాన్నే అనుసరిస్తాను.

**(నిష్క్రమిస్తారు)**

## పదకొండో దృశ్యం

**అలెగ్జాండ్రియా, క్లియోపాత్రా సౌధం, ఆంటోనీ పరిచారకులతో ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** విను! ఆంటోనీ! నీవింక నా మీద అడుగు పెట్టకని అవనీతలం ఆజ్ఞాపిస్తున్నది. నన్ను భరించటానికి పృథ్వి సిగ్గుపడుతున్నది. మిత్రులారా! ఇక్కడికి రండి. అఖిల ప్రపంచంలో నేనే అంధకారావృతుడనైనాను. నిత్యంగా నన్ను నేను కోల్పోయేటంతటి అధికంగా అంధకారావృతుడనైనాను. నాకు కాంచనసంభరితమైన

నావ ఒకటి దక్కింది. దాన్ని పుచ్చుకోండి! పంచుకోండి!! పారిపొండి!! సీజర్‌తో సంధి చేసుకోండి.

**అందరూ :** పారిపోవడమా? మిమ్మల్ని వదిలిపెట్టి ఆ పని చేయలేం.

**ఆంటోని :** నేనే పారిపోయివచ్చాను. వెన్నిచ్చి పారిపొమ్మని భీరువులకు నేనే పాఠం నేర్పాను. మిత్రులారా! మీకిదే నా వీడ్కోలు. ఆ నా సంపద నౌకాశ్రయంలో ఉంది. పుచ్చుకోండి. అయ్యో! సిగ్గు! సిగ్గు!! నే నెవతెముఖాన్ని చూడటానికి లజ్జిస్తున్నానో ఆమెను నేనింతవరకూ అనుసరించాను. ఇపుడు నా రోమరోమం విప్లవం చేస్తున్నది. కపిలకుంతలాల తొందరపాటును చూచి పలితకేశాలు దూషిస్తే అవి తిరిగీ వీటి భీరుత్వవ్యామోహాలను నిందిస్తున్నాయి.

మిత్రులారా! ఇదే వీడ్కోలు. మీ మార్గాన్ని సుగమం చేయటానికి నేను కొందరు మిత్రులకు లేఖలు వ్రాస్తాను. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. చింతాక్రాంతులు కాకండి. నన్ను వీడిపోవటానికి ఇష్టపడక వ్యతిరేకమైన సమాధానాలు చెప్పకండి. నా నిరాశ ప్రకటిస్తున్న సూచనలను అందుకోండి. తన్ను తానే పరిత్యజించుకొన్న దాన్ని ఎన్నడూ పట్టుకొని ప్రాకులాడకండి. సముద్రతీరాన వెంటనే సూటిగా పయనించండి. ఆ నౌకనూ, ఆ సంపత్తినీ నేను మీ పరం చేస్తాను. నాకు కొంత ఏకాంతాన్ని కల్పించండి. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ప్రార్థించట మెందుకంటారా? నేనిపుడు మీ సేనాధినేతను కాను గనుక. ఇప్పుడే నేను మిమ్మల్ని మళ్ళీ వచ్చి కలుసుకొంటాను (ఆసనస్థుడౌతాడు. ఛార్మియన్, ఇరోస్ త్రోవ చూపిస్తుంటే క్లియోపాత్రా ప్రవేశిస్తుంది. ఐరాస్ అనుసరిస్తాడు).

**ఇరోస్ :** రాజ్ఞీ! వెనక్కు తగ్గవద్దు. ఆయన దగ్గరకు వెళ్లు. సౌఖ్యాన్ని చేకూర్చు.

**ఐరాస్ :** ప్రియరాజ్ఞీ! ఆరంభించు.

**ఛార్మియన్ :** పూనుకో. ఏమిటిది? ఇంకేమన్నా జరిగిందా?

**క్లియోపాత్రా :** ఓ జూనో! నన్ను? ప్రక్కన కూర్చోనీ.

**ఆంటోనీ :** ఓ! వద్దు, వద్దు, వద్దు!

**ఇరోస్ :** ప్రభూ! మీ ప్రక్కన ఉంది ఎవరో చూచారా?

**ఆంటోనీ :** ఆం – ఛీ, చీ, ఛీ!!!

**ఛార్మియన్ :** ప్రియరాజ్ఞీ!

**ఐరాస్ :** రాజ్ఞీ! సమ్రాజ్ఞీ!!

**ఇరోస్ :** ప్రభూ! ప్రభూ!!

**ఆంటోనీ :** అవును, నా ప్రభూ, అవును! ఫిలిప్పీయుద్ధరంగం[93]లో అతడు కౌక్షేయాన్ని దూయవలసిన అవసరమే లేకపోయింది. ఖడ్గాన్ని అలంకారమాత్రంగా గ్రహించి నటకుడిలాగా అపుడు ఆతడు దాన్ని ధరించాడు. అంతే. ఆ బక్కపలచని ఆకలికళ్ల కాషియస్‌ను ఎదుర్కొన్నది నేను. ఆ ఉదాత్తోన్మత్తుణ్ణి బ్రూటస్‌ను అంతమొందించింది నేను. ఆహవవ్యూహాలమధ్య వ్యవహరిం చటంలో అభ్యాసం లేనివాడు కావటంవల్ల, అతడప్పుడు అనుచరగణంచేత యుద్ధం చేయించాడు. అయితే ఇప్పుడో ఏదో - గడిచిపోయింది.

**క్లియోపాత్రా :** అయ్యో! నాకు సాయం రండి!

**ఇరోస్ :** మహారాజ్ఞి, ప్రభూ! మహారాజ్ఞి!

**ఐరాస్ :** రాజ్ఞీ! ఆయనదగ్గిరికి వెళ్లు. మాట్లాడు. లజ్జవల్ల ఆయన తన వీరగుణవిశేష సర్వస్వాన్నీ కోల్పోతున్నాడు.

**క్లియోపాత్రా :** అయితే! నాకు తోడ్పడండి! అయ్యో! ఆధారంగా నిలవండి.

**ఇరోస్ :** ఉదాత్తసమ్రాట్! ఉత్థితులు కండి. మహారాజ్ఞి మీ దగ్గిరికి వస్తున్నది. ఆమె శిరస్సు వాలిపోతున్నది. మీరిచ్చే సౌఖ్యం రక్షణార్థం రాకపోతే మృత్యువామెను కబళించి తీరుతుంది.

**ఆంటోనీ :** నా ప్రతిష్ఠయెడ నేను ద్రోహినైనాను. ఇది అత్యనుదాత్తమైన వ్యతిక్రమం.

**ఇరోస్ :** ప్రభూ! మహారాజ్ఞి!!

**ఆంటోనీ :** నీవు నన్నెక్కడికి నడిపించావు? చూడు? గౌరవచ్యుతుడనైన నేను ఆర్జించి పేర్చిన అఖిలాన్నీ వెనుదిరిగి చూస్తూ నా లజ్జను నీ దృష్టిపథం నుంచీ ఎలా దాచుకొంటున్నానో చూడు!!

**క్లియోపాత్రా :** ప్రభూ! పిరికివడి నేను నావమీద వలియబారి వచ్చినందుకు నన్ను క్షమించండి. నన్నుమీరు అనుసరించి వస్తారని ఆ సమయంలో అణుమాత్రమైనా భావించలేకపోయాను.

**ఆంటోనీ :** ఈజిప్టురాజ్ఞీ! నా హృదయం ప్రణయసూత్రాలతో నీవనే చుక్కానికి బంధితమై ఉందనీ, నీవు నన్ను వెంట లాక్కోపోతావనీ, నీకు ఎంతో బాగా తెలుసును. నా అంతరాత్మ మీద నీకెంతటి సర్వాధికారం ఉన్నదీ నీవు ఎంతో బాగా ఎరుగుదువు. దేవతల అనుశాసనాన్నైనా తిరస్కరించి వచ్చేటట్లు నీ అత్యల్పమైన సంజ్ఞ కూడా నన్ను ఆజ్ఞాపించి రప్పిస్తుందని నీకు తెలుసు.

**క్లియోపాత్రా :** ఓ నా ప్రభూ! నన్ను క్షమించండి!!

**ఆంటోనీ :** ఒకనాడు నా ఇచ్ఛానుసారంగా ప్రపంచార్ధంలోని ప్రజల అదృష్టాలకు ఉదయాస్తమయాలను కల్పించిన నాకు ఈ నాడతినీచతమాదృష్టుడనై, అణకువతో ఆ యువకుణ్ణి సంధికోసం అభ్యర్థించటానికి ఎంతో తంటాలు పడవలసిన స్థితి పట్టింది. నన్నెంతగా నీవు జయించావో ఎరుగుదువు. ప్రణయంవల్ల నా ఖడ్గం ప్రాభవహీనమై సర్వకాల సర్వావస్థల్లోనూ దాని ఆజ్ఞలను అనుసరిస్తుందని నీవెరుగుదువు.

**క్లియోపాత్రా :** క్షమించండి! నన్ను క్షమించండి!!

**ఆంటోనీ :** నీ విషాదాశ్రుబిందువు నొకదానినైనా చిందనీయకు. అది నేను జయించి కోల్పోయిన సర్వంతో సమానమైన మూల్యం కలది. ఏదీ ఒక ముద్దు. ఇదైనా చాలు, నే కోల్పోయిన సర్వాన్నీ తిరిగి చెల్లిస్తుంది. మన ఉపాధ్యాయుణ్ణి పంపించాను. ఆయన తిరిగివచ్చాడా? ప్రియా! దుఃఖం నన్ను పూర్ణంగా ఆవరించింది. కొంత ద్రాక్షాసవాన్నీ, ఉపహారాలను తెచ్చియివ్వండి. గట్టిదెబ్బలు తీస్తున్నప్పుడే మనం దాన్ని గాఢంగా అసహ్యించుకొంటామని అదృష్టానికి తెలుసు.

## పన్నెండో దృశ్యం

**ఈజిప్టు, సీజర్ శిబిరం, సీజర్ దోలబెల్లా, థైరీయస్ ఇతరులతో ప్రవేశిస్తారు.**

**సీజర్ :** ఆంటోనీ దగ్గరనుంచి వచ్చిన వ్యక్తిని దర్శనం చేసుకోమనండి – నీవు అతణ్ణి ఎరుగుదువా?

**దోలబెల్లా :** సీజర్ మహాశయా! అతడు నాకు తెలుసును. క్లియోపాత్రావల్ల ఆంటోనీకి కలిగిన బిడ్డలకు అతడు ఉపాధ్యాయుడు[94]. కొలదిమాసాలకు పూర్వం వార్తాహరులనుగా ఎందరెందరో రాజులను ఉద్యోగించగలిగిన ఆంటోనీ, ఇట్టి ప్రయోజనం కోసం ఇతణ్ణి పంపించటమే అతడు సమస్తకీర్తినీ కోల్పోయినాడనటానికి ప్రబలనిదర్శనం.

**ఆంటోనీ పంపిన రాయబారి యూఫ్రోనియస్ ప్రవేశిస్తాడు.**

**సీజర్ :** ఇలా దగ్గరకు రావయ్యా! మాటాడు.

**యూఫ్రోనియస్ :** మహార్ణవంతో పోలిస్తే గొంజిఆకుమీద మంచుబొట్టు ఎంతో ఉపాధ్యాయుడనైన నేను అంతగా కొలది కాలంనుంచీ ఆయన ప్రయోజనాలకు తోడ్పడుతున్నాను.

**సీజర్ :** కావచ్చు, నీవు వచ్చిన ప్రయోజనమేమిటో వెల్లడించు.

**యూఫ్రోనియస్ :** తన అదృష్టానికి అధిపతులైన మీకు నమస్కరించి, అతడు ఈజిప్టులో నివసించటానికి అనుమతించవలసిందని అర్థిస్తున్నాడు. ఇందుకు మీరు అంగీకరించని పక్షంలో తన కోర్కెను తగ్గించుకొని ఏథెన్సులో ఒక ప్రత్యేకవ్యక్తిగా భూమ్యాకాశాలమధ్య జీవించటానికి అనుమతించవలసిందని ప్రార్థిస్తున్నాడు. ఆయన్నుగురించి మీకు నివేదించవలసింది ఇంతే. తరువాత క్లియోపాత్రా మీ ఆధిక్యాన్ని అంగీకరించి మీకు లొంగిపోయింది. అపాయస్థితికి పాలైన టోలమీల కిరీటాన్ని తన వారసులకు దక్కించవలసిందని ఆమె మిమ్మల్ని అభ్యర్థిస్తున్నది.

**సీజర్ :** ఆంటోనీ విషయంలో – అతడి అభ్యర్థనను నేను చెవిని బెట్టను. ఈజిప్టు రాజ్ఞిని గురించి – ఆమెకు సమ్ముఖాన్ని కల్పించటంగాని, ఆమె కోర్కెలు తీర్చటంగాని నేను కాదనను. కానీ, ఇందుకు ఆమె సర్వవిధాలా గౌరవచ్యుతుడైన తన ప్రియుణ్ణి ఈజిప్టు దేశంనుంచి బహిష్కృతుణ్ణి చేయటం గాని, ప్రాణహరణం చేయటంగాని చేయవలసి ఉంటుంది. ఇందులో ఏది జరిగించినా ఆమె ప్రార్థనలను విని అనుకూలంగా వ్యవహరించటం జరుగుతుంది. ఇదే వారిద్దరికీ నా సమాధానం.

**యూఫ్రోనియస్ :** అదృష్టదేవత మిమ్మాదరించుగాక!

**సీజర్ :** ఇతణ్ణి సైన్యాలగుండా నడిపించుకోపొండి.

**(యూఫ్రోనియస్ నిష్క్రమిస్తాడు)**

(థైరియస్‌తో) క్లియోపాత్రా యెడ నీ వక్తృత్వప్రావీణ్యాన్ని ప్రదర్శించి పరీక్షించుకోవలసిన సమయం ఇప్పుడు వచ్చింది. వెంటనే బయలుదేరు. క్లియోపాత్రాను ఆంటోనీనుంచి వేరుచేయటంలో విజయం సాధించు. ఆమె కోరినవెల్లా ఇచ్చేయ్ – నా పేరు చెప్పి వాగ్దానం చెయ్యి. ఆమె కోరుకొన్నవే కాదు, ఇంకా నీ ఊహకు తోచినవాటిని కూడా చేర్చి ఇచ్చేయ్. తమ అదృష్టాలు, పరాకాష్ఠలను అందుకొన్నప్పుడు అబలలెన్నడూ మానసికంగా సబలలై నిలువలేరు. పురుషస్పర్శ అంటే ఏమో ఎరుగని వెష్ఠాదేవి[95]

కన్యలచేత నైనా ఆ స్థితి చేసిన శపథాలను వ్యతిక్రమించేటట్లు చేయగలుగుతుంది. థైరియస్! నీ శక్తిని పరీక్షించుకో! ఇందులో నీవు విజయం చేకొన్నావో ఓ పారితోషికాన్ని నీవే నిర్ణయించుకోవచ్చు దాన్ని శాసనంలా[96] భావించి చెల్లిస్తాను.

**థైరియస్ :** సీజర్ మహాశయా! నేను వెళ్ళివస్తాను.

**సీజర్ :** తన అదృష్టం సర్వం అస్తమించిన పరిస్థితులకు ఆంటోనీ ఎలా అలవడిపోతుంటాడో పరిశీలించు. శారీరక మానసికచర్యల మూలంగా అతడు ఏమో వెల్లడిస్తున్నాడని, నీవు భావించే ప్రత్యంశాన్నీ పరిశీలించు.

**థైరియస్ :** సీజర్ మహాశయా! తప్పక పరిశీలిస్తాను.

**(నిష్క్రమిస్తారు)**

## పదమూడో దృశ్యం

**క్లియోపాత్రా ప్రాసాదం, క్లియోపాత్రా, ఎనోబార్బస్, ఛార్మియస్, ఐరోస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** ఎనోబార్బస్! ఇప్పుడు మనమేం చేద్దాం?

**ఎనోబార్బస్ :** చింతిద్దాం! మరణిద్దాం!!

**క్లియోపాత్రా :** ఇంతకూ దోషం మనదా? ఆంటోనీదా?

**ఎనోబార్బస్ :** బుద్ధి కాక కాంక్ష నడిపించినట్లు నడిచే ఆ ఆంటోనీదే. పరస్పర భయోత్పాతాలను కల్పిస్తూ, ఒకదాని కొకటి ఎదురుమళ్ళగా యుద్ధరంగంలో నిలిచి ఉన్న నౌకా పరంపరల ఎదుటనుంచి నీవు పారిపోతే మటుకేం? ఆయన నిన్ను అనుసరించటమెందుకు? ప్రణయకండూతి ఆ సమయంలో ఆతని ఆధిపత్యాన్ని కాటు వేయకుండా వుండవలసింది. అట్టి క్లిష్టసమయంలో తన నౌకాదళాలన్నీ మహాద్భుతభీత చిత్తాలతో తిలకించేటట్లుగా నీ వలియబారే నౌకలను అనుసరించటం వల్ల కలిగిన నష్టం కంటే లజ్జ ఏ మాత్రం తీసిపోదు!

**క్లియోపాత్రా :** ఇంతతో చాలించు ఇదే నిన్ను ప్రార్థిస్తున్నాను.

**దూత యూఫ్రోనియస్‌తో ఆంటోనీ తిరిగి ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** అతని సమాధానం అదేనా?

**యూఫ్రోనియస్ :** అవును ప్రభూ!

**ఆంటోనీ :** ఆమె నన్ను మోసగిస్తేనే అతనివల్ల క్రమమైన మర్యాదను పొందుతుందన్నమాట!

**యూఫ్రోనియస్ :** అని వారంటున్నారు.

**ఆంటోనీ :** అయితే ఈ విషయాన్ని రాజ్ఞికి తెలియజెయ్! రాజ్యాలయెడా, రాష్ట్రాలయెడా ఉన్న పరిపూర్ణాభిలాష తీరాలంటే బాలుడైన[97] ఆ సీజర్ దగ్గిరికి నా ఈ నెరిసిన తలను పంపించాలని తెలియజెయ్!!

**క్లియోపాత్రా :** ఆ తలనా, ప్రభూ?

**ఆంటోనీ :** మళ్లీ సీజర్ దగ్గరికి వెళ్ళి చెప్పు! పరికీర్తిత యౌవనాలంకారశోభితుడవు. నీవేదైనా విశిష్టకార్యధూర్వహుడవై నిర్వర్తించి చూపాలె నని లోకం కోరుతున్నది. నీ సంపత్తి, సైనికబలాలు, నౌకాదళాలు ఏ పిరికిపందకైనా ఉండవచ్చు. సీజర్‌కు ఉండాలా? ఒక పసిబిడ్డ కున్నా అవి విజయాన్ని సాధించటం తథ్యం. అందువల్ల అతడికి సహజంగా లభ్యమైన సంపదను దూరంగా ఉంచి అస్తమించిన అధికారయౌవనాలుగల నన్ను ఒంటిగా ఎదుర్కోవలసిందని ఆహ్వానిస్తున్నానని చెప్పు. నేనీ వీరాలాపాన్ని లిఖితపూర్వకంగా పంపుతాను. నా వెంట రా!

**(ఆంటోనీ, యూఫ్రోనియస్ నిష్క్రమిస్తారు)**

**ఏనోబార్బస్ :** (స్వగతం) అవును. మహాసైన్యసంపత్తికి అగ్రేసరుడైన సీజర్ ఈ ద్వంద్వయుద్ధాహ్వానాన్ని అంగీకరించటం సంభవమేనా? ఉపలభ్యమానాలై ఉన్న సహజావకాశాల నన్నింటినీ అవతలపెట్టి, ఆ సీజర్ ప్రజలు దర్శించటం కోసం ఒక సామాన్యఖడ్గ విన్యాసప్రదర్శకుడితో తా జగడమాడటంకోసం రంగస్థలంమీద నిలుస్తాడా? అసంభవం! ఇది ఎంత విచిత్రమైన ఊహ? మానవుల నిర్ణయాలు కూడా వారి అదృష్టాన్నే అనుసరిస్తుంటాయి. రెండూ తుల్యంగా వినాశనాన్ని పొందాలి గనుక మానసికగుణవిశేషాలను కూడా అదృష్టం తన వెంట నడిపిస్తుంటుంది. వివిధవ్యక్తుల శక్తిసామర్థ్యాలను పరిగణించటంలో ప్రముఖవిజ్ఞాని అయిన తాను, సర్వైశ్వర్య పరిపూర్ణుడైన సీజర్, అధఃపతితుడైన తనతో సమఘాయాలో సమరరంగాన సమాధానం

చెబుతాడని  కలగనటం ఎంత వింత! సీజర్ మహాశయా! ఈతని నిర్ణాయకశక్తి మీద కూడా నీవు విజయం చేకొన్నావు!

**సేవకుడొకడు ప్రవేశిస్తాడు**

**సేవకుడు :** సీజర్ వద్దనుంచీ ఒక వార్తాహరి వచ్చాడు.

**క్లియోపాత్రా :** ఏమిటి? నా యెడ చూపవలసిన సమయాచారాలు ఇంతటితో చెల్లిపోయాయా! ఓ నా కన్యకలారా! గమనించండి. ముకుళంలా ఉన్నప్పుడు తావి నాఘ్రాణించటానికి తలొగ్గి నిలిచే మానవులు, వికసించిన గులాబి దగ్గరికి నడిచివెళ్లే నాసికను అరికడతారు. అతణ్ణి ప్రవేశపెట్టు.

**సేవకుడు నిష్క్రమిస్తాడు.**

**ఎనోబార్బస్ :** (స్వగతం) నా గౌరవప్రతిపత్తి నాతో భిన్నిస్తున్నది. కలహమారంభించింది. రాజభక్తి పరాయణత్వం బుద్ధిబలాన్ని కోల్పోయినవారిని అంటిపట్టుకొని ఉండటం దానిదోషమే. అయితే ఏ సేవకుడు తత్పరతతో పడిపోయిన యజమానిని అనుసరింపగలుగుతాడో అతడు ఆ యజమాని కంటే ఆధిక్యాన్ని సంపాదించి మరో యజమానికి లొంగినవాని కంటే అధికుడనిపించుకోటమే కాకుండా చరిత్రలో ఒక గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకొంటాడు.

**థైరియస్ ప్రవేశిస్తాడు.**

**క్లియోపాత్రా :** సీజర్ నిర్ణయాలేమిటి?

**థైరియస్ :** మీరు ఏకాంతంగా వినవలసిఉంది.

**క్లియోపాత్రా :** ఇక్కడ ఉన్నవారందరూ ఆప్తులే. ధైర్యంతో చెప్పు.

**థైరియస్ :** సందర్భవశాన వీరందరూ ఆంటోనీకి కూడా ఆప్తులే కదా!

**ఎనోబార్బస్ :** సీజర్‌కు ఎందరు ఆప్తులు అవసరమో ఆయనకూ అందరు అవసరం. కానీ యుద్ధం అయిపోతుంది కనుక మాతో పనిలేకుండా పోవచ్చుకూడాను. సీజర్ ఇచ్ఛయిస్తే మా యజమాని మిత్రుడై వర్తించటానికి ఎంతో రయోద్వేగాన్ని ప్రకటిస్తాడు. మేమో, ఆయన ఎవరివాడో మేమూ వారివాళ్ళమే  అంటే సీజర్ ప్రజలమౌతా మన్నమాట!

**థైరియస్ :** మంచిది. ఓ విఖ్యాతిగన్న వనితా, రాజ్ఞీ! ఇప్పుడు మీ ఉన్నతస్థితినిబట్టి ఆయన మహోదారుడైన సీజర్ అన్నభావంతో తప్ప అన్యంగా గాని భిన్నంగా గాని వ్యవహరింపవలసిన అగత్యం లేదని ఆయనే విన్నవిస్తున్నాడు.

**క్లియోపాత్రా :** ఇది మహోదారంగా ఉంది  కానీ –

**థైరియస్ :** మీరు ఆంటోనీయెడ స్నేహాన్ని ప్రకటించటం భయభావంవల్లనే గాని ప్రణయాతిశయంవల్ల కాదని ఆయనకు తెలియకపోదు.

**క్లియోపాత్రా :** అలాగా?

**థైరియస్ :** అందువల్లనే మీ గౌరవవిషయంలో గల మచ్చలు బలప్రయోగానికి లొంగిపోవటంవల్ల కలిగినవే గాని, ఐచ్ఛికంగా ఇచ్చివేసుకోవటంవల్ల అబ్బినవి కావని భావించి ఆయన అందుకు మీ యెడ ఎంతో కరుణారసభావాన్ని ప్రదర్శిస్తున్నాడు.

**క్లియోపాత్రా :** ఆయన దేవత. సత్యమేమో ఆయనకు తెలుసు. నాకై నేను నా గౌరవాన్ని ఐచ్ఛికంగా అర్పించుకోలేదు. అది కేవలం విజిత.

**ఎనోబార్బస్ :** ఇందులోని సత్యాన్ని తెలుసుకోటానికి నేను ఆంటోనీని అడిగివేస్తాను. నీకు అత్యంతప్రియురాలైన ఈమే నిన్ను వీడిపోతున్నది. మేమూ నిన్ను విడిచిపోతాము. మునిగిపో! ప్రభూ! నీవీనాడు రంధ్రంపడ్డ నావవైనావు. మునిగిపో!!

**(నిష్క్రమిస్తాడు)**

**థైరియస్ :** మీరు సీజర్‌ను ఏమి కోరుతున్నారో తెలియజేస్తారా మరి? ఒకరీతిగా ఆయన మీరు కోరినవన్నీ ఇచ్చుకొంటానని మిమ్మల్ని ప్రార్థించి తెలియజేస్తున్నాడు. ఆయన సంపత్తిని మీరు ఆలంబనంగా కల్పించుకోటానికి ఆతురతవహిస్తే ఆయన మహానందపడతాడు. అయితే మీరు ఆంటోనీని విడచిపెట్టారని, సర్వప్రపంచాధినేత అయిన ఆయన రక్షణక్రిందికి వచ్చారని నా వల్ల వింటే, ఆయన ఆత్మ ఆనందోత్తేజితమౌతుంది.

**క్లియోపాత్రా :** నీ నామధేయం?

**థైరియస్ :** థైరియస్.

**క్లియోపాత్రా :** వరకరుణాగుణాన్వితా! వార్తాహారీ!! ఘనుడైన సీజర్‌తో నిన్ను ఆయనకు ప్రతినిధిగా భావించి, ఇలా ఆయన విజేతృహస్తాన్ని ముద్దాడానని విన్నవించు. ఆయన

పాదదేశాన నా కిరీటాన్ని నిల్పి నతులర్పించటానికి సంసిద్ధురాలనని విన్నవించు. సర్వజన పాలితమైన ఆయన కంఠనిశ్వాసం ఈజిప్టును గురించి ఏమని శాసిస్తే అందుకు లోబడి నడుచుకోటానికి సర్వసంసిద్ధురాలనని విన్నవించు.

**థైరియస్ :** ప్రస్తుతస్థితిలో ఇదే మీకు పరమోదాత్తమైన మార్గం. వివేకం, అవకాశం రెండూ పరస్పరవ్యతిరేకాలై కలహిస్తున్నప్పుడు, వివేకం తన సర్వశక్తినీ వినియోగించి ధైర్యోపేతంగా నిలువగలిగితే, అవకాశం దాన్ని అణుమాత్రమైనా కదలించలేదు. తమ హస్తంమీద నా సమ్మాన చిహ్నమైన చుంబనముద్రను నిలపటానికి అనుగ్రహించండి.

**క్లియోపాత్రా :** నూతన రాజ్య సంపాదనబుద్ధితో విచ్చేసి మీ సీజర్ తండ్రి అయోగ్యమైన యీ హస్తప్రదేశాన తన రదనచ్ఛదాలతో చుంబనవృష్టి కురిపించాడు.

**ఆంటోనీ, ఎనోబార్బస్ తిరిగి ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** పర్జన్యాధిపుడైన జౌసాక్షిగా వాణ్ణి అనుగ్రహిస్తున్నదే – ఎవరోయ్ నీవు?

**థైరియస్ :** సర్వసంపత్పరిపూర్ణుడూ, నిఖిలజనపాలిత నిజశాసనుడూ అయిన మహావ్యక్తి ఆజ్ఞలను నిర్వర్తించే ఒక అల్పుణ్ణి.

**ఎనోబార్బస్ :** (స్వగతం) ఓరీ! నీ కిందుకు కశాఘాతలు తప్పవు.

**ఆంటోనీ :** మీరందరూ అక్కడికి చేరండి. ఓహో! ఓసి గ్రద్దా!! దేవతలారా!! భూతరాశులారా!! అధికారం నా హస్తాలలోనుంచీ కరిగిపోతున్నది. నిన్న మొన్నటివరకూ నేను కేకపెడితే చిరుపండ్లకోసం చరచరప్రాకుతూ వచ్చే పసిపిల్లల్లా ఎందరెందరో రాజులు 'ఏమాజ్ఞ?' అని అడుగుతూ వచ్చారు. మీకేం చెవులు లేవా? వినిపించటంలేదా? ఇంకా నేను ఆంటోనీనే!

**సేవకులు ప్రవేశిస్తారు.**

ఈ తిమ్మణ్ణి ఇక్కడినుంచి తీసుకుపోయి కొరడా దెబ్బలు కొట్టండి.

**ఎనోబార్బస్ :** (స్వగతం) మరణాసన్నమైన వృద్ధసింహంతో ఆడటం కంటే సింహకిశోరంతో క్రీడించటం ఉత్తమం.

**ఆంటోనీ :** చంద్రదైవతమా! నక్షత్రరాశీ!! – ఈ గాడిదను కట్టికొట్టండి. సీజర్ సర్వాధికారాన్ని అంగీకరించే మహాసామంతులు ఇరవైమంది ఇక్కడికి వచ్చినా, అంతటి తులువతనంతో ఆమె హస్తాన్ని ముద్దిడుకోటాన్ని చూచి నేను సహించను. ఆమె

నామధేయం క్లియోపాత్రా! కానీ క్లియోపాత్రాగా మనటం మానివేసిన తరువాత మరి ఆమె పేరేమో? ఒక పసిపిల్లవాడులా ముఖాన్ని ముడుచుకొంటూ కరుణించవలసిందని పెద్దపెట్టున పలవరించేదాకా, కొరడా దెబ్బలతో నొప్పించండి. ఉ. ఇక్కడినుంచి తీసుకోవెళ్ళండి.

**థైరియస్ :** మార్క్ ఆంటోనీ!

**ఆంటోనీ :** పడలాక్కోపొండి. కట్టివేసి బాగాకొట్టి తిరిగి ఇక్కడికి తీసుకోరండి. ఈ తుంటరి తిమ్మన్న మనదగ్గిరనుంచీ సీజర్‌కు ఒకవార్త చేరవేయాలి. (థైరియస్‌తో సేవకులు నిష్క్రమిస్తారు) నాకు నీతో పరిచయం కలగకపూర్వమే నీ ప్రతిష్ఠలో అర్ధాంశం ధ్వంసమైంది. నేను రోములోని నా పర్యంకంమీది తలగడను నలగనీయందీ, సత్సంతానప్రాప్తి నరికట్టిందీ అయ్యో! అధమాధమ సేవకులమీద హార్దదృష్టిని ప్రసారించటానికి అలవాటుపడ్డ ఒక చెడిపెచేత, 'స్త్రీజాత్యాభరణం' చేత, నిందితుణ్ణి కావటానికేనా!

**క్లియోపాత్రా :** ప్రభూ! మహోదారా!!

**ఆంటోనీ :** ఛీ! నిరంతం నీవు చపలచిత్తవు. దుష్టవర్తనలతో మన మనస్సు కరడుగట్టినప్పుడు – అయ్యో అది ఎంతటి పతనావస్థ – విజ్ఞానోపేతులైన దేవతలు కన్నులు కుట్టి పాపాచరణం చేయించి, మన పరిశుద్ధనిర్ణయ పరిజ్ఞానాన్ని భంగపరిచారు. మన చేత మన దోషాలను ఆరాధింపజేశారు. ఆనందగర్వ విభ్రాంతితో మనం అణగారిపోతుంటే, మనలనుజూచి నవ్వుకొన్నారు.

**క్లియోపాత్రా :** అయ్యో! నీవీ స్థితికి వచ్చావా?

**ఆంటోనీ :** మరణించిన సీజర్ మహాశయుని భోజనభాజనంలో వేడెక్కని తడితునకనుగా తొలుత నేను నిన్ను చూచాను. కాదు, కాదు. నీవు కయ్యస్ పాంపే మహాశయుని కరండంలోని ఉపాహారకబళ ఖండానివని జనసామాన్యంలో వార్తకెక్కలేదు గాని, ఇంతకుమించిన విలాసఘటికల నెన్నింటినో నీవు అసంఖ్యాకంగా అతడితో కాముకివై గడిపివేశావు. ఇది నా గాఢవిశ్వాసం. ఇంద్రియదమనమంటే ఏమో నీవు కొంతగా ఊహింపగలిగినప్పటికీ, అది నీ అనుభూతిలో అణుమాత్రమైనా లేదు.

**క్లియోపాత్రా :** ఇదంతా ఎందుకు? నీ అభిప్రాయమేమిటి?

**ఆంటోనీ :** ఇచ్చిన క్షుద్రపారితోషికాలకే "ఈశ్వరుడు తమకు మహాభాగ్యా లిచ్చుగాక" అని పలికే అల్పుడికి, నేను క్రీడించే నీ హస్తాన్ని, రాజులు గౌరవార్థంగా ముద్దిడుకొనే నీ హస్తాన్ని, మహనీయహృదయులైన సమ్రాట్టుల ప్రణయచిహ్నాంకనార్హమైన నీ హస్తాన్ని అందీయటమా? అయ్యో! ఉన్మత్తుడనై నేను బాసన్ పర్వతంమీద[98] నిల్చి మహోక్షగోగణాలను మించి రంకె వేయాల్సి వచ్చింది. ఎందువల్లనో నాకు అటువంటి దారుణమైన కారణం కలిగింది. దాన్ని గురించి ఏ మాత్రం మర్యాదతో చెప్పవలసివచ్చినా, అది కుత్తుకకు ఉరితాడు తగిలించినవాణ్ణి దాన్ని కొంత ఒదులుగా అమర్చినందుకు, నిహతావస్థలో ఉన్నవాడు అభినందించినట్లౌతుంది.

**థైరియస్‌తో సేవకులు తిరిగి ప్రవేశిస్తారు.**

– ఏం వీణ్ణి గట్టిగా కొట్టారా?

**ప్రథమసేవకుడు :** చాలా గట్టిగా కొట్టాము ప్రభూ!

**ఆంటోనీ :** ఏడ్చి క్షమించమని అర్థించాడా?

**ప్రథమసేవకుడు :** అనుగ్రహించవలసిందని ప్రాధేయపడ్డాడు.

**ఆంటోనీ :** సజీవుడై ఉంటే మీ తండ్రి నీ వంటి కుమారుడు కలగటం కంటే కుమార్తె జన్మించడం మేలై ఉండేదని పశ్చాత్తాపపడుగాక! అతణ్ణి సేవించటంవల్ల నీకీ దెబ్బలు తగిలాయి కనుక, జయోదీయమానుడైన సీజర్‌ను అనుసరించి చరిస్తున్నందుకు చింతపడు. ఒక వనిత శ్వేతహస్తాన్ని తిలకించేటప్పుడు ఇకనుంచీ నీవు ఈ రీతిగానే కంపించి బాధపొందుతావు. సీజర్ దగ్గిరికి తిరిగి వెళ్లు. ఇక్కడ నీకు మేము ఎటువంటి ఆతిథ్యాన్ని ఇచ్చామో నివేదించు. తానెరిగిన ఒకనాటి నా మహోన్నతిని గుర్తించకుండా, నిరంతరం పదేపదే నేటినా ఉనికినే పలుకుతూ కన్పించటంవల్ల అతడు నాకు తనమీద కోపాన్ని తెప్పిస్తున్నాడని తెలియజెయ్! అవును. అతడు నాకు కోపం తెప్పిస్తున్నాడు. అది సులభం కూడాను. పూర్వం నాకు మార్గదర్శకాలై వర్తించిన నా శుభనక్షత్రాలు తమ మండలాలను విడిచి, శూన్యసీమలను కావించి, నరకంలోని అగాధాలకు తమ తేజఃపుంజాలను ప్రసరింపజేస్తున్నాయి కనుక ఈ పని చేయటం చాలా సుకరం. ఈ నా సంభాషణకూ, నీకు చేసినదానికీ, అతడికి కోపం వస్తే నా యెడ ప్రతిచర్య చేయటానికే నేను స్వాతంత్ర్యప్రదానం చేసిన నా బానిస హిప్పార్కస్ అక్కడ ఉన్నాడు. అతణ్ణి ఆనందంతో కొట్టించమను, ఉరితీయమను. లేదా ఇష్టమైతే చిత్రవధ చేయించమను. ఇటువంటి ప్రతిచర్య ఏదైనా చెయ్యమని సీజర్‌ను ప్రేరేపించు. ఈ వాతలతో ఇక నీవు ఇక్కడనుంచి నిష్క్రమించు. (థైరియస్ నిష్క్రమిస్తాడు)

**క్లియోపాత్రా :** నీవు చేయవలసింది అంతా పూర్తి అయిందా?

**ఆంటోనీ :** అయ్యో! మన భౌమచంద్రదైవతం ఉపరాగాన్ని పొందింది. ఈ చంద్రోపరాగం కేవలం ఆంటోనీ పతనాన్నే సూచిస్తున్నది.

**క్లియోపాత్రా :** అతడి ఉద్వేగం చల్లారేటంతవరకూ నేనేమి చెప్పినా ప్రయోజనం లేదు.

**ఆంటోనీ :** సీజర్‌ను స్తుతించటంకోసం నీవు ఒక క్షుద్రసేవకుడితో కనులు కలుపుతావా?

**క్లియోపాత్రా :** ఇంకా నీవు నన్ను తెలుసుకోలేదా?

**ఆంటోనీ :** నా వంక శీతలహృదయాన్ని వహించావని నీవు తెలుసుకోలేదా అని అడుగుతున్నావా?

**క్లియోపాత్రా :** నేనే అట్టిస్థితిని వహించినదానినైతే ఈశ్వరుడు ఆ నా శీతలహృదయంలో వడగళ్ళను సృజించి జన్మస్థానంలోనే వాటిని విషపూరితాలను గావించుగాక! అందులోని మొదటి వడగళ్ళు నా మెడలో పడుగాక!! అవి కరుగుతూ తనతోబాటుగా నా జీవితాన్ని కూడా కరిగించుగాక!! తరువాతి వడగళ్ళు సేజరియన్‌ను పడమొత్తుగాక! నా గర్భానికి చిహ్నాలైన సమస్తసంతానాన్నీ, నా వీరవరులైన ఈజిప్షియన్లనూ, సమాధిరహితులను కావించి వారి నాహారంగా గ్రహించే నైలునదీమశకమక్షికల కుక్షుల్లో వారిని ఖననం చేసుకొనేటంతవరకూ కరకావృష్టి కురిసి కరుగుగాక!

**ఆంటోనీ :** ఇది నిశ్చయం! సీజర్ అలెగ్జాంద్రియాలో శిబిరాలు వేయిస్తాడు. సర్వవిధాలా నేను అక్కడ అతని అదృష్టాన్ని అవరోధిస్తాను. నా భూతలసైన్యమంతా మంచి కట్టుబాటుతోనే ఉంది. ఆహవంవల్ల చెల్లాచెదరైనా నాకు నౌకాబలం అనంతంగా ఉంది. సముద్రంమీద యోగ్యరీతిలోనే నేను శత్రువులతో తలపడగలను. ఓ ధైర్యమాతా! నన్ను విడిచి నీవు ఎక్కడికెళ్ళావు? క్లియోపాత్రా! విన్నావా? నీ పెదవులను ముద్దిడుకోటం కోసం కదనభూమినుంచే తిరిగివస్తే నేను శత్రురక్తప్లావితమైన శరీరంతోనే వస్తాను. నాకూ, నా ఖడ్గానికీ చరిత్రలో ఒక స్థానం లభిస్తుంది. అట్టి అవకాశం ఇంకా నాకు కలగనున్నదనే నా ఆశ.

**క్లియోపాత్రా :** ఓ నా ప్రణయమూర్తీ! ఎంత వీరోచితంగా సెలవిచ్చావు?

**ఆంటోనీ :** మహాకార్పణ్యంతో ఉదయం మొదలు అస్తమయం వరకూ పోరాడటానికి నా హృదయం, నిశ్వాసం, జీవాయువులు ముప్పిరిగొంటాయి. అదృష్టవంతుడినై నేను

సుగమమైన జీవితాన్ని గడిపే దినాలలో అశ్రద్ధ వహించాను. అట్టివేళల్లోనే మానవులు నాకు కేవల పరిహాసాలకే ప్రాణపరిహారాలను చెల్లించారు. అతితీవ్రనిశ్చయంతో ఇప్పుడు నా కరాళదంష్ట్రలను విప్పి మార్గానికి అడ్డునిలిచి, అందరినీ అంధకారంలోకి తరిమివేస్తాను. రా. ఒకే ఒక ఉల్లాసనిశీథాన్ని గడుపుదాం. చింతాక్రాంతులై ఉన్న నా సేనాపతులందరితో పానగోష్ఠి సాగించి ఆ రాత్రిని అతిశయానందంతో గడిపివేద్దాం. చింతాక్రాంతులైన నా సేనాపతులందరినీ పిలుద్దాం. సాణికలను సంపూర్ణంగా స్వాదువులైన మధువులతో నింపి సేవిద్దాం. కాలగమనాన్ని గుర్తించకుండా అశ్రద్ధ చేస్తూ మన గోష్ఠులను అట్టె కొనసాగిద్దాం.

**క్లియోపాత్రా :** ఈ నాడు నా జన్మదినం. ఏ భోగాలూ లేకుండానే దీనంగా దీన్ని గడిపివేద్దామనుకొన్నాను. కానీ తిరిగి నా ప్రభువు ఆంటోనీ నిజవైభవాన్ని చేకూర్చుకొన్నాడు గనుక నేను ఇక ఎప్పటి క్లియోపాత్రానే ఔతాను.

**ఆంటోనీ :** ఇంకా నేనెంతో సాధించగలను.

**క్లియోపాత్రా :** పూర్వం నా ప్రభువుకు సేనాపతులైనవారినందరినీ నా దగ్గిరికి పిలవండి.

**ఆంటోనీ :** పిలిపించు. మనం వారితో ప్రసంగిద్దాము. ఈ నాటి రాత్రి వారి గాత్రక్షతాలు కక్కిపోసేటంతవరకూ ద్రాక్షాసవాన్ని త్రాగిస్తాను. రా! ఓ నా రాజ్ఞీ!! ఇంకా ఇందులో ఆశాసారముంది. ఈ మారు నేను పోరాడేటప్పుడు హత్యాకాండతో క్షామాన్ని కల్పించటంలో ఆరితేరిన మరణాధిదేవతాలవిత్రంతో పందెంవేసి, ఊచకోతలో ఎవరం ఘటికులమో తేల్చమని కోరి, అతని మహత్తరానురాగాన్ని చూరగొనేటట్లు రణభూమిలో క్రీడిస్తాను.

**(ఎనోబార్బస్ తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

**ఎనోబార్బస్ :** ఈ ఉన్మాదవైపరీత్యంలో ఈతడెంత దూరమైనా పోగలడు. కోపోద్రిక్తతకు లొంగిపోవటమంటే, భయం ఇంక తన్ను భయపెట్టలేనంతగా భయపడిపోవటమన్న మాటే! ఇటువంటి మానసికస్థితి ఉన్నప్పుడు కపోతం శ్యేనాన్నే పొడుచుకొని తినగలుగుతుంది. ఇంతే కాదు మా సేనాధినేత బుద్ధిబలం క్రమంగా మందగిస్తున్నకొద్దీ, అతని హృదయం పుంజుకొంటున్నది. ఆలోచనాశక్తిని పరాక్రమం హతమార్చినప్పుడు, అది తన కదనసాధనమైన ఖడ్గాన్నే కబళిస్తుంది – ఏదో సాకు చెప్పి నేనిక అతణ్ణి పరిత్యజిస్తాను.

**(నిష్క్రమిస్తాడు)**

# చతుర్థాంకం

## ఒకటో దృశ్యం

**సీజర్ శిబిరం, సీజర్, అగ్రిప్పా, తన సైన్యంతో మెకయ్‌నాస్ ప్రవేశిస్తారు. లేఖను చదువుతూ**

**సీజర్ :** అతడు నన్ను బాలుడని సంబోధిస్తున్నాడు. నన్నీ ఈజిప్టులోనుంచీ తరిమివేయగల శక్తి తనకున్నట్లు ఏమేమో అరోచకాలు పలుకుతున్నాడు. నా దూతను బెత్తాలతో కొట్టించి నన్ను ద్వంద్వయుద్ధాని కాహ్వానిస్తున్నాడు. మోరకుడైన ఆ ఆంటోనీతో సీజర్ ఒంటిగా పోరాడాలట! మరణించటానికి ఇంతకంటే అనేకమార్గాలున్నాయని ఆ వృద్ధ ఘాతుకుడు గమనించుగాక! అంతవరకూ అతడు చేసిన ఆ సవాలును త్రోసిపుచ్చటమే కర్తవ్యం.

**మెకెయ్‌నాస్ :** సీజర్ మహాశయులు ప్రశాంతంగా ఆలోచించవలసి ఉంటుంది. అంతటివాడు క్రోధానికి లొంగిపోవటమంటే అతడు పతనపరిపూర్తికి సన్నిహితుడౌతున్నా డన్నమాట! ఊపిరి సలుపుకోటానికి కూడా అతడికి అవకాశ మీయకండి. అతడి ఉన్మత్తక్రోధావస్థవల్ల కలిగే అవకాశాన్ని వినియోగించుకోండి. క్రోధోన్మత్తులెన్నడూ తమ రక్షణ విషయంలో తగ్గ శ్రద్ధ వహించరు.

**సీజర్ :** యుద్ధపరంపరలో తుది కదనాన్ని రేపే మనం సాగిస్తామని మన శ్రేష్ఠసేనాపతులు గుర్తింతురుగాక! మన సైనికశ్రేణుల్లో నిన్న మొన్నటిదాకా అతణ్ణి సేవించినవారెందరో ఉన్నారు. వారే అతణ్ణి బందీని చేస్తారు. ఈ కార్యాన్ని నిర్వహించు. సైనికవీరులందరికీ విందు చేయించడానికి అవసరాలైన సకలసంభారాలూ మన కోశాగారాలల్లో ఉన్నాయి. ఈ విలాసవ్యయానికి వారెంతగానో అర్హత గడించుకొన్నవాళ్లు. దీనజనుడా, ఆంటోనీ!

**(నిష్క్రమిస్తాడు)**

## రెండో దృశ్యం

అలెగ్జాండ్రియాలో క్లియోపాత్రాప్రాసాదం. ఆంటోనీ, క్లియోపాత్రా, ఎనోబార్బస్, ఐరాస్, ఎలెగ్జాస్, ఇతరపరివారంతో ప్రవేశిస్తారు.

**ఆంటోనీ :** డొమిటియస్! నాతో ద్వంద్వయుద్ధం చేయటానికి అతడు నిరాకరించాడు.

**ఎనోబార్బస్ :** అవును. నిరాకరిస్తాడు.

**ఆంటోనీ :** ఎందుకు నిరాకరిస్తాడు?

**ఎనోబార్బస్ :** అదృష్టం విషయంలో మీ కంటే ఎన్నోరెట్లు అధికుడనని భావించే అతడు మీతో పోరాడటం అవమానకరకృత్యమని తలపోస్తాడు.

**ఆంటోనీ :** వీరయోధుడా! రేపు నేను అంబుధిమీదా, అవనీతలంమీదా – రెంటిమీదా అతడితో తలపడతాను. లేదా వారిని రక్తస్నానమాడించి[99] మరణాసన్నమైన నా ప్రతిష్ఠను పునరుజ్జీవింప చేసుకొంటాను. మరి నీవు ఘనంగా పోరాడతావా?

**ఎనోబార్బస్ :** పైనబడి 'విజయమో, వీరమరణమో అంతే' నని కేక పెడతాను.

**ఆంటోనీ :** మంచిది. పద. నా గృహసేవకులను పిలిపించు. ఈ రాత్రికి మనం ఉదాత్తమైన విందారగిద్దాము.

**ముగ్గురో, నలుగురో దాసజనం ప్రవేశిస్తారు.**

ఏవీ, మీ హస్తాలను ఇలా అందించండి. నీవు కల్మషరహితమైన ప్రభుభక్తిని ప్రకటించావు. అలాగే నీవు, నీవును, నీవు కూడా అలాగే, మీరందరూ నన్ను మహాఘనంగా సేవించారు. మీతోబాటుగా ఎందరో రాజులు కూడా సేవాకృత్యాలలో పాలుపంచుకొన్నారు.

**క్లియోపాత్రా :** (అపవారితంగా ఎనోబార్బస్‌తో) ఇదంతా ఏమిటి?

**ఎనోబార్బస్ :** (క్లియోపాత్రాతో అపవారితంగా) మానసికవేదనవల్ల ఉద్భవిల్లే ఊహావిశేషాలలో ఇది ఒకటి.

**ఆంటోనీ :** నీవూ నా యెడ సత్యసంధుడివై వర్తించావు. నాయందేకమై మీరందరూ నన్ను భక్తిప్రపత్తులతో సేవించారు. కనుక బహురూపాలను ధరించి మీరు నాకెంతటి ఉత్తమసేవ చేశారో, అట్టిసేవను నేనూ చేయాలని అభివాంఛిస్తున్నాను.

**అందరు :** మీరు మమ్మల్ని సేవించే దుఃస్థితి నివారింపబడుగాక!

**ఆంటోనీ :** ఉత్తమసైనికులారా! ఈ నాటిరాత్రి నా పార్శ్వవర్తులై మెలగండి. చషకాలు పొర్లిపోయేటట్లు ద్రాక్షాసవాన్ని పోసుకొని స్వేచ్ఛగా ఆస్వాదించండి. సామ్రాజ్యాధినేతనైన కాలంలో నా నాయకత్వాన్ని అంగీకరించి సేవకులై మీరెలా వర్తించి గౌరవించారో, అలాగే ఈ నాడూ ప్రవర్తించండి.

**క్లియోపాత్రా :** (ఎనోబార్బస్‌తో అపవారితంగా) దీని భావమేమిటి?

**ఎనోబార్బస్ :** (క్లియోపాత్రాతో అపవారితంగా) ఇదంతా ఆయన తన అనుచరులను ఏడ్పించటం.

**ఆంటోనీ :** ఈ నాటిరాత్రి నా ప్రక్కనే ఉండి నన్ను సేవించండి. మీ సేవావృత్తి అంతటితో అంతం కావచ్చు. బహుశః ఇక మీరు నన్ను చూడనే చూడకపోవచ్చు. లేక ఒకవేళ మీరు నన్ను చూస్తే అది కేవలం నా బాహ్యరూపం. నా ఛాయ. రేపు మీరు మరొక యజమానికి సేవకులైపోవచ్చు. అందుకని ఇప్పుడు నేను మిమ్మల్ని నా వీడ్కోలును పరిగ్రహించేవారినిగా పరిగణిస్తున్నాను. సన్మిత్రులారా! నేనేమీ మిమ్మల్ని తరిమివేయటం లేదు. ఒక పతిని పత్ని[100] మరణపర్యంతం విడిచి చరించనిరీతిగా మీరు నన్ననుసరించి సేవించండి. కానీ ఈ నాటిరాత్రి మాత్రం రెండు గంటలకాలం నా వెనువెంటనే ఉండి నన్ను సేవించండి. నేను మిమ్మల్ని ఇంతకంటే ఏమీ కోరబోను. చేసిన ఈ మీ సేవకు దేవతలు మిమ్మల్ని బహూకరించెదరుగాక!

**ఎనోబార్బస్ :** ప్రభూ! మీ అభిప్రాయమేమిటి? వారినెందుకు తామిలా దీనావస్థకు పాల్పడచేస్తున్నారో అర్థం కావటం లేదు. గమనించారా, వారెలా దుఃఖిస్తున్నారో! చివరకు ఒక గార్దభాన్నయిన నేను కూడా ఉల్లిలా ఉన్న నీరంతా కారుస్తున్నాను. సిగ్గుచేటు ప్రభూ! మమ్మల్ని ఇలా మహిళలనుగా మార్చివేయకండి.

**ఆంటోనీ :** హఁ హఁ హఁ![101] వీడ్కోలుకు సన్నిహితమైన సంభాషణగా నేను దీన్ని ఉద్దేశించి ఉన్నట్లయితే ఒక పెనుభూతం నన్ను ఆవరించుగాక! ఆ కన్నీరు రాలిన ప్రదేశం రామణీయకతకు జన్మభూమై నిత్యవివృద్ధినొందుగాక!! హృదయమిత్రులారా! నా ప్రసంగాన్ని మీరు అతితీక్ష్ణంగా భావించండి. ఇలా ప్రసంగించానంటే ఇది కేవలం నేను మీకు సౌఖ్యాన్ని సంతరించటం కోసమే. మీరు ఈ రాత్రినంతటినీ ఉల్లాసాలతో గడపవలసిందనే నేను ఉద్దేశిస్తున్నాను. హృదయతుల్యులైన మిత్రులారా! రేపటిని గురించి నేనెంతో ఆశపెట్టుకున్నాను. మిమ్మల్ని మరణం, ప్రతిష్ఠలున్న చోటికంటే

ఎక్కడ విజయోపేతమైన జీవితం లభ్యమౌతుందని భావిస్తానో, అక్కడికి నాయకుడినై నడిపిస్తాను. మనమందరం రాత్రి విందుకు పోదాం. సిద్ధపడండి. ఇక తీవ్రాలోచనలకు స్వస్తి చెప్పండి. రండి.

**(నిష్క్రమిస్తారు)**

## మూడో దృశ్యం

అలెగ్జాండ్రియా ప్రాసాదం ముందు, ఇరువురు సైనికులు కాపలా వృత్తిలో ఉంటారు.

**ప్రథమ సైనికుడు :** సోదరా! సునక్తం!! రేపే మన రోజు!!

**ద్వితీయ సైనికుడు :** అది తప్పక ఏదో మార్గాన్ని తేల్చి వేస్తుంది. శుభమగుగాక! వీథుల్లోని వింతవిశేషాలేమన్నా విన్నావా?

**ప్రథమ సైనికుడు :** లేదు. విశేషాలేమిటి?

**ద్వితీయ సైనికుడు :** అది కేవలం ఓ 'వదంతి' కావచ్చు. సునిశీథిని!

**ప్రథమ సైనికుడు :** శుభమయ్యా!

**మరి ఇరువురు సైనికులు ప్రవేశిస్తారు**

**ద్వితీయ సైనికుడు :** సైనికులారా! రక్షణవిషయంలో ప్రమత్తులై మెలగండి.

**తృతీయ సైనికుడు :** నీవు కూడా జాగ్రత్తగా ఉండు. సునక్తం!

**రంగస్థలంలో అన్నిమూలలా నిలుస్తారు.**

**చతుర్థ సైనికుడు :** ఈ ప్రదేశాన్ని మేము రక్షించుకుంటాము. రేపు మన నౌకాదళం విజృంభిస్తే పదాతిబలం కూడా దృఢంగా నిలువగలదని నా గాఢవిశ్వాసం.

**తృతీయ సైనికుడు :** అది మిక్కిలి ధైర్యసాహసాలు గల వీరసైన్యం. నిశ్చలనిర్ణయం కలది.

**రంగస్థలంలో అన్నిమూలలా దారుయంత్రాల సంగీతం వినిపిస్తుంది.**

**చతుర్థ సైనికుడు :** నిశ్శబ్దం! ఏమిటీ నిస్వనం?

**ప్రథమ సైనికుడు :** విను. విను.

**ద్వితీయ సైనికుడు :** శ్రద్ధతో విను.

**ప్రథమ సైనికుడు :** ఇది అంతరిక్షంనుంచి కదూ?

**ద్వితీయ సైనికుడు :** కాదు. భూమ్యంతరాళంనుంచి.

**చతుర్థ సైనికుడు :** ఇది ఏమో సూచిస్తున్నది కదూ?

**తృతీయసైనికుడు :** లేదు.

**ప్రథమ సైనికుడు :** నిశ్శబ్దం! దీని అభిప్రాయం ఏమై ఉంటుంది?

**ద్వితీయ సైనికుడు :** ఆంటోనీని అమితంగా ప్రేమించే దైవతం హెర్క్యూల్స్[102] ఇప్పుడు అతణ్ణి విడిచిపోతున్నాడు.

**ప్రథమ సైనికుడు :** నడవండి. ఇతరరక్షకులకు కూడా ఇది వినిపిస్తున్నదేమో తెలుసుకొందాం.

**మరొకస్థానం దగ్గిరికి వారు చేరుతారు**

**ద్వితీయ సైనికుడు :** ఏమిటయ్యా! ఇది?

**అందరూ :** (కలిసి) వింతగా ఉంది! ఏమిటిది? మీకూ వినిపిస్తున్నదా?

**ప్రథమ సైనికుడు :** అవును. ఇది వింతగా లేదూ?

**తృతీయ సైనికుడు :** మీకూ వినిపిస్తున్నదా? మీకూ వినిపిస్తున్నదా?

**ప్రథమసైనికుడు :** మన రక్షణ ప్రదేశపు మేరలదాకా వెళ్ళి ఈ ధ్వని ఏమిటో పరిశీలిద్దాం. ఇది ఎలా లీనమైపోతున్నదో గుర్తిద్దాం.

**అందరు :** బాగుంది. కానీ ఇది చాలా విచిత్రంగా ఉంది.

**(నిష్క్రమిస్తారు)**

## నాలుగో దృశ్యం

అదే ప్రదేశం. ప్రాసాదంలో ఒక కక్ష్య. ఆంటోనీ, క్లియోపాత్రా, ఛార్మియన్, ఇతర పరిచరగణంతో ప్రవేశిస్తారు.

**ఆంటోనీ :** ఇరోస్! ఏదీ నాలోహకవచం?

**క్లియోపాత్రా :** మరికొంతసేపు నిద్రించండి.

**ఆంటోనీ :** ఓసి పెట్టా! వీలు లేదు. ఇరోస్ రా, నా కవచాన్ని తీసుకో రా. ఇరోస్!

**కవచంతో ఇరోస్ ప్రవేశం**

రా! మంచి సేవకుడవోయ్! ఈ లోహకవచాన్ని నా శరీరానికి అమర్చు. అదృష్టం ఇవాళ మనకు అనుకూలించకపోతే అది క్లియోపాత్రాను తిరస్కరించి పోతున్నందువల్ల కలిగిందనుకోవలసి ఉంటుంది. నా వెంట రా!

**క్లియోపాత్రా :** అలా అనకండి. నేను కూడా మీకు తోడ్పాటు నిస్తాను. ఇది ఎందుకు?

**ఆంటోనీ :** దాని ప్రమేయం నీకెందుకు? నీవు తొడగవలసింది ధైర్యకవచాన్ని. తప్పు, తప్పు అంతా తప్పు.

**క్లియోపాత్రా :** నేను మీకు కవచధారణలో సాయపడి తీరవలసిందే. ఇలా ఉండాలి ఇప్పుడు తెలిసింది.

**ఆంటోనీ :** మంచిది. ఇప్పుడు విజయం మనదే. చూచావుటోయ్, ఎలా కవచంతో శరీర రక్షణ చేసుకొన్నానో! ఇక వెళ్ళు. నీ రక్షకదళాలను తమ తమ స్థానాలలో నిలుపు.

**ఇరోస్ :** తమ ఆజ్ఞను తక్షణమే నిర్వహిస్తాను.

**క్లియోపాత్రా :** కవచాన్ని సక్రమంగా అమర్చాను కదూ!

**ఆంటోనీ :** దానికి అమరిక ఇంత బాగా ఎన్నడో గాని కుదరలేదు. విశ్రాంతికి అవసరమని నేను కోరినప్పుడు తప్ప, ఎవరు దీన్ని విప్పుతారో వారికి ప్రళయం తప్పదు. ఇరోస్! నీవు దాన్ని పట్టుకోటానికి ఇలా తికమక పడిపోతున్నావేమిటి? నీ కంటే ఇందులో నా రాజ్ఞే ప్రవీణగా గోచరిస్తున్నది. త్వరపడండి. ఈ నాటి నా రణకర్మకౌశలాన్ని దర్శించి క్షాత్రవృత్తి అంటే ఏమిటో తెలుసుకోగలవు. ఈ నాటి నా యుద్ధక్రియలో ఒక కళాప్రవీణుడెలా కదనరంగంలో విశృంఖల వీరవిహారం చేస్తాడో నీకు గోచరిస్తుంది.

**కవచధారియైన ఒక సేవకుడు ప్రవేశిస్తాడు**

సుప్రభాతం! ఇదే నా స్వాగతం! పరుల పైబడటంలో నీవు ప్రవీణుడివిలా కన్పిస్తున్నావు. అతిప్రియమైన కృత్యాన్ని నిర్వహించటానికి మనం సకాలంలో మేల్కొన్నాము. అందుకోసం మహానందంతో మనమందరం బయలుదేరుదాం.

**సైనికుడు :** ప్రభూ! ఒక సహస్రసైనికులు ఇంత పెందలకడనే పరిపూర్ణంగా యుద్ధోచిత వేషాన్ని ధరించి మీ రాకకోసం ద్వారదేశాన చూస్తున్నారు.

**(కోలాహలం, దుందుభిధ్వానాలు)**

**సేనాపతులు, సైనికులు ప్రవేశిస్తారు.**

**సేనాపతి :** ఈ ఉదయం ఎంతో రమణీయంగా ఉంది సైన్యనేతా! సుప్రభాతం!

**అందరు :** సైన్యనేతా! సుప్రభాతం!!

**ఆంటోనీ :** కాళరాత్రి కమనీయప్రభాతంగా వికసించింది. యువకుని యౌవనశక్తిలా సకాలంలో ఈ నాటి ఉదయం ఉదితమైంది. ఇది రమణీయమైన ఉదయవేళ. రండి. దాన్ని నాకందించండి. ఎంతో బాగా జరిగించారు. ప్రియా! ఇదే నా వీడ్కోలు. శుభమగుగాక! ఇక నాకేమి జరిగినా సరే. ఇదిగో, ఇది సైనికుడిచ్చే ముద్దు. (క్లియోపాత్రాను ముద్దిడుకొంటాడు) సిగ్గుచేత ఇంతకు తక్కువగా సెలవుపుచ్చుకోటం నిందాపాత్రమైంది. లోహవ్యక్తిలాగా ఇప్పుడు నిన్ను నేను విడిచిపోతున్నాను. యోధులారా! మీరు నన్ను వెన్నంటి రండి! మిమ్మల్ని నేను యుద్ధమధ్యంలోకి తీసుకు వెళ్లుతాను. క్లియోపాత్రా! – సెలవు!

**(ఆంటోనీ, ఇరాస్, సేనాపతులు, సైనికులు నిష్క్రమిస్తారు)**

**ఛార్మియన్ :** రాజ్ఞీ! ఇష్టమైతే నీ కక్ష్యకు వెళ్ళిపోదాం.

**క్లియోపాత్రా :** నా కక్ష్యకు నన్ను తీసుకోవెళ్ళు. వీరాధివీరుడివలె ఆయన సమరభూమికి సాగిపోతున్నాడు. ఒక ద్వంద్వయుద్ధంతో ఆయనా, సీజర్ ఈ మహాయుద్ధాని కొక సమాప్తిని సంఘటిస్తే అప్పుడు ఆంటోనీకి విజయం తథ్యం. – అయితే ఇప్పుడో? మంచిది. ఆంటోనీ! సాగిపో!

**(నిష్క్రమిస్తారు)**

## అయిదో దృశ్యం

అలెగ్జాండ్రియా, ఆంటోనీ శిబిరం. దుందుభిధ్వనులు వినిపిస్తుంటవి. ఆంటోనీ, ఇరోస్ ప్రవేశిస్తారు. సైనికుడొకడు వచ్చి వారిని కలుసుకొంటాడు.

**సైనికుడు :** ఆంటోనీ మహాశయుడి కీ నాటిని దేవతలొక ఆనందసమయంగా రూపొందించెదరు గాక!

**ఆంటోనీ :** క్షతగాత్రంతో వచ్చి ఒకప్పుడు నన్ను భూతలయుద్ధం చేయవద్దని బలవంతం పెట్టింది నీవే కదూ?

**సైనికులు :** మీరు అలా చేసి ఉన్నట్లయితే మీ మీద విప్లవం చేసి[103] వెళ్ళిపోయిన రాజులు వ్యతిరేకులు అయ్యేవారే కారు. ఈ ఉదయమే మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిన సైనికశ్రేష్ఠుడు మీతోనే ఉండి మీ అడుగు జాడలను అనుసరించి ఉండి ఉండేవాడు.

**ఆంటోనీ :** ఈ ఉదయం వెళ్లిపోయింది ఎవరు?

**సైనికుడు :** ఎవరా? నిరంతరం మీ వెనువెంట ఉండేవాడు. ఎనోబార్బస్‌ను పిలిపించండి. అతడు ఇక మీ ఆజ్ఞలను పాలించడు. సీజర్ శిబిరం నుంచీ 'ఇక నేను మీ వాడిని కాను' అని కేక పెడతాడు.

**ఆంటోనీ :** నీవేమంటున్నావో నాకర్థం కావటం లేదు.

**సైనికుడు :** ప్రభూ! అతడిప్పుడు సీజర్‌ను చేరుకున్నాడు.

**ఇరోస్ :** ప్రభూ! ఆయన పేటికలు, కోశం అతని వెంట లేవు.

**ఆంటోనీ :** అతడు వెళ్ళిపోయినాడా?

**సైనికుడు :** నిశ్చయంగా!

**ఆంటోనీ :** వెళ్లు, ఇరోస్! అతని కోశాన్నంతటిని అతడి వెంట పంపించు. వెంటనే పంపించాలి. అందులో అణుమాత్రాన్నయినా ఆపివేయకు. ఒక లేఖ వ్రాయి. దానిమీద నేను సంతకం చేస్తాను. అందులోని విషయాలు మృదువుగా వీడ్కోలును, శుభాకాంక్షలను తెలియజేయటం మాత్రమే. 'అతని కిక యజమానిని మార్చవలసిన అవసరం కలుగకుండుగాక!' అని నేను కోరుతున్నట్లుగా వ్రాయి. అయ్యో! నా సంపత్తి సత్యసంధులను మలినం చేసింది. వెంటనే అతని సంభారాలను పంపించి వెయ్యి. ఎనోబార్బస్!

**(నిష్క్రమిస్తాడు)**

## ఆరో దృశ్యం

సీజర్ శిబిరం. కోలాహలం, సీజర్, అగ్రిప్పా, ఎనోబార్బస్ మరి ఇతరులతో ప్రవేశిస్తాడు.

**సీజర్ :** అగ్రిప్పా! ఇక బయలుదేరు. యుద్ధాన్ని ఆరంభించు. ఆంటోనీని సజీవుడుగా పట్టుకోటమే నా అభిలాష. ఈ విషయాన్ని అందరికీ ప్రకటించు.

**అగ్రిప్పా :** అలాగే సీజర్ మహాశయా!

**(నిష్క్రమిస్తాడు)**

**సీజర్ :** ఇది మనకు అనుకూలమైన అదృష్టం గల దినమైతే, విశ్వశాంతికి[103A] అనుకూలమైన కాలం ఆసన్నమైనదన్నమాట! దిశాత్రయ పరివ్యాప్తమైన రోమక సామ్రాజ్యం తిరుగులేకుండా స్వేచ్ఛగా శాంతి ననుభవిస్తుందన్నమాట!!

**ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు**

**వార్తాహరి :** ఆంటోనీ యుద్ధభూమిలో ప్రవేశించాడు.

**సీజర్ :** వెంటనే వెళ్ళి, అగ్రిప్పా, అతనిమీద పడు. అతనిమీద విప్లవం చేసి వచ్చి మనతో చేరుకొన్న వాళ్ళను ముందుపెట్టు. ఆంటోనీ అప్పుడు తన క్రోధాన్నంతటినీ నిజానికి తనవాళ్ళమీద వ్యయిస్తాడు. [103B]

**(ఎనోబార్బస్ తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

**ఎనోబార్బస్ :** జూడియారాజు తనమీద తిరుగబడకుండా వ్యవహారం చేసిరమ్మని ఆంటోనీ పంపించిన ఎలెగ్జాస్, తానే తిరుగబడ్డాడు. అంతే కాదు. అతడు అక్కడికి వెళ్ళి యజమాని అయిన ఆంటోనీని విడిచి, హీరాడ్ రాజును సీజర్ పక్షాన చేరిపొమ్మని బలవంతపెట్టాడు. తనకోసం అతడు ఇంత శ్రమ తీసుకుంటే సీజర్ అతణ్ణి ఉరి తీయించాడు. ఆంటోనీని విడిచి వచ్చిన కానెడియస్ మొదలైనవాళ్ళు సీజర్ కొలువును పొందగలిగారే కాని ఆయన గాఢవిశ్వాసాన్ని సంపాదించలేకపోయారు. నేను మహాతప్పిదం చేశాను. ఇందుకు అతిదారుణంగా నన్ను నేనే నిందించుకొంటున్నాను. ఇక ఎన్నడూ జీవితంలో నాకు ఆనందమంటూ ఉండదు!

**సీజర్ సైనికుడొకడు ప్రవేశిస్తాడు.**

**సైనికుడు :** ఎనోబార్బస్! ఆంటోనీ నీ సమస్తకోశాన్నీ నీ వెంట పంపించాడు. దానితో మరికొన్ని కానుకలను కూడా కలిపి పంపించాడు. ఆ దూత నేను కాపలా కాసే ప్రదేశానికి వచ్చాడు. ఇప్పుడు అతను నీ శిబిరం దగ్గర గార్దభాలమీద నుంచీ సంభారాలను దింపిస్తున్నాడు.

**ఎనోబార్బస్ :** వాటినన్నిటినీ నేను నీకిచ్చివేస్తున్నాను.

**సైనికుడు :** ఎనోబార్బస్! నన్ను ఎగతాళి చేయకు. నేను చెప్పేది సత్యం సుమా! సైన్యమధ్యంనుంచీ అతణ్ణి భద్రంగా ఎక్కడికైనా చేర్చటం ఉత్తమం. నేను నా ఉద్యోగనిర్వహణలో ఉండిపోవలసి వచ్చింది. లేకపోతే ఆ పని నేనే చేసేవాణ్ణి. మీ చక్రవర్తి ఇంకా జౌవ్‌లా వైభవోపేతుడుగానే వర్తిస్తున్నాడు.

**ఎనోబార్బస్ :** పృథ్వీమీద పుట్టిన పరమద్రోహిని నేను. అందుకు నేనెంతో చింతిస్తున్నాను. ఆంటోనీ మహాశయా! నీవు కరుణాఖనివి, నీచబుద్ధినై నిన్ను విడనాడి వచ్చిన నాకు నీవీ సువర్ణాదులను ప్రతిఫలంగా ఎలా పంపగలిగావయ్యా ప్రభూ? ఈ నీ ఔదార్యం నా గుండెలను బ్రద్దలుకొడుతున్నది. దుఃఖోల్బణాలు దాన్ని శతచ్ఛిద్రం చెయ్యలేకపోతే నేను అందుకు అంతకంటే బలవత్తరమైన నా ధనాన్ని దేనినైనా ప్రయోగిస్తాను. అయితే అందుకు దుఃఖం సమర్థమైనదే అని అనుకొంటాను. ఏమిటి? నేను నీకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నానా? లేదు. నీకు ఎదురునిల్చి యుద్ధం చెయ్యను. మరణించటానికి ఏదైనా ఒక మంచి గర్తాన్ని వెదుకుకొంటాను. ఈ అరోచకకృత్యం నా జీవితంలోని అంత్యభాగానికి అతియోగ్యమైంది.

**(నిష్క్రమిస్తారు.)**

## ఏడో దృశ్యం

**శిబిరాలమధ్య యుద్ధభూమి. హెచ్చరిక, దుందుభులు, తుత్తారలు ధ్వనిస్తుంటాయి. అగ్రిప్పా, ఇతరులూ ప్రవేశిస్తారు.**

**అగ్రిప్పా :** వెనుదిరిగి విశ్రాంతి తీసుకొందాము. చాలావరకు మనం సాహసించాము. సీజర్‌కే తన స్థానాన్ని నిలుపుకోటానికి శ్రమౌతున్నది. శత్రువు ప్రయోగించిన బలం ఊహించినదానికంటే ఎంతో ఎక్కువౌతున్నది.

**(నిష్క్రమిస్తాడు)**

**హెచ్చరికలు, క్షతగాత్రులైన ఆంటోనీ, స్కారస్ ప్రవేశిస్తారు.**

**స్కారస్ :** సాహసాంకా, సమ్రాట్! సమరం అంటే ఇదే. తొలుతనే మనం ఇలా వర్తించి ఉంటే, తలకు కట్టుకొన్న కట్లతో వారు పారిపోయేటట్లు చేయగలిగే ఉండేవాళ్లం.

**ఆంటోనీ :** నీ నెత్తురు విపరీతంగా పోతున్నది.

**స్కారస్ :** మొదట నా గాయం 'టి' అనే అక్షరం కారణంగా ఉండి ఇప్పుడు 'హెచ్' ఐంది.

**ఆంటోనీ :** వారు వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నారు.

**ఇరోస్ ప్రవేశిస్తాడు**

**ఇరోస్ :** ప్రభూ! వారిని విజితులను చేశాం. మనకు ఘనవిజయాన్ని కూర్చటానికి ఈ అవకాశం ఎంతో అధికంగా ఉపకరిస్తుంది.

**స్కారస్ :** వారిని వెన్నాడుదాం. జాగిలాలు కుందేళ్ల వెంటబడి తరిమి పట్టుకొన్నట్లుగా వారిని పట్టుకొందాం. పారిపొయ్యేవారిని వెన్నంటి పట్టుకోటం ఎంతో విచిత్రమైన క్రీడ.

**ఆంటోనీ :** నీవు నాకిస్తున్న వీరోచితప్రోత్సాహానికి ఒక రెట్టుగానూ, నీ సాహసానికి పదిరెట్లుగానూ నిన్ను బహూకరిస్తాను. పద.

**స్కారస్ :** నేను మీ వెంట కుంటుతూ వస్తాను.

**(నిష్క్రమిస్తారు)**

## ఎనిమిదో దృశ్యం

**అలెగ్జాండ్రియా కుడ్యాల ముందు. హెచ్చరిక. ఆంటోనీ సైనికవిన్యాసంతో ప్రవేశిస్తాడు. స్కారస్ ఇతరులతో ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** అతణ్ణి శిబిరం వరకూ తరిమి కొట్టాము. మీలో ఒకరు ముందుగా రాజ్ఞి దగ్గరికి పరుగెత్తుకోవెళ్ళి, ఆమెకు మనం సాధించిన ఘనకార్యాలను తెలియజేయండి. సూర్యుడు ఉదయించి తిరిగి మనను చూచేలోగా ఈ నాడు తప్పించుకోపోయినవారి నెత్తుటేళ్లను ప్రవహింపజేద్దాం. మీ కివే నా కృతజ్ఞతాపూర్వకమైన అభినందనలు. మీరందరూ మహాబలశాలురైన వీరపుంగవుల్లా ప్రవర్తించారు. భృతికోసం పోరు సల్పినవారిలా కాకుండా కదన కారణం నాదే కాక మీలో ప్రతి ఒక్కరిదీ అయినట్లు పోరాడారు. హెక్టర్[104] వంటి మహావీరులమని మీరందరూ ప్రదర్శించుకొన్నారు. నగరంలో ప్రవేశించండి! మీ మీ పత్నులనూ, మిత్రులనూ గాఢాశ్లేషసౌఖ్యంలో ముంచెత్తండి!! బవరంలో తగిలిన పవిత్రమైన మీ గాయాలమీద ఆనందబాష్పాల

వర్షించి ముద్దెట్టుకొని వాటికి పూర్ణతను చేకూర్చేటట్టు మీ మీ వీరకృత్యాలను వినిపించండి. (స్కారస్‌తో) ఏదీ, నీ హస్తాన్ని నాకిలా అందించు!

**క్లియోపాత్రా పరివారంతో ప్రవేశిస్తుంది.**

మీరొనర్చిన మహావీరకృత్యాలనన్నింటినీ చేయించిన సమ్మోహిని ఈమే. (క్లియోపాత్రాతో) ఓ సకల ప్రపంచప్రశస్తా! కవచధారణం చేసిన నా కంఠాన్ని గాఢాలింగనంతో బంధించు. ఉన్న దుస్తులతోనే సర్వస్వంగా నిదర్శనకవచంతో నా హృదయంమీదికి దుముకు. విజయ సంభ్రమంతో విర్రవీగుతూ ఉన్న దానిమీద స్వారీ చెయ్యి!

**క్లియోపాత్రా :** ప్రభూనాం ప్రభూ! పరమవిక్రమా! మృత్యుమాయతో ప్రపంచాన్ని ముగ్ధం చేసే యుద్ధంనుంచీ పట్టుబడకుండా చిరునవ్వులు చిలుకరిస్తూ విచ్చేశావా?

**ఆంటోనీ :** ఓ నా నైటింగేల్![105] శయ్యలను చేరుకుండేదాకా వారిని తరిమికొట్టాము. అయితేనేం, పిల్లదానా, నా జుత్తు కొంత నెరిస్తేనేం? నా స్వేదతంతువులు కొంతగా కపిలవర్ణకేశాలతో కలిస్తే మటుకేం, యువకుల దగ్గరనుంచీ విజయానికి విజయాన్ని సాధించగలుగుతాయి. ఈ వీరుణ్ణి తిలకించు. అనుగ్రహసూచకమైన నీ హస్తాన్ని అతడి పెదవులకు అందించు, ముద్దాడుతాడు. వీరయోధుడా! ముద్దిడుకో! మానవజాతి మీద రోతగొన్న దేవతో అన్నట్లు దివ్యాకృతిని ధరించి ఈతడీనాడు శత్రుసంహారం చేశాడు.

**క్లియోపాత్రా :** మిత్రుడా! నీకు నేనొక కాంచనకవచాన్ని బహూకరిస్తాను. అది మహావీరోచితమైంది.

**ఆంటోనీ :** ఫోయిబస్ రథంలా[106]గా అది సూర్యకాంతమాణిక్యాలు పొదిగినదైనా ప్రతిగ్రహించటానికి ఇతడు యోగ్యతను పొందాడు. బహూకృతిగా, ఏదీ, నాకు నీ హస్తాన్ని అందించు. ఉత్సవం చేసుకొంటూ మన వీరగుణచిహ్నాలైన దెబ్బలు తిన్న డాళ్లను ప్రదర్శిస్తూ మనం అలెగ్జాండ్రియా వీథుల్లో తిరుగుదాము. సైన్యానికంతటికీ మన విశాలప్రాసాదంలో రాత్రివిందును ఏర్పాటు చేయించి కలసి భుజిద్దాం. పానపాత్రలను పొర్లిపొయ్యేటట్లు నింపి ఘనప్రమోదాన్ని సూచించే మరునాటి అదృష్టంకోసం ఆసవసేవనం చేద్దాము. తుత్తారవాద్య బృందమా! మీరు నగరశ్రవస్సులు బ్రద్దలయ్యేటట్లు ధ్వనించండి. మీ ఘనస్వరాలు మొరసే మన చిరుదుందుభిధ్వనులతో

కలిసిపోవాలి. అప్పుడు అవి భూమండలంనుంచి ఆకాశానా, ఆకాశంనుంచి భూతలానా ప్రతిధ్వనించి, జైత్రయాత్రాపరులమైన మనను అభినందించాలి.

## తొమ్మిదో దృశ్యం

**సీజర్ శిబిరం, తమ తమ స్థానాలలో నిలిచిన కాపలావారు ప్రవేశిస్తారు.**

**ప్రథమ సైనికుడు :** ఎవరైనా ఒక గంటలోగా వచ్చి మనకు విశ్రాంతి ఇవ్వకపోతే మనం రక్షకజనస్థానానికి తిరిగి వెళ్ళాల్సి ఉంది. గగనం నక్షత్రకాంతులతో కడుశోభాయమానంగా ప్రకాశిస్తున్నది. ఉచితవేషాన్ని ధరించి ఉదయం రెండోగంటనే మనం యుద్ధానికి సన్నద్ధులం కావాలని వారంటున్నారు.

**ద్వితీయ సైనికుడు :** గడిచిన దినం మనకు చాలా చెడ్డది.

**ఎనోబార్బస్ ప్రవేశిస్తాడు.**

**ఎనోబార్బస్ :** ఓ నిశీధినీ! నీవు నాకు సాక్ష్యంగా నిలు.

**తృతీయ సైనికుడు :** ఇదెవరు?

**ద్వితీయ సైనికుడు :** చాటున దాగి విను.

**ఎనోబార్బస్ :** ఓ పవిత్రమైన చంద్రదైవతమా! నీవు నాకు సాక్షివి కా! ప్రజాద్రోహులను నిందిస్తూ జనానీకం జ్ఞప్తిచేసుకొనేటప్పుడు ఎనోబార్బస్ ప్రథమశ్రేణికి చెందిన ప్రభుద్రోహి అయినా, నీ ముందు పశ్చాత్తాపపడినట్లు చెప్పుకొనేటందుకు నీవు నాకు సాక్షివి కా!

**ప్రథమ సైనికుడు :** ఎనోబార్బస్!

**తృతీయ సైనికుడు :** నిశ్శబ్దం! ఇంకా ఏమేం పలుకుతాడో విను.

**ఎనోబార్బస్ :** ఉన్మాదాదివ్యసనాలను[107] సామ్రాజ్ఞివైన ఓ దేవతా! ఇక ప్రభువుకు ఎదురు తిరిగిన ప్రాణం నన్ను బహుకాలం పట్టుకొని వ్రేలాడకుండా నా మీద నిశీథినీవిషశైత్యాన్ని పిండెయ్! దుఃఖించి దుఃఖించి ఇదివరకే ఎండిపోయిన నా గుండె బ్రద్దలై పొడి ఆరి ఇక నీచమైన ఊహలను చేయకుండా ఉంటుంది. నా దోషమనే చెకుముకి రాతిమీదికి విసిరి పారెయ్! ఆంటోనీ మహాశయా! నీవు మహోదాత్తుడవు. నీ మీద నా తిరుగుబాటు ఎన్నిరెట్లుగా నీచాతినీచమైందో నీవు అంతకంటే ఎన్నోరెట్లుగా మహోదాత్తుడవు. నన్ను నీవు క్షమించు. కానీ యజమానిని విడిచిపోయినవాడనీ,

పటాలాన్ని వదలిపారిపోయిన సిపాయీ అనీ నన్ను లోకం గుర్తించుగాక! ఆంటోనీ మహాశయా! మహాశయా, ఆంటోనీ!!

**(మరణిస్తాడు)**

**ద్వితీయ సైనికుడు :** వెళ్ళి అతడితో మాట్లాడుదాం.

**ప్రథమ సైనికుడు :** అతడు ఇంకా ఏమైనా అంటాడేమో విందాం. అందువల్ల సీజర్‌కు ప్రయోజనం ఉండవచ్చు.

**తృతీయ సైనికుడు :** అలాగే చేద్దాము. కానీ అతడు నిద్రపోతున్నాడు.

**ప్రథమ సైనికుడు :** నిద్రగా లేదు. మూర్ఛపోయినట్లున్నాడు. ఎందువల్లనంటే అతడు చేసిన అంత చెడ్డ ప్రార్థన నిద్రకోసంగా కనిపించటం లేదు.

**ద్వితీయ సైనికుడు :** మనం అతనిదగ్గిరికి వెళ్లుదాం.

**తృతీయ సైనికుడు :** లేవయ్యా, లే, మాటాడు.

**ద్వితీయ సైనికుడు :** ఏం, వినబడుతున్నదా?

**ప్రథమ సైనికుడు :** మృత్యుహస్తం అతణ్ణి చేరుకొన్నది. (దూరంగా దుందుభులు వినిపిస్తుంటవి) అవిగో! దుందుభులు నిద్రితులను ప్రశాంతంగా మేల్కొల్పుతున్నాయి. ఇతణ్ణి మనం భటాగారానికి మోసుకోపోదాం. ఇతడెవరో ఉన్నతవర్గంలో వాడు. మన రక్షణకాలం పూర్తిగా అయిపోయింది.

**తృతీయ సైనికుడు :** అయితే రండి. ఇతడు ఇంకా తేరుకోవచ్చు.

**(ఎనోబార్బస్ కళేబరంతో నిష్క్రమిస్తారు)**

## పదో దృశ్యం

**రెండు శిబిరాల మధ్య, తమ సైన్యాలతో**
**ఆంటోనీ, స్కార్కస్ ఇరువురూ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** వారీనాడు మనను సముద్రంమీద ఎదుర్కోటానికి సిద్ధపడ్డారు. భూతలంమీద కలుసుకొంటే వారికి సంతృప్తి కలగదు.

**స్కారస్ :** ప్రభూ! మనం వారిని రెంటిమీదా కలుసుకొందాం.

**ఆంటోనీ :** వారు వహ్నిమీద పోరాడినా, వాయువుమీద పోరాడినా అందుకు నేను సంసిద్ధమే. అయితే మన ఏర్పాటు ఇది. పదాతిదళం నగరాన్ని ఆనుకొని ఉన్న కొండలమీద మనతో బాటుగా ఉంటుంది. సముద్రంమీద శత్రువులతో తలపడ వలసిందని ఇదివరకే ఆజ్ఞ ఇచ్చాను. అప్పుడే వారు రేవు పట్టణాన్ని వదిలిపెట్టి పయోధిమీద పయనమారంభించారు. మనం ముందుకుసాగి కొండలమీదికి చేరుకొందాం. వారి వస్తుసంభారాల విస్తృతి ఎంతో మనం అక్కడినుంచీ కనిపెట్టవచ్చు సముద్రంమీద వారి యుద్ధకృషి ఎంత తీవ్రంగా ఉందో తిలకించనూవచ్చు.

**(నిష్క్రమిస్తారు)**

## పదకొండో దృశ్యం

**అక్కడనే మరోవంక, సీజర్ సైన్యంతో ప్రవేశిస్తాడు.**

**సీజర్ :** వారు మనపైన పడితే తప్ప ఉర్వీతలంమీద మనం ఉన్న స్థానాలలోనే స్థిరంగా ఉండిపోదాం. ఉన్న పరిస్థితులను బట్టి పృథ్వీమీద మనకు పనికలగదనే నా అభిప్రాయం. అతని సైనికుల్లో ఉత్తములందరూ వాటిని జనసమ్మర్దం చేయటానికి నౌకలదగ్గరికి వెళ్లారు. ముందుకు సాగి ఆ లోయలోకి వెళ్లి, మనం ఆనుకూల్యాన్ని చూచుకొని అక్కడ నిలుద్దాం.

**(నిష్క్రమిస్తాడు)**

## పన్నెండో దృశ్యం

**అదే ప్రదేశంలో మరొక భాగం. ఆంటోనీ, స్కారస్ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** వారింకా తారసిల్లలేదు. అదుగో దూరంగా ఆ సాలవృక్షం దగ్గిరనుంచీ అంతా కనిపెట్టుతాను. ఎలా కొనసాగబోతున్నదో వెంటనే నీకు వార్త తీసుకోవస్తాను.

**(నిష్క్రమిస్తాడు)**

**స్కారస్ :** క్లియోపాత్రా తెరచాపల్లో టిట్టిభాలు[108] ఇళ్లు కట్టుకొన్నాయి. శకునజ్ఞులు అదేమో తమకేమీ తెలియటం లేదంటున్నారు. దాని అర్థాన్ని ఏమీ చెప్పలేమంటున్నారు. వ్యాకుల నేత్రాలతో తిలకిస్తున్నారు. తెలుసుకొన్నదాన్ని సాహసించి చెప్పలేకుండా ఉన్నారు. పరాక్రమోపేతుడై ఉన్నా ఆంటోనీలో నిస్పృహ ద్యోతకమౌతున్నది.

శీఘ్రయాతాయాతశీలంగల ఆయన అదృష్టం ఆయనకున్నదాన్ని గురించీ, లేనిదాని గురించీ ఆశాభయభావాల రెంటినీ కల్పిస్తున్నది.

**సముద్రయుద్ధంలో వలె దూరంగా హెచ్చరిక వినిపిస్తుంది.**
**ఆంటోనీ తిరిగి ప్రవేశిస్తాడు.**

**ఆంటోనీ :** సర్వం వినాశనమైంది, నీచురాలు ఈజిప్టు రాజ్ఞి నన్ను మోసగించింది. నౌకాదళం, శత్రువులకు లొంగిపోయింది. అరుగో, దూరంగా, నా సైనికులు బహుకాలానికి కలుసుకొన్న మిత్రుల్లాగా ఆనందతన్మయత్వంతో తమ కుళాయిలను ఎగరవేస్తూ కలిసి త్రాగుతున్నారు. ముప్పురి మార్చిన[109] ఓ బంధకీ! అనుభవంలేని యువకుడికి నన్ను అమ్మివేశావు. నా హృదయం ఇప్పుడు నీ మీదనే కదనం చేస్తున్నది. – వారందరినీ పారిపొమ్మని ఆజ్ఞాపించు. ఇక నాకు మిగిలింది ఒకటే. నన్ను సమ్మోహితుణ్ణి చేసి విడిచిన స్త్రీమీద ప్రతీకారం తీసుకోవటం. దీన్ని జరిగిస్తే నేను సమస్తాన్నీ నిర్వహించినట్లే. – అందర్నీ పారిపొమ్మని ఆజ్ఞాపించు. స్కారస్! సెలవు!

**(స్కారస్ నిష్క్రమిస్తాడు.)**

ఓ రవీ! ఇంకోమారు నీవు ఉదయించటాన్ని నేను దర్శించను. ఇక్కడే, ఇక, నిరంతరంగా ఆంటోనీ, అతని అదృష్టమూ విడివడిపోతున్నారు, ఇక్కడ కూడా మేము ఒకరికొకరం వీడ్కోలు చెప్పుకొంటున్నాము. సర్వం ఇంతకు వచ్చిందా? ఎవరు కోరిన కోర్కెలన్నింటినీ నేను మరుక్షణంలో తీర్చానో, ఆ వీరహృదయాలు ఈ నాడు నన్ను విడనాడి వికసిస్తున్న సీజర్‌ను పరిపుల్లం చేయటానికి అతనిని చేరిపోతున్నారు. నేను సర్వవృక్షాలను మించి పెరిగిపోయిన దేవదారువును. ఇప్పుడు నాపై చర్మాన్నంతటినీ కోల్పోయాను. మోసానికి పాలైనాను. ఓ ఈజిప్టు రాజ్ఞీ! కృత్రిమహృదయీ! ఎవతె కనుచూపు నన్ను కదనభూమికి పంపటానికీ, తిరిగి రమ్మనటానికీ సమర్థమైందో, ఎవతె ప్రేమను నా కిరీటంగానూ, చరమ లక్ష్యంగానూ పరిగణించానో ఆ భీషణసమ్మోహనాంగి, గాఢవినాశం పొందేటంత వరకూ నన్ను ఏదో మాయ చేసి మోసగించింది. ఏమిటది ఇరోస్! ఇరోస్!!

**క్లియోపాత్రా ప్రవేశిస్తుంది.**

**క్లియోపాత్రా :** ప్రభువెందుకో తమ ప్రియురాలైన ఈ క్లియోపాత్రా మీద కినుక వహించారు?

**ఆంటోనీ :** ఇక్కడినుంచి అదృశ్యమై పో! లేదా నీకు తగ్గ శాస్తి చేయవలసి వస్తుంది. అందువల్ల సీజర్ విజయానికి అప్రతిష్ఠ ఘటిల్లుతుంది. అతడు బందీగా పట్టుకోవెళ్లి

కరతాళధ్వనులతో చెలరేగే ప్లీబన్ల[110]కు చక్షుఃప్రీతి కలిగేటట్లు నిన్ను ఎగురవేయుగాక! నీ స్త్రీజాతికంతటికీ కలిగిన తురీయకళంకంలాగా అతడు నిన్ను రథానికి కట్టి తీసుకుపోయేటప్పుడు, నీవు దాన్ని అనుసరింతువుగాక! బహుకాలంనుంచీ శాంతి వహించి బాధపడుతున్న ఆక్టేవియా సిద్ధం చేసుకొన్న కొనగోళ్ళతో నీ ముఖాన్ని చారలుపడ గీరుగాక!

**(క్లియోపాత్రా నిష్క్రమిస్తుంది)**

నీవు వెళ్ళిపోవటం ఎంతో మంచిదైంది. లేకపోతే నేను నిన్ను చంపివేసేవాణ్ణి. అయితే నా క్రోధం వల్ల నీవు మరణించటం కూడా ఒకరీతిగా మేలై ఉండేది. నీ ఒక్కతె చావు అనేకవ్యక్తుల మరణాలను ఆపివేసేది. ఓ ఇరోస్! నెస్సెస్[111] విషప్రావృతకం నన్ను కప్పేస్తున్నది. ఓ నా వంశకర్తా ఆల్సిడిస్![112] నీ క్రోధోద్వేగాన్ని నాకు నేర్పు. నాలిఛాస్‌ను చంద్రదేవతా శృంగాలమీదికి విసిరి ఆ హస్తాలతోటే ప్రబలమైన గదను గ్రహించి నీకు యోగ్యవారసుడనైన నన్ను నేనే అంతమొందించుకోగల ఆత్మశక్తిని నాకు ప్రసాదించు. ఆ మాంత్రికురాలు మరణించుగాక! ఆమె నన్ను యువకుడైన ఆ రోమన్‌బాలుడికి అమ్మివేసింది. నేను వారి కుతంత్రాలకు బలై పోతున్నాను. ఇందుకామెకు నే విధించే శిక్ష మరణమే. ఇరోస్! ఇరోస్!!

**(నిష్క్రమిస్తాడు)**

## పదమూడో దృశ్యం

**అలెగ్జాండ్రియాలోని క్లియోపాత్రా ప్రాసాదంలో**
**క్లియోపాత్రా, ఛార్మియన్, ఐరాస్, మార్డియన్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** నాకు సాయపడండి. ఓ నా పార్శ్వపరిచారికలారా! ఎకిలిస్‌డాలుకోసం ఉద్రిక్తుడైన టెలమన్[113] కంటే ఆయన అత్యధికంగా ఉన్మత్తుడైనాడు. థెస్సలీ వరాహమైనా[114] కలిగిన నిస్త్రాణవల్ల ఇంతమిక్కిలిగా నురగలు కక్కలేదు.

**ఛార్మియన్ :** నీ పిరమిడ్ దగ్గిరికి వేగంగా సాగిపో. ఆ లోపల ఉండి మూసివేయించుకో. మరణించావని అతనికి వార్త పంపించు. బహుకాలం అనుభవించిన ఘనత పోవటం కంటే శరీరం, ఆత్మ అనే రెండూ విడివడిపోవడం దొడ్డవిషయం కాదు.

**క్లియోపాత్రా :** నేను నా సమాధినిర్మాణం దగ్గిరికి చరచరా వెళ్ళిపోతున్నాను. మార్డియన్, నీవు వేగంతో వెళ్ళి నేను ఆత్మహత్య చేసుకొన్నానని ఆయనతో చెప్పు. నేను తుదిమాటగా

‘ఆంటోనీ’ అని అన్నానని చెప్పు. నిన్ను ప్రార్థిస్తున్నాను. నా మరణాన్ని గురించి నీవు చెప్పగలిగినంత దీనంగా చెప్పు. మార్డియన్! ఆలసించకు. నా మరణాన్ని గురించి విన్న తరువాత ఆయన ఎలా వ్యవహరించారో, వెంటనే వచ్చి నాకు తెలియజెయ్! నేను నా సమాధినిర్మాణం దగ్గరికి వెళ్ళిపోతున్నాను.

**(నిష్క్రమిస్తుంది)**

## పదునాల్గో దృశ్యం

**అదే ప్రదేశం, మరో కక్ష్య, ఆంటోనీ, ఇరోస్ ప్రవేశిస్తారు.**

**ఆంటోనీ :** ఇరోస్! నన్ను వెనకటిలాగానే నీవు చూడగలుగుతున్నావా?

**ఇరోస్ :** ఉదాత్తప్రభూ! అలాగే చూడగలుగుతున్నాను.

**ఆంటోనీ :** అప్పుడప్పుడూ మేఘాలు మనకు ఘటసర్పాలులాగానూ, ఆవిరులు భల్లూకసింహాకారాలతోనూ గోచరిస్తుంటాయి. అవి శిఖరాలుగల ప్రాసాదాలల్లాగానూ, వ్రేలాడే కొండల్లాగానూ, పంగలపర్వతాలలాగానూ, నాలికలా సముద్రంలోకి చొచ్చుకోపోయి పైన చెట్లగల నీలపునేల తునుకల్లాగానూ, ప్రపంచానికి శిరాలు వంచిన వాతావరణంవల్ల కన్పించి, మన కళ్ళను మోసగిస్తుంటాయి. నీవిటువంటి విభ్రామ్యాలను చూచే ఉంటావు. ఇవన్నీ సాయం కాలతిమిరాలు మనకు చూపించే దృశ్యాలు.

**ఇరోస్ :** అవును ప్రభూ! నేనూ అటువంటి వాటిని చూచాను.

**ఆంటోనీ :** భావాతివేగంతో వెడుతూ గుర్రంలా కనిపించే దానిని పై ఉష్ణవాయువు ఇప్పుడు నీటితో కలిసి పోయినట్లుగా చెరిపివేసింది.

**ఇరోస్ :** ప్రభూ! మీరన్నట్లే జరిగింది.

**ఆంటోనీ :** ఇరోస్! నీవు నా ప్రియసేవకుడివి. నీ సేనాధినేతనైన నేను కూడా పై వానిని పోలిన ఒక దృశ్యాన్నే. ఇక్కడిప్పుడు నేను ఆంటోనీగా ఉన్నాను. ఇరోస్! అయినా ఇప్పుడు నే ధరించిఉన్న ఈ రూపాన్ని ఇక నేను నిలువబెట్టుకోలేను. ఈ యుద్ధాలనన్నిటినీ నేను క్లియోపాత్ర కోసం చేశాను. నా హృదయం ఆమెది కనుక ఆమె హృదయం నాదనుకొన్నాను. కానీ అది నాదై ఉన్నప్పుడే కోటిహృదయాలను ఆకర్షించింది. ఇప్పుడు నేను దాన్ని కోల్పోయాను. ఆమె ఇప్పుడు సీజర్‌తో రహస్యంగా సంధి చేసుకొని శాత్రవులకు విజయాన్ని చేకూర్చి, నన్నూ, నా కీర్తినీ మోసగించింది.

వద్దు. ఇరోస్! కోమలహృదయుడా! దుఃఖించవద్దు. మనను అంతమొందించు కొనే అధికారం ఇంకా మనదగ్గరనే ఉంది.

### మార్డియన్ ప్రవేశిస్తాడు

**ఆంటోనీ :** ఓరీ దుష్టుడా! ఆమె నా ఖడ్గప్రాభవాన్ని కాజేసింది.

**మార్డియన్ :** లేదు, ఆంటోనీ మహాశయా! మా యజమానురాలు నిన్ను ప్రేమించింది. తన అదృష్టాన్ని ఆమె పూర్ణంగా మీతోనే పెనవేసింది.

**ఆంటోనీ :** వెళ్ళిపో! ఓరీ తుంటరి కొజ్జా! ఆమె నా యెడ అనురాగంతో వర్తించిందనటానికి నీకెంతటి ధైర్యం! ఎంతటి స్థైర్యం!! ఆమె నన్ను మోసగించింది. ఇందుకుగానామె ద్రోహిలా మరణించి తీరవలసిందే!

మార్టియన్ : మరణమనే ఋణాన్ని ఎవరైనా ఒక్కమారే చెల్లించగలరు. ఆమె దానిని ఇంతకుపూర్వమే చెల్లించింది. మీరేమి చెయ్యాలని కోరుతున్నారో అది, ఇదివరకే, మీకోరికకు అనుగుణంగానే జరిగిపోయింది. ఆమె తుదిక్షణంలో పలికిన పలుకు "ఆంటోనీ! అత్యుదారుడా!" అన్నదే. గుండెను చీల్చుకొనివచ్చే ఒక మూల్గు మధ్యలో ఆంటోనీ మహాశయా! ఆమె నీ నామోచ్ఛారణాన్ని ఆపివేసింది. అది ఆమె మోవికీ, హృదయానికీ మధ్య రెండై నిలిచిపోయింది. ఇలా ఆమె తిరిగీ తన ప్రాణాన్ని ఇచ్చివేసింది ఇలా నీ నామం ఆమె హృదయంలో సమాధి కట్టుకొన్నది.

**ఆంటోనీ :** ఆమె మరణించిందా?

**మార్డియన్ :** మరణించింది.

**ఆంటోనీ :** ఇరోస్! ఇక నీ రణవేషాన్ని విప్పివెయ్! దీర్ఘదినకృత్యం నిర్వర్తితమైంది. మనం ఇక నిరంతరవిశ్రాంతి కోసం దీర్ఘనిద్ర పోదాం. (మార్డియన్‌తో) ఇటువంటి దారుణ వార్తను కొనివచ్చి కూడా ప్రాణంతో వెళ్ళిపోతున్నావు కనుక, నీకు ప్రతిఫలం ఎంతో ఘనంగా ముట్టినట్లు. వెళ్లు! (మార్డియన్ నిష్క్రమిస్తాడు) ఇరోస్, నా శస్త్రవేషాన్ని విప్పివెయ్! ఏడుపొరలు గల ఎజాక్సుఖేటం నాకున్నా ఈ మహాదారుణమైన ఆపద చేసిన ముట్టడినుంచి నన్ను రక్షించలేదు. అయ్యో! నా హృదయపక్షాలను బ్రద్దలుకొట్టు. దానిని పొంది దానికంటే ఎన్నో రెట్లు బలవత్తరమైన నా హృదయం స్వీయపేటికను బ్రద్దలు కొట్టుకొని బయటపడుగాక! ఇరోస్! త్వరగా పోదాం పద! త్వరపడు. ఓ నా శస్త్రశకలాల్లారా! ఇక నేను యుద్ధవీరుణ్ణి కాను. మిమ్మల్ని ఇంతవరకూ మహోదాత్తంగా

భరించాను. మీకిదే నా వీడ్కోలు. ఇరోస్! క్షణకాలం నాకు ఏకాంతాన్ని కల్పించు (ఇరోస్ నిష్క్రమిస్తాడు). క్లియోపాత్రా ఈ యాత్రలో నిన్ను నేనధిగమిస్తాను. నన్ను క్షమించమని నీకడ కన్నీరు కార్చి వాపోతాను. అవును. నాకింతకంటే మార్గం మరేమీ లేదు. ఇక జీవిస్తే చిత్రవధే! నన్ను నడిపించిన జీవితజ్యోతి వీడిపోయిన తరువాత శయనించటం మంచిది. ఇక చీకట్లో తట్టాడకు. శ్రమసర్వం వ్యర్థమైంది. విజయాలకు హేతువైన నా మూల బలమే అపజయాన్ని నిశ్చయిస్తున్నది. దీన్ని ముద్రాంకితం చెయ్! సర్వం పరిసమాప్తమైంది. ఇరోస్! – క్లియోపాత్రా! నేనూ వస్తున్నాను. ఇరోస్! నా కోసం ఆగు, మృతులైనవారి ఆత్మలు ఎక్కడ పుష్పశయ్యలమీద శయనిస్తాయో, అక్కడ ప్రాణులు ఆశ్చర్యగౌరవాలను ప్రదర్శిస్తూ తిలకించేటట్లు మనం చేయి, చేయి కలిపి సంభ్రమంగా పచారులు చేద్దాము. అక్కడి సర్వభూత ప్రపంచం మన ఇరువురి చుట్టూ చేరడంవల్ల ఇక డిడోకు,[115] ఆమె ప్రియుడైన ఏయ్ నియాస్‌కు పార్శ్వచరులు కరువైపోతారు. ఇరోస్! ఇరోస్!!

**ఇరోస్ తిరిగి ప్రవేశిస్తాడు**

**ఇరోస్ :** ఏమి సెలవు ప్రభూ?

**ఆంటోనీ :** క్లియోపాత్రా మరణించినప్పటినుంచీ దేవతలు నా నీచత్వాన్ని అసహ్యించుకొనేటంతటి అప్రతిష్ఠాకరమైన జీవితాన్ని గడుపుతున్నాను. విశ్వాన్నంతటినీ ఖడ్గచాలనలతో నా ఇచ్ఛానుసారంగా విభజించిన నేను, ఒక్కొక్కటే ఒక నగరాన్ని నింపుకోగల నౌకలతో నెప్ట్యూన్[116] హరితార్ణవం మీద అఖండవైభవంతో వెలిగిన నేను, ఒక స్త్రీకంటే అధిక సాహసికుణ్ణిగానీ, ఉదాత్తుణ్ణిగానీ కానని తీర్పు చెప్పుకొన్నాను. మరణంతో ఆమె మన సీజర్‌కు 'నా విజేత్రిని నేనే!' అని తెలియజెప్పింది.

ఇరోస్! విషమపరిస్థితి ఏర్పడితే – నిశ్చయంగా అది ఇప్పుడేర్పడ్డది – అపకీర్తి భీతి వెన్నాడటాన్ని గమనించి, నేనెప్పుడాజ్ఞాపిస్తే అప్పుడు నీవు నా ప్రాణాలను తీస్తావని శపథం చేశావు. ఆ కాలం వచ్చింది. వెనుదీయకు. సత్యానికి నీవు నన్ను చంపటం లేదు సీజర్‌కు ఆశాభంగం కలిగిస్తున్నావు. జంకకు. ధైర్యాన్ని చిక్కబట్టుకో.

**ఇరోస్ :** ఈ కృత్యనిర్వహణాన్ని దేవతలు మాన్పించెదరుగాక! పరమశత్రువులైన పార్థియన్లే[117] మహాయత్నాలు చేసి విఫలులైన ఈ కార్యాన్ని నేను నిర్వహించవలసి వచ్చిందా?

**ఆంటోనీ :** ఇలా చేతులు కట్టుకొని నీ యజమాని సహజౌద్ధత్యంగల కంఠాన్ని కుంచించి ఆత్మలోకి చొచ్చుకోపోయిన సిగ్గువల్ల ముఖం వంచి, సీజర్ విజయరథ పార్ష్ణి భాగాన అపకీర్తి ముద్రితుడై నడుస్తుంటే, ఇరోస్! నీకేమైనా రోము మహానగరంలోని ఒక ఉన్నత వాతాయనంలో నిల్చి చూడాలని కోరికుందా?

**ఇరోస్ :** ఆ దృశ్యాన్ని నేను చూడను!

**ఆంటోనీ :** అయితే రా. ఒక్కపోటుతో నా జీవితమనే వ్యాధిని అంతమొందించు. నీ దేశ సంక్షేమార్థంగా ధరించిన విశ్వాసపాత్రమైన నీ కృపాణాన్ని ఒరనుంచి దుయ్!

**ఇరోస్ :** ప్రభూ! నన్ను క్షమించండి!

**ఆంటోనీ :** మరి నీకు నేను స్వాతంత్రం ప్రదానం చేయలేదా? నేను ఆజ్ఞాపించినప్పుడీ పని చేస్తానని నీవు శపథం చెయ్యలేదూ? తక్షణం చేసెయ్! లేకపోతే పూర్వం నీవు చేసిన సేవలన్నీ యాదృచ్ఛికకృత్యాలేగాని భక్తితో చేసినవి కావని భావించవలసి ఉంటుంది. కత్తిదూసి పూనుకో.

**ఇరోస్ :** అయితే సర్వప్రపంచం భక్తితాత్పర్యాలతో పూజించే ఆ మీ ముఖాన్ని నా వంకనుంచి ప్రక్కకు త్రిప్పండి.

**ఆంటోనీ :** అలాగే కానీ!

**(అతనివంక నుంచి ప్రక్కకు తిరుగుతాడు)**

**ఇరోస్ :** ఇదిగో నా కత్తిని దూశాను.

**ఆంటోనీ :** ఎందుకోసం దాన్ని దూశావో ఆ పనిని నీ ఖడ్గం చేత వెంటనే చేయించు.

**ఇరోస్ :** ప్రియమైన ఓ నా స్వామీ! నా సైన్యాధినేతా!! నా సమ్రాట్!! ఈ దారుణమైన ఘాతకు పూనుకొనేముందుగా నన్ను మీకు వీడ్కోలు చెప్పుకోనీయండి.

**ఆంటోనీ :** ఆ వీడ్కోలును నీవు చెప్పటం అయిపోయింది. ఇదే నా వీడ్కోలు!

**ఇరోస్ :** మహాగ్రేసరా! ఇదే వీడ్కోలు. ఘాతకు సిద్ధమేనా?

**ఆంటోనీ :** కానీ ఇరోస్!

**ఇరోస్ :** ఇక నేనెందుకు? ఈ పని చేసి ఆంటోనీ మహాశయుని మరణంవల్ల కలిగే దుఃఖంనుంచి తప్పించుకొంటాను.

**(తన్ను చంపుకొంటాడు)**

**ఆంటోనీ :** వీడు నా కంటే మూడురెట్లు ఉదాత్తుడు. సాహసికా, ఇరోస్! నేను చెయ్యదగ్గదేదో, నీవు చెయ్యలేకపోయిందేదో ఇందుమూలంగా నీవు నాకు పాఠం నేర్పావు. నా రాజ్ఞి, ఇరోస్ ఇరువురూ నాకు సాహసచర్యను గురించి పాఠాన్ని నేర్పి, వీరకృత్యచరిత్రలో నా కంటే ఉత్తమస్థానాన్ని సంపాదించుకొన్నారు. అయితే ఉత్సాహంతో వధువు దగ్గరికి వెళ్లే వరునిలా నేను మృత్యువు దగ్గిరికి వెళ్లుతాను. ప్రియుడు వైవాహికశయ్యను చేరేటట్లు నేను ఆమెతో లీనమౌతాను. ఇక నిర్వర్తిస్తాను. ఇరోస్! నీ యజమాని నీకు శిష్యుడై మరణిస్తున్నాడు. (కత్తిమీద పడిపోతూ) ఇలా చేయటం నేను నీ దగ్గరనే నేర్చుకొన్నాను. ఏమిటి? ఇంకా నేను మరణించలేదా? ఇంకా మరణించలేదా? ఓ రక్షకభటులారా! నన్ను పంపించి వేయండి. ఓ....

డెర్సిటాస్, మరొక రక్షకభటుడు ప్రవేశిస్తారు.

**ప్రథమ సేవకుడు :** ఈ శబ్దమేమిటి?

**ఆంటోనీ :** మిత్రులారా! నేను పనిని సక్రమంగా పూర్తిచేయలేదు. నేనారంభించింది పూర్తిచేయండి.

**ద్వితీయ భటుడు :** మహానక్షత్రం రాలిపోయింది.

**ప్రథమ భటుడు :** ఇంతటితో కాలమే పరిసమాప్తమైంది.

**అందరూ :** అయ్యో, మనకెంతటి ఆపద వచ్చింది!

**ఆంటోనీ :** ఎవడు నన్ను ప్రేమిస్తే అతడు నన్ను అంతమొందించుగాక!

**ప్రథమ భటుడు :** నేను ప్రేమించటం లేదు.

**ద్వితీయ భటుడు :** నేనూ ప్రేమించటం లేదు.

**తృతీయ భటుడు :** ప్రేమించేవారు ఇక్కడ ఎవరూ లేరు.

**(భటులు నిష్క్రమిస్తారు)**

**డెర్సిటాస్ :** నీ మృత్యువు, భగ్నమైన నీ అదృష్టం అనుచరులను పారిపోయేటట్లు చేస్తున్నవి. ఈ ఖడ్గాన్ని చూపించి జరిగినవార్త వినిపిస్తే సీజర్ నిన్ను తన ఆప్తసేవకుణ్ణిగా స్వీకరిస్తాడు.

**దయొమిడిస్ ప్రవేశిస్తాడు**

**డయొమిడిస్ :** ఆంటోనీ మహాశయుడెక్కడ?

**ఆంటోనీ :** డయొమెడ్! ఇక్కడ, ఇక్కడ!

**డయొమిడిస్ :** ఇంకా ఆయన బ్రతికే ఉన్నాడా? సజీవుడేనా? సమాధానం చెప్పవేమయ్యా?

**(డెర్సిటాస్ నిష్క్రమిస్తాడు).**

**ఆంటోనీ :** డయోమెడ్! నీవు అక్కడున్నావా? నీ కత్తిని దూసి మరణపర్యంతంగా ఒక వ్రేటు వెయ్యి!

**డయొమిడిస్ :** ఓ నిరంకుశప్రభూ! నా యజమానురాలు క్లియోపాత్రా నన్ను మీదగ్గరికి పంపించింది.

**ఆంటోనీ :** ఆమె నిన్నెప్పుడు పంపించింది?

**డయొమిడిస్ :** ఇప్పుడే ప్రభూ!

**ఆంటోనీ :** ఆమె ఎక్కడుంది?

**డయొమిడిస్ :** తన సమాధి నిర్మాణంలో తాళం వేసుకొని ఉండిపోయింది. జరిగిపోయిన దానిని సూచించే భయమామెకు ముందుగానే కలిగింది  ఆమె సీజర్‌తో సంధి చేసుకొన్నదని మీరు అనుమానించినప్పుడు – ఇది కేవలం ఆధారరహితమైన అనుమానం – మీ కోపం శమింపలేదని గమనించి ఆమె మీకు మరణించానని వార్త పంపించింది. ఆ వార్త మీ యెడ ఎలా వర్తిస్తుందో అన్న భయంతో సత్యాన్ని తెలియజేయటం కోసం నన్ను పంపించింది. నేను వచ్చాను. చాలా ఆలస్యమైపోయింది.

**ఆంటోనీ :** అవును. చాలా ఆలస్యమైంది. కనికరించి నా రక్షకభటుణ్ణి కేకపెట్టు!

**డయొమిడిస్ :** ఎవరక్కడ? చక్రవర్తి రక్షకభటుల్లో ఎవరక్కడ? రండి మీ చక్రవర్తి పిలుస్తున్నాడు.

ఆంటోనీ రక్షకభటులు నలుగురైదుగురు ప్రవేశిస్తారు.

**ఆంటోనీ :** ప్రియమిత్రులారా! క్లియోపాత్రా ఉన్నచోటికి నన్ను మోసుకు పోండి. మీకు నేనిచ్చే తుది ఆజ్ఞ ఇదే!

**ప్రథమ భటుడు :** ప్రభూ! ఇది మీకెంతటి కీడు! మీ అనుచరులను అందరినీ మించి మీరు జీవించరా!

**అందరు :** ఎంతటి దుర్దినం!

**ఆంటోనీ :** ప్రియులారా! విలువగల మీ చింతలను చెల్లించి క్రూరవిధిని సంతృప్తిపరచటానికి యత్నించవద్దు. మనసు శిక్షించటానికి ఏది వస్తే దానికి స్వాగతమీయండి. అది ఇచ్చే శిక్షను అవలీలగా భరిస్తే అప్పుడు దాన్ని మనమే శిక్షించినట్లౌతుంది. నన్ను పైకి తీసుకోపొండి. మీకు నాయకుడినై అనేకపర్యాయాలు మిమ్మల్ని నడిపించాను. ఇప్పుడు నన్ను మీరు నడిపించండి. మోసుకోపొండి. నాకు చేసిన సేవలన్నిటికీ నా ప్రణామాలను అందుకోండి.

**(ఆంటోనీని మోసుకుపోతూ నిష్క్రమిస్తారు)**

## పదిహేనో దృశ్యం

**అలెగ్జాండ్రియా. ఒక సమాధి నిర్మాణం. క్లియోపాత్రా, ఆమె కన్యలు, పరిచరగణం, ఛార్మియన్, ఐరాస్‌తో పైన ప్రవేశిస్తుంది.**

**క్లియోపాత్రా :** చార్మియన్! నేను ఇక్కడినుంచి వెళ్ళనే వెళ్ళను!

**ఛార్మియన్ :** అమ్మా! నీవు సౌఖ్యాన్ని చేకూర్చుకో.

**క్లియోపాత్రా :** లేదు, సౌఖ్యం నాకవసరం లేదు. సమస్త విచిత్ర సన్నివేశాలకూ, దారుణ సంఘటనలకూ మనం సిద్ధపడుతుంటాం. కానీ మనం ఉపలభ్యమానాలైన సంతోషాలను ఉపభోగించం. నా కారణానికి తుల్యమైందై, దాన్ని కల్గించడానికి కారణమైన ఆపద ఎంతటి గొప్పదో నా దుఃఖం అంత గొప్పది కాక తప్పదు.

**క్రింద డయొమెడిస్ ప్రవేశిస్తాడు**

ఆంటోనీ  ఎలా ఉన్నాడు? మరణించాడా?

**డయొమిడిస్ :** మృత్యువాయన్ను సమీపించింది. కానీ మరణించలేదు. మీ కట్టడానికి ఆవలిదిక్కున చూడండి. ఆయన రక్షకభటుడొకడు ఆయన్ను మోసుకోవచ్చాడు.

**క్రింద రక్షకభటుడు కొనివచ్చిన ఆంటోనీ ప్రవేశిస్తాడు**

**క్లియోపాత్రా :** ఓ రవీ! నీవు తిరుగుతున్న ఆ మండలాన్ని దగ్ధం చెయ్! సర్వప్రపంచాన్నీ దాని తీరాలతో బాటుగా తిమిరాలపాలు చెయ్! అయ్యో! ఆంటోనీ! ఆంటోనీ!! ఆంటోనీ!!

ఛార్మియన్! సాయపడు. ఐరాస్! సాయపడు. క్రింద ఉన్న మిత్రులారా! సాయపడండి. మనం ఆయన్ను ఇక్కడికి చేరుద్దాం.

**ఆంటోనీ :** శాంతి వహించండి. ఆంటోనీని పడగొట్టింది సీజర్ పరాక్రమం కాదు. అతని పరాక్రమమే అతని మీద విజయం చేకొన్నది.

**క్లియోపాత్రా :** అలాగే జరిగి ఉండాలి. లేకపోతే ఆంటోనీని గెలవగలిగేవారు ఆంటోనీతప్ప మరెవ్వరుంటారు. అయినా అలా జరగటం ఎంత దురదృష్టం!

**ఆంటోనీ :** నేను మరణిస్తున్నాను. ఈజిప్టు రాజ్ఞీ! నేను మరణిస్తున్నాను. నీ పెదవులమీద నేనుంచిన వేయి ముద్దుల్లో తుదిదైన ఈ నిరుపేదముద్దును నిలుపటం కోసం మృత్యువును ఇంచుక వేచి ఉండమని ప్రార్థిస్తున్నాను.

**క్లియోపాత్రా :** దాన్ని స్వీకరించటానికి సాహసించి నేను దిగిరాలేను. ప్రియప్రభూ! క్షమించండి. నేను సాహసించలేను. దిగివస్తే నన్ను బందీగా పట్టి తీసుకోపోతారని నా భయం. సంపత్పరిపూర్ణుడైన సీజర్ విజయప్రవేశదృశ్యం నా వల్ల అలంకరింపబడదు. కత్తికి అంచు, మూలికలకు శక్తి, పాములకు కాటూ అంటూ ఉంటే నా భద్రతకు భంగం ఏమీ ఉండదు. నీ భార్య ఆక్టేవియా లజ్జావిశాలనేత్రాలతో, నిలుకడగల నిశ్చయంతో అలక్ష్యంగా నన్ను పరికించి చూసే గౌరవాన్ని పొందదు. రా. రా.. ఓ నా ఆంటోనీ! – ఓ నా వనితాగణమా! నాకు సాయపడండి. ఆయనను మనం పైకి తీసుకురావాలి. ఉత్తమమిత్రులారా! సాయపడండి!!

**ఆంటోనీ :** అయ్యో! తొందరపడండి! లేకపోతే నేను అయిపోతున్నాను.

**క్లియోపాత్రా :** నిజమైన విలాసమంటే ఇదే! నా ప్రభువెంత బరువుగా వున్నాడు! మనబలమంతా భారాన్ని కల్పించే బండతనంగా మారిపోతున్నది. నాకే జూనోకున్న[118] అధికారముంటే బలవత్పక్షాలుగల దూత మెర్క్యూరీ[119] నిన్ను పైకితెచ్చి జౌవ్ ప్రక్కన కూర్చుండబెట్టేవాడు. ఇంకా కొంచెం పైకిరా. కేవలం కోర్కెలు – మరి ఆ, రా. రా. రా. (వారు ఆంటోనీని క్లియోపాత్రావరకు చేర్చుతారు) స్వాగతం! ప్రభూ, సుస్వాగతం!! ఎక్కడ నీ జీవితాన్ని అంతటినీ అనుభవించావో నీవు ఆ కౌగిలిలో మరణించు, ముద్దుపెట్టుకొని పునరుజ్జీవించు. నేడు నా పెదవులకు పూర్వమున్న శక్తి ఉంటే నేను దాన్నంతటినీ ఇలా పిండి ఇస్తాను.

**అందరు :** ఇది ఒక మహాదీన దృశ్యం!

**ఆంటోనీ :** నేను మరణిస్తున్నాను. ఈజిప్టురాజ్ఞీ! నేను మరణిస్తున్నాను. కొంత ద్రాక్షాసవాన్నివ్వు మరికొంతసేపు మాటాడగలుగుతాను.

**క్లియోపాత్రా :** కాదు ప్రభూ! నన్ను మాటాడనివ్వు. ఆమె మీద విసరబోతున్న నిందకు కోపం తెచ్చుకొని, తనచక్రాన్ని బ్రద్దలుకొట్టే రీతిలో అనతికాలంలో నన్ను వీడబోతున్న ద్రోహచిత్త ఆ అదృష్టదైవతాన్ని విరుచుకోపడి తిట్టనీ!

**ఆంటోనీ :** మధురప్రియా! ఒక్కమాట. సీజర్‌వల్ల నీ గౌరవభద్రతలకు రెంటికీ ఎట్టి అపాయం కలగదు. సంధి చేసుకో. ఓ రాజ్ఞీ! నా కోరికను చెల్లించు.

**క్లియోపాత్రా :** నా గౌరవభద్రతలు రెండూ కలసి మెలగలేనివి.

**ఆంటోనీ :** సాధుశీలా! నా మాట విను. సీజర్‌కు సంబంధించిన విషయాల్లో ప్రొక్యులైయస్‌ను తప్ప అన్యులను ఎవరినీ నమ్మకు.

**క్లియోపాత్రా :** నా నిర్ణయాన్నీ, నా హస్తాలనూ మాత్రమే నమ్ముతాను. సీజర్‌ను గురించిన విషయాల్లో ఇతరులను ఎవరినీ నమ్మను!

**ఆంటోనీ :** నాకు అంత్యకాలం సన్నిహితమైంది. కనుక నా అదృష్ట విషయంలో ఏర్పడ్డ విషమపరిణామానికి నీవు దుఃఖించకు. సమస్తప్రపంచానికీ రాజాధిరాజునై మహోదాత్తుణ్ణిగా మెలిగిన పూర్వవైభవస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని, నీ ఊహలకు తృప్తిని కలిగించు. నేను నీచమరణాన్ని పొందు తున్నానని తలపోయకు. పిరికిపందనై నా దేశీయుడికొకడికి శిరస్త్రాణాన్ని అర్పించానని అనుకోకు. నేను ఒక రోమను దేశీయుడివల్ల పరాక్రమోపేతంగా జితుడనైన రోమను దేశీయుడను. నా ఆత్మ ఇక నన్ను వీడిపోతున్నది. నా శక్తి తుదముట్టింది.

**క్లియోపాత్రా :** మానవజాతిలోకెల్ల మహోదాత్తుడా! నీవు మరణిస్తున్నావా? నా సంరక్షణతో నీకు పని లేదా? నీవు లేనిది కేవలం వరాహాలకు వాసయోగ్యమైన ఈ స్తబ్ధప్రపంచంలో నన్నుండిపొమ్మంటున్నావా? అయ్యో! చూడండి. ఓ నా నారీగణమా! రత్నగర్భకిరీటం కరిగిపోయింది. ఓ ప్రభూ! అయ్యో!! కదనకుసుమదామం వాడిపోయింది. ఓ సైనికధ్వజం చెదిరిపోయింది. సర్వమానవులూ – బాలురు, బాలికలు, అందరూ ఇప్పుడు ఒకే వర్గానికి చెందినవారైనారు. కీర్త్యౌదార్యాల కీళ్లు సడలిపోయాయి. నిత్యయాత్రకు విచ్చేసే చంద్రదైవతానికి ఇక అవనీతలం మీద చూడనర్హమైన వస్తువంటూ ఏమీ మిగలలేదు!

**(మూర్ఛపోతుంది)**

**ఛార్మియన్ :** అయ్యో! ఉద్రిక్తవు కాకమ్మా!

**ఐరాస్ :** మన సామ్రాజ్ఞి మరణించింది కూడాను!

**ఛార్మియన్ :** రాజ్ఞీ! రాజ్ఞీ!!

**ఇరోస్ :** ప్రభ్వీ! ప్రభ్వీ!!

**ఛార్మియన్ :** రాజ్ఞీ! మహారాజ్ఞీ!!

**ఇరోస్ :** ఈజిప్టురాజ్ఞీ! సామ్రాజ్ఞీ!!

**ఛార్మియన్ :** నిశ్శబ్దం! నిశ్శబ్దం!! ఐరాస్!

**క్లియోపాత్రా :** 'రమణీ' అన్న మాటలతో తప్ప 'రాజ్ఞీ సామ్రాజ్ఞీ' అన్న పదాలతో ఇక పని లేదు. పాలు పితుకుతూ, పనిపాటలతో బ్రతికే నా స్త్రీ జాతిలోని క్షుద్రవనితలతో నేను తుల్యత వహిస్తున్నాను. అనర్ఘరత్నమైన నా ఆంటోనీని కాజేసేటంతవరకూ తమ రాజ్యంతో సర్వవిధాలా సామ్యం వహించిన ప్రపంచం మీద మీరు స్పర్ధ వహించారని ఆ దుష్టదేవతలతో చెప్పి నా రాజదండాన్ని విసిరిపారేయటం నాకు యుక్తమైన పని. మానవజన్మల్లో మహితమైనదంటూ కన్పించదు. మందబుద్ధులకు అనుద్వేగం అభిమానగుణం. ఉద్వేగం, ఉన్మత్త కుర్కురికి గుణం. అయితే అది మనదగ్గరికి చేరటానికైనా సాహసించేముందే మృత్యురహస్యనికేతన ప్రవేశం కోసం పరువెత్తటం పాపకృత్యమా?

ఓ నా నారీగణమా! మీ బాధేమిటి? నిరాశపడకండి! ఉల్లాసాన్ని కల్పించుకోండి. ఛార్మియన్! అదేమిటి? అలా విషణ్ణచిత్తవై కనిపిస్తున్నావేమిటి ఓ నా ఉదాత్తకన్యకలారా! అయ్యో! వనితాగణమా! గమనించండి. నా జీవితజ్యోతి చల్లారబోతున్నది చల్లారనే చల్లారింది. ఉత్తమ వనితలారా! సుస్థిరలు కండి. మనము ఆయనకు ఖననకర్మ చేయిద్దాం. తరువాత ఉత్తమ రోమకాచారాన్ని అనుసరించి ఏది సాహసకార్యమో, ఏది ఉత్తమకృత్యమో దాన్ని నిర్వర్తిద్దాము. మృత్యువుకు మనసు పొందగలిగిన గర్వాన్ని కల్పిద్దాం. రండి! అనుసరించండి!! ఆ మహాత్ముని శరీరం ఇప్పుడు అతిశీతలమై పోయింది. అయ్యో వనితాగణమా! రండి! మనకు నిర్ణయం తప్ప మిత్రుడంటూ లేదు. అతివేగంగా మరణించటం తప్ప మనం ఆచరింపదగ్గ కార్యమూ లేదు.

**(ఆంటోనీ శరీరాన్ని మోసుకొంటూ పైవారందరూ నిష్క్రమిస్తారు)**

# పంచమాంకం

## ఒకటో దృశ్యం

అలెగ్జాండ్రియాలో సీజర్ శిబిరం, సీజర్, అగ్రిప్పా, దోలబెల్లా, గాల్లస్, ప్రొక్యూలియస్, తదితరులూ, సీజర్ యుద్ధసమయమంత్రివర్గం ప్రవేశిస్తారు.

**సీజర్ :** దోలబెల్లా! ఆతని దగ్గరికి వెళ్లు. లొంగిపొమ్మని ఆజ్ఞాపించు. అలా ఓడిపోయినవాడు ఇంకా ఆలస్యాలను కల్పించటం హాస్యాస్పదంగా ఉందను.

**దోలబెల్లా :** సీజర్ మహాశయా! అలాగే నిర్వర్తిస్తాను.

**డెర్సిటాస్ ఆంటోనీ ఖడ్గంతో ప్రవేశిస్తాడు.**

**సీజర్ :** ఇది[120] ఎక్కడినుంచి? రక్తపంకిలమైన ఖడ్గంతో మా ముందు కన్పించటానికి సాహసించావు. నీవెవరు?

**డెర్సిటాస్ :** నా పేరు డెర్సిటాస్! నేను మార్క్ ఆంటోనీ సేవకుణ్ణి. పరుల సేవలను అందుకోటానికి ఆయన పరమయోగ్యత కలవాడు. సజీవుడుగా ఉన్నప్పుడు ఆయన నా యజమాని. అప్పుడు ఆయన్ను నిందించినవారిని అంతమొందించటానికి నా జీవితాన్ని అంకితం జేశాను. ఆయనయెడ నేను ఎలా వర్తించానో అలాగే మీరు నన్ను పరిగ్రహింపదలిస్తే, సీజర్, మిమ్మల్ని గూడా అలాగే కొలుస్తాను. ఇందుకు మీరు అంగీకరించకపోతే మీ సమక్షంలోనే జీవితాన్ని చాలిస్తాను.

**సీజర్ :** నీవనేది ఏమిటో నాకేమీ అర్థం కావటం లేదు.

**డెర్సిటాస్ :** ఇట్టి దారుణవార్త వచ్చినపుడు ఘనగర్జనలు వినిపించి ఉండవలసింది. జగత్తు సింహసంహతులను విశృంఖలంగా రాజమార్గాలలో విహరించటానికని విసిరివేసి, అవి పరిత్యజించిన గుహల్లోకి నాగరకులను తరిమి పంపించి ఉండవలసింది. మార్క్ ఆంటోనీ మరణమంటే అది ఒక వ్యక్తికి కలిగే ఉపప్లవం కాదు. అతని నామంలో ప్రపంచార్ధభాగం ఇమిడి ఉంది.

సీజర్ మహాశయా! ఆయన మరణించాడు. ఒక ప్రజాన్యాయ నిర్వాహకుడివల్ల కాదు అద్దెకు వచ్చిన హంతకుడి ఖడ్గధారవల్ల అంతకంటే కాదు. ఆయన నిర్వహించిన

సర్వకృత్యాలలో ఒక గౌరవస్థానాన్ని ఏ హస్తం కల్పిందో ఆ హస్తం, హృదయమిచ్చిన ధైర్యంతో, దాన్నే చీల్చివేసింది. ఇదిగో, ఇది ఆయన ఖడ్గం. ఆయన గాయం నుంచీ దీన్ని కాజేసుకోవచ్చాను. పరిశీలించండి! ఆ మహోదాత్తుని రక్తంతో పరిషిక్తమైన దీన్ని పరికించండి!

**సీజర్ :** మిత్రులారా! మీరందరూ విషణ్ణచిత్తులౌతున్నారా? అయితే ఇది రాజనేత్రాలు కూడా కన్నీటిని రాల్చి తీరక తప్పనివార్త!

**అగ్రిప్పా :** ప్రకృతి మిక్కిలి పట్టుదలతో కొనసాగించి చేయించిన కృత్యాలకు మనచేత తిరిగి చింతించేటట్లు చేయటం ఎంతో వింతైన విషయం.

**మెకయ్‌నాస్ :** ఆయన ఉదాత్తగుణాలు, ఉన్నతదోషాలు రెండూ తుల్యంగా ఒకదానిమీద ఒకటి పందెమొడ్డాయి.

**అగ్రిప్పా :** ఆయనవలె ఒక విశిష్టాత్మ నడిపించిన వ్యక్తి సామాన్యంగా కన్పింపదు. అందుకని ఓ దేవతలారా! మీరు మమ్మల్ని మానవులనుగా నిల్పటానికి కొన్ని లోపాలను మాకు ప్రసాదించండి. సీజర్ ఎంతగా చలించి పోతున్నాడో పరికించు!

**మెకయ్‌నాస్ :** అంతటి విశాలమైన అద్దాన్ని అతనిముందు నిలిపినపుడు సీజర్ తన రూపాన్ని తాను తప్పక చూచుకొని తీరాలి.

**సీజర్ :** ఓ ఆంటోనీ! ఇది జరిగేదాకా నిన్ను వెన్నాడాను. శారీరకవ్యాధికి కొంత ప్రయోగం ప్రయోజనకారి అయినట్లుగా నా రాజకీయ సంక్షేమానికి నీ మరణం సహాయకారి అయింది. నీ అస్తమయాన్ని నేనో, నా అస్తమయాన్ని నీవో చూడటం అత్యావశ్యకమని విధి నిర్ణయం. ప్రపంచమనే మందూరాలో మనమిర్వురం కలిసి వసించలేమని విశదమైంది. అయితే నా హృదయరక్తంవలె అమూల్యమైన కన్నీటిని విడుస్తూ, ఆంటోనీ, నీ మరణానికి నేను దుఃఖించకుండా ఉండలేను. నీవు నాకు ఆప్తుడవు. సమస్త మహత్తరలక్ష్యాలలోనూ సహవ్రతుడవు. సామ్రాజ్యంలో సహభాగస్వామివి. మిత్రుడవు. సమరాంగణంలో నాకు సమర్థుడవు. నా శరీర బాహువువు. నిఖిలభావోద్వేగాలకు జన్మభూమియైన నా హృదయానికి హృదయానివి. సర్వ విషయాల్లో నీవు నాతో సమానుడవు. లక్ష్యాల విషయంలో మనకు పొత్తు కుదరదని నిర్ణయించుకొన్న మన అదృష్టం నా చేతనే ఇలా మనలో ఒకరు వినాశాన్ని పొందటమనే క్షుద్రస్థితిని అంగీకరించి వ్యవహరించకుండా చేయవలసి ఉంది. – ప్రియమిత్రులారా!

వినండి. ఇప్పుడు కాదులే... మరో సమయంలో ఇంకా మీకు ఎంతో చెప్పవలసి ఉంది.

**ఈజిప్టు దేశీయుడొకడు ప్రవేశిస్తాడు.**

ఈతడు వచ్చిన పనిని చూపులే చెప్పక చెపుతున్నవి. అయినా, అతడు చెప్పవలసిందేమో నేను వింటాను. ఎక్కడి నుంచి వచ్చావు?

**ఈజిప్టు దేశీయుడు :** నేనొక దీనుడైన ఈజిప్టు దేశీయుణ్ణి. మా రాజ్ఞి తనకు సర్వస్వంగా మిగిలిన సమాధి నిర్మాణానికే పరిమిత అయిపోయి తన్ను తానే నిర్బంధించుకొన్నది. ఆమెను గూర్చిన మీ ఉద్దేశాలేమిటో తెలియజేస్తే వాటికి తగ్గట్టుగా క్రమశిక్షనొంది దిద్దుకోటానికి వేచి ఉంది.

**సీజర్ :** చిత్తోల్లాసాన్ని చెరుచుకోవద్దని మాకుగా ఆజ్ఞాపించు. అనతికాలంలోనే మా దూతవల్ల ఎంతో గౌరవోపేతంగానూ, కరుణాన్వితంగానూ మేము ఆమె యెడ వర్తింపదలచామో ఆమె వినగలుగుతుంది. జీవిత పర్యంతం సీజర్ ఎన్నడూ అనుదాత్తుడుగా ఉండజాలడు.

**ఈజిప్టు దేశీయుడు :** అయితే, దేవతలు మీకు చిరకాలజీవితాన్ని ప్రసాదింతురుగాక!

**(నిష్క్రమిస్తాడు)**

**సీజర్ :** ప్రొక్యులియస్, ఇలారా! అక్కడికి వెళ్ళు. ఏ అవమానాన్నీ ఆమెకు కల్పించటానికి మేము ఉద్దేశించటం లేదని చెప్పు. ఆమె దుఃఖాన్ని శమింపజేయటం కోసం అవసరమైన అఖిలాన్నీ జరిగిస్తామని మాట ఇచ్చిరా. లేకపోతే ఉదారహృదయ ఆమె ఏ ఆత్మహత్యో చేసుకొని మన ఉద్దేశాన్నే భగ్నం చెయ్యవచ్చు. ఆమెను రోములో నివసించేటట్లు చేస్తే మన విజయానికి నిత్యప్రతిష్ఠ. వెళ్లు. నీ చేతనైనంత వేగంగా, తిరిగివచ్చి ఆమె ఏమన్నదీ, ఎట్టిస్థితిలో ఉన్నదీ తెలియజెయ్!

**ప్రొక్యులియస్ :** సీజర్ మహాశయా! తామాజ్ఞాపించినట్లే.

**(నిష్క్రమిస్తాడు)**

**సీజర్ :** గాల్లస్! నీవు అతనివెంట వెళ్లు. (గాల్లస్ నిష్క్రమిస్తాడు) దోలబెల్లా ఎక్కడ?

**అందరూ :** దోలబెల్లా!

**సీజర్ :** వద్దు, అతణ్ణి వదిలేయండి. అతడికి నిర్దేశించిన పని ఏమిటో జ్ఞప్తికి వచ్చింది. సమయానికాతడు కార్యనిర్వహణకోసం సంసిద్ధుడయ్యే ఉంటాడు. నా వెంట శిబిరానికి

రండి! అక్కడ నేను మీకు యుద్ధానికి ఎంతటి అయిష్టంతో దిగవలసివచ్చిందో చూపిస్తాను. అతడికి వ్రాసేటప్పుడు నేను ఎంత ఉదాత్తంగానూ, సమంజసంగానూ వ్యవహరించానో కూడా మీకు చూపిస్తాను. నాతో రండి. మా ఇరువురి మధ్య నడచిన ఉత్తరప్రత్యుత్తరాలను చూద్దురుగాని రండి.

**(నిష్క్రమిస్తారు)**

## రెండవ దృశ్యం

**అలెగ్జాండ్రియా సమాధి నిర్మాణంలో ఒక కక్ష్య.**
**క్లియోపాత్రా, ఛార్మియస్, ఐరాస్ ప్రవేశిస్తారు.**

**క్లియోపాత్రా :** ఈ నా దైన్యస్థితి నవజీవితానికి నాందిగా పరిణమిస్తున్నది. కనుక చింతపడను. 'సీజర్ పదవి'ని పొంది సమ్రాట్టు కావటం సర్వసామాన్య విషయం. అదృష్టానికి సీజర్ దైవతం కాదు. ఆమెకు సేవకుడు. ఆమెకు ఆజ్ఞానువర్తి, సంఘటనల నరికట్టేదీ, పరివర్తనను స్తంభింపజేసేదీ, నిరంతర నిద్రాముద్రితమైందీ, జీవితదాయిని అయిన ఆహారాన్ని రుచి చూడనిదీ, సీజర్ కెలాగో, అలాగే ఒక భిక్షుకుడికి కూడా దాది అయినదీ, సమస్తకృత్యాలనూ అంతమొందించే ఆకార్యాన్ని ఆచరించటం ఎంతో ఘనమైన విషయం.

ప్రొక్యూలియస్, గాల్లస్, సైనికులు సమాధినిర్మాణ ద్వారసీమ దగ్గరికి ప్రవేశిస్తారు.

**ప్రొక్యూలియస్ :** ఈజిప్టు రాజ్ఞికి సీజర్ శుభాకాంక్షలు. తానివ్వటానికి మీ కెటువంటి సంధినియమాలు కావాలో పరిశీలించుకోవలసిందని ఆయన సెలవిచ్చారు.

**క్లియోపాత్రా :** నీ నామధేయం?

**ప్రొక్యూలియస్ :** ప్రొక్యూలియస్.

**క్లియోపాత్రా :** నిన్ను గురించి ఆంటోనీ నాకు చెప్పాడు. నిన్ను నమ్మవలసిందని ఆజ్ఞాపించాడు. నమ్మినందువల్ల నాకు కలిగే లాభం ఏమీ లేదు కనుక మోసగించినా నేను లక్ష్యం చెయ్యను. ఒక రాజ్ఞి తనను యాచించాలని మీ యజమాని కోరుకొంటే, ఆమె తన ఔచిత్యాన్ని నిల్పుకోటంకోసం రాజ్యానికి ఏ అణుమాత్రంగానైనా తక్కువైనదాన్ని దేన్నీ యాచించదని నీవు నిష్కర్షగా చెప్పు. తాను జయించిన ఈజిప్టు

రాజ్యాన్ని ఆయన నా కుమారుడికి ఇవ్వదలచుకొంటే నాకు యాజమాన్యం ఉన్న దాన్ని నాకివ్వటమే ఔతుంది. మోకాళ్లపై నిల్చి నమ్రనై ఆయనకు నమస్కరిస్తాను.

**ప్రొక్యూలియస్ :** ఉత్సాహాన్ని చిక్కపట్టుకోండి. ఒక మహాసమ్రాట్టు మీకు రక్షకులైనారు. ఇక మీరు ఎందుకు జంకవలసిని అగత్యం లేదు. అవసరాలు గలవారెందరున్నా అనుగ్రహించటానికి అనవరతకరుణాన్వితుడైన మా ప్రభువుకు స్వేచ్ఛగా మీ విజ్ఞాపనాన్ని తెలియజేయండి. మనఃపూర్వకంగానూ, పరిపూర్ణంగానూ మీరు వారిమీద ఆధారపడుతున్నానని వారికి నివేదించుకోటానికి అంగీకరించండి. ఇలా జరిగిస్తే, వారి దయాగుణాన్ని అభిలషించి వినమ్రులైతే, అందుకు సహాయాన్ని తానే అర్థించే ఒక విజేతను ఆయనలో మీరు దర్శింపగలుగుతారు.

**క్లియోపాత్రా :** ఐశ్వర్యవంతుడైన ఆయనకు నేను సామంతను కావటాని కిష్టపడతాననీ, అలా చేయటం వల్ల ఆయన ఆర్జించుకొన్న ఘనతను అంగీకరించటమే ఔతున్నదని తలపోస్తున్నాననీ, ఆయనకు తెలియజేయవలసిందిగా నిన్ను ప్రార్థిస్తున్నాను. సమయం నా వల్ల అభిలషించే వినమ్రతను గూర్చిన పాఠాన్ని నేర్చుకొంటాను. ఆయనను ముఖాముఖిగా అమితానందంతో దర్శింపగలుగుతాను.

**ప్రొక్యులియస్ :** ప్రియ ప్రభ్వీ! ఇదంతా ఆయనకు నివేదిస్తాను. మీకీ దైన్యస్థితిని కల్పించిన ఆయనే మీ దుఃస్థితిని గుర్తించి కరుణ వహిస్తున్నాడు. కనుక ఉల్లాసాన్ని వహించండి.

**గాల్లస్ :** ఆమెను ఎంత త్వరగా బందీని చేయటానికి వీలుంటుందో గమనించండి.

ఒక వాతాయనంమీద వాల్చిన నిశ్రేణిక మీదుగా ప్రొక్యూలియస్, ఇరువురు రక్షకభటులు సమాధినిర్మాణాన్ని ఆరోహించి లోపలికి దిగి క్లియోపాత్రా వెనుకకు వస్తారు. కొందరు రక్షకభటులు కవాటాలను వివృతం చేస్తారు.

**ప్రొక్యూలియస్ :** (రక్షకభటులతో) సీజర్ మహాశయుడు విచ్చేసేదాకా ఆమెను భద్రంగా కాపాడండి!

**ఇరోస్ :** మహారాజ్ఞీ!

**ఛార్మియన్ :** క్లియోపాత్రా! రాజ్ఞీ! నిన్ను వారు బందీని చేశారు.

**క్లియోపాత్రా :** (ఛురికను దూస్తూ) ఓ నా హస్తాల్లారా! త్వరపడండి. త్వరపడండి!

**ప్రొక్యూలియస్ :** ఆగు! మహారాజ్ఞీ! ఆగు. (అందుకొని కత్తిని తీసివేస్తారు) ఇంతటి దోషాచరణం చేసుకోవటం తగని పని. ఇందువల్ల మిమ్మల్ని రక్షిస్తున్నాము గాని మోసగించటం లేదు.

**క్లియోపాత్రా :** ఏమిటి? మహావేదననుంచీ కుర్కురాలనుకూడా బయటపడవేసే మృత్యువునుంచి కూడానా?

**ప్రొక్యూలియస్ :** రాజ్ఞీ, క్లియోపాత్రా! మిమ్మల్ని మీరే నాశనం చేసుకోటంతో మా యజమాని తన కరుణారసాన్ని ప్రదర్శించుకోటానికి కలిగిన అవకాశాన్ని దుర్వినియోగం చెయ్యవద్దు. ఆయన ఔదార్యం మీ మరణంవల్ల రంగస్థలం మీదికి వచ్చే అవకాశాన్ని కోల్పోతుంది. అది అద్భుతశక్తితో నటియిస్తే తిలకించే అవకాశాన్ని అఖిలప్రపంచానికీ కల్పించండి.

**క్లియోపాత్రా :** మృత్యువా, నీవెక్కడున్నావు? రా. నాకు. దర్శనమివ్వు. వచ్చి బిడ్డలకూ, భిక్షువులకూ తుల్య అయిపోయిన ఈ రాణిని తీసుకుపో!

**ప్రొక్యూలియస్ :** రాజ్ఞీ! ప్రశాంతచిత్తలు కండి.

**క్లియోపాత్రా :** ఇక నే నా ఆహారాన్ని స్వీకరించను. పానీయాన్ని సేవించను. వేగంగా మరణించడానికి ఉన్మత్తప్రలాపాలు అవసరమైతే నేను నిద్రకూడా పోను. నిలపటానికి సీజర్ ఎట్టి యత్నాలు చేసినా నా ఈ భౌతికశరీరాన్ని నేను వినాశనం చేస్తాను. మీ యజమాని తీర్చే సభలో బద్ధహస్తనై నిలుచోనని తెలుసుకో. మందబుద్ధి ఆ ఆక్టేవియా అలక్ష్యపుచూపులనే శిక్షలను అందుకోను. కరతాళధ్వనులతో గందరగోళం చేస్తూ నన్ను అధిక్షేపించటానికి ఆ రోమకజానపదుల కోసం పైకెత్తి నన్ను ప్రదర్శింపదలచారా? ఇంతకంటే ఈజిప్టులోని ఓ చిన్నగర్తమైనా నాకు కమనీయమైన సమాధి ఔతుంది. ఇంతకంటే నా నగ్నమృతశరీరాన్ని నైలునదీ పంకప్రదేశం మీద పారేస్తే, అక్కడి నీరమక్షికతతి నిలువెల్లా వికృతరూపం కలిగేటంతవరకూ కుట్టిపెట్టినా నేను ఇష్టపడతాను. ఇంతకంటే నా దేశంలోని మహోన్నత నిర్మాణాలైన పిరమిడ్లనే నా వధ్యభూమిగా చేసి నన్ను శృంఖలాబద్ధను కావించినా నేను తృప్తి పడతాను.

**ప్రొక్యూలియస్ :** ఇంతటికే కారణం కనిపించనిదే సీజర్ యెడ మీరీ ఘోరభయభావాన్ని వహించి ఊరికే ఏవేవో ఊహిస్తున్నారు!

**దోలబెల్లా ప్రవేశిస్తాడు.**

**దోలబెల్లా :** ప్రొక్యూలియస్! నీవు నిర్వర్తించిన స్వరం నీ యజమానికి చేరింది. ఆ నీ కోసం వార్త పంపించాడు. ఇక ఈ రాజ్ఞి రక్షణభారాన్ని నేను వహిస్తాను.

**ప్రొక్యూలియస్ :** దోలబెల్లా! నాకు చాలా తృప్తిగా ఉంది. ఆమెయెడ ఎంతో ఉదాత్తంగా వర్తించు. (క్లియోపాత్రాతో) ఏమన్నా చెప్పవలసింది అని మీరు నన్ను నియోగిస్తే నేను దాన్ని సీజర్ మహాశయునికి తెలియజేస్తాను.

**క్లియోపాత్రా :** అయితే నేను మరణిస్తానని చెప్పు.

**(ప్రొక్యూలియస్, సైనికులు నిష్క్రమిస్తారు)**

**దోలబెల్లా :** అత్యుదాత్త సామ్రాజ్ఞీ! నన్ను గురించి మీరు విన్నారా?

**క్లియోపాత్రా :** నేను చెప్పలేను.

**దోలబెల్లా :** నిశ్చయంగా మీరు నన్నెరుగుదురు.

**క్లియోపాత్రా :** నేను ఏమి విన్నా లేదా తెలుసుకున్నా పరవాలేదు. పసిపాపలు గాని, పడతులు గాని తమ కలలను గురించి చెపితే నీవు నవ్వుతావు కదూ?

**దోలబెల్లా :** మీరనేది నాకేమీ అర్థం కావటం లేదు.

**క్లియోపాత్రా :** ఆంటోనీ అనే ఒక సమ్రాట్టు ఉన్నట్లు నేను కలగన్నాను. ఓహో! అతడు పోయిన నిద్రవంటి నిద్రను అనుభవిస్తున్న అటువంటి మరోవ్యక్తిని నేను చూడగలిగితే?

**దోలబెల్లా :** అభిలషిస్తే అటువంటి ఇంకో వ్యక్తిని మీరు చూడవచ్చు.

**క్లియోపాత్రా :** అతని ముఖం ఆకాశాన్ని పోలి ఉంటుంది. అందులో సూర్యచంద్రులిరువురూ సంచారం చేస్తూ క్షుద్రమండలమైన భూమిని భాసింపజేస్తుంటారు.

**దోలబెల్లా :** ఆంటోనీ రాచరికం మూర్తీభవించిన వ్యక్తి.

**క్లియోపాత్రా :** మహాసముద్రపుటొడ్లమీద రెండు పాదాలను నిలిపి అతడు కోలాసస్[121]గా నిలిచాడు. ఆయన ఉద్యద్బాహువులు ప్రపంచ గోళాకారాన్ని వహిస్తున్నవి. ఆయన కంఠం గోళాల సంగీతం[122] వంటి సంగీతంతో సుసజ్జితమైంది. ఆయన తన కంఠమాధుర్యాన్ని మిత్రులయెడనే ప్రయోగించేవాడు. ప్రపంచాన్ని భయంతో కంపింపజేయ దలచుకొన్నప్పుడు మేఘగంభీరంగా గర్జించేవాడు. ఆయన కరుణాగుణానికి శీతకాలమంటూ లేదు. అందులో చల్లదనంగాని, గడ్డకట్టటంగాని

పొడకట్టదు. అది ఎల్లవేళలా కోస్తున్నకొద్దీ పంట పండేది. ఆయన విలాసాలన్నీ శఫరజాతి మత్స్యవిలాసాలు! అవి నివసించే నీరంనుంచీ బయటికి దుమికి వెల్లకిలపడి, బోరలు చూపుతూ మళ్ళీ నీటిని వదలనట్లుగానే ఆయన విలాసాలను అనుభవిస్తాడే గాని పరిత్యజించడు. ఎందరో రాజులాయనకు అనుజీవులు. రాజ్యాలు ఆయన జేబులనుంచి రాలే రౌప్యఖండాలుగా ఉండేవి.

**దోలబెల్లా :** రాజ్ఞీ, క్లియోపాత్రా!

**క్లియోపాత్రా :** నేను కలలో చూచిన ఇటువంటి వ్యక్తి సజీవుడై ఒకప్పుడుండేవాడని గాని, ముందు ఉండవచ్చునని గాని నీవు భావిస్తున్నావా?

**దోలబెల్లా :** మహారాజ్ఞీ! లేదు.

**క్లియోపాత్రా :** నీవు గొప్ప అబద్ధమాడుతున్నావు. దేవతల శ్రవస్సులను కూడా చేరదగనంతటి అబద్ధమాడుతున్నావు. ఒకవేళ అట్టివ్యక్తి ఉండి ఉన్నా, లేకపోయినా ఆయన ఊహ కూడా సృజింపలేనంతటి అతీతుడు. ఊహ నిర్మింపగల విచిత్రసృష్టులతో పంతమాడగల వస్తుసంపత్తి ప్రకృతికి లేదు. కానీ ఒక ఆంటోనీని భావించి మహత్తర మూర్తినిగా ప్రకృతి రూపొందించటం, ఊహావినిర్మితాలు కేవలం మూల్యరహితాలైన ఛాయామూర్తులని పోల్చి అధిక్షేపించటమే!

**దోలబెల్లా :** రాజ్ఞీ! వినండి. మీరెంతటి ఘనులో మీకు కలిగిన నష్టం అంతఘనమైంది. ఆ నష్టభారాన్ని మీరు దాని ఆధిక్యానికి అనుగుణమైన రీతిగా భరించటమే మీరు చేయదగ్గ కృత్యం. తిరిగివచ్చి తగిలి మీ దుఃఖం నా హృదయమూలాన్ని చలింపజేసే దుఃఖాన్ని కల్పిస్తున్నది. ఇది అసత్యమైతే ప్రియమార కాంక్షించి కష్టించిన ఘనవిషయంలో నేను విజయం పొందకుందునుగాక!

**క్లియోపాత్రా :** కృతజ్ఞురాలను. సీజర్ నన్నేమి చెయ్యాలని ఉద్దేశించాడో నీకు తెలుసునా?

**దోలబెల్లా :** దాన్ని మీరే తెలుసుకోగోరుతారు. నేనై తెలియజేయటం నాకిష్టంలేదు.

**క్లియోపాత్రా :** నిన్ను ప్రార్థిస్తున్నాను. దయుంచి తెలియజేయ్!

**దోలబెల్లా :** సీజర్ గౌరవనీయుడే ఐనప్పటికీ –

**క్లియోపాత్రా :** అయితే, ఆయన తన విజయోత్సవం వెంట నన్ను నడిపిస్తాడన్నమాట! నడిపిస్తాడా?

**దోలబెల్లా :** రాజ్ఞీ! నేనెరుగుదును, తప్పక నడిపిస్తాడు.

లోపల సంగీతం, కలకలం. "నిశ్శబ్దం, ఘనుడు సీజర్ వేంచేస్తున్నాడు" అన్న హెచ్చరికలు వినిపిస్తాయి. సీజర్, గాల్లస్, ప్రొక్యూలియస్, మెకయ్‌నాస్, సెల్యూకస్, సీజర్ పరివారంలోని ఇతరులూ ప్రవేశిస్తారు.

**సీజర్ :** ఎవరా ఈజిప్టురాజ్ఞి?

**దోలబెల్లా :** రాజ్ఞీ! వీరే చక్రవర్తులు.

**(క్లియోపాత్రా మోకాళ్ళపై నిల్చి ప్రణమిల్లుతుంది)**

**సీజర్ :** లే! నీవు ప్రణామం చేయనవసరం లేదు. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. లే. ఈజిప్టు రాజ్ఞీ లే!

**క్లియోపాత్రా :** మీ ముందిలా ప్రణమిల్లవలసిందని దేవతలు నన్ను కోరుతున్నారు. నాకు యజమానులు, ప్రభువులూ అయిన మీ యెడ నేను నమ్రభావాన్ని ప్రకటించి తీరవలసిందే.

**సీజర్ :** నీకు మేమేదో ఆపదను కల్పిస్తామని భావించవద్దు. నీవు మాకు కల్పించిన గాయాలు శరీరవిలిఖితాలై కన్పిస్తున్నా, వాటిని మేము సమయం చేసిన చేష్టలని సరిపెట్టుకొంటాము.

**క్లియోపాత్రా :** వసుధైకాధిపతీ! నేను కల్పించిన కారణం నిందకు పరిపూర్ణంగా దూరమైనదని నేను నిరూపించలేను. నా స్త్రీ జాతికెట్టి దోషాలు కళంకాన్ని ఆపాదించగలవో, అట్టి లోపాలు పూర్వం నాలో ఉన్నవని నేనంగీకరించి తీరుతాను.

**సీజర్ :** క్లియోపాత్రా! నేను వాటి విషయంలో పట్టుపట్టను. మరచిపోతానని వాగ్దానం చేస్తున్నాను. నిన్ను గురించిన నా ఉద్దేశానికి నీవు అనుగుణంగా వర్తిస్తే, అవి నీ యెడ మహోదారాలై ఉంటాయి. ఇటువంటి పరివర్తన వల్ల ముమ్ముందెంతగానో నీకు సంక్షేమలాభం ఉందని నీవు గమనింపగలుగుతావు. ఆత్మహత్యతో ఆంటోనీ చూపిన మార్గాన్ని నీవు అనుసరించి నా యెడ క్రూరంగా ప్రవర్తిస్తే, నేను నీకు జరిగించాలని ఊహిస్తున్న మేళ్లనన్నింటినీ కోల్పోవటమూ, నా ఉద్దేశాలను అనుసరించటంవల్ల కలిగే రక్షణను పోగొట్టుకోవటమే కాకుండా, నీ సంతానాన్నంతటినీ నాచేత సర్వనాశనం చేయించినదానివౌతావు. నేను నిష్క్రమిస్తున్నాను.

**క్లియోపాత్రా :** ఈ సర్వప్రపంచంమీద మీరు స్వేచ్ఛగా ఎక్కడికైనా పోవచ్చు. మేము మీ ఖేటాలము విజయచిహ్నలము. ఎక్కడ నిలువమని మీరు ఆదేశిస్తే అక్కడ ఉండవలసినవాళ్లం. అంతే ప్రభూ!

**సీజర్ :** క్లియోపాత్రాకు సంబంధించిన సర్వవిషయాలల్లో నేను నీ సలహానే పొందుతాను.

**క్లియోపాత్రా :** కొన్ని క్షుద్రవస్తువుల మూల్యాలు ఏమి చేరలేదో గాని – ఇదిగో, ఇది నా ధనం, గృహోపకరణాలు, ఆభరణాలు విలువకట్టిన పట్టిక. సెల్యూకస్ ఎక్కడున్నాడు?

**సెల్యూకస్ :** రాజ్ఞీ! ఇక్కడున్నాను.

**క్లియోపాత్రా :** ఇతడే నా కోశాధికారి ప్రభూ! ఇతడు నా బదులుగా సర్వాన్నీ మీకు నివేదిస్తాడు. సత్యం చెప్పడో, ఇతడు తన ప్రాణాలను కోల్పోవటం తథ్యం. నేను నా కోసం ఏమీ మిగుల్చుకోలేదు. సెల్యూకస్! సత్యాన్ని నివేదించు.

**సెల్యూకస్ :** రాజ్ఞీ! అసత్యాన్ని నివేదించి శిక్షను చెప్పించుకోటంకంటే నేను పెదవులను కుట్టివేసుకుంటాను.

**క్లియోపాత్రా :** పట్టికలో చేర్చకుండా నేనేమైనా మానివేశానా?

**సెల్యూకస్ :** మీకు తెలియజేసినంత సంపత్తిని విలుచుకోటానికి తగినంతగా దాచారు.

**సీజర్ :** క్లియోపాత్రా! నీవేమీ కళవళపడకు. నీవు మంచి వివేకం గల పనిచేశావు. అందుకు నేను అంగీకరిస్తాను.

**క్లియోపాత్రా :** గమనించు! సీజర్ మహాశయా! వైభవానికి అనుచరులు ఎలా లభిస్తారో గమనించు!! అప్పటి నా వారందరూ ఇప్పుడు నీ వారైనారు. ఈ సెల్యూకస్ కృతఘ్నతాభావం నన్ను ఉన్మత్తను చేస్తున్నది. ఓరి బానిసా! అద్దెకుగొన్న ప్రేమ ప్రేమే కాదు. ఏమిటి? నీవా పక్షాన్ని చేరిపోతున్నావా? అవును. పరపక్షానికి వెళ్లిపోతావు. ఇది నిశ్చయం. నీ గ్రుడ్లకు రెక్కలున్నా నేను వాటిని పెరికిస్తాను. ఓరి పారశవా! అంతరాత్మ లేని ద్రోహీ! అతినీచుడా! ఓరి కుక్కురమా!

**సీజర్ :** ఉదారా, రాజ్ఞీ! ఈతణ్ణి క్షమించవలసిందని నేను నిన్నర్థిస్తున్నాను.

**క్లియోపాత్రా :** సీజర్ మహాశయా! ఇది నాకెంతో గాయాన్ని కల్పించే అవమానం! నేనున్న ఇంతటి దైన్యావస్థలో, దర్శనభాగ్యాన్ని అనుగ్రహించటం కోసం అంతటివాడవైన నీవు నాకడకు దిగివచ్చిన ఈ సమయంలో, ఈ నా సేవకుడు, వీడు, ఈర్ష్యాపరుడై

మరొక అవమానాన్ని కల్పించటమా? సీజర్ మహాశయా! నేను ఏవో సామాన్యంగా స్నేహితురాండ్రకు ఇచ్చుకొనే విలువలేని బొమ్మల వంటివి కొన్ని, నన్ను గురించిన విషయాలలో మధ్యవర్తిత్వాన్ని వహించటంకోసం లివియా ఆక్టేవియాలకు కాన్కలుగా ఇవ్వదలచుకొన్న కొన్ని, ఆడవాళ్ల వస్తువులను దాచుకొన్నాననుకోండి. నేను పోషించిన వీడు ఇలా వాటిని బయటపెడుతాడా? దేవతలారా! ఇతరాలైన నా దురదృష్టాలకంటే ఇది నన్నెంతో అధికంగా బాధపెడుతున్నది! (సెల్యూకస్‌తో) వెళ్ళిపో! నిన్ను ప్రార్థిస్తున్నాను. లేకపోతే ఇప్పుడు నేను దీనావస్థలో ఉన్నా నా పూర్వ రాజరికాన్ని కల్పించుకొని నీ యెడ వ్యవహరిస్తాను. నీవు నిజంగా పురుషుడివే అయితే నా మీద కనికరం వహించి ఉండేవాడివి.

**సీజర్ :** సెల్యూకస్! నీవు వెళ్ళిపో!

**(సెల్యూకస్ నిష్క్రమిస్తాడు)**

**క్లియోపాత్రా :** అవనిమీద వసించే అందరికంటే అధికులమైన మనను ఇతరులు చేసే ఇటువంటి పనులవల్ల అపార్థం చేసుకొంటుంటారని ఎంతగానో మనం గ్రహించవలసి ఉంది. పతనాన్ని పొందే వేళల్లో ఇతరులు చేసే కృత్యాలకు మనం బాధ్యత వహించవలసి ఉంటుంది. అందువల్ల మనం దయనీయుల మౌతుంటాము.

**సీజర్ :** క్లియోపాత్రా! విజయప్రాప్తసత్త్వం[123] వల్ల రావలసిన వస్తుసంభారపట్టికలో నీవు దాచుకొన్నవాటినిగాని, లేదా ఒప్పుకొని చేర్చినవాటినిగాని మేము లెక్కించలేదు. అందువల్ల అవన్నీ నీవే. వాటిని నీ స్వేచ్ఛానుసారంగా ఇచ్చి వేసుకోవచ్చు. నిన్నే బహుమానంగా గెల్చుకొన్న తరువాత, సీజర్ వ్యాపారస్థులమ్ముకొనే వస్తువులను పట్టించుకోడని నమ్ము. అందువల్ల ఉల్లాసాన్ని వహించు. నీ ఊహలనే కారాగారాలను కల్పించుకోకు. ప్రియరాజ్ఞీ! నీ విషయంలో నేను నీ సలహానే అనుసరించదలిచాను. కనుక నీ అంతటిదాని కిలా చేయటం తగదు. మృష్టాహారాన్ని స్వీకరించు సుఖంగా నిద్రించు. నీకు నిరంతర మిత్రుణ్ణిగా నిలిచిపోవాలని కోరుతున్న నేను నీ యెడ కరుణాశ్రద్ధలను ఎంతగా వహిస్తున్నానో గుర్తించు. ఇక సెలవు తీసుకొంటాను.

**క్లియోపాత్రా :** యజమానీ! ప్రభూ!!

**సీజర్ :** నన్ను అలా సంబోధించవద్దు. నేను నీకు మిత్రుణ్ణి. సెలవు!

**(సంగీతం. సీజర్ పరివారంతో నిష్క్రమిస్తాడు)**

**క్లియోపాత్రా :** నా యెడ నేను ఉదాత్తంగా వర్తించటాన్ని అడ్డుపెడుతూ ఎన్నో ప్రియవచనాలు చెప్పి ఆయన వెళ్ళిపోయాడు. కానీ ఛార్మియన్! మాట విని పో –

**(చెవిలో ఏమో చెబుతుంది)**

**ఇరోస్ :** ఉత్తమ ప్రభ్వీ! నీ జీవితాన్ని అంతమొందించుకో. కాంతిగల కాలం వెళ్ళిపోయింది. ఇక మనకు రాబోయేవి కాళరాత్రులే!

**క్లియోపాత్రా :** మళ్ళీ అతిత్వరితంగా వెళ్లు. ఇదివరకే ఆజ్ఞాపించాను. త్వరగా సిద్ధం చేసుకొని తీసుకోరావాలి.

**ఛార్మియన్ :** ప్రభ్వీ! తప్పక తెస్తాను.

**దోలబెల్లా తిరిగి ప్రవేశిస్తాడు**

**దోలబెల్లా :** రాజ్ఞి ఎక్కడ?

**ఛార్మియన్ :** అదుగో! చూడవచ్చు.

**(నిష్క్రమిస్తుంది)**

**క్లియోపాత్రా :** దోలబెల్లా!

**దోలబెల్లా :** మీ ఆజ్ఞలను పాలిస్తానని ప్రతిన చేసిన రీతిని బట్టి, ప్రభ్వీ! మీ మీద నాకు గల ప్రేమ మతవిశ్వాసమై దాన్ని అనుసరించి జేయటాన్ని బట్టీ ఈ విషయాన్ని మీకు నివేదిస్తున్నాను. సీజర్ మహాశయుడు మూడు దినాల్లో సిరియాగుండా ప్రయాణం చేయ నిశ్చయించాడు. మిమ్మల్నీ, మీ సంతానాన్నీ ముందుగానే రోముకు పంపించదలిచాడు. ఈ వార్తను మీరు ఘనప్రయోజనాన్ని కల్గించేదానినిగా చేసుకోండి. నేను మీకు ఉల్లాసాన్ని కల్పించేదాన్ని, ప్రతిన చేసినదాన్నీ చేసినవాడినౌతున్నాను.

**క్లియోపాత్రా :** దోలబెల్లా! నేను నీకు ఋణపడుతున్నాను.

**దోలబెల్లా :** రాజ్ఞీ! నేను నిరంతరం మీ సేవకుడిగానే ఉండిపోతున్నాను. రాజ్ఞీ! నేను సీజర్‌కు పారిపార్శ్వకుడినై వర్తించాలి.

**(దోలబెల్లా నిష్క్రమిస్తాడు)**

**క్లియోపాత్రా :** శుభమగుగాక! ఇవే ప్రణామాలు! ఐరాస్! నీ అభిప్రాయ మేమిటి? నాలాగే నిన్ను కూడా ఈజిప్టునుంచి పట్టుకువచ్చిన ఒక పుత్తలికనుగా ప్రదర్శిస్తారని

భావిస్తున్నాను. చమురు చొక్కాలు తొడిగి, చేత మానదండాలు, సుత్తెలు పుచ్చుకొని నిల్చే కర్మకారులు మనను ప్రజలకు కన్పించేటందుకుగా పైకెత్తి చూపిస్తారు. వారి దుర్గంధనిశ్వాసాలలోనూ, నీచాహారదుర్వాసనలోనూ మనం మునిగి మాసిపోయి, వారి నీచుగాలిని పీల్చవలసిందే!

**ఐరాస్ :** దేవతలు మనకిట్టి దుఃస్థితిని తప్పింతురుగాక!

**క్లియోపాత్రా :** అవును ఐరాస్. ఇది సుసత్యం. రోమన్ న్యాయాధిపతుల పరివారం[124] మనను ఈటిముండలను పట్టుకొన్నట్లు పట్టుకొంటారు. మనమీద వెగటుపాటలు వ్రాసి, కుకవులు వింతగా చదువుతారు. చురుకైన పరిహాసకులు మన కథలను అభినయిస్తారు. అలెగ్జాండ్రియాలోని మన విలాసాలనన్నింటినీ ప్రదర్శిస్తారు. ఆంటోనీ పాత్రను అభినయించేవాడిచేత తప్ప త్రాగించి ప్రవేశపెడతారు. వైభవోన్నతమైన నా పాత్రను కీచుగొంతుకతో[125] ఒక కుర్రవాడు అభినయిస్తుంటే, బాధపడుతూ చూడవలసిన దుఃస్థితి నాకు కలుగుతుంది.

**ఐరాస్ :** అయ్యో! దేవతలారా! ఇదంతా జరిగి తీరవలసిందేనా?

**క్లియోపాత్రా :** తప్పదు. ఇది జరిగి తీరవలసిందే!

**ఐరాస్ :** దీన్ని నేను చూడను! ఇది నిశ్చయం! నా నయనాలకంటే నఖాలు ఎంతో గట్టివి.

**క్లియోపాత్రా :** వారి సన్నాహాలను అపహాస్యం చెయ్యటానికీ, ఉద్దేశాలను తారుమారు చేయటానికీ ఇది తగ్గ మార్గం.

**ఛార్మియన్ తిరిగి ప్రవేశిస్తుంది**

**క్లియోపాత్రా :** నా నారీలోకమా! నన్ను మహారాజ్ఞినిగా అలంకరించండి. వెళ్లండి. నా దుస్తుల్లో అత్యుత్తమమైన వాటిని వెదికి పట్టుకోరండి. మార్క్ ఆంటోనీని కలుసుకోటానికి నేను మళ్లీ నావమీద పయనింపబోతున్నానన్న భావం నాకు కలుగుతున్నది. ఓసి ఐరాస్! వెళ్లు, ఉదాత్త, ఛార్మియన్! ఇక త్వరలో మనం వ్యవహారాన్ని ముగిద్దాం. ఈ కొద్దిపనిని ముగించావో, నీకు 'డూమ్సు డే' వరకూ సెలవిస్తాను. నా కిరీటాన్నీ, మిగిలిన అన్ని అధికార చిహ్నాలనూ తీసుకో రా! ఈ ధ్వని ఎక్కడినుంచి?

**(ఐరాస్ నిష్క్రమిస్తుంది. లోపల ధ్వని వినిపిస్తుంది)**

**రక్షకభటుడు తిరిగి ప్రవేశిస్తాడు**

**రక్షకభటుడు :** మహనీయులైన మీ దర్శనంకోసం ఒక గ్రామీణుడు వచ్చాడు. మీకు అత్తిపళ్లను కానుకగా తెచ్చాడు.

**క్లియోపాత్రా :** అతణ్ణి ప్రవేశపెట్టు. (రక్షకభటుడు నిష్క్రమిస్తాడు) ఎంతటి క్షుద్రమైన సాధనం ఒక మహత్తరకృత్యాన్ని నిర్వహింపగలుగుతున్నది! అతడు నాకు స్వాతంత్ర్యాన్ని కొనివచ్చాడు. నేను స్థిరనిర్ణయం చేసుకొన్నాను. ఇక నాలో స్త్రీత్వమనేది అణుమాత్రమైనా లేదు. ఆపాదమస్తకం నేను శిలనైనాను. చలనశీలంగల చంద్రదైవతాన్ని ఇక నా అదృష్టానికి సంరక్షకురాలినిగా నేను అంగీకరింపలేను.

**రక్షకభటుడు, బుట్టను తెచ్చే ఒక గ్రామీణుడితో తిరిగి ప్రవేశిస్తాడు.**

**రక్షకభటుడు :** అతడు ఇదుగో.

**క్లియోపాత్రా :** నీవు వెళ్ళిపో. అతణ్ణి ఇక్కడ ఉండనీ.

**(రక్షకభటుడు నిష్క్రమిస్తాడు)**

బాధపెట్టకుండా చంపే ఆ నైలునదీకీటకం నీ దగ్గిరుందా?

**గ్రామీణుడు :** నిజంగా నా దగ్గిర ఉంది. దాని కాటు తీవ్రమైంది. కనుక దాన్ని మీరు ముట్టుకోటానికి నేనిష్టపడను. దాని కాటువల్ల దెబ్బతిన్నవారు తిరిగీ అరుదుగ బ్రతకనూ వచ్చు. బ్రతకకపోనూ పోవచ్చు.

**క్లియోపాత్రా :** దాని కాటువల్ల చనిపోయినవారు నీకెవరైనా గుర్తున్నారా?

**గ్రామీణుడు :** లేకేం. ఆడా, మొగా చాలామంది జ్ఞప్తికున్నారు. నిన్ననవే ఒకళ్లనుగురించి విన్నాను. ఆమె సత్యసంధురాలు. కొద్దిగా అబద్ధమాడింది. సత్యం కోరినప్పుడు తప్ప స్త్రీ అలా అబద్ధమాడకూడదుగా మరి! దాని కాటువల్ల ఆమె ఎలా మరణించిందీ, ఆమె ఎంత బాధను అనుభవించిందీ, – అంతా నాకు జ్ఞప్తికుంది. అంతే కాదు. ఆమె ఆ పురుగుకు మంచి యోగ్యతాపత్ర మిచ్చింది కూడాను. వారు చెప్పేది అంతా నమ్మేవాణ్ణి. అది చేసేదానిలో సగం చేసినా బ్రతికించటం కష్టం. కానీ ఈ పురుగు చాలా నిశ్చయమైనదనీ, నిర్మలమైనదనీ – పవిత్రమైన పురుగు అనీ....

**క్లియోపాత్రా :** ఇక వెళ్ళిపో! నీకు శుభమగుగాక!

**గ్రామీణుడు :** (బుట్టను క్రింద పెడుతూ) దీనివల్ల మీకు చాలా ఉల్లాసం కలుగుతుందనుకొంటాను.

**క్లియోపాత్రా :** శుభమగుగాక! వెళ్లు!

**గ్రామీణుడు :** చూడండి. ఈ పురుగు తన స్వభావానికి అనుగుణంగానే వర్తిస్తుంది.

**క్లియోపాత్రా :** నిజం. నీకు శుభం!

**గ్రామీణుడు :** చూడండి. చాలా ప్రాజ్ఞులైనవారి పాలనలో ఉంటే తప్ప ఈ పురుగును నమ్మటానికి వీల్లేదు. ఎందువల్లనంటారా, దీనిలో సహజమైన మంచితనం లేదు.

**క్లియోపాత్రా :** నీవేమీ ఆదుర్దాపడకు. అగత్యం లేదు. కడు శ్రద్ధ వహిస్తాను.

**గ్రామీణుడు :** మంచిది. దయుంచి దానికేమీ పెట్టవద్దు. అది అలా తిండి పెట్టదగ్గది కాదు.

**క్లియోపాత్రా :** అయితే అది మరి నన్ను తింటుందా?

**గ్రామీణుడు :** నన్నొక వెర్రివాడినని అనుకోకండి. స్త్రీని భూతమే తిననప్పుడు, పురుగెందుకు తింటుంది? భూతం ఆమెను అలంకరించకపోతే స్త్రీ దేవతలకు భోగ్యం కాదగ్గది. కానీ ఈ భూతాలు దేవతలకు స్త్రీలను కల్పించటంలో వారికెంతో కీడు కల్గిస్తున్నారు. వారు సృజించే ప్రతి పదిమందిలోనూ అయిదుగురిని చెడకొడుతారు.

**క్లియోపాత్రా :** మంచిది. వెళ్ళిపో. నీకు శుభమగుగాక!

**గ్రామీణుడు :** మీరు కోరుకున్న పురుగు చిక్కిందనుకొంటాను. దీనివల్ల మీకు ఆనందం కలుగుగాక!

**(నిష్క్రమిస్తాడు)**

**దుస్తులు, కిరీటం తీసుకుని ఐరాస్ ప్రవేశిస్తుంది.**

**క్లియోపాత్రా :** నా దుస్తులతో నన్ను అలంకరించు. కిరీటాన్ని అమర్చు. దివ్యత్వాకాంక్షలు నాలో విజృంభిస్తున్నాయి. ఇక క్షణకాలమైనా ఈజిప్టు ద్రాక్షాసావంతో నా మోవిని శీతలం చెయ్యను. ఉదాత్త! ఐరాస్!! త్వరపడు. సిద్ధపడు. ఆంటోనీ నన్ను పిలుస్తున్నట్లు తోస్తున్నది. ఈ నా ఉదాత్తకృత్యాన్ని స్తుతించటం కోసం ఆయన తిరిగి లేచి వస్తున్నట్లు కన్పిస్తున్నాడు. దేవతలు తరువాత తాము ప్రకటించే క్రోధాన్ని కప్పిపుచ్చుకొనేటందుకు ప్రసాదించిన సీజర్ మహైశ్వర్యాన్ని, ఆయన పరిహసిస్తున్నట్లు నాకు విన్పిస్తున్నది. ప్రణయవతీ! నేను వస్తున్నాను. నీ పత్నినని పిలవబడటానికి తగ్గ యోగ్యత నాకున్నదని నా ధైర్యం నిరూపించుగాక! నాలోని ఇతరభూతాలను నేను అల్పప్రాణులకు ఇచ్చివేశాను.

కనుక నేను కేవలం ఆకాశాన్ని, తేజాన్ని అందువల్ల నేను పరలోకంలో దివ్యత్వాన్ని అనుభవింపబోతున్నాను. ఛార్మియన్! నా అలంకరణ పూర్తి అయిందా? రా. నా పెదవులిచ్చే తుది వెచ్చనిముద్దు పుచ్చుకో. ఇదే నా వీడ్కోలు! కరుణాగుణా! అతిదీర్ఘమైన వీడ్కోలు. (వారిని ముద్దెట్టుకొంటుంది. ఐరాస్ క్రిందపడి మరణిస్తుంది.) ఆ కీటవిషం నా పెదవుల్లో ఉందా? నీకు మరణాన్ని కల్పించిందా? నీవు మానవజీవితం నుంచి ఇంత ప్రశాంతంగా విడివడిపోగలిగితే 'ప్రియుని వ్యథ' లాగా బాధపెడుతున్నా కాంక్షింపతగ్గది. నీవు ఇంత ప్రశాంతంగా శయనింపగలిగావా? ఈ రీతిగా నీవు అదృశ్యవు కాగలిగితే, మరణాన్ని గురించి అంతటి గొడవ అనవసరమని ప్రపంచానికి ప్రకటించవచ్చు.!

**ఛార్మియన్ :** మా మరణాలకు దేవతలు కూడా దుఃఖిస్తున్నారని చెప్పటం కోసం ఓ సజలమేఘమా! కుంభవృష్టిగా నీవు కరిగిపో!

**క్లియోపాత్రా :** ఇది నా నీచత్వాన్ని నిరూపిస్తున్నది. అలంకరించుకొని సంసిద్ధంగా ఉన్న ఆంటోనీని ఇది ముందుగా కలుసుకొంటే, ఆయన నన్ను గురించి ప్రశ్నించి నేను స్వర్గానికి వెళ్లగానే నాకు దక్కించవలసిన ముద్దు దీనికిచ్చేస్తాడు. ఓ భయంకరకీటమా! రా! నన్ను అంతమొందించు. (వక్షాన్ని అర్పిస్తూ కీటకంతో) నీ నిశితదంష్ట్రలతో ఈ నా జీవితక్లిష్టబంధాన్ని కొరికివెయ్! ఓసి విషపుతుట్టా! కోపం తెచ్చుకో! నా జీవితానికి పరిసమాప్తిని కలిగించే నీవు మాట్లాడిగలిగి ఉన్నట్లయితే ఎంత బాగుండేది! ఓహో! 'నీకు ప్రాజ్ఞతగాని నీతిగాని లే'దని సీజరును నీవు నిందిస్తుంటే వీనులార వినగలిగేదాన్ని.

**ఛార్మియన్ :** అయ్యో! ఓ ప్రాక్తారా!

**క్లియోపాత్రా :** ఇస్! నిశ్శబ్దం. కనిపించటం లేదూ? చనుబాలు త్రాగుతూ నాబిడ్డ తాను నిద్రించటానికి ప్రతిగా దాదినైన నన్నే నిద్రపుచ్చుతున్నది.

**ఛార్మియన్ :** ఓ నా హృదయమా! ఇంకా నీవు బ్రద్దలు కావేం?

**క్లియోపాత్రా :** అంజనంలా అమృతప్రాయమై, మారుతంలా మెత్తనై, మృదు – ఆంటోనీ! త్వరలో నిన్ను కలుసుకొంటాను. నీకు కూడా నా స్తన్యమిస్తాను. (మరొక కీటాన్ని చేతికి కరిపించుకొంటూ) ఏమిటి?.... నేను... ఉండాలా?

**(శయ్యమీద వ్రాలి మరణిస్తుంది)**

**ఛార్మియన్ :** ఈ క్షుద్రప్రపంచంలో... ఉండాలా? లేదు. నీకు శుభమగుగాక! సాటిలేని కన్య ఇప్పుడు నీదైంది. ఓ మృత్యువా! ఇక గర్వించి నీ ఘనతను చెప్పుకోవచ్చు. పక్షుల ఒంటిమీది మెత్తని రెక్కల్లా మృదువైన కనురెప్పల్లారా! ఇక నిరంతరం మీరు మూసుకోపొండి. ఈమెకంటే రాచరికం గల కన్నులేవీ ఫొయిబస్ స్వర్ణకిరణకాంతులను ముందు చూడబోవు. నీ కిరీటం చెదరింది. సరిదిద్ది తరువాత క్రీడిస్తాను.

**వేగంతో చొచ్చుకొని వస్తూ భటులు ప్రవేశిస్తారు**

**ప్రథమ భటుడు :** రాజ్ఞి ఎక్కడ?

**ఛార్మియన్ :** నింపాదిగా మాట్లాడు  ఆమె మేల్కొంటుంది.

**ప్రథమ భటుడు :** మమ్మల్ని సీజర్ పంపించారు.

**ఛార్మియన్ :** నింపాదిగా ఒక భటుణ్ణి (ఒక సర్పాన్ని కరిపించుకొంటుంది) ఓహో! త్వరగా రా! నన్ను కూడా పంపించు! కొంతగా నీ కాటు చవి నాకు తెలుస్తున్నది.

**ప్రథమ భటుడు :** హేయ్! క్లియోపాత్రా కడకు చేరండి! ఇదేమీ సవ్యంగా లేదు. మీరు సీజర్‌ను మోసగించారు.

**ద్వితీయభటుడు :** సీజర్ పంపించిన దోలబెల్లా అక్కడ ఉన్నాడు  అతణ్ణి పిలవండి.

**ప్రథమ భటుడు :** ఏం పని చేశారు? ఛార్మియన్! నీవు చేసిన పని మంచిదేనా?

**ఛార్మియన్ :** మంచిపనే చేశాను. ఉత్తమరాజవంశంలో జన్మించిన రాకుమారికి యోగ్యమైన పని చేశాను. అవును సైనికుడా! మంచిపని చేశాను.

**దోలబెల్లా తిరిగి ప్రవేశిస్తాడు.**

**దోలబెల్లా :** ఇక్కడ ఏమి జరుగుతున్నదేమిటి?

**ద్వితీయభటుడు :** అందరూ మరణించారు.

**దోలబెల్లా :** సీజర్ మహాశయా! ఈ మృతశరీరదృశ్యాలు మీ పూర్వోహలన్నీ సత్యాలని నిరూపించాయి. నిష్ఠతో నివారించటానికి యత్నించిన కృత్యాలు నిర్వర్తితాలై పోవటాన్ని తిలకించటానికి తామే స్వయంగా విచ్చేస్తున్నారు.

**లోపల 'మార్గం', 'సీజర్ మహాశయునికి మార్గం' అన్న కేకలు వినిపిస్తుంటాయి. సైనిక విన్యాసంతో వెంటవస్తున్న పరివారంతో సీజర్ తిరిగి ప్రవేశిస్తాడు.**

**దోలబెల్లా :** ప్రభూ! మీరు సత్యంగా ప్రవక్తలు. ఇది జరుగుతుంది అని శంకించి, జంకి, సెలవిచ్చింది సర్వం జరిగిపోయింది.

**సీజర్ :** నిరంతర సాహసిక! ఈమె తన జీవితాంత్యంలో మహాసాహసాన్ని ప్రదర్శించింది. మన ఉద్దేశాలను ఊహించింది. రాచపుట్టువు కనుక ప్రతివిషయంలోనూ ఇచ్ఛానుసారంగా వర్తించే హక్కు ఆమెకు ఉన్నందువల్ల, ఆమె తనకుతోచిన మార్గాన్ని అనుసరించింది. వారు ఎలా మరణింపగలిగారు? ఎక్కడా రక్తస్రావం కనిపించటం లేదే!

**దోలబెల్లా :** వీరి దగ్గరికి వచ్చిన చివరివాడెవడు?

**ప్రథమభటుడు :** ఒక సామాన్యగ్రామీణుడు. ఆమెకు అత్తిపళ్లు తెచ్చాడు. ఇది అతని బుట్ట.

**సీజర్ :** అయితే వాడు వీరికి విషంపెట్టాడన్నమాట!

**ప్రథమభటుడు :** ఈ ఛార్మియన్ ఇంతదాకా బ్రతికే ఉంది. నిలువబడే మాటాడింది కూడాను. మరణించిన ఆమె యజమానురాలి శిరస్సుమీద చెదిరిన కిరీటాన్ని చక్కదిద్దింది. నిలువబడ్డప్పుడు గజగజలాడింది. హఠాత్తుగా పడి ఒరిగిపోయింది.

**సీజర్ :** ఓహో! ఇది ఎంత ఉదాత్తమైన దౌర్బల్యం! విషం తిన్నట్లయితే అది పొంగుగా శరీరంమీద కన్పించేది. ఓహో! ఈమె తన సౌందర్య సమ్మోహనవిద్యతో మరో ఆంటోనీని నిబద్ధుణ్ణి చేయటానికో అన్నట్లు నిద్రపోతున్నది.

**దోలబెల్లా :** ఇదిగో. ఆమె వక్షంమీద ఒక రక్తపు జాలు కన్పిస్తున్నది. కొంత ఉబ్బు కూడా గోచరిస్తున్నది. అటువంటి పొంగే ఆమె హస్తంమీదనూ ఉంది.

**ప్రథమ భటుడు :** ఇది పురుగు చేష్ట. నైల్‌నదీభూగర్భకుల్యల్లోని[126] సర్పాలమీద ఉన్నట్లుగా ఈ అత్తిఆకుల మీద పంకకళంకాలు కన్పిస్తున్నవి.

**సీజర్ :** బహుశః ఆమె పురుగు కాటు వల్లనే మరణించి ఉండవచ్చు. ఆమె అగదంకారులచేత సులభమరణాన్ని అన్వేషించటానికి అనేకపరిశోధనలు చేయించిందని విన్నవించారు. ఆమె శయ్యను ఎత్తుకోండి. ఆమె నారీగణాన్ని ఈ నిర్మాణం నుంచీ మోసుకోరండి. ఆమె ఆంటోనీతోనే ఆమెను సమాధి చేయిస్తాను. ఇట్టి జంటను

పొందిన సమాధి ఏదీ ఇలమీద ఉండబోదు. ఇటువంటి బలవత్కృత్యాలు, వాటికి కారకులైన వారికి వ్యతను కలిగింపకపోవు. ఇట్టి బాధాకథను కల్పించటం కారకులకు గౌరవాన్ని కలిగించటంకంటే అధికంగా ఇతరులను దుఃఖితులను చేసి, బాధితులయెడ బహుళతరమైన కరుణను కట్టబెడుతుంది. వీరి అంత్యక్రియల్లో మన సైన్యం శాంతప్రదర్శనలను జరుపుతూ పాల్గొంటుంది. తరువాత రోముకు మనం పయనిస్తాం. రా! డోలబెల్లా! ఈ అంత్యక్రియలు అత్యుత్తమ శోభావిభవపరంపరలతో సాగిపొయ్యేటట్లు చూడు.

**(నిష్క్రమిస్తాడు)**

# అనుబంధం

## ప్రథమాంకం

1. **కపిలవర్ణ :** క్లియోపాత్రా, ఈమె 'దివిజ–చక్రవర్తి' అయిన అలెగ్జాండరు వంశంలో జన్మించింది. అందువల్ల ఈజిప్షియన్ కాదు గ్రీకు వనిత. ఈమె పారంపర్యంగా వస్తున్న క్లియోపాత్రానామాన్ని ధరించిన 7వ టొలమీ రాజ్ఞి. కానీ చరిత్రలో క్లియోపాత్రా అన్న నామధేయం ఈమెకే రూఢమైంది. మార్క్ ఆంటోనీ ఈమెనే 'పురానైల్ నాగిని' అని వ్యవహరించాడు. జన్మతః గ్రీకుజాతి వనిత అయిన ఈమెను, షేక్స్పియర్ ఈజిప్టు వనితగా వర్ణించాడు. తరువాతి కవులు, చిత్రకారులు ఈమెను ఆఫ్రికావనితగానే వ్యవహరించారు. టెనిసన్ కవిమాత్రం ఈ రాజ్ఞిని కపిలగండభాగనుగాను, నీలనేత్రనుగాను పేర్కొన్నాడు.

   **జిప్సీ :** ఇది ఈజిప్షియన్ శబ్దానికి భ్రష్టరూపం. జిప్సీలు తొలుతగా భారతదేశంనుంచి పాశ్చాత్యలోకంలో ప్రవేశించారుట.

2. **అంకురించే శ్మశ్రువులు గల యువకుడు –** కథాకాలంనాటికి (క్రీ.పూ. 41) ఆక్టేవియస్ సీజర్ వయస్సు ఇరవై మూడు సంవత్సరాలు. అతని జన్మవత్సరం క్రీ.పూ. 63.

3. **టైబర్ నది :** ఇటలీలోని ఈ నదీతీరాననే రోము మహానగరం నిర్మితమైంది.

5. **ఏబది ఏండ్ల వయసులో –** ఏబది సంవత్సరాలు గడచినతరువాత సంతానం కలుగుతుందని చెప్పటంకంటే, స్త్రీని గురించిన మహా గొప్ప స్తోత్రపాఠం ఉండదు.

6. **జూరీ హీరాడ్ :** ఇతడు ప్రాచీనాలైన ఆంగ్లేయుల అద్భుతరూపకాలలో అతిభయంకరుడూ, డాంబికుడూ అయిన నిరంకుశపరిపాలకుడుగా నిరూపితుడైనాడు. ఇతడు ప్రత్యేకంగా బాలబాలికలను చిత్రవధ చేయటంలో పేరు మ్రోగించాడు.

7. **తండ్రులెవరో తెలియక –** అధర్మసంతానం కావటం వల్ల.

8. **నిండి ప్రవహించే నైల్ –** దరులు నిండి ప్రవహించే నైలు ఒండుమట్టి పెట్టటంవల్ల సస్యానికి లోపం ఉండదు. అంటే విరాస్ పవిత్రగా ఉండజాలదని.

9. **తడిచేయి :** ఐరాస్ చేయి తడిదనీ, ఫలవంతమైనదనీ ఛార్మియన్ చెప్పటంలో, 'ఆమె కామచపల' అన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నది.

10. **ఇసిస్ :** ఈజిప్టియనుల దేవతాగణంలో ఒక ముఖ్యురాలు. చంద్రదైవతం. తొలుత ఈమె వారి భూ సస్య సంతానాధి దైవతం.

11. **తమ భార్య ఫుల్వియా :** ఆంటోనీ క్రీ.పూ. 48–46 మధ్య కాలంలో ప్రఖ్యాతుడైన క్లోడియస్ విధవ అయిన ఫుల్వియాను వివాహమాడాడు. ఈమె రాజకీయ వ్యవహారాలలో పాల్గొనటం ప్రారంభించిన ప్రథమ రోమకవనిత. భర్త ప్రాచ్యదేశాలలో ఉన్నప్పుడు అతని హక్కులను అన్నింటినీ రోములో ఉండి అతిశ్రద్ధతోనూ, సాహసంతోనూ కాపాడింది. క్రీ.పూ. 42, 41లలో ఆంటోనీ సోదరుడైన లూషియస్‌తో కదనభూమిలో నిల్చి పోరాడింది. తరువాత లూషియస్, ఫుల్వియా ఇరువురూ ఆక్టేవియస్ సీజర్ మీద తిరుగుబాటు చేసి రోమును వశపరచుకొన్నారు. కాని క్రీ.పూ. 40లో ఆక్టేవియస్‌కు సేనాపతి అయిన అగ్రిప్పాకు ఓడి, ఫుల్వియా బ్రండీషియంద్వారా బిడ్డలతో తూర్పునకు పారిపోవలసి వచ్చింది. లూషియస్ లొంగిపోయాడు. భర్తృతృణీకారభావం వల్లా, రాజకీయాలలో ఆమె పాల్గొనటాన్ని అతడు నిందించటంవల్లా జబ్బుపడి సిక్సన్‌లో ఫుల్వియా మరణించింది. షేక్స్‌పియర్ మహాకవినాటకం క్రీ.పూ. 40 మధ్యకాలంలో ఆరంభమౌతున్నది.

10. **యూఫ్రెటీస్ –** ఆసియాలో ఒక నది.

13. **సెక్సస్ పాంపే :** క్రీ.పూ. 106 – 48లలో సుప్రసిద్ధ రోమకసేనానాయకుడై అనేక మహావిజయాలను చేకొన్న పాంపేఘనుడనే మహావీరుని కుమారుడు.

14. **అశ్వజాతి కేశాలలాగా –** పూర్వం కంబర్‌లాండ్ మొదలైన ప్రాంతాలలో అశ్వకేశాన్ని నీళ్ళల్లో పడవేస్తే, అది సర్పంగా మారిపోతుందని ఒక నమ్మకం ఉండేది.

**15.** **మనసార ప్రేమిస్తే –** క్లియోపాత్రా ఆంటోనీని మనసార ప్రేమించటం లేదనీ, ప్రేమిస్తుంటే అనుసరింపవలసిన మార్గం ఇది కాదనీ, ఈ మార్గం ఆకర్షించటానికంటే వ్యతిరేకం చేసుకోటానికి పనికివస్తుందనీ ఛార్మియన్ భావం.

**16.** **పరిహృతుడైన పాంపే –** రోమునించి వచ్చిన కాందిశీకులను దయార్ద్ర హృదయంతో చూడటంవల్ల, సెక్టస్ పాంపే అధికప్రజానురాగపాత్రు డౌతున్నట్లు ఎప్పియస్ చరిత్రకారుడు.

**17.** **కాచపాత్రిక –** ప్రాచీన రోమనులు మిత్రుని శవమృణ్మయపాత్రల్లో వారి మరణవేళ తాము కార్చిన కన్నీటిబుడ్లను ఉంచేవారు.

**18.** **నైల్ :** ఈజిప్టును సారవంతం చేసే మహానది.

**19.** **చేపలు పడుతున్నాడు –** ఒకమారు క్లియోపాత్రాతో చేపలు పట్టటానికి వెళ్లి, ఒక్క చేపా పడకపోతే ఆంటోనీ కోపం తెచ్చుకొని, తన ఈతగాళ్లను నీళ్ల లోపలికి వెళ్ళి మునిగిఉండి తన గాలానికి చేపలను తగిలించమని ఆజ్ఞాపించినట్లు – ప్లూటార్కు.

**20.** **త్రాగుతున్నాడు –** క్లియోపాత్రా సౌధం నట, నర్తక, ద్యూతక్రీడారతులతోనూ, గారడీవారితోను, త్రాగుబోతులతోనూ నిండి ఉండేదనీ, ఆమె నిరంతరమూ విలాసోపభోగాలతో తేలి ఆడుతుండేదనీ ప్లూటార్కు.

**21.** **టోలమీ శయ్య :** టోలమీ క్లియోపాత్రా సోదరుడు. ఈజిప్టు రాజవంశంవాళు ్ల తమ సోదరులనే వివాహమాడటం ఆచారం. అందువల్ల క్లియోపాత్రాను ఆమె సోదరుడైన టోలమీ కిచ్చి సాంకేతికంగా వివాహం చేశారు. క్లియోపాత్రా శయ్య అందువల్ల ధర్మతః టోలమీ శయ్య ఔతుంది.

**22.** **ఆ అతివకు రాజ్యదానం :** ఆంటోనీ రోమనుల అభిప్రాయానికి వ్యతిరేకంగా క్లియోపాత్రాను ఈజిప్టు, సిప్రస్, లిడియా, లోయర్, సిరియాలకు రాజ్ఞిని చేశాడు. అప్పుడు క్లియోపాత్రా చంద్రదేవత అయిన ఇసిస్ దుస్తులు ధరించి, నూతన ఇసిస్‌లా ప్రజలను దర్శనమిస్తూ ఉండేదిట – (ప్లూటార్కు).

**23.** **మెనక్రేట్స్, మెనాస్ :** ప్రజానురాగాన్ని కోల్పోతున్న ఆక్టేవియస్ సీజర్ కాలంలో, ఈ ఓడదొంగలు ఇటలీ భూభాగంమీదికి ఎన్నో దండయాత్రలు చేసినట్లు చరిత్ర చెపుతున్నది.

**24.** **మహాభోగివిగా పెరిగినా –** ఉత్తమసైనికుని కావశ్యకాలైన సద్గుణాలు సర్వం ఉన్న ఆంటోనీ, నేడు ఎలా కామలోలుడైనదీ సీజర్ నిరూపిస్తున్నాడు.

**25.** **మాన్డ్రగోరా :** ఈ మొక్క కషాయం తాగితే నిద్రపడుతుందిట. దీనిని త్రాగి క్లియోపాత్రా నిద్రించి, ఆంటోనీ వియోగం వల్ల కలిగే బాధనుంచి బయటపడ తలచుకుంటున్నది.

**26.** **అర్ధఅట్లాస్ :** అట్లాస్ టిటన్లలో ఒకడు. మారిటేనియాకు రారాజు. ఇతడు పెర్స్యూస్‌కు ఆతిథ్యమివ్వకపోతే మెడూసా కళ్ళను చూపించి పర్వతంగా మార్చివేశాడు. ఈ పర్వతం ఉత్తరాఫ్రికాలో తూర్పుపడమరల వ్యాపించి ఉందనీ, దానిమీదనే ఆకాశం నిలిచి ఉందనీ, ప్రాచీన పాశ్చాత్యుల భావన. అట్లాస్ తన బాహువులమీద ప్రపంచాన్ని భరిస్తున్నాడని వారి అభిప్రాయం. క్లియోపాత్రా ఆంటోనీని 'అర్ధ – అట్లాస్' అనటంలో అతడూ, సీజరు ప్రపంచాన్ని చెరిసగం పంచుకొన్నారని. ఇట త్రైకూటవీరుల్లో మూడోవాడైన లెపిడస్‌కు వ్యక్తిత్వం లేకపోవటంవల్ల, క్లియోపాత్రా అతణ్ణి పూర్తిగా విస్మరించింది.

**26A.** **ఫొయిబస్ ప్రణయ....:** ఫొయిబస్ సూర్యదేవత. సూర్యదేవుని క్లియోపాత్రా తన ప్రియుడుగా భావించటం మహామనోజ్ఞమైన ఊహ.

**కాలకల్పిత గాఢరేఖా...:** క్లియోపాత్రాకు ఆంటోనీతో సంబంధం ఏర్పడేటప్పటికి ఆమె వయస్సు ఇరవై మూడు సంవత్సరాలైనట్లు, అప్పుడు ఆమె పూర్ణయౌవనవికాసాన్ని పొందినట్లు ప్లూటార్క్ చరిత్రకారుని పలుకు. కానీ షేక్స్‌పియర్ మహాకవి ఆ సమయానికి క్లియోపాత్రా వయస్సు చాలా ఎక్కువగా ఉన్నట్లు ఇక్కడ సూచిస్తున్నాడు.

**27.** **ఘనుడైన పాంపే –** ఇతడు చరిత్రప్రసిద్ధి నొందిన ఘనుడైన పాంపే కాదు అతని కుమారుడు క్నైయస్ పాంపే. తన సౌందర్యాతిశయంతో జూలియస్ సీజర్, పాంపేలను జయింపగలిగిన తాను ఆంటోనీని అవలీలగా కైవసం చేసుకోగలనని ఆశిస్తున్నది.

**28.** **పరుసవేది :** క్షుద్రలోహాలను స్వర్ణంగా మార్చగలదని ప్రఖ్యాతి పొందిన, 'తాత్త్విక – శిల' (Philosopher - stone)

**29.** **సీజర్‌ను –** జూలియస్ సీజర్‌ను.

## ద్వితీయాంకం

**30.** **ఎపిక్యురస్ –** క్రీ.పూ. 342 – 270 ఒక గ్రీకు తత్త్వవేత్త.

'ఎపిక్యురస్' మతానుయాయులు – మహోన్నతానందం మంచివల్ల కలుగుతుందని ఎపిక్యురస్ సిద్ధాంతం. కానీ తరువాతి కాలంవారు ఇతడు 'ఇంద్రియలోలత'నే మహానందంగా నిరూపించినట్లు అపార్థం కల్పించి, ప్రచారం చేశారు. అందువల్ల అతడి అనుయాయులంటే ఇంద్రియలోలురనే అర్థం వచ్చింది.

**31.** **ఈజిప్టువిగతభర్తృక :** సోదరుణ్ణి వివాహమాడి ఆతడి మరణం వల్ల విధవ అయిన క్లియోపాత్రాను గురించి ఏహ్యభావాన్ని ప్రకటిస్తూ, పాంపే ఈ పదప్రయోగం చేశాడు.

**32.** **జూపిటర్ :** రోమన్ దేవతాగణంలో ప్రముఖుడు. గ్రీకుల జూయెస్ వంటివాడు. సం.ద్యౌః. పితరుడు.

**33.** **ఈజిప్టు నుంచి రప్పించటానికి –** ఫుల్వియా కుటిలబుద్ధి కలది. చిక్కులను కల్పించే స్వభావం గల ఆమె, ఆంటోనీని ఈజిప్టునుంచి రప్పించటానికి ఇటలీలో సీజర్‌మీద కావాలని తిరుగుబాటు చేసింది.

**34.** **తల్లి వంక చెల్లెలు:** ఆక్టేవియా సీజర్‌కు ఆంకేరియా అనే మరొక తల్లి వల్ల జన్మించిన సోదరి. అతని తల్లి అక్కియా అని ప్లూటార్కు వల్ల తెలుస్తున్నది. దీనినే షేక్స్‌పియర్ అనుసరించాడు. ఇది చారిత్రికసత్యం కాదు. సీజర్ తండ్రి అయిన ఆక్టేవియస్ రెండవ భార్య అతియా వల్ల సీజర్, ఆక్టేవియా ఇరువురు జన్మించారు.

**35.** **శీలసౌభాగ్యాదులే... చెప్పగలవు :** షేక్స్‌పియర్ మహాకవి ఉత్తమురాలు, ధర్మజ్ఞ అయిన ఆక్టేవియాను పరిహాసపాత్రురాలుగా చిత్రించాడని కొందరి భావం. అది పొరబాటు. గృహ్యజీవితానికి యోగ్యయైన వ్యక్తి అని అగ్రిప్పా, మెకయ్‌నాస్ ఆమెను పొగిడారే గాని, ఇందులో ఆమెను పరిహసించటం ఎక్కడా కన్పించదు. ఆమెయెడ ఈర్ష్య వహించిన క్లియోపాత్రా మాత్రం ఆక్టేవియాను గురించి 'మరుగుజ్జనీ', 'ముద్దమాటలు మాటాడుతుం'దనీ వర్ణించింది. ఆమెచేత ఇలా అనిపించటంలో షేక్స్‌పియర్ ఔచిత్యాన్నే పాటించాడు.

36. **ఆక్టేవియా మీద ఉన్న అధికారం –** ప్రేమగల సోదరుడికి సోదరిపై గల అధికారమన్నమాట.

37. **ఈ మహోదారకృత్యానికి పరిపూర్తిని –** తాత్కాలికోద్వేగంతో ఆంటోనీ ఆక్టేవియాను వివాహమాడటం ఉత్తమఫలోపేతమని భావించాడు. ఉద్వేగం తగ్గిన తరువాత ఇది చెరుపు కలిగించేటట్లు అతనికి తోచింది. ఆక్టేవియాను వివాహమాడటం ఆంటోనీ చేసిన గొప్ప పొరపాటు పని. మహాలాభం చేకూరుతుందన్న భ్రాంతిపడి, ఆంటోనీ ఆక్టేవియాను వివాహమాడి సీజర్ చేతుల్లో పడిపోయాడు.

38. **గౌరవాన్ని ప్రకటిస్తూ వచ్చాడు –** ఫుల్వియా సీజర్‌మీద తిరగబడి ఇటలీనుంచి పారిపోయి వచ్చినప్పుడు,సెక్టస్ పాంపే, ఆంటోనీ తల్లికి అతిగౌరవంతో ఆతిథ్యమిచ్చాడు. అందువల్ల లోకం వారిద్దరూ సంధి చేసుకొన్నారని కూడా భావించింది.

39. **మైసనం –** కాంపేనియా వద్ద నాలికలా సముద్రంలోకి చొచ్చుకొనిపోయి పై నామంతో వ్యవహరింపబడే భూభాగం.

40. **సిడ్నస్ నదిమీద :** సిడ్నస్ నది మౌంట్ టార్సస్‌లో పుట్టి, టార్సస్ నగరంమీదుగా ప్రవహిస్తున్నది. ఆంటోనీ క్లియోపాత్రాను సిడ్నస్ నదిమీద కలుసుకోలేదు. ఆమె సమ్మోహనరూపంతో సిడ్నస్ నదిమీద తన నౌకలో ఉండగా, ఆంటోనీ విపణిలో ఉన్నతాసనాన్ని అధిష్ఠించి ఒంటిగా కూర్చొన్నాడు. ఆమె దిగివచ్చి అతణ్ణి రాత్రివిందుకు ఆహ్వానించింది. అందువల్ల ఇక్కడ 'నది మీద' అంటే నదీతీరప్రాంతం అని అన్వయించుకోవలసి ఉంది.

41. **స్థపతి శిల్పించి నిల్పిన వీనస్‌మూర్తి –** ఈ చిత్రం సుప్రసిద్ధ గ్రీకుచిత్రకారుడైన ప్రొటొజెనస్ గీచిన వీనస్ అని కొందరు విమర్శకులు, అపెల్లస్ గీచిన 'సాగరోద్భవ అయిన వీనస్' అని కొందరు విమర్శకులు భావిస్తున్నారు.

42. **నెరైడ్స్ :** జలకన్యలు (అప్సరసలు)

మత్స్యకన్యలు – వీరు మెర్మైడ్లు. వీరికీ నెరైడ్స్‌కు రూపంలో విభేదముంది. నెరైడ్స్ పరిపూర్ణమానవరూపంలో ఉంటారు. మెర్మెయిడ్లు కటిప్రదేశం వరకూ మానవాకారాన్నీ, క్రింద మత్స్యాకారాన్నీ వహిస్తారు.

43. **శూన్యతను కల్పించి ఉండవలసింది :** ప్రకృతి శూన్యతను గర్హిస్తుందని, రెండు వేలకు పూర్వం గ్రీకులలో సంచారం చేస్తూ తమ తత్త్వాన్ని వ్యాప్తి నొందించిన పెరిపాటటిక్ మతస్థులైన తాత్త్వికుల అభిప్రాయం.

44. **జోస్యుడు :** ఇతడు ఈజిప్టు నుంచి ఆంటోనీ వెంట రోముకు వచ్చాడు.

45. **లావుకాలు :** ప్రాచీన సమారిట్లను, చైనీయులు లావుకపిట్టలకు పోటీలు పెట్టి వినోదించేవారని తెలుస్తున్నది.

46. **బిల్లియర్డ్సు –** ఈ క్రీడ ఆధునికం. దీనిని రోమనుల కాలంలో ఉన్నట్లు చెప్పటం ఔచిత్యం.

47. **ఆంటోనీ మరణించాడా? :** వార్తాహరి తెచ్చిన వార్తను వినటానికి భయపడుతున్న క్లియోపాత్రా అత్యాతురతతో అతణ్ణి చెప్పనీయకపోవటం మానసికవేత్త అయిన షేక్స్పియర్ చేసిన మనోజ్ఞకల్పన.

48. **ఫ్యూరీలా –** గ్రీకు పురాణగాథల్లోని క్రోధదేవతలు. వీరు దోషులకు విధించిన శిక్షలను కార్యరూపంలో పెడుతుంటారు. వీరి శరీరాలు కారునలుపుగాను, శిరోజాలు సర్పాన్వితాలుగానూ ఉంటాయి. కన్నుల నుంచి రక్తబిందువులు స్రవిస్తుంటాయి. బంగారాన్ని వర్షిస్తాయి – ప్రాచ్యదేశాల రాజుల పట్టాభిషేకసమయాలలో వారిమీద బంగారు రజనును, పులిముత్యాలను వెదచల్లటం ఆచారం.

49. **నార్సిస్సస్ –** నదీదైవతమైన సెఫీస్సస్కు, అప్సరస లిరియోప్కు జన్మించిన పుత్రుడు. అందగాడు. ఒక కొలనులో తన ప్రతిబింబాన్ని చూచి ముగ్ధుడై, అది ఆ ప్రదేశంలోని అప్సరస అని భావించి పొందలేక నిరాశపడి, మరణించాడు. దేవతలు అతణ్ణి ఒక పుష్పంగా రూపొందించారు. ఇతని ప్రేమకోసం 'ఇకో' వనదేవత అలమటించి, చివరకు స్వరంతప్ప ఏమీ మిగలకుండా అయిపోయింది. ఈ నిర్దయకు శిక్షగా ఇతడు తన ప్రతిబింబాన్ని తానే ప్రేమించి, వసివాడి, మరణించవలసి వచ్చింది.

50. **నిత్యంగా వెళ్ళిపోనీ –** ఈ వాక్యాలను క్లియోపాత్రా ఆంటోనీని ఉద్దేశించి పలుకుతున్నది.

**51.** **గర్గన్‌లా –** గార్గన్లు ముగ్గురు. అక్కచెల్లెండ్రు. ఫార్సిస్ కేటోల కుమార్తెలు. వీరిలో సుప్రసిద్ధ మెడూసా. ఈమె శిరస్సు మహాభయంకరమైంది. దాన్ని చూచిన ప్రతివారూ శిలలుగా మారిపోతారు.

**52.** **మార్స్ :** గ్రీకుల యుద్ధదేవత.

**53.** **ఫిలిప్పీయుద్ధరంగం :** మార్క్ ఆంటోనీ ఈ యుద్ధరంగంలోనే బ్రూటస్, కాషియస్‌లను ఓడించి, సీజర్ హత్యకు ప్రతీకారాన్ని పొందటం జరిగింది.

**54.** **నా జనకుడు :** పాంపే తండ్రి ఘనుడైన పాంపే. మొదటి పాలక త్రయకూటమి క్రీ.పూ. 60లో ఏర్పడ్డది. అందులో సభ్యులు జూలియస్ సీజర్, పాంపే, క్రాసస్. క్రీ.పూ. 48లో జూలియస్ సీజర్ పాంపేను థాసల్లీలోని ఫార్సేలియాలో ఓడించి చంపాడు. తరువాత కొలది కాలానికే క్రాసస్‌ను అలెగ్జాండ్రియాలో హత్య చేశాడు.

**55.** **బ్రూటస్ :** జూలియస్ సీజర్‌కు మిత్రుడు. రోమక ప్రజాస్వామ్యానికి సీజర్ హత్య అవసరమని భావించి హంతకవర్గనాయకుడై, ఆత్మమిత్రుని హతమార్చిన ఉదాత్తరోమకవ్యక్తి.

**56.** **సభాభవనాన్ని రక్తపంకిలం చేయటం –** సీజర్ హత్య నిజానికి రోములోని సభాభవనంలో (కాపిటోల్) జరగలేదు క్యూరియా పాంపేయ్‌నాలో అతడు నిహతుడైనాడు.

**57.** **జనకుల సౌధాన్ని –** ఆంటోనీ ప్రతిఫలమివ్వకుండానే ఘనుడైన పాంపేగృహాన్ని పుచ్చి వేసుకొన్నాడు. అందువల్ల నీవు మోసకారివని ఆంటోనీని, పాంపే కుమారుడైన సెక్టస్ పాంపే నిందిస్తున్నాడు.

**58.** **ఇంతకంటే అధికసంపదను –** సీజర్ రాజనీతిజ్ఞుడు. ఇట పాంపే హృదయంలో జంకును కల్పించి తమ సంధిషరతులకు అంగీకరించేటట్లు చేయటానికి వేసిన ఎత్తు అతని చతురతను వెల్లడిస్తున్నది.

**59.** **మీరు సిసిలీ :** పాంపే విచిత్రమైన వ్యక్తి. ఎక్కువకు ఆశపడి ఎంతో కోల్పోతాడు. ఈ మైసినం సంధిమూలంగా ఇతడు తన సదవకాశాలను కోల్పోయినాడు. రోమకసామ్రాజ్యాన్ని పంచుకోటంలో అతని వంతుకు వచ్చినవి సిసిలీ సార్డీనీయాలు. అవి ఇంతకుముందే అతనివి. ఇందుకు

ప్రతిఫలంగా అతడు తన సైన్యంలో క్రొత్తగా చేరిన మెనాస్ మొనక్రేట్స్ వంటి ఉత్తములను శత్రువుల పరంచేసి కీర్తిని కోల్పోటం, రోముకు గోధుమపంట ఇవ్వటం వల్ల క్షామపీడితులౌతున్న శత్రువులకు ఆహారాన్నిచ్చి పోషించటం జరిగింది.

60. **అయితే వినండి :** లెపిడస్ అనుభవిస్తున్న స్థానానికంటే అధికమైంది కాకపోయినా, దానితో సాటి అయినదాన్నైనా పాంపే పొందగలిగిన సమయం వచ్చింది. కానీ మెసినమ్ సంధికి ఒప్పుకోటం వల్ల అది పోయింది. ఇలా అంగీకరించి నందువల్ల రక్షణ, అధికారం లభిస్తాయని పాంపే ఆశ పడ్డాడు. కానీ రాజనీతిజ్ఞుడైన సీజర్, అవకాశం చిక్కించుకొని అణగద్రొక్కాడు. దూరదృష్టి లేకుండా ఇతరుల దృష్టిలో నీతిమంతుడు, ఉదాత్తుడు, అనిపించుకోవాలన్న ఆశతో, పూర్ణహృదయంతో వ్యవహరింపని పాంపే జీవితం నిరర్థకంగా అంతం పొందక మరేమౌతుంది?

61. **సీజర్ దగ్గిరికి వీపుమీద మోసుకొని తెచ్చాడు :** 'ఒక మెత్తలో క్లియోపాత్రాను నిలిపి ఎప్పొలొడోరస్ సీజర్ దగ్గిరికి తీసుకోవచ్చాడు' అని నార్త్ అనువదించిన (1579) ప్లూటార్క్ చరిత్రలోని మార్జిన్‌లో ఉంది.

62. **అదృష్టంతో పరాచకాలాడుతున్నాడు –** సంధిమూలంగా త్రైకూటవీరుల్లో ఒకడైన లెపిడస్ వంటి స్థానాన్ని పొందగలిగే అవకాశాన్ని పోగొట్టుకొంటున్నాడని మెనాస్ భావం. మెనాస్ దృష్టిలో ఫలమే ప్రధానం మార్గం ఏదైనా సరే.

63. **వారి స్నేహానికి ఉరిత్రాడు –** ఆంటోనీ ఆక్టేవియాను హృదయపూర్వకంగా ప్రేమించటంవల్ల పరిణయమాడలేదు. రాజకీయ ప్రయోజనం కోసం చేసుకొన్న ఈ వివాహం ఎప్పుడైనా విఫలం కాక తప్పదనీ, అందువల్ల అతడికి మరింత క్లేశం కలిగి తీరుతుందనీ ఎనోబార్బస్ అభిప్రాయం.

64. **ఆసవశేషం –** త్రాగెడివారి పాత్రలో చివరకు మిగిలిన ఆసవభాగం. దీనిని భిక్షుకజనానికి ఇచ్చివేస్తారని ఒక అభిప్రాయం. త్రాగేవారిపనిని సుగమం చేయటానికి, ఇతరమిత్రులు మిగిలిన ఆ పానీయాంశాన్ని పుచ్చుకొంటారని మరొక అభిప్రాయం.

65. **నేజా :** కొండ పగుళ్ళను దాటటానికి ఉపయోగపడే ఒక సాధనం. పిరమిడ్ అంటే షేక్స్‌పియర్ ఒక ఎత్తయిన స్తంభం అని భావించి ఉంటాడా?

**పంట సమృద్ధిగా పండటం –** ఈ నైలోమీటర్‌ను గురించిన విశేషాలు, షేక్స్‌పియర్ ప్లినీ ప్రకృతిచరిత్రకు హోలిన్షెడ్ చేసిన అనువాదం (1601) వల్ల తెలుసుకొని ఉంటాడని ఒక ఊహ.

66. **టోలమీలు :** ఈజిప్టు దేశపాలకులకు 'టోలమీ' అన్నది సర్వసమానం.

67. **మరో జంతువుగా మారిపోతుంది :** ఇది పైథాగోరస్ చేసిన ఆత్మయానసిద్ధాంతాన్ని వెల్లడిస్తున్నది.

68. **జౌదేవత వౌతావు –** అంతరిక్షానికి జౌ ఎటువంటి సర్వాధికారో అలాగే నీవు భూమికి సర్వాధికారి వౌతావు.

69. **అలెగ్జాండ్రియా విందు –** క్లియోపాత్రా అధ్యక్షతన జరిగే పానగోష్ఠులను పోలవు అని.

70. **ఈజిప్టు బాకస్ విలాసోత్సవాలు –** బాకస్ ద్రాక్షాసవదేవత. ఇతణ్ణి ఉద్దేశించి చేసే ఉత్సవాలే బాకస్ విలాసోత్సవాలు. వీటిలో మధుసేవ, కామవిలాసాలు విశేషంగా సాగుతాయి.

71. **చిరుకన్నుల చూపులతో – స్థూలకాయ –** మద్యపానం చేసినవారు చూచేరీతిగా చూచే చూపు, స్థూలకాయం పానలోలత వల్ల కలిగాయి.

72. **నెప్ట్యూన్ :** జలాధిదేవత. మనం మిత్రులం – పాంపే తన యెడ ఆంటోనీ చేసిన ద్రోహాన్ని ఒక మద్యపాని లీలగా పరిగణించి, తొలగద్రోసుకొన్నట్లు త్రోసివేశాడు. ఇటువంటి జడత్వం కలవాడు కావటం వల్లనే ఆక్టేవియస్ ఇతణ్ణి చులకనగా మట్టుపెట్టగలిగాడు.

## తృతీయాంకం

73. **పాకోరస్ :** పార్థియారాజైన బరోడెన్ పుత్రుడు.

74. **ఇప్పుడు నిన్నే పొడుస్తున్నవి –** పార్థియన్ ఆశ్వికదళానికి శత్రువులను చుట్టుముట్టి ఈటెలు విసరటమూ, వెనుతిరిగి వెళ్ళిపోయేటప్పుడు,

శత్రువులకు సన్నిహితంగా చేరి పోరాడే అవకాశాన్ని ఇవ్వకుండా జీనులు వెనుకకు త్రిప్పివేసి, ఈటెలు విసురుతూ వెళ్ళటమూ ఆచారం.

**మార్కస్ క్రాసస్ మరణానికి :** క్రీ.పూ.53లో పార్థియారాజైన బరోడెస్ సేనాధిపతి సురేనాస్ మార్కస్ క్రాసస్‌ను మెసపోటేమియా మైదానాలల్లో ఘనంగా ఓడించి విజయం చేకొన్నాడు. తరువాత అతణ్ణి, పార్థియన్ సేనానాయకులు తమతో ముచ్చటించటానికి వచ్చిన సందర్భంలో హత్య చేశారు. నేటి వెంటిడియస్ విజయం క్రాసస్ హత్యకు ప్రతీకారంగా భావింపబడుతున్నది.

75. **ఏథెన్సు –** గ్రీకుదేశంలో ఒక మహానగరం.

76. **మిగిలిన ముప్వురూ –** సీజర్, ఆంటోనీ, లెపిడస్.

77. **మానవజాతిలో జూపిటర్ –** ఇట అగ్రిప్పా, ఎనోబార్బస్, సీజర్ ఆంటోనీలను లెపిడస్ ఎంత హృదయరహితంగా స్తుతి చేస్తున్నాడో నిరూపిస్తూ, హాస్యరసస్ఫూర్తితో ప్రసంగించటం గమనించదగ్గది.

78. **అరేబియావిహంగం :** ఫొనిక్స్ అనే పేరు గల పెద్ద పక్షి. ఇది అయిదు వందల సంవత్సరాల కాలం జీవిస్తుందనీ, మరణించిన తరువాత దాని శిథిలశరీరంనుంచే పునర్జన్మను పొందుతుందనీ ప్రతీతి.

79. **కారణభూతురాలు కాకూడదు –** రోమనులలో ప్రతిఒక్కరూ సౌందర్యం, సత్యసంధత, విజ్ఞానం గల ఆక్టేవియాను ఆంటోనీ వివాహమాడటంవల్ల అతడికీ, సీజర్‌కూ దృఢమైన సఖ్యానుబంధం ఏర్పడుతుందని ఆశించారు – ప్లూటార్క్.

80. **ముఖాన నల్లమచ్చ ఉండే అశ్వం :** ముఖాన నల్లని మచ్చ ఉన్న అశ్వానికి విరసగుణం ఉంటుందనీ, అది లోపమనీ భావిస్తారు.

81. **అదేమంత మంచి విశేషం కాదులే –** సన్ననికంఠాన్ని కలిగి ఉండటం స్త్రీలకు ఒక సుగుణం. ఇది క్లియోపాత్రాకు వేదనను కల్పించే విషయం. కానీ ఆమె తన శత్రువైన ఆక్టేవియాది బొంగురుగొంతుకని తనకు తానే సమాధానం చెప్పుకోటానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. ఇది ఆమెలోని

అసంబద్ధత. ఈ అసంబద్ధత సౌందర్యవిభవాలతో బాటుగా ఆమె కొక అలంకారం.

**82.** **మందబుద్ధులు :** పరిపూర్ణంగా వర్తులమైన ముఖంగలవారు మందబుద్ధులన్న అభిప్రాయం. ప్రాచీన శరీరనిర్మాణశాస్త్రజ్ఞుల రచనల్లో కనిపిస్తుంది.

**83.** **జౌ –** గ్రీకుల పరమేశ్వరుడు.

**84.** **మూడో త్రైకూటవీరుడు బంధితుడైనాడు –** సీజర్ లెపిడస్ మీద నిందారోపణలు చేసి, అతడికి అవి సత్యాలౌనో కాదో నిరూపించుకొనే అవకాశాన్ని ఇవ్వకుండా, బందీని చేశాడు.

**84A.** **కుత్తుకను ఉత్తరిస్తానంటూ బెదిరిస్తున్నాడు–** పాంపేను ఎవరు హత్య చేశారన్న విషయం చరిత్రలో అనుమానాస్పదంగా ఉంది. ఆంటోనీ ఆజ్ఞాపించగా టిటియస్ అనే అతని భృత్యుడు పాంపేను వధించినట్లు ఒక కథనమున్నది. ఎప్పియన్ ఈ విషయాన్ని గురించి తన 'అంతర్యుద్ధ చరిత్ర' (హిష్టరీ ఆఫ్ సివిల్ వార్స్) లో చెప్పి, కొందరు పాంపేను హతమార్చినవాడు ప్లాన్కస్ అని కూడా పేర్కొంటున్నట్లు తెలియజేశాడు.

**85.** **నా తండ్రికి కలిగిన కుమారుడు –** జూలియస్ సీజర్‌వల్ల క్లియోపాత్రాకు కలిగిన కుమారుడికి, ఆమె సీజరియన్ అని పేరు పెట్టింది. సీజరుకు ఆక్టేవియస్ సోదరీపౌత్రుడు. కానీ అతడు ఆక్టేవియస్‌ను పెంపుడు కొడుకుగా గ్రహించాడు. అందువల్ల అతణ్ణి తండ్రిగా చెప్పటం జరిగింది. సీజరియన్ తన తండ్రికి కలిగాడని ఆక్టేవియస్ పూర్తిగా అంగీకరించటం లేదు.

**86.** **టారెంటం, బ్రుండూసియమ్ –** ఇటలీలో దక్షిణప్రాగ్దిశలో ఉన్న నేటి టరంటో బ్రిందిసీలున్న ప్రాంతం.

**87.** **అయోనియా సముద్రం –** గ్రీసుదేశపుపశ్చిమతీరాన్ని తాకిఉన్న సముద్రం.

**88.** **టొరైన్ :** ఆక్టియంకు ఉత్తర – పశ్చిమంగా 20 మైళ్ళదూరాన ఉన్న ఒక నగరం.

**89.** **థెటిస్ –** సాగరకన్యలైన ఏబదిమంది నెరైడ్సులో ఒకతె.

**90.** **టారస్ –** ఆక్టేవియస్ సీజర్ పక్షాన ఉన్న పదాతిదళానికి సేనానాయకుడు.

91. **ఆంటోనియడ్ –** ఆంటోనిమీద ప్రేమానురాగం వల్ల క్లియోపాత్రా తన ప్రధాననౌకకు 'ఆంటోనియడ్' అనే పేరుపెట్టుకొన్నది.

91A. **దివ్యచిహ్నాలు:** ప్లేగువ్యాధివల్ల బాధితులయ్యేవారి శరీరాలమీద ఒక రకమైన బొబ్బలు పొడచూపితే వారిమరణం తథ్యం. వీటికే 'దేవచిహ్న'లని పేరు. ఇవి అతివేగమరణానికి నిదర్శనాలు కావటమే ఇటువంటి నామం కలగటానికి కారణం.

92. **నా పదాతిదళాన్నీ...:** సీజర్ పరం చేస్తాను. కానెడియస్ ఆక్టియం యుద్ధమైపోయిన తరువాత కూడా ఆంటోనీయెడ భక్తిని ప్రకటించి, అలెగ్జాండ్రియాలోనే ఉండిపోయాడు – ప్లూటార్క్.

93. **ఫిలిప్పీ యుద్ధరంగం –** ఈ యుద్ధంలోనే జూలియస్ సీజర్ హత్యకు కారకులైన బ్రూటస్, కాషియస్‌లమీద ఆంటోనీ విజయం చేకొన్నాడు.

94. **మన ఉపాధ్యాయుణ్ణి –** ఇతని నామధేయం యూఫ్రోనియస్. క్లియోపాత్రాకు, ఆంటోనీకి కలిగిన సంతానాని కీతడు గురువు.

95. **వెష్టాదేవికన్యలు –** వీరు పావిత్ర్యదేవత అయిన విష్టాదేవి దగ్గర ఆమెను కొలుస్తూ, జీవితాంతం పురుషప్రసక్తి లేకుండా అవివాహితలుగా ఉండిపోతామని శపథం చేసినవారు.

96. **శాసనంగా భావించి :** ప్రాచీనరోములో న్యాయాధికారులు నూతనంగా ఉద్యోగాన్ని స్వీకరించగానే కొన్ని శాసనాలను చేస్తుంటారు. వాటిని పాలకులు అంగీకరించటం, తరువాత వచ్చిన న్యాయాధికారులు పూర్వశాసనాలవలెనే వీటినీ పాటించటం జరుగుతుండేవి.

97. **బాలుడైన సీజర్ :** ఈ సమయానికి ఆంటోనీ వయస్సు ఏబదిమూడు సంవత్సరాలు. సీజర్ వయస్సు ముప్పది ఒక్క సంవత్సరం. ఇంకా బాగా గడ్డం, మీసాలు రాలేదు. అందువల్ల ఆంటోనీ అతణ్ణి బాలుడని వ్యవహరిస్తున్నాడు.

98. **బాసన్ పర్వతంమీద :** బాసన్ పర్వతంమీది గోగణాలు చుట్టటం బైబిల్‌లో సామ్సులో ఉన్న ప్రసిద్ధవిషయం. ఆంటోనీ మహోదాత్తదుఃఖం వల్ల వివశు డైనాడు. బాసన్ పర్వతం మీద గోగణాలు చుట్టుముట్టగా వాటిని మించి

రంకెలు వేసేటట్టి అవకాశం తనకు క్లియోపాత్రా నైచ్యాన్ని ప్రకటించేందుకు లభిస్తే బాగుండునని అతడు భావిస్తున్నాడు.

## చతుర్థాంకం

99. **రక్తస్నాన మాడించి :** కుష్ఠు మొదలైన వ్యాధులు కొన్ని రక్తస్నానాలవల్ల నయమౌతాయట!

100. **పతిని పత్ని మరణపర్యంతం విడిచి చరించినట్లు :** "నిన్ను విడిచి నేను చరించను" అన్న వైవాహికశపథాన్ని ఇది స్మృతికి తెస్తున్నది.

101. **హ!, హ! హ! :** ఆంటోనీ తన దయనీయమైన స్థితిని తానే పరిహసించు కొంటున్నాడు. ఇవి క్లియోపాత్రా అంకం v దృశ్యం v లో మాండ్రగోరారసాన్ని ఇవ్వమన్నప్పుడు, తన్ను గురించి తానే ఉన్మత్తాపహాస్యం చేసుకొన్నట్లు ఆంటోనీ తన్ను గురించి తానే అట్టహాసం చేస్తూ పలికిన పదాలని బాస్వెల్ అభిప్రాయం.

102. **ప్రేమించే దైవతము హెర్క్యూల్స్ :** ఆంటోనీని పరిత్యజించిన దైవతం బాకస్ అని ప్లూటార్క్. అతడికి దూరదృష్టి, నిర్ణయశక్తి రెండూ లోపించినవని చూపించటంకోసం షేక్స్పియర్ హెర్క్యూల్స్ అతణ్ణి ముందే వదలిపెట్టినట్లుగా వర్ణించాడు.

103. **మీ మీద విప్లవం చేసి వెళ్ళిన రాజులు :** ఎమిన్‌టాస్, డైయొటారస్ మొదలైన రాజులు కొందరు ఆక్టియమ్ యుద్ధానికి పూర్వమే ఆంటోనీని విడిచిపెట్టి సీజర్‌ను చేరుకొన్నారు.

103A. **విశ్వశాంతికి కాలమాసన్నమైంది :** ఆక్టేవియస్ సీజర్ ఈజిప్టుమీద విజయం చేకొన్నది క్రీ.పూ. 29లో. ఈ వాక్యాన్ని పలికేటప్పుడు షేక్స్పియర్ మనస్సులో జీసస్ జన్మ జ్ఞప్తికి ఉండి ఉండవచ్చునని కొందరి ఊహ.

103B. **వారిమీదనే వ్యయిస్తాడు –** సీజర్ దారుణయుద్ధనీతికి ఇది చక్కని నిదర్శనం.

104. **హెక్టర్ :** ఒక ట్రోజన్ వీరుడు.

105. **నైటింగేల్ –** కమ్మగా పాడే ఒక పక్షి.

**106. ఫొయిబస్ రథంలా :** ఫొయిబస్ సూర్యదేవత. ఇతని రథచక్రాలు సూర్యకాంత మణులతో పొదగబడి మనోజ్ఞాలై ఉన్నట్లు ఓవిడ్ తన 'మెట మార్ఫొసిస్'లో వర్ణించాడు.

**107. ఉన్మాదాది వ్యసనాలకు :** ఉన్మాదం చంద్రదైవతం వల్ల కలుగుతుందని.

**108. టిట్టిభాలు (స్వాలోలు) :** ఆక్టియం యుద్ధానికి పూర్వం అపశకునాలు ఎన్నో కన్పించినట్లు ప్లూటార్క్. క్లియోపాత్రా నౌకాపదనంమీద స్వాలోలు చేరాయి. ముందు వచ్చినవాటిని తరువాత వచ్చి చేరినవి తరిమివేశాయి. ఇదొక అపశకునం.

**109. ముప్పురిని మార్చిన బంధకీ –** క్లియోపాత్రాకు తొలుతటి స్వామి జూలియస్ సీజర్. రెండవవాడు క్నెయస్ పాంపే తరువాతివాడు ఆంటోనీ. ఆంటోనీ ఇప్పుడు ఆమె తన్నుగూడా విడిచి ఆక్టేవియస్ సీజర్ను చేరుతున్నదని అనుమానిస్తున్నాడు.

**110. ప్లీబన్లు :** రోమను సామాన్యప్రజలు.

**111. నెస్సస్ :** ఒక విషబాణాన్ని ప్రయోగించి తన్ను బాగా గాయపెట్టిన హెర్క్యూల్స్ మీద ప్రతీకారాన్ని చేసిన 'నరాశ్వం' నెస్సస్. ఇతనికి కల్గిన ప్రతీకారభావోద్వేగం తన్నావహిస్తున్నదని ఆంటోనీ అభిప్రాయం. హెర్క్యూల్స్ ప్రయోగించిన విషబాణంవల్ల తన శరీరంనుంచి స్రవించే రక్తాన్ని కొంత ప్రేమచిహ్నంగా దాచుకోవలసిందని నెస్సస్ తన భార్య డెజనిరాతో చెప్పి మరణించాడు. తరువాత ఆమె హెర్క్యూల్సు వస్త్రకంబళాన్ని నెస్సస్ రక్తంలో ముంచి, లిఛాస్ అనే వాడిచేత అతడికి పంపించింది. దాన్ని ధరించటంవల్ల విషం హెర్క్యూల్స్ను ఎంతో బాధపెట్టింది. కోపం వచ్చి హెర్క్యూల్స్ ఒకమారు లిఛాస్ను పట్టుకొని సముద్రంలోకి విసిరిపారేశాడు.

**112. అల్సీడిస్ :** అంటే హెర్క్యూల్స్. అల్క్యూయస్ కుమారుడు.

**113. టెలమస్ ఏజాక్సుఫేటం కోసం :** ట్రోజన్ వీరుడైన ఎక్కిలిస్ డాలును అతనితల్లి థెటిస్ గ్రీకుల్లో అతిసాహసి ఐన వాడికిస్తానని ప్రకటించింది. యుద్ధంలో మిగిలినవారందరిలో యులిసిస్ వీరుడు. కాబట్టి అతడి కివ్వమని అతని

దేశీయులు నిర్ణయించారు. నిరాశాపూరితుడైన ఎజాక్స్ టెలమస్ ఉన్మత్తుడై, ఎజాక్స్‌డాలు తనకు లభ్యం కాలేదని తన్ను తానే పొడిచి చంపుకొన్నాడు.

114. **థెస్సలీ వరాహమైనా :** కాలిడన్ రాజైన ఓనియస్ తనయెడ చేసిన అపరాధానికి ప్రతిచర్యగా డయానా ఒక వరాహాన్ని పంపించింది. అదే థెస్సలీ వరాహం. అనేకులైన సాహసికులు దాన్ని వేటాడటానికి బయలుదేరారు. తుదకు దాన్ని ఓనియస్ కుమారుడు మెలియేజర్ చంపాడు.

115. **డిడోకు :** ఆమె ప్రియుడైన ఏయ్‌నియాస్‌కు – ట్రాయ్ మహానగరం పడిపోయిన తరువాత ఏయ్‌నియస్ కార్తేజికి వస్తే, కార్తేజి రాజ్ఞి డిడో అతణ్ణి గాఢంగా ప్రేమించింది. అతడు ఆమెను విడిచివెళ్ళిపోయినప్పుడు డిడో ఆత్మహత్య చేసుకొన్నది.

116. **నెప్ట్యూన్‌హరితార్ణవం –** జలదేవత నెప్ట్యూన్ యొక్క పచ్చని సముద్రం.

117. **పరమశత్రువులైన పార్థియన్లే :** ఇతరశత్రువులకంటే పార్థియన్లు ఆంటోనీకి ఎక్కువ శ్రమ కల్గించారు. క్లియోపాత్రా దారుణప్రభావం వల్లనే ఆంటోనీ తలపెట్టిన పార్థియన్ దండయాత్ర విచ్ఛిన్నమైంది.

118. **జూనో నీవు తిరుగుతున్న ఆ మండలాన్ని దగ్ధం చెయ్ :** ప్రాచీన టోలమీ సిద్ధాంతాన్ని అనుసరించి సూర్యుడు ఒక గ్రహం. ఇది ఒక వర్తులాకృతి గల గోళంలో నిబద్ధఅయి ఉంటుందనీ, భూమిచుట్టూ తిరుగుతుందని భావింపబడేది.

119. **మెర్క్యూరీ :** జ్యూపిటర్‌కు ఇతడు రెక్కల దూత.

## పంచమాంకం

120. **ఇది :** డెర్సిటాస్ పట్టుకోవచ్చిన ఖడ్గం.

121. **కొలాసస్‌లాగా :** ర్హోడ్స్ అనే ప్రదేశంలో, సముద్రతీరాలు రెంటిమీదా రెండు కాళ్ళను నిల్పిఉన్న మినర్వా విగ్రహంవలె, ఈ విగ్రహం క్రిందుగా యుద్ధనౌకలతో ప్రయాణం చెయ్యవచ్చు. ఈ కొలాసస్ లాగానే ఆంటోనీ మహోన్నతవ్యక్తిత్వం గలవాడనీ, అతనిముందు సామాన్యులు నిలువలేరనీ క్లియోపాత్రా అభిప్రాయం.

122. **గోళాల సంగీతం -** గోళాలు సంచరిస్తున్నప్పుడు ఒక రీతి సంగీతం వినిపిస్తుందనీ, దాన్ని అప్సరసలు మాత్రమే వినగలుగుతారనీ, మానవుల శ్రవస్సుల కవి వినిపించవనీ గ్రీకుతత్త్వవేత్త పైథాగోరస్ సిద్ధాంతం.

123. **విజయప్రాప్తసత్త్వం :** జయించటం వల్ల కలిగిన హక్కు.

124. **లిక్టర్లు :** రోమక న్యాయాధిపతులు దోషులకిచ్చే శిక్షలకు కార్యరూపాన్ని కల్గించేవారు.

125. **కీచుగొంతుక గల కుఱ్ఱవాడు :** ఇంగ్లండులో క్రీ.శ. 1660వరకు కూడా స్త్రీ పాత్రలను 'బాలురే' అభినయించేవారు.

126. **నైల్‌కుల్యలు :** భూగర్భంలోని ఈ కాలువల ద్వారానే అలెగ్జాండ్రియాకు నైల్ నీరం వస్తుంది.

# మేక్బెత్

‘గ్లామిస్ నిద్రనే హత్య చేశాడు. కౌడర్ ఇక నిద్రపోదు’

**–మేక్బెత్**

# బహు భర్తృత్వం - బహు భార్యాత్వం

## భూమిక

### మేక్బెత్ - ఆధారాలు

మేక్బెత్ నాటకరచనకు మూలమైన కథనిచ్చి తోడ్పడిన రచన 1577లో పుట్టిన హోలిన్ షెడ్ మహాశయుని స్కాట్లండు రాజవంశావళి. మేక్బెత్‌లో కొన్ని ప్రకృతివిరుద్ధమైన విశేషాలు మంత్రగత్తెలు, వారి చేష్టలు, విశ్వాసాలు మొదలైనవి కనిపిస్తున్నవి. వీటిని సంగ్రహించటం విషయంలో షేక్స్‌పియర్ మహాకవికి, అతని కాలంలోని నమ్మకాలతోపాటుగా 1584లో పుట్టిన రెజనాల్డు స్కాట్ 'డిస్కవరీ ఆఫ్ విచ్‌క్రాఫ్ట్' అన్న గ్రంథం కూడా తోడ్పడివుంటుంది.

షేక్స్‌పియర్ మహాకవి నాటకనిర్మాణ విషయంలో హోలిన్ షెడ్ క్రానికిల్‌లోని రెండు ప్రత్యేక భాగాలను ఉపయోగించాడు. అందులోని "హిస్టరీ ఆఫ్ మేక్బెత్" అన్న భాగాన్ని ప్రధానకథకు, ఫోరైస్ దుర్గాధిపతి డోన్వాల్డు డఫ్ రాజును చేసిన హత్యాచరిత్రను డంకన్ రాజు హత్యను నిరూపించే సందర్భానికి ఉపయోగించుకొన్నాడు.

నాటకీయ శక్తినిపాతమే ప్రధానాశయంగా గల షేక్స్‌పియర్ మహాకవి, ఆధార గ్రంథాల్లోని అంశాలను స్థలం, కాలం, వ్యక్తుల విషయంలో అనేకరీతులుగా మార్చాడు. అందుచేత మేక్బెత్ 'కేవల చరిత్రాత్మక నాటక'మని అంటానికి వీలు లేదు. కథాకల్పనం, పాత్రపోషణ, రసనిరూపణాది కళాకౌశలమంతా షేక్స్‌పియర్ మహాకవిదే. ఆ మహనీయశిల్పి హస్తాన మేక్బెత్ హృదయస్పంది అయిన ఒక విషాదాంతనాటకంగా పరిణమించింది.

### మేక్బెత్ - హోలిన్‌షెడ్ రచన

విషాదాంత నాటకతత్త్వం గల మేక్బెత్ కథావస్తువు షేక్స్‌పియర్ మహాకవికి హోలిన్ షెడ్ రచనలో లభ్యమైంది. అనేకప్రధానాంశాల విషయంలో ఆయన ఆ రచనను అనుసరించాడు. శక్తిహీనుడైన డంకన్ మహారాజు బలవంతుడు, జయశీలి అయిన

మేక్బెత్ సేనానిమీద అంతర్బహిశ్శత్రువులను సాధించే విషయంలో ఆధారపడటం, మేక్బెత్ రాజౌతాడనీ, బాంకో సంతానంవల్ల రాజపరంపర ఏర్పడుతుందని ముప్పురు మంత్రగత్తెలు జోస్యం చెప్పటం, మేక్బెత్ ప్రభ్వీ దురాశవల్ల భర్తను హత్యకు పురికొల్పటం, డంకన్ పుత్రులమీద అనుమానపడటం, హత్యాసమయంలో ప్రకృతివిరుద్ధమైన తుఫాను మొదలైన అరిష్టసూచనలు కనిపించటం, ప్రథమహత్య జరిపిన తరువాత మేక్బెత్ శీలం పతనంకావటం ప్రారంభించటంతో, అతడు ప్రతివారినీ అనుమానించటం ఆరంభించి, సమస్త నీతినియమాలను విసర్జించటం, భయంవల్ల బాంకోను అనుమానించటం వల్లను, అతని సంతానంవల్ల రాజపరంపర ఏర్పడుతుందన్న మంత్రగత్తెల జోస్యప్రభావంవల్లను బాంకోను, అతని కుమారుడు ఫ్లియాన్సును హత్య చేయించటానికి మేక్బెత్ పూనుకుంటే బాంకో హత్యకు గురై ఫ్లియాన్సు తప్పించుకొని పారిపోవటం, స్కాట్లండునుండి  పారిపోవటం, మాక్డఫ్‌ను అనుమానించి అతడు చిక్కకపోవటం చేత అతని కుటుంబాన్నంతటినీ నాశనం చెయ్యటం, మంత్రగత్తెలిచ్చిన ధైర్యంవల్ల మేక్బెత్ ప్రమాదస్థితి త్రోసుకొనివస్తున్నా ఎట్టి భయంలేదని గాఢంగా విశ్వసించటం, మాక్డఫ్–మాల్కొంల మధ్య జరిగిన సంభాషణను యథాతథంగా గ్రహించి నడిపించటం, ఆంగ్లేయుల సహాయంతో మాల్కొం స్కాట్లండును క్రూరనిరంకుశుడైన మేక్బెత్ పాలనలోనుంచి ఉద్ధరించటం మొదలైన అంశాలు షేక్స్‌పియర్ నాటకంలోను, హాలిన్ షెడ్ రచనలోను నమూనాలై కన్పిస్తున్నవి.

మాక్డొనాల్డు విప్లవం, స్వెనోదండయాత్ర, కాన్యూట్ సైన్యం స్కాట్లండుపై ఎత్తిరావటం అన్న మూడు అంశాలు హాలిన్ షెడ్ రచనలో ప్రత్యేకంగా మూడు సమయాల్లో జరిగినట్లుంది. సైనికుడుగా మేక్బెత్ ఎంతటి అధికుడో నిరూపించటం కోసం, షేక్స్‌పియర్ ఈ ఉదంతాలు మూడూ ఏకకాలంలో జరిగినట్లు మార్పు చేశాడు. హాలిన్ షెడ్ రచనలో మాక్డోన్వాల్డు ఆత్మహత్య చేసికొన్నట్లున్నది. మన కథానాయకుడైన మేక్బెత్‌కు వీరగుణాన్ని కల్పించటంకోసం షేక్స్‌పియర్ అతణ్ణి మేక్బెత్ రణరంగంలో హతమార్చినట్లు మార్చాడు. హలిన్ షెడ్ రచనలో డఫ్‌రాజును దుర్గాధిపతియైన డోనాల్డు నియమించిన నలుగురు హంతకులు హత్యచేసినట్లుంది. షేక్స్‌పియర్ ఆ హత్యలోని భయానకత్వాన్ని నిరూపించటం కోసమూ, మేక్బెత్ నైతికపతనాన్ని చిత్రించటంకోసమూ, ఆ హత్యను మేక్బెత్ స్వహస్తాలతో జరిగించినట్లు పరివర్తన చేశాడు. మేక్బెత్ చేసిన విందునుంచి తిరిగి వస్తుండగా బాంకోను హత్యచేసినట్లు హాలిన్ షెడ్‌లో ఉంది. షేక్స్‌పియర్ మేక్బెత్‌ను, అతని పత్ని మేక్బెత్ ప్రభ్విని ఒక

విచిత్రసన్నివేశంలో ప్రదర్శించి చూపించటంకోసం విందుకు ముందే ఆ హత్య జరిగిపోయినట్లు మార్చాడు. హాలిన్ షెడ్ రచనలో మేక్బెత్ రాజు పదిహేడు సంవత్సరాలు పాలించినట్లుంటే, కథాగమనానికి అంతటికాల విలంబం తగదు గనుక షేక్స్పియర్ ఆ కాలంలో జరిగిన అంశాలన్నీ స్వల్పకాలంలోనే జరిగిపోయినట్లు నిరూపించి, విషాదాంతనాటకానికి అవశ్యకమైన గమనతీవ్రతను కల్పించాడు.

రాజ్యహరణానంతరం కొంతకాలం మేక్బెత్ ధర్మప్రవృత్తితో ఉదాత్తంగా రాజ్యపాలన చేసినట్లు హాలిన్ షెడ్ రచన చెబుతున్నది. మంత్రగత్తెల ప్రభావానికి లోనైన మేక్బెత్ నిజరక్షణకోసం చేసే రక్తపాతం విషయంలో కాలవిలంబం పనికిరాదు కనుక, అతణ్ణి షేక్స్పియర్ రాజ్యహరణం చేసిన తొలినాటినుండి కూడా క్రూరనిరంకుశు ణ్ణిగానే నిరూపించాడు. హాలిన్ షెడ్ రచనలో డంకన్ రాజు శక్తిహీనుడు, యువకుడు. రాజ్యవ్యవహారాలను పట్టించుకోకపోవడం వల్ల సర్వ వ్యవహారాలకూ మేక్బెత్ మీద ఆధారపడ్డాడు. కానీ షేక్స్పియర్ మహాకవి మేక్బెత్ హత్యాదోషాన్ని తీవ్రతరంగా ప్రదర్శించడం కోసం, డంకన్‌ను వృద్ధుడైన ఆదర్శప్రభువుగా రూపొందించినాడు. హాలిన్ షెడ్ రచనలో బాంకో మేక్బెత్‌కు తోడ్పాటునిచ్చినట్లుంది. నాటకంలో షేక్స్పియర్ ఇతణ్ణి మేక్బెత్‌కు ప్రతిపాత్రగా గ్రహించి సర్వసద్గుణాన్వితుడైన మహోదాత్తమూర్తిగా మలచాడు. మేక్బెత్ ప్రభ్వి హాలిన్‌షెడ్ రచనలో రాజ్ఞీనామంకోసం ఆరని దాహాన్ని వహించి, భయాన్ని కల్పించేటంతటి అత్యంతస్వార్థపరురాలైన అతివగా కనిపిస్తుంది.

షేక్స్పియర్ నాటకంలో మేక్బెత్ ప్రభ్వి శీలాన్ని కొంతగా సరిదిద్దాడు. మేక్బెత్ రూపకంలో ఆమెలోని స్త్రీత్వం కొంత లోపించినా, మూలంలోని అత్యంతస్వార్థపరత్వం అదృశ్యమై గోచరిస్తుంది. ఆమె నిర్వహించిన సమస్తం తనకోసం కాక భర్తయైన మేక్బెత్ కోసమని స్పష్టమౌతుంది. స్త్రీత్వం లోపం, క్రౌర్యతీక్ష్ణత లుంచినా షేక్స్పియర్ ఆమెకు స్వార్థత్యాగ మొక గుణవిశేషంగా కల్పించాడు. చరిత్రలో ఈ మేక్బెత్ పత్ని జీవితం ఏమైందీ కన్పట్టదు.

షేక్స్పియర్ నాటకంలోని 'నిద్రాగమనదృశ్యానికి' (అం. V దృI) గాని, 'విందు దృశ్యానికి' (అంIII దృ6) గాని, 'ఛురికాదృశ్యానికి' (అంI దృI)గాని చరిత్రలో ఎట్టి ఆధారాలూ లేవు. చరిత్ర షేక్స్పియర్‌కు కేవలం ఛాయామాత్రమైన రూపాన్నే ఇవ్వగలిగింది. జగదేకనాటకకర్త అన్న విఖ్యాతిగన్న ఈ మహాశిల్పి, ఘనవిషాదాంత నాటకచతుష్టయంలో ఒకటిగా పరిగణితమవుతున్న 'మేక్బెత్'లోని కళావిలసనమంతా రచయితదే!

## 'మేక్బెత్' - చరిత్ర

షేక్స్‌పియర్ మహాకవి హోలిన్ షెడ్ కథనాన్ని అత్యంతసన్నిహితంగా అనుసరించలేదు. అందులోని అంశాలను అవసరమైనంతవరకూ స్వేచ్ఛగా స్వీకరించాడు. అదీకాక హోలిన్ షెడ్ కథనంగా చరిత్రను ప్రధానాంశాల విషయంలోనైనా యథాతథంగా నిరూపించలేదన్న అభిప్రాయం ఉండనే ఉంది. అందువల్ల చరిత్రలో సత్యంగా జరిగిన విశేషాలేవో గమనించటం అవసరం.

మాల్కొం II తరువాత అతని మనుమడు డంకన్ స్కాట్లండుకు రాజై, 1034 - 1040 మధ్యకాలంలో రాజ్యపాలనం చేశాడు. దక్షిణదిక్కుకు దండయాత్ర చేసి డర్హాం దగ్గిర ఓడిపోవటం వల్ల, వెన్నంటి తరుముకువస్తున్న అతనిజ్ఞాతి థోర్ఫిన్ సైన్యాల శక్తినుంచి స్కాట్లండును రక్షించటంకోసం, డంకన్ తిరోగమింపవలసి వస్తుంది. పెంట్లండ్ ఫిర్త్ యుద్ధం తరువాత ఇతను ఓడిపోయి, థోర్ఫిన్ పక్షంలో చేరిపోయిన తన సేనాని మేక్బెత్ విద్రోహఛురికకు గురికావటం జరిగింది. మేక్బెత్ మాల్కొం II కుమార్తెయైన డయోడాకు, రాస్‌కు (గ్లామిస్‌కు కాదు) పాలకుడైన ఫిన్లేకు పుత్రుడు. ఒక తుములయుద్ధంలో మాల్కొం II తన తండ్రియైన ఫిన్లేను చంపటం వల్ల, మేక్బెత్‌కు అతని వారసుడైన డంకన్‌తో బంధుకలహం సంప్రాప్తిస్తుంది. మేక్బెత్ మోరై పాలకుడైన గిల్కోంగైస్ విధవ గ్రౌచ్‌ని వివాహమాడి, ఆమె కుమారుడు బాలుడు కావటంచేత మోరైకు పాలకుడైనాడు.

మేక్బెత్ పత్నియైన గ్రౌచ్ మాల్కొం II రాజ్యభ్రష్టుని చేసి చంపిన కెన్నెత్ III కు పుత్రుడైన బొయటే కుమార్తె మాల్కొం II డంకన్‌ను సింహాసనాధిష్ఠితుణ్ణి చేయటానికి నిశ్చయించి, ఆమె ఏకైకసోదరుణ్ణి కూడా హతమార్చాడు. ఇందువల్ల - తండ్రిని, సోదరుని మాల్కొం II చంపటంవల్ల - మేక్బెత్‌కు, అతని పత్నికి మాల్కొంకు వారసుడైన డంకన్ మీద ప్రతీకారేచ్ఛ కలిగింది. ప్రతీకార నిర్వహణానంతరం స్కాట్లండుకు రాజైన మేక్బెత్ (1040-57) పదిహేడు సంవత్సరాల సామర్థ్యంతో, ప్రజానురాగంతో రాజ్యపాలనం చేశాడు. శక్తిమంతుడై సివర్డు దండయాత్రలను తిరగగొట్టగలిగాడు. తుదకు లంప్ హానన్ యుద్ధంలో గాడ్విన్ ప్రభువు సహాయంతో ఎత్తివచ్చిన యువ మాల్కొంతో పోరాడుతూ మరణించాడు. ఇతని అనంతరం లులాగ్, కమ్మోరు సింహాసనానికి వారసులై 1093 దాకా రాజ్యపాలనం చేశారు. ఇవి చరిత్రలో జరిగిన సత్యాలైన అంశాలు. డంకన్ పాలనకాలంలో విప్లవం చేసిన కౌడర్ థేన్ విషయం,

నార్వే ప్రభువైన స్వెనో దండయాత్రోదంతాలు లేనే లేవు. బాంకో, ఫ్లియాన్సు చారిత్రికపురుషు కారు. మాక్డఫ్, మాక్డఫ్ ప్రభ్వని గురించి విశ్వసింపతగ్గ విశేషాలు చరిత్రలో ఏమీ కన్పట్టవు. మేక్బెత్ ప్రభ్వి మృత్యువిధానాన్ని గురించి ఏమీ తెలియదు. చరిత్రలో మేక్బెత్ వృద్ధసివర్డు ఎత్తి రావటంవల్ల ఓడిపోవటం లేకపోగా, ఎత్తివచ్చిన నార్తంబ్రియా ఎరల్‌ను తరిమివేసి తరువాత బహుకాలం జీవించి రాజ్యపాలన చేసినట్లు కనిపిస్తున్నది. మేక్బెత్ పాలనలో ప్రభుత్వం అతిశక్తిమంతంగా నడిచిందనీ, ప్రజలు సుభిక్షంగా ఉన్న దేశంలో సర్వ సౌఖ్యాలను అనుభవించారన్న విషయాన్ని చరిత్రలన్నీ ఏకకంఠంతో అంగీకరిస్తున్నవి.

## మేక్బెత్ – ఆంగ్లనాటక సాహిత్యంలో దానిస్థానం

'మేక్బెత్' షేక్స్‌పియర్ రచనకాలంలోని తృతీయావస్థలో (1601–1608) జన్మించిన ఒక విషాదాంతరూపకం. ఈ దశలో ఆ మహాకవి మేక్బెత్, హామ్లెట్, లియర్ రాజు, ఒథెల్లో, రోమక నాటకాలైన ఆంటోనీ – క్లియోపాత్రా, కొరియ లానస్‌లను రచించినాడు. లోకంలోని నిరంకుశత్వం అసత్యప్రియత్వం, విశ్వాసఘాతుకత్వం, కృతఘ్నత ఈ కాలంలో షేక్స్‌పియర్ మహాకవి మనస్సును ఆవరించి, విషాదభావశబలితం చేశాయి. అందువల్ల ఆయన మానవహృదయనైచ్యతలోని లోతులను ఈ దశలోని తన రూపకాలలో త్రవ్విపోసినాడు.

విమర్శకులు 'మేక్బెత్'ను ఆంగ్లనాటక సాహిత్యంలో అత్యుత్తమనిధిగా భావిస్తున్నారు. ఈ రూపకంలో కన్పించే విషాదమహత్త్వాన్ని తిరిగి చూడాలంటే, ఈ స్కైలస్ కవితను ఆశ్రయించవలసిందేనని వారి అభిప్రాయం.

ఇందలి దృశ్యసౌభాగ్యం, కవితావైశిష్ట్యం మనోహరాలు, ఈ రూపకంలో రచయిత పాఠకులను ఒక అతీతప్రపంచంలోకి నడిపించుకోపోయి, తన కావ్యభాషాశిల్పవిశేషాల సహాయంతో సృష్టించిన సర్వం చైతన్యోపేతమైన సత్యజగత్తన్నట్లుగా నిరూపిస్తాడు. ఉద్రేకోత్సాహాలతో, అంధవిశ్వాసాలతో, దృఢప్రత్యయాలతో ఇందలి పాత్రలు పరితల వెన్నాడగల పరమశిల్పమూర్తులు.

మేక్బెత్ దుర్గంలోనికి డంకన్ స్వయంగా ప్రవేశించటం, మేక్బెత్ ప్రభ్వి 'నిద్రా – గమనం', డంకన్ హత్య, మేక్బెత్ దంపతుల సమావేశాలు మొదలైనవి ఈ రూపకంలో వ్యక్తిగతంగా వైశిష్ట్యాన్ని పొందిన దృశ్యాలు. హత్యానిర్వహణ, నిర్వహణానంతరవేళల్లో మేక్బెత్ మనోవైక్లబ్య ప్రదర్శనం, హృదయవిదారకమైన అపురూపచిత్రాలు.

ఈ సందర్భాలల్లో నాటకకర్త ఉపయోగించిన కవితాసాధన ఏ యుగంలోనూ కన్పట్టనిది. కనుక 'ఆంగ్లనాటక సాహిత్యంలో మేక్బెత్ అత్యుత్తమనిధి' అన్న విమర్శకాభిప్రాయం ఎంతో సమంజసమైంది.

## మేక్బెత్ - ఏకకర్తృకమా?

నేడు ఉపలభ్యమౌతున్న మేక్బెత్ షేక్స్పియర్ మహాకవి రచించిన రూపంలో కాక, అనేకమైన ప్రక్షిప్తభాగాలతో కనిపిస్తున్నదన్న వాదం ఒకటి ప్రబలంగా ఉంది. ప్రక్షిప్తాలలో ప్రధానాలుగా ఎన్నబడుతున్నవి సార్జెంటు దృశ్యం (అం I దృ2), హెకేట్ సంభాషణలు (అం III దృ5), ద్వారపాలకుని సంభాషణ (అం IV దృ4గ), మేక్బెత్ సంభాషణ (అం IV దృ4 లో మూలంలోని 135-153 పంక్తులు), నాటకాంతదృశ్యంలోని కొంత భాగం (అం V -దృ 8లో 35-75 పంక్తులు).

ఛందస్సు సక్రమంగా లేకపోవటంవల్లను, శైలి నిరర్థకశబ్దపుష్టిని సూచిస్తుండటంవల్లనూ, తీవ్రంగా గాయాలు తగిలిన వీరుని విజయవార్తను చెప్పటానికై పంపించటం అనుచితంగా ఉండటంవల్లనూ, సార్జెంటుదృశ్యం ఒక ప్రక్షిప్తభాగమని ఒక అభిప్రాయం. దీనికి వ్యతిరేకులైనవారు ఛందస్సు సక్రమంగా లేకపోవటం, నాటకకర్త ఇతరరచనల్లోకూడా కనిపిస్తుందనీ, ఇందులో శైలి సామాన్యవీరుడు రాజుతో చేసే ప్రసంగానికి యోగ్యంగానే ఉందనీ, సార్జెంటు రాక కేవలం విజయవాతావరణాన్ని కల్పించటానికి ఉద్దేశింపబడ్డదేగాని, నిజమైన వార్తాహారి రాస్ అనీ చెప్పి, పై అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతున్నారు.

ఈ దృశ్యం షేక్స్పియర్ కృతమే అని నిరూపించటానికి వెరిటీమహాశయుడు కొన్ని ఉపపత్తులను చూపించాడు. ఈ దృశ్యంవల్లనే మేక్బెత్ మహాయోధుడని నిరూపితమౌతున్నది. వీరగుణప్రదర్శన ద్వారా మేక్బెత్ విషాదాంతపతనాన్ని అత్యంతరమణీయం చేయటంకోసం, అతని సేవలకు మెచ్చుకొని డంకన్ అతణ్ణి గౌరవించటం భవిష్యత్తులో అతని కృతఘ్నుతాభావ తీవ్రతను నిరూపించటానికీ, ఈ గౌరవమే హత్యాచరణకు దోహదంగా వర్తించేటట్లు చేయటంకోసమూ, మేక్బెత్ విజయమే మాల్కొంను యువరాజుగా ప్రకటించటానికి పురికొల్పి మేక్బెత్ను హత్యాచరణకు త్వరపెట్టటాన్ని కల్పించదలచుకోవటం వల్లనూ, మహాకవి షేక్స్పియరే ఈ దృశ్యాన్ని రచించివుంటాడు. నాటకశిల్పదృష్టితో పరికిస్తే, ఇది ప్రధానకథ కత్యావశ్యకమైన భాగంగా కన్పించటంవల్ల ప్రక్షిప్తభాగం కాజాలదు.

మిడిల్ టన్ వ్రాసిన ‘ది విచ్’ అనే నాటకం నుంచి హేకెట్‌కు సంబంధించిన భాగాలు ‘మేక్బెత్’ నాటకంలో ప్రక్షిప్తాలుగా ప్రవేశించాయని ఫ్లియే అన్న విమర్శకుడు ఒక సిద్ధాంతాన్ని లేవదీశాడు. ‘ది విచ్’ అన్న నాటకానికీ, మేక్బెత్‌కు అనేకసామ్యాలు కన్పిస్తున్నాయనీ, రెండు నాటకాలలోని మాంత్రికురాండ్రు ఒకేరీతిగా ఉన్నారనీ, రంగసూచికల్లో ఇవ్వబడిన రెండు గేయాలు (అం III దృ 5 – 33), (అం IV దృ 1–43) ‘ది విచ్’లో నుంచి మేక్బెత్‌లో ప్రవేశించాయని ఫ్లియే అభిప్రాయం. గుణవిశేషం విషయంలో మిడిల్ టన్ వ్రాసిన ‘ది విచ్’ మేక్బెత్‌తో ఏకోశానా పోలకపోవటంవల్ల, విమర్శకుల వింత అభిప్రాయాన్ని త్రోసిపుచ్చి మేక్బెత్ నుంచే మిడిల్టన్ కొన్ని విశేషాలను గ్రహించివుంటాడని నిశ్చయించారు. తీవ్రంగా పరిశీలించి రెండు నాటకాల్లోని మంత్రకత్తెలకు సామ్యాలకంటే వైషమ్యాలే విశేషంగా ఉన్నాయని వారు నిరూపించారు.

అందలి శైలీపారుష్యాలనుబట్టి కొందరు ద్వారపాలక సంభాషణ (అం III దృ 3) షేక్స్‌పియర్ మహాకవికృతం కాదని భావిస్తున్నారు. కోల్రిడ్జి మహాశయుడే సామాన్య ప్రేక్షకులకోసం దీనినెవరో రచించి మేక్బెత్‌లో ప్రవేశపెట్టి వుంటారన్న అభిప్రాయాన్ని అంగీకరిస్తున్నాడు.

భయానక విషాదాంత సన్నివేశాల మధ్య ఇటువంటి దృశ్యానికి అవకాశం లేదన్న భావమే ఇట్టి ఊహలకు కారణం. కాని ద్వారభేదనదృశ్యాన్ని ఉంచినపుడు ద్వారపాలక సంభాషణ ఉండితీరవలసిరావటం వల్లనూ, భయానక సన్నివేశాలమధ్య కొంత విశ్రాంతికోసం ఇది అవసరమనిపించటంవల్లనూ, ఈ సంభాషణ నాటకగమనానికి అనుగుణంగానే ఉండటం వల్లనూ, ఇందలి శైలి, భాష షేక్స్‌పియర్‌దే కావటం వల్లనూ, ఈ ద్వారపాలక సంభాషణ షేక్స్‌పియర్ కృతమేనని హేల్సు మహాశయుడు నిర్ణయించాడు.

మేక్బెత్‌ను తొలుత ఆనీరాణి కాలంలో, ఆమె సోదరుడు డెన్మార్కు రాజు అయిన క్రిష్టియన్ IV సోదరిని దర్శించటానికి వచ్చిన సందర్భంలో, అతని గౌరవార్థం ప్రదర్శించారట. తరువాత జేమ్సు I కాలంలో ప్రదర్శించినప్పుడు ఆయన మెప్పుకోసం రాజును గురించిన సంభాషణ (అం IV దృ III – 135–154) లు అందులో ప్రవేశపెట్టారన్న అభిప్రాయం ఉంది. కాని ఇందులోని భాష శైలి షేక్స్‌పియర్‌ది కావటంవల్ల అది ప్రక్షిప్తం కాదనీ, ఒక వేళ ప్రక్షిప్తమైనా షేక్స్పియరే తరువాతి కాలంలో దాన్ని ప్రవేశపెట్టాడనీ విమర్శకాభిప్రాయం.

ఇది ప్రధానంగా ఉత్తమపాలకుడైన ఎడ్వర్డుకు, దుష్టపాలకుడైన మేక్బెత్‌కు ఉన్న తారతమ్యాన్ని ప్రదర్శిస్తుండటంవల్లనూ, వింతైన సన్నివేశంలో నుంచి అప్పుడే బయటపడ్డ మాక్డఫ్ చిత్తవృత్తికి నిలకడను కల్పించటానికి ఇది తోడ్పడటంవల్లనూ, నాటకీయంగా ఇది అనుచితం కాదు గనుకనూ, ఇది షేక్స్పియర్ మహాకవి కృతమే అన్న అభిప్రాయం స్థిరపడింది. తుది దృశ్యంలోని (అం V దృ 8 –35–75) నలుబది పంక్తులు ప్రక్షిప్తాలన్న వాదంలో కూడా బలంలేదు. ప్రక్షిప్తభాగమనటానికి ఒక కారణంగా చెప్పబడిన మాల్కొం మేక్బెత్ ప్రభ్విని 'భూతం వంటి రాజ్ఞిని' అని వ్యవహరించటం, మేక్బెత్ 'భావనాత్మకమైన విషాదాంతం' కావటంవల్లనే అని చెప్పి సమర్థించటం జరిగింది.

## మేక్బెత్ చారిత్రిక నాటకమా? విషాదాంతమా?

మేక్బెత్ రూపకాన్ని 'విషాదాంతంగా' రచించటమే షేక్స్పియర్ లక్ష్యం. అందువల్ల ఆయన చారిత్రిక వాతావరణాన్ని ఆధారమాత్రంగా గ్రహించి, భావనామూర్తియైన మేక్బెత్ అంతరంగయుద్ధాన్ని నిరూపించదలచుకొన్నాడు గనుక, నాటకాన్ని మనోవృత్తి వివరణంగా రూపొందించాడు. తన నాటకంలో సత్యమైన స్కాట్లండు దేశచరిత్రలోని అంశాలను దృశ్యరూపంలో నిరూపించటం ఆయన ఉద్దేశం కాదు గనుక, మేక్బెత్ చరిత్రాత్మకరూపకం కాజాలదు. ఒక నైతికసూత్రానికి కట్టుబడి, క్రమశిక్షణతో వర్తించని మనోవృత్తిగల వ్యక్తిలో స్థానాన్ని చేకూర్చుకొన్న అత్యాశ పొందిన పరిణామం వల్ల కలిగే దుష్ఫలితాలను ప్రదర్శించి చూపటమే మేక్బెత్ రచనలో నాటకకర్తకు ప్రధానాశయం. ఈ కారణంవల్లనే నాటక నిర్మాణవిషయంలో షేక్స్పియర్ మహాకవి కాల, స్థల, వ్యక్తుల విషయంలో ఎన్నో మార్పులు చేసుకోవలసివచ్చింది. ఉపజ్ఞతో ఆ ఉత్తమశిల్పి ఇందువల్లనే హాలిన్ షెడ్‌తో ఎట్టి సంబంధమూ లేని నూతనవాతావరణాన్ని సృష్టించుకోవలసి వచ్చింది.

మేక్బెత్‌ను అత్యుత్తమ విషాదాంత నాటకంగా రూపొందించిన మరుభూమి దృశ్యం (I. 1) ఛురికాదృశ్యం, విందు దృశ్యం, నిద్రాగమనదృశ్యం, డంకన్ హత్యకు పూర్వం మేక్బెత్ హృదయగవేషణం మొదలైన విషాదాంత విశేషాలన్నీ షేక్స్పియర్ మహాకవి కల్పనలే. షేక్స్పియర్‌కు మేక్బెత్ రచనమూలంగా ఒక చరిత్రను రూపకంగా రచిద్దామన్న ఉద్దేశం లేదు. అస్థిపంజరమాత్రంగా చరిత్రనుంచి కథను గ్రహించి, అత్యాశాశబలితమైన కృతఘ్నప్రవృత్తిచే విషాదాంతనాయకుడై వర్తించి పతనాన్ని పొందిన

మేక్బెత్‌ను చిత్రించి చూపటమే షేక్స్‌పియర్ ఉద్దేశం. కనుక మేక్బెత్ 'విషాదాంతమే' కాని 'చరిత్ర' కాదు.

## మేక్బెత్ - విషాదాంత నాటకం

భద్రతాసౌఖ్యాలను అనుభవిస్తున్న ఉన్నతవర్గానికి సంబంధించిన వ్యక్తి అదృష్టానికి అజ్ఞాతంగా పరిపూర్ణవైపరీత్యం ఏర్పడటం ఒక విషాదాంత కృత్యంగా భావింప బడుతుంది. ఈ విషయంలో మహాకవి షేక్స్‌పియర్ దృష్టి వేరు. అది విశేషపురోగమనం కలది. షేక్స్‌పియర్ విషాదాంత నాటక నాయకులందరూ విశేషంగా మహారాజులు, రాజపుత్రులు, ప్రజానాయకులు అయి ఉంటుంటారు. వీరికి కలిగే విషాదాంత పతనం ఏదో అర్థరహితమైన విధి చేష్టవల్ల కాక, సకారణమై వుంటుంది. ఆయన విషాదాంత నాటకాలలో కేంద్రం శీలంవల్ల నిర్వర్తితమైన కార్యంలో కాని లేదా కార్యంవల్ల నిరూపితమయ్యే శీలంలోగాని ఉంటుంది. సర్వసామాన్యంగా నాయకుని ఒకానొక కృత్యంవల్లనే విషాదంతపతనం సంభవిస్తుంటుంది. షేక్స్‌పియర్ విషాదాంత నాటక నాయకులు ఘనత వహించినవారై వుంటుంటారు. అయినా ఒక దిక్కున వారి పక్షపాతమో, లోభమో, ఆశో లోపమై, దానిని వారు చక్కదిద్దుకోలేక పతనమవు తుంటారు.

ఉదాత్తప్రకృతిగల ఒథెల్లో ఈర్ష్యవల్ల పతనమైనాడు. హామ్లెట్ వంటి విజ్ఞాని అతిశయమైన ఆదర్శతత్త్వంవల్ల అంతమొందాడు. మహావీరుడైన మేక్బెత్ కృతజ్ఞతాగుణరహితమైన అత్యాశవల్ల హతమారిపోయినాడు. ఈ ఉదాహరణలన్నింటిలో ప్రధానపాత్రలలోని ఏకైకలోపమే కన్పిస్తుంది. ఆ ఏకవిషయకమైన వ్యసనాన్నో లేక లాభాన్నో విడిచిపుచ్చితే, షేక్స్‌పియర్ మహాకవి విషాదాంత నాటక నాయకులందరూ ఉదాత్తులు, ఘనులు. అందువల్లనే, వీరి వినాశం కరుణను, భయాన్ని మనలో కల్పించగలుగుతున్నది.

మహాకవి షేక్స్‌పియర్ ఊహించిన విషాదాంతం ఆత్మవినాశం, లేదా ఆత్మ పునరుద్ధరణం, మానవజీవితాలకు సంబంధించి వుంటుంది. అంటే దానికి వస్తువు లోకంలోని మంచి చెడ్డలే... వీటిలో మహాకవి షేక్స్‌పియర్ పరిష్కరించటానికి అవకాశం లేని కొన్ని సమస్యలను ప్రతిపాదిస్తుంటాడు. ఆయన మిల్టన్‌లా చెడుగు మూలమేమో దాన్ని వివరించటానికి పూనుకోడు. డాంటీలా అంతులేని బాధాచక్రాలమూలంగా ఆత్మనుద్ధరించి చూపడు. మంచి చెడ్డలు రెండు ఉన్నవని ప్రదర్శించి చూపటమే

ఆయన పెట్టుకొన్న పని. లోకంలో ద్వేషం ఎలా ఉంటుందో, అలాగే దౌష్ట్యం నుంచి లోకాన్ని ఉద్ధరించాలన్న పవిత్రభావం కూడా ఉంటుందని ఆయన నిరూపిస్తుంటాడు. అవి రెండూ తగ్గ ప్రతిఫలాలను ఈ లోకంలోనే అనుభవించటం ఆయన రచనల్లో కనిపిస్తుంది.

షేక్స్పియర్ విషాదాంతాలలో కథ ప్రధానంగా ఒకరికి – నాయకుడికి లేదా ఇరువురికి – నాయికానాయకులకు సంబంధించి ఉంటుంది. ఇందులో విపదనుభవ పతనాలు విశిష్టంగా ఉంటాయి. అవి ఒక అసామాన్యవ్యక్తికి సంబంధించినవై ఉంటాయి. పూర్వం ఆ వ్యక్తి కీర్తి వైభవాలను అనుభవించినవాడై ఉంటాడు. ఆపదలు, చర్యలనుబట్టి వ్యక్తుల చర్యలనుబట్టి ఉద్భవిస్తుంటాయి. విషాదాంతకేంద్రం పాత్రలశీలంనుంచి ఉద్భవించిన చర్యలోగాని లేదా చర్యలవల్ల జనించిన శీలంలోగాని ఉంటుంది. పాత్రల శీలమే విశేషంగా ఈ చర్యలకు మూలాధారమై ఉంటుంది. పాత్రలోని ఏకైకవిషయపక్షపాతం వల్లనో, ఏకైకాశయ నిమగ్నత వల్లనో, ఏకైకభావమనో నిశ్చలత వల్లనో విషాదాంతగుణం ప్రదర్శిత మౌతుంది. ఈ గుణం విషాదాంత నాటక నాయకుని ఇతరవిషయాలలో అశక్తుని చేస్తుంటుంది. ఈ విషాదాంతగుణమే అతని ఏకైకగుణమై పతనాన్ని ప్రాప్తింపజేస్తుంటుంది.

మేక్బెత్‌లో తనది కానిదానిని పొందవలెనన్న స్వార్థపరమైన అత్యాశ, మేక్బెత్ ప్రభ్వి అంతకంటే శక్తిమంతమైన ప్రణయ, స్వార్థరాహిత్యాలతో కూడిన అత్యాశ, స్వేచ్ఛా సంచారం చేసి ఉత్తములైన ఆ దంపతుల పతనానికి దారి తీసింది. ఉత్తమకార్యసాధకులు కాదగ్గ వారిరువురూ అత్యాశవల్ల వినాశాన్ని పొందటం చేత, వారి కథావస్తువుతో గూడిన మేక్బెత్‌ను విమర్శకులు 'అత్యాశావిషాదాంతము' అని భావించారు. స్నిడర్ మహాశయుడు మేక్బెత్‌ను 'భావవిషాదాంత' మన్నాడు. బాహ్యదృష్టికి మేక్బెత్ విధి సోదరీమణుల ప్రేరణం వల్ల నిర్దోషి యైన డంకన్‌ను హత్య చేసినట్లు కన్పించినప్పటికీ, ఈ చర్యకు బాధ్యత అంతా అతనిదే. ఈ విధి సోదరీమణుల రూపాలు అతని కాంక్షలు, అత్యాశాదులవల్ల కళవళపాటును పొందుతున్న మనస్సు నుండి ఉద్భవించి స్వాతంత్ర్యాన్ని పొందినవే. బాహ్యంగా మేక్బెత్ కొంత శిక్షను అనుభవించినా అతడు, అతని పత్ని మేక్బెత్ ప్రభ్వి విశేషంగా మానసిక భావనలవల్ల అధిక వేదనను అనుభవించారు. అందువల్ల మేక్బెత్‌ను 'భావనావిషాదాంత' మనటం సమంజసమే.

## మేక్బెత్ – కెల్టుల నాటి స్కాట్లండు వాతావరణం

మేక్బెత్ రూపకంలో షేక్స్పియర్ కెల్టిక్ స్కాట్లండు వాతావరణాన్ని యథాతథంగా ప్రదర్శించటం కనిపిస్తుంది. ప్రథమాంకంలోని మూడో దృశ్యంలో ఫార్రేస్ చుట్టూ ఉన్న ప్రదేశాన్ని వర్ణించటంలోను, ప్రథమాంకంలోని ఆరో దృశ్యంలో ఇన్వర్నెస్ దుర్గాన్ని గురించి చేసిన వర్ణనలోను,షేక్స్పియర్కు ఆ ప్రదేశాలతో ప్రత్యక్షపరిచయం ఉన్నదా అన్న అనుమానం కలుగుతుంది. షేక్స్పియర్కు మూలాలైన చరిత్రలు, స్కాట్లండు ప్రకృతి వాతావరణవర్ణనల విషయంలో సత్యానికి భిన్నాలుగా ఉండటంవల్ల, ఆయనకు విశేషంగా తోడ్పడి వుండటానికి అవకాశం లేదు. స్కాట్లండుదేశంలోని భూతవిద్యకు, మేక్బెత్లోని మంత్రగత్తెల చరిత్రకు చాలా సామ్యాలు కనిపిస్తున్నవి. మేక్బెత్ పఠనం వల్ల షేక్స్పియర్కు ఆ నాటి స్కాట్లండుదేశపు స్థానికాచార వ్యవహారాలతోనూ, విశ్వాసవిలాసాలతోను, ప్రకృతితోను గాఢపరిచయం ఉన్నదని సర్వత్రా గోచరిస్తుంది. అందువల్ల 1601లో అబర్డీన్ టౌన్ కౌన్సిలు రిజిస్టరులో విచ్చేసినట్టు రిజిస్టరైన లారెన్సు ఫ్లెచ్చెర్ సంఘంలో ఒక సభ్యుడుగా, షేక్స్పియర్ స్కాట్లండు దేశాన్ని దర్శించి వుండవచ్చునని కొందరూహిస్తున్నారు కానీ, ఒక దేశపుప్రకృతితోను, ఆచార వ్యవహారాలతోను పరిచయాన్ని గ్రంథంలో ప్రదర్శించినంత మాత్రం చేత ఆ దేశాన్ని దర్శించాడని చెప్పవలసిన అగత్యం లేదు.

షేక్స్పియర్ రోమన్ ఇటాలియన్ నాటకాలలో రోముతోనూ, ఇటలీతోనూ విశేష పరిచయమున్నట్లు కనిపిస్తాడు. అంతమాత్రంచేత ఆయన ఇటలీదేశాన్ని పర్యటించాడనిగాని, రోమును దర్శించాడనిగాని ఊహించటానికి అవకాశం లేదు. జేమ్సు I రాజు ఆంగ్ల సింహాసనాన్ని అధిష్ఠించిన తరువాత లండన్ నగరానికి విశేషంగా రాకపోకలు చేస్తున్న స్కాటులతో చేసిన గోష్ఠుల వల్ల, షేక్స్పియర్ స్కాచ్దేశప్రకృతికి, వాతావరణానికి సంబంధించిన అనేకాంశాలను సంగ్రహించి వుండవచ్చు. 1603కు పూర్వం షేక్స్పియర్కు ఫ్లెచ్చెర్తో పరిచయమున్నట్టు ఆధారాలేవీ లేవు గనుక, 1601లో ఫ్లెచ్చెర్ నాయకత్వాన స్కాట్లండును దర్శించిన సంఘంలో షేక్స్పియర్ ఒక సభ్యుడవటం పొసగదు.

అదీకాక, 1601లో తండ్రి మరణించటంవల్ల షేక్స్పియర్ స్కాట్లండుయాత్రను తలపెట్టటానికి అవకాశం కూడా లేదు. స్కాచ్ మిత్రులతో సలిపిన గోష్ఠులవల్లనే షేక్స్పియర్ మేక్బెత్ నాటకానికి ఆవశ్యకమైన వర్ణనాంశాలను, వాతావరణవిశేషాలను సేకరించాడని భావించటమే సర్వవిధాలా సమంజసం.

## మేక్బెత్ - మాంత్రికురాండ్రు

"మేక్బెత్‌లోని మంత్రగత్తెలు విచిత్రసృష్టి. వీరు సామాన్యంగా జనవిశ్వాసంలో కన్పించే మాంత్రికురాండ్రవంటివారు కారు. ఇంతకంటే ఎంతో శక్తిమంతలు. విధి దేవతలవంటివారు. మానవజాతి కతీతమైన భవిష్యద్విజ్ఞానం వీరికున్నట్లు విస్పష్టంగా గోచరిస్తుంది. మాంత్రికురాండ్రను గురించి తన కాలంలో ఉన్న అభిప్రాయాలను గ్రహించి, షేక్స్పియర్ ఈ మాంత్రికురాండ్రను భావించి వారికి ఎన్నో అతీతశక్తులను ప్రసాదించాడు. సామాన్య జనశ్రుతిలో చీపురుకట్టలతో కన్పించే మంత్రగత్తెలు కారు. వీరు విరూపలైనా ఉదాత్తత లోపింపనివారు. వీరు మహాశిల్పి మైకలాంజెలో చిత్రించిన మానవ జీవితతంతువుల ననుయించే వృద్ధవనితలతో తుల్యమైన స్థానాన్ని ఆక్రమింపదగ్గవారు" అన్న డౌడన్ మహాశయుని అభిప్రాయం గమనింపదగినది.

మేక్బెత్‌లోని మంత్రగత్తెలలో రెండు తెగలవారున్నారనీ, అందులో మొదట కన్పించినవారు (అంI దృ1) స్కాండినేవియా దేశంలోని భూతభవిష్యద్వర్తమానాలకు అధిదేవతలైన నోర్సన్లనీ, రెండవమారు కన్పించినవారు (అం IV దృ 1 ) సామాన్య జనశ్రుతిలోని మాంత్రికురాండ్రవంటి వారనీ ఒక అభిప్రాయముంది. ఈ అభిప్రాయాన్ని ఖండించి త్రోసిపుచ్చి, షేక్స్పియర్ సృష్టించిన మంత్రగత్తెలు సామాన్య జనశ్రుతిలోని మాంత్రికురాండ్రేగాని, దేవతలైన నోరన్లు కారని విమర్శకులు నిరూపించారు.

## మేక్బెత్ : నాటకీయ ఏకత

ఎంత రమణీయమైలైనప్పటికినీ, కొన్ని కథాసన్నివేశాలనుగాని, లేదా కొన్ని కథాభాగాలను గాని ఒకచోట చేర్చినంతమాత్రాన నాటకం కాజాలదు. అందువల్లనే గ్రీకు నాటకతత్త్వవేత్త అరిస్టాటిల్ నాటకంలో ఆదిమధ్యాంతాలందు ఒక కార్యపరిణామాన్ని మాత్రమే ప్రదర్శించవలెనని నిర్ణయించాడు. ఇట్లే స్థలైక్యం, కాలైక్యంగూడా ప్రాచీన లాక్షణికు లేర్పరచినప్పటికీ, అనుసరించి వాటికి విశేషప్రాముఖ్యాన్నివ్వటం తరువాతి నాటకకర్తలు మానివేశారు.

మేక్బెత్ నాటకంలో సమస్తమూ మేక్బెత్ ఉదయాస్తమయాల మీద కేంద్రీకృతమైంది. ఇందులో ప్రాసంగికకథ అంటూ ఏమీ లేదు. నాటకీయోపశమనానికో లేక తులనాత్మక రసభావ ప్రదర్శనలలో ప్రవేశపెట్టిన ఇతరసన్నివేశాలు కూడా అల్పసంఖ్యాకాలు. మంత్రగత్తెలు మేక్బెత్‌ను జోస్యంతో మోసగించటం ప్రథమాంకంలోనే ప్రారంభమౌతుంది. తృతీయాంకంలోని తృతీయ దృశ్యంలో ఫ్లియాన్సును కూడా హత్య

చేయించటంలో విఫలుడు కావటంతో, అంతవరకూ అవిచ్ఛిన్నంగా సర్వకృత్యాలలో విజయాన్ని పొందుతూ వస్తున్న మేక్బెత్‌కు, 'దుర్గతి' ప్రారంభమౌతుంది, అప్పటినుంచీ పతనోన్ముఖత ప్రారంభమై, అన్ని విషయాలలోనూ మేక్బెత్ అపజయాలనే పొందుతాడు. మాల్కొం, మాక్డఫ్ తుదకు అతణ్ణి రూపుమాపటంతో అతని విషాదకథ పరిసమాప్తిని పొందుతుంది.

'ఉదాత్తపాత్ర ప్రలోభానికి లొంగిపోవచ్చు. ఈ ప్రలోభం అతనిచేత ఒక పాపకృత్యాన్ని చేయించటానికి పురికొల్పటంలో క్రమంగా అతడు ఒకదాని తరువాత మరొక పాపకృత్యాన్ని ఆచరించటానికి వెనుదీయకపోవటం జరుగుతుంది.. ఈ పాపకృత్యాలకు, వాని తీవ్రతకు అనుగుణమైన ఉచితశిక్ష అనుభవింపక తీరదు' – అన్నది మేక్బెత్ నాటకానికి మూలభావంగా కనిపిస్తున్నది.

మంత్రగత్తెలు రాజ్యాశను కల్పించి మేక్బెత్‌ను ప్రలోభపెట్టారు. అతడు డంకన్ రాజును హత్య చేయటంతో పాపకార్యాచరణాన్ని ఆరంభించాడు. ఇక తిరోగమనమన్నది లేకపోవటం వల్ల అతడు నీతికరుణలను విడిచిపుచ్చి దారుణహత్యాకాండను కొనసాగించటం జరిగింది. తుదకు పశ్చాత్తాపం వల్ల ఆత్మనైనా ఉద్ధరించుకోటానికి అవకాశం లేని దారుణమరణంతో గాని అతనికి బాధోపశమనం కలగలేదు. ఈ రీతి పరిశీలనవల్ల మేక్బెత్ నాటకంలో షేక్స్పియర్ మహాకవి భావైక్యాన్ని మహామనోజ్ఞంగా సంపాదించడం గోచరిస్తుంది.

## మేక్బెత్ – నాటకీయోపశమనం

మేక్బెత్ నాటకంలో మొదటినుంచీ తుదివరకూ ఒకదాని తరువాత మరొక భయానక సన్నివేశం కనిపిస్తుంది. ఇటువంటి భీకరసన్నివేశాలను దర్శిస్తున్నప్పుడు ప్రేక్షకుల మనస్సు విశేషంగా అలసట పొందుతుంటుంది. అందువల్ల మధ్యమధ్య ఉపశమనంకోసం, కథాగమనాన్ని అడ్డుకోని కొన్ని అన్యరసభావసన్నివేశాలకు మహాకవి షేక్స్పియర్ ఈ రూపకంలో ప్రవేశాన్ని కల్పించాడు.

సామాన్యంగా షేక్స్పియర్ నాటకాలలో విదూషకపాత్ర ఇటువంటి విషాదాంతభారాన్ని భరించడంలో తోడ్పడుతుంటాడు. కానీ తీవ్రవిషాదాంత నాటకమైన మేక్బెత్‌లో దాని నిర్మాణరీతులకు, ప్రధానరసభావాలకు భంగం కలుగుతుంది. కనుక హాస్యరసస్ఫూర్తులతో కూడిన విదూషపాత్రను ప్రవేశపెట్టటానికి అవకాశం లేదు. అందువల్ల షేక్స్పియర్ మహాకవి ఈ ఉపశమన సంతరింపునకు అన్యమార్గాలను

అన్వేషించాడు. డంకన్‌ను హత్య చేయటానికి వెళ్ళబోయేముందు మేక్బెత్‌కు కవితాత్మను ప్రసాదించి పంపించాడు. మాక్డఫ్ కుటుంబాన్ని హత్య చేయించే సందర్భంలో, ఆ కాలంలో పక్వమైన బాలుని తొక్కు పలుకుల మూలంగా అక్కడి భయానకతకు కొంత ఉపశమనాన్ని కల్పించాడు.

కథాంతవేళలో మేక్బెత్ 'వైద్యుణ్ణి నే పాలించే భూమికి పటిష్ఠమూ, స్వచ్ఛమూ అయిన ఆరోగ్యాన్ని చేకూర్చగలవా?' అని ప్రశ్నించి కవితాత్మతో వ్యవహరించటం వల్ల, అతని తుదివేదనావస్థను కొంతగా కప్పిపుచ్చాడు.

మహాకవి షేక్స్‌పియర్ కొంత అనుదాత్తస్థాయితో కల్పించిన దృశ్యాలమూలంగా కూడా ఈ ఉపశమనాన్ని సంతరిస్తుంటాడు. డంకన్ హత్యకు సిద్ధపడుతున్న మేక్బెత్ మనోవేదనను దర్శించి శ్రమగొన్న ప్రేక్షకుల బుద్ధికి, ద్వారపాలకుని దృశ్యం మూలంగా నాటకకర్త కొంత విశ్రాంతిని చేకూర్చాడు. లేకపోతే హత్య ఎరుకపడిన తరువాత వచ్చే భయానక సన్నివేశాలను వారు భరించటం కష్టమౌతుంది. అంకం II దృశ్యం 4 మూలంగా ప్రేక్షకులను మేక్బెత్ దుర్గం నుంచి దూరంగా తీసుకుపోయి, వారి బుద్ధిని తాత్కాలికంగా హత్యావ్యవసాయానికి దూరం చేయటం కూడా ఈ ఉపశమనసంతరింపు కోసమే. బాంకో హత్య తరువాత మంత్రగత్తెలకు 'హెకేటుకు జరిగిన సంభాషణకు, ఆ హత్యావ్యవసాయం చేత అనిబద్ధభీతిని పొందిన మేక్బెత్‌ను దర్శించినపుడు కలిగే శ్రమనుంచి ప్రేక్షకులకు కొంత విశ్రాంతి కల్పించటమే ప్రయోజనం' అంకం III దృశ్యం 4లో కూడా ఇట్టి ప్రయోజనమే ఉద్దేశితమైంది.

షేక్స్‌పియర్ మహాకవి చతుర్థాంకంలోని తృతీయదృశ్యాన్ని మాక్డఫ్ సత్యసంధతను మాల్కొం పరీక్షించటం, మాక్డఫ్ తన భార్యాపుత్రుల వధను గురించి వినడం అన్న రెండు భాగాలుగా విభజించి వస్తుగమన వైపరీత్యంతో ప్రేక్షకబుద్ధికి ఒక విచిత్రోపశమనాన్ని కల్పించటం ప్రశంసాయోగ్యమైన నాటకీయశిల్ప కౌశలవిశేషం.

## కథాపరిచ్ఛేదం

## ప్రథమాంకం – ప్రలోభం

ఒక మరుభూమిలో ముగ్గురు మాంత్రికురాండ్రు సమావేశమై, విప్లవాన్ని అణచి విజయాన్ని చేకొని యుద్ధభూమినుంచి డంకన్ రాజును హత్య చేయాలన్న నిశ్చితపథకంతో వస్తున్న మేక్బెత్‌ను, 'ఒక క్షేత్రసీమ'లో కలుసుకోటానికి నిశ్చయిస్తారు. ఇతరుల మనస్సులో ప్రవేశించి సర్వాన్నీ గ్రహింపగల శక్తి ఉన్న దుష్టమాంత్రికురాండ్రు

పూర్వమెరుగని మేక్బెత్ మనస్సులోని పథకాన్ని గుర్తించటంవల్లనే అతడు వారిని ఆకర్షించటం జరుగుతుంది. దుష్టత్వం, దుష్టత్వానికి తోడ్పడాలని ఉత్సహించటమే ఇందుకు కారణం. ఈ స్వల్పదృశ్యం వల్ల భయానకాద్భుతవాతావరణం సూచితమౌతుంది (దృశ్యం1).

ఫోరెస్‌లోని ఒక శిబిరం దగ్గిర ఉండగా, స్కాట్లండు రాజైన డంకన్, నార్వీజియన్ రాజు సహాయంతో మేక్డొనాల్డు చేసిన తిరుగుబాటును తన పినతల్లి కుమారుడైన మేక్బెత్ అణచివేసి విజయం చేకొన్నాడన్న వార్తను వింటాడు. ఈ సమయంలో కౌడర్ థేను చేసిన విద్రోహాన్ని తెలుసుకొని డంకన్ రాజు ప్రాణహరణమే అతనికి శిక్షగా చెప్పి, కౌడర్ థేన్ బిరుదాన్ని మేక్బెత్‌కు ప్రసాదిస్తాడు.

ఈ దృశ్యం మేక్బెత్ కీర్తి ప్రశస్తితో ముగిసి అతనికి విషాదాంత నాటక నాయకత్వానికి అర్హతను ప్రదర్శిస్తున్నది. ఇంతలో, డంకన్ మేక్బెత్‌కు చేసిన గౌరవం ఇతఃపూర్వమే అతని మనస్సులో మొలకెత్తిన అత్యాశకు దోహదమై, హత్యకు అతణ్ణి మరింతగా ప్రేరేపిస్తుంది. (దృశ్యం2) తరువాత తొలుత నిశ్చయించుకొన్నట్లుగా మాంత్రికురాండ్రు యుద్ధభూమి నుంచి విజయంతో వస్తున్న మేక్బెత్‌ను కలుసుకొని, మేక్బెత్‌ను "గ్లామిస్ థేన్, కౌడర్ థేన్ భవిష్యస్కాట్లండు ప్రభూ!" అన్న బిరుదాలతో జయవెట్టుతారు. అతని వెంట వున్న బాంకోతో 'నీవు రాజువు కాకపోయినప్పటికీ రాజపరంపరకు మూలపురుషుడవౌతా'వని తెలియజెప్పుతారు.

ఇంతలో వార్తాహరులు వచ్చి మేక్బెత్‌తో రాజు 'మిమ్మల్ని కౌడరుకు థేనును చేసినా'డని విన్నవిస్తారు. మంత్రగత్తెలు చెప్పిన జోస్యంలో పూర్వార్ధం సత్యం కావటం వల్ల, ఉత్తరార్ధం కూడా సత్యమై తీరుతుందని అతడు విశ్వసించటం ప్రారంభిస్తాడు. తన యత్నమేమీ లేకుండానే ఆ జోస్యం ఫలించవచ్చునని అతడు ఊహిస్తాడు. (దృశ్యం 3).

కౌడర్ మరణదండన జరిగిపోయిందని విన్నతరువాత, డంకన్ రాజు దర్శనానికి వచ్చిన బాంకో, మేక్బెత్‌ల వీరగుణాన్ని ప్రశంసిస్తాడు. సింహాసనాన్ని గురించి భవిష్యత్తులో ఎటువంటి అంతఃకలహాలూ పుట్టకుండా ఉండటంకోసం అతడు తన పుత్రుడైన మాల్కొంను యువరాజని ప్రకటిస్తాడు. అందువల్ల తాను స్కాట్లండుకు రాజు కావటానికి డంకన్ మాల్కొంకే కాక ముందు డొనాల్బెయిన్ మొదలైనవారు కూడా అడ్డుకావచ్చును కనుక, ఆ నాటి రాత్రికే తలపెట్టిన హత్య జరిగిపోవాలని మేక్బెత్ నిశ్చయిస్తాడు.

ఇట్టి స్థితిలో డంకన్ రాజు తానే మేక్బెత్ దుర్గమైన ఇన్వర్నెస్‌కు ఆతిథ్యాన్ని స్వీకరించటానికి వస్తున్నాని మేక్బెత్‌కు తెలియజేస్తాడు (దృశ్యం 4).

ఇన్వర్నెస్ దుర్గంలోని సౌధంలో మంత్రగత్తెలు చెప్పిన జోస్యాన్ని గురించి మేక్బెత్ వ్రాసిన ఉత్తరాన్ని చదువుతూ, అందులో అప్పటికే కొంతభాగం సత్యమైనందుకు సంతోషించి, మిగిలిన భాగాన్ని పూర్తిచేయటం కోసం భర్తను త్వరపెట్టి డంకన్‌ను హత్య చేయించటానికి మేక్బెత్ ప్రభ్వి నిశ్చయిస్తుంది. ఒక వార్తాహరి వచ్చి డంకన్ రాజు వారి దుర్గానికి అతిథిగా వస్తున్నాడన్న వార్తను మేక్బెత్ ప్రభ్వికి నివేదిస్తాడు. స్వల్పకాలంలో మేక్బెత్ వస్తాడు. మేక్బెత్ ప్రభ్వి భర్తను మాంత్రికురాండ్రు జయవెట్టిన రీతిగా ఆహ్వానిస్తుంది. ఆమె సార్వభౌమాధికారాన్ని సంపాదించాలంటే డంకన్ హత్య అత్యవసరమని, అన్యమార్గం లేదని భర్తకు మంతనం చెబుతుంది (దృశ్యం 5).

మేక్బెత్ దుర్గం దగ్గరికి వచ్చి డంకన్ రాజు అచ్చటి ప్రకృతి విలాసాన్ని, ప్రశాంత వాతావరణాన్ని ప్రశంసిస్తాడు. ఆయాతుడైన రాజును అత్యాదరంతో మేక్బెత్ ప్రభ్వి ఆహ్వానించి స్వాగతం చెబుతుంది. (దృశ్యం 6) మేక్బెత్ తనకు అతిథిగా వచ్చిన మహారాజు డంకన్‌ను హత్య చేయటమా, చేయకపోవటమా అని డోలాందోళితమనస్కుడై కళవళపాటు పొందుతుంటాడు. అనుమానభయాలు ఆవరిస్తున్నప్పుడు మేక్బెత్ ప్రభ్వి ప్రవేశించి అతని భీరుత్వాన్ని నిందించి, ప్రతిజ్ఞాభంగం చెయ్యవద్దని ఉద్బోధించి హత్యకాతణ్ణి స్థిరనిశ్చయుణ్ణి చేస్తుంది.

## ద్వితీయాంకం – ప్రథమవిద్రోహం

మేక్బెత్ సౌధప్రాంగణంలో రాత్రి బహుకాలం గడచిన తరువాత, మేక్బెత్ బాంకోను, అతని పుత్రుడు ఫ్లియాన్సులను కలుసుకొని, మంత్రగత్తెల జోస్యం బాంకోమీద ఎలా పనిచేస్తున్నదో తెలుసుకో యత్నిస్తాడు. బాంకో సమాధానాల వల్ల అతడు డంకన్ హత్యలో తనతోబాటు భాగస్వామి కాడని అతడు గ్రహిస్తాడు. వాళ్ళు వెళ్ళిపోయినతరువాత ఏకాంతంగా ఉన్న సమయంలో మేక్బెత్‌కు డంకన్ కక్ష్యవైపునకు దారి చూపిస్తూ ఉన్న ఒక ఛురికాఛాయామూర్తి కనిపిస్తుంది. ఇంతలో మేక్బెత్ ప్రభ్వి ఇచ్చిన సూచనను అందుకొని, అతడు డంకన్‌ను హత్య చేయటానికి అతడి కక్ష్యకు వెళ్ళుతాడు (దృశ్యం 1).

ఏమైందో అన్న ఉద్వేగంతో మేక్బెత్ ప్రభ్వి తహతహపడుతుండగా, మేక్బెత్ డంకన్‌ను హత్య చేసి రక్తపంకిలాలైన హస్తాలతో ఆమెదగ్గరికి వస్తాడు. బాహ్యస్మృతి

లేకుండా అతడు కాపలావాళ్ళదగ్గిర విడిచిరావలసిన ఛురికలను వెంట తెస్తాడు. మేక్బెత్ ప్రభ్వి అతణ్ణి తిరిగి వాటిని లోపలికి తీసుకోపోయి కాపలావాళ్ళదగ్గిరి పెట్టి, అనుమానం వాళ్ళమీద పడేటందుకుగాను వారి ఒడళ్ళనిండా రక్తాన్ని పులిమి రమ్మని చెపుతుంది. అతిభీతివల్ల మేక్బెత్ ఆ పని చెయ్యటానికి నిరాకరించినప్పుడు, మేక్బెత్ ప్రభ్వి భర్త హస్తాలలో నుంచి ఛురికలను లాగుకొనివెళ్ళి, తానే ఆ పని చేసివస్తుంది. డంకన్ కక్ష్యనుంచి ఆమె తిరిగివచ్చిన వెంటనే ద్వారం దగ్గిర గట్టిగా తట్టిన చప్పుళ్ళు వినిపిస్తాయి. మేక్బెత్ ప్రభ్వి చేతులు కడుగుకొని నిద్రను నటించటం తమ కర్తవ్యమని త్వరపెట్టి భర్తను వెంట తీసుకోపోతుంది (దృశ్యం2).

డంకన్ కక్ష్యకు ప్రక్కన ఉన్న కక్ష్యలో విడిది చేసిన మాక్డఫ్, లెన్నాక్స్ పెద్దగా చప్పుడు చేసి నిద్రిస్తున్న ద్వారపాలకుణ్ణి మేల్కొల్పుతారు. అతడు అర్థరహితమైన ప్రలాపం చేసి తలుపు తీస్తాడు. ఇంతలో మేక్బెత్ వచ్చి వారిని కలుసుకొంటాడు. మాక్డఫ్ డంకన్ కక్ష్యలోకి వెళ్ళి, నిహతుడైన డంకన్‌ను చూసి వచ్చి, ఆ హత్యావిషయాన్ని మేక్బెత్‌కు ఎరుకపరిచి కేకలు పెట్టి సౌధంలో వాళ్ళనందరినీ మేల్కొల్పుతాడు. ఇంతలో మేక్బెత్ ప్రభ్వి, బాంకో కూడా అక్కడికి వస్తారు. మేక్బెత్, లెన్నాక్స్ ఇరువురూ డంకన్ కక్ష్యకు వెళ్ళినప్పుడు మేక్బెత్ తీవ్రకోపాన్ని నటించి అక్కడి కాపలావారిని చంపివేస్తాడు. వారు తిరిగి వచ్చేటప్పటికి మాల్కొం డొనాల్బెయిన్ కూడా అక్కడికి చేరుతారు. వారికి మేక్బెత్ కోపతీవ్రతలో తాను రాజును హత్యచేసిన కాపలావారిని చంపివేశానని చెపుతాడు. ఈ వార్త విన్నవెంటనే మేక్బెత్ ప్రభ్వి మూర్ఛపొందుతుంది. ఆమెను తీసుకోవెళ్ళినతరువాత కొలది కాలానికి, దుష్టబుద్ధి ఐన మేక్బెత్ విద్రోహాన్ని గ్రహించి డంకన్ రాజుపుత్రులైన మాల్కొం, డొనాల్బెయిన్ ఇంకా అక్కడ ఉంటే తమ ప్రాణాలకు కూడా ప్రమాదం సంభవిస్తుందని భావించి, స్కాట్లండునుంచి పారిపోవటానికి నిశ్చయించుకుంటారు. (దృశ్యం 3).

మేక్బెత్ సౌధానికి బయట డంకన్ రాజు హత్య జరిగిన నాటి రాత్రి కనుపట్టిన శకునాలను, అశుభసూచనల గురించి రాస్ మరొక వృద్ధుడితో చర్చిస్తుంటాడు. ఇంతలో మాక్డఫ్ అక్కడికి వచ్చి పారిపోవటంవల్ల రాజును కుమారులే హత్యచేశారని ప్రజలు అనుమానిస్తున్నట్లు తెలియజేస్తాడు. రాస్ అతనితో ప్రజలు మేక్బెత్‌ను ప్రభువుగా ఎన్నుకొన్నారని, త్వరలోనే అతనికి కిరీట ప్రదానోత్సవం స్కోన్‌లో జరుగనున్నదనీ తెలియజేస్తాడు (దృశ్యం 4)

## తృతీయాంకం - ద్వితీయవిద్రోహం

ఫోరెస్ సౌధంలో మేక్బెత్‌కు అతిథిగా ఉన్న బాంకో మంత్రగత్తెలు చెప్పిన జోస్యాన్ని గురించి ఏవేవో ఊహలు చేస్తుండగా, మేక్బెత్, మేక్బెత్ ప్రభ్వి వచ్చి అతణ్ణి రాజసౌధంలో ఆ నాటి రాత్రి జరుగుతున్న విందుకు ఆహ్వానిస్తారు. రాజపదవి అబ్బిన మేక్బెత్, బాంకో సంతానపరంపర రాజ్యపాలన చేస్తుందని మంత్రగత్తెలు చెప్పిన జోస్యాన్ని మరచిపోలేదు. అందుకని అతడు బాంకోను, అతని కుమారుడైన ఫ్లియాన్సును హత్య చేయటానికి నిశ్చయిస్తాడు. ఈ కృత్యాన్ని నిర్వహించటానికని మేక్బెత్ ఇరువురు హంతకులను నియమిస్తే, వారు తగిన పథకం వేస్తారు (దృశ్యం 1). బాంకో హత్యనుగూర్చిన పథకాన్ని ఎరుగని మేక్బెత్ ప్రభ్వి ఆ విషయాన్ని తెలుసుకొంటుంది. గడచిపోయిన విషయాలను గురించి పదేపదిగా ఆలోచనా నిమగ్నుడౌతూ, ఉన్మత్తుడిలా ప్రవర్తిస్తున్న మేక్బెత్ చర్యను ఆమె నిందిస్తుంది. అప్పుడు అతడు తాను బాంకో, ఫ్లియాన్సు తనను సింహాసనం నుంచి దింపివేస్తారేమోనని భయపడుతున్న విషయం ఆమెకు తెలియజేస్తాడు. (దృశ్యం 2). మేక్బెత్ సౌధానికి సన్నిహితంగా ఉన్న ఒక ఉద్యానవనంలో హంతకులు బాంకోను హత్య చేస్తారు. ఫ్లియాన్సు తప్పించుకొని పారిపోతాడు. (దృశ్యం 3). రాజసౌధంలో విందుకు ఏర్పాట్లు జరుగుతాయి. రాజు, రాజ్ఞి - మేక్బెత్, మేక్బెత్ ప్రభ్వి - అతిథులను, ప్రియవాక్యాలతో ఆహ్వానిస్తారు. బాంకోను హతమార్చిన హంతకులలో ఒకడు ద్వారప్రదేశానికి వచ్చి కనిపిస్తే, మేక్బెత్ అక్కడికి వెళ్ళి అతడితో స్వల్పంగా సంభాషించి వస్తాడు. ఫ్లియాన్సు తప్పించుకొని పారిపోవటం మేక్బెత్‌ను విశేషంగా కలతపెట్టటం ప్రారంభించింది. అతిథుల సంగతిని పట్టించుకోకుండా ఆలోచనావీథిలో పడిపోయిన మేక్బెత్‌ను, అతనిస్థానం దగ్గిరకు పిలుచుకొనివచ్చి ఉత్సాహాన్ని కల్పించటానికి మేక్బెత్, ప్రభ్వి యత్నిస్తుంది. తన స్థానందగ్గరికి వచ్చిన మేక్బెత్ బాంకో ప్రేతరూపం తన ఆసనాన్ని ఆక్రమించుకొన్నట్లుగా విభ్రాంతిని పొందుతాడు. అప్పుడాతడు ప్రదర్శించిన భయావేశం అతిథులనందరినీ ఆశ్చర్య చకితులను చేస్తుంది.

మేక్బెత్ ప్రభ్వి తన భర్తను అటువంటి భావావేశాలను పొందటం యౌవనకాలం నుంచీ అలవాటని నచ్చజెప్పి, అతిథులను వెళ్ళిపోకుండా కూర్చోపెడుతుంది. మేక్బెత్ మనస్సును చిక్కబట్టుకొని ఒక ద్రాక్షాసవాన్ని అందరికీ ఇప్పిస్తున్న సమయంలో, బాంకో ప్రేతరూపం మళ్ళా అతనికి కన్పించి ఉద్విగ్నుణ్ణి చేస్తుంది. విందు యత్నమంతా భగ్నమౌతుంది. తరువాత మేక్బెత్ ప్రభ్వి మాక్డఫ్ వారివిందుకు రావటానికి

నిరాకరించనట్లుగా భర్తకు తెలియజేస్తుంది. మేక్బెత్ తన భవిష్యత్తును గురించి మాంత్రికురాండ్రతో మళ్ళా ఒకమారు మాటాడి, వారి సలహాను పొంది రావటానికి నిశ్చయిస్తాడు. (దృశ్యం 4).

ఒక క్షేత్రసీమలో తనకు తెలియజేయకుండానే మేక్బెత్‌తో స్వతంత్రంగా వ్యవహరించారని మంత్రగత్తెలను కోపించి, వారి విద్యాధిదేవత అయిన హెకేట్, తాను మేక్బెత్‌ను వినాశనం చెయ్యటానికి నిశ్చయించినట్లుగా తెలియజేసి, తన పథకాన్ని వారికి వివరిస్తుంది (దృశ్యం 5).

ఫోర్రెస్ సౌధంలో మేక్బెత్ ప్రవర్తన కొందరు ప్రభువులకు అనుమానాన్ని కల్పించింది. డంకన్‌ను, బాంకోను మేక్బెత్తే హత్య చేశాడని ప్రజలు గాఢంగా విశ్వసిస్తున్నట్లు, లెన్నాక్స్ మరొక ప్రభువుతో చేసిన సంభాషణ వల్ల తెలుస్తుంది. క్రూరవిద్రోహియైన మేక్బెత్ పాలననుంచి దేశాన్ని ఉద్ధరించటానికి, ఆంగ్లప్రభువు సహాయాన్ని అర్థించటంకోసం మాక్డఫ్ ఇంగ్లండు వెళ్ళినట్లు ఆ ప్రభువు లెన్నాక్స్‌కు తెలియజేస్తాడు. (విందు దృశ్యం 6).

## చతుర్థాంకం - ప్రతిచర్య

ఒక చీకటి గుహలో మాంత్రికురాండ్రు శక్తిమంతమైన ఒక 'కవచాన్ని' తయారుచేస్తుంటారు. వారివల్ల తన భవిష్యత్తును తెలుసుకోదలచిన మేక్బెత్ ప్రవేశించి, నాకు ముందేమి జరుగనున్నదో తెలుపవలసిందని ఆజ్ఞాపిస్తాడు. మంత్రగత్తెలు అతనికి మూడు ఛాయారూపాలను చూపించి తుదకు ధైర్యం చెప్పటం జరుగుతుంది. కనిపించిన మొదటి పిశాచరూపం 'మాక్డఫ్‌ను గురించి జాగ్రత్త' అనీ, రెండో పిశాచరూపం 'స్త్రీకి జన్మించినవాడికి నీవు భయపడ పనిలే'దనీ, మూడో పిశాచరూపం 'బిర్నాం మహారణ్యం డన్సినేన్ వరకూ కదలి వచ్చేదాకా నీవు విప్లవానికిగాని, యుద్ధానికిగాని భయపడవ'ద్దని మేక్బెత్‌కు తెలియజేస్తాయి. తరువాత అతడు బాంకో సంతానం ఎప్పటికైనా స్కాట్లండుకు రాజులౌతారేమో తెలియజేయవలసిందని శాసిస్తాడు.

అప్పుడు మంత్రగత్తెలు అతనికి బాంకో వంశపరంపరలోని ఎనిమిదిమంది రాజుల ఛాయారూపాలను చూపించి, అదృశ్యమైపోతారు.

ఆ దృశ్యాన్ని చూచిన తరువాత మేక్బెత్ క్రోధోన్మత్తుడై మంత్రగత్తెలను తిట్టిపోస్తాడు. ఇంతలో లెన్నాక్స్ వచ్చి, మాక్డఫ్ ఇంగ్లండుకు పారిపోయినట్లు మేక్బెత్‌కు నివేదిస్తాడు. మేక్బెత్ పట్టజాలని కసితో మాక్డఫ్ ప్రభ్విని, ఆమె సంతానాన్ని చంపివేయటానికి

నిశ్చయిస్తాడు. (ఇది పిశాచావాహన దృశ్యం 1) ఫైఫ్‌లో మాక్డఫ్ దుర్గం, ఒక వార్తాహరి ప్రవేశించి మాక్డఫ్ ప్రభ్వితో ఆమెకు ఆపద రానున్నది కనుక వెంటనే పారిపోవలసిందని విన్నవిస్తాడు. అంతలోనే హంతకులు ప్రవేశించి ఆమెను, ఆమె పుత్రుని వధిస్తారు (దృశ్యం 2).

ఆంగ్ల రాజసౌధమందు మాక్డఫ్ అంతకుపూర్వమే ఆంగ్లేయ ఆస్థానాన్ని చేరుకొన్న మాల్కోంను కలుసుకుంటాడు. మాల్కోం తొలుతగా మాక్డఫ్‌ను అనుమానించినా, అనతికాలంలోనే అతడు విశ్వాసపాత్రుడని నమ్మి, స్కాట్లండు దండయాత్రకు ప్రయత్నాలెంతవరకు కొనసాగింది అతనికి ఎరుక చేస్తాడు. ఇంతలో మాక్డఫ్‌కు తన భార్యను, బిడ్డలను మేక్బెత్ హత్య చేసినట్లు తెలుస్తుంది. అతడు మేక్బెత్ యెడ ప్రతీకారం చేసితీరుతానని ప్రతిజ్ఞ చేస్తాడు (దృశ్యం 3).

## పంచమాంకం - దుర్దశ

మేక్బెత్, మేక్బెత్ ప్రభ్వి బలిష్ఠమైన డన్‌సేన్ దుర్గంలో వసిస్తుంటారు. మేక్బెత్ ప్రభ్వికి చిత్తవైక్లబ్యం ఏర్పడి నిద్రావస్థలో, హత్యాసందర్భాన తాను భర్తకిచ్చిన తోడ్పాటును గురించి అసంబద్ధంగా ప్రలాపిస్తుంటుంది. అనుతాపానికి పాలైన ఆమె ఆరోగ్యం పరిపూర్ణంగా భగ్నమైపోయి ఉంటుంది (దృశ్యం 1).

డన్‌సేన్‌కు సమీపంలో ఉన్న ఒక గ్రామప్రాంతాన స్కాచ్‌సైన్యం వస్తున్న మాల్కోం సైన్యంతో చేరిపోవటానికి సిద్ధపడుతుంటుంది. సైనికులు, ప్రజలు ఒక్కొక్కరే మేక్బెత్ పక్షాన్ని విడిచిపెట్టి మాల్కోం పక్షంలో చేరటానికి వెళ్ళిపోతుంటారు. (దృశ్యం 2). అనుచరులందరూ తన్ను విడిచిపెట్టి పారిపోతూ శత్రుపక్షంలో చేరిపోతున్నారన్న వార్తలు మేక్బెత్‌ను చేరుతాయి. మంత్రగత్తెలు చెప్పిన జోస్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని ధైర్యం వహిస్తూ, తుదిదాకా డన్‌సేన్‌లో ఉండి, మేక్బెత్ దానిని, తన్ను రక్షించుకోటానికి నిర్ణయిస్తాడు (దృశ్యం 3).

బిర్నాం అరణ్యాన్ని చేరిన మాల్కోం శత్రువులు, తమ సంఖ్య ఎంతో తెలిసికొనటానికి వీలులేకుండా తన సైనికులతో తలా ఒక కొమ్మను విరిచి ముందు పెట్టుకొని నడవమని ఆజ్ఞాపిస్తాడు (దృశ్యం 4). డన్‌సేన్ దుర్గంలో మేక్బెత్ తన జెండాలను దుర్గంమీద ఎగురవేయవలసిందని శాసిస్తాడు. ఇంతలో అతని భార్య మరణించిందన్న వార్తను వింటాడు. ఒక వార్తాహరి వచ్చి బిర్నాం మహారణ్యం కదలి డన్‌సేన్ వంకకు వస్తున్నట్లు తెలియజేస్తాడు. ఈ వార్త మేక్బెత్‌ను విశేషంగా

కళవళపెడుతుంది. సైనికులను యుద్ధానికి సిద్ధపడవలసిందని శాసించి నిష్క్రమిస్తాడు. (దృశ్యం 5).

దండెత్తి వచ్చిన మాల్కొం సైన్యం డన్సనేన్ మైదానాన్ని చేరుకొంటుంది. అక్కడ సైనికులందరూ తమ చేతుల్లోని కొమ్మలను క్రింద పారేస్తారు. దుందుభిధ్వనులతో యుద్ధమారంభ మౌతుంది. (దృశ్యం 6).

డన్సనేన్ రణభూమిలో యుద్ధం సాగుతుంటుంది. మేక్బెత్ యువ సివర్డును చంపి, తనకు స్త్రీకి జన్మించినవాని చేతిలోని ఆయుధాలవల్ల ఎట్టి ప్రమాదం లేదని పరిహసించి, నిష్క్రమిస్తాడు. విశేషప్రతిఘటన లేకపోవటంవల్ల దుర్గం అనతికాలంలోనే మాల్కొంకు వశమౌతుంది. ఆయన అందులో ప్రవేశిస్తాడు. (దృశ్యం 7).

మాక్డఫ్, మేక్బెత్‌ను ఎదుర్కొని యుద్ధం చేయవలసిందని పిలుస్తాడు. మేక్బెత్ అతనితో తనది దివ్యశరీరమనీ, తాను స్త్రీకి జన్మించిన వాడికెవడికీ లొంగనని అంటాడు. సమాధానంగా మాక్డఫ్ తాను తల్లి గర్భాన సామాన్యరీతిని జన్మించలేదనీ, కనుక యుద్ధమైనా చేయవలసింది, లేకపోతే ఒక క్రూరజంతువులాగా అందరిముందూ ప్రదర్శించటానికి పనికివచ్చేటట్లు లొంగిపోవలసింది అని మేక్బెత్‌తో అంటాడు. అప్పుడు కోపాన్ని తెచ్చుకొని మేక్బెత్ పోరాడటానికి పైబడగా, మాక్డఫ్ అతణ్ణి హతమారుస్తాడు. విజయాన్ని చేకొన్న మాల్కొం పక్షంలోని వీరులందరూ యుద్ధభూమిలో సమావేశమై ఉండగా, మేక్బెత్ శిరస్సుతో మాక్డఫ్ ప్రవేశిస్తాడు. అందరూ మాల్కొంను స్కాట్లండుకు రాజువని ప్రకటిస్తారు (దృశ్యం 8).

## పాత్రలు – పురుషులు

## మేక్బెత్

మేక్బెత్ హృదయరహితుడు. అత్యాశాపరుడైన స్వార్థపరుడు. పశ్చాత్తాపరహితుడైన క్రూరవిద్రోహి. సర్వవిధదుష్కార్యాచరణానికి చాలినంత శారీరకపుష్టి కలవాడు. నైతికచైతన్యం విషయంలో ఆచారభయంచేత తొలుత హత్యావ్యవసాయానికి కొంతగా తట్టాడినా, అత్యాశ ఇచ్చిన దోహదం చేత తట్టుకొని అనన్యసామాన్యహంతకుడై, అసలీతనికి దయాంతఃకరణ లేశోశాన్నైనా ఉన్నవాడేనా అన్న శంకకు తావలమైనవాఁడు.

మహాకవి షేక్స్‌పియర్ మేక్బెత్‌ను కథాగమనాన్ని అనుసరించి పరిణమిస్తూ వచ్చిన పాత్రనుగా చిత్రించి, మానసికపరిశీలనకు మహోదాహరణంగా రూపించాడన్న

విమర్శకాభిప్రాయమొక టున్నది. మేక్బెత్ సహజంగానే దుష్టబుద్ధి, మూర్తీభవించిన క్రౌర్యం అన్న అభిప్రాయం కలిగినప్పుడు పునరాలోచనలో కాదేమో అనిపిస్తుంది. సహజంగానే అతడు క్రూరుడు, దుష్టబుద్ధి అయి ఉన్నట్లయితే మేక్బెత్ ప్రభ్వి అతణ్ణి గురించి "మీ ప్రకృతి దాక్షిణ్యక్షీరరసంతో పరిపూరితమైంది" అని అనటం ఎలా సంభవిస్తుంది? విప్లవాన్ని అణచివేసే సందర్భంలో అతడు ప్రదర్శించిన వీరగుణాలకు ముగ్ధులై, సాటియోధులు అతణ్ణి ఘనంగా మహోదాత్తుడని ప్రశంసించటం గూడా పొసగదు.

ప్రకృతితః మేక్బెత్ మంచికి గాని, చెడుగుకు గాని తీవ్రరూపం పరిణమించగల తీక్ష్ణచైతన్యం గలవాడనీ, స్థితిగతులనుబట్టి పరమక్రూరుడుగా పరివర్తన పొందాడనీ భావించవలసి ఉంటుంది. అంటే ఇతని ప్రకృతిలో తొలుతనే సద్గుణదుర్గుణాలు రెండూ బీజరూపంలో ఉండి, కాలక్రమాన దుర్గుణాలకు ప్రాబల్యం హెచ్చి దుర్గుణుడుగాను, తుదకు నీచుడుగాను తీర్చిదిద్దటం జరిగిందన్నమాట. నాటకారంభదశలో మేక్బెత్‌లో గోచరించే సద్గుణాలలో ప్రథమతః మనదృష్టినాకర్షించే గుణవిశేషం అతని సాహసం. యుద్ధభూమిలో అతడు మేక్డొనాల్డు, స్వెనోలతో పోరాడేటప్పుడు ప్రదర్శించిన వీరగుణవిశేషాన్ని స్వయంగా చూసివచ్చిన సార్జెంటు, "సాహసానికి సార్థకనాముడైన మేక్బెత్ అదృష్టాన్ని ధిక్కరించి పరాక్రమానికి ప్రియపుత్రుడో అన్నట్లు నిహతుల రక్తధారలతో పంకిలమైన నిస్త్రింశిక సహాయాన త్రోవ చేసుకొంటూ ఆ బానిసను ముఖాముఖిగా, ఎదుర్కొనేటంతవరకూ చొచ్చుకొనిపోయినాడు" అని వర్ణించాడు.

రాస్ అతణ్ణి 'బెల్లోనావరు'డని ప్రశంసించాడు. మేక్బెత్ వీరగుణానికి అతడే తన్ను గురించి చెప్పుకొంటూ "వీడు పురుషుడు అని అనిపించుకోటానికి ప్రమాణమెంతో అంతా చేసితీరుతాను" అన్న వాక్యాలు ఉపోద్బలకాలుగా కనిపిస్తున్నవి. అతని ప్రకృతి బాగా ఎరిగిన మేక్బెత్ ప్రభ్వి, మేక్బెత్‌ను గురించి అతడు దయాగుణవిశిష్టుడనీ, అందువల్లనే సన్నిహితమార్గంలో రాజ్యాన్ని సంపాదించటానికి అతడు అంగీకరించలేదని అన్నది. కానీ ఈ దయాగుణం అతడు మంత్రగత్తెలను కలుసుకున్న తరువాత పూర్తిగా లోపించటమే కాకుండా, అతనిలో ఉన్న దుష్టశక్తుల నన్నింటినీ బహిర్గతం చేసింది.

సాహసానికి తరువాత మనను విశేషంగా ఆకర్షించే మేక్బెత్ గుణవిశేషం అత్యాశ. ఈ అత్యాశవల్ల జనించిన దురూహలు బహుకాలం నుంచీ అతనిలో ఉన్నప్పటికీ "మేక్బెత్, భవిష్యన్మహారాజా!" అని మంత్రగత్తెలు అతడికి జయవెట్టినప్పటినుంచి అవి బయటపడటం ప్రారంభించాయి.

మంత్రగత్తెలు జయవెట్టినప్పుడు అతడు తొలుత చలించి బెదరటం ప్రారంభించాడు. దాన్నిగురించి బాంకో "ఇంతటి ప్రియమైన వార్త విన్నప్పుడు ఇలా బెదురుతున్నారేమిటి?" అని ప్రశ్నించినపుడు, అతని దుష్టచిత్తం ఒక్కమాటుగా తన రహస్యం బయటపడ్డదో అన్నట్లు చకితమైనదన్నమాట! డంకన్‌రాజు అతణ్ణి "కౌడర్ థేనును చేశా" దని విన్న తరువాత, మేక్బెత్ ఆశాపరత స్వేచ్ఛాసంచారం చేసింది. అతడి భావవీథిలో డంకన్ హత్యాకాంక్ష స్ఫురించి ఒకమారు భయపెట్టింది. అత్యాశాపరుడైన మేక్బెత్‌కు ఈ హత్యాకాంక్ష అప్పుడు కలిగింది కాదు. మేక్బెత్ ప్రభ్వి సంభాషణవల్ల (అం I దృ 7) అది ఎన్నడో కలిగినట్లు, భార్యాభర్తల మధ్య దానిని గూర్చి చర్చలు జరిగినట్లు అవగతమౌతున్నది.

డంకన్ రాజు తన కుమారుడైన మాల్కొంను కంబర్లాండు యువరాజుగా నియమించినప్పుడు, మేక్బెత్ ఆశాపరత్వానికి లక్ష్యమైన సింహాసన సంపాదనకు నిశ్చితసాధనమైన హత్య కంటిముందు పొడకట్టింది. "నేను సింహాసనాన్ని అధిరోహించే విషయంలో నా మార్గమధ్యాన ఒకమెట్టు ఏర్పడింది. నేను దీన్ని తట్టుకొనిపడవచ్చు లేదా దుమికి బయటపడవచ్చు. ఓ తారకల్లారా! మీ మీ తేజాలను తిరోహితాలు చెయ్యండి!! కలుషాలైన నా రహస్యాకాంక్షలను బయటపెట్టకండి!" అని మేక్బెత్ అనటం లక్ష్యసిద్ధికోసం అప్పుడే అతడు అమూల్యాలైన సర్వమూల్యాలను, సర్వనైతికసూత్రాలను పరిత్యజించాడని వ్యక్తం చేస్తున్నది.

డంకన్ హత్యకు తన అత్యాశ తప్ప అన్యమైన బలవత్తరకారణం ఏమీలేదని అతడికి బాగా తెలుసును. హత్యా నిర్ణయ విషయంలో అతడు కొంత ఆందోళనను, వ్యాకులపాటును ప్రదర్శించటం ధర్మభీతి వల్ల కాదు! మంచిచెడ్డల మధ్య మనస్సులో కలిగిన మథనవల్ల అంతకంటే కాదు. అదంతా బయటపడిపోతామేమోనన్న భయభావం వల్ల పడ్డ యాతన. ప్రథమాంకంలోని ఏడో దృశ్యంలో కనిపించే దీర్ఘమైన మేక్బెత్ స్వగతాన్నంతటినీ ఇందుకు ప్రధానోదాహరణగా గ్రహించవచ్చు. అందువల్లనే డౌడన్ మహాశయుడు "మేక్బెత్ తన్నొక బందవానిగను, నీచదోషిగను రూపొందించుకొనగల మంచితనాన్ని నిల్పుకొన్నాడేగాని, దోషంనుంచి దూరునిగా నిల్పగలిగినంత మంచితనాన్ని వహించలేకపోయినాడు" అని అనాడు.

మేక్బెత్ విశ్వాసఘాతుకుడు. ఈ గుణవిశేషం అతనికి తొలుత భీతిని కలిగించింది. డంకన్‌ను హత్యచేసే విషయంలో అతడు మొదట కలిగిన ఉద్దేశాన్ని మానివేయటానికి సగంవరకూ నిశ్చయం చేశాడు. కానీ అతడు తన భార్యను కలుసుకొన్న తరువాత,

ఆమె అతని లోపాలను ఎరిగింది కనుక అతణ్ణి శక్తిహీనుడవని, స్థిరనిశ్చయుడవు కావనీ, భీరువువనీ నిందించి లొంగదీసింది. అతనికి సమయం, స్థలం ఎంతో అనుకూలంగా ఉండటాన్ని నచ్చచెప్పి నమ్మించటంతో అతడు పడిపోయి విశ్వాసఘాతుక కృత్యానికి అంగీకరించాడు. అపార గౌరవాలతో తనను బహూకరించి, నమ్మి తన గృహానికి అతిథిగా విచ్చేసిన మహారాజును ఆత్మ బంధువులు, హత్య చేయటానికి నిశ్చయించి "నా మనసిప్పుడు కుదుటబడ్డది. నేనిక నా సర్వావయవాలను ఈ దారుణచర్యకనుకూలంగా దిద్దుకొంటాను. ఆనందాభినయంతో కాలాన్ని హసించి మోసగిద్దాం. క్రూరహృదయం భావించే ఘోరచర్యలను మోసకారియైన ముఖం మరుగుపరచవలసిఉంది" అని అంటాడు.

విశ్వాసఘాతుకుడై డంకన్‌ను హత్యచేసి, రాజ్యాపహరణంవల్ల తన అత్యాశాఫలమైన సార్వభౌమత్వాన్ని సంపాదించిననాటినుంచీ, మేక్బెత్ శీలం పరివర్తన పొందటం ఆరంభించింది. ఆ స్థితిలో అతని హృదయంలో మంచిచెడుల మధ్య సంఘర్షణ లేదు. బయటపడిపోతానేమో అన్న భయంవల్ల కలిగే జంకు పొడచూపటం మానివేసింది. భార్యయైన మేక్బెత్ ప్రభ్వి కఠిన వాక్యాలతో పదేపదిగా ఉద్బోధించవలసిన అవసరం తప్పింది. రక్తదాహం అయినప్పుడల్లా, ఊహాపోహలమధ్య ఉగ్రూతలూగ కుండానే స్థిరశక్తితో నిర్ణయాలను చేసి నిర్వర్తించాడు. బాంకో హత్యగాని, మాక్డఫ్ కుటుంబహత్యగాని అతనికి అణుమాత్రమైన సంశయాన్ని కూడా కల్పింపలేదు. పరమదౌష్ట్యంవల్ల బండబారిన వ్యక్తిలా ప్రవర్తించాడు. రక్తపాతం అతని జీవితానికి ఒక రక్ష అయినట్లు, ఒక వ్యసనమైనట్లు, తీవ్రవిదాహంతో అతడు ఆటవికమైన హత్యాకాండను కొనసాగించాడు. నిరాశను కవచంగా చేసుకొని సమస్తం ఛాయాస్వరూపం, అసత్యమని అతడు వింత సిద్ధాంతాన్ని ప్రతిపాదించనారంభించాడు. అతడు ఎంత చేసినా మనకు అతని యెడ ఒక దయ ఎందుకో ఉండనే ఉంటున్నది. ఇది బహుశా జన్మతః సైనికుడై అతడు తొలుత ప్రదర్శించి సాహసగుణం వల్లనై ఉంటుంది. మోసగింపబడ్డ అతడు పశ్చాత్తాపాన్ని గాని ప్రకటింపకుండా సర్వాన్నీ ఎదుర్కొంటున్నప్పుడు, అతని సాహసం మనను ఆకర్షిస్తున్నది. సాహసి. సమరయోధుడు, రాజుకు సన్నిహితబంధువు, సదవకాశాలెన్నో కలవాడు అయిన ఈ మేక్బెత్ సక్రమంగా జీవించివుంటే, సకలశ్రేష్ఠుడన్న ప్రపంచవిఖ్యాతి గడించేవాడు. నైతికచిత్తస్థైర్యం లేకపోవటంవల్ల అత్యాశ విజృంభించి అతణ్ణి అధఃపతితుని చేసింది.

మేక్బెత్ గొప్ప భావుకుడు. అతని భావుకత నాటకంలో సర్వేసర్వత్ర గోచరిస్తుంది. డంకన్ హత్యకు పూర్వం రక్తచిహ్నితమైన ఛురిక కన్పించటం, హత్యానంతరం కొన్ని కంఠాలు వినిపించటం, బాంకో ప్రేతమూర్తిని విందువేళ అతడొక్కడే చూడటం మొదలైనవన్నీ ఇందుకు నిదర్శనాలు. మేక్బెత్ భావుకతలో సుస్పష్టత, తీవ్రత రెండూ ఉన్నవి. ఈ రెండు గుణాలవల్ల అతని భావుకత అతడికి మానవాతీతశక్తులతో సంబంధాన్ని కల్పించింది. అతని బలానికి గాని, భయానికిగాని ఈ భావుకతే మూలశక్తి అయింది. ఈ భావుకతే మేక్బెత్‌ను హృదయంలో క్రూరహంతకుడైన బుద్ధిలో కవి అని అనేటట్లు చేసింది.

### బాంకో

బాంకో మేక్బెత్‌కు భిన్నమైన ప్రకృతి గల పాత్ర. అతనివలె మహాయోధుడు. విప్లవాన్ని అణచటంలో అతడితో తుల్యంగా కృషి చేసినవాడు. ఆశాపరుడే. అయినా ఉదాత్తప్రకృతి గలవాడు. సత్యసంధుడైన ఇతణ్ణి మంత్రగత్తెల మాటలు రాజవిద్రోహబుద్ధిని కల్పించి మోసగించపోయినవి. అత్యాశాపరత్వం వల్ల మేక్బెత్ మంత్రగత్తెల మాటలు విన్న మరుక్షణంలోనే విద్రోహభావాలకు జన్మభూమి అయిపోయి విపరీతోద్రేకాన్ని పొందినప్పుడు, బాంకో పరిపూర్ణమైన స్థిరచిత్తంతో వర్తించాడు.

"నేను మీ ఆదరాన్ని అర్థించేవాణ్ణి కాను మీరు అసహ్యించుకుంటే అంతకంటే జంకేవాణ్ణి కాను" అని పలికి మంత్రగత్తెలను తనతో మాటాడవలసిందిగా శాసించాడు. మంత్రగత్తెల మాటలు మేక్బెత్‌ను ఎంతగా తారుమారు చేశాయో గమనించి, "ప్రబలమైన ఆపదలను కల్పించబోయేముందు ప్రధానాంశాలలో మనను మోసగించటంకోసం, కొంత విశ్వాసం కుదరటానికని సైతానుకు ప్రతినిధులైన యీ మంత్రగత్తెలు స్వల్పవిషయాల వల్ల సత్యం చెప్పటం తరచుగా జరుగుతుంటుంది" అని దురాశ గాని, దురాలోచనలు గాని కలిగి ఉంటే, తొలగించుకోటం మంచిదని బాంకో మేక్బెత్‌కు సూచించాడు. ఈతడు ఆద్యంతాలు ఒకేరీతిగా తన ఉదాత్తప్రకృతిని ప్రదర్శించాడు. ఈతని ఉదాత్తప్రకృతిలోని 'రాజసం' తనను కేవలం కౌగిలించుకొని తన సహచరుడైన మేక్బెత్‌కు బిరుదు అధికారాన్ని ఇచ్చినప్పుడు, ఎట్టి ఈర్ష్యాసూయలను వహించకుండా సహించి, రాజు యెడ, మేక్బెత్ ఎడ ఉదారంగా ప్రవర్తించటంలో విశేషంగా వ్యక్తమౌతున్నది. ఈ సందర్భంలో లోలోపల ఇతని ప్రకృతిని గురించి మేక్బెత్ ఈర్ష్య వహిస్తున్నప్పుడు, ఈ బాంకో మేక్బెత్‌ను గురించి రాజుతో గొప్పగా చెప్పటం గొప్ప విషయం. మంత్రగత్తెలు 'నీవు ఒక రాజవంశపరంపరకు మూలకర్త వౌతా" వన్నప్పుడు

ఆశ కలిగినా వారిజోస్యాన్ని అతడు గాఢంగా పట్టించుకోకపోవటంవల్ల, అది ఈతని దృష్టిని తాత్కాలికంగా ఆకర్షించటం తప్ప మరేమీ చేయలేకపోయిందని స్పష్టమౌతున్నది. ఆశ కలవాడే అయినా బాంకో వశీకృతచిత్తుడు. అన్ని ప్రలోభాలను సంయమనంతో ఎదుర్కొన్నాడు. పాపపుటూహలు కలగకుండా ఉండటానికని ఇతడు నిద్రతో గూడా పోరాడవలసివచ్చింది. "సీసంలా బరువైన నిద్ర నన్నాహ్వానిస్తున్నది. కానీ నాకు నిద్రపోవాలని లేదు. నిద్రావేళ కలల్లో కూడా దయాన్వితాలైన దివ్యశక్తులు పాపపుటూహలనుంచీ నన్ను దూరం చేయుగాక!" అని ఇతడు మనఃపూర్వకంగా వాంఛించటం ఈతని సత్యసంధతకు చక్కని నిదర్శనం. మేక్బెత్ కూడా ఇతణ్ణి ప్రలోభపెట్టటానికి "నేను రూపొందించుకొన్న పథకానికి కార్యరూపాన్ని కల్పించటంలో నీవు సాయపడితే ఆ చర్య నీకు గౌరవాన్ని తెచ్చిపెట్టేటట్లు నేను చూస్తాను" అన్నాడు.

అప్పుడు బాంకో "అయితే నేను దోషరహితమైన చిత్తం కలవాణ్ణి. నా రాజభక్తి అమలినమైంది. అధికగౌరవాన్ని అన్వేషించటంలో ఉన్నదాన్ని పోగొట్టుకోకుండా ఉండేటట్లయితే, నేను మీకు తప్పక తోడ్పడుతాను" అని చెప్పటంలో హృదయస్వచ్ఛతతో పాటు పరేంగితజ్ఞత గూడా వ్యక్తమౌతున్నది. మేక్బెత్ రాజును హత్య చేసిన తరువాత, బాంకో మేక్బెత్‌ను అనుమానించాడు. కానీ మాల్కొండొనాల్బెయిను, పారిపోయినా తాను దేశంలోనే ఉన్నాడు. క్రొత్తరాజైన మేక్బెత్‌కు తన భక్తివిశ్వాసాలను ప్రకటించటంలో వ్యతిరేకతను చూపలేదు. అయితే చేష్టల్లో, మాటల్లో అతిజాగరూకతను వహిస్తూ వచ్చాడు. కానీ ఇతడు తన శరీర రక్షణ విషయంలో ఆలోచన చేసి ఒక నిశ్చయానికి శ్రద్ధవహించకపోవటం ఇతని ప్రధానదోషం. దీన్ని 'అకర్మ' అనవచ్చు. ఇటువంటి అకర్మవల్లను, రాజభక్తి ప్రదర్శన వల్లనే మేక్బెత్‌కు నమ్మకం కల్పించి అతణ్ణి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించనిస్తే, తన వంశరాజపరంపర రావటానికి అవకాశం కల్పించినవాడి నౌతానన్న అభిప్రాయంతో, బాంకో ఇట్టి ప్రవర్తనను ప్రదర్శించాడా? 'అయితే ఆ కిరీటం నీ వంశంలో నిలువదనీ, నేను అనేకరాజులకు మూలపురుషు డనౌతాననీ వారు జోస్యం చెప్పారు. నీ విషయంలో వారి జోస్యాలు చిత్రరీతిన నిరూపితాలైనాయి. నా విషయంలోకూడా ఎందుకు సత్యాలు కాకూడదు?' (అం I దృI) అన్న బాంకో మాటలవల్ల, తాను రాజపరంపరకు మూలకర్తనౌతానన్న ఆశమాత్రముండదని వ్యక్తమౌతున్నది.

ముందు రానున్న ప్రయోజనం కోసం ఇతఁడు మేక్బెత్ కత్తిని ఎదుర్కోటానికి పూనుకొని ఉండకపోవచ్చు. అయితే ఈ 'అకర్మ', 'అశ్రద్ధ'లే బాంకో అంతానికి

దారితీశాయి. "ఇలాగే నీ విషయంలో వారి వచనాలు నిరూపితసత్యాలై భాసించినట్లు నా విషయంలో కూడా ఎందుకు సత్యాలు కాకూడదు? అవి నాకెందుకు ఆశలు కల్పించకూడదు?" (అం I దృ1) ఇత్యాది వాక్యాలవల్ల మేక్బెత్‌ను బాంకో సమయం చూసి హత్య చేయటానికి ఉద్దేశించాడనీ, అందువల్ల మానసికంగా అతడు దోషి అనీ, ఆ దోషానికే మృత్యువు పాలవటమనే శిక్షను అనుభవించవలసి వచ్చిందనీ ఒక అభిప్రాయం ఉంది. మంత్రగత్తెల జోస్యాలకు పరిపూర్తిని కల్పించటంకోసం మహాపురుషుడైన మహారాజును మేక్బెత్ హత్య చేశాడా అన్న క్రోధం వల్ల, ఒకవేళ తాత్కాలికంగా మేక్బెత్‌ను నేను హత్య చేస్తేనో అన్న భావం తోచినా, సంయమనశక్తి గల బాంకో, పునరాలోచనలో సర్దుకోగలిగినవాడు. మేక్బెత్‌కు భిన్నప్రకృతిగా బాంకోను సృష్టించదలచుకొన్న షేక్స్‌పియర్ భవిష్యత్తులో హత్య చేయనుద్దేశించి కాలంకోసం కనిపెట్టుకొన్న ఒక హంతకుణ్ణిబాంకో పాత్రమూలంగా ప్రదర్శించటం ఉద్దేశం కూడా కాదు.

## మాక్డఫ్

తొలి దృశ్యాలలో మాక్డఫ్‌కు విశేషప్రాముఖ్యం లేదు. బాంకోవధకు తరువాత కథలో ఇతనికి ప్రముఖస్థానం లభ్యమైంది. వివేచనజ్ఞానం, దూరదృష్టి, విస్పష్టదర్శనం కలవాఁడు. సత్యసంధుఁడు, దేశభక్తుడు, రాజభక్తుడు, ప్రేమపూరితహృదయుడు, ఉదాత్తుడు. ఈతని నైతికాధిక్యాన్ని గమనించి మేక్బెత్ భయపడటం, అసహ్యించుకోవటం ఇతని గొప్పదనానికి నిదర్శనాలు.

డంకన్ రాజు శరీరం ఇతని దృష్టిలో పవిత్రీకృతమైన ఆలయం, ఆయన హత్యాదృశ్యం ఇతడికి కొంగ్రొత్త గార్గన్ చేసిన చర్యలా తోచింది. మొదట ఇతడు, డంకన్ రాజుపుత్రులైన మాల్కొం, డోనాల్బెయిన్‌లే పరిచారికులను ప్రేరేపించి యీ పని చేయించి వుంటారని నమ్మాడు. (అంII దృ2). స్వేచ్ఛగా జంకులేకుండా ఆయభిప్రాయాన్ని వెల్లడించాడు. తరువాత ఇతని అనుమానం మేక్బెత్ అనంతరచేష్టల వల్ల అతనిమీదికి తిరిగింది. సత్యం అర్థమైపోయిన తరువాత, ఆ క్రూరనిరంకుశుని పాలనలోనుంచి దేశాన్ని ఉద్ధరించాలన్న ఉద్వేగం కలిగింది. ఆవేశంతో భార్యాపుత్రుల స్థితి ఏమౌతుందోనని ఊహించకుండానే ఆంగ్లదేశానికి వెళ్ళి, ప్రభుపుత్రుడైన మాల్కొంను కలుసుకొన్నాడు ఇంతకుపూర్వమే మేక్బెత్ ద్రోహి అని విశ్వసించిన తరువాత, అతని కిరీటధారణోత్సవానికి వెళ్ళటం మానివేశాడు. వచ్చి కలుసుకోవలసిందని 'క్రొత్తరాజు' వార్త పంపించినా ధైర్యసాహసాలు గల ఇతడు వెళ్లటం మానివేశాడు.

మాక్డఫ్ ప్రభువు ఏ పని చేసినా ఉద్రేకంతో, తొందరపాటుతో చేస్తుంటాడు. అంతవరకూ అతిజాగరూకతతో ఉన్నవాడు, హఠాత్తుగా తరువాత తన కుటుంబపరిస్థితి ఏమౌతుందో ఆలోచించుకోకుండా ఆంగ్లదేశానికి పారిపోవటం అటువంటి చర్యల్లో ప్రముఖమైంది. కొందరు దీనికి అతని పిరికితనం కారణమన్నారు. కానీ కథాగమనంలోని ఈతని చర్యలను పరికిస్తే ఇతడు పిరికివాడని అనటానికి అవకాశం లేదు. ఈ సమయంలోని ఈతని ప్రవర్తన ఇతని భార్యకే అర్థం కాలేదు. ఆమెకు ఉన్మాదకృత్యంగా తోచింది. "భార్యాబిడ్డలను, సౌధాలను, ఇతరాలైన ఆస్తిపాస్తులను ఎక్కడనుంచి తాము పారిపోతున్నారో ఆ ప్రదేశంలోనే విడిచిపుచ్చటం వివేకంతో చేసిన పనా? వారికి మేమంటే ప్రేమ లేదు. ఇదంతా వారికోసమైన భయమేగాని, ఇతరుల కోసమైన ప్రేమ మాత్రం కాదు" (అంIV దృI) అని అనుకొన్నది. మాక్డఫ్ ఆంగ్లదేశానికి పారిపోవటం అతిశయమైన రాజభక్తితోను, దేశభక్తితోను చేసిన పని. దేశంనుంచి వెంటనే వెళ్ళిపోతేగాని తనకు, దేశానికి క్షేమంలేదని ఇతనికి సద్య స్ఫురణగా తోచింది. భార్యాపుత్రులను వెంట తీసుకొనిపోయే అవకాశం అందువల్ల లేకపోయింది. మాల్కొంను కలుసుకున్నపుడు అతడు ఇతణ్ణి శత్రువునకు గూఢచారి అన్నభావంతో పరీక్ష ప్రారంభించాడు. ఇతడు ఉద్వేగంతో నైతికోన్నతిని, నిష్కాపట్యాన్ని ప్రదర్శించి అతని పరీక్షలకు తట్టుకొన్నాడు.

మహారాజుల కుండవలసిన సద్గుణాలు తనకు లేవనీ, తాను మూర్తీభవించిన ఈర్ష్యాకామక్రోధాలేనని మాల్కొం చెప్పినపుడు, ఈ మాక్డఫ్ మహోదారశోకవివశత్వంతో "రక్తంలో మునిగితేలుతున్న రాజదండంతో, సింహాసనాన్ని కాజేసిన ఒక క్రూరనిరంకుశ రాజ్యాపహర్త పరిపాలనకు లోనైన ఓ నా దేశమా! నీవెంతటి దీనావస్థ ననుభవిస్తున్నావు! సత్యమైన నీ రాజవంశంలోని వారసుడు తనయెడ తానే దోషారోపణం చేసుకొని తనరాజవంశాన్ని నిందిస్తున్నాడు" మొదలైన వాక్యాలతో ఇతడు మాల్కొం హృదయాన్ని ఆకర్షించి, అతణ్ణి అనుమాన రహితుణ్ణి చేయడం ఉద్వేగపూరితమైన సంభాషణవిరచనానికి ఉత్తమమైన ఉదాహరణలలో ఒకటి. మాల్కొం దేశోద్ధరణకు పూనుకుంటానని మాట ఇచ్చినపుడు పట్టరాని సంతోషం కలిగి ఇతడు మూకత వహించాడు. కారణమేమని ప్రశ్నిస్తే "ప్రియాలు అప్రియాలు అయిన అంశాలు ఏకకాలంలో ఇలా వచ్చినపుడు, ఎలా సమన్వయించుకోవాలో నాకు తెలియటంలేదని సంతోషపరవశత్వంతో పలికాడు. ఈ సంతోషం బహుకాలం నిలువకుండానే, ఇతడు రాస్‌వల్ల తన భార్యాపుత్రుల వధను గురించి వినవలసి వచ్చింది. తన లోపం వల్ల

వారు దారుణహత్యాకాండకు పాల్పడ్డందుకు ఇతడు ఎంతగానో దుఃఖించాడు. 'పరమేశ్వరుడు వారికి శాంతిని ప్రసాదించుగాక!' అని ప్రార్థించాడు. ఇది మాక్డఫ్ ప్రభువు ప్రేమహృదయాన్ని వ్యక్తం చేస్తున్నది. 'స్కాట్లండు దేశానికి పిశాచమై పట్టుకున్న ద్రోహి ఐన మేక్బెత్‌ను యుద్ధభూమిలో తనకు ముఖాముఖిగా నిలిచేటట్లు చెయ్యి' మని భగవంతుణ్ణి ప్రార్తించాడు. "తప్పించుకొంటే అతణ్ణి నేను క్షమిస్తా" నని ఔదార్యంతో పలికాడు. ఇతఁడు యుద్ధభూమిలో మేక్బెత్‌తో 'నేను కార్యప్రధానుడను గాని వాక్య ప్రధానుడనుకా' నన్నాడు. అల్పవాక్యాలను పలికినా అతిశక్తిమంతంగా పలుకగలవాఁడు. సామాన్యంగా కొలదిగా మాటాడినా ఉద్వేగం వచ్చినపుడు పొంగులువారి ప్రసంగించగలడు. మాల్కొం తిరస్కరించినపుడు, రాస్‌వల్ల భార్యాపుత్రుల వధనుగూర్చి విన్నపుడు ఇతడు ఇటువంటి సంభాషణలు చేశాడు. ఒక ఉద్బోధకముంటే గాని ఇతడు తీవ్రకార్యాచరణకు పూనుకొనే స్వభావం కలవాడు కాదు గనుక, మహాకవి షేక్స్‌పియర్ ఇతని కుటుంబవధతో దాన్ని కల్పించాడు. ఇతడు బాంకో వలె సమయానికి తగ్గట్లు కట్టుబడిపోయేవాడు కాదు. కాలాన్ని ఎదుర్కొని కాపట్యం లేని చిత్తంతో మంచిత్రోవను పెట్టటానికి, ఎట్టి కష్టాన్నైనా భరించి పోరాడగల వీరోదారుడు. మేక్బెత్ వలె కార్యప్రధానుడు. కానీ మరిన్ని మాటలు పలకడు. మంచిమార్గం తప్పడు.

## మేక్బెత్ ప్రభ్వి

మేక్బెత్ ప్రభ్వి షేక్స్‌పియర్ మహాకవి సృష్టించిన స్త్రీ ప్రపంచమంతటితో తన అత్యాశాపరత్వం, కాపట్యం, క్రౌర్యం ఇత్యాదిగుణవిశేషాలతో ఒక విశిష్టస్థానాన్ని గడించుకొన్న వ్యక్తి. అయితే ఈమె స్త్రీప్రకృతులు పరిపూర్ణంగా లోపించిన వ్యక్తి కాదు. కాని వాటినీమె తన కాంక్షాబలంతో కట్టిపడవేసింది. తన దృష్ట్యా ఈమె పత్నిగా అత్యుత్తమురాలు. పరిపూర్ణురాలు. భర్త నతిగాఢంగా ప్రేమించింది. అతణ్ణి గౌరవించింది. స్వార్థరాహిత్యంతో అతనికోసం జీవించింది. ఆమె ఆశాపరత్వం సర్వం అతనికోసమే. అతని మూలంగానే తన ఉన్నతిని ఆశించింది.

వస్తుతః మేక్బెత్ ప్రభ్వి భర్తకంటే అతిశయమైన ఇచ్ఛాబలం కలది. భర్త అయిన మేక్బెత్ అనుమానాలకు లోనై, తన శక్తిసామర్థ్యాలమీద గాఢవిశ్వాసం లేని స్థితిలో, ఈమె చిత్తస్తిమితతను ప్రదర్శించింది. మంత్రగత్తెలతో సమావేశమైన తరువాత భర్త తిరిగివచ్చి తన్ను కలుసుకొని ప్రసంగించటానికి పూర్వమే, లేఖను చదివిన వెంటనే ఈమె డంకన్ హత్యోద్యోగాన్ని ఊహించి సంసిద్ధురాలై ఉంది. ఈ అంశాన్ని మేక్బెత్ లీలగానైనా పసిగట్టలేకపోయినాఁడు.

భర్త పంపించిన లేఖను చదివిన వెంటనే "మీరు ఇప్పటికే గ్లామిస్‌కు థేనులైనారు! కౌడర్‌కు థేనులైనారు. మంత్రగత్తెలు జోస్యం చెప్పినట్లు ముమ్ముందు మహారాజులు కూడా ఐతీరుతారు" అన్న వాక్యాలు తన ఈమె మనోనిశ్చయదృఢిమ ఎంతటి గాఢమైందో వ్యక్తం చేస్తున్నవి. మేక్బెత్ ప్రభ్వికి శక్తి యెంతో తెలుసును. ఆ శక్తిమీద ఆమెకు అధికవిశ్వాసముంది. భర్త దుర్బలచిత్తం మీద తన కెంతటి ప్రభావం ఉందో కూడా ఆమెకు తెలుసు.

"మీ శ్రవణేంద్రియాలను నిరంతరం ఉత్సాహంతో నింపివేస్తూ, వీరోచిత వాక్ప్రసంగాలతో దైవానుగ్రహం, అదృష్టశక్తులూ నిర్ణయించి యిచ్చిన స్వర్ణకిరీటానికీ, మీకూ మధ్య ఆటంకంగా నిలుస్తున్న మీ ప్రకృతిలోని వెనకాడటమనే గుణాన్ని వెంటబడి తరిమి వేస్తాను!" అన్న వాక్యాలిందుకు నిదర్శనాలు.

"మానవులమనోభావాలను వెన్నంటి ఉండే ఓ అదృష్టశక్తుల్లారా! రండి! నాలోని స్త్రీత్వాన్ని తొలగించండి!" అన్న వాక్యాలు మేక్బెత్‌ను తొలిసారిగా ఆహ్వానిస్తూ పలికిన "ఘనుడా! గ్లామిస్ యోగ్యుడా కౌడర్!! అనతికాలంలో మీకబ్బనున్న బిరుదంతో మిమ్మల్ని ఆహ్వానించటానికి అంగీకరించండి" అన్న వాక్యాలు, ఈమె మేక్బెత్ రాకకు పూర్వమే డంకన్ హత్యాపథకాన్ని ఊహించి చిత్తంలో స్థిరం చేసుకొన్నట్లు ద్యోతకం చేస్తున్నవి.

తాను సూచించిన మార్గాన్ని గురించి అనుమానిస్తూ తట్టాడుతున్నప్పుడు, రెండో పర్యాయం మేక్బెత్‌తో ప్రసంగించిన సందర్భంలో "మనకపజయమా? స్థిరనిశ్చయం కలగటానికి మీరు ధైర్యాన్ని చిక్కబడితే చాలు" అని అన్నమాట, యీ మేక్బెత్ ప్రభ్వి అమోఘ స్థిరసంకల్పానికి తార్కాణం. భర్తమీద ఈమె ప్రభావం ఎంత విస్తారమో "భీతచిత్తవుగాని నీ గర్భం మగబిడ్డలను తప్ప మోయలేదు. నీవు పురుషసంతానం మాత్రమే పుట్టదగ్గ తల్లివి" అని మేక్బెత్ అన్న మాటలవల్ల తెలుస్తున్నది.

"మిగిలిన వ్యవహారపర్వం నాకు విడిచిపెట్టండి" అని అనటంలో, ఏ భారాన్ని వహిస్తానని భర్తకు మాట యిస్తున్నదో ఈమెకు బాగా తెలుసు. వంచనాశక్తితో డంకన్ హత్య అనే తానల్లిన పథకాన్ని, తాను తమమీద అనుమానం కలగకుండా నిర్వర్తింపగలనని ఆమెకు గట్టి నమ్మకం. ఒకవంక హత్యోద్యోగానికి సంసిద్ధురాలై, మరోవంక మనోహరకంఠంతో డంకన్‌ను అతిథిగా ఆహ్వానించే సందర్భంలో పలికిన స్వాగతవాక్యాలు ఈమె వంచనాశక్తికి ప్రబలనిదర్శనాలు.

ఈమె మనఃస్తిమితత నిరుపమానమైంది. హత్యానంతరం భీతచిత్తుడైన భర్త తన దగ్గిరికి వచ్చినపుడు ఆమె అణుమాత్రమైనా చలించకపోవడమే కాకుండా, అతని భయకంపాన్ని సమయోచిత సంభాషణతో త్రోసిపుచ్చటం ఇందుకు చక్కని తార్కాణం. పరిచారకుల ముఖాలను రక్తంతో పులయటం మరిచిపోయి హత్యానంతరం ఛురికలతో తిరిగివచ్చిన భర్తను మళ్ళీ వెళ్ళి ఆ క్రియాభాగాన్ని పూర్తిచేసిరమ్మని ఆజ్ఞాపించినపుడు, అతడు నిరాకరిస్తే, ధైర్యశాంతి నిలయమై "మీ రెంతటి దుర్బలచిత్తులు! ఆ ఛురికలనిలా ఇవ్వండి. నిద్రితులు, మృతులు కేవలం చిత్రరూపాలు. వారిని గురించి ఇంతటి భయమేమిటి?" అని భర్త శక్తిహీనతకు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ, తాను వెళ్ళి ఆ పని నిర్వర్తించి వచ్చింది. తిరిగి వచ్చినపుడు స్వశక్తిని గురించి గాఢవిశ్వాసంతో ప్రసంగించింది. అవతల ద్వారం దగ్గిర శబ్దం వినిపిస్తున్నప్పుడు అణుమాత్రమైనా చిత్తచాంచల్యాన్నిగాని, భయకంపాన్ని గాని ప్రదర్శించక, శయ్యాగృహానికి వెళ్ళమని సలహా చెప్పింది.

భర్త దుర్బలత్వాన్ని తెలుసుకొన్నది కనుక, అతనికోసం తేజోవంతురాలైన ఈ మేక్బెత్ ప్రభ్వి పురుషపాత్రను నిర్వహించటానికి పూనుకొన్నది. స్వయంగా ఈమే హత్యాపథకాన్ని నిర్మించింది. పరిచారకులకు మత్తు పెట్టింది. ఛురికలను సిద్ధం చేసింది. హత్యాకృత్యాన్ని కూడా తానే నిర్వహించి ఉండేదిగాని, ఆ డంకన్ రాజు మరణించిన తన తండ్రిలా కనిపించాడు. అందువల్ల తాత్కాలికంగా కొంతసేపు ఆగవలసివచ్చింది. ఇది ఈమెకు తండ్రియెడగల అను రాగానికి నిదర్శనం. భార్యగా ఆమె మేక్బెత్ క్షేమాన్ని, శ్రేయాన్ని శ్రద్ధతో సేవించింది. ఈమె అత్యాశ అంతా అతనికోసమే. "దేనిని పరిపూర్తిచేయటంవల్ల మన కీ దేశం మీద తదనంతరజీవిత కాలమంతా యాజమాన్య సార్వభౌమాధికారాలు దక్కుతాయో ఆ అతిప్రధానమైన వ్యవహారాన్ని నా అధీనం చెయ్యండి" (అం I. దృ5) అన్న వాక్యంలో లీలగా కన్పించే కించిత్తు స్వార్థం తప్ప ఆమె సర్వయత్నమూ భర్త అయిన మేక్బెత్ కోసమే.

మేక్బెత్ ప్రభ్వికి సంతానం కలిగారు. కాని ఎవరూ నేడు జీవించిలేదు. అయితే ఈమె "ఈ కార్యనిర్వహణవిషయంలో నేను మీవలె ప్రతిజ్ఞ చేసి వున్నట్లయితే, ఇది తల్లినై స్తన్యపానం చేస్తున్న పసిపాపను ప్రేమించటమంటే ఏమిటో తెలుసుకొన్న తరువాత..." అన్న వాక్యంవల్ల ఈమె మాతృహృదయం ఎటువంటిదో వ్యక్తమౌతున్నది.

డంకన్ హత్య జరిగిపోయిన తొలిదశలో ఈమె ప్రశాంతతతో నిశ్చలంగా వర్తించింది. తొలుత దుర్బలుడైన మేక్బెత్ క్రమంగా ధైర్యాన్ని చిక్కబట్టుకొని,

మంచిచెడ్డలతో పెట్టుకోకుండా ముందుకు సాగిపోవటం ప్రారంభించాడు. అనుకొన్న ప్రయోజనాలు సిద్ధించకపోవటం అట్లుండగా, భర్తకు కష్టాలు వచ్చిపడి దేశం వినాశనం పాలు గావటంతో, మేక్బెత్ ప్రభ్వి చిత్తస్తిమితత సడలిపోనారంభించింది. ఈమెకు భర్తను అనుసరిస్తూ మానసికోద్రేకాలకు తట్టుకొని నిల్వటానికి శక్తి చాలకపోయింది. అనుకోకుండా వచ్చిపడ్డ బాధలకు ఈమె ఉక్కుగుండె కరిగిపోనారంభించింది. అయినా బాధను అనుభవించే స్థితిలో కూడా, ఈమె కార్యాచరణవేళ ఎట్టి మనోద్రఢిమను ప్రదర్శించిందో దాన్ని వ్యక్తం చేస్తూనే వచ్చింది. నిరంతరం మానసికోద్రేకాలకు నిలయమైపోవడం వల్ల తుదకీ మేక్బెత్ ప్రభ్వి తట్టుకోలేక, భీతచిత్తంలోని రహస్యాలను తెలియకుండానే బయటపెట్టడం ప్రారంభించింది. అసహజమైన ఆమె వంచనాశక్తి నిద్రాగమనవేళ ఆమెను మోసిగించి దంకన్ హత్యారహస్యాలను మాటిమాటికీ వెలిబుచ్చుతూ వచ్చింది. ఒకప్పుడు కొద్దినీటితో తన హత్యాదోషానికి చిహ్నమైన రక్తాన్ని కడిగివేసుకోవచ్చు ననుకొన్న ఈమె, కాలక్రమాన ఆ మచ్చను కడిగివేసుకోలేననీ, దాని వాసన వీడిపోదనీ నిర్ణయించుకున్నది. ఆత్మహత్యతో జీవితాన్ని అంతమొందించుకొని అనంతంగాను అతిశయంగాను, బాధపెట్టే మనోవేదనను అంత మొందించుకొన్నది.

"నాలోని స్త్రీత్వాన్ని తొలగించండి. నఖశిఖపర్యంతం నన్ను నిర్భరక్రౌర్యంతో నింపివేయండి" అని అదృష్టశక్తులకు ప్రార్థించి, భర్తను హత్యోద్యోగానికి ఉద్బోధించి ప్రేరకురాలై వర్తించిన ఈ మేక్బెత్ ప్రభ్వి, మొదటినుంచీ స్త్రీగానే ఉండిపోయింది. మానవత్వం ఈమెను వీడలేదు. తన స్త్రీత్వాన్ని తొలగించమని అదృష్టశక్తులను ఆర్థించడమే ఈమె స్త్రీసహజమైన దౌర్బల్యం లేనిది కాదని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నది. విందువేళ నుంచీ మనకు ఈమె తాను హత్యాప్రేరకురాలనన్న భావాన్ని దూరం చేస్తూ, ఉదాత్తప్రకృతితో దయనీయురాలనన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నది. కథాంతంలో మాల్కొం ఈమెను గురించి "భూతం వంటి రాజ్ఞి" అన్నాడు. కానీ ఈ మాట అన్నప్పుడు అతడు ఈమె మానసికస్థితిని ఎరగడు.

మేక్బెత్ ప్రభ్వి స్త్రీ. చెడ్డ స్త్రీ. కాని భూతం వంటి స్త్రీ మాత్రం కాదు. ఆమె తన్ను గురించి స్త్రీని కానని చెప్పుకొన్నా మరణం వరకు స్త్రీయే!

# పాత్రలు

**పురుషులు**

| | | |
|---|---|---|
| **డంకన్** | : | స్కాట్లండు దేశపురాజు |
| **మాల్కొం** | : | డంకన్ రాజు పుత్రుడు |
| **డొనాల్బెయిన్** | : | ” |
| **మేక్బెత్** | : | డంకన్ రాజు సేనాపతి |
| **బాంకో** | : | ” |
| **మాక్డఫ్** | : | స్కాట్లండులోని ప్రభువులు |
| **లెన్నాక్స్** | : | ” |
| **రాస్** | : | ” |
| **మెంటియథ్** | : | ” |
| **ఆంగస్** | : | ” |
| **కెయిథినెస్** | : | ” |
| **ప్లియాన్స్** | : | బాంకో పుత్రుడు |
| **సివర్డు** | : | నార్తంబర్లాండు ప్రభువు. ఆంగ్లసేనలకు అధిపతి |
| **యువ సివర్డు** | : | సివర్డు ప్రభువు కుమారుడు |
| **సైటన్** | : | మేక్బెత్కు పార్శ్వచరుడైన ఉద్యోగి |
| **బాలుడు** | : | మాక్డఫ్ పుత్రుడు |

ఒక ఆంగ్లవైద్యుడు, ఒక స్కాచ్ వైద్యుడు

ఒక సార్జెంట్, ఒక ద్వారపాలుడు, ఒక వృద్ధుడు, ప్రభువులు, ఉద్యోగులు, సైనికులు, హంతకులు, పార్శ్వచరులు, వార్తాహరులు, ఛాయామూర్తులు,

**స్త్రీలు**

**మేక్బెత్ ప్రభ్వి** : రాజ్యాపహర్త అయిన మేక్బెత్ భార్య

**మాక్డఫ్ ప్రభ్వి** : ఫైఫ్‌దుర్గాధిపతికి పత్ని

**దాసి** : మేక్బెత్ ప్రభ్వికి అనుచరురాలు

**హెకేట్** : మాంత్రికురాండ్ర దేవతామూర్తి

ముప్పురు మాంత్రికురాండ్రు

# ప్రథమాంకం

## ఒకటో దృశ్యం

**ఒక మరుభూమి.[1] ఉరుములు, మెరుపులు.**
**మాంత్రికురాండ్రు ముగ్గురు ప్రవేశిస్తారు.**

**ప్రథమ మాంత్రికురాలు :** మరి మళ్ళీ మనముగ్గురికీ సమావేశమెప్పుడు? ఉరుములు వినిపించేటప్పుడు, మెరుపులు మెరిసేటప్పుడూనా? లేక కుంభవృష్టి కురిసేటప్పుడా?

**ద్వితీయ మాంత్రికురాలు :** ఈ రణకల్లోలం[2] అణగిన తరువాత. యుద్ధంలో అపజయమో, జయమో నిర్ణీతమైన తరువాత.

**తృతీయ మాంత్రికురాలు :** అది సూర్యాస్తమయవేళకు పూర్వమే తేలిపోతుంది.

**ప్రథమ మాంత్రికురాలు :** అయితే అప్పుడు మన సమావేశానికి స్థలమెక్కడ?

**ద్వితీయ మాంత్రికురాలు :** అక్కడే. ఆ క్షేత్రసీమలో.

**తృతీయ మాంత్రికురాలు :** మేక్బెత్‌ను కలుసుకోటానికి అక్కడే సమావేశ మౌదాము.

**ప్రథమ మాంత్రికురాలు :** గ్రేమాల్కిన్[3]! వస్తున్నా.

**ద్వితీయ మాంత్రికురాలు :** పాడ్డాక్[4] నన్ను పిలుస్తున్నది.

**తృతీయ మాంత్రికురాలు :** నేనూ వెంటనే వస్తున్నాను.

**ముగ్గురు మాంత్రికురాండ్రు :**

ఎయ్యది పరులకు[5] మంచో
అయ్యది మనకగు చెడుగు
ఎయ్యది ఏహ్యమొ యితరులకు
అయ్యది ప్రియమగు మనకు :

నీచు కంపులతో మూడమంచుతో
నిండిన నింగిని పయనిద్దాం పద.

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

ఫోర్రెస్[6] దగ్గిర ఒక శిబిరం. డంకన్, మాల్కొం, డొనాల్బెయిన్, లెన్నాక్స్ పరిచారక వర్గంతో ప్రవేశించి రక్తస్రావంతో వస్తున్న ఒక సార్జెంటు[7]ను కలుసుకొంటారు.

**డంకన్ :** రక్తస్రావంతో వస్తున్న ఆ వ్యక్తి ఎవరో! అతని దీనస్థితినిబట్టి అతడు ఇప్పుడే యుద్ధభూమినుంచి వస్తున్నట్లు తోస్తున్నది. విప్లవానికి సంబంధించిన క్రొత్తవార్తలు ఇతడు వినిపించగలడు.

**మాల్కొం :** శత్రువులు నన్ను బందీగా పట్టుకోబోతున్నప్పుడు, పరమ సాహసాన్ని ప్రదర్శించి అత్యుత్తమయోధుడిలా పోరాడింది యీ సార్జెంటే. వీరమూర్తీ, మిత్రమా! నీకిదే స్వాగతం! నీవు విడిచివచ్చినప్పటి రణరంగంలోని విశేషాలేమో రాజుగారికి విన్నవించు.

**సార్జెంటు :** యుద్ధఫలితం కొంతకాలం సంశయాస్పదంగా ఉండిపోయింది. ఎంతో సన్నిహితులుగా ఒకరికొకరు చేరుకొన్నా, వారికళను ప్రయోజనరహితంగా చేసేటంతటి అలసటను పొందిన ఇరువురు ఈతగాండ్రలాగా, ఉభయసైన్యాలు అత్యంతసన్నిహితంగా తారసిల్లాయి. కరుణారహితుడైన మాక్డొన్ వాల్డ్ విప్లవకారుడు కావటానికి ఎంతో యోగ్యత కలవాడు. అందుకు అవసరాలైన అన్ని గుణాలను ప్రకృతి అతడికి ప్రసాదించింది. అవి అతడిలో స్థిరనివాస మేర్పరచుకొని గ్రుడ్లు పోసి కొల్లలౌతున్నవి. అతడికి పశ్చిమ[8] ద్వీపాలనుంచి లఘ్వాయుధాలైన పదాతిదళాలు, సాయుధాలైన ఆశ్వికదళాలు లభించాయి. ఒక విప్లవకారునికి ఉంపుడుకత్తెలా అయిపోయిన అదృష్టం, అతడు సాగిస్తున్న నీచకలహానికి అనుకూలిస్తూ నవ్వుతున్నది. అయినా అంతా నీరసంగానే ఉంది. సాహసానికి సార్థకనాముడైన మేక్బెత్ అదృష్టాన్ని ధిక్కరించి పరాక్రమానికి ప్రియపుత్రుడో అన్నట్లు, నిహతుల రక్తధారలతో పంకిలమైన నిస్త్రింశిక సహాయాన త్రోవ చేసుకొంటూ ఆ బానిసను ముఖాముఖిగా ఎదుర్కొనేటంతవరకూ చొచ్చుకోపోయినాడు. కరచాలనం చేయటానికిగాని, వీడ్కోలు వాక్యాలు వినిపించటానికి

గాని కాలహరణం చెయ్యకుండా, అతణ్ణి బొడ్డు దగ్గర నుంచి చెంపదాకా చీల్చి, శిరస్సును మన కోటకొమ్ముకు బిగించాడు.

**డంకన్ :** ఓహో! మాతృస్వస్రేయా[9]! వీరసోదరా!! యోగ్యమూర్తీ!!

**సార్జెంటు :** రవి ఏ ప్రాగ్దిశనుంచి ఉదయిస్తున్నాడో ఆ దిక్కే నౌకాభంగాలను కల్పించే తుపానులకు, భీకరాలైన అగ్నిప్రపాతాలకూ పుట్టినిల్లయినట్లు తొలుత ఆనందాస్పదమై తోచిన మేక్డొనాల్డు మృతి, పొంగులువారే అసంతృప్తికి ఆలవాలమైంది. గమనించండి! స్కాట్లండు మహాప్రభో! గమనించండి! తమ పక్షాన్ని వహించిన న్యాయం, మేక్బెత్ పరాక్రమమనే కవచాన్ని ధరించి ఆపేరెములు వారే శాత్రవపదాతి దళాన్ని సమరభూమినుంచి తరిమివేసిన మరుక్షణంలోనే, ఆ నార్వేప్రభువుకు స్వలాభం ఏదో గోచరించినట్లుంది. రక్తపంకిలాలు కాక భాసించే శస్త్రాలతోనూ, నూతనంగా వచ్చి చేరిన సైన్యాలతోను మనమీద క్రొత్తముట్టడి ప్రారంభించాడు.

**డంకన్ :** ఈ సంఘటన మన సేనాపతులను భయపెట్టలేదా?

**సార్జెంటు :** లేకేం? భయపెట్టింది. తీతువులు డేగలను, కుందేళ్ళు సింహాలను భయపెట్టినట్లు భయపెట్టింది. సత్యం చెప్పవలసివస్తే వారు రెండుమార్లుగా దట్టించి విడిచిన ఫిరంగుల్లా[10] ప్రవర్తించారు. శత్రువులపైబడి రెండింతలుగా దెబ్బతీయటానికి వారి క్షత్రజధారల్లో స్నానమాడాలని కోరుకోటమో, లేక మరొక గొల్గోతగా[11] జ్ఞాపకముంచుకొనేటట్లు చేయాలని కాంక్షించటమో తప్ప, నాకు మరొక కారణం కన్పించటంలేదు – కానీ నాకు విస్తారమైన అలసట కలుగుతున్నది. వెంటనే చికిత్స జరిగించమని నా గాయాలు మొరపెడుతున్నవి.

**డంకన్ :** నీ గాయాలలాగానే నీ వాక్యాలు కూడా నీ వీరప్రవృత్తికి ఎంతో అనుగుణంగా ఉన్నాయి. అవి రెండూ ఉదాత్తతను సూస్తున్నాయి వెళ్ళండి, ఇతణ్ణి వైద్యులకు ఒప్పచెప్పండి.

**(పరిచారకులు వెంటరాగా సార్జెంటు నిష్క్రమిస్తాడు)**

ఆ వచ్చేదెవరు?

**మాల్కొం :** యోగ్యుడైన థేన్[12], రాస్!

**లెన్నాక్స్ :** అబ్బా! ఆతడి కన్నుల్లో ఎంతటి ఆవేశం ద్యోతకమౌతున్నది! ఏవో విచిత్రవార్తలు కొనివచ్చిన వ్యక్తిలా చూస్తున్నాడు.

**రాస్ ప్రవేశిస్తాడు.**

**రాస్ :** రాజేంద్రుని పరమేశుడు రక్షించుగాక!

**డంకన్ :** ఉదాత్తుడా, థేన్ మహాశయా! నీ రాక ఎక్కడి నుంచి?

**రాస్ :** మహాప్రభూ! ఫైఫ్‌నుంచి[13] వస్తున్నాను. మన ఆకాశంలో విశృంఖలంగా విహరిస్తూ, నార్వే దేశీయుల పతాకలు మన ప్రజాహృదయాలను శీతలం చేస్తున్న ఫైఫ్‌నుంచి వస్తున్నాను. రాజద్రోహి ఆ కౌడర్‌థేన్ ఇచ్చిన అసంఖ్యాక సైనికసహాయంతో నార్వే ప్రభువు భీకర కదనమారంభించాడు. కానీ అతని ఆ ప్రబలయత్నమంతా వ్యర్థమైపోయింది. సర్వతనుత్రాణంతో బెల్లోనావరుడైన[14] మేక్బెత్ తుదకు ముఖాముఖిగా ఎదుర్కొని, బాహాబాహిగా తలపడి పోరాడి, అతడి మదోద్రేకాన్ని అణగద్రొక్కాడు. సంక్షేపంగా చెప్పవలసివస్తే సమరంలో విజయం మనకే సంప్రాప్తించింది.

**డంకన్ :** మహాసంతోషం!

**రాస్ :** ఇప్పుడా నార్వేరాజు స్వెనో సంధికి ప్రాకులాడుతున్నాడు. అందుకు మనం అంగీకరించటం ఇష్టంలేకపోతే, సెంట్[15] కోల్మిద్వీపందగ్గర మన సైన్యోపయోగం కోసం అతడు పదివేల డాలర్ల[16]ను అర్పించేదాకా అతడి సైన్యాలను పాతిపెడుతూ వుండటానికి మనం అంగీకరించవలసివుంటుంది.

**డంకన్ :** ఆ కౌడర్ థేన్ మా అనురాగాన్ని అనుభవిస్తూ మాకు ప్రీతిపాత్రాలైన ప్రయోజనాల విషయంలో ద్రోహాన్ని తలపెట్టగలిగే అవకాశం ఇకలేదు. వెళ్ళి, వెంటనే అతనికి మరణశిక్ష విధించానని చెప్పు. అతని పూర్వబిరుదు ప్రశస్తితో మేక్బెత్‌ను సన్మానించు!

**రాస్ :** తాము సెలవిచ్చినట్లే జరిగిస్తాను.

**డంకన్ :** అతడు కోల్పోయినవాటినన్నిటినీ మేక్బెత్ గెలుచుకొన్నాడు.

**(నిష్క్రమిస్తారు)**

## మూడో దృశ్యం

**ఫోరెస్ సమీపంలో ఒక క్షేత్రసీమ. ఉరుములు వినిపిస్తుంటాయి. మాంత్రికురాండ్రు ముప్వురు ప్రవేశిస్తారు.**

**ప్రథమ మాంత్రికురాలు :** సోదరీ, ఎక్కడకి వెళ్లావు?

**ద్వితీయ మాంత్రికురాలు :** అప్పటినుంచీ వరాహాలను[17] హతమారుస్తున్నాను.

**తృతీయ మాంత్రికురాలు :** సోదరీ, నీవెక్కడికి వెళ్ళావు?

**ప్రథమ మాంత్రికురాలు :** ఒక నావికుడి పెళ్ళాన్ని కలుసుకొన్నాను. ఆమె ఒళ్ళో అడవి బాదాములు కుప్పబోసుకున్నది. పళ్ళు లేకపోవటం వల్ల ఆమె వాటిని చివుళ్ళతో నములుతున్నది. 'కొన్ని నాకివ్వ'మని అడిగాను. కశ్మలం తినే ఆ గజ్జిముండ 'పో, పోవే మంత్రగత్తే!' అని నన్ను తిట్టి కసిరింది. దాని మొగుడు 'టైగ'[18] రనే నౌకకు అధిపతిగా ఎలెప్పోకు వెళ్ళాడు. ఇక్కడినుంచే బయలుదేరి నేను సముద్రంమీద ఒక చేటలో ప్రయాణం చేసి తోకలేని ఎలుకలా ఆ నౌకలో ప్రవేశిస్తాను. తప్పక వెళ్ళి తీరుతాను. నా పగ తీర్చుకొంటాను.

**ద్వితీయ మాంత్రికురాలు :** అందుకు నీకు అనుకూలమైన ఒక గాలిని నేనిస్తాను.

**ప్రథమ మాంత్రికురాలు :** సోదరీ! నీవెంతటి దయగలదానివి!

**తృతీయ మాంత్రికురాలు :** నేను నీకు మరొక గాలినిస్తాను.

**ప్రథమ మాంత్రికురాలు :** ఇక మిగిలిన గాలులన్నీ నా అధీనంలోనే ఉన్నాయి. గాలులమీద నాకిటువంటి అధికారం కలిగింది గనుకే వారు చేరే రేవు పట్టణాలన్నిటి మీదా, నావికుని దిక్సూచిఫలకం[19] చూపించే అన్ని దిక్కులమీదా, నాకు అధికారం ఉన్నట్లే. రక్తాన్నంతటినీ ఓడ్చేసి వాణ్ణి ఎండుగడ్డిలా వాడ్చి వేస్తాను. వాడికి రాత్రింబవళ్ళు నిద్ర లేకుండా చేస్తాను. వాలిపోయే రెప్పలిక వాడి కళ్ళమీద మూతలు పడవు. వాడు బహిష్కృతుడిలా బ్రతకవలసిందే. క్రమంగా వాడు ఎనభై ఒక్కవారాలు కృశించి వాడి వత్తయిపోవలసిందే. వాడి నౌకను సర్వనాశనం చేయటానికి అవకాశం లేదు. అయినా దాన్ని పెనుతుపానుల్లో ఉగ్రూతలూగిస్తాను. ఇదిగో, నా దగ్గిర ఉన్నదేమిటో చూడండి!

**ద్వితీయ మాంత్రికురాలు :** ఏదీ, నన్ను చూడనీ. నన్ను చూడనీ!

**ప్రథమ మాంత్రికురాలు :** ఇది ప్రవాసంనుంచి ఇంటికి తిరిగివస్తుండగా పడవ మునిగిపోయిన ఒక కర్ణధారి బొటన వ్రేలు.

**(లోపలినుంచి దుందుభిధ్వని వినిపిస్తుంది)**

**తృతీయ మాంత్రికురాలు :** దుందుభి! దుందుభి!! – అంటే మేక్బెత్ వచ్చేశాడన్నమాట!

**మాంత్రికురాండ్రు ముప్పురు :**

విధికి మనం కూతుళ్ళం![20]
వేరు లేని ముప్పురం!

అక్కాచెల్లెళ్లం – మన
మక్కాచెల్లెళ్ళం!!                    విధికి మనం...

ఇలా కలిపి చేయి చేయి
ఇలమీదను కడలిమీద
వేగంగా నటియిస్తూ
ఆగక పయనిస్తుంటాం          విధికి మనం...

తిరుగుము ముమ్మారు నీవు
తిరిగెద నే మూడుమార్లు
సోదరి ముమ్మారు తిరుగ
నొదవు పూర్తి తొమ్మిదికి          విధికి మనం...

ఇక చాలు. ఆపండి. మన మంత్రకవచం పరిపూర్తి పొందింది.

**మేక్బెత్, బాంకో ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** ఒక సమయంలో ఇంత మంచిగానూ, ఇంకో సమయంలో ఇంత చెడ్డగాను ఉన్న మరోదినాన్ని నేనెన్నడూ చూడలేదు.

**బాంకో :** ఫోరెస్ ఇంకా ఇక్కడికి ఎంతదూరం ఉందో. బాగా బక్కచిక్కిన రూపాలతో, వెగటైన వేషాలతో కన్పిస్తున్న ఈ ప్రాణులెవరై ఉంటారు? ఇప్పుడు భూమిమీదనే ఉన్నప్పటికీ వీరు భౌములైన ప్రాణుల్లా తోచటంలేదు. మీరు సజీవులేనా? మానవుడు ప్రశ్నించి సమాధానాలు పొందదగ్గ ప్రాణులేనా మీరు? ఎండి బీటలువారిన పెదవుల మీద వ్రేళ్ళు పెట్టుకొని వింటున్నారు, నా భాష మీకు అర్థమౌతున్నట్లుంది. మీరు స్త్రీలని ఊహిస్తున్నాను. కానీ మీ ఆ గడ్డాలవల్ల కారేమోననిపిస్తున్నది.

**మేక్బెత్ :** మాట్లాడగలిగితే పలకండి. మీరు ఏ జాతివారు?

**ప్రథమ మాంత్రికురాలు :** జయం మేక్బెత్ జయం! గ్లామిస్ థేన్, నీకు జయం!

**ద్వితీయ మాంత్రికురాలు :** స్వాగతం మేక్బెత్! కౌడర్ థేన్ స్వాగతం!!

**తృతీయ మాంత్రికురాలు :** మేక్బెత్ స్వాగతం! భవిష్యన్మహారాజా! స్వాగతం!!

**బాంకో :** ఆర్యా! అంతగా ఆశ్చర్యపడుతున్నారేమిటి? ఇంతటి ప్రియమైన వార్త విన్నప్పుడు ఇలా చలించి బెదురుతున్నారేమిటి? – సత్యంమీద ఒట్టుపెట్టి ప్రశ్నిస్తున్నాను,

మీ రూపాలు ఊహాజన్యాలా లేక ప్రత్యక్షంగా గోచరిస్తున్నట్లు సత్యాలేనా? మీరు నా యీ ఉదాత్తసహచరుణ్ణి అతని ప్రస్తుత బిరుద గౌరవాలతో పేర్కొని ఆహ్వానించారు. మునుముందు మహారాజయ్యే గౌరవం దక్కనున్నదనీ ఆశ కల్పిస్తూ జోస్యం చెప్పారు. అతడు ఆ ఊహల్లో మునిగిపోయినట్లు కన్పిస్తున్నాడు. కానీ మీరు నాతో మాట్లాడటం లేదు. కాలంలో నిద్రించే బీజశక్తిని దర్శించగల ప్రతిభ మీకుంటే ఇందులో ఉద్భిజ్జమయ్యేదేది? కానిదేది? నాకు తెలియజేయండి! నేను మీ ఆదరాన్ని అర్థించేవాణ్ణి కాను  మీరు అసహ్యించుకొంటే జంకేవాణ్ణి అంతకంటే కాను.

**ప్రథమ మాంత్రికురాలు :** నీవు మేక్బెత్ అంతటివాడివి కావు  కానీ గొప్పవాడివి.

**ద్వితీయ మాంత్రికురాలు :** అతనికి కలిగే ఆనందం నీకుండదు. కానీ అంతకంటే అధికానందం నీకు లభిస్తుంది.

**తృతీయ మాంత్రికురాలు :** నీవు మహారాజువు కాలేవు  మహారాజులకు వంశకర్తవౌతావు. కనుక నీకు జయం! జయం!! మేక్బెత్ బాంకోల కిరువురికీ జయం! జయం!!

**ప్రథమ మాంత్రికురాలు :** బాంకో మేక్బెత్‌లకు ఇరువురికీ జయం!!

**మేక్బెత్ :** ఆగండి! ఓ అస్పష్టభాషిణులారా! ఆగండి. మరింత విశదంగా తెలియజేయండి. సైనల్[21] మృతివల్ల గ్లామిస్‌కు థేన్‌ను అయినానని నాకు తెలుసు. కానీ కౌదరుకు నేనెలా ప్రభువును కాగలను? ఇంకా కౌదర్ ప్రభువు సజీవుడు. అంతే కాదు, అతడు అదృష్టవంతుడు కూడాను. నేను కౌదరుకు థేన్‌ను ఔతాననటం నమ్మటానికి వీలులేకుండా ఉంది. ఈ విషయం మీకెలా తెలిసింది? ఇటువంటి జోస్యంతో ఆహ్వానించి స్వాగతం చెప్పి ఈ క్షేత్రసీమలో మా మార్గానికి అడ్డువచ్చి, మీరెందుకు మమ్మల్ని ఆపవలసివచ్చింది? మాటాడండి. నేను మిమ్మల్ని శాసిస్తున్నాను.

**(మాంత్రికురాండ్రు అదృశ్యమౌతారు)**

**బాంకో :** నీటికున్నట్లే భూమికి కూడా బుడగలున్నాయన్నమాట! ఈ రూపాలు అవే. – అవి ఏ దెసకు అదృశ్యమైనాయో గమనించారా?

**మేక్బెత్ :** వాయుపథంలోకి ఎగిరిపోయాయి. శరీరధారణం చేసి కన్పట్టిన ఆ రూపాలు నిట్టూర్పుగాడ్పుల్లా గాలిలో కలిసిపోయాయి. అవి కొంతకాలం నిలిచివున్నట్లయితే బాగుండేది!

**బాంకో :** మనం వేటిని గురించి మాటాడుకొంటున్నామో ఆ రూపాలు మనకంటిముందు నిజంగా కనిపించాయా? లేక ఓ జాతి ఉన్మాదాన్ని కలిగించి ఆలోచనను బందీ వెట్టగల పిచ్చి దుంపలను వేటినైనా మనం తిన్నామా?

**మేక్బెత్ :** నీ సంతతి మహారాజులౌతారట!

**బాంకో :** మీరు మహారాజులౌతారట!

**మేక్బెత్ :** అంతే కాదు. నేను కౌడర్‌కు థేనును కూడా ఔతానట! ఆ జోస్యం ఇలాగే నడిచింది కదూ?

**బాంకో :** అవును. ఆ జోస్యానికి తాత్పర్యార్థమదే. అంతే కాదు. వారు పలికిన పదాలు కూడా అవే. – ఎవరది?

**రాస్, ఆంగస్ ప్రవేశిస్తారు.**

**రాస్ :** మేక్బెత్ మహాశయా! మహారాజు మీ విజయవార్తను మహానందంతో విన్నారు. విప్లవవీరులతో జరిగించిన పోరాటంలో వ్యక్తిగతంగా మీరొనర్చిన సాహసచర్యలు వారికి ఆశ్చర్యాన్ని కల్గించాయి. కర్తకు మెప్పును చేకూర్చాయి. ఆయన ఏమీ పలకలేకపోయినారు. తాను పొందిన అనుభూతిని వెల్లడించటానికి పొగడ్త చాలదని ఒక వంక, పొగడకపోవటం కృతఘ్నత అని మరొకవంక ఆయనకు తోచింది. పొందిన ఆశ్చర్యం, చిక్కు పెట్టటం వల్ల చివరకు ఆయన ఏమీ పలకలేక స్తబ్ధత వహించారు. ఇట్టి భావసంధిలో ఇదమిత్థమని ఏమీ నిర్ణయించలేక నిరాశను పొంది, తరువాత క్రమంగా ఇంకా నిలిచిపోయిన ఆ నాటి యుద్ధవార్తలను విన్నారు. వాటిలో నిబిడంగా బారులు తీర్చి నిలిపిన నార్వే సైనిక శ్రేణుల్లోకి ప్రతికళేబరం మృత్యుమూర్తిలా కనిపించేటట్లు స్వయంగా కల్పించిన భీకరదృశ్యాలను భీతి చెందకుండా మీరు చొచ్చుకొనిపోవటాన్ని ప్రత్యేకంగా ఆయన గమనించారు. యుద్ధభూమి నుంచి వడగండ్లలా వార్తాహరులు ఒకరి తరువాత ఒకరు వస్తుండేవారు. వారిలో ప్రతిఒక్కడూ రాజ్యరక్షకోసం మీరు జరిపిన సాహసచర్యలకు సంబంధించిన పొగడ్తలను కోకొల్లలుగా కొనివచ్చి ఆయన ముందు క్రుమ్మరించారు.

**ఆంగస్ :** వారి అభివాదనలను మీకు అందజేయవలసిందని మహారాజు మమ్మల్ని నిర్దేశించారు. మిమ్మల్ని వారి సముఖానికి కొనిరమ్మని వారి ఆదేశం. మేము మిమ్మల్ని బహూకరించటానికి రాలేదు.

**రాస్ :** ముమ్ముందు వారు మీకు జరపనెంచిన ఘనతరసన్మానానికి సంచకరువులా 'కౌడర్ థేన్' అన్న బిరుదాన్ని మీకు అందజేయవలసిందిగా వారు నన్నాదేశించారు. ఆ బిరుదుమిప్పుడు మీదైంది. దానితో ఒక్కమారు మిమ్మల్ని జయవెట్టనివ్వండి.

**బాంకో :** (స్వగతం) ఏమిటి? మంత్రగత్తె సత్యము చెప్పగలిగిందన్న మాటేనా?

**మేక్బెత్ :** కౌడర్ థేన్ ఇంకా సజీవుడు కదా? ఎరువు తెచ్చిన దుస్తులతో నన్నెందుకు అలంకరిస్తారు?

**ఆంగస్ :** ఆ థేన్ ఇంకా సజీవుడై వున్నమాట నిజమే. కానీ అతనికా జీవితం శిక్షాభరం వల్ల భారోపేతమైంది. దానిని కోల్పోవలసిన స్థితినాతడు తెచ్చిపెట్టుకొన్నాడు. అతడు నార్వేరాజ సైన్యంతో కలిసిపోయినాడో లేక మన సైన్యాలను అధిగమించటంకోసం ఆ విప్లవసాహసికి గుప్తసహాయం చేశాడో, కాక ఈ రెండు మార్గాల్లోనూ తీవ్రకృషి చెయ్యటంవల్ల తనదేశానికి తీరని వినాశాన్ని తెచ్చిపెట్టుకొన్నాడో నాకు తెలియదు. కానీ నిరూపితమై అతడే అంగీకరించిన రాజద్రోహదోషం అతనికి వినాశాన్ని తెచ్చిపెట్టింది.[22]

**మేక్బెత్ :** (స్వగతం) గ్లామిస్! కౌడర్ థేన్!! అన్నిటినీ మించిన జోస్యఫలం ఇంకా అనుభవానికి రావలసిఉంది. (రాస్, ఆంగస్‌లతో) మీరు తీసుకొన్న శ్రమకివే నా నమస్సులు. (బాంకోతో) నీవు 'కౌడర్ థేన్ ఔతా' వని నాకు జోస్యం చెప్పిన ఆ మంత్రగత్తెలే నీ సంతతికీ జోస్యం చెప్పారు గదా! వారు మహారాజులౌతారని నీవు ఇంకా ఆశించటం ఆరంభించలేదా?

**బాంకో :** ఆ జోస్యాన్ని మీరు పూర్తిగా విశ్వసిస్తే కౌడరుకు థేనులు కావటంతో తృప్తిని పొందనీయకుండా, అది కిరీటసంపాదనకు కూడా మిమ్మల్ని ప్రేరేపించవచ్చు. ఏమైనా వారి జోస్యం కొంతగానైనా నిజం కావటం ఆశ్చర్యంగానే ఉంది. ప్రబలమైన ఆపదను కల్పింపబోయే ముందు, ప్రధానాంశాల్లో మనను మోసగించటంకోసం, కొంత విశ్వాసం కుదరటానికని సైతానుకు ప్రతినిధులైన ఈ మంత్రగత్తెలు, స్వల్పవిషయాలలో సత్యం చెప్పటం తరచుగా జరుగుతుంటుంది.

సోదరులారా! క్షమించండి. ఒకమాట.

**మేక్బెత్ :** (స్వగతం) భవిష్యత్తులో[23] జరుగునున్న మహానాటకానికి, సార్వభౌమత్వం కథావస్తువుగా గల మహానాటకానికి, పరమాహ్లాదకరాలైన ప్రస్తావనలుగా సత్యాలను రెంటిని ముందుగా ఆ మంత్రకత్తెలు పలకటం జరిగింది. (ప్రకాశంగా) ఉదాత్తులారా!

మీకివే నా నమస్సులు. (స్వగతం) మానవేతరాలైన ప్రేరేపణలెప్పుడూ దోషోపేతాలై వుండవు. అలాగే అవి శుభయుతాలై కూడా ఉండవు. ఒకవేళ వారు చెప్పింది దోషోపేతమైతే ఒక జోస్యంలో తొలిభాగాన్ని సత్యం చేసి నాకు ముందు రానున్న విజయానికి సంచకరువును కల్పించటమెందుకు? కౌడర్‌కు నేను థేనును కావటం క్రియారూపంలో కన్పిస్తునే ఉన్నది. ఇక శుభోపేతమైతే – ప్రకృతికి విరుద్ధంగా ఏ భావ భీకరరూప దర్శనంవల్ల నా కురులు నిక్కబొడుచుకొని నిలవటం, సుస్థిరమైన నా హృదయం డొక్క ఎముకలకు తగిలి తడుతూ ఉండటం జరుగుతున్నదో, ఆ భావానికి నే లొంగటమెందుకు? భవిష్యత్తులో రానున్నవని భావించే క్రూరభయానకాలను సహించటం కంటే వర్తమానంలో ఎదుర్కొనేవాటిని భరించటం బహుసుకరం. ఇంకా కేవలమొక ఊహామాత్రంగానే ఉండిపోయి, ఎట్టిరూపాన్నీ పొందకుండానే ఉన్న హత్యను గూర్చిన ఆలోచన నా మనోరాజ్య వ్యాపారాలను స్తంభింపజేస్తున్నది. ఊహామాత్రమైన అది ఒక సత్యంలా గోచరిస్తున్నది.

**బాంకో :** చూడండి. మన సహచరుడు ఎలా ఆలోచనలో మగ్నుడై పోయినాడో!

**మేక్బెత్ :** (స్వగతం) అదృష్టం నన్ను మహారాజును చేయదలచుకంటే నా కృషితో ఎట్టి ప్రమేయం లేకుండానే అదే కిరీటమిచ్చితీరుతుంది.

**బాంకో :** నూతనంగా అబ్బిన పదవీగౌరవాలు ఇంకా ఇతనికి బాగా ఒదగలేదు. అవి క్రొత్తదుస్తుల్లా కొన్నాళ్లు ఉపయోగిస్తేగాని ఒదగవు.

**మేక్బెత్ :** (స్వగతం) ఏది రానున్నదో దాన్ని రానీ! అందలి కాలానికి ఎంతటి కఠిన ప్రవృత్తి ఉన్నా దినమనేది గడిచి తీరుతుంది.

**బాంకో :** మీకు వీలు కలిగేటంతవరకూ వేచి ఉంటాము.

**మేక్బెత్ :** ఇంతకాలం మిమ్మల్ని వేచివుండేటట్లు చేశాను. క్షమించండి. మందమైన నా బుద్ధి మరిచిపోయిన కొన్ని విషయాలను జ్ఞప్తిచేసుకోవటంలో నిమగ్నమైపోయింది. నన్ను గురించి మీరు చేసిన శ్రమను నా చిత్తపత్రంమీద లిఖించుకొన్నాను. పఠించటం కోసం ప్రతినిత్యం ఆ పత్రాన్ని తిరుగవేస్తాను. మనం ఇక మహారాజదర్శనానికి బయలుదేరుదాము. (బాంకోతో) ఈ నాటి మన అనుభవాలను గురించి ఆలోచించు. వాటిని గురించి మధ్యకాలంలో సూక్ష్మపరిశీలన చేసి, మనం మరొకప్పుడు పరస్పరం హృదయాలిచ్చుకొని ప్రసంగిద్దాం.

**బాంకో :** అలాగే పరమానందంతో ప్రసంగిద్దాము.

**మేక్బెత్ :** అందాకా ఆ విషయాలను ప్రస్తావించవద్దు – మిత్రులారా! ఇక బయలుదేరుదాము.

**(నిష్క్రమిస్తారు)**

## నాల్గో దృశ్యం

**ఫోరెస్ రాజసౌధం, తుత్తారధ్వని వినిపిస్తుంది.**
**పరివారంతో డంకన్, మాల్కొం, డొనాల్బెయిన్, లెన్నాక్స్ ప్రవేశిస్తారు.**

**డంకన్ :** కౌడర్ వధ జరిగిపోయిందా? ఆ కార్యనిర్వహణం కోసం నియమితులైనవారు ఇంకా తిరిగిరాలేదా?

**మాల్కొం :** మహాప్రభూ! రాలేదు. ఆ మరణశిక్షను పొంది అతడు మృతి నొందటాన్ని చూసిన ఒక వ్యక్తితో నేను మాటాడాను. ఆ వ్యక్తి నివేదించినదాన్ని బట్టి ఆ కౌడర్ ప్రభువు తన రాజద్రోహాన్ని విస్పష్టంగా అంగీకరించాడనీ, గాఢపశ్చాత్తాపాన్ని ప్రదర్శించాడనీ, క్షమించవలసిందని మహారాజును అర్థించాడనీ తెలుస్తున్నది. అతడు తన జీవితంలో చేసిన ఏ కృత్యం కూడా అతడు తన జీవితాన్ని విడిచిపుచ్చినరీతిలా అతనికి వన్నె తెచ్చిపెట్టలేదు. ఇతఃపూర్వమే మరణవిషయంలో ఎన్నోమార్లు శిక్షణను పొందినట్లుగా అతడు మరణించాడు. తనకున్న వస్తువులన్నిటిలో అతిప్రియమైన జీవితాన్ని అతడు ఒక క్షుద్రపదార్థంలా[24] పరిత్యజించటానికి అతడు పరమసాధన చేసినట్లు మరణించాడు.

**డంకన్ :** ముఖకవళికలను బట్టి మనోవృత్తిని గమనించగలగటాన్ని నేర్పే కళంటూ ఒకటున్నట్లు కనిపించదు. అతడు ఉదాత్తుడని తలపోసి నేను అతడిమీద పరిపూర్ణ విశ్వాసముంచాను.

**మేక్బెత్, బాంకో, రాస్, ఆంగస్‌లు ప్రవేశిస్తారు.**

సర్వశ్రేష్ఠసోదరా! నీవొనర్చిన సేవకు తగినరీతిగా బహూకరింపని కృతఘ్ను పాపభారాన్ని వహించినందుకు నన్ను నేనింతవరకూ నిందించుకొంటున్నాను. పారితోషికాలు ఎంత శ్రమపడి పర్వులెత్తి చేరుకోటానికి యత్నించినా, అందులో లేనంతగా నీ యోగ్యతలు అతివేగాలైన రెక్కలు కట్టుకొని ఎంతో ఎత్తున ఎగిరిపోతున్నాయి. అభివాదనలు

చెప్పుకొని అనుగుణంగా బహూకరింపగలిగే శక్తి నాకు దక్కేటట్లుగా నీ యోగ్యతలు కొంత తక్కువ అయి ఉంటే బాగుండేదనిపిస్తుంది. ప్రస్తుతానికి నేను చెప్పగలిగింది ఒక్కటే. నా సర్వాధికారంలో ఉన్న సమస్తం కంటేను, అంతకంటే అధికంగాను నేను నీకు ఋణపడ్డాను.

**మేక్బెత్ :** స్వామిభక్తి సేవలనే ఋణాలను చెల్లించవలసిన బాధ్యత నాకుంది. ఏ కృత్యం వల్లనైనా అట్టిసేవ చేయటమంటే నే పడ్డ ఋణాన్ని చెల్లించటమే ఔతుంది. సేవకధర్మాలైన అట్టి కర్తవ్యాలను స్వీకరించటం మీ వంతు. మా కర్తవ్యాలు తమకూ, తమ రాజ్యానికీ తల్లిదండ్రులకు పిల్లలెలాంటివారో అలాటివి. యజమానులకు సేవకులవంటివి. నిర్వర్తించవలసిన కర్తవ్యాలను మేము సక్రమంగా నిర్వర్తిస్తే తమమీది ప్రేమ గౌరవాలవల్ల నిర్వర్తించవలసినవాటిని నిర్వర్తించటమే ఔతుంది.

**డంకన్ :** నీవనే లతను నేనిప్పుడే నాటాను. అది పరిపూర్ణరూపంలో వృద్ధి పొందటానికి అవసరమైన సమస్తకృషిని చేస్తాను. బాంకో మహాశయా! నీవూ మేక్బెత్‌తో తుల్యమైన యోగ్యతను సంపాదించుకొన్నావు. అంతటి యోగ్యత నీకుందని ఎరుకపడటానికిగా దానిని ఉచితరీతిని ప్రకటించుకోవచ్చు. ఏదీ నిన్నొక మారు కౌగిలించుకొని నా హృదయానికి హత్తుకోనీ.

**బాంకో :** నేను వృద్ధిపొందితే కలిగే ఫలసాయమంతా తమదే.

**డంకన్ :** ఆపుకోలేని నా ఆనందం అశ్రుజలంతో పరిపూర్తిని పొందదలచింది. పుత్రులరా! సోదరులారా!! నా సింహాసనానికి సన్నిహితులైన ఇతరవ్యక్తులారా!! గ్రహించండి. ఇప్పుడే రాజ్యవారసత్వాన్ని నా జ్యేష్ఠపుత్రుడైన మాల్కొంకు దత్తత చేస్తున్నాను. ఇకనుంచి 'కంబర్ లాండు యువరాజు'[25] అని అతనికి నామకరణం చేస్తున్నాను. ఇట్టి గౌరవాన్ని అతడొక్కడే కాక మరికొందరు కూడా పొందవలసివుంది. ఈ ఉత్తమలాంఛనాలు నక్షత్రాల్లా యోగ్యత కలవాళ్ళను మరింత తేజోవంతులనుగా భాసింపజేస్తాయి. ఇక్కడ నుంచి మనం ఇన్వర్నెస్‌కు వెళ్ళవలసి వుంది. అక్కడ నీవు మాకు గేస్తువై వర్తించి, ఇంతకంటే ఎంతో అధికంగా మమ్మల్ని ఋణగ్రస్తులను చేసుకోవచ్చు.

**మేక్బెత్ :** తమ సేవకు వినియోగించకుండా పొందే విశ్రాంతి కాలాన్ని తీవ్రమైన శ్రమకంటే మాకు భరించటం ఎంతో కష్టం. నేనే తమ రాకను గురించిన హెగ్గడికాడనై

ముందుగావెళ్ళి నా భార్యకీ వార్త చెప్పి, ఆమెను సంతోషభరితాంతఃకరణను చేస్తాను. సెలవు దయచేయించండి.

**డంకన్ :** కౌడర్ మహాశయా! అలాగే. నీవు వెళ్ళవచ్చు.

**మేక్బెత్ :** (స్వగతం) 'కంబర్లాండు యువరాజు'! నా మార్గమధ్యాన ఒక మెట్టు ఏర్పడింది. నేను దీన్ని తట్టుకొని పడవచ్చు లేదా దుమికి బయటపడవచ్చు. ఓ తారకల్లారా! మీ మీ తేజాలను తిరోహితాలు చెయ్యండి! కలుషాలైన నా రహస్యాకాంక్షలను బయటపెట్టకండి!! నా హస్తం ఏమి చేస్తుందో దాన్ని నా నేత్రం చూడకుండా చేయండి. నిర్వర్తితమైన తరువాత ఆ కార్యాన్ని చూసి అది భయాన్ని పొందుగాక!

**(నిష్క్రమిస్తాడు)**

**డంకన్ :** యోగ్యుడా, బాంకో! నీవన్నది సత్యం. నీవు వర్ణించినట్లు ఇతడు వీరగుణపరిపూర్ణుడే. ఇతణ్ణి గురించిన నీ వర్ణనలు నాకు విందులా విశేషతృప్తిని కల్గించాయి. స్వాగతం చెప్పే విషయంలో సర్వసౌఖ్యాలను చేకూరుద్దామన్న శ్రద్ధతో ఇతడు ముందుగా వెళ్ళాడు. ఇతడు సత్యంగా సాటిలేని బంధువు.

**(తుత్తారధ్వని. నిష్క్రమిస్తారు)**

## ఐదో దృశ్యం

**ఇన్వర్నిస్‌లో మేక్బెత్ సౌధం. లేఖ చదువుతూ మేక్బెత్ ప్రభ్వి ప్రవేశిస్తుంది.**

**మేక్బెత్ ప్రభ్వి :** "నేను విజయం చేకొన్ననాడు వారు నన్ను కలుసుకొన్నారు. లోపరహితమైన వారి కథనాన్ని బట్టి, వారికి మానవాతీతమైన విజ్ఞానం ఉన్నదని నేను గ్రహించాను. ఉత్సాహోద్రిక్తతతో మరికొన్ని ప్రశ్నలడగాలన్న కోర్కె నాకు కలగంగానే గాలిలో లీనమై అలా చిత్రంగా వారు అదృశ్యమైపోయినప్పుడు, నేనద్భుతావిష్టుడనై చేష్టలు దక్కి నిలుచున్నాను. ఇంతలో మహారాజు దగ్గిరనుంచి వార్తావహులు వచ్చి పూర్వం విధిసోదరీమణులు జయవెట్టినట్లుగానే "కౌడర్ థేన్! జయ" మని నాకు జయవెట్టారు. పూర్వ మా సోదరీమణులు "భవిషన్మహారాజా! జయ!" మని పల్కి, ముందు నేను మహారాజును అయ్యే కాలం వస్తున్నదని సూచించారు కూడాను. నా ఘనతలో భాగస్వామినివైన నీకు భవిష్యత్తులో ఎట్టి ఆధిక్యం అబ్బనున్నదో తెలియకపోవటం వల్ల, నాతో తుల్యమైన ఆనందాన్ని పొందే అవకాశం పోగొట్టకుండా

ఉండేటందుకు నీకీ వార్తను అందజేయటం ఉచితమని ఊహించాను. ఈ విషయాలను హృదయంలోనే ఉంచుకొని తీవ్రంగా ఆలోచించు. సెలవు.”

మీరు ఇప్పటికే గ్లామిస్‌కు థేనులైనారు! కౌడర్‌కు థేనులైనారు!! మంత్రగత్తెలు జోస్యం చెప్పినట్లు ముమ్ముందు మహారాజులు కూడా ఔతారు!! కానీ మీ ప్రకృతితో పరిచయం గలదాన్ని కాబట్టి, నాకేదో భయం వేస్తున్నది. దాక్షిణ్యక్షీరరసంలో అది పరిపూరితమైంది. అందుచేత అది సన్నిహితమైన మార్గాన్ని అందుకొని చరించదు. ఘనతను సంపాదించవలెనన్న ఆకాంక్ష మీకుంది. ఘనమైన కోర్కె లేని వ్యక్తులు కారు మీరు. కానీ దురదృష్టవశాన, ఏది లేకపోతే ఒక ఉన్నతమైన ఆశయాన్ని సాధించే అవకాశం లేదో ఆ అన్యాయభయరాహిత్యం మీకు లేదు. మీరు ఎన్నడైనా ఒక ఉన్నతప్రయోజనాన్ని సాధించటానికి గౌరవనీయమైన మార్గాన్నే కోరుతుంటారు. అనుచితమార్గాలతో దాన్ని పొందటం వంకకు ఆశపడరు. అయితే అట్టి మార్గాల వల్లనే తప్ప పొందటానికి అవకాశం లేని దానివల్ల వచ్చే ఫలాన్ని అనుభవించాలని ఆశపడుతుంటారు.

“నీకది కావాలంటే ఇది చేసితీరాలి” అని కంఠోక్తిగా చెప్పేదాన్ని పొందటమంటే మీకిష్టమే. కానీ ఆ పనిని మీరు స్వయంగా చేయటానికి జంకుతారు. అయినప్పటికీ అట్టిపని జరిగిపోయిన తరువాత దాన్ని త్రిప్పాలెనని మాత్రం మీరు కోరరు. మీ శ్రవణేంద్రియాలను నిరంతరం ఉత్సాహంతో నింపివేస్తూ, వీరోచితవాక్ప్రసంగాలతో దైవానుగ్రహం, అదృష్టశక్తులు నిర్ణయించి యిచ్చిన స్వర్ణకిరీటానికీ, మీకూ మధ్య ఆటంకంగా నిలుస్తున్న మీ ప్రకృతిలోని వెనకాడటమనే గుణాన్ని వెంటబడి తరిమివేస్తాను!

### ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు

వార్తలేమిటి?

**వార్తాహరి :** మహారాజులు రాత్రికి ఇక్కడికి విచ్చేస్తున్నారు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇటువంటి వార్త చెబుతున్నావు. నీకేమైనా మతిపోయిందా? మీ యజమాని మహారాజు వెంట లేరా? నిజంగా మహారాజు లిక్కడికి వస్తున్నట్లయితే తగిన ఏరాట్లు చేయటంకోసం మీ యజమానులు నాకు ముందుగా వార్త పంపించివుండేవారు.

**వార్తాహరి :** నివేదించేటందుకు తాము నన్ననుగ్రహిస్తే నే తెచ్చిన వార్త సత్యమైందే. మన ప్రభువు ముందుగా వస్తున్నారు కూడాను. నా సహచరుల్లో ఒకడు వారికంటే

ముందుగా వార్తనందించటంకోసం ఊపిరి సలుపుకోలేక మరణించేటంతటి వేగంతో, మరణిస్తే వార్త అందదేమోనన్న భయంతో వచ్చాడు.

**మేక్బెత్ ప్రభ్వి :** వాడికి క్రమమైన పరిచర్య చేయించండి. అతడు తెచ్చిన వార్త ఎంతో ఘనమైంది.

**(వార్తాహరి నిష్క్రమిస్తాడు)**

ఇలాంటి అరిష్టసూచకమైన వార్త చెప్పేటప్పుడు బొంత కాకి గొంతుక కూడా వెలుగురాయటం సహజం. అట్టి స్థితిలో డంకన్ మా సౌధంలో ప్రవేశిస్తున్నాడన్న వార్త తెచ్చిన వార్తాహరికి నోటమాట పెగిలిరాకపోవటంలో వింతేముంది? మానవుల మనోభావాలను వెన్నంటి వుండే ఓ అదృష్టశక్తుల్లారా! రండి!! నాలోని స్త్రీత్వాన్ని తొలగించండి. నఖశిఖపర్యంతం నన్ను నిర్భరక్రౌర్యంతో నింపి వేయండి. నా శరీరంలోని రక్తాన్ని కరడుగట్టించండి. కరుణకెట్టి ప్రవేశాన్నీ కల్పించకండి. దారులనన్నింటినీ మూసివేయండి. లేకపోతే ప్రయోజనాన్ని సాధించనీయకుండా ప్రకృతిసహజాలైన అనుమానాలు నన్ను క్రుంగదీయవచ్చు లేదా నా ఉద్దేశానికీ, తదాచరణకూ మధ్య ఆటంకాలుగా అవి నిలిచిపోవచ్చు.

ఓ హత్యాసచివులారా! మానవులు క్రూరకృత్యాలను ఆచరించే వేళల్లో అదృశ్యరూపులై వెంట ఉండి సాయపడే మీరు, నా స్తనద్వయం మీదికి విచ్చేసి అందలి క్షీరరసాన్నంతటినీ విషంగా మార్చేసి, నన్ను పరమక్రౌర్యమూర్తినిగా రూపొందించండి. నా నిశితకరవాలం కల్పించే గాయం దానికంటికి కనుపించకుండా ఉండేటందుకు, ఆ వినీలకంబళంలో నుంచి తొంగిచూచి వియత్తు 'ఆప' మని కేకపెట్టకుండా ఉండేటందుకు, ఓ కరాళకాళరాత్రీ! నారకధూమాన్ని కప్పుకొని నా కోసం రా!

**మేక్బెత్ ప్రవేశిస్తాడు**

ఘనుడా గ్లామిస్![26] యోగ్యుడా కౌడర్!! అనతికాలంలో మీకబ్బనున్న మహనీయ బిరుదంతో మిమ్మల్ని ఆహ్వానించటానికి అంగీకరించండి. మీ లేఖలు ముందేమి జరుగనున్నదో ఎరుకపడని వర్తమానకాలపు టెల్లల కెంతో ఆవలకు నన్ను నడిపించుకోపోయినవి. ఇప్పటికీ నేను ఆ భవిష్యత్తులోనే ఇంకా జీవిస్తున్నట్లు అనుభూతిని పొందుతున్నాను.

**మేక్బెత్ :** పరమప్రియా! ఈ రాత్రికి డంకన్ ఇక్కడికి వస్తున్నాడు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇక్కడనుంచి తిరిగి అతడు వెళ్ళట మెప్పుడు?

**మేక్బెత్ :** ప్రస్తుతోద్దేశప్రకారం రేపు.

**మేక్బెత్ ప్రభ్వి :** అట్టి రేపు సూర్యునిముఖం చూడబోదు. నా థేన్ మహాశయా! మీ మోము ఎన్నో అతీతవిషయాలను గ్రహింపదగ్గ గ్రంథంలా కన్పిస్తున్నది. లోకం కన్నులు కప్పటం కోసం సమయోచితాచారాల విషయంలో శ్రద్ధ వహించటానికి అలవాటు పడండి. మీ కన్నుల్లో, చేతల్లో, మాటల్లో స్వాగతం చెప్పటమే కనిపించాలి సుమా! ఏమీ ఎరగని సుకుమార కుసుమంలా కనిపించండి. కానీ అందులో సర్పంలా ఉండిపోవటం మరిచిపోవద్దు. వస్తున్న వ్యక్తి విషయంలో అతిశయమైన శ్రద్ధ వహించండి. ఆ విషయంలో మీరేమీ ఆందోళనపడవద్దు. దేనిని పరిపూర్తి చేయటం వల్ల మీ కీ దేశం మీద తదనంతర జీవితకాలమంతా యాజమాన్య సార్వభౌమాధికారాలు దక్కుతాయో, ఆ అతిప్రధానమైన వ్యవహారాన్ని నా అధీనం చెయ్యండి.

**మేక్బెత్ :** మనం తరువాత మరోమారు ఈ విషయాన్ని గురించి ప్రసంగిద్దాము.

**మేక్బెత్ ప్రభ్వి :** ముఖకాంతి వివర్ణమౌటమంటే భయాన్ని వ్యక్తం చెయ్యటమన్నమాట! ఉత్సాహంతో కనిపించటం తప్ప మీరు చేయవలసింది మరేమీ లేదు. మిగిలిన వ్యవహారం సర్వం నాకు విడిచిపెట్టండి.

**(నిష్క్రమిస్తారు)**

## ఆరోదృశ్యం

మేక్బెత్ సౌధం ముందు. సన్నాయి ధ్వనికారుల సంగీతం వినిపిస్తుంది. కాగడాలతో మేక్బెత్ సేవకవర్గం నిలుచుంటారు డంకన్, మాల్కొం, డొనాల్బెయిన్, బాంకో, లెన్నాక్స్, మాక్డఫ్, రాస్, ఆంగస్, సేవకవర్గం ప్రవేశిస్తారు.

**డంకన్ :** ఈ హర్మ్యం మహామనోహరమైన ప్రదేశంలో నిర్మితమైంది. సువాసనా శోభితమైన యిక్కడి మనోహరపవనం మన యింద్రియాలకు ప్రశాంతిని చేకూరుస్తున్నది.

**బాంకో :** అతిథులుగా వేసవిలో మన దేశానికి వచ్చి ఆలయాల్లో గూళ్ళు కట్టే ఏట్రింతలు[27] నివాసం చేస్తుండటం వల్లనే ఇచ్చటి వాయువు నిజమాధుర్యం చేత మనలను ఆకర్షిస్తున్నదన్న అంశం స్థిరపడుతున్నది.

ఈ సౌధంలోని వలభుల్లోగాని, ఫలకపంక్తుల్లోగాని, అండకుడ్యాలలోగాని, అవి గూళ్ళు కట్టి తమ పిల్లలను పెట్టని ప్రదేశమంటూ లేదు. నేను ఎన్నోమార్లు పరిశీలించాను అవి ఎక్కడ సంతానంతో సంతోషంగా తిరుగుతుంటవో అక్కడ వాయువు అతికోమలంగా ఉంటుంది.

**మేక్బెత్ ప్రభ్వి ప్రవేశిస్తుంది**

**డంకన్ :** అదిగో గమనించండి! గౌరవనీయురాలైన మన ఆతిథేయి విచ్చేస్తున్నది. మిత్రబృందంతో సమావేశాన్ని కాంక్షించి త్వరపెట్టే మన ప్రేమ కొన్ని సందర్భాలలో వారికీ శ్రమను కల్పిస్తుంటుంది. అయినా మనం వారి ప్రేమను స్వీకరించి కృతజ్ఞతలర్పిస్తుంటాము. మా రాకవల్ల మీకు మేము కల్పించిన శ్రమకు తగ్గ బహూకృతిని ప్రసాదించవలసిందని భగవంతుని ప్రార్థించే రీతిని, కల్పించిన శ్రమకుగాను మాకు కృతజ్ఞతను తెల్పవలసిన రీతిని ఈ ఆగమనం వల్ల మీకు మేము నేర్పుతున్నాము.

**మేక్బెత్ ప్రభ్వి :** మేము చేయగలిగిన సర్వసేవలను రెండుమార్లుగా చేసి, వాటినన్నిటినీ తిరిగి రెండురెట్లుగా చేసినా, ఇలా గౌరవవిశేషంతో మా గృహాన్ని ముంచెత్తిన తమకు మేము చేసే గౌరవం మిక్కిలి పేదది, అయోగ్యమైనది మాత్రమే ఔతుంది. పూర్వం తామొనర్చిన గౌరవాలకు, నూతనంగా ప్రసాదించిన గౌరవాలకు, మేము తమ సంక్షేమాన్ని కోరుతూ నిత్యం జపం చేసే మాలాధారుల[28] మైన మౌనులం కాక తప్పదు.

**డంకన్ :** కౌడర్ థేన్ ఎక్కడున్నాడు? ఇంకా తిరిగిరాలేదా? అతడికంటే ముందు చేరుకోవాలని మేము అతడు బయలుదేరిన వెంటనే అనుసరిస్తూ వచ్చాము. అలా జరగటానికి వీలులేదు. అతడు గొప్ప ఆశ్వికుడు. మీ మీది ప్రేమ కూడా అతణ్ణి మాకంటే ముందుగా ఇంటికి చేర్చటానికి తోడ్పడివుంటుంది. ఉచితజ్ఞవూ, ఉదాత్తవూ అయిన ఆతిథేయీ! ఈనాటి రాత్రి మేము మీకు అతిథులము.

**మేక్బెత్ ప్రభ్వి :** తమ సేవకులు – మేము అందులోవారమే – తమను, తమ అధీనంలో ఉంచిన సమస్తాన్నీ, మహారాజులైన తాము కోరినప్పుడు తమపరం చెయ్యటానికి ఎన్నడూ సంసిద్ధులే కదా! సత్యానికి ఈ సమస్తం తమదే కదా!!

**డంకన్ :** ఏదీ మీ హస్తం? మమ్మల్ని మా ఆతిథేయుని దగ్గరకు తీసుకువెళ్ళండి. అతడంటే మాకు అమితగౌరవం ఇంకా మేము అతడిమీద మా గౌరవాభిమానాలను క్రుమ్మరింపదలచాము. గేహినీ! మరి అనుజ్ఞనిస్తారా?

**(నిష్క్రమిస్తారు)**

## ఏడో దృశ్యం

మేక్బెత్ సౌధం, సన్నాయి ధ్వనికారుల సంగీతం వినిపిస్తుంటుంది. కాగడాలు వెలుగునిస్తుంటాయి. విందుకు సంబంధించిన నానాపదార్థాలతో అనేకసేవకులు పర్యవేక్షకుడు[29] రంగస్థలం మీద నుంచి వెళ్ళిపోయిన తరువాత మేక్బెత్ ప్రవేశిస్తాడు.

**మేక్బెత్ :** ఈ హత్యను జరిగించటంవల్ల సర్వం పరిపూర్తి అయ్యేటట్లయితే, దాన్ని వేగంగా జరిగించటం మంచిది. ఈ హత్య, దానివల్ల కలుగనున్న దుష్ఫలితాలను ఆపగలిగితే, ఆతణ్ణి తుదముట్టించటంవల్ల నాకు విజయం చేకూరితే, బాహిరంగా మరేమీ లేకుండా ఈ హత్యలోనే దాని ఆద్యంతాలు గర్భితాలై ఉంటే, నిత్యమైన కాలమహాసముద్రానికి ఒక తీరమో లేక అందులో ఒక తిన్నో అయిన ఈ జీవితంలో ముందేది వచ్చినా నేను తట్టుకోగలను.

భవిష్యజ్జన్మలో ఏమీ జరుగనున్నా నేను పట్టించుకోకుండా సాహసించవలసివుంది. కానీ ఇట్టి సందర్భాలలో శిక్షను ఈ జీవితంలోనే అనుభవించవలసివుంటుంది. ఇటువంటి చర్యల విషయంలో మనం ఇతరులకు హత్యాపాఠాలను నేర్పుతుంటాము. అలా నేర్పటంవల్ల ఆ పాఠాలను కనిపెట్టినవారి ప్రాణాలకే ముప్పు వస్తుంటుంది. సమచిత్తంతో వర్తించే న్యాయం, ఇతరులచేత త్రాగించటం కోసమని నింపిన విషచషకాన్ని మన పెదవులకే అందించి, దాన్ని మన చేతనే త్రాగించటమనే దారుణశిక్ష చెపుతుంటుంది.

రెండురీతుల అతణ్ణి రక్షించవలసిన ధర్మం నా యెడ ఉంది. నేను అతడికి తొలుత జ్ఞాతిని పిమ్మట సేవకుణ్ని. ఈ ద్వివిధసంబంధాలు నే తలపెట్టిన చర్యకు వ్యతిరేకాలు. అదీకాక ప్రస్తుతం నేను ఆతడికి ఆతిథేయుడను. హత్య చేయటం కోసం అతడిమీదికి హంతకుడెవడైనా వస్తుంటే అన్ని కవాటాలనూ బంధించి అతణ్ణి రక్షించవలసినవాణ్ణి. హత్యాఖడ్గాన్ని అత్యంతం హస్తాన ధరింపతగనివాణ్ణి. ఇంతే కాదు, ఈ డంకన్ ధర్మప్రధానంగా రాచరికాన్ని నెఱపుతున్నవాడు. ఉన్నతోద్యోగ నిర్వహణలో ఎట్టి కళంకం లేకుండా ఉన్నవాడు.

దుందుభిస్వనాలైన[30] కంఠాలతో దేవదూతల్లా అతడి సద్గుణాలు, నరకబాధలను భవింపదగ్గ ఈ హత్యాచరణ విషయంలో అతణ్ణి హతమార్చిన హంతకునికి వ్యతిరేకంగా వాదిస్తాయి. తమ దుర్విధినిగురించి కోమలాలైన కుత్తుకలతో చేసే రోదనధ్వనులు పవనవీథుల్లో లీనమైపోయేటట్లు విలపించే నగ్నరూపులు, నవజన్ములు అయిన మృతశిశు

వుల్లా, లోకంలో జరిగే పాపకృత్యాలకు తగ్గ ప్రతీకారం జరిగితీరాలని వాయుపథంలో హర్కారాగణాలై, గమనవేగం వల్ల కనిపింపని గాలిగుంపులను అధిరోహించి, ఆ ఘోషించే దివ్యగంధర్వబాలకుల్లా[31], దయా హృదయాలు కరగటం వల్ల కార్చిన కన్నీటిభారం చేత ఒక పెనుతుపాను చెలరేగేటట్లు ఈ దారుణకృత్యాన్ని సర్వప్రపంచం లోని నేత్రాలముందు కన్పించేరీతిగా ప్రదర్శించితీరుతుంది! జీనుమీదికి చేరటానికని ఎత్తుగా ఎగరటం వల్ల ఆవలిదిక్కుకు పడవేసే గంతులమారి ఆశ తప్ప ఆతణ్ణి హతమార్చడానికి నా ఉద్దేశమనే అశ్వాన్ని డొక్కల్లో తన్ని అదుపున పెట్టుకోటానికి, మడమకు కట్టుకొనే మరొక అయస్కూచి నాకేమీ లేదు.

**మేక్బెత్ ప్రభ్వి ప్రవేశిస్తుంది**

విశేషాలేమిటి?

**మేక్బెత్ ప్రభ్వి :** ఆయన భోజనం పూర్తికావస్తున్నది. మీరు భోజనకక్ష్యను విడిచి వచ్చారేమిటి? కారణం?

**మేక్బెత్ :** ఆయన నన్ను గురించి ఏమైనా ప్రశ్నించాడా?

**మేక్బెత్ ప్రభ్వి :** ప్రశ్నించాడని మీకింకా తెలియదా?

**మేక్బెత్ :** మన వ్యవహారాన్ని ఇంతటితో కట్టిపెడదాం. మొన్నమొన్ననే ఆయన నన్ను గౌరవించాడు. ప్రజల్లో అన్నివర్గాలవల్లా దివ్యమైన అభిప్రాయాలను పొందాను. దాని క్రొత్తదనం మాసిపోకముందే సార్వజనీనమైన ఆమోదాన్ని కొంతకాలం ఆనందంతో అనుభవిస్తాను. అనుభవించటానికి యోగ్యమైంది కాదని దీన్ని అవతల పారవేయటానికి వీల్లేదు.

**మేక్బెత్ ప్రభ్వి :** గర్వోన్మత్తులై ఏ ఆశతో మీరు మిమ్మల్ని అలంకరించుకొన్నారో ఆ ఆశ ఒక మధుపానమత్తుని ఆశకంటే అతిశయమైంది కాదా? అది ఇంతవరకూ నిద్రాముద్రితమైందా? ధైర్యంతో ఏర్పాటుచేసుకొన్న సన్నాహాన్ని చూచి పచ్చబడి వివర్ణమైపోవటానికి ఇప్పుడు మేల్కొన్నదా? నా మీది మీ ప్రేమ కూడా ఇలాగే నిలకడ లేనిదని ఈ క్షణంనుంచీ భావించవలసిందేనా? కాంక్షించటంలో మీరెలాటివారో చర్యలోనూ, సాహసంలోనూ అటువంటి వారుగానే వర్తించటానికి మీరు జంకుతున్నారా? జీవితానికి పరమాలంకారంగా దేన్ని భావిస్తున్నారో దాన్ని పొందవలెనని ఒకవంక కోరుతూ కూడా మరొకవంక “ధైర్యం చాలటం లేదు, ఆగు,

తింటాను" అన్న సామెతలోని పిల్లిలా పలుకుతూ, మీ దృష్టిలోనే మీరొక భీరువుగా నిలిచిపోదలిచారా?

**మేక్బెత్ :** నిన్నర్థిస్తున్నాను. శాంతించు. 'వీడు పురుషుడు' అని అనిపించు కోటానికి ప్రమాణమెంతో అంతా చేసితీరుతాను! ఇంతకుమించి చేస్తే అప్పుడు వీడు పురుషుడు కావటం జరగదు గదా!

**మేక్బెత్ ప్రభ్వి :** అయితే తొలుత ఈ సాహసచర్యను గురించి ప్రస్తావించినప్పుడు మిమ్మల్ని ఏ పశువావేశించి పల్కించింది? సాహసించి ఆ చర్యను సూచించినప్పుడు మీరు పురుషుడిలాగానే ప్రవర్తించారు. ఈ స్థితికంటే అధికమైన స్థితిని పొంది వర్తిస్తే ఆ పురుషుడన్న పేరుకు మీరు మరింతగా యోగ్యులౌతారు. 'అప్పుడు సమయంగాని, స్థలంగాని మీకు అనుకూలంగా లేదు', అని అంటూ మీరు ఆ రెంటినీ అనుకూలం చేసుకోటానికి నిశ్చయించారు. అయితే ఇప్పుడా రెండూ వాటినవే కల్పించుకొని అనుకూలించాయి గాని, మిమ్మల్ని ఆ చర్యకు అయోగ్యుణ్ణి చేస్తున్నవి. ఈ కార్యనిర్వహణ విషయంలో నేను మీ వలె ప్రతిజ్ఞ చేసివున్నట్లయితే, ఇది తల్లినై, స్తన్యపానం చేస్తున్న పసిపాపను ప్రేమించటమంటే ఏమిటో తెలుసుకొన్న తరువాత, అది నవ్వుతూ నా ముఖాన్ని చూస్తున్నప్పుడు దాని చిరుచివుళ్ళనుంచి నా చూచుకాన్ని లాగేసి హఠాత్తుగా దాని శిరస్సును చితకగొట్టట మన్నమాట!

**మేక్బెత్ :** ఇందులో మనకపజయం కలిగితేనో?

**మేక్బెత్ ప్రభ్వి :** మనకపజయమా? పరిహాసాస్పదమైన మాట! స్థిరనిశ్చయం కలగటానికి మీరు ధైర్యాన్ని చిక్కబట్టితే చాలు మనం అపజయాన్ని పొందం. ప్రయాణాయాసం వల్ల తప్పక పట్టితీరుతుంది గనక డంకన్ నిద్రాపరవశుడైనప్పుడు ఆయన సౌఖశాయనిక సేవకుల నిరువురినీ మధుపానంలో ముంచెత్తి విలాసోన్మత్తులను చేయిస్తాను. మానసికరహస్యాలను రక్షించుకోగల వారి ధీశక్తి ఆవిరిగా మారిపోవటంవల్ల వారి మనస్సు ఒక బట్టీగా మారిపోతుంది. అలా తప్పత్రాగి వారి ప్రకృతి మరణవేళలో వలె తడిసి చల్లబడిపోయినప్పుడు, రక్షణ లేని డంకన్ శరీరంమీద మీరూ, నేను ఏమైనా చెయ్యగలం గదా! మనం చేసిన ఘనహత్యాభారాన్ని మధుపానం చేత కరడుగట్టిన ఆ ఉద్యోగులమీదకు నెట్టి వారిచేత మ్రోయించవచ్చు.

**మేక్బెత్ :** భీతచిత్తవుకాని నీ గర్భం మగబిడ్డలను తప్ప మ్రోయలేదు. నీవు పురుష సంతానం మాత్రమే పుట్టదగ్గ తల్లివి. నిదురించే ఆ ఇరువురు సౌఖశాయనిక సేవకుల

ఛురికలనే ప్రయోగించి వారి శరీరాలను రక్తచిహ్నితాలను చేస్తే హంతకులు వారేనని నమ్మించటానికి వీలుంటుందా?

**మేక్బెత్ ప్రభ్వి :** ఆయన మృతికి మనం ఘనంగా రోదనధ్వనులు చేస్తుంటే ప్రత్యక్షంగా చూచినవారు తప్ప అన్యథా భావించేటంతటి సాహసం చెయ్యగలవారెవ్వరుంటారు?

**మేక్బెత్ :** నా మనసిప్పుడు కుదుటబడ్డది. నేనిక నా సర్వావయవాలను ఈ దారుణచర్య కనుకూలంగా దిద్దుకుంటాను. ఇక వెళ్ళి ఆనందాభినయంతో కాలాన్ని హసించి మోసగిద్దాం. క్రూరహృదయం భావించే ఘోరచర్యలను మోసకారియైన ముఖం మరుగుపరచవలసివుంది.

**(నిష్క్రమిస్తారు)**

# ద్వితీయాంకం

## ఒకటో దృశ్యం

**ఇన్వర్నిస్‌లో మేక్బెత్ సౌధంలోని ఒక ప్రాంగణం. కాగడాను ముందుకు చూపుతున్న ఫ్లియాన్సుతో బాంకో ప్రవేశిస్తాడు.**

**బాంకో :** ఇప్పుడు సమయమెంతై వుంటుంది?

**ఫ్లియాన్సు :** చంద్రాస్తమయమైంది. ఎన్ని గంటలు కొట్టారో వినలేదు.

**బాంకో :** అది పన్నెండుగంటలకే జరిగిపోతుంది.

**ఫ్లియాన్సు :** సరి, ఈ ఖడ్గాన్ని పుచ్చుకో. ఆకాశం తన దీపికలను ఆర్పివేసి సౌఖ్యాన్ని ప్రకటించింది. (ఛురిక నందిస్తూ) దీన్ని కూడా పుచ్చుకో. సీసంలా బరువైన నిద్ర నన్నాహ్వానిస్తున్నది. కానీ నాకు నిద్రపోవాలని లేదు. నిద్రావేళ కలల్లో కూడా దయాన్వితాలైన దివ్యశక్తులు పాపపుటూహలనుంచి నన్ను దూరంచేయుగాక! ఏదీ, నా ఖడ్గాన్ని ఇలాతే. ఎవరక్కడ?

**మేక్బెత్, కరదీపికతో ఒక సేవకుడు ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** ఒక మిత్రుడు.

**బాంకో :** ఏమిటి? ఇంకా మీరు విశ్రాంతి తీసుకోలేదా? ఆయన అసామాన్యమైన ఆనందాన్ని అనుభవించి పారితోషికాలుగా బహుళమైన కాన్కలను మీ సేవకాలయాలకు పంపించాడు. "మహాదయాన్వితయైన, ఆతిథేయి" అన్న బిరుదంతో ఈ అనర్ఘమణిని మీ పత్నికి బహుమతిగా ఇచ్చి ఎంతో అభినందించాడు. ఆయన శయనించి ఎంతో సేపైంది.

**మేక్బెత్ :** కాలమతిస్వల్పం కావటంవల్ల తగిన ప్రయత్నాలు చేయలేకపోవటం జరిగి, వారి ఆగమనానికి తగ్గ ఆతిథ్యాన్ని ఇవ్వాలన్న మా అభిలాష లోపరహితంగా తీరింది కాదు.

**బాంకో :** సర్వం సక్రమంగానే సాగిపోయింది. రాత్రి నేనా ముగ్గురు మాంత్రికురాండ్రను గురించి కలగన్నాను. మీ విషయంలో వారు చెప్పింది కొంత సత్యమైంది.

**మేక్బెత్ :** ఆ మంత్రగత్తెలను గురించి ఆలోచించటం నేను పూర్తిగా మానివేశాను. అయినా మన కో గంట విశ్రాంతి లభించినప్పుడు, ఆ కాలాన్ని నీవు నాకు వినియోగింప గలిగితే, ఆ విషయాలను గురించి తరువాత కొంతసేపు నీతో ప్రసంగిస్తాను.

**బాంకో :** మీకెప్పుడు విశ్రాంతి కలిగితే అప్పుడు అందుకు నేను సంసిద్ధమే.

**మేక్బెత్ :** నేను రూపొందించుకొన్న పథకానికి కార్యరూపాన్ని కల్పించటంలో నీవు సాయపడితే ఆ చర్య నీ గౌరవాన్ని తెచ్చిపెట్టేటట్లు నే చూస్తాను.

**బాంకో :** అయితే నేను దోషరహితమైన చిత్తం కలవాణ్ణి. నా రాజభక్తి అమలినమైంది. అధికగౌరవాన్ని అన్వేషించటంలో ఉన్నదాన్ని పోగొట్టుకోకుండా ఉండేటట్లయితే, నేను మీకు తప్పక తోడ్పడుతాను.

**మేక్బెత్ :** సరే. నీవు సమయం వచ్చేదాకా మంచి విశ్రాంతి తీసుకో.

**బాంకో :** మంచిది. ఆర్యా! మరి మీరూ అట్టి విశ్రాంతినే అనుభవింతురు గాక!

**(బాంకో, ఫ్లియాన్సు నిష్క్రమిస్తారు)**

**మేక్బెత్ :** వెళ్ళి మీ యజమానురాలితో పానీయం సిద్ధమైన తరువాత ఘంటికను మ్రోగించమని చెప్పు. తర్వాత నీవు వెళ్ళిపోయి నిద్ర పో. (సేవకుడు వెళ్ళిపోతాడు) నా హస్తం వంకకు అభిముఖమైన పిడితో కంటిముందు కన్పించే యిది ఛురికయేనా? రా, వచ్చి నా హస్తాన అమరిపో. ఏమిటిది? నీవు నా చేతికి చిక్కటం లేదు? కానీ ఇంకా నా కంటిముందు కనిపిస్తూనేవున్నావు. నేత్రాలముందు గోచరించటమే గాని నీవు స్పర్శకందని అరిష్టసూచకమైన కేవలమొక దృశ్యానివి మాత్రమేనా? లేక నీవు నా మనస్సులో మాత్రమే ఉనికిని గొన్న ఛురికవా? భావోద్రేకాన్ని పొందిన నా బుద్ధిలోనే పుట్టి వెలికి వెడలివచ్చిన ఒక అసత్యసృష్టివా? అయితే ఒరనుంచి నేనిప్పుడు లాగుతున్న యీ ఛురికలాగానే నీవు ఎంతో విస్పష్టమైన రూపంతో నాకు కనిపిస్తున్నావు. నే పయనిస్తున్న మార్గానికి హర్కారాతనాన్ని నెరపుతూ నాకు నీవు ప్రయోగింప వలసిన సాధనంగా గోచరిస్తున్నావు. ఇతరాలైన నా ఇంద్రియాలు వాటిని చూచి పరిహసించేటట్లు నీవు నా నేత్రాలను మోసగించనైనా మోసగిస్తుండాలె లేదా నీవు సత్యమైన రూపం కలదానివే అయితే, నీ అస్తిత్వాన్ని గుర్తించలేని నా ఇతర సర్వేంద్రియాలతో కేవలమొక్క నా నేత్రద్వయమే తుల్యమూల్యమైనదైనా అయివుండాలె. నీవింకా నా కంటిముందు సుసత్యంగానే కన్పిస్తున్నావు. నీ వాదరమీద, పిడిమీద తొలుతగా నీవు కన్పించినప్పుడు లేని నెత్తురు చుక్కలు కన్పిస్తున్నాయి.

ఇదంతా నా హత్యావ్యవసాయం నేత్రాలముందు గోచరించటం కోసం కల్పితమైందే తప్ప సత్యమైంది కాదు. ఇటువంటిది నిజానికి లేనే లేదు. ఇదంతా నా భ్రాంతి! ఒక ప్రపంచార్ధ గోళంలో ఇప్పుడు సమస్తప్రకృతీ మృతినొందినట్లు తోస్తున్నది. ప్రశాంతమైన నిద్రాస్థితిని దారుణస్వప్నాలు కళవళపెడుతున్నట్లు కన్పిస్తున్నది. ఇష్టనివేదనలతో కరాళమూర్తి యైన హెకేట్‌కు[32] తంత్రక్రియలు సాగించటానికని మంత్రగత్తెలు సమావేశమైనారు. కావలికాడై కాలాన్ని తెలియజేసి క్రియాచరణకు మేల్కొల్పే తోడేలు కూత విని, బక్కచిక్కిన హంతకుడు లుక్రీషియాను చెరచటానికని ఆమె పర్యంకం దగ్గిరకు వెళ్ళుతున్న టార్క్విన్[33] వేసిన అడుగుల్లా సద్దులేని పెద్ద అడుగులతో భూతమో అన్నట్లు హతమార్చదలచిన వ్యక్తి దగ్గరకు కదలిపోతున్నాడు. ఘనరూపవుగా నా పాదాల క్రింద గాఢఖచితవైన ఓ పృథ్వీ! నా పాదవిన్యాసధ్వనులను వినిపించుకోకు. అవి ఏ దిక్కుకు నడుస్తున్నాయో గమనించకు. అలా చేశావో నీలోని శిలలే గగ్గోలుపెట్టి నా నిర్ణీతప్రదేశాన్ని బయటపెట్టేస్తాయి. నేనిప్పుడు నిర్వహింపబోతున్న భీకర కృత్యానికెంతో అనువుగా ఉన్న ఇప్పటి నిశ్శబ్దానికి భంగపాటు కల్పించి కాలంలోని దారుణత్వాన్ని తరిమివేస్తాయి.

నేనిలా వాచాలతను చూపుతున్నంతసేపు అతడు సజీవుడై ఉంటూనే వుంటాడు. కేవలం వట్టిమాటలు కృత్య నిర్వహణోత్సాహాన్ని చల్లార్చివేస్తాయి.

**(ఘంటిక వినిపిస్తుంది)**

ఇక నేను వెళ్ళటమంటే ఆ చర్య జరిగిపోయిందన్న మాటే! అదిగో! ఘంటిక. కార్యనిర్వహణార్థం నన్నాహ్వానిస్తున్నది!! డంకన్! నీవా ఘంటికను వినకు! అది నిన్ను స్వర్గానికో లేక నరకానికో ఆహ్వానించే మృత్యుఘంటిక. కనుక నీవు దాన్ని వినకు!!

**(నిష్క్రమిస్తాడు)**

**మేక్బెత్ ప్రభ్వి మళ్లీ ప్రవేశిస్తుంది.**

**మేక్బెత్ ప్రభ్వి :** వాళ్ళనేది ఉన్మత్తులను[34] చేసిందో అది నా ధైర్యాన్ని మేల్కొల్పింది. ఏది వాళ్ళను చల్లబడజేసిందో అది నాలోని అగ్నిని రగుల్కొల్పింది. ఇష్! ఎక్కడి దా ధ్వని? ఓహో! ప్రాణహరణవేళ జీవులకు ఏదో తెలియజేయటానికని విధి నియమించిన ఘంటికాకారుడిలా అదిగో... ఉలూకం కేక పెట్టింది. ఆయన ఆ కృత్యాన్ని నిర్వర్తించటానికని వెళ్ళారు. ఆ ద్వారాలన్నీ తెరిచివున్నాయి. తప్పత్రాగిన రక్షకులు నిద్రలో గురకలుపెడుతూ రాజరక్షణమనే పరిహాస నాటికను అభినయిస్తున్నారు.

వారికిచ్చిన పానీయాలలో నేను కొన్ని ఓషధులను కలపటం వల్ల వారిలో జీవమరణాలమధ్య సంకులసమరం సాగుతున్నది. తత్ఫలితంగా వారు జీవించనూ వచ్చు లేదా మరణించనూవచ్చు.

**మేక్బెత్ :** (లోపల) ఎవరక్కడ? అయ్యో! ఏమిటది?

**మేక్బెత్ ప్రభ్వి :** అయ్యో! పరిచారకులు మేల్కొనివుంటారా? ఆ పని జరిగివుండదు. కార్యరూపాన్ని ధరించని యత్నం నన్ను కలవరపెడుతున్నది. ఏమాధ్వని? వారికోసం నేను ఛురికను సిద్ధపరిచేవచ్చాను. కృత్యనిర్వహణంలో నా భర్త విఫలుడు కాకూడదే! నిద్రిస్తూన్న మహారాజు నా తండ్రిని పోలి నాకు కన్పించి ఉండకపోయినట్లయితే నేనే ఈ కృత్యాన్ని నిర్వర్తించి వుండేదాన్ని.

**మేక్బెత్ ప్రవేశిస్తాడు.**

ప్రియసతీ!

**మేక్బెత్ :** నేనాకృత్యాన్ని పరిపూర్తిని కల్పించాను. నీకు శబ్దమేమీ వినిపించలేదూ?

**మేక్బెత్ ప్రభ్వి :** ఒక గ్రుడ్లగూబ కేక, కీచురాళ్ళ ఏడ్పు వినిపించింది. మీరేమీ మాట్లాడుకోలేదా?

**మేక్బెత్ :** ఎప్పుడు?

**మేక్బెత్ ప్రభ్వి :** ఇప్పుడే.

**మేక్బెత్ :** నేను పైనుంచి దిగివస్తున్నప్పుడా?

**మేక్బెత్ ప్రభ్వి :** అవును.

**మేక్బెత్ :** విను. ఆ ధ్వనేమిటో? డంకన్ కక్ష్యకు ప్రక్కగదిలో నిద్రించే దెవరు?

**మేక్బెత్ ప్రభ్వి :** డోనాల్బెయిన్.

**మేక్బెత్ :** (తన హస్తాలను చూస్తుంటాడు)

**మేక్బెత్ ప్రభ్వి :** దీన్ని దీనదృశ్యం అని అనటం కేవలం అజ్ఞానవిలసితమైన అభిప్రాయం.

**మేక్బెత్ :** ఒకడు నిద్రలో నవ్వుతున్నాడు. రెండోవాడు 'హత్య!' అని కేకపెట్టాడు. ఒకరినొకరు మేల్కొల్పుకొన్నారు. వారు మాట్లాడుకొంటుంటే నేను నిలిచి విన్నాను. వాళ్ళు ప్రార్థనలు చెప్పుకొని తిరిగి నిద్రకు సంసిద్ధులైనారు.

**మేక్బెత్ ప్రభ్వి :** ప్రక్క కక్ష్యలో ఇరువురు నిద్రిస్తున్నారు. మీరు చెప్పినదంతా అక్కడే జరగటానికి అవకాశముంది.

**మేక్బెత్ :** అందులో ఒకడు 'భగవంతుడు రక్షించుగాక!' అని అన్నాడు. రెండోవాడు 'అగుగాక!' అన్నాడు. ఈ హంతకహస్తాలతో ఉన్న నన్ను చూసి వారు భయపడి నట్లున్నారు. 'భగవంతుడు రక్షించుగాక!' అని వారన్నప్పుడు నేను 'అగుగాక!' అని అనలేకపోయినాను.

**మేక్బెత్ ప్రభ్వి :** మీరు ఆ విషయాన్ని గురించి అంతగా ఆలోచించవద్దు.

**మేక్బెత్ :** అయితే నేనప్పుడు 'అగుగాక!' అని ఎందుకు అనలేకపోయినాను? ఆ సమయంలో పరమేశ్వరానుగ్రహం నాకెంతైనా కావలసివుంది. కానీ నా గొంతుకలో 'అగుగాక!' అన్నమాటలు తట్టాడి కొట్టుకులాడాయి కూడాను.

**మేక్బెత్ ప్రభ్వి :** ఈ విషయాలనుగురించి ఈ రీతి ఇంత తీవ్రంగా ఆలోచించరాదు. ఆలోచిస్తే అవి మనలను వెర్రివాళ్ళను చేసివేస్తాయి.

**మేక్బెత్ :** 'నిద్రించకు. మేక్బెత్ నిద్రను హత్య చేశాడు!' అని ఏదో ఒక గొంతుక కేక పెట్టినట్లు నాకు వినిపించింది. నిద్ర! అమాయకపు నిద్ర!! శ్రద్ధ అనే చిక్కుముళ్ళు పడ్డ చీనిపింజలను సవరించి వస్త్రరూపాన బంధించే నిద్ర!! అనుదిన మృత్యువైన నిద్ర!! అది అలసిన శ్రమకు స్నానం! గాయపడిన మనస్సుకు కమనీయమైన అంజనం!! ఉదాత్తమైన ప్రకృతి చేసే విందులో ద్వితీయ వ్యంజనప్రసారం!![35] జీవితపు విందులో ప్రబలమైన బలవర్ధకం!!

**మేక్బెత్ ప్రభ్వి :** ఈ ధోరణేమిటి?

**మేక్బెత్ :** 'ఇక నిద్రపోవద్దు. గ్లామిస్ నిద్రనే హత్య చేశాడు. కౌడర్ ఇక నిద్రపోడు!' అని ఆ గొంతుక గృహమంతా ప్రతిధ్వనించేటట్లు కేకలు పెట్టి పలికింది.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇలా కేకలు పెట్టింది ఎవరు? ఉదాత్త థేన్ మహాశయా! వృథాగా ఈ విషయాలను గురించి మతికేదో మహావ్యాధి సంక్రమించినట్లు తలపోస్తూ, మీ సర్వశక్తినీ దిగజార్చుకొంటున్నారు. వెళ్ళండి. నీరు తెచ్చుకొని చేసిన హత్యకు నీచసాక్ష్యంగా కన్పించే ఈ నీలరక్తపంకాన్ని మీ చేతులమీద నుంచి కడిగివేయండి. ఆ ఛురికల నిక్కడి కెందుకు తెచ్చారు? అవి అక్కడనే ఉండాలి. తీసుకువెళ్ళండి. నిద్రిస్తున్న ఆ సేవకుల శరీరాలను రక్తంతో పులిమిపెట్టండి.

**మేక్బెత్ :** మళ్ళా ఇక నేనక్కడికి వెళ్ళను. చేసినదాన్ని గురించి ఊహించటానికే భయకంపితుడనౌతున్నాను. తిరిగి దాన్ని చూడటానికి సాహసించలేను.

**మేక్బెత్ ప్రభ్వి :** అయ్యో! మీరెంతటి దుర్బలచిత్తులు! ఆ ఛురికలనిలా ఇవ్వండి. నిద్రితులు, మృతులు కేవలం చిత్రరూపాలు. వారిని గురించి ఇంతటి భయమేమిటి? చిత్రాలలోని భూతాలను చూసి చిన్నపిల్లల కళ్ళు భయపడతాయి. దోషం వారిదిలా కనిపించాలి  కనుక ఆయాసపడే వారి శరీరాల నుంచి ఇంకా రక్తం స్రవిస్తుంటే దానితో వాళ్ళ ముఖాలను పులిమి పెడతాను.

**(నిష్క్రమిస్తుంది. లోపల చప్పుడు వినిపిస్తుంది)**

**మేక్బెత్ :** ఈ శబ్ద మెక్కడినుంచి? వినిపించే ప్రతిశబ్దం నన్నింత వింతగా తికమక పెడుతున్నదేమిటి? అయ్యో! నా హస్తాలెలా రక్తపంకిలా లైనాయి? నేత్రచషకాలనుంచీ నా కన్నులు చీల్చుకొని విడివడిపోతున్నాయి! నా హస్తాలనుంచీ ఈ రక్తమాలిన్యాన్ని కడిగివేయటానికి ఘనుడైన నెప్ట్యూన్[36] పాలించే మహాసముద్రంలోని నీరసర్వస్వమైనా చాలుతుందా? చాలదు. ఆ సముద్రంలోని అనంతవీచికలను నా హస్తాలు కెంపుచేసి వాటి హరితవర్ణాన్నంతటినీ ఒకేరీతి రక్తవర్ణంగా పరిణమించేటట్లు చేస్తాయి.

**మేక్బెత్ ప్రభ్వి తిరిగి ప్రవేశిస్తుంది.**

**మేక్బెత్ ప్రభ్వి :** మీ హస్తాలలాగానే, ఇవిగో, నా హస్తాలు కూడా ఎర్రబడ్డాయి. అయితే మీ వలె శ్వేత హృదయాన్ని వహించటానికి నేనెంతో సిగ్గుపడతాను (లోపల శబ్దం వినిపిస్తుంది) ఏదో శబ్దం దక్షిణద్వారం దగ్గరనుంచి వినిపిస్తున్నది. ఇక మన కక్ష్యకు వెళ్ళిపోదాం. కొంచెం నీరు చాలు మనకూ, ఈ కృత్యానికీ ఉన్న సమస్తబంధాన్నీ కడిగివేస్తుంది. ఎంతో సుగమంగా పని జరిగేపోయింది. అయితే మీ స్థిరనిశ్చయం మిమ్మల్ని మధ్యలో విడిచిపుచ్చింది. (లోపలనుంచి మళ్ళీ శబ్దం వినిపిస్తుంది) వింటున్నారా, శబ్దమింకా ఎక్కువౌతున్నది. మీ రాత్రి దుస్తులను ధరించండి. లేకపోతే కనిపించటంవల్ల బయటికి రావాలసివస్తుంది. అప్పుడు రాత్రంతా మనం మేల్కొన్నామని బయటపడవచ్చు. మీరింత దీనమైన ఆలోచనలల్లో మునిగిపోకూడదు సుమా!

**మేక్బెత్ :** నన్ను గురించి నా స్మృతి నాకున్నంతకాలం నేను చేసిన చర్య నాకు స్మరణకు వచ్చి తీరుతుంది. కనుక నేను నన్నే మరిచిపోవటం ఉత్తమం! (లోపల మళ్ళీ శబ్దం

వినిపిస్తుంది) డంకన్! నీవు ఇలాగే ధ్వనిచేస్తూ మేల్కో! నీకేగనక శక్తుంటే ఓ డంకన్! ఇలాగే ధ్వనిచేస్తూ నీవు మేల్కొనాలని నా అభిలాష!

**(నిష్క్రమిస్తాడు. లోపలనుంచి శబ్దం వినిపిస్తుంది. ద్వారపాలకు డొకడు ప్రవేశిస్తాడు.)**

**ద్వారపాలకుడు :** అబ్బా! ఎంత గొప్ప ధ్వని! ఈ ద్వారాన్ని తెరవటమంటే నరక ద్వారపాలకుడు చేయదగ్గ పనిలా ఉంది.

**(లోపలనుంచి మరింతగా ధ్వని వినిపిస్తుంటుంది)**

ధ్వని చేయండి! ఇష్టం వచ్చినంత గట్టిగా ధ్వని చేయండి!! బీల్జిబబ్[37] పేరు చెప్పి ప్రశ్నిస్తున్నాను. లోపలున్నవారెవరు? ఇందున్నదెవరో కాని నరకంలో ప్రవేశపెట్టదగ్గవాడు. ఇతడు సస్యం సమృద్ధిగా[38] పండటంచేత ధరలు పడిపోతాయేమో నన్న భయంతో ఆత్మహత్య చేసుకొన్నవాడిలా ఉన్నాడు. ఓ కృషీవలుడా! నీవు సరిగా సమయానికి వచ్చావు. ఇక్కడ ఎంతో విశేషంగా చెమట పోస్తున్నది. చాలినన్ని హస్తవసనాలను తెచ్చుకో,

**(లోపల మళ్ళీ శబ్దం వినిపిస్తుంది)**

తట్టండి! గట్టిగా తట్టండి!! మరో భూతంలా ఇంకా ఎవరో ఉన్నారు. అదెవరు? ఓహో! ఒక విషయంలో ఒకమారు ఔనని, మరోమారు కాదని పల్కి భగవత్సంబంధమైన దోషాన్ని ఆచరించటంవల్ల స్వర్గాన్ని పొందలేకపోయిన జెసూటువా! నీవు! సరే, ఓ జెసూట్![39] రా!

**(లోపలనుంచి మళ్ళీ ధ్వని వినిపిస్తుంది)**

నీవెవరు? ఓహో. ఇతడు ఆంగ్లసీవనకారుడై[40] ఉంటాడు. నీవిక్కడ ఇస్త్రీ చేసుకొంటుండవచ్చు.

**(మళ్ళీ ధ్వని వినిపిస్తుంది)**

మళ్ళీ ధ్వనా? ఇది శాంతించేటట్లు లేదు. ఇదెవరు? ఈ స్థలం నరకంలాకాక అతిశీతలంగా ఉంది. ఉష్ణంతో ఉండే నరకంలోని ద్వారపాలకుడు నిర్వహించవలసిన పాత్రను ఇక్కడ ఉండి నేను నిర్వహించలేను. నానావృత్తులకు సంబంధించినవాళ్ళ నందరినీ ఇందులోకి ప్రవేశపెడతాను. ఇక్కడ కొంతకాలం విలాసాలతో గడిపి వాళ్ళు తరువాత నిత్యముండే నరకంలో పడతారు.

**(మళ్ళీ ధ్వని వినిపిస్తుంది)**

వస్తున్నాను! త్వరపడకండి. ఈ ద్వారపాలకుణ్ణి[41] మరిచిపోకండి!!

**(ద్వారాన్ని తెరుస్తాడు)**

**మాక్డఫ్, లెన్నాక్స్ ప్రవేశిస్తారు.**

**మాక్డఫ్ :** ఏమోయ్ మిత్రుడా! తలుపు తీయడానికి ఇంత ఆలస్యమైందేం? రాత్రి నిద్రపోయేటప్పటికి ఆలస్యమైందా ఏమిటి?

**ద్వారపాలకుడు :** ఆర్యా! మేము రెండో మారు కోడి[42] కూసేదాకా త్రాగుతూనే ఉన్నాము.

**మాక్డఫ్ :** మీ యజమాని మేల్కొనివున్నారేమో నీకు తెలుసా? అదుగో, ఆయన ఇక్కడికే వస్తున్నారు. బహుశః మేము చేసిన ధ్వనులు ఆయనను మేల్కొల్పి ఉంటాయి.

**మేక్బెత్ తిరిగి ప్రవేశిస్తాడు.**

**లెన్నాక్స్ :** మహోదయా, సుప్రభాతం!

**మేక్బెత్ :** మీ ఇరువురికీ సుప్రభాతం!!

**మాక్డఫ్ :** థేన్ మహాశయా! మహారాజులు నిద్ర మేల్కొన్నారా?

**మేక్బెత్ :** ఇంకా లేదు.

**మాక్డఫ్ :** ఉదయమే పెందలకడ మేల్కోవలసిందని నన్నాజ్ఞాపించారు. ఇప్పటికే ఆలస్యమైనదనుకొంటుంటారు.

**మేక్బెత్ :** అయితే నేను మిమ్మల్ని వారి దగ్గరకు తీసుకుపోతాను.

**మాక్డఫ్ :** ఇటువంటి శ్రమ తీసుకోవటం మీకు సంతోషప్రదమైన కృత్యమని నాకు తెలుసు. నేనే ఒంటరిగా వెళ్ళి వారి దర్శనం చేసివస్తాను.

**మేక్బెత్ :** ఏ శ్రమంటే మనకు సంతోషదాయకమో దానివల్ల కలిగే శారీరకబాధకు తగ్గ బహూకృతి దానిలోనే ఉంటుంది.

**మాక్డఫ్ :** ఆ కర్తవ్యాన్ని మహారాజులు నాకు నిర్దేశించారు. కనుక వెళ్ళి మేల్కొల్పటానికి నేనే ధైర్యం చేస్తాను.

**(నిష్క్రమిస్తాడు)**

**లెన్నాక్స్ :** మహారాజులు తిరిగి ఈ నాడే వెళ్ళిపోతారా?

**మేక్బెత్ :** అవును. వెళ్ళిపోతారు. వారు చేసుకొన్న ఏర్పాటు ఇదే!

**లెన్నాక్స్ :** క్రితం రాత్రి తుపానుతో, గందరగోళంతో గడిచిపోయింది. మేము విడిసినచోట దీపికలు ఆరిపోయాయి. ఎన్నో రీతులైన రోదనధ్వనులు వినిపించాయని చెప్పుకొన్నారు. చావు కేకలు విన్పించాయట! ఆ ఆక్రోశాలలో కొన్ని ఆ రీతిగా భయంకరమైన కాలప్రవృత్తికి అనుగుణంగా మున్ముందు అన్ని రంగాలలోను మహోత్పాతాలు సంభవింపనున్నాయని ఘోషిస్తూ జోస్యం చెప్పాయట!! సంజ్వరం కలిగినట్లు పృథివి చలించిపోయిందని కొందరు చెప్పుకొన్నారు.

**మేక్బెత్ :** గడచిన రాత్రి మహాభీకరమైందే?

**లెన్నాక్స్ :** నా యువజీవితంతో దీనితో తుల్యమైన మరొక తుపాను కలిగినట్లు జ్ఞప్తిలో లేదు.

**మాక్డఫ్ తిరిగి ప్రవేశిస్తాడు.**

**మాక్డఫ్ :** దురంతం! దురంతం!! నాలుక పలుకలేని దురంతం! మనసు ఊహించలేని దురంతం!!

**మేక్బెత్, లెన్నాక్స్ :** సంగతేమిటి? ఏం జరిగింది?

**మాక్డఫ్ :** వినాశకశక్తి పరిపూర్ణమైన విజయాన్ని పొందింది. దైవద్రోహమైన హత్య పవిత్రీకృతమైన మన ఆలయాన్ని[43], మహారాజశరీరాన్ని, బ్రద్దలుకొట్టి ప్రాణహరణం చేసింది.

**మేక్బెత్ :** మీరు అనేదేమిటో నాకు బోధపడటం లేదు. ప్రాణహరణమా?

**లెన్నాక్స్ :** మీరు అనేది మహారాజు గురించేనా?

**మాక్డఫ్ :** అవును. ఆయన కక్ష్యలో ప్రవేశించి క్రొంగొత్త గార్గన్[44] చేసిన చర్యలా కన్పించే ఆ బీభత్సదృశ్యాన్ని చూసి మీ కన్నులకు కళవళపాటును కల్పించుకోండి. ఇక నన్నేమీ ప్రశ్నించకండి. వెళ్ళి చూసి స్వయంగా తెలుసుకోండి

**(మేక్బెత్, లెన్నాక్స్ నిష్క్రమిస్తారు)**

మేల్కోండి! సౌధనివాసులారా, మేల్కోండి!! హెచ్చరిక చేసే ఘంటికను మ్రోయించండి! రాజద్రోహం! బాంకో, డొనాల్బెయిన్, మాల్కోం మేల్కొండి!! మృత్యువుకు

ఛాయారూపంగా గోచరించే మీ మృదులమైన నిద్రను విదలించి వెయ్యండి. కేవలం మృత్యువునే దర్శించండి!! లెండి, లెండి! దర్శించండి!! ప్రళయకాలప్రతిరూపమైన దృశ్యాన్ని దర్శించండి!! మాల్కొం, బాంకో! సమాధులనుంచో అన్నట్లుగా మీరు లేవండి! ఈ భయంకర దృశ్యానికి తగినట్లు ప్రేతరూపాల్లో బయలుదేరి రండి!! ఘంటికను మ్రోగించండి!!

**(హెచ్చరిక చేసే గంట మ్రోగుతుంది)**

**మేక్బెత్ ప్రభ్వి ప్రవేశిస్తుంది.**

**మేక్బెత్ ప్రభ్వి :** ఇలా ఘోరంగా ఘంటికలను మ్రోగించి నిద్రిస్తున్న సౌధనివాసుల నందరినీ సమావేశం కావలసిందని పిలువవలసిన పని ఏమి వచ్చిపడ్డది? పలకరేం?

**మాక్డఫ్ :** మహోదయా! మేము విన్నవించేదాన్ని మీరు వినటం ఉచితం కాదు. అది చెవుల బడితే స్త్రీని హత్యచేసినంతౌతుంది.

**(బాంకో ప్రవేశిస్తాడు.)**

బాంకో, బాంకో! మన యజమానిని, మహారాజును హత్య చేశారు!

**మేక్బెత్ ప్రభ్వి :** అయ్యో! ఏమది? మా సౌధంలోనే?

**బాంకో :** ఎక్కడ జరిగినా అది దారుణమైన క్రూరకృత్యం. ప్రియమైన డఫ్, నిన్ను ప్రార్థిస్తున్నాను. నీవు చెప్పినదాన్ని కాదని అనను. నేను చెప్పింది అసత్యమని అను!

**మేక్బెత్, లెన్నాక్స్ తిరిగి ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** ఈ ఉపద్రవానికి ఒక గంట ముందుగా నేను మరణించి ఉన్నట్లయితే జీవితమంతా ఎంతో సంతోషంతో బ్రతికినవాడినయ్యేవాణ్ణి. ఈ క్షణంనుంచీ ఈ మానవ ప్రపంచంలో 'నీవు నాకోసం జీవించు' మని నన్ను కోరే ఉదాత్తుడింకెవరున్నారు? ఇక నాకు మిగిలినవారందరూ ఆటబొమ్మలు. అనుగ్రహం, విఖ్యాతి, రెండూ అంతరించాయి. జీవిత ద్రాక్షాసవం ఒలికి పోయింది. గర్వించి చెప్పుకోటానికి మరి పృథివికిక మడ్డితప్ప ఏమీ మిగలలేదు!

**మాల్కొం, డొనాల్బెయిన్ ప్రవేశిస్తారు.**

**డొనాల్బెయిన్ :** లోపమేమి జరిగింది?

**మేక్బెత్ :** అయ్యో! లోపం జరిగింది! మీకు తెలియకుండానే మీకు లోపం జరిగింది. జీవితమనే చెలమకు మూలమైన నీటిబుగ్గను నిలిపివేశారు. మీ జీవితాన్ని ఆపివేశారు.

**మాక్డఫ్ :** మీ తండ్రిని, మహారాజును, హత్య చేశారు?

**మాల్కొం :** అయ్యో! ఆ పని చేసిందెవరు?

**లెన్నాక్స్ :** మా బుద్ధికి తోచినంతలో ఆయన శయ్యాగృహరక్షకులు, వారి హస్తాలు, ముఖాలు రక్తపంకిలాలై ఉన్నాయి. ఇంకా వాటిని తుడవనైనా లేదు. అవి మాకు వారి తలగడలమీద కన్పించాయి. ఒక్కమారు వారు గ్రుడ్లు విప్పి మమ్మల్ని చూచారు. మేము భయభ్రాంతులమైనాము. ఎంతటివారైనా ప్రాణాపాయం లేదని నమ్మి వారి ప్రాంతానికి వెళ్ళటం క్షేమం కాదు.

**మేక్బెత్ :** ఆ సేవకులే స్పష్టంగా దోషులని ప్రత్యక్షంగా తెలిసిపోయినప్పటికీ, కోపతన్మయత్వంలో వారిని హతమార్చినందుకు నేను పశ్చాత్తాపపడుతున్నాను.

**మాక్డఫ్ :** మీరెందుకలా చేయవలసి వచ్చింది?

**మేక్బెత్ :** అట్టిస్థితిలో మనస్సంక్షోభాన్ని పొందుతూ వివేకంతోను, కోపోద్రేకాన్ని వహించి సమచిత్తంతోను, రాజభక్తిని భరిస్తూ ఉపేక్షాభావంతోను ఎవరుండగలరు? మానవుడెవడూ ఉండలేడు! మహారాజునెడ నాకు గల ప్రేమతీవ్రత, నిలుకడను కల్పించే నా వివేచనశక్తిని త్రోసిరాజన్నది.

రక్తపుచారికలతో ఒక వంక బంగారు తీగలను కూర్చి అల్లిన రజతవస్త్రంలాగాను, వినాశశక్తి బలవంతంగా ప్రవేశించి తన దుష్కృత్యాన్ని నిర్వర్తించటానికని ప్రకృతి శరీరంలో పడ్డ గండ్లలా తోచే సందులువద్ద గాయాలతోను ఒక వంక మహారాజు శరీరమూ, మరొకవంక హంతకులు వారి వృత్తికి చిహ్నమైన రక్తవర్ణంతోను ఘోరంగా పేరుకొన్న నెత్తుటిజాళ్ళతోను కనిపిస్తుంటే, ప్రేమించనేర్చినదీ, ఆ ప్రేమను ప్రదర్శించటానికి యోగ్యమైన సాహసం కలదీ అయిన హృదయం కలవాడెవడు నావలె వ్యవహరించకుండా ఊరుకొంటాడు?

**మేక్బెత్ ప్రభ్వి :** అయ్యో! సాయపడండి!

**మాక్డఫ్ :** ఆమె విషయంలో అతిశ్రద్ధ తీసుకోండి!

**మాల్కోం :** (డొనాల్బెయిన్‌తో) దుఃఖంలో మునిగిపోదగినంతటి కారణం ఉండికూడా మనం ఊరుకోటం ఎందుకు?

**డొనాల్బెయిన్ :** (మాల్కోంతో) అనుమానించటానికి అవకాశంలేని రహస్యమైన ఏమూలనో దాగి అదృష్టం కూడా అమాంతంగా మీదపడి మనను హతమార్చేటట్లున్న ఈ ప్రదేశంలో, ఎంత దుఃఖమున్నా వ్యక్తం చెయ్యటం ఎలా? ఇక్కడినుంచి వేగంగా వెళ్ళిపోదాం. కార్చటానికింకా మనకన్నీరు సిద్ధం కాలేదు.

**మాల్కోం :** (డొనాల్బెయిన్‌తో) ఘనమైనదైనప్పటికీ మన దుఃఖం తన్ను తాను ప్రదర్శించుకొనే రూపాన్ని పొందలేదు.

**బాంకో :** ఆమె విషయం శ్రద్ధ తీసుకోండి. (సేవకులు మేక్బెత్ ప్రభ్విని తీసుకోపోతారు) దరిదాపు నగ్నంగా ఉన్న శరీరాలకు చలిదెబ్బ తగలకుండా వస్త్రధారణ చేసివచ్చి తిరిగి సమావేశమై ఈ దారుణచర్యను గురించి విశేషమైన విచారణ సాగిద్దాం. ఇప్పుడు భయాలు, అనుమానాలు మనను కలతపెడుతున్నాయి. నన్ను సర్వేశ్వరుని పరంచేసుకొని ఆయన ప్రసాదించే రక్షతో కార్పణ్యాన్ని వహించి, రాజద్రోహం చేసిన ద్రోహుల రహస్యోద్దేశాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించటానికి నేను సంసిద్ధంగా ఉన్నాను.

**మాక్డఫ్ :** అందుకు నేనూ సిద్ధంగా ఉన్నాను.

**అందరు :** మేమూ అంతే.

**మేక్బెత్ :** వేగంగా మనమందరం యుద్ధోచితవేషాలను ధరించి అంతశ్శాలలో సమావేశమౌదాము.

**అందరు :** ఇది ఎంతో తృప్తికరంగా ఉంది. ఎంతో బాగుంది.

**(మాల్కోం, డొనాల్బెయిన్ తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

**మాల్కోం :** మరి మనమేమి చేద్దాం? వీరితో సాహచర్యం మనకు వద్దు. అనుభవించని దుఃఖాన్ని ప్రకటించటం అసత్యశీలురకు అతిసుగమమైన కృత్యం. నేను ఇంగ్లండుకు వెళ్ళిపోతాను.

**డొనాల్బెయిన్ :** నేను ఐర్లండుకు చేరిపోతాను. ఇరువురి గమ్యస్థానాలు వేరువేరుగా ఉండటంవల్ల ఇరువురికీ భద్రత ఉంటుంది. ప్రస్తుతం మనం ఉంటున్న ఇక్కడి వ్యక్తుల చిరునవ్వుల్లో చిరుకత్తులు కనిపిస్తున్నాయి. సన్నిహితులైన రక్తబంధువులైనకొద్దీ వారిలో రుధిరదాహం విశేషంగా కనిపిస్తున్నది.

**మాల్కొం :** హంతకుని ధనువునుంచి విడువబడ్డ దారుణబాణ మింకా దాని చరమలక్ష్యాన్ని చేరుకోలేదు. ఆ లక్ష్యపథాన్ని విడిచిపెడుతూ తప్పుకొని చరించటమే మనకు క్షేమకరమైన మార్గం. అందువల్ల మనం అశ్వాలను అధిరోహిద్దాం. సెలవు తీసుకోవాలన్న ప్రత్యేకశ్రద్ధ ఏమీ పెట్టుకోవద్దు. వేగంగా వెళ్ళిపోదాం. చోరుల్లా కేవలం మన శరీరాలతోనే జారుకొందాము. తమ భద్రత అన్నదే వారికి ఏకైకకాంక్ష అయినప్పుడు, చోరులు తమ శరీరాలను తామే కాజేసుకోపోవటం ధర్మం కదా!

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

**రాస్, ఒక వృద్ధుడు ప్రవేశిస్తారు.**

**వృద్ధుడు :** గడచిన నా డెబ్బది సంవత్సరాల జీవితం జ్ఞప్తికుంది. విపులమైన ఈ కాలంలో భయంకరాలు, విచిత్రాలు అయిన సంఘటనలు జరిగిన ఎన్నో సమయాలను నేనెరుగుదును. కానీ ఈ భీకరమైన కాళరాత్రి నా పూర్వానుభవాల నన్నిటినీ అతిశయించింది.

**రాస్ :** ప్రపంచఘాతుకరంగస్థలంమీద మానవుడు అభినయిస్తున్న పాత్రను చూచి కోపాన్ని వహించి ఆకసం దాన్ని నాశనం చేస్తానని భయపెట్టటం నీవు చూచావు కదా! గడియారం వల్ల ఇది పగలని తెలుస్తున్నది. కానీ పయనించే దీపమైన సూర్యుణ్ణి కారుమొయిళ్ళు కప్పివేయటం వల్ల కాళరాత్రిలా కన్పిస్తున్నది. జీవితప్రదానం చేసే సూర్యరశ్మిని చుంబించవలసిన ఈ సమయంలో పృథ్వీముఖాన్ని గాఢాంధకారం క్రమ్మివేసింది.

**వృద్ధుడు :** జరిగిపోయిన కృత్యంలా ఇదీ ఎంతో అసహజమైంది. గడచిన బుధవారంనాడు అది ఎంత ఎత్తున ఎగురకలదో అంత ఎత్తూ ఎగిరి విహరిస్తున్న ఒక శ్యేనాన్ని, సామాన్యంగా మూషికాలను తిని బ్రతికే ఒక ఉలూకం వెంటబడి తరిమికొట్టింది.

**రాస్ :** మరో విచిత్రమైన విషయం జరిగింది. మనోజ్ఞాలు, త్వరితగమనాలు అయిన డంకన్ అశ్వరాజాలు, తమ జాతిలో కల్లా అత్యుత్తమాలు, హఠాత్తుగా స్వభావం మారటం చేత మందురానుంచి తప్పించుకొని విడివడి పాలకులను లక్ష్యపెట్టకుండా మానవజాతిమీద యుద్ధాన్ని ప్రకటించగోరుతున్నట్లు ప్రవర్తించాయి.

**వృద్ధుడు :** అవి ఒకదాని నొకటి తినివేశాయని చెప్పుకొన్నారు.

**రాస్ :** ఆ వార్త సత్యమే  అది నా కళ్ళముందే జరిగింది. నేనెంతో ఆశ్చర్య పడ్డాను. అడుగో! మాక్డఫ్ మహాశయుడు వస్తున్నాడు. ఆర్యా, విశేషాలేమిటి?

**మాక్డఫ్ ప్రవేశిస్తాడు**

**మాక్డఫ్ :** మీరూ గమనించటం లేదా?

**రాస్ :** సామాన్యమైన హత్యకంటే అత్యధికమైన ఆ ఘోరకృత్యాన్ని చేసినదెవరో బయటపడ్డదా?

**మాక్డఫ్ :** మేక్బెత్ హతమార్చిన ఆ సేవకులే చేసివుంటారు.

**రాస్ :** అయ్యో! అలా చేయటంవల్ల వాళ్ళు ఆశించిన ప్రయోజనం ఏమై ఉంటుంది?

**మాక్డఫ్ :** సరే, వాళ్ళనెవరో రహస్యంగా ప్రేరేపించి ఉంటారు. మహారాజపుత్రులు మాల్కొం, డొనాల్బెయిన్ ఇరువురూ ఎవరికీ తెలియకుండా ఎక్కడికో తప్పించుకో పోయారు. ఈ పరిస్థితివల్ల ఆ చర్య చేసింది వాళ్ళేనన్న అనుమానానికి తావు కలిగింది.

**రాస్ :** స్వభావానికి విరుద్ధంగా జరుగుతున్న కృత్యాలకు ఇది మరో ఉదాహరణం. ఇది జీవితం మూలాన్నే నాశనం చేసుకొన్న ప్రతిఫలరహితమైన దురాశ. అయితే ఇక రాజ్యాధికారం మేక్బెత్‌కు సంక్రమిస్తుందన్నమాట!

**మాక్డఫ్ :** అతణ్ణి రాజుగా ఎన్నుకోటం ఎప్పుడో జరిగిపోయింది. కిరీటధారణకోసం అతను స్కోనుకు[45] వెళ్ళాడు కూడాను.

**రాస్ :** మరణించిన డంకన్ మహారాజు శరీరం ఎక్కడుంది?

**మాక్డఫ్ :** అతని పూర్వుల అస్థికలను భద్రపరచిన పవిత్రాగారమైన కోల్మ్‌కిల్[46]కు తీసుకోవెళ్ళారు.

**రాస్ :** మీరు కూడా స్కోన్‌కు వెళుతున్నారా?

**మాక్డఫ్ :** లేదు. సోదరా నేను ఫైఫ్‌కు వెళ్ళుతున్నాను.

**రాస్ :** మంచిది. నేను స్కోన్‌కు వెళ్ళుతున్నాను.

**మాక్డఫ్ :** సరే. అక్కడ మీకు సర్వం క్షేమకరంగా గడచిపోవుగాక! ఈ క్రొత్త వాతావరణంలో మనకు పూర్వంలా భద్రత ఉండకపోవచ్చు. అందుచేత మళ్ళీ మనం కలుసుకోలేకపోవచ్చు. సెలవు.

**రాస్ :** తండ్రీ! మరి శుభం!

**వృద్ధుడు :** చెడును మంచిగాను, శత్రువులను మిత్రులనుగాను మార్చటానికి యత్నించే మీకూ, మీ వలెనే శ్రమించే ఇతరులకూ పరమేశ్వరుడు సర్వశుభాలను చేకూర్చుగాక!

**(నిష్క్రమిస్తారు)**

# తృతీయాంకం

## ఒకటో దృశ్యం

**ఫోర్రెస్ రాజసౌధం. బాంకో ప్రవేశిస్తాడు.**

**బాంకో :** నీవు మహారాజువైనావు  కౌడర్ థేన్‌వైనావు  గ్లామిస్ థేనువైనావు  అంతే కాదు, ఆ మాంత్రికురాండ్రు వాగ్దానం చేసినవన్నీయైనావు. కానీ నీవు వారి జోస్యాలకు పరిపూర్తిని కల్పించటంకోసం రాజద్రోహానికి పాల్పడ్డావని నేను భావిస్తున్నాను. అయితే ఆ కిరీటం నీ వంశంలో నిలువదనీ, నేను అనేక రాజులకు మూలపురుషుడనౌతాననీ వారు జోస్యం చెప్పారు.

నీ విషయంలో వారి జోస్యాలు చిత్రరీతిని నిరూపితాలైనాయి. ఇలాగే, నీ విషయంలో వారి వచనాలు నిరూపితసత్యాలై భాసించినట్లు, మేక్బెత్, నా విషయంలో కూడా ఎందుకు సత్యాలు కాకూడదు? అవి నాకెందుకాశలు కల్పించకూడదు? ఇక ఆపివేస్తాను. ప్రస్తుతానికి ఇంతే.

**తుత్తారధ్వని, రాజవేషంలో మేక్బెత్, రాజ్ఞీవేషంలో మేక్బెత్ ప్రభ్వి, లెన్నాక్స్, రాస్, ప్రభువులు, ప్రభ్వీణులు పరివారాలతో ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** నేటిరాత్రి విందులోని మన ప్రధానాతిథి ఇక్కడనే ఉన్నాడు.

**మేక్బెత్ ప్రభ్వి :** వీరిని మరిచిపోయివుంటే మన గొప్ప విందులో కొరత ఏర్పడి, అంతా ఏదో లోపంగా ఉండేది.

**మేక్బెత్ :** ఉత్సవప్రాయంగా జరగనున్న ఈ నాటి రాత్రి విందులో నీవు తప్పక ఉండితీరాలని మా ప్రార్థన.

**బాంకో :** గౌరవనీయులైన తాము నన్ను ప్రార్థించటమేమిటి? ఆజ్ఞాపించండి. విప్పరాని రాజభక్తి సూత్రాలతో బంధితుడను. కర్తవ్యపాలన శీలంగల మీ సేవకుడను అయిన నేను, ఆ మీ ఆజ్ఞను పాటించి తీరుతాను.

**మేక్బెత్ :** నీవు మధ్యాహ్నం అశ్వవాహ్యాళికి వెళ్ళుతున్నావా?

**బాంకో :** అవును. మహాప్రభూ!

**మేక్బెత్ :** లేకపోతే ఈ నాటి సభలో నీ సరసమైన సలహాను అర్థిద్దామనుకొన్నాను. అది ఎప్పుడూ ఉదాత్తంగానూ, సరసంగానూ ఉంటుంది. సరే. కానీ అందుకు రేపటిదినాన్ని వినియోగిద్దాం. వాహ్యాళికి చాలాదూరం వెళ్ళుతున్నావా?

**బాంకో :** రాత్రి భోజనవేళ లోపల ఎంత దూరం వెళ్ళటానికి వీలుంటే అంత దూరం వెళ్ళుతాను. అంతకంటే వేగంగా నా అశ్వం పయనింపలేకపోతే, చీకటిపడ్డ తరువాత గంటకో, రెండు గంటలకో తిరిగివస్తాను.

**మేక్బెత్ :** విందుకు ఉండితీరాలి సుమా!

**బాంకో :** మహారాజా! వచ్చితీరుతాను.

**మేక్బెత్ :** రక్తవిద్రోహులైన నా సోదరపుత్రుల్లో[47] ఒకరు ఇంగ్లండులోను, ఇంకొకరు ఐర్లండులోను స్థిరపడిపోయినట్లు వింటున్నాను. పితృహత్యాదోషాన్ని అంగీకరింపక పోవటమే కాకుండా, వారు నాకు దుష్కీర్తిని తెచ్చిపెట్టిన వింతకథలను కూడా కల్పించి వెళ్ళిపోయినారు. ఇతరరాజ్యవ్యవహారాలతో బాటుగా ఆ విషయాన్ని గురించి రేపు ప్రసంగిద్దాము. సరే, ఇక నీవు అశ్వాన్ని అధిరోహించటానికి వెళ్ళు. నీవు రాత్రికి తిరిగివచ్చేదాకా మరి సెలవు. ఫ్లియాన్సు నీ వెంట వస్తున్నాడా?

**బాంకో :** అవును, మహారాజా! ఇక మేము బయలుదేరటానికి వేళైంది.

**మేక్బెత్ :** మీ అశ్వాలు జవోపేతాలు, వినిశ్చితపదాలు అగుగాక! ఈ శుభాకాంక్షలతో మిమ్మల్ని అశ్వాలను అధిరోహించమని వాంఛిస్తున్నాను, సెలవు.

**(బాంకో నిష్క్రమిస్తాడు)**

రాత్రి ఏడుగంటలవరకూ ఎవరి పనులను వారిని స్వేచ్ఛగా నిర్వర్తించుకోనిస్తాను. మిత్రబృందంతో కలిసి సమావేశాన్ని మనోహరంగా అనుభవించేటందుకుగాను రాత్రి భోజనవేళవరకూ ఏకాంతంగా గడుపుతాను. అంతవరకు సెలవు. (మేక్బెత్, ఒక సేవకుడు తప్ప అందరూ నిష్క్రమిస్తారు) ఒరేయ్! వారు మా ఆజ్ఞలను స్వీకరించటానికి సంసిద్ధులుగా ఉన్నారా?

**సేవకుడు :** చిత్తం మహారాజా! వాళ్ళు ద్వారదేశానికి అవతల వేచివున్నారు.

**మేక్బెత్ :** వారిని ఇక్కడికి తీసుకో రా. (సేవకుడు నిష్క్రమిస్తాడు) ఇలా మహారాజును కావటంతో సరిపోదు. ఈ పదవిలో భద్రంగా స్థిరపడిపోవాలి. బాంకో విషయంలో

నా భయం అతితీవ్రంగా ఉంది. అతని ప్రకృతిలోని రాజసం అతడంటే నేనెప్పుడూ భయపడేటట్లు చేస్తూనే ఉంది. అతడు అసామాన్యమైన సాహసం కలవాడు. మనోధైర్యానికి తోడుగా సర్వవ్యవహారాలను భద్రతతో నడిపించగల వివేకం కూడా అతనికుంది. ఒకరి ఉనికిని చూచి నేను భయపడతగ్గ వాడంటూ ఒకడుంటే ఆతడు తప్ప మరెవ్వరూ లేరు. సీజర్ ఎదుట మార్క్[48] ఆంటోనీ సంరక్షకశక్తి నిస్తేజమయ్యేదని చెప్పుకొంటున్నట్లుగా, అతడి ఎదుట నా సంరక్షకశక్తి భయకంపితమౌతున్నది.

'నీవు రాజువౌతా' వని మంత్రగత్తెలు నాతో చెపుతున్నపుడు అతడు వారిని మందలించాడు. తనతో ప్రసంగించవలసిందని శాసించాడు. అపుడు వారు 'నీవొక రాజపరంపరకు మూలపురుషుడవౌతా'వని జోస్యం చెప్పి అతడికి జయవెట్టారు. వారు నిరర్థకమైన కిరీటాన్ని నా శిరసుమీద నిలిపారు. నా వంశంతో ఎట్టి సంబంధమూ లేని మరొకని హస్తం బలవంతంగా లాగుకొనేటందుకు రాజదండాన్ని నా హస్తాని కందించారు. నాకు పిమ్మట నన్నుసరించి నా పుత్రుల్లో ఎవరూ రాజ్యపాలన చెయ్యరట! అది అలాగే జరిగేటట్లయితే బాంకో సంతతికోసం నేను నా మనస్సును మలినం చేసుకొన్నానన్నమాట! మహోదారుడైన డంకన్ను వారికోసం మహాఘోరమైన హత్య చేశానన్నమాట!! వారికోసం మధురమైన నా శాంతి చషకంలో కటుకాలైన ఓషధులను కలుపుకొన్నాన్నమాట!! బాంకో వంశజులను రాజులను చెయ్యటం కోసం మానవజాతికి సామాన్యశత్రువైన సైతానుకు అనర్ఘమణియైన నా ఆత్మను అమ్ముకొన్నానన్నమాట!! అలా జరగనీయను. అంతకంటే రానీ. విధి వ్యతిరేకపక్షంలో చేరిపోరాడనీ, మరణపర్యంతం ఎదుర్కొంటాను – ఎవరక్కడ?

**ఇరువురు హంతకులతో ఒక సేవకుడు ప్రవేశిస్తాడు.**

ద్వారం దగ్గరికి వెళ్ళి మేము తిరిగి పిలిచేదాకా అక్కడనే ఉండు. (సేవకుడు నిష్క్రమిస్తాడు) మనమిరువురం కలిసి మాటాడింది నిన్ననే కదా!

**మొదటి హంతకుడు :** అవును మహారాజా! నిన్ననే.

**మేక్బెత్ :** మంచిది. మేము మాటాడినదాన్ని గురించి బాగా ఆలోచించావా? మీ అదృష్టాన్ని పూర్వం అరికట్టింది అతడే. ఏమీ ఎరగని మేము ఆ పని చేశామని మీరనుకున్నారు. లేనిపోని ఆశలు కల్పించి మిమ్మల్ని ఎలా వంచించిందీ, ఎలా మీకు అడ్డంకిగా నిలిచిందీ, ఎటువంటి సాధనాలను అతడు ఉపయోగించిందీ, వాటితో

ఎవరిచేత ఏమేమి చేయించిందీ బాంకోయే నని, అర్థబుద్ధికైనా లేక వెర్రివాడికైనా స్పష్టంగా అర్థమయ్యేటట్లు గడచిన మన సమావేశంలో మేము మీకు విశదం చేశాము.

**మొదటి హంతకుడు :** అవును ప్రభూ! తాము తెలియజెప్పారు.

**మేక్బెత్ :** అలా చేయటమే కాదు. ఇంకా మరికొంత దూరం కూడా వెళ్ళాము. ఇది మన రెండో సమావేశం. ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఇలా గడిచిపోనిచ్చే సహనం ఇంకా మీలో బలవత్తరంగా ఉందనుకొంటాను. మిమ్మల్ని సమాధికి సన్నిహితులనుగా రూపొందించి, మీ ఆలుబిడ్డలను భిక్షుకులునుగా మార్చిన ఆ సజ్జనుడి క్షేమంకోసమూ, అతని సంతానసంక్షేమం కోసమూ నిత్యం పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తుండేటంతగా 'సువార్తల'మీద విశ్వాసం గలవాళ్ళా ఏమిటి మీరు?

**మొదటి హంతకుడు :** లేదు మహారాజా! మేమూ సామాన్యమానవులమే.

**మేక్బెత్ :** వేటకుక్కలు, రేచులు, మాలకుక్కలు, నక్క కుక్కలు, కుచ్చి కుక్కలు, ఊరకుక్కలు, బొచ్చుకుక్కలు, నీటికుక్కలు – అన్నీ లెక్కకు కుక్కల్లో చేరినట్లే, మీరూ మనుష్యుల లెక్కల్లో చేరుతున్నారు.

వేగకాళ్లు, మందకోళ్లు, వివేకులు, కాపుకాళ్లు, వేటకాళ్ళు అన్న వర్గీకణం కుక్కలకు వాటి వాటి గుణవిశేషాలను బట్టి కలుగుతుంటుంది. మనుష్యుల విషయంలో కూడా ఇలాగే జరుగుతుంటుంది. ఇలాటి మానవజాతి వర్గీకరణంలో మీకొక నియమిత స్థానమంటూ ఒకటుంటే అది మానవజాతిలో నీచతమమైంది కాకుంటే, మీ మీద ఒక కార్యభారాన్ని నిలుపుతాను. దాన్ని నిర్వహించటంవల్ల మీ శత్రువు తొలగిపోతాడు. మీరు మా హృదయానికి సన్నిహితులై మీ ప్రేమకు పాత్రులౌతారు. అతడు జీవించి వున్నంతకాలం మాకు రుగ్మత, అనారోగ్యం తప్పదు. అతడి మృతితో మా ఆరోగ్యం ఎంతైనా చక్కబడుతుంది.

**రెండో హంతకుడు :** మాత్సర్యం వహించిన నేను, గట్టిదెబ్బలు కొట్టి లోకంమీద పగ తీర్చుకోటానికి ఎట్టి సాహసచర్యకైనా వెనుదీయనివాడినిగా విధి దెబ్బలు తీసి తీర్చిదిద్దిన వ్యక్తిని నేను!

**మొదటి హంతకుడు :** కష్టాలను కల్పించి వెంటబడి తరుముతున్న విధితో మల్లయుద్ధానికి తలపడి, మంచినైనా, చెడ్డనైనా చేయటానికి జీవితాన్ని పణం పెట్టేటందుకు సిద్ధపడ్డ మరొకణ్ణి నేను.

**మేక్బెత్ :** బాంకో శత్రువని మీకు పూర్తిగా అర్థమైనదనుకుంటాను.

**హంతకులిద్దరు :** మహారాజా! పరిపూర్ణంగా అర్థమైంది.

**మేక్బెత్ :** మీకెలాగో అలాగే మాకూ అతడు శత్రువు. అతడు ప్రతిక్షణం అతితీవ్రమైన సాన్నిహిత్యంతో కడుపులో గుచ్చుకొన్న కత్తిలా మెలగుతున్నాడు. తలచుకుంటే మేమే మాకున్న రాజ్యాధికారంతో అతణ్ణి తుడిచిపెట్టగలం. కానీ మేము స్వప్నంలోనైనా ఆ పని చెయ్యకూడదు. మా ఉభయులకూ కావలసిన మిత్రులు కొందరున్నారు. వారి ప్రేమానుబంధాలను కోల్పోవటం మాకిష్టం లేదు. మేమే హతమార్చినప్పటికీ, అతడు లేకపోవటమనే శోకానికి అనుగుణంగా అంగలార్చవలసివుంది. కనుక ఈ విషయంలో మా పాత్ర ప్రజల నేత్రాలలో పడకుండా కప్పి పుచ్చటానికని మీ సహాయాన్ని కోరవలసి వచ్చింది.

**రెండో హంతకుడు :** మహారాజా! తామాజ్ఞాపించినట్లు చేసి తీరుతాము.

**మొదటి హంతకుడు :** మా ప్రాణాలు పోయినా సరే, చేసి తీరుతాము!

**మేక్బెత్ :** ఇప్పటి మీ ఉత్సాహం కన్నుల్లో భాసించి కనిపిస్తూనేవుంది. అతడికోసం మీరు ఎక్కడ కాపువేయాలో ఒక గంటసేపట్లో మీకు తెలియజేస్తాము. అంతకు మించనివ్వము. సర్వమెరిగిన గూఢచారిచేత ఏ సమయంలో పని జరిగిపోవాలో కూడా తెలియజేస్తాము. ఆ పని ఈ నాటి రాత్రే జరిగిపోవాలి. అది మా రాజసౌధానికి కొంతదూరంలో జరిగిపోవాలి. మాకూ, దానికీ ఎట్టి సంబంధం లేదన్న సంగతి మీరు మరిచిపోరాదు సుమా! నిర్వహించిన పనిలో అతుకులుగాని గతుకులుగాని, లేకుండా ఉండాలంటే, ఆ కాళరాత్రిలోనే అతనివెంట వస్తున్న అతని కుమారుడైన ఫ్లియాన్సుకు కూడా అదే అదృష్టాన్ని పట్టించాలి. అతని తండ్రికంటే కూడా ఆతడు లేకపోవటమే మాకెంతో అవసరం. ఈ విషయాన్ని గురించి విడిగా ఆలోచించి నిర్ణయించుకోండి. మళ్ళీ మిమ్మల్ని వెంటనే వచ్చి కలుసుకొంటాము.

**హంతకులిద్దరూ :** మహారాజా! మేము పూర్వమే నిర్ణయించుకొన్నాము.

**మేక్బెత్ :** అయితే మీరు సౌధప్రాంగణంలో ఉండండి. మిమ్మల్ని వెంటనే పిలిపిస్తాము. (హంతకులు నిష్క్రమిస్తారు) ఈ పని జరిగిపోయినట్లే. బాంకో! నీ ఆత్మ స్వర్గంలో ప్రవేశించవలసి వుంటే అది ఈ రాత్రికే జరుగుతుంది.

**(నిష్క్రమిస్తాడు)**

## రెండో దృశ్యం

**రాజసౌధం, మేక్బెత్ ప్రభ్వి, ఒక సేవకుడు ప్రవేశిస్తాడు.**

**మేక్బెత్ ప్రభ్వి :** సౌధంనుంచి బాంకో వెళ్ళిపోయినాడా?

**సేవకుడు :** అవును! మహారాజ్ఞీ! మళ్లీ రాత్రికి తిరిగి వస్తారు.

**మేక్బెత్ ప్రభ్వి :** వారికి అవకాశమున్నప్పుడు నేను వారితో కొన్ని మాటలు మాటాడాలె నని చెప్పు.

**సేవకుడు :** చిత్తం మహారాజ్ఞీ!

**(నిష్క్రమిస్తాడు)**

**మేక్బెత్ ప్రభ్వి :** సంపాదించింది ఏమీ కన్పించదు. పైగా సర్వం కోల్పోవటం జరిగింది. కాంక్షించిన ప్రయోజనాన్ని పొందినా మాకు మనశ్శాంతి తప్పింది. అనిశ్చితమైన సంతోషంతో చరించటంకంటే, మేము వినాశనం చేసిన వ్యక్తి ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానాన్ని పొందటం భద్రమైన పని.

**మేక్బెత్ ప్రవేశిస్తాడు**

ప్రభూ! మీ విషయం ఎంతో వింతగా ఉంది. దీనమైన దృశ్యాలను సహచరులనుగా చేసుకొని మరణించిన వ్యక్తితోబాటుగా మీ మనస్సులో మాసిపోవలసిన భావాలను మాటిమాటికీ త్రవ్వి తెచ్చిపెట్టుకొంటూ, మీరు ఎప్పుడూ ఏకాంతంగా ఉండి పోతున్నారేమిటి? ప్రతిక్రియల కవకాశంలేని విషయాలను గురించి ప్రబలమైన శ్రద్ధ పనికిరాదు. జరిగిపోయిందేమో జరిగిపోయింది.

**మేక్బెత్ :** కాలసర్పానికి చిన్నగాయాన్ని కల్పించగలిగామే, కాని మనం చంపలేక పోయినాము. దాని గాయం నయమైపోతుంది. ఆ విషసర్పం యథాకారతను పొందుతుంది. శక్తిహీనమైన మన ఈర్ష్యకు దాని ఘోరదంష్ట్రలవల్ల అతిశయమైన ప్రమాదం సంభవించి తీరుతుంది. నిత్యభయంతో భుజింపవలసిన నిర్బంధస్థితి మనకు కలుగకపూర్వమే నిశీథివేళల్లో నిరంతరం ప్రజల భీకరస్వప్నాల్లో కలవరపెడుతుంటే నిద్రింపవలసిన దుఃస్థితి మనకు రాక పూర్వమే, ఈ ప్రపంచనిర్మాణం భగ్నమగుగాక! స్వర్గమర్త్యాలు రెండూ సర్వనాశనాన్ని పొందుగాక!! నిద్రారహితమైన పరవశతతో మానసికయాతనలను అనుభవించటంకంటే ప్రశాంతి నార్జింపగలమన్న మిథ్యాకాంక్షతో

ఏ వ్యక్తికి సమాధిశాంతిని కల్పించామో, అతనితోబాటు వసించటమే మనకు అతిశయమైన సంక్షేమాన్ని చేకూరుస్తుంది. డంకన్ ఈ నాడు తన సమాధిలో ఉన్నాడు. జీవిత సంజ్వరానంతరం అతడు ఆ సమాధిలో చిత్తశాంతితో నిద్రిస్తున్నాడు. రాజద్రోహం అతనియెడ చేయగలిగినంత కీడు చేసింది. అయితే హంతకుని దారుణఖడ్గం గానీ, కాలకూటంగానీ, దేశీయశత్రువులుగానీ, విదేశీయసైన్యంగానీ, అతణ్ణి ఇప్పుడు ఏ మాత్రం స్పృశింపలేవు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇక రండి! ప్రభూ, మీరు పరమశాంతస్వభావులు. గంద్రవారిన మీ ముఖాన్ని కోమలతతో కప్పిపుచ్చండి. ఈ రాత్రి అతిథులమధ్య కళకళలాడుతూ ఉల్లాసంతో కనిపించండి.

**మేక్బెత్ :** ప్రియారాజ్ఞీ! అలాగే కనిపిస్తాను. నిన్ను కూడా అలాగే కనిపించవలసిందని అర్థిస్తున్నాను. నీ దృష్టినంతటినీ శ్రద్ధతో బాంకోమీదనే లగ్నం చెయ్యి. చూపులతో, మాటలతో అతణ్ణి అధికంగా గౌరవిస్తున్నట్లు కన్పించు. నూతనంగా మనం ఆర్జించుకొన్న గౌరవాలను తేజోవంతాలుగా నిలుపుకోటంకోసం వాటిని స్తోత్రపాఠసారణులలో స్వచ్ఛంగా సమ్మార్జనం చేయవలసినంతవరకూ, అవి సత్యమైన స్వరూపాలతో బయటపడిపోతాయేమోనని మన హృదయాలకు ముఖాలను జీరాలుగా చేసుకొని కప్పిపుచ్చుకోవలసిఉన్నంతవరకూ, అయ్యో! మనస్థితికి భద్రత అన్నది లేదు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇలా వేధించే ఈ ఊహలను మీరిక విడిచిపెట్టాలి.

**మేక్బెత్ :** వృశ్చికప్రాయాలైన ఊహలతో నా మనస్సు ఎలా నిండి ఉందో నీకు తెలియదు. బాంకో, ఫ్లియాన్సు ఇంకా సజీవులేనన్న అంశాన్ని తెలుసుకో.

**మేక్బెత్ ప్రభ్వి :** అయితే ప్రకృతి వారికి ప్రసాదించిన జీవిత ప్రమాణపత్రం నిత్యమైంది కాదు గదా!

**మేక్బెత్ :** అవును. వారి జీవితాలు పైనబడటానికి అవకాశమున్నవి కావటంవల్లనే మనకు కొంతలో కొంత ఊరట దొరుకుతున్నది. అందువల్ల నీవు ఉల్లాసంతో కన్పించు. ఈ రాత్రే మన ప్రాసాదంలోని గుప్తప్రార్థనాగారాల చుట్టూ విహరించడం కోసమని గబ్బిలాలు రాకముందే, కాళరాత్రి కధిదేవతయైన హెకేట్ పిలుపు విని పొలుసు రెక్కలమీద వ్రాలి బొద్దింకలు తమనిద్రా ముద్రితమైన ఝిల్లీనినాదాలతో రాత్రిదేవత అట్టహాసాన్ని ఎరుకపరచకముందే, ఆ భయానక చర్య జరిగి తీరవలసి ఉంది.

**మేక్బెత్ ప్రభ్వి :** ఏ భయానకచర్య?

**మేక్బెత్ :** ప్రియా! నిర్వర్తితమైన తరువాత పరికించి శ్లాఘించేటంతవరకూ ముందుగానే దానిని గూర్చిన, విశేషాలను నీవు తెలుసుకోకుండా ఉండటం ఎంతో మంచిది. డేగలను పెంచి వేటాడేవాడు వాటికన్నులను కుట్టేటట్టుగా జాలిగొల్పేటట్లు పగటికన్నులను కుట్టివేసే కాళరాత్రీ! రా! దారుణమైన నీ గుప్తహస్తంతో నిరంతరం నన్ను భయంవల్ల పాలిపొయ్యేటట్లు ఆ బిరుదాన్ని తుడిచిపెట్టి ఖండఖండాలుగా తుంచివెయ్యి! చీకటి దట్టమౌతున్నది.

అదిగో, కాకం! స్వకులనీడనిబిడమైన కాననానికి వెళ్ళిపోతున్నది. దినకాంతిలో తిరిగే సరసమైన ప్రాణిలోకం అలసి నిద్రకోసం ఆతురత వహిస్తున్నది. రాత్రికి ప్రతినిధులైన క్రూరసత్త్వాలు తమ ఎరలను వేటాడటం కోసం మేల్కొంటున్నవి. నా మాటలకు నీవు ఆశ్చర్యపడు తున్నట్లున్నావు? కొంతసేపు ఓపికపట్టు, దౌష్ట్యంతో ఆరంభించిన పనులకు క్రౌర్యంతోనే భద్రత చేకూరవలసివుంది. నన్ననుసరించు!

**(నిష్క్రమిస్తారు)**

## మూడో దృశ్యం

**దుర్గప్రదేశానికి దగ్గరలో ఉన్న ఒక ఉద్యానవనం.**
**ముగ్గురు హంతకులు ప్రవేశిస్తారు.**

**మొదటి హంతకుడు :** మమ్మల్ని కలుసుకోమని నిన్నెవ్వరాజ్ఞాపించారు?

**మూడో హంతకుడు :** మేక్బెత్.

**రెండో హంతకుడు :** 'మీరు చేయవలసిన పను' లని ఇతడు చెప్పే పనులన్నీ మొదట మనం స్వయంగా పొందిన సూచనలకు సరిపోతున్నవి. కనుక ఇతణ్ణి మనం అనుమానించవలసిన అవసరం లేదు.

**మొదటి హంతకుడు :** అయితే ఇక మాతోపాటు ఉండిపో. పడమటిదిక్కున పగటి వెలుగులింకా మసకమసకగా కన్పిస్తూనేవున్నవి.

ప్రయాణంలో ఆలస్యమైన బాటసారి దగ్గరిలో ఉన్న పాంథశాలను చేరుకోటానికని అశ్వాన్ని పరుగులు పెట్టిస్తున్నాడు. మనం ఎవరికోసం కాచుకొంటున్నామో ఆ వ్యక్తి కూడా సమీపిస్తుంటాడు.

**మూడో హంతకుడు :** నిశ్శబ్దం. ఏదో గుర్రపుడెక్కల చప్పుడు వినిపిస్తున్నది.

**బాంకో :** ఎవరక్కడ? వెలుగు చూపించండి.

**రెండో హంతకుడు :** ఇతడు అతడే అయి వుండాలి. విందుకు విచ్చేస్తారని ఉద్దేశించిన అతిథులందరూ ఇంతకుపూర్వమే ఆ స్థానానికి చేరివుంటారు.

**మొదటి హంతకుడు :** (వినటాన్ని అభినయిస్తూ) ఇతని గుర్రాలు చుట్టుబాటన నడుస్తున్నాయి.

**మూడో హంతకుడు :** ఆ బాట ఒక మైలు చుట్టుంటుంది. కానీ అతడు సామాన్యంగా అందరిలాగానే ఇంతవరకూ వచ్చి ఇక్కడినుంచీ దుర్గద్వారందాకా నడిచి వెళ్ళుతుంటాడు.

**రెండో హంతకుడు :** ఇదుగో కాగడా! ఇదుగో కాగడా!!

**మూడో హంతకుడు :** ఇతడు అతడే!

**మొదటి హంతకుడు :** అక్కడ స్థిరంగా నిలు.

**బాంకో, ఫ్లియాన్సు ఒక కాగడాతో ప్రవేశిస్తారు.**

**బాంకో :** ఈ రాత్రి వర్షం పడుతున్నది.

**మొదటి హంతకుడు :** పడనీ! (హంతకులు బాంకోమీద పడతారు)

**బాంకో :** ద్రోహం! ద్రోహం!! ఫ్లియాన్స్, పారిపో! పారిపో!! ప్రతీకారచర్య కోసం పారిపో!... ఓరి ద్రోహీ!

**మూడో హంతకుడు :** కాగడాను ఆరిపోనిచ్చింది ఎవరు?

**మొదటి హంతకుడు :** అలా జరగనీయకూడదా?

**మూడో హంతకుడు :** ఒకడే హతుడైనాడు. కుమారుడు[49] పారిపోయినాడు.

**రెండో హంతకుడు :** మనకృత్యంలో ఉత్తమభాగం చెడిపోయింది.

**మొదటి హంతకుడు :** సరే. మరి మనం వెళ్ళి ఎంతవరకు చేయగలిగామో ఆ విషయాన్ని నివేదిద్దాం.

**(నిష్క్రమిస్తారు)**

## నాల్గో దృశ్యం

**అదే ప్రదేశం. సౌధంలో ఒక విశాలమైన కక్ష్య. విందు సిద్ధమై ఉంటుంది. మేక్బెత్, మేక్బెత్ ప్రభ్వి, రాస్, లెన్నాక్స్, ప్రభువులు కొందరు, సేవకులతో ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** మీ మీ స్థానాలేవో మీకు తెలుసు. స్థానక్రమాన వాటిని స్వీకరించి అధివసింపగోరుతాను. ఇదే మీకు మా మనఃపూర్వకమైన స్వాగతం.

**ప్రభువులు :** మహారాజా! మీకివే మా అభివాదనలు.

**మేక్బెత్ :** మీతో కలిసిమెలిసే నేను వినతితో ఆతిథేయకృత్యాలను నిర్వహిస్తాము. మీ ఆతిథేయి అర్హాసనం మీద అధివసించి ఉంటుంది. మీకు స్వాగతి నెఱపేసమయం వచ్చినప్పుడు ఆమెను నేను పిలుస్తాను.

**మేక్బెత్ ప్రభ్వి :** నా పక్షాన కూడా మీరే మీ మిత్రులందరికీ స్వాగతవచనాలు పలకండి. వారందరినీ నేను మనఃపూర్వకంగా ఆహ్వానిస్తున్నాను.

**మేక్బెత్ :** మనఃపూర్వకమైన అభినందనలతో నా స్వాగతవచనానికి ఎలా ప్రత్యుత్తర మిస్తున్నారో! ఉభయ పార్శ్వాలలో సంఖ్య సమంగా ఉంది. మధ్యలో నేను ఉపవసిస్తాను.

**మొదటి హంతకుడు :** ద్వారదేశం దగ్గరకు ప్రవేశిస్తాడు.

స్వేచ్ఛతో వినోదించండి. ఇదిగో! నేను మీ అందరి ఆరోగ్యాలకోసం ఈ ఆసవాన్ని సేవిస్తాను (ద్వారదేశం దగ్గిరకు వచ్చి) నీ ముఖంమీద రక్తం కనిపిస్తున్నది.

**హంతకుడు :** అయితే అది బాంకోదన్న మాట, మహారాజా!

**మేక్బెత్ :** అతడు ఈ లోపల ఉండటం కంటే ఆతని రక్తం నీ ముఖంమీద ఉండటమే ఎంతో ఉచితమైన విషయం. అతణ్ణి పూర్తిచేశారన్నమాటేనా?

**హంతకుడు :** అవును ప్రభూ! అతడి పీక కోసేశాము. ఆ పని చేసింది నేనే!

**మేక్బెత్ :** అయితే హంతకజాతిలో నీవు అగ్రగణ్యుడవన్నమాట! కానీ ఫ్లియాన్స్ విషయంలో ఇట్టిపని జరిగించినవాడు కూడా ఇంతటి ప్రజ్ఞావంతుడే అని అనవలసి ఉంటుంది. అది కూడా నీవే చేసిఉన్నట్లయితే నీకు ఎవరూ సాటిలేరన్నమాట!

**హంతకుడు :** మహారాజా! ఫ్లియాన్స్ తప్పించుకొని పారిపోయినాడు.

**మేక్బెత్ :** అయితే భీతి మళ్లీ మిమ్మల్ని ఆవరిస్తుందన్న మాట! లేకపోతే మేము భద్రంగా ఒక పాలరాయిలా ఉండేవాళ్ళం. మా రాచరికమనే హర్మ్యం గండశిలల పునాదిమీద కట్టినట్లు అతిదృఢంగా నిలిచి ఉండేది. మనచుట్టూ వీచేగాలిలా ఎట్టి ఆటంకమూ లేకుండా అనంత స్వేచ్ఛను అనుభవింపగలిగేది. అలయించే అనుమానాలతో మేమిప్పుడు ముకుళించుకొని, మా కక్ష్యలోనే బంధించుకొని ఉండిపోవలసివచ్చింది – పోనీ ఇంకా బాంకో కూడా భద్రుడై లేడు కదా!

**హంతకుడు :** భద్రుడే మహాప్రభూ! అన్నిటిలో అల్పమైనదే ప్రాణం తీయటానికి సమర్థమైన ఇరవై గాయాలతో, కందకంలో అతిభద్రంగా ఉన్నాడు.

**మేక్బెత్ :** అందుకు మీకివే మా అభినందనలు. ఆ పెరిగితే పెనుజాతి పాము అక్కడ ఉండిపోయింది. సమయం వచ్చినప్పుడు విషాన్ని క్రక్కే స్వభావం కలదే అయినా పారిపోయిన ఆ పురుగుకు ఇంకా కోరలు రాలేదు. నీవు వెళ్ళిపో. రేపు మళ్ళీ ప్రసంగిద్దాము.

**(హంతకుడు నిష్క్రమిస్తాడు)**

**మేక్బెత్ ప్రభ్వి :** మీరు అతిథులకు అనుగుణాలైన స్వాగతవాక్యాలు పలికారు కారు. సౌజన్యంతో సక్రమంగా ఆతిథేయకృత్యాలను నిర్వర్తించినప్పుడు అది విందనిపించు కొంటుంది కాని, లేకపోతే కొన్ని రుచ్యపదార్థాలను అమ్ముతున్నట్లుగా అతిథులు భావిస్తారు. తినటం, త్రాగటమనేవి వాళ్ళ ఇళ్ళదగ్గిర ఇంతకంటే ఎంతో బాగా జరుగుతుంటాయి. కానీ ఒకరు విందును అనుభవిస్తున్నప్పుడు ఆచారపూర్వకమైన సౌజన్యంతో వ్యంజనాలను పూట పెట్టటం వల్ల రుచిని కల్పించటం కన్పించాలి. ఇది లేకపోతే గోష్ఠీసమావేశాలు చప్పగా ఉంటాయి.

**మేక్బెత్ :** ప్రియా! సమయానికి నా కర్తవ్యాలను జ్ఞప్తిచేసినందుకు కృతజ్ఞుణ్ణి. పదార్థాలను భుజించటానికి అవసరమైన జఠర ముందు, తరువాత జీర్ణశక్తి, పిమ్మట ఆ రెంటినీ అనుసరించి మంచి ఆరోగ్యం మీకు కలుగుగాక!

**లెన్నాక్స్ :** తాము తమ ఆసనాన్ని అధివసించవలసిందని వేడుకొంటున్నాను.

**(బాంకో ప్రేతరూపం ప్రవేశించి మేక్బెత్ స్థానంలో కూర్చొని వుంటుంది.)**

**మేక్బెత్ :** బాంకో మహాశయుడుకూడా విచ్చేసి ఉన్నట్లయితే, మన దేశానికి గౌరవాన్ని సంపాదించియిచ్చినవాళ్ళందరూ ఈ గృహాంతరాళంలో సమావేశమైనట్లుండేది. అతడు

రానందుకు సరైన కారణం తెలుసుకొన్నప్పుడు, ఏదో అవాంతరం వల్ల రాలేకపోయినందుకు అతణ్ణి కనికరించవలసిన స్థితి కలగటం కంటే రాకుండా నిర్దాక్షిణ్యాన్ని ప్రకటించినందుకు మందలించే స్థితి మాకు కలుగుగాక!

**రాస్ :** అతడు రాకపోవటం ఎందువల్లనైనా కావచ్చు. కానీ అది అతడు చేసిన వాగ్దానాన్ని ఉల్లంఘించటమే ఔతున్నది. ఘనత వహించిన తాము తమ స్థానాన్ని అధిష్ఠించి మాకు గౌరవాన్ని కల్పించండి.

**మేక్బెత్ :** స్థానాలన్నీ నిండివున్నాయి కదా?

**లెన్నాక్స్ :** ఇదిగో, ఇక్కడ మీకో స్థానం ప్రత్యేకించబడింది.[50]

**మేక్బెత్ :** ఏదీ ఎక్కడ?

**లెన్నాక్స్ :** మహాప్రభూ! ఇక్కడ. ఇలా కళవళపాటు పడుతున్నారేమిటి?

**మేక్బెత్ :** మీలో ఈ పని చేసింది ఎవరు?

**ఒక ప్రభువు :** ఏ పని మహారాజా!

**మేక్బెత్ :** ఈ పనిని నీవు చేశావని మేమనలేదు. రక్తసిక్తాలైన కురులతో కూడిన నీ శిరస్సును నా వంకకు అలా త్రిప్పకు.

**రాస్ :** మహాశయులారా! మనం వెళ్ళిపోదాం పదండి. మహారాజు లేదో బాధపడుతున్నట్లున్నారు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఉదాత్తమిత్రులారా! మీరు లేచివెళ్ళవద్దు. నా ప్రభువు తరచుగా ఇలాగే ప్రవర్తిస్తుంటారు. యౌవనారంభవేళనుంచీ అప్పుడప్పుడు ఇలా ఉండటం వారికి అలవాటు. మీరు లేవవద్దు. మీ మీ స్థానాలలో అధివసించవలసిందనీ నా ప్రార్థన. ఈ మరపు వారికి తాత్కాలికం. వారు మళ్ళీ స్వల్పకాలంలోనే యథాస్థితికి వస్తారు. మీరు వారిని గురించి ఆటే శ్రద్ధ వహించవద్దు. అందువల్ల వారి స్థితి ఉద్రిక్తమై అతిశయిస్తుంది. మీరు విందారగించండి. వారి సంగతి పట్టించుకోకండి – మీరు పురుషులేనా?

**మేక్బెత్ :** అవును. కేవలం పురుషుణ్ణి మాత్రమే కాదు. భూతాలనైనా భయపెట్టగలటం ఆ దృశ్యాన్ని సహితం దర్శించగల ధైర్యశాలిని కూడాను.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇదంతా అసంబద్ధమైన విషయం! మీ భయభావం వల్ల పుట్టిన విచిత్ర దృశ్యం! ఇది వెనుక మీరు నాతో చెప్పారు చూడండి. మిమ్మల్ని డంకన్ కక్ష్యకు నడిపించుకోపోయిన ఆ భ్రామికమైన ఛురికవంటి దృశ్యం!! అయ్యో? హఠాత్తుగా మీకు కలిగే ఈ ఉద్రేకోల్బణాలు, మైమరపులు వింతగా ఉంటున్నాయి. ఇవన్నీ భయంవల్ల కలుగుతున్నమాట సత్యం. ఇవన్నీ దీర్ఘాలైన శీతకాలసాయంతనవేళల్లో అగ్నికుండం ప్రక్కన కూర్చొని అమ్మమ్మ చెప్పిన దయ్యాల కథలను తిరిగి చెప్పే ఆడదానికి యోగ్యమైన విషయాలు. ఇదంతా సిగ్గు చేటుగా ఉంది. ముఖాన్ని వికారంగా ఎందుకలా త్రిప్పుతున్నారు? మీ కళ్ళముందు శూన్యమైన ఆసనంతప్ప మరేమీ కన్పించటం లేదే?

**మేక్బెత్ :** అదుగో అటు చూడు! అక్కడ! ఇప్పుడేమంటావు? అయితే నాకేమిటి? తలాడిస్తున్నావు నీవు మాటాడనుకూడా కలవన్నమాట! శ్మశానంలోని భూగర్భగృహాలు, సమాధులు, మృతి నొందినవారిని బయటికి పంపించి పృథ్వీమీద విహరింపజేస్తున్నవి. అయితే మున్ముందు మృతినొందిన వారిని గృధ్రాల గర్భకుహారాలలోనే సమాధి చేయించవలసి వుంటుంది.

(ప్రేతరూపం నిష్క్రమిస్తుంది)

**మేక్బెత్ ప్రభ్వి :** అర్థరహితమైన ఊహలతో మీరు ధైర్యాన్ని ఇలా కోల్పోతున్నారేమిటి?

**మేక్బెత్ :** ఇక్కడ నేను నిలుచోటం ఎంత సత్యమో, అంత సత్యంగా నేను అతణ్ణి చూస్తున్నాను.

**మేక్బెత్ ప్రభ్వి :** అబ్బా! మీ ప్రవర్తన సిగ్గుచేటుగా ఉంది!

**మేక్బెత్ :** న్యాయశాస్త్రాలు మానవసమాజాన్ని పవిత్రం చెయ్యని ప్రాచీనకాలంలో ఎంతగానో రక్తపాతం జరిగింది. ఆ తరువాత కూడా వినటానికే అతిఘోరాలైన మార్గాలలో హత్యలు జరుగుతూనే వచ్చాయి, మెదడును లాగిపారేస్తే వెనుకటి కాలంలో మానవుడు పూర్తిగా మరణించేవాడు. ఇప్పుడో తలమీద ఇరువై గాయాలు తగిలి మరణించినా, నిధనాన్ని పొందినవారు నిలువునా లేచివచ్చి ఆసీనులమైవున్న మనను ఆసనాలలో నుంచి నెట్టివేస్తున్నారు. ఇది నిశ్చయంగా హత్య కంటే వింతైన విషయం!

**మేక్బెత్ ప్రభ్వి :** ఉదాత్తప్రభూ! మీ ఉత్తమమిత్రులమధ్య మీరు ఉండకపోవటం జరుగుతున్నది.

**మేక్బెత్ :** అవును. నేనే నా అతిథేయకృత్యాలను మరిచిపోయాను. యోగ్యమిత్రులారా! నా ప్రవర్తనను గురించి ఆశ్చర్యపడకండి. నాకో వింత వ్యాధి ఉంది. నాతో మంచిపరిచయం ఉన్నవాళ్ళెవరూ దాన్ని పట్టించుకోరు. ఇక మనం విందారగిద్దాము. మీకివే నా ప్రణయాకాంక్షలు. మీకు సర్వశ్రేయాలు కల్గుగాక! ఇక నేను నా ఆసవాన్ని స్వీకరిస్తాను. ద్రాక్షాసవాన్ని కొంత

నాకందీయండి. చషకాన్ని నిండుగా నింపండి. ఇచ్చటికి వచ్చేసిన సభ్యులందరి ఆరోగ్యం కోసం, రాకపోవటంవల్ల నాకు చింతను కల్పించిన బాంకో ఆరోగ్యం కోసం నే నీ ఆసవాన్ని సేవిస్తున్నాను. ఆ బాంకో ఇక్కడ ఉన్నట్లే భావిస్తున్నాను. ఇవే మీ అందరికీ నా శుభాకాంక్షలు! అతడికి నా శుభాకాంక్షలు!!

**ప్రభువులు :** కర్తవ్యానుపాలనం చేస్తూ ప్రభుభక్తితో వర్తిస్తామని మేమందరం ఈ విందువేళ ప్రమాణం చేస్తున్నాము.

**బాంకో ప్రేతరూపం తిరిగి ప్రవేశిస్తుంది.**

**మేక్బెత్ :** వెళ్ళి పో! నా కంటిముందు నుంచి వెళ్ళి పో! పృథ్వి తిరిగీ నిన్ను తన గర్భంలోకి చేర్చుకొనుగాక! నీ శల్యాలు మజ్జావిరహితాలు. నీ రక్తమతిశీతలం. నీ నేత్రాలకు నిలుకడైన చూపే గాని జ్ఞానశక్తి లేదు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఉదాత్తప్రభువులారా! ఇదంతా వారికి సామాన్యలక్షణంగానే భావించండి. అంతకు మించి ఏమీ లేదు. అయితే ఇది ఈ సమయంలోని సంతోషాన్నంతటినీ భగ్నం చేస్తున్నది.

**మేక్బెత్ :** మానవుడికెంత సాహసముండటానికి వీలుందో అంత సాహసం నాకుంది. ఆ విషయంలో నేను ఎవరికీ లొంగేవాణ్ణికాను. ఇప్పటి నీ రూపంలో తప్ప బిరుసువారిన కేశాలు గల రష్యను భల్లూకంలా[51] గానీ, శృంగరక్షగల ఖడ్గమృగంలా కానీ, హైర్కానియన్ వ్యాఘ్రంలా[52]గానీ, మరే రూపంలోనైనా గాని నీవు రా! బిర్రబిగిసిన నా నరాలు ఆ దృశ్యాన్ని చూసినప్పుడు నన్ను భయకంపితుణ్ణి చెయ్యవు. లేదా నీవు తిరిగి జీవించి ఖడ్గపాణివై వచ్చి ద్వంద్వయుద్ధంలో నన్ను ఏకాంతప్రదేశంలోనైనా సరే, ఎదుర్కో. అప్పుడు నేను వణికినట్లు కనిపిస్తే 'వీడు క్రీడించే ఒక బాలిక చేతిలోని బొమ్మ' అని లోకానికి ప్రకటించు. పారి పో! ఓ భీకర ప్రేతమూర్తీ! పారి పో! సత్యమైన రూపం లేకుండా సజీవవ్యక్తి కొక పరిహాసరూపానివై కన్పట్టే ఓ వ్యక్తీ! తొలగి పో.

ఏమిటి? నేను కోరినట్లే ఆ ఛాయామూర్తి తొలగిపోయింది. నా ఆజ్ఞను పాటించింది. మళ్ళీ నేను మనిషినైనాను. ఉదాత్తులారా! మీరంతా కూర్చోండి.

**మేక్బెత్ ప్రభ్వి :** మీరీ సమయంలోని సంతోషాన్నంతటినీ భగ్నం చేశారు. వింతైన మీ వైకల్యం వల్ల ఈ సమావేశం విచ్ఛిన్నమైంది.

**మేక్బెత్ :** ఇట్టి విచిత్రవిషయాలు సంభవించినప్పుడు, అందులోను గ్రీష్మకాల మేఘంలా హఠాత్తుగా విచ్చేసినప్పుడు, అద్భుతావిష్టులు కాకుండా ఉండటానికి అవకాశముందా? చెక్కిళ్ళను పాలిపోయేటట్లు చేసే దృశ్యాలు కనిపిస్తుండమనే స్థితి నాకు సహజమై పోయింది. అట్టి స్థితిలో ఉన్న నన్ను చూచినా నీవు చెక్కిళ్ళమీద ఎర్రనికాంతిని కోల్పోవన్న భావంతో ఉన్న నాకు దానిని కోల్పోయి కన్పిస్తూ నా స్థితిని గురించి నేనే ఆశ్చర్యపడేటట్లు చేస్తున్నావు.

**రాస్ :** దృశ్యాలేమిటి మహారాజా?

**మేక్బెత్ ప్రభ్వి :** దయ ఉంచి వారిని పలకరించకండి. ఈ అపస్మారం ఇంకా విషమిస్తుంది. ప్రశ్నిస్తే వారు మరింత కళవళపడతారు. మీకు వీడ్కోలు చెపుతున్నాను. వెళ్ళిపోయే క్రమాన్ని గురించి మీరు విశేషశ్రమ వహించవద్దు. దయ ఉంచి వెంటనే వెళ్ళిపొండి.

**లెన్నాక్స్ :** సునక్తం! మహారాజులు అనతికాలంలో స్వస్థచిత్తులగుదురుగాక!

**మేక్బెత్ :** మీ అందరి కదే నా హృదయపూర్వకమైన సునక్తం.

**(మేక్బెత్, మేక్బెత్ ప్రభ్వి తప్ప మిగిలినవారు నిష్క్రమిస్తారు)**

**మేక్బెత్ :** అది రక్తాన్ని పుచ్చుకొని తీరుతుంది. రక్తం రక్తాన్ని[53] పుచ్చుకొంటుందని పెద్దలంటారు. హత్యలకు సంబంధించిన రహస్యాలను వెల్లడించటానికి శిలలు నడిచి వెళ్లుతాయట![54] వృక్షాలు ప్రసంగించగలుగుతాయట! శకునాలకు భవిష్యత్తులో జరుగబోయే అంశాలకు గల సంబంధాన్ని అవగతం చేసుకోగల శకునజ్ఞుల శక్తి, గోకరాళ్ళ కూతలు[55], కాకఘూకాల రొదలు హంతకుని ఎంతటి నిగూఢరహస్యాన్నైనా బయటపెడతాయట! ఇప్పుడు రాత్రి ఎంతై ఉంటుంది?

**మేక్బెత్ ప్రభ్వి :** ఇంకా రాత్రో లేక ఉదయమో చెప్పలేము.

**మేక్బెత్ :** మన ఆజ్ఞను పాటించటం కోసం మాక్డఫ్ విందుకు రావలసి వుండికూడా రాకపోవటాన్ని గురించి నీ అభిప్రాయమేమిటి?

**మేక్బెత్ ప్రభ్వి :** అతణ్ణి ఆహ్వానించటంకోసం ఎవరినైనా పంపించారా?

**మేక్బెత్ :** లేదు. కానీ అతడు విందుకు రావటానికి నిరాకరించాడని విన్నాను. ఎవరినైనా అతడికోసం పంపించి నిజమేమిటో తేలుస్తాను. ప్రతి ప్రభువు సౌధంలోనూ నేనే జీతమిచ్చి పోషించే సేవకుడు ఒకడుండనే ఉన్నాడు. మంచి వేళ చూసుకొని నేను రేపే మాంత్రికురాండ్ర దగ్గిరకి వెళ్ళుతాను. దాని స్వభావం ఎటువంటిదైనా, వాళ్ళవల్ల తెలుసుకోవలసిన చెడుగు ఇంకా ఏముందో తెలుసుకోడానికి నిశ్చయించాను. సిద్ధికోసం చెడ్డసాధనాలను ఎన్నింటిని ఉపయోగింపవలసివచ్చినా సరే, శ్రేయాన్ని చేకూర్చుకొనే విషయంలో నేను ఎందుకూ వెరవను! అందుకుగాను అన్నింటినీ త్రోసిరాజంటాను. రక్తంలో ఇంత వరకూ నడిచాను. ఇప్పుడు అవతలి ఒడ్డుకు చేరటం ఎంత కష్టమో, వెనక్కి వెళ్ళటం కూడా అంత కష్టం. నా మనస్సులో కొన్ని విచిత్రోద్దేశాలున్నాయి. జాగరూకతతో నిశితపరిశీలన చేయకపూర్వమే వాటికి కార్యరూపాన్ని కల్పించ వలసివుంది.

**మేక్బెత్ ప్రభ్వి :** సర్వప్రాణులకూ ఆరోగ్యాన్ని ప్రసాదించే నిద్ర మీకు బాగా కరవై కన్పిస్తున్నది.

**మేక్బెత్ :** పద, వెళ్లి నిద్రిద్దాం. దోషాచరణవిషయంలో నేనింకా ప్రాథమికుణ్ణి. నా యీ విభ్రాంతి నిరంతరం బహుళంగా దోషాలను ఆచరించటంవల్లగాని బండబారని భయభావం తప్ప మరేమీ కాదు. ఇట్టి కృత్యాల విషయంలో మనమింకా యువకులమే!

## ఐదో దృశ్యం

ఒక క్షేత్రసీమ. ఉరుములు వినిపిస్తుంటాయి. మాంత్రికురాండ్రు ముప్వురూ హెకేట్‌ను కలుసుకుంటారు.

**ప్రథమ మాంత్రికురాలు :** ఏమమ్మా! కోపదృక్కులను ప్రసరిస్తున్నావు, కారణమేమిటి?

**హెకేట్ :** గండ్రాగుండి తులువలైన మీబోటి ముసలి ముండలతో వ్యవహరించవలసిన నాకు, కోపానికి కారణం లేదంటారా? మీ మంత్రవిద్య కంతటికే అధిదేవతను. అన్ని అశుభాలనూ అల్లిక చేసేదానిని, మన విద్యాప్రావీణ్యాన్ని ప్రదర్శించేదానిని అయిన నన్ను, నా పాత్రను నిర్వహించటం కోసం ఆహ్వానించకుండానే మృత్యుసంబంధి వ్యవహారాల్లోను, మోసపు జోస్యాల్లోను స్వతంత్రించి మేక్బెత్‌తో వ్యవహరించటానికి మీకెంతటి సాహసం చేకూరింది! ఇతరులలాగానే మనమీది అనురాగం వల్ల కాక,

స్వప్రయోజనాలకోసం, మన నాదరిస్తూ, మనమీద మాత్సర్యం వహించి భయపెట్టే ఒక ముష్కరుడి కోసం ఇంత చేయటం మరీ చెడ్డపని. వెనుక చేసిందేదో చేశారు. ఇకముందు మీరు దాన్ని సరిదిద్దాలి. ఇవాళ్టికి వెళ్ళి రేపు నన్ను ఎకిరాన్ గర్తం దగ్గిర కలుసుకోండి. తన అదృష్టం ఎలా ఉందో తెలుసుకోటానికని అతడు అక్కడికి వస్తాడు. మీరు మీ కొప్పెరలతో, మంత్రోచ్చారణలతో, ఇంకా కావలసిన సర్వసన్నాహాలతో అక్కడ సిద్ధపడివుండండి. ఇప్పుడు నేను వాయుపథంలో విహరించాలి.

భీకరమూ, విధివిలాసమూ అయిన ఒక ప్రళయాన్ని సృష్టించటంలో నేనీ రాత్రినంతటినీ గడపవలసివుంది. రేపటి మధ్యాహ్నంలోపల ఒక ఘనమైన వ్యవహారాన్ని నిర్వర్తించవలసి వుంది. చంద్రశృంగం[56]మీద నిబిడమైన బిందువొకటుంది. అది భూమిమీద పడకముందే దాన్ని పట్టుకోవాలి. మంత్రోచ్చారణలతో ఆ నీహారబిందువును ధృతి చేస్తే ఆతణ్ణి వినాశనం వంకకు నడిపించే వంచనాశక్తి గల కృత్రిమభూతరూపాలు అందులోనుంచి ఉద్భవిస్తాయి. అతడు విధిని తిరస్కరిస్తాడు. మృత్యువును లెక్కించక అహంకరిస్తాడు. వివేకాన్ని, సారళ్యాన్ని, భయాన్ని త్రోసిపుచ్చి అతిసాహసోపేతుడైన ఆశాపరుడౌతాడు. అతిశయమైన ఆత్మవిశ్వాసం మానవులకు అగ్రగణ్యమైన శత్రువని మీకు తెలిసిందేకదా?

**(లోపల సంగీతం 'రారా హెకేట్ రావమ్మా' రా రా హెకేట్ రా!' అన్న పాట వినిపిస్తుంది.)**

వినండి. అదుగో, నన్ను పిలుస్తున్నది. అటు చూడండి. మంచుతో నిండిన మబ్బుమీద కూర్చొని అదే నా ముద్దుల శక్తి నన్ను పిలుస్తున్నది.

**(నిష్క్రమిస్తుంది)**

**ప్రథమ మాంత్రికురాలు :** రండి. పోదాం త్వరపడండి. మళ్ళీ ఈమె త్వరలోనే వచ్చేస్తుంది.

**(నిష్క్రమిస్తారు)**

## ఆరో దృశ్యం

**ఫోర్రెస్, రాజసౌధం, లెన్నాక్స్, మరొక ప్రభువు ప్రవేశిస్తారు.**

**లెన్నాక్స్ :** నా పూర్వసంభాషణలు మీ ఊహలకు సరిపోయాయన్నమాట! ఇక నేను చెప్పకుండా విడిచిపుచ్చినదాన్ని మీరే వ్యాఖ్యానించుకోండి. అయితే నేను ఇంతమాత్రం

చెపుతాను. అన్ని విషయాలూ విచిత్రంగా జరిగిపోయాయి. ఉదాత్తుడైన డంకన్[57] గురించి మేక్బెత్ కరుణరస మొలికించాడు. మేరీసాక్షిగా అతడు మరణించాడు. పరాక్రమవంతుడైన బాంకో ప్రొద్దు గ్రుంకిన తరువాత రాత్రి ప్రయాణం చేశాడు. ఫ్లియాన్సు పారిపోయాడు. కనుక ఆ ఫ్లియాన్సే అతణ్ణి హత్యచేశాడని మీరు అనవచ్చు. ఈ దినాల్లో ప్రొద్దు గ్రుంకిన తరువాత రాత్రులో మనుష్యులు ప్రయాణం చెయ్యకూడదు. చేస్తే – సత్యం చెప్పవలసివస్తే ఉదారుడైన తండ్రిని చంపిన మాల్కొం, డొనాల్బెయిన్ ఎంతటి ఘాతుకచర్య చేశారన్న భావం ఎవరికి కలగకుండా ఉంటుంది! అయ్యో! అది ఎంతటి నీచకృత్యం! అది మేక్బెత్‌ను ఎంత గాఢంగా దుఃఖపెట్టింది! పునీత క్రోధంవల్ల అతడు ఉద్రేకించి పానపిశాచికి బానిసలు, నిద్రాసతికి దాసులు అయిన ఆ దోషులనిద్దరినీ చీల్చిపారేయలేదా? అది మహోదాత్తకృత్యం కాదనగలమా? ఆ స్థితిలో వాళ్ళు దోషులము కామని చెప్పుకొంటుంటే, మానవహృదయం కలవాళ్ళకెవరికైనా అంతటి కోపం వచ్చి తీరుతుంది. కనుక అప్పుడతడు వివేకంతో కూడా వర్తించాడనే అనవలసివస్తుంది. అందువల్ల అతడు సర్వవ్యవహారాలనూ సక్రమంగా సర్దుకోవచ్చాడని మళ్లీ ఒకమాటు చెపుతున్నాను.

డంకన్ మహాశయుని పుత్రులే అతడి స్వాధీనంలో ఉండి ఉన్నట్లయితే – అట్టిపని తిరిగి ఎన్నడూ జరుగకుండుగాక అని నేను పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను – తప్పకుండా వారు తండ్రిని చంపటమంటే ఏమిటో తెలుసుకొనివుండేవారు. పారిపోకుంటే ఫ్లియాన్సు పనికూడా అంతే ఐ ఉండేది. కానీ, ఇష్, నిష్కాపట్యంతో పలుకుతాడనీ, ఈ నిరంకుశు డు చేసిన విందుకు రాక తప్పించాడనీ, మాక్డఫ్ అవమానితుడౌతున్నట్లు వింటున్నాను. మహాశయా! ఇప్పుడతడెక్క డుంటున్నాడో మీకేమైనా తెలుసునా?

**ప్రభువు :** ఎవని జన్మ స్వత్వమైన బ్రతుకు నీ నియంత నిలిపివేశాడో, ఆ డంకన్ మహాశయునికి పుత్రుడైన ఆతడిప్పుడు ఆంగ్లసంస్థానంలో వసిస్తున్నాడట! పరమపవిత్రుడైన ఎడ్వర్డు రాజు[58], విధివహించిన విద్వేషంవల్ల జన్మచే లభించిన గౌరవానికి అణుమాత్రమైనా లోపం రానిరీతిగా అతణ్ణి ఆహ్వానించాడని విన్నాను. నార్తంబర్‌లాండు, సివర్డు ప్రభువులను సైన్యసహాయం చెయ్యటంకోసం పురికొల్పి, వారి సహాయంతోను ధర్మోపేతమైన కృత్యాలకు లభ్యమయ్యే భగవదనుగ్రహంతోనూ మనం సుఖంగా తిని భద్రంగా నిద్రించటానికి, హత్యా ఖడ్గప్రదర్శనలు[59] లేకుండా విందు విలాసాలకు పొందటానికి సత్యమైన రాజునెడ భక్తిని ప్రకటించి, ఆయనవల్ల సత్కార్యాచరణకు దోహదమిచ్చే యోగ్యగౌరవాలను పొందటానికి తగ్గ అవకాశాన్ని

కల్పించేటందుకు, ఆయన పక్షాన మాక్డఫ్ కూడా పవిత్రుడైన ఆ రాజును ప్రార్థించడానికని వెళ్ళాడు. ఇటువంటి మహాహ్లాదసమయం ఎప్పుడు వస్తుందా అని అలమటించిపోతున్నాము. ఈ వార్తలు మేక్బెత్‌ను ఎంతగానో సంకటపెట్టాయి. అతడు యుద్ధాభిలాషతో సన్నాహాలు సాగిస్తున్నాడు కూడాను.

**లెన్నాక్స్ :** అతడు మాక్డఫ్ కోసం[60] వార్త పంపించలేదా?

**ప్రభువు :** పంపించాడు. అతడు 'అయ్యా! నేను తిరిగిరాను' అని విస్పష్టంగా సమాధానం చెప్పి పంపించాడు. వెళ్ళిన వార్తాహరి 'ఇట్టి సమాధాన నిర్వహణభారాన్ని నా మీద పడవేసిన సమయాన్ని గురించి మునుముందు మీరెంతో చింతపడతా' రన్నట్లుగా ఏమేమో గొణిగినట్లు తోచి గిరుక్కున వెనక్కి తిరిగాడట!

**లెన్నాక్స్ :** దీన్నిబట్టి అతడు అత్యంత జాగరూకతతో మెలగవలసివుందనీ, సాధ్యమైనంత దూరాన ఉండవలసివుందనీ అతని చేష్ట చెపుతున్నదన్నమాట! ఒక నిరంకుశుని క్రూరపాలనకు లోనై బాధపడుతున్న మన దేశానికి శాంతిసౌఖ్యాలను చేకూర్చటంకోసం, మాక్డఫ్ కంటే ముందుగానే ఒకదూత ఆంగ్లస్థానానికి వెళ్ళి అతని సందేశాన్ని తెలియజేయవలసి వుంది.

**ప్రభువు :** భగవంతుణ్ణి గురించి నేను సత్ప్రార్థనలు చేసి అవి ఆ దూతను అనుసరించేటట్లు చేస్తాను.

**(నిష్క్రమిస్తారు)**

# చతుర్థాంకం

## ఒకటో దృశ్యం

**ఒక గుహ, మధ్యలో తెకతెక కాగుతున్న ఒక కొప్పెర. ఉరుములు.**
**మాంత్రికురాండ్రు ముివ్వురూ ప్రవేశిస్తారు.**

**ప్రథమ మాంత్రికురాలు :** చారలపిల్లి[61] ముమ్మారు మ్యావ్ మ్యావన్నది.

**ద్వితీయ మాంత్రికురాలు :** ముళ్ళపంది మూడున్నొక్కమారు[62] ముక్కుతో గుర్రుపెట్టింది.

**తృతీయ మాంత్రికురాలు :** కొప్పెర చుట్టూ గుండ్రంగా తిరుగుదాం. విషమిచ్చి చంపిన జంతువుల ఆంత్రాదులను అందులో పడవేయండి. చర్మం మీదుగా విషాన్ని వెలిజిమ్ముతూ ముప్పది ఒక్క రాత్రింబవళ్ళ కాలం నిద్రించిన గోదురుకప్పను పట్టుకొన్నాం. దాన్ని ముందుగా ఆ మంత్రకటాహంలో ఉడకబెడదాం.

రెక్కాని గొప్పగ రెండింతలుగా
సంకటపడదాం, శ్రమచేద్దాం
అగ్నీ, ఘనముగ వెలుగు!
హండీ, మెండుగ ఉడుకు!!

**ద్వితీయ మాంత్రికురాలు :** తేమనేలనుంచీ పట్టి తెచ్చిన పాము ముక్కలను కొప్పెరలో ఉడకపెట్టి మరిగిద్దాం. నీరుడం కంటిని, కప్ప బొటనవ్రేలిని, గబ్బిలం వెంట్రుకలను, కుక్క నాల్కను, కట్లపాము రెండు పాయలనాలుకను, మొండికట్టె తోకను, బల్లికాలును, గుడ్లగూబ రెక్కను – వీటన్నింటినీ కలిపి ఉడికించి వేయిద్దాం.

**అందరు :** రెక్కాని గొప్పగ రెండింతలుగా
సంకటపడదాం, శ్రమ చేద్దాం.
అగ్నీ, ఘనముగ వెలుగు!
హండీ, మెండుగ ఉడుకు!!

**తృతీయ మాంత్రికురాలు :** ఘటసర్పపు పొలుసు చర్మాన్ని, తోడేలు పన్నును, మమ్మీ పొట్టను, ఉప్పునీటి సముద్రంలో ఆకలితో అలమటించే షార్కుచేప గొంతుకను, రాత్రివేళ

త్రవ్వి తీసిన హెమ్లాక్ విషౌషధి వ్రేళ్ళను, ఈశ్వరుడిమీద నమ్మకం లేని జ్యూజాతివాని[63] కార్జాన్ని, మేకపిత్తాన్ని, చంద్రగ్రహణవేళ చెక్కిన యూజాతి వృక్షపు నలిని, తురుష్కుని ముక్కును, తార్తారుని పెదవులను, నీచజాతి స్త్రీ పుట్టగానే గొంతు పిసికి చంపి గోతిలో పారేసిన పసిబిడ్డ వ్రేలును – వీటన్నిటినీ వేసి ఆ చరువుని చిక్కగా చేతికంటుకొనేటట్లు జిగురు చేద్దాం. కొప్పెరలోని దినుసులన్నిటితో చివరకు పులి పేగులను చేరుద్దాం.

**అందరు :** రెక్కొని గొప్పగ రెండింతలుగా
సంకటపడదాం, శ్రమ చేద్దాం
అగ్నీ, ఘనముగ వెలుగు!
హండీ, మెండుగ ఉడుకు!!

**ద్వితీయ మాంత్రికురాలు :** అప్పుడు దానితో బాబూను కోతినెత్తురు కలిపి చల్లారబెట్టామంటే అంతటితో ఈ 'మంత్ర కవచం' పరిపూర్తిని పొంది శక్తి గలదౌతుంది.

**హెకేట్ ప్రవేశిస్తుంది.**

**హెకేట్ :** చాలా బాగా నడిపిస్తున్నారు. మీరు పడుతున్న శ్రమకు మిమ్మలినందరినీ అభినందిస్తున్నాను. మీలో ప్రతి ఒక్కరికీ ప్రతిఫలం దొరుకుతుంది. దివ్యవనితల్లా, గంధర్వగాయనుల్లా చేయి చేయి పట్టుకొని, పాటలు పాడుతూ, ఇప్పుడు కొప్పెర చుట్టూ తిరిగి మీ ఉచ్చాటనతంత్రం వల్ల అందులో వేసిన సర్వసంభారాలకూ శక్తిని కల్పించండి.

లోపలినుంచి సంగీతం, 'నీలి నీలి భూతాల్లారా' అన్నపాట వినిపిస్తుంది.

**(హెకేట్ నిష్క్రమిస్తుంది.)**

**ద్వితీయ మాంత్రికురాలు :** బొటనవ్రేలికేదో కుట్టినట్లు బాధ పెడుతున్నది. ఏదో క్రూరరూపం అందువల్ల ఇటు వచ్చేటట్లు తోస్తున్నది.

తాళాల్లారా విడిపొండి,
తట్టేదెవరో రా రండి!

**మేక్బెత్ :** ఓ వృద్ధవనితల్లారా! ఈ కరాళరాత్రిలో ఇంత రహస్యంగా ఏమిటిది? ఏమిటి చేస్తున్నారు.

**అందరు :** పేరు లేని ఒక పని.

**మేక్బెత్ :** మీ విద్యమీద ఒట్టుపెట్టి మీకు తెలుసుననే విశ్వాసంతో అడుగుతున్నాను. నే వేసే ప్రశ్నలన్నింటికీ మీరు సమాధానాలు చెప్పి తీరాలి. బంధనాలను విప్పి పెనుగాలులను చెలరేగించి దేవమందిరాలమీదికి పంపించినా సరే, నురుగుముద్దలతో నిండి మిడిసిపడే అలలచేత నౌకాభంగాలను జరిపించి ఆ యానపాత్రలను మ్రింగివేసేటట్లు చేసినాసరే, మీరే కల్పించే తుపానుతో అంచులు కట్టిన ధాన్యపుమొక్కలను నేలవ్రాలించి, వృక్షాలను కూలద్రోయించి, సౌధాలు కదలిపోయి రక్షకుల నెత్తిమీద కుప్పకూలేటట్లు చేసినాసరే, పిరమిడ్లలా సుస్థిరాలైన రాజహర్మ్యశిఖరాలు, ఇతరనిర్మాణాల శిరసులు పునాదుల్లోకి వంగి పూడిపోయినా సరే, వినాశమే తన కృత్యానికి విసగట పొందేటంతవరకూ ప్రాకృతికమూల్య సంపదైన ప్రాణిబీజాలు సర్వం ఒక పెంటకుప్పగా పోగుపడ్డా సరే, మీరు నా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు  చెప్పితీరాలి సుమా!

**ప్రథమ మాంత్రికురాలు :** అడగవచ్చు.

**ద్వితీయ మాంత్రికురాలు :** ఆజ్ఞాపించు!

**తృతీయ మాంత్రికురాలు :** సమాధానాలు చెప్పగలం.

**ప్రథమ మాంత్రికురాలు :** సమాధానాలను నీవు మా నోట వింటావా? లేక మాకు యజమానురాండ్రయిన శక్తులవల్ల వింటావా? మొదట చెప్పు.

**మేక్బెత్ :** ఆ శక్తులనే పిలవండి. వారిని నన్ను చూడనివ్వండి.

**ప్రథమ మాంత్రికురాలు :** అయితే తాను పెట్టిన తొమ్మిది పిల్లలను తిన్న ఈ ఆడుపంది నెత్తురును ఇందులో వ్రేల్చు. ఆ తలారి ఉరికంబంమీద పేరుకొన్న జిడ్డును ఈ మంటలో పడవెయ్యి.

**అందరు :** ఓ అదృశ్యపిశాచాల్లారా! రండి! కొద్ది గొప్ప అనే తారతమ్యాలు లేకుండా మీరందరూ వేగంగా విచ్చేసి. మీ మీ విద్యాప్రావీణ్యాలను ప్రదర్శించండి.

ఉరుములు వినిపిస్తాయి. మొదటి పిశాచం – శిరస్త్రాణంతో ఉన్న ఒక తల

**మేక్బెత్ :** ఓ విచిత్రపిశాచమా! చెప్పు. నా మన.....

**ప్రథమ మాంత్రికురాలు :** నీ మనస్సులోని భావాలేమిటో ఆయనకు తెలుసు. చెప్పేది విను. నీవేమీ ఆయనతో మాటాడకు.

**మొదటి పిశాచం :** మేక్బెత్! మేక్బెత్!! మేక్బెత్!! మాక్డఫ్‌ను గురించి జాగ్రత్త! ఈ ఫైఫ్‌థేనును గురించి జాగ్రత్త! ఈ చెప్పింది చాలు. నన్ను పంపించి వెయ్యి.

**(దిగిపోతుంది)**

**మేక్బెత్ :** నీవు ఎటువంటి దుష్టపిశాచానివైనా కావచ్చు. కానీ నీవు నాకిచ్చిన సలహాకు నీకివే నా ధన్యవాదాలు. నీవు నా భయతంతువును గమనించి చక్కగా మీటావు. కానీ మరోమాట.

**ప్రథమ మాంత్రికురాలు :** ఆయన నీ శాసనాలను పాలించే వాడు కాదు. ఇదుగో, అతనికంటే శక్తిమంతుడు మరి ఇంకో పిశాచం వస్తున్నాడు.

**(ఉరుములు వినిపిస్తాయి. రెండో పిశాచం – ఒంటినిండా రక్తంతో ఒక బిడ్డ, గోచరిస్తాడు.)**

**రెండో పిశాచం :** మేక్బెత్! మేక్బెత్!! మేక్బెత్!!

**మేక్బెత్ :** నాకు మూడు చెవులున్నా, వాటినన్నిటినీ నీవు చెప్పే విషయాన్ని వినటంకోసమే ఉపయోగిస్తాను.

**రెండో పిశాచం :** మనస్సును హత్యామయం చెయ్యి. ధైర్యం వహించు. స్థిరనిశ్చయుడవుకా. స్త్రీ గర్భాన జన్మించిన వ్యక్తి ఎవ్వరూ, మేక్బెత్, నిన్ను ఏమీ చెయ్యలేరు. కనుక మానవశక్తిని అలక్ష్యం చెయ్యి! దాన్ని పరిహసించు.

**(దిగిపోతుంది)**

**మేక్బెత్ :** అయితే మాక్డఫ్! నీవు సజీవుడవుగానే ఉండిపో. నీ మూలంగా నేను భయపడవలసిన అగత్యం లేదు. అయినా నా భద్రతను రెండింతలు గట్టి చేసుకొంటాను. విధివల్ల నా క్షేమాన్ని గురించి ఒక ఒడంబడిక పుచ్చుకొంటాను. మాక్డఫ్! నీవు జీవించరాదు. పిరికిగుండెవల్ల పాలిపొయ్యే భయంతో "నీవు అబద్ధమాడుతున్నా"వని చెప్పవలసివస్తుంది కనుకను, ఉరుముల్లో కూడా నిశ్చలంగా నిద్రించే అవకాశం కలుగుతుంది గనుకనూ, నీవు జీవించరాదు.

**(ఉరుములు, మూడో పిశాచం – కిరీటాన్ని ధరించిన ఒక బాలుడు చేతిలో ఒక చిన్న చెట్టును పట్టుకొని గోచరిస్తాడు.)**

చిన్ని తలమీద కిరీటాన్ని ధరించి రాజకుమారుడిలా పైకివస్తున్న ఆతడెవరు?

**అందరు :** అతడు చెప్పేది విను. అతనితో మాట్లాడకు.

మూడోపిశాచం : సింహగాంభీర్యంతో మహాదర్పాన్ని వహించు. ఎవరు సంకటపడ్డా ఎవరు ఉద్రేకపడ్డా ఎవరు ద్రోహాన్ని తలపెడుతున్నట్లు కనపడ్డా పట్టించుకోకు. తనకు వ్యతిరేకంగా తిరిగి బిర్నామ్ మహారణ్యం నడుస్తూ ఉన్నతమైన డన్సినేన్ పర్వతందాకా పయనించి వచ్చేటంత వరకూ మేక్బెత్‌కు ఓటమి అనేది లేదు.

**మేక్బెత్ :** అది ఎన్నటికీ జరుగదు! మహారణ్యాన్ని తమ సేవ చేయటంకోసం లొంగదీసుకొని, భూమిలో పాతుకోపోయిన వ్రేళ్ళను విడదీసుకొని వచ్చివెయ్యమని వృక్షాలను ఆజ్ఞాపింప గలవాడెవరు? ఓహో, ఎంతటి మధురమైన జోస్యాలు! ఇవి ఎంత దొడ్డగా ఉన్నాయి. బిర్నాం మహారణ్యం[64] ఎత్తివచ్చేదాకా విప్లవం తలయెత్తకుండుగాక! మేక్బెత్ పూర్ణాయుషజీవిగా బ్రతికి ప్రకృతి లక్షణాన్ని అనుసరించి కాలం తీరినప్పుడే మర్త్యధర్మాన్ని అనుసరించి తన ప్రాణాలను విడిచిపెట్టుగాక! అయినా ఒక విషయాన్ని తెలుసుకోటం కోసం నా చిత్తం తత్తరపాటు వహిస్తున్నది. నీ విద్య కా శక్తి ఉంటే చెప్పు, బాంకో సంతానం ఎప్పుడైనా ఈ రాజ్యాన్ని పొందుతుందా?

**అందరు :** చెప్పినదాన్ని మించి తెలుసుకోటానికి యత్నించకు.

**మేక్బెత్ :** దీనితో నేను తృప్తి వహించటానికి, నిశ్చయించాను. ఈ అంశాన్ని చెప్పటానికి నీవు తిరస్కరిస్తే నీకు నిత్యమైన శాపం తగులుగాక!... ఎందుకు ఆ కొప్పెర అలా క్రుంగిపోతున్నదీ? ఈ శబ్దమేమిటి?

**(తుత్తారధ్వని, పన్నాయి వినిపిస్తాయి)**

**ప్రథమ మాంత్రికురాలు :** కనిపించండి  వెలికివచ్చి కనిపించండి.

**ద్వితీయ మాంత్రికురాలు :** కనిపించండి

**తృతీయ మాంత్రికురాలు :** కనిపించండి.

**అందరు :** కంటిముందు కన్పించి అతని హృదయాన్ని దుఃఖరసపూరితం చెయ్యండి. ఛాయారూపాలతో వచ్చి మీరంతా అదే రూపంతో తిరిగిపొండి.

ఎనిమిదిమంది రాజులు[65], చివరి రాజు చేతుల్లో ఒక అద్దమూ, కాచగోళము, వెనుక బాంకో ప్రేతరూపం వున్న ఒక ఛాయాదృశ్యం గోచరిస్తుంది.

**మేక్బెత్ :** నీవు విశేషంగా బాంకో ప్రేతరూపంలా[66] కనిపిస్తున్నావు. వెళ్ళిపో! నీ శిరస్సుమీది కిరీటం నా కనుగ్రుడ్లను మండిస్తున్నది. స్వర్ణకిరీటాన్ని ధరించిన ఓ ద్వితీయమూర్తీ! నీ జుట్టు మొదటివాని జుత్తులాగానే ఉంది. మూడోరూపం సర్వవిధాలా మొదటి రెండు రూపాలనే పోలివుంది. నాల్గోరూపం కూడా ఉందా ఏమిటి? ఓ నేత్రాల్లారా! మీరు నిలిచిన స్థానం నుంచి తప్పించుకొని వెళ్ళిపోండి.

ఏమిటి ఈ రాజవంశపరంపర ఇలా మహాప్రళయకాలంవరకూ అనంతంగా కొనసాగిపోతుందా ఏమిటి? మళ్ళీ ఇంకో రూపమా సప్తమరూపమా! ఇక ససేమిరా నేను చూడను. ఇంకా ఎన్నెన్నో మూర్తులను ప్రదర్శించే కాచముకురాన్ని ధరించి ఎనిమిదోరూపం కనిపిస్తున్నదే! ఇందులో కొన్ని రూపాలు ఒకచేతిలో రెండు బంతులను, మరో చేతిలో మూడు రాజదండాలను ధరించి కనిపిస్తున్నవే. అయ్యో! ఎంత ఘోరమైన దృశ్యం! 'వీరంతా నా వంశజులే' అని ఛాయామూర్తులను చూపిస్తూ నన్ను చూసి నవ్వుతూ, రక్తంతో తడిసి బిరుసెక్కి జడలు కట్టిన జుత్తులో బాంకో వీరందరి వెనుకా కనిపించటంవల్ల నా భయాలన్నీ సత్యమైనవే అని నాకిప్పుడర్థమౌతున్నది. ఏమిటి? ఇలా ముందు ముందు అంతా జరిగి తీరుతుందా?

**ప్రథమ మాంత్రికురాలు :** అవునయ్యా! జరిగితీరుతుంది. అయితే మేక్బెత్ ఇంతగా అచ్చెరువుపడి ఆగిపోయాడేమిటి? రండి! సోదరీమణులారా! మనం ఇతనికి ఉత్సాహాన్ని కల్పిద్దాము. అతడు మనకిచ్చిన స్వాగతానికి తగ్గరీతిగా శ్రద్ధతో మనం మన కర్తవ్యాలను నిర్వహించామని ఈ దొడ్డరాజు పలికేటట్టుగా, అతనికోసం మనకు తెలిసినవాటిలో మంచి వినోదాన్నొకదానిని కల్పిద్దాము. సంగీతాన్ని వినిపించేటట్లు నేను వాయువుమీద ఒక మంత్రప్రయోగం చేస్తాను. నీవు విచిత్రమైన మండలనృత్యం చెయ్యి.

**(సంగీతం వినిపిస్తుంది. మాంత్రికురాండ్రు నృత్యం చేసి హెకేట్‌తోబాటు అదృశ్యమౌతారు.)**

**మేక్బెత్ :** వీళ్ళేరి? అదృశ్యమైపోయినారా? ఈ దుష్టమైన ఘడియ నిందాపాత్రమౌతూ కాలపట్టికలో నిలిచిపోవుగాక! అక్కడ వేచిఉన్నదెవరో లోపలికి రండి!

**లెన్నాక్స్ ప్రవేశిస్తాడు.**

**లెన్నాక్స్ :** మహారాజా! ఏమాజ్ఞ!

**మేక్బెత్ :** నీవు మాంత్రికురాండ్రను చూశావా?

**లెన్నాక్స్ :** లేదు మహారాజా!

**మేక్బెత్ :** వాళ్ళు వెళ్ళేటప్పుడు మీ ప్రక్కగా వెళ్ళలేదా?

**లెన్నాక్స్:** లేదు మహారాజా! నిశ్చయంగా వెళ్ళలేదు.

**మేక్బెత్ :** అయితే వారు పయనించే వాయువు విషపూరితమౌగాక! వారిని నమ్మినవారు వినాశమొందుదురుగాక!! ఎక్కడివో గుర్రపుడెక్కల చప్పుళ్ళు నాకు వినిపించాయి. ఎవరు వచ్చారు?

**లెన్నాక్స్ :** మహారాజా! మాక్డఫ్ ఇంగ్లండుకు పారిపోయాడన్న వార్తను నివేదించటానికి ఇద్దరో, ముగ్గురో వార్తాహరులు వచ్చారు.

**మేక్బెత్ :** మాక్డఫ్ ఇంగ్లండుకు పారిపోయాడా?

**లెన్నాక్స్ :** అవును మహారాజా!

**మేక్బెత్ :** నేను తలపెట్టిన భీకరకృత్యాలను అడ్డుకోటం కోసమో అన్నట్లు కాలమా! నీవు అతివేగంగా పరుగెత్తుతున్నావు. చేసిన వెంటనే కార్యరూపంతో పరిపూర్తిని కల్పింపకపోతే వట్టి తీర్మానాలు వ్యర్థాలు.

ఈ క్షణం నుంచీ నా హృదయంలో కలిగే ప్రతి ప్రథమోద్దేశం నా హస్తాలకు నిర్వర్తించిన ఆదిమ కర్తవ్యమౌగాక! ఇప్పుడు కూడా ఏ ఉద్దేశ కార్యరూపాల రెంటికీ సాహచర్యాన్ని కలిగిస్తాను. హఠాత్తుగా ఇప్పుడు మాక్డఫ్ దుర్గం[67]మీద పడతాను. ఫైఫ్‌లోని[68] అతని ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకొంటాను. అతని భార్యను, బిడ్డలను, అతని వంశజులు కావటంవల్ల వారసులు కాదగిన అదృష్టహీనులనందరినీ నా ఖడ్గాంచలానికి బలి ఇస్తాను. బుద్ధిహీనుడు పలికే గర్వోక్తులు కావివి. నా ఉద్రేకం చల్లారకమునుపే ఈ పని చేసి తీరుతాను. ఇదివరకటిలాగా ఇక నాకు కేవల దృశ్యాలను చూడటంతో పనిలేదు. ఆ వార్తాహరులేరీ? పదండి. నన్ను వారి దగ్గరికి తీసుకుపోండి.

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

**(ఫైఫ్, మాక్డఫ్ దుర్గంలోని సౌధం. మాక్డఫ్ ప్రభ్వి, ఆమె కుమారుడు, రాస్ ప్రవేశిస్తారు.)**

**మాక్డఫ్ ప్రభ్వి :** దేశంనుంచి పారిపోవలసినంతటి తప్పిదం వారేమి చేశారు?

**రాస్ :** ప్రభ్వీ! తాము ప్రశాంతితో వ్యవహరించాలి.

**మాక్డఫ్ ప్రభ్వి :** వారు ప్రశాంతితో వ్యవహరించారా మరి? వారు పారిపోవటం కేవలం ఉన్మాదకృత్యం. ఒకప్పుడు మన చేష్టలవల్ల కాకపోయినా భయాలు మనకు రాజద్రోహులను చేస్తుంటాయి.

**రాస్ :** తల్లీ! వారు చేసిన కృత్యం వివేకంతో చేసిందో, భయంవల్ల చేసిందో మీకు తెలియదు.

**మాక్డఫ్ ప్రభ్వి :** వివేకంతో చేసిందనా? భార్యను, బిడ్డలను, సౌధాలను, ఇతరాలైన ఆస్తిపాస్తులను ఎక్కడనుంచి తాము పారిపోతున్నారో ఆ ప్రదేశంలోనే విడిచిపుచ్చటం వివేకంతో చేసిన పనా? వారికి మేమంటే ప్రేమ లేదు. సహజమైన ప్రణయభావం వారిలో లోపించింది. జీనువాయివంటి చిన్న పిట్టకూడా గూటిలోని తన చిన్నబిడ్డలను రక్షించుకోటం కోసం గ్రుడ్లగూబతో పోరాడుతుంది. ఇదంతా వారికోసమైన భయమేగాని, ఇతరులకోసమైన ప్రేమమాత్రం కాదు. ఏ రీతిగా చూసినా ఈ పారిపోవటానికి అర్థం కనిపించటం లేదు  కనక ఇందులో వివేకం అణుమాత్రం లేదు.

**రాస్ :** ప్రియసోదరీ! ఈ తొందరపాటును కొంతకట్టిపెట్టమని మిమ్మల్ని నేను ప్రార్థిస్తున్నాను. మీ భర్త ఉదాత్తుడు, వివేకి, ధర్మసమ్మితుడు  కాలంలోని వైపరీత్యాలను మహాఘనంగా గమనింపగలవాడు. సత్యానికి ఏమీ ఎరగకపోయినా, మనం రాజద్రోహులముగా పరిగణింబడుతున్నామంటే మనయెడ పుట్టిన ప్రతివదంతినీ మన భయానికి అనుగుణంగా అన్వయించుకొంటూ, అవగతం చేసుకొంటూ, ఎందుకు మనం భయపడవలసివచ్చిందో కూడా తెలియకుండానే భయదవాతోత్తుంగ పారావారంలో ఆటుపోటులమధ్య అలగిపోతున్నప్పుడు, కాలం మనయెడ నిర్దాక్షిణ్యంగా వర్తిస్తున్నదని మాత్రమే చెప్పగలను. ఇప్పుడు మీ సెలవు తీసుకొంటున్నాను. తిరిగి ఇక్కడికి రావటానికి ఎంతో ఆలస్యం చెయ్యను. విషయాలు విషమపరిస్థితిలో పరాకాష్ఠను చేరుకోటంవల్ల అంతరించనన్నా అంతరిస్తవి. లేదా పూర్వం తామున్న ప్రశాంతసుస్థితినైనా పొందుతవి. ప్రియసోదరీ! పరమేశ్వరుడు మీకు పరమశ్రేయాలను చేకూర్చుగాక!

**మాక్డఫ్ ప్రభ్వి :** ఇతడు తండ్రి కలవాడే. అయినా ఇప్పుడు లేనివాడైనాడు.

**రాస్ :** ఇంకా నేను ఇక్కడ ఉండిపోయేటట్లయితే నన్ను నేనే బుద్ధిహీనుణ్ని చేసుకొన్నవాడనౌతాను. అందుమూలంగా నన్ను నేనే అవమానించుకొన్నవాడి నౌతాను. మీకు అధిక దుఃఖాన్ని కలిగిస్తాను. అందువల్ల వేగంగా మీ సెలవు తీసుకొంటున్నాను.

**(నిష్క్రమిస్తాడు)**

**మాక్డఫ్ ప్రభ్వి :** చిట్టితండ్రీ! మీ నాన్న చనిపోయినారు. నీవిప్పుడేం చేస్తావు? ఎలా జీవిస్తావు?

**కుమారుడు :** అమ్మా! పక్షులు ఎలా జీవిస్తాయో అలాగే జీవిస్తాను.

**మాక్డఫ్ ప్రభ్వి :** అవి పురుగులను, ఈగలను తిని బ్రతుకుతాయి మరి.

**కుమారుడు :** అమ్మా! వాటినివలెనే ఏది దొరికితే దాన్ని తిని బ్రతుకుతాననే నా అభిప్రాయం!

**మాక్డఫ్ ప్రభ్వి :** వెర్రికూనా! తెలియకపోవటంవల్ల వలలన్నా, మచ్చులన్నా, కండెలన్నా, బోనులన్నా నీవు భయపడటం ఎరగవు.

**కుమారుడు :** వాటిని చూసి నేనెందుకు భయపడాలమ్మా? వాటిని నాబోటి పేదపక్షులకోసం ఎవరు పన్నుతారమ్మా! ఎంతైనా చెప్పు, మా నాన్నగారు మరణించలేదమ్మా!

**మాక్డఫ్ ప్రభ్వి :** కాదు తండ్రీ! వారు మరణించారు. మరి నీకు నాన్న కావాలి గదా, నీవేం చేస్తావు?

**కుమారుడు :** అమ్మా! మరి నీకు భర్త కావాలిగదా, నీవేం చేస్తావు?

**మాక్డఫ్ ప్రభ్వి :** ఏ విపణిలోనైనా అటువంటి భర్తలను ఇరవైమందిని నా కోసం కొనుక్కొంటాను.

**కుమారుడు :** తిరిగి అమ్మివేయటానికని ఇంతమందిని కొంటావా?

**మాక్డఫ్ ప్రభ్వి :** ఎంత తెలివిగా మాటాడావురా తండ్రీ! నీ వయసుకు తగ్గ తెలివి ఉందనిపిస్తున్నావు.

**కుమారుడు :** అమ్మా! అయితే మా నాన్నగారు రాజద్రోహం చేశారా?

మాక్డఫ్ప్రభ్వి : అవును నాయనా! రాజభక్తి ప్రమాణాన్ని[69] భగ్నం చేశారు.

**కుమారుడు :** అయితే రాజద్రోహులందరూ ఇలాగే చేస్తుంటారా?

**మాక్డఫ్ ప్రభ్వి :** ఇలా చేసినవాళ్ళందరూ రాజద్రోహులు ఉరితీయటమే వారికి శిక్ష.

**కుమారుడు :** ప్రమాణం చేసి భగ్నం చేసినవారందరినీ ఉరి తీయవలసిందేనా?

**మాక్డఫ్ ప్రభ్వి :** అవును. అలాటి ప్రతివారినీ ఉరితీయవలసిందే.

**కుమారుడు :** అయితే వారిని ఎవరు ఉరితీయాలి?

**మాక్డఫ్ ప్రభ్వి :** సత్యసంధులు.

**కుమారుడు :** అలా అయితే సంఖ్యలో వీరు అధికులు గనకను, ఆ సత్యసంధులచే ఉరితీయబడటం కంటే వారినే ఉరి తీయగలరు కనుకనూ, ఈ ప్రమాణం చేసేవాళ్ళు, వారిని శిక్షించేవారు అంతా మూర్ఖులన్నమాట!

**మాక్డఫ్ ప్రభ్వి :** ఓరి పిచ్చికోతీ! దేవుడు నిన్నెలా కనిపెడతాడో! అయితే ఇంతకు మీ తండ్రిగారు లేకపోతే నీవేం చేస్తావు మరి?

**కుమారుడు :** వారు చనిపోయినట్లయితే నీవు ఏడ్చేదానివి. నీవు ఏడ్వటం లేదంటే అది మంచి లక్షణమే నాకు త్వరలో క్రొత్త నాన్న వస్తాడన్నమాట!

**మాక్డఫ్ ప్రభ్వి :** ఓరి వదరుబోతా! ఎంత తెలివిగా వాగుతున్నావు?

**ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు.**

**వార్తాహరి :** మహోదాత్తా! మీకు పరమేశ్వరుడు క్షేమాన్ని చేకూర్చుగాక! తల్లీ! మీ ఉన్నతస్థితిని నేను బాగా ఎరుగుదును. కానీ మీరు నన్నెరగరు. ప్రమాద మేదో మిమ్మల్ని సమీపిస్తున్నదని నేను అనుమానిస్తున్నాను. నావంటి కాపట్యరహితుని సలహాను మీరు పాటించదలచుకొంటే మీరు ఇక్కడ ఉండవద్దు. మీ పిల్లలతో ఎక్కడికైనా పారిపోండి. ఇలా మిమ్మల్ని భయపెట్టడంతో నేను మీయెడ ఒక ఆటవికుడిలా ప్రవర్తిస్తున్నానేమోనని భావిస్తున్నాను. అయితే మిమ్మల్ని జాగ్రత్తపడవలసిందని చెప్పకుండా ఉండటం, అనతికాలంలో మీ మీద జరుగనున్న అత్యాచారం కంటే దారుణమైన పని. పరమేశ్వరుడు మిమ్మల్ని రక్షించుగాక! ఇక ఎక్కువకాలం ఇక్కడ ఉండటానికి నేను సాహసించలేను.

**మాక్డఫ్ ప్రభ్వి :** అయ్యో, నేనెక్కడికి పారిపోను? నేనెవరికీ ఎట్టికీడునూ చేసినదాన్ని కాను. కానీ ఇప్పుడు నేను ఇతరులకు ఆపదలను కలిగించగలగటమే శ్లాఘనీయంగాను,

కొన్ని పరిస్థితుల్లో ఇతరులకు మంచి చేయటం అతిప్రమాదకరమైన దోషంగాను పరిగణింపబడే ప్రపంచంలో ఉన్నానని నాకిప్పుడు స్మృతికి వస్తున్నది. ఇట్టి స్థితిలో 'నేనెవరికీ ఏ కీడూ చేయలే' దని సామాన్యంగా స్త్రీలు చెప్పుకొనే రక్షణవాక్యాన్ని నేనెందుకు పలకాలి?

**హంతకులు ప్రవేశిస్తారు.**

అయ్యో! ఎంతటి భయంకరరూపాలు!

**ప్రథమ హంతకుడు :** నీ భర్త ఎక్కడ?

**మాక్డఫ్ ప్రభ్వి :** వారు నీవంటి ద్రోహులు ప్రవేశించి పట్టుకోటానికి అవకాశమున్న ఏ అపవిత్రదేశంలోను లేరని నా విశ్వాసం.

**ప్రథమ హంతకుడు :** ఆయన రాజద్రోహి!

**కుమారుడు :** ఓరి జుంజురుజుత్తు వెధవా, ద్రోహి, నీ మాట అసత్యం!

**ప్రథమ హంతకుడు :** ఓరిగ్రుడ్డా! ఏమన్నావు? (కత్తితో పొడుస్తాడు) ఓరి వేపుడు ముక్కా!

**కుమారుడు :** అమ్మా. వీడు నన్ను పొడిచి చంపాడు. పారిపో. ప్రార్థిస్తున్నానమ్మా. పారిపో.

**(మరణిస్తాడు)**

(హత్య అని కేకలు పెడుతూ హంతకులు వెన్నాడగా మాక్డఫ్ ప్రభ్వి నిష్క్రమిస్తుంది.)

## మూడో దృశ్యం

**రాజసౌధానికి ముందు మాల్కొం, మాక్డఫ్ ప్రవేశిస్తారు.**

**మాల్కొం :** నీడ ఉన్న ఏకాంతప్రదేశాన్ని చూసుకొని అక్కడ దుఃఖరసపూరితాలైన హృదయాలను శోకించి శూన్యం చేసుకొందాము.

**మాక్డఫ్ :** ఇంతకంటే స్థిరనిశ్చయంతో భీకరఖడ్గధారణం చేసి వీరపురుషుల్లా నిలిచి పతితమైన పవిత్రజన్మభూమిని రక్షిద్దాము. విగతభర్తృకల ఆక్రందనాలు, అనాథబాలల రోదనాలు, ఆకసాన్ని అలముకోటంవల్ల స్కాట్లండు దుఃస్థితికి అది తిరిగి

అనుగుణపరితాపాన్ని వహిస్తున్నదో అన్నట్లు దాని ప్రతిధ్వనుల రూపాన వినిపించే నూతన దుఃఖధ్వనులు ప్రతిదినం తెల్లవారిందంటే క్రొత్తక్రొత్తవిగా వినిపిస్తుంటాయి.

**మాల్కొం :** నాకు సంబంధించినంతవరకూ నేను విశ్వసించినవాటికోసమే దుఃఖిస్తాను. సత్యాలని రూఢిగా ఎరిగినవాటినే విశ్వసిస్తాను. కాలం అనుకూలించి సాయపడ్డప్పుడు అట్టి కృత్యాలకు తగ్గ ప్రతీకారచర్యలు చేస్తాను. నీవు చెప్పేవి సత్యాలే కావచ్చు. ఎవరి నామోచ్చారణం ఇప్పుడు మన నాల్కను రగుల్కొల్పుతున్నదో ఆ నిరంకుశుణ్ణి అందరూ పూర్వం ఉదాత్తుడని భావించారు. అతణ్ణి నీవూ పూర్వం గాఢంగా ప్రేమించావు. ఇంతవరకూ అతడు నిన్ను ముట్టుకోలేదు. అతడివల్ల మంచి పారితోషికాలను పొందటానికి నీకు మంచి వీలుంది. క్రోధాన్ని వహించిన దేవతను తృప్తిపరచటానికి శక్తిహీనం, దరిద్రం, నిరపరాధం అయిన అజశాబకాన్ని బలిగా అర్పించటం అతివివేకమైన విధానం కదా!

**మాక్డఫ్ :** నేను స్వామిద్రోహిని కాను!

**మాల్కొం :** నీవు కాకపోవచ్చు. కానీ మేక్బెత్ విశ్వాసఘాతుకుడు. రాజాజ్ఞను నిర్వహించే విషయంలో ఉదాత్తమూ, సద్గుణాన్వితమూ అయిన ప్రకృతికూడా లొంగిపోవచ్చు. ఇలా నిన్ను అనుమానించినందుకు క్షమాపణ నర్థిస్తున్నాను. అయితే నీ సహజప్రకృతి నా అభిప్రాయాలను మార్చలేదు గదా! అతితేజోవంతులైనవారు పడిపోయిన వేళల్లో కూడా తేజోవంతులుగానే ప్రకాశిస్తుంటారు. నీచగుణాలకు సద్గుణవేషాన్ని కల్పించి కన్పించినా సద్గుణం సర్వవేళలా స్వస్వరూపంతోనే కన్పించితీరాలి.

**మాక్డఫ్ :** నా ఆశలన్నీ భగ్నమైనాయి.

**మాల్కొం :** ఇలా జరగటం బహుశః నేను అనుమానించటం వల్లనే అని అనుకొంటాను. ఆలోచనారహితమైన తొందరలో అమూల్యహేతువులు, ప్రగాఢప్రణయబంధాలు అయిన దారాపుత్రులను రక్షణరహితులనుగా చేసి, వీడ్కోలైనా చెప్పకుండా నీవెందుకు విచ్చేశావు? నిన్ను అనుమానించటం అగౌరవించటం కాదనీ, నా భద్రత కోసం తీసుకొంటున్న చర్య అనీ భావించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. నేనెల్లా భావించినా దానికి భిన్నంగా నీవు సత్యతత్పరుడవే ఐ ఉండవచ్చు.

**మాక్డఫ్ :** అయ్యో! ఓ నా అభాగ్యజన్మభూమీ! నీ శరీరంనుంచి ఇలాగే అవిరళంగా రక్తం స్రవించుగాక! ఓ స్వామిద్రోహమా! మంచితనం నిన్ను అడ్డుకోలేకపోతున్నది

స్వేచ్ఛగా నీవు నీ స్థానాన్ని సుప్రతిష్ఠితం చేసుకో! నీ దుశ్చర్యల వల్ల ఏ ఫలాన్ని పొందుతున్నావో దాన్ని బహిరంగంగానే అనుభవించు.

నీ సత్త్వం స్థిరపడింది ప్రభూ! నాకు సెలవిప్పించండి. సమృద్ధశీల అయిన ప్రాచ్యదేశంతో జతచేసి ఆ రాజద్రోహి చేపట్టిన సర్వరాజ్యాన్నీ నాకిచ్చినా, నేను మీరు భావించినట్లుగా స్వామిద్రోహిని, విశ్వాసఘాతుకుణ్ణి కాలేను.

**మాల్కొం :** కోపం తెచ్చుకోకు. నేను కేవలం నిన్ను గురించి కలిగిన భయంవల్ల నే అలా అనలేదు. రాజద్రోహమనే కాడిబరువును మోయలేక మన మాతృభూమి క్రుంగిపోతున్నదని నేనెరుగుదును. ఆమె ఆక్రోశిస్తున్నది. నెత్తురులు విరజిమ్ముతున్నది. ఆమె శరీరానికి తగిలిన గాయాలకు క్రొత్తరోజు వచ్చినప్పుడల్లా విచ్చి, నెత్తురును విరజిమ్మే మరొక గాయం చేరుతున్నది.

నా సత్త్వసంరక్షణార్థం శస్త్రధారణ చెయ్యటానికి సంసిద్ధులైనవారున్నారని కూడా నాకు తెలుసు. మహోదారమైన ఇంగ్లండు కూడా నా పక్షాన పోరాడటానికి వేలకొలది సైన్యాన్ని సహాయమిచ్చింది.

అయినా నేనా రాజద్రోహిమీదికి ఎత్తివచ్చి, అతని తలదన్నినా, లేక నా ఖడ్గాంచలాన విజయచిహ్నాన్ని చేర్చినా, అభాగ్యమైన నా మాతృభూమి అతనితరువాత పరిపాలన చేసేవాడివల్ల అంతకు పూర్వం కంటే ఎంతో విశేషమైన వ్యసనాలకు, నానారీతులైన నూతనకష్టాలకు గురౌతుంది.

**మాక్డఫ్ :** ఆ పాలకుడు ఎటువంటివాడై వుంటాడు?

**మాల్కొం :** అదేమిటి? అతణ్ణి నేనే. సర్వరీతివ్యసనాలూ పాదుకొని పరిపూర్ణంగా వృద్ధిపొందితే పరమనీచుడుగా కన్పట్టే మేక్బెత్‌తో పోల్చినప్పుడు అతడే హిమఖండమువలె అతిస్వచ్ఛంగా తోచేటట్లు కనిపింపజేసే ఆ వ్యక్తిని నేనే. నేను రాజునైతే కల్పించే అనంతహింసలను చూచి, నన్ను అతడితో పోల్చి నా దేశీయులు అతణ్ణి గొఱ్ఱెవంటి సాధువుగా భావిస్తారు.

**మాక్డఫ్ :** నరకంలోని అసంఖ్యాక సైనికదళాలలో కూడా క్రూరచేష్టాచరణ విషయంలో మేక్బెత్‌ను పోలిన పెనుభూతాలు కన్పించవు.

**మాల్కొం :** అతడు క్రూరుడనీ, భోగలాలసుడనీ, అసత్యప్రియుడనీ, మోసకారి అనీ, అతికోపి అనీ, అసూయాపరుడనీ, ఇంకా పేరంటూ పొందిన సమస్తపాపచిహ్నాలూ

కలవాడనీ అంగీకరిస్తాను. కానీ నా భోగాసక్తికి అంతంటూ లేదు. నా కోర్కె ఎదిరించిన ఎట్టి ప్రబలమైన ఆటంకాలనయినా తల్లక్రిందులు చేసివేస్తుంది. అందువల్ల నావంటివారు పాలించేదానికంటే మన దేశాన్ని మేక్బెత్ పాలించటమే ఉచితం! ఉత్తమం!!

**మాక్డఫ్ :** మర్యాద నెరుగని ఆత్మలోలుపత్వం ప్రకృతితః నిరంకుశత్వమే. అంతే కాదు, ఈ గుణమే పలుమార్లు సింహాసనాన్ని శూన్యం చేయిస్తూ మన రాజవంశంలో పుట్టిన అనేకులకు అకాలమరణాన్ని కల్పించింది. అంత మాత్రంచేత రాజులైన మీరు మీ స్వత్వాన్ని విడిచిపుచ్చేటంతగా పిరికిపడవద్దు. మీ కాముకతను తీర్చుకోటానికి కావలసినంత మంది లభ్యమౌతారు. దానిని రహస్యంగా తీర్చుకొంటూనే పునీతులవలె కనిపించి కాలాన్ని మోసగించవచ్చు. తమంతట తామే మహారాజులకు తమ్మర్పించుకొనే స్త్రీలు ఎందరో ఉంటారు. మహారాజు అందుకు అనుకూలుడైనట్లు కన్పించినట్లయితే ఆత్మార్పణం చేసే అబలాగణా న్నంతటినీ తృప్తి కలిగేటట్లు మ్రింగగలిగే రాబందు మీలో ఉండటానికి అవకాశం లేదు.

**మాల్కొం :** దీనితో బాటుగా నేనే రాజునైతే నీచగుణాలు గల నా ప్రకృతిలో తృప్తి నెరుగని లోభం పుట్టి ప్రభువర్గంవారి భూములను కత్తిరించటమో, కాజేయటమో చేయవచ్చు. నేను ఒకరి ఆభరణాలు, మరొకరి గృహాన్ని కోరవచ్చు. ఎక్కువ లభించటమనేది ఒక వ్యంజనగా పనిచేసి నాకు మరింత ఆకలిని కల్పించవచ్చు. అందువల్ల ఉత్తములు, భక్తిప్రపత్తులు గల ప్రజలమీద నేను లేనిపోని దోషాలను ఆరోపణ చేసి, సంపదలకోసం వారిని నాశనం చెయ్యవచ్చు.

**మాక్డఫ్ :** గ్రీష్మకాలంలో తాత్కాలికమైన కాముకత్వం కంటే యీ లోభం నేలలో లోతుకు పాతుకొనిపోయి విషపువ్రేళ్ళ సహాయంతో పెరుగుతున్న దన్నమాట వాస్తవమే. ప్రజావిప్లవాలకు గురియై మన పూర్వరాజన్యులపాలిటి కిది నిశాతఖడ్గమైన మాట వాస్తవమే. అయినా మీరు భయపడనవసరం లేదు. మీ కాంక్షను తీర్చటానికి స్కాట్లండులో ఘనసంపదలు అనంతంగా ఉన్నవి. అవి నిజానికి మీవి కూడాను. మీ సద్గుణాలతో తులతూస్తే ఇవి సహనయోగ్యాలు మాత్రమే.

**మాల్కొం :** అయితే నీవు చెప్పే ఆ సద్గుణాలు నాలో ఏమీ లేవు. మహారాజులకు యోగ్యమైన సద్గుణాలు ధర్మతత్పరత, సత్యసంధత, స్థిరత, వితరణ, దృఢాధ్యవసాయం, కారుణ్యం, వినయం, భక్తి, సహనం, సహిష్ణుతలు, ఈ గుణవిశేషాలయెడ నాకాసక్తి లేదు. అదీకాక దోషాలల్లో ఎన్ని జాతులున్నాయో, వాటిలో ప్రతిజాతిదోషాన్నీ నానారీతుల ఆచరించివుండటమనే లక్ష్యంతో కట్టుబడ్డవాణ్ణి నేను. ఇంతేకాదు. అధికారం

హస్తగతమైతే శాంతిక్షీరాన్ని నరకాలపాలు చేసి జగచ్ఛాంతిని ఛిద్రం చేస్తాను. భూమిమీద ఐకమత్యమన్నది లేకుండా పూర్తిగా వినాశనం చేస్తాను.

**మాక్డఫ్ :** అయ్యో! నా స్కాట్ దేశమా! స్కాట్ దేశమా!!

**మాల్కొం :** నేనెటువంటివాడినో నీకు తెలియజేశాను. చెప్పు, ఇట్టివాడు పాలించటానికి యోగ్యుడైతే చెప్పు!

**మాక్డఫ్ :** ఇట్టివాడు పాలించటానికి యోగ్యుడా అని అడుగుతున్నారా? కాదు. జీవించటానికి కూడా యోగ్యుడు కాడు. రక్తంలో మునిగితేలుతున్న రాజదండంతో, సింహాసనాన్ని కాజేసిన ఒక క్రూరనిరంకుశ రాజ్యాపహర్త పరిపాలనకు లోనైన ఓ నా దేశమా! నీవెంతటి దీనావస్థననుభవిస్తున్నావు! సత్యమైన నీ రాజవంశంలోని వారసుడు తనయెడ తానే దోషారోపణం చేసుకొని తనను, తన రాజవంశాన్నీ నిందిస్తున్నాడు. కనుక ఓ నా మాతృభూమీ! మహావైభవాన్ని అనుభవించిన ఆపూర్వదినాలను నీవు తిరిగి ఏ నాటికి చూడగలవో తెలియటంలేదు. ప్రభూ! మీ తండ్రి పుణ్యపురుషుడైన మహారాజు. నిన్ను కన్నతల్లి మహారాజ్ఞి నిత్యవ్రతాచరణంతో శరీర కార్శ్యాన్ని వహించి మోకరిల్లి ఎల్లవేళలా మరణావస్థలో ఉన్నట్లు మనిన మహనీయ. మీకు శుభమగుగాక! తమకున్నట్లుగా ఏకరువు పెట్టిన మీ దోషాలే నన్ను స్కాట్లండు నుంచి బహిష్కృతుణ్ణి చేస్తున్నవి. అయ్యో! హృదయమా! ఇంతటితో నీ ఆశలడుగంటాయి.

**మాల్కొం :** మాక్డఫ్! సత్యసంధతవల్ల జనించిన ఈ నీ మహోదారశోకవివశత్వం నా హృదయం నుంచి నీచానుమానాల నన్నింటినీ తుడిచిపెట్టింది. నీ నిష్కాపట్య నైతికోన్నతులమీద నాకు నమ్మకం కల్గించింది. దుష్టుడైన మేక్బెత్ నన్ను మోసగించి లోగొనటానికి ఇటువంటి పన్నాగాలెన్నో ప్రయోగించాడు. అందువల్ల అణకువగల నా వివేకం, నన్ను అతిసులభంగా నమ్మే తొందరపాటు నుంచి దూరంగా నిలుపుతున్నది. ఇక నీ నా మధ్య సంబంధాన్ని పరమేశ్వరుడే నిర్ణయించుగాక! ఈ క్షణంనుంచీ నేను నీకిష్టాలైన సూచనలను అనుసరిస్తాను. నాకు వ్యతిరేకంగా ఏమేం చెప్పానో అవి సత్యాలు కాదని అంటాను.

ఏ దుర్గుణాలు, దోషాలు నాలో ఉన్నవని ఆరోపించుకొని నేను నీతో పలికానో అవి నా ప్రకృతికి అపరిచితాలని నీ ముందు ప్రమాణం చేసి చెపుతున్నాను.

నేను ఇంకా స్త్రీజాతిప్రణయమంటే ఏమిటో ఎరగనివాణ్ణి. అసత్యవచనదోషం అంటనివాణ్ణి. సంపదలకు, అవి నావే అయిన సందర్భాల్లో కూడా లౌభ్యాన్ని

ప్రదర్శింపనివాణ్ణి. ఎన్నడూ ఇతరులుంచిన విశ్వాసానికి విచ్ఛిత్తిని కల్పించనివాణ్ణి. దుష్టుడినైనా బయటపెట్టి వాడిని తోటిదుష్టుడికి ఒప్పచెప్పనివాడిని. స్వప్రాణవిషయంలో ఎంతటి ఆసక్తి వహిస్తానో, సత్యవిషయంలో కూడా అంతకు అణుమాత్రమైన తరుగని ఆస్థను వహించినవాణ్ణి. ఈ రీతి నాకు వ్యతిరేకంగా దోషారోపణం చేసుకోటమే తొలిసారిగా నేనాడిన అసత్యం. నా సత్యమైన ప్రకృతిని నేనిప్పుడు నీకు ఎరుకపరిచాను. నా సమస్తసేవలనూ నీకూ, నా అభాగ్యమాతృభూమికీ అర్పణ చేస్తున్నాను. నీవు ఇక్కడికి వచ్చిన కొద్దికాలానికి ముందే వృద్ధుడైన సివర్డు ఈ ప్రయోజనం కోసమే మార్చుకొన్న యోధాగ్రగణ్యులున్న పదివేలమంది సైన్యంతో స్కాట్లండుకు బయలుదేరటానికి సంసిద్ధుడైనాడు. ఇప్పుడు నీవు కూడా వచ్చావు కనుక మనమంతా కలిసి దండెత్తిపోదాము. ధర్మోపేతమైన కారణంలాగానే మనకు విజయావకాశం తథ్యమగుగాక! సరేనా? నీవు మూకత వహిస్తున్నావేమిటి?

**మాక్డఫ్ :** ప్రియాలు, అప్రియాలు అయిన అంశాలు ఏకకాలంలో ఇలా వచ్చిపడ్డప్పుడు ఎలా సమన్వయించుకోవాలో నాకు తెలియటం లేదు.

**ఒక వైద్యుడు ప్రవేశిస్తాడు.**

**మాల్కొం :** సరే. ఈ విషయాలనుగురించి తరువాత విపులంగా మాట్లాడుదాము. అయ్యా! రాజుగారు ఇప్పుడు బయటికి విచ్చేస్తున్నారేమో అడగవచ్చునా?

**వైద్యుడు :** అవునయ్యా! వస్తారు. వారివల్ల వ్యాధినివారణ చేసుకోటంకోసం ఓ పెద్ద నిర్భాగ్యపుగుంపు వేచివుంది. ఈ జనాలవ్యాధి వైద్యవిద్యను తారుమారు చేస్తున్నది. అయితే పరమేశ్వరుడు ఆయన హస్తానికి అటువంటి పవిత్రతను ప్రసాదించాడు. ఆయన కరస్పర్శవల్ల ఆ వ్యాధి అమాంతంగా కట్టుబడిపోతున్నది.

**మాల్కొం :** వైద్యమహాశయా! మీకు నమస్కారాలు!

**(వైద్యుడు నిష్క్రమిస్తాడు)**

**మాక్డఫ్ :** ఇతడు చెప్పే వ్యాధేమిటి?

**మాల్కొం :** 'గండమాల'![70] ఈ దేశపురాజు విషయంలో ఇది ఒక అద్భుతచర్య. ఈ ఇంగ్లండులో ఉంటున్నప్పటినుంచీ ఈ వ్యాధిని ఆయన నివారించటం నేను చూస్తున్నాను. మరి ప్రార్థనలతో పరమేశ్వరుణ్ణి కదలించి ఎలా వశం చేసుకొంటాడో అది ఆయనకే తెలియాలి. శస్త్రవైద్యవిద్యకు నిరాశను కల్పిస్తూ, చూసేవారి హృదయాల్లో

దైన్యాన్ని ఎక్కొల్పుతూ, వాచి కురుపులు తేలిన వింతవ్యాధితో బాధపడే జనాలను ఆయన నయం చేసి పంపటం మాత్రం నిజం. తగిన ప్రార్థనలు చేసి ఒక బంగారు నాణాన్ని వారి మెళ్ళోకట్టి ఆయన ఆ వ్యాధిని నివారిస్తాడు. రాజవంశంలోని ఆయన వారసులకు ఈ వ్యాధినివారణోపాయాన్ని ఆయున శాసనపూర్వకంగా బహూకరింపదలచినట్లు చెప్పుకొంటున్నారు. అద్భుతమైన నివారణసామర్థ్యంతో పాటు భవిష్యత్తును చెప్పగల దివ్యశక్తి కూడా ఆయునకుంది. అంతే కాదు. పరమేశ్వరకరుణాసంపత్తి కలవాడని వెల్లడించే ఇతర మహత్తరశక్తులింకా ఆయనకెన్నో ఉన్నాయి.

**మాక్డఫ్ :** అటు చూడండి. ఆ వచ్చేదెవరు?

**మాల్కొం :** నా దేశీయుడే అయినా ఎవరో నాకింకా తెలియటం లేదు.

**రాస్ ప్రవేశిస్తాడు.**

**మాక్డఫ్ :** ప్రియసోదరా! నీకిదే స్వాగతం!

**మాల్కొం :** ఇప్పుడు నేనితణ్ణి గుర్తుపట్టగలిగాను. మన దేశీయులను ఒకరినొకరి కపరిచితులనుగా చేస్తున్న కారణాలను తొలగించమని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

**మాక్డఫ్ :** స్కాట్లండులో పరిస్థితులు వెనక ఉన్నట్టే ఉన్నాయా?

**రాస్ :** అయ్యో! అభాగ్యమైన మన దేశం తన్ను గురించి తెలుసుకోటానికి తానే భయపడుతున్నది. అది మన మాతృభూమి కాదు మన సమాధిభూమి. వ్యవహారాలు ఎలా సాగిపోతున్నాయో ఎరుగనివాళ్ళు తప్ప ఏ ఒక్కరూ ఒక్కమారైనా చిరునవ్వుతో కనిపించని అవనిగా అది మారిపోయింది. నిట్టూర్పులతో, కేకలతో, మూల్గులతో ఆకాశం నిరంతరం నిండిపోతుండటం సర్వసామాన్యమైపోవటంవల్ల, వాటిని ఎవరూ గమనించని స్థితి దానికి పట్టింది. అంతే కాదు. దారుణదుఃఖం, ఒక సాధారణభావంగా అక్కడ తలపబడుతున్నది. వినిపించే మరణఘంటికలు ఏ మనిషిని గూర్చి అన్న ప్రశ్న ఉదయించటం మానివేసింది. ఆరోగ్యవంతుల జీవితాలు వారి కుళాయిలలోని కుసుమాలు వాడకముందే రాలిపోతున్నవి. లేదా అవి రుజాగ్రస్తాలు కాకముందే రూపుమాసిపోతున్నవి.

**మాక్డఫ్ :** నీవు చేసిన ఈ వర్ణన విపులంగాను, సత్యయుతంగాను ఉంది.

**మాల్కొం :** నీవు తెలుసుకొన్న తుదిఘాతుకచర్య ఏమైనా వినిపించగలవా?

**రాస్ :** ఒక గంటకు ముందు జరిగింది ప్రాతబడటం వల్ల కథకుడి చేత 'హుస్' అనిపిస్తుంటే తుదిగా ఇది జరిగిందని చెప్పటం ఎంతో కష్టం. ప్రతిక్షణం క్రొత్తదంటూ ఏదో ఒకటి జరుగుతూనే వుంది.

**మాక్డఫ్ :** నా భార్య ఎలా ఉంది?

**రాస్ :** ఏం? క్షేమంగానే ఉన్నారు.

**మాక్డఫ్ :** నా బిడ్డలో?

**రాస్ :** ఏం? వారు కూడా క్షేమంగానే[71] ఉన్నారు.

**మాక్డఫ్ :** మరి ఆ క్రూరనిరంకుశుడు వారి ప్రశాంతికి భంగం కలిగించలేదా?

**రాస్ :** లేదు. నేను వారిని విడిచిపుచ్చి వచ్చినప్పుడు వారు ప్రశాంతంగానే ఉన్నారు.

**మాక్డఫ్ :** లౌభ్యంతో నీ సంభాషణను కప్పిపుచ్చవద్దు. వారెలా ఉన్నారో చెప్పు.

**రాస్ :** నా హృదయంలో మహాభారంగా భరించి తెచ్చిన వార్తను మీకు వినిపించటానికని బయలుదేరేటప్పుడు, ఆ క్రూరనిరంకుశుడి మీద కొందరు విప్లవం చేసి రణభూమిలో నిలిచినట్లు వదంతి చెలరేగింది. ఆ నిరంకుశుని సైన్యం యుద్ధభూమికి బయలుదేరటం స్వయంగా చూసివచ్చాను. గనుక అది సత్యమని స్థిరపడింది. ఇది మీరు మాకు సాయపడదగిన సమయం. మీరు స్కాట్లండులో ఉంటే చాలు. సైనికులను అదే సృష్టిస్తుంది. తీవ్రతరదుఃఖాలలో నుంచి బయటపడటానికి స్త్రీల చేత యుద్ధం చేయిస్తుంది.

**మాల్కొం :** నేను అక్కడికి వస్తున్నాను కనుక ఈ వార్తతో వాళ్ళకు సంతోషం కలుగుగాక! మహోదారుడైన ఇంగ్లండు రాజు మాకు ఉత్తముడైన సివర్డు ప్రభువును, పదివేల సైనికులను సాయమిచ్చాడు. ఆ సివర్డు ప్రభువుకంటే వృద్ధవీరుడు, ఉత్తమయోధుడు అయినవాణ్ణి సమస్త క్రైస్తవప్రపంచం మరొకణ్ణి ప్రసాదించలేదు.

**రాస్ :** వినటంవల్ల మహానందాన్ని కల్పించిన ఈ వార్త వంటి వార్తను నేను వినిపించగలిగి వుంటే ఎంత బాగుంటేది! కానీ నేను ఎవ్వరి చెవులకు సోకరాక, మరుభూమిలో మాత్రమే ఆక్రోశించి వినిపించదగ్గ వార్త తెచ్చాను.

**మాక్డఫ్ :** ఆ దారుణదుఃఖవార్త దేనికి సంబంధించినది? ప్రజానీకానికంతటికీ సంబంధించిందేనా? లేక ఒక హృదయానికి మాత్రమే సంబంధించిందా?

**రాస్ :** అయినా ఉదారహృదయమేదీ ఈ దుఃఖంలో కొంత పాలు పంచుకోకుండా ఉండలేదు. అయితే ఇందులో ప్రధానాంశమంతా మీకు సంబంధించిందే.

**మాక్డఫ్ :** అది నాకు సంబంధించిందే అయితే చెప్పటంలో ఆలసించకు. వేగంగా తెలియజెయ్యి!

**రాస్ :** మీరు పూర్వమెన్నడూ విననంతటి కఠోరవాక్యాలను వినిపిస్తున్నాను కనుక మీ శ్రవస్సులు నా నాల్కను నిరంతరం నిందించకుండుగాక!

**మాక్డఫ్ :** అయ్యో! ఈ వార్త ఏమై ఉంటుందో నేను ఊహించలేకుండా ఉన్నాను.

**రాస్ :** మీ దుర్గంమీద హఠాత్తుగా దాడి జరిగింది. మీ భార్యాపుత్రులను ఆటవికంగా హత్య చేశారు. అది ఎలా జరిగిందో నేను వివరిస్తే, మీకు మరణాన్ని కల్పించి మిమ్మల్ని కూడా హతమార్చి ఆ జింకలగుంపులో చేర్చటం జరుగుతుంది.

**మాల్కొం :** దయానిధీ, పరమేశ్వరా! ఏమిటి? నీవు వీరపురుషుడవు. కార్చే కన్నీళ్ళను కనిపించకుండా చేయడానికని అలా టోపీని కనుబొమలమీదికి లాగకు. నీ దుఃఖాన్ని మాటలమూలంగా వ్యక్తంకానీ. లేకపోతే పలుకని దుఃఖం నిర్భరమైన గుండెతో గుసగుసలాడి బ్రద్దలైపొమ్మని ఆజ్ఞాపిస్తుంది.

**మాక్డఫ్ :** ఏమిటి! నా పుత్రులను కూడా హత్య చేశారా?

**రాస్ :** మీ భార్యను, పుత్రులను, సేవకులను – ఇంకా ఇంట్లో కనిపించిన వారినందరినీ హత్య చేశారు.

**మాక్డఫ్ :** ఇదంతా జరిగేటప్పుడు అయ్యో! నేను దూరంగా ఉండిపోవలసి వచ్చిందే! నా భార్యను గూడా హత్య చేశారా?

**రాస్ :** ఈ విషయం ఇదివరకే తెలియజేశాను.

**మాల్కొం :** సౌఖ్యాన్ని తెచ్చిపెట్టుకొనే ముందుగా మనం ఈ దారుణదుఃఖానికి తగ్గ ప్రతీకారాన్ని చేద్దాము.

**మాక్డఫ్ :** ఆయనకు బిడ్డలు లేరు. నా ముద్దుల బిడ్డలనందరినీ హత్య చేశారా? అందరినీ హత్యచేసినట్లు నీవు చెప్పావా? అయ్యో! వాడెంతటి నారకశ్యేనం! అందరినీనా? ఏమిటి? వాడు ఒక్కమాటే నా ముద్దుల కుక్కుటశాబకాలమీద, వారితల్లి మీద పడ్డాడా?

**మాల్కోం :** నీ దుఃఖాన్ని పురుషుడిలా ఎదుర్కో!

**మాక్డఫ్ :** అలాగే చేస్తాను. అయితే ముందు దాన్ని పురుషుడిలా అనుభవించాలిగదా! క్షణకాలానికి పూర్వం వరకూ నాకు అమూల్యమైన అట్టి భార్యాపుత్రులున్నారన్న మాట మరిచిపోలేను.

భగవంతుడిదంతా చూచాడా? వారి పక్షం వహించి అడ్డుపడలేదా? పాపీ! మాక్డఫ్! నీ కోసమే వాళ్ళను హత్య చేయటం జరిగింది. అయ్యో! నేనెంతటి వ్యర్థుణ్ణి! వారి లోపాలవల్ల కాదు, వాళ్ళు నా లోపాలవల్ల దారుణహత్యావ్యవసాయానికి గురైనారు. పరమేశ్వరుడు వారికి శాంతిని చేకూర్చుగాక!

**మాల్కోం :** ఈ చర్యను నీ ఖడ్గానికి శాణోపలంగా చేసుకో! నీ దుఃఖాన్నంతటినీ క్రోధంగా పరివర్తన పొందనీ! శోకంతో హృదయాన్ని బండబారిపోనీయకు. కోపాగ్నితో దాన్ని రగుల్కొల్పు!

**మాక్డఫ్ :** అయ్యో! స్త్రీలా నయనాలతో విలపిస్తూ నేను నాలుకలో గర్జింపగలిగి ఉన్నట్లయితే. కానీ, కరుణాన్వితుడవైన పరమేశ్వరా! నా కాంక్షకూ, కార్యనిర్వహణకూ మధ్య కాలవిలంబాన్ని కత్తిరించివెయ్యి. స్కాట్లండు దేశానికి పిశాచమై పట్టుకొన్న ఆ నీచుణ్ణి ముఖాముఖిగా నిలిచేటట్లు నా దగ్గిరికి చేర్చు. అతణ్ణి నా ఖడ్గపరిధిలో కట్టిపడవెయ్యి! తప్పించుకొన్నాడా, అతణ్ణి నేను క్షమిస్తాను భగవంతుడు కూడా క్షమించవచ్చు.

**మాల్కోం :** ఓహో! ఈ ధోరణి ఎంత పురుషోచితంగా ఉంది. రండి. మనం రాజుదగ్గిరికి వెళ్లుదాము. మన సైన్యం సిద్ధంగా ఉంది. ఇక మనకు ఆయన సెలవు తీసుకోటమే మిగిలింది. మేక్బెత్ పతనం కావటానికి పండబారాడు. దివ్యశక్తులు తమ సాధనాలైన మనను ఉద్బోధిస్తున్నాయి. చేతనైనంతగా ఊరటను చేకూర్చుకో! ఎంతటి దీర్ఘనిశీథమైనా తుదకు ఉదయకాంతికి దారిచ్చి తీరుతుందని మరిచిపోకు!!

**(నిష్క్రమిస్తారు)**

# పంచమాంకం

## ఒకటో దృశ్యం[72]

**డన్సనేన్ రాజసౌధంలో ఒక కక్ష్య. ఒక వైద్యుడు, ఒక దాసి ప్రవేశిస్తారు.**

**వైద్యుడు :** నీతోబాటుగా రెండు రాత్రులు పరిశీలించాను. కానీ నీవు నివేదించింది సత్యమని నిరూపణ కాలేదు. ఆమె కడసారిగా నిద్రలో ఎప్పుడు నడిచింది?

**దాసి :** మహారాజులు యుద్ధభూమికి వెళ్ళింది మొదలుగా ఆమె శయ్యమీది నుంచి లేచి, రాత్రి దుస్తులు ధరించి, అల్మారా తెరిచి అందులో నుంచి ఒక కాగితాన్ని తీసి, మడిచి, ఏదో వ్రాసి, చదువుకొని, దానిమీద శిఖావేసి, తిరిగి శయ్యమీదికి చేరుకోటం నేను చూశాను. ఆమె ఇదంతా గాఢనిద్రలోనే చేసేది.

**వైద్యుడు :** ఒక వంక నిద్రవల్ల కలిగే ప్రయోజనాలను పొందుతూ, మరొకవంక మేల్కొనేటప్పుడు చేసే పనులనన్నిటినీ చేయటం – అంటే శరీరవిధానంలోనే ఏదో గొప్ప వైపరీత్యం కలిగిందన్నమాట! నిద్రావస్థలో నడవటం, ఇతరకృత్యాలను నిర్వహించటం కాక ఏమిటి? ఎప్పుడైనా ఆమె ఏమన్నా అనటం విన్నావా?

**దాసి :** విన్నాను. కానీ ఆమె అన్నది ఇది అని చెప్పటానికి సాహసించలేనిది కొంత విన్నాను.

**వైద్యుడు :** నీవు నాతో చెప్పవచ్చు. నాతో చెప్పటం చాలా సముచితం కూడాను.

**దాసి :** చెపితే సమర్థించుకోటానికి తగ్గ సాక్ష్యం లేకపోవటంవల్ల నేను మీకు గాని, ఇతరులకు గాని దాన్ని చెప్పరాదు. అటు చూడండి! ఆమె ఇక్కడికే వస్తున్నది. ఆమె ఎప్పుడూ అనుసరించే రీతి ఇదే. నా జీవితం మీద ప్రమాణం చేసి చెబుతున్నాను ఇప్పుడు ఆమె గాఢనిద్రలో ఉంది. ఆమెను గమనించండి. దాగి వుండి గమనించండి.

**వైద్యుడు :** ఆమె కా దీపం ఎలా దొరికింది?

**దాసి :** అది ఆమె శయ్యప్రక్కన ఉన్నదే. ఆమె దగ్గర ఎప్పుడూ దీపం ఉంటుంది. అది ఆమె ఆజ్ఞ.

**వైద్యుడు :** చూడు, ఆమె కన్నులు తెరిచే వుంది.

**దాసి :** అయితే వాటికి చూచే శక్తి లేదు.

**వైద్యుడు :** ఆమె ఇప్పుడు చేసేదేమిటి? చూడు. ఆమె తన చేతులను ఎలా రుద్దుతున్నదో.

**దాసి :** అలా చేతులు కడుక్కొంటున్నట్లు కనిపించటం ఆమెకు అలవాటైన పని. ఇలాగే ఆమె గంటనుంచీ చేస్తుండటం నేను చూస్తూనేవున్నాను.

**మేక్బెత్ ప్రభ్వి :** ఇదిగో మచ్చ!

**వైద్యుడు :** విను. ఆమె ఏదో మాట్లాడుతున్నది. నా జ్ఞాపకశక్తి సరైందో కాదో, తరువాత సరిచూసుకోటానికి ఆమె నోటినుంచి వచ్చేదంతా వ్రాస్తాను.

**మేక్బెత్ ప్రభ్వి :** ఓ చెడ్డమచ్చా![73] పో! నేను శాసిస్తున్నాను పో! చెరిగిపో! ఒకటి, రెండు. అయితే ఆ పనిని తీర్చటానికి సమయమైంది. నరకం! అంధకారమయం!! సిగ్గు, నా ప్రభూ, సిగ్గు!! మీరు యోధులే అయినా భయపడుతున్నారు. ఎవరెవరికి తెలిస్తేమటుకు భయమెందుకు? పాలకులమైన మనను పలకరింపగలిగేవారెవరు? ఆతనివంటి ముదుసలి శరీరంలో అంత రక్తం ఉంటుందని ఎవరు భావించగలరు?

**వైద్యుడు :** నీవు అది గమనిస్తున్నావా?

**మేక్బెత్ ప్రభ్వి :** ఫైఫ్థేనుకు[74] ఒక భార్య ఉండేది. ఆమె ఇప్పుడెక్కడుంది? ఏమిటి? ఈ చేతులెప్పటికీ పరిశుభ్రపడవా? ఇవి పనికిరావు. నా ప్రభూ! ఇవి ఇక పనికిరావు. ఈ మీ ఉన్మాదచేష్టలతో మీరు అంతా చెడగొడుతున్నారు.

**వైద్యుడు :** వెళ్ళిపో, వెళ్ళిపో. నీవు తెలుసుకోకూడని సంగతులు తెలుసుకొన్నావు.

**దాసి :** ఆమె మాట్లాడకూడంది మాట్లాడింది. ఇది నిజం. ఆమెకు తెలిసిన విషయమేమిటో భగవంతుడికే తెలుసు.

**మేక్బెత్ ప్రభ్వి :** ఆ రక్తపువాసన ఇంకా ఇక్కడ ఉంది. అరేబియాలో ఉన్న ఎన్ని పరిమళాలైనా ఈ నా చిన్ని హస్తానికి తీయందనాన్ని ఇప్పించలేవు. అయ్యో! అయ్యో!! అయ్యో!!

**వైద్యుడు :** అబ్బా! ఎంత పెద్ద నిట్టూర్పు! ఆమె హృదయం ఏదో మహాభారాన్ని వహిస్తున్నది.

**దాసి :** ఆమె రాజ్ఞీత్వాన్ని ప్రతిగా ఇచ్చినా వక్షభాగంలో అటువంటి హృదయాన్ని కలిగి వుండడానికి నేను ఒప్పుకోను.

**వైద్యుడు :** సరి. సరి –

**దాసి :** మహాశయా! పరమేశ్వరుడు సమస్తాన్నీ శుభంగా పరివర్తన పొందించుగాక!

**వైద్యుడు :** ఈ వ్యాధి నా వైద్యవిద్యానైపుణ్యాన్ని[75] మించిపోయింది. ఇలా నిద్రావస్థలో నడచినా, పవిత్రమైన జీవితాన్ని గడిపి ప్రశాంతితో తమ శయ్యల మీదనే చరమస్థితిని పొందినవాళ్ళను నేనెందరినో ఎరుగుదను.

**మేక్బెత్ ప్రభ్వి :** చేతులు కడుక్కోండి, రాత్రి దుస్తులను ధరించండి. అంతగా పాలిపోయి కనిపించకండి. అయినా మరోమారు చెబుతున్నాను. బాంకోను సమాధి చేశారు. సమాధి నుంచి అతడు లేచి రాలేడు.

**వైద్యుడు :** వ్యవహారాలు ఇంత చెడ్డగా నడిచాయా?

**మేక్బెత్ ప్రభ్వి :** శయ్యను చేరుకొందాం ఎవరో ద్వారసీమ దగ్గిర తలుపు తడుతున్నారు. జరిగించినదానికి తిరుగు జరగనిస్థితిని కల్పించాము.

**వైద్యుడు :** ఆమె ఇప్పుడు తిరిగి శయ్య దగ్గిరికి వెళ్ళుతుందా?

**దాసి :** సూటిగా వెళ్ళిపోతుంది.

**వైద్యుడు :** నీచమైన వదంతులు వినిపిస్తున్నాయి. అసహజమైన చర్యలవల్ల వ్యాధులు జనిస్తాయి. దోషచిత్తులు తమ రహస్యాలను వినలేని తమ తలగడలకు వినిపిస్తుంటారు. ఈమెకు వైద్యులకంటే మతవిద్వాంసులవల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. ఓ పరమేశ్వరా! మమ్ముల నందరినీ క్షమించు. ఆమె విషయంలో శ్రద్ధ తీసుకో! శరీరానికి గాయాలను కల్పించుకోగల సాధనాలన్నింటినీ ఈమెకు అందుబాటులో లేకుండా చెయ్యి! అయినా ఈమెనెంతో భద్రంగా కనిపెట్టి ఉండు. సరి, మరి సునక్తం. ఈమె నా మనస్సును తారుమారుచేసింది. దృష్టిని ఆశ్చర్యమగ్నం గావించింది. ఎంతో ఆలోచనను ప్రేరేపించింది గాని మనస్సులో తోచినదాన్ని పలకటానికి సాహసించలేక పోతున్నాను.

**దాసి :** వైద్యమహాశయా! సునక్తం!!

**(నిష్క్రమిస్తారు)**

## రెండో దృశ్యం

డన్సినేన్ సమీపంలో గ్రామసీమ, దుందుభిధ్వనులతో జెండాలతో, మెంటియథ్, కెయిథీనెస్, ఆంగస్, లెన్నాక్స్, ఇతర సైనికులు ప్రవేశిస్తారు.

**మెంటియథ్ :** మాల్కొం, ఆయన పినతండ్రి[76] సివర్డు, ప్రవీణుడైన మాక్డఫ్‌ల నాయకత్వాన వస్తున్న ఇంగ్లీషు సైన్యం చేరువకు వచ్చింది. ప్రతీకారేచ్ఛ వారిని ప్రజ్వలింపజేస్తున్నది. సమస్తోద్రేకాలూ చచ్చిపోయిన సన్యాసులను గూడా జ్వలింపజేసి, రక్తపాతయుతమైన దారుణరణరంగానికి ఆహ్వానించే వ్యక్తిగతాలైన ప్రబలకారణాలున్న వాళ్ళు వాళ్ళు.

**ఆంగస్ :** మనం వారిని బిర్నాం అరణ్యందగ్గిర కలుసుకొందాం. వారూ ఆ మార్గాన్నే వస్తున్నారు.

**కెయిథీనెస్ :** సోదరునివెంట డొనాల్బెయిన్ కూడా వస్తుండవచ్చు.

**లెన్నాక్స్ :** అతడు రావటం లేదు. ఇది నిశ్చయం. ఆంగ్లేయసైన్యాలవెంట వస్తున్న ప్రభువర్గం వారిపట్టిక నా దగ్గిర ఉంది. ఆ సైన్యం వెంట స్టివర్డు కుమారుడున్నాడు. ఇంకా పురుషత్వ విషయంలో ప్రాథమికావస్థను ప్రదర్శిస్తూ, శ్మశ్రువైనా మొలకెత్తని యువకులెందరో ఉన్నారు.

**మెంటియథ్ :** మన క్రూరనిరంశకుడు మేక్బెత్ ఏం చేస్తున్నాడు?

**కెయిథీనెస్ :** డన్సినేన్ మహాదుర్గాన్ని పటిష్ఠం చేయిస్తున్నాడు. కొందరతడు ఉన్మాదియైపోయినాడంటున్నారు. అతణ్ణి అంతగా అసహ్యించుకోని కొందరు అది ఉన్మాదం కాదు, వీరోన్మాదమంటున్నారు. అయితే వ్యవస్థ తప్పిన తన పక్షాన్ని ఇక అతడు క్రమశిక్షణ సూత్రంతో బంధించలేడన్న అంశం మాత్రం నిజం.

**ఆంగస్ :** చేసిన రహస్యహత్యలు తనకు చేతి సంకెళ్ళయి కట్టిపడేస్తున్నట్లు అతడిప్పుడు భావిస్తున్నాడు. నమ్మిన స్వామియెడ అతడు చేసిన ద్రోహాన్ని నిందించడంకోసం ప్రతిక్షణం విప్లవాలు చెలరేగుతున్నవి. అతని అనుచరులైనా నిర్భరభయభావం వల్లనేగాని, ప్రేమతో అతణ్ణి అనుసరించటం లేదు. అతడి రాచరికం కూడా మరుగుజ్జు దొంగ ఒంటిమీది ఉన్నత శరీరుని దుస్తుల్లాగా బరువుగా వ్రేలాడుతున్నట్లు అతనికి తోస్తున్నది. అతడిలో ఉన్న సమస్తం అతణ్ణి పొంది ఉండవలసివచ్చినందుకు తన్ను

తానే నిందించుకొంటున్న స్థితిలో, నిరంతరం భారక్లేశాన్ని వహిస్తున్న అతని ఇంద్రియాలు వ్యతిరేకించి ఒక ఉన్మాదిని చేస్తే, అతణ్ణి ఎవరు నిందించగలరు?

**కెయిథీనెస్ :** సరే. మనం న్యాయసమ్మతుడైన రాజును చేరుకొని మన భక్తిభావాన్ని ప్రకటించటం కోసం బయలుదేరుదాము. వ్యాధిగ్రస్తమైన రాజ్యానికి వైద్యుడైన ఆయన్ను మనం కలుసుకొందాం. మన జన్మభూమిని పవిత్రం చెయ్యటం కోసం ఆయనతో కలిసి మనలోని ప్రతిరక్తబిందువు నొలికిద్దాము.

**లెన్నాక్స్ :** మన రాజపుష్పాన్ని తుషారబిందుసంయుతం చెయ్యటానికి ఎన్ని రక్తబిందువులు అవసరమో అన్నిటినీ ఒలికిద్దాము. ఇక మనం బిర్నాం వైపునకు పయనమారంభిద్దాం.

**(సైనికవిన్యాసంతో నిష్క్రమిస్తారు)**

## మూడో దృశ్యం

**డన్సినేన్ రాజసౌధంలో ఒక కక్ష్య. వైద్యుడు, పరిచారకులు ప్రవేశిస్తారు**

**మేక్బెత్ :** ఇటువంటి వార్తలేవీ ఇక నా దగ్గిరికి తీసుకోరావద్దు. వాళ్ళందరినీ పారిపోనీ బిర్నాం మహారణ్యం కదలి డన్సినేన్ దుర్గం వరకూ నడిచివచ్చేదాకా భయభావంతో నేను కళంకితుణ్ణి కాలేను. బాలుడైన మాల్కొంకు నేనెందుకు భయపడాలి? అతడేం స్త్రీకి జన్మించనివాడా? మానవులకు సంభవింపనున్న సమస్తాన్నీ ఎరిగిన దివ్యశక్తులు నాతో "భయపడకు మేక్బెత్! స్త్రీ గర్భాన జన్మించిన ఏ వ్యక్తీ నీ మీద విజయాన్ని సాధించలేడు!" అని వెల్లడి చేశాయి. అందువల్ల సత్యసంధులు కాని, థేనులారా! మీరందరూ పారిపొండి. శత్రుపక్షాన చేరిపొండి. భోగలాలసులైన ఆ ఆంగ్లేయ ఎపిక్యూరియనులతో[77] కలిసిపొండి. నన్ను నడిపించే నా మనస్సు, నేను వహించే నా హృదయం మాత్రం నావైతే చాలు. అవి అనుమానాలతో క్రుంగేవి కావు భయభావం వల్ల బెదిరేవి అంతకంటే కావు!

**ఒక సేవకుడు ప్రవేశిస్తాడు**

పాలిపోయిన మొగంతో పరుగెత్తుకోవచ్చిన బుద్ధిహీనుడా! ఏ భూతమో నిన్ను నల్లబడవేయుగాక! అలా పాలిపోయి పిరికివడ్డ ముఖాన్ని ఎక్కడ సంపాదించావురా?

**సేవకుడు :** అక్కడ పదివేలు –

**మేక్బెత్ :** ఓరి తులువా! పదివేల బాతులున్నాయటరా!

**సేవకుడు :** లేదు, మహారాజా, పదివేల సైనికులున్నారు.

**మేక్బెత్ :** ఓరి పిరికిపందా! వెళ్ళి నీ ముఖాన్ని చీరుకొని నీ భయాన్ని మరింత ఎర్రవారజేసుకో. సైనికులెవరురా మూర్ఖుడా? ఆత్మ చచ్చిన అధమస్థుడా! తెల్లగా రవసెల్లా వంటి నీ చెక్కిళ్ళు చూసేవారికి భయాన్ని అంటిస్తున్నవిరా! ఓరి పాలిన మొఖం! వారు ఎవరి సైనికులురా?

**సేవకుడు :** ఆంగ్లేయసైన్యం ప్రభూ!

**మేక్బెత్ :** ఛీ! నీ ముఖం చూపించకు. వెళ్ళిపో. (సేవకుడు నిష్క్రమిస్తాడు) సైటన్! ఇలా పారిపోవటం చూస్తుంటే నా గుండె దిగజారిపోతున్నది. సైటన్! వినపడలేదా? ఈ ఎత్తిరావటం నాకు నిరంతరానందాన్నయినా కల్పిస్తుంది లేదా ఇప్పుడే పదభ్రోయనైనా పదభ్రోస్తుంది. బహుకాలం జీవించను, నా బ్రతుకు పండబారింది. ఆకులపాటుతో దానికి గ్రీష్మకాలం చేకూరింది. వృద్ధుడనైనప్పటికీ ముదిమివేళ మాంద్యాన్ని చేకూర్చే గౌరవం, ప్రేమ, భక్తసమూహం, మిత్రబృందం మొదలైనవాటిని వాంఛించే అవకాశం నాకు లేదు. వాటిస్థానంలో నాకు లభ్యమౌతున్నవి – గట్టిగా వినపడకపోయినా గాటమైన తిట్లు, పెదవులు దాటని భక్తి, బహిరంగంగా సాహసించలేకపోయినప్పటికీ హృదయాంతరాలలో మానివేయటమంటే మహానందాన్ని పొందే ఓటి పొగడ్తలు –సైటన్!

**సైటన్ ప్రవేశిస్తాడు.**

**సైటన్ :** మహాప్రభూ! ఏమాజ్ఞ?

**మేక్బెత్ :** నా కోసం ఏమైనా క్రొత్తవార్త తెచ్చావా?

**సైటన్ :** ఈ క్రొత్తవి పూర్వవార్తలను స్థిరపరుస్తున్నవి మాత్రమే.

**మేక్బెత్ :** నా అస్థిమాంసాలను చిందరవందర చేసేదాకా పోరాడతాను. నా కవచాన్ని తెచ్చిపెట్టు.

**సైటన్ :** మహారాజా! అటువంటి స్థితి ఇంకా రాలేదు.

**మేక్బెత్ :** అయితే నేం. కవచధారణ చేస్తాను. అధికసంఖ్యలో ఆశ్వికులను పంపించాను. దేశమంతా తిరిగి పరిశుద్ధం చెయ్యమని వారితో చెప్పు. భయాన్ని గురించి మాటాడే

ప్రతివాడినీ పట్టి ఉరితీయించు. ఇక ఆలసించక నా కవచాన్ని తెచ్చిపెట్టు. – వైద్యమహాశయా! మీ రోగి ఎలా ఉంది?

**వైద్యుడు :** ఏవో మనోభావాలు వెంటవెంటనే వచ్చి ఆమెను బాధపెడుతున్నాయి. కాని మహారాజా! శారీరకంగా ఆమెకేమంత జబ్బు లేదు.

**మేక్బెత్ :** అయితే మీరు ఆమెకు ఆ వ్యాధినే నయం చెయ్యండి! మీరు జబ్బుపడ్డ మనసులకు మందీయలేరా? గాఢంగా నాటుకొన్న దుఃఖాన్ని ఆమె జ్ఞాపకవీధి నుంచి విడబెరికి వెయ్యలేరా? గంభీరంగా నాటుకొన్న దుష్టబాధలను తుడిచివేయలేరా? భారవంతం చేస్తూ ప్రమాదకారియై ఆమె హృదయాన్ని అంటిపెట్టుకొన్న ఆ కశ్మలాన్నంతా అతిగాఢనిద్రను కల్పించే ఒక తీయనైన అరఖుతో కడిగివేయలేరా?

**వైద్యుడు :** ఇది రోగి స్వయంగా చేసుకోవలసిన పని.

**మేక్బెత్ :** అయితే, మీ వైద్యవిద్యనంతటినీ కుర్కురాలపాల్జేయండి. దానితో నాకేం పని లేదు. సైటన్! రా! శరీరానికి కవచాన్ని సంధించు. నా రాజదండాన్ని తెచ్చిపెట్టు. దేశంలోని మూలమూలలకు పరిశుద్ధి చేయటానికిగాను ఆశ్వికులను పంపించు. వైద్యమహాశయా! నా థేనులందరూ నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. రావయ్యా! త్వరపడు! చేతనైతే ఓ వైద్యమహా శయా! నే పాలించే భూమికి పట్టిన వ్యాధి ఏమిటో కనిపెట్టు. తిరిగి దానికి పటిష్ఠమూ, స్వచ్ఛమూ అయిన ఆరోగ్యాన్ని చేకూర్చగలిగావో, దేశమంతటా మార్మ్రోగేటట్లు ఎంతో ఘనంగా నిన్ను కీర్తిస్తాను. – ఈ కవచాన్ని విప్పివెయ్యి! రేవల చిన్ని, నేలతంగేడుల వంటి ఏ రేచనకారులైన ఓషధులతో ఈ ఆంగ్లేయులను కడిగివేయవచ్చునో చెప్పగలవా? వారిని గురించి విన్నావా?

**వైద్యుడు :** మహాప్రభూ! తాము చేసిన ఘనసన్నాహాలు వారిని గురించి కొంతగా తెలుసుకొనేటట్లు చేశాయి.

**మేక్బెత్ :** ఈ కవచాన్ని నా వెంట తీసుకో రా. బిర్నాం మహారణ్యం డన్స్‌నేన్ వరకు కదలివచ్చేదాకా నేను మృత్యువును గురించిగాని, వినాశాన్ని గురించి గాని భయపడను!

**(వైద్యుడు తప్ప అందరూ నిష్క్రమిస్తారు)**

**వైద్యుడు :** ఈ డన్స్‌నేన్ నుంచి ఒకమారు బయటికి వెళ్ళగలిగినా, కట్నమెంతిచ్చినా, అది మళ్ళీ ఇక్కడికి వచ్చే విషయంలో మమ్మల్ని లోభపెట్టలేదు.

**(నిష్క్రమిస్తాడు)**

## నాలుగో దృశ్యం

డన్సినేన్‌కు సమీపభూమి. దూరంగా అరణ్యం కనిపిస్తుంటుంది. దుందుభిధ్వనులతో, పతాకాలతో, మాల్కొం, వృద్ధ సివర్డు, యువ సివర్డు, మాక్డఫ్, మెంటియథ్, కెయిథినెస్, ఆంగస్, లెన్నాక్స్, రాస్, సైనికులు సైనికవిన్యాసాలతో ప్రవేశిస్తారు.

**మాల్కొం :** సోదరులారా! భయరహితులమై శయ్యా[78]గృహాలలో శాంతియుతంగా జీవించే దినాలు బాగా దగ్గరకు వచ్చాయనిపిస్తున్నవి.

**మెంటియథ్ :** ఈ విషయంలో మాకూ అనుమానమేమీ లేదు.

**సివర్డు :** మన ముందున్న ఆ అరణ్యం పేరేమిటి?

**మెంటియథ్ :** అది బిర్నాం మహారణ్యం.

**మాల్కొం :** మన సైనికులలో ప్రతి ఒక్కరు తలా ఒక కొమ్మను విరిచి ముందుపెట్టుకొని నడవండి. అలా అయితే మన సంఖ్య ఎంతో శత్రువులకు తెలియదు. వారి చారులు తప్పుడు వార్తలతో తిరిగి వెళ్ళుతారు.

**సైనికుడు :** తమ ఆజ్ఞలను అలాగే అనుసరిస్తాను.

**సివర్డు :** ఆ క్రూరవిద్రోహి ఇంకా డన్సినేన్ దుర్గంలోనే గాఢవిశ్వాసంతో ఉన్నాడనీ, మన ముట్టడికి కూడా సిద్ధపడి ఉన్నాడనీ మాత్రమే తెలుస్తున్నది.

**మాల్కొం :** ఇక అదే అతని ప్రధానమైన ఆశ. అవకాశం చిక్కినప్పుడల్లా ఉత్తములు, క్షుద్రులు అన్న విభేదం లేకుండా అంతా అతన్ని విడిచిపెట్టేశారు. ఇప్పుడాతణ్ణి సేవిస్తున్న వారైనా బలవంతాన ఆ పని చేస్తున్నారేగాని హృదయమిచ్చి కాదు.

**మాక్డఫ్ :** మన ఊహలెంతవరకు సత్యాలో కార్యరంగంలో కలిగే ఫలితాలను నిర్ణయించనీయండి. అందాకా మనం అతిశ్రద్ధతోనే సైనికవ్యవహారాలను నడిపిద్దాము.

**సివర్డు :** 'ఇది మాకు లాభించింది. ఇది మేము నష్టపడ్డాము' అని చెప్పగలిగేటట్లు స్పష్టంగా తెలిసిపోయే సమయం ఆసన్నమైంది. కార్యాచరణకు పూర్వం చేసే ఊహలన్నీ మన అనిశ్చయాలైన ఆశలను మాత్రమే వెల్లడిస్తుంటాయి. కానీ సత్యమైన పరిణామాన్ని సమరతలంలో తగిలే దెబ్బలు తేల్చవలసిందే. ఆ యుద్ధంకోసం ఇక మన సైన్యాదులను తరలిద్దాం.

**(నిష్క్రమిస్తారు. సైనికవిన్యాసం)**

## ఐదో దృశ్యం

**డన్స్‌నేన్ దుర్గంలో దుందుభి ధ్వనులతో, పతాకలతో**
**మేక్బెత్, సైటన్, సైనికులు ప్రవేశిస్తారు.**

**మేక్బెత్ :** మన పతాకాలను బహిః ప్రాకారాలమీద ఎగురవేయండి. 'వారు వస్తున్నారు వారు వస్తున్నా' రని ఎప్పుడూ ఒకటే కేకలు! రానీయండి! శత్రువుల[79] ముట్టడిని పరిహసించగల శక్తి మనదుర్గానికుంది. క్షామం, సంజ్వరం కబళించేటంతవరకూ వారిక్కడ పడి ఉండవలసిందే! మనపక్షంలో ఉండవలసినవాళ్ళు వచ్చి వారిలో చేరి బలాన్ని చేకూర్చినట్లయితే, మనం వాళ్ళను ధైర్యంతో ఎదుర్కొని ముఖాముఖిగా పోరాడి, తిరిగి ఇంటికి వెళ్ళేదాకా తరిమికొట్టవచ్చు. (లోపల నుంచి ఒక స్త్రీ దుఃఖధ్వని వినిపిస్తుంది) ఆ ధ్వని ఎక్కడనుంచి?

**సైటన్ :** అది స్త్రీ రోదనధ్వని మహారాజా!

**మేక్బెత్ :** భయాలంటే నాకు రసన చచ్చిపోయింది. ఒకప్పుడు రాత్రివేళలో మూల్గు వినిపిస్తే నా సర్వేంద్రియాలూ చల్లబడిపోయేవి.

ఒక విషాదగాథ విన్నపుడు నా కురులు నిక్కబొడుచుకొని నిల్చి చైతన్యవంతాలేమో అని అనిపించేవి. భీకరదృశ్యాలను కన్నులార ఆరగించాను. హత్యాసంబంధమైన భావాలతో నిండిన నా మనస్సుకు భీకరత్వం సుపరిచితమై పోయింది కనుక అది నన్ను కలత పెట్టలేదు.

**సైటన్ తిరిగి ప్రవేశిస్తాడు.**

ఆ రోదనధ్వని ఎక్కడినుంచి?

**సైటన్ :** మహారాజా! మహారాజ్ఞి మరణించింది.

**మేక్బెత్ :** నేడో రేపో ఆమె ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే. అట్టి మాట వినవలసిన కాలమంటూ ఒకటి ఉండనే ఉన్నది. జీవితగ్రంథం పరిసమాప్తి అయ్యేదాకా రేపు, రేపు – ఇలా ఒకరోజు తరువాత మరొకరోజు పరంపరగా సాగిపోవలసిందే. గడిచిపోయిన 'నిన్న'లన్నీ అదృష్టహీనులైన మర్త్యులను మృణ్మయమైన మృత్యుమార్గానికి దారి చూపించి పంపించాయి. ఆరిపో! ఓ క్షుద్రదీపమా! ఆరిపో! జీవితమంటే చరించే

స్వభావంగల ఒక ఛాయ! జగద్రంగంమీద గడియో అరగడియో నిక్కుతూ, నురగలు క్రక్కుతూ ఆ కాస్త కాలం గడచిందో, మళ్ళీ మాటైనా వినబడకుండా తిరిగి నిష్క్రమించే ఒక క్షుద్రనటుడు. ఇంతకు మించి మరేమీ లేదు. జీవితమంటే శబ్దాడంబరంతో, క్రోధముద్రతో ఉన్మత్తుడొకడు చెప్పిన అర్థశూన్యమైన ఒక కథ.

**ఒక వార్తాహరి ప్రవేశిస్తాడు.**

**వార్తాహరి :** కరుణాశీలీ! మహాప్రభూ! కళ్ళతో చూచినదాన్ని చెప్పటం నా ధర్మం. కనుక ఒక వార్త తెచ్చాను. కానీ దాన్ని ఎలా చెప్పాలో నాకు తెలియటం లేదు.

**మేక్బెత్ :** సరే, కానీయవయ్యా!

**వార్తాహరి :** డన్సనేన్ కొండమీద కాపలా తిరుగుతున్నప్పుడు నేను బిర్నాం మహారణ్యం వంకకు చూచాను. తక్షణమే ఆ మహారణ్యం కదలినట్లు నాకు తోచింది.

**మేక్బెత్ :** నీచుడా! అసత్యవాదీ!!

**వార్తాహరి :** చెప్పినట్లు జరగకపోతే మీరు ఏ శిక్ష చెప్పినా సహిస్తాను. ఔను ప్రభూ! అది జంగమమహారణ్యం. దుర్గం వరకు మూడు మైళ్ళూ అది నడిచి వచ్చింది.

**మేక్బెత్ :** నీవు చెప్పింది అసత్యమైతే, ఆకలితో అలమటించి చచ్చేదాకా ఈ దగ్గర చెట్టుకే వ్రేలాడదీయిస్తాను. సత్యమైతే నీవు నన్ను అలా చేయించినా లెక్కించను. ఇప్పుడు నా విశ్వాసం సడలనారంభించింది. 'బిర్నాం మహారణ్యం డన్సనేన్ వరకు కదలివచ్చేదాకా భయపడకు' అన్న ఆ మాంత్రికురాండ్ర ద్వంద్వార్థపు మాటలను ఇప్పుడు అనుమానించటం ఆరంభించాను. ఇప్పుడు ఒక అరణ్యం డన్సనేన్ దాకా వస్తున్నది. శస్త్రాలను ధరించండి! శత్రువును ఎదుర్కోటానికి బయలుదేరండి. వీడు నిశ్చయం చేస్తున్నది కనిపించికపోతే ఇక్కడనుంచి పారిపోవటం గాని లేదా ఇక్కడనే ఉండిపోవట గాని రెండూ జరగవు. జీవితమంటే నాకు విసగట జనించింది. ప్రపంచంలో సుస్థాపితమైన క్రమాన్ని తారుమారు చేయతలపెట్టాను. జాగ్రద్ఘంటికను మొరయించండి. మహావాయూ! నీ ప్రబలశక్తిని ప్రదర్శించు. తారుమా రా! తరలి రా! కల్లోలమా! కదలి రా!! మరణించవలసివస్తే వీపున కవచంతోనే కదనభూమిలోనే నేను మరణింతునుగాక!

**(నిష్క్రమిస్తారు)**

## ఆరో దృశ్యం

డన్స్‌నేన్ దుర్గం ముందు. దుందుభిధ్వనులతో పతాకాలతో మాల్కొం, వృద్ధసివర్డు, మాక్డఫ్ ప్రభృతులు కొమ్మలను ముందిడుకొని వారి సైన్యాలతో ప్రవేశిస్తారు.

**మాల్కొం :** తగినంతగా దగ్గరకు వచ్చేశాం. ఇక మీ పత్రయవనికలను క్రిందపారవేసి స్వస్వరూపాలతో కనిపించండి. సుయోగ్యుడా! మీకు మహోదాత్తపుత్రుడైన ఈ సోదరుడి సాయంతో మన ప్రథమసైనికశ్రేణిని మీరు నడిపిస్తారా? యోగ్యుడైన మాక్డఫూ, మేము మన యుద్ధపథకక్రమాన్ని అనుసరించి మిగిలిన కృత్యాన్ని నిర్వహిస్తాము.

**సివర్డు :** మీకు శుభమగుగాక! మేక్బెత్ సైన్యాన్నంతటినీ ఈ రాత్రే మనం బయటికి రప్పించాలి సుమా! పోరాడి దాన్ని నిర్మూలించకపోతే మనం దెబ్బతినటానికి తగ్గవాళ్ళమే నన్నమాట!

**మాక్డఫ్ :** మన దుందుభులనన్నిటినీ పలికించండి! రక్తపాతానికీ, మృత్యువిహారానికీ సందడి చేసే కట్యగాళ్ళయిన వాటిలో ప్రతి ఒక్కదానికీ ప్రాణం పోసి పలికించండి!!

**(నిష్క్రమిస్తారు)**

## ఏడో దృశ్యం

**యుద్ధరంగంలో మరొక భాగం. దుందుభిధ్వనులు. మేక్బెత్ ప్రవేశిస్తాడు.**

**మేక్బెత్ :** కదలవీలులేకుండా వారు నన్ను ఒక కట్టుకొయ్యకు[80] బంధించి పడేశారు. ఎగిరిపోలేను. పైబడ్డప్పుడు ఎలుగుబంటులా ఎదుర్కోవలసిందే. స్త్రీ గర్భాన జన్మించని అతడెవరో? నేనొక మానవుడికి భయపడుతున్నానంటే అతడు అటువంటివాడైనా అయి ఉండాలి! లేదా మానవుడే కాకుండానైనా ఉండి ఉండాలి!

**యువ సివర్డు ప్రవేశిస్తాడు**

**యువ సివర్డు :** నీ పేరేమిటి?

**మేక్బెత్ :** అది వింటే నీవు భయపడతావు.

**యువ సివర్డు :** లేదు. నరకంలో ఉన్న పేర్లనన్నింటినీ మించిన పేరు నీకున్నా నేను భయపడను.

**మేక్బెత్ :** అయితే నా పేరు మేక్బెత్.

**యువ సివర్డు :** నరకంలోని పెనుభూతమైనా, సైతానైనా ఇంతకంటే అసహ్యించుకోదగ్గ పేరును వినిపించలేదు.

**మేక్బెత్ :** అంతే కాదు, అంతకంటే నిరంకుశమూ, భీకరమూ అయిన పేరును కూడా వినిపించలేదు.

**యువ సివర్డు :** ఓరీ సహింపరాని దారుణవిద్రోహీ! ఇది అసత్యం. ఈ నా ఖడ్గంతోనే నీవన్నది అసత్యమని నిరూపిస్తాను.

**(ఇరువురూ పోరాడతారు యువ సివర్డు మరణిస్తాడు)**

**మేక్బెత్ :** నీవు స్త్రీగర్భాన జన్మించినవాడివే. స్త్రీకి జన్మించినవాడు చేపట్టినంతవరకూ నేను సర్వఖడ్గాలనూ, సమస్తశస్త్రాలనూ చూసి చిరునవ్వుతో తిరస్కరిస్తాను!

**(నిష్క్రమిస్తాడు)**

**దుందుభి ధ్వనులు, మాక్డఫ్ ప్రవేశిస్తాడు.**

**మాక్డఫ్ :** అదుగో! శబ్దం ఆ వంకనుంచి వినిపిస్తున్నది. నీచనిరంకుశద్రోహీ! బయటపడి ముఖాముఖిగా నిలు! నా శస్త్రఘాతవల్ల కాక ఇతరులవల్ల నీవు చంపబడ్డావో, నా భార్యాపుత్రుల ప్రేతమూర్తులు నిరంతరం నన్ను వెన్నాడుతాయి. శూలాలభారాన్ని మోయటానికని అద్దెకిచ్చిన హస్తాలు గల నీచసైనికులమీద నేనెన్నడూ దెబ్బతీయను. ఓ మేక్బెత్! నీవు నా మీదికి రానన్నా రావాలి. లేదా ఎట్టి హత్యాచరణచేతనైనా బండబారని నా చంద్రాయుధాన్ని నేను ఒరలో నిలుపనైనా నిలుపాలి. నీవు అక్కడనే ఉండు. ఆ వినిపించే మహాయుధనిక్వాణాలవల్ల అక్కడ ఎవరో ఉన్నతవర్గానికి సంబంధించిన వ్యక్తి ఒకడున్నట్లు వ్యక్తమౌతున్నది. అదృష్టమా! నాకతడు కన్పించే అవకాశాన్ని కల్పించు. పరమమైన దీనికంటే మరొకటి ప్రసాదించమని నిన్ను ఎన్నడూ ప్రార్థించను

**(నిష్క్రమిస్తాడు. దుందుభి ధ్వనులు వినిపిస్తాయి)**

**మాల్కొం, వృద్ధ సివర్డు ప్రవేశిస్తారు**

**సివర్డు :** మహారాజా! ఇటు విచ్చేయండి. దుర్గమతిసులభంగా లొంగిపోయింది. ఆ నిరంకుశద్రోహి ప్రజలు చీలి ఉభయపక్షాలలో పోరాడుతున్నారు. మన పక్షాన ఉన్న

ఉదాత్తులయిన థేనులు సమరభూమిలో సాహసికులై వర్తిస్తున్నారు. దరిదాపుగా ఈ నాడు మీదైనట్లు తానే చెప్పివేస్తున్నది. ఇక తీర్చవలసిన కృత్యం అల్పమాత్రమే!

**మాల్కొం :** మనపక్షాన పోరాడుతున్న శత్రువులను కొందరిని మేము కలుసుకొన్నాం.

**సివర్డు :** ప్రభూ! ఇక దుర్గంలో ప్రవేశించండి.

**(నిష్క్రమిస్తాడు. దుందుభిధ్వనులు వినిపిస్తవి).**

## ఎనిమిదో దృశ్యం

**యుద్ధభూమిలో మరొక ప్రాంతం. మేక్బెత్ ప్రవేశిస్తాడు.**

**మేక్బెత్ :** రోమకదేశీయుల్లా[81] కత్తిమీది కురికి ఆత్మహత్య చేసుకొని నేనెందుకు విదూషక పాత్రనభినయించాలి? శత్రువులు సజీవులై కన్పించినంతకాలం వారికి గాయాలను కల్పించటమే మంచిది.

**మాక్డఫ్ ప్రవేశిస్తాడు.**

**మాక్డఫ్ :** ఓరీ నారకకుర్కురమా! ఇటు తిరుగు! నా వైపు తిరుగు!

**మేక్బెత్ :** అందరికంటే అధికంగా నిన్ను తప్పించుకొని తిరిగాను. వెనక్కు తగ్గు. నీకు సంబంధించిన విశేషరక్తంతో నా హృదయం ఇప్పటికే నిర్భరమై పోయింది.

**మాక్డఫ్ :** మాటలతో నేను కాలహరణం చెయ్యలేను. ఇక నా కంఠం పలకవలసిన దానిని ఖడ్గమే పలుకుతుంది. నీవు పదాలు వర్ణించలేనంతటి పరమక్రూరవిద్రోహివి!

**(ఇరువురూ పోరాడతారు)**

**మేక్బెత్ :** ఎందుకు వృథాగా శ్రమపడతావు? వాడి ఐన నీ కత్తితో అభేద్యమైన వాయువుకు ఒక గాటును కల్పించటం ఎంత తేలికో, రక్తాన్ని చిందించటం అంత తేలికనుకో. ఛేదించటానికి వీలున్న శిరాలమీదనే నీ ఖడ్గాన్ని ప్రయోగించు. మంత్రపరిరక్షితమైన మహిమగల జీవితం నాది. అది స్త్రీ గర్భాన జన్మించిన వ్యక్తికి లొంగేది కాదు.

**మాక్డఫ్ :** నీవు చెప్పే మంత్రశక్తిమీద ఆధారపడకు. ఇంతవరకూ నీవు కొలుస్తున్న శక్తి నీతో 'మాక్డఫ్ స్త్రీగర్భాన జన్మించినవాడే కాని నెలలు నిండకముందే బయటపడ్డవా'డని నీకు తెలియు జేయుగాక!

**మేక్బెత్ :** నా పౌరుషత్వంలో ప్రధానాంశాన్ని లోగొన్న నీ జిహ్వకు వినాశం కలుగుగాక! ద్వంద్వార్థాలతో మోసపుచ్చే గారడీమంత్రకత్తెలను ఇక ఎవ్వరూ నమ్మకుందురుగాక! వాళ్ళు మాటలతో చెవులకు సర్వం చేకూర్చేటట్లు మాట ఇస్తారు. ఆశ పెట్టిన వస్తువులను చేకూర్చటంలో భంగపాటును కల్పిస్తారు. నీతో నేను పోరాడదలచలేదు.

**మాక్డఫ్ :** అయితే, ఓరి పిరికిపందా! లొంగిపో! ఈ కాలంలో జన్మించినవారందరికీ నీవు ప్రదర్శించి పరిశీలించదగ్గ వస్తువుగా బతుకు. "ఇదుగో! చూడండి. క్రూరనిరంకుశుడు" అని వస్త్రంమీద వ్రాసి ఒక స్తంభానికి వ్రేలాడగట్టి, లభ్యమైన ఒక అసాధారణవికృతజంతువును ప్రదర్శించినట్లు నిన్ను చూపిస్తాము.

**మేక్బెత్ :** యువకుడైన మాల్కొం పాదప్రదేశాన్ని ముద్దాడటం కోసంగాని, నీచజననిందావాక్యాలకు ఎరగావటానికి గాని నేను లొంగిపోదలచలేదు. బిర్నాం మహారణ్యం డన్సనేన్‌కు వచ్చినా, స్త్రీగర్భాన జనింపనివాడివై నీవు నన్ను ఎదుర్కొన్నా, నేను తుదిదాకా నా యుద్ధయత్నాన్ని మానుకోను. ఇదిగో! కదనయోగ్యమైన డాలును శరీరానికి ముందిడుకొంటున్నాను. మాక్డఫ్! ఏదీ, ఎదుర్కో! 'చాలు! ఆప' మని మొదట ఎవరు కేక పెడితే వాడు అధోగతిపాలౌతాడు.

**(పోరాడుతూ నిష్క్రమిస్తారు. దుందుభిధ్వని వినిపిస్తుంటుంది.)**

**(తిరోగమనం తుత్తారధ్వనులు, దుందుభిమ్రోతలతో,**
**పతాకాలతో మాల్కొం, సివర్డు, రాస్, లెన్నాక్స్, ఆంగస్, కెయిథేనెస్,**
**మెంటియథ్, సైనికులు ప్రవేశిస్తారు.)**

**మాల్కొం :** ఇక్కడ మాకు కనిపించని మిత్రులందరూ సజీవులుగా తిరిగివచ్చి మమ్మల్ని చేరుకొందురుగాక!

**సివర్డు :** కొందరు మరణించటం తప్పదు. ఇందర్ని ఇక్కడ చూస్తున్నప్పుడు ఈ నాటి ఘనవిజయాన్ని మనం ఎంతో అల్పవ్యయంతో విలుచుకొన్నా మనిపిస్తున్నది.

**మాల్కొం :** ఇక్కడ మాక్డఫ్ కనిపించటం లేదు. మీ ఉదాత్తపుత్రుడు సివర్డు కనిపించటం లేదు.

**రాస్ :** సివర్డు ప్రభూ! తమ పుత్రుడు వీరమరణాన్ని పొందాడు. అతడు పురుషత్వాన్ని పొందుతున్న తొలిదశవరకే జీవించినా ఆ ఆరంభదశలోనే తన పరాక్రమసాహసాలను

నిరూపించుకొన్నాడు. సైనికోద్యోగ నిర్వహణంలో స్థిరుడై నిల్చి పోరాడి, పురుషోచితమరణాన్ని పొంది తన వీరతను సుస్థాపితం చేశాడు.

**సివర్డు :** అయితే అతడు మరణించాడన్నమాట!

**రాస్ :** అతని కళేబరాన్ని యుద్ధరంగంనుంచి తెచ్చారు కూడాను. అతని విలువకు అనుగుణంగా మీరు దుఃఖించటానికి పూనుకొంటే దానికి అంతమంటూ ఉండదు.

**సివర్డు :** అతని శరీరానికి ముందుభాగంలో ఏమైనా గాయాలు కనిపిస్తున్నావా?

**రాస్ :** అవును. కన్పించే గాయాలన్నీ ముందు భాగానికి తగిలినవే!

**సివర్డు :** అయితే అతడు పరమేశ్వర సేవలో ప్రాణాలు కోల్పోయినాడు. అతణ్ణి గురించి నాకు దుఃఖించవలసిన అగత్యం లేదు. నాకు తలపై కురులంతమంది తనూజులున్నా, వారికి ఇంతకంటే ఉచితమైన మరణం మరొకటి కావాలని నేను కోరను. అయితే అతనికోసం మృత్యుఘంటికలను మొరయించటం జరిగిపోయిందన్నమాట!

**మాల్కోం :** ప్రభూ! అతడు ఇంకా అధికంగా దుఃఖించటానికి అర్హుడు. తగిన అవకాశాన్ని చూచుకొని అందుకు వినియోగిస్తాను.

**సివర్డు :** అనవసరం. అతడికోసం ఇంతకంటే అధికంగా మనం దుఃఖించవలసిన పనిలేదు. అతడు ఉదాత్తంగా మృతి పొందాడనీ, వీరసైనికుడిగా తన ఋణం తీర్చుకొన్నాడనీ వారు చెప్పారు గదా! పరమేశ్వరుడు అతణ్ణి అనుగ్రహించు గాక! – ఇక మంచివార్త వస్తుందని ఊహిస్తున్నాను.

**(మేక్బెత్ శిరసుతో మాక్డఫ్ ప్రవేశిస్తాడు.)**

**మాక్డఫ్ :** మహారాజా! జయము! జయము!! ఇప్పుడు తాము మాకు మహారాజులైనారు. ఈ రాజద్రోహి దుష్టశరీరాన్ని ఎక్కడ నిలపాలెనో దర్శించండి. ఇక కాలానికి స్వేచ్ఛ సంప్రాప్తించింది. నేను వ్యక్తీకరించే హృదయభావాలనే వహించిన తమ రాజ్యంలోని ఆణిముత్యాలచేత ఇప్పుడు తాము పరివేష్టింపబడ్డారు. అందరి కంఠాలనూ నా కంఠంతో కలిపి 'స్కాట్లండు మహారాజా! జయము! జయము!!' అని జయవెట్టకోరుతున్నాను.

**అందరు :** స్కాట్లండు మహారాజా! జయము! జయము!!

**(తుత్తార ధ్వనులు వినిపిస్తవి)**

**మాల్కొం :** మీలో ప్రతిఒక్కరూ నాకై ప్రకటించిన ప్రణయగుణోపేతమైన సేవలను ప్రశంసించటంలో విశేషకాలవిలంబాన్ని ఇక నేను సహించలేను. నా ఋణాన్ని వెంటనే తీర్చుకొంటున్నాను. ఇప్పుడు థేనులుగా ఉంటున్న నా బంధువుల నందరినీ ఎరల్‌లనుగా నియమిస్తున్నాను. ఇట్టి విజయవేళల్లో ఏ స్కాట్లండు ప్రభువూ, పూర్వమెన్నడూ నియమించి ఎరుగని ఎరల్‌లు వీరు. చారులను నియమించి నిరంతరం పరిశీలించటంవల్ల భయపడి, ఈ నిరంకుశుని పాలనతో కాందిశీకులై వెళ్ళినవారిని తిరిగి పిలిపించటం నిహతుడై ఈ హంతకుని క్రూరానుయాయులకు, నిజహస్తాలతోనే ప్రాణం తీసుకొన్నదని వింటున్న భూతంవంటి[82] ఇతని రాజ్ఞికి శిక్ష చెప్పటం మొదలైన పనులేమేమి మేము చేయవలసి ఉంటే, వాటినన్నిటినీ వెంటనే జరిగిస్తాము.

ఇంతే కాదు. ఇంకా ఏ యే స్థలాలల్లో ఏ యే కృత్యాలను చేయవలసిన అవసరం పడితే వాటినన్నిటినీ పరమేశ్వరానుగ్రహ సహాయంతో నిర్వర్తించటానికి మేము స్థిరసంకల్పుల మైనాము. అందువల్ల తిరిగి మీ అందరికీ సమష్టిగాను, వ్యష్టిగాను నా నమస్కృతుల నర్పిస్తున్నాను. స్కోన్‌లో జరుగనున్న మా కిరీటధారణోత్సవానికి విచ్చేయవలసిందని మిమ్మల్నందరినీ ఆహ్వానిస్తున్నాను.

**(తుత్తార ధ్వనులు వినిపించినవి, నిష్క్రమిస్తారు)**

# అనుబంధం

## ప్రథమాంకం

1. **మరుభూమి –** దుష్టశక్తుల సమావేశానికి యోగ్యమైన ప్రదేశం. సమయం. ఈ మాంత్రికురాండ్రకు సామాన్యమైన మంత్రగత్తెలకున్న శక్తులేకాక, విధి దేవతలైన ఫ్యూరీలకుండే శక్తులు కూడా కొన్ని ఉండటాన్ని గమనించవలసి వుంది.

2. **రణకల్లోలం :** నార్వే రాజైన స్వెనోతో జరుగుతున్న యుద్ధకల్లోలం.

3. **గ్రేమాల్కిన్ :** ప్రథమమాంత్రికురాలి బిడాలనామం.

4. **ఫాడ్డాక్ :** ద్వితీయ మాంత్రికురాలి గోదురుకప్ప (హరంజాదా). మంత్రగత్తెలు గోదురు కప్పలు, పిల్లుల రూపంలో భూతపిశాచాలను తమ దగ్గర ఉండేటట్లు చేసుకోగలరని, 1584లో ప్రచురితమైన 'డిస్కవరీ ఆఫ్ విచ్ క్రాఫ్ట్' అనే గ్రంథంవల్ల తెలుస్తున్నది.

5. **ఎయ్యది పరులకు మంచో :** ఇందులో భవిష్యత్సూచన ఉన్నదని విమర్శకుల అభిప్రాయం.

6. **ఫోరెస్ :** స్కాట్లండులోని ఎల్జిన్ అనే కౌంటీలోని ఒక పట్టణం. ప్రస్తుత యుద్ధం ఇంచ్‌కోల్మ్ అన్న ప్రదేశంలో జరుగుతున్నది.

7. **సార్జెంట్ :** షేక్స్‌పియర్ కాలంలో ఇతడు సామాన్యోద్యోగి మాత్రమే కాదు. రాజుకు పార్శ్వచరులైన ప్రధానోద్యోగుల్లో ఒకడు.

8. **పశ్చిమద్వీపాలు :** స్కాట్లండుకు పశ్చిమంగా ఉన్న 'అవుటర్ హెబ్రిడిస్' ద్వీపాలు.

9. **మాతృస్వస్రేయా :** డంకన్, మేక్బెత్ అక్కచెల్లెండ్ర కుమారులు. డంకన్‌కు పూర్వం స్కాట్లండును పాలించిన మాల్కొంరాజుకు మనుమలు.

10. **ఫిరంగుల్లా :** ఫిరంగి ఆడ్రియనోపిల్ ముట్టడి వేళ మహమ్మద్ ॥ 1453లో తొలుతగా ప్రయోగించాడు. 1543లో మొదటిసారిగా ఇంగ్లండులో ఫిరంగి ప్రయోగింపబడ్డది. అందువల్ల ఇది కాలసంబంధిదోషము.

**11. గొల్గోతగా :** జెరూసలెం నగరాన బాహ్యప్రదేశంలో తలపుర్రెలతో నిండిఉన్న ఒక శ్మశాన ప్రదేశం. క్రీస్తు మహాశయుని ప్రాణహరణం ఇక్కడనే జరిగింది.

**12. థేన్ :** ఈ శబ్దం ఆంగ్లో సాక్సనుల కాలంలో ఎరల్, ఎల్డర్ మన్‌లకు మధ్యస్థితి వహించిన ఒక జాతి ప్రభువును తెలియజేస్తుంది. వీరు మొదట రాజుకు పార్శ్వచరులు. తరువాత ప్రాంతీయపాలకులైనారు.

**13. ఫైఫ్ :** ఫిర్త్ ఆఫ్ ఫోర్తుకు ఉత్తరంగా ఉన్న ఒక కౌంటీ.

**14. బెల్లోనా వరుడు :** బెల్లోనా రోమనుల యుద్ధాధిదేవత.

**15. సెయింట్ కొల్మిద్వీపం :** పిక్టులకు తొలుతగా క్రైస్తవమతాన్ని ప్రచారం చేసిన సెయింట్ కొలుంబా వసించిన ద్వీపం.

**16. డాలర్లు :** ఇవి 1518లో తొలుత బొహిమియాలోని సెయింట్ జొయాఖిం లోయలోని వెండిగనుల్లో జన్మించాయి. అందువల్ల జొయాఖిం థేలర్లని వీటికి మొదటిపేరు. థేలర్ అనే జర్మను శబ్దం ఆంగ్లభాషలో డాలర్ అయింది.

**17. వరాహాలను హతమార్చు –** దుష్టదృష్టిని ప్రసరించి వాటిని చంపు. మంత్రగత్తెలు వాటి యజమానులమీద కోపం తీర్చుకోటానికి దుష్టదృష్టితో గృహజంతువులను చంపటం, పిశాచశక్తులను వాటిమీద ప్రయోగించి బాధపెట్టటం చేస్తుంటారు.

**18. టైగర్ :** ఒక నౌక. 1583లో టైగరనే పేరుతో ఒక నౌక ఎల్లెప్పొకు సమీపంలో ఉన్న ట్రిపోలీలో (సిరియా) దిగిందట. ఎలెప్పో శబ్దాన్ని ప్రాచ్యదేశ మంత్రవిద్యకు సంబంధించిన పదంగా షేక్స్‌పియర్, స్కాట్ ప్రయోగించారు.

**19. దిక్సూచి ఫలకం :** షేక్స్‌పియర్ కాలంలో దిక్కులను సూచించే ఒక ఫలకాన్ని నావికులు ఉపయోగిస్తుండేవారు.

**20. విధికి మనం కూతుళ్ళం :** మేక్బెత్‌లో మంత్రగత్తెలు జనశ్రుతిలోని సామాన్య మాంత్రికురాండ్రు కారు. వీరికి సముద్రం మీద ప్రయాణం చెయ్యటం, గాలిలోకి ఎగిరిపోవటం మొదలైన అతీతశక్తులున్నాయి. వీరు విధి, అదృష్టాలమీద అధికారం గలవాళ్ళు.

**21. సైనల్ :** మేక్బెత్ తండ్రి. కానీ ఇతని నిజమైన పేరు ఫిన్లే. సైనల్ అనతికాలానికి పూర్వమే మరణించటంవల్ల మేక్బెత్‌కు ఇంకా ఆచారపూర్వకంగా గ్లామిస్‌థేన్ పదవి రాలేదు.

**22. అతడికి వినాశాన్ని తెచ్చిపెట్టింది :** కౌడర్ థేన్ నార్వే ప్రభువైన స్వైనోకు సైన్యసహాయం చేసి రాజద్రోహాన్ని తలపెట్టటం వల్ల, డంకన్ అతణ్ణి గురించి పూర్వవిచారణచేసి శిక్ష చెప్పటం నిలిపి ఉంచాడు. రాస్ వల్ల సత్యం తెలుసుకొన్న తరువాత మరణశిక్ష చెప్పి, అతని 'కౌడర్ థేన్' బిరుదాన్ని, పదవిని మేక్బెత్‌కు అందజేశాడు.

**23. భవిష్యత్తులో జరుగనున్న మహానాటకానికి –** ఈ స్వగతంలోని ప్రతివాక్యమూ మేక్బెత్ బుద్ధిలో ద్రోహాచరణకాంక్ష ఎంతో పూర్వమే పుట్టి ఉండటాన్ని వ్యక్తం చేస్తున్నదని, కోల్రిడ్జ్ మహాశయుడు. మంత్రగత్తెలవల్ల రాజ్యం బాంకో వంశస్థులకు పోతుందని విన్న అతడు, ఆలోచనలో పడ్డాడు. తృతీయాంక ప్రథమదృశ్యంలోని మేక్బెత్ స్వగతానికి బీజాలు ఇందులో కనిపించటం గమనింపదగ్గ విషయం.

**24. క్షుద్రపదార్థంలా పరిత్యజించటానికి –** కౌడర్ థేన్ మృతిని షేక్స్పియర్ మనోహరమైన భాషలో విపులంగా వర్ణించటానికి ఆయనకు అధికగౌరవం గల ఎస్సెక్స్ ప్రభువు వధ్యవేళ ప్రదర్శించిన ప్రవర్తన కారణమైవుంటుందని ఒక ఊహ. ఎస్సెక్స్ ప్రభువు కొంతకాలం ఎలిజబెత్ రాణికి ప్రీతిపాత్రుడై వర్తించి, ద్రోహాన్ని తలపెట్టి తెలిసినతరువాత క్షమాపణ వేడుకొన్నా ప్రయోజనం లేకపోవటం వల్ల, మరణశిక్షకు (1601) గురైనాడు.

**25. కంబర్‌లాండు యువరాజు :** రాజు కంబర్‌లాండుకు తన జీవితకాలంలో ఎవరిని పేర్కొంటే వారు రాజమరణానంతరం స్కాట్లండుకు ప్రభువు కావటం పరిపాటి. క్రీ. శ. 975 నుంచి స్కాట్లండు రాజులు కంబర్‌లాండును ఆంగ్లరాజు లిచ్చిన మొఖాసాగా అనుభవిస్తున్నారు. ఈ సందర్భంలోని మేక్బెత్ స్వగతం 'డంకన్ హత్యాపథకం' మేక్బెత్ బుద్ధిలో పుట్టిందేకాని మేక్బెత్ ప్రభ్వి చిత్తంలో జనించింది కాదని వ్యక్తం చేస్తున్నది.

**26. ఘనుడా గ్లామిస్! :** ఇట మేక్బెత్ ప్రభ్వి ప్రియపత్నివలె కాక, భర్త మనస్సును, తన మనసును ఆకర్షించిన డంకన్ హత్యోద్యోగానికనుగుణంగా స్వాగతాన్ని చెప్పటం గమనింపదగ్గది. యుద్ధభూమి నుంచి వచ్చిన భర్త బాహుబంధంలో ఒదిగిపోవటానికి పర్వెత్తకుండా 'గృధ్రరాజైన' భర్తకు తగ్గ సహచరిగా ఆమె ప్రవర్తించింది.

**27. ఏట్రింత –** మార్టిన్ అన్న ఈ పక్షి వేసవి ఆరంభంలో ఇంగ్లండుకు అతిథిగా వచ్చి, చలికాలం ఆరంభం కాగానే వెళ్ళిపోతుంది.

**28. మాలాధారులు :** జపమాలలు ధరించి ఎల్లప్పుడూ రాజుల జీవితం కోసం జపం చేస్తుండేవారిని బ్లూ గౌనులంటారు. తమ కో ఏడాది పెరిగినప్పుడల్లా ఇట్టి జప్యులను పెంచుతుండటం స్కాట్లండు రాజులకు ఆచారమట!

**29. పర్యవేక్షకుడు :** రాజుకు, ఆయన పరివారానికి భోజనసదుపాయాలను కల్పించటానికి పంపబడే ఉద్యోగి.

**30. దుందుభిస్వనాలైన కంఠాలతో :** తీర్పు నాడు (డే ఆఫ్ జడ్జిమెంటు) దేవదూతలు దుందుభులు మ్రోగిస్తారట!

**31. దివ్యగంధర్వ బాలకుల్లా :** తుది తీర్పు నాడు ఎగిరిపోతున్న మేఘాల నెక్కి వీళ్ళు లోకంలోని పాపాలకన్నిటికీ ప్రతీకారం జరిగితీరవలసిందేనని కేక పెడుతుంటారట!

## ద్వితీయాంకం

**32. హెకేట్ :** మాంత్రికవిద్యకు అధిదేవత. ఈమెను డయానాతో అభేదనుగా చెబుతుంటారు. అందువల్లనే హెకేట్ చంద్రాధిదైవతంగా భావింపడుతుంది.

**33. టార్క్విన్ :** ఇతడు యువ టార్క్విన్. రోము రాజైన టార్క్విన్ ది ప్రౌడ్ (క్రీ.పూ. 510 ప్రాంతం) కుమారుడు. ఇతడు లుక్రీషియాను బలవంతంగా చెరచినాడు.

**34. వాళ్ళనేది ఉన్మత్తులను చేసిందో –** మేక్బెత్ ప్రభ్వి మధుపానం చేసి వచ్చిందన్నమాట.

**35. ద్వితీయవ్యంజనప్రసారం :** భోజనవేళ రెండవమారు వడ్డనలో అతిరుచికరాలైన వ్యంజనాలుంటాయి. ప్రకృతి ఇచ్చే విందులో మొదటి ప్రసారం ఆహారమనీ, రెండవ ప్రసారం నిద్ర అని భావం.

**36. నెప్ట్యూన్ :** సముద్రాలకు అధిదేవత. ఇతణ్ణి ప్రాచీనరచయితలందరూ ఘనుడని వ్యవహరిస్తారు. 'సాటరన్'ను సింహాసనం నుంచి దించి, అతని రాజ్యాన్ని విప్లవం చేసిన అతని ముచ్చురు పుత్రులు 'పంచుకొన్నప్పుడు జూపిటర్‌కు స్వర్గం, భూమి, ప్లూటోకు అధోలోకం, నెప్ట్యూన్‌కు సముద్రం వచ్చాయని గ్రీకు పురాణగాథ.

**37. బిల్జిబబ్ :** పాలస్టయిన్‌లో పూజింపబడే భూతాలకు పాలకుడైన దేవతామూర్తి.

**38. సస్యం సమృద్ధిగా పండటంచేత :** పంట విపరీతంగా పండటంచేత 1606లో ఆంగ్లదేశాన ధరలు విపరీతంగా పడిపోయి, కొందరు కృషీవలులు ఆత్మహత్య చేసుకొన్నారట!

**39. జెసూట్‌వా!:** జేమ్సు రాజువల్ల తమకు వ్యతిరేకాలైన కొన్ని చట్టాలను మార్పించుకోటానికి యత్నించి జెసూట్లు విఫలులై, 1605లో పార్లమెంటు జరుగుతుండగా భవనాలను బ్రద్దలుకొట్టడానికి మందు పెట్టి, కుట్ర బయటపడటంవల్ల ఉరి తీయబడతారు. ఈ కుట్ర కాథలిక్ మతస్థుడైన రాజును సింహాసనమెక్కించటానికి ఉద్దేశింపబడింది కనుక భగవత్సంబంధ మైనది.

**40. ఆంగ్లసీవనకారుడు :** షేక్స్‌పియర్ కాలంలో సీవనకారులు దుస్తులు కుట్టటానికని ఇచ్చిన గుడ్డలో కొంత కాజేసేవారట! ఫ్రెంచి ఫాషన్లను వికృతంగా అనుకరించేవారట! అందువల్ల షేక్స్‌పియర్ వారిని పరిహసిస్తున్నాడు.

**41. ద్వారపాలకుణ్ణి మరిచిపోకండి :** లంచం ఇవ్వటం విషయంలో.

**42. రెండోమారు కోడి కూసేదాకా :** అంటే రాత్రి 3 గంటల వరకు.

**43. పవిత్రీకృతమైన మన ఆలయాన్ని :** కిరీటధారణవేళ రాజు శరీరాన్ని పరమేశ్వరాలయంగా అభిషేకించి పవిత్రీకృతం చేయటం క్రైస్తవాచారం.

**44. గార్గన్ చేసిన చర్యలు :** ఇది మెడూసా అన్న సర్పకేళి. సర్పాలను కేశాలుగా కలిగిన ఈ మెడూసా, తన్ను చూచినవాళ్ళను రాళ్ళుగా మార్చివేస్తుందని గ్రీకు పురాణగాథ.

**45. స్కోన్‌కు :** నేటి పెర్త్‌కు దగ్గిరిగా ఉన్న ఒక మఠాలయం. ఇందులో జాకబ్ తలగడైన ఒక రాయి ఉందనీ, ప్రాచీన స్కాట్లండు రాజులనందరినీ ఆ రాతిమీద కూర్చోపెట్టి కిరీటధారణం చేయించేవారనీ తెలుస్తున్నది. ఎడ్వర్టు ఆ శిలను వెస్టుమినిస్టరుకు తెప్పించిన నాటినుంచీ, ఆంగ్లచక్రవర్తులందరినీ దానిమీదనే కూర్చోపెట్టి కిరీటధారణం చేయించటం జరుగుతున్నది.

**46. కోల్మి - కిల్ -** పూర్వపు స్కాట్లండు రాజులకు అది ఖననసంస్కారభూమి. ఇప్పుడు దాన్ని ఐయోనా అంటారు. ఇది పశ్చిమద్వీపాలలో ఒకటి. క్రైస్తవమతాన్ని ప్రచారం చెయ్యటానికి క్రీ.శ. 6వ శతాబ్దంలో వచ్చిన సెయింట్ కొలుంబా యిక్కడ నివసించటంవల్ల, దీనికి కొలుంబా సెల్, కోల్మికిల్ అన్న పేర్లు వచ్చాయి.

## తృతీయాంకం

**47. నా సోదరపుత్రులు :** మాల్కొం, డొనాల్బెయిన్.

**48. సీజర్ ఎదుట మార్క్ ఆంటోనీ సంరక్షకశక్తి :** ఈ సీజర్ ఆక్టేవియిస్ సీజర్. క్రీ.పూ. 63-14 మధ్యకాలంలో రోమక సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తి.

తొలుత ఇతడు ఆంటోనీ, లెపిడస్‌లతో కలిసి త్రైకూటమి సమితి (ట్రయంవిరేట్) ఏర్పాటు చేసి తుదకు ఆక్టియం యుద్ధంలో ఆంటోనీని ఓడించి, రోమక ప్రపంచానికి ఏకైకపాలకుడైనాడు.

మార్క్ ఆంటోనీ ఆక్టేవియస్‌తోపాటు త్రైకూటసమితిలో సభ్యుడై, అతని సోదరి ఐన ఆక్టేవియాను వివాహమాడి, తరువాత ఈజిప్టుకు వెళ్ళినప్పుడు క్లియోపాత్రా మోహంలో చిక్కుకొని, ఆక్టియం యుద్ధంలో ఓడిపోయి ఆత్మహత్య చేసుకొన్న రోమక వీరాగ్రేసరుడు. ఇక్కడ మార్క్ ఆంటోనీ అయిన మేక్బెత్‌కు బాంకో ఆక్టేవియస్ అన్నమాట!

**49. కుమారుడు పారిపోయినాడు :** ఫ్లియాన్సు వేల్సుకు పారిపోయి రాకుమార్తెను వివాహమాడి, తరువాత కాలంలో స్కాట్లండుకు హైస్ట్యూవర్డు అయిన వాల్టరన్న పుత్రుని కన్నాడు. జేమ్సు రాజు ఇతని వంశంలో జన్మించినాడట! అందువల్ల బాంకో స్టువర్టు రాజవంశానికి మూలపురుషుడైనాడన్నమాట!!

**50. మీకో స్థానం ప్రత్యేకించబడి ఉంది :** లెన్నాక్స్‌కు బాంకో ప్రేతరూపం కనిపించకపోవటాన్ని బట్టి ఇలా మాట్లాడుతున్నాడు.

**51. రష్యన్ భల్లూకంలా :** రష్యాలో భల్లూకాలు విశేషం. కొన్ని సందర్భాలలో రష్యాను 'ఘనభల్లూకం' అని వ్యవహరించటం కద్దు.

**52. హైర్కానియస్ వ్యాఘ్రంలా :** ప్రాచీన పర్షియాదేశంలో హైర్కానియా ఒక రాష్ట్రం. ఇందులో వ్యాఘ్రాలు విశేషంగా ఉన్నట్లు ప్లినీ, వర్జిల్ పొగడినారు.

**53. రక్తం రక్తాన్ని పుచ్చుకొంటుంది:** నిహతుని రక్తం హంతకుని రక్తాన్ని పుచ్చుకోకపోతే ప్రాయశ్చిత్తం లేదని షేక్స్‌పియర్ నాటి విశ్వాసం.

**54. శిలలు నడిచివెళ్ళుతాయిట :** డ్రూయిడ్లనే పురోహితులు పూర్వం కొన్ని శిలల మూలంగా హత్యాదోషాలను బయట పెట్టగలిగేవారట. ఆ శిలలను హంతకుడు కదల్పలేడట. నిర్దోషి సులభంగా కదల్చగలడట. కొన్ని శిలలకు హత్యగావింపబడిన వ్యక్తులను బయటపెట్టగల శక్తి ఉన్నట్లు కొన్ని కథలు కనిపిస్తున్నవట. పాలిడోరస్ అన్న రాజకుమారుని హత్య చేస్తే, అతని సమాధి మీద ఒక చెట్టు మొలిచి రక్తాన్ని ఒలికించి ఆ హత్యను బయట పెట్టినట్లు వర్జిల్ మహాశయుని 'ఈనిడ్'లో ఒక కథ కనిపిస్తున్నది.

**55. గోకరాళ్ళ కూతలు :** రోమనులు పక్షుల కలకలాలను బట్టి, విహరించే రీతులను బట్టి ఎన్నో విషయాలను తెలుసుకొంటూండేవారు. ఈ అంశాలవల్ల తన హత్యాదోషం బయటపడ్డదన్న భావం మేక్బెత్‌కు కలిగినట్లు స్పష్టమౌతున్నది.

**56. చంద్రశృంగంమీది నిబిడమైన బిందువు :** ప్రాచీనకాలంలో చంద్రగోళం నుంచి కొన్ని రసబిందువులు ఔషధులమీద పడి వాటికి విచిత్రమైన మాంత్రికశక్తి నిచ్చేవనే విశ్వాసముండేది.

**57. ఉదాత్తుడైన డంకన్‌ను గురించి :** డంకన్‌కు ఉదాత్తుడన్న విశేషణం సర్వసాధారణంగా ప్రయోజితమైంది. చరిత్రాత్మకంగా డంకన్ అటువంటివాడు కాకపోయినా, షేక్స్పియర్ అతణ్ణి అటువంటివాడినిగా చిత్రించటం, రాజ్యాపహర్త, హంతకుడు ఐన మేక్బెత్ పతనాన్ని తీవ్రతరం చేయటంకోసమేనని గమనించవలసి ఉంది.

**58. పవిత్రుడైన ఎడ్వర్డు రాజు :** ఈ ఎడ్వర్డు రాజుకు పోపు అలెగ్జాండర్ III 'కన్ఫెసర్' అన్న బిరుదునిచ్చి, 1161లో గౌరవించాడు. వెస్ట్ మినిస్టర్ అబీని (మఠాలయాన్ని) నిర్మించినదీ మహారాజే.

**59. హత్యాఖడ్గ ప్రదర్శనలు లేకుండా :** ఇది అనుమానించదగ్గ నానారీతులైన వారితో కలిసి విందులను సేవించేటప్పుడు బల్లలమీద ఛురికా ఖడ్గాలను గ్రుచ్చటమనే పూర్వపు స్కాట్లండు దేశాచారాన్ని జ్ఞప్తి చేస్తున్నది.

**60. మాక్డఫ్ కోసం వార్త పంపించలేదా? –** మాక్డఫ్ ఫైఫ్ దుర్గాధిపతి. ఫైఫ్ మేక్బెత్ ప్రస్తుతమున్న ఫార్రెస్ సౌధానికి రోజు ప్రయాణం కంటే ఎక్కువ దూరంగా ఉంది. కానీ షేక్స్పియర్ ఒక రోజులోనే వార్తాహరి వెళ్లి తిరిగి రాదగినంత దూరంలో ఉన్నట్లు ఊహించాడు.

## చతుర్థాంకం

**61. చారలపిల్లి :** ప్రథమ మాంత్రికురాలి పిల్లి – గ్రేమాల్కిన్.

**62. మూడున్నొక్కమారు :** మంత్రగత్తెలకు మూడు, ఒకటి ముఖ్యంగా శక్తియుతమైన సంఖ్యలు.

**63. జ్యూజాతివాని :** షేక్స్పియర్ జ్యూ, టర్క్, తాత్తారులనందరినీ ఒకేలెక్కలో పరిగణించటం, వారిని జంతువులతో సమానంగా చూడటం, అతని కాలంవారికి వారిమీద ఎట్టి అభిప్రాయమున్నదీ వ్యక్తం చేస్తున్నది. చంగిస్‌ఖాన్

దండయాత్రలవల్ల, మధ్యాసియా నివాసులైన తార్తారులతో పాశ్చాత్యులకు పరిచయం కలిగింది.

**64. బిర్నాం మహారణ్యం :** డస్‌కెల్ట్ వద్ద డన్సనేన్ పెర్త్‌లకు మధ్య వున్న కొండతో కూడిన మహారణ్యం.

**65. ఎనిమిదిమంది రాజులు :** వీరు రిచ్చర్డు II, రిచ్చర్డు III, ఆర్గురు జేమ్సులు అన్న స్కాట్లండు రాజులు. ఇందులో ఐదవ జేమ్సు రాజు కుమార్తె అయిన మేరీ రాణి విడిచిపెట్టబడ్డది. మంత్రగత్తెల జోస్యంలో రాజులను మాత్రమే చెప్పటం ఇందుకు కారణం.

**66. నీవు బాంకో ప్రేతరూపంలా :** ఇలా కన్పించేది బాంకో వారసుడైన రిచ్చర్డు II

**67. మాక్డఫ్ దుర్గం :** ఫైఫ్ షైర్ సముద్రతీరాన నేటి డైసార్టుకు మూడు మైళ్ళలో ఈ మాక్డఫ్ దుర్గం ఉండి ఉన్నట్లు భావించబడుతున్నది.

**68. ఫైఫ్‌లోని అతని ఆస్తి :** మాక్డఫ్, ఫైఫ్ దుర్గాధిపతి. కనుక అతని ఆస్తిని స్వాధీనం చేసుకొంటానని మేక్బెత్ అభిప్రాయం.

**69. రాజభక్తి ప్రమాణాన్ని భగ్నం చేశారు :** నేడు మేక్బెత్ రాజై ఉండగా, మాల్కోంను రాజును చేయటానికి యత్నించటం వల్ల.

**70. గండమాల :** స్క్రోఫులా, ఎడ్వర్డురాజు ఈ వ్యాధిని తన అద్భుతశక్తితో నయం చేయటంవల్ల దీనికి 'రాజవ్యాధి' అన్న పేరు వచ్చింది. ఈ చికిత్సాశక్తి వారసత్వంగా అనీరాణి వరకు ఈ రాజవంశంలో వచ్చినట్లు ప్రతీతి.

**71. వారు కూడా క్షేమంగానే ఉన్నారు :** మాక్డఫ్ దారాపుత్రులను మేక్బెత్ హత్య చేయటాన్ని రాస్ అతిజాగరూకతతో నింపాదిగా బయటపెట్టటం గమనింపదగ్గ విషయం.

## పంచమాంకం

**72. ఒకటో దృశ్యం –** 'నిద్రా – గమనాన్ని' ఇంత రమణీయంగా నిరూపించి చూపిన దృశ్యం ఆంగ్లసాహిత్యంలో మరెక్కడా లేదు. ఇట్టి జాతికి చెందిన దృశ్యాలలో ఇదే మొదటిదీ, తుదిదీ కూడాను.

**73. ఓ చెడ్డమచ్చా! :** మేక్బెత్ ప్రభ్వి కూడా నిద్రను హత్య చేసింది. ఆమె ఊహించే మచ్చ ఊహాజనితం, హత్యాసంబంధియైనది.

**74. ఫైఫ్ థేనుకు ఒక భార్య :** మాక్డఫ్ ప్రభ్వి.

**75. నా వైద్యవిద్యానైపుణ్యాన్ని మించిపోయింది –** షేక్స్పియర్ కాలంలో ఉన్మాదవ్యాధిని నయం చేయటానికి చాలా తక్కువ ప్రయత్నం జరిగింది.

**76. పినతండ్రి సివర్డు –** హాలిన్ షెడ్‌లో వృద్ధ సివర్డు మాల్కొంకు మాతామహుడు. ఇతని కుమార్తెనే డంకన్ వివాహమాడాడు.

**77. ఎపిక్యూరియన్లతో –** ఎపిక్యురస్ అనే గ్రీకు తత్త్వవేత్త (క్రీ.పూ. 4వ శతాబ్ది) సిద్ధాంతాలను అనుసరించేవారు ఎపిక్యూరియనులు. కానీ ఏ కారణంచేతనో తిని, తాగి, తందనాలాడామని కొన్ని సిద్ధాంతాలలోను ఎపిక్యురస్ ప్రచారం చేసినట్లు లోకంలో అపప్రథ పడ్డది. ఇటువంటి స్థితే ఉమర్ ఖయ్యాముకు కూడా పట్టింది.

**78. శయ్యాగృహాలలో –** ఈ వాక్యాలు పలికేటప్పుడు మాల్కొం, తన తండ్రి డంకన్ హత్యను గురించి ఊహిస్తూ ఉండిఉంటాడు.

**79. శత్రువుల ముట్టడిని పరిహసించగల శక్తి –** మేక్బెత్ చేత ఈ వాక్యాలను పలికించేటప్పుడు షేక్స్పియర్ బాబిలోనియా తుదిరాజైన బాల్షజారు కైరస్ దండెత్తివచ్చినపుడు పరిహసించటాన్ని జ్ఞప్తిలో ఉంచుకొని ఉంటాడు.

**80. కట్టుకొయ్యకు బంధించేశారు –** ఎలిజబెత్ కాలంలో కట్టుకొయ్యలకు ఎలుగుబంట్లను కట్టి, వేటకుక్కల చేత వాటిని కరిపించి కష్టపెట్టటం అన్ని వర్గాలవారికీ ఒక విలాసం. బహుశః షేక్స్పియర్ దీన్నిబట్టి మేక్బెత్ చేత ఇలా పలికించివుంటాడు.

**81. రోమకదేశీయుల్లా –** కాటో, కాషియస్, బ్రూటస్, ఆంటోనీవంటి రోమకసేనానులును శత్రువులకు చిక్కిపోవటం కంటే ఆత్మహత్య చేసుకోవటమే ఘనంగా భావించారు. మేక్బెత్ దృష్టిలో ఈ వీరకృత్యం 'విదూషకపాత్రాభినయం' అని అనిపించుకోటం అతని శీలంలోని నైచ్యతను వెల్లడిస్తున్నది.

**82. భూతంవంటి ఇతని రాజ్ఞిని –** మాల్కొం తన తండ్రి హత్య విషయంలో మేక్బెత్ ప్రభ్వి పవిత్రతను గురించి వినటం వల్ల ఇలా పలికాడు. కాని నిద్రాగమన దృశ్యంలో ఆమె వ్యవహారాన్ని చూసిన తరువాత, ఆమెను గురించిన ఇటువంటి వర్ణనను సహించలేము. ఆమెపడ్డ పశ్చాత్తాపాన్ని గురించి వింటే మాల్కొం కూడా తప్పకుండా ఈ అభిప్రాయాన్ని మార్చుకొని తీరుతాడు.

# డాక్టర్ జెకిల్ - మిస్టర్ హైడ్

(రాబర్ట్ లూయీ స్టీవెన్సన్)

వ్యక్తి సుస్వభావ దుస్వభావాల ద్వంద్వ ప్రకృతి అతడి దుస్వభావానికి వ్యక్తిత్వంతో వ్యవహరించే అవకాశం లభిస్తే సుస్వభావాన్ని ఎలా పరిపూర్ణంగా రూపుమాపగలుగుతుందో నిరూపిస్తుంది 'డాక్టరు జెకిల్-మిస్టర్ హైడ్'

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ద్వారబంధకథ | 461 |
| 2. | హైడ్ కోసం అన్వేషణ | 470 |
| 3. | డాక్టరు జెకిల్ ప్రశాంతంగా ఉన్నాడు | 481 |
| 4. | క్యారూ హత్యావ్యవహారం | 485 |
| 5. | ఉత్తరం కథ | 491 |
| 6. | డాక్టర్ లాన్యన్ విచిత్రోదంతం | 498 |
| 7. | వాతాయనం దగ్గరి విశేషం | 504 |
| 8. | తుది రాత్రి | 507 |
| 9. | డాక్టరు లాన్యన్ కథనం | 523 |
| 10. | హెన్రీ జెకిల్ సమగ్ర వాఙ్మూలం | 533 |

# 1. ద్వారబంధకథ

న్యాయవాది మిస్టర్ అట్టర్సన్ గుండ్రని ముఖంలో చిరునవ్వంటూ ఎప్పుడూ ఎవరికీ కనిపించలేదు. అతని సంభాషణ ఎల్లవేళలా నిర్జీవంగా, అతికష్టం మీద నడుస్తున్నట్లుండేది, అతని భావాలు వెనుకంజ వేస్తూ కనిపించేవి. పొడుగ్గా, బక్కపలచగా, దుమ్ముకొట్టి అలసిపోయినట్లు కనబడుతుంటే మటుకేం? అతడు అందరి అనురాగాన్నీ చూరగొంటుండేవాడు, మిత్రబృందంతో కలసి ద్రాక్షాసవాన్ని రుచిచూచేటపుడు, మానవత్వం ఒక విశిష్టరూపంతో అతని కన్నుల్లోనుంచీ ఉట్టిపడుతుండేది. అయినా అది అతని సంభాషణలో ఎన్నడూ బయటపడేది కాదు. కానీ అది భోజనం పూర్తిచేసి కూర్చున్నపుడు మూగ సంజ్ఞలతో ముఖంలోనూ, అంతకంటే అధికంగా అతని నిత్యజీవిత వ్యాపారాలలోనూ వ్యక్తమౌతూ ఉండేది. నిత్యప్రవర్తన విషయంలో అట్టర్సన్ కొన్ని విశేషనియమాలున్నవాడు. ఆసవసేవనం విషయంలో తనకున్న అభిరుచిని అణచివేయాలన్న సంకల్పంతో, ఏకాంతంగా ఉన్నపుడు ఘాటైన వెగటుపుట్టించే జిన్ తాగుగుండేవాడు. నాటకప్రదర్శనలు చూడటమంటే అతనికి ఎంతో అభిలాష. అయినా గడచిన ఇరవై ఏండ్లలో ఒక్కమాటైనా అతడు ఏ నాటకశాలలోనూ అడుగు పెట్టలేదు. ఇట్టి విశేషాలు కలవాడైనా అతనికి ఇతరులయెడ మనఃపూర్వకమైన సహనం విశేషంగా ఉండేది. ఏవేవో దుష్కృత్యాలు చేసి మహోత్సాహంతో ఇతరులు విర్రవీగుతూ ఉండేటపుడు, అతడు వారిని చూచి ఈర్ష్య వహిస్తున్నాడా అని ఊహించదగినంతగా ఆశ్చర్యపడుతూ ఉండేవాడు. అయితేనేం? ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా అటువంటి దుష్కార్యాసక్తులను నిందించటంకంటే సహాయంచెయ్యటానికి మొగ్గేవాడు. “సోదరమానవులు ఏవైనా పాపకృత్యాలు చేస్తే దాని ఫలితాలను వాళ్ళే అనుభవిస్తారు. నా కెందుకు? నేనుమాత్రం ‘కైన్ నియమావళి’నే అనుసరిస్తాను. అన్నమాటలు అతనినోటి వెంట తరుచుగా వినబడేవి. ఇట్టి ప్రకృతిగల వ్యక్తి కావటం వల్లనే పతితులకు ఖ్యాతిగల పరిచయస్థుడు అయి ఉన్నా వారి జీవితాల మీద తన ఉత్తమప్రవర్తనభావాన్ని నెరపటంలో తుదివాడైనాడు. ఒకవిధంగా ఇది అతని అదృష్టం అనవచ్చు. అతన్ని తమకు న్యాయవాదిగా పెట్టుకొని ఆ భ్రష్టులు తమ వ్యవహారపుచిక్కులను చక్కబెట్టుకోవటానికి

కార్యాలయానికి రాకపోకలు సాగించే సందర్భాలలో, అతడు వారియెడ చూపే ప్రవర్తనలో ఎటువంటి వైపరీత్యాన్నీ వెల్లడించేవాడు కాడు.

ఇటువంటి ప్రవర్తన  మిస్టర్ అట్టర్సన్‌కు అతిసుగమమైంది. అతిశయమైన ఆడంబరం లేకపోవటంవల్ల, తన సుస్వభావానికి అనుగుణంగా, విశాలదృష్టితో మిత్రత్వాలను ఏర్పరుచుకోవటం వల్లా, యాదృచ్ఛికంగా లభించిన స్నేహితులనే స్నేహబృందంగా స్వీకరించటం ఉదారుడైన అతనికి లక్షణమైంది. ఆ రీతిగా మిత్రులను ఎన్నుకోటంలో అతడు అనుసరించేది, న్యాయవాదుల విధానం. అయితే అతని ఆప్తమిత్రులు మాత్రం రక్తసంబంధం గల బంధువులో లేకపోతే చిరకాల పరిచయం కలవాళ్లో అయి ఉండేవారు. అతని స్నేహలతలు ప్రత్యేక ప్రయోజనాలను సాధించటంకోసం జన్మించి వేగవేగంగా ప్రాకిపోయినవి కావు  బహుకాలం పెనవేసుకొని అల్లుకున్నవి. అతనికి దూరజ్ఞాతీ, పట్టణంలో కొంత ప్రఖ్యాతి ఉన్నవాడూ అయిన రిచ్చర్డు ఎన్ఫీల్డుతో అట్టర్సన్‌కు ఏర్పడ్డ అనుబంధం ఇటువంటిదే. ఒకరిలో ఒకరికి ఏమి విశేషం కనిపించిందో, ఇరువురికీ లక్ష్యాంశం ఏమిటో ఎవరికైనా అగమ్యగోచరంగానే ఉండిపోయింది. ఒక్క పర్యాయమైనా తప్పని ఆదివారపు వాహ్యాళు ల్లో వారిద్దరూ ఏమీ మాట్లాడుకోరనీ, స్తబ్ధంగా మౌనముద్ర వహించి నడుస్తూ కనిపిస్తారనీ, పైగా అటువంటి సమయంలో ఎవరైనా మిత్రుడు కన్పిస్తే ఎంతో సంతోషిస్తూ ఉంటారనీ చూచినవాళ్లు చెప్పేవారు. ఈ పాటివే అయినా ఆ ఆదివారపు షికారులకోసం ఆ ఇద్దరు వ్యక్తులూ అమితోత్సాహాన్ని ప్రకటిస్తూ ఉండేవారు. కేవలం విలాసాలనే కాకుండా అనంతానందాన్ని ప్రసాదించశక్తి గల అనేక వ్యాపారాలను కూడా వీటికోసం వదులుకొంటుండేవారు. ప్రతి వాహ్యాళినీ ఆ వారంలో తాము సంపాదించిన ఒక అమూల్యరత్నంగా వారు భావించేవారు.

ఒకనాడు షికారుకు వెళ్లుతున్నప్పుడు, వాళ్ళిద్దరూ లండన్ మహానగరంలో వ్యాపారపుసందడి అత్యధికంగా ఉన్న ప్రాంతాన ఒక ఉపవీథి గుండా ప్రయాణం చేస్తున్నారు. ఆ ఉపవీథి చాలా చిన్నది. అతి ప్రశాంతంగా ఉంది. ఆదివారం కాక వారంలోని ఇతర దినాలల్లో ఉపవీథిలో వ్యాపారం విరివిగా సాగుతుంటుంది. ఆ ఉపవీథిలో నివాసం చేసేవాళ్ళందరూ ఇంత ఉన్నవాళ్లు, సంపన్నులైనా వ్యాపారాలకు ఇంకా వృద్ధి చేసి ఇనుమిక్కిలిగా ఆర్జించాలెనన్న ఆశ కలవాళ్లు, అందువల్ల ఆ వీథిలోని షాపుల బహిర్భాగాలను అన్నింటినీ, వాళ్లు తమకు వచ్చిన అధికలాభాలు పెట్టి ఎంతో అందంగా అలంకరించారు. ఆ వీథిలోని అంగళ్లు అన్నీ, రమణీయమైన అలంకారాలతో

సింగారించుకొని, చిరునవ్వులతో వస్తువులను కొనేవాళ్లను ఆహ్వానిస్తున్న వ్యాపారపు పడుచులవలె గోచరిస్తున్నవి. తన మనోజ్ఞ శృంగారానికి ఇంతగా ముసుగు వేసుకొన్నట్లున్నప్పటికీ ఆదివారంనాడు కూడా ఆ ప్రాంతం జనసమ్మర్దంతో, ఇతరనిస్తబ్ధప్రాంతాలతో పోల్చి చూస్తే అరణ్యంలో దావాగ్నిలా ప్రకాశిస్తూనే ఉంది. క్రొత్తగా రంగులు వేసిన పై తలుపులు, నిన్నో మొన్నో మలామా చేసిన ఇత్తడి గుబ్బలు, ప్రదేశ పారిశుద్ధ్యం, శయ్యారామణీయకం – అన్నీ పాంథులదృష్టిని వెనువెంటనే ఆకర్షించి, అనందాన్ని ప్రసాదిస్తూనే ఉంటాయి.

ఆ వీథికి తూర్పుగా వెళ్ళి ఎడమవైపు తిరిగితే కనుపించే గృహశ్రేణిలో ఉన్న రెండిళ్లు దాటగానే ఒక సందు కన్పిస్తుంది. ఆ సందుమీదికి చొచ్చుకువచ్చి అమంగళ స్వరూపంతో ఉన్న మహాభవనం ఒకటి కన్పిస్తుంది. అది రెండంతస్తుల సౌధం. అయినా క్రింది అంతస్తులో ముందువైపుగా ఒక వాతాయనమైనా లేదు. ఒక ద్వారం మాత్రం ఉంది. పై అంతస్తున రంగు వెలిసిపోయిన కుద్యం ఒకటి కనిపిస్తున్నది. దాని లక్షణాన్ని బట్టి బహుకాలంనుంచీ ఈ భవనాన్ని గురించి ఎవరూ శ్రద్ధ వహించలేదని వ్యక్తమౌతున్నది. లోపల ఉన్నవాళ్ళను పిలవటం కోసం తలుపుకు ఒక గంటగానీ లేదా కొక్కెరగానీ అమర్చినట్లు లేదు. ఆ భవనానికి వేసిన రంగు పూత చిట్లి పగుళ్లు వారి, స్పష్టంగా కన్పిస్తున్నది. తిరుగుబోతులు భవనం బయటి భాగంలో పవళించటమూ, వాతాయన ఫలకాలమీద అగ్గిపుల్లలు గీయటమూ, చేస్తుంటారు. ఎప్పుడూ ఆ భవనం ముందు పిల్లలు గుంపులుగుంపులుగా కూడుతుంటారు. ఆ ఇంటిదిమ్మలమీద బడికి వెళ్లేటప్పుడూ, ఇంటికి పోయేటప్పుడూ పిల్లలు కత్తులు చాదుతుంటారు. దరిదాపుగా ఒకతరం గడిచి పోవస్తున్నది. ఇలా చిల్లరగా చేరే అల్లరిమూకలను వెళ్ళగొట్టడానికి కానీ, భవనానికి వారు చేసిన దుశ్చర్యలకు తగ్గ ప్రతిచర్యలు చేసి దాన్ని క్రమంగా పాలించటానికిగానీ ఎవరూ యత్నించినట్లు కన్పించదు.

మిస్టర్ ఎన్ఫీల్డ్, న్యాయవాది అట్టర్సన్ ఆ సందు అవతలి వైపునకు వచ్చారు. ఆ భవనం ముందుకు రాగానే ఎన్ఫీల్డ్ చేతి కర్ర ఎత్తి ఆ ఇంటివైపు చూపించాడు.

“మీరు ఎప్పుడైనా ఆ ద్వారబంధాన్ని శ్రద్ధతో గమనించారా?” అని పక్కనున్న మిత్రుణ్ణి వేసిన ప్రశ్నకు అనుకూలంగా సమాధానం రాగానే, “దీనికి సంబంధించిన ఒక విచిత్రమైన కథ నా మనస్సులో మెదులుతున్నది” అన్నాడు ఎన్ఫీల్డ్.

"అలాగా?" అని, మిస్టర్ అట్టర్సన్ కొంతగా కంఠస్వరంలో మార్పు కన్పించేటట్లు "అదేమిటి?" అని ప్రశ్నించాడు.

"అదేమిటంటే" అని ప్రారంభించి మిస్టర్ ఎన్ఫీల్డ్ ఇలా చెప్పుకోవచ్చాడు : "ఒక శీతాకాలంనాటి ఉదయం దరిదాపు 3 గంటలప్పుడు నేను బహుదూరం ప్రయాణం చేసి ఇంటికి తిరిగి వస్తున్నాను. నేను నడిచివచ్చే నగరప్రాంతంలో దీపస్తంభాలు తప్ప మరేమీ కన్పించటం లేదు. వీధి వెంట వీధిని నడిచి వస్తున్నాను. అంతటా జనం గాఢంగా నిద్రపోతున్నారు. దీపస్తంభాలు వీధుల్లో బారులు తీర్చి ఏదో ఉత్సవాలకని బయలు దేరబోతున్నట్లున్నవి. చలి విపరీతంగా ఉండటం వల్ల ఆ ప్రదేశమంతా అతినిశ్శబ్దంగా ఉంది. అయినా అప్పుడప్పుడు వినిపిస్తూ వచ్చిన వింతధ్వనులను వినీవినీ, నేను ఎవరైనా ఒక రక్షకభటుడు కన్పిస్తే ఎంత బాగుంటుంది అని అనుకొన్నాను. అటువంటి మానసిక వాంఛతోనే నడుస్తున్నాను. అట్టి స్థితిలో హఠాత్తుగా నా కంటిముందు రెండు ఆకారాలు కన్పించాయి. అందులో ఒక ఆకారం గుజ్జురూపంతో ఉన్న వ్యక్తి. అతడు అతివేగంగా నడుస్తూ తూర్పుగా వస్తున్నాడు. రెండో ఆకారం ఒక ఆడపిల్ల. వయస్సు ఎనిమిదేళ్ళో, పదేళ్ళో ఉంటుంది. ఆ పిల్ల అడ్డంగా పోతూ ఉన్న మరొక వీధిమీద పరుగెత్తుకుంటూ వస్తున్నది. మూలతిరుగుడు దగ్గర వీళ్ళిద్దరూ ఒకరినొకరు గట్టిగా ఢీకొన్నారు. అప్పుడే ఒక ఘోరకృత్యం జరిగింది. అలా ఢీకొన్నప్పుడు పిల్ల పడిపోయింది. పడిపోయిన పిల్లమీదుగా ఆ ఎదురు తగిలిన మనిషి పిసరు వెళ్ళేట్టు త్రొక్కుకుంటూ నడిచి వెళ్ళాడు. పిల్ల నేలమీద గగ్గోలు పెడుతూ ఏడుస్తున్నా అతడు వినిపించుకోకుండా వెళ్ళిపోతున్నాడు. చెపితే మీరు ఊహించను గూడా లేరు కాని ఆ పిల్ల నరకబాధను అనుభవించింది. వాడు మనిషిగా లేడు జగన్నాథరథంలా ఉన్నాడు. వెంటనే నేను కేకలు పెడుతూ పరుగెత్తుకు వెళ్ళి, చొక్కా పట్టి గిలగిలా కొట్టుకుంటున్న పిల్లదగ్గరికి అతన్ని లాక్కోవచ్చాను. ఆ దుఃస్థితిలో ఉన్న పిల్ల దగ్గరకి జనం చేరి చుట్టూ మూగారు. అంత జనం గుంపులు చేరినా అతడు తొణకలేదు అతిప్రశాంతంగా ఉన్నాడు. నన్ను ఎదిరించటానికైనా అతడు యత్నించలేదు. అయితే నన్నొక ఏహ్యాపుచూపు చూచాడు. దానితో నా ఒళ్లు ముచ్చెమటలు పోసింది. పిల్ల చుట్టూ గుంపులు చేరినవాళ్ళు, ఆ బాలిక బంధువులో వాళ్లూ పిల్లను డాక్టరు దగ్గిరికి పంపించారట! ఆ డాక్టరు కూడా అప్పుడు అక్కడికి వచ్చాడు. పిల్ల బాగా బెదిరిపోయిందనీ, పిల్లకు గట్టిదెబ్బ ఏమీ తగలలేదనీ ఆ అమ్మాయి బంధువులు 'సాబోన్లు' చెప్పారు.

"మీరు ఇంతటితో ఈ కథ పూర్తయిందని అనుకోవద్దు. మరో విచిత్రవిషయం కూడా జరిగింది. మొదట చూచినప్పుడు ఆ వ్యక్తిమీద రోత పుట్టింది అతన్ని చూచి ఆ పిల్ల బంధువులు కూడా అలాగే అసహ్యించుకున్నారు. ఇది సహజమేగా! అక్కడికి వచ్చిన డాక్టరు లక్షణం నాకు అతివిచిత్రంగా తోచింది. అతడు సామాన్యంగా పెళుసుగా ముక్తసరిసంభాషణ చేసే వైద్యుడు. అతని కంఠస్వరంలో ఎడింబరో మాండలికోచ్చారణ గాఢంగా కనిపిస్తున్నది. ఆవేశం వచ్చినప్పుడు అతడు సంగీతపుతిత్తిలా ఉబ్బిపోయి కన్పించాడు. అతడు కూడా మావలెనే అక్కడ ఉండిపోయాడు. నాకు బందీగా చిక్కిపోయిన వ్యక్తివైపు అతడు చూచినప్పుడల్లా 'సాబోన్లు' అతన్ని హత్య చేద్దామన్నంతగా తబ్బిబ్బుకావటం జరిగింది. అతడి మనస్సులో ఏముందీ నాకు అర్థమైపోయింది  నా మనస్సులో ఏముందీ అతడికి తెలిసింది! హత్య చేయటమన్న ప్రశ్నకు ఎటువంటి ఆస్కారమూ లేదు. కాబట్టి తరువాతి చేయదగ్గ మంచిపని ఏదో అది, – చేసిన పనికి నలుగురిలో తలెత్తి తిరగలేకుండా ఏమి చెయ్యాలో అది – చేశాం. అతడిమీద నిందమోపి లండన్ నలుమూలలా ప్రకటించేస్తామని అతడితో స్పష్టంగా చెప్పేశాము. నగరంలో అతడికి మిత్రులు గానీ, పరపతిగానీ ఉంటే ఇక వదులుకోవలసిందే అని అతన్ని బెదిరించాము. కర్రకాల్చి వాతలు పెడుతున్నట్లుగా ఈ మాటలు మేము మాట్లాడుతున్నంత సేపూ, శివాలెత్తిన పెనుభూతాలు గనుక, ఆడవాళ్లను అతడి దగ్గిరికి చేతనైనంతవరకూ రాకుండా చూచాం. కోపోద్రేకం వల్ల అలా ఎర్రవారిన ముఖాలను నేను మళ్ళీ ఎన్నడూ చూడలేదు.

జనమధ్యంలో ఉన్న ఆ ఖైదీ పెద్దమనిషి నల్లగా కొరివిలా వికటహాసం చేస్తూ ఉన్నాడు. అది నేను గమనించాను. అతడు సైతానులా ఇంకా నవ్వుతూనే ఉన్నాడు. అన్నాడు : "ప్రమాదవశాన జరిగిన దానికి మీరందరూ ఇంత చేయదలుచుకుంటే, నిస్సహాయుణ్ణి నేనేం చేయగలను?" అని. మేమడిగాము నెమ్మదిగా అతన్ని నూరుపౌనులు ఇస్తా ననేటంత వరకూ తెచ్చాము. ఎలాగైనా ఇటువంటి చిక్కుల్లో పడకుండా తప్పించుకొందామని అతడు ప్రయత్నించేవాడే. కానీ మేమందరం చాలా పట్టుదలగా ఉన్నాం. అందువల్ల ఆ ఆటలు సాగవని గమనించి చివరకు ఒప్పుకున్నాడు. ఇక కర్తవ్యం. ఈ వంద పౌనులనూ వసూలు చేయటం. అతడు మమ్మల్ని ఎక్కడికి తీసుకోపోయినాడో తెలుసా? ఈ ద్వారబంధం దగ్గిరికే తీసుకువచ్చాడు. జేబులోపలినుంచి ఒక తాళం చెవి తీసి లోపలికివెళ్ళి వెంటనే ఏబది పౌనుల విలువచేసే బంగారాన్నీ, చూపించినవారికి ఏబది పౌనులు డబ్బిచ్చేటట్లు కూట్సు బ్యాంక్‌కి వ్రాసిన ఒక చెక్కూ తెచ్చి మాకిచ్చాడు. ఆ చెక్కు మీద చేసిన సంతకం నిజమైనదైతే ఒక

సుప్రసిద్ధుడైన వ్యక్తిది. ఈ కథలో అతని పేరు చాలా ప్రధానమైందే. అయినా నేను ఇప్పుడు దాన్ని బయటపెట్టటానికి వీల్లేదు.

కొంత స్వాతంత్ర్యం తీసుకొని నేను నాకు బందీగా చిక్కిన పెద్దమనిషితో అన్నాను : "అయ్యా! చూడబోతే ఇదంతా చాలా మోసంగా ఉంది. ఉదయం నాలుగంటలప్పుడు తలుపు తెరుచుకొని గదిలో ప్రవేశించి వెంటనే మరొకవ్యక్తి పేరుతో ఏబదిపౌన్లకు చెక్కు వ్రాసి తెచ్చిఇవ్వటం సత్యమైన జీవితంలో ఒక వ్యక్తి జరిగించే పని కాదు." అతడు తొణకలేదు. వెక్కిరింపుగా ఒక్క నవ్వు నవ్వి అన్నాడు. "మీరేం భయపడవద్దు. బ్యాంకు తెరిచేదాకా నేను మీతోనే ఉంటాను. నా చెక్కును నేనే మార్చి మీకు డబ్బు తెస్తాను" ఇలా అనటంవల్ల అతని మాటలు నిజమే నని నమ్మాము. అతన్ని నిర్బంధించలేదు. మేమూ, డాక్టరు, పిల్లతండ్రి, నాకు మిత్రుడైన పూర్వపు బందీ అందరం వెళ్ళిపోయాము. మిగిలిన రాత్రంతా నేను నా గదిలోనే వెళ్ళబుచ్చాను. మర్నాడు మేమందరం ఒక జట్టుగా ఉదయభోజనం పూర్తి చేసుకొని బ్యాంకికి వెళ్ళాం. డబ్బుకోసం చెక్కును నేనే అధికారులకు ఇచ్చాను. ఇస్తూ అన్నాను : "అయ్యా! ఇది దగాకోరు చెక్కని నా అనుమానం" అని.

"అణుమాత్రం కాదు. ఈ చెక్కు నిజమైందే!"

"ఛీ, ఛీ!" అన్నాడు మిస్టర్ అట్టర్సన్.

"నాకు తోచినట్లే మీకు కూడా తోస్తున్నట్లున్నది" అందుకొని ఎన్ఫీల్డ్ మళ్ళీ, "ఇదంతా చాలా చెడ్డకథ. ఎందువల్లనంటారా, నేను వ్యవహరించిన వ్యక్తికి ఎవరితోనూ సంబంధం లేదు. వాడు వట్టి వ్యర్థుడు. అయితే ఇతనికి చెక్కు వ్రాసి ఇచ్చిన వ్యక్తి మరో పెద్దమనిషి, సంపన్నుడూ, ప్రఖ్యాతిగల వాడులా కనిపిస్తున్నాడు. అంతేకాదు జనం ఎవరినైతే మహోదారు డని చెప్పుకుంటారో అటువంటి మీ ఫాయాలో వ్యక్తివలె తోస్తున్నది. ఇదంతా చూస్తుంటే తాను చేసిన తప్పిదాలను చెల్లించవలసిన సమయం వస్తే, ఇతడు వెళ్ళి ఏదో పరువుతీస్తానని బెదిరించినప్పుడు మర్యాదస్థుడొకడు డబ్బు ఇచ్చినట్లు గోచరిస్తున్నది. అందువల్ల ఈ ప్రాంతాన్ని 'అపనిందావ్యాపారసదనం' అని నేను వ్యవహరిస్తుంటాను. ఇంతటితో ఈ సౌధానికి సంబంధించిన సర్వం మీకు నేను వివరించానని అనుకోవద్దు" అని అన్నాడు ఎన్ఫీల్డ్ ఏదో ఆలోచనలో పడ్డాడు.

"అయితే ఆ చెక్కు వ్రాసి ఇచ్చిన ఆ సంపన్నుడు ఆ ఇంట్లో ఉన్నాడో, లేదో నీకు తెలుసునా?" అన్న ప్రశ్న ఎన్ఫీల్డ్‌ను ఆలోచనలోనుంచి బయటపడేసింది.

“ఇది నేనన్న ప్రదేశమే. ఔనంటారా? కాదంటారా?” అని అడిగాడు ఎన్ఫీల్డ్. “చెక్కుమీద సంతకం చేసిన సంపన్నుని నేను గుర్తు పట్టినట్లే ఉన్నాను. అతడు ఏదో చౌతరాదగ్గర ఉంటున్నాడు.”

“అయితే గుమ్మం ఉన్న ప్రదేశాన్ని గురించి నీవేమీ ప్రశ్నించలేదా?” అని అడిగాడు మిస్టర్ అట్టర్సన్.

“లేదండీ, అదే అమర్యాదగా అప్పుడు నాకు తోచింది” అని సమాధానంగా చెప్పాడు ఎన్ఫీల్డ్. అతడి మీద ఏదో అభియోగం ఉన్నట్లు నిలువబెట్టి ప్రశ్నించటం కూడని జోక్యం కల్పించుకోటం అని భావించాను. ఒక ప్రశ్న వేస్తే ఒక శిఖరం మీది రాయిని కదిలించటం వంటిదని నాకు తోచింది. కొండమీది గండశిలను ఒకదాన్ని కదిలించి వదిలితే, అది దానంతట అదే మిగిలిన రాళ్ళన్నిటినీ పడవేస్తుంది. తుదకు అది మనం ఎప్పుడూ ఊహించని ప్రక్కతోటలో నివాసం చేసే ముసలివాడి తలమీద కూడా పడుతుంటుంది  అంతటితో ఆ కుటుంబంవాళ్లు ఇంటిపేరు కూడా తప్పక మార్చుకోవలసి వస్తుంటుంది. అందువల్లనే నేను ఏదైనా వీథి వింతగా కనిపిస్తే, దానికి సంబంధించిన వివరాలను అడగ్గూడదని ఒక నియమం పెట్టుకొన్నాను.

“ఈ నియమం చాలా ఉత్తమమైంది కూడాను” అన్నాడు న్యాయవాది.

“అయితే నేను ఆ ప్రదేశాన్ని జాగ్రత్తగా పరిశీలించాను” అంటూ ఎన్ఫీల్డ్ తన సంభాషణను ఇలా పొడిగించాడు. “ఈ భాగం నివాసగృహంగా ఎప్పుడూ ఉన్నట్లు కనుపించలేదు. దీనికి రెండో ద్వారమంటూ లేదు. ఈ కనపడే ద్వారంగుండానైనా ఎవరూ రాకపోకలు జరుపుతున్నట్లు కనిపించదు. నేను చెప్పిన కథలోని సాహసికుడు ఏదో ఒకనాడు ఇందులోనుంచి లోపలికి వెళ్ళి వస్తుంటాడు. ఈ భవనం మొదటి అంతస్తుకు సందువైపున మూడు కిటికీలున్నాయి. అవి ఎప్పుడు చూచినా మూసే ఉంటాయి. అయితే అవి మటుకు అతిపరిశుభ్రంగా ఉంటాయి. ఈ సౌధానికి ఒక పొగ వెళ్ళే గూడు ఉంది. అందువల్ల ఆ భాగాన ఎవరో నివసిస్తూనే ఉండి ఉండాలి. అయితే ఆ మాట నిశ్చయంగా చెప్పలేము. ఎందువల్లనంటే ఈ చత్వరంలో ఇళ్లన్నీ ఒక దానిమీద ఒకటి క్రిక్కిరిసి ఉన్నాయి  అందువల్ల ఏ ఇల్లు ఎక్కడ మొదలవుతుందో, ఏది ఎక్కడ అంతం అవుతుందో చెప్పటం కష్టం.”

ఆ మిత్రద్వయం మౌనంగా కొంతదూరం నడిచారు. అప్పుడు మిస్టర్ అట్టర్సన్ అన్నాడు: “ఎన్ఫీల్డ్! నీవు పెట్టుకున్నావన్నది చెప్పింది చాలా మంచి నియమం” అని.

"నేనూ అలాగే భావిస్తున్నాను" అన్నాడు ఎన్ఫీల్డ్.

"ఇదంతా బాగానే ఉంది. కానీ నిన్ను ఒక్కటే విషయం అడగదలిచాను. అలా ఆ పిల్ల మీద నడిచిపోయిన వ్యక్తి పేరేమిటి?" అని న్యాయవాది ప్రశ్నించాడు.

"నేను మీకీ పేరు చెప్పటంవల్ల ఏమైనా ప్రమాదం కలుగుతుందేమో నాకు తెలియదు. కానీ అతన్ని మిస్టర్ హైడ్ అంటారు"

"అలాగా! అతడు చూడటానికి ఎలా ఉన్నాడు?" అని ప్రశ్నించాడు అట్టర్సన్.

"అతన్ని వర్ణించటం చాలా కష్టం. అతని రూపంలోనే ఏదో వికారం ఉంది. చూడంగానే ఏదో అరోచకం, అసహ్యం గోచరిస్తుంది. నేను అంత అధికంగా అసహ్యించుకున్న వ్యక్తిని మరొకణ్ణి ఎన్నడూ చూడలేదు. అయితే నేను అతన్ని ఫలాన ఈ కారణంవల్ల అసహ్యించుకున్నానని కూడా స్పష్టంగా చెప్పలేను. అది నాకే తెలియదు. 'అతడిడి చాలా వికృతమైన రూపం' అన్న భావం చూడంగానే కలిగి తీరుతుంది. మొత్తం మీద అతని మూర్తిలో ఎక్కడో వైకల్యం ఉంది. అతన్ని నేను వర్ణించలేను. ఇది అతడి రూపం నాకు జ్ఞప్తికి లేకపోవటం వల్ల కాదు. అంతవరకెందుకు? విస్పష్టరేఖలతో అతని మూర్తిని ఏ క్షణానైనా నేనే నా కంటిముందు నిలుపుకోగలను."

తిరిగి మిస్టర్ అట్టర్సన్ మౌనంగా కొంతదూరం నడిచాడు. ఏదో ఆలోచనలో పడ్డట్లున్నాడు. చివరకు ప్రశ్నించాడు : "అతడు ఒక తాళపు చెవిని ఉపయోగించాడన్నమాట సత్యమేనా?"

"ఏమి ప్రశ్న వేశారండీ?" అంటూ ఎన్ఫీల్డ్ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

అతని సంభాషణను అందుకొని అట్టర్సన్ అన్నాడు : "అవును. నాకు అర్థమైంది. ఇదంతా చిత్రంగా, వింతగా కనిపిస్తున్నది. నాకు తెలుసు. ఆ అవతలిసంపన్నుని నామధేయం ఏమని నిన్ను నేనడగలేదు. గమనించావా? ఎందువల్లనంటే అది నాకు తెలుసును గనక. రిచ్చర్డ్! నీ కథ నాకు సమూలంగా అర్థమైపోయింది. నీకేమన్నా అనుమానాలు ఉంటే అడిగి తీర్చుకోవచ్చు."

"ఎందుకైనా మంచిదని మీరు నన్ను ఇలా హెచ్చరిస్తున్నారనుకుంటాను. మీరు అంటుంటారే అతిచాదస్తంగా అని... అలాగే కథనంతటినీ అణుమాత్రం బీరుపోకుండా మీకు వివరించాను. అతడిదగ్గర తాళం చెవి అప్పుడు ఉంది అప్పుడే కాదు ఇప్పుడు

కూడా ఉంది. వారం రోజులనాడు దాన్ని తిరిగీ అతడు ఉపయోగిస్తుండగా మళ్ళీ నేను చూచాను" అని మందకొడిగా సమాధానం చెప్పాడు ఎన్ఫీల్డ్.

మిస్టర్ అట్టర్సన్ దీర్ఘంగా నిశ్వసించాడు  కానీ ఏమీ మాట్లాడలేదు. యువకుడు ఎన్ఫీల్డ్ మళ్ళీ అందుకున్నాడు. అన్నాడు : "ఈ సందర్భంలో నేను తిరిగి ఒక గుణపాఠం నేర్చుకోవలసి ఉంది. అది ఏమీ చెప్పకుండా ఉండటం. ఇందాకటినుంచీ నేను చూపిన వాచాలతను తలుచుకుంటుంటే నాకే సిగ్గు వేస్తున్నది. మనం ఒక ఒప్పందానికి వద్దాం. ఈ విషయం మనం ఎన్నడూ తిరిగి ప్రస్తావన చెయ్యవద్దు"

"హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను. రిచ్చర్డ్! ఇదిగో, నేను ఒడబడ్డట్లు అంగీకారసూచకంగా నా హస్తాన్ని అందిస్తున్నాను" అన్నాడు న్యాయవాది అట్టర్సన్.

# 2. హైడ్ కోసం అన్వేషణ

ఆ నాడు సాయంకాలం అట్టర్సన్ తన ఇంటికి వచ్చాడు. అతనిది బ్రహ్మచారి గృహం. భోజనానికి కూర్చున్నాడు  కానీ ఆలోచనానిమగ్నుడు కావటం వల్ల అది రుచించలేదు. ఆదివారంనాడు రాత్రి భోజనానంతరం అగ్ని ఉన్న అధిశ్రయణి ప్రక్కనే చదువుకుండే బల్లముందు కూర్చొని, భగవత్సంబంధమైన ఒక గ్రంథాన్ని తీసుకొని చేరువలో ఉన్న చర్చిగంట పన్నెండు కొట్టేటంతవరకూ చదువుతూ ఉండటం అతనికి అలవాటు. ఆ తరువాత అతడు ప్రశాంతితో, భగవంతుని యెడ కృతజ్ఞతాభావాన్ని ప్రకటిస్తూ శయ్యమీదకు చేరుతాడు. కానీ ఈ నాటి రాత్రి భోజనంచేసి బల్లమీద పరిచిన గుడ్డను తీసివేసిన తరువాత కొవ్వొత్తి పుచ్చుకొని తన కార్యాలయకక్ష్యలోకి వెళ్లాడు. ఇనుపపెట్టె తెరిచాడు. అందులో ఒక విశిష్టప్రదేశం నుంచి 'డాక్టర్ జెకిల్ విల్ నామా' అని వ్రాసిఉన్న ఒక కవరులోనుంచి ఆ పత్రాన్ని బయటికి తీశాడు. అతి తీక్ష్ణదృష్టితో అందులో ఉన్న విషయాలను చదవటం ప్రారంభించాడు. అది స్వదస్తూరీతో వ్రాసిన ఇచ్ఛాపత్రం. దాన్ని తయారుచేయటంలో వ్రాసిన వ్యక్తికి తాను అణుమాత్రమైనా సాయపడలేదు. అయినా దాన్ని భద్రపరిచేభారం తనమీదనే వేసుకొన్నాడు. ఆ పత్రంలో 'హెన్రీ జెకిల్ యం.డి., డి. సియల్., యల్‌యల్.డి., యల్.ఆర్.ఎస్. మరణించిన పక్షంలో అతని స్థిరచరాస్తులూ, ఇతర హక్కులూ, సర్వం అతనికి మిత్రుడూ సంక్షేమాభిలాషి అయిన ఎడ్వర్డు హైడ్‌కు చెందాలి' అని ఉంది. అంతేకాదు 'ఒకవేళ డాక్టరు జెకిల్ మూడు నెలలకు మించిన కాలం అదృశ్యుడైనా,  ఊహించరాని కారణాలవల్ల కనుపించకపోయినా, పైన పేర్కొనబడ్డ హైడ్ ఎట్టి ఆలస్యం లేకుండా అతని స్థానాన్ని వహించి ఆస్తికి ఉత్తరాధికారి కావలె' నని వ్రాసి ఉంది. డాక్టరు ఇంట్లో సభ్యులైనవారికి ఇవ్వవలసిన చిన్నమొత్తాలకు తప్ప అతనికి ఎటువంటి బాధ్యతలూ లేవని కూడా ఉంది.

ఈ పత్రం న్యాయవాది అట్టర్సన్‌కు కంటపడ్డప్పుడల్లా ఏదో నేత్రవ్యాధిగా బాధపెడుతూ ఉంది. లోలోన వ్యవహార దృష్ట్యా పరిశీలిస్తే ఇది ఒక ఉన్మత్తుడు వ్రాసిన పత్రంలా కనిపిస్తున్నది. ఇది ఎంతో 'మర్యాదారహితమైన పత్రం' అని అతడు భావిస్తూ ఉండేవాడు. హైడ్ అంటే ఎవరో తెలియకపోవటం వల్ల అతడిమీద అతనికి కోపం

ఊరికే పొంగి పొర్లి వస్తుండేది. హైడ్ అంటే ఎవరో ఇప్పుడు అతనికి హఠాత్తుగా తెలిసింది. ఇంతకుపూర్వం అతని పేరు తప్ప ఇతర విశేషాలేమీ తెలియవు. అప్పుడే అతనికి కోపం పొర్లి వస్తూ ఉండేటప్పుడు ఇప్పుడు అతడు నీచలక్షణాలు కలవాడని విన్న తరువాత ఇక చెప్ప వలసిందేముంది? ఇంతకుపూర్వం అతన్ని గురించిన భావాలు ఏవేవో మూడమంచులా మనస్సును ఆవరిస్తూ ఉండేది. అతని అవ్యక్త స్వరూపం కంటిని కలవరపెట్టుతూ ఉండేది. ఇప్పుడు ఎన్ఫీల్డ్ చెప్పిన కథ విన్న తరువాత, అతడు తన కంటి ముందు రాక్షసరూపంతో ప్రత్యక్షమైనట్లుంది.

"ఇది కేవలం ఒక ఉన్మాదకృత్యం అనుకున్నాను కానీ అత్యవమానకరమైన వ్యవహారమని ఇప్పుడు తోస్తున్నది" అనుకున్నాడు, ప్రమాదకరమైన ఆ పత్రాన్ని తిరిగి ఇనుపపెట్టెలో పెడుతూ.

తనలో తాను ఇలా అనుకొన్న తరువాత కొవ్వొత్తిని ఆర్పేసి, పొడుగు పాటికోటు వేసుకొని కావెండిష్ స్క్వేర్ వైపు బయలుదేరాడు. అక్కడ ఒక పెద్ద వైద్యశాల ఉంది. అది అతని మిత్రుడు డాక్టర్ లాన్యన్ ఇల్లు. అక్కడనే ఆ వైద్యుడు గుంపులు గుంపులుగా వచ్చే రోగులకు వైద్యసేవ చేస్తుంటాడు. "ఈ విషయం ఇంకా ఎవరికైనా తెలిసి ఉంటే అది ఒక్క లాన్యనుకు మాత్రమే ఐఉంటుంది" అనుకుంటూ అట్టర్సన్ నడుస్తున్నాడు.

లాన్యన్ ఇంటిదగ్గిరికి రాగానే, అట్టర్సన్‌ను బట్లరు గుర్తు పట్టాడు. లోపలికి ఆహ్వానించాడు. అనవసరమైన కాలహరణం చేయకుండా అతడు వచ్చిన వ్యక్తిని డాక్టరు భోజనశాలలోకి సూటిగా తీసుకోపోయినాడు. ఏకాంతంగా అక్కడ డాక్టరు ఆసవాన్ని సేవిస్తూ ఉన్నాడు. డాక్టర్ లాన్యన్ సహృదయుడు, ఆరోగ్యవంతుడు, చురుకైనవాడు, ఎర్రనిముఖం, తలవెంట్రుకలు మాత్రం ముందుగానే నెరిసినట్లు కనిపిస్తుంటవి. మంచి సరదాగల మనిషి. అతని రీతిలో ఒక విస్పష్టతా, విశిష్టతా గోచరిస్తాయి. అట్టర్సన్‌ను చూడగానే అతడు కుర్చీలోనుంచి అమాంతంగా లేచి, రెండుచేతులూ చాచి మహాదరంతో ఆహ్వానించాడు. ఆ డాక్టరు ప్రకటించే ఆదరణను చూసేవాళ్ళకు అది నాటకశాలల్లో కన్పించే నటనవలె గోచరిస్తుంది. కానీ అది నటనకాదు హృదయంలోనుంచి ఉట్టిపడేది. వీళ్ళిద్దరూ చిరకాలస్నేహితులు పాఠశాలలోనూ, కళాశాలలోనూ సహాధ్యాయులు. ఒకరిమీద ఒకరికి గౌరవం విశేషం. ఇందుకుతోడు ఇరువురూ అధికంగా ఆత్మగౌరవం కలవాళ్లు కూడాను. ఒకరినొకరు కలుసుకొన్నప్పుడు ఇద్దరూ పరిపూర్ణానందాన్ని అనుభవించేవాళ్ళు.

పిచ్చాపాటి కొంత సాగింది. తరువాత న్యాయవాది తన మనస్సును అమితంగా కలవరపెడుతూ ఉన్న విషయాన్ని సంభాషణలోకి తీసుకోవచ్చాడు.

"లాన్యన్! హెన్రీ జెకిల్‌కు ఉన్న చిరకాలవృద్ధమిత్రులం మన మిద్దరమే అయి ఉండాలి అని అనుకుంటున్నాను. మీరేమంటారు?" అని అతన్ని అడిగాడు.

"ఆ మిత్రులు యువకులైతే బాగుంటుందని నా కోరిక" అని లాన్యస్ అదో రీతిగా నవ్వాడు. "అవును. అతని వృద్ధమిత్రులం మన మిద్దరమే అయితే ఇప్పుడు ఏమి వచ్చింది? అతడు వెనకటిలా కన్పించటం లేదే!" అన్నాడు లాన్యన్.

"నిజంగానా? మీ ఇద్దరికీ నిత్యసాంగత్యం ఉంటున్నదనుకొంటున్నానే!" అన్నాడు అట్టర్సన్.

"అది నిజమే. ఒకప్పుడు మా ఇద్దరికీ అటువంటి అనుబంధమే ఉంటూ ఉండేది. అయితే హెన్రీ జెకిల్ నాతో ఖుషీగా మాట్లాడి పదేండ్లకు పైబడ్డది. అతడి మనస్సు చెడుత్రోవలు పట్టటం మొదలుపెట్టిన తరువాత కూడా కొంతకాలం, నేను అతడంటే ఎంతో ఉత్సాహాన్ని చూపుతూనే వచ్చాను. అతని రాక్షసత్వాన్ని క్రమంగా గమనించాను" అంటూ సంభాషిస్తున్నప్పుడు హఠాత్తుగా ఆ వైద్యుడి ముఖం ఎర్రవారింది. అన్నాడు : "అటువంటి అశాస్త్రీయ లక్షణాలమీద బుద్ధి నడుస్తుంటే డామన్ పిథియస్‌ల వంటి మిత్రులు కూడా శత్రువులు కాకతప్పదు!"

అతడిలో ఇటువంటి ఉద్రేకం కలగటం వల్ల అట్టర్సన్‌కు తన శ్రమలో కొంత తీరినట్లు తోచింది. వైద్యశాస్త్ర విషయకంగా వారిద్దరికీ అభిప్రాయభేదా లేవైనా కలిగాయేమో అనుకున్నాడు. కానీ ఆస్తిపరివర్తనకు సంబంధించిన విషయంలో తప్ప మరే ఇతర శాస్త్రీయాంశాల్లోనూ తనకు ఆసక్తి లేకపోవటం వల్ల, అతడు "ఇంతకంటే అప్రశస్తం ఇంకేముంటుంది?" అన్నాడు. ఈ మాట వినగానే డాక్టరు విస్తుబోయాడు. స్వస్థితికి రావటానికి రెండు సెకన్ల కాలమిచ్చి అట్టర్సన్ తిరిగి తన ప్రసంగం సాగించాడు. అన్నాడు :"అతడి రక్షణలో ఉన్న హైడ్ అనే వ్యక్తిని మీరు ఎప్పుడైనా కలుసుకున్నారా?"

"నేను జీవించిన ఇంతకాలంలోనూ అతన్ని గురించి వినను కూడా లేదు."

న్యాయవాదికి ఇంతమాత్రం విషయం దొరికింది. దానితో అతడు తిరిగీ తన ఇంటికి వెళ్ళి, ఉదయమయ్యేటంతవరకూ తన ప్రక్కమీదనే అటూ ఇటూ పొర్లాడు. అసలే అతనిది విశేషశ్రమవల్ల ఎప్పుడూ అలిసిపోయి ఉండే మనస్సు. క్రితం రాత్రంతా

అతనికి ఏదో అంధకారంగా ఉంది. ఏవేవో ప్రశ్నలు. ప్రశాంతి అణుమాత్రం లేకుండా గడిచిపోయింది.

అట్టర్సన్ ఇంటికి చాలా దగ్గరగా ఉన్న చర్చిలోంచి గంటలు ఆరు వినిపించాయి. ఆ సమస్యను ఇంకా అతడు త్రవ్వి తిరగవేస్తూనే ఉన్నాడు. అతడు ఇంతరవకూ ఆ సమస్యను వ్యవహారదృష్టితోనే పరిశీలించాడు. ఇప్పుడు అది అతని ఊహాశక్తి నంతటినీ ఆకర్షించి బానిసగా చేసుకొన్నది. తెరవేసిన అతని గదిలో ఆ సమస్య ఆడుతున్న చిత్రంలాగా కళ్ళముందు కనిపించటం ప్రారంభించింది. ఎన్ఫీల్డ్ చెప్పిన కథంతా దృశ్యం తరువాత దృశ్యంగా అతని నేత్రాలముందు నడిచింది. ఆ నిశీథినగరంలో దీపాలవరస, అతివేగంగా నడిచివస్తున్న వ్యక్తి మూర్తి, డాక్టరు ఇంటిముందుగా పరుగెత్తుకుంటూ పోతూ ఉన్న బాలిక, వాళ్ళిద్దరూ తారసిల్లటం, పిల్ల పడిపోవటం, ఆ పిల్లమీదుగా ఆ వ్యక్తి పిసరు వెళ్ళేటట్లు జగన్నాథరథంలా నడవటం, ఆ పిల్ల మూల్గులనైనా వినిపించుకోకుండా వెళ్ళిపోతూ ఉండడం – అన్నీ క్రమరీతిని కనిపించాయి. ఇది కాకపోతే ఒక దొడ్డ సౌధంలో తన మిత్రుడు కలలు కంటూ ఉండటం, లేదా కలల్లో కలకల నవ్వుతూ ఉండటం, ఇంతలో ఒక వ్యక్తి అతని శయ్యాకక్ష్యలో తలుపులు తెరుచుకొని ప్రవేశించి ఎట్ట ఎదుట నిలువబడటం, అటువంటి అర్ధరాత్రి సమయంలో తన మిత్రుడు వచ్చిన వ్యక్తి ఆజ్ఞలను అతివిధేయతతో పాటించటం – అన్నీ కళ్ళముందు వరుసగా ఆడుతున్నట్లు కన్పించాయి.

ఈ రెండు సంఘటనల్లోని వ్యక్తులూ రాత్రంతా న్యాయవాదిని వెన్నాడుతూనే ఉన్నారు. ఒకవేళ ఏ క్షణకాలమో మధ్యలో కునికిపాట్లు పడ్డా ఆ నిద్రమత్తులో కూడా నిద్రాముద్రితాలైన ఆ సౌధవ్యూహ పరంపరలలో ఆ వ్యక్తి అణువేగంగా మసలుతూ కన్పించాడు. ఆ మహానగర వీథుల్లో ఏ సంఘటన తోచినా బాలికను భయంకరంగా కాళ్ళతో త్రొక్కుతూ మూల్గులను కూడా వినిపించుకోకుండా వెళ్ళిపోతున్న ఆ వ్యక్తే కన్పించాడు. అతడు ఎవరో గుర్తిద్దామంటే అతనికి ముఖం లేదో! స్వప్నావస్థలో కూడా అతడికి ముఖం ఉండి కన్పించదో!! క్షణకాలం కన్పించి కళ్ళముందు కరిగిపోతుందో!! ఇటువంటి స్థితిలోనే హైడ్ సత్యస్వరూపం ఎటువంటిదో చూచి తీరాలెనని అట్టర్సన్‌కు ఒక విశిష్టమైన కోరిక జన్మించి, క్రమంగా గాఢం కాజొచ్చింది. సమస్తమైన విచిత్రవిషయాలూ పరిశీలించిన తరువాత అర్థం కావటం సహజం. కనుక తాను ఒక్క మారు కళ్ళతో అతన్ని చూస్తే ఈ విచిత్రకథంతా బోధపడుతుందని ఊహించాడు తన మిత్రుడికి అతడిమీద అంతటి గాఢాభిమానం ఎందుకో, అతడికి

(మీరేమన్నా అనండి) విచిత్రమైన బానిస ఎందుకైనాడో, తన ఇచ్ఛాపత్రంలో ఉన్న విపరీతనిబంధనలు ఎందుకు వ్రాయవలసి వచ్చిందో అతన్ని ఒక్కమాటు చూస్తే అర్థమైపోతుందని అతడు నిశ్చయించాడు. దాక్షిణ్యకోశమంటూ లేని ఆ వ్యక్తి ముఖం అందుకోసమైనా చూడదగ్గంత విలువ గలది. అంతేకాదు త్వరగా చలించని ఎన్ఫీల్డ్ మనస్సులో తిరుగులేని ఏహ్యభావాన్ని కలిగించగలిగి నందుకైనా అతని ముఖం చూడదగ్గది.

చూడాలెనని కోరిక కలిగినప్పటినుంచీ అతడు ఆ ఉపవీథిలో ఉన్న గృహద్వారం దగ్గిరికి తరచుగా వెళ్ళి వస్తుండేవాడు. ఉదయం తన కార్యాలయానికి వెళ్ళే సమయానికి పూర్వం, మధ్యాహ్నం వ్యవహారాలభారం విశేషంగా ఉండి కాలం స్వల్పంగా ఉన్నప్పుడూ, రాత్రి పొగమంచు కప్పిన నగరచంద్రుని వెన్నెల వెలుగుల్లో, దీపాలు వెలుగుతూ సమ్మర్దం ఉన్నప్పుడూ, నిశ్శబ్దంగా ఉన్నప్పుడు – ఏకాంతస్థితి చిక్కినా, ఊపిరి సలుపుకోలేని పనులున్నా – తాను మనఃపూర్వకంగా ఎన్నుకున్న ఈ పనిమీద ఆ ప్రదేశానికి వెళ్ళివస్తున్నాడు.

"అతడు మిస్టర్ హైడ్ అయితే నేను మిస్టర్ సీక్‌నౌతాను! అన్వేషించి తీరుతాను" అని నిర్ణయించుకున్నాడు.

చివరకు అతని శ్రమ ఫలించింది. అది ఒకనాటి రాత్రి దట్టంగా మంచు పట్టి ఉంది. వీథులన్నీ బ్యాలెట్ నిత్యమందిరంలోని నేలల్లా పరిశుభ్రంగా ఉన్నాయి. గాలి తూలుతూ ఒక పథకం వేసుకొని వెలుగునీడలను సృజిస్తున్నట్లుగా దీపాలు నిశ్చలంగా వెలుగుతున్నాయి. షాపులన్నీ మూసిన తరువాత పది గంటల ప్రాంతంలో ఆ ఉపవీథి నిర్జనంగా ఉంది. లండన్ నగరఘోష నీరసించి సన్నని మూల్గులు వినిపిస్తున్నది. అది అతినిశ్శబ్దంగా ఉంది. ఎంత చిన్న శబ్దమైనా బహుదూరం వినిపిస్తున్నది. గృహకృత్య నిర్వహణలో కలిగే ధ్వనులు వీథికి రెండువైపులా ఉన్న ఇళ్ళల్లో నుంచి వినిపిస్తున్నవి. ఎవరైనా ఆ వీథిని వస్తుంటే ఆ వ్యక్తి దర్శనానికి ఎంతో ముందుగానే కాలిచప్పుళ్ళు వినిపిస్తాయి. తన పని మీద అట్టర్సన్ ఆ ప్రాంతానికి వచ్చిన తరువాత కొన్ని నిమిషాల కాలం గడిచింది. ఇంలో అతడికి, వింతగా తేలిగ్గా వస్తున్న కాలిచప్పుళ్ళు విన్పిస్తూ ఉన్నవి. బహుకాలం నుంచీ మాటు వేసుకొని రాత్రులు గస్తీ తిరుగుతున్న అతడికి, ఒంటరిగా వచ్చే మనిషి కాలిచప్పుడు, అతడు ఎంత దూరాన ఉన్నా, నగరఘోషలోనుంచి విడివడి అమాంతంగా విస్పష్టంగా వినిపించటం మిక్కిలి అలవాటైపోయింది. కానీ ఇప్పుడు వినిపిస్తున్న కాలిచప్పుడు అతన్ని అతిదారుణంగా

ఆకర్షించి అరికట్టేస్తున్నది. ఎందుకో అతనికి ఈ నాడు ఇన్నాళ్ళనుంచీ తాను చేస్తున్న కృషి ఫలిస్తుందన్న గాఢవిశ్వాసం కలిగింది. వెంటనే అతడు మెల్లగా ఆ ఇంటిపెరటిలోకి నడిచివెళ్ళాడు.

ఆ అడుగులు వేగంగా దగ్గిరికి వస్తున్నాయి. వీథిమలుపు తిరిగేటప్పటికి వాటి చప్పుడు హఠాత్తుగా హెచ్చింది. ఇంతకు పూర్వమే ఆ వచ్చే వ్యక్తిని న్యాయవాది అట్టర్సన్ ద్వారతోరణం దగ్గర నిలిచి చూడటం వల్ల, తాను భవిష్యత్తులో ఎటువంటి వ్యక్తితో వ్యవహరించవలసి ఉందో అతన్ని బాగా గమనించగలిగాడు. అతడు మిక్కిలి పొట్టివాడు. సాదా దుస్తులు ధరించాడు. అతడి చూపు అంతదూరాన ఉన్నప్పుడే చూచేవాళ్ళ ఆసక్తిని చంపేస్తున్నది. వచ్చే వ్యక్తి కాలహరణం కాకుండా ఉండటానికి వీథికి అడ్డంపడి ద్వారబంధం దగ్గిరికి సూటిగా వచ్చాడు. తన ఇంటికి వచ్చిన యజమానిలా జేబులోనుంచి తాళం చెవిని బయటికి తీశాడు.

అట్టర్సన్ రెండు అడుగులు ముందుకువేసి లోపలికి ప్రవేశించబోతున్న ఆ వ్యక్తి భుజం తట్టి "మీరు మిస్టరు హైడ్ అనుకుంటాను?" అన్నాడు.

హైడ్ కొంచెంగా వెనక్కు తగ్గి ఒకమాటు దీర్ఘంగా నిశ్వసించాడు. అయితే అతడికి కలిగిన భయం క్షణకాలం కంటే నిలువలేదు. ప్రశాంతంగా, న్యాయవాదిని ముఖంలోకి చూడకుండానే, "అవును. అది నా పేరే. మీకేం కావాలి?" అని ప్రశ్నించాడు.

"మీరు లోపలికి వెళ్ళుతున్నారనుకుంటాను" అని "నేను డాక్టర్ జెకిల్‌కు చిరకాలమిత్రుణ్ణి. గాంట్ వీథిలో నివసించే అట్టర్సన్‌ను నేనే. మీరు బహుశః నా పేరు వినే ఉంటారు. ఇప్పుడు మనం చాలా తీరికగా కలుసుకున్నాం. కనుక లోపలికి రావటానికి అనుజ్ఞ ఇస్తారా?"

"డాక్టర్ జెకిల్ మీకు కన్పించడు. అతడు ఇంట్లోనుంచి వెళ్లాడు" అని తాళం చెవి ఊదుతూ సమాధానం చెప్పాడు. అంతటితో ఊరుకోలేదు. "నేను మీకెట్లా తెలుసు?" అని చివాలున ఇంకా తల ఎత్తకుండానే ప్రశ్నించాడు.

అప్పుడు అట్టర్సన్ ఇలా అన్నాడు : "మీరు ఇప్పుడు నాకొక సాయం చేయగలరా?"

"మహానందం. ఏమిటది?" అన్నాడు హైడ్.

“మీ ముఖాన్ని నన్ను ఒకమాటు పరిశీలించనివ్వండి” అని న్యాయవాది అట్టర్సన్ అర్థించాడు.

హైడ్ మొదట ఏదో సంకోచిస్తున్నట్లు కన్పించాడు. తరువాత అతడు హఠాత్తుగా తోచిన భావంవల్లనో అన్నట్లు, తన తిరస్కారాన్ని ప్రకటిస్తున్నట్లుగా అట్టర్సన్ ఎదుట ముఖా ముఖిగా నిలుచున్నాడు. కొన్ని మాత్రల కాలం ఆ వ్యక్తులిద్దరూ ఒకరినొకరు కళ్ళు నిలిపి పరికించి చూచుకొన్నారు. అట్టర్సన్ అన్నాడు : “ఇక నేను మిమ్మల్ని గుర్తుపట్టగలను. మీతో పరిచయం నాకు ఎందుకైనా మంచిది.”

“అవును. మనం ఇప్పుడు కలుసుకోటం వల్ల మంచిపని జరిగింది. నా విలాసం కూడా మీ దగ్గర ఉంటే మంచిది” అని హైడ్ సోహోప్రాంతంలో ఉన్న ఒక ఇంటిసంఖ్య చెప్పాడు.

“ఓరి వీడి తస్సదియ్యా! ఇచ్ఛాపత్రం సంగతి వీడి మనస్సులో కూడా ఉంది కాబోలు!” అని అనుకున్నాడు. కానీ తన మనోభావాలను వెలికి రానీయకుండా గుప్తం చేసుకొని విలాసాన్ని ఇచ్చినందుకు కృతజ్ఞతా సూచకంగా ఏదో కొంత గొణిగాడు.

“అయితే, మీరు నన్ను ఎలా తెలుసుకున్నారు?” అని అవతల వ్యక్తి ప్రశ్నించాడు.

“మిమ్మల్ని గురించి విన్న వర్ణనలవల్ల” అని సమాధానం చెప్పాడు అట్టర్సన్.

“ఎవరు చేసిన వర్ణనల వల్ల?”

“మన ఉభయులకూ మిత్రులైన వాళ్ళు ఉన్నారు” అన్నాడు మిస్టర్ అట్టర్సన్.

“ఉభయులకూ మిత్రులా? వాళ్ళెవరు?” అని కొంత బొంగురుగా తిరిగి అతడు ప్రశ్నించాడు.

“ఉదాహరణానికి జెకిల్” అని సమాధానం చెప్పాడు న్యాయవాది.

కోపోల్బణంతో “అతడు మీకెప్పుడూ నన్ను వర్ణించి చెప్పి ఉండడు!” అని, “మీరు అబద్ధమాడుతున్నారని కూడా నేను అనలేను” అన్నాడు అతడు.

“అయ్యా! తగ్గండి. మీ భాష సరసంగా లేదు” అన్నాడు మిస్టర్ అట్టర్సన్.

రెండోవ్యక్తి ఒక ఆటవికుడిలా పగలబడి నవ్వాడు. మరుక్షణంలోనే ఉద్వేగంతో చెవి తిప్పి తలుపు తెరిచి ఇంట్లోకి అదృశ్యుడైనాడు.

హైడ్ తన్ను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళిపోయిన తరువాత, అట్టర్సన్ చిత్రించిన బొమ్మలా నిశ్చేష్టుడై కొంతసేపు నిలిచి పోయాడు. తరువాత అతడు వీధి ఎగువకు అడుగులో అడుగు వేసుకుంటూ, ప్రతి ఒకటిరెండు అడుగులకూ ఆగుతూ, ఆలోచిస్తూ, మానసికంగా కళవళపాటు పడుతున్న వ్యక్తిలా ఫాలభాగాన్ని చేత్తో పట్టుకుంటూ నడుస్తున్నాడు. అలా అతడు నడుస్తూ ఆలోచిస్తున్న సమస్య అంత చులకనగా పరిష్కారమయ్యేది కాదు. హైడ్ పాలిపోయి కన్పించాడు. గుజ్జురూపం, అంగవైకల్యం ఇక్కడ అని శృంగగ్రాహికగా చూపలేముగాని వికారం మాత్రం ద్యోతకమై తీరుతున్నది. అతని వికటహాసం అతికటువుగానూ, అసహ్యంగానూ ఉంది. పిరికితనం, ధైర్యం పెనగొని ఉన్న వ్యక్తిలా అతడు న్యాయవాది అట్టర్సన్‌తో సంభాషించాడు. ఊక చప్పుడుగా, భిన్నకంఠంతో మాట్లాడాడు. ఈ లక్షణాలన్నీ అతడిమీద వ్యతిరేకభావాన్నే కలిగిస్తున్నవి. ఇవన్నీ ఒకటిగా కలిసినా అతడంటే అట్టర్సన్‌కు కలిగిన అసహ్యానికి గానీ, భయానికి గానీ కారణం కాదు. ఉక్కిరిబిక్కిరై పోతున్న ఆ పెద్దమనిషి ఇందుకు కారణం ఇది కాదు. ఇంకా ఏదో ఉంది. ఉండితీరాలి అని అనుకొన్నాడు. "తప్పకుండా ఇంకా ఏదో ఉండితీరాలి. అది నేను చెప్పగలిగితే... భగవంతుడు నన్ను కాపాడుగాక! ఈ వ్యక్తి మానవుడిలా లేడు. ఏదో రాతియుగంనాటి 'గుహావాసి'లా ఉన్నాడు. పోనీ ఇతడేదైనా మృణ్మయా కారమా? ఇదేదో డాక్టర్ ఫెల్ పాత్రకథలా ఉంది. చివరకు నాకిది తోస్తున్నది. మిత్రమా! ఓ భాగ్యహీనుడా! జెకిల్ మహాశయా! ఎవరి ముఖాన్నైనా సైతాను స్వహస్తం కనిపిస్తున్నదంటే అది మీ నూతనమిత్రుని ముఖాన్నే ఉందంటాను!"

ఆ ఉపవీధికి మూలతిరగంగానే ఒక కూడలి ఉంది. అక్కడ రమ్యమైన ప్రాచీనభవనాలెన్నో కనిపిస్తూ ఉంటవి. వాటిలో చాలాభాగం తమ పూర్వోన్నత్యాన్ని కోల్పోయి శిథిలావస్థలో ఉన్నవి. ఆ భవనాలలోని అన్ని అంతస్తులలో కక్ష్యలనూ, విడివిడిగా వీలును బట్టి పలురకాల వృత్తులు గల వ్యక్తులకు అద్దెకిచ్చారు. అందులో కొన్నింట్లో చిత్రపటాలు గీసేవారు, కొన్నింట్లో బేలుదారిపని చేసేవాళ్ళు. కొన్నిట్లో పేచీకోరు లాయర్లూ, కొన్నింట్లో అవ్యక్తవ్యాపారులు అద్దెకుంటున్నారు. ఆ వీధి మూలనుంచి రెండో ఇల్లుగా ఉన్నదిమాత్రం సంపూర్ణంగా ఒకరి క్రిందనే ఉంది. ఈ ఇంటిగుమ్మం సంపన్నతను సూచిస్తున్నా వీధిలో ఉన్న దీపాల వెలుగు తప్ప అంత ఇంట్లో మరే కాంతీ కన్పించటం లేదు. అట్టర్సన్ ఆ ఇంటి ముందు ఆగి తలుపు తట్టాడు. మంచి దుస్తుల్లో ఉన్న వృద్ధ సేవకుడు ఒకడు వచ్చి తలుపులు తీశాడు.

"పూల్? డాక్టర్ జెకిల్ ఇంట్లో ఉన్నారా?" అని న్యాయవాది ప్రశ్నించాడు.

అతన్ని ఆ వృద్ధసేవకుడు ఎత్తు తక్కువగా ఉన్న ఒక హాల్లోకి ప్రవేశపెడుతూ, "మిస్టర్ అట్టర్సన్! నేను చూచి చెపుతాను" అని సమాధానమిచ్చాడు. ఆ హాలు సౌఖ్యకరంగానే ఉంది. నేలంతా మెరుగుడురాళ్ళు పరిచారు. (గ్రామీణ గృహాలలో ఉండే పద్ధతిని అనుసరించి) ఆ హాల్లో అగ్నిధావని అమర్చబడి ఉంది. ఆ గది ఓక్ చెక్కతో తయారుచేసిన దారు సామగ్రితో అలంకరించబడి ఉంది. "మీరు ఇక్కడ అగ్నిధావని ప్రక్కన కూర్చొని ఉంటారా? లేకపోతే భోజనశాలలో దీపాలు వెలిగించి ఏర్పాట్లు చేయమన్నారా?" అని పూల్ ప్రశ్నించాడు.

"ఈ హాల్లోనే ఉంటాను" అన్నాడు న్యాయవాది. తానే ఒక కుర్చీని అగ్నిధావనికి దగ్గరగా లాక్కొని దానిమీద వ్రాలాడు. అతని మిత్రుడైన డాక్టరు జెకిల్‌కు ఈ హాల్ అంటే మహాప్రీతి. అంతేకాదు. అట్టర్సన్‌కు కూడా అటువంటి అభిమానమే ఉంది. అనేక పర్యాయాలు లండన్ నగరం అంతటా ఇంతటి హాయినిచ్చే ఘనకక్ష్య మరొకటి లేదని, మిత్రుడితో తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. కానీ ఈ నాటి రాత్రి అతని రక్తం ఊరికే ఉడికిపోతున్నది. హైడ్ ముఖమే అతని మనస్సులో మెదుల్తున్నది. జీవితమంటే (అతని ప్రకృతికి విరుద్ధమైన) ఒక అసహ్యం, అసంతృప్తే అతనికి కలుగుతున్నది. అతడు ఇటువంటి మానసికాందోళనలో ఉన్నప్పుడు మినుకు మినుకుమని వెలుగుతున్న అగ్నిధావని కాంతులు దారుసామగ్రి మీద వికటంగా ప్రకాశిస్తున్నవి. ఆ వెలుగుల్లో అతనికి ఏదో వింత ప్రమాదం గోచరిస్తున్నది. ఏదో ఒక నీడ ఇంటికప్పు పైభాగంలో విచిత్రంగా ఆడుతున్నట్లు అతనికి తోచింది. అతని మనస్సు భయోద్వేగంలో నిమగ్నమైంది. ఇంతలో పూల్ తిరిగివచ్చాడు. అతనికి కొంత శాంతి చేకూరినట్లయింది. తాను వహించిన దుఃస్థితికి సిగ్గుపొందాడు. పూల్ వచ్చి డాక్టరు జెకిల్ ఇంట్లో లేరనీ ఎక్కడికో బయటికి వెళ్ళారని నివేదించాడు.

"పూల్! ఈ శల్యశోధనమందిరద్వారం గుండా మిస్టర్ హైడ్ ప్రవేశించటం నేను చూచాను. డాక్టర్ జెకిల్ ఇంట్లో లేనప్పుడు ఇలా అతడు ప్రవేశించటం న్యాయమేనా?" అని అట్టర్సన్ పూల్‌ను ప్రశ్నించాడు.

"ఇందులో అన్యాయానికేముంది? మిస్టర్ హైడ్‌కు ఇంటి తాళం చెవి మరొకటుంది" అని సమాధానం చెప్పాడు ఆ వృద్ధసేవకుడు.

ఏదో ఊహిస్తున్నట్లుగా "అయితే ఈ యువకుడిమీద మీ యజమాని చాలా గాఢమైన నమ్మకం ఉంచారన్న మాట!" అన్నాడు అట్టర్సన్.

“అవునండి. వారికి అతనిమీద గట్టి నమ్మకముంది. మమ్మల్ని అందరినీ మిస్టర్ హైడ్ ఆజ్ఞానుసారంగా ప్రవర్తించండి అని ఆజ్ఞాపించారు కూడాను” అన్నాడు పూల్.

“మిస్టర్ హైడ్‌ను కలుసుకొనే అదృష్టం నాకెప్పుడూ పట్టలేదని అనుకుంటాను” అన్నాడు అట్టర్సన్

“లేదు బాబూ! ఆయన ఎన్నడూ ఇక్కడ భోజనం చెయ్యడు” అన్నాడు పూల్. “అంతేకాదు, భవనంలోని ఈ భాగానికి వారు ఎప్పుడూ రారు కూడాను. పరిశోధన మందిరంలోకి సూటిగా వస్తుంటారు, వెళ్తుంటారు” అని పూల్ చెప్పాడు.

“మంచిది. పూల్! వస్తాను. శుభం!”

“నమస్తే, మిస్టర్ అట్టర్సన్!”

బరువు గుండెతో న్యాయవాది ఇంటిదారి పట్టాడు. తనలో తాను ఇలా అనుకుంటూ నడుస్తున్నాడు.

“వెర్రివాడు పాపం! హారీ జెకిల్! అతడు నడిసముద్రంలో ఉన్నాడని పిస్తుంది. చిన్నప్పుడు అతిస్వేచ్ఛగా ప్రవర్తించినవాడు. ఇది ఏ నాటి మాటో! భగవదిచ్ఛ! దానికి హద్దుపద్దులంటూ ఉండవు. విషయం అదే ఐఉంటుంది. పూర్వం చేసుకొన్న పాపం భూతరూపాన్ని ధరించి అతన్ని ఆవహించి ఉంటుంది. రహస్యంగా దాచిపెట్టిన రాచపుండు అతన్ని పట్టేసింది. ఏ పనికైనా ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదు. ఈ నాడు అనుభవిస్తున్నాడు. ఆత్మమీది అభిమానం వల్ల ఎన్నో ఏళ్ళక్రింద చేసిన అపచారం జ్ఞప్తికి ఉండకపోవచ్చు. అయితేనేం? శిక్ష అనుభవిస్తున్నాడు.” ఇలా ఏమేమో భావిస్తూ అట్టర్సన్ నడుస్తున్నాడు.

ఈ రీతిగా ఊహిస్తున్నప్పుడు తన్ను గురించిన భయం ఏదో అతనిలో తారట్లాడింది. తన పూర్వప్రవర్తనను కూడా పరిశీలించటం మొదలుపెట్టాడు. ఎన్నాళ్ళనాటివో అతని చేష్టలన్నీ మనస్సులో ఒక మాటు దర్శనమిచ్చి వెళ్ళిపోతున్నాయి. ఏదైనా జ్ఞప్తి లేని అపచారపిశాచం తన్ను ఆవరించిందేమోనని శోధించుకొన్నాడు. అది పూర్తయింది. అమ్మయ్య! అతని పూర్వచరిత్ర అంతా నిష్కల్మషంగానే ఉంది. ఇలా తమ పూర్వచరిత్రను మాధ్యస్థం వహించి పరిశోధించుకోగల వ్యక్తులు లోకంలో ఎందరో లేరు తన చరిత్ర అతిపరిశుద్ధమైందని నిరూపితమైనా, తన స్వల్పదుష్కృత్యాలకే అతడు భయంతో క్రుంగిపోతున్నాడు. తాను చేయటానికి తలపెట్టి తీరా సర్వంసిద్ధం చేసి మానుకొన్న పనులు జ్ఞప్తికి వచ్చినప్పుడు, వాటిని చెయ్యకుండా

తప్పించుకొన్నందుకు తన యెడ తానే కృతజ్ఞతాభావాన్ని ప్రకటించుకొన్నాడు. మళ్ళీ అతని మనస్సు మొదటినుంచీ ఆలోచిస్తున్న విషయంమీదికి ప్రసరించింది. ఆశారేఖ ఏదో హఠాత్తుగా అతనికి గోచరించింది.

“యువకుడైన ఈ హైడ్‌ను పరిశీలించి చూస్తే, అతని జీవితానికి సంబంధించిన కొన్ని మర్మాలు తప్పక బయటపడి తీరుతాయి. అతని జీవితంలో చాలా గూఢరహస్యాలున్నట్లు వాడి చూపే వ్యక్తం చేస్తున్నది. దుష్టాతిదుష్టాలైన ఈతని జీవితరహస్యాలతో వెర్రి జెకిల్ రహస్యాలను పోల్చి చూస్తే, రెండోవి పగటి వెలుగులా స్వచ్ఛంగా కన్పించి తీరుతాయి. ఇలా ఎంతో కాలం జరగదు. వీడు దొంగలా హారీ శయ్య దగ్గిరికి నక్కుతూ వెళ్ళటాన్ని తలుచుకొంటుంటే నా ఒళ్లు చల్లబడిపోతున్నది. ఎంతటి ప్రమాదముందో గమనించావా? ఈ హైడ్‌కు వీలునామా అంటూ ఒకటి ఉన్నదని తెలిస్తే, దాన్ని స్వాధీనం చేసుకొని ఆస్తినంతటినీ భుక్తంలోకి తెచ్చుకోటానికి ఎంతో ఆతురత వహిస్తాడు. జెకిల్ నాకు అవకాశమిస్తే ఈ విషయంలో నేను గట్టిగా పూనుకొని తీరుతాను. జెకిల్ గనక నాకు అవకాశమిస్తేనా?...” అని తనలో తాను తర్కవితర్కాలు చేసుకొంటూ నడుస్తున్నప్పుడు, జెకిల్ ఇచ్ఛాపత్రంలోని ఎన్నో అంశాలు అతని మనోనయనాలముందు ముకురంలో ప్రతిబింబించినట్లు విస్పష్టరూపంతో కన్పిస్తున్నవి.

# 3. డాక్టరు జెకిల్ ప్రశాంతంగా ఉన్నాడు

ఒక పక్షం కాలం గడిచింది. డాక్టర్ లాన్యన్, తన చిరకాలమిత్రులు ఐదారుగురికి ఒక ఆనందకరమైన విందు చేశాడు. అతిథులందరూ జ్ఞానవృద్ధులు, కీర్తిమంతులు. ఆసవాలరుచిని అతినిశితంగా పరిగహించి తీర్పులు చెప్పగల సమర్థులు. అట్టర్సన్ అతిథులందరూ రాకముందు కొంతకాలం అక్కడనే ఉండే ఏర్పాటుతో వచ్చాడు. ఇలా ప్రవర్తించటం అతనికి కొత్త విషయం కాదు. అతడు ఇలా ఎన్నోమార్లు చేశాడు. అట్టర్సన్ అంటే అభిమానం ఉన్నవాళ్ళకు అది సాధారణాభిమానం మాత్రం కాదు అతిగాఢాభిమానం, తీవ్రహృదయం లేనివాళ్ళూ, వాచాలురూ విందారగించి విలాసాలలో విశేషభారాన్ని వహించి వెళ్ళిపోయిన తరువాత, సరదాలమీద ఆసక్తి లేని అట్టర్సన్‌తో గోష్ఠి చేయదలచుకొన్న కొందరు మిత్రులు మాత్రమే మిగిలారు. అట్టర్సన్ ఏకాంతప్రియత్వాన్నీ, మితభాషిత్వాన్నీ అర్థంచేసుకొని, అతనితో మాట్లాడి అందువల్ల మనస్సుకు శాంతిని చేకూర్చుకోటం అంటే, వాళ్ళకెంతో ఇష్టం. డాక్టరు జెకిల్ కూడా ఈ కోవలో చేరకుండా ఉండలేనివాళ్ళలో ఒకడు. ఆ విశాలకక్ష్యలో అగ్నిధావనికి ఎదురుగా అతడు కూర్చున్నాడు. వయస్సు ఏబదిఏండ్లు. దృఢశరీరి, మృదువైన భారీముఖం. కొంత ఓరచూపు చూస్తున్నాడా అనిపిస్తుంటుంది. అతనిలో సామర్థ్యం, దాక్షిణ్యం అన్న రెండుగుణాలూ విస్పష్టంగా కనిపిస్తుంటవి. అట్టర్సన్ అంటే గాఢమూ, సత్యమూ అయిన అభిమానం ఉన్నట్లు అతని చూపులే వెల్లడిస్తుంటాయి.

"జెకిల్, నేను మీతో మాట్లాడాలెనని ఎంతో ఆసక్తితో ఉన్నాను. మీరు వ్రాసిన వీలునామా సంగతి మీకు తెలిసిందేనా?" అన్నాడు అట్టర్సన్.

విమర్శనదృష్టితో చూచేవ్యక్తికి ఈ విషయం జెకిల్‌కు రుచించదని అనిపిస్తుంది. అయితే డాక్టర్ జెకిల్ మాత్రం ఈ ప్రసంగాన్ని ఆనందంతోనే స్వీకరించాడు. "వెర్రివాడా! మిస్టర్ అట్టర్సన్! నాబోటివాడు మీకు క్లైంటు అయినందుకు మీరు చాలా దురదృష్టవంతులు. నా వీలునామాను గురించి మీరు పడుతున్నంత కలవరపాటును పొందేవాళ్ళను నేనెవరినీ చూడనేలేదు. శాస్త్రచర్చల్లో నేను ప్రకటించే

అశాస్త్రీయసిద్ధాంతాలనుగురించి పూర్వప్రమాణైక దృష్టిగల పండితుడు డాక్టర్ లాన్యన్ కూడా ఇలాగే కలవరపాటు పడుతుంటాడు. అదిగో, నేను చెప్పే మాటలు మీకేమీ రుచిస్తున్నట్లు లేదు  ముఖం చిట్లిస్తున్నారు. అతడు అత్యుత్తముడని నాకు తెలుసు. అంతే కాదు. ఇంకా నేను తెలుసుకోవలసిన మంచితనం కూడా అతనిలో ఎంతో ఉంది. అయితేనేం పాతసిద్ధాంతాలనే కొండలకు తన్ను అతడు మిక్కిలి గట్టిగా కట్టేసుకున్నాడు. తనమీద నేను పెట్టుకొన్న ఆశలను డాక్కర్ లాన్యన్‌వలె భగ్నంచేసిన వ్యక్తి నాకు మరెవ్వరూ కనిపించలేదు" అని డాక్టర్ జెకిల్ అన్నాడు. లాన్యన్‌కు సంబంధించి డాక్టర్ జెకిల్ తెచ్చిన ఈ నూతనప్రసంగాన్ని అవతలికి త్రోసిపారేసి, "మీ విల్‌నామాను నేను ఎన్నడూ అంగీకరించనని మీకు తెలిసిందే" అన్నాడు అట్టర్సన్.

"ఔను. నాకు బాగా తెలుసు." వెంటనే అందుకొని, "ఈ విషయం నాకు మీరు వెనక స్పష్టంగా చెప్పారు కూడాను" అన్నాడు డాక్టర్ జెకిల్.

"మంచిది. మళ్ళీ చెపుతున్నాను. ఇటీవలనే హైడ్ అనే వ్యక్తిని గురించి నాకు కొంత తెలియవచ్చింది" అని న్యాయవాది సంభాషణ సాగించాడు.

డాక్టర్ జెకిల్ సుందరమైన భారీముఖం పెదవుల వరకూ పాలిపోయింది. కళ్ళను ఏదో కాలిమ ఆవరించింది. "ఇక నే నీ విషయాన్ని గురించి వినదలచలేదు. ఈ విషయం ఎప్పుడూ మన సంభాషణలోకి రాకూడదని వెనక ఒక ఒప్పందం కూడా చేసుకున్నాం" అన్నాడు డాక్టర్ జెకిల్.

"అతన్ని గురించి నేను విన్నదంతా పరమఘోరంగా ఉంది" అని అన్నాడు అట్టర్సన్.

"ఇంతమాత్రం చేత ఆ వ్యవహారంలో కలిగే క్రొత్త మార్పులు ఏమీ ఉండవు. నా స్థితి ఏమిటో మీరు అర్థం చేసుకోలేదు. అట్టర్సన్! నేనొక బాధాకరమైన దుఃస్థితిలో పడ్డాను. నేటి నా స్థితి చిత్రమైంది  అతివిచిత్రమైంది. సంభాషణలవల్ల చక్కబడని వ్యవహారాలలో ఇది ఒకటి" అని జెకిల్ కొంత అసంబద్ధ ప్రవర్తనతో సంభాషించాడు.

అప్పుడు అట్టర్సన్ అందుకొని "జెకిల్! నేను మీకు బాగా తెలిసినవాణ్ణి, విశ్వాసపాత్రుణ్ణి. నా మీద నమ్మకం ఉంచి దాపరికం లేకుండా సమస్తం చెప్పండి. మిమ్మల్ని ఈ సంకట స్థితిలోనుంచి నిస్సందేహంగా నేను బయటపడవేయగలను" అని అన్నాడు.

“అట్టర్సన్ మహాశయా! మీరు నాయెడ చూపే సుహృద్భావానికీ, సద్భావానికీ నేనెంతో కృతజ్ఞుణ్ణి. ఆ కృతజ్ఞతను ఎలా వెల్లడించుకోవాలెనో నాకు మాటలు చాలటం లేదు. మీ మీద నాకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంది. సజీవులైన సమస్తవ్యక్తులందరి కంటే నేను మిమ్మల్ని అధికంగా నమ్ముతున్నాను అంతే కాదు, నన్ను నేను నమ్మినదానికంటే అధికంగా మిమ్మల్ని నమ్ముతున్నాను. కానీ ఈ వ్యవహార విషయంలో నాకు స్వేచ్ఛ లేదు. అదీ కాక ఈ వ్యవహారం మీరు ఊహిస్తున్నది కానే కాదు. మీరు ఊహిస్తున్నంత అధ్వాన్నంగా అది లేనూ లేదు. మీ ఉదాత్తహృదయానికి కొంత ఊరట కలగటం కోసం ఒక విషయం చెపుతాను వినండి. ఏ క్షణంలోనైనా నేను మిస్టర్ హైడ్‌ను వదిలించుకోగలను. ఈ విషయం సత్యం. మీ చేతికి చేయి అందించి చెపుతున్నాను. మీరు నాయెడ చూపించే అనురాగానికి తిరిగితిరిగి కృతజ్ఞతను వెల్లడించుకొంటున్నాను. అట్టర్సన్! మరొక విషయం కూడా మీతో చెప్పాల్సి ఉంది. అయితే దాన్ని మీరు సహృదయత్వంతో స్వీకరిస్తారని భావిస్తాను. ఇది నా ఆంతరంగిక విషయం. దాన్ని మీరు మేల్కొల్పవద్దని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను” అని డాక్టర్ జెకిల్ సమాధానంగా సంభాషించాడు.

అగ్నిధావనిలోకి చూస్తూ అట్టర్సన్ కొంతసేపు ఆలోచించాడు. చివరకు లేవబోతూ “అవును. మీరు మాట్లాడిందంతా చాలా సమంజసంగా ఉంది” అన్నాడు.

డాక్టర్ జెకిల్ తిరిగి ప్రస్తావిస్తూ “మంచిది. ఎలాగూ ఈ విషయాన్ని ప్రసంగిస్తున్నాము కనుకనూ, దీన్ని గురించి ఇదే మన తుది ప్రసంగం కనుకనూ, మరొక్క విషయం కూడా మీకు తెలియజేస్తాను. పాపం ఆ వెర్రి హైడ్ విషయంలో నాకు విశేషాసక్తి ఉంది. మీరు అతన్ని గురించి వినటమే కాదు. చూచారని కూడా నాకు తెలుసు. అతడే చెప్పాడు. బహుశః అతడు మీ యెడ అసభ్యంగా కూడా ప్రవర్తించి ఉండవచ్చు. కానీ నాకు మాత్రం అతనిమీద దొడ్డ ఆసక్తి, మహాదొడ్డ ఆసక్తి ఉంది. ఒకవేళ ఏ కారణాన్నైనా నేను లేకుండా పోవటం జరిగితే, మిస్టర్ అట్టర్సన్, మీరు అతని బండతనాన్ని సహించి నా సర్వస్వాన్నీ అతనికి చెందేటట్లు చేస్తానని నాకు వాగ్దానం చెయ్యండి. విషయమంతా తెలిస్తే మీరు తప్పక అలా చేస్తారని నాకు తెలుసు. మీరు ఆ వాగ్దానమిస్తే, నిజం చెబుతున్నాను. నా మనోభారం ఎంతో తీరుతుంది” అని అన్నాడు.

“అతడంటే నాకు ఇష్టం ఇప్పుడు కలిగిందని మీ ముఖప్రీతికోసం నేను నటించలేను” అన్నాడు అట్టర్సన్.

డాక్టర్ జెకిల్ అట్టర్సన్ భుజంమీద చేయి వేసి తడుతూ, "మిమ్మల్ని నటించమని నేనెన్నడూ కోరను. అయితే ఏది న్యాయమో దాన్ని అనుసరించమని కోరుతాను. నా అనంతరం నా కోసం అతడికి సాయం చెయ్యవలసిందని మిమ్మల్ని అర్థిస్తున్నాను" అన్నాడు.

అట్టర్సన్ అణచుకోలేని నిట్టూర్పు విడిచాడు. అన్నాడు : "మంచిది. ఇదిగో, అలాగే మీకు వాగ్దానమిస్తున్నాను."

# 4. క్యారూ హత్యావ్యవహారం

ఒక సంవత్సరకాలం దరిదాపుగా గడిచిపోయింది. 18 అక్టోబరు మాసం. లండన్ మహానగరంలో ఒక దారుణమైన హత్య జరిగింది. నగరమంతా ఉడికిపోతున్నది. హతుడైన వ్యక్తి ఉన్నతస్థితిలో ఉన్నవాడు. ఆ కారణంవల్ల ఈ హత్యోదంతం విశేషప్రాముఖ్యాన్ని వహిస్తున్నది. తెలియ వచ్చిన హత్యావివరాలు చాలా స్వల్పంగా ఉన్నవి. ఆ కొద్ది వివరాలైనా మహాదారుణమైనవి. నదికి దగ్గరగా ఉన్న ఒక ఇంట్లో ఒక పడుచుదాసి ఒంటరిగా నివసిస్తున్నది. దరిదాపు రాత్రి పదిగంటలప్పుడు ఆమె నిద్ర పోవటానికని పై అంతస్తుమీదికి వెళ్ళింది. తెల్లవారుజామున పొగమంచు నగరాన్నంతటినీ ఆవరించినా రాత్రి ఆకాశం స్వచ్ఛంగా ఉంది. మబ్బు లేమీ లేవు. సంపూర్ణ చంద్రుని వెన్నెల్లో ఆ కన్యక ఉన్న ఇంటి వాతాయనం గల ఉపవీథి ప్రకాశిస్తున్నది. ఆ పడుచును గురించి కొంత విలాసప్రియ అని చెప్పుకుంటారు. కిటికీ క్రింద ఉన్న పెట్టెమీద కూర్చొని ఆమె ఏవేవో కలలు కంటూ ఉన్నది. రాత్రి జరిగిన సంఘటన గురించి కంటనీరు కారుస్తూ ఆ పిల్ల చెప్పింది. ఆ పిల్లకు ఆ నాటి రాత్రి మానవలోకం మీద కలిగినంత మక్కువ మరెన్నడూ కలుగలేదుట! ఆ నాడామె ప్రపంచంమీద వహించినంతటి కరుణభావాన్ని మరెప్పుడూ పొందలేదట!

ఈ నాటి రాత్రి అలా కలలు గంటూ పెట్టెమీద కూర్చొని కిటికీగుండా క్రిందికి చూస్తుంటే వెండి జుత్తుతో అందగాడు, వయస్సు ముదిరినవాడు, ఆ సందులో ప్రవేశించి క్రమంగా దగ్గరికి వస్తున్నాడు. గుజ్జురూపంతో మరో వ్యక్తి కూడా ముందుకు చూస్తూ వస్తున్నాడు. మొదట ఆ కన్య రెండో వ్యక్తిని అంతగా గమనించలేదు. నిలిచి మాట్లాడటానికి వీలైనంత దగ్గరగా వాళ్ళిద్దరూ కలుసుకొన్నప్పుడు, సరిగా ఆ కన్నెకు కళ్ళముందు కనిపించే స్థలం, ఇద్దరిలో వృద్ధుడు రెండో వ్యక్తికి వంగి నమస్కరించి ఎంతో హుందాఅయిన రమణీయరీతితో వినయభావాన్ని ప్రకటించి ముఖం వంక చూచాడు. అతడు అడిగినదానిలో గూడా ఏమీ విశేషమున్నట్లు కన్పించదు. అతడు చేయి చాపి చూపించటాన్ని బట్టి ఏదో త్రోవ అడిగినట్లుగా అర్థమౌతున్నది. అతడు మాట్లాడుతున్నప్పుడు వెన్నెల వెలుగు అని ముఖంమీద పడ్డది. అప్పుడు అతని ముఖాన్ని పరికించి చూడటానికి ఆ కన్నె ఎంతో ముచ్చట పడ్డది. ఆ ముఖంలో ఒక

అమాయకత్వం, పూర్వకాలపు దయాదాక్షిణ్యాలూ ఆ పడుచుకు గోచరించాయి. అంతేకాదు, కొంత గొప్పదనం కూడా ఉట్టిపడి కనిపించింది. అదీకాక అతడు సంపన్నుడని కూడా ఆమెకు స్ఫురించింది. వెంటనే ఆమె కళ్ళు రెండో వ్యక్తి మీదికి మరిలాయి. యజమాని దగ్గిరికి వచ్చినప్పుడు తాను మిక్కిలిగా అసహ్యించుకొన్న మిస్టర్ హైడ్ అని అతన్ని ఆమె వెంటనే పోల్చుకున్నది. అత్యంతాశ్చర్యమగ్నురాలైంది. అతడు చేతిలో ఉన్న గట్టి కర్రను అటూ ఇటూ ఊపుతున్నాడు. పై పెద్దమనిషి అడిగిన ప్రశ్నకు అతడు సమాధాన మేమీ చెప్పినట్లు కన్పించలేదు చెప్పింది ఓర్పు లేనివాడిలాగా విన్నట్లు మాత్రం గోచరించింది. అప్పుడు ఎందుకో అతడికి హఠాత్తుగా కోపోద్రేకం వచ్చింది. నేలను కాలితో తాటించి, చేతిలో ఉన్న కర్రను గిర్రున త్రిప్పి (ఆ కన్య వర్ణించినట్లు) ఉన్మత్తుడిలా ఒక హుంకారం చేశాడు. వృద్ధుడైన ఆ పెద్దమనిషి నిర్ఘాంతపోయి ఒక అడుగు వెనక్కు వేశాడు. అంతట హైడ్ విజృంభించాడు. గట్టి దెబ్బకొట్టి ఆ పెద్దమనిషిని నేలమీద పడేశాడు. మరుక్షణంనుంచీ మర్కటక్రోధంతో క్రిందపడ్డ పెద్దమనిషి మీద కాళ్లు పెట్టి త్రొక్కుతూ, చేతికర్ర దెబ్బలతో కుంభవృష్టి కురిపించాడు. ఆ పెద్దమనిషి ఎముకలు విరిగిన చప్పుడు కూడా ఆ కన్యకు వినిపించింది కళేబరం రోడ్డుమీద ఎగిరిపడ్డది. ఈ దృశ్యధ్వనుల భీకరత్వానికి ఆ కన్య మూర్ఛపోయింది.

ఆమెకు స్పృహవచ్చి పోలీసువారికి తెలియజేసేటప్పటికి కల్లా రాత్రి రెండుగంటలైంది. హంతకుడు పారిపోయి ఎంతో సేపైంది. అతని హత్యకు బలి ఐపోయిన వ్యక్తిమాత్రం యమబాధలు పడి ఆ ఉపవీథి మధ్యలో శవరూపంతో పడి ఉన్నాడు. ఈ దారుణకృత్యానికి తోడ్పడ్డ ఆ గట్టికర్ర మిక్కిలి బిరుసైంది గట్టి చేవతో చేసింది. అయినా ఆ క్రూరచర్యలో తనమీద పడ్డ భారానికి మధ్యకు విరిగిపోయింది. అందులో ఒక తుండెం ప్రక్క మురికి కాలవలోకి దొర్లి పడి ఉంది. ఇంకోభాగం హంతకుడి చేతిలోనే ఉండిపోవటం వల్ల అతడే తీసుకోపోయి ఉంటాడు. ఇందులో సంశయానికి అవకాశమే లేదు. హతుడైన వ్యక్తి శరీరంమీద ఒక పర్సు, చేతి గడియారం ఉన్నవి. ఒక సీలు వేసిన కవరు తప్ప (బహుశః దీన్ని అతడు పోస్టు చేయటానికి తీసుకువెళ్ళుతుంటాడు) ఇతరమైన కార్డుగానీ, కాగితాలు గానీ అతని దగ్గర ఏమీలేవు. ఆ కవరుమీద మిస్టర్ అట్టర్సన్ విలాసం వ్రాసి ఉంది.

మరునాటి ఉదయం అతడు ఇంకా నిద్ర లేవటానికి పూర్వం ఎవరో ఆ కవరును అట్టర్సన్‌కు చేర్చారు. అతడు వెంటనే కవరును విప్పి అందులోని పత్రాన్ని అతివేగంగా

చూచాడు. కవరును తీసికోవచ్చిన వ్యక్తివల్ల పరిస్థితిని గురించి ఆదుర్దాతోనైనా సాకల్యంగా విన్నాడు. "కళేబరాన్ని చూచేవరకు ఇదమిత్థ మని నేనేమీ చెప్పలేను" అని గంభీరంగా పెదవి విరిచి అన్నాడు. "ఇది చాలా ఘోరచర్యగా తోస్తున్నది. దయ ఉంచి నేను దుస్తులు ధరించేదాకా వేచి ఉండండి" అని అట్టర్సన్ వచ్చిన వ్యక్తిని అర్థించాడు. ఇంతసేపూ కన్పిస్తున్న తీక్షమైన ముఖంతోనే ఉదయభోజనం వేగంగా పూర్తిచేసుకొని పోలీసు స్టేషనుకు వెళ్లాడు. అప్పటికే కళేబరం అక్కడ చేరి ఉంది. అట్టర్సన్ ఆ శవం ఉన్న కక్ష్యలో ప్రవేశించిన వెంటనే తల పంకించాడు.

"అవును. ఇతణ్ణి నేను గుర్తు పట్టగలిగాను. ఇది సర్ డాన్వర్స్ అని చెప్పటానికి నేనెంతో చింతిస్తున్నాను" అని అన్నాడు.

ఈ మాటలు వినగానే రక్షణశాఖాధికారి ఆశ్చర్యపడ్డాడు. అన్నాడు : "ఏమిటి! మహాశయా! ఇటువంటిది సంభవమా?" మరుక్షణంలోనే ఆతని వృత్తికి సంబంధించిన సహజలక్షణాలైన ఉత్సాహం, ఆసక్తి కన్నుల్లో మెలగటం ప్రారంభించాయి. "అయితే, ఇది చాలాగొప్ప ఆందోళనను కల్పిస్తుంది తప్పదు ఆరాలు తీసి హంతకుణ్ణి పట్టుకోటంలో మీరు మాకు తప్పక సాయపడతారని భావిస్తున్నాను" అన్నాడు ఆ అధికారి. అతడు అట్టర్సన్‌కు ఆ కన్య చెప్పినదంతా సంక్షేపంగా చెప్పి, విరిగిపోయి దొరికిన కఱ్ఱముక్కను కూడా చూపించాడు.

ఆ అధికారి కన్యవల్ల విన్న కథంతా చెపుతున్నప్పుడు హైడ్ పేరు రాగానే అట్టర్సన్ ఒకమాటుగా జంకి కలవరపడ్డాడు. అయితే చేతికఱ్ఱలో దొరికిన తునకను చూపించి ముందుపెట్టినప్పుడు అతడు ఇక సందేహించలేక పోయినాడు. ఇప్పుడది విరిగి చెదిరిపోయి కనిపిస్తున్నా దాన్ని తాను కొన్నేళ్ళకు పూర్వం డాక్టరు జెకిల్‌కు బహూకరించిన చేతికఱ్ఱే అని సులువుగా అతడు గుర్తింపగలిగాడు.

"ఆ హైడ్ గుజ్జు రూపం వాడేనా?" అని సాలోచనగా అట్టర్సన్ ప్రశ్నించాడు..

"చాలా పొట్టివాడట! అతిక్రూరపు చూపు కూడా కలవాడట! ఆ దాసీ కన్య చెప్పింది" అని సమాధానమిచ్చాడు అధికారి.

అట్టర్సన్ ఆలోచనలోపడ్డాడు, కొంతసేపటికి తలెత్తి అధికారితో, "ఇప్పుడు మీరు నా బండిలో వెంటవస్తే నేను మీకు అతడి ఇల్లు చూపిస్తాను" అని అన్నాడు.

అప్పటికి ఉదయం తొమ్మిది గంటలైంది. ఆ ఋతువులో మంచు కురియటం ఆరంభించి అదే మొదటిదినం. మంచు తెరలు ఆకాశాన్నంతా ఆవరించి ఉన్నాయి.

చాకలేట్ రంగుతో అది మధ్యమధ్య క్రమ్ముకోబోతున్నది. అప్పుడప్పుడూ తండ తండాలుగా వచ్చిపడుతున్న చలిగాలికి మంచు తెర చెదిరిపోతున్నవి. ఇట్టిస్థితిలో అట్టర్సన్ గుర్రపుబండి ఒక వీథి తరువాత మరోవీథి దాటుతూ నెమ్మదిగా నడుస్తున్నది. అట్టర్సన్ వాతావరణంలోని కిమ్మీరిత కాంతుల వివిధ వేషాలను గమనిస్తున్నాడు. ఒకచోట సాయంకాలపు తుదిభాగంలో ఆవరించే అంధకారకాంతులు, మరొకచోట విచిత్రదావాగ్నులవలె ఉదయకాలపు నీరెండలూ, మరొకట చోట గోధుమవర్ణకాంతులూ, కన్పిస్తున్నవి. ఒకచోట మూడమంచుగుత్తులు క్షణకాలం విరిసి మళ్లీ ముంచేసే మధ్యకాలంలో బాలసూర్యకాంతులు చొచ్చుకోరావటాన్ని అతడు గమనిస్తున్నాడు. మురికి బాటలతో, ఎడ్డెమడ్డి తెరవరులతో చీకటి చేసే క్రొత్త దారులను ఎదుర్కోటం కోసమో అన్నట్లు ఎప్పుడూ ఆరాటంగానీ, మరోమారు వెలిగించటం గానీ లేని దీపాలతో అ సోహోప్రాంతం న్యాయవాది చూపులకు ఆశబలిత కాంతుల్లో దుఃస్వప్నలోకానికి చెందిన ఒక మహానగరంలోని మార్మ్యాలవాడగా గోచరిస్తున్నది. అంతే కాదు. అతని మనస్సులోని ఆలోచనలు కూడా అతని నిరాశాజనకాలుగా నడుస్తున్నవి. ఈ ప్రయాణంలో తనప్రక్కన కూర్చున్న రక్షణశాఖాధికారి మీద తన దృష్టి పడ్డప్పుడు దండ నీతి, దండాధికారం, చట్టం, చట్టసంబంధులైన అధికారులకు సబంధించిన ఏదో అర్థంకాని భయం అతన్ని కలవరపెట్టటం ప్రారంభించింది. ఈ రక్షకశాఖాధికారులు కొన్ని సందర్భాల్లో ఏమీ ఎరగని అమాయకులను నిర్బంధించి బాధపెడుతూ ఉండటం అతనికి తెలిసి ఉండటమే ఇందుకు కారణం.

సూచించిన విలాసం ఉన్న ఇంటి సమీపానికి గుర్రపు బండి చేరేటప్పటికి మంచు తెర కొంతవచ్చి విరిసిపోతూ ఉంది. ఎదుట చీకటి నిండిన ఒకవీథి అతని కంటిముందు కన్పించింది. ఆ వీథిలో ఒక కీల్య, ఒక ఫ్రెంచి – కాఫీ శాల, ఒకటి రెండు పెన్నీల విలువగల లేహ్యాలు అమ్మే చిల్లరదుకాణం, ఇంటిగుమ్మాల ముందు గుంపులు చేరే చింకిరి గుడ్డల పిల్లలూ, చేతిలో తాళపు చెవులు పుచ్చుకొని వేడి వేడి పానీయాలకోసం బయటికి వెళ్తున్న అనేక జాతుల స్త్రీలు కొంచెంగా మంచుతెర విచ్చటం వల్ల అతనికి కన్పించాయి. మరుక్షణంలోనే మంచుతెర ఆ ప్రాంతాన్ని తన గోధుమరంగుతో గాఢంగా కప్పి వేసింది. అదువల్ల అట్టర్సన్‌కు చుట్టుపట్ల ఉన్న విశేషాలు కనిపించటం మానేశాయి. పదిలక్షల స్టెర్లింగులకు ఉత్తరాధికారి కాబొయ్యే హెన్రీ జెకిల్ ఆప్తమిత్రుని ఇల్లు ఇక్కడనే ఉంది.

దంతపుపెట్టెలాంటి ముఖం, నెరిసిన జుత్తూ ఉన్న ఒక వృద్ధసేవిక వచ్చి తలుపు తీసింది. ఆమె ముఖంలో దుష్టత్వం నిబిడమై పొడ కట్టుతున్నది. పైకి మాత్రం తెచ్చి

పెట్టుకొన్న మర్యాదతో ఎంతో బాగా మాట్లాడింది. "ఇది మిస్టర్ హైడ్ ఇల్లే కాని వారు ఇంట్లో లేరు" అని ఆ ముసలిది సమాధానం చెప్పింది. గడిచిన రాత్రి అతడు చాలా ప్రొద్దుపోయిన తరువాత ఆలస్యంగా ఇంటికి వచ్చాడనీ, వచ్చిన వెంటనే తిరిగి వెళ్ళిపోయినాడనీ ఆమె తెలియజేసింది. ఇందులో వింత ఏమీ లేదు. అతని అలవాట్లన్నీ ఇలా క్రమవిహీనంగా ఉంటాయి. అనేక సమయాల్లో అతడు ఇంట్లో ఉండడు. ఆమె అతన్ని నిన్న ఇంటికి వచ్చినప్పుడు చూచింది అంతకు పూర్వం రెండునెల్లనాడు చూచింది. అతని అలవాట్లు క్రమబద్ధంగా ఉండవనటానికి ఇంతకంటే మరేం నాదర్శనం కావాలి?

"మంచిది. మేము అతడి గదులు చూడవలసి ఉంది" అన్నాడు న్యాయవాది అట్టర్సన్. ఆమె 'అది సాధ్య పడ'దని చెప్పటం ప్రారంభించగానే అట్టర్సన్ పోలీసు అధికారిని చూపిస్తూ "వీరు ఎవరో నీకు తెలుసునా? ఇన్‌స్పెక్టర్ మిస్టర్ న్యూకామెన్. స్కాట్లండు యార్డు నుంచి వచ్చారు అన్నాడు అట్టర్సన్.

ఆ వృద్ధ స్త్రీ ముఖంలో విద్వేషమిళితమైన సంతోషం వ్యక్తమైంది. "అలాగా? ఆయన ఏమన్నా చిక్కులో పడ్డారా ఏమిటి? ఏం చేశారేమిటి?" అని ప్రశ్నించింది.

మిస్టర్ అట్టర్సన్, పోలీసు ఇన్‌స్పెక్టర్ ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. "ఇతని సంగతి చూస్తే ఏమీ ప్రజాభిమానం ఉన్నవాడులా కనిపించటం లేదే?" అన్నాడు ఇన్‌స్పెక్టర్. ఆ వృద్ధస్త్రీతో "ముసలమ్మా! నన్నూ ఈ పెద్దమనిషినీ ఒక్క మాటు ఈ పరిసరాల నలుదిక్కులూ చూడనీ" అని అతడన్నాడు.

అంత విశాలవిస్తీర్ణం గల ఆ ఇంట్లో ఉంటున్నది ఆ వృద్ధస్త్రీ ఒక్కతే. ఆమే లేకపోతే ఇల్లు ఖాళీ అన్నమాటే. హైడ్ ఆ ఇంట్లో రెండు గదులను మాత్రమే ఉపయోగిస్తాడు. అవి రెండూ సౌఖ్యంగా అలంకరింపబడి యజమాని ఉత్తమాభిరుచులను వెల్లడిస్తున్నది. ఒక చిన్నగది ఆసవాలతో నిండి ఉంది. బల్లమీద అందాలు చిందే అల్లికగల వస్త్రం ఒకటి పరచి ఉంది. దానిమీద ఒక వెండిపళ్లెం పెట్టి ఉంది. ఒక చక్కనిపటం గోడమీద వ్రేలాడదీసి ఉంది. (అట్టర్సన్ ఊహించినట్లు) బహుశః దీన్ని హెన్రీజెకిల్ హైడ్‌కు బహూకరించి ఉంటాడు. జెకిల్‌కు కళాఖండాలను సేకరించటం మీద ఉన్న అభిలాషే ఇలా ఊహించటానికి కారణం. ఈ రెండుగదుల్లో పరిచి ఉన్న తివాచీలు మంచి రంగుల సమ్మేళనంతో ఒప్పుతున్నాయి. కానీ ప్రస్తుతం గదులను రెంటినీ పరిశీలించి చూస్తున్నప్పుడు కొద్ది కాలానికి పూర్వమే అతివేగంగా కొన్ని వస్తువుల కోసం వాటిని వెతికినట్లు వస్తువులన్నీ చిందరవందరగా

కనిపించటంవల్ల, తోస్తున్నది. బల్లసొరుగులకు తాళాలు తీసి తెరచివున్నాయి. అగ్నిధావనిలో చాలాపత్రాలను పడేసి దగ్ధం చేసినట్లు కాలి కరుళ్లు కట్టిన పొత్తులవల్ల తెలుస్తున్నది. ఆ కాలిన పొత్తులలో నుంచి ఇన్‌స్పెక్టర్ తగలపడకుండా మిగిలిపోయిన ఒక బ్యాంకు చెక్కు పుస్తకపు పూర్వార్ధభాగాన్ని బయటికి తీశాడు. విరిగిన చేతికర్రలో రెండో సగం తలుపు వెనకన పెట్టి ఉంటే కనిపించింది. ఇంతటితో ఇన్‌స్పెక్టర్ అనుమానం గట్టిపడ్డది. అది లభించినందుకు తాను ఆనందభరితుడనౌతున్నాని అతడు ప్రకటించాడు. హంతకుడి పేరుతో బ్యాంకు ఖాతాలో అనేక వేల పౌనులు నిల్వ ఉన్నట్లు దానివల్ల తెలియవచ్చింది. బ్యాంకుకు వెళ్లి విచారణ చెయ్యవచ్చుననే ఆశ కలిగింది. ఆ రక్షణశాఖాధికారికి పరిపూర్ణ సంతృప్తి కలిగింది.

"ఇక నా మాట నమ్మండి. హంతకుడు నా చేత చిక్కినట్లే! అతడికి మతిపోయి ఉంటుంది. లేకపోతే ఈ విరిగిన కర్ర ముక్కను ఇక్కడ ఉంచిపోయేవాడు కాదు ఈ చెక్కు పుస్తకాన్ని ఇలా తగులబెట్టేవాడు కూడా కాడు. ప్రతి వ్యక్తికీ ధనంతోనే గడండీ జీవితం! మనం చెయ్యవలసింది ఇంతకంటే ఏమీలేదు. బ్యాంకుదగ్గర అతనికోసం కాచుకొని కూర్చుందాం. అతడు తెచ్చే చెక్కులను పట్టుకుందాం" అన్నాడు అతను అట్టర్సన్‌తో.

"కాని ఈ చివరిపనిమాత్రం అనుకున్నంత తేలికైనది కాదు. మిస్టర్ హైడ్‌తో ముఖపరిచయం కలవాళ్ళే కొద్దిమంది. ఇందాకటి వృద్ధదాసిభర్త కూడా అతన్ని రెండేమార్లు చూచాడు. హైడ్ కుటుంబంవాళ్లంటూ ఎక్కడా ఎవరూ ఉన్నట్లు ఆచూకీ అయినా లేదు. అతడు తన రూపానికి ఒక్క ఛాయాచిత్రాన్ని కూడా తీయించుకోలేదు. ఇలా ఉంటాడని అతన్ని వర్ణించగల కొద్దిమందైనా అతన్ని నానారీతుల వర్ణిస్తున్నారు. ఎవరు ఏ రీతిగా వర్ణించినా అతడిలో ఇదమిత్థమని చెప్పటానికి వీలులేని ఒకవికారం ఉంది అన్న విషయంలో మాత్రం అందరిదీ ఒకటే అభిప్రాయం.

# 5. ఉత్తరం కథ

మధ్యాహ్నంలో చాలాభాగం గడచినతరువాత అట్టర్సన్ డాక్టరు జెకిల్ ఇంటికి వెళ్ళాడు. వెంటనే పూల్ అతణ్ని లోపలికి ప్రవేశపెట్టాడు. ప్రాచీన భోజనశాలల్లోనుంచీ నడిపించుకుంటూ ఒక నిర్జనమైన పెరట్లోకి తీసుకువెళ్ళాడు. ఆ ప్రదేశం ఒకానొకప్పుడు ఉద్యానవనంగా ఉండేది. అక్కడినుంచీ పూల్ అతన్ని ఒక భవనంలోకి తీసుకువెళ్ళాడు. దాన్ని జనం పరిశోధనశాల లేదా శల్యశోధనశాల అంటుండేవాళ్ళు. డాక్టరు జెకిల్ ఈ భవనాన్ని ప్రసిద్ధుడైన ఒక శస్త్ర వైద్యుడి వారసుల దగ్గరనుంచి కొన్నాడు. ఇతడికి శరీరశాస్త్ర నిర్మాణం మీదకంటే రసాయనిక శాస్త్రవిషయాలల్లో పరిశోధనాసక్తి విశేషం. అందువల్ల ఇతడు ఆ భవనంలోని పెరటిని ఉద్యానవనంగా మార్చాడు. తన మిత్రుడు జెకిల్ పరిశోధనశాలలో ఉండగా అట్టర్సన్ అతన్ని కలుసుకోటం ఇదే మొదటిసారి. కిటికీలు లేక చీకటికోణంగా ఉన్న ఆ ఇంటిని అట్టర్సన్ ఆశ్చర్యంతో తిలకిస్తూ ఉన్నాడు. ఆ మందిరాన్ని చూస్తున్నప్పుడు అతడు అసంతృప్తితో పరికిస్తున్నాడు. ఈ భవనం ఒకప్పుడు విద్యాసక్తి గల విద్యార్థుల గుంపుతో నిండి ఉండేది. ఇప్పుడు అది నిశ్శబ్దంగా నిద్రపోతున్నట్లుంది. బల్లలన్నీ పరిశోధనలకు ఉంచిన రసాయనిక ద్రవ్యాలతో నిండి ఉన్నాయి. బంగీలు కట్టడానికి ఉపయోగించే గడ్డితో నేలంతా నిండి ఉంది. రసాయనిక పదార్థాలు కరిగించే కొలిమిగుండా మంచును చీల్చుకొని మసక మసకగా వెలుతురు లోపల ప్రవేశిస్తున్నది. ఆ మందిరానికి మరో ప్రక్క మెట్లవరస ఉంది. వాటిమీద ఎర్రనిగుడ్డ పరచి ఉంది. ఆ మెట్లు మరొక ద్వారం దగ్గరికి తీసుకోపోతాయి. ఈ ద్వారం నుంచే అట్టర్సన్ డాక్టరు జెకిల్ మందిరంలో ప్రవేశించాడు. ప్రవేశించిన ఆ క్షణమే డాక్టరు జెకిల్ అత్యాప్యాయతతో అతడికి స్వాగతం చెప్పాడు. ఈ గది మిక్కిలి విశాలమైంది. ఈ గదిచుట్టూ గాజుఫలకాలు అమర్చబడి ఉన్నాయి. ఇందులో బల్లలు మొదలైన సామగ్రి విశేషంగా కనిపిస్తుంది. పెరటివైపునకున్న ఇనప ఊచల కిటికీలు మూడూ దుమ్ముపట్టి కన్పిస్తున్నాయి. ధావనిలో అగ్ని మండుతూ ఉంది. పొగమంచే దట్టంగా ఇంట్లోకి కూడా వచ్చి పడుతున్నది. పొగ గూటి అరలో దీపం ఒకటి వెలిగించి ఉంది. అగ్నిధావనికి ప్రక్కనే డాక్టరు జెకిల్ వెచ్చదనం కోసం కూర్చున్నాడు. అతడు చూడటానికి చాలా జబ్బుపడ్డట్లుగా కన్పిస్తున్నాడు. అతిథిగా తన ఇంటికి వచ్చిన

అట్టర్సన్‌ను ఆహ్వానించేటప్పుడు కూర్చున్న చోటినుంచి లేవటానికి కూడా శక్తి లేని స్థితిలో ఉన్నందువల్ల లేవకుండానే చల్లని హస్తాన్ని చాచి ఆహ్వానించాడు. ఆహ్వానవాక్యాలు చెప్పేటప్పుడు అతని గొంతుకలో ఎంతో మార్పు కూడా కన్పించింది.

పూల్ వెళ్ళగానే అట్టర్సన్ "మీరు విషయమంతా విన్నారా?" అన్నాడు.

జెకిల్ ఒకమాటు హఠాత్తుగా గతుక్కుమన్నాడు. "అవును. చత్వరంలో పెద్దగా చెప్పుకొంటుంటే నేను భోజనశాల నుంచి విన్నాను" అని డాక్టర్ జెకిల్ సమాధానం చెప్పాడు.

న్యాయవాది ప్రస్తావిస్తూ అన్నాడు : "ఒకమాట, 'క్యారూ' నాకు ఖాతాదారు మీరు కూడా అంతే. ఈ వ్యవహారంలో నేను ఏం చెయ్యబోతున్నానో ముందుగా తెలుసుకోవాలి గదా! ఆ దుష్టుణ్ణి దాచిపెట్టాలన్నంత వెర్రితనం మీకు లేదని నేను భావిస్తున్నాను."

"అట్టర్సన్! భగవత్సాక్షిగా చెపుతున్నాను వాణ్ణి నేను మళ్ళీ చూడను. నా గౌరవంమీద ప్రమాణం చేసి చెపుతున్నాను. వాడికీ, నాకూ ఈ ప్రపంచంలో ఇక ఎటువంటి సంబంధమూ లేదు. అదంతా ఐపోయింది. నాకు తెలిసినంతగా మీకు వాడిని గురించి తెలియదు. నా సహాయం వాడికి అక్కరలేదు కూడాను. వాడు భద్రంగా ఉన్నాడు. ఈ నా మాటలు మీరు అతిజాగరూకతతో గమనించండి. ఇక వాడి విషయం మీ చెవినబడదు" అన్నాడు డాక్టర్.

వ్యాకులపాటుతో న్యాయవాది ఇదంతా వింటున్నాడు. తన మిత్రుడు ఇంతటి ఉద్వేగంతో సంభాషించటం ఏమీ తృప్తిగా లేదు. "మీకు వాడి విషయం స్పష్టంగా తెలుసునన్నమాట! మీరు చేసినదంతా మీ దృష్టికి సబబుగానే ఉండవచ్చు. ప్రస్తుత విషయం విచారణకు వస్తే మీ పేరు కూడా బయటికి రావచ్చు" అన్నాడతడు.

అందుకు డాక్టర్ జెకిల్ ఇలా సమాధానం చెప్పాడు : "వాడి విషయం నాకు స్పష్టంగా తెలుసు. ఈ విషయంలో ఇతరులందరికంటే ఇంత ధైర్యంగా చెప్పటానికి తగిన ఆధారాలు నాకెన్నో ఉన్నవి. కానీ ఒక్క విషయంలో మీరు నాకు సలహా ఇవ్వవలసి ఉంది. నాకొక లేఖ వచ్చింది. ప్రస్తుతం అది నా దగ్గరనే ఉంది. అది నేను పోలీసుశాఖవారికి చూపవచ్చునో లేదో నాకు అర్థం కావటం లేదు. అట్టర్సన్! నేను దాన్ని మీ చేతిలో పెడుతున్నాను. మీరు విశేషప్రజ్ఞావంతులు బాగా ఆలోచించి నిర్ణయించగలరు. అంతే కాదు, మీరంటే నాకు గాఢవిశ్వాసం కూడాను."

వెంటనే న్యాయవాది “ఈ లేఖవల్ల వాడు పట్టుబడిపోతాడని మీకేమైనా భయముందా?” అని ప్రశ్నించాడు.

“లేదు. హైడ్ గతి ఏమౌతుందనే విషయంలో నాకు అణుమాత్రమైనా శ్రద్ధ లేదు. వాణ్ణి నేను సంపూర్ణంగా వదిలేశాను. ఈ అసహ్యమైన వ్యవహారంలో పేరు బయటపడి నా ప్రతిష్ఠకు ఏ భంగం కలుగుతుందో అనే ఆలోచిస్తున్నాను అన్నాడు డాక్టర్ జెకిల్.

అట్టర్సన్ కొంతసేపు ఏదో ఆలోచించాడు. తన మిత్రుని స్వార్థపరత్వం అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా దానివల్ల అతడికి ఒకింత ఉపశాంతి కూడా చేకూరింది. “మంచిది. నన్నొకమారు ఆ ఉత్తరాన్ని చూడనివ్వండి. అన్నాడు చివరకు.

లేఖలో అక్షరాలు విచిత్రమైన ఖత్తులో నిట్రనిలువుగా నడిచాయి. చివరకు ‘ఎడ్వర్డు హైడ్’ అనే సంతకం కూడా ఉంది. ఈ లేఖను వ్రాసిన వ్యక్తికి డాక్టర్ జెకిల్ అనేక సహస్ర సహాయాలు చేసినట్లూ, అయినా అతడు కృతజ్ఞత లేకుండా ప్రవర్తించినట్టూ, ఈ ఆపదలోనుంచీ తప్పించుకోటానికి గట్టిగా ఆధారపడ్డ ఉపాయాలు ఎన్నో ఉండటం వల్ల ఆయన అతని జీవితానికి కలగనున్న ముప్పును గురించి ఎటువంటి ఆందోళనా పడనవసరం లేనట్లూ, ఉత్తరానికి తాత్పర్యార్థంగా గోచరించింది. న్యాయవాది ఈ ఉత్తరాన్ని చూచి చాలా సంతోషించాడు. ఈ లేఖవల్ల వ్రాసినవ్యక్తికి డాక్టరుతో ఉన్న స్నేహభావతత్త్వం ఎటువంటిదో అతడు ఆశించిన దానికంటే సుస్పష్టంగా అభివ్యక్తమౌతున్నది. పూర్వం పడుతూ వచ్చిన అపోహలకు న్యాయవాది అట్టర్సన్ తన్ను తానే నిందించుకొన్నాడు.

“ఈ లేఖకు సంబంధించిన కవరు కూడా మీ దగ్గరినే ఉంది కదూ?” అని ప్రశ్నించాడు అట్టర్సన్.

“పూర్తిగా విషయాన్ని అవగాహన చేసుకోటానికి పూర్వమే నేను దాన్ని తగులబెట్టాను. అయితే దానిమీద ఏ పోస్టుముద్రా లేదు. ఆ లేఖను ఎవరో తెచ్చి నా చేతికిచ్చి వెళ్ళారు” అని జెకిల్ దానికి సమాధానం చెప్పాడు.

అట్టర్సన్ “అయితే ఈ ఉత్తరాన్ని నా దగ్గర ఉంచుకొని, తలక్రిందపెట్టి నిద్రపొమ్మంటారా?” అన్నాడు.

“ఏం చేస్తే మంచిదో నా కోసం మీరే యోచించి నిర్ణయించండి. నాకు ఆత్మవిశ్వాసం తప్పిపోయింది” అన్నాడు జెకిల్.

"మంచిది. ఆ విషయం నేనే ఆలోచిస్తాను" అన్నాడు న్యాయవాది. అయితే మీ విల్లునామాలో ఉన్న 'అదృశ్యత'కు సంబంధించిన విషయాలను మీకు పాఠం చెప్పి వ్రాయించింది ఆ హైడేనా?" అని న్యాయవాది ప్రశ్నిస్తే, దానికి డాక్టరు మూర్ఛాభ్రాంతిలో మునిగిపోయినట్లైనాడు. తెప్పరిల్లి నోరు గట్టిగా మూసుకొని ఔనన్నట్లు తల ఊపాడు.

"అది నాకు తెలుసు. వాడు మిమ్మల్ని హత్య చెయ్యాలని ఉద్దేశించాడు అయితే మీరు చాలా చక్కగా తప్పించుకొన్నారు."

కొంత ప్రశాంతంగా అన్నాడు డాక్టరు : "అంతే కాదు, ఇంతకంటే ఎంతో విశేషమైన మేలు చేకూరింది. ఓ ప్రభూ, నేను మంచి గుణపాఠం నేర్చుకొన్నాను." ఈ మాటలు చెపుతూ ఉన్నప్పుడు అతడు తన ముఖాన్ని క్షణకాలం చేతుల్తో కప్పుకొన్నాడు.

తిరిగి తన ఇంటికి వెళ్ళిపోయేటప్పుడు న్యాయవాది పూల్‌తో ఒకటిరెండు మాటలు మాట్లాడాడు. "సరేగాని, ఇవాళ ఎవరో ఒక ఉత్తరం అందజేశాడట! అది తెచ్చిన మనిషి ఎలా ఉన్నాడు?" అని ప్రశ్నించాడు. పోస్టు ద్వారా తప్ప ఇతరంగా ఉత్తరాలు ఏమీ రాలేదనీ అవైనా కేవలం ప్రకటనలు మాత్రమే అనీ పూల్ స్పష్టంగా నివేదించాడు.

ఈ వార్తతో మళ్ళీ అనుమానాలు అట్టర్సన్ వెంటపడ్డవి. పరిశోధనాలయద్వారం గుండానే లేఖ వచ్చి ఉంటుంది. ఈ విషయంలో సంశయమేమీ లేదు. బహుశః వెనక ఉన్న గదిలోనే ఈ ఉత్తరం వ్రాయటం కూడా జరిగి ఉంటుంది. ఇది నిజమంటే విషయాన్నంతటినీ మరోరీతిగా పరిశీలించవలసి ఉంటుంది అంతేకాదు అతి జాగరూకతతో కూడా పరిశీలించవలసి ఉంటుంది.

"పార్లమెంటు సభ్యుని ఘోరహత్య ప్రత్యేకసంచిక!!" అని వార్తాపత్రిక లమ్మే కుర్రవాళ్లు అతడు వెళ్ళుతున్న వీథికి ఇరుప్రక్కలా ఉన్న వేదికామార్గాల మీద గొంతు చినిగిపోయేటట్లు కేకలు వేస్తున్నారు. ఈ కేకలన్నీ అట్టర్సన్‌కు అతని ఖాతాదారూ, మిత్రుడూ అయిన ఒక ప్రముఖవ్యక్తి అంత్యక్రియల్లోని ఉపన్యాసాలలాగా వినిపిస్తున్నవి. ఒకవంక ఈ అపకీర్త్యావర్తంలో మరొక మిత్రుని స్వచ్ఛమైన కీర్తిప్రతిష్ఠలు రూపు మాసిపోతున్నట్లు ఎన్నో ఊహలు అతనికి కలుగుతున్నవి. ఆ భయం అతనిలో అతిశయంగా చెలరేగుతున్నది. అతని కేదో ఆశారేఖలు ద్యోతకమయ్యే ఊహలు తడుతున్నవి. అతనిది కేవలం స్వయంగా ఊహించే ప్రకృతి ఆలోచనల విషయంలో అతడు ఎవరిమీదా ఆధారపడేవాడు కాదు. కానీ ఈ విషయంలో మాత్రం అతనికి

ఎవరినైనా సంప్రదించి సలహా పొందాలనే వాంఛ తీవ్రంగా కలిగింది. అయినా దాన్ని సూటిగా పొందటం అతనికి రుచించటం లేదు. ఎలాగైనా ప్రసంగవశాన దాన్ని పొందవచ్చునని అతడు ఊహించాడు.

అనతికాలంలోనే అతడు ఇంటికి చేరాడు, 'అగ్నిధావని' ప్రక్కన ఒకవైపు తానూ మరొకప్రక్క అతని పెద్ద గుమాస్తా మిస్టరు గెస్టు కూర్చున్నారు. ఇరువురికీ మధ్యగా ఒక బల్లమీద ద్రాక్షాసవపు సీసా ఒకటి పెట్టి ఉంది. అది బహుకాలం ఎండతగులని ప్రదేశంలో ఉంచి భావన చేసింది. పొగమంచు గాలిమీద పడి నిద్రపోతూ ఇంకా లండన్ మహానగరాన్ని ముంచేస్తున్నది. వీథుల్లో దీపాలు మసకమసకగా రాచపుండుల్లా మండుతున్నాయి. కంబళ్లు కప్పినట్లుగా క్రిందికి వ్రాలుతున్న మేఘాల ముసుగుక్రింద మహానగరానికి సిరలుధమనులుగా ఉన్న వీథుల్లో జనులు వాత్యారయఝుంకారాలకు చలిస్తూనే రాకపోకలు సాగిస్తున్నారు. కానీ అట్టర్సన్ గది అగ్నిధావనిలోని కాంతులవల్ల ఆనందోన్మత్తంగా ప్రకాశిస్తున్నది. ద్రాక్షారసపు సీసాలో ఉన్న క్షారాలు ఎప్పుడో విరిగిపోయినవి. త్రుప్పుపట్టిన కిటికీ రంగు బాగా పట్టినట్లున్న ఆ సీసామీది ముద్ర కాలం గడవటం వల్ల మెత్తపడిపోయింది. నగరసానువుల్లో ఉన్న ద్రాక్షాసవ ప్రాంతాలలోని శరత్సాయంకాల కాంతులు లండన్ నగరాన్ని ఆవరించిన పొగమంచు తెరలను చెదరగొట్టడానికి దండెత్తి వస్తున్నవి. న్యాయవాది మనస్సు కరిగిపోతున్నది. ఏ అత్యల్పాంశామో తప్ప తన రహస్యాలల్లో అధికభాగాన్ని చెప్పుకోటానికి అట్టర్సన్‌కు మిస్టరు గెస్టు తప్ప మరెవ్వరూ లేరు. అతడికి తెలియనివ్వకుండా ఎన్నో రహస్యాలను అతడు దాచిపెడదామనుకున్నా అతడు దాచిపెట్టలేడు. గెస్టు ఏవేవో వ్యవహారాలమీద డాక్టర్ జెకిల్ దగ్గరికి ఎన్నోమార్లు వెళ్లాడు. పూల్ అతన్ని బాగా ఎరుగుకూడాను. డాక్టర్ జెకిల్ ఇంట్లో హైడ్‌కు అతిపరిచయం ఉన్నదన్న విషయంకూడా అతడికి తెలుసును. ఇటువంటి స్థితిలో మిస్టర్ గెస్టు అగమ్యగోచరంగా ఉన్న ఈ లేఖను చూస్తే మంచిది, కాదా అన్న ఊహ అట్టర్సన్‌కు తోచింది. అదీకాక అతడు చేతివ్రాతను చూడడంలో అధికకృషి చేసినవాడు దొడ్డగా పరామర్శించి నిర్ణయించగలడు. అతడు అట్టర్సన్‌కు కేవలం గుమాస్తా మాత్రమే కాదు బాగా ఆలోచించి మంచి సలహాలను కూడా ఇవ్వగల సమర్థుడు. అతడు ఈ లేఖాపత్రాన్ని తిలకించిన తరువాత ఏదో ఒక అభిప్రాయాన్ని ఇవ్వకుండా ఊరుకొనేవాడు కాదు. అతడు అన్న మాటలను బట్టి అట్టర్సన్ భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకోవచ్చు.

“సర్ డాన్వర్సు విషయంలో చాలా ఘోరమైన సంఘటన జరిగింది” అని న్యాయవాది అట్టర్సన్ అన్నాడు.

“అవునండీ. ఇందుమూలంగా ప్రజలెంతో ఆందోళన పడుతున్నారు కూడాను. హంతకుడు ఏవరోగాని ఉన్మాది ఐ ఉంటాడు” అన్నాడు గెస్టు.

దానిమీద అట్టర్సన్ ఇలా అన్నాడు : “ఈ విషయంలో నాకు నీ అభిప్రాయం కావాలి. వాడు స్వహస్తంతో వ్రాసిన ఉత్తరం ఒకటి నా దగ్గర ఉంది. దానితో ఏం చెయ్యాలో నాకింకా ఏమీ బోధపడలేదు. ఇదంతా చాలారహస్యంగా ఉండాలి  మన ఇద్దరిమధ్యనే ఉండిపోవాలి. ఏమైతేనేం? ఇదంతా ఒక చెత్త వ్యవహారంగా ఉంది. ఇదిగో! ఆ పత్రాన్ని నీ ముందు ఉంచుతున్నాను. ఇది హంతకుడు స్వహస్తంతో వ్రాసిన లేఖ.”

ఆ లేఖను చూడంగానే గెస్టు కళ్ళు కాంతితో విప్పారినవి. అత్యాసక్తితో ఆ లేఖను పరిశీలిస్తూ కూర్చున్నాడు. కొంతగా లేఖను పరికించి అన్నాడు : “ఈ వ్రాత ఉన్మాది వ్రాసింది కాదు  చాలా విచిత్రంగా ఉంది.”

“ఎన్ని రీతుల పరీక్షించినా వ్రాసినవాడు విచిత్రలేఖకుడు గానే తోస్తున్నాడు” అన్నాడు అట్టర్సన్.

ఈ స్థితిలో వారుండగా ఒక చీటీ తీసుకొని సేవకుడొకడు లోపలికి వచ్చాడు.

“అది డాక్టర్ జెకిల్ వద్దనుంచేనా అండీ?” అని ప్రశ్నించాడు గుమాస్తా. “ఆ దస్తూరీ వారిదిగా కనిపించింది లెండి. అందుకోసం అడిగాను. అదేమైనా ఆంతరంగిక వ్యవహారమా?” అన్నాడు గెస్టు.

“కాదు. ఇది కేవలం భోజనానికి రమ్మని పంపిన ఆహ్వానం, చూస్తానంటావా?”

“వీలుంటే క్షణకాలం చూడనివ్వండి” అని క్రొత్తగా సేవకుడు తెచ్చిన చీటీని పుచ్చుకొన్నాడు గెస్టు. వెనుక ఉత్తరాన్నీ, ఈ చీటీనీ ఒకదానిప్రక్క మరొకదాన్ని ఉంచి రెంటి అంశాలను అతితీక్ష్ణంగా పరిశీలించాడు.

“కృతజ్ఞుణ్ణి” అని రెండు లేఖలనూ తిరిగి ఇచ్చి వేస్తూ, “మొదటి లేఖలోని సంతకం చాలా విచిత్రంగా ఉంది” అన్నాడు గెస్టు.

అట్టర్సన్ తనలో తాను మథనపడుతూ కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. తెప్పరిల్లిన తరువాత “గెస్టు! రెంటినీ పోల్చి పరిశీలించావా ఏమిటి?” అని ప్రశ్నించాడు.

"రెంటికీ ఒక విశిష్టమైన పోలిక ఉంది. అనేకవిషయాలలో రెండు లేఖలూ ఒకే ఫక్కీగా నడిచాయి. రెంటికీ తేడా అక్షరాలు మొదటిదాన్లో ఏటవాలు పద్ధతిలో నడవటం కూడా కన్పిస్తున్నది" అన్నాడు గుమాస్తా.

అట్టర్సన్ "ఇది మహావిచిత్రమైన విషయం" అని అన్నాడు.

"మీరన్నట్లు ఇది మహావిచిత్రమైన విషయమే" అని తిరిగి అన్నాడు గెస్టు.

"ఈ లేఖను బయటపెట్టడం నాకెంతమాత్రం ఇష్టంలేదని నీకు తెలుసునా?"

"మీరన్నట్లు ఇది బయటపెట్టకూడనిదే. విషయం అంతా నాకు అర్థమైపోయింది" అని అన్నాడు గుమాస్తా.

అట్టర్సన్‌కు ఏకాంతం లభించగానే, మరుక్షణంలో ఆ లేఖను తన ఇనుపపెట్టెలో పెట్టి భద్రంగా తాళం వేశాడు. అప్పటినుంచీ ఆ లేఖ అందులోనే నిద్రపోతున్నది. "ఏమిటి? హెన్రీ జెకిల్ హంతకుడు వ్రాసినట్లుగా ఒక లేఖను సృష్టించాడా?" అని అనుకొన్నాడు. ఈ ఊహ కలగ్గానే అతని సర్వనాళాల్లో రక్తం ఒక్కమాటుగా చల్లబడ్డది.

# 6. డాక్టర్ లాన్యన్ విచిత్రోదంతం

కాలం గడిచిపోతున్నది. సర్ డాన్వర్స్ మృతి ఒక ప్రజోపద్రవంగా భావింపబడటం వల్ల హంతకుణ్ణి పట్టి ఇచ్చినవాళ్ళకు వేయి పౌనుల ద్రవ్యం పారితోషికమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సజీవుడై ఉండి జనుల్లో కలిసి పోయాడా అన్నంత ఆశ్చర్యకరంగా పోలీసువారి దూరదర్శన దృష్టినుంచి హైడ్ అదృశ్యుడైనాడు. అతని పూర్వజీవితవిశేషాలను గురించి విశేషమైన దర్యాప్తు జరిగింది. అవన్నీ అప్రతిష్ఠాకరాలు. అతన్నిగురించి తెలియవచ్చిన ప్రతి కథా ఒక ఘాతుకకృత్యాన్నో, లేదా క్రౌర్యాన్నో వెల్లడించింది. ప్రతి కథా అతని క్రూర స్వేచ్ఛాసంచారాన్నీ, మర్యాదావిచ్ఛేదనాసక్తినీ ద్యోతకం చేసింది. వీటివల్ల అతని విచిత్రమైన సహచరులు ఎందరో బయటపడ్డారు. వారి మాత్సర్యప్రవృత్తి అద్భుతకరమై అభివ్యక్తమైంది. అయితే అతని ప్రస్తుతసంచారాలను గురించి గుసగుసగా కూడా ఇంతైనా వినిపించలేదు. హత్యచేసిననాడు అతడు ఉదయం తన సాహో ప్రాంతంలోని ఇంట్లోనుంచీ వెళ్ళిపోయింది మొదలు తుడిచిపెట్టుకో పోయినాడు.

కాలం గడిచినకొద్దీ అతడు పడే వేదనలోని వేడి తగ్గింది. అతడి మనస్సు ప్రశాంతి వహించి ప్రసన్నమైంది. హైడ్ ఇలా రూపు మాసిపోయి సర్ డాన్వర్స్‌ను హత్య చేసినందుకు అధికశిక్షనే అనుభవించాడని అట్టర్సన్‌కు తోచింది. అతని దుష్టప్రభావం తొలగిపోయింది గనుక డాక్టర్ జెకిల్ జీవితంలో ఇక నూతనప్రకరణం ప్రారంభమైంది. ఇన్నాళ్ళబట్టి అతడు అనుసరిస్తున్న ఏకాంతాన్ని వదిలిపెట్టి బయటికి వచ్చాడు. పూర్వ స్నేహితులందరితో మైత్రిని పునరుజ్జీవం చేసుకొన్నాడు. మళ్ళీ ఒక్క మారు తాను వారికి అతిపరిచితుడై అతిథి ఐనాడు. అతిథులను తన ఇంటికి ఆహ్వానించి సత్కారాలతో అనందప్రదానం చేసే ఆతిథేయి ఐనాడు, అతడు ఇతఃపూర్వం దానధర్మాలకు విశేషవిఖ్యాతి గన్నవాడు. ఈనాడు అలాగే మతపిపాసువై తత్తుల్యమైన విశిష్టతను ఆర్జించుకొంటున్నాడు. ఎల్లవేళలా ఏవో కార్యకలాపాలల్లో నిమగ్నుడౌతూ ఆదాన ప్రదానాలతో అందరిలో కలిసిమెలిసి తిరుగుతూ సత్కార్యాలను సాధిస్తున్నాడు. అతని ఆంతరచైతన్యం సేవాసక్తమైందా అన్నట్లు ముఖంలో ఎప్పుడూ చూచినా తేజస్సు

ఉట్టిపడుతూ కన్పిస్తున్నది. డాక్టర్ జెకిల్ ఇలా ఒక మాసద్వయానికి పైగా మహాశాంతిని అనుభవించాడు.

జనవరి 8వ తారీఖున డాక్టర్ జెకిల్ కొంతమంది మిత్రులకు తన ఇంట్లో విందు చేశాడు. అందులో అట్టర్సన్ పాల్గొన్నాడు  దానికి డాక్టర్ లాన్యన్ కూడా విచ్చేశాడు. ఈ మిత్రత్రయం వెనుక ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంతటి సన్నిహితంగా మెలిగారు. ఈ విందు సందర్భంలో డాక్టర్ జెకిల్ వెనుకటి అనుబంధాన్ని స్ఫురింపజేసే స్నేహసద్భావాలతోటే మిత్రులిద్దరినీ చూచాడు. అయితే న్యాయవాది అట్టర్సన్ ఆ నెల 12, 14 తేదీలలో డాక్టర్ జెకిల్ ఇంటికెళ్ళితే ప్రవేశించటానికి వీల్లేకుండా తలుపు మూసిఉంది.

"డాక్టరు బయటికి ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంట్లోనే ఉన్నాడు. కానీ ఎవరికీ దర్శన మివ్వటంలేదు" అని పూల్ నివేదించాడు. అయితే అట్టర్సన్ తిరిగీ 15వ తేదీన మిత్రుని చూడటం కోసం అతని భవనానికి వెళ్లాడు. లోపలికి ప్రవేశించటం కోసం యత్నించాడు  తిరస్కృతుడైనాడు. గడచిన రెండు మాసాలలో నిత్యం మిత్రుని చూడటం అతనికి అలవాటైపోయింది. అందువల్ల క్రొత్తగా కలిగిన ఏకాంతం అతని మనస్సుకు భారమనిపిస్తున్నది నాలుగు దినాలు ఎలాగో గడిచాయి. అయిదో నాటి రాత్రి గెస్టును తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. ఆరోనాడు తాను డాక్టరు లాన్యన్ ఇంటికి వెళ్ళాడు.

అయితే అతడు అక్కడమాత్రం తిరస్కృతుడు కాలేదు. లోపలికి ప్రవేశించటంతోటే డాక్టరు  ముఖంలో వ్యక్తమయ్యే మార్పును చూచి నిర్ఘాంతపొయ్యాడు. అతని కండలన్నీ కరిగిపోయి కనిపిస్తున్నాయి. మృత్యువు పంపిన ఆహ్వానం అందిన లక్షణాలు అతనిముఖంలో ద్యోతకమౌతున్నవి. నిగనిగలాడుతూ ఉండే మనిషి ఇప్పుడు ఎందుకో పాలిపోయాడు. అతని బట్టతల, వృద్ధాప్యం బయటపడిపోతున్నవి. అయినా అట్టర్సన్‌ను నిర్ఘాంత పెట్టింది అతని శరీరకార్శ్యం కాదు  అవి అతనియందు స్థిరస్థానాన్ని ఏర్పరుచుకొన్న మానసికభీతిని వెల్లడించే కంటిచూపు, ప్రవర్తనరీతులు. డాక్టరుకు మరణభయం ఉండటం అసహజం  అయినా అటువంటి భయం అతన్ని పట్టుకొన్నదని అట్టర్సన్ అనుమానించకుండా ఉండలేకపోయాడు. "అవును. అతడు వైద్యుడు. కనుకనే తన స్థితి ఎలా వుంటుందో అతడు తెలుసుకొని ఉంటాడు. తనకు గడువు దగ్గిరికి వచ్చి ఉంటుంది. మరణసంబంధమైన జ్ఞానం వల్ల కలిగిన భీతిభారం అతడి భారవహనశక్తిని మించిపోయింది" అని అతడు భావించాడు. ఆయన జబ్బుచూపును

గురించి వ్యాఖ్యానిస్తూ "నేను మరణం ఆసన్నమైన వ్యక్తిని" అని అతడు దృఢవిశ్వాసంతో ప్రకటిస్తున్నట్లు చూస్తూన్నాడన్నాడు అట్టర్సన్.

"నాకు గొప్ప మనోవైకల్యం కలిగింది. ఇక కోలుకోవటమంటూ కల్ల! నా జీవితం ఇక వారాలల్లోకి వచ్చింది. మంచిది. జీవితాన్ని ఇంతవరకూ మహానందంతో గడిపాను. నాకు బ్రతుకుమీద అధికాసక్తి ఉండేది ఆ కారణంవల్లనే నేను బ్రతుకును ప్రేమించాను. మనకు పరిపూర్ణ విజ్ఞానవమే ఉంటే ఈ లోకంలోనుంచి వెళ్ళిపోవటానికే ఆసక్తిచూపుతామని నేను అప్పుడప్పుడూ అనుకొంటుంటాను" అన్నాడు డాక్టర్ లాన్యన్.

"జెకిల్ కూడా చాలా జబ్బుగా ఉన్నాడు మీరు చూచి వచ్చారా?" అని ప్రశ్నించాడు అట్టర్సన్.

ఈ ప్రశ్నకు లాన్యన్ ముఖం మారిపోయింది. వణికిపోతూ ఉన్న చేతిని పైకెత్తి అన్నాడు : " నేను డాక్టర్ జెకిల్‌ను చూడదలుచుకోలేదు సరిగదా, అతన్ని గురించి విననుకూడా తలచుకోలేదు. వాడితో నా ప్రాణం విసిగిపోయింది. చచ్చినవాళ్ళలో జమకట్టాను. వాడి ప్రస్తావన తీసుకు రావొద్దని కోరుతున్నందుకు నన్ను క్షమించండి."

'ఛీ, ఛీ!' అన్నాడు అట్టర్సన్. తరువాత గమనార్హమైన కొంతకాలం ఆగి "లాన్యన్! నేను నీకు చేయగల సాయమేదీ లేదా?" అని ప్రశ్నించాడు. "మనం ముగ్గురం బహుకాలస్నేహితులం. ఇక మన జీవితంలో క్రొత్తమిత్రులను ఎన్నుకుండేది లేనే లేదు" అన్నాడు అట్టర్సన్.

"నాకు మీరు చేయగలిగిందంటూ ఏమీలేదు. ఏమన్నా ఉందేమో వెళ్లి అతన్ని అడగండి" అన్నాడు లాన్యన్.

"అతడు నాకు చూడటానికే అవకాశం ఇవ్వటం లేదు" అన్నాడు న్యాయవాది.

"అతడు చేసిన ఈ పనికి నాకేమీ ఆశ్చర్యం కలగటం లేదు. అట్టర్సన్! నా మరణానంతరం ఏదో ఒకనాడు ఈ విషయంలో ఉన్న మంచిచెడ్డలన్నీ మీకు తెలియవచ్చు. కానీ నేను మీకు ముఖతః వినిపించలేను. ప్రస్తుతం నాతో ఇతరవిషయాలేమైనా ఉంటే కూర్చోని మాట్లాడండి. తప్పక మాట్లాడండి. బాబో! చాలు, చాలు, దేవతలకు వేయి దణ్ణాలు. మీరు ఈ పాపిష్ఠిప్రసంగం తీసుకోరాకుండా ఊరుకోలేనంటారా, వెళ్ళిపొండి దాన్ని నేను భరించలేను!" అని అన్నాడు లాన్యన్.

ఇంటికి వెళ్ళగానే అట్టర్సన్ తాను ఇంటికి వస్తే కనిపించకుండా నిరాకరించటాన్ని నిందిస్తూను, డాక్టరు లాన్యన్‌తో దుఃఖకరంగా మైత్రిని విచ్ఛేదం చేసుకోటానికి కారణం తెలియజేయవలసిందని కోరుతూను జెకిల్‌కు ఒక లేఖ వ్రాశాడు.

మరునాడే సమాధానం వచ్చింది. ఆ లేఖలోని ధోరణి కొన్నిచోట్ల విషాదపూరితంగానూ, కొన్నిచోట్ల తమోవృతమై అగాధంగానూ ఉంది. "నేను మన మిత్రుణ్ణి నిందించటం లేదు. ఇక జీవితకాలంలో వేము ఇరువురమూ కలుసుకోకూడదన్న అతడి అభిప్రాయంతో నేను పూర్ణంగా ఏకీభవిస్తున్నాను. ఇకనుంచీ నేను ఎవరికంటా పడకుండా పరిపూర్ణంగా ఏకాంతవాసం చేస్తాను. నా ద్వారం మీకు కూడా ఎల్లవేళలా మూసిఉంటే మీరేమీ అనుకోవద్దు. మన మిత్రత్వాన్ని శంకించవద్దు. ఒక ఘోరశిక్షను, ఆపదను నా నెత్తిమీదికి నేనే తెచ్చిపెట్టుకొన్నాను. పాపుల్లో నేనెలా ప్రథముడినైనానో, అలాగే బాధావ్యథితహృదయుల్లో కూడా అగ్రగామినైనాను. వర్ణనాతీతాలైన ఇటువంటి బాధలకు గాని, భయాలకు గానీ భూమి మీద తావుంటుందని నేను ఎన్నడూ ఊహించలేపోయాను. కానీ అట్టర్సన్! దుర్విధివల్ల కలుగుతున్న నా ఈ బాధలను తగ్గించు!" అని ఆ లేఖలో ఉన్నది.

అట్టర్సన్ లేఖ చూసుకుని ఆశ్చర్యపోయాడు. హైడ్ దుష్ప్రభావం తొలగిపోయింది డాక్టరు తన పూర్వప్రవృత్తికి వచ్చాడు వారంలో రోజుల క్రితమే అతడు మళ్ళా మహోత్సాహంతో జీవితాన్ని వెళ్ళబుచ్చగలడనే ఆశారేఖలు ఉదయించాయి. కానీ క్షణకాలంలో అతని మైత్రి, మానసికశాంతి, జీవనవింతధోరణి సమస్తం భగ్నమైనాయి. హఠాత్తుగా అతనిలో ఇంతటి మార్పు రావటాన్ని చూస్తే అతని మనస్సు ఏదో చెడిపోయినట్లు తోస్తున్నది. లాన్యన్ ప్రవర్తననూ, సంభాషణ ధోరణినీ గమనిస్తే, డాక్టర్ జెకిల్ జీవితంలో అర్థంగాని మహామర్మం ఇంకా ఏదో ఉండితీరాలి అనిపిస్తున్నది.

మంచమెక్కిన వారందినాలకు డాక్టర్ లాన్యన్ మరణించాడు. అతని అంత్యక్రియలు పూర్తయిన మరునాటి రాత్రి అట్టర్సన్ తన కార్యాలయకక్ష్యలో తలుపు బిగించి, తాళం వేసి, విషాదజ్యోతులు విరజిమ్మే ఒక కొవ్వొత్తి ముందు కూర్చొని తన మిత్రుడు స్వహస్తంతో వ్రాసి కవరులో పెట్టి సీలుచేసిన ఉత్తరాన్ని బయటికి తీశాడు. "ఆంతరంగికం – కేవలం జి.జె. అట్టర్సన్ చేతికే అందించాలి. అతడు నాకంటె ముందుగానే మరణిస్తే చదవకుండా కాల్చివేయాలి" అని, విస్పష్టంగా ఆ లేఖ ఉన్న కవరుమీద వ్రాసి ఉంది. ఉత్తరాన్ని విప్పితే అందులో ఉన్న ఎటువంటి అంశాలను తెలుసుకోవలసి ఉంటుందో అని న్యాయవాది భయభావంతో కంపించిపోతున్నాడు.

“ఇవాళే ఒక మిత్రుడి అంత్యక్రియలు పూర్తిచేయించి వచ్చాను  ఈ ఉత్తరం మరొక మిత్రుని కూడా పోగొడుతుందేమో!” అని అతడు భావించాడు. లాన్యన్ ఎడ మిత్రద్రోహంగా కనిపించే ఈ భయాన్ని చంపుకొని అతడు సీలు విప్పదీశాడు. పై కవరు లోపల మరొక కవరు ఉంది. అది కూడా పైదానిలాగానే భద్రంగా సీలు చేసి ఉంది. దానిమీద “డాక్టర్ హెన్రీ జెకిల్ మరణించటమో, లేక అదృశ్యం కావటమే జరక్క పూర్వం తెరవరాదు” అని వ్రాసి ఉంది. అట్టర్సన్ తన కళ్ళను తానే నమ్మలేకపోయినాడు. అదృశ్యుడు కావటమే! వ్రాసిన వ్యక్తికి తాను తిరిగి ఇచ్చివేసిన ఇచ్ఛాపత్రంలో కూడా ఇలాగే ‘అదృశ్యు’డన్న పదం ప్రయుక్తమై ఉంది. అందులో ఆ పదం బహుశః ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని సాధించటంకోసం స్పష్టంగానూ, ఘోరంగాను బయటపడిపోతూ ఉన్న హైడ్ కుత్సితపు సలహాలవల్ల చేరి ఉండవచ్చును  ఇలా అనుకుందామా అంటే ఈ లేఖలో కూడా ‘డాక్టర్ జెకిల్ అదృశ్యుడు కావటం’ అన్నభావం తిరిగి కనిపిస్తున్నది. ఈ లేఖ లాన్యన్ స్వహస్తంతో వ్రాసింది. దీని అభిప్రాయం ఏమిటి? ‘జెకిల్ మరణాంతరం లేదా అదృశ్యుడైన తరువాతనే చూడాలని అన్న లేఖమీది నిషేధాన్ని గౌరవించకుండానే, ఈ మర్మతంత్ర మంతటికీ మూలం ఏదో లోతుకు పోయి తెలుసుకోవాలన్న కుతూహలం లేఖకు ధర్మాధికారి అయిన అట్టర్సన్‌కు కలిగింది. కానీ తన వృత్తినీతి, మర్యాద, మిత్రద్రోహం అనేవి రెండూ అతని త్రోసివేయజాలని ప్రతిబంధకాలైనవి. అందువల్ల అట్టర్సన్ తన ఆంతరంగికలోహపేటికలలో ఒక మారుమూలన ఆ లేఖను భద్రపరచటం వల్ల అది కొంతకాలం నిద్రపోవలసి వచ్చింది.

రహస్యాన్ని తెలుసుకోవాలె నన్న కుతూహలాన్ని అణగద్రొక్కటం ఒక విషయం దాన్ని సంపూర్ణంగా జయించటం మరో విషయం. లాన్యన్ మరణానంతరం తనకు మిగిలిన ఒక మిత్రుడైన జెకిల్‌ను కలుసుకోవాలని వెనకటంత గాఢంగా ఇప్పుడు అట్టర్సన్ వాంఛిస్తున్నాడా అన్నంత అనుమానం కలుగుతున్నది. అయితే ఆ మిత్రుణ్ణి గురించి కరుణాన్వితమైన ఊహలే సాగిస్తున్నాడు. అతడి ఆలోచనలు కల్లోలితాలుగానూ, భయాన్వితాలుగానూ నడుస్తున్నవి. అయినా ఒకమారు మిత్రుణ్ణి చూచివద్దామని అతడి భవనానికి వెళ్ళాడు. ప్రవేశం తిరస్కృతమైంది. అందువల్ల అతడికి బాధ కలక్కపోగా ఒకవిధమైన హాయి కూడా చేకూరింది. ఆ గృహంలో ప్రవేశించి ఐచ్ఛిక బానిసత్వాన్ని అనుభవిస్తున్న అగమ్యగోచరునితో ప్రక్కన కూర్చొని సంభాషించే దానికంటే బహుశః అట్టర్సన్ స్వేచ్ఛాసంచారం గల నగర వాతావరణం మధ్య, సమస్తశబ్దాలనూ వినగలుగుతూ ఉండేచోట, జెకిల్ ఇంటిగుమ్మం ముందు మెట్లమీద, పూల్‌తో

సంభాషించటమే విశేషంగా వాంఛించి ఉంటాడు. అయితే పాపం పూల్‌కు, అతడికి నివేదింపదగ్గ సంతోషకరమైన వార్తలంటూ ఏమీ ఉండటం లేదు. డాక్టర్ జెకిల్ నిరంతరం పరిశోధనమందిరానికి అవతల ఉన్న కక్ష్యలోనే ఉంటున్నాడు. తరచుగా అతడు అక్కడనే నిద్రిస్తున్నాడు కూడాను. అతడు తాను తానుగా లేదు ఖుషీ నశించింది. విశేషంగా మౌనముద్ర ధరించి ఉంటున్నాడు. గ్రంథపఠనం చెయ్యటం లేదు. అతని మనస్సును ఏదో తీవ్రంగా కలతపెట్టుతున్నట్లు కనిపిస్తున్నది. అతన్ని గురించి వస్తున్న వార్తల్లో ఎట్టి మార్పూ కన్పించకపోవటంతో, అట్టర్సన్ అలవాటు పడ్డాడు. తరచుగా జెకిల్ ఇంటికి ప్రయాణాలు చేస్తూ ఉండటం కూడా తగ్గించాడు.

# 7. వాతాయనం దగ్గరి విశేషం

అట్టర్సన్ యథాప్రకారంగా ఎన్ఫీల్డుతో వాహ్యాళికి వెళ్ళి వస్తూ ఉండగా, ఒక ఆదివారం నాడు వారు వెనుకటి ఉపవీథిని మరొకమాటు ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. ఆ భవనం ద్వారబంధం దగ్గిరికి రాగానే దాన్ని పరికించటానికి ఇద్దరూ ఆగారు.

"మంచిది. ఆ గాథసర్వం సమాప్తమైనట్లే ఇక హైడ్ మన కంటపడట మంటూ ఉండదు కదా!" అన్నాడు ఎన్ఫీల్డు.

"ఉండదనే అనుకుంటాను. నేను అతడిని ఒకమాటు చూచాననీ, నీవు అసహ్యించుకొన్నట్లే నేనూ అసహ్యించుకొన్నాననీ నీకు నేనెప్పుడైనా చెప్పానా?" అని అట్టర్సన్ అడిగాడు.

"అతడిని చూడటమంటూ జరిగితే అసహ్యభావం కలగకపోవటమంటూ ఉండదు. రెంటినీ విడదీయటం అసంభవం. ఆ విషయం అలా ఉంచండి. ఇది డాక్టర్ జెకిల్ దొడ్డిగుమ్మం కదండీ! అరె! ఇది నేను గాడిదలాగా తెలుసుకోలేకపోయానే! దీన్ని తెలుసుకోవటం కూడా కొంతవరకూ మీ లోపంవల్లనే జరిగింది" అన్నాడు ఎన్ఫీల్డ్.

"అయితే నీవు తెలుసుకొన్నావన్నమాట! కనక మనం పెరట్లోనుంచి వెళ్ళి ఒకమాటు కిటికీలవంక చూచివద్దాం పద. నీకు నిజం చెపుతున్నాను. నేను జెకిల్ విషయంలో ఏం చెయ్యాలో తోచక చాలా ఆందోళనపడుతున్నాను. బయట ఉన్నప్పటికీ మిత్రులు కనబడితే అతనికి కొంత తృప్తి చేకూరుతుందని నా నమ్మకం."

పెరడు చాలా తేమగానూ, చల్లగానూ ఉంది. నెత్తిమీద సూటిగా ఆకాశాన ఇంకా అస్తమించే సూర్యుని కాంతులు ప్రకాశిస్తున్నా పెరట్లో ముందుగానే చీకటి ఆవరించింది. మూడు కిటికీలలో మధ్యది సగంగా తెరిచిఉంది. దాని ప్రక్కనే కూర్చొని

దుఃఖాక్రాంతుడై, నిరాశాపూరితుడైన ఖైదీలా అతిభారంగా గాలిని పీలుస్తూ ఉన్న జెకిల్‌ను అట్టర్సన్ చూచాడు.

"ఏమయ్యా జెకిల్! ఇప్పుడు మీకు కొంత కులాసా చిక్కిందనుకొంటాను" అన్నాడు క్రిందినుంచి అట్టర్సన్.

"ఎందుకో నేను క్రుంగిపోతున్నాను  బాగా క్రుంగిపోతున్నాను. దేవుడికి దయరాలేదు. ఇంకా ఎంతో కాలం ఇలా గడవదు."

"ఇల్లు వదలకుండా ఇలా బంధించుకొని ఉండటం మీకు ఎక్కువై పోతున్నది. నేనూ, ఎన్ఫీల్డూ ఎలా షికార్లు కొడుతున్నామో చూడండి. ఒంట్లో రక్తప్రసారాన్ని కొట్టి మేల్కొల్పాలి. ఇతడు మా జ్ఞాతి, ఎన్ఫీల్డు – డాక్టర్ జెకిల్ – బయటికి రండి. టోపీ ధరించండి. మాతోపాటు ఒక్కమాటు తిరిగి వచ్చేద్దురుగాని రండి" అన్నాడు న్యాయవాది.

జెకిల్ అన్నాడు : "మీరన్నది ఎంతో బాగున్నది. అలా చేయటమంటే నాకెంతో ఇష్టంగూడాను. కానీ కుదరదు  కుదరదు. అది నాకు అసాధ్యమైనపని. నాకు ధైర్యం చాలటం లేదు. కానీ, అట్టర్సన్! మిమ్మల్ని చూడగలిగినందుకు నేనెంతో సంతోషి స్తున్నాను. ఇది, నిజం చెపుతున్నాను, నాకెంతో మహానందంగా ఉంది. మిమ్మల్నీ, ఎన్ఫీల్డునూ పైకి ఆహ్వానించేవాణ్ణే. కానీ ఈ ప్రదేశం ఏమీ యోగ్యంగా లేదు.

"అయితే శ్రమపడకండి. మేము క్రిందనే ఉండి ఇక్కడినుంచే మీతో మాట్లాడటం మంచిదన్నమాట!" అని అట్టర్సన్ తన సుస్వభావాన్ని వ్యక్తీకరిస్తూ అన్నాడు.

"నేనూ ఈ విధంగానే చెయ్యవలసిందని సూచించటానికి సాహసించ బోతున్నాను" అన్నాడు చిరునవ్వుతో డాక్టర్. కానీ అతని మాటలు ముగియకముందే ముఖంలోని చిరునవ్వును త్రోసిరాజని క్రింద నిలుచొని చూస్తున్న ఇద్దరు పెద్దమనుష్యుల రక్తం చల్లబడేటట్లు గాఢభయనిరాశాభావాలు ఆవరించాయి. ఇటువంటి స్థితిలో ఉన్న జెకిల్‌ను వారు క్షణకాలం మాత్రమే చూడగలిగారు. అతడు ఆ భావాలు కలిగిన మరుక్షణంలోనే కిటికీలు మూసివేయటం ఇందుకు కారణం. కానీ ఆ క్షణకాలదృశ్యం చాలు! ఒక్కమాటైనా మాట్లాడకుండా వారు పెరట్లోనుంచీ బయటికి వచ్చేశారు. మౌనంగానే ఆ ఉపవీథిలో పయనించారు. ఆదివారమైనా మంచి జనసమ్మర్దం ఉండే రాజమార్గానికి వచ్చిన తరువాత, అట్టర్సన్ వెనక్కు తిరిగి తన సహచరుణ్ణి ఎన్ఫీల్డును

చూచాడు. ఇరువురి ముఖాలూ తెలతెలబోతున్నవి. వారి కన్నుల్లో అందుకు కారణభూతమైన భయం కనిపిస్తూనే ఉంది.

"భగవంతుడు మనలను రక్షించుగాక! భగవంతుడు మనలను రక్షించుగాక!!" అన్నాడు అట్టర్సన్.

ఎన్ఫీల్డు తీవ్రంగా తలపంకించి ఊపాడు మళ్ళీ మౌనంగా నడక సాగించాడు.

# 8. తుది రాత్రి

ఒకనాటి సాయంకాలం భోజనం చేసి అట్టర్సన్ అగ్నిధావని ప్రక్కన కూర్చున్నప్పుడు అక్కడికి వచ్చిన పూల్‌ను చూచి, ఆశ్చర్యపోయాడు.

"ఏ పూల్, ఏదో పనిమీద వచ్చినట్లున్నావు?" అని భయంతో కేక పెట్టినట్లు అడిగాడు. మళ్లా మరొక్కమాటు అతన్ని చూచి, "నీవేదో బాధపడుతున్నట్లుగా ఉన్నావు? డాక్టరుకు జబ్బుగా ఉందా?" అని ప్రశ్నించాడు.

"అట్టర్సన్ బాబూ! ఏదో ప్రమాదం సంభవించింది!"

"రా, కూర్చో. ఒక చషకం ద్రాక్షాసవాన్ని పుచ్చుకో. తొందరేమీ లేదు. స్తిమితపడు. నీకేం కావాలో నెమ్మదిగా చెప్పు" అన్నాడు న్యాయవాది.

పూల్ ఇలా అన్నాడు : "డాక్టరుగారి ప్రవర్తన మీకేమీ తెలియనిది కాదు. ఆయన ఎలా తలుపులు బిగించుకొని ఇంట్లో కూర్చుంటున్నదీ మీకు తెలిసిన విషయమే. ఆయన ఇప్పుడు మా ఇంట్లో తలుపులు బిగించుకొని కూర్చున్నాడు. ఎందువల్లనో నేను దాన్ని భరించలేకపోతున్నాను. అయ్యా! అట్టర్సన్ బాబూ! దాన్ని భరించటమంటే నాకు ప్రాణాలు పొయ్యేటట్లుగా ఉంది. నాకేమిటో వెర్రి భయం వేస్తున్నది"

"ఎందుకలా బెదిరిపోతున్నావు? స్పష్టంగా చెప్పు. నీకు భయం దేన్నిగురించి?" అన్నాడు న్యాయవాది.

"వారం దినాలనుంచీ నేను భయపడి పోతున్నాను. దీన్ని భరించలేను!" అని న్యాయవాది అడిగిన ప్రశ్నను వినిపించుకోకుడానే సమాధానం చెప్పాడు పూల్.

అతని ప్రవర్తనరీతి కూడా అతని మాటలకు అనుగుణంగానే ఉంది. అది క్రమంగా మరింత అధ్వానం ఔతున్నది. మొట్టమొదటిసారిగా అతడు తన భయాన్ని గురించి నివేదించేటప్పుడు తప్ప, అతడు న్యాయవాదిముఖాన్ని కూడా తల ఎత్తి చూడలేదు. అతడు చూపును గదిలో ఒక మూలమీద నిలిపి మాట్లాడుతున్నాడు. "నేను దీన్ని మరింతకాలం భరించలేను" అన్నాడు న్యాయవాది.

పూల్ బొంగురుగొంతుతో "ఏదో ఘోరం జరిగిందనే నమ్మకం" అని అన్నాడు.

"ఘోరమా!" భయకంపితుడై "ఘోరం" అంటే నీ అభిప్రాయమేమిటి?" అని చీకాకుతో అడిగాడు అట్టర్సన్.

"నాకు ఏమీ చెప్పటానికీ నోరాడటం లేదండీ! మీరు ఒక్కసారి నా వెంటవచ్చి స్వయంగా చూడగలరా?"

ఇక దానికి అట్టర్సన్‌కు మరో సమాధానమేముంది? వెంటనే లేచి టోపీ ధరించాడు. పెద్దకోటు వేసుకున్నాడు. ఆ దృశ్యాన్ని చూస్తున్న బట్లరు ముఖంలో పోయిన ప్రాణాలు లేచివచ్చినట్లు కన్పిస్తున్నవి. న్యాయవాది ఇచ్చిన ద్రాక్షాసవాన్ని రుచైనా చూడకుండానే, అతడు అట్టర్సన్ వెంట బయలుదేరాడు. అట్టర్సన్ ఈ విషయం కూడా గమనించాడు.

అది వెర్రిచలి వేస్తున్న మార్చి నెలరాత్రి. చంద్రుడు వెలవెలపోతున్నాడు! గాలి తన్ను తరిమి పంపిస్తున్నట్లుగా నడుస్తున్నాడు. మంచును ముక్కలు కొట్టి విరజిమ్ముతున్నదా అన్నట్లుగా వీస్తున్నది చలిగాలి. అందువల్ల వీథుల్లో మనుష్య సంచారమంటూ లేదు. ఆ వీథి నిర్మానుష్యంగా ఉన్నది. "లండన్ నగరంలోని ఈ ప్రాంతం ఇంత జనశూన్యంగా ఉండటం ఎప్పుడూ లే"దనుకున్నాడు అట్టర్సన్. మరో సాటిమానవుడు కన్పిస్తే అతన్ని స్పృశిద్దామన్న కోరిక ఇంత తీవ్రంగా అతడి జీవితంలో ఎప్పుడూ కలగలేదు. ఏదో ఘోరవిపత్తు రానున్నట్లు అతని మనస్సు వేదనపడుతూ ఉన్నది. ఎంత యత్నించినా అది అణిగిపోవటం లేదు. చౌకులోకి ప్రవేశించాడు. ఆ కూడలిలో నిలుచోని చూస్తే దుమారం తప్ప ఏమీ కన్పించటం లేదు. తోటలో పలుచని చెట్లు గాలికి చలిస్తూ ఇనుప కటకటాలకు కొట్టుకుంటున్నవి. వేదికామార్గాలమీద ఇంతవరకూ అట్టర్సన్ కంటే ఒకటిరెండడుగులు ముందుగా నడుస్తున్న పూల్ వెనక్కు తగ్గాడు. అంతటి చలిగాలిలో కూడా అతడు టోపీ తీసి ఒక ఎర్రని జేబు రుమాలుతో ముఖం తుడిచాడు. ఆ చెమట వేగంగా నడిచినందువల్ల కలిగింది కాదు. లోపల ఉరిపోస్తున్నట్లుగా ఉన్న వేదనవల్ల కలిగింది. అందువల్లనే అతని ముఖం తెలతెలబోతున్నది. కంఠస్వరం బొంగురుపోయి కంపిస్తూ ఉన్నది.

"బాబూ! మనం ఇక్కడికి వచ్చేశాం. కానీ భగవంతుడి దయవల్ల ఏమీ ప్రమాదమూ సంభవించకుండా ఉండాలి" అన్నాడు పూల్.

"శుభమగుగాక!" అన్నాడు న్యాయవాది.

అటు తరువాత పూల్ అతిజాగ్రత్తగా తలుపు తట్టాడు. లోపల గొలుసు తొలగించిన చప్పుడు వినిపించగానే “పూల్, నీవేనా?” అని ఒక కంఠం ప్రశ్నించింది?”

“అవును. నేనే. తలుపు తెరవండి” అన్నాడు పూల్.

బాగా దీపాలు వెలుగుతున్న హాల్లో వాళ్ళు ప్రవేశించగానే ఆ ఇంటి సేవకులూ, సేవకురాండ్రూ అంతా ఒక గొప్ప ఉంపుగా అగ్నిధావని ప్రక్కన గుమికూడి ఉన్నారు. అట్టర్సన్‌ను చూడగానే ఒక దాసీకన్యకు ఏదో ఆవేశం వచ్చి ఎక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. బానసీడు “బ్రతికాము స్వామీ! అట్టర్సన్ బాబు వచ్చారు” అన్నాడు. అతన్ని చేతుల్తో చుట్టివేయాలన్న కోరికతో ముందుకురికి పరుగెత్తుకోవచ్చాడు.

“అరె!’ మీరంతా ఇక్కడ గుంపుకూడి ఉన్నారా? ఇదేం బాగా లేదు. ఇలా ప్రవర్తిస్తే మీ యజమాని సహించడు” అన్నాడు.

“వీళ్ళంతా భయపడిపోతున్నారండి బాబూ!” అన్నాడు పూల్.

ఇంతటితో కొంతసేపు నిశ్శబ్దం. ఎవరూ పూల్ చెప్పిన మాటను కాదనలేదు. దాసీ కన్యమాత్రం ఇంకా ఎక్కిళ్లు పెడుతూ గొంతెత్తి ఏడుస్తూనే ఉంది.

పూల్ ఆమెను “నోరు ముయ్!” అని గదమాయించాడు. ఆ కేక పెట్టినప్పుడు అతడు కూడా కంగారు పడుతున్నాడన్న విషయం కంఠధ్వనిలో కనిపిస్తున్నది. ఆ దాసీకన్య ఏడ్పు ప్రారంభించినప్పుడే వాళ్ళంతా బయలుదేరి బెదురు గుండెలతో లోపలి తలుపు దగ్గర ఏదో ఘోరం వినబడుతున్నట్లు భయంతో వెళ్లుతున్నారు. వంటశాలలో కూరగాయలు తరిగి ఇచ్చే కుర్రవాడితో పూల్ “ఒరేయ్! కొవ్వొత్తి దీపం అంచెలంచెలుగా అందుకుంటారు  వెంటనే పంపించు” అన్నాడు. దీపం రాగానే అట్టర్సన్‌ను తనవెంట రమ్మని ప్రార్థించి పెరటిలోని తోటలోకి దారితీశాడు.

“చప్పుడు కాకుండా మీరు రాగలిగినంత మెల్లిగా రండి. మీకు ఏదైనా వినిపిస్తే వినండి  అంతేకాని మీరు మాత్రం మాట్లాడవద్దు. ఆయన మిమ్మల్ని రమ్మని ఏ సందర్భంలోనైనా కోరితే మీరు వెళ్ళవద్దు.”

ఇలా అంటాడని ఊహించని అట్టర్సన్ గుండె ఒక్కమాటు హఠాత్తుగా ఆగిపోయినట్లైంది. అల్లటతల్లట చేసింది కానీ వెంటనే తట్టుకొన్నాడు. ధైర్యం తెచ్చుకొని బట్లరు వెంట పరిశోధనా మందిరం గుండాను సీసాలూ, ఇతర వస్తుసామగ్రి చెల్లాచెదరుగా ఉన్న శస్త్ర పరిశోధనశాలలో నుంచి మెట్లదగ్గిరికీ వెళ్లాడు. పూల్ అతన్ని

ఒక పక్కగా నిలువబడి వినవలసిందని కోరాడు. తాను క్రొవ్వొత్తి క్రిందపెట్టి, చెదురుతూ ఉన్న మనస్సును చిక్కబట్టుకొని, తలుపుకు తగిలించి ఉన్న పిడిని పట్టుకొని తడబడుతున్న చేతితో తలుపు తట్టాడు.

"బాబూ! మిమ్మల్ని అట్టర్సన్ గారు చూడాలని వచ్చారు" అన్నాడు. ఆ మాటలు అంటున్నప్పుడే ఏమి సమాధానం వస్తుందో వినమని మళ్ళీ ఒకమారు అట్టర్సన్‌కు సైగ చేశాడు.

"నేను ఎవర్నీ చూడదలచలేదని వారితో చెప్పు" అని మంచి విసుగుదలతో లోపలినుంచి ఒక కంఠం సమాధానం వచ్చింది.

ఏదో విజయాన్ని సాధించిన తృప్తి ద్యోతకమయ్యే గొంతుకతో "చిత్తం" అని అన్నాడు పూల్. మళ్ళీ కొవ్వొత్తి చేత పుచ్చుకొని అట్టర్సన్‌ను పెరటిగుండా వంటశాలలోకి తీసికోవెళ్ళాడు. అక్కడ నిప్పు పూర్తిగా చల్లారి ఉంది. నేలమీద పురుగులు గంతులేస్తున్నవి.

అట్టర్సన్ కళ్ళల్లోకి చూస్తూ పూల్ ప్రశ్నించాడు. "బాబూ! అది మా యజమానిగారి గొంతుకేనా?" అతని చూపులో చూపు నిలిపాడే గాని, తెల్లబోయిన ముఖంతో అట్టర్సన్ "కంఠస్వరంలో గొప్ప మార్పు వచ్చినట్లు కనిపిస్తున్నది" అన్నాడు.

"మార్పు వచ్చినట్లున్న దంటున్నారా? నాకు అలా తోచటం లేదు." అన్నాడు బట్లర్. యోచించి మళ్లా అందుకొని "యజమాని ఇంట్లో ఇరవైఏళ్ళబట్టీ సేవ చేస్తున్నాను. నేనే వారి గొంతు గుర్తుపట్టలేకపోయినానంటారా? కాదు బాబూ! అది మా యజమానిగారి గొంతుకాదు. ఆయన అయిపోయినాడు. ఎనిమిది రోజులనాడే. 'ఓ పరమాత్మా!' అని కేకలు పెట్టిననాడే ఐపోయినాడు. అట్టర్సన్ మహాశయా! అయితే ఆయనకు బదులుగా గదిలో ఉంది ఎవరంటావు? ఎందుకక్కడ ఉన్నాడు? ఇదంతా ఆ పరమాత్ముడికే తెలియాలి" అన్నాడు పూల్.

"పూల్, నీవు చెప్పేదంతా వింతకథగా ఉంది. వెర్రిగా ఊహిస్తున్నావు. నీవు భావించినట్లు, లేదా భావిస్తున్నట్లు మీ యజమానిని ఎవరో హత్య చేశారనే అనుకుందాం. ఇంకా హంతకుడు గదిలో ఎందుకుంటాడంటావు? నీవు చెప్పేది ఏమీ సబబుగా లేదు. ఆలోచన కెక్కడా సరిపోవటం లేదు."

"సరేలెండి! అట్టర్సన్‌బాబూ! మీకు నచ్చచెప్పటం చాలా కష్టం. అయినా మీకు నమ్మకం కలిగించగలను" అన్నాడు పూల్. "మీరు వినాలి, క్రితంవారమంతా, ఆ

గదిలో ఉంది మరి ఏమిటోగాని, ఏదో మందుకోసం రాత్రింబవళ్ళు ఒకటే చెడ్డగోల పెట్టింది. ఆ మందేమిటో దానికి జ్ఞప్తికి వచ్చినట్లు లేదు. ఏవైనా మాకు ఉత్తర్వులివ్వాలంటే చీటీ మీద వ్రాసి మెట్లమీద పడవేయటం మా యజమాని, కాదు దానికి – అలవాటు. ఈ వారంరోజులూ ఈ పనితప్ప మరొకటేమీ చెయ్యలేదు. చీటీలు వ్రాసి బయటవేస్తుండటం, తలుపులు ఎప్పుడూ మూసుకోటం తప్ప ఏమీ ఇంతకుమించి జరగలేదు. మా యజమానిగారికోసం తలుపు ముందు పెట్టిన భోజనాన్ని ఎవరూ చూడనప్పుడు లోపలికి తీసుకోవటం, ఉత్తర్వులు జారీ చేయటం, సరుకులు తెప్పించుకోవటం, గొణగటం, అలవాటైంది. ఈ నగరంలో ఔషధాలమ్మే టోకు వర్తకులందరి దగ్గిరికీ నన్ను ఈ వారందినాలై రోజుకు ఒకటి రెండు మూడు మార్లు పరుగెత్తించి చంపారు – చంపింది. షాపులకు వెళ్ళి మందులు తెస్తే వాటిని తిరిగి ఇచ్చివేసి రమ్మనటం జరిగింది. మరి మందు ఎందుకోగాని అత్యవసరంగా కావాలెనంటున్నారు – అంటున్నది బాబూ!" అన్నాడు పూల్.

"ఆయన వ్రాసి పడేసిన చీటీలు నీ దగ్గరేమైనా ఉన్నవా?" అని అట్టర్సన్ వితర్కంగా ప్రశ్నించాడు.

పూల్ తన జేబులు వెతుక్కొని నలిగిపోయిన చీటీ ఒకటి తీసి అతనిచేతికిచ్చాడు. కొవ్వొత్తి దగ్గరకు వంగి న్యాయవాది దాన్ని అతిశ్రద్ధతో పరిశీలించాడు. ఆ చీటీ ఇలా నడిచింది : "మీ కంపెనీవారికి డాక్టర్ జెకిల్ అభివందనాలు. మీరు వెనక పంపినమందు కల్తీ కలిసింది. అతని ప్రస్తుతావసరానికి ప్రయోజనకారి కాదు. గడచిన పద్దెనిమిది సంవత్సరాలలో డాక్టర్ జెకిల్ మీ కంపెనీవారి దగ్గరనుంచీ పెద్ద మొత్తాలుగా ఎన్నో ఔషధాలు కొన్నాడు. ఇది జ్ఞప్తికుంచుకొని అతిశ్రద్ధతో ప్రస్తుతపు ఔషధం కోసం అతిదయతో వెతికి, కల్తీ లేనిదిగా పంపవలసిందని ప్రార్థిస్తున్నాడు. మూల్యం ఎక్కువనే విషయాన్ని గురించి ఆలోచించనే వద్దు. ఈ ఔషధం డాక్టర్ జెకిల్‌కు ఎంత ప్రధానమైందో వర్ణించటం అలవిగాని పని" ఇంతవరకూ ఉత్తరం ప్రశాంతంగా నడిచింది. తరువాత "మహాప్రభో! పాత సరుకు ఏమైనా దొరుకుతుందేమో నా కోసం వెతికి పంపించండి" అన్న వాక్యం వ్రాసేటప్పుడు లేఖకుని ఆవేదన ఒక్క మాటుగా పొంగిపొర్లినట్లు వ్రాత ఖత్తులో ఒక వొణుకు కనిపిస్తున్నది.

"ఇది చాలా చిత్రమైన చీటీ. అయితే దీన్ని నీవు ఎలా విప్పి చూడలిగావు?" అని అట్టర్సన్ ప్రశ్నించాడు.

“ఆ బాబూ! ఆ మందుల కంపెనీలో మనిషి దీన్ని చూచి మండిపడి ఏదో చిత్తుకాగితంలా నా మీద విసిరిపారేశాడు” అని పూల్ సమాధానం చెప్పాడు.

“ఇది నిస్సందేహంగా డాక్టరు దస్తూరే. అనుమానం లేదు. గుర్తించావా?” అన్నాడు తిరిగి ప్రశ్నిస్తూ న్యాయవాది. జంకుతూ ఆ వృద్ధసేవకుడు “అలాగే కనిపిస్తున్న దనుకుంటున్నాను” అన్నాడు. గొంతులో కొంతమార్పు కనిపించగా “దస్తూరీ ఎవరిదైతే ఏం ప్రయోజనం?” నేను వ్యక్తినే చూచాను గదా!” అన్నాడు మళ్ళీ.

“వ్యక్తినే చూచావా? అయితే ఇంకేం?” అన్నాడు అట్టర్సన్.

“బాగుంది. అలా అర్థం చేసుకోండి. వ్యక్తిని చూచాను. ఎలా చూచాను? ఇలా చూచాను : నేను ఉద్యానవనంలో నుంచి పరిశోధనశాలలోకి హఠాత్తుగా ప్రవేశించాను. మందు కోసమో, మరెందుకైనానో ఆయన బయటికి వచ్చాడు. కార్యాలయద్వారం తెరిచి ఉంది. ఆ గదిలో ఒక మూలన ఉన్న బంగీల చెత్తలో ఆయన దేనికోసమో అతి ఆదుర్దాతో వెతుకుతున్నాడు. నేను లోపల ప్రవేశించగానే ఆయన నన్ను చూచి వెర్రికేక పెట్టి వెంటనే తన గదిలోకి వెళ్ళిపోయాడు. ఆయన్ను నేను చూచింది క్షణకాలమే. అయితేనేం? నా తలమీద జుట్టు నిట్టనిలువుగా నిలిచిపోయింది. ఆయన నా యజమాని అయితే ముఖాన ముసుగు ఎందుకు వేసుకొంటాడు? ఆయన నా యజమానే అయితే నన్ను చూడంగానే ఎందుకలా వెర్రికేక పెడతాడు? ఎందుకు నిలువకుండా పరుగెత్తిపోతాడు? నేను బహుకాలం ఆయన కొలువు చేసినవాణ్ణి... అదీకాక..” అంటూ పూల్ తన సంభాషణ కొంతసేపు ఆపి ముఖమంతా తుడుచుకొన్నాడు.

ఇంతవరకూ విన్న అట్టర్సన్ అన్నాడు : “పూల్! నీవు చెప్పేదంతా చాలా విచిత్రంగా ఉంది. రోగిని విపరీతంగా బాధపెట్టి రూపాన్ని గూడా సంపూర్ణంగా మార్చివేసే శక్తి ఉన్న వ్యాధి యేదో మీ యజమానిని పట్టి పీడిస్తున్నది. నాకర్థమైపోయింది. అందువల్లనే కంఠస్వరంలో మార్పు వచ్చింది. ఆ ముసుగు వేసుకోవటం, ఆప్తమిత్రులను కూడా దగ్గరకు చేరనివ్వకపోవటం కూడా అందుకోసమే. ఆ ఔషధంకోసం అంతటి ఆదుర్దా పడటం తుదకు ఆ వ్యాధినుంచీ బయటపడుదామన్న ఆశతోనే. భగవంతుడు అతన్ని మోసం చేయకుండా కాపాడుగాక! నీవు చెప్పిన దాని కంతటికీ ఇదేనా వ్యాఖ్యానం పూల్? ఇది అతివిషాదకరమైన కథగా ఉంది. ఆలోచిస్తున్నకొద్దీ ఆదుర్దా విశేషమౌతున్నది. అయితే అతిసహజంగా అన్ని విషయాలూ అతికినట్లు అర్థమైపోతున్నవి. కనుక మనం మిక్కిలిగా ఆదుర్దాపడటం అనవసరం!”

బట్లరు పూల్ అట్టర్సన్ చెప్పిన ఓదార్పు మాటలు విన్నప్పటికీ తెల తెలబోతూ, "బాబూ! మీరేమన్నా చెప్పండి. గదిలో ఉంది మాత్రం మా యజమాని కాదు. ఇది సత్యం! మా యజమాని..." అంటూ నాలుగువైపులా భద్రంకోసం చూచి "మా యజమాని పొడగరి. అందమైన రూపం గలవాడు. కండపుష్టి కలవాడు. ఉన్నవాడో మరుగుజ్జు" అని అన్నాడు.

అప్పుడు అట్టర్సన్ కాదన్నాడు.

"ఇరవై యేళ్లు సేవించినవాడిని నా యజమాని ఎట్లా ఉంటాడో నాకు తెలియదంటారా? ప్రతినిత్యం ఆయన గది గుమ్మం ముందు నిలుచుంటూ చూడటం అలవాటు పడ్డవాణ్ణి నాకే ఆయన తల ఎంతవరకూ వస్తుందో తెలియదంటారా? కాదండీ బాబూ, కాదు. ఆ ముసుగులో ఉంది మా యజమాని కానే కాదు. అది ఎవరో భగవంతుడు ఒక్కడికే ఎరుక  అది మా యజమాని డాక్టరు జెకిల్ మాత్రం కాదు. ఇది నా హృదయపూర్వకమైన విశ్వాసం. హత్య జరిగిపోయింది!" అన్నాడు పూల్.

అప్పుడు న్యాయవాది అట్టర్సన్ సమాధానంగా ఇలా అన్నాడు. "పూల్! నీవు ఇలా నొక్కి చెపుతున్నావు. ఇక సత్యం ఏమిటో తేల్చవలసిన భారం నా మీద పడుతున్నది. ఒకవంక మీ యజమాని మనస్సుకు బాధకలించకూడదన్న వాంఛ నాకెంతగానో ఉంది. ఈ ఉత్తరం మీ యజమాని సజీవుడై ఉన్నాడనటానికి నిదర్శనంగా ఉండి మరొకవంక నన్ను తికమక పెడుతున్నది. లోపల ఉన్నది మీ యజమాని కాదని నీవు స్పష్టంగా చెపుతున్నావు. అందువల్ల గది తలుపులు బ్రద్దలు కొట్టి చూడటమే ఇంక నాకు అవశ్యకర్తవ్యమని నిర్ణయిస్తున్నాను"

"అబ్బా! అట్టర్సన్ మహాశయా! చేయవలసిన నిర్ణయం చేశారు" అని సంతోషంగా కేక పెట్టాడు పూల్.

"ఒక సమస్య తేలిపోయింది. అయితే బ్రద్దలుకొట్టేది ఎవరన్నది రెండో సమస్య" అని అన్నాడు అట్టర్సన్.

"ఎవరో ఎందుకండీ బాబూ! మీరూ, నేనే బ్రద్దలు కొడదాం" అన్నాడు పూల్ భయరహితంగా

"చాలా బాగుంది. అలాగే చేద్దాం. ఇందువల్ల ఏమి వచ్చినా కష్టంగానీ, నష్టంగానీ లేకుండా, రాకుండా చూచే భారం నాది."

"ప్రయోగశాలలో గొడ్డలి ఒకటుంది. అది నేను తీసుకుంటాను. మీరు వంటశాలలో నిప్పులను ఎగదోసే ఇనుపచువ్వ ఉంది దాన్ని పుచ్చుకోండి" అని సాధన సామాగ్రిని చూచించాడు పూల్.

మొరటుదైనా, బరువుగా ఉన్న ఆ సాధనాన్ని చేత్తో పుచ్చుకొని న్యాయవాది సరితూకంగా చేతిలో నిలుపుకొన్నాడు. పైకి చూస్తూ అన్నాడు : "పూల్! నీవూ నేను ఒక ప్రమాదంలో పడటానికి వీలున్న పని పెట్టుకొన్నాం, తెలిసిందా?"

"అయితేనేం! కానివ్వండి!" అన్నాడు పూల్.

"బాగుంది. మనం ఉన్నది ఉన్నట్లుగా ఒకమారు పర్యవేక్షిద్దాం. ఇంతకు పూర్వం నీవూ, నేనూ ఏమేమో చెప్పుకొన్నాం. ఒకమాటు మర్మం లేకుండా చెప్పుకుందాం. నీవు గదిలోని ముసుగు వేసుకొన్న రూపాన్ని చూచావు గదూ? గుర్తు పట్టావా?"

"అవును బాబూ! ఆ రూపం అతివేగంగా వెళ్ళిపోయింది. త్వరితంగా వెళ్లేటప్పుడు శరీరం సగానికి మడతపెట్టినట్లు కన్పించింది. అందుచేత నేను గుర్తించానని గట్టిగా ప్రమాణం చేయ్యలేను" అని పూల్ ఇంకా ఇలా అన్నాడు : "అతడు హైడ్ అయి ఉండవచ్చు నని మీరు ఊహిస్తే నేను అందుకు ఒప్పుకుంటాను. ఆ మూర్తి అతనిదే. సరిగా అతని ఎత్తే. అదేరీతిగా తేలిగ్గా అది నడిచింది. అదీకాక పరిశోధనశాలలో అతనికంటే ఇంకెవరు ప్రవేశించగలరు? ఏమండోయ్ బాబూ! హత్య జరిగేటప్పటికి తాళంచెవి అతనిదగ్గరనే ఉందని మీరు మరిచిపోలేదనుకుంటాను? అంతేకాదు. నాకు తెలియదు గాని మీరు ఎప్పుడైనా అతన్ని కలుసుకొన్నారా?"

"అవును" అని అన్నాడు న్యాయవాది. "అతనితో ఒకమాటు మాట్లాడాను కూడా"

"అయితే అతనిలోని వికృతలక్షణాన్ని గూడా గమనించే ఉంటారనుకుంటాను. స్పష్టంగా ఇంతకు మించి ఏమి చెప్పాలో నాకేమీ తెలియటంలేదు. బాబూ! అతన్ని చూడగానే నా శరీరం చల్లబడుతుంది శల్యాలు కదిలిపోతాయి."

"నీవు వర్ణించినదంతా నిజం. నాకూ అలాగే అనుభవమైంది" అన్నాడు అట్టర్సన్.

"నిజమండీ బాబూ! ఆ ముసుగురూపం పరిశోధనశాలలోని రసాయనిక ద్రవ్యాలమీదుగా కోతిలా గెంతుతూ గదిలోకి ఊపుతో ఉడాయించినప్పుడు నా వెన్నుపూసలో మంచుముక్క నడిచినట్లు తోచింది. అట్టర్సన్‌బాబూ! ఇదంతా సాక్ష్యంకాజాలదని నాకు తెలుసు. నేను కాస్త గ్రంథాలు తిరగవేసివాడినేనండోయ్!

మనిషి అన్న ప్రతివాడికీ కొంత ఊహాశక్తి ఉంటుందిగా మరి! ఆ రూపం 'మిస్టర్ హైడ్' అని నేను బైబిల్‌లోని ప్రమాణవాక్యంగా విన్నవిస్తున్నాను" అన్నాడు పూల్.

"బాగుంది. నా అనుమానాలు కూడా అతని వంకకే మొగ్గుతున్నవి. ఇదంతా ఘోరపాపం! బ్రద్దలు కాకమానదు. ఆ పాపంతో సంబంధం పెట్టుకోటం వల్లనే ఇలా సంభవించింది. నీ అభిప్రాయాన్నే నేనూ నమ్ముతున్నాను. హారీని ఎవరో హత్య చేశారు. (ఏ ప్రయోజనాన్ని ఆశించి హత్య చేశారో అది భగవంతుడు ఒకడికే తెలుసు). ఇంకా హంతకుడు ఆ నిహతుని గదిలోనే తారట్లాడుతున్నాడు. అతడు చేసినదానికి తగ్గ ప్రతీకారాన్ని మనం చేసితీరుదాం. బ్రాడ్షాను పిలు" అన్నాడు న్యాయవాది.

పిలుపు వినపడగానే ఆ సేవకుడు బిక్కమొగంతో గజగజ వణికపోతూ వచ్చాడు.

"బ్రాడ్షా! ఆ పిరికితనం ఏమిటోయ్! ధైర్యం తెచ్చుకో. విషయం ఏమిటో తేలకపోవటం వల్ల మీరంతా ఇలా భీరువులై బాధపడుతున్నారు. ఇది నాకు తెలుసు. ఇకదాన్ని తేల్చివేద్దామనే మా ఉద్దేశం. పూల్, నేనూ గది తలుపులు ఛేదించుకొని లోపలికి పోవాలని నిర్ణయించాం. అంతా సక్రమంగా ఉంటే వచ్చిపడే నిందను అంతటినీ నేను భరిస్తాను. ఇంతలో ఏమీ లోపం జరగకుండా ఉండాలి. ఏ దుర్మార్గుడూ గది వెనక నుంచీ తప్పించుకొని పారిపోకుండా ఉండాలి. నీవూ, కుర్రవాడూ రెండు బడితెలు తీసుకొని, చుట్టు తిరిగి వెళ్ళి అక్కడ గుమ్మం దగ్గర కాపలా కాయండి. మీరు ఆ స్థానానికి వెళ్ళటం కోసం పదినిమిషాల సమయమిస్తున్నాను" అన్నాడు న్యాయవాది అట్టర్సన్.

బ్రాడ్షా వెళ్ళంగానే న్యాయవాది తన గడియారంలో కాలమెంతైందో చూచాడు. "పూల్! ఇక మన పనిమీద బయలుదేరుదాం పద" అన్నాడు. ఇనపచువ్వ చేత్తో పట్టుకొని అతడు పెరట్లోకి దారితీశాడు. మేఘమాలిక ఒకటి చంద్రుణ్ణి కప్పి వేయటంవల్ల ఒక చీకటి తెర వచ్చింది. మహాకూపంలా ఉన్న ఆ భవనం లోపలికి అప్పుడప్పుడూ ఈదురుగాలి కుప్ప తెప్పలుగా వచ్చిపడుతున్నందువల్ల, వాళ్ళు ప్రయోగశాల దగ్గిరికి వెళ్ళేటంతవరకూ కొవ్వొత్తి ఆ గాలికి కదలిపోతున్నది. వారు పెద్దశాలలోకి చేరారు. సమయంకోసం అక్కడ కొంచెంసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు. చుట్టూ ఉన్న లండన్ నగరం మందంగా ఝుంకారం చేస్తున్నది. దగ్గరలో ఆ ప్రదేశప్రశాంతి నంతటినీ భగ్నం చేస్తూ గదిలో అటూ ఇటూ తిరుగుతూ ఉన్న వ్యక్తి పాదధ్వని వినిపిస్తున్నది.

పూల్ ఏదో రహస్యం చెపుతున్నట్లుగా అట్టర్సన్ చెవిలో అంటున్నాడు : "ఇదే రీతిగా పగలంతానూ, రాత్రులు చాలా ప్రొద్దుపోయే టంతవరకూను. ఈ శబ్దం

వినిపిస్తుంటుంది. రసాయనవిక్రేతదగ్గరనుంచీ ఏదైనా క్రొత్త ఔషధం వచ్చినప్పుడు మాత్రం కొంత విరామం ఉంటుంది. చూడబోతే గదిలో ఉన్న వ్యక్తి విశ్రాంతి అంటే గిట్టని దుష్టబుద్ధిలా తోస్తున్నది. ఆ రూపంలోనూ, అది వేసే ప్రతి అడుగులోనూ త్రాగిన పచ్చి నెత్తురును జీర్ణం చేసుకోలేక దుర్వాసనలతో క్రుమ్మరిస్తున్నట్లుంటుంది. ఇలా కాస్త దగ్గిరికి వచ్చి వినండి. గుండెకు చెవులు తగిలించి వినండి. ఇవి డాక్టరుగారి అడుగుల చప్పుళ్ళే అంటారా?"

నెమ్మదిగా నడుస్తూ ఉండటంవల్ల ఆ అడుగులు ఒక తూగుతో తేలిగ్గానూ, వికృతంగానూ ధ్వనిస్తున్నవి. అయితే అవి నడుస్తున్నప్పుడు ధాటిగా వినిపించే హెన్రీ జెకిల్ అడుగుల చప్పుళ్ళకంటే స్పష్టంగా భిన్నమైనవి. అట్టర్సన్ దీర్ఘంగా విశ్వసించాడు. "ఇంతకుమించి ఎప్పుడూ మరేమీ జరగలేదా?" అని అతడు ప్రశ్నించాడు.

పూల్ తల ఊపి "అది ఏడవటం ఒక తడవ వినిపించింది" అన్నాడు.

"ఏడవటమా? అదెల్లా ఉంది?" అని హఠాత్తుగా ఒళ్లు చల్లబడి, న్యాయవాది ప్రశ్నించాడు.

"ఒక స్త్రీలాగా, గుండె చల్లబడిపోతున్న వ్యక్తిలాగా ఏడ్చింది. ఆ ఏడ్పు వినటంతోటే నా గుండె గుభేలుమన్నది. నాకు కూడా ఏడ్పు వచ్చింది" అన్నాడు బట్లరు.

ఇంతలో పెట్టుకొన్న పది నిమిషాల గడువు పూర్తైంది. బంగీల చెత్తలో నిండిన కుప్పలోనుంచి పూల్ గొడ్డలిని బయటికి తీశాడు. తలుపుమీద ముట్టడి సాగించడానికి అనువుగా వారిద్దరూ ఒక బల్లమీద దీపాన్ని అమర్చారు. అర్ధరాత్రివేళ, అటువంటి ప్రశాంత సమయంలోనైనా అలసటన్నది ఎరగకుండా అటూ ఇటూ తిరుగుతున్న పాదాలు ధ్వనించే చోటికి వాళ్ళిద్దరూ చేరారు.

అట్టర్సన్ పెద్ద గొంతుకతో "జెకిల్! నేను నిన్ను చూచి తీరాలి!" అని అన్నాడు. సమాధానం కోసం క్షణకాలం వేచి చూచాడు. అది రాలేదు. "ఇదిగో నీకు సవ్యంగా ముందు తెలియజేస్తున్నాము. మా కెన్నెన్నో అనుమానాలు కలుగుతున్నవి. నేను నిన్ను చూచి తీరాలి. తప్పక చూచి తీరుతాను!" అన్నాడు అట్టర్సన్ మళ్ళా. "మంచి మార్గాన వీలు కాకపోతే చెడ్డబాటనైనా సరే, నేను నిన్ను ఇవాళ చూచి తీరుతాను!"

లోపలినుంచి కంఠం పలికింది : "అట్టర్సన్! దైవసాక్షిగా అర్థిస్తున్నాను. ఈ ప్రయత్నం వద్దు. నన్ను కనికరించు."

"ఆc! ఇది జెకిల్ కంఠం కాదు హైడ్ గొంతుకే!" అని కేక పెట్టాడు అట్టర్సన్. "పూల్! ఉc. కొట్టు! తలుపులు బ్రద్దలుకొట్టు." అని బిగ్గరగా ఆజ్ఞాపించాడు.

భుజంమీద సిద్ధంగా పెట్టుకొని ఉన్న గొడ్డలిని ఒక్కమాటుగా తలుపు మీదికి విసిరాడు పూల్. దాని దెబ్బకు ఆ మహాభవనమంతా కంపించిపోయింది. ఎర్రని పిడి ఉన్న ఆ తలుపు తాళం ఒక్క దెబ్బతోనే బ్రద్దలైంది. బందులు కదలటం వల్ల తలుపు ఒక ప్రక్కకు జరిగింది. భీతాహంతో ఎన్నో వన్యమృగాలు గగ్గోలుగా ఒక్కపెట్టున ఏడ్చినట్లు ఒక రోదనధ్వని వినిపించింది. మళ్లీ తలుపుమీద మరొక గొడ్డలిపెట్టు తగిలింది. మడత రెక్కలు తునకలైపోయాయి. మరి నాలుగుసార్లు గొడ్డలి దెబ్బలు తగిలినవి. ద్వారబంధం మంచి చేవగల కర్రతో చేసింది కావటం వల్ల అయిదో దెబ్బ పడవలసి విచ్చింది. అది పడితే గాని లోపలితాళం బ్రద్దలై విరిగిన ముక్కలు లోపల పరిచి ఉన్న తివాచీల మీద అమాంతంగా విరుచుకొని పడలేదు.

ఆ నిశ్శబ్దసమయంలో గదిమీద దాడి సాగిస్తున్నప్పుడు తాము చేసే గందరగోళానికి తామే కొంతగా భయకంపితులైనారు. కొద్దికాలంలో నిష్క్రియత్వం ఆవరించింది. కాసేపు వెనక్కు తగ్గి లోపలికి తొంగి చూచారు. గది వారికి దీపాల వెలుగుతో పరిపూర్ణంగా దర్శనమిచ్చింది. గదిలోపల అగ్నిధావనిలో అగ్ని ప్రకాశిస్తూ మధ్య మధ్య సణుగుతున్నది. నీళ్ళు మరిగే పాత్ర నెమ్మదిగా కొళకొళమంటున్నది. బల్లలోని డాయర్లు ఒకటి రెండు ముందుకు లాగబడి కనిపిస్తున్నవి. అగ్నిధావనికి ప్రక్కన ఉన్న బల్లమీద ఏవో పత్రాలు అతి రమ్యంగా అమర్చబడి ఉన్నాయి. ధావని దగ్గర టీ కాచుకోటానికి అవసరమైన వస్తువులన్నీ పెట్టి ఉన్నాయి. గాజు కుప్పెల్లో కదులుతూ ఉన్న రసాయనికద్రవ్యాలను మినహాయిస్తే, అంతటి ప్రశాంతమైన గది ఇంకోటి ఉండదనవచ్చు. ఇలాటి రమణీయ కక్ష్యలు లండన్ నగరంలో సర్వసామాన్యంగా కనిపిస్తూనే ఉంటవి.

గది మధ్యలో ఒక మనిషి శరీరం మెలికలు తిరిగి, ఇంకా కొనప్రాణంతో కొట్టుకుంటూ, కనిపిస్తున్నది. వాళ్ళిద్దరూ మునివ్రేళ్ళమీద నెమ్మది నెమ్మదిగా నడుస్తూ, ఆ శరీరం దగ్గరకి వచ్చారు. దాన్ని వెల్లికిల త్రిప్పారు. ఎడ్వర్డు హైడ్ ముఖం కనిపించింది. అప్పుడు అతడు తనకు చాలా పెద్దవైనవీ, డాక్టరుకు సరిపడే దుస్తుల్లో ఉన్నాడు. అతని ముఖాన ఉన్న నరాల కదలికలవల్ల ఇంకా ప్రాణం ఉన్నట్లు వ్యక్తమౌతూనే ఉంది అయితే ప్రాణం పోయినట్టే. పగులగొట్టిన మందుబుడ్డీ చిన్నది

ఒకటి అతని చేతిలో ఉంది. ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తి శరీరాన్ని చూస్తున్నానని అట్టర్సన్ గమనించాడు.

అట్టర్సన్ ధాటిగా అన్నాడు పూల్‌తో : "మనం రక్షించటానికి గానీ, శిక్షించటానికి గానీ సమయం మించిపోయిన తరువాత వచ్చాం. హైడ్ తను చేసుకున్నదానికి ఫలితంగా అంతరించాడు. ఇక మీ యజమాని కళేబరం ఎక్కడ ఉందో చూడటమే మనకు మిగిలిన పని!"

ఆ భవనంలోని విశేషభాగాన్ని, ఇంచుమించు క్రిందభాగాన్నంతటినీ, పరిశోధనశాలే ఆక్రమించుకొని ఉంది. ఇందులోకి వెలుతురు పైనుంచీ, కార్యాలయకక్ష్యలోనుంచీ వస్తూ ఉంటుంది. ఈ పరిశోధనశాల సమస్తభవనానికీ ఒక కోణం. ఏదో ప్రత్యేకంగా ఒక అంతస్తుగా ఉంటుంది. ఈ పరిశోధనశాలకు కార్యాలయకక్ష్యలోనుంచి ఒక సోపానమార్గం కూడా ఉంది. ఇవే కాకుండా ఆ భవనంలో భూగర్భగృహాలూ, అంధకారకక్ష్యలూ ఉన్నవి. వీటన్నిటినీ వారిద్దరూ పరిపూర్ణంగా పరిశోధించారు. ఇవన్నీ బహుకాలంనుంచీ శూన్యంగా ఉండటంవల్లా, ఈ మధ్యకాలంలో పని పడకపోవటం చేత వాటి ద్వారాలు కూడా తెరవకపోవటం వల్లా, వీటిని ఒకమారు పైనుంచి చూస్తేనే చాలు. వీళ్ళు వాటిని తెరిచినప్పుడు ఎన్నాళ్ళనుంచో పైనబడి దట్టంగా పేరుకున్న దుమ్ముపైనుంచి క్రిందికి రాలింది. జెకిల్ విక్రయించుకోకపూర్వం ఆ ఇంటికి యజమానిగా ఉంటున్న శస్త్రవైద్యుని కాలంనుంచీ ఉంటూ ఉన్న విచిత్ర వస్తువులు అధికంగానూ, ఇంకా చెత్త చెదారంతో ఆ కక్ష్యలు నిండి ఉన్నాయి. అక్కడ బహుకాలంనుచీ ప్రవేశాన్ని ఆటంకపరిచేటట్లు ఒక చాపలా సాలీళ్ళు గూళ్ళు దట్టంగా కట్టి ఉన్నాయి. తలుపులు తీయంగానే అవి తెగి క్రింద పడటంతో ఇక ఆ గదిని వెతకటం అనవసరమైన పని అని వెల్లడైంది. ఎక్కడ చూసినా హెన్రీ జెకిల్ సజీవుడుగా గాని, నిర్జీవుడుగా గాని, ఉన్న చిహ్నమేదీ వారికి కన్పించలేదు.

పూల్ భవనానికి మధ్యగా ఉన్న నడవగట్టుమీద ఒక తన్ను తన్ని వినిపించిన శబ్దాన్ని విపరీతమైన శ్రద్ధతో వింటూ "వారిని ఇక్కడ పాతిపెట్టి ఉండాలి!" అన్నాడు.

"లేదా ఆయన పారిపోయి కూడా ఉండవచ్చు" అని అట్టర్సన్ ఉపవీధివంకకు ఉన్న ద్వారాన్ని పరిశీలించాడు. అది తాళం వేసి ఉంది. అంచులమీద త్రుప్పుపట్టిన తాళం చెవి వ్రేలాడుతూ వారి కంటబడ్డది.

"ఇది ఉపయోగంలో ఉన్న తాళం చెవిలా కన్పించటం లేదు" అన్నాడు న్యాయవాది అట్టర్సన్.

“కనిపిస్తూనే ఉందిగదా, ఎవరో త్రొక్కి విరగగొట్టినట్లుగా!” అని అందుకొన్నాడు పూల్.

“అవునోయ్! దాని లక్షణం కూడా బాగా తుప్పుపట్టి ఉంది” అన్నాడు అట్టర్సన్ బెదిరిపోతూ. ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు.

“పూల్! ఇదంతా నా తలకు మించిపోయింది. ఏమీ అర్థంకావటం లేదు. మనం కార్యాలయ కక్ష్యలోకి వెళ్లుదాం పద.

పై కక్ష్యలోని వస్తువులను పరిశీలించటానికి బయలుదేరి, చప్పుడు కాకుండా మెట్లెక్కుతూ, మధ్యమధ్య మృతకళేబరం మీద భయదృష్టులు నిలుపుతూ, సాగిపోతున్నారు వాళ్లిద్దరూ. ఈ దుఃఖమయజీవి శక్తిలేక తరువాత విరమించుకొన్న ఒకానొక పరిశోధనకోసం ఏర్పాటు చేసుకొన్న రసాయనికద్రవ్యాల చిహ్నాలు, గాజుపళ్ళాలలో కుప్పలు పోసిఉన్న క్షారాలు, ఒక బల్లమీద అమర్చి కన్పించాయి.

“ఆయనకు నేనెప్పుడూ తెచ్చిపెట్టేది ఈ ఔషధాన్నే” అన్నాడు పూల్. అతడు మాట్లాడుతున్నంతసేపూను, తరువాత గూడాను, గిన్నెలో నీళ్ళు కళపెళమంటూ ఉడుకుతూనే ఉన్న చప్పుడు వినిపిస్తున్నది.

తరువాత వాళ్లు అగ్నిధావని దగ్గిరికి వచ్చారు. దానికి దగ్గరగా ఒక పడకకుర్చీ వేసి ఉంది. అందులో కూర్చున్న వ్యక్తికి, కప్పులో ఉన్న పంచదారతో సహా, టీ కాచుకోటానికి కావలసిన వస్తువులన్నీ చేతికి అందుబాటులో ఉండేటట్లు పెట్టి ఉన్నాయి. ఒక షెల్ఫ్‌లో కొన్ని పుస్తకాలు అందంగా అమర్చి ఉన్నాయి. వాటిలో ఒకటి అనేక పర్యాయాలు జెకిల్ మహాగౌరవభావాన్ని ప్రకటిస్తూ వచ్చిన భగవత్సంబంధమైన ప్రతి. అది టీ కాచుకోడానికి అమర్చిన సామగ్రి దగ్గర తెరిచిపెట్టి ఉండటం వల్ల అట్టర్సన్ దాన్ని చూడగలిగాడు. దానిలో అనేకప్రదేశాలలో జెకిల్ భగవద్దూషణ చేస్తూ చేసిన వ్యాఖ్యానాలను చూచి విస్తుపొయ్యాడు.

తరువాత, ఆ కక్ష్యను పరిశోధించటంలో, ఒక భూతద్దం దగ్గిరికి వచ్చాడు. దాన్ని చూచేటప్పటికి వారికి అప్రయత్నంగా మహాభీతి కలిగింది. కానీ అది ఏమీ లేదు. ఇంటికప్పుమీద ఉన్న గులాబీ కాంతులు, పింగాణీ పాత్రలమీద ప్రతిబింబిస్తున్న అగ్ని చుళుకంలోని మంటలు, భీతాహంవల్ల పాలిపోతున్న వారి ముఖాలు అనంతరూపాలతో కనిపిస్తున్నవి. ఆ అద్దం అలా వికృతరూపాలను ప్రదర్శించటానికిగాను ఏటవాలుగా అమర్చి ఉండటమే వారి భీతికి కారణం.

పూల్ గుసగుసగా "బాబూ! ఈ అద్దం చాలా వికారరూపాలను చూపిస్తున్నదండీ!" అన్నాడు.

అతని మాటలకు ప్రతిధ్వనిగా. అతడుపయోగించిన మెత్తని గొంతుకతోనే "ఇంతకంటే విపరీతవస్తువు ప్రపంచంలో ఇంకొకటి ఉంటుందని నేననుకోను" అన్నాడు అట్టర్సన్. "దీనితో జెకిల్ ఏమి చేసి ఉంటాడు?" – ఇలా ప్రశ్నించేటప్పుడు మొదట్లో అతని నోట మాట తడబడ్డది. మళ్ళీ తనదైన్యానికి తానే సిగ్గుపడి "దీనితో జెకిల్‌కు ఏం పని పడి ఉంటుంది?" అన్నాడు మళ్ళీ.

"అది మీరు నిర్ణయించాలి. నాకేం తెలుస్తుంది?" అన్నాడు పూల్.

తరువాత వారి దృష్టి కార్యాలయకక్ష్యలో ఉన్న మేజా బల్లమీద పడింది. ఆ బల్లమీద చక్కగా అమర్చిఉన్న ఎన్నో పత్రాలమధ్య డాక్టర్ జెకిల్ స్వహస్తంతో అట్టర్సన్ పేరు వ్రాసి ఉంచిన ఒక కవరు బాగా పైకి కన్పిస్తున్నది. న్యాయవాది దాని సీలు ఊడదీసినప్పుడు అందులో నుంచి మరికొన్ని కవర్లు నేలమీద పడ్డాయి. ఇలా వ్రాసిన కవర్లలో మొదటిది ఆరు నెలలవాడు తాను డాక్టర్ జెకిల్‌కు తిరిగి ఇచ్చివేసిన విల్లునామాలోని వింత షరతులతో వ్రాసిన క్రొత్త వీలునామా. వ్రాసిన వ్యక్తి దీన్ని తాను మరణించిన పక్షంలో ఇచ్ఛా ప్రవచనంగానూ, అదృశ్యుడైన పక్షంలో దానపత్రంగానూ ఉద్దేశించి వ్రాశాడు. అయితే, ఇందులో పూర్వపత్రంలో లేని విశేషమేమిటంటే "ఎడ్వర్డు హైడ్" అనే పేరు ఉండవలసిన స్థానంలో "గేబ్రియల్ జాన్ అట్టర్సన్" అనే పేరు ఉండటం. ఇది చదివినప్పుడు న్యాయవాది అట్టర్సన్ వర్ణనాతీతమైన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు. ఒకమారు పూల్‌వంక, మరొకమారు ఆ పత్రంవంక, తిరిగి తిరిగి చూచాడు. చిట్టచివరకు మాత్రం తివాచీ మీద చచ్చిపడి ఉన్న క్రూరకర్ముణ్ణి  హైడ్‌ను చూచాడు.

"నా తల తిరిగిపోతున్నది. అంతా అయోమయంగా ఉంది. ఇన్నాళ్ళబట్టీ ఈ వీలునామా వీడి వశంలోనే ఉంది. నేనంటే వీడికి అనురాగం కలగటానికి కారణం ఏమీ కన్పించటం లేదు. వీడు తనకు బదులుగా మరో వ్యక్తి ఇంటికి, ఆస్తికి అధిపతి ఔతాడంటేనే మండిపడవలసినవాడు. ఇటువంటి స్థితిలో ఇంతకాలం తనవశంలో ఉన్న ఈ పత్రాన్ని ఎందుకో రూపుమాపలేదు!"

న్యాయవాది తరువాత పత్రాన్ని చేతపుచ్చుకొన్నాడు. ఇది డాక్టర్ జెకిల్ స్వహస్తంతో వ్రాసి పైన ఒక అంచుమీద తేదీ వేసిన లఘులేఖ. దాన్ని చూచీ చూడకముందే

అట్టర్సన్ "ఏమోయ్, పూల్!" అని బొబ్బపెట్టి "అతడు ఈ రోజున ఇక్కడనే సజీవుడుగా ఉన్నాడు! చాలా కొద్ది వ్యవధిలో జెకిల్‌ను తుదముట్టించే అవకాశం లేదు. ఆయన ప్రాణాలతోటి పారిపోయి ఉంటాడు? ఎందుకు పారిపోయి ఉంటాడు. ఎక్కడికి పారిపోయి ఉంటాడు? ఎట్లా పారిపోయి ఉంటాడు? ఇటువంటి సందర్భంలో ఇక్కడ మన కళ్ళకు కనిపిస్తున్న దానిని ఆత్మహత్య అని అనటానికి నిర్ధారణగా అవకాశం లేదు. ఆః మనం అతి జాగరూకతతో ప్రవర్తించాలి సుమా! లేకపోతే మనవల్ల మీ యజమాని ఇంకా ఘోరప్రమాదంలో పడవచ్చు!" అన్నాడు.

"బాబూ! ఆ లేఖ చదివి వినిపించరేం?" అన్నాడు పూల్.

"ఏమిటో! నాకు భయంగా ఉంది. కనక చదవలేదు. భగవంతుడు నాకు అటువంటి భయాన్ని తొలగించుగాక!" అంటూ అట్టర్సన్ లేఖను కళ్ళముందుకు తెచ్చుకొని ఇలా చదివాడు.

"ప్రియమైన అట్టర్సన్!

ఈ పత్రం మీ చేతిలో పడ్డప్పుడే నేను అదృశ్యమైనట్లు – కానీ ఇది ఏ పరిస్థితుల్లో ఎలా జరుగుతుందో ముందుగా నేను ఊహించలేను. నా సహజావబోధాలూ, ఇది అని నిర్వచింపరాని ప్రస్తుతస్థితీ, నాకు అంత్యదశ తప్పదనీ, అది అచిరకాలంలోనే వచ్చి తీరుతుందనీ నాకు సూచన చేస్తున్నవి. మీ పేర ఒక ఉత్తరం వ్రాసి దాన్ని మీ పరం చేస్తానని డాక్టర్ లాన్యన్ నన్ను హెచ్చరించి మందలించాడు. వెళ్ళి త్వరగా ఆ ఉత్తరాన్ని చదవండి. ఈ విషయాన్ని గురించి ఇంకా మీరు అధికంగా తెలుసుకోదలచుకుంటే అప్పుడు నా లేఖను విప్పి చదవండి.

అయోగ్యుడు, అభాగ్యుడూ అయిన నీ మిత్రుడు, హెన్రీ జెకిల్."

"మూడో కవరు ఏమైనా ఉందా?" అని అట్టర్సన్ ప్రశ్నించాడు. "ఇదిగో నండీ" అంటూ పూల్ ఎన్నోచోట్ల సీళ్లు వేసిన ఒక కట్టను న్యాయవాది చేతికి అందించాడు.

న్యాయవాది దాన్ని జేబులో పెట్టుకున్నాడు.

"ఈ ఉత్తరం సంగతి నేను బయటపెట్టను. మీ యజమాని పారిపోయినా, మృతినొందినా ఇందువల్ల మనం అతడి గౌరవాన్ని కాపాడగలవాళ్ళమౌతాము. ఇప్పుడు రాత్రి పదిగంటలైంది. నేను ఇంటికి వెళ్ళి ఈ పత్రాలను తిరిగి ప్రశాంతచిత్తంతో

పరిశీలించాలి. నేను మళ్ళీ అర్ధరాత్రిలోగా ఇక్కడికి వస్తాను. అప్పుడు మనం పోలీసువారికి విషయాన్ని తెలియజేద్దాం.”

పరిశోధనశాల తలుపు తాళంవేసి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయినారు. హాల్లో అగ్నిధావని దగ్గర ఉన్న సేవకులనూ, సేవకురాండ్రనూ అక్కడనే ఉండమని, ఈ మాయా వ్యవహారంలోని మర్మాన్నంతటినీ వివరించే రెండు గాథలనూ, – ఒకటి లాన్యన్ కథనం, రెండవది జెకిల్ వాఙ్మూలం – చదవటం కోసం తన కార్యాలయానికి అట్టర్సన్ నడక సాగించాడు.

# 9. డాక్టరు లాన్యన్ కథనం

“నాలుగు రోజులనాడు, జనవరి తొమ్మిదవ తేదీన, సాయంకాలపు టపాలో, వృత్తిలో నాకు సహచరుడూ, ఉన్నత పాఠశాల సహాధ్యాయి అయిన హెన్రీ జెకిల్ దస్తూరీతో నాకు ఒక కవరు వచ్చింది. ఉత్తరం ఇలా రావటాన్ని గురించి నాకెంతో ఆశ్చర్యం వేసింది. మా ఇరువురు మధ్యా ఉత్తరప్రత్యుత్తరాలు నడవటమనే అలవాటు ఎప్పుడూ లేదు. అదీకాక అంతటిక్రితం రాత్రే నేను అతన్ని చూచాను అతడితో విందారగించాను. క్రితంనాటి సంభాషణను బట్టి ఇటువంటి రిజిస్టరు ఉత్తరం రావటానికి తగ్గ కారణాలను ఊహించటానికైనా ఏమీ కన్పించలేదు. లేఖలో ఉన్న అంశాలు నా ఆశ్చర్యాన్ని మరింత వృద్ధి చేశాయి. ఆ ఉత్తరం ఇలా నడిచింది.

“20 డిసెంబరు 18 –

“ప్రియమిత్రుడా! లాన్యన్! – మీరు నాకు అత్యంతచిరకాలమిత్రుల్లో వారు. శాస్త్రీయ విషయాలల్లో మనం ఇద్దరం పరస్పరం వ్యతిరేకభావాలను కలిగినవాళ్ళం అయినప్పటికీ, మన అనురాగాల విషయంలో ఎటువంటి అవాంతరాలూ వచ్చినట్లు నా మటుకు నాకేమీ జ్ఞప్తికి రావటం లేదు “జెకిల్! నా జీవితం, నా గౌరవం, నా వివేకం, అన్నీ మీ మీద ఆధారపడి ఉన్న” వని మీరు ఎప్పుడైనా అంటే, నా సర్వైశ్వర్యాన్నీ మీ కోసం త్యాగం చేయటానికి నేను సిద్ధపడనిది గానీ, నా దక్షిణహస్తాన్ని మీకు అందించనిది గానీ ఒక్క దినమైనా లేదు. లాన్యన్! నా జీవితం, నా గౌరవం, నా వివేకం, అన్నీ ఈ నాడు మీ దయమీద ఆధారపడి ఉన్నవి. ఈ రాత్రికి మీరు నన్ను ఆదుకోకపోతే నేను అంతరించినట్లే. ఈ ఉపోద్ఘాతం చదివిన తరువాత నేనేదో అప్రతిష్ఠాకరమైన వాంఛను కోరబోతున్నానని మీరు ఊహించే ఉంటారు. అంతా చదివిన తరువాత మీరు బాగా యోచించి నిర్ణయించి ఉంటారు.

“మంచం పట్టి మహారాజు మిమ్మల్ని రావలసిందని పిలుపు పంపించినా సరే – ఇవాళ రాత్రి మీరు నా కోసం సమస్తవ్యవహారాలనూ

వాయిదా వేయమని ప్రార్థిస్తున్నాను. మీ సొంతబండి ద్వారం దగ్గర ఉంటే సరి, లేకపోతే ఒక బండిని కిరాయికి మాట్లాడి ఉంచండి. మనం ఇరువురమూ సంప్రదించటం కోసం ఈ ఉత్తరాన్ని మీ జేబులో పెట్టుకొని సూటిగా మా ఇంటికి రండి. నా బట్లర్ పూల్‌కు ఇవ్వవలసిన ఆదేశాలను ఇతఃపూర్వమే ఇచ్చి ఉంటాను. అతడు ఒక తాళాలవాడితో కలిసి మీ రాకకోసం అక్కడ ఎదురు చూస్తుంటాడు, మీరు ఒక్కరే గదిలో ప్రవేశించి ఎడమవైపున బీరువాలలో 'ఇ' అనే గుర్తు ఉన్న పింగాణీ పూతగల బీరువాను తెరవండి. ఇకవేళ అది తాళం వేసి ఉంటే, అది పగులగొట్టి అయినా, తెరవండి. అందులోని నాలుగో సొరుగును, ఉన్న వస్తువులన్నిటితో పాటుగా, బయటికి లాగండి. ఆ సొరుగు పైనుంచి లెక్కించినప్పుడే నాలుగోది క్రిందినుంచి లెక్కించినప్పుడు మూడోది ఔతుంది. ప్రస్తుతం నాకు మనఃస్తిమితం లేకుండా ఉంది. అందువల్ల వ్రాసే ఈ ఉత్తరంలో మీకు వివరాలను ఏమైనా తప్పుగా ఇస్తున్నానేమో అని అనుమానంగా కూడా ఉంది. ఒకవేళ నేను పొరబాటుగా సూచిస్తున్నా, అందులోని చూర్ణాలు, బుడ్డీ, కాగితపు పుస్తకాన్ని బట్టి, మీరు నిజమైన సొరుగు ఏదో తెలుసుకో గలరు. ఉన్నదాన్ని ఉన్నట్లుగా మీరు ఆ సొరుగును "కావెండిష్ స్క్వేరు"కు తీసుకోరావలసిందని నేను ప్రార్థిస్తున్నాను.

"మీరు నాకోసం చేయవలసిన సాయంలో ఇది మొదటిభాగం. ఇక రెండోభాగం. ఈ లేఖ మీకు చేరిన తరువాత, ఒకవేళ మీరు ఎక్కడికైనా వెళ్ళితే, ఇంకా కొంతసేపటికి గాని అర్ధరాత్రి కాకముందే ఇంటికి వచ్చేయండి. ముందుగా ఊహించటానికి గాని, ఆపుకోటానికి గాని వీలు లేని ఆటంకాలు ఏమైనా కలగవచ్చు. కనకనే మిమ్మల్ని ఇంతముందుగా రమ్మని కోరుతున్నాను. తరువాత మీరు సాగించవలసిన కార్యక్రమానికి మీ గృహంలోని సేవక సేవికాగణం నిద్రపోతూ ఉన్న సమయం అత్యుత్తమమైంది. అప్పుడు అర్ధరాత్రి సమయంలో, మీరు రోగులను పరీక్షించే గదిలో ఏకాంతంగా ఉండండి. ఆ సమయంలో మీ ఇంటికి నా పేరు చెప్పి వచ్చే అతిథిని మీ స్వహస్తాలతో ఆహ్వానించండి. లోపలికి తీసుకోవెళ్ళండి. అప్పుడు మీరు అతనికి నా కార్యాలయం నుంచి తెచ్చిన సొరుగును అతనిపరం చెయ్యండి. ఇంతటితో మీరు మీ పాత్రను

నిర్వహించిన వారౌతారు. తరువాత అయిదు నిమిషాలల్లో ఇదంతా ఏమిటని మీరు వివరణను కోరితే, అప్పుడు ఈ ఏర్పాట్లు సర్వం ఏమిటో, ఎంత ప్రముఖమైనవో, అర్థమౌతుంది. ఇవి అతివిచిత్రమైనవిగా మీకు కన్పించినా, నిర్లక్ష్యం చేసి వీటిని చేయకపోవటం వల్ల నా మృతికి లేదా నా వివేకనాభంగానికి మీరే కారకులైరని మీ మనస్సును తరువాత ఎంతో నిందించుకొంటారు.

"ఈ నా మనవిని మీరు త్రోసిపుచ్చరనే గాఢవిశ్వాసం నా కెంతగానో ఉంది. అటువంటి దేమైనా జరగటానికి అవకాశం ఉన్నదేమో అని ఊహామాత్రంగానైనా నాకు తోచినప్పుడు, హృదయం క్రుంగిపోతున్నది. నా చేయి వణికిపోతున్నది. ఎంతటి అతిశయంగా ఊహించినా అందుకోజాలని అంధకారబంధురమైన దుఃస్థితిలో, ఒక విచిత్ర విజనప్రదేశంలో, నేనున్నాన మీరు తెలుసుకోండి. అయితే ఒక విషయాన్ని గ్రహించండి. సమయానికి మీరు నాతో సహకరిస్తే గతించిన గాథలా నా ఆపదలు సర్వం మటుమాయమై పోతాయి. ప్రియమైన లాన్యన్! నాకు సహాయం చెయ్యండి. నన్ను రక్షించండి!

"మీ మిత్రుడు హెచ్.జె."

"పునః – ఈ ఉత్తరాన్ని సీలు చేసిన తరువాత నన్నొక క్రొత్తభీతి ఆవరించింది. తపాలా కార్యాలయం నన్ను మోసగించవచ్చు. ఈ లేఖ రేపటి ఉదయం దాకా మీ చేతికి చేరకపోవచ్చు. అటువంటి సందర్భంలో, ప్రియమైన లాన్యన్, పగటివేళనే, మీకు ఎప్పుడు అవకాశం లభిస్తే అప్పుడు, వెంటనే, నాకీపని చేసిపెట్టండి. రాత్రికి నా దగ్గరనుంచి ఒక వార్తావహుడు వస్తాడు అతనికోసం ఎదురు చూడండి. అప్పటికే రాత్రి చాలా భాగం గడిచిపోయి ఉంటుంది. ఒకవేళ ఆ రాత్రికి మీ దగ్గరకు ఎవరూ రాకపోతే, హెన్రీ జెకిల్ అయిపోయినాడని నిశ్చయించండి."

"ఈ ఉత్తరం చదవటం పూర్తికాగానే నా సహచరుడు ఉన్మత్తుడై పోయినాడని నేను నిశ్చయించుకున్నాను. అది అనుమానరహితంగా సత్యమే అని నిరూపణ అయ్యేటంత వరకూ అతని వాంఛను తీర్చటం నా కర్తవ్యం అని నిర్ణయించుకొన్నాను. అయోమయంగా ఉన్న ఆ ఉత్తరాన్ని అర్థం చేసుకోటం ఎంతో దుర్ఘటంగా ఉంది. అందువల్ల దాని ప్రాముఖ్యాన్ని గ్రహించటం కూడా అంత కష్టమైంది. అంత వేదనతో వ్రాసిన ఆ మనవిని, తీవ్ర బాధ్యత వహించకుండా త్రోసి పారవేయటానికి కూడా

వీల్లేదు. వెంటనే బల్ల దగ్గరనుంచి లేచాను. వాహనం ఎక్కి సూటిగా జెకిల్ ఇంటికి వెళ్ళాను. బట్లరు నా రాకకోసం అక్కడ నిలబడి ఎదురు చూస్తున్నాడు. నాకు మల్లెనే అతనికీ ఒక రిజిస్టరు కవరు వచ్చిందట! సంగతులు గమనించి వెంటనే ఒక తాళాల మనిషికీ, కొయ్య పనిమనిషికీ కబురు పెట్టాడు. మేము ఇద్దరం మాట్లాడుకుంటున్నప్పుడే ఆ తాళాల మనిషీ, వడ్రంగీ ఇద్దరూ వచ్చేశారు. మేమంతా ఒక బృందంగా పూర్వపు డాక్టరు డాన్మన్ గారి శస్త్రచికిత్సాలయం వైపుగా బయలుదేరాం. (మీకు బాగా తెలిసిన విషయమే) అదులోనుంచి జెకిల్ ఆంతరంగిక కార్యాలయంలోకి సుగమంగా చేరుకోవచ్చు. ద్వారం చాలా బలకరమైంది. తాళం కూడా మంచి గట్టిది. బలవంతంగా తలుపులు తెరిచేటట్లయితే ద్వారానికి బాగా దెబ్బలు తగులుతాయని వడ్రంగి ముందుగానే స్పష్టం చేశాడు. తాళాలవాడు కొంత తంటాలుపడి నిస్పృహ చెందాడు. కానీ అతడు మంచి కర్మకౌశలం కలవాడు. రెండుగంటల కాలం శ్రమపడ్డాడు. తలుపు తెరిచాము. 'ఇ' గుర్తు ఉన్న బీరువా తెరిచే ఉంది. దానిలోనుంచి సొరుగును తీసి, చెత్తతో నింపి ఒక కాగితంలో చుట్టి, దానితో కావెండింష్ స్క్వేర్‌కు తిరిగి వచ్చాను.,

"ఇక్కడకు చేరింతరువాత ఆ సొరుగులో ఉన్న సామగ్రిని పరిశీలించటం ప్రారంభించాను. అందులో ఉన్న చూర్ణాలు అందంగా తయారైనవి. కానీ వాటిలో రసాయనిక ద్రవ్యవిక్రేతల నైపుణ్యం కనిపించటం లేదు. అందువల్ల అవి జెకిల్ స్వయంగా తయారుచేసినవి అని స్పష్టంగా తెలిసిపోతున్నది. ఒక పొట్లం విప్పి చూచాను. అందులో ఉన్నది ఒక స్ఫటిక క్షారచూర్ణం. ఒక బుడ్డి తరువాత నా దృష్టిని ఆకర్షించింది. అందులో సగంవరకూ రక్తవర్ణంగల ఒక రసాయనికద్రవ్యం ఉంది. అది వాసనకు చాలా వెగటుగానూ, ఘాటుగానూ ఉంది. అందులో ఉన్న పుస్తకం అతిసామాన్యమైన జ్ఞప్తికాగ్రంథం. అందులో కొన్ని తారీఖులు తప్ప మరేమీ కన్పించలేదు. ఈ తేదీలు చాలా సంవత్సరాలకు పూర్వం హఠాత్తుగా ఆగిపోయి ఉన్నవి. అది నేను గమనించాను. అక్కడక్కడా తారీఖులకు ప్రక్కన సూక్ష్మమైన గమనిక చిహ్నాలు పెట్టి ఉన్నవి. కొన్ని వందల్లో ఏ ఒక్కమాటో 'ద్విరుక్తమ్' అన్నమాట చాలా కొద్దిమారులు, ఏ ఆరుమాట్లో, కన్పించినవి. ఆ పట్టికల ఆదిలోనే ఒకమారు 'సంపూర్ణాపజయం' అన్న పదం కనిపించింది. నాకు బోధపడలేదు. ఇంకో అరఖు ఉన్న మరొకబుడ్డీ, ఒక క్షారపు పొట్లం (జెకిల్ సాగించిన అనేకప్రయోగాలవలె) ఎటువంటి ప్రత్యక్షప్రయోజనాన్ని సాధించిన పరిశోధన ఫలితవేదికలనూ తరువాత నేను చూచాను. ఈ వస్తువులను తెచ్చి నా ఇంట్లో ఉంచటంతో చెరిగిన గుండెగల నా మిత్రుని గౌరవ సభ్యతలకుగానీ,

జీవితానికి గానీ ఉన్న సంబంధం ఏమిటి? అతడి వార్తావహుడు సమయానికి రాలేకపోవటం ఎందుకు జరుగుతుంది? అతన్ని ఒక పనిమీద పంపితే అక్కడికి చేరగలిగినప్పుడు, మరొక పనిమీద మరొకచోటికి పంపితే చేరలేకపోవటం ఎలా జరుగుతుంది? ఒకవేళ ఏదైనా అంతరాయం కలగవచ్చుననే అనుకుందాం. అతన్ని నేను రహస్యంగా ఎందుకు ఆహ్వానించాలి? దీన్నిగురించి ఆలోచించిన కొద్దీ ఒక మానసిక వ్యాధిగ్రస్తునితో నేను వ్యవహరిస్తున్నానన్న విశ్వాసం నాకు గాఢం కావటం ప్రారంభించింది. సేవకులందరూ నిద్రించవలసిందని ఆజ్ఞాపించినప్పటికీ, ఆత్మరక్షణ చేసుకోవలసిన పరిస్థితి ఏదైనా ఏర్పడుతుందేమో అన్న ఉద్దేశంతో, నా రివాల్వరు నిండా తూటాలు ఎక్కించి ఉంచాను.

"లండన్‌లో పన్నెండు గంటలు పూర్తిగా వినిపించాయో లేదో, ఎవరో వచ్చి నెమ్మదిగా వారి తలుపు తట్టారు. పిలుపు విని నేనే స్వయంగా వెళ్ళి నావలభిలో స్తంభాలకు చాటుగా నక్కిఉన్న ఒక మరుగుజ్జు మనిషిని చూచాను.

"నీవు డాక్టర్ జెకిల్ పంపిస్తే వచ్చావా?" అని అతన్ని ప్రశ్నించాను.

"అతడు గొంతు బిగబట్టినట్లుగా నటించి "ఔ" నని సంజ్ఞ చేశాడు. లోపల ప్రవేశించివలసిందని నేను ఆజ్ఞాపించినప్పుడు, అతడు ఒకమాటు వెనక్కు తిరిగి దూరాన ఉన్న చత్వరంలోని అంధకారంలోకి తన అన్వేషణాత్మకదృష్టిని నిగుడ్చకుండా దాన్ని పాటించ లేకపోయినాడు. అవతలి దూరంలో ఒక రక్షకభటుడు తన 'అనధ్వనేత్రాన్ని' విస్ఫారితం చేసి ముందుకు నడిచి వస్తున్నాడు. అంతటితో ఆ ఆగంతుకుడు కదిలి అతివేగంగా ఇంట్లోకి నడవసాగాడు.

"ఈ విశేషాలన్నీ నాకు చాలా అసహ్యాన్ని కలిగించాయని నేను తప్పక ఒప్పుకొని తీరుతాను. నేను రోగులను సంప్రదించే గదిలోకే అతన్ని నడిపిస్తున్నాను. అతన్ని అనుసరిస్తున్నప్పుడు నా చేయి ఆయుధంమీదనే పెట్టి ఉంచాను. ఆ గదిలోకి వెళ్ళింతరువాత అక్కడ నేను అతన్ని స్పష్టంగా చూడగలిగాను. అంతవరకూ నా కళ్ళను ఒక్కమారైనా అతడిమీదికి ప్రసరించలేదు. నేను వెనక చెప్పినట్లు అతడు పొట్టివాడు. అంతేకాదు, అతని కండరాల కదలిక శరీరదౌర్బల్యంతో మిళితమై, అతని ముఖంలోని కఠోరభావాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇది నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. ఇరుగుపొరుగువారు కల్పించిన వ్యథలవల్ల ఆ వ్యక్తి అలా ఐపోవటం నన్ను అన్నిటికంటే విశేషంగా ఆకర్షించింది. కొన్ని నిర్బంధనియమాలను శరీరాన్ని కట్టిపడేయటంవల్ల

నాడి కూడా నీరసించినట్లు వ్యక్తమైంది. ఆ వ్యక్తికి అరోచకాన్ని కల్పించిన కొన్ని సందర్భాలు కారణంగా అతనికి ఉన్మాదం కలిగిందని నేను అప్పుడు ఊహించాను. అయితే అతనిలో ఆ ఉన్మాదలక్షణాలు అంత తీవ్రంగా పనిచేస్తున్నందుకు ఎంతో వింత పడ్డాను. అప్పటినుంచీ కేవలం ఒక రోతగాని, విద్వేషంగాని ఇంతటి శారీరక పరివర్తనను తీసుకోరాలేదనీ, అయితే దీనికి కారణం ఏదో అతని ప్రకృతిలోనే గూఢంగా జనించి ఉందనీ నేను భావించటానికి, భావించినదాన్ని విశ్వసించటానికీ, తగ్గ కారణాలు కన్పించాయి.

"(ప్రవేశించిన మొదటి క్షణంనుంచీ నాలో అసహ్యాకరమైన ఆసక్తిని ప్రేరేపించాడని వర్ణింపగల) ఆ వ్యక్తి సామాన్యులకు నవ్వు పుట్టించే దుస్తులు ధరించాడు. అవి చాలా విలువైనవీ, హుందాతనం గల గుడ్డతో తయారైనవీ అయినప్పటికీ, ప్రతి కొలతలోనూ అవి అతని శరీరానికి చాలా పెద్దవి. అతడు తొడిగిన లాగూ ఎంతో పొడుగ్గా ఉండి, పాదాలమీద వ్రేలాడుతూ, నేలమీద జీరాడకుండా వెనక్కు మడిచి ఉంది. అతడు ధరించిన కోటు పిరుదులు దాటి ఇంకా క్రిందికుంది. మెడపట్టీ భుజాల క్రిందిదాకా వచ్చింది. అతడు ఇటువంటి పరిహాసాస్పదమైన వేషంలో ఉన్నా నాకు నవ్వు కలగకపోవటం, అన్నిటికంటే అతివిచిత్రమైన విషయం. నా ఎదుట నిల్చిన – ముట్టడి చేసే, ఆశ్చర్యకరమైన విప్లవాన్ని ప్రేరేపించే – వ్యక్తికి ప్రకృతి తత్త్వంలోనే వికృతి ఉండటం వల్ల, ఆ వికృతి మనస్సును కలవరపెట్టి రోత కలిగించేది కావటం వల్లా, అతడు ధరించిన దుస్తులవల్ల కలిగే వికారం అందులో అంతర్భాగంగానే నాకు గోచరించి ఉంటుంది. అతని ప్రవృత్తి, కథావిశేషాలూ, ఆస్తిపాస్తులూ తెలుసుకోవలెననే కుతూహలం కూడా నాకు కలిగింది.

"వ్రాయటం కావటంచేత ఇంత దీర్ఘంగా చెప్పిన ఇవన్నీ, అప్పుడు నా మనస్సులో కొద్దిక్షణాలలో భాసించిన ఊహావిశేషాలు. నా ఇంటికి వచ్చిన ఈ ఆగంతుకుడు తత్తరపడి ఏదో ఊష్మంతో ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు. 'అది మీరు తెచ్చారా?' అని ఆ వ్యక్తి కేక పెట్టాడు. అతడు తన ఆదుర్దాలో ఎంతో ఉత్తేజితుడై కన్పించాడు. అలా అడిగేటప్పుడు అతడు నా భుజంమీద చేయి వేసి అమాంతంగా ఒక్కమాటు ఊపి వేయటానికి యత్నించాడు.

"అతడి స్పర్శవల్ల నా రక్తం మంచు సోకినట్లు ఝల్లుమనటం వల్ల నేను అతన్ని వెనక్కు త్రోచి ఉంచాను. "బాబూ! రండి. మీకు ఇష్టమైతే కూర్చోండి. ఇంతకుపూర్వం

మీ పరిచయం నాకు లేదని మీరు మరిచిపోయినట్లున్నారు" అన్నాను. ఆచారంగా నేను కూర్చొనే కుర్చీలో కూర్చొని అతనికి స్థానాన్ని చూపించాను. రాత్రి పోయిన ప్రొద్దు, నాకున్న ప్రవృత్తుల స్వభావం, ఆగంతుకుడు కల్పించిన భీతి నన్ను ఎంతవరకు స్వస్థితిలో నిలుపగలవో ఆ స్వస్థితిని బట్టి అతని యెడ వైద్యసహాయాన్ని ఆర్థించి నా వద్దకు వచ్చే రోగియెడ చూపే ప్రవర్తనరీతినే సాధ్యమైనంతగా ప్రకటించాను.

"డాక్టర్ లాన్యన్! నన్ను క్షమించండి" అని అతడు తగినంత మర్యాదతో సమాధానమిచ్చాడు. "మీరన్నది సత్యం. నా ఆతురతవల్ల ఎరుకపరచుకోటమనే సభ్యతను పాటించటం మరిచిపోయాను. నేను మీ సహచరుడు డాక్టర్ హెన్రీ జెకిల్ పంపిస్తే ఒక ముఖ్యమైన పనిమీద మీ దగ్గిరికి వచ్చాను. నేననుకుంటాను..." అని హఠాత్తుగా రెండు చేతులతో తన గొంతుకను పట్టుకున్నాడు. అతడు పైకి క్రమ్ముకోవస్తున్న ఉన్మాదపుతెరను రానివ్వకుండా అడ్డుకోటానికి అవస్థ పడుతున్నట్లు కన్పించాడు. "నేననుకుంటాను.. ఒక డ్రాయరు సొరుగును..."

"ఈ స్థితిలో ఆ ఆగంతుకుని అవస్థయెడా, నాలో అధికమౌతున్న ఆసక్తిమీద నేను కొంతగా జాలి వహించాను. (నాకు ఇంకా ఏమి జరగబోతుందో అన్న ఆసక్తి అధికం కావటం ప్రారంభమైంది)

"అయ్యో! అదిగో సొరుగు అక్కడుంది" అని నేలమీద, బల్లకు వెనక, ఇంకో కాగితం కప్పి ఉన్న డ్రాయరు సొరుగును చూపించాను.

"అతడు ఒక్క అంగన ఒక్కడికి వెళ్ళాడు. అక్కడ ఆగాడు. గుండెమీద చేయి వేసుకొని చూచుకున్నాడు. స్మృతి తప్పినప్పుడు ఆడిపోతున్న దవడలకు అనుకూలంగా అతడు దంతాలతో పటపటమని ధ్వని చేయటం నాకు వినిపించింది. చూడటానికి అతని ముఖం అతిభీకరంగా ఉంది. అతని ప్రాణం, వివేకం ఏమైపోతాయో అని నేనే ఆదుర్దా పడ్డాను.

"శాంతి చేకూర్చుకోండి  సంబాళించుకోండి" అని అన్నాను.

"అతడు నా వంకచూచి అతిభీకరంగా మందహాసం చేశాడు. నిరాశతో ఏదో నిర్ణయం చేసినట్లు కనిపించి సొరుగుమీద చుట్టి ఉన్న కాగితాన్ని లాగి పారేశాడు. అందులో ఉన్న వస్తువులను చూడగానే అతడు ప్రాణం తెప్పరిల్లినట్లుగా ఒక్కమారు వెక్కుపెట్టి పెద్దగా ఏడ్చాడు. ఇదంతా చూస్తున్న నేను నిశ్చేష్టుడినైపోయినాను.

మరుక్షణంలోనే స్వాధీనానికి వచ్చిన కంఠస్వరంతో "మీ దగ్గర కొలత గ్లాసు ఉందా?" అని అతడు ప్రశ్నించాడు.

"కొంత ప్రయాసపడి లేచి అతడు అడిగిన వస్తువును తెచ్చి ఇచ్చాను.

"చిరునవ్వుతో తల ఊపుతూ నాకు అతడు కృతజ్ఞతను వెలిబుచ్చాడు. ఎర్రని అరఖులోనుంచి కొలతగా కొన్ని చుక్కలు గ్లాసులో వేసి, దానిలో ఒక చూర్ణాన్ని కలిపాడు. ఆ మిశ్రమం రంగు మొదట ఎర్రగానే ఉంది. అందులో వేసిన స్ఫటికాలు కరుగుతున్నకొద్దీ అతికాంతిమంతమౌతున్నది. క్రమంగా ఆ మిశ్రమం పొంగి నురగమీది తుంపురులు ఎగిరిపడుతున్నవి. కొంతసేపటికి పొంగు ఆగింది. తరువాత ఆ మిశ్రమం రంగు ఊదాగా మారింది. ఆ రంగు కూడా క్రమంగా విరిసి లేత ఆకుపచ్చరంగుగా మారింది. ఆ ఆగంతుకుడు కలిగే ఈ మార్పుల నన్నిటినీ అతిశ్రద్ధతో గమనిస్తూ, తుదకు ఒక చిరునవ్వు నవ్వి గ్లాసును బల్లమీద పెట్టాడు. నా వైపు తిరిగి నన్ను పరికించి చూచాడు.

"ఇకముందు జరగవలసినదానికి వస్తాను" అని అతడన్నాడు. "మీరు వివేకం వహిస్తారా? క్రమపద్ధతిని అనుసరిస్తారా? ఎటువంటి ప్రసంగం చేయకుండా ఈ గ్లాసును నా వెంట తీసికోపోనిస్తారా? లేకపోతే ఇదంతా ఏమిటో తెలుసుకుందామన్న కుతూహలం మిమ్మల్ని వెన్నాడుతున్నదా? మీరే నిర్ణయం చేస్తే అలా జరుగుతుంది కనుక బాగా ఆలోచించి నిర్ణయించండి. మీరు ఉన్నట్లే ఉంటే మీలో కలిగే మార్పు ఏమీ ఉండదు. మీకు ధనం చేకూరదు విజ్ఞానం పెరగదు. కానీ ఒక దుఃస్థితిలో ఉన్న మిత్రుడికి సహాయం చేయటమనే సంతృప్తి కలుగుతుంది. లేదా మీరు తెలుసుకోవలెననే నిర్ణయిస్తే మీ కోసం ఒక నూతన విజ్ఞానరాజ్యాన్ని, కీర్త్యధికారాలకు నిలయమైన నవ్యమార్గాన్ని తత్క్షణమే, మీ ముందే, ఈ గదిలో నేను ప్రదర్శించి చూపిస్తాను. సైతాను నాస్తికత్వాన్ని కూడా పారద్రోలగల మహాద్భుత ప్రతిభాసంపన్నుని మూలంగా మీరు దిగ్భ్రమ పొంది తీరుతారు!" అన్నాడు.

"ఆ సమయంలో నాలో నిజంగా లేని నిబ్బరాన్ని ప్రదర్శిస్తూ "అయ్యా! మీరన్నీ ఏవో చిత్రవిచిత్రాలు సెలవిస్తున్నారు. మీరు చెప్పే విషయాలమీద, కేవలం వినటం వల్ల, నాకు గాఢవిశ్వాసం కలగటం లేదంటే మీరు ఆశ్చర్య పడరనుకుంటాను. మీరేదో నేను పరోపకారాన్ని చేశానంటున్నారు. అది ఎలా చేశానో నాకేమీ బోధపడటం

లేదు. దీని పర్యవసానమేమిటో చూద్దామనే ఉద్దేశంతో నేనే మీకు కావలసిన సేవలు చేస్తూ ఇక్కడ ఉన్నాను" అని అన్నాను.

"సరే మంచిది" అన్నాడు అతడు. "ఇదివరకు మీరు చేసిన కొన్ని శపథాలు జ్ఞప్తి కున్నవనుకుంటాను. ఇకముందు జరగబొయ్యేదంతా మన వృత్తికి సంబంధించిన రహస్యం. ఇంతవరకు మీరు అతిసంకుచితాలైన భౌతికసిద్ధాంతాలకు మాత్రమే కట్టుబడి వ్యవహరించారు. కానీ నేను ఆత్మ నుద్ధరించుకొనే ఔషధప్రభావం ఉన్నదని చెప్పినపుడు మీరు ధిక్కరించారు. మీకంటే ఘనులైనవారిని ధిక్కరించిన మీకు, ఇదిగో ఆ ప్రభావాన్ని చూపిస్తున్నాను. చూడండి" అన్నాడు.

"ఆ గ్లాసును పెదవుల దగ్గర పెట్టుకొని అందులో ఉన్న మిశ్రమాన్నంతటినీ ఒక్క గుటకలో అతడు త్రాగేశాడు. వెంటనే ఒక పెద్ద వెర్రికేక వినిపించింది. అతడి తల తిరిగిపోతున్నది. తూలి వాలిపోతున్నాడు. బల్ల పట్టు చిక్కించుకొని పడిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు. లోపలికి పీక్కుపోతున్న కళ్ళతో చూస్తూ నోరు తెరిచి నిండా గాలి పీలుస్తున్నాడు. అతన్ని గమనిస్తున్న నాకు అతనిలో ఏదో మార్పు వస్తున్నట్లు తోచింది. అతడు పెరిగి పెరిగి ఉబ్బిపోతున్నాడు. అతని ముఖమంతా హఠాత్తుగా నల్లబడిపోతున్నది. అతని శరీర లక్షణాలన్నీ కరిగి మార్పు పొందుతున్నట్లు కన్పిస్తున్నది. మరుక్షణంలో నేను అమాంతంగా కుర్చీలో నుంచి వెనక్కు గంతేసి గోడమీద పడ్డాను. ఆమహిమాన్వితుడి వల్ల కలగబోయే ప్రమాదం ఉన్నదని ఊహించి రక్షించుకోటానికి నా చేయి పైకెత్తాను. నా మనస్సు భయానక మహాసముద్రంలో మునిగిపోయింది.

"అనేక పర్యాయాలు 'ఓ ప్రభూ! ఓ ప్రభూ!' అని కేకలు పెట్టాను. అప్పుడు నా కళ్ళముందు – పాలిపోయి వణికిపోతూ, స్పృహ సగంగా తప్పిపోయి తన్ను తానే తడివి చూచుకుంటూ, మృత్యువు బారినబడి తిరిగి తన్ను పునరుద్ధరించుకొన్న వ్యక్తిలాగా – నిల్చున్నాడు హెన్రీ జెకిల్!

తరువాత ఒక గంటసేపు నాతో చేసిన ప్రసంగంలో అతడు ఏమేమి చెప్పాడో కాగితం మీద పెట్టటానికి నాకేమీ జ్ఞాపకం రావటం లేదు. చూచిందేదో చూచాను విన్నదేదో విన్నాను. దానితో నా మనస్సు ఎంతో బాధపడ్డది. ఆ దృశ్యం నా కంటి ముందునుంచి తొలగిన తరువాత 'జరిగినదంతా సత్యమేనా?' అని నన్ను నేనే ప్రశ్నించుకొంటున్నాను. దానికి నేనే సమాధానమూ చెప్పలేను. నా జీవితమహావృక్షం వ్రేళ్ళతో పెల్లగిలిపోయింది. నిద్ర నన్ను విడిచిపెట్టింది. ప్రతిదినం రాత్రింబవళ్లు

అఘోరభయం నన్ను వెంటాడుతున్నది. నా రోజులు దగ్గరకు వచ్చినవనీ, నేను మరణించకతీరదనీ భావిస్తున్నాను. నేను మరణించినా అజ్ఞానిగా మరణిస్తాను గాని, మహిమాన్వితుణ్ణిగా మరణించదలచుకోలేదు. జెకిల్ అతని నైతిక ప్రవర్తనను గురించి పశ్చాత్తాపపడుతూ, కన్నీరు కారుస్తూ ఎన్నెన్నో చెప్పాడు. అవి నా మనస్సుకు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా నేను భయకంపితుణ్ణి కాకుండా ఉండలేకపోతున్నాను. (దానిని మీరు గౌరవిస్తే) అట్టర్సన్! ఒక విషయం చెప్పుతున్నాను అది ఒక్కటే చాలు. ఆనాడు నా ఇంట్లో ప్రవేశించిన భూతం హైడ్ అనే నామంతో తిరుగుతున్న వ్యక్తి. ఈ విషయం జెకిల్ ఒప్పుకొన్నాడు. భూమి నలుమూలలా వెతుకుతున్నది 'క్యారూ' హంతకుడైన ఈ హైడ్ కోసమే!

హెస్టీ లాన్యన్."

# 10. హెన్రీ జెకిల్ సమగ్ర వాఙ్మూలం

"నేను ఒక సంపన్నగృహంలో 18 – సంవత్సరాన జన్మించాను. ప్రకృతి సిద్ధంగా నాకు మంచి బుద్ధిబలం లభించింది. శ్రమపడటమంటే నాకు సహజంగా ఎంతో ఇష్టం. విద్వాంసుల మన్ననలూ, సాటివారి ఆదరణ పొందాలని నాకూ అభిలాష అధికం. అందువల్ల నాకు గౌరవార్హమూ, విశిష్టమూ అయిన భవిష్యత్తు ఉండి తీరుతుందని ఊహించటానికి తగ్గ అవకాశాలన్నీ ఉన్నాయి. నాలో ఉన్న లోపమల్లా ఒక్కటే. ముందు వెనుకలు ఆలోచించకుండా ఖుషీగా ఉండే తత్త్వం. ఈ తత్త్వంతో ఎందరి జీవితాలో సుఖంగా గడిచి పోయాయి. కాని పదిమందిలో, తీక్షమైన ముఖంతో, హుందాగా, తలయెత్తుకొని తిరగాలెనన్న తీవ్రమైన వాంఛకూ, పైతత్త్వానికీ పొంతన కుదరటం కష్టమని తేలింది. అందుచేత ఆనందాల నన్నిటినీ నాలోనే గుప్తంగా దాచిపెట్టానన్నమాట! ఆత్మపరిశోధన చేసుకోగల వయస్సు వచ్చిన తరువాత, ఒక్కమారు నా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలించుకొని, ప్రపంచంలో నా స్థితినీ, అభివృద్ధినీ గురించి విమర్శించుకొన్నాను. అప్పటికే నాలో తీక్ష్ణంగా ఈ ద్వంద్వప్రకృతి స్థావరాన్ని కల్పించుకొన్నట్లు గుర్తించాను. నాలో ఉండి నా దృష్టికి లోపాలుగా తోచిన అవలక్షణాలు ఉన్నవాళ్ళు ఎంతోమంది, వాటిని గొప్ప చేసి బాహాటంగా లోకంలో వెల్లడించుకుంటున్నారు. కానీ నేను కొన్ని ఉత్తమజీవితలక్ష్యాలను పెట్టుకోటంవల్ల సిగ్గుపడి, వాటిని గుప్తంచేసి ప్రవర్తిస్తూ వచ్చాను. మానవుల్లో సామాన్యంగా ఉండేవాటికంటే ఈ గుణాలు నాలో అతితీవ్రంగా ఉండి ఒక మహాగర్తాన్ని నిర్మించి నన్ను ఈ రీతిగా రూపొందించాయి. నాలో పొత్తు కలియని సుగుణదుర్గుణరాజ్యాలు రెండేర్పడ్డాయి... అగర్తం ఒక వంక రెంటినీ కలుపుతూ, మరొకవంక విడగొట్టుతూ ఉంది. ఇటువంటి ద్వంద్వస్వభావం, ఇటువంటి ద్వంద్వప్రవృత్తి ప్రతివ్యక్తిలోనూ సమ్మిళితమై ఉంటుంది. కానీ కొందరు వ్యక్తుల్లో ఇది విడివడి కూడా ఉంటుంది. ఇవి నాలో పరిపూర్ణంగా విడివడ్డాయి. ఇందుకు కారణం నాలో ఉన్న అవలక్షణాలు తీవ్రాతితీవ్రమైనవి కావటమే. ఎండని నీటిబుగ్గలా మతానికి మూలమూ, దుఃఖహేతువూ అయిన ఈ మానవజీవిత ధర్మసూత్రాన్ని గురించి తీవ్రంగా నేను వివేచన ఆరంభించాను. ఇంత విశిష్టమైన ద్వంద్వప్రవృత్తి కలవాడిని అయినప్పటికీ నేను

మాయావినిగానీ, మోసకారినీ గానీ కాను. నాలో ఉన్న ఉత్తమ నీచలక్షణాలు రెండూ విడివిడిగానే ప్రవర్తించాయి. పగటివేళ బాధోన్మూలనానికీ, దుఃఖనివారణకూ, విజ్ఞానాభివృద్ధికీ కృషి చేస్తున్నప్పుడు నేనెంత తీవ్రంగా ఉంటున్నానో, అలాగే నా నిగ్రహాన్ని కోల్పోయినప్పుడు కూడా అంత సహజంగానే నీచకృత్యాలను చేస్తుండేవాణ్ణి. అంతరింద్రియశక్తులను గురించీ, ఆత్మోద్ధరణ గురించీ నేను సాధించిన శాస్త్రజిజ్ఞాసల వల్ల నాకు కొంత వివేచనజ్ఞానం కలిగింది. తన్మూలకంగా నాలోని ఉభయప్రవృత్తులకూ – సదసత్ప్రవృత్తులకు, నిరంతరం నాలో ద్వంద్వయుద్ధం జరుగుతున్న ఫలితంగా నాకొక నిత్యసత్యం గోచరించింది. నైతికమూ, జిజ్ఞాసాపరమూ అయిన నా వివేచనజ్ఞానంవల్ల మానవుడు ఏకవ్యక్తి కాదనే నిత్యసత్యాన్ని నేను గ్రహించాను. ఈ సత్యాన్ని నేను కొంతవరకే చూడగలిగాను. అందువల్లనే నా జీవితనౌక భగ్నమైంది. అయితే నేను, సజీవియైన ప్రతి మానవుడూ ఒక వ్యక్తిద్వయసంపుటి అని వాదించగలను. నా పరిశోధనమార్గాలను అనుసరించి, భవిష్యత్తులో కొందరు నన్ను మించి ఎన్నో విషయాలను కనుక్కోవచ్చు. అప్పుడు వారు మానవుడు బహుముఖీనాలూ, పరస్పర విరుద్ధాలూ, స్వతంత్రాలూ అయిన ప్రవృత్తుల సంపుటి అని తప్పక వాదించి తీరుతారు. ఈ విషయాన్ని నేను గాఢవిశ్వాసంతోనూ, అతిశయమైన సాహసంతోనూ ఊహిస్తున్నాను.

నా జీవితలక్షణాన్ని బట్టి నేను ఇందులో ఒకవంకనే, కేవలం ఒకవంకనే, అనంతంగా పురోగమించాను. లోకంలోని నైతికప్రవర్తనను పరిశీలించినా, నా జీవితాన్ని గమనించినా, నాకు మానవుని ప్రాథమిక ద్వంద్వప్రకృతి పరిపూర్ణంగా అవగతమై పోయింది. ఈ విభిన్నప్రకృతులు రెండూ నాలో ఉండటం వల్లనే పరస్పరసంఘర్షణ కలుగుతున్నదని నా అంతరాత్మ విస్పష్టంగా గమనించింది. 'నేను' అంటే ఈ రెండు విభిన్నప్రకృతుల సంపుటి అన్నమాట! – ఒక ద్వంద్వప్రకృతి. ఈ రీతిగా నేను వాదించినప్పటికీ నేను ఈ రెంటిలో ఒక ప్రకృతిలోనే పరిపూర్ణవ్యక్తిత్వంతో ప్రవర్తిస్తున్నానని అంగీకరిస్తున్నాను. ఈ రెండు ప్రకృతులనూ శాస్త్రీయపరిశోధనల ద్వారా వేరు చేయటానికి వీలుందని నమ్మాను. నా శాస్త్రీయపరిశోధనలు నాకు మార్గాన్ని చూపించటానికి ఎంతో పూర్వమే, ఈ విషయాన్ని గురించి నేను ఎన్నెన్నో ఊహలు చేశాను. మానవునిలో ఉన్న ఈ రెండు భిన్నప్రకృతులను విడదీసి భిన్నమూర్తులను రూపొందింప గలిగితే మానవజీవితంలో కన్పించే సమస్త మానసికదుఃస్థితులూ తొలగిపోతవి. సత్ప్రకృతితో అసత్ప్రకృతికి ఎటువంటి బాంధవ్యమూ లేకుండా

విడదీయవచ్చు. ఇలా రెంటినీ విశ్లేషణం చేసి పృథఃకరింప గలిగినప్పుడు మానవుడు దుశ్చింతలకు పాల్పడడు. వాటి ప్రేరణలవల్ల దుష్కార్యాలను చేయడు. పశ్చాత్తాపాలకు గాని, పరాభవాలకుగాని గురికాడు. ఉత్తమ మార్గాలలో సంచరించి ఉన్నతాశయాలను సాధింపగలుగుతాడు. మానసికోల్లాసాన్ని కలిగించే సత్కార్యాలలో సంచరిస్తాడు.

ఈ రీతిగా ఈ భిన్నప్రకృతులనే రెండు మోపులను కలిపికట్టటం, బాధావ్యథితమైన మానసికగర్భంలో ధ్రువాంతరాలు గల ఈ కవలలు నిరంతరం ద్వంద్వయుద్ధం సాగించడం మానవజాతికి తగిలిన మహాశాపం! అయితే ఈ రెంటినీ పృథఃకరించటం ఎలా?

ఈ రీతిగా ఆలోచనానిమగ్నుడినై పరిశోధనాలయంలో బల్లముందు ఉన్నప్పుడు నాకొక వెలుగు కనిపించింది. ఇతః పూర్వం నేను చెప్పిన దానికంటే విస్పష్టరూపంలో, దుస్తులు ధరించి తిరిగే మన దేహంలో కదలాడుతుండే ఒక ద్రవస్వరూపం, ఒక మంచువంటి ఆంతరికశక్తి నాకు గోచరించటం ప్రారంభించింది. ఒక మంటపంలోని తెరలను చండవాయువు కదిలించినప్పుడు కనిపించేటంత స్పష్టరూపంలో, ఈ చర్మసంపుటిని కదలించి అందులోని వ్యక్తులను విడగొట్టే శక్తిగల ప్రతినిధి సాధనాలను నేను ప్రదర్శించగలిగాను. రెండు ఉత్తమకారణాల కారణంగా నేను నా ప్రకటనకు సంబంధించిన శాస్త్రీయవిషయాలను వివరింపదలచుకోలేదు. వాటిలో మొదటికారణం మన జీవితభవిష్యత్తుకు సంబంధించిన భారం మన భుజస్కంధాలమీదనే మోపబడి ఉన్నదాన్ని తొలగించేటానికి యత్నాలు చేస్తే, ఆధారం మరింత తీవ్రంగా, అసాధారణశక్తితో మనమీద జైత్రయాత్రకు రావటం, రెండో కారణాన్ని నా కథనమే మీకు సుస్పష్టం చేస్తున్నది. అది దురదృష్టవశాన నాపరిశోధన అసమగ్రంగా నిలిచిపోవటం. అయితే నాకు ఒకటే సంతృప్తి. నన్ను ఆవరించిన కొన్ని ప్రభావమండలకాంతులనుంచి వేరుచేసి, నేను నా సహజస్వరూపాన్ని గుర్తింపగలిగాను. ఈ శక్తుల ప్రభావాన్ని తొలగించి నాకు సహజాలై, నా అంతరాత్మలో నిద్రిస్తున్న నీచ ప్రకృతులకు వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకోటం కోసం మరొక క్రొత్తరూపాన్ని, ముఖాన్ని ఇవ్వగల ఔషధాన్ని కనుక్కోగలిగాను.

ప్రయోగాత్మకంగా ఈ సిద్ధాంతాన్ని, నిరూపించటానికి ఉపక్రమించ బొయ్యేముందు, నేను ఎంతో సంకోచించాను. ఈ ప్రయోగాన్ని నిర్వహించటంలో ప్రాణాలను పోగొట్టుకొనే అవకాశం కూడా ఉందని నాకు స్పష్టంగా తెలుసు. ఈ ద్వంద్వప్రకృతి దుర్గానికున్న పునాదులను సహా కదిలింపగల శక్తి ఉన్న ఏ మందైనా,

అణుమాత్రంగా మోతాదుకు మించి పుచ్చుకున్నా, సమయానికి పుచ్చుకోకపోయినా, నేను ఆశిస్తున్న పరిపూర్ణనూతనరూపం మూర్తీభవించకపోవటమే కాకుండా, ఉన్న రూపానికి కూడా గొప్ప ముప్పును కలిగించవచ్చు. అయినా నాకు ఈ ఔషధశక్తిని పరీక్షించాలెనన్న ఆసక్తి అపారం కావటం వల్ల, ఎటువంటి ప్రమాదభయసూచనలనూ పరిగణించలేదు. బహుకాలం క్రిందటనే నేను ఈ అరఖును తయారుచేశాను. అందులో మరొక ప్రత్యేకక్షారాన్ని తుది ఔషధంగా చేర్చవలసిన అవసరం ఉంది అని నా పరిశోధనలవల్ల నేను గమనించాను. అందువల్ల రసాయనికద్రవ్యాలలో టోకువ్యాపారం చేసే ఒకడివద్ద ఆ క్షారాన్ని ఒక్కమాటే పెద్దమొత్తంగా కొని ఉంచుకొన్నాను. ఒక పాపిష్ఠిరాత్రి చాలాభాగం గడచిన తరువాత, నేను ద్రవ్యాలన్నింటినీ కలిపి మిశ్రమం చేశాను. అవి అన్నీ మిళితమై ఉడికి ఆవిరి క్రక్కుతూ ఉండటాన్ని గమనించాను. పొంగును చల్లారనిచ్చి ఒక ధైర్యవికాసంతో నేను దాన్ని పుచ్చుకొన్నాను.

శరీరంలో భరించరాని నొప్పులు ఆరంభమయ్యాయి. ఎముకలు గుల్లయిపోతున్నవి. వెర్రివికారం ప్రారంభమైంది. జననకాలం, మరణంకాలం రెంటిలోనూ ప్రాణి పొందే వేదనవంటి వేదన ప్రారంభమైంది. అనతికాలంలో ఈ వేదన క్రమంగా చల్లారింది. నాకు ఒక మహావ్యాధిలోనుంచి బయటపడ్డట్లనిపించింది. నా ఇంద్రియ పరిజ్ఞానంలో ఏదో వింత గోచరించింది. వినూత్నమైన స్పృహ ఒకటి వినూత్నంగానూ, వర్ణనాతీతంగానూ ద్యోతకమైంది. ఆనకొక క్రొత్త రూపు ఏర్పడ్డది. అందలి నవ్యతవల్ల నాకప్పుడు అది మధురాతిమధురంగా కన్పించింది. నాకు ఏదో యవ్వనం వచ్చినట్లు తోచింది. శరీరం తేలికైనట్లు, దేహం నిండా ఆనందం తాండవిస్తున్నట్లు ఒక గర్వం, ఒక నిర్లక్ష్యం నా హృదయాన్ని క్రమ్మివేశాయి. ఇంద్రియ భోగవాంఛలతో నా శిరస్సు మత్తెక్కింది. సమస్త బంధనాలూ విచ్ఛేదం చేసుకొని విశృంఖలంగా విహరించాలని ఆత్మ ఉవ్విళ్లూరుతున్నది. అయితే, ఈ స్వేచ్ఛాభికాంక్ష సత్ప్రయోజనాలను సాధించటం కోసం కాదని నాకు తెలుసు. ఈ నూతన జీవితారంభదశలోనే నాలో పూర్వం ఉంటూ వచ్చిన దౌష్ట్యానికి పదిరెట్లు దౌష్ట్యం మించిందనీ, నేను దానికి బానిసగా అమ్ముడుపోయినానని స్పష్టంగా నాకు తెలిసింది. ఈ భావం నాకు ఆ సమయంలో రుచిగల ద్రాక్షాసవంగా ఆహ్లాదాన్ని కల్పించి కైపెక్కించింది. ఈ నూతనమైన ఇంద్రియ చేతనత్వాలకు ఉబ్బి తబ్బిబైపోతూ, చేతులను ముందుకు చాచి చూచుకొన్నాను. ఈ రూపపరివర్తనలో నాకు కుబ్జత్వం ప్రాప్తించిందని హఠాత్తుగా స్ఫురించింది.

ఆ తేదీనాటికి నా గదిలో భూతద్దం లేదు. ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నప్పుడు నా వెనకనే ఉన్న ఈ అద్దాన్ని తరువాత నా రూపపరివర్తనవిశేషాలను చూచుకోటం కోసం, కొంత కాలానికి తెప్పించాను. ఆ రాత్రి తెలతెలవారబొయ్యే వరకు గడిచింది. ఆ వేళొక సమయంలో నా ఇంట్లో పనివాళ్లందరూ గాఢనిద్రాపరవశులై ఉన్నారు. నూతనంగా ప్రాప్తించిన విజయోత్సాహంతో, నా క్రొత్త రూపంతో, నేను నా శయ్యామందిరంవరకూ వెళ్ళడానికి సాహసించాను. పెరడు దాటాను. నక్షత్రరాశుల చూపులు నా మీద పడ్డాయి. ఎల్లవేళలా అప్రమత్తతతో సర్వాన్నీ తిలకించే ఆ నక్షత్రరాశుల కంటబడని నూతనశరీరధారిని క్రొత్తనైన నేనే కదా అన్న భావం నాకు కలిగింది. నడవలన్నిటిలో నా ఇంట్లో నేనే ఒక క్రొత్త వ్యక్తిగా తిరిగాను. నా గదిలోకి వచ్చి, మొట్టమొదటిసారిగా ఎడ్వర్టు హైడ్ అనే వ్యక్తి ప్రపంచంలో ప్రవేశించటాన్ని చూచాను.

ఇక చెప్పబోయేవి నేను నిర్ణయాలని గ్రహించినవి కావు ఇలా జరగటానికి వీలున్నదని ఊహించినవి కూడా కావు. అటువంటి కొన్ని విషయాలను గురించి తాత్త్విక సిద్ధాంతాత్మకంగా నేను కొంత చెప్పవలసి ఉంది. నా ప్రకృతిలో ఉన్న దుష్టస్వభావాన్ని ఇప్పుడు మూర్తీభవింపజేశాను. కాని ఇది ప్రస్తుతం నాలో నుంచి దూరంగా తొలగించి ఉంచుకొన్న సుస్వభావం వంటి పుష్టినిగాని, పరిమాణాన్నిగానీ కలది కాదు. నా జీవితంలో అధికాంశం, పదింట తొమ్మిది పాళ్లు, నిరంతరసాధనతోనూ, సత్ప్రవర్తనతోనూ, నిగ్రహంతోనూ గడిచింది. అందువల్ల నా దుష్టత్వానికి తగ్గ పోషణ కలక్కపోవటం వల్లా, పరిణామాన్ని పొందేటందుకు అవసరమైన అవకాశాలు లభించకపోవటం వల్లా ఎడ్వర్టు హైడ్ రూపం కుబ్జత్వాన్నీ, లఘుత్వాన్నీ వహించవలసి వచ్చింది. ఈ కారణం వల్లనే హెన్రీ జెకిల్ కంటే ఎడ్వర్టు హైడ్ తరుణమూర్తిగా తయారైనాడు. ఏ రీతిగా జెకిల్ ముఖంలో సుస్వభావం లిఖితమై కన్పిస్తున్నదో, అదేరీతిగా రెండో వ్యక్తి ముఖంలో దుఃస్వభావం విస్పష్టంగా లిఖితమై గోచరిస్తున్నది. ఈ దుస్వభావమే హైడ్ ఆకారానికి వికారాన్నీ, కార్శ్యాన్నీ కలుగజేసింది. కానీ నేను నా హైడ్ రూపాన్ని అద్దంలో చూచుకొన్నప్పుడు ఎటువంటి అసహ్యాన్నీ పొందలేదు. ఆ మూర్తిని హర్షంతో ఆహ్వానించాను. ఆ రూపమూ నాదే. అదీ నా సహజప్రకృతే. అది మానవత్వం కాదనుకోటం పొరబాటు. అదీ మానవత్వమే – మానవలక్షణమే. పరిపూర్ణం గాని ద్వంద్వప్రకృతి నాలో ఉండి ఇంతవరకూ అది నా ముఖాన ప్రతిబింబిస్తుండేది. దాన్ని చూచుకొనే ఇది నేను అని అనుకోటానికి అలవాటు

పడ్డాను. కానీ ఇటువంటి ద్వంద్వప్రకృతిని పృథఃకరించి ఈ క్రొత్తరూపాన్ని పొందిన తరువాత, ఇందులో నా అంతరాత్మ చైతన్యోపేతంగా విహరిస్తున్నది. ఈ ప్రకృతిలో ద్వంద్వస్వభావం లేదు. ఈ మూర్తిలో ఏదో ఒక ప్రకృతే విస్పష్టరూపంతో విలసిల్లుతూ ఉండటం ద్యోతకమైతున్నది. ఇంతవరకూ నేను చేస్తూ వచ్చిన తత్త్వవిచారణ క్రమమార్గాన్నే అనుసరించింది. ఎడ్వర్డు హైడ్ రూపంలో నేను ఉన్నప్పుడు నన్ను చూచిన వారు, నా అవయవనిర్మాణాన్ని బట్టి తప్పక అనుమానించి తీరుతారు. ఇందుకు కారణం ఒకటే అని నా బుద్ధికి తోస్తున్నది. అది ఏమిటంటే ఇంతవరకూ లోకంలో ఉన్న వ్యక్తులందరూ సదస్ప్రకృతుల మిశ్రమూర్తులై ఉండటమే. సర్వమానవజాతిలో ఎడ్వర్టు హైడ్ ఒక్కడే ఎటువంటి మాలిన్యం లేని దుఃస్వభావం గల వ్యక్తి. ఇది భిన్నసంశయం.

ఒక్క క్షణకాలం నిలువుటద్దం దగ్గర తారట్లాడాను. ఇంకా సారాంశాన్ని తేల్చే శక్తి గల రెండో ప్రయోగాన్ని చేయవలసి ఉంది. నా నిజస్వరూపం పోతుందేమో, పోతే తెల్లవారే లోపల ఇకముందు నాది కాజాలనట్టి నా ఇంట్లోనుంచి నేను వెళ్ళిపోవలసి ఉంటుందేమో చూడవలసి ఉంది. వెంటనే నా పరిశోధనానలకు వెళ్ళి మిశ్రమాన్ని తయారుచేసి త్రాగాను. మళ్ళీ రూపపరివర్తన పొందటానికి నాలో వేదన ప్రారంభమైంది. తిరిగీ నేను హెన్రీ జెకిల్ స్వభావంతో, స్వరూపంతో నేను నేనైనాను. ఆ రాత్రి నా జీవితయాత్రలో నేనొక సమద్విఖండమార్గానికి వచ్చాను. ఉదారాశయాలతో నా పరిశోధనలు సాగించి ఉన్నట్లయితే, పునీతభావాలతో సాహసాన్ని చేకొన్నట్లయితే, అంతా మరోరీతిగా జరిగి ఉండేది. ఇటువంటి రూపపరివర్తనలలో జననమరణాలవల్ల కలిగే వేదన మూలంగా నేను ఒక పెనుభూతంగా పరిణమించేవాణ్ణి కాను ఒక దివ్యమూర్తినయ్యేవాణ్ణి. నేను కనిపెట్టిన ఔషధానికి ఎటువంటి విచక్షణశక్తీ లేదు. అది దివ్యమూ కాదు పైశాచికమూ కాదు. కానీ దానికి నా 'ఉనికి' అనే కారాగార ద్వారాలను బ్రద్దలుకొట్టగల శక్తి ఉంది. అందులో ఉన్న వ్యక్తులు ఫిలిప్పీబందీలలాగా విజృంభించినవి. అప్పుడు నా సత్స్వభావం నిద్రిస్తూ ఉన్నది దుఃస్వభావం మేల్కొన్నది. అది అతివేగంగా అవకాశాన్ని పుచ్చుకొని విజృంభించటానికి సిద్ధపడి ఉంది. దానిమూలంగా ఎడ్వర్టు హైడ్ ఉద్భవించాడు. అందులో ఒకటి విస్పష్టంగా దుష్టమైంది. రెండవది పరస్పరం అసంబద్ధాలైన స్వభావద్వయానికి మిశ్రరూపం. అది వృద్ధమూర్తి హెన్రీ జెకిల్. నేను ఈ మూర్తిని కూడా సంస్కరించాలని యత్నించి నిరాశను పొందాను. అందువల్ల నా ఉద్యమం సర్వం పరిపూర్ణంగా నీచత్వం వంకకే మ్రొగ్గింది.

విద్యావ్యాసంగ జీవితంలో ఉన్న మాధుర్యవిహీనతను నేనెప్పటికైనా జయించలేకపోయినాను. అయినప్పటికీ నాకు ఆనందసమయాలంటూ లేకపోలేదు. అయితే నాకు సంతోషాన్ని ప్రసాదించేవి (కొంతవరకైనా చెప్పవలసివస్తే) నీతివిరహితాలు, గౌరవరహితాలూ అయిన కృత్యాలు మాత్రమే. పదిమందితో పరిచయాన్ని సంపాదించి గౌరవాన్ని పొందుతూ పెద్దతనాన్ని పెంపొందించుకున్నవాణ్ణి కావటం వల్ల, నా ప్రవర్తనలోని బహిరంతరస్వభావాలకు పొత్తు కలియకపోవటం నాకే ఎంతో అసహ్యాన్ని కలిగిస్తుండేది. ఒకవంక క్రొత్తగా ఆర్జించుకొన్న మహిమకు నేను బానిసనైపోతున్నాను. సుప్రసిద్ధుడైన వైద్యవిద్యావేత్త రూపాన్ని విసర్జించి ఎడ్వర్డు హైడ్ మూర్తిని పొందటానికి ఇక గిన్నెడు మందు త్రాగితే చాలు. ఈ రూపపరివర్తన వైచిత్రికి నాకే నవ్వు వస్తుండేది. ఈ క్రియ ఎంతో పరిహాసాస్పదంగా నాకు తోచేది. అతితీక్ష్ణమైన శ్రద్ధతో కావలసిన ఏర్పాట్లన్నీ చేశాను. ఇంటిదగ్గిరి పోలీసు వారు హైడ్‌ను అన్వేషిస్తూ వస్తారని గుర్తించి, సోహోప్రాంతంలో ఆ ఇంటిని పుచ్చుకొన్నాను. అందులో అవసరమైన అమరికలను అన్నింటినీ ఏర్పాటు చేశాను. దానికి నిరంతరం ఎటువంటి నీచకృత్యానికైనా జంకని వ్యక్తిని ఒకణ్ణి కాపలాదారుడుగా నియమించాను. మరొక వంక చౌతరాలో ఉన్న నా ఇంట్లో (నేను బాగా పూర్వం వివరించి చెప్పినట్లు) ఎడ్వర్డు హైడ్ సమస్తస్వేచ్ఛనూ, సర్వాధికారాన్నీ కలిగి ప్రవర్తించటంకోసం అతనికి ఎటువంటి అభ్యంతరాలూ కలిగించరాదని ఎరుకపరిచాను. ఇంకా ఏవైనా అవాంతరాలు సంభవించటానికి అవకాశం ఉంటుందనే దృష్టితో, నా ద్వితీయరూపంతో నా ఇంట్లో ఉండే వారందరికీ పరిచయం కలిగించాను. ఒకవేళ నా డాక్టర్ జెకిల్ రూపానికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే, నా ఆస్తిపాస్తులకు నష్టం కలుగకుండా ఎడ్వర్డు హైడ్ అనే పేరుతో వాటికి కర్తను కావాలెననే ఉద్దేశంతో, తరువాత మీరు విశేషంగా వ్యతిరేకిస్తూ వచ్చిన, ఇచ్ఛాపత్రాన్ని వ్రాసి ఉంచాను. రాగలిగిన ప్రమాదాలకు నా ఊహ కందినంతలో తగిన కట్టుదిట్టాలను చేసి, నాకు లోకంలో ఉన్న స్థితివల్ల కలిగే సమస్తగౌరవాదరాలనూ పొందాను.

లోకంలో ఇంతవరకూ పెద్దమనుషులు ఏవైనా నేరాలను చేయించ దలచుకొంటే కొంతమంది సాహసికులను నియమించి తమ వ్యక్తిత్వానికీ, ప్రతిష్ఠకూ భంగం రాకుండా కాపాడుకొంటూ వస్తున్నారు. ఆత్మోత్సాహాన్ని తీర్చుకోటం కోసం ఇటువంటి ఘోరనేరాలను స్వయంగా చేయగలిగిన ప్రథముణ్ణి నేనైనాను. ప్రజాదృష్టిలో అనురాగపూర్వకమైన గౌరవాన్ని అనంతంగా పొందుతూ, ఒక్కక్షణకాలంలో ఒక తన్ను తన్ని పారేసినట్లు విప్పేసినట్లు, ఒక విద్యార్థిలా, స్వేచ్ఛామహాసాగరంలో ముందువెనకలు

పరికించకుండా దుముకగలిగిన ప్రథమవ్యక్తిని నేనే ఐనాను. నేను ధరిస్తూ ఉన్న భంగరహితమైన దుస్తులతో నాకు సంపూర్ణమైన భద్రత చేకూరింది. అసలు నాకు ఒకరీతిగా భావిస్తే అస్తిత్వమే లేదనుకోండి! నా పరిశోధనాగార ద్వారానికి ప్రవేశముండి, ఎప్పుడూ అక్కడ సర్వసిద్ధంగా ఉంటుండే ద్రవ్యాలలో మిశ్రమాన్ని తయారుచేసికోటానికి ఒకటిరెండు క్షణాల కాలవ్యవధి ఇస్తే ఎడ్వర్డు హైడ్ అద్దంమీద పడ్డ నిశ్వాసమాలిన్యం లాగా అంతర్ధానమై పోగలడు. – ఇది మీరు ఊహించండి. అతని స్థానంలో స్వగృహంలోని పఠనమందిరంలో క్రొవ్వొత్తి దీపాన్ని సవరిస్తూ తీక్ష్ణంగా లోకుల అనుమానాలను గురించి ఆలోచిస్తూ, వాటికి తనలో తానే నవ్వుకుంటూ హెన్రీ జెకిల్ మీకు దర్శనమిస్తాడు.

మీకు ఇంతకు పూర్వమే నివేదించాను ఈ అవకుంఠనంలో నేను పొందే విలాసాలు గౌరవప్రదాలు కావని. ఇంతకంటే పరుషమైన, పదాన్ని వాటియెడ ఉపయోగించటానికి నేను ఇష్టపడను. అయితే ఇవి ఎడ్వర్డు హైడ్ ద్వారా నిర్వర్తితాలైనప్పుడు, రాక్షసకృత్యాలై పోతున్నవి. ఇటువంటి విలాసవాహ్యాళులకు వెళ్ళి తిరిగివచ్చిన తరువాత, నేను చేసి వచ్చిన కృత్యాలను తలుచుకొని నేనే నా పతనాన్ని గురించి అద్భుతావహచిత్తుడ నౌతుండేవాణ్ణి. నా అంతరాత్మలో ఈ పరిచితవ్యక్తికి స్వేచ్ఛ యిచ్చి "నీ ఆనందానికి అనుగుణంగా వర్తించి రావలసిం"దని ఒంటరిగా పంపేవాణ్ణి. ఈ హైడ్ స్వభావం చేతనే మహాక్రూరుడుగా అవతరించిన వ్యక్తి, అతడు చేసే ప్రతికృత్యం, అతని ప్రతిభావం స్వార్థపరత్వంతో నిబిడీకృతమై ఉంటాయి. ఒక వన్యమృగంలా ఇతరులను అనేక తరతమరీతుల్లో ఎటువంటి దారుణహింసలకైనా పాల్పడజేసి, అతడు ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఉంటాడు. మెత్తదనం అణుమాత్రమైనా లేని పాషాణశరీరివలె అతడు దయావిదూరుడు. ఎడ్వర్డు హైడ్ చేసే దారుణ హింసాచర్యలను చూచి ఎన్నోమార్లు హెన్రీ జెకిల్ దారుభూతుడైనాడు. కానీ ఇదంతా సామాన్యమైన చట్టాలకు లొంగేది కాదు. అందువల్ల అంతరాత్మను అంతగా కలతపెట్టేది కూడా కాజాలకపోయింది. ఎందువల్లనంటే ఇక్కడ దోషి హైడ్ హైడ్ ఒక్కడే. అయితే జెకిల్ మాత్రం తీసిపోయినవాడు మాత్రం కాదు. అతడు తిరిగి తనను స్వభావాన్ని మేల్కొల్పి అంతరాత్మలో అణుమాత్రమైనా కలవరపాటు పొందకుండానే వ్యవహరిస్తుండేవాడు. అవకాశమున్నచోటల్లా హైడ్ చేసిన దుష్కృత్యాలకు తగ్గ ప్రతిచర్యలను చేయటానికి ఎంతగానో ఆతురత వహిస్తుండేవాడు. ఈ రీతిగా అతని అంతరాత్మ నిద్రాముద్రితమైంది.

"ఇప్పటికీ దుశ్చర్యలను చేశానని నేను అంగీకరించదలచుకోలేదు గనక, అప్రతిష్ఠాకరాలైన కృత్యాలనిన్నటినీ వివరించే ఉద్దేశం నాకు లేదు. అయితే ఎట్టి హెచ్చరికలు వచ్చి ఏ క్రమసంఘటనలతో నేను శిక్షను అనుభవించివలసి వచ్చిందో మాత్రం, వివరింపదలిచాను. ఒకమారు ఎటువంటి పర్యవసానమూ కలగని ఒక ప్రమాదసంఘటన జరిగింది. దాన్ని నేను కేవలం సూచించి వదిలేస్తాను.

ఒక బాలిక విషయంలో నేను క్రూరప్రవర్తనను ప్రకటించినప్పుడు దారినపోతున్న ఒక వ్యక్తికి నా మీద పట్టరాని కోపం వచ్చింది. అతడు మీ జ్ఞాతి ఎన్ఫీల్డు అని మొన్ననే తెలుసుకున్నాను. అతనితో వైద్యుడూ, ఆ బాలిక బంధువులకూ చేరారు. అప్పుడు నా జీవితానికి ప్రమాదం సంభవిస్తుందేమో అన్నంతగా భయపడ్డ క్షణాలు కలిగినవి. అందువల్ల ఉచితమైన వారి కోపావేశాన్ని శాంతింపజేయటానికి హైడ్ వారిని ద్వారబంధం దగ్గిరికి తీసుకోపోయి జెకిల్ సంతకంతో ఒక చెక్కును ముట్టచెప్పవలసి వచ్చింది. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు సంభవిస్తే కాచుకోటానికి, మరొక బ్యాంకులో ఎడ్వర్టు హైడ్ పేరనే ఒక పద్దు ఏర్పాటు చేశాను. నా చేతి ఖత్తు ఏటవాలుగా వంచి వ్రాసి నా రెండోమూర్తికి ఒక సంతకాన్ని సృష్టించాను. ఇందుమూలంగా నేను విధి అందుకు దూరంగా తిష్ఠ వేయగలనని ఊహించాను.

సర్ డాన్వర్సు హత్యకు రెండు నెలల పూర్వం నేను నా నిత్యసాహస విహారాలకు వెళ్ళి ప్రొద్దుపోయి తిరిగి వస్తున్నాను. మరునాటి ఉదయం శయ్యమీదినుంచి లేచేటప్పటికి నా కేదో విచిత్రస్పృహ కలిగింది. చుట్టుపట్ల చూచుకొన్నాను. చౌకులోని నా ఇంట్లో ఉన్న రమణీయమైన దారులోహాది సామగ్రులను పరికించాను. ప్రయోజనం లేకపోయింది. నా శయనీయయవనికల మీద అల్లికలను, చంద్రకొయ్యతో చేసిన చట్రాన్ని చూచాను. నేనెక్కడున్నానో గుర్తుపట్టగలిగాను. అయితే ఉండవలసిన ప్రదేశంలో లేనట్లు నాకు విస్పష్టంగా తెలిసిపోయింది. హైడ్ రూపంతో ఉండేటప్పుడు సోహోచౌకులోని ఏ కక్ష్యలో నిద్రపోవటానికి నేను అలవాటు పడ్డానో ఆ గదిలో నిద్రించిన నేను అక్కడ మేల్కోలేదని గ్రహించాను. ఆత్మవిమర్శ సాగించాను. నాలో నేనే నవ్వుకున్నాను. ఇటువంటి విభ్రాంతి నాకెందుకు కల్గింది అని విమర్శించుకుంటూ ఏదో మత్తుగా కూర్చున్నాను. నాకిటువంటి జిజ్ఞాసావస్థ సంభవించి నప్పుడు, తెల్లవారిన తరువాత కూడా కునికిపాట్లు పడుతూ మత్తుగా ఉండటం ఆచారం. అప్పుడు ఇంకా అటువంటి మాంద్యంలోనే ఉండగా, నాకు కొంతగా జాగ్రదవస్థ కలిగింది. ఎందుకో నా చూపు చేతిమీద పడింది. (మీరు అనేకపర్యాయాలు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు

కూడాను). హెన్రీ జెకిల్ చేయి రూపంలోనూ, పరిమాణాల్లోనూ అతని వైద్యవృత్తికి అనుగుణంగా భారీయై, దృఢంగా, స్వచ్ఛవర్ణంతో, మనోజ్ఞంగా ఉండేది. నాకు ప్రస్తుతం కంటబడ్డ చేతిని, నిద్రాసమయంలో ధరించే దుస్తుల్లో సగం కప్పబడి ఉన్నదానిని, మధ్యాహ్నపు లండన్ మధ్యభాగంలోని ఉదయకాల బాలసూర్యకాంతుల్లో చూచుకొన్నాను. అది మిక్కిలి పలచగా నరాలు పైకుబికి కన్పించింది. బిరుసు పీటముళ్లు పడ్డట్టు పొగబారిన రంగుతో, నిండా కేశాలు దట్టంగా మొలిచి కన్పించింది. అది ఎడ్వర్డు హైడ్ హస్తం.

ఏవో కొయ్యపలకలు మ్రోగించినట్లు భయం నన్ను ఆవహించక పోయినట్లయి, నాకు కలిగిన అద్భుతమౌఢ్యంతో అరనిమిషంకాలం అదేపనిగా దాన్ని పరికిస్తూ ఉండేవాణ్ణి. హఠాత్తుగా శయ్యమీదినుంచి లేచి అద్దం ముందుకు అతివేగంగా వెళ్ళి చూచుకొన్నాను. అద్దంలో నాకు కన్పించిన దృశ్యానికి నా రక్తం వెంటనే పలచబడి మంచుబారింది. నేను హెన్రీ జెకిల్‌లా నిద్రపోయి ఎడ్వర్డు హైడ్‌లా మేల్కొన్నాను. దీన్ని సమన్వయించటం ఎలా? నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను. మరోమారు భయకంపితుడైనాను. దీనికి చికిత్స ఏమిటి? – అని మరొక ప్రశ్న కూడా వేసుకొన్నాను. అప్పటికే బాగా తెల్లవారిపోయింది. నా ఇంట్లో సేవకులందరూ మేల్కొని ఉదయకాలకృత్యాలు నిర్వహిస్తున్నారు. ఔషధాలన్నీ నా కార్యాలయ కక్ష్యలో ఉన్నవి. నేను అక్కడికి వెళ్ళటమంటే ఎంతో ప్రయాణం చెయ్యాల్సి ఉంది. అక్కడికి వెళ్ళటం ఎలా? అబ్బురపడి నిలుచున్నాను. నా ముఖాన్ని ముసుగు వేసుకొని కప్పి వేయవచ్చు. నా మూర్తికి కలిగిన కుబ్జత్వం అనే అవకరాన్ని దాచిపెట్టే అవకాశం లేనప్పుడు, దానివల్ల విశేషప్రయోజనం ఏముంటుంది? అప్పుడు నా ద్వితీయరూపమైన హైడ్ మూర్తితో నా సేవకులకు పరిచయం ఉంది కదా అన్న భావం తోచింది. ఒక హృదయోపశాంతి మాధుర్యం నన్ను ముంచెత్తింది. వెంటనే నా జెకిల్ రూపానికి సరిపడే దుస్తులనే చేతనైనంత బాగా ధరించాను. నా ఇంటిలో గుండా ప్రయాణం చేశాను. అప్పుడు బ్రాడ్షా ఆ సమయంలో హైడ్‌ను, అటువంటి విచిత్రమైన దుస్తుల్లో, చూచి ఒక్కమారు భయంతో వెనకడుగు వేశాడు. నా గదికి చేరుకున్నాను. పది నిమిషాల్లో డాక్టర్ జెకిల్ స్వస్వరూపానికి తిరిగివచ్చి, ఆలోచనా నిమగ్నుడై ఫాలాన్ని చిట్లిస్తూ ఉదయకాలభోజనాన్ని అనుభవిస్తున్నట్లు ప్రవర్తించాడు.

నాకు బాగా ఆకలి లేదు. ఆ నాడు నాకు కలిగిన అనుభవం, అంటే రూపపరివర్తనవిధానంలో వైపరీత్యం కలగటం, బాబిలోనియా కుడ్యాలమీదా చిత్రితమైన

హస్తవల్లవం వలె రానున్న నా శిక్షను వ్యక్తం చేసేటట్టు గోచరించింది. తీక్ష్ణంగా వెనకటిలాగా నేను రూపద్వయంతో వ్యవహరించటానికి గల అవకాశాలను గురించి ఆలోచించాను. కోరుకొని పొందుతున్న నా హైడ్ రూపం కొంతకాలం నుంచి మంచి తర్ఫీదును పొంది తన్ను తానే పోషించుకుంటూ వస్తున్నదైపోయింది. ఇటీవల ఆతనిమూర్తి పెరిగిపోతున్నట్లు (ఆ రూపాన్ని నేను ధరించినప్పుడు) నాకు గోచరిస్తూ వచ్చింది. నా రక్తంలో ఒక ఉల్బణం కనిపించింది. మరికొంతకాలం ఇలా దీన్ని సాధన చేస్తే నాలో ఉన్న ప్రకృతిద్వయమనే త్రాసు తారుమారయ్యేటటువంటి స్థితిగతులు ఏర్పడుతవని నాకు తోచింది. 'అలాగే జరిగినట్లయితే సంకల్పానుసారంగా నా స్వరూపాన్ని పొందటానికి అవకాశం తప్పిపోవటం, ఎడ్వర్డు హైడ్ రూపమే నాకు శాశ్వతంగా రావటం జరిగి తీరుతుంది. అదీ కాక నా ఔషధం ఎల్లవేళలా ఏకరీతిగా ప్రవర్తించటం లేదు. మొదటి దినాల్లో అది ఒక మారు నన్ను సంపూర్ణంగా ముంచేసింది. అందువల్ల అటు తరువాత కొన్నిసార్లు పుచ్చుకొనే మోతాదును రెండుమార్లకు పెంచవలసి వచ్చింది కూడాను. ఒకమారు మరణానికి కూడా సాహసించి సిద్ధపడి మూడింతలుగా మోతాదును పెంచి పుచ్చుకోవలసి వచ్చింది. కొన్నిమార్లే అయినప్పటికీ, ముందుకు ఇటువంటి అనిశ్చితమైన ప్రభావమే ఉన్నట్లు గమనించటం వల్ల, రూపపరివర్తన విషయంలో ఇంతకుపూర్వమున్న గాఢవిశ్వాసం నాకు తొలగిపోతూ వచ్చింది. ఏదో ఒక అనుమానచ్ఛాయ దాన్ని ఆవరిస్తూనే ఉంటున్నది. ఈ ఉదయం కలిగిన ఆసక్తికరానుభవం వల్ల నేను మరొక విషయాన్ని గుర్తించి తీరవలసి వచ్చింది. అది మొదట్లో నాకు జెకిల్ శరీరాన్ని వదిలించుకోటం కష్టమైతే, ఇప్పుడు ఆ స్థితి పరిపూర్ణంగా తారుమారైంది అని గ్రహించటం. నేడు హైడ్ రూపాన్ని వదిలించుకోటం కష్టమైపోతున్నది. అది నేను క్రమంగా నా సహజమూ, ఉత్తమమూ అయిన సుస్వభావం మీద శక్తిని కోల్పోయి, రెండవదీ, దుష్టమూ అయిన దుఃస్వభావంలో లీనమైపోవటం జరుగుతున్నదని చివరకు తాత్పర్యంగా గ్రహించాను.

అందువల్ల రెండు భిన్నప్రకృతులలో నేను ఒకని యెడనే "ఇది నాది" అనే మమకారం వహించవలసి వచ్చింది. నా రెండు విభిన్నప్రకృతులకూ జ్ఞాపకశక్తి అనేది ఒక్కటే సమాన ధర్మం. మిగిలిన సర్వవిషయాల్లోనూ వీటికి భిన్నత్వం నిరూఢమై గోచరిస్తున్నది. జెకిల్ ఉత్తమనీచప్రవృత్తుల సంపుటి అయిన ఒక ద్వంద్వప్రకృతి. అతడు అప్పుడప్పుడూ మంచి చెడ్డలను గూర్చి నిశితభావాలను పొంది మీమాంస చేస్తుంటాడు. అప్పుడప్పుడూ మహోత్కంఠను పొందినట్లుగా హైడ్ విహారకృత్యాలల్లోనూ, సాహచర్యల్లోనూ పాలు పంచుకుంటుండేవాడు. అయితే హైడ్‌కు జెకిల్ అంటే

సంపూర్ణనిర్లక్ష్యం, అతడేమనుకున్నా, ఏమైనా అతనికి పట్టదు. ఒకవేళ పట్టినా కొండలమధ్య ఉండే బందిపోటు దొంగ, ఇతరులకు పట్టుబడకుండా, తనకు ఆశ్రయమిచ్చే గుహను జ్ఞప్తికుంచుకున్నట్లు మాత్రమే అతన్ని స్మరిస్తాడు. అయితే హైడ్ మీద జెకిల్‌కు పితృవాత్సల్యం కంటే అధికవాత్సల్యం ఉంది హైడ్‌కు జెకిల్ మీద కుమారుడికుండే నిర్లక్ష్యం కంటే విశేషనిర్లక్ష్యం ఉంది ఇతడు పూర్తిగా అతనితో సంబంధాన్ని తెంచుకోలేడు. అలా చేస్తే ఇంతకాలం నుంచీ రహస్యంగా తృప్తిచేకూరేటట్లు అనుభవించి పెంచుకొన్న దుష్టవ్యాపార బుభుక్షను తీర్చుకొనే అవకాశం తప్పిపోతుంది. హైడ్‌తోనే నేను సంబంధాన్ని పెట్టుకుందామంటే, అనేకసహస్రాల ఉన్నతాశయాలనూ, లాభాలనూ చంపుకొని, చెప్పు దెబ్బ తిని, అందరూ అసహ్యించుకొనటానికి పాల్పడి మిత్రహీనుడుగా, జీవచ్ఛవంలా బ్రతకవలసి వస్తుంది. నేను జెకిల్ హైడ్‌లలో ఎటువైపు మొగ్గుచూపటం అనే విషయంలో మరొక అంశాన్ని గూడా ఆలోచించవలసి ఉంది. జెకిల్‌కు వెనుకటిలా విశృంఖలస్వేచ్ఛకు బలవంతనిగ్రహం ఏర్పడటం వల్ల అనిగ్రహాగ్నుల మధ్య కుమిలిపోవటం కలిగింది. హైడ్ తనకేమి పోయిందో జ్ఞప్తికి తెచ్చుకోగల చైతన్యశక్తి కూడా లేనివాడు. ఈ రీతిగా నడిచే వితర్కం క్రొత్తది కాదు. ఇది సహజంగా మానవుడితో పాటే జన్మించింది. భ్రమపడి పాపకృత్యాలు చేసి, తరువాత గజగజలాడిపొయ్యే ప్రతిపాపినీ ఇలాగే వ్యామోహాలూ, ప్రబోధాలూ ఏదో వంకకు ఈడ్చుకోపోవటం అనాదినుంచీ జరుగుతూనే వస్తున్నది. భూత వర్తమాన కాలాలలో సోదరమానవులందరి విషయంలో ఏమి జరిగిందో నా విషయంలోనూ అదే జరిగింది. నేను నా సుస్వభావం వంకకే మొగ్గాను. కానీ నాకు దాన్ని నిలువ పెట్టుకోటానికి శక్తి చాలకపోతున్నది.

"అసంతృప్తితో ఉత్తమమార్గాలల్లో నడిచే స్నేహితసమాజం మధ్య జీవించే వృద్ధుడైన డాక్టర్ జెకిల్ మూర్తినే నేను తుదకు వరించాను. నిరంకుశమైన స్వేచ్ఛకూ, తులనాత్మకమైన యవ్వనానికీ, ఆ తేలికైన అడుగులకూ, అశ్వగతితో నడిచే హైడ్ రూపంతో రహస్యంగా ఇంతవరకూ అనుభవస్తున్న ఆనందాలకూ నేను స్వస్తి చెప్పాను. ఇటువంటి నిర్ణయానికి రావటంలో నాకు తెలియకుండానే నేను కొన్ని మేరలు పెట్టుకొన్నాను. సోహోలో ఉన్న నా ఇంటిని వదిలిపెట్టలేదు. ఎడ్వర్డు హైడ్ దుస్తులను నాశనం చెయ్యలేదు. అవి ఇప్పటికీ ఇంకా నా గదిలోనే ఉన్నవి. అచంచలనిగ్రహంతో రెండు మాసాలకాలం నా నిర్ణయానికి అనుగుణంగా ప్రవర్తించి, నిలువ పెట్టుకోగలిగాను. ఇతఃపూర్వం ఎన్నడూ నా జీవితంలో ఇంతటి ఇంద్రియ నిగ్రహాన్ని పాటించి, అందుకు అంతరాత్మ అంగీకరించటం వల్ల కలిగే ఆనందాన్ని

అనుభవించలేదు. మళ్లీ హైడ్ రూపధారణను గురించిన భయం నన్ను ఆవరించి బాధించటం ప్రారంభించింది. అది క్రమంగా తీవ్రరూపాన్ని ధరించటం జరుగుతూ వచ్చింది. నా అంతరాత్మ అతని అవతారానికి అంగీకరించే స్థితి ఏర్పడిన తరువాత, ఆ భయతీవ్రత కొంత తగ్గిపోవటం జరిగింది. అది క్షీణిస్తున్నకొద్దీ నాకు నా అంతరాత్మ మీద విశ్వాసం తరగటం ప్రారంభమై, పరిపూర్ణంగా పొయ్యే స్థితి ఏర్పడ్డది. హైడ్ నాలోనే ఉండి "నన్ను స్వేచ్ఛగా సంచరించనీ!" అని పీడిస్తున్నట్లుగా కోర్కెలు తీగలు వారుతూ, నా సర్వశరీరాన్నీ పెనవేసుకుంటూ ఉన్నాయి. చిట్టచివరకు నా నిర్ణయానికీ, నీతికీ ఇక నేను కట్టుబడి ఉండలేని స్థితి వచ్చింది. మళ్ళీ ఒకసారి ఆ రూపవర్తనను కల్పించే ఔషధాన్ని తయారుచేసి పుచ్చుకొన్నాను.

"తాగిన వ్యసనాన్ని గురించి త్రాగుబోతు ఎన్నో వందలమార్లు – ఏ ఐదు వందలమార్లో, వితర్కించుకొంటే త్రాగి, మృగప్రాయంగా మైకం వహించిన స్థితివల్ల కలిగే ప్రమాదాలను గురించి అందులో ఒక్కమారైనా అతనికి తోచవచ్చు. నా విషయం కూడా అంతే. నా స్థితిని నేను అనేక పర్యాయాలు వితర్కించుకొన్నాను. ఎడ్వర్టు హైడ్‌కు ముఖ్యలక్షణాలైన నిర్దాక్షిణ్యాన్నీ, నైతిక స్పందరాహిత్యాన్నీ గమనించాను. అయితే జాగ్రత్తమాత్రం వహించలేదు. చివరకు అతని దుష్టలక్షణాల ఫలితంగానే నేను శిక్షను అనుభవింపవలసి వచ్చింది. నాలో ఉన్న భూతాన్ని బహుకాలం బంధించి ఉంచాను. అది ఆపుకోలేక గర్జిస్తూ తెగదెంచుకొని బయట పడ్డది. ఈ సారి ఎటువంటి శృంఖలాలూ చాలని క్రోధోన్మత్తమైన దుర్బలత్వం నాలో విజృంభిస్తున్నదని, ఔషధాన్ని పుచ్చుకొంటున్నప్పుడు నాకు స్మృతికి వచ్చింది. అందువల్ల నాలో తొందరపాటనే తుపాను ఒకటి చెలరేగింది. ఆ తొందరపాటులోనే నాలో మొరపెడుతూన్న ప్రాణిఘోష విన్నాను. అంతటితో ఆపుకోలేని తొందర కలిగింది. అలా గుండె కరిగిపోయేటట్లు దీనంగా మొర వినిపిస్తున్నప్పుడు, ఎంతటి మానవుడైనా తన నియమాన్ని భంగం చేసుకొని అభయప్రదానం చేస్తాడనీ, అది అతని దోషం కాదనీ, దానికి సంబంధించిన బాధ్యత కూడా అతనిది కాదనీ, నేను భగవంతుని ముందైనా వాదిస్తాను. రుగ్మతతో బాధపడుతున్న బిడ్డ చేతిలో ఉన్న అందమైన ఆటబొమ్మను బ్రద్దలు కొట్టినట్లుగా, నేను ఏ ఆలోచనా లేకుండా నా నియమాన్ని భగ్నం చేసేటప్పుడు ప్రవర్తించాను. ఎటువంటి సమ్మోహనాలూ, విభ్రాంతులూ కలిగినా కొందరు మనస్సును చిక్కబట్టుకొని స్థిరంగా వ్యవహరిస్తారు. అటువంటి ధోరణిని నేను ఐచ్ఛికంగానే వదులుకున్నాను. నేను ఒకమాటు ఎంత అల్పంగానైనా సమ్మోహితుడినైనా నంటే, నాకు అధఃపతనం తప్ప మరేమీ ఉండదు!

"నాలో ఉన్న ఆ నారకమహాభూతం హఠాత్తుగా మేల్కొని గర్జించింది. నాలో ఒక వెర్రి ఆవేశం విజృంభించింది. నన్ను ఎదుర్కొంటున్న నా శరీరానికి దెబ్బ మీద దెబ్బ కొట్టాను. ప్రతి దెబ్బవల్లా ఏదో అవ్యక్తమాధుర్యాన్ని అనుభవించాను. కొంతసేపటికి నాకే ఆయాసం ప్రారంభమైంది. అది పూర్తిగా ఆక్రమించుకోకముందే నా మైకం పరాకోటిని చేరుతున్నప్పుడు, భీతివల్ల నాకొక అతిశీతల హృదయోత్కంపం కలిగింది. ఆ మంచుతెర విచ్చిపోయింది. నా ప్రాణం నాకు దక్కినట్టయింది. నేనొక వైపరీత్యరంగంలోనుంచీ బయట పడ్డట్లయింది. నా పాపవ్యసనదాహం చల్లారింది. నా జీవితాశయరూపాన్ని ధరించి తీక్ష్ణమైంది. వెంటనే మహాగర్వంతో, మహోత్సాహంతో సోహోచౌకులోని నా ఇంటికి నేను పరుగెత్తుకొని వెళ్ళిపోయాను. నాకు సంబంధించిన పత్రాల నన్నింటినీ (ప్రమాదభయం లేకుండా ఉండటానికిగాను) దగ్ధం చేశాను. నే చేసిన ఘాతుకచర్యల నన్నిటినీ సింహావలోకనం చేస్తూ, ముమ్ముందు చెయ్యబొయ్యేవాటికి పన్నాగాలను పన్నుతూ, నన్ను పట్టి పగతీర్చుకోవాలని వెన్నాడేవాళ్ల కాళ్ల చప్పుళ్ళను ఆలకిస్తూ, దీపాలు వెలుగుతున్న వీథుల్లో పరుగెత్తి పొయ్యాను. ఆ మందును హైడ్ స్వయంగా మిశ్రమం చేసేటప్పుడు తనకు తానే స్వస్తి చెప్పుకున్నట్లు పాటపాడాడు. ఆ మిశ్రమాన్ని 'ఇక నేను మరణించిన వ్యక్తుల్లో జత' అన్న భావంతో త్రాగాడు. రూపపరివర్తనను పొందేవేళ వేదన ప్రారంభమైంది. హైడ్ రూపం బయటపడగానే. హెన్రీ జెకిల్ పశ్చాత్తాప కృతజ్ఞతాభావబంధురాలైన బాష్పాలతో భగవంతుడికి నమస్కరించాడు. అతని దుష్టమూర్తి ఆపాదమస్తకం భేదిల్లింది. నా జీవిత సర్వస్వం ఒక మాటు నా కంటికి కట్టింది. నా తండ్రిగారి చేయి పట్టుకొని బాల్యంలో వాహ్యాళు లకు వెళ్ళటం ఆరంభంగా డాక్టరు వృత్తిలో నిస్స్వార్థంగా నిర్వహించిన సమస్తకార్యాలూ, నా కంటికి గోచరించాయి. అవన్నీ ఏవో కలల్లోని విలాసాలుగా తోచాయి. ఆ నాటి భయంకర వాతావరణం కూడా నాకొక లీలగానే కన్పించింది. నేను గొంతెత్తి ఆక్రోశించేవాణ్ణే. కానీ ఎన్నెన్నో కిరాతకృత్యాలు, దారుణధ్వనులూ నాకు కనిపించాయి. వినిపించాయి. వాటిని ఉబికి రానీయకుండా కన్నీటితోనూ, దైవప్రార్థనలతోనూ ఎంతో యత్నించాను. ఈ కలిగిన మానసిక ప్రబోధం వల్ల నా పాతకమహాభూతవికృతి నా అంతస్సులో అవతరించటం ఆరంభించింది. ఆత్మపరితాపం ఈ విధంగా కొంతకాలం మహోద్ధృతంగా పొంగిన తరువాత క్రమేణా చల్లబడ్డది. తరువాత నన్నేదో ఒక అనిర్వచనీయానందం అవేశించింది. నా ప్రవర్తనసమస్య పరిష్కృతమైంది. ఇక హైడ్ అసాధ్యుడు. నేను అనే వ్యక్తిని ఉన్నా, లేకపోయినా, నేను ఇప్పుడు సత్ప్రవర్తనతోనే వ్యవహరించటానికి కట్టుబాటు చేసుకున్నాను. అబ్బా! ఆ నా మూర్తిని తలచుకుంటుంటే

నాకెంతో ఆనందంగా ఉంది. ఇచ్ఛాపూర్వకమైన వినయంతోనే జీవిత సహజ నిబంధనలను తిరిగి స్వీకరించాను! నేను పదే పదే రాకపోకలు చేసిన ద్వారబంధాన్ని తాళంవేసి బంధించి, చెవిని నా పాదరక్షల క్రింద పెట్టి త్రొక్కి ఎంతో విశుద్ధమైన పరిత్యాగబుద్ధితో విరుగగొట్టాను.

"మరునాడే హత్యకు సంబంధించిన వార్తలు వచ్చాయి. హత్య చేస్తుండగా ఎవరో పైనుంచి చూచినట్లూ, ఆ హంతకుడు హైడ్ అనే వ్యక్తి అయినట్లూ, నిహతుడు ప్రజాగౌరవాదరణలను చూరగొన్న ఒక ఉన్నతవ్యక్తి అయినట్లు, లోకమంతా తెలిసిపోయింది. ఇది కేవలం ఒక దుష్కృత్యమే కాదు అతివిషాదకరమైన దుష్కృత్యం. ఈ విషయం నాకు ఇప్పుడు తెలిసి వచ్చినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. ఉరిశిక్షాభయంవల్ల నా సత్ప్రవర్తన నన్ను విడిచిపెట్టకుండా ఎంతో జాగ్రత్తగా పట్టుకోవస్తున్నాను. మృత్యుభీతిని పోటీపెట్టి, దానిశక్తిని పరీక్షింపగలుగుతున్నందుకు అంతరాత్మలో అత్యధికానందాన్ని అనుభవిస్తున్నాను. కాందిశీకుడనైన నాకిప్పుడు 'జెకిల్' అనే మహానగరమే శరణ్యమైంది. ఒక్క క్షణకాలం హైడ్ బయటికి తొంగిచూస్తే అతన్ని పట్టి చంపేయటానికి సహస్రహస్తాలు సంసిద్ధంగా ఉన్నవి.

"పూర్వం నేను చేసిన సమస్తదోషాలనూ పరిష్కరించుకోటం కోసం, అవసరమైన ప్రతిచర్యలను చేయటానికి నేను ప్రస్తుతం నిర్ణయించుకొన్నాను. ఈ నా నిర్ణయఫలితం లోకానికి శుభాకరంగా ఉంటుందనే చెప్పాలి క్రితం సంవత్సరం చివరి మాసాలలో సాటిమానవుల బాధోన్మూలనానికి ఎంతగా కృషి చేశానో మీకు తెలిసిన విషయమే. ఆ రోజులు నాకెంతో ప్రశాంతంగా గడిచిపోయినవి. మనస్సు విశేషానందాన్ని అనుభవించింది. కొంతకాలం ఇలా నిష్కపటంగా లోకహితాభిలాషినై కాలం గడపటం వల్ల, అటువంటి జీవితం మీద నాకు విసుగు పుట్టిందని చెప్పలేను. ఆ విధంగా జీవితాన్ని గడుపుతుంటే నా ఉల్లాసం ప్రతినిత్యం అధికం కావటమే ఇందుకు కారణం. అయినా నా ద్వంద్వప్రకృతి, పరస్పర విరుద్ధవాంఛలూ, నన్ను పీడిస్తూనే ఉండేవి. నా ద్వంద్వప్రకృతి పాతకం నన్ను వదలిపెట్టింది కాదు. నా సత్స్వభావం క్రమంగా బండబారటం ప్రారంభించింది. నాలో ఇంతకాలం శృంఖలాబద్ధమైన నీచపాశవప్రవృత్తి స్వాతంత్ర్యంకోసం గగ్గోలు చేయటం మొదలుపెట్టింది. అంటే నేను హైడ్‌కు తిరిగీ రూపకల్పనం చేద్దామని కోరుకుంటున్నానని కాదు. ఆ ఊహ కలిగినంత మాత్రాన్నే నా శరీరం చల్లబడిపోతుండేది. ఇప్పుడు నాకున్న ప్రస్తుతరూపంతోనే అంతరాత్మతో తగాదా పడైనా, స్వైరసంచారం చెయ్యాలని కోర్కె కల్గుతూ వచ్చింది. ఇలా తగాదా

పెట్టుకుంటున్నది నేనే! నా వ్యక్తిత్వమే!! రహస్యంగా ఘోరపాపాలకు పాల్పడే పాపిలాగా వ్యామోహం నా మీద దాడులు చేసినప్పుడు, ఒకమారు నేను లొంగిపోయాను.

"ప్రతికథకూ సమాప్తమంటూ ఉండి తీరుతుంది ఎంత పట్టే పాత్రైనా నిండి తీరుతుంది. స్వల్పంగా నేను దుష్టత్వం వంకకు మ్రొగ్గుచూపటం వల్ల, తుదకు నా అంతరాత్మ అనే తులకు స్థానం తప్పింది. అయినా నేను చెదరలేదు. ఈ పతనం నాకు అతిసహజంగానూ, ఈ మహామహిమను కనిపెట్టిన పూర్వదినాలకు నేను తిరోగమిస్తున్నట్లున్నూ మాత్రమే తోచింది. అది జనవరి నెలలో ఒక మంచి పగటి పూట, పాదాలు పెట్టినచోట మంచు కరిగి తడి ఔతున్నప్పటికీ ఆకాశం మేఘాచ్ఛాదితం కాలేదు. రీజంటు ఉద్యానవనంలో శీతకాలపు శకుంతాలు కిలకిలా రావాలు చేస్తున్నవి. వసంతాగమనాన్ని సూచించే సువాసనలు పరిమళిస్తున్నవి. నీరెండలో నేను ఒక బల్లమీద కూర్చున్నాను. అణిగి నాలో ఉన్న పశుప్రవృత్తి ఏయే రీతుల్లో వ్యవహరించిందో స్మరణకు తెచ్చుకొంటూ ఉన్నాను. నాలోని దైవసంబంధమైన ప్రవృత్తి మాంద్యం వహించి ఉంది. అవసరమైనప్పుడు పశ్చాత్తాపాన్ని పొందవచ్చు ననుకుంటున్నట్లుందేగాని అది ఆ పని ఇంకా ప్రారంభించినట్లు లేదు. నేను నా చుట్టు ప్రక్కల ఉన్నవాళ్ళెలా ఉన్నారో అలాగే ఉన్నానని భావించుకొంటూ ఉన్నాను. ఇరుగు పొరుగువారితో పోల్చుకుంటున్నప్పుడు నన్ను గురించి నేనే మందస్మితం చేశాను. సత్ప్రవృత్తితో నేను చేసిన పనుల మంచితనాన్ని, ఇతర జనుల దయారహిత నిర్దాక్షిణ్యంతో పోల్చి చూచుకుంటున్నాను. ఇటువంటి ఆత్యాధిక్యభావాలు నా మనస్సులో పర్యటిస్తుండగా, అప్రయత్నంగా నా శరీరం జలదరించింది. గడగడ కంపించిపోవటం ప్రారంభించింది. వికారమేదో ముంచుకోవచ్చి పైబడ్డది. ఈ మైకంలోనుండి బయటపడి చూచుకోగా, నా భావనాధోరణి పూర్ణంగా తారుమారైనట్లు తోచింది. ఏదో దొడ్డ ధైర్యం, ప్రమాదనిర్లక్ష్యం, నిర్మొగమాటం, నాలో స్థావరాన్ని కల్పించుకొన్నాయి. ఒకమారు క్రిందికి తలవంచి నన్ను నేనే చూచుకొన్నాను. నా దుస్తులు రూపవిహీనంగా కుంచుకొనిపోయిన నా శరీరావయవాలమీద వ్రేలాడుతూ కనిపించాయి. నా మోకాలిమీద నిలుపుకున్న చేయి ముళ్లు పడ్డ నరాలతో, కేశావృతమై కన్పించింది. నేను మళ్ళీ ఒక్కమారు ఎడ్వర్డు హైడ్ నైపోయాను. క్షణకాలానికి పూర్వం నేను లోకానికి గౌరవనీయుణ్ణి, భాగ్యశాలిని, ప్రమాదభయరహితుణ్ణి, అభిమానపాత్రుణ్ణి. నా భోజనశాలలో బల్లమీద శ్వేతవస్త్రం కప్పబడి రుచ్యమైన భోజనపదార్థాలు, నా రాకకోసం ఎదురుచూస్తూ ఉన్నవి. ఇప్పుడో... ఈ రూపంలో నేను మానవజాతి సమస్తం త్రవ్వి

వెతుకుతున్న రాళ్ళగుట్టను, లోకం వెన్నాడుతున్న వేటమృగాన్ని, ఆశ్రయవిరహితుణ్ణి. నా కోసం సర్వసిద్ధం చేసుకొని ఉరికంబం రాకకోసం ఎదురు చూస్తున్నది.

"నా వివేచన కంపించింది కానీ స్వాధీనంలోనే ఉంది. ఈ నా ద్వితీయప్రకృతిలో నా మేధాశక్తి అతినిశితంగా, తేజోవంతంగా ఉంటుందని పూర్వం ఎన్నోమార్లు నివేదించాను. ఈ కారణంవల్ల జెకిల్ సంపూర్ణంగా లొంగిపోయేటప్పుడు హైడ్ సమయస్ఫూర్తితో విజృంభించాడు. నా ఔషధాలన్నీ నా గదిలో ఒక బీరువాలో ఉన్నవి. అక్కడికి వెళ్ళటం ఎలా? ఇది పెద్ద ప్రశ్న. కర్తవ్యం ఏమిటి? (కణతలను రెండు చేతులతో గట్టిగా నొక్కుతూ) సమస్యను పరిష్కరించటానికి పూనుకున్నాను. పరిశోధనమందిరద్వారాన్ని పూర్వమే బంధించాను. నా గృహద్వారం గుండా ప్రవేశిస్తే నా సేవకులే నన్ను ఉరితీయటానికి ఒప్ప చెపుతారు. అందువల్ల నేను మరొకరి సహాయాన్ని పొందటానికి నిశ్చయించాను. అతడే లాన్యన్. లాన్యనును కలుసుకోటం ఎట్లా అన్నది మళ్ళీ ఒక సమస్య. ఒకవేళ పట్టుబడకుండా వీథుల్లో తప్పించుకొని ప్రయాణం చేయగలిగినా, అతని ఎదటబడటం ఎలా? పరిచయం లేని, అసహ్యరూపంతో ఆగంతుకుడనైన నేను, అతన్ని "తన సహచర వైద్యశిఖామణి" అయిన డాక్టర్ జెకిల్ ఇంట్లో ప్రవేశించి ఔషధాలు తెచ్చిపెట్టమని ఒప్పించటం ఎట్లా? నా పూర్వప్రకృతి సర్వం నన్ను వీడిపోయినా, దానికి సంబంధించిన ఒక ప్రజ్ఞమాత్రం ఇంకా నా దగ్గర ఉన్నదని నాకు స్మృతికి వచ్చింది. అది డాక్టర్ జెకిల్‌లా వ్రాయగలిగి ఉండటం, ఇటువంటి జ్యోతి నా ఊహలో మెరిసిన తత్క్షణమే, నేను నడిపించవలసిన పథకమంతా ఒక్కమాటుగా ఆ మూలనుండి ఈ మూలకు సమగ్రస్ఫూర్తితో నాకు అభివ్యక్తమైంది.

"తరువాత సాధ్యమైనంతవరకూ నా దుస్తులను సరిదిద్దుకొని దారిన వెళ్తూ ఉన్న ఒక బండిని పిలిచి, సమయానికి జ్ఞప్తికి వచ్చిన పోర్టులాండు వీథిలో ఉన్న ఒక ఆహారశాలకు చేరాను. (నా రూపాన్ని దుస్తులు ఎంత శోచనీయంగా కప్పిపుచ్చినా) అది హాస్యాస్పదంగా ఉండటం వల్ల ఆ వాహనచోదకుడు ఆపుకోలేక నవ్వాడు. పిశాచంలాగా ఒకమాటు కోపం తెచ్చుకొని పండ్లు కొరికాను. వాడి అదృష్టం కొద్దీ, కాదు నా అదృష్టం కొద్దీ, అంతటితో వాడి ముఖాన ఆ నవ్వు తప్పిపోయింది. లేకపోతే వాణ్ని అమాంతంగా బండిమీదినుంచి ఆ క్రోధంలో క్రిందికి నెట్టేసేవాణ్ణి. భోజనశాలకు చేరాను. నా కారుమబ్బుల ముఖంలో నలువైపులా చూచాను. అక్కడి సేవకులందరూ నన్ను చూడగానే గజగజ వణికిపోయారు. నా ముందు నిలువడి ఒక్కమారైనా వాళ్లు

తలెత్తి చూడలేదు. నా ఆజ్ఞలను వెనువెంటనే పాటిస్తూ వచ్చారు. నాకొక ప్రత్యేకమైన గదిని వారు చూపించారు. వ్రాతకు కావలసిన పరికరాలన్నింటినీ తెచ్చిపెట్టారు. ప్రాణాపాయంలో ఉన్న హైడ్ నాకే అతినూతనంగా కన్పించాడు. హత్య చేస్తాడేమో అన్నంత ఉద్రిక్తస్థాయిలో కుపితుడై ఉన్నా, ఆ ఆవేశాన్ని స్థిరచిత్తంతో జయించాడు. ఒకటి లాన్యనుకు, రెండవది పూల్‌కు, – రెండు ముఖ్యమైన ఉత్తరాలు, వ్రాయటం పూర్తి చేశాడు. అవి పోస్టులో పడ్డవని రూఢిగా తెలుసుకొనేటందుకు, రిజిష్టరు చేసి రమ్మని ఆజ్ఞాపించాడు.

“తరువాత ఆ రోజంతా, తన ప్రత్యేకమైన గదిలో అగ్నిధావని ముందు కూర్చొని గోళ్ళు కొరుక్కుంటూ గడిపాడు. అక్కడ భయంతోడుగా భోజనం చేశాడు. ఎదురుగా ఉన్న నౌకరు గజగజలాడిపోతున్నాడు. అప్పుడు పూర్తిగా చీకటి పడ్డ తరువాత మూసిన పెట్టెబండిలో ఒకమూల కూర్చొని వీధుల్లో అటూ ఇటూ అడ్డదిడ్డంగా ప్రయాణం చేశాడు. అతడికి, నాకు – అని నే అనిలేదు, రక్తశిశువైన అతడికి, మానవత్వమంటూ ఏమీ లేదు. అతడిలో భయం, ద్వేషం తప్ప మరేమీ లేవు. చివరకు అతనికి ఆ వాహనచోదకుడు ఏదో అనుమానిస్తున్నాడని తోచింది. బండిని విడిచిపెట్టి నేలమీద జీరాడుతున్న భారీ ఉడుపులతోనే నడక సాగించాడు. అతడు అలా నడుస్తున్నప్పుడు, ఆ వికారరూపంతో చుట్టుపట్ల తిరుగాడుతున్న పదిమందినీ ఆకర్షిస్తూ, వారిమధ్యలోనుంచే వెళ్ళిపోయాడు. తనలో పుడుతున్న భయాలు వెన్నాడుతుండగా, లోలోపలేదో గొణుక్కుంటూ, జనసంచారం తక్కువగా ఉన్న వీధుల్లో నక్కుతూ, అర్ధరాత్రి కావటానికి ఇంకా ఎన్ని నిమిషాల కాలవ్యవధి ఉందో మధ్యమధ్య లెక్కిస్తూ, అతివేగంగా నడుస్తున్నాడు. మార్గమధ్యంలో ఒక స్త్రీ అతన్ని పలకరించి ఏవో తినుబండారాలు కొనమని కోరితే ఆమెను దవడమీద ఒకటి చరిచాడు. ఆమె భయంతో పారిపోయింది.

“లాన్యన్ ఇంటికి వెళ్ళి నేను స్వస్వరూపాన్ని పొందిన తరువాత, నాకు చిరకాలమిత్రుడైన అతడు వెలిబుచ్చిన వెఱ్ఱిభయాలు నా మీద కొంతవరకూ పనిచేసి ఉంటవేమో నాకు తెలియదు. ఆ నాటి నిశీథిసమయంలో కొన్ని గంటల కాలంలో జరిగిన విశేషాలను నేను తలచుకున్నప్పుడు నాకు కలిగిన అసహ్య మహాసముద్రంలో, నా మిత్రుడు పడ్డ అసహ్యం వల్ల కలిగిన బాధ ఒక బిందువంతైనా ఐ ఉండదు. నాలో ఒక మార్పు వచ్చింది. నన్ను ఉరితీస్తారన్న భయం నాకెప్పుడో తీరిపోయింది. అప్రయత్నంగానే నేను హైడ్‌గా మారిపోతుంటాననే కాబోలు అన్న భీతాహం నన్ను పట్టుకొన్నది. లాన్యన్ నన్ను నిందిస్తూ చేసిన ప్రబోధం అంతా నాకు లీలగా స్మరణకు

వచ్చింది. ఒక స్వప్నావస్థలోనే నేను లాన్యన్ ఇంటినుంచి నా ఇంటికి వచ్చి, శయ్యమీదకు చేరాను. క్రితం నాటి అలసట వల్ల నిస్త్రాణ కలిగి వెర్రినిద్ర పట్టింది. ఆ బండ నిద్రను నాకు అలవాటుగా రాత్రులు వచ్చే దుఃస్వప్నాలు కూడా భంగం చేయలేకపోయాయి. మరునాటి ఉదయం నీరసంగా, బలహీనంగా మేల్కొన్నాను. అయినా నాకు అలసట ఎంతో విశేషంగా తీరినట్లుంది. ఇంకా నాలో నిద్రిస్తున్న ఆ మృగం తలపునకు వచ్చినప్పుడల్లా భయం కలుగుతూనే ఉండేది. అతడికి సంబంధించిన ఊహలనే అసహ్యించుకొంటున్నాను. భయపడుతున్నాను. దానివల్ల క్రితం నాటి రాత్రి నేనెటువంటి దురవస్థల పాలైందీ మరిచిపోలేదు. అయితే నేను మళ్ళీ ఒకమారు నా ఇంటికి చేరగలిగాను. నా ఔషధాలముందు ఉండగలిగాను. భవిష్యత్తులో పరిశుద్ధమార్గాన ప్రవర్తించగలననే ఆశామహోల్లాసం కంటే, తప్పించుకొని బయటపడ్డందుకు కలిగిన కృతజ్ఞతాహ్లాదం నా అంతరాత్మలో బహుళశక్తితో భాసిస్తున్నది.

"ఉదయభోజనం పూర్తి చేసుకొని విశ్రాంతిగా నా పెరట్లో పచార్లు చేస్తున్నాను. సంతోషంతో చల్లనిగాలిని అనుభవిస్తున్నాను. అటువంటి పరిస్థితిలో రూపపరివర్తనవేళ నేను పొందే వేదనలు పొడకడుతూ వచ్చాయి. హైడ్ ఉద్రేకాలు నన్నావరించి నాకు కైపెక్కే లోపల, నేను నా గదిలోకి చేరుకోటానికి ఎంత కాలవ్యవధి కావాలో అంతమాత్రమే ఉంది. అప్పుడు మళ్లీ నా సహజస్వరూపాన్ని పొందటానికి నేను మందును రెండింతలుగా పుచ్చుకోవలసి వచ్చింది. దిగులుతో అగ్నిధావనిలోకి చూస్తున్నాను. అయ్యో! మళ్లీ ఆరు గంటల కాలంలోనే నాకు రూప పరివర్తనకాలవేదనలు ప్రారంభమైనవి. తిరిగీ ఔషధాన్ని సేవించవలసి వచ్చింది. ఆ క్షణంనుంచీ నా జెకిల్ రూపాన్ని నిలుపుకోటానికి వ్యాయామ విశేషాలు నేర్చుకొనేవేళ చేసేటటువంటి కృషి చేయవలసి వచ్చింది. రాత్రింబవళ్లు నాకేదో శరీరకంపం సంభవిస్తూ వచ్చింది. నిద్రపోతున్నా, కుర్చీలో చిన్న కునుకు తీస్తున్నా నేను హైడ్ రూపంతో మేల్కొంటున్నాను. ఏదో పీడ నా మనస్సును నీడలా పట్టుకోటం వల్ల నిద్రపోవడం కూడా మానేశాను. నిద్రను ఎంతవరకూ మానవుడు విసర్జించగలడో అంతవరకూ విసర్జించాను. నిరంతరం వచ్చిపడుతున్న ప్రమాదం, నాకు నేనే నిద్రావిహీనత అనే దరిద్రదారుణస్థితిని కల్పించుకోటం వల్ల, నేనూహించినదానికంటే అధికంగా ఏదో జ్వరతాపం తిని ఖాళీ చేస్తున్న జీవినైపోతున్నాను. మానసికంగానూ, శారీరకంగానూ గాఢదౌర్బల్యం ఏర్పడ్డది. నిరంతరం ఒకటే విషయాన్ని గురించి నాకు ఆలోచన అది నా రెండో రూపం కల్పించిన మహాభయం! నేను నిద్రపోయినప్పుడు గానీ, నేను సేవించే ఔషధశక్తి

క్షీణించినప్పుడుగానీ, ఏదో హఠాదుద్వేగంతో లేస్తుంటాను (రూపపరివర్తనకు సంబంధించిన వేదనలు క్రమంగా తక్కువ శక్తితో వస్తూ వుండటం వల్ల) నా మనస్సులో ఏవో భయానక బీభత్సచిత్రాలు చిందులు వేస్తుండేవి. లోకంమీద అకారణమైన ద్వేషం, అసహ్యం నాలో నిండి, నన్ను కల్లోలపెడుతుండేవి. ఇటువంటి క్రోధోల్బణాలకు నా శరీరం తట్టుకొనే శక్తి తప్పిపోయింది.

"జెకిల్ రుగ్మతతో బలహీనమౌతున్నకొద్దీ, హైడ్ తత్త్వం ప్రబలధాటితో విజృంభిస్తున్నది. ఒకరియెడ ఒకరికి కలిగిన ద్వేషభావం జెకిల్– హైడ్ ఇరువురిలో సమానంగానే పెరిగిపోతూ ఉంది. జెకిల్ – హైడ్ అంగవికారాన్ని పూర్తిగా గుర్తించాడు. కానీ అతడు ఉభయులకూ ఆత్మపరివర్తనలో భాగస్వామ్యం ఉందనీ, తనతోపాటు అతడు కూడా జీవితాంతం వరకూ ఆస్తికి 'సహాధికారి' అని గమనించాడు. ఈ రెండు లక్షణాలూ తప్ప ఇరువురికీ సమష్టిలక్షణాలు ఇంకేమీ లేవు. కానీ బంధనం అతని మనోవైక్లబ్యానికీ, వేదనకూ ముఖ్యకారణమైంది. జెకిల్ తన యావజ్జీవితం, సంకల్పబలంతోనూ, ఆసక్తితోనూ పరిశీలించి హైడ్ ఒక పెనుభూతమనీ, చేతనరహితుడనీ గుర్తించాడు. ఏదో మాలిన్యం విడివడి అట్టహాసం చేస్తూ తనలో కూతలు పెడుతున్నదని అతడు గమనించాడు. మృతి చెంది రూపరహితమైన భూతం ఒకటి తనలో స్థావరాన్ని ఏర్పరచుకొని, శాశ్వతంగా నిలిచిపోవాలని యత్నిస్తున్నదని అతనికి నమ్మకం కలుగుతూ వచ్చింది. అతని శరీరంలో బందీగా ఉంటున్న ఆ భూతం నిరంతరం రొద చేస్తూ జననవేదనతో ఎల్లవేళలా యుద్ధాన్ని సాగిస్తున్నది. అణుమాత్రం తనకు బలహీనత కలిగి ఏమరినప్పుడూ లేదా చిరునిద్ర పోతున్నప్పుడు, అది అతనిమీద విజృంభించి లొంగతీసుకొని అతణ్ణే శరీరంలోనుంచి తరిమివేస్తున్నది. హైడ్‌కు జెకిల్ మీద గల ద్వేషం మరోవిధమైంది కూడాను. తనకు ఉరిశిక్షాభయం ఉంది. అందువల్ల అతడు జెకిల్‌లో దాక్కుంటున్నాడు. ఇందుమూలకంగా అతనికి సంపూర్ణస్వాతంత్ర్యం కలగటం లేదు. అందుకని జెకిల్‌ని అసహ్యించుకుంటున్నాడు. జెకిల్‌కు విషాదం కలగటం, హైడ్‌కు అసహ్యాకారణం ఔతున్నది. అదీకాక తన్ను జెకిల్ అసంతృప్తితో చూడటం అతనికి ఇష్టంలేదు. ఇలా తన మీద రోతపుట్టి తన్ను అగౌరవించటం చూచి, అతడు నా భగవత్సంబంధమైన గ్రంథాలమీద నిందావాక్యాలు వ్రాయటం, లేఖలను చించివేయటం, మా నాన్నగారి చిత్రపటాన్ని ముక్కలు చేయటం, మొదలైన మర్కటచేష్టలు చేస్తున్నాడు. అతడికి ప్రాణభయం అపారంగా ఉంది. లేకపోతే తనతో నన్ను కూడా అంతమొందించటానికి అతడెప్పుడో ఆత్మహత్య చేసుకొనేవాడే!

అతడికి బ్రతుకుమీద ఉన్న ఆశ అత్యద్భుతమైంది. వాడిపేరు చెప్పినప్పుడు నాకు ఒళ్లు జల్లుమంటుంది గగుర్పోడుస్తుంది. ఇంకా విశేషంగా వివరిస్తాను. అతడికి సంబంధించిన ఊహలు కలిగితేనే జాడ్యం రావటం సహజమైన నాకు, ఆత్మహత్య చేసుకొని అతన్ని అంతమొందించాలె నన్న భావం కలిగినప్పుడు, అతన్ని చూస్తే అతడిమీద ఉన్న మమకారం వల్ల, నాకెంతో జాలివేసేది.

"ఇదంతా నిష్ప్రయోజనకరమైన కథ. వివరించటానికి కాలవ్యవధి కూడా లేదు. ఇంతవరకూ పుట్టిన మానవుడెవరూ ఇటువంటి దారుణవేదనలను అనుభవించలేదు. ఇంతమాత్రం చెపితే చాలు. ఇటువంటి ఘోరబాధలకు అలవాటు పడ్డంత మాత్రంచేత, అది ఉపశమించేదేమీ లేదు. నా అంతరాత్మ మొద్దుపారింది నిస్పృహతో నిత్యసాంగత్యం ఏర్పడ్డది. అనేకవత్సరాలు నేను శిక్షను అనుభవించాను. తుట్టతుదిగా సంభవించిన ఈ ఆపత్తు నా స్వరూపాన్ని సర్వనాశనం చేసింది. నా ముఖం నాకు పోయింది. నా ఔషధప్రయోగాన్ని ప్రారంభించినప్పుడు తెప్పించిన భారీమొత్తం తరువాత, మళ్ళీ క్షారాన్ని తెప్పించటం జరక్కపోవడం వల్ల, అది ఐపోయింది. క్రొత్తగా ఔషధాన్ని తయారుచేయటం కోసం మరికొంత క్షారాన్ని తెప్పించాను. ఔషధం చేశాను. ఆ మందు పొంగింది. కానీ వర్ణంలో మొదటి మార్పు మాత్రమే కనిపించింది. రెండో మార్పు రాలేదు. ఔషధాన్ని పుచ్చుకొన్నాను. అయితే అది పనిచేయలేదు. లండన్ నగరాన్నంతటినీ ఆ క్షారం కోసం ఎలా గాలించానో, మీరు పూల్‌వల్ల తెలుసుకోవచ్చు.అయినా ప్రయోజనం లేకపోయింది. అందువల్ల నాకు ప్రథమంలో లభించిన క్షారమే మలినమైందనీ, అటువంటి మాలిన్యం అందులో ఉండటం వల్లనే ఔషధం ప్రబలశక్తితో పనిచేసిందనీ నేను ఇప్పుడు గ్రహించక తప్పటం లేదు.

"ఒక వారం గడిచింది. నేను ఇప్పుడు క్రొత్త క్షారంతో తయారుచేసిన ఔషధప్రభావంతోనే ఈ వాఙ్మూలాన్ని పూర్తి చేస్తున్నాను. హెన్రీ జెకిల్ తన సహజమైన ఊహలను చేయటానికి ఇదే తుదిసారి. అతని ముఖాన్ని కూడా తుదిసారిగా ఇప్పుడే అద్దంలో చూచుకుంటున్నాడు. (అయ్యో! అది ఎంత విషాదకరంగా మారిపోయింది) ఇంతటి మహామాయ లోకంలో ఇంకోటి ఉంటుందనుకోను. ఇక కాలయాపన చెయ్యకుండా నా రచనను ముగించాలి. నా ఈ వాఙ్మూలం ఇంతవరకూ హైడ్ చేతుల్లో పడకుండా తప్పించుకొన్నదంటే, అది నేను విశేషంగా తీసుకొంటున్న జాగరూకతవల్లనూ, అదృష్టం వల్లనూ సాధ్యపడింది. ఈ రచన చేస్తున్నప్పుడే నాకు రూపపరివర్తనకు సంబంధించిన వేదన కలిగితే, హైడ్ జన్మించి ఉండే వాడు.

ఈ పత్రాన్ని ముక్కముక్కలుగా చించివేసి ఉండేవాడు. అతడు ఎప్పుడూ తాత్కాలిక ప్రయోజనాన్నే తన సర్వస్వంగా చేసుకొనే లక్షణం కలవాడు. దీనిని వ్రాసి దాచిన తరవాత కొంతకాలం గడిస్తే అతని మర్కటస దృశద్వేషం నుంచి అది తప్పించుకోవచ్చు. అంతే కాదు. మా ఇద్దరినీ రూపుమాపటానికి సన్నిహితమౌతున్న ఘోరప్రమాదం అతన్ని ఈపాటికే మార్చి పిప్పి చేసింది. ఇక ఒక అరగంట కాలంలో నేను శాశ్వతంగా దుర్భరమూ, అసహ్యమూ అయిన మూర్తిని ధరించబోతున్నానీ, అప్పుడు నేను నా కుర్చీలో వణికిపోతూ ఏడుస్తుంటాననీ, లేదా (ఈ దుఃస్థితిలో నాకు కడపటి శరణ్యంగా మిగిలిన ఈ కక్ష్యలో) అతిభయోద్వేగంతో ఏమి జరుగుతుందో అనీ, వినిపించే ప్రతిశబ్దానికీ చెవులు ఒప్పచెపుతూ, భయంతో అటూ ఇటూ పచార్లు చేస్తూనైనా ఉంటానని నాకు తెలుసు.

హైడ్ ఉరికంబం ఎక్కి అసువులు పోగొట్టుకుంటాడా? లేక తుదిక్షణంలో తనకు తానే విమోచనను కలిగించుకొంటాడా? ఇది భగవంతునికే ఎరుక! నాకేమైనా లక్ష్యం లేదు. ఇదే నాకు నిజమైన మరణసమయం. పిమ్మట ఏమౌతుందన్న విషయం నాకు పట్టదు. కలాన్ని క్రిందపెట్టి ఈ నా వాఙ్మూలం మీద ముద్రవేస్తూ ఆనందరహితుడైన హెన్రీ జెకిల్ తన జీవితాన్ని అంతమొందిస్తున్నాడు!"

# బాలసాహిత్యం

## ఆండ్రూ కార్నెగీ

## నాలంద

## అగ్రగాములు

## కదంబము

**ఇందులో**


| | |
|---|---|
| ఆండ్రూ కార్నెగీ | 557–704 |
| నాలంద | 705–790 |
| అగ్రగాములు | 791–870 |
| కదంబము | 871–911 |

# ఆండ్రూ కార్నెగీ

సాహిత్యలత 1953

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | స్కాట్లండులోని పూర్వరంగం | 559 |
| 2. | సంకట సంవత్సరాలు | 569 |
| 3. | వార్తాహరి బాలుడు | 579 |
| 4. | నిశ్రేణికారోహణం | 588 |
| 5. | దొర్లిపొయ్యే మంచుముద్ద | 602 |
| 6. | బల్‌రన్ - డన్ఫర్మ్‌లైన్ | 613 |
| 7. | భంగపడిన తీర్మానం | 621 |
| 8. | ఉక్కుయుగం | 636 |
| 9. | మరువరాని సంవత్సరం | 645 |
| 10. | వివాహం ఐశ్వర్య సువార్త | 655 |
| 11. | హోమ్‌స్టెడ్ - స్కిబో | 665 |
| 12. | సంకటస్థితి - పరిష్కారం | 674 |
| 13. | పంపకం | 682 |
| 14. | అస్తమయం | 694 |

# 1. స్కాట్లండులోని పూర్వరంగం

అప్పటికి ఇంకా అతడికి రెండేళ్ళయినా లేవని పెద్దవాళ్ళు రూఢిగా చెపుతున్నా, ఆండ్రూ ఆ సంగతి తనకు జ్ఞాపకం వున్నదని ఎప్పుడూ అంటుండేవాడు. అంతేకాదు, జ్ఞాపకమున్నదనే ఆయన గాఢవిశ్వాసం.

"ఏమైనా, అది నాకు జ్ఞాపకముంది" అని గట్టిగా అంటుండేవాడు.

"నాకు జ్ఞాపకమున్న మొదటి విషయమే అది!" అనేవాడు.

ఈ సంఘటనలో ఉద్రేకం పొందదగినంతటిదేమీ లేదు. అతని తల్లిదండ్రులు, మేనమామ, పినతల్లి, విలియం మారిసన్, మిసెస్ ఆండ్రూ, ఐట్కిన్ తలలు చేర్చి సుమారు రెండు అడుగుల గుడ్డమీద అంటించిన మెరిసిపోతున్న ఒక కాగితాన్ని చూస్తున్నారు. దాన్ని చుట్టటానికి అనువుగా గుడ్డకు రెండు చివరలా రెండు కర్రముక్కలు అమర్చబడి వున్నవి. గుమిగూడి చూస్తున్న వాళ్ళ దగ్గరికి తప్పటడుగులు వేసుకుంటూ వచ్చి, చొచ్చుకొని ప్రవేశించే స్వభావం గల ఆండ్రూ, అదేమిటో తెలుసుకుందా మన్నట్లుగా వారి మధ్యన తానూ తల దూర్చాడు. తండ్రి, పినతండ్రి విలియం ఇద్దరూ నవ్వుతూ అతడు చూడటానికి వీలుగా దాన్ని కొంచెం క్రిందికి దించారు.

"ఆండ్రా, ఇది దేశపట" మన్నాడు తండ్రి.

"దేశపటం!" అని తిరిగి ఉచ్చరించాడు ఆండ్రూ.

"ఇది అమెరికా దేశపటం" అన్నాడు గంభీరంగా తండ్రి. అతడు చిన్నబిడ్డలతో కూడా ఎప్పుడూ పెద్దవాళ్ళతో మాటాడినట్లు మాటాడుతాడు. "అదిగో అక్కడ" అని ఒక చుక్కను చూపిస్తూ అతడు "అది పిట్స్‌బర్గ్ పట్టణం. అక్కడికే అంకుల్ ఆండ్రా, ఆంట్ అన్నా వెళ్లుతున్నారు. అంకుల్ విలియం ఇంకా పైకి ఓహాయో రాష్ట్రంలోకి వెళ్లుతున్నాడు" అన్నాడు.

పిట్స్‌బర్గ్ అన్నది తరువాతి కాలంలో ఆండ్రూ తన సంపత్తిని పెంచుకొన్న నగరం పేరు. తల్లిదండ్రులు జ్ఞప్తి చేయటం వల్ల, పిట్స్‌బర్గు అన్న పేరే అతని మనస్సులో ఈ సంఘటనను స్థిరం చేసి వుంటుందనటంలో సందేహం లేదు.

జీవితకాలం మొత్తంలో, యే కొద్దిమంది వ్యక్తులో పదో లేక ఇరవయ్యో మైళ్ళు తప్ప ఎన్నడూ కదలి వెళ్ళని ఒక చిన్న స్కాచ్ నగరం నుంచి, కుటుంబం ఒకటి కుదుళ్ళతో సహా లేచి, సముద్రాలు దాటి, చుట్టుప్రక్కల ప్రదేశాల్లో వుండి ఇంకా ఇండియన్లు ఆపదలు కల్పిస్తున్న విశాలమూ, అజ్ఞాతమూ అయిన దేశంలో దిగి నూతనజీవితాన్ని ఆరంభించటమంటే ఏమిటో అర్థం చేసుకోవటానికి ఆండ్రూ ఇంకా చాలా చిన్నవాడు.

“మీరు కూడా మాతో రావలెనని నా కోరిక!” అని ఆంట్ అన్నా ఐట్కిన్ నిట్టూర్చింది.

“వద్దు, వద్దులే అన్నా!” అని ఆండ్రూ తండ్రి నిష్కర్షగా తలత్రిప్పాడు. “ఇప్పుడే ఈ క్రొత్త అద్దె యింట్లోకి మారాము. నావి నాలుగు మగ్గాలు నడుస్తున్నవి. ఇప్పుడు కాదు” అన్నాడు.

విలియం కార్నెగీ నారతో బుటేదారు పనితనాన్ని చూపించే బల్లగుడ్డలను, చేతి రుమాళ్ళను తయారుచేసే నేత పనివాడు. తమ ఇంటిలోనే నేత నేసి జీవించే స్కాట్లండులోని వేలకొలది నేతపనివాళ్ళలో ఇతడొకడు.

ఆండ్రూ జన్మించిన డన్ఫర్మ్‌లైన్, స్కాట్లండులోని బుటేదారు పని కంతటికీ కేంద్రంగా వుంటుంటేది. అక్కడి వాళ్ళలో ఎక్కువమంది నేతపనివాళ్ళు. మంచి అభివృద్ధిలో వున్నప్పుడు ఆ నగరంలోని కుటీరాల్లోను, పరిసరగ్రామాల్లోను నాలుగు వేలకు పైగా వున్న మగ్గాల చప్పుళ్ళు వినిపిస్తుండేవి. నేతపని వాడు కావలసిన వస్తువులకోసం లేదా నమూనాలకోసం పని ఇచ్చేవాడి దగ్గిరికో, గుత్త వ్యాపారి దగ్గరికో వెళ్ళి, అవి తీసుకొని ఇంటికి తిరిగి వచ్చి, ఆ తాను నేసి తిరిగి పని ఇచ్చినవాడి దగ్గరకు వెళ్ళి దాన్ని వొప్పచెప్పి, రావలసిన డబ్బు పుచ్చుకొని ఆర్డరు తెచ్చుకుంటాడు.

విలియం కార్నెగీ 1834లో మేరీ మారిసన్‌ను వివాహమాడాడు. అప్పటికే ఇతడు నేతపనివాడుగా పేరుపడ్డాడు. అంతస్తున్నర వున్న రాతికుటీరంలో వీరిద్దరికీ 1835 నవంబరు 25న పెద్దకుమారుడు కలిగాడు. ఉత్సాహవంతుడైన అతని తాత గౌరవార్థం అతనికి ‘ఆండ్రూ’ అని వారు నామకరణం చేశారు. విలియం మగ్గం క్రింది అంతస్తులో ఒక గదిని ఆక్రమించుకొని వుండేది. దానికి ప్రక్కగా ఉన్న గదిలోను, ఇంటికి కొసన వున్న చిన్న గదిలోను వాళ్ళు నివసిస్తూండేవాళ్ళు. విలియం ఎప్పుడూ

ఏవేవో కలలు కంటుంటాడు  అయినా మంచివాడు. నీతిమంతుడు. ఒక సంవత్సరం అటూ ఇటూగా ఇతడు తన వ్యాపారాన్ని బాగా పెంపొందించాడు. వాళ్ళు పెద్ద యింట్లోకి మారారు. అదనంగా మరి మూడు మగ్గాలు కొన్నారు. వాటిమీద పనిచేయటానికి మనుష్యులను పెట్టుకున్నారు. క్రింద అంతస్తంతా నేతగదులు. వారి నివాసం పై అంతస్తులో.

తరువాత చాలా కాలానికి ఆండ్రూ మహాధనవంతుడైనపుడు, వంశవృక్షాలను వ్రాయటం వృత్తిగా పెట్టుకొన్న ఒక వ్యక్తి వచ్చి, అతని వంశవృక్షాన్ని తయారు చేసే పని ఇవ్వవలసిందని కోరాడు. వాళ్ళను స్కాచ్ రాజకుటుంబపు సంతతివాళ్ళని అందులో నిరూపిస్తానని సూచన చేశాడు.

“ఇది వినటానికి నాకెంతో చింతగా వుంది” అని ఈ మాటలు నచ్చని కోటీశ్వరుడు, “నేను ఒక నేతపనివాడి కుమారుడనన్న భావంతోనే నా భార్య నన్ను వివాహం చేసుకున్నది” అంటూ ప్రతిసమాధానమిచ్చాడు.

ఆ వ్యక్తి స్కాచ్ రాజుకు మనుమణ్ని, మునిమనుమణ్ని చేస్తానని కూడా అని వుండేవాడు.

ఈ కుటుంబం వారు కొన్ని తరాలుగా నేత పనివాళ్లు తన కుటుంబం బలిష్ఠులు, నీతిమంతులు అయిన కర్మకారులు పుట్టిన కార్మిక కుటుంబమైనందుకు అతడు ఎంతగానో గర్వించేవాడు. నిజం! స్కాట్లండులో ప్రభువర్గానికి చెందిన కార్నెగీలు వుండేవారు. కార్నెగీ అన్నది నార్తెస్క్, సౌతెస్క్ ప్రభువులకు కుటుంబనామం. తరువాత కాలంలో ఆండ్రూ స్కాట్లండులో తన సౌధాన్ని నిర్మించుకొన్నప్పుడు, అతడు, నార్తెస్క్ ప్రభువు ఆప్తమిత్రులైనారు. తమ ఇద్దరికీ కుటుంబసంబంధమైన బంధుత్వం లేదని తెలిసినప్పటికీ, వాళ్ళు కులాసాగా ఒకరి నొకరు ‘సోదరా!’ అని సంబోధించుకొనేవారు. ప్రభువులతో బంధుత్వం కోసం కార్నెగీ ఎన్నడూ ప్రయత్నించలేదు.

చిన్ని ఆండ్రూకు నాలుగైదేళ్ళ వయస్సు వచ్చినప్పుడు వాళ్ళ నాన్న కాళ్ళతో పలకలను త్రొక్కి ఆసుక్రోవిని అటూ ఇటూ త్రిప్పుతూ రవసెల్లాలమీద తెల్లనిపూలు, తీగలు, పక్షులు ఇతరదృశ్యాలు నేసి, క్లిష్టమైన పనితనంగల అంచులతో వాటిని రూపొందిస్తుంటే, మగ్గం ప్రక్కన కూచుని చూడటానికి ఎంతో సరదా పడేవాడు. మగ్గం మీద పని చేస్తూ “బొయటీ రౌస్”, “లోఛబర్ నో మోర్” లేదా.

"Scots who have for wallace bled,
Scots whom Bowse had often led,
Welcome to your glory bed,
Or  to Victory."

అన్న పాతకాలపు స్కాచ్ వీరగీతాలను, పాడుకుంటూ పాడటం కంటె గొణుగుకుంటూ ఉండే సిగ్గరీ, సాధువూ అయిన తన తండ్రి అంటే ఆండ్రూకు ఎంతో భక్తి.

"1314లో బానాక్ బర్న్ యుద్ధానికి ముందు ఇంగ్లీషు సైన్యానికి ఎదురుగా నిల్చిన తన సైన్యాన్ని ఉద్దేశించి రాబర్టు బ్రూస్ చేసిన ప్రసంగంగా ఈ 'స్కాట్స్...' అన్న గేయం ఊహింపబడుతున్నదని, తన తండ్రి పాటను తొలిసారిగా మధ్యలో ఆపి, తనకు చెప్పి, తిరిగి ఎత్తుకొని ఎప్పుడు పాడాడో ఆండ్రూకు జ్ఞాపకం లేదు. కొన్ని సమయాలలో అతడు ఇది కూడా చేర్చి చెపుతుండేవాడు : "రాబర్టు బ్రూస్! – మన మొదటి రాబర్టు బ్రూస్ రాజు అయినది ఇతడే బుజ్జీ! నీకు తెలుసునా? అయిదు వందల సంవత్సరాలకు పూర్వం ఇంగ్లీషు వారినుంచి స్కాట్లండ్ దేశానికి ముక్తిని కలిగించిన ఇద్దరిలో ఇతడొకడు. రెండవ వాడు సర్ విలియం వాలెస్." అతడు ఆసుక్రోవిని ఎడమనుంచి కుడికి, మళ్ళీ వెనకకు ఆడించేవాడు. "బ్రూస్‌ను ఇక్కడే డన్ఫర్మ్‌లైన్‌లోని అబ్బీలో ఖననం చేశారు... అతడు, అతని రాణి, అనేకమంది, మన రాజులు, రాణులు ఎంతోదూరం నుంచి మాల్కొ కాన్మోరుకు వచ్చారు. అతని రాణి మార్గరెట్. ఆమే 1075లో ఈ అబ్బీని స్థాపించింది" అని అతడు చెప్పేవాడు.

స్కాట్లండ్‌కు మధ్యయుగంలో రాజకీయ మతవిషయిక ముఖ్యనగరం కావటం వల్ల డన్ఫర్మ్‌లైన్ వాస్తవికంగా ఒక చరిత్రాత్మకమైన చిన్న నగరం. అందులోని రాజసౌధం, మధ్యయుగపు మరికొన్ని కట్టడాలు, ఈ నాడు శిథిలావస్థలో వున్నవి. ఒకప్పుడు స్కాచ్ రాజకుటుంబం నివసించినదీ, ఇంగ్లండు రాజు చార్లెస్ I జన్మించినదీ అయిన రాజసౌధానికి సంబంధించిన ఒక గోడ మాత్రం నేటికీ పడిపోకుండా నిలచి వుంది. గౌరవనీయుడైన బ్రూస్ గోరీతో సహా రాజుల గోరీలకు, రాణుల గోరీలకు నీడనిస్తూ అందమైన నలుచదరపు బురుజులతో, ఎత్తయిన శిఖరంతో వున్న అందమైన గొథిల్ అబ్బీ ఇంకా నిలిచివుంది. డన్ఫర్మ్‌లైన్ నుంచి ఆగ్నేయదిక్కుగా ఫిర్త్ ఆఫ్ ఫోర్త్ లోయగుండా చూస్తే, మబ్బులు లేని రోజున, పదిహేను మైళ్ళ దూరాన పొగల మధ్య కనిపించే ఎడింబరోలోని పొగ గొట్టాలు, గండశిలమీద ఉన్న దాని ఎత్తయిన దుర్గం కనిపిస్తవి.

వివాహం వల్ల అంకుల్ అయిన జార్జి లాడర్ ఇష్టుడయిన బంధువు. ఇతడు చరిత్ర, జనశ్రుతిని బోధించే ఉపాధ్యాయుడు. అంకుల్ లాడర్ ఒక షాపు వ్యాపారి. అతని భార్య కొన్ని యేండ్లకు పూర్వం చనిపోయింది. ఇతడు ఆండ్రూను, తల్లి లేని తన కుమారుడైన జార్జిని నగరంలోను, నగరం చుట్టుప్రక్కలా వున్న చరిత్రాత్మక ప్రదేశాలకు తీసుకునిపోయి చూపిస్తుండేవాడు. బయలుదేరబొయ్యేముందు వారు చూడనున్న ప్రదేశాలను గురించి కొంత తెలుసుకోమనేవాడు. అందువల్ల అతడు దేన్ని గురించి ప్రసంగించబోతున్నాడో వాళ్ళకు ముందే తెలిసి వుండేది. ఉదాహరణకు అతడు వాళ్ళను నగరానికి కొన్ని మైళ్ళ దూరాన వున్న లోచ్ లెవెన్‌ను తీసుకు వెళ్ళినప్పుడు, వాళ్ళకు సరస్సులో వున్న చిన్న ద్వీపంమీద నేడు శిథిలావస్థలో వున్న, దుర్గంలోనే ఎలిజిబెత్ రాణి, ఏడవ హెన్రీ రాజుకు పెద్ద మనుమరాలిని గనుక వారసత్వం వల్ల రాజ్యం నాదని కోరిన, దురదృష్టవంతురాలు మేరీని, ఖైదీ చేసిందన్న సంగతి వాళ్ళకు తెలుసు.

తరువాత చాలా సంవత్సరాలకు ఆండ్రూ, ఇక్కడా అక్కడా జనోపయోగ కృత్యాలను చేస్తున్నప్పుడు, లాడర్ టెక్నికల్ కాలేజీని కట్టించి, తనకు ప్రియుడైన తన అంకుల్‌కు స్మృతి చిహ్నంగా దాన్ని దానం చేశాడు. జార్జి లాడర్, జూనియర్ ఆండ్రూ జీవిత పర్యంతం పరస్పరమైన స్నేహానుబంధంతో వర్తించారు. అతిబాల్యదశలో వాళ్ళు ఒకరిపేరు ఇంకొకరు పలకలేకపోయేవారు. ఎంతో బాగా అనగలిగితేనే ఆండీ జార్జిని 'డాడ్' అనీ, జార్జి కార్నెగీని కుదించి 'నైగ్' అనీ అనగలిగేవారు. తరువాతి జీవితంలో కూడా వాళ్ళు ఒకరి నొకరు అలాగే పిలుచుకొన్నారు. అలాగే ఉత్తరాలలో సంతకాలు చేశారు.

వారి వయస్సు ఆరేళ్ళు వున్నప్పుడు, స్కాట్లండులోని ఉత్తరభాగంలో పర్యటించటానికి వచ్చిన యువ విక్టోరియా రాణిని చూడటం కోసం వాళ్ళను తీసుకువెళ్ళటం జరిగింది. ఆమె ఆంగ్ల దేశీయురాలు. దాక్షిణాత్య. ఈ బాలురు దేశభక్తిపూరితులు. తమ దేశానికి దేశీయుడైన ఒక రాజు వుండాలని వీళ్ళ అభిప్రాయం. అందువల్ల ఈ స్కాచ్ బాలురిరువురూ ఆమెను శీతలమైన విమర్శనదృష్టితో చూశారు.

"ఆమె మీ అమ్మవలె పొడగరి కా" దన్నాడు డాడ్.

"ఆమె గౌను ఏమంత అందంగా కూడా లే" దన్నాడు నైగ్, వాళ్ళ వెంట వచ్చిన తన తల్లిని చూస్తూ.

వయసు వచ్చిన తరువాత ఇంగ్లండు యెడ అతని దృష్టి పక్వమైంది. అతడు ఉన్నతులు, బిరుదాంకితులు అయిన అనేకులైన ఆంగ్లేయులతోను, వారి కుటుంబాలతోను సన్నిహితమైత్రిని పెంపొందించుకున్నాడు. కాని అతడు బాల్యంలో సామరస్యం లేని స్కాచ్ పక్షపాతి.

డన్ఫర్మ్లైన్‌లోని కార్మికులు, వ్యాపారస్థులు బాగా చదువుతుండేవారు. ఆలోచనలు చేస్తుండేవారు. వర్తమానవిషయాల మీద అక్కడ మితవాదులు మొదలు అతివాదుల వరకూ అన్ని భావఛాయలున్నవారు ఉండటం చేత – చర్చలు చేస్తుండేవారు. ఈ చర్చలు ముఖ్యంగా రాజకీయమత విషయాలను గురించి సాగుతుండేవి. వాళ్ళ చిన్ని పుస్తకాల షెల్ఫ్‌లలో ఉన్న పుస్తకాలను ఒకచోటికి చేర్చి, చదువుదామని తృష్ణ ఉన్న ఎవరికైనా పుస్తకాలను అరువు ఇచ్చే అయిదుగురిలో విలియం కార్నెగీ ఒకడు. ఈ కారణం వల్లనే కార్నెగీకి గ్రంథాలయాలను నెలకొల్పాలన్న ఆత్మోద్బోధ సహజంగా కలిగింది. అతడికి రాబర్టు బరన్స్ కావ్యాలమీద కేవలం స్కాచ్ వారికి మాత్రమే వుండదగ్గా, అందులో అతనికి మరీ విశిష్టమై అతనిదే అనదగ్గా శ్రద్ధాయుతమైన గౌరవం వుండేది. కార్నెగీలో ఇది జీవితపర్యంతం ఇలాగే ఎట్టి మార్పునూ పొందకుండా నిలచి వుంది. యౌవనవేళ అతడు సాహిత్యంలో ద్వితీయస్థానాన్ని సర్ వాల్టర్ స్కాట్‌కు ఇచ్చాడు.

తండ్రికి వున్న గ్రంథపఠనాభిలాష కొన్నివేళల్లో అతని పనికి అడ్డు వస్తుండేది. అతడికి డికెన్స్ నవలలంటే గాఢమైన గౌరవం. అవి ముప్పది రెండు పుటలలో చిన్న కరపత్రాలుగా, నెలకొక ప్రకరణగా వస్తుండేవి. స్థానికంగా వార్తాపత్రికలను అమ్మే ఒక వ్యక్తి వాటిని పంచి ఇస్తుండేవాడు. ఇతడు "ఆండ్రా! సుప్రభాతము! 'ది ఓల్డు క్యూరియా సిటీ షాప్' క్రొత్త సంచిక ఇదిగో!" అంటూ ఇంట్లో ప్రవేశించగానే, విల్లీ కార్నెగీ దాన్ని ఆతురతతో లాక్కునేవాడు. అంతటితో అతని మగ్గం ఆడటం మానేసేది. ఎంత తొందరైన నేతపని వున్నా సరే, డికెన్సు అతణ్ని అలా సమ్మోహితుణ్ణి చేసేవాడు. అయిదు... పది... పదిహేను నిమిషాలు కథను మ్రింగివేస్తున్నట్టుగా చదివి, ఎలాగో యత్నంమీద త్రెంచుకుని బయటపడి, మళ్ళీ ఆసుక్రోవిని అతివేగంగా ఆడించేవాడు. మళ్లీ మగ్గం కోపతీవ్రతతో ధ్వనిస్తూ పని చేసేది. మధ్యలో అతడి భార్య పైఅంతస్తులో కూచుని ఆసుక్రోవికి అందించటం కోసం నూలును, కండెలకు చుడుతుండేది. ఆమెకు మధ్యలో ఒక ఆడపిల్ల పుట్టిపోయిన తరువాత, ఆండ్రా కలిగిన ఆరేండ్లకు, మరొక

మగశిశువు జన్మించాడు. అందువల్ల ఆమె కొన్నివేళలలో నూలుకండె చుడుతూనే కాలితో ఉయ్యాలను ఊపుతుండేది.

ఇంటి నేత పరిశ్రమ పడిపోతున్నదని, ఆ స్థానాన్ని ఆవిరిమీద నడిచే మర మగ్గాలున్న కర్మాగారాలు ఆక్రమిస్తున్నాయని ఆండ్రా అతిబాల్యంలోనే గమనించాడు. చేనేతపనివారి ఆందోళన అతితీవ్రం కాజొచ్చింది. కొందరు జిల్లాలో మధ్యగా వేస్తున్న క్రొత్త రైలు మార్గంమీద పని చేయటం కోసం పలుగు, పార పుచ్చుకుని వెళ్ళవలసి వచ్చింది. కొందరు బొగ్గు గనుల్లో పని చేయటానికి వెళ్ళారు. మార్గరెట్ కార్నెగీకి సన్నిహిత కుటుంబంలోని వారు ముగ్గురు – సోదరుడు విలియం మారిసన్, ఇద్దరు సోదరీమణులు మిసెస్ థామ్సన్ హోగన్, మిసెస్ ఆండ్రూ ఐట్కిన్ వారి భర్తలతో – అమెరికా దేశానికి వలసపోయినారు. లోకజ్ఞానం తక్కువయిన విల్లీ కార్నెగీ, ఎంతగా సన్నగిల్లిపోతున్నా ఇంకా ఆశను చంపుకోలేక తన పాత వ్యాపారాన్ని, పాత దేశాన్ని అంటిపెట్టుకుని అలాగే వుండిపోయాడు. అయితే ఒక రోజున దీనవదనంతో ఇంటికి తిరిగివచ్చి తన నేతపనివాళ్ళలో ఒకడితో ఇలా అన్నాడు. “తమ్మాస్! నిన్ను పంపించి వేయవలసి వచ్చేటట్టుంది. పని చాలా తరిగిపోయింది.” త్వరలోనే తన నేత పనివాళ్ళలో మరొకణ్ణి, మరొకణ్ణీ, వరుసగా పంపించి వేయటం జరిగింది. విలియం ఒక్కడే చివరకు మిగిలాడు. మంచి విలువైనదిగా భావింపబడుతూ వచ్చిన ఇరవై పౌనుల ఖరీదు మగ్గాన్ని అమ్మ వలసి వచ్చింది. కానీ దానివల్ల అతడికి లభించింది కొద్ది షిల్లింగులు మాత్రమే.

జీవితవ్యయం కోసం మగ్గాలలో రెండోది, మూడోది కూడా వెళ్ళిపోవటం తప్పలేదు. కుటుంబం ఒక చౌక కుటీరంలోకి చేరింది. అందులోనే మిసెస్ కార్నెగీ చిన్న దుకాణం పెట్టి కూరగాయలు, పండ్లు, తీపి వస్తువులు అమ్ముతుండేది. మధ్య మధ్య చిత్రమైన సమయాలలో సాయంత్రవేళల్లో సోదరుడైన థామస్ మారిసన్ కోసం ఆ అనురాగమూర్తి స్థిరసంకల్పంతో పాదరక్షలు కుడుతుండేది. మారిసన్ పాదరక్షల వ్యాపారి. ఇతడు కేవలం చెడిపోయిన వాటిని బాగుచేసి ఇచ్చేవాడు మాత్రమే కాదు, అనేకమంది పనివాళ్ళను పెట్టుకొని పాదరక్షలను ఉత్పత్తి చేసే పెద్ద వ్యాపారి. అప్పటికి ఇంకా పాదరక్షలను యంత్రాల మీద ఉత్పత్తి చేసే విధానం రాలేదు. ఆండ్రూ అమ్మ పక్కన కూర్చొని సూదులకు దారా లెక్కిస్తూ దారాలకు మైనం రాస్తూ, మధ్య మధ్య వీలు చిక్కినప్పుడల్లా కొంత కాలాన్ని చదువుకోవటం కోసం వినియోగిస్తుండేవాడు. రోజల్లా అతనికి ఏదో పని వుంటుండేది. వీధికి పైగా ఒకటో రెండో ఇళ్ళ వరుసలు

దాటి వెళ్ళీ, అక్కడ ఉన్న ఉమ్మడి బావినుంచి కడివెడు నీళ్లు తీసుకురావటం అతని మొదటి కర్తవ్యం. అక్కడ అతడు స్త్రీలు, బాలురు, బాలికలతో వున్న ఒక వరుసలో చేరి అనేకులలో తనవంతు వచ్చేదాకా నిలచి వుండవలసి వచ్చేది. తరువాత ఎక్కువకాలం బళ్లో గడపి ఇంటికి వస్తే, చెప్పిన చిన్న పనులకోసం అటూ ఇటూ వెళ్ళి వచ్చేటప్పుడు కల్లా భోజనవేళ అయ్యేది.

'మాన్ వాజ్ మేడ్ టు మోరన్' అన్న బరన్స్ కవి పద్యం కంఠస్థం చేసినందుకు మిస్టర్ మార్టిన్ అనే గట్టి పట్టుదల గలవాడైన వృద్ధోపాధ్యాయుడు, అతనికి పారితోషికంగా ఒక పెన్నీ ఇచ్చాడు. కుటుంబంలోని వాళ్ళవల్ల కాకుండా బయటివాళ్ళ దగ్గర్నుంచి అతడు సంపాదించిన మొదటి పెన్నీ యిదే. స్కాట్ ఉద్గ్రంథాలలో నుంచి ఒక చిన్న కావ్యాన్నో లేక వచనభాగాన్నో కంఠస్థం చేయించి అంకుల్ లాడర్ అప్పుడప్పుడూ ఒకటో రెండో పెన్నీలు అతడికి ఇస్తుండేవాడు. కావ్యాలను కంఠస్థం చెయ్యడం ఆ నాటి ఆచారం. కోరినపుడు వుపయోగించటానికి వీలుగా నాలుక తుదను ఉత్తమకవిత్వసంపదను నిల్పుకొని జీవితాలను సంపన్నం చేసుకున్న ఆ నాటి అనేకులలో ఆంద్రూ ఒకడు మాత్రమే.

నింపాదిగా అయినా నిశ్చయంగా తాము అమెరికా చేరటానికి యత్నించవలె నని మార్గరెట్ కార్నెగీ ఒప్పుదల చేసుకున్నది. థామస్ హోగన్లు, ఆంద్రూ ఐట్కిన్లు – పిట్స్ బర్గుకు పైగా ఉన్న అలిఘనీ నదిమీది పిట్సుబర్గుకు సోదర నగరమైన అలిఘనీలో – (ఇప్పుడిది పిట్స్‌బర్గులో ఒక భాగం...) నివసిస్తున్నారు. పెద్ద ధనికులు కాలేకపోయినప్పటికీ, స్కాట్లండ్‌లో కంటే సుఖంగా అక్కడ వారి జీవితం గడిచిపోతున్నది. పిట్స్‌బర్గుకు పశ్చిమంగా ఎంతో దూరం కాని ఓహియోలో ఆమె సోదరుడు మారిసన్ తన వ్యవసాయ క్షేత్రంలో కృషి చేస్తూ కొంత అభివృద్ధికి వస్తున్నాడు. వ్యవసాయ క్షేత్రంలో తన భర్త ఎందుకూ పనికిరాడని మిసెస్ కార్నెగీకి తెలుసు. అయితే పిట్స్‌బర్గులో గాని, అలిఘనీలో గాని తన భర్త ప్రవృత్తికి తగ్గపని ఏదైనా దొరికి తీరుతుందని ఆమె ఊహించింది. అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి అని విలియంకు ఆమె నెమ్మది నెమ్మదిగా వెంటబడి బోధించింది.

అయితే మిగిలిన మగ్గాన్ని, గృహోపకరణాలను వేలంలో అమ్మితే వచ్చిన మొత్తం శోచనీయమైనంత స్వల్పం. కార్నెగీల సముద్రప్రయాణానికి అవసరమైన మొత్తానికి ఇంకా ఎంతో తక్కువైంది. ఈ నాడు మనం నమ్మలేనంత తక్కువ మొత్తంలో ఎవరైనా సరే, తెరచాప పడవ లెక్కి అట్లాంటిక్ సముద్రాన్ని దాటటానికి వీలున్నప్పుడు కూడా,

వారిని బయట పడవేయాలని మార్గరెట్‌కు జీవిత పర్యంత మిత్రురాలు ఒకతె పూనుకొనినంతవరకూ, వాళ్ళ స్థితి నిరాశాపూరితమై ఉంది. ఆ మిత్రురాలు మిసెస్ జాన్ హేన్డర్ సన్. కన్నెగా వున్నప్పుడు, ఆమె పేరు ఆలిసన్ ఫెర్గుసన్. ఈ పేరునే మార్గరెట్ చిన్నతనంలో "అయ్‌లీఫార్గీ" అని ఉచ్చరించేది. అయ్‌లీ ఆమె భర్త ఇల్లు కొనుక్కుందామని ప్రతి నెలా పది షిల్లింగులు, అంటే రెండున్నర డాలర్లు, తీసి విడిగా జాగ్రత్త పెడుతున్నారు మిసెస్ హేన్డర్ సన్. ఎవరి మాటా వినకుండా, చివరకు కార్నెగీలకు వినాశం తప్ప ఏమీ కలగబోదని ఊహిస్తున్న మార్గరెట్ సహోదరుడయిన థామస్ మాటను కూడా తిరస్కరించి, తాము దాచుకున్న మొత్తం ఇరవై పౌనులూ మార్గరెట్‌కు ఇవ్వటానికి సంసిద్ధురాలైంది.

"ఓహో! అయ్‌లీ!" అని తబ్బిబ్బుపడి ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది. "మరి మీ ఇల్లో?"

"అది ఆగవచ్చు. నా బాల్యమిత్రురాలికి నేను చేసే ఈ సాయం చాలా స్వల్పం" అన్నది మిసెస్ హేన్డర్ సన్.

మిసెస్ కార్నెగీ కనులలో బాష్పబిందువులు క్రమ్మివేశాయి. "మరి జాన్ ఇందుకు ఒప్పుకున్నాడా?" అని అడిగింది.

"అవును. అయితే ఇది చాలుతుందా అన్నదే మరి?"

"చాలు ననుకుంటాను. ఎలాగో సర్దుకొని గడుపుకొంటాము" అన్నది మార్గరెట్. "ఓహో! అయ్‌లీ! నీకు కృతజ్ఞతలు తెలుపుకోటానికి నాకు మాటలు రావటం లేదు. గీచి పోగు చేయగలిగినంత తొందరలో తిరిగి ఇచ్చివేస్తామని వాగ్దానం చేస్తున్నాను."

మార్గరెట్ కార్నెగీ ప్రయాణం దగ్గరైనప్పుడు డన్ఫర్మ్‌లైన్ దుఃఖంలో మునిగి పోయింది. ఎన్నో ఇళ్ళల్లో ఇందుకు కన్నీరు కార్చారు. ఎరిగినవాళ్ళందరికీ ఆమె వివేకం గల సలహాదారుగాను, మిత్రురాలుగాను మెలగుతుండేది. ఆపద వచ్చినప్పుడు అమితమైన సాయం చెయ్యటానికి ఆమె ఎల్లవేళలా సంసిద్ధురాలై ఉండేది. అయితే అమెరికాకి వెళ్ళిపోవాలన్న విషయంలో, కుటుంబంలోని ఇతర సభ్యులందరి కంటే ఎక్కువ పట్టుదల ఆమెదే. ఆమె భర్త వెళ్ళిపోతున్నందుకు తగినంతగా చింతించాడు. తనకు అతిప్రియుడయిన అంకుల్ లాడర్, డాడ్‌కి, మరి ఇతర బంధువులకు దూరుడై నగరం నుంచి విడివడిపోతున్నందుకు అత్యధికంగా చింతపడ్డవాడు ఆండ్రూ. నలభై సంవత్సరాల తరువాత అతడు ఇలా వ్రాశాడు : "హిందువులకు వారణాసి ఎటువంటిదో,

మహమ్మదీయునికి మక్కా ఎటువంటిదో, క్రైస్తవునికి జెరూసలెం ఎటువంటిదో నాకు డన్ఫర్మ్‌లైన్ సర్వం అటువంటిది" అప్పుడు అమెరికాను గురించి అతడికి ఉత్సాహభావమేమీ కలగలేదు – బ్రూస్ లేడు, వాలెస్ లేడు, బరన్స్ లేడు. పరికించి చూస్తే గర్వించి చెప్పదగ్గ వీరులు లేని దేశం. తుది రాత్రి, తుది ఉదయభోజనం, తుదిగా వినిపించిన ఆబ్బీ గంటల తియ్యని చప్పుడు డన్ఫర్మ్‌లైన్‌లోని ఆ నాటి ప్రతి అంశం అతనికి హృదయవిదారకమైంది.

తన బాల్యాన్ని గడిపిన ఇంటివైపునకు వెన్ను త్రిప్పిన తారీఖును – మే18. 1848 – అతడు ఎన్నడూ మరచిపోలేదు. అప్పుడు అతని వయస్సు పదమూడు సంవత్సరాలు. అందమయిన అతని చిన్న తమ్ముడు థామస్ మోరిసన్ వయస్సు అయిదేండ్లు. ఫోర్తు అగ్రంలో వున్న నౌకాశ్రయానికి వెళ్లుతున్న దారిలో, పెట్టెబండి కిటికీలోంచి చెమ్మగిల్లే కన్నులతో అడ్డు వచ్చిన కొండను, క్రమంగా దృష్టిని దూరం చేసి దాచివేస్తున్న డన్ఫర్మ్‌లైన్‌లోని కొండ గుర్తులను అన్నిటినీ, తుదిగా అతిపురాతనమైన ఆబ్బీ శిఖరాన్ని వెనక్కి తిరిగి నిలబడి చూశాడు. అంకుల్ లాడర్, డాడ్, అంకుల్ థామస్ వారిని సముద్రతీరందాకా అనుసరించారు. రేవు చేరగానే ఆండ్రూ హఠాత్తుగా అతివేగంతో అంకుల్ లాడర్ దగ్గరికి వెనక్కు వెళ్ళి, "అబ్బా! నిన్ను విడిచిపెట్టలేను, నిన్ను విడిచిపెట్టలేను!" అని ఏడుస్తూ చేతులతో అతన్ని చుట్టవేశాడు. ఎవరో నెమ్మదిగా అతన్ని విడిపించి తీసుకుపోయి నావ ఎక్కించారు. స్వదేశాన్ని విడిచిపెట్టి నవప్రపంచంలో వారి యాత్ర ప్రారంభమైంది.

# 2. సంకట సంవత్సరాలు

అలిఘనీ, 1848లో మాగుడు వాసన, బురద, కొల్ల కొల్లగా గడ్డిపట్టి వుండే వీధులు, ప్రతి వసంతంలోను వచ్చి బాధపెట్టే వరదలు, అప్పుడప్పుడు విజృంభించే కలరాలతో, ఆకర్షణ ఏ మాత్రమూ లేని నగరాలలో ఒకటిగా వుంటుండేది. అయితే అది క్రమరహితంగా మాత్రం వుండేది కాదు. అయితే అందులో ఇరవై రెండువేల మంది నివసిస్తున్నా అక్కడి రక్షకభటుల సంఖ్య నలుగురు మాత్రమేనని, ఆండ్రూ కజిన్ డాడ్‌కు వ్రాసిన వుత్తరంలో సగర్వంగా తెలియజేశాడు. ఇందులోని జనంలో ఎక్కువమంది ప్రతినిత్యమూ ఉదయము, సాయంకాలము అలిఘనీ బ్రిడ్జిమీదుగా నడిచి వెళ్ళి పిట్స్‌బర్గులో పనిచేస్తుంటారు.

ఆత్మబంధువులైన మిసెస్ థామస్ హోగన్, ఆంట్ అన్నా ఐట్కిన్, కార్నెగీలకు హృదయపూర్వకమైన స్వాగతమిచ్చారు. వీరు అందరు రెబెక్కా వీధిలో నివాసాలు ఏర్పరుచుకొన్నారు. వీళ్ళల్లో ఎవరూ సంపత్తి కలవారు కారు. అయినా భద్రత లభించటం వల్ల తాము సుఖంగా వున్నామనే భావిస్తున్నారు. అంకుల్ టామ్ హోగన్ ఒక క్రోకరీ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. సుఖప్రదమయిన చిన్ని రెండతస్తుల ఇంట్లో వుంటూ దానికి అద్దె చెల్లింపగలుగుతున్నాడు. చాలా సంవత్సరాలకు పూర్వమే భర్త చనిపోయిన ఆంట్ ఐట్కిన్ ఇప్పుడు ఒక చిల్లర దుకాణానికి యజమానురాలైంది. అంకుల్ టామ్ సోదరుడయిన ఆండ్రూ హోగన్, ఆంట్ ఐట్కిన్ నివసిస్తున్న ఇంటికి చివరలో ఉన్న చిన్న ఇంట్లో వుంటూ నేత నేస్తుండేవాడు. ప్రస్తుతం అందులో నుంచి మారబోతున్నాడు. ఆంట్ ఐట్కిన్ దాన్ని కార్నెగీలకు ఇచ్చింది.

"అన్నా! అద్దె యెంత వుంటుంది?" అని విలియం అడిగాడు.

"మీరు కొంత నిలువ ద్రొక్కుకున్నదాకా ఏమీ వుండదు" అన్నది ఆ దయామూర్తి.

విలియం అందుకు అభ్యంతరం చెప్పాడు కాని, ప్రస్తుతం అతనికి అంతకంటే గత్యంతరం లేదు.

ఇక ఇప్పుడతను, వెనక స్కాట్లండులో చేస్తున్నట్లుగానే చేనేతపని ప్రారంభించాడు. అయితే అమెరికాలో చేనేతను మరమగ్గాలనేత అతివేగంగా త్రోసిపుచ్చటం వల్ల అతడు అక్కడికంటే ఇక్కడ ఎక్కువ ఇబ్బందుల మధ్య పని చేయవలసి వచ్చింది. డన్ఫర్మ్లైన్లో నేసిన వాటికంటే చౌకరకం బల్లగుడ్డలను, తీసి పారవేయదగ్గ ప్రత్తిజాతి గుడ్డలను నేసి, విలియం ఇంటింటికి తిరిగి అమ్ముతుండేవాడు. ఈ సమయంలో అతడి భార్య చెప్పులు కుట్టటమనే పాత పనిని ఎత్తుకొని, మిస్టర్ ఫిలిప్ అనే చిన్న చెప్పుల దుకాణదారుకు చెప్పులు కుట్టి ఇస్తుండేది. ఫిలిప్ దుకాణంలో ఇద్దరు లేదా ముగ్గురు, ఇంటిదగ్గర పనిచ్చే మార్గరెట్ కార్నెగీ వంటి కొందరు సహాయకులతో దొరికిన ఆర్డర్లకు అనుగుణంగా చెప్పులు కుట్టించి ఇవ్వటమే కాక, ఇతర రకాల పాదరక్షకులను కూడా తయారుచేయించి వాటిని మోసుకొనిపోయి అలిఘనీ, పిట్స్బర్గులకు చుట్టుప్రక్కల వున్న గ్రామసీమల్లోకి కూడా వెళ్ళి అమ్ముతుండేవాడు.

ఇంటిపని తక్కువగా వున్నప్పుడల్లాను, కొన్ని సమయాలలో అర్ధరాత్రి వరకూ చెప్పులు కుట్టటంలో ఎంతో శ్రమపడి, మిసెస్ కార్నెగీ వారానికి దరిదాపుగా నాలుగు డాలర్లు సంపాదించగలిగేది. ఇప్పుడు చిన్న టామ్కు కూడా సాయపడవలసిన వంతు వచ్చింది. బడి లేనప్పుడు అతడు తల్లికి ప్రక్కన క్రిందుగా చిన్న పీటమీద కూచుని సూదులకు దారాలెక్కించి ఇవ్వటం, దారాలకు మైనం వ్రాసి అందివ్వటం చేస్తుండేవాడు. ఆ సమయంలో ఆమె అతనికి అద్భుతమయిన తన జ్ఞాపకశక్తితో స్కాచ్ వైతాళికులు పాడిన కొన్ని వీరగీతాలనో, వాల్టర్ స్కాట్ రచించిన దీర్ఘకావ్యాలలో నుంచి కొన్ని భాగాలనో కంఠస్థం చేసినవాటిని వినిపిస్తుండేది. ఎంతో చక్కగా ఉల్లాసం కల్పించగలదన్న ఆమె కీర్తి, పరిసరాల్లో ఉన్న పిల్లల్లో బాగా వ్యాపించి పోయింది. ఆమె స్కాచ్ చరిత్రలోనుంచి కథలను చెపుతుంటేనో,

''Nine-and-twenty Knights of fame
Hung their shields in Branksone Hall
Nine - and twenty squires of name
Brought then their steeds to bower from stall.
Nine - and twenty Yoemant all
Waited, duteous, on them all.
They were all knights of mettle true.
Krismar to the flood Bucclewch''

మొదలయిన ఉద్రేకపూరిత కావ్యభాగాలను సర్ వాల్టర్ ఉద్గ్రంథాల నుంచి పఠిస్తుంటేనో, ఆతురతతో కొన్ని వేళల్లో ఆమె చుట్టూ పిల్లలు గుంపులు చేరేవాళ్ళు.

తొలుతగా కార్నెగీలు అలిఘనీలో నివాసమేర్పరుచుకొన్నప్పుడు, ఆండ్రూ ఇంత పొట్టిగా, నలుచదరపు దవడతో ఒకదానికొకటి కొంతదూరంగా వుండేటట్లు పొదగబడ్డ కళ్ళతో, దరిదాపుగా తెల్లని దనిపించే జుట్టుతో స్పష్టమైన స్కాచ్ ఉచ్చారణతో వుంటుండేవాడు. "బాటమ్ హూషియర్స్" అని పిలువబడే పరిసర ప్రాంతాలలోని పిల్లలు (అలిఘనీ నది పల్లప్రుప్రాంతం వల్ల వీరికీ పేరు వచ్చింది) ఇతణ్ణి చూసి నవ్వుతూ, "స్కాచీ!" అని పిలిస్తే ఆండీ దానికి స్కాచ్ బాలుని వుచ్చారణతో "అవును. నేను స్కాచీనే. అందుకు గర్విస్తున్నా!" నని గట్టిగా తిరిగి దెబ్బకొట్టినట్లు సమాధానం చెబుతుండేవాడు. ఇలా ఎగతాళిగా చేసే వాళ్ళల్లో ఎక్కువమంది పిల్లలు తామే స్వచ్ఛమయిన స్కాచ్ వాళ్ళు. స్కాట్లండునుంచి వలస వచ్చిన వాళ్ళ బిడ్డలు – కావటం ఇందులోని హాస్యాస్పదమయిన అంశం. వీరూ ఆండీ లాగానే అమెరికాలో కాక తమ పూర్వ దేశమయిన స్కాట్లండులో పుట్టినవాళ్ళు. అయితే కొద్దికాలంలోనే ఆండీ అతని స్కాచ్ యాసను అతివేగంగా పోగొట్టుకొన్నాడు. కొద్ది నెలల్లోనే తాను కూడా "బాటమ్ హూషియర్ల"లో ఒకడయినాడు. ఆ పిల్లలందరూ తరువాతి కాలంలో ఎంతో అభివృద్ధికి వచ్చి ప్రముఖపౌరులైనారు. ఉచ్చస్థితికి రావటానికి వాళ్ళలో కొందరికి ఆండీ తొలుతగా దోహదం చేశాడు. ఇది గమనించవలసిన మరో విషయం.

దరిదాపుగా ఫలరహితమైన బేరపుతిరుగుడు తిరిగి వచ్చి, అమ్ముడు పోని గుడ్డలను ఒక మూలపడేసి నిట్టూరుస్తూ, "అమ్మా! ఇదేమీ ప్రయోజనం లేదు. ఈ రకంగా అయితే జీవనోపాధిని సంపాదించుకోలేము, ఇక బ్లాక్ స్టాక్ కాటన్ మిల్లులో వుద్యోగం చూసుకోక తప్పదు!" అని ఒక రోజున అన్నాడు విలియం కార్నెగీ. అక్కడ తనకు పని దొరుకుతుందని ముందుగానే విచారణ చేశాడు. పనికి కుదిరాడు. తరువాత కొద్ది దినాలకు "ఆండ్రా! మిల్లులో నీకు పని కూడా ఉంది" అన్నాడు.

ఆండీ పనికోసం వెతుకుతున్నాడు. ఎక్కడకు వెళ్ళినా అతణ్ని చాలా చిన్నవాడంటున్నారు. ఇప్పుడు అతడికి అమితోత్సాహం కలిగింది. "ఎటువంటి పని నాన్నా?" అని అడిగాడు.

"ఉండలు చుట్టటం."

"అందుకు మరి నాకు జీతమిస్తారా?"

"నీకు వారానికి ఒక డాలరు ఇరవై సెంట్లు వస్తుంది."

అది నమ్మలేనంత తక్కువ జీతం. అయినా, అది కుటుంబనిర్వహణానికి తాను కూడా సాయపడిన వాడనౌతానన్న ఉద్దేశంతో, ఆండీ అది విని పరవశుడైనాడు. తరువాత అతడు తండ్రి సూర్యోదయానికి పూర్వమే లేచి – చలికాలంలో ఇంకా ముందుగానే లేచి – అతివేగంగా ఉదయభోజనం చేసి, స్తిమితంగా సాయంత్రం ఆరుగంటల వరకూ పనిచేయటం కోసం కర్మాగారానికి ఉరుకులెత్తేవాళ్లు. విల్లీ కార్నెగీ వ్యక్తిత్వంగల భావుకుడు. ఇతరుల ఆజ్ఞలకు లోబడి ఒక నిర్ణీతకార్యక్రమాన్ని అనుసరించి కూలికి ఒకరి దగ్గర పనిచేయటానికి ఏ మాత్రం తగనివాడు. నేతపని, యంత్రం మీద జరుగుతుండటాన్ని చూసి అతని అంతరాత్మ ఎదురు తిరుగుతుండేది. తట్టుకోలేక, కొన్ని నెలలు గడచిన తరువాత కర్మాగారాన్ని వదిలివేశాడు. అడపాదడపా తయారు చేసి ఇంటింటికి మైళ్ళ తరబడిగా నడిచివెళ్ళి, ఒకటో రెండో ఆ బల్లగుడ్డలను అమ్ముకొస్తుండేవాడు.

కుటుంబానికి తమ పూర్వదేశం నుంచి వలసవచ్చినవారితో పరిచయం వృద్ధి పొందుతున్న రోజుల్లో, ఆండ్రూ మరొక స్కాట్లండ్ దేశీయుడైన జాన్‌హోను కలుసుకున్నాడు. అతడు అతనికి చాలా ఎక్కువ జీతంతో – అంటే వారానికి రెండు డాలర్లు. ఒక వుద్యోగ మిస్తానన్నాడు. ఇంతవరకు అతడు చేయవలసి వచ్చిన అసంతృప్తికరమైన పనులన్నిటిలోకీ అది దొడ్డది. చిన్న ఇంజిను మీద దృష్టి నిలిపి దాని బాయిలర్ క్రింద నిప్పు వేస్తూ వికారమైన ఒక చీకటి కొట్లో అతడు పనిచేయాలి. అటువంటి పరీక్షాసమయం వస్తే దాన్ని సర్ విలియం వాలెస్ ఎలా ఎదుర్కొనేవాడో అని ఊహిస్తూ, తన ఉద్యోగం మీద ఉత్సాహాన్ని నిలుపుకోటానికి అతడు యత్నించాడు. ఉద్యోగం ఎంతో అసంతృప్తికరమైనది! అయితేనేం అతడు దాన్ని ఎంతగా అసహ్యించుకుంటున్నాడో అతడు తల్లిదండ్రులకు తెలియనివ్వకూడదు.

తన కర్మాగారంలో ఒక మూల బల్ల వేసుకొని కూర్చున్న మిస్టర్ హో – అతని కార్యాలయానికి కంతటికీ అతడొక్కడే ఉద్యోగివర్గం – ఒక రోజున కుర్రవాడైన ఆండీని పిలిచి అడిగాడు. "నీకు లెక్కలు బాగా తెలుసునా?" అని.

"ఆర్యా! తెలుసుననుకొంటాను" అన్న సమాధానం వచ్చింది.

"నీవు బాగా వ్రాయగలవా?"

"ఆర్యా! చాలా అందంగా వ్రాయగలను."

“ఎలా వ్రాస్తావో చూడనీ, ఇక్కడ కూర్చో” ఆండీ చేతిలో ఒక కలాన్ని దోపి కాగితాన్ని ముందుకు తోశాడు. “ఆ చెడ్డగా లేదు. చెడ్డగా లేదు” అన్నాడు వ్రాసింది చూస్తూ. “నాకు బిల్లులు వ్రాసిపెట్టటం నీకిష్టమేనా?”

“ఓ, తప్పక చేస్తాను”అని ఆశ్చర్యపడుతూ, తాను పనిచేస్తున్న చీకటి కొట్టులోనుంచి బయటపడటానికి అతడు ఎంత ఆతురత వహిస్తున్నాడో వెల్లడించే ఉత్సాహంతో అన్నాడు.

వెనుకటంత చెడ్డది లేదా అంతకంటె మరీ చెడ్డది అయిన పని తనకు రానున్నదని అతడు అప్పుడు కొంచెమైనా, వూహించలేదు. అతడు మిస్టర్ హో యిచ్చిన “సింగిల్ ఎంట్రీ బుక్ కీపింగ్” పని కొద్దికాలంలోనే పూర్తి చేస్తుండేవాడు. ఇది అతని పనికాలంలో సగానికైనా సరిపోదు. అందువల్ల మిగిలిన రోజంతా అతడు కండెలను నూనె తొట్టిలో ముంచి సరిచేస్తుండేవాడు. ఆ నూనెకు ఎంతో కష్టంమీద గాని అతడు సహించలేనంతటి కంపు వుండేది. మనస్సును బ్రూస్, వాలెస్‌ల మీద ఎంతగా లగ్నం చేసినప్పటికీ, ఇతడు దాన్ని సహించలేకపోతున్నాడు. ఓర్చుకోలేక పళ్ళు మెలికలు తిప్పి కొరుకుతుండేవాడు. అయినా తాను బాధపడుతున్నట్లు తల్లిదండ్రులకు ఏ మాత్రం తెలియనిచ్చేవాడు కాదు.

సాయంత్రం అతడు ఒక గంటసేపు ఫిలిప్ చెప్పుల దుకాణం దగ్గర జాన్ ఫిలిప్‌తోను, యితర బాలురతోను గడుపుతుండేవాడు. వీళ్ళలో ఎక్కువమంది స్కాచ్ బాలురు. ఒకనాటి సాయంత్రం అతడు తన బుక్ కీపింగు పనిని గురించి వాళ్ళకు చెబుతున్నప్పుడు, టామ్ మిల్లర్ “హో వ్యాపారం వంటి చిన్నదానికి సింగిల్ ఎంట్రీ బుక్కీపింగు పనికివస్తే రావచ్చునుగాని, పెద్ద కంపెనీలన్నీ తమ లెక్కలను డబుల్ ఎంట్రీ విధానంలోనే వ్రాయిస్త” వన్నాడు.

ఇది ఆండీకి క్రొత్త విషయం. అతడు ఆ క్రొత్త పద్ధతిని గురించి యింకా ఎక్కువగా తెలుసుకోదలచుకున్నాడు. అయితే దీన్ని గురించి టామ్‌కు వున్న జ్ఞానం చాల తక్కువ. కొన్ని సాయంత్రాలు గడిచిన తరువాత ఎవరో ఒక వ్యక్తి క్రమమైన రుసుము తీసుకొని సాయంసమయాలలో ఆ బుక్ కీపింగు విధానాన్ని పాఠం చెపుతాడని టామ్ తెలియజేశాడు. కొన్నాళ్ళు ఆలోచనలు సాగించిన తరువాత ఆండీ, టామ్, జాన్‌ఫిలిప్స్, లిల్లీకౌలీ వాళ్ళకు వచ్చే కొద్ది రాబడులలోనే చిన్న మొత్తాలను ఆ పాఠాలు నేర్చుకునేటందుకు దాచుకుందామని నిశ్చయించారు. అప్పటినుంచి వారు డబుల్ ఎంట్రీలోని విశేషాలను నేర్చుకుంటూ కొన్ని సాయం త్రాలు గడిపారు.

గత్యంతరం లేక ఇష్టం కాకపోయినా చేయవలసివచ్చిన పనిలో, అమెరికాలో అతడు గడిపిన మొదటి ఒకటిన్నర సంవత్సరాలకాలమే అతని జీవితమంతటిలోనూ ఆనంద విహీనమయిన సమయం. అయితే అతని అదృష్టంలో మార్పు సిద్ధంగా వుంది.

అప్పుడు 'తంతి' బాల్యావస్థలో వుంది. తూర్పు నుంచి పిట్స్‌బర్గువరకూ ఒక లైను పూర్తి చేశారు. దాని వ్యాపారం అతివేగంగా వృద్ధి పొందుతున్నది. దానికి స్థానికకార్య నిర్వాహకుడు డేవిడ్ బ్రూక్స్ అలీఘనీలో కార్నెగీలకు పొరుగువాడు. అతడు, అంకుల్ టామ్ హోగన్ ఇరువురూ సాయంత్రవేళల్లో చదరంగ మాడుకుంటూ ఆనందిస్తుంటారు.

ఒకరాత్రి వాళ్ళు అప్పుడే ఒక ఆట పూర్తిచేశారు. మరొక ఆటకోసం పావులను అమరుస్తుండగా మిస్టర్ బ్రూక్స్ "మా వ్యాపారం అతివేగంగా పెంపొందుతున్నది. అందువల్ల మాకు తంతులను బట్వాడా చేసేటందుకు మరొక వార్తాహరి బాలుడు కావలసివచ్చాడు. మంచివాడు, గట్టిగా నమ్మదగ్గవాడు మీకెవరైనా తెలుసునా?" అన్నాడు.

మిస్టర్ హోగన్ తన మనుష్యుల నందరినీ ఒక్కమారు చివరివరకూ జ్ఞాపకం చేసుకొని, క్షణమాలోచించాడు. "నాకొక నెవ్యూ వున్నాడు. వాడు ఈ పని చెయ్యవచ్చు. పేరు ఆండ్రూ కార్నెగీ. క్రొత్త డాలరులా మెరుస్తుంటాడు. నమ్మదగ్గవాడు. మనఃస్ఫూర్తిగా పనిచేస్తాడు. ఎంతపనికీ వెరవడు" అని తరువాత అన్నాడు.

"వయస్సెంత?"

స్మృతికి తెచ్చుకొని అంకుల్ టామ్ అన్నాడు.

"పదునాలుగున్నర. వయసులో చిన్నవాడయినా వయసుకు మించిన చురుకుతనం వున్నవాడు. అటువంటి బాలుడికి మీరేమిస్తారు?"

"వారానికి రెండున్నర డాలర్లు. ఇది అతడికి తృప్తిగా వుంటే నా కార్యాలయానికి పంపించి నాతో మాట్లాడమంటారా?"

"అలాగే చేస్తాను."

మిత్రులిద్దరూ ఆట పూర్తి చేశారు. వెంటనే మిస్టర్ హోగన్ కార్నెగీల ఇంటికి వెళ్ళాడు. అప్పటికి సాయంకాలం చాలావరకు గడిచిపోయింది. అయినా మిసెస్ కార్నెగీ చెప్పులు కుడుతున్నది.

అంకుల్ టామ్ తెచ్చిన వార్తమీద ఉల్లాసకరమయిన చర్చలు సాగాయి. ఆండీ ముఖం ఉద్రేకంతో మెరిసిపోతున్నది. ఓహో! ఆ దారపుకండెల తొట్టెదగ్గర నుంచి దూరంగా వెళ్ళిపోవటం! అతడికి ఏదో నూతన ప్రపంచద్వారాలు తనకోసం తెరుస్తున్నట్లు తోచింది. కానీ అతని తండ్రి మాత్రం అనుమానిస్తున్నాడు.

"ఆండ్రా ఎంత చిన్నవాడో మిస్టర్ బ్రూక్స్‌కు తెలిసి వుండ" దని అతడు అడ్డుపెట్టాడు. "అతడు యిస్తానన్న జీతాన్ని బట్టి ఇంతకంటే పెద్దవాడు, బలిష్ఠుడు అయిన కుర్రవాడు కావలెనని అతడు ఉద్దేశించి వుంటాడు.

"ఆండీ వయసున చిన్నవాడే. కానీ అసాధారణమైన చురుకుతనం వున్నవాడని నేను అతడికి వివరించి చెప్పాను" అన్నాడు అంకుల్ టామ్. "అతడు ఇంతకంటే పెద్దవాడు కావలెనని వుద్దేశించలేదు. ఆండీ అతడికి సంతృప్తిని కలిగించగలడని నా విశ్వాసం."

మిస్టర్ కార్నెగీ తల ఊపాడు. "థామస్! నీవు ఇందులోని మంచిచెడ్డల నన్నిటినీ ఆలోచించినట్లు లేదు. అతణ్ని నానారకాలైన స్థలాలకు పంపిస్తుంటారు. అందులో కొన్ని కుర్రవాళ్ళు వెళ్ళదగ్గవిగా వుండవు. వార్తలను చేతికిచ్చి చీకటి రాత్రుల్లో బయటికి పంపించవచ్చు. బహుశః గ్రామసీమలకు కూడా పంపించవచ్చు. అంతే కాదు, మొదట అతనికి ఈ మహానగరమే సరిగా తెలియదు" అన్నాడు నొక్కి పలుకుతూ.

"నేను త్వరలో తెలుసుకుంటాను" ఆదుర్దాతో వణికిపోతూ, ఆండీ మధ్యలో జోక్యం కల్గించుకొని అన్నాడు.

"కాదు, కాదు!" అన్నాడు తండ్రి. "నీవు అందులో చేరవద్దు!"

పని చేసుకొంటూనే విషయాన్ని గురించి ముందువెనుకలు ప్రశాంతంగా ఆలోచిస్తూన్న తల్లి ఈ క్షణంలో తన నిర్ణయాన్ని బయట పెట్టింది. ఆమె అన్నది "చేరడమే ఆండ్రూకు చాలా మంచిదని నా అభిప్రాయం."

"అల్లిక దారపు కర్మాగారంలోనే అతడు నిరంతరం పనిచేస్తుండాలని మనం అనుకోవటానికి వీల్లేదు. అక్కడ అతడి అభివృద్ధికి ఎటువంటి అవకాశమూ లేదు."

"నేను దానిలోనుంచి బయటపడదా మనుకుంటున్నా" నన్న ఆండీ గొంతు భావోద్వేగం వల్ల గాద్గద్యం వహించింది. "ఆ నూనెకంపును ఒక్క క్షణకాలం కూడా నేను భరించలేనని ఎన్నో తడవలు అనుకుంటుండేవాణ్ని."

అతనివంక తండ్రి ఆశ్చర్యంతో చూశాడు. ఈ వ్యతిరేకభావాన్ని గురించి అతడికి తెలియదు.

"ఈ విషయం మాకు ఎందుకు చెప్ప" లేదని తల్లి అడిగింది.

"మీకు ఇబ్బంది కలిగించటం నాకు ఇష్టం లేకపోయింది."

"మిస్టర్ బ్రూక్స్ రేపు తన్ను కలుసుకోమన్నా" డన్నాడు అంకుల్ టామ్. తంతి కార్యాలయం ఫోర్తు అండ్ వుడ్ వీథులమధ్య వుంది.

ఆండ్రూకు ఆ రాత్రి నిద్రపట్టటం కష్టమయింది. అతడు మర్నాడు ఉదయమే పెందలకడ మేల్కొన్నాడు.

ఉదయం భోజనవేళ తండ్రి ఇలా అభిప్రాయప్రకటన చేశాడు "మిస్టర్? బ్రూక్స్‌ను చూసేటప్పుడు నేను కూడా నీ వెంట వస్తాను. అయితే దీన్ని గురించి ముందుగా మిస్టర్ హోతో ఆలోచిస్తాను."

చాలా చిన్న విషయాన్ని గురించి తండ్రి పెద్దగొడవ చేస్తున్నాడని ఆండ్రూకు అనిపించింది. విషయాన్ని తనకు వదిలిపెడితే, సూటిగా మిస్టర్ బ్రూక్స్ కార్యాలయానికి వెళ్ళి, "నేను ఉద్యోగంలో చేరుతాను" అని చెప్పేవాడు. అయితే తండ్రి అంటే అతనికి అమిత గౌరవం. అందువల్ల ఏమీ అనలేదు. మిస్టరు హోతో ఆలోచించటానికి మిస్టర్ కార్నెగీ అతిత్వరితంగా వెళ్ళాడు.

"అతన్ని పోగొట్టుకోవటం వల్ల నాకు ఎంతో అసౌకర్యం కలుగుతుంది. కానీ అందువల్ల ఆండ్రూకు బహుశాః అధికప్రయోజనం ఉండవచ్చు. కనుక అతన్ని నాదగ్గరనుంచి మార్చవలసిందే అని నేను సలహా ఇస్తాను. తంతివారు అంగీకరించకపోతే అతడు తిరిగి ఇక్కడికి రావచ్చు" అన్నాడు సత్యాన్ని పలికే మిస్టర్ హో.

ఇంతలో ఆండీకి మంచి పంట్లాం తొడిగి, మంచి నీలవర్ణపు జాకెట్టు వేసి ముఖం తుడిచి, బూడిదరంగు జుత్తును జాగ్రత్తగా సరిదిద్ది దువ్వి, చివర దిద్దుళ్ళు పూర్తిచేసి, పరికిస్తున్నది తల్లి. వసంతపు ఉదయవేళ అతడు, అతని తండ్రి రెండు మైళ్ళు నడిచి పిర్త్ అండ్ వుడ్ వీథుల మూలలలో ఉన్న తంతి కార్యాలయం దగ్గరికి చేరారు. మిస్టర్ బ్రూక్స్ కార్యాలయం రెండవ అంతస్తులో కనిపించింది. మెట్లగది ద్వారం దగ్గరి ఆండ్రూ త్రోవలో తాను చేసుకొన్న నిర్ణయానికి తగ్గట్లుగా ప్రవర్తించాడు.

ఆగి తండ్రికి ఎదురు మళ్ళగా నిలిచి అతడు “నాన్నా! దయవుంచి మీరు ఇక్కడి ఉండిపొండి. ఈ పనిని నన్నే స్వయంగా చేయ్యనివ్వండి. మిస్టర్ బ్రూక్స్‌తో నన్ను ఒంటరిగా మాట్లాడనివ్వండి” అన్నాడు అయితే తన భయమేమిటో అతడు చెప్పలేదు. తండ్రి తన చిన్నిరూపం మీద దృష్టి నిలిచేటట్లు మాట్లాడి, ఉద్యోగాన్ని పొందే అవకాశం అతిస్వల్పంగా ఉండేటట్లు చేస్తాడేమో అన్నది అతని భయం. “నాన్నా! ఈ పని నంతటినీ నేనే స్వయంగా చేసుకొంటా” నని వేడుకొన్నాడు.

తండ్రి అతనివంక శోధనపూర్వకంగా చూసి అన్నాడు. “మంచిది. నీ కోసం నేను ఇక్కడ ఎదురు చూస్తుంటాను.” అందువల్ల తండ్రి ప్రవేశద్వారం దగ్గర ఆగిపోయాడు. ఆండ్రూ మేనేజరును చూడటానికి వెళ్ళాడు.

మిస్టర్ బ్రూక్స్ ఎంతో దయగా అప్పుడే కుర్రవాడికి ధైర్యం చెప్పాడు. జీతాన్ని గురించిన ప్రసంగంలో కూడా ఉదారంగా ఉండటానికి యత్నించాడు.

“పిట్స్‌బర్గ్ నాకు పూర్తిగా తెలియదు. అయితే, అతిత్వరితంగా తెలుసుకొంటాను. నేను చిన్నవాడినని నాకు తెలుసు, బహుశః ఈ ఉద్యోగానికి తగినంత బలిష్ఠుణ్ణి కాక పోవచ్చు. కానీ నిర్వహించగలనన్న నమ్మకం నాకుంది. నే కోరేదల్లా నాకొక అవకాశ మిప్పించమని.”

“జీతం – వారానికి రెండున్నర డాలర్లు – నీకు సంతృప్తికరంగా ఉందా?” అని అడిగాడు మేనేజరు.

“ఇంకా నేను ఎక్కువ సంపాదించుకోగలిగేదాకా సంతృప్తికరమే.”

“పని ఎప్పుడు ఆరంభిస్తావు?”

దీన్ని గురించిన నిర్ణయం చేయటానికి ఆండీకి రెండు క్షణాలకంటే ఎక్కువకాలం అవసరం లేకపోయింది. “మీరు కోరితే ఇప్పుడే ఆరంభిస్తాను.”

“చాలా బాగుంది” అని గొంతు పెద్దది చేసి అతడు “జార్జ్!” అని పిలిచాడు.

ఆండీ కంటే పెద్ద కుర్రవాడొకడు ప్రక్కగదిలోనుంచి వచ్చాడు.

“జార్జ్! ఇతడు మన నూతన వార్తాహరి. ఆండ్రూ కార్నెగీ” అన్నాడు మిస్టర్ బ్రూక్స్ ఆండ్రూ. “జార్జి మెక్లెయిన్ నీకు నగరాన్ని, మా పద్ధతులను పరిచయం చేస్తాడు.”

జార్జి ఆండీ వంక తిరస్కార పూర్వకంగా చూస్తున్నాడు. "ఇతడు మనకెందుకు పనికి వస్తాడు? చెయ్యవలసిన పనికి ఇతడు చాలా చిన్నవాడు" అన్నాడు.

"ఆ నిర్ణయం చేయటం నాకు విడిచిపెట్టు" అని మిస్టర్ బ్రూక్స్ ముక్తసరిగా సమాధానం చెప్పాడు. "వెంటనే ఆండ్రూను లోపలికి తీసుకుపో. ఆపరేటర్ల దగ్గర నుంచి వార్తలను పుచ్చుకో. ఇవాళ ఇతణ్ణీ నీ వెంట తీసుకోవెళ్లు. నువ్వు ఎలా పనిచేస్తావో చూస్తాడు."

ఆపరేటర్ల గదిలో ఆండ్రూ కొద్ది నిముషాలు జార్జితో గడిపాడు. అప్పుడు అతడికి తండ్రి విషయం జ్ఞప్తికి వచ్చింది.

"అరె!" అని కేక పెట్టాడు. "మా నాన్నను అక్కడ ప్రక్కదారి దగ్గర నిలువబెట్టి వచ్చాను. క్రిందికి వెళ్ళి ఆయనకు చెప్పి వస్తాను."

పరుగెత్తుకుంటూ మెట్లు దిగాడు. "నాన్నా!" అంతా నిర్ణయమైంది" పెద్దగా అన్నాడు. "నాకు ఉద్యోగమిచ్చాడు. వెంటనే పని ప్రారంభించాలి."

కాంతిని విరజిమ్ముతున్న అతని ముఖం అతడెంత సంతోషంగా ఉన్నాడో తండ్రికి తెలియజెప్పింది.

కుర్రవాడి బుజంమీద చెయ్యి ఉంచి "నిన్ను గురించి నాకెంతో సంతోషంగా వుంది బాబూ! ఇందుకు మీ అమ్మ సంతోషిస్తుంది. నీవు చేతనైనంత బాగా పని చేస్తావని నాకు తెలుసు" అన్నాడు.

# 3. వార్తాహరి బాలుడు

ఆంద్రూ దాన్నిగురించి తరువాతి కాలంలో వెనుదిరిగి చూచుకొన్నప్పుడు, ఆ రోజు అతనికి తన జీవితంలో ఒక మైలురాయిలా, ఒక పరివర్తన బిందువుగా కనిపించింది. చీకటికొట్టులో నుంచీ, కంపుకొట్టే నూనెతొట్టి దగ్గరినుంచీ బయటపడి, ఇప్పుడు అతడు మంచి వెలుగులో, తంతికార్యాలయ కలకలంలో, నగరవీథుల్లో, కర్మాగారాలల్లో, గిడ్డంగుల్లో, స్వేచ్ఛతో సంచరిస్తున్నాడు. ఇంటిదగ్గర ఎప్పుడో గాని తిండి తినటం పడటం లేదు. దాన్ని గురించి కుటుంబంలో వారికి చెప్పటాని కైనా అతనికి అవకాశం దొరకటం లేదు. వెంటనే విధుల అమరికను, వాటిల్లో నడుస్తున్న వ్యాపారాలను, నగరాన్ని గురించినదంతా తెలుసుకోవటానికి అతడు పూనుకున్నాడు. నగరంలోని ప్రముఖులను – వ్యాపారస్థులను, వ్యాపార కార్యనిర్వాహకులను, వృత్తినిర్వాహకులను... అందరినీ తెలుసుకున్నాడు. అతని పరిచయస్థులలో తరువాతి కాలంలో అధ్యక్షుడు లింకన్‌కు యుద్ధకార్యదర్శి అయిన ఎడ్విన్ యం. స్టాన్టన్ ఒకడు. ఆయనతో పరిచయం కలిగినందుకు అతడు ప్రత్యేకంగా గర్విస్తుండేవాడు.

తంతి కార్యాలయం వారి వ్యాపారం వృద్ధి పొందుతుండటం వల్ల, మరొక కుర్రవాడు అవసరమై ఉండటాన్ని గురించి మిస్టర్ బ్రూక్స్ ఆంద్రూతో మాటాడాడు. “ఆర్యా! నేను ఒకణ్ణి తీసుకురాగల”నని చెప్పి అలిఘనీ నుంచి తన ఇరుగుపొరుగు కుర్రవాడయిన డేవిడ్ మెక్కార్గోను తీసుకొచ్చాడు. జార్జి మెక్లయిన్ వెళ్ళిపోయినాడు. తరువాత ఆంద్రూ బాటమ్ హూషియర్లలోనుంచి ఒకరి తరువాత ఒకరిని మరి ముగ్గురు కుర్రవాళ్ళను – రాబర్టు పిట్కైరన్, హెన్రీ ఆలివర్, లిల్లీ మోర్లాండ్‌లను – తెచ్చి ఒప్పజెప్పాడు. వారు వంతుల ప్రకారంగా కార్యాలయంలో వ్యాపారసమయం ప్రారంభం కాకముందే, వూడ్చి బాగుచేయటానికి పెందలకడ వస్తుండేవారు. ఈస్టర్న్ టెలిగ్రాఫ్ కంపెనీ సూపరిండెంటు రైడ్ – ఇతడు కూడా డన్ఫర్మ్‌లైన్ వాడే – పర్యవేక్షణకోసం పిట్స్‌బర్గ్‌కు వచ్చినప్పుడు ఈ స్కాచ్ వార్తాహరి బాలదళాన్ని చూచి ఎంతో సంతోషించి, వారందరికీ ఒకేరకమైన దుస్తులు ఏర్పాటు చేయించాడు. ముదురు పచ్చ జాకెట్లు, ట్రౌజర్లు. ఈ వేషంతో వాళ్ళ నగరంలోని వీథుల్లో వెడుతున్నప్పుడు విశేషంగా జనులదృష్టిని ఆకర్షిస్తుండేవాళ్ళు.

ఒక పరిమితి దాటిన తరువాత, తంతివార్తలను అందజేసినందుకు, వార్తాహరి బాలుడు అదనంగా పదిసెంట్లను సంతోషంక్రింద వసూలు చేసుకునే అవకాశ మిచ్చారు. ఈ తంతివార్తలను అందజేయటంలో ఇతరులకంటె ఎక్కువ వంతు తెచ్చుకొనే విషయంలో ఆ బాలురకు ఆలోచనలు, చర్చలు ప్రారంభమైనవి. వాళ్ళ మైత్రికి భంగం కలగబోయేటంతగా కలతలు పెరుగుతున్నట్లు కనిపించాయి. అప్పుడు ఆండ్రూ, తనకు నైజమైన నీతినిపుణతతో, ఒకనాటి ఉదయం ఆ బాలబృందాన్ని వుద్దేశించి ఇలా అన్నాడు : 'మనం ఇలా పోటీపడటం తగదు. వార్తలను ఎవరు అందజేస్తున్నారన్నది మనం పెట్టుకోవద్దు. ఈ పదిసెంట్ల మొత్తాలను అన్నింటినీ సమష్టినిధిలో వేసి, నెలాఖరుకు అందరము సమానంగా పంచుకుందాము"

వ్యాపారంలో ఉపయోగింపబడుతున్న అర్థంతో సమష్టి (Pool) అన్న పదంతో ఇతనికి ఇంకా పరిచయం కలుగలేదు. కానీ అతడు చేసినది మాత్రం అదే. మిగిలిన బాలురందరూ ఈ సూచనగురించి యోచించి, ఆండీయే ఆ నిధికి కోశాధికారిగా వుండాలనే షరతుతో, అంగీకరించారు. దీని తరువాత దగ్గరలో ఉన్న ఒక తినుబండారాలమ్మే వాడి దగ్గర ఖాతాపెట్టి, ఈ పదిసెంట్ల డబ్బులతో కొనుక్కుంటున్న కాండీ, కేకులను గురించి తప్ప, మళ్ళీ ఎన్నడూ వాళ్ళమధ్య తగాదా రాలేదు. కొందరు తమకు రావలసినదానికంటే తినుబండారాలను ఎక్కువ వాడుకున్నప్పుడు, ఆ వ్యాపారి నెలలోవచ్చే వారి వాటాలుపోను మిగిలిన డబ్బు చెల్లించవలసిందని కోరితే, ఆండీ ఇద్దరు ముగ్గురు అతిగా వాడుకుంటున్న వాళ్ళ అదనపు అప్పు డబ్బులను గురించి బాధ్యత వహించవలసివచ్చింది. తీపి వస్తువులంటే అతిలోభాన్ని చూపించే కుర్రవాళ్ళలో మిక్కిలి చెడ్డవాడు బాబ్ పిట్కైరన్. ఇతని దుబారాతనాన్ని గురించి హెచ్చరించి ఆండీ చీవాట్లు పెట్టినప్పుడు, "ఇతడు నా కడుపులో జీవజంతువులున్నాయి. ఆండీ! తీపి వస్తువులను పెట్టి వాటిని మేపకపోతే అవి నా డొక్కలు కొరికేస్తా" యని గంభీరంగా సమాధాన మిచ్చాడు.

వీరంతా ఎటువంటి బాలదళం! ఇందులోని రాబర్టు పిట్కైరన్ మధ్య మధ్య తన డబ్బును పెట్టుబడులలో పెట్టిన తరువాత, పెన్సిల్వేనియా రైల్ రోడ్ కంపెనీకి ఉపాధ్యక్షుడైనాడు. డేవిడ్ మెక్కార్గో రైలు మార్గాలను నిర్మించటానికి పూనుకొని, ఇతరులతో కలిసి అలిఘనీ వాలీ రైల్వే నిర్మాతల్లో ఒకడయినాడు. హెన్రీ ఆలివర్ ఒక పెద్ద ఉత్పత్తి సంస్థకు ప్రముఖుడయి, మిన్నసోటాలోని లోహఖనిజ ప్రాంతాన్ని వృద్ధి పొందించటంలో సహకరించి చివరకు ఒక కోటీశ్వరుడుగా మరణించాడు. విలియం

మోర్‌లాండ్, పిట్స్‌బర్గులో ఒక ప్రముఖుడయి, ఆటార్నీ పదవిని నిర్వహించిన వాడయి, అధిక సంపన్నుడయినాడు.

వార్తావహుడుగా ఆంద్రూ కార్నెగీ ఒక సంవత్సరం పనిచేసిన తరువాత ఒకనాడు మిస్టర్ గ్లాన్ పైనుంచి ప్రజాకార్యాలయంలోకి దిగివచ్చి మిస్టర్ బాక్స్‌తో, “నేను ఒక పనిమీద వెళ్ళుతున్నాను. యువకార్నెగీని కొన్ని క్షణాలపాటు కార్యాలయములో ఉండమనండి” అన్నాడు. అందువల్ల పెద్దదైన ఆ కర్తవ్యనిర్వహణకు హఠాత్తుగా పిలుపు తనకు వచ్చినందుకు ఆండీ కొంతగా చకితుడయినాడు. పంపవలసిన తంతి వార్తలను అందుకుంటున్నాడు. ఆపరేటర్ గది నుంచి బయటికి వచ్చిన వాటిని అందజేయటం కోసం వార్తాహారులకు పంచి యిచ్చాడు మిస్టర్ గ్లాస్ట అప్పుడప్పుడే రాజకీయాలల్లో ప్రవేశిస్తుండటం వల్ల, అతడు లేని సమయాలలో కార్యాలయవ్యవహారాలను చూడవలసిందని ఆంద్రూను తరువాత పదే పదే పిలవటం జరిగింది.

ఇప్పుడు బాలురకు పదకొండుంబాతిక డాలర్లు ఇస్తున్నారు. తరువాత వచ్చిన జీతపు రోజున పుచ్చుకోవటం కోసం బాలురందరూ వరుసగా నిలబడ్డారు. ఆండీ తల్లడిల్లినట్లుగానే అందరికీ జీతం బట్వాడా చేయటం జరిగింది. భీతి వల్ల అతడి తల తిరిగిపోతున్నది. అతన్ని అవసరం లేదని పంపించివేస్తారా ఏమిటి? అతని తప్పేమిటి? మిగిలిన పిల్లలందరూ గది విడిచిపెట్టి వెళ్ళిన తరువాత, మేనేజరు నీకు రెండుంబాతిక డాలర్లు అదనం వస్తుందని చెప్పి, అతడి చేతికి పదమూడున్నర డాలర్లిచ్చాడు.

అది ఒక శనివారం సాయంత్రం. తరువాతి కాలంలో ఆండీ ఇది బాగా గుర్తు పెట్టుకొన్నాడు. అతడు ఇంటికి రావటంలో చాలా భాగం పరుగెత్తుకుంటూ వచ్చాడు. నడిచే వాళ్ళతో బాట క్రిక్కిరిసి ఉండడం వల్ల, కోరినంత వేగంగా పరుగెత్తే అవకాశం లేకపోయింది. అందువల్ల అతడు బండ్లు వెళ్ళే మార్గాన అలిఘనీ బ్రిడ్జికి అడ్డంగా పడి పరుగెత్తి, ఇల్లు చేరుకున్నాడు. మధ్యలో ఒక నాటకీయమైన చిన్ని పథకాన్ని ఆలోచించాడు. రెబెక్కా వీథిని చేరుకోగానే ఉచ్ఛ్వాసం కోసం కొంత వేగాన్ని తగ్గించాడు. ఇంట్లోకి వెళ్ళి ఎప్పుడూ ఇస్తున్న పదకొండు డాలర్ల ఇరవైయైదు సెంట్లు తల్లి చేతికి ధైర్యంగా ఇచ్చాడు. తన కోసమని అతడు ఎప్పుడూ డబ్బు ఖర్చు పెట్టకపోవటం వల్ల మిగిలిన పిల్లవాళ్లు అతనిని పిసినిగొట్టని అనుకుంటుండేవాళ్ళు. కార్నెగీ కుటుంబసభ్యులమధ్య ఎంతటి సాన్నిహిత్యమున్నదో కుటుంబంలో సంపాదించే ముగ్గురు, ఇంటిలోకి వస్తుసామగ్రిని, ఫర్నిచరు, దుస్తులను కొనటానికీ, స్కాట్లండులోని

పూర్వమిత్రురాలయిన మిసెస్ హెన్డర్ సన్ ఇచ్చిన ఇరవై పౌనుల అప్పును తీర్చివేయటానికీ, పెన్నిలతో సహా ఎంత జాగ్రత్తగా కూడబెడుతున్నారో వారికి తెలియదు.

ఆండీ తల్లి అవకాశమున్నప్పుడల్లా ఒక వెండి అరడాలరును సంగ్రహించి ఈ నిధికి చేరుస్తుండేది. చివరకు ఇవి రెండు వందలు అయినప్పుడు, ఆండీ వీటిని పిట్స్‌బర్గ్‌కు మోసుకుపోయి, ఇరవై పౌనులకు డ్రాఫ్టుకొని మిసెస్ హెన్డర్‌సన్‌కు పంపించాడు. ఆ నాడు మహానంద సమయం! కార్నెగీ కుటుంబం ఋణవిముక్తి పొందింది.

ఆ నాటి రాత్రి తన రహస్యంతో ఉబ్బితబ్బిబ్బులవుతున్నా, తాను, తన తొమ్మిదేళ్ళ తమ్ముడు టామ్ ఇంటి వెనక భాగంలోని పడక గది లోపలికి వెళ్ళేటంతవరకూ ఆండ్రూ తన అదృష్టాన్ని గురించి ఏ మాత్రం చెప్పలేదు. తన రహస్యాన్ని ఏదో సణిగినట్లు బయటపెట్టి రెండు వెండి డాలర్లను ఇరవైయైదు సెంట్లను విడి విడి జేబుల్లో నుంచి తీసి తమ్ముడికి చూపించినప్పుడు అవి ఒకదానికొకటి తగిలి చప్పుడు కావటం కాని, వాటిని గురించి అతడు ప్రశ్నలడగటం కాని ఇష్టపడలేదు. టామ్ ఆ సంఘటనలోని ఘనతకు అబ్బురపడ్డాడు. చివరకడిగాడు : "ఆండీ! వీటితో నీవేమి చెయ్యదలిచావు?"

ప్రక్కమీదికి వాలుతూ "ఎప్పటికయినా అమ్మకే ఇస్తాను" అని సమాధానం చెప్పాడు. "మనవాళ్ళందరికీ గొప్ప ఆశ్చర్యాన్ని కలిగించదలుచుకొన్నాను." అంతే టామ్ పైకి పోవటం ఆరంభించాడు. "ఎప్పుడో ఒకరోజున మనమిద్దరమూ "కార్నెగీ బ్రదర్స్" అన్న పేరుతో వ్యాపారం చేద్దాము."

"ఎటువంటి వ్యాపారం?" టామ్ తెలుసుకోదలచుకున్నాడు.

"తప్పక చేద్దాం. నేను ఇంకా నిశ్చయం చేసుకోలేదు. కానీ మనం ధనాన్ని సంపాదించి తీరుతాం. నాన్న, అమ్మ మంచి బండి ఎక్కి తిరుగుతారు." గురక వినిపించి తాను చెప్పేది తమ్ముడు వినటం లేదని తోచేటంతవరకూ, అతడు అలాగే భావవీథుల్లో సంచరించాడు.

మరునాడు ఉదయకాల భోజనసమయంలో అతడు రెండుంబాతిక డాలర్లు బల్లమీద వుంచినప్పుడు, తల్లిదండ్రులు తమ కళ్ళను తామే నమ్మలేకపోయినారు. తల్లి కన్నుల్లో సంతోషాశ్రువులు ఒక్కమారుగా పొంగి సుళ్ళు తిరిగాయి. భుజంమీద చెయ్యివేసి తండ్రి, "ఆండ్రూ! నిన్ను చూచి గర్విస్తున్నా" నన్నాడు. తదనంతర జీవితంలో

పొందిన యే విజయం గాని, గౌరవం గాని ఈ స్వల్పజయం ఇచ్చినంతటి ఆనందస్పందనాన్ని ఇవ్వలేకపోయినవని అతడన్నాడు.

వార్తాహరి బాలురు జీతానికి తగ్గ పని పూర్తిగా చేసేవాళ్ళు. ప్రతి రెండో సాయంకాలం వాళ్ళు కార్యాలయాన్ని మూసేటంతవరకు ఉండవలసి వచ్చేది. అప్పటి రాత్రుల్లో ఆండ్రూ ఎప్పుడో తప్ప పదకొండు లోపల ఇంటికి చేరుకునేవాడు కాదు. ప్రతి రెండో సాయంత్రం ఆరు కాగానే బాలురు కార్యాలయం నుంచి వెళ్ళిపోతుండే వాళ్ళు. ఆ మంచు పట్టిన రాత్రుల్లోను, ఉదయవేళల్లోను అలిఘనీ బ్రిడ్జిమీద నడవటం చాలా కష్టమయిన పని. అయితే రాకపోకలకు కార్యాలయం డబ్బు ఇవ్వటమన్న ఊహకు అవకాశం లేదు.

పనిమీద సాయం సమయాల్లో వుండవలసి వచ్చినప్పుడు ఆండ్రూ శ్రమకు ప్రతిగా ఒక మేలు వుంటుండేది. అతడు పిట్స్ బర్గ్ థియేటరు మేనేజరుకు తరచుగా వార్తలను అందజేయవలసి వుంటుండేది. ఈ థియేటర్ లోపలిభాగం చాలా ఘనమైందని ఆండీ అనేకపర్యాయాలు విన్నాడు. గోడల మీది పూలచెక్కడాలు, ఇత్తడి మేకులకు కట్టబడ్డ కుంకుమ రంగు వెల్వెట్ తెరలు, స్ఫటికపు కొమ్మల దీపపుసెమ్మెలు గొప్పగా ఉంటవని తెలుసుకొన్నాడు. తంతి వార్తను అందించటం కోసం ఒక సాయంకాలం థియేటర్‌కు వెళ్ళినప్పుడు, సరసుడయిన మేనేజరు పై అంతస్తులో వున్న గ్యాలరీవరకూ అతన్ని వెళ్ళనిచ్చాడు. అక్కడ సీట్లు ప్రత్యేకించబడి లేవు. తదేకచిత్తంతో అతడు నాటకంలోని కొంత భాగాన్ని చూశాడు. తరువాత ఆ థియేటర్ మేనేజరుకు తంతి వార్త ఉన్నప్పుడల్లా దాన్ని అందజేయటానికి సాయంత్రం తెర ఎత్తే సమయం దాకా – అది ఇప్పటికంటే ఎంతో పెందలకడ జరుగుతూండేది – ఆలస్యం చెయ్యటానికి యత్నించేవాడు.

ఆ థియేటర్‌లో అతడికొక నవప్రపంచద్వారాలు తెరవబడినట్లు తోచింది. ఇంతకు పూర్వం అతడు షేక్స్పియర్ రచనల్లో ఒక పంక్తి కూడా చదవలేదు. ఆ దినాలల్లో ప్రేక్షక జనానికి ఇష్టమయిన వాళ్ళలో షేక్స్పియర్ ఒకడు. ఊపిరి సలుపలేనంత తీక్ష్ణమయిన శ్రద్ధతో, ఆ వేగంతో ఆ కుర్రవాడు కన్ను చెదరే ఆడంబరోత్సవాలను చూచేవాడు. జూనియస్ బ్రూటస్, బూత్, వాలాక్కులు, ఛార్లటీ కుష్మన్ అంతా ఆనాటి ప్రముఖ నట నటీ వర్గం వారి కంఠాల్లోంచి వెలువడే 'ఆవన్' కవివర్యుని దివ్యరచనలను వినేవాడు. జ్ఞాపకశక్తి విశేషంగా వున్న అతడు, కాగితం మీద చూడకపూర్వమే, ఆ నాటకాలలో నుంచి సుదీర్ఘ కావ్యభాగాలను నేర్చుకున్నాడు. అప్పటినుంచీ అతని

దృష్టిలో షేక్స్పియర్ ఒక గౌరవస్థానాన్ని సంపాదించుకున్నాడు. కానీ అది బరన్స్, స్కాట్ చేకూర్చుకున్న దానికంటే తక్కువయింది.

పిట్స్‌బర్గ్‌లో గాని, అలిఘనీలోగాని ప్రజాగ్రంథాలయాలు లేవు. అందువల్ల ఆండీ అప్పటికి చాలా తక్కువ పుస్తకాలు మాత్రమే చదివాడు. కార్నెగీ కుటుంబానికి పుస్తకాలను కొనుక్కొనేటందుకు ఖర్చు పెట్టగల అవకాశం లేదు. కల్నల్ జేమ్స్ ఆండర్‌సన్ అనే ఉద్యోగాన్ని విరమించుకొన్న ఒక ఉత్పత్తిదారు, నాలుగువందల సంపుటాలున్న ఒక గ్రంథాలయాన్ని చేకూర్చుకొన్నాడు. ఆదివారం నాడు ఆ కల్నలే లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నప్పుడు, ఎవరైనా గ్రంథమొకటి తీసుకొని మళ్ళీ వచ్చే శనివారం దాకా దాన్ని తనదగ్గర వుంచుకోవచ్చు. సక్రమంగా అతడు దాన్ని తిరిగి ఇస్తే మళ్ళీ మరొకదాన్ని పుచ్చుకోవచ్చు. కల్నల్ పెట్టిన ఈ పథకం బాగా ప్రాకిపోయింది. అందువల్ల ఉదారస్వభావుడయిన కల్నల్, దీనిని విస్తృతం చెయ్యటానికి నిశ్చయించాడు. న్యూ యార్క్‌కు వెళ్ళి అతడు మరిన్ని పుస్తకాలు కొన్నాడు. గ్రంథసంఖ్య పద్దెనిమిది వందలదాకా పెరిగింది. వాటితో ఆయన నగరం ఒక నివేశనాన్ని చూపిస్తే, "మెకానిక్స్ అండ్ ఎప్రంటిసిస్ లైబ్రరీ" అన్న పేరుతో ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పటానికి నిశ్చయించుకున్నాడు. కౌన్సిల్ వెంటనే అందుకు అంగీకరించింది. జీతమిచ్చి ఒక లైబ్రేరియన్‌ను నియమించటంతో పని నడిచిపోతుంది.

అయితే ఈ క్రొత్త సంస్థ ఆండ్రూకు దెబ్బతగిలే ఒక నిబంధనను పెట్టింది. అది ఎల్లప్పుడూ ఎప్రంటిస్‌లుగా వున్న వాళ్ళే ఈ గ్రంథాలయాన్ని ఉచితంగా వుపయోగించు కోవచ్చు. ఇతరులు అందులో నుంచి పుస్తకాలను తీసుకొనే అవకాశమిచ్చినందుకు సంవత్సరానికి రెండు డాలర్లను చెల్లించాలన్నది. ఆండీ ఆ గ్రంథాలయానికి వెళ్ళాడు. "తంతి వార్తాహరి బాలుడు డబ్బు చెల్లించకుండా పుస్తకాలను తీసుకొనే వీలు వున్నదా?" అని లైబ్రేరియన్‌ను ప్రశ్నించాడు.

"నీవు ఎప్రంటిస్‌గా బౌండ్ అయినావా?" అని లైబ్రేరియన్ ప్రశ్నించాడు.

"లేదు. కాని..."

"వార్తాహరి బాలురు చేతులతో పనిచేసేవాళ్ళు కారు" ఇది తుది నిర్ణయంగా లైబ్రేరియన్ సమాధానం చెప్పాడు.

"కాకపోవచ్చు. అయితే వాళ్ళు చాలా పనికాళ్ళతో చేస్తారు" ఆండీ వెంటనే ప్రతిగా సమాధానం.

“ఏమయినా రెండూ ఎన్నటికీ ఒకటి కాజాల” వని లైబ్రేరియన్ అన్నాడు. బాగా విసిగిపోయి ఆండీ, ఈ విషయాన్ని జనమందరికీ తెలియజేయాలని నిశ్చయించుకొన్నాడు. బౌండు కానంతమాత్రం చేత స్టోర్స్‌లలో పనిచేసే పిల్లలను, దాత వేరుగా ఊహించారని భావించేటందుకు వీలు లేదు. వీరిలో చాలామంది నిర్ణీతమయిన రెండు డాలర్ల సుంకాన్ని ఇచ్చుకోలేరు కనుక, గ్రంథాలయాన్ని వినియోగించుకోవటం కేవలం ఎప్రెంటిస్‌లకు మాత్రమే పరిమితం చేయటంలో మేనేజర్లు దాత వుద్దేశాన్ని అపార్థం చేసుకున్నారని లోపాన్ని ఎత్తిచూపుతూ, అతడు వ్రాసిన లేఖను ‘పిట్స్‌బర్గ్ డిస్పాచ్’ పత్రిక ప్రకటించింది. ఆ ఉత్తరం చివర అతడు ‘బౌండు కాని శ్రామిక బాలుడు’ అని సంతకం చేశాడు.

ఇది ముద్రణ విషయంలో అతడు చేసిన మొదటి సాహసం. ఒకమారు చవిచూచాడు గనుక తరువాత అతడు తరుచుగా పత్రికలకు వ్రాస్తుండేవాడు. లైబ్రేరియన్ వెంటనే ‘దానం ఎవరికోసమయితే ఉద్దేశింపబడ్డదో ఉచిత వినియోగదారుల పట్టికను వారివరకే పరిమితం చెయ్యవలసి వచ్చింది’ అని పత్రిక ద్వారానే సమాధానమిచ్చాడు. ఊహించటానికి వీలున్నట్లే అతడు దీన్ని ఖండిస్తూ మరొక లేఖ వ్రాశాడు. అందులో అతడిలా వ్రాశాడు. “ఈ దానం ఎప్రంటిస్‌ల కొరకు కన్నప్పుడు శబ్దార్థాన్ని నిష్కర్ష చేయటం జరిగిందా? వ్యాపారాన్ని నేర్చుకొంటూ బౌండు అయినవారికి మాత్రమే ఉద్దేశింప బడ్డదా లేక బౌండు అయినా కాక పోయినా శ్రామికబాలుర కందరికీ ఉద్దేశింపబడ్డదా అన్నది ప్రశ్న. ఇందులో మొదటిదే సత్యమని అంటే మేనేజర్లు ఉదారుడైన దాత ఉద్దేశాన్ని అపార్థం చేసుకొన్నారన్న మాటే – శ్రామికబాలుడు.”

ఈ లేఖ ప్రచురితమయిన తరువాత లైబ్రేరియన్ కల్నల్ ఆన్డర్‌సన్‌తో భేటీ చేసి వుంటాడు. తరువాత మూడు రోజులకు డిస్పాచ్ పత్రిక సంపాదకీయపు పుటలో “బౌండు కాని శ్రామిక బాలుడు ఈ కార్యాలయానికి విచ్చేయవలసిందని ప్రార్థన” అన్న పంక్తి ఒకటి ప్రచురితమయింది.

ఆండీ వెళ్లాడు. అతన్ని లైబ్రేరియన్‌ను కలుసుకోవలసిందనీ, పై సూత్రాన్ని సడలించారనీ, అందువల్ల ఎప్రంటిస్‌లు కాకపోయినప్పటికీ, కార్మికబాలు లందరూ ఉచితవినియోగదారుల పట్టికలో చేరుతారనీ చెప్పటం జరిగింది.

జాతి కంతటికీ గొప్ప శ్రేయస్సును చేకూర్చిన కార్నెగీ ఉచిత ప్రజాగ్రంథాలను భావానికి మూలభూతుడైన కల్నల్ జేమ్స్ ఆన్డర్‌సన్‌కు మనం ఎంతగానో కృతజ్ఞులమై

ఉండవలసి ఉంది. కార్నెగీ తరువాతి కాలంలో ఇలా వ్రాశాడు. “మానవుడు నేటివరకూ కూడబెట్టిను కోటానకోట్ల ద్రవ్యసంపదనంతటినీ ఇచ్చినా దానికి ప్రతిగా దేనిని ఇవ్వలేనో, అటువంటి సాహిత్యాభిరుచిని నాకు కలిగించిన అతనికి.” ధనవంతుడైన తరువాత కార్నెగీ అలిఘనీకి ఇచ్చిన గ్రంథాలయంలో హాలుకు ముందు కల్నల్ స్మృతిచిహ్నంగా అతడు ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. దాని క్రింద ఉన్న రచనలో కొంతభాగం ఇలా ఉంది.

“పశ్చిమ పెన్సిల్వేనియాలో ఉచిత గ్రంథాలయ స్థాపకుడైన కల్నల్ ఆన్డర్సన్కు.. ఇది వేటి మూలంగా యువకులు ఆరోహింపగలరో, అట్టి అమూల్య జ్ఞానభావనానిధులు ఎవరికి ఆరీతిగా వివృతం చెయ్యబడ్డవో ఆ “కార్మిక బాలకు” లలో ఒకడైన ఆంద్రూ కార్నెగీ కృతజ్ఞతాపూర్వకంగా నెలకొల్పిన స్మృతిచిహ్నం”

తన చెలికాండ్రయిన జాన్ ఫీప్స్, టామ్ మిల్లర్, జిమ్మీ విల్సన్, విల్లీ కౌలీలతో బాటు మిస్టర్ ఫిప్స్ పాదరక్షల నిర్మాణశాలలో గడిపేది తప్ప మిగిలిన సాయంతనాల నన్నింటినీ – ఇంటిదగ్గర ఉండే ప్రతి రెండో సాయంతనాల నన్నింటినీ – ప్లూటార్క్లైవ్స్ మెకాలే లాంబుల వ్యాసాలు, మెక్సికో పెరూలమీద స్పైనీయులు చేసిన విజయయాత్రలను గురించి ప్రెస్కాట్ రచించిన చరిత్రలు, మిగిలిన అన్నింటికంటె అతిశ్రద్ధతో పఠించిన బాన్ క్రాఫ్ట్ కృతి హిస్టరీ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్ చదవటంతో అతడు గడిపివేసేవాడు. అతడు కొన్ని సాంకేతిక గ్రంథాలను, ముఖ్యంగా లోహనిర్మాణాన్ని (Iron Making) గురించినవి, అతిజాగరూకతతో పఠించాడు. అప్పుడు ఎవరూ గ్రహింపకపోయినప్పటికీ, ఇది అతని భవిష్యత్తు కొక సూచికగా కనిపిస్తున్నది.

అంకుల్ జార్జి లాడర్తోను, యువ జార్జితోను, బాల్యంలో తన ప్రీతికి పాత్రుడైన కజిన్డాడ్తోను అతడు ఎప్పుడూ ఉత్తరప్రత్యుత్తరాలు నడుపుతుండేవాడు. ఆ లేఖల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని స్వేచ్ఛాసాహసాలను గురించి అత్యుక్తులు, గర్వోక్తులు ఉంటుండేవి. ఈ లేఖలే కజిన్ డాడ్ మనస్సులో బీజాలను నాటి, తరువాతి కొలది సంవత్సరాలలోనే అతడు అమెరికాకు వలస వచ్చేటట్లు చేశాయి.

విలియం కార్నెగీ స్వెడెన్ బోర్జియన్ చర్చిలో చేరాడు. అతని భార్య మతవిషయాల్లో తాను దూరంగా ఉంటున్నా, అతని విశ్వాసాలతో ఎట్టి ప్రమేయం పెట్టుకోలేదు. ఆండీ కొన్ని సంవత్సరాలు అక్కడి సండే స్కూలుకు వెళ్ళాడు. అప్పుడు అతడు విశేషంగా స్వెడెన్ బోర్జియన్ విషయాలమీద వ్రాసిన పుస్తకాలున్న సండే స్కూల్లోని చిన్ని

గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా ఉన్నాడు. 'డ్యూ డ్రాప్' అనే పేరుగల ఆ సండే స్కూల్ పత్రికకు అప్పుడప్పుడూ చిన్న చిన్న రచనలు చేస్తుండేవాడు. ఈ చిన్న రచనల్లో ఒకటి యుద్ధవ్యతిరేకతను నిరూపించేది అయి వుండటం ముఖ్యంగా గమనింపదగ్గ విషయం. దీనిని అతడు తన పద్దెనిమిదోయేట క్రిమియాలో ఇంగ్లండు రష్యామీద యుద్ధం చేస్తున్న మొదటి సంవత్సరం వ్రాశాడు. అతడు చర్చిలో పాట పాడుతుండేవాడు. సంగీతం వినటమంటే అతడికి మంచి ఆసక్తి, అయితే చర్చి సంగీతపు నాయకుడు ఒప్పుకొన్నట్లు అతడి కంఠంలో ఆశించదగ్గది ఏదో కొంత ఉంది. ఏమైనా, ఎప్పటిలాగానే అతనికి ఈ అనుభవం వల్ల కొంత లాభం కనిపించింది. అది తరచుగా పాడే 'బాఖ్ కోరల్స్' మీద క్రొత్త అభిలాష కలగటం, మంచి సంగీతాన్ని ప్రశంసించగల శక్తి పెరగటం, మంచి సంగీతమంటే అభిరుచి ఏర్పడటం.

స్కాచ్ వారైనప్పటికీ అతని తల్లిదండ్రులు ఆలోచనారీతిలో ఉదారత ఉన్నవాళ్ళని, చలికాలంలో ఒక శనివారం నాడు అలిఘనీనది గట్టిగా, నునుపుగా గడ్డ కట్టినప్పుడు నిరూపితమైంది. ఆదివారం నాడు ఆటపాటలంటే స్కాచ్ వారు ఎంత పట్టుదల వహిస్తారో జ్ఞప్తికుండి కూడా స్కేటింగ్ అంటే అతిప్రీతిగల ఆండీ, ఆ నాటి సాయంత్రం కొంత అనుమానిస్తూనే తల్లిదండ్రులతో "రేపటి ఉదయం చర్చికి వెళ్ళబోయేముందు కొద్దిసేపు నేను స్కేటింగ్ చేయవచ్చునా." అన్నాడు.

విశాల హృదయం గల తల్లి అన్నది. "నీ కెంతసేపు ఇష్టమైతే అంతసేపు స్కేట్ చేయవచ్చు?"

"అంతసేపు నేను ఒప్పుకోను" అని ఆమె అభిప్రాయానికి తండ్రి ఒక సవరణ చేశాడు. "ఆండ్రా! ఉదయం కొంతసేపు స్కేటింగు చెయ్యటంలో నాకేమీ అభ్యంతరం లేదు. కాని, నీవు నాతో కలిసి చర్చికి పోవటానికి సకాలంలో ఇంటికి తిరిగి వచ్చేయాలి."

అందువల్ల ఆండీ పెందలకడనే లేచాడు. గడ్డ కట్టిన నదిమీద కొన్ని గంటలు గడిపాడు.

# 4. నిశ్రేణికారోహణం

వార్తాహరి బాలుడుగా ఆంద్రూ వుద్యోగం సంవత్సరం మీద మరికొద్ది కాలం గడిచింది. మొదటినుంచి అతడు తంతి సాధనాలంటే విశేషమైన ఆసక్తిని చూపిస్తుండే వాడు. అవకాశం దొరికినప్పుడల్లా ఆపరేటర్లు వార్తలను ఎలా పంపిస్తారో చూస్తూ, ఎలా స్వీకరిస్తారో వింటూ వుండేవాడు. ఉదయం కార్యాలయాన్ని చిమ్మి పరిశుభ్రం చేయటానికి వచ్చిన సమయాలల్లో అతడు మోర్స్ అక్షరమాలను నేర్చుకున్నాడు. చుక్కలకుగాను, వేగంగాను, నిశితంగాను నొక్కటం, డాష్‌లకోసం దీర్ఘమైన కటక్కుమనే ధ్వనులు చేయటం సాధన చేశాడు. కార్యాలయంలోని ముచ్చట్లవల్ల అతడు పదకొండు – పంతొమ్మిది సంవత్సరాల మధ్యవయస్సు కుర్రవాళ్ళే ఇతరచోట్ల వార్తలను పంపించటం, పుచ్చుకోవటం చేస్తుంటారని గ్రహించి, ప్రక్క స్టేషన్లను పిలవటానికి కూడా సాహసించాడు. అక్కడ వుండే పిల్లలతో తాను నేర్చుకుంటున్న వాడినని చెప్పి వాళ్ళకు కొన్ని మాటలను అందించి, వాళ్ళ జవాబు మాటలను అందుకుంటుండేవాడు. ఒక రోజు ఉదయం అతడు ఒంటరిగా వున్నప్పుడు డెపిట్స్‌బర్గు ఒక వార్తను అందుకుంటారా?" అని ఆదుర్దాగా అడగడం జరిగింది ఫిలడెల్ఫియా నుంచి.

"మరణాన్ని తెలియజేసే అతి జరూరైన వార్తను మీరు అందుకుంటారా?" అని ఫిలడెల్ఫియా అడిగింది.

"అందుకుంటాము" అని ఆండీ సమాధానం చెప్పాడు.

వార్తలను అందుకునే సాధనాలు ఆ రోజుల్లో చుక్కలను, డాషులను చిన్న కాగితపు ముక్కలమీద ముద్రిస్తుండేవి. ఆండీ ఆ వార్తకు మేలుప్రతి వ్రాసుకొని అందించటం కోసం పరుగెత్తాడు. తాను చేసిన సాహసాన్ని గురించి మిస్టర్ బ్రూక్స్ ఏమని భావిస్తాడో అని, అతడు కొంత ఆందోళన చెందాడు. "అది చాలా జరూరయినది కావటం వల్ల తాను అందుకున్నా" నని క్షమాపణ చెప్పుకున్నాడు.

"మంచిపని చేశావు. ఇక్కడ నీవు ఒంటరిగా వుంటున్నప్పుడు అలా చెయ్యవచ్చు" అని మిస్టర్ బ్రూక్స్ ఆర్ద్రంగా అన్నాడు. "అయితే, కడు జాగ్రత్తగా వుండాలి. తప్పులు రావటానికి వీల్లేదు సుమా!" అని హెచ్చరించాడు.

ఈ సంఘటన జరిగిన కొద్ది కాలం నుంచి ఆపరేటర్లు మధ్యాహ్నభోజనానికి బయటికి వెళ్ళినప్పుడు ఆండీని ఒంటరిగా కార్యాలయంలో వుంచి పోతుండేవాళ్ళు. అతడు బల్ల దగ్గరవుండి వార్తలను పుచ్చుకోవటమే కాకుండా, పంపిస్తుండేవాడు కూడా. ఇప్పుడు అతని జీతం పెరిగి వారానికి నాలుగు డాలర్లు అయింది. టేపు మీద ఉబ్బెత్తుగా ముద్రింపబడె చుక్కలను, డాషులను చూడకుండానే యంత్రాలు చేసే ధ్వనులనుబట్టి వస్తున్న వార్తలను తెలుసుకోవచ్చునని, అతడు త్వరలోనే గమనించాడు. కేవలం చెవితో వినటంతోనే వార్తలను గ్రహించి కెంటకీలో ఆపరేటరుగా పనిచేస్తున్న ఒక కుర్రవాడు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాడని, చెప్పుకొంటున్న వార్తలు నిజమని చులకనగా విశ్వసించాడు.

హ్యూస్ అనే వృద్ధుడు టేపునుంచి వార్తలను చదివి, వ్రాసి యిస్తూ కార్యాలయంలో వ్రాయసగాడుగా పనిచేస్తున్నాడు. అతడు, ఆండీ వార్తలను పంపిస్తూ అందుకొంటూ వున్నప్పుడు, గొణగటం ప్రారంభించాడు. ఒక బాలవార్తాహరికి అందించే వార్తలకు తనను ప్రతి వ్రాయమంటున్నందుకు అతడు తన అసంతృప్తిని వెల్లడిస్తున్నాడు. అందువల్ల ఆండీ అతనికి తెలియజెప్పటంకోసం వార్తలు వస్తున్నపుడు టేపుచుట్టను ఆపివేసి, కేవలం అవి చేస్తున్న ధ్వనులను వినటం మూలంగానే వాటిని అందుకోటం ప్రారంభించాడు.

హ్యూస్‌కు నింద వచ్చింది. “నీవిలా చేయటానికి వీల్లేదు” అని అతడు అడ్డుపెట్టాడు. “ఇది పద్ధతికా” దన్నాడు.

“జిమ్మీ లియొనార్డు కెంటకీలో ఇలాగే చేస్తున్నా” డని ఒకవంక వార్తను వింటూ, మరొక వంకదాన్ని వ్రాస్తూ ఆండీ ఎదురు చెప్పాడు.

“ఇలా అయితే గందరగోళం జరుగుతుంది” అని ఆ వృద్ధుడు గట్టి పట్టు పట్టాడు. “ఇందుకు నీవు అనుభవించవలసి వస్తుంది.”

అయితే, అతడన్నదానికి బదులుగా ఆండీ చేసిన అద్భుతచర్య అతనికి వుద్యోగంలో ప్రమోషన్ తెచ్చిపెట్టింది. కార్యాలయ వ్యాపారం వేగంగా వృద్ధి పొందుతున్నది. మరొక ఆపరేటరు కావలసివచ్చాడు. ఆండీ ఆ వుద్యోగాన్ని సంపాదించుకొన్నాడు. జీతం నెలకు ఇరవై అయిదు డాలర్లు.

తరువాత కొద్ది కాలానికే మిస్టర్ బ్రూక్స్ ఆండీని బల్లదగ్గరికి పిలిచి అన్నాడు. “గ్రీన్స్‌బర్గు ఎక్కడుందో నీకు తెలుసా?”

“తెలుసు. ఇక్కడికి తూర్పున వుంది” – అన్నాడు గౌరవ పూర్వకంగా.

“అక్కడ ఆపరేటరు మిస్టర్ టైలర్ రెండువారాలు సెలవు తీసుకోదలచాడు! అతనికి బదులుగా అక్కడ ఒక మనిషి కావాలి. నీవు ఆ పని చేయగలవా?”

“చేయగలను” అన్నాడు ఏ మాత్రం అనుమానించకుండా.

“మంచిది. నిన్ను అక్కడికి పరీక్ష క్రింద పంపిస్తున్నాము”.

ఆండీ ఈ వార్తను తీసుకువచ్చినప్పుడు ఇంట్లో ఆనందోద్వేగం అతిశయించింది. తల్లి వెంటనే అతని దుస్తుల విషయం ఆలోచించింది. తల్లి “అతనికి క్రొత్త షర్టు కావా” లన్నది, తండ్రి ఈ సంఘటనకు నివ్వెరపోయాడు.

“బాధ్యత ఎంతో తెలిసిందా?” అన్నాడు కేక పెట్టినట్టు. “నవంబరు వస్తేగాని అతడికి పదిహేడేళ్ళు రావు. ఆండీ! ఈ పనిని నిర్వహించగల శక్తి నీకున్నట్లు భావిస్తున్నావా?”

“అవును. నిర్వహింపగలననే భావిస్తున్నాను!” అని ఆత్మవిశ్వాస పూర్వకమైన సమాధానం వచ్చింది.

“నీవు యోగ్యుడవనిపించుకొనటానికి ఇది తగిన గౌరవమని నా నమ్మకం!” అన్నాడు తండ్రి.

స్టేజి కోచ్ మీద ముప్పది మైళ్ళు ప్రయాణం చెయ్యటమనేది ఎప్పుడోగాని తటస్థపడని పండుగ. ప్రాణంగా ఫిలడెల్ఫియానుంచి పిట్స్‌బర్గువరకూ తన రైలు మార్గాన్ని విస్తృతం చేస్తున్న రైలురోడ్డు, వారికోసం దారిపొడుగునా లోతుగా గుంటలు తీసి కట్టలు పోసేందుకు మూగుతున్న నిరంతరశ్రామిక జనదర్శన నయనోత్సవం అతనికి కలిగింది. అనతికాలంలోనే ఆ సాహసికచర్యతో తనకు సంబంధం కలగబోతున్నదన్న సంగతి చిన్ని ఆండీకి అణుమాత్రమైనా తోచలేదు.

ఆండీ తొలిసారిగా ఒక ప్రజాభోజనశాలలో భుజించింది గ్రీన్స్‌బర్గు హోటల్లోనే. అతడు అక్కడి భోజనం బాగున్న దనుకున్నాడు. నిగనిగలాడే మోముతో, ఎర్రవారే బుగ్గలతో, పీచువలె రేగిన జుట్టుతో లోపలికి ప్రవేశించి తనకు బదులుగా వచ్చానని చెప్పినప్పుడు, ఆపరేటరయిన టైలర్ తన అబ్బురపాటును దాచుకోలేకపోయాడు. కానీ అతడు యువకుడయిన కార్నెగీతో కలిసి కొన్ని వార్తలను ప్రసారం చేసినప్పుడు అతని శక్తిని గురించి తెలుసుకొన్నాడు. ఒక్క పిలుపును కూడా విడిచిపెట్టకుండా

అందుకోటం కోసం సాయంకాలం ప్రొద్దుపోయిన దాకా పనిచేద్దామని అతడు ఆదుర్దాగా వున్నాడు. ఒక తుఫాను రోజున సాయంత్రం తన తంతి యంత్రంముందు కూర్చున్నప్పుడు – ఏదో పుస్తకం చదువుతూ, మెరుపులు మెరిసిన సమయంలో అతడు 'కీ'ని ముట్టుకోటానికి సాహసించాడు. ఏదో పెద్దభూతం పెనుగదతో తన్ను మోదినట్లు తోచింది. అతడు, అతడు కూర్చున్న బల్లా నేలమీద పడిపోవటం జరిగింది. నరాలు ఝల్లుమన్నవి. అప్పటినుంచీ ఈ ఉలికిపాటు వల్ల పాఠం నేర్చుకోవడం చేత, తుఫానువేళల్లో అతడు ఎంతో జాగరూకుడయి మెలగుతుండేవాడు.

గ్రీన్స్‌బర్గులో ఆండీ ప్రసిద్ధుడైనాడు. అతడు కేవలం చెవులతోటే వార్తలను గ్రహించే ప్రజ్ఞగలవాడని విని, జనం అతన్ని చూడటం కోసం కార్యాలయానికి వస్తుండేవారు. అతడు తాత్కాలికంగా తనకు ఒప్పచెప్పిన పనులను ఎంతో సమర్థంగా నిర్వహించాడు. పిట్స్‌బర్గుకు తిరిగివచ్చిన తరువాత ఈస్టర్న్ టెలిగ్రాఫిక్ కంపెనీ మేనేజరు, చేసిన పనిని మెచ్చుకొంటున్నందుకు చిహ్నంగా, అందమైన బైండుగల బరన్స్ కవి కావ్యసంపుటాన్ని అతనికి బహూకరించాడు. మరొకటి ఏదయినా అతనికి ఎక్కువ సంతోషాన్ని కలిగించేది కాదు.

ప్రాచ్యవైదేశిక వార్తలను తీసుకురావటం కోసం పిట్స్‌బర్గులోని వార్తాపత్రికలు విడివిడిగా తమ విలేఖకులను తంతి వార్తాకార్యాలయానికి పంపిస్తుండేవి. ఇప్పుడు అవి అన్నీ కలిసి ఏకంగా ఒక విలేఖకునికి మాత్రమే పంపటానికి నిర్ణయించుకొన్నవి. ఆ విలేఖకుని సూచన మీద ఆండీ వార్తలకు అయిదు ప్రతులను తయారుచేసి ఇస్తుండేవాడు. ఈ పని చేసినందుకు అతనికి వారానికొక డాలరు వస్తుండేది. అంతాచేరి ఇప్పుడు అతనికి నెల ఒకటికి దరిదాపుగా ముప్పది డాలర్ల రాబడి అయింది.

కార్నెగీ కుటుంబం అద్దె ఇవ్వటం మానివేసి సొంత ఇల్లు కొనుక్కునేందుకు తగ్గ ఆర్థిక స్తోమత తమకు లభించినట్లు భావిస్తున్నది. రెండు సంవత్సరాలలో తీర్చేటట్లు అంకుల్ ఆండ్రూ హోగన్ కాటేజి, రెబెక్కా వీథిలో ఒక నివేశనస్థలం వాళ్ళు 50 డాలర్లకు కొనుక్కున్నారు.

వసంత సమయంలో ఓహైయోనది పొంగి, స్టుయిబెన్ విల్లీ, వ్హీ లింగుల మధ్య తూర్పునకు, మధ్య పశ్చిమానికి మధ్య వార్తాతంత్రులను త్రెంచివేసి, ఇరవైమైళ్ళ పొడుగు తంతి తీగను దూరంగా కొట్టిపారేసిన నాటికి ఆండీ వయస్సు పదిహేడున్నర సంవత్సరాలు. తీగలను తిరిగి ముడిపెట్టేటంత వరకూ స్టేషన్ల మధ్య సంబంధాన్ని

నిలబెట్టటం కోసం ఆండ్రూని స్టుయిబెన్ విల్లీకి పంపించారు. తూర్పునుంచి వార్తను గ్రహించి ఒక గంటో లేక మరికొంతసేపో ఆలస్యంతో చిన్ని పడవలమీద అతడు హీలింగ్‌కు పంపించేవాడు. తిరిగి వస్తూ పడవలు కొలంబస్, సిన్సినాటి, టాయివిల్లీ నుంచీ సెయింట్ లూయీ, ఇంకా ఇతర ప్రదేశాలనుంచీ కొల్లలుగా వార్తలను తీసుకొవచ్చాయి. వార్తాప్రసరణ ఒక వారానికి మించి నిలిచిపోని రీతిగా ఆండీ ఈ వార్తల నన్నిటినీ ప్రసారం చేశాడు.

ఆతడు అక్కడ వున్న సమయంలోనే సిన్సినాటి, ల్వీ లింగులలో అమ్ముదామననే ఉద్దేశంతో కొన్ని బల్లగుడ్డలను తీసుకొని నదిమీదుగా తాను వస్తున్నట్లు, తండ్రిదగ్గర నుంచి ఆండీకి ఒక ఉత్తరం వచ్చింది. ఆండీ పడవ వచ్చే సమయానికి రేవు దగ్గిరికి వచ్చాడు. తండ్రికోసం కొద్దిసేపు వెతుక్కొని, కనిపించిన తరువాత ఒడ్డుకు రమ్మని సైగ చేశాడు. విలియం కింద డెక్కు మీద సామానులను ఎక్కించే ఒక మూలకు దారి తీశాడు.

"దొంగ భయంవల్ల మూటల దగ్గర నుంచీ ఎక్కువ దూరం వెళ్లటం నాకిష్టం లే" దని అతడు అందుకు కారణం చెప్పాడు.

"నీ కొక గది అంటూ లేదా?" అని కొడుకు జంకుతూ అడిగాడు.

"లేదు. ఖర్చు తగ్గించవలెనని ఉద్దేశించాను. అందువల్ల నేను డెక్కుమీదనే ప్రయాణం చేస్తున్నా" నన్నాడు.

ఆ మాటలు వినటంతోటే "అలాగా నాన్నా?" అంటున్నప్పుడు ఆండీ గొంతుక గాద్గద్యం వహించింది.

"అదేమీ చెడ్డపని కాదు" అని తండ్రి అతని అభిప్రాయాన్ని సరిదిద్దాడు. "ఇదుగో, నాకు నా దుప్పటి వుంది. చాలా బాగా నిద్రపోగలను. అమ్మకం అంత చులకనగా లేదు బాబూ, అందువల్ల నేను జాగ్రత్తగా మెలగాలి."

"కానీ నాన్నా! నీవు, అమ్మ సొంత బండిలో ప్రయాణం చెయ్యటానికి యింకా ఎంతోకాలం వేచి ఉండవలసిన అవసరం లేదు" అన్నాడు ఆండీ ఉత్సాహంతో.

తండ్రి నిశ్శబ్దంగా అతని చేయి పట్టుకున్నాడు. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. తరువాత ఒక పావుగంటలో పడవ బయలుదేరబోతున్నప్పుడు విలియం కుర్రవాడి చేతిని ఉల్లాసంతో నొక్కి అన్నాడు : "ఆండ్రా! నిన్ను చూచుకొని నేను గర్విస్తున్నాను."

ఈ సమయంలో థామస్ ఎ. స్కాట్ అన్న ఒక విశిష్టవ్యక్తి పెన్సిల్వేనియా రైలు రోడ్డువారి పిట్స్‌బర్గు డివిజనుకు సూపరింటెండెంటుగా వున్నాడు. అల్టూనాలో ఉన్న తనపై వాడయిన లోంబయర్టుతో తంతి ద్వారా ఉత్తరప్రత్యుత్తరాలు చేయటానికి అతడప్పుడప్పుడూ తంతి కార్యాలయానికి వస్తుండేవాడు. ఇలా వస్తున్న సందర్భాలలో యువకుడయిన ఆపరేటరు మీద దృష్టి నిలిపి తనతో మాట్లాడటం కోసం కొంతసేపు ఆగుతుండేవాడు.

ఒక తంతివార్తను తీసుకొని మిస్టర్ స్కాట్ అసిస్టెంట్లలో ఒకడు, ఆండ్రూ కార్యాలయానికి వచ్చాడు. "మిస్టర్ స్కాట్ ఈ నాటి ఉదయం నిన్ను గురించి మాట్లాడాడు."

"అలాగా? ఏమన్నాడు?" అని ఆండీ వెంటనే సర్దుకున్నాడు.

"తనకు నిన్ను గుమాస్తాగాను, ఆపరేటర్‌గాను తీసుకురాగలవా?" అని నన్నడిగాడు. రోడ్డువారు సొంత తంతి కార్యాలయాన్ని పెట్టబోతున్నారు, నీకు తెలుసా? అది చాలా అసాధ్యమైన పని. నీవు ప్రస్తుతోద్యోగంలో చాలా సంతృప్తిగా ఉన్నావని నేను అతనితో చెప్పాను."

"ఆగు! అంత త్వరపడకు!" అని చేయి యెత్తి ఆండీ అతన్ని ఆపాడు. "ఆయనకు కావాలంటే నన్ను పెట్టుకోవచ్చు. వెళ్ళి ఇలాగని చెప్పు."

దీని పరిణామంగా ఫిబ్రవరి 1-1853న ఆండీ నెల ఒకటికి ముప్పదియైదు డాలర్ల జీతంతో స్కాట్ దగ్గర పని చేయటానికి కుదిరాడు. అతడికి భయపడేటంత వేగముగా ప్రమోషన్లు వచ్చాయి.

అతని తల్లి ఇప్పుడు చెప్పులు కుట్టటం మానేసింది. త్వరలోనే అతడు డేవిడ్ మెక్కార్లో, రాబర్టు పిట్కైరన్‌లకు రైల్ రోడ్ సంస్థలో ఉద్యోగాలిప్పించగలిగాడు. అల్టూనాలోని జనరల్ సూపరింటెండెంట్ అయిన లోంబయర్ట్‌కు అతడు అసిస్టెంటుగా కాగలిగాడు. అప్పుడు అల్టూనా ఒక చిన్న గ్రామం. అయినా పెన్సిల్వేనియా రైలు మార్గాలకు అది కూడలి.

పిట్స్‌బర్గు జీతాల పట్టిక ననుసరించి జరిగే బట్వాడా కోసం డబ్బు తీసుకురావటానికని ఆండీ అల్టూనాకు వెళ్ళేవాడు. రెండోమారు వెళ్ళినప్పుడు కఠినుడు, మితభాషి అయిన జనరల్ సూపరింటెండెంటు మిస్టర్ లోంబయర్టు. అతణ్ని తేనీటి విందుకు ఇంటికి పిలిచి ఆశ్చర్యాన్ని కల్గించాడు. మిస్టర్ లోంబయర్టు వచ్చిన అతిథిని

ద్వారం దగ్గరనే మిసెస్ లోంబయర్టుకు "ఇతడే మిస్టర్ స్కాట్స్ వాళ్ళ ఆండీ" అని పరిచయం చేశాడు. అతడు కార్యాలయంలో కనిపించేటంతటి శీతలంగా ఇంటిదగ్గర కనిపించలేదు. తన్ను గురించి చేసే పై రీతి పరిచయాన్ని విన్న తరువాత అందరూ తన్ను అలా చెప్పుకొంటుంటే తృప్తిని పొందేటట్లు ఆండీకి స్కాట్ మీద గౌరవం కలిగింది. ఒకనాడు రైల్‌రోడ్ అధ్యక్షుడు ఎడ్గర్ థామ్సన్ యువకుడయిన అసిస్టెంటు గదిలోకి తొంగి చూసి "స్కాట్స్ ఆండీవి నీవేనా?" అని ప్రశ్నించాడు. ఇది అతనికి సర్వసాధారణమైన పేరైపోయింది.

ఒకరోజున ఆండీ కార్యాలయానికి వెళ్ళేటప్పటికి, తూర్పు డివిజన్‌లో ఒక ప్రమాదం సంభవించటం వల్ల పశ్చిమానికి వెళ్ళవలసిన ఎక్స్‌ప్రెస్ ఆలస్యమైందనీ, తూర్పునకు వెళ్ళే పాసింజెర్లు వంక దగ్గిర ఒక ఫ్లాగ్ మానును ముందు పంపిస్తూ నెమ్మదిగా ప్రాకుతున్నట్లు నడుస్తున్నవనీ, రెండు వైపులకు వెళ్ళవలసిన సామాను బండ్లు ప్రక్క పట్టాల మీద నిలిచిపోయినవని తెలుసుకున్నాడు. ఒకేదారి వున్న రైలు మార్గాల పద్ధతిలో బండ్లు నడవటం ఇంకా ఎంతో అనాగరికస్థితిలో వుంది.

మిస్టర్ స్కాట్ ఎక్కడ వుందీ ఎవరికీ తెలియదు. బహుశః అతణ్ని ఏదో పనిమీద పిలిచి వుంటారు. ఏర్పడ్డ పరిస్థితికి ఆండీ కళవళపడుతున్నాడు. ఎంతో పనిచేసి చాలా అలిసిపోయిన చోదకులకు విశ్రాంతి నిచ్చి పరిస్థితిని కొంత చక్కదిద్దాలనే కుతూహలాన్ని అతడు ఆపుకోలేకపోయినాడు. ఇటువంటి ఆత్యయిక పరిస్థితులను పూర్వం ఇతడు మిస్టర్ స్కాట్ సూచనలతో అతడు సరిదిద్దాడు. అందువల్ల అతడు తన బాధ్యతమీదనే బండ్లను నడిపించటం, అవి కలుసుకునే ప్రదేశాలను నిర్ణయంచటం జరిగించాడు. చివరికి పై అధికారి వచ్చేటప్పటికల్లా సర్వం సుగమంగా సాగిపోతున్నది.

ఆండీ బల్ల దగ్గిరికి అతివేగంగా చొచ్చుకోవచ్చి "మంచిది. పరిస్థితులు ఎలా వున్న" వన్నాడు.

"మిస్టర్ స్కాట్, నాకు మీరు ఎక్కడా కనిపించలేదు. మీ పేరుమీదనే ఉదయం ఆర్డర్ల నిచ్చాను" అని సమాధానం చెబుతున్నప్పుడు ఆండీకి గొంతు బాగా పెగిలి రాలేదు.

అతడు ఇచ్చిన ఆర్డర్ల కాపీలన్నింటినీ చూపించాడు. లైనుమీద వున్న బండ్లన్నీ – సామాను బండ్లు, పాసింజరు బండ్లు – ప్రస్తుతం ఏ స్థితిలో, ఎక్కడెక్కడ వున్నదీ తెలియజెప్పాడు. చెప్పటం ముగించగానే సూపరింటెండెంటు ఆశ్చర్యపడుతూ ఆండీ

ముఖంలోకి చూశాడు. బాలుడు సాహసించి చేసిన పనిని తానెలా స్వీకరించాడో తెలియజేయకుండానే, అతన్ని ఇంకా అనుమానపడే స్థితిలోనే వుంచి, తన గదిలోకి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఫ్రయిట్ ఏజంటు మిస్టర్ ఫ్రన్సిస్ వచ్చినప్పుడు అతనితో నవ్వుతూ "నా చిన్న తెల్ల జుత్తు, స్కాచ్ భూతం ఏం చేశాడో నీకు తెలిసిందా?" అని మిస్టర్ స్కాట్ అడిగినట్లు విన్నంతవరకూ, అతడి నరాల బిగువు సడలలేదు.

"సూచనగానైనా అధికారాన్ని పొందకుండానే నా పేరు మీద డివిషన్‌లోని బండ్లను నడిపించి వుండకపోతే నేను దెబ్బతినేవాణ్ని."

"మరి అతడు సక్రమంగా చేశాడా?"

"అవును – చేశాడు." అది అలా ముగిసింది.

తరువాత మిస్టర్ స్కాట్ ఆండీకి మరింత బాధ్యతను ఒప్పజెబుతుండేవాడు. ఒకప్పుడు అతడు పదిరోజులు కార్యాలయానికి రాలేదు. అప్పుడు మిస్టర్ లోంబయర్టు అంగీకారంతో అతడు డివిజన్‌కు సంబంధించిన మొత్తం బాధ్యతను యువకుడయిన తన గుమాస్తామీద పెట్టి వెళ్ళాడు. ఇరవై యేళ్ళ వయసులో వున్న యువకుడిమీద ఇంత బాధ్యతను వుంచటం ఎంతో విశిష్టమైన విషయం. అతడు ఈ బాధ్యతను వహిస్తున్న సమయలో నిర్మాణానికి సంబంధించిన ఒక బండి బ్రద్దలైంది. ఎవరి అజాగరూకత వల్ల అది జరిగిందో వారి విషయంలో ఆండీ అతికర్కశంగా వ్యవహరించాడు. ముఖ్యదోషిని ఉద్యోగంలోనుంచి పంపించి వేశాడు. మరి ఇద్దరిని సస్పెండు చేశాడు. మిస్టర్ స్కాట్ తిరిగివచ్చిన తరువాత అతనివల్ల తాను వాళ్ళ విషయంలో అతికఠినంగా ప్రవర్తించినట్లు తెలుసుకొన్నాడు. అందుకు అతడు ఎంతో చింతించాడు. తాను తీవ్రంగా శిక్షించినవారికి యేదో తగ్గ ప్రతిచర్య చేయటానికి యత్నించాడు.

1855 శరత్తులో తాము కొన్న ఇంటికి డబ్బు పూర్తిగా చెల్లించకపూర్వమే విలియం కార్నెగీ కొద్దిగా జబ్బుచేసి, తన ఏభయ్యోయేట మరణించాడు. "తగిన విశ్రాంతిని, సౌఖ్యాన్ని మేము ఇవ్వగల శక్తిని సంపాదిస్తున్న సమయంలో ఆయన మృతినొందా" డన్నాడు ఆండీ. సాధుశీలుడు, నిరాడంబరుడు అయిన తండ్రి మరణించినందుకు కుటుంబమంతా చింతలో మునిగింది. పెద్ద కుమారుడు ఎప్పుడూ అతన్ని గురించి అత్యుదాత్తుడు, ప్రేమార్హుడు అయిన అటువంటి వ్యక్తిని తాను మరొకణ్ణి ఎరగనంటుండేవాడు.

తండ్రి వ్యాధి, మృతి ఆండ్రూ మీద, అతని తల్లి మీద మరికొంత ఆర్థికభారాన్ని పడవైచినవి. తల్లి తిరిగి పాదరక్షలను కుట్టటం ప్రారంభం చేసింది. ఈ పరిస్థితిలోనే ఒకనాడు మిస్టర్ స్కాట్ "ఆండీ! నీ దగ్గర అయిదు వందల డాలర్లు వున్నవా?" అని ప్రశ్నించాడు.

ఆండీ జీతం ఇప్పుడు నెలకు ముప్పై డాలర్లకు పెంచబడింది. తానే జీతాలు బట్వాడా చేస్తుండేవాడు గనుక అతని కంటికి ప్రపంచంలో అత్యుత్తమ లలిత కళాఖండాలుగా కనిపించే రెండు పక్షి జంటలున్న బంగారు నాణాల రూపంలో అతడు దాన్ని పుచ్చుకునేవాడు. అయితే అనుకోకుండా వచ్చిపడే యిబ్బందుల వల్ల వాటిని వెంటనే కరిగిస్తుండేవాడు. పై అధికారి ప్రశ్నించినప్పుడు అతనిదగ్గర అయిదు వందల సెంట్లు కూడా లేవు.

అతడు సమాధానం చెప్పేలోగానే, తన యువకుడయిన అసిస్టెంటు కన్నుల్లోని బిత్తర చూపును పట్టించుకోకుండానే, ఒక్క మాటు రెప్పలల్లార్చి మిస్టర్ స్కాట్ ఎందుకయినా మంచిదని ఇలా అన్నాడు. "ఎందుకంటే, అది వుంటే నీ కోసం ఒక పెట్టుబడి నిలిచివుంది – ఆడమ్స్ ఎక్స్‌ప్రెస్ కంపెనీలోని పదిషేర్లు. ఈ నాడు విపణిలో ఉన్నవాటిలోకల్లా ఇవి ఉత్తమమయినవి. బహుశః గిల్ట్ ఎడ్జిడ్ కూడా అయి వుంటవి. ఇవి షేరు ఒకటికి ఒక డాలరు నెలకు డివిడెండుగా యిస్తున్నవి. నాకు తెలిసిన ఒక వ్యక్తికి వెంటనే డబ్బు కావలసి వచ్చి ఈ స్టాకును అమ్ముతున్నాడు. నీవు మరి ఆ డబ్బు తీసుకురాగలవా?"

ఈ సమస్తజగత్తులో అయిదువందల డాలర్లు తనకెలా లభ్యమవుతాయని ఊహిస్తున్నప్పుడు అతని తలలో మోత పుట్టడం మొదలు పెట్టింది. దయగల తనపై అధికారి ముఖ్యంగా ఈ సదవకాశాన్ని తానే కబళించకుండా, తన కిప్పించట మనే త్యాగం చేస్తున్నాడు. ఇట్టి స్థితిలో ఈ అవకాశాన్ని పోగొట్టుకోకూడదు.

"ఎలాగో చేకూర్చుకోగల" నని సమాధానమిచ్చాడు.

రెబెక్కా వీథిలోని ఇంటికి అయిదువందలు చెల్లించటం జరిగింది. మొత్త మంతటి కోసం దాన్ని తాకట్టు పెడితే సరిపోతుందని ఆండీ ఆశించాడు. సాహసించి ఆ విధంగా తాకట్లు పెట్టించుకొనే వ్యక్తి ఒక్కడే వున్నాడు. మిస్టర్ స్కాట్ నిర్ణయం మీద పరిపూర్ణమయిన విశ్వాసం గల ఆండీ తల్లి, "నేను బ్రదర్ విలియంను ఈ డబ్బిమ్మని అడుగుతా" నన్నది. యాభై మైళ్ళు ఆవిరి – పడవలో ఓహైయో నదిమీద దిగువగా

ప్రయాణం చేసి, ఆమె ఈస్టు లివర్ పూల్ చేరుకున్నది. ఇక్కడ విలియం మారిసన్ కొంత ఆర్జించుకున్న వ్యక్తి. జస్టిస్ ఆఫ్ పీస్. పరిసరాల్లోని రైతులకు ఇన్వెస్ట్‌మెంటు బ్రోకరు ఇంటిమీద రెండో తాకట్టు పెట్టించుకొని డబ్బు ఇచ్చాడు. అతని సోదరి పిట్స్‌బర్గ్‌కు విజయంతో తిరిగి వచ్చింది.

ఆండీ మిస్టర్ స్కాట్‌కు డబ్బు ఇచ్చేటప్పటికి చాలా రోజులు గడిచాయి. అందువల్ల "ఆ వ్యక్తి, రైనాల్డ్సు స్టాకును ధర పెంచాడు. అతడికి ఇప్పుడు ఆరువందలు కావాలిట" అన్న ఊహించని మాటలను డబ్బు నిచ్చేటప్పుడు అతడు వినవలసి వచ్చింది.

ఆండ్రూ క్షణకాలం నిశ్చేష్టుడయినాడు. అయినా మిస్టర్ స్కాట్ "మిగిలిన వంద నీ కోసం తాత్కాలింగా నేను చూస్తాను. నీవు వీలయినప్పుడు వీలయినట్లుగా ఇవ్వవచ్చు" అన్నాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఒకనాటి ఉదయం, మూలన ఆడమ్స్ ఎక్స్ప్రెస్ ముద్ర ఉన్న బరువయిన తెల్లని కాగితపు కవరు బల్లమీద ఉంది. విసిరినట్లుగా దానిమీద "ఆండ్రూ కార్నెగీ ఎస్క్వైర్" అన్న చిరునామా కన్పించింది. దాని లోపల పదిడాలర్లకు గోల్డ్ ఎక్సేంజి, బ్యాంక్ ఆఫ్ న్యూ యార్క్ మీద ఇచ్చిన చెక్కు ఒకటుంది. ఇది అతని మొదటి నెల డివిడెండు. ఆ చెక్కుమీద పెద్దదిగా విస్ఫూర్తితో కనిపించిన కాషియర్ జె.సి. బాబ్ కాక్ సంతకాన్ని తాను శ్రమించకుండా, స్వహస్తాలతో, చెమటోడ్చకుండా పెట్టిన పెట్టుబడి మీద తొలి ఆదాయాన్ని పొందినప్పటి ఆనందాస్పందనాన్నీ జీవితాంతం వరకూ అతడు ఎన్నడూ మరిచిపోలేదు. తనలో తాను 'యురేకా'! (గొప్పది కనిపెట్టాను.) ఇది బంగారు గ్రుడ్లను పెట్టేబాతు' అని నెమ్మదిగా అనుకున్నాడు.

చెక్కును మార్చకుండా వారం చివరదాకా వుంచి, తన ప్రియమిత్రులైన టామ్ మిల్లర్, జాన్ ఫిప్స్, జిమ్మీ విల్సన్, విల్లీ కాల్స్‌లకు నలుగురికీ తమ వనవిహార సమయంలో చూపించాడు. వాళ్ళు "ఎస్క్వైర్" అని అతని పేరుకు చివర తగిల్చిన పదంమీద చతురోక్తు క్రీడలాడారు. కానీ వాళ్ళకీ డివిడెండు చెక్కు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

"అభ్యుదయానికి ఇదే మార్గ" మన్నాడు ఫిప్స్.

"జాన్, ఇటువంటి అవకాశాలు వస్తాయేమో నేనూ కనిపెడుతుంటాను" అని ఏకీభవించాడు జిమ్మీ.

“ఈ పని మనమందరం చేద్దాం. ఒకరికొకరం చెప్పుకుటుందాం” అంటూ ఉత్సాహాన్ని ప్రదర్శించాడు టామ్ మిల్లర్.

“ఒక్కడికి మించిన పెట్టుబడిని గురించి వింటే వీలును బట్టి అందరం ఒకటై అందులో ప్రవేశిద్దా” మన్నాడు ఆండ్రూ.

“చాలా దొడ్డ అభిప్రాయం” అని ఒప్పుకున్నాడు టామ్. అందువల్ల వీలు కలిగినప్పుడల్లా తరువాత కొన్ని సంవత్సరాలవరకూ వాళ్ళు అలా చేస్తూ వచ్చారు.

ఫిప్స్ పాదరక్షల కార్యాలయంలో అతడికోసం వచ్చినవాళ్ళందరూ తిరిగి వెళ్ళిపోయిన తరువాత, సాయం సమయాలలో ఈ ‘పంచకం’ వర్తమాన సమస్యలను గురించి నిత్య ఉల్లాసకరమైన చర్చలు సాగిస్తుండేవాళ్ళు. ఆండీ విశేషంగాశ్రామిక జనతత్త్వం కలవాడు. ప్రతి సమస్యనూ ప్రజల్లోకి తీసుకోపోవాలని వుల్లాసపడుతుంటాడు. ఒకప్పుడితడు గంటన్నరకు తక్కువగాని గంభీరోపన్యాసం చేశాడు. తరువాత మిల్లర్ న్యాయాధిపతులను ‘జనవాక్యాన్ని’ అనుసరించి నిర్దేశించాలని వాదించాడు. అయితే ఇది ఆచరణయోగ్యమైనది. కాదని అతడు తరువాతి కాలంలో గుర్తించాడు. యింతలో ఒక వార్తాహరి ఊపిరి సలుపుకోలేకుండా వచ్చి “కార్నెగీ నిన్ను రమ్మంటున్నారు. డేర్రీ దగ్గర ఒక ‘విచ్ఛిత్తి’ జరిగిందట!” అని చెప్పకపోయినట్లయితే, అతడు ఇంకా ఆ విషయాన్ని గురించి ఎంతసేపు మాట్లాడి ఉండేవాడో చెప్పటం కష్టం. పిలుపును గురించి విన్నవెంటనే హాట్, కోటు అందుకొని “మీలో ఎవరైనా నేను ఎక్కడికి వెళ్లుతున్నానో మా యింట్లో తెలియజేయండి” అని చెప్పి పరుగుపెడుతూ అదృశ్యుడైనాడు.

ఆ అయిదుగురు వెబ్స్టర్ సాహిత్యసంఘం సభ్యులుగా చేరారు. ఇది నగరంలోని ఈ జాతి క్లబ్‌లన్నింటిలో శ్రేష్ఠమైంది. ఇందులోని సభ్యత్వానికి యోగ్యులుగా పరిగణింపబడినవారు ఎంతో గర్విస్తారు.

యువకుడుగా ఉన్నప్పుడు ఆండ్రూకు పత్రికారచన మీద ఎన్నో ఆశలుండేవి. ముఖ్యంగా సంపాదకుడుగా పనిచేయటం మీద అతని ప్రీతి. తరువాత కొద్ది సంవత్సరాలకు ఇతడు ‘న్యూ యార్క్ ట్రిబ్యూన్’ పత్రికకు ఒక ప్రజాహిత విషయంమీద లేఖ వ్రాశాడు. పెన్సిల్వేనియా రైల్ రోడ్ విషయంలో నగరపౌరులు ఎంతటి అనాతిథేయ ప్రవర్తనను ప్రకటిస్తున్నారో విమర్శిస్తూ, ‘పిట్స్ బర్గ్ డిస్పాచ్’ పత్రికకి ఒక లేఖ వ్రాశాడు. ఈ ఉత్తరం ‘నామరహితంగా’ ప్రచురితమైంది. కానీ, రైల్ రోడ్ కంపెనీకి ముఖ్య

సలహాదారైన మిస్టర్ స్టోల్స్ లేఖకుని పేరు చెప్పవలసిందని గట్టిగా కోరాడు. దీని ఫలితంగా రచయితను అతడు గ్రీన్స్‌బర్గ్‌లోని తన యింటికి వారాంతంలో సెలవు దినం గడపటానికి రమ్మని ఆహ్వానించాడు. మిస్టర్ స్టోల్స్ వంటి తేజోవంతుడు, విద్యావేత్తతో తృప్తికరంగా నేనేంమాట్లాడగలను, వుల్లాసకరంగా ఏం చెయ్యగలనని సంశయిస్తూనే ఆహ్వానాన్ని అందుకున్నాడు ఆండ్రూ. కానీ అతడు తాను సంశయించిన విషయంలో పొరబడ్డాడు.

ఇక్కడే అతడు తనకు పరిచితంగాని ఇంట్లో ఒకరికి తా నతిథియైన మొదటిరాత్రి గడిపాడు. స్టోల్స్ నివేశనాతిశయం వల్ల అతడు ఎంతగానో ప్రభావితుడయినాడు. ముఖ్యంగా ఆ గృహంలోని గ్రంథాలయంలో వున్న ఒక పాలరాతి గూడు అతన్ని ఆకర్షించింది. ఆ అర్ధ చంద్రాకృతి గల గూట్లో మధ్యన ఒక తెరిచిన పుస్తకానికి ప్రతికృతి అమర్చబడి వుంది. దానిమీద –

"ఎవడు హేతువాదం చెయ్యడో వాడు బుద్ధిహీనుడు

ఎవడు చేయటానికి ఇష్టపడడో వాడు దురభిమాని

ఎవడు చేయటానికి సాహసించడో వాడు బానిస"

అన్న లేఖనం కనిపించింది. ఆండ్రూ ఆ అందమైన నిర్మాణాన్ని నివ్వెరపడి చూస్తుండగా, సూటిగా చెప్పబడ్డ పై వాక్యాల ప్రభావం వల్ల అతని ఆత్మ సంచలించింది. అతడు తనతో తాను చెప్పుకున్నాడు. "ఎప్పుడో ఒకప్పుడు నా గ్రంథాలయాన్ని నేను ఏర్పాటు చేసుకొంటాను. అందులోని గూట్లో ఈ మాటలనే చెక్కిస్తాను" కొంతకాలం గడచిన తరువాత వాటిని న్యూ యార్క్ స్కాట్లండ్‌లో కార్నెగీ గృహాలలో రెండు గూళ్ళలో చెక్కించటం జరిగింది.

అతడు ఇప్పుడు అధికాధికంగా అతిథిగా ఆహ్వానింపబడుతున్నాడు. అందువల్ల అత్యవసరమైన ఆ నాటి క్రమమైన సాంఘికాచారాల గురించిన పాఠాలను ప్రత్యక్షంగా నేర్చుకుంటున్నాడు. జనరల్ ఫ్రయిట్ మేనేజరు భార్య మిసెస్ ఫ్రాన్సిస్‌కస్ అతని యెడ ఎంతో వాత్సల్యాన్ని ప్రదర్శిస్తుండేది. అతడు సిగ్గరి కావటం వల్ల ఆమెకు తమ యింట్లో భోజనం చెయ్యమని బలవంతం చేయటానికి బహుకాలం పట్టింది.

లాంబయర్టు తరువాత 1856లో మిస్టర్ స్కాట్, జనరల్ సూపరింటెండెంటు పదవిని స్వీకరించి, తన కార్యాలయాన్ని అల్టూనాకు మారుస్తూ, ఆండ్రూను తనవెంట

తీసుకు వెళ్ళాడు. అల్తూనాలో సుఖమైన ఒక కాటేజిని అద్దెకు తీసుకోగల పరిస్థితి ఏర్పడగానే, మిసెస్ కార్నెగీ చెప్పులు కుట్టటాన్ని మళ్ళీ మానివేసింది. ఆండ్రూ ఆమెకు ఒక పరిచారిక అవసరమని నిర్ణయించాడు.

"నీవు జీవితమంతా చాలా శ్రమపడ్డావు. ఇప్పుడు సుఖపడటం కొత్తగా ప్రారంభించాలి" అన్నాడు ఆండ్రూ, తల్లితో.

ఇందువల్ల అతడు ఊహించనంతటి పెద్ద ధ్వని వినిపించింది. ఆమె ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ అన్నది :

"ఏమిటి? నా యింట్లో మరొక క్రొత్తమనిషి ప్రవేశించి అన్ని వ్యవహారాలల్లో స్వేచ్ఛగా సంచరించటమా? అందుకు నేను అంగీకరించను. ఇన్నాళ్ళుగా నా పిల్లలకోసం నేనే ఇల్లు దిద్దుకున్నాను. మీ కోసం వంట చేశాను. మీ దుస్తులను ఉతికి బాగుచేశాను. నీవు ఇప్పుడు నన్ను చేతులు ముడుచుకొని కూర్చోమంటున్నావు. నీవు నన్ను షెల్ఫ్‌లో పెట్టదలిచావు. మరొక స్త్రీని నేను సహించలేను. బాలురైన మీకు ఇష్టమైన ఆహారపదార్థాలను ఎలా వండాలో ఇతరస్త్రీ ఎవతెకూ తెలియదు!"

ప్రక్కవాటుగా వచ్చిన మాటను పుచ్చుకొని ఆండీ "అమ్మా! నీవు నాకు, టామ్‌కు సమస్తం చేశావు. నీవే సమస్తమైనావు. మరి, మమ్మల్ని నీ కోసం కొంత చెయ్యనీ. మనం భాగస్వాములమై ఒకరి కొకరం ఎవరికేది మంచిదో అది చేద్దాం. నీవు విందుల్లో యజమానురాలివై వ్యవహరించవలసిన సమయం వచ్చింది. కొద్ది దినాలలో నీవు బండిలో సంచరించబోతున్నావు. ఈ మధ్యకాలంలో నీకు సహాయం చేస్తుంది. ఆ పిల్లని యింట్లోకి రానీ. ఇలా చెయ్యటం టామ్‌కు, నాకూ ఎంతో ఇష్టం!"

చాలాసేపు గొణిగినా చివరకు ఒప్పుకున్నది. సేవకురాలు వచ్చిన తరువాత ఆమె అల్తూనాలో లభ్యమయినంత ఉన్నతసంఘంలోకి వెళ్ళింది. ఆమె స్వయంగా విద్య నేర్చుకొన్నది. సుళువుబలువులను ఎరిగివుండటం వల్ల, సమత సంపాదించుకున్నది. ఎటువంటి పరిస్థితులయినా చక్కదిద్దుకోగల సౌజన్యం ఆమెకున్నది. ఉద్యానకృషి, పుష్పాలతో ఆమె తన జీవితాని కబ్బిన నూతనదశను అనుభవించట మారంభించింది.

కొద్దికాలం క్రితం భార్య చనిపోవటం వల్ల, మిస్టర్ స్కాట్ తన గృహ పర్యవేక్షణకోసం తన మేనగోడలు మిస్ రెబెక్కా స్టీవార్డును తీసుకువచ్చాడు. ఆమె సొగసైన యువతి. ఆండ్రూ కంటే వయసున కొన్ని యేళ్ళు పెద్దది. అతడికి

అవసరమయిన కొన్ని సాంఘికాచారాలను గురించి నెమ్మది నెమ్మదిగా కొన్ని సలహాలిస్తూ, ఆమె ఆండ్రూకు జ్యేష్ఠభగిని పాత్రను వహిస్తున్నది. కొండలమధ్య ఎంతో దూరం వాళ్ళు వాహ్యాళికి వెళ్తుండేవాళ్ళు. అప్పుడప్పుడు ఆమె ఆండ్రూను మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి ఆహ్వానిస్తుండేది. అటువంటి ఒక సందర్భంలో రైల్ రోడ్డు వ్యక్తిగా పైకి వస్తున్న టామ్ మిల్లర్ కూడా అతిథి కావటం తటస్థించింది. మిస్టర్ స్కాట్ ఊళ్ళో లేడు. వాళ్ళు భుజించటం కోసం బల్లముందు కూర్చున్న సమయంలో, రెబెక్కా స్టీవార్డు, ఆమె సేవిక అయిన కన్య క్షణకాలం భోజనకక్ష్యలో నుంచి బయటికి వెళ్ళగానే, అప్పుడు తాను అనుభవిస్తున్న జీవితంలోని అద్భుతానికి యింకా అలవాటు పడని ఆండ్రూ, సగౌరవంగా అచటి నవనీతపాత్రను పైకెత్తి, గొణిగినట్లుగా "ఇది నిజమయిన వెండి టామ్!" అన్నాడు.

# 5. దొర్లిపొయ్యే మంచుముద్ద

రైల్ రోడ్ కంపెనీ మీదికి అభియోగ మొకటి తీసుకురాబడింది. సమన్లు పంపించి ఇందులో సాక్ష్యం చెప్పటంకోసం ఆండ్రూను పిలిపిస్తారని మిస్టర్ స్టోల్స్ అనుమానించాడు. అందుకు సిద్ధపడటం కోసం కొంత కాల వ్యవధి అతడు విచారణకు వాయిదా కోరాడు. అతని యువకుడైన అసిస్టెంటును కొంతకాలం పాటు రాష్ట్రం బయటికి ఎక్కడికైనా తరిమి వెయ్యమని మిస్టర్ స్టోల్స్ మేనేజర్ స్కాట్‌ను అర్థించాడు. ఈ కారణంగా ఆండ్రూ, క్రిష్టలైను, ఓహియోలకు వెళ్ళి టామ్ మిల్లర్, జిమ్మీ విల్సన్‌లతో (వీళ్ళిద్దరూ అక్కడ రైల్ రోడ్‌లో పనిచేసేవాళ్ళు) చాలా రోజులు గడిపాడు. వారందరూ కొద్దికాలం క్రితమే గుఱ్ఱంమీది నుంచి పడటం వల్ల మరణించిన జాన్ ఫిప్స్ కోసం దుఃఖించారు. ఇది ఆ యువక బృందానికి కలిగిన మొదటి విచ్ఛిత్తి. ఈ మహాఘోరమైన ప్రమాదాన్ని స్వీకరించటానికి వాళ్ళు ఏ మాత్రం సంసిద్ధులైన వాళ్ళు కాదు. జాన్ చిన్నతమ్ముడు హెన్రీ ఆండ్రూకి ఎంతో ప్రీతిపాత్రుడై అతని బహువ్యాపారాలల్లో భాగస్థుడైనాడు.

బండి యెక్కి ఓహియోగుండా క్రిస్టలైనుకు వెళ్ళుతున్నప్పుడు, ఆండీ పచ్చని సంచీని మోసుకుపోతున్న ఒక మనిషిని చూశాడు. బండగా కనిపించే అతడు అన్నాడు. "మీరు పెన్సిల్వేనియా రైల్ రోడ్‌కు సంబంధించిన వారట. బ్రేహ్‌మాన్ నాతో చెప్పాడు!"

"అవును. నిజమే!" అని సమాధాన మిచ్చాడు ఆండీ.

ఆ అపరిచితుడు "నా పేరు థియొడోర్ వూడ్రఫ్. నా దగ్గర రాత్రి ప్రయాణాలకు పనికి వచ్చే ఒక కారు నమూనా వుంది. దాన్ని నేనే కనిపెట్టాను. మీకు చూపించనా?" అన్నాడు.

"తప్పకుండా."

మిస్టర్ వూడ్రఫ్ తన నమూనాను సంచిలోనుంచి బయటికి తీశాడు. అది నిద్రపోవటానికి వీలైన ఒక కారు భాగం. రెండువైపులా దానికి జంటలుగా కూర్చోవటానికి సీట్లు వున్నాయి. ఈ సీట్లు ఒకదాని కొకటి ఎదురుమదురుగా ఉన్నవి.

రాత్రివేళ రెంటినీ కలిపే ఎటుబడితే అటు వంచడానికి అనువైన దిండు, పరుపుల మూలంగా మొత్తాన్ని ఒక శయ్యగా మార్చివేయవచ్చు. కిటికీపైన మరొక ప్రక్కగా వుంది. పగటివేళ దీన్ని తెలివిగా లోపల దాచి పెట్టే ఏర్పాటు వుంది. గొలుసుల ఆధారంతో రాత్రులు దీనిని క్రిందికి దించవచ్చు. పడుకొనేందుకు ఉపయోగించనప్పుడు దీనినీ పరుపు, ప్రక్క గుడ్డలను పెట్టుకోవటానికి గిడ్డంగిగా వినిగియోగించుకోవచ్చు. సంగ్రహంగా చెప్పవలసి వస్తే, ఇది 1870 నుంచి ఈ నాటి వరకూ మనకు తెలిసివున్న పుల్మన్ స్లీపింగ్ కార్.

స్లీపింగ్ కార్లని పిలువబడే ఇటువంటివి, రైల్ రోడ్ల మీద ఇప్పటికి దరిదాపుగా ఇరవై సంవత్సరాలనుంచీ వుంటూనే ఉన్నవి. అయితే ఆత్మగౌరవ మున్నవాళ్ళు అందుమీద నిద్రపోవటానికి అసహ్యించుకొన్నారు. స్త్రీలు ఆ పని ఎన్నడూ చెయ్యలేదు. ఇవి ఇరువైపులా రెండు మూడు అంతస్తులున్న బాక్స్ కార్లకంటే కొంచెం బాగున్నవి. కొందరు ప్రయాణికులు వాటిమీద గుడ్డలు పరుచుకొని, మరికొందరు బూట్లు విప్పుకొని ఈ షెల్ఫ్‌లమీద వెన్ను వాల్చేవారు.

ఈ సూచింపబడ్డ వూడ్రఫ్ కారు ఎంతో భిన్నమైంది. నమూనాను పరిశీలించగానే ఆండ్రూకు ఉద్రేకం ఎక్కువైంది. ప్రయాణరీతినే పూర్తిగా మార్చివేయగలదేదో ఇందులో ఉందని, అతడు తనలో తాననుకున్నాడు. ఎన్నో ప్రశ్నలడిగాడు.

వూడ్రఫ్ అన్నాడు : “ఇది మీతో చెప్పటం ఎంతో సముచితం. చాలా అననుకూలమైన పరిస్థితులైనప్పటికీ న్యూ యార్క్ సెంట్రల్‌వారు నా భావానికి రూపకల్పన చేసే ప్రయత్నం అర్ధహృదయంతోనే చేశారు. దానికి సక్రమమైన అవకాశం లభించలేదు.”

ఆండ్రూ అడిగాడు : “నీ కోసం కబురుచేస్తే అల్టూనాకు వస్తావా?”

“తప్పక వస్తాను”

“సరే. నేను తిరిగి వెళ్ళిన తరువాత ఈ విషయాన్ని మిస్టర్ స్కాట్‌కు తెలియజేస్తాను. నీ చిరునామా నాకివ్వు.”

ఓహియోలో ఉన్నంతకాలం అతణ్ని స్లీపింగ్ కార్ వెన్నాడుతూనే ఉంది. తిరిగి అల్టూనాకు వెళ్ళగానే అతడు వేగంగా స్కాట్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయి, దావాను గురించి కూడా అడగకుండా, “మిస్టర్ స్కాట్, నేనొక నమూనాను సంపాదించాను. అది రాత్రులు పడుకొని నిద్రపోవటానికి వీలున్న కారు” అన్నాడు.

మేనేజరు మోముమీద సగం నవ్వుతో వింటూ వెనక్కు వ్రాలాడు. అతడు కుర్రవాని ఉద్రేకాలకు బాగా అలవాటు పడ్డవాడు. అయినా, అందులో కొంత గట్టి ఆధారం వుంటుందని అతనికి తెలుసు. "ఏమోయ్, యువకుడా! దీన్ని నీవు గట్టిగా విశ్వసించావా?" అన్నాడతను. "సరే! మీ మిత్రునితో నమూనాను తీసుకురమ్మను. దాన్ని నేను చూస్తాను."

తంతి మూలంగా తెలియజేసిన వెంటనే వూడ్రఫ్ అల్టూనాకు వచ్చాడు. స్కాట్‌కు అతని నమూనా గట్టిగా నచ్చింది.

"అయితే నీ మాట యేమిటి?" అతడడిగాడు.

"మీ కంపెనీ ఈ కార్లను తయారుచేసి, ప్రవేశపెట్టినట్లయితే నాకు రాయల్టీ ఇవ్వాలని" అన్నాడు ఆ వస్తుస్రష్ట.

దానికి సంబంధించిన వివరాలను చర్చించటం అయిపోయింది. వెంటనే రెండు కార్లను నిర్మించాలని మిస్టర్ స్కాట్ నిశ్చయించాడు. మిస్టర్ వూడ్రఫ్‌తో బాటు ఆండ్రూ బయటికి వచ్చాడు. కార్యాలయ బహిరంగణంలో ఆ వస్తుస్రష్ట అతనివంకకు తిరిగి "మిస్టర్ కార్నెగీ, ఈ వ్యాపారంలో నీవు నాతోకలిసి వస్తావా?" అని అడిగినప్పుడు అతడాశ్చర్యపడ్డాడు.

క్షణకాలం ఆండీ మూకత వహించాడు. అతని దగ్గర ఉన్నదేమిటి? కొద్ది డబ్బు కూడా సిద్ధంగా లేకపోవటం. అయితే ఆడమ్స్ ఎక్స్‌ప్రెస్ స్టాక్ లాగా తనవంకకు డివిడెండ్లను ప్రవహింపజేసే అవకాశాలలో ఒకటి సిద్ధంగా వుంది. జారవిడవటానికి వీల్లేదు!

"బహుశః, కలిసి వస్తాను" అన్నాడు. "నీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు.

"నేను వెంటనే ఆరంభింపబోతున్న సంస్థలో ఎనిమిదోవంతు భాగాన్ని నీకు కొనుక్కునే అవకాశం ఇద్దామని ఉద్దేశిస్తున్నాను."

అతడు పెట్టుబడి మొత్తం ఎంతెంతుందో అంకెల్లో చెప్పాడు. వెంటనే చెల్లించటానికి తన దగ్గర డబ్బు లేదని ఆండ్రూ ఒప్పుకున్నాడు. కొంత సంభాషణ సాగిన తరువాత వూడ్రఫ్ అది అంచెలవారీగా చెల్లించవచ్చునన్నాడు. మొదటిసారిగా చెల్లించవలసిన మొత్తం 217.50 డాలర్లు, అప్పు పుచ్చుకోవటం వల్ల తప్ప మరొకవిధంగా దీన్ని పొందే అవకాశం ఆండ్రికి లేదు. అతడు మిస్టర్ లాయిడ్ అనే

స్థానికుడైన వడ్డీ వ్యాపారస్థుడి దగ్గరికి వెళ్ళాడు. పెట్టుబడి పెట్టే నిమిత్తంగా డబ్బును అప్పుగా ఇవ్వటానికి అతనికి అవకాశం ఉంటుందేమో అని అడిగాడు. అతడు చాలా పొడగరి. ఆరు అడుగుల మనిషి. సాయిలా పాయిలావాడు. ఆండ్రూని యెరుగును. అతడంటే ప్రీతి కూడాను.

"అది మంచి పెట్టుబడి అని నీకు నిశ్చయంగా తెలుసునా?" బరువైన తన హస్తాన్ని ఆ యువ మిత్రుని భుజాలమీద అడ్డంగా ఉంచి ఆ వడ్డీ వ్యాపారి ప్రశ్నించాడు.

"తెలుసును. అది స్లీపింగ్ కార్ కంపెనీకి పెట్టుబడి. మా రైల్ రోడ్ సంస్థ రాయల్టీ పద్ధతిమీద అటువంటి కార్లను రెంటిని నిర్మించబోతున్నది."

"తప్పక నీకిస్తాను, ఆండీ!" అన్నాడు మిస్టర్ లాయిడ్. "సాహసించి ఐనా ఇవ్వదగ్గవాడివి నీవు."

ఆండ్రూ తన జీవితంలో ఒక ప్రామిసరీ నోటు వ్రాసి ఇవ్వడం ఇదే మొదటిసారి. ఈ సంఘటనే తన అదృష్టానికి ఆరంభమని తరువాత కాలంలో అతడు నిత్యం భావిస్తుండేవాడు. దఫాలవారీగా అతడు చెల్లించవలసిన పెట్టుబడి మొత్తాలను, అతడికి వచ్చే డివిడెండ్ల మూలంగా వచ్చే డబ్బుతో చెల్లించగలుగుతుండేవాడు. పెన్సిల్వేనియా సంస్థ ఇంకా ఇతర జాతి స్లీపర్లను నిర్మిస్తున్నది. ఈ పనికి ఇతర కంపెనీలు, తామూ పూనుకొన్నవి. అతడికి ఇరవయ్యయిదేళ్ళ వయసు వచ్చేటప్పటికి స్లీపింగ్ కార్ల పెట్టుబడిమీద వస్తున్న సంవత్సరాదాయం 5000 డాలర్లు. "సాంకోపాంజా పలికిన ధోరణిలో అంటున్నాను, నిద్రను కనిపెట్టిన వాడెవడో గాని అతడికి శ్రేయమగుగాక!" అన్నాడు అతడో మాటు.

కార్నెగీలు అల్టూనాలో మూడేళ్ళున్న తరువాత, 1859 నాటి గ్రీష్మంలో, మిస్టర్ స్కాట్ తన అసిస్టెంటుతో అన్నాడు : "ఆండ్రూ! వాళ్ళు నన్ను ఫిలడెల్ఫియా సంస్థకు ఉపాధ్యక్షుణ్ణి చేయదలచుకొన్నారు. ఈ విషయాన్ని మిస్టర్ థామస్‌తో చర్చించేటందుకు నేను వచ్చేవారంలో ఫిలడెల్ఫియాకు వెళ్ళుతున్నాను."

ఈ వార్త విని ఆండ్రూ క్రుంగిపోయాడు. ఫిలడెల్ఫియా, అతడు విశేషంగా గౌరవిస్తూ, దరిదాపు అతని కాదర్శమూర్తి అని భావించే పెద్దను ఆకర్షించి వేస్తున్నది. దీని ఫలితం అతని మీద ఎలా వుంటుంది? స్కాట్‌కు అనుబంధంగా వుండటం తప్ప, ఇంతవరకూ అతనికొక విశిష్టత అంటూ ఏమీ లేదు. తన అధికారి తనకోసం ఫిలడెల్ఫియాలోనే ఏదయినా ఉద్యోగ మిప్పిస్తాడా? అలాగే జరుగుతుందని అతడు

తీవ్రోద్వేగంతో ఆశించాడు. మరొకరి క్రింద పని చేయటమన్న భావం కలిగినప్పుడు అమితంగా భయపడ్డాడు.

మేనేజరు ప్రయాణం చేసి తిరిగి వచ్చాడు. ఆండీని తన కార్యాలయానికి రమ్మని పిలిచాడు.

"ఆ నిర్ణయం జరిగింది" అన్నాడు అతడు. "ఉపాధ్యక్షుణ్ణి కనుక నన్ను ఫిలడల్ఫియాకు మారుస్తారు." "నా తరువాత వచ్చే జనరల్ మేనేజరు మిస్టర్ లూయీ."

అతడు మాట్లాడుతున్నంతసేపూ ఆండ్రూ నరాలు బిగుసుకుపోతున్నవి.

"ఇక నీ విషయం పిట్సుబర్గ్ డివిజనుకు సూపరింటెండెంటు అయిన మిస్టర్ పాట్స్‌ను, ఫిలడెల్ఫియాలోని ట్రాన్స్‌పోర్టేషను శాఖకు ప్రమోటు చేస్తున్నారు. ఆ స్థానాన్ని నీకివ్వవలసిందని నేను ప్రెసిడెంటుకు రికమెండు చేశాను. పశ్చిమశాఖను నీవు నడపగలవా?" అన్నాడు చిట్టచివరికు అతని పై అధికారి.

ఆండ్రూకి క్షణకాలం తల తిరిగిపోయింది. విజయం, అభివృద్ధి అన్న రెండూ, దరిదాపుగా నిశ్చతమన్నంత వరకూ ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయతనికి. అతనికి ఇరవై నాలుగో జన్మదినం ఇంకా కొద్దిరోజులకు గాని రాదు. తాను కేవలం రాజకీయజ్ఞుడు, అనుభవరహితుడు అయినప్పటికీ, తీసుకోమంటే మర్నాడే చానల్ ఫ్లీట్‌మీద ఆధిపత్యాన్ని పుచ్చుకొంటాడని, లార్డు జాన్ రస్సెల్‌ను గురించి చెప్పుకొనే విషయాన్ని స్మృతికి తెచ్చుకున్నాడు. బ్రూస్ గాని వాలెన్‌లు గాని ఇలాగే ప్రవర్తించేవాళ్ళు...

"నడపగలను" అని, "నడపగలనని బాగా ఎరుగుదు" నన్న అభిప్రాయాన్ని నిగూఢంగా అనుసంధించి సమాధానం చెప్పాడు.

"సరే మంచిది. నీకొక అవకాశమిచ్చి చూడటానికి ఫుస్టర్ థామ్సన్ అంగీకరించాడు" జీత మెంత కావాలని నీ అభిప్రాయం?"

"జీతమా?" అని ఆశ్చర్యపడ్డట్లున్నాడు – ఆ క్రొత్త సూపరింటెండెంటు. జీతం సంగతి అతని మనసులో ప్రవేశించనే లేదు. "నా ఆసక్తి జీతాన్ని గురించి కా" దన్నాడు. ఉదారంగా. "నేను కోరేది ఆ పదవి. మీరు వుండి పూర్వం పనిచేసిన ఆ స్థానాన్ని పొందటమే నాకు గొప్ప. అది చాలు, జీతాన్ని మీ ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయించండి. మీ కిష్టమయితే ఇప్పుడిస్తున్నదే ఇవ్వండి."

(అది నెలకు అరవై అయిదు డాలర్లు)

మిస్టర్ స్కాట్ అతని సాధుత్వాన్ని గమనించి వస్తున్న నవ్వును ఆపుకొన్నాడు. "ఆ వుద్యోగాన్ని నేను నిర్వహిస్తున్నప్పుడు సంవత్సరానికి పదిహేను వందలు వస్తున్నాయి. మిస్టర్ పాట్‌కు పద్దెనిమిది వందలు వస్తున్నాయి. నిన్ను పదిహేను వందల మీద నియమించటం ఉచితం. నీవీ తొలి పరీక్షలో విజయవంతుడవయితే జీతం పద్దెనిమిది వందల దాకా పెరుగుతుంది. అది నీకు సంతృప్తికరమేనా?"

ఒక్కమాట తలనూచి చేతిని ఆడించటంతో, అది అతనికి అప్రధానవిషయ మని ఆ క్రొత్త వున్నతోద్యోగి తెలియజేశాడు.

తనకబ్బిన శుభాన్ని గురించి తెలియజేసే ఆతురతతో అతడు మరోమారు వేగంగా ఇంటికి చేరాడు. అసలతడు పరుగెత్తి వెళ్ళదలచాడు. కానీ అది, పెన్సిల్వేనియా రైల్ రోడ్ వారి పిట్స్‌బర్గ్ డివిజన్ సూపరింటెండెంటు గౌరవానికి భంగకరమైన పనైపోయింది. అతని తల్లి ఈ వార్త విని సంక్షేపంగా సంతోషించింది. ఆండ్రూవంటి కుర్రవాడివల్ల ఆశించేది ఇటువంటివి కావటమే ఇందుకు కారణం. ఆమె తిరిగి పిట్స్‌బర్గ్‌కు వెళ్ళటమనే సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. ఆమె "పూర్వమిత్రుల మధ్యకు, బంధువుల మధ్యకు వెళ్ళటమంటే సంతోషకరమైన విషయమే గాని అక్కడి పొగమసికి భయమేస్తున్న" దన్నది.

పదహారేళ్ళ వయసుగల టామ్‌తో అన్నాడు : "నాకు కార్యదర్శివిగా వుండటం నీకిష్టమేనా?"

"ఎంతో బాగుం" దని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు టామ్. అతడు ఇప్పుడు అద్భుతమైన టెలిగ్రాఫరు అయినాడు. డివిషన్ సూపరింటెండెంటుకు తంతిద్వారా అనేకమైన వార్తలను పంపించటం, అందుకోవటం వుంటుంది.

సూపరింటెండెంటు బల్లమీద కూర్చుని ఉత్తరువు లిచ్చేటప్పుడు ఆండ్రూ 'అబ్బా!' అని అనిపించుకోకుండా వుండటానికి యత్నించాడు. ఉన్నతస్థాయి వుద్యోగానికి అమాంతంగా ప్రాకి పైకొచ్చిన చిన్నవాడయిన తన్ను గురించి, వయోవృద్ధులైన ఇతరోద్యోగస్థులు తమలో తాము గుసగుసలాడుకుంటారని అతడు అనుమానించాడు. అందువల్ల తన చిన్నరూపం సంగతి ఎలా వున్నా, తాను పొందిన ఆ వుద్యోగస్థానానికి తగ్గవాడనని నిరూపించటం కోసం అతడు మరింత నిశ్చయం చేసుకోవటం జరిగింది. తన గుణవిశేషాలను నిరూపించుకోవటానికి అతనికి ఆ సంవత్సరపు చలికాలంలో చాలా అవకాశాలు లభించాయి. ప్రమాదం సంభవించినప్పుడు డివిజన్

సూపరింటెండెంటు రాత్రింబవళ్ళూ పనిచేయాలని ఉద్దేశింపబడుతుంది. రాత్రివేళ ఏదైనా ఒక హఠాత్సంభవం జరిగితే అతనికి ఆ రాత్రికి రాత్రే తెలియజేస్తుండేవారు. ఆ ప్రదేశానికి వెళ్ళి అతడు దాన్ని చక్కబెట్టి వస్తుండేవాడు.

అంతే కాదు, అది ఎంత గడ్డు చలికాలం! ఆ రోజుల్లో పట్టాలను అడ్డు కమ్మీలమీద బిగించేటప్పుడు పట్టు పట్టటం కోసం పోతయినుము "ఛైర్స్" ఉపయోగించేవాళ్ళు. గట్టి చలి గాలికి అవి తట్టుకోలేక పగుళ్ళు చూపి విచ్చిపోతుండేవి. బండ్లు ఆగిపోవటాలు, పట్టాలు తప్పటాలు ఆ చలికాలంలో పరంపరగా వుంటుండేది. ఒక చిక్కని చలిరాత్రి, ఎక్కడో ఒకచోట, ఇక్కడో అక్కడో, ఆ ఛైర్లు నలభైయేడింటిదాకా బ్రద్దలైనాయి. అలా చలి విజృంభించే ఆ రోజుల్లో, క్రొత్త సూపరింటెండెంటు ఇల్లు విడిచి ఎనిమిది దినాలపాటు తిరిగి భంగాలు కలిగినచోట్ల, బండ్లు పట్టాలు తప్పిన చోట్లు చూచాడు.

తనకు అలుపు లేదు కనుక, తాను ఇతరుల కష్టసుఖాలను ఎరగని కఠినుడైన అధికారివలె ఆ రోజుల్లో ప్రవర్తించానేమో అన్న భావం అతనికి, తరువాతి కాలంలో కలిగింది. తనచుట్టూ ఎంతో రొద వున్నా లెక్కచెయ్యకుండా బాక్స్ కార్ నేలమీద గాని, లేదా మరెక్కడయినా గాని వెన్ను వాల్చి వెంటనే నిద్ర పోగల శక్తి అతనికుంది. ఎంత చిన్న కునికిపాటయినా చాలు, శ్రమతీరి మహోల్లాసంతో నిద్రలేచేవాడు. దీనికి తోడుగా అతనికి హృదయపూర్వకంగా పని చేయాలన్న గుణముంది. క్రొత్తది, బాధ్యతాయుతమైంది అయిన వుద్యోగాన్ని శక్తితో నిర్వహించి చూపించే ఆశయం గల యువకుడు అతడు.

పిట్స్‌బర్గులోని పొగ, పొగదుమ్ము, తిరిగి వచ్చినప్పుడు వాళ్ళను ఆశ్చర్యచకితులను చేశాయి. "ఇది వెనుకటి కంటె చాలా అసహ్యకరమయినది" అని వాళ్ళు ఒకరితో ఒకరు చెప్పుకున్నారు – కాని నిజానికి ఇప్పటికంటె వెనకే ఎక్కువ అసహ్యకరంగా వుండేదని కూడా చెప్పవచ్చు. ఏ వస్తువునూ పరిశుభ్రంగా వుంచటం సాధ్యం కాని పని అని మార్గరెట్ కార్నెగీ గృహిణీహృదయం నిరుత్సాహంతో తల్లడిల్లింది.

కార్యాలయంలో ఒకనాడు "మాకు గ్రామసీమలో వుండాలని వుం" దన్నాడు.

"మంచిది. ఎందుకుండ కూడదు?" అన్నాడు మిస్టర్ స్కాట్ మేనల్లుడు, రైల్ రోడ్ సంస్థకు జనరల్ ఫ్రయిట్ ఏజంటు, డి.ఎ. స్టువార్టు. "హోమ్ వుడ్‌కు వచ్చేయ్యండి. వెంటనే కొనవచ్చు. మాకు ప్రక్కనే ఒక స్థలముంది. దాని వునికి ఎంతో బాగుంది. ఏమంత దూరాన కూడా లేదు. ఆ పరిసరాలలో ఒక డజనుకుమించి కుటుంబాలు

లేవు. అవి అన్నీ వున్నతస్థాయిలోవే. మీరు కావాలంటే వచ్చి చూచేటంతవరకూ అట్టిపెట్టమని ఆ ఆస్తిగలవాళ్ళతో చెప్పి ఉంచుతాను."

ఆండ్రూ, తల్లి ఆ ప్రదేశాన్ని పరిశీలించటానికి వెళ్ళారు. దాన్ని చూడటంతోనే వారికి ఎంతో ఉల్లాసం కలిగింది. అది మంచి విశాలమయిన మైదానాలు, చెట్ల గుంపులు, పొదలు, కోనలు – వీటిమధ్య ఉన్న రెండంతస్తుల కాటేజి, నగరంలోని కార్నెగీల ఇల్లు చిన్నజాతిలోది. అయినా కుటుంబానికి చాలినంతగా స్థలముంది. మార్గరెట్ మిత్రబృందాన్ని పెంపొందించుకొని, అల్టూనాలో కంటే అధికవిస్తృతిగల పుష్పోద్యానాన్ని పెంచుకొని, తన జీవితంలోని ఆనందకరమైన అనేకసంవత్సరాలను ఇందులో గడిపింది.

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రాత్రి ఏ గంటలోనైనా, ఆదివారమైనా యువకుడైన ఆ ఉన్నతోద్యోగి పిలుపును అందుకొనేటందుకు వీలుగా ఇంటిలోకి టెలిగ్రాఫు తీగ అమర్చబడింది.

ఇరుగుపొరుగువారైన స్టువార్టులు కూడా నెమ్మదిగా వారికి ప్రీతిపాత్రులైనారు. ఆండ్రూ ఇక్కడ యువకుడైన ఇరుగుపొరుగు జాన్‌వాన్డి వోర్డును కలుసుకున్నాడు. ఇతడిలాగనే మిస్టర్ స్టీవర్డ్ కాలం గడిచిన తరువాత కార్నెగీ యినుము – ఉక్కు వ్యాపారంలో భాగస్థుడైనాడు. ప్రియమైన "వాన్డీ" ఆండ్రూ చివర చివరగా చేసిన కొన్ని విదేశ ప్రయాణ కాలాల్లో అతనికి సహచరుడిగా వుండేవాడు. కార్నెగీలు హోమ్‌వుడ్‌కు వలస వచ్చిన తరువాత అక్కడికి ఇంకో వాసితుణ్ణి తీసుకువచ్చారు. అతడు థామస్ ఎన్, మిల్లర్ – ఇతడు పరీక్ష కాగిన నిజమైన మిత్రుడు. సంగీతం, గ్రంథాలు, దేశయాత్ర అన్న విషయాలో ఆండ్రూతో అన్యోన్యత గలవాడు. ఆండ్రూ కార్నెగీలో ఉన్న మనోహరమైన లక్షణాలల్లో ఒకటి, మైత్రి నార్జించటంలో గల సామర్థ్యం. మిత్రుల యెడ అతనికుండే ఆసక్తి అతితీవ్రమైంది. నిత్యమైంది. మిత్రులను అతడెన్నడూ మరిచిపోయేవాడు కాదు. వృద్ధాప్యం వృద్ధి పొందుతున్న సంవత్సరాలలో అతనికి అత్యానందప్రదాలైన దినాలు, బహుకాల వియోగానంతరం యౌవనం నాటి మిత్రులను కలుసుకొన్న రోజులే!

హోమ్‌వుడ్‌లోని విజ్ఞావంతులు. సాంస్కృతికులతో గూడిన సమాజం హృదయపూర్వకంగా ఆండ్రూని తమలో ఒక సభ్యుణ్ణి చేసుకొన్నవి. ఆ ప్రాంతంలో కల్లా పెద్ద న్యాయమూర్తి విలియం జోన్సు. మంచి విద్వాంసుడు. ఉద్యోగవిరమణ కాలంలో విశ్రాంతి తీసుకొంటున్నాడు. కొన్నాళ్ళు సెనటర్‌గా వ్యవహరించాడు.

కొన్నాళ్ళు యుద్ధకార్యదర్శి, రష్యామంత్రిగా చేశాడు. అతని భార్య రాజనీతికోవిదులు, దౌత్యతంత్ర నిర్వాహకులు, జన్మించిన కుటుంబంలో పుట్టింది. ఈమె బైరన్ కవికి దూరబంధువు కూడాను. వీళ్ళతో కొంతగా భీతిని కలిగించే పరిచయం, దీనికితోడు మిసెస్ ఎడిసన్, ఆమె కుమార్తెల పరిచయం ఆండ్రూ ఆత్మతృప్తికి ఒక కదలికను కల్పించింది.

"తనబోటివారిని ఉన్నతవిద్యావంతులనుంచి వేరు చేసే వర్ణనాతీతం, గణనాతీతం అయిన అఘాతాన్ని అర్థం చేసుకొన్నాను" అని అతడు తరువాత జీవితంలో అంగీకరించాడు. న్యాయమూర్తి విల్కిన్ పఠనకక్ష్యలోని 'చలిపొయ్యి' చుట్టూ జరిగే సంభాషణలు డార్విన్, హెర్బర్టు స్పెన్సర్, జాన్ స్టువార్టుమిల్ మొదలయిన ప్రముఖుల రచనలను చదవమని ప్రేరేపించాయి. మిసెస్ ఎడిసన్‌తో కలిగిన పరిచయాలు అతని సంభాషణలోను, ప్రవర్తనలోను కోసులు కోసులుగా మిగిలిపోయిన అంచులను నునుపు చేశాయి. పిట్స్‌బర్గు, దాని పరిసర ప్రాంతం ఇంతవరకూ ఎందులో చేరివున్నట్లు భావింపబడుతున్నదో ఆ పశ్చిమప్రాంతంలో నివసించే యువకులు, వదులైన కాలర్లు, బండబూట్ల మీద ప్రీతితో మొరటుతనాన్ని వెలిబుచ్చే అజాగరూకతను ప్రదర్శిస్తున్నారు. ఆ రోజుల్లో 'పిచ్చి సొగసు' (foppish) అన్న ముద్రను వెయ్యదగ్గ ప్రతిదీ అసహ్యించుకోబడేది. కొన్ని సమయాలలో 'కిడ్ గ్లౌ'లను ధరించే రైల్ రోడ్‌వారి సాధారణోద్యోగి పరిహాసపాత్రుడౌతుండేవాడు. యువకుడైన కార్నెగీలో వున్న అటువంటి అభిప్రాయాల నన్నింటినీ మిసెస్ ఎడిసన్ మృదువుగా తొలగించివేసింది. కొన్ని వేళల్లో ప్రమాదకరంగా పరిణమిస్తున్న అతని మంకుపట్టును కొంతగా ఆమె అణచి పెట్టవలసి వచ్చింది. అయితే అతడు ఎప్పుడూ నైజాన్ని ప్రదర్శించేవాడు కాదు. తన ఆరంభదశలో క్షుద్రమైన స్థితిగతులను గురించి ఎన్నడూ సిగ్గుపడేవాడు కాదు. 'వింత ఏమంటే – అతడు తనకు కొంత మెరుగు, వృద్ధి అవసరమని గుర్తించాడు. ఎంత ఆత్మవిశ్వాస మున్నప్పటికీ అతనిలోని సత్యసంధత, నిష్కాపట్యం, సాధుత్వం అతన్ని ప్రీతిపాత్రుణ్ని, జనానురాగపాత్రుణ్ని చేశాయి.

విలియం కోల్‌మన్ ఆండ్రూకు మరో పొరుగువాడు. ఇతడు పిట్స్‌బర్గులోని ధనికుల్లో ఒకడు. ఇనుము పరిశ్రమ అధిపతి, కళాపోషకుడు. పిట్స్‌బర్గు ఆపేరా గృహానికి చిరకాలం యజమాని. పిట్స్‌బర్గ్, హోమ్‌వుడ్‌లోని యువకుల దృష్టిలో ఇతనికున్న గొప్ప సంపద ఇతని అందమైన అయిదుగురు కుమార్తెలు. వీళ్ళల్లో థామస్ మిల్లర్‌కు ఒకరు, థామస్ యం. కార్నెగీకి ఒకరు భార్యలైనారు.

1859లో పెన్సిల్వేనియాలో నూనెను కనుగోటం జరిగిన తరువాత మిస్టర్ కోల్‌మన్ ఆండ్రూ ఇరువురూ అలిఘనీ వరకు పరిశీలనయాత్ర చేశారు. వాళ్ళు వీలు చిక్కినప్పుడు నిద్రిస్తూ, అందినచోట భోజనం చేస్తూ, అనేకదినాలు మిట్టపల్లాలతో గూడిన నీలారణ్య దేశంలో సంచారం చేశారు. మిస్టర్ కోల్‌మన్, ఆండ్రూ కొద్ది బేరం సాగిన తరువాత నూనె ఉన్నట్లు నిరూపితమైన భూమికి సన్నిహితంగా వున్న ఒక క్షేత్రాన్ని, ఎంతైనా సరే పెట్ట ధైర్యం చేయగలదాన్ని, అన్ని హక్కులతో నలభై వేల డాలర్లకి కొనగలిగారు. తరువాతి కాలంలో, అంటే నూనె లాభాలు విశేషంగా ఉన్నప్పుడు, కనిపించినట్లు లాభాపేక్ష గలవారు. అప్పుడు అట్టే వ్యామోహాన్ని ప్రకటించకపోవడం, ఆలోచనలు గాని, కార్యాచరణలుగాని తక్కువ సంఖ్యలో ఉండటం ఈ చౌక బేరానికి కారణాలు.

ఆండ్రూ కార్నెగీ స్కాచ్‌వాడైనా, కొత్త కొత్త సాహసచర్యల్లో పాల్గొనటానికి జంకే స్వభావం కలవాడు కాదు. ఆత్మశక్తి మీద అతనికున్న విశ్వాసం, విజయమార్గంలో క్రమమైన ఆరోహణం కనిపించటం అన్నవి రెండూ అతని అదృష్టం మీద అతనికి ఎరుకపడని ఏదో నమ్మకాన్ని కలిగించాయి. ఇంకా ఎన్నో అవకాశాలను స్వీకరించటానికి అతడు సాహసించేటందుకు తోడ్పడ్డాయి.

అప్పుడా క్షేత్రాన్ని విక్రయించిన వ్యక్తి ఆ లావాదేవీని గురించి బహుశా ఎంతో సంతృప్తి పొంది వుంటాడు. అందులోని సాహసాన్నంతటినీ కొనేవాళ్ళు భరించారు. తన తదనంతర జీవితాన్నంతటినీ సుఖంగా గడిపేటందుకు చాలినంత ధనాన్ని వారిచ్చారు. అయితే, మూడు నాలుగేళ్ళకు ఎంతో విలువైన బ్లాక్ పెన్సిల్వేనియా పెట్రోలియంను ఇచ్చి, డజనో లేక అంతకంటే కొంచెమెక్కువో బావులు పడ్డ తరువాత, ఆ ఆస్తి విలువ రమారమి అయిదు మిలియన్ల డాలర్లని  తెలిసినప్పుడు, ఆ భూస్వామికి హృదయంలో తీవ్రమైన మంటలు చెలరేగి వుండవచ్చు.

కోల్‌మన్ (ఇతనికి భూమిలో ఎక్కువభాగం తప్పదు గదా) కార్నెగీ, వాన్డివోర్ట్, టామ్ మిల్లర్, ఇంకా ఇతరులు హోమ్‌వుడ్ బృందంలో వారు. ఆ క్షేత్రానికి యజమానులుగా కొలంబియా ఆయిల్ కంపెనీని స్థాపించారు. కార్నెగీ, యిరవై యేళ్ళయినా నిండని తన తమ్ముడు టామ్ కార్నెగీ కోసం కొంత డబ్బును ముందు తానే పెట్టుబడి పెట్టి భాగమిచ్చి, కంపెనీలో చేర్చాడు. శక్తి, నిశితమైన బుద్ధి వున్నవాళ్ళకు అది నిజంగా అవకాశ స్వర్ణయుగం. ఆ తరువాత ఎన్నడూ కార్నెగీకి క్రొత్త పెట్టుబడులకు

డబ్బు లేకపోవటమంటూ లేదు. అతడు మరిన్ని ఆడమ్స్ ఎక్స్‌ప్రెస్ వ్యాప్తి షేర్లు పెట్టుబడులను కొన్నాడు. వెస్టర్న్ యూనియన్ టెలిగ్రాఫు సంస్థలోనుంచి కొనటమారంభించాడు. అతని సంపద దొర్లిపొయ్యే మంచుముద్దలా పెద్దదౌతున్నకొద్దీ, దానిచుట్టూ మరికొంత పేరుకుంటున్నది.

# 6. బల్‌రన్ - డన్ఫర్మ్‌లైన్

కొంత కాలంనుంచి నిరంతరం అతిసూక్ష్మంగా జాతీయ సంఘటనల మీద, సమస్యల మీద ఆసక్తి వహించి, అతినిశితదృష్టితో పరిశీలిస్తున్న యువ కార్నెగీ బానిసత్వం, రాష్ట్రాల హక్కులు అన్న వివాదగ్రస్తమైన రెండంశాల వల్ల, ఉత్తర దక్షిణాలమధ్య క్రమంగా వృద్ధి పొందుతున్న తగాదాను గురించి తీవ్రమైన ఆందోళన చెందటం ప్రారంభించాడు. ఈ రాజకీయాలనే మహాశిలువ మీద తనకు ప్రియమైన జాతీయనౌక భగ్నం కాబోతున్నదని అతడు నమ్మలేకపోయినాడు. అతడు నిశ్చయంగా ఆ క్లిష్టపరిస్థితికి సంచరించి, తరువాతి కాలంలో అధ్యక్షుడు క్లీవ్‌లాండ్ అతన్ని గురించి "అఫెన్సివ్ పార్టిజాన్" అని అన్నదానికి తగ్గట్లు రూపొందాడు. లింకన్ అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డ ఫలితంగా 1861 నాటి వసంతారంభంలో దక్షిణరాష్ట్రాలు విడివడిపోవటం ప్రారంభించాయి. ఆ సమయంలో అతడు ఒక ఆదివారం నాడు గ్రీన్స్‌బర్గ్‌లో తన ఉత్తమ మిత్రుడైన మిస్టర్ స్టోల్స్ ఇంట్లో అతిథిగా వున్నాడు. అప్పుడతని అతిథి విడివడిపోతున్న రాష్ట్రాలను ఆపటానికి బలప్రయోగం చేసేందుకు ఫెడరల్ ప్రభుత్వానికి ఎటువంటి హక్కూ లేదన్నప్పుడు విని ఆశ్చర్యపడ్డాడు.

"మిస్టర్ స్టోల్స్, మేము నీ బోటి వ్యక్తులను ఆరు వారాలలో ఉరి తీయబోతున్నాము!" అని ఆండ్రూ విరుచుకు పడ్డాడు.

మిస్టర్ స్టోల్స్ ఈ పరాభవానికి ఏమీ చెయ్యలేక పెద్దపెట్టున నవ్వాడు. 'నాన్సీ!' అని ప్రక్కగదిలో వున్న భార్యను పిలిచాడు. "నాన్సీ, ఈ యువస్కాచ్ పిశాచం ఏమంటున్నాడో విను. నా బోటి వాళ్ళను వీరు ఆరువారాలలోగానే ఉరి తీయబోతున్నారట!"

కానీ ఆరువారాల్లోనే మిస్టర్ స్టోల్స్ ఫెడరల్ సైన్యంలో మేనేజరైనాడు. అతడు విడివడిపోయే రాష్ట్రాలమీద సైన్యాన్ని ప్రయోగించరాదనటం రిపబ్లికన్ ప్రభుత్వం మీద ఒక ప్రగాఢమైన డెమాక్రాట్ చేసే విమర్శ మాత్రమే. పోర్టు సమ్లర్‌లో జరిగిన కాల్పులనే సంఘటన అతని కళ్ళు తెరిచేటంతవరకూ, అది యుద్ధమని అతడికి అవగతం కాలేదు. రాజకీయ పక్షాలకు సంబంధించిన చిన్న సంఘర్షణ మాత్రమే

అని అతడు అంతవరకూ భావించాడు. ఇరుపక్షాల మధ్య ఏర్పడ్డ విచ్ఛిత్తి ఎంత తీవ్రమయిందో అర్థం చేసుకోలేకపోయిన అతనివంటి వ్యక్తులు మొదట్లో చాలామంది ఉండేవారు.

యుద్ధసేవ చేయవలసిన అవసరం పెన్సిల్వేనియా రైల్ రోడ్ కంపెనీలో పనిచేసేవారికి అతివేగంగా వచ్చింది, మిస్టర్ స్కాట్‌ను ట్రాన్స్‌పోర్టేషను శాఖకు యుద్ధసహకార్యదర్శిని చేశారు. అతడు వెంటనే తనకు విశ్వాసపాత్రుడయిన ఆండ్రూ కార్నెగీని రైల్వే మనుష్యులతో ఒక సైనికదళాన్ని కూర్చుకొని మిలిటరీ రైల్‌రోడ్, టెలిగ్రాఫ్‌ల పని చూచేటందుకు సహాయకునిగా రమ్మని పిలిపించాడు. మసాచ్యుసెట్స్‌నుంచి దక్షిణానికి చేరవలసిన సైన్యం బాల్టిమోర్ మీదుగా వెళ్లుతున్నప్పుడు ఒక మూక ఎదుర్కొన్నది. ఎన్నోచోట్ల రైల్వే లైనులను తెగగొట్టి, వంతెలను తగలేసి అది మార్గాలన్నింటినీ పాడుచేసింది. ఏప్రిల్ 19 తరువాత ఒక వారానికి వాషింగ్‌టన్‌కు, ఉత్తరానికీ మధ్య వార్తాప్రసారం పూర్తిగా విచ్ఛిన్నమైపోయింది. ఇది చాలా విషమమైన పరిస్థితి.

ఆ మార్గాన్ని తిరిగి సరిచేయించటం కార్నెగీకి నిర్ణీతమైన ప్రథమకర్తవ్యం. ప్రయాణం చేయవలసిన సైన్యంలో నుంచి ఎన్నుకొన్న మనుష్యులను, ఒక ఇంజినీరింగ్ దళాన్ని అతడు కనికరమన్నది ఎరగకుండా తరిమి పనిచేయించాడు.

వారాంతరంలో బండ్లు తిరిగి నెమ్మదిగా దక్షిణానికి వెళ్ళటం ప్రారంభించాయి. కట్టలను మధ్యమధ్య దట్టించటానికి, ఎంతో ఘనమయిన భారాలను మోయగలందుకు, వాటిని బలయుతం చెయ్యటానికి తన మనుష్యులను అక్కడ ఆపుదల చేసి, నిండా సైనికులున్న రైలు బండి ఇంజిన్ పెట్టెలో కూర్చుని, తాను బాగుచేయించిన రోడ్డు మీదుగా వాషింగ్టన్ వైపునకు ప్రయాణం చేశాడు. బండిమీద విద్రోహచర్య ఏదైనా జరుగుతుందేమో అన్న భయంతో వాళ్ళు అతి జాగరూకులై వెడుతున్నారు. వాషింగ్టన్ ఇంకా చాలా మైళ్ళ దూరాన ఉంది. ఉన్న ఒక్క తంతితీగనూ స్తంభాలనుంచి వదులు చేసి, నేలమీద మేకుతో గట్టిగా అంటబాతినట్లు ఆంద్రూ గమనించాడు.

“ఇక్కడ ఆపండి. నేను తంతితీగను విడుదల చేయాలి” అన్నాడు ఆండ్రూ ఇంజినీరుతో.

“దాన్ని తెగనరికారా ఏమిటి?” అప్పటికి ఇంకా గాలి బ్రేక్ రాలేదు కనుక ఆవిరిని ఆపి వెనక్కు నడుపుతూ ప్రశ్నించాడు ఇంజినీరు.

"లేదు" అన్నాడు ఆండ్రూ సమాధానంగా. "ఎందుకో మరి, మేకులతో నేలకు అంట పాతటం మాత్రమే జరిగింది. తోరణంలా వ్రేలాడుతున్నా అది పని చేస్తుంది. అయితే ఇలా నేలకు బిగిస్తే పని చెయ్యదు".

పెట్టెలోనుంచి అతడు వేగంగా క్రిందికి దిగి, మేకు దగ్గరకు వెళ్ళి, రెండు చేతులతో బలం కొద్దీ మేకును నేలనుంచి బయటికి లాగాడు. బిగించిన వైరును హఠాత్తుగా విడిపించటం వల్ల ఏం జరుగుతుందో అతడప్పు డూహించలేదు. అతని మొగాన గట్టి దెబ్బకొట్టి పైకి ఎగిసిపడ్డది. అతడి చెక్కిలి మీద అడ్డంగా లోతున గీచుకుపోవటం వల్ల నెత్తురు విపరీతంగా కారింది. నెత్తురుతో నిండిపోయిన చేతిగుడ్డను మొగాన అడ్డుపెట్టుకొని సైన్యంతో అతడు వాషింగ్టన్ ప్రవేశించాడు. అంతర్యుద్ధంలో యూనియన్ కోసం తొలిసారిగా నెత్తురును ఒలికించినవాణ్ణి నేనని, అతడు తరువాతి కాలంలో నవ్వుతూ అంటుండేవాడు.

వాషింగ్‌టన్ చేరగానే యుద్ధశాఖలో తంత్రివార్తాహరులు తక్కువగా ఉన్నట్లు తెలుసుకొన్నాడు. యుద్ధసేవకోసం మరి నలుగురికి ఉత్తరువులు పంపించి పిలిపించవలసిందని, అధికారులు అతన్ని కోరారు. అతడు ఆ ఉత్తరువును డేవిడ్ మెక్కార్గోకు తంతిమూలంగా పంపించాడు. అతడు ప్రస్తుతం పెన్సిల్వేనియా రైల్‌రోడ్‌కు టెలిగ్రాఫ్ సూపరింటెండెంటుగా పనిచేస్తున్నాడు. మొక్కార్గో ఆ నలుగురు ఆపరేటర్ల పేర్లను, వారు వాషింగటన్ చేరటానికి వెంటనే ఏ మార్గాన వస్తుందో ఒక గంటలోపల తెలియజేశాడు. వారి వయస్సు పద్దెనిమిది, ఇరవై మూడు మధ్య వుంటుంది. వాళ్ళలో పెద్దవాడు స్ట్రేస్, తరువాత ప్రభుత్వం తంతి సమాచారశాఖకు సూపరింటెండెంటు అయినాడు.

పోటోమాక్ నది మీదుగా వర్జీనియా రాష్ట్రంలోకి వెళ్లే బాగా దెబ్బతినిపోయిన మార్గాన్ని పునర్మించటం అతనికి తరువాతి కర్తవ్యమైంది. ముఖ్యపట్టణరక్షణార్థం ఆ ప్రాంతానికి ఫెడరల్ సైన్యం వెళ్లేటందుకు వీలు కలిగించాలంటే, ఇది ఎంతైనా అవసరం. ఉన్నతోద్యోగితో సహా అందరూ గడియారం దగ్గర పెట్టుకొని పనిచేసి పోట్‌మాక్ నది మీది పొడుగాటి పాత వంతెనను తిరిగి కొయ్యతోటే నిర్మించడం జరిగింది. చెడగొట్టబడ్డ మొత్తం మార్గాలను, వంతెనలను, తంతి తీగలను సరిచేయిస్తూ, క్రొత్తవి నిర్మిస్తూ ఆ యువకుడయిన ఉన్నతోద్యోగి, ఆరువారాలు గడిపాడు. 1861 వేసగిలో ఎన్నడూ ఎరగని ఎండలు కాశాయి. అమెరికాలోని నిదాఘంతాపానికి అతడు

తట్టుకోలేకపోయినాడు. ఎక్కువసేపు ఎండలో గడపకుండా ఉండటం కోసం అతడు ఎంతో శ్రద్ధ తీసుకోవలసి వచ్చేది.

యూనియన్‌కు కనువిప్పును కలిగించిన బుల్ బరస్ యుద్ధం జులై 21న జరిగింది. ఆ రోజున కార్నెగీ, సైన్యాలను, ఆహారపదార్థాలను, ఆయుధసామగ్రిని రైలు మీద యుద్ధరంగానికి చేరుస్తూ, వాషింగ్టన్‌కు ఇరవై మైళ్ళ దూరంలో వున్న బర్క్ ్స స్టేషన్‌లో వున్నాడు. ముఖ్యనగరంలో శ్రుతిమించిన ఆత్మవిశ్వాసం రాజ్యమేలుతున్నది. అహంకారపూరితులైన దాక్షిణాత్యులను సులువుగా ఓడించ వచ్చుననీ, ఆ చిన్ని తిరుగుబాటును అంతమొందించవచ్చునని ప్రభుత్వం అభిప్రాయపడుతున్నది.

బర్క్ ్స స్టేషన్‌లో రోజంతా తీవ్రంగా శ్రమపడవలసి వచ్చింది. అంబులెన్సు శకటాలు తీసుకువస్తున్న క్షతగాత్రుల సంఖ్య క్షణక్షణం ఊరికే పెరిగిపోతున్నది. వాషింగ్టన్ నుంచి ఇంజిన్‌లను, కార్లను తెప్పించి వారిని నగరంలోను, పరిసరాలలోను ఉన్న వైద్యశాలలకు చేర్చే ఏర్పాటు చేయించవలసి వచ్చింది. యుద్ధభూమినుంచి వచ్చిన తొలి వార్తలు ఆశాజనకంగానే వున్నవి. మధ్యాహ్న మయ్యేటప్పటికల్లా పరిస్థితిలో మార్పు కన్పించింది. కొందరు దళాలుగాను, కొందరు ఒంటరి ద్రిమ్మరులుగాను తిరోగమించి వస్తున్న సైనికుల గుంపు స్టేషన్ మీద వెల్లువగా వచ్చి పడింది. ఒక ఘనవిజయానికి బదులుగా దారుణ విపత్తు రానున్నదని వెంటనే స్పష్టమయింది. బండి తరువాత బండిగా గాయపడ్డ వాళ్ళను పంపించటం కొనసాగుతూనే ఉంది. వాగన్ మార్గాలు తిరిగివచ్చే సైనికుల బండ్లతోను, కొందరు కుటుంబాలతో, కొందరు ఒంటరిగా విజయాన్ని చూడటం కోసం వచ్చిన కాంగ్రెస్ సభ్యుల బండ్లతోను, ఉద్యోగుల బండ్లతోను క్రిక్కిరిసి పోతున్నవి. దారుణమయిన ఓటమి కలుగుతున్న సమయంలో చీకటి పడింది. కార్నెగీ వాషింగ్టన్ వెళ్ళటం కోసం బండి ఎక్కగానే కాల్పుల చప్పుళ్ళు మిక్కిలి సన్నిహితంగా వినిపించాయి. ఆ పిమ్మట అతడు చాలా వారాలు వాషింగ్టన్‌లోనే వున్నాడు. అతనికి ప్రభుత్వంలోను, సైన్యంలోను వున్న ప్రముఖులందరితో పరిచయం కలిగింది. వీళ్ళల్లో అధ్యక్షుడు లింకన్ ఒకడు. అతడు, తనకు సహజమయిన నిష్కాపట్యసౌజన్యాలు గల వ్యక్తిత్వంతో కార్నెగీని గాఢంగా ప్రభావితుడిణ్ణి చేశాడు.

వాషింగ్టన్‌లోని ప్రభుత్వం, యుద్ధాన్ని గురించి మొదట కొద్దివారాలలో ముగిసిపోయే చిన్న పొంగు మాత్రమే అని అనుకున్నది. అందువల్ల రైల్ రోడ్‌కు సంబంధించిన స్కాట్, కార్నెగీల వంటివారిని ఆత్యయికపరిస్థితిని సరిదిద్దటం కోసమే త్వరితగతిని పంపించటం జరిగింది. నిశ్చేష్టులను చేసేటట్లు బుల్‌రన్‌లో కలిగిన

వ్యతిరేకఫలం అధికారవర్గం వారి ఆలోచనారీతినే మార్చివేసింది. యుద్ధం ఒకటో, రెండో, మూడో సంవత్సరాలు సాగుతుందని గుర్తించటం జరిగింది. స్కాట్, కార్నెగీ బహుకాలం వారి రైల్ రోడ్ వుద్యోగాలను విడిచిపెట్టి ఉండటానికి వీల్లేదు. అంతేకాక పెన్సిల్వేనియా వంటి ప్రముఖమైన రైల్ రోడ్‌లు యుద్ధాన్ని కొనసాగించటానికి ముఖ్యఅవసరాలుగా కూడా ఉన్నవి. స్కాట్, కార్నెగీ వారి వుద్యోగాల్లోకి వెళ్ళిపోయారు. ప్రభుత్వం తన రైలు, తంతిపనులను చూడటం కోసం స్థిరంగా వుండిపోగల వుద్యోగులను నియమించుకున్నది.

పిట్స్‌బర్గుకు తిరిగివచ్చి కార్నెగీ, తన వుద్యోగతంతువులను అందుకొని, ఆ నాటి ఆశాపరులయిన గొప్ప వుద్యోగస్థులందరూ చేస్తున్నట్లుగానే' బయట వ్యాపారాలలోని పెట్టుబడుల మీద దృష్టి నిలపటం కొనసాగిస్తూనే వున్నాడు. తరువాత వచ్చిన చలికాలపు చివరిభాగంలో చాలావారాలు అతడు గట్టి జబ్బు పడ్డాడు. కార్యాలయానికి తిరిగి వచ్చినప్పుడు తన బలహీనతను తెలిసికొని, స్వాస్థ్యాన్ని చేకూర్చుకోవటం కోసం సెలవడిగాడు. సెలవు మంజూరు చేయబడ్డది. సెలవు ఎక్కడ గడపటమా అన్న ప్రశ్న అతనికి కలగనే లేదు. మే మాసాంతంలో తాను, తల్లి డన్ఫర్మ్‌లైన్ చూడడానికి వస్తున్నామని వ్రాశాడు.

జూన్ 23న వారు లివర్‌పూల్‌కు ఓడ ప్రయాణం చేసేటప్పుడు ఎడబాటు ఎరుగని టామ్ మిల్లర్ వారి వెంట వున్నాడు. అతడు బ్రిటన్ అంతా తిరగటం కోసం బయలుదేరాడు. బండి లివర్‌పూల్‌నుంచి ఉత్తరంగా నడుస్తున్నప్పుడు, ఛివియట్ కొండలను చుట్టి అది స్కాట్లండులో ప్రవేశించినపుడు ఆండ్రూ, అతని తల్లి పొందిన ఆనందం పరాకాష్ఠ నందుకున్నది. అలలలాగే కదలాడే పచ్చని పూలపరపులతో అక్కడి కొండ ప్రదేశమంతా కప్పబడి వున్న దృశ్యాన్ని చూసి మార్గరెట్ కార్నెగీ, "ఓహ్! అక్కడే తంగేడు చెట్టు! తంగేడు చెట్టు" అన్నది నెమ్మదిగా. పొంగి పొరలే సంతోషభావాలను ఆమె ఆపుకోలేకపోయింది. ఇక ఆమె కుమారుడు "పవిత్రమైన ఆ నేలమీద పడి ముద్దెట్టుకుందామని నా కనిపించింది" అన్నాడు తరువాత.

వారిని గౌరవించే విషయంలో "మేము మే" మని పోటీపడ్డ అసంఖ్యాకులయిన బంధువులు వారికి స్వాగతం చెప్పారు. మిసెస్ కార్నెగీ తన కుటుంబంతో, మారిసన్‌లతో వుండిపోయింది. ఆండ్రూ సూటిగా అంకుల్ జార్జిలాండర్ షాపులో వున్న గదికి వెళ్ళాడు. అక్కడ యువకులయిన వారిరువురూ ఒకరియెడ ఒకరు వాళ్ళ బాల్యంలో వర్తించినట్లే 'డాడ్' 'నైగ్'లుగా ప్రవర్తించారు. వారు 'డగ్లాస్' అనే 18వ శతాబ్దపు

విషాదాంత నాటకంలోని ఒక దృశ్యాన్ని చిన్నతనంలో చూసినట్లే చూశారు. అక్షరం తప్పిపోకుండా దరిదాపుగా అందులోని పంక్తులన్నీ జ్ఞప్తికున్నట్లు వాళ్ళు సరిచూచుకున్నారు.

ఆ బంధువులోకెల్లా పెద్దదయిన ఆంట్ ఛార్లెటీకి, ఆండ్రూ మరీ పసిబిడ్డగా వున్ననాటి విశేషాలు కొన్ని బాగా జ్ఞప్తికున్నాయి. ఆమె "నీవు చాలా ఆశాపరుడైన బిడ్డ" వని అతనితో అన్నది. "నీకు రెండు చెంచాలతో పోయవలసి వచ్చేది. నోటిలోనుంచి ఒకటి తీసేటప్పటికే రెండోదాని కోసం గుక్క పెట్టేవాడివి." ఆండ్రూ అభివృద్ధిని గురించి తెలుసుకోటం విషయంలో ఆమె ఎంతో వెనుకపడింది. అతడు రావటం ఎంతో ముఖ్యవిషయంగా భావించింది. "నీవు ఏ నాటికయినా తిరిగి వచ్చి ఇక్కడ హై స్ట్రీట్‌లో షాపు పెట్టాలి సుమా!" అన్నది. హై స్ట్రీట్‌లో ఆమె అల్లుడికి ఒక గ్రీన్ గ్రోసర్ షాపువుంది. అతడు ఇతర వీథుల్లో షాపులున్న వాళ్ళకంటె కొంత అధికుడుగా ఉండేవాడు. ఆమె దృష్టిలో మానవజీవితంలో సాధింపదగ్గ ఘనమైన విషయం ఆ హై స్ట్రీట్‌లో షాపు పెట్టడమే.

కార్నెగీ కుటుంబం అమెరికాకు వలసపోవటం కోసం ఇరవై పౌనులు అప్పిచ్చిన మిసెస్ హెన్డర్ సన్ – అయ్‌లీ ఫార్గీ ఇంకా జీవించే వుంది. ఆమె, జానీలకు ఇప్పుడు బాగా లేకపోవటమనే స్థితే లేదు. ఇరవై పౌనులు తగ్గటం వల్ల మొదట కొంత తగ్గుదల వచ్చింది. అయితే డన్ఫర్మ్‌లైన్ ప్రమాణాలను బట్టి చూస్తే వాళ్ళిప్పుడు ఆనందంగా వున్నారు. అప్పుడిచ్చిన అప్పుకుగాను మిసెస్ హెన్డర్‌సన్‌కు కార్నెగీ ఇరవై పౌనులు 'ఇంటరెస్టు' (వడ్డీ. ప్రీతి అని శ్లేష) అన్న పేరుతో స్వార్థరహితమైన కృత్యానికి గాఢమైన కృతజ్ఞతగా కొన్ని సంవత్సరాలు పంపించటంతో, వాళ్ళకు డబ్బు పెరగటం మొదలెట్టింది. ఇప్పుడతడు "నేను ఆ అప్పును ఇప్పుడు తీర్చివేయటం మంచిదని భావిస్తున్నా" నన్నాడు.

"ఆ అప్పు ఇదివరకే తీర్చావుగదా!" అన్నది సమాధానంగా.

"ఇచ్చిన 'ఇంటరెస్టు'తో నేను సంపూర్ణంగా తృప్తి చెందాను" అని అంది.

"వెనక వడ్డీమాత్రమే చెల్లించాను. ఇప్పుడు అసలు ఇచ్చివేయగల స్తోమత నాకు వచ్చింది" అన్నాడు అభ్యంతరం చెపుతూ.

"ఆండ్రా, అసలు సంగతి పెట్టుకోకు" అన్నది, ఆ హాస్యసన్నివేశానికి అనుగుణంగా కళ్ళు మిలమిలలాడిస్తూ. "ఉన్నదున్నట్లుగానే అది చాలా మంచి పెట్టుబడి"

అందువల్ల "ఇంటరెస్టు" క్రింద చెల్లింపులు నడుస్తూనే వచ్చాయి.

ఇంటి విషయానికి వస్తే ఆ 1852 వేసగి ఫెడరల్ ప్రభుత్వానికి తృప్తికరంగా లేదు. యుద్ధభూమిలో దానికి చుక్కెదురుగా వుంది. యుద్ధఫలితాన్ని గురించి తీవ్రమైన అనుమానాలు ప్రారంభమయినాయి. స్కాట్లండులో ముఖ్యంగా డన్ఫర్మ్లైన్‌లో కూడా అభిప్రాయం దక్షిణానికి అనుకూలంగా వుంది. అది విని కార్నెగీ విస్తుపోయాడు. యూనియన్ అనుసరిస్తున్నది సన్మార్గమని తెలియజెపుతున్న అంకుల్ లాడర్ ఆ ప్రాంతంలో ఒక్కడై నిలువవలసి వచ్చింది.

తిరిగి జబ్బు చేయటం వల్ల ఆండ్రూ, అంకుల్ లాడర్ ఇంట్లో కొన్ని వారాలు గడపవలసి వచ్చింది. వాళ్ళిరువురూ అమెరికన్ వ్యవహారాలను గురించి ఎన్నో చర్చలు చేశారు. ఒకనాడు అంకుల్ అన్నాడు అతనితో – "ఆండ్రూ! నిన్ను శ్రమకరమైంది అడుగుతున్నానని నాకు తెలుసు నేను దాచిపెట్టుకొన్నది తీసుకోపోయి నా కోసం అమెరికాలో పెట్టుబడి పెడితే నేనెంతో సంతోషిస్తాను" అన్నాడు.

ఈ విధంగా తనమీద భారాన్ని పడేసినందుకు ఆండ్రూ చకితుడైనాడు. "అంకుల్, డబ్బును ఏ రూపంలో పెట్టుబడి పెట్టమంటావు?" అని అడిగాడు.

"అది నీకే బాగా తెలుసు" అని సమాధానం వచ్చినది. "అయితే దాన్ని యునైటెడ్ స్టేట్స్ బాండ్లకు వినియోగిస్తే నాకు మరికొంత ఎక్కువ సంతోషం. ఎందువల్ల నంటే ఇటువంటి ఘోరమైన ప్రమాదస్థితిలో ఉన్న సమయంలో కూడా ఇలా అనటం నేనా గణతంత్ర రాజ్యాంగం మీద ఎన్నడూ విశ్వాసాన్ని కోల్పోయినవాడిని కాకపోవటం వల్లనే."

అంకుల్ కోరినట్లుగా కార్నెగీ కొంతడబ్బును ప్రభుత్వపు బాండ్లలోను, మరికొంత తనతో సంబంధమున్న అనేక వ్యాపారాలలోనూ పెట్టుబడి పెట్టాడు. చివరకు అంకుల్ లాడర్ పెట్టుబడికి మూడురెట్ల ప్రతిఫలం వచ్చింది.

జార్జి, జూనియర్ ఇతరులతో ఎంతో ముక్తసరిగా మాట్లాడే స్వభావం గల స్కాచ్ యువకుడు. మంచి సమర్థుడయిన మెకానికల్ ఇంజినీరు. కెల్విన్ దగ్గర చదువుకున్నాడు. ఆండ్రూను అమెరికన్ వ్యాపారాన్ని గురించి, ఖనిజసంపదను గురించి అతడు అనేక ప్రశ్నలడిగాడు. అమెరికాను చూడాలనీ, అద్భుతమైన ఆ దేశంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనీ అతడికి నిగూఢమయిన అభిలాష వున్నదని ఆండ్రి గమనించాడు.

"జార్జ్, నీకున్న శిక్షణతో, శక్తితో నీ వక్కడ చాలా గొప్ప పనులు చేయవచ్చు!" అన్నాడతడు.

జార్జ్ అప్పుడు ఇదమిత్థమని ఏదీ నిర్ణయించి చెప్పలేదు. కానీ అతడు సకాలంలో కార్నెగీ ఉక్కు సామ్రాజ్యంలోని ఒక ప్రముఖపాత్ర వహించటానికి మహాసముద్రాన్ని దాటాడు.

# 7. భంగపడిన తీర్మానం

అల్టూనాలో వున్నప్పుడు కార్నెగీ ఒక రైల్ రోడ్ షాపులో తొలిసారిగా ఇనుప బ్రిడ్జీని చూశాడు. అది చిన్న పగుళ్ళమీదుగా పట్టాలను ఇవతలనుంచి అవతలికి తీసుకోపోవటం కోసం తయారు చేసింది. దీని నమూనాను కంపెనీ వారి ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తున్న హెచ్.జె. అన్విల్లి షాపుల్లోని యాంత్రికమేధావి జాన్‌యల్ పైపర్ సాయంతో నిర్మించాడు. వాళ్ళు ఇరువురూ కలిసి దానికి పేటెంటు తీసుకొన్నారు. పైపర్‌ను షాపుల్లోను, ఆఫీసులోను అందరూ "పైప్" అని వ్యవహరిస్తుంటారు. ఇతడు రైల్ రోడ్ కంపెనీవారికీ వంతెనలను నిర్మించి ఇస్తుంటాడు. ఇంత వరకూ ఇతడు తన పని నంతటినీ కొయ్యతోనే చేస్తుండేవాడు. బ్రిడ్జీలు ఆ దినాలలో కొయ్యవి కావటం వల్ల తరచు కాలిపోతుండేవి. వాటికీ, కొట్టుకొని పోతున్నవాటికీ, బదులుగా అతివేగంగా బ్రిడ్జీలను తయారుచేసి యివ్వడంలో ఎంతో పేరెక్కినవాడు, "ఒక ఇంజినీరింగ్ దళాన్నంతటినీ వేసేదానికంటె కాలిపోయిన బ్రిడ్జి దగ్గరకు నేను 'పైపు'ను పంపుతాను" అని అధ్యక్షుడు థామ్సన్" ఇతణ్ణి గురించి అన్నాడు.

ప్రస్తుతం 'పైప్' ఇనుప బ్రిడ్జిలు కావాలని పరవశుడై వాదిస్తూండేవాడు. "ఆండీ కొయ్యి వంతెనల కాలం అయిపోయిం" దని ఇతడు పదే పదే అంటుండేవాడు. ఇకనుంచి ఇనుపవి తప్ప మరేవీ ఉండవు. రాబొయ్యే ఇరవై సంవత్సరాలలో మొదటి తరగతి రైల్ రోడ్డుమీద కొయ్య వంతెన అంటూ ఉండదు. కాలిపోనివీ, ఏటి పొంగులకు కొట్టుకొని పోనివీ అయిన ఇనుప బ్రిడ్జిలను గురించి యోచించు."

అతడు, రైల్ రోడ్ కంపెనీ వారి బ్రిడ్జీల జనరల్ సూపర్వైజరు ఆరన్ స్థిఫ్లర్ – ఇద్దరూ 1862లో కంపెనీ ఉద్యోగాన్ని వదిలేసి, తామిరువురూ భాగస్వాములుగా వంతెనలను నిర్మించే ఒక కంపెనీని ప్రారంభించారు. అయితే వారికి వ్యాపారంలోని కిటుకులు తెలిసినవాళ్ళు, పెట్టుబడి పెట్టగలవాళ్ళు కావాలి. అన్విల్లి కార్నెగీలను కంపెనీలోకి తీసుకొన్నారు. వీరితో కార్నెగీ అయిదుగురు భాగస్వాములతో కీస్టోన్ బ్రిడ్జి కంపెనీని స్థాపించాడు. ఇందులో అయిదవ వాడు థామస్ యన్. స్కాట్. వీరు ప్రతివొక్కరూ పన్నెండు వందల యాభై డాలర్ల పెట్టుబడి పెట్టారు. ఆరువేల ఆరువందల

యాభై డాలర్ల పెట్టుబడితో ఒక బ్రిడ్జీలను నిర్మించే కంపెనీని ఆరంభం చెయ్యటం ఈ నాటి పారిశ్రామికుల బుద్ధికి పరిహాసాస్పదంగా కనిపించవచ్చు. అయితే అప్పుడు అన్నిటి ఖరీదులూ కొద్దిలో వుండేవి. వ్యాపారం కొద్దియెత్తున జరుగుతుండేది. చాలా సంస్థలు ఈ నాడు మనకు అతిస్వల్పమైన మొత్తంగా కనిపించే మూలధనంతో ఆరంభమయినవే. ఈ పెట్టుబడిదారులు అప్పుడప్పుడూ డబ్బు అప్పు పుచ్చుకోవలసి వస్తుండేది. కానీ వారు ఆ అప్పులను సకాలంలో తీర్చగలుగుతుండేవారు. ఎగుడుదిగుడుపని ఏమాత్రం ఉండకూడదనీ, నిర్మించే ప్రతి బ్రిడ్జిని చేతనయినంత కట్టుదిట్టంగా నిర్మించాలని వారివలె అందరూ స్థిరనిశ్చయులయినారు. వీరు సక్రమంగా నిర్మించిన బ్రిడ్జీలను గురించి మాటాడుకుంటుండేటప్పుడు థామస్ కార్లయిల్ నుంచి గ్రహించిన "ఆనెస్టుబ్రిడ్జి" (నమ్మకమయిన వంతెన) అన్న పదబంధాన్ని తరుచుగా ప్రయోగిస్తుండేవాళ్ళు.

పెన్సిల్వేనియా నుంచి పశ్చిమంగా తమ రైలు మార్గాన్ని విస్తృతం చేస్తున్నప్పుడు, ఒక రైల్ రోడ్ కంపెనీ వీరిని "పిట్స్ బర్గుకు పశ్చిమంగా వున్న స్ట్యూబెన్ విల్లి దగ్గర ఓహైయోనది మీద ఒక వొడ్డునుంచి మరొక ఒడ్డుకు మూడువందల అడుగుల మధ్య దూరంతో ఒక బ్రిడ్జిని తయారుచేసి ఇచ్చే పనికి పూనుకొంటారా'?' అని అడిగింది. ఇది ఈ కీస్టోన్ సంస్థకు తొలిరోజుల్లో వచ్చిన "సవాలు"ల్లో ఒకటి. అప్పటికి ఉక్కు ఇంకా అమెరికాలో తయారు కావటం లేదు. అంత ఎక్కువ 'మధ్యస్థదూరం'తో పోత ఇనుమును ఉపయోగించి రైల్ రోడ్డు బ్రిడ్జిని నిర్మించటమంటే ఎంతో గొప్ప సాహసికచర్య. అయినా వారు ఆ పనిని చేస్తామని అంగీకరించారు. రైల్ రోడ్ కంపెనీవారి ఉన్నతోద్యోగి నదిని దాటవలసిన ప్రదేశాన్ని పరిశీలించటానికని వచ్చి, అక్కడ పడవేసి వున్న పోత యినుము దూలాలను చూసి ఆశ్చర్యంతో అన్నాడు – "ఇవి ఓహియో నదిమీద వెళ్ళవలసిన బండ్లను మోయటం ఎలా వున్నా, తమ బరువును తాము మోసుకోగలవని నేను భావించటంలేదు."

కానీ అతడు పొరబడ్డాడు. దాన్ని తిరిగి కావాలని తీసివేసేటంతవరకూ ఆ వంతెన అనేకసంవత్సరాలు రైలు బండ్ల రాకపోకలను తట్టుకున్నది. ఏమైనా బ్రిడ్జీ కంపెనీ ఈ పనిచేసిన కొద్దికాలం తరువాతనుంచి, వంతెనలను నిర్మించటానికి దుక్క ఇనుమునే ఉపయోగించింది. మొదటి పైఅర్ధచంద్రకారాలకు (్రునీళిజీఖిరీ),తరువాత మిగిలిన మరి కొన్ని భాగాలకు, ఈ దుక్క ఇనుమును ఉపయోగించారు.

పెట్టుబడిదారులు, ఎంతో లాభం వస్తుందనుకున్నారు. కానీ ద్రవ్యోల్బణం రావటం వల్లను, యుద్ధసమయం కనుకను ఖరీదులు విరివిగా పెరిగిపోయినవి. వారి ఆదాయవ్యయా పట్టికలో తుది పంక్తిని ఎఱ్ఱ సిరాతో వ్రాయవలసి వచ్చింది.. అంటే ఏమీ మిగలలేదన్నమాట! ఈ పరిస్థితిని గమనించి పెన్సిల్వేనియాలోని అధ్యక్షుడు ఎర్గా థామ్‌సన్, తన సొంత బాధ్యతమీద, కీస్టోన్ కంపెనీకి నష్టం లేకుండా మరికొంత అదనంగా మంజూరు చేయించాడు. అతినిశితమయిన కృతజ్ఞతాదృష్టి గల కార్నెగీ, ఈ కారణం వల్లనే తరువాత పది సంవత్సరాలకు తాను ప్రారంభించిన మొదటి ఉక్కు కర్మాగారానికి మిస్టర్ థామ్సన్ పేరు పెట్టటం జరిగింది.

ఇరవైయో శతాబ్దపు పన్నురేట్లతో పోల్చి చూచుకుంటే దాని తరం చాలా తక్కువే అయినా, అంతర్యుద్ధం తెచ్చిపెట్టిన రాబడి పన్నుపోను 1863లో ఆండ్రూ కార్నెగీ ఆదాయ పట్టిక 47,86,067 డాలర్లు అతని రాబడి అయినట్లు చూపించింది. ఈ మొత్తం ఆశ్చర్యకరమైంది. అందులో ఇది ఇరవై ఏడేళ్ళ యువకుడి ఆదాయం కావటం ఎంతో విశిష్టమైన విషయం. ఇందులో అతనికి డివిషన్ సూపరింటెండెంటుగా వచ్చిన జీతం ఇరవై నాలుగు వందల డాలర్లు మాత్రమే. ఇందులో ఎక్కువ భాగాన్ని అతనికి నూనెమీది పెట్టుబడి తెచ్చిపెట్టింది. అతని స్లీపింగు కార్, కీస్టోన్, ఆడమ్స్ ఎక్స్‌ప్రెస్ మొదలైన పెట్టుబడులు కూడా తగినంత రాబడిని ఇచ్చాయి. మిగిలిన ఆదాయం అతనికి ఇతరమైన పెట్టుబడులవల్ల వచ్చింది. అతడు నిజంగా "రూపొందుతున్న స్కాచ్‌వాడు" అయినాడు. ఆ నాటి ఇతని తైలవర్ణచిత్రం పదకొండు సంవత్సరాలకు పూర్వం తీసిన ఛాయాచిత్రపటంలో వలె అదే నిగనిగ గల శాంతమైన ముఖాన్ని ప్రదర్శిస్తున్నది. అతని జుట్టు కొంచెంగా నల్లబడ్డది. సొగసైన చిన్ని గడ్డం చేకూరింది.

అతని ఆదాయంలో మరొక పద్దు నలభై రెండు వందల యాభై డాలర్లు "క్లోమన్" నుంచి వచ్చింది. ఇది కార్నెగీ ధనసంపత్తిని పెంపొందించిన మరొక వ్యాపారసంస్థ. ఈ సంస్థలోనుంచి వచ్చిన ఆదాయం అతడు తమ్ముడికోసం పెట్టుబడి పెట్టినదాని మీద వచ్చినది.

ఆండ్రూ క్లోమన్ శక్తిమంతుడు. కానీ సుస్థిరచిత్తం కలవాడు. కొంచెం తగాదా మారివాడు. మంచి జర్మన్ మెకానిక్. క్లోమన్‌కు అలిఘనీలో ఒక ఫౌండరీ వుంది, ఇతని ఇరుసులకు ఎంతో ప్రఖ్యాతి వచ్చింది. యుద్ధం ప్రారంభం కావటం చేత ప్రభుత్వం ఇతడికి చాలా ఆర్డర్లిచ్చింది. అయితే ఇతడికి తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకొనేటందుకు తగిన వస్తు సంపత్తి, ధనసంపత్తి లేవు.

టామ్ మిల్లర్ ఇతనికి తోడయినాడు. ఇరువురూ కలిసి చిన్ని కార్పొరేషనును స్థాపించారు.

కార్నెగీతో "ఆండీ! నిన్ను కూడా ఇందులోకి తీసుకు రావాలని నా కోరిక. కాని క్లోమన్ దీనిని భగ్నం చేశాడు. అతడికి నీవంటే భయం. నీవు ఇందులో చేరితే మొత్తం నీ పరం చేసుకొంటావనీ, లేదా నీ పరం చేసుకోవటానికి ప్రయత్నంచేస్తావనీ అతని అభిప్రాయం" అన్నాడు మిల్లర్.

ఆ పరిహాసాంశాన్ని గురించి వాళ్ళు నవ్వుకున్నారు. అప్పుడు వాళ్ళిరువురూ ఎంత త్వరలో ఆండీ ఇనుము వ్యాపారంలో ప్రవేశించనున్నాడో అణుమాత్ర మయినా ఊహించలేదు.

యుద్ధశాఖ ఇరుసులకు, ఫిరంగి బండ్లకు విపరీతంగా ఆర్డర్లిస్తున్నది. వీటికే హెన్రీ కాకుండా ఇతరమయిన వాటికి కూడా ఆర్డర్లు ఊరికే వచ్చిపడుతున్నవి. ఒకరోజున ఫీప్స్ – (జాన్‌కు చిన్న తమ్ముడు. ఇతడు తరువాత కొద్ది సంవత్సరాలకు చనిపోయాడు) ఆశపడుతూ "నాకు ఇనుము వ్యాపారంలో ప్రవేశించాలని వుంది. అయితే ఎలా సాధ్యమౌతుందో బోధపడటం లేదు" అన్నాడు.

టామ్ సొగసుగా మీసాలు గుంజుకుంటూ కొద్దిసేపు ఆలోచించాడు. అతనికి హెన్రీ, ఇంకా సరైన వయసు చేకూరనినాడు. ఒకరోజు "నాకు ఒక క్వార్టరు బదులు ఇస్తావా?" అని అన్ననడిగి తెచ్చుకొని, సొంత వ్యాపారాన్ని ఎలా ప్రారంభించుకున్నాడో స్మృతికి వచ్చింది. అన్న ప్రశ్నార్థకంగా తనను చూచినప్పుడు హెన్రీ "ఇది అత్యవసరమయినది" అన్నాడు.

జాన్ ఆ క్వార్టరును సందేహించకుండా ఇచ్చాడు.

మర్నాడు 'డిస్పాచ్' పత్రికలో 'కావలెను' అన్న ప్రకటన కనిపించిది. "ఉత్సాహ వంతుడయిన కుర్రవాడు ఏదైనా పని కోరుతున్నారు" ఏ మాత్రం దాపరికం లేని ఈ చిన్న ప్రకటనకు ఒక వ్యాపారసంస్థ సమాధానమిచ్చింది.

అది అతనికి 'ఎర్రండ్ బాయ్'గా ఉద్యోగమిచ్చింది. తల్లిదండ్రులు ఒప్పుదలతో అతడు బడి విడిచిపెట్టి ఆ పనిలో చేరాడు. ఆనాటినుంచి అతడు ఒక్కరోజును కూడా వృధాగా పోనివ్వలేదు. ప్రస్తుతం అతడు ఒక పౌడరు కంపెనీకి బుక్‌కీపరుగా పనిచేస్తున్నాడు. ఒకమాటు "వయసు ఇరవయి సంవత్సరాలు, నేను ఇంకా ఎందులోనూ ప్రవేశించలే" దన్నాడు, జీవితమంతా భగ్నమయిన ఒక వృద్ధుడిలా ఆవరించిన నిరాశతో.

టామ్ మిల్లర్ మళ్ళీ ఒక మాటు పరికించాడు. హెన్రీని అతడు బాల్యం నుంచి చూస్తూనే వున్నాడు. మంచి తేజస్సు, ప్రతిభ న్యాయతత్పరతగల యువకుడుగా తోచాడతనికి. పైగా అతడు తనకు బహుకాల ప్రియమిత్రుడయిన జాన్‌కు సోదరుడు.

"పెట్టుబడికి నీ దగ్గర డబ్బు ఏమయినా వుందా?" అని అడిగాడతను.

"లేదు" అన్నాడు హెన్రీ. "అప్పుడప్పుడు కొద్ది కొద్దిగా జీతంలోనుంచి మిగుల్చుకొన్నాను. కానీ ఆ మొత్తాన్నీ నా కుద్యోగమిచ్చిన వాడి వ్యాపారంలో పెట్టుబడి పెట్టాను."

"క్లోమన్ అండ్ కంపెనీలో ప్రవేశించటం నీ కిష్టమేనా?"

"నా చేతిలో విడిగా డబ్బున్నట్లయితే తప్పక ప్రవేశిస్తాను. కానీ లే"దని నిరాశతో చేయి చాచాడు.

"నేను నీకు కొద్దిగా అప్పిస్తాను" అన్నాడు మిల్లర్. "ఆ వ్యాపారస్థితి ప్రస్తుత మిలా వుంది. ఎనిమిది వేల డాలర్ల మూలధనంతో మా సంస్థ స్థాపితమైంది. అయితే దాన్ని అంతా చెల్లించలేదు. వ్యాపారపు టవసరాలు పెరుగుతున్న కొద్దీ దఫాలవారీగా చెల్లించవలెనని చార్టరులో వుంది. కంపెనీ కొత్త యంత్రాలకోసం కొంత ఖర్చు పెట్టవలసి వుంది. నా దగ్గర డబ్బు విశేషంగా లేదు. కొద్ది వందలతో నిన్ను అందులో ప్రవేశపెట్టిస్తాను."

హెన్రీ కృతజ్ఞతాపూర్వకంగా ఈ మేలుకు అంగీకరించాడు వృద్ధిపొందుతూ. నిశ్చయంగా లాభాలొచ్చే వ్యాపారంలో తనకోసం పెట్టుబడి పెట్టుకోవడానికి వినియోగించుకోకుండా, దయాళువయిన టామ్ తన దగ్గరవున్న పదహారు వందల డాలర్లలో ఫిప్స్‌కు ఎనిమిది వందల డాలర్లు, విలియం అలెగ్జాండర్‌కు ఎనిమిది వందల డాలర్లు అప్పిచ్చాడు. విలియం, అలెగ్జాండర్ ఇద్దరూ ఒకనాటి "బాటమ్ హూషియర్లు." బాల్యం నుంచి అంత సన్నిహితమయిన అనుబంధం వుండి, ఒకరియెడ మరొకరికి అంత శ్రద్ధాసక్తులు గల యువకవర్గాన్ని మరొకచోట చూడటం చాలా కష్టం.

గణకుడుగా వుండే యువ ఫిప్స్ క్లోమన్ అండ్ కంపెనీలో ప్రవేశించాడు. పౌడర్ కంపెనీలో పగలంతా పనిచేసిన తరువాత, కొద్దిగా భోజనం చేసి క్లోమను కార్యాలయానికి పరిగెత్తి సాయంత్రం ప్రొద్దుపోయేదాకా పుస్తకాలో గడిపేవాడు. అతడు ఆ ఆఫీసుకు వెళ్ళేటప్పుడు, అతని సమవయస్కుడయిన టామ్ కార్నెగీ అతనివెంట

నిత్యం తప్పనిసరిగా వెడుతుండేవాడు. వారు డేవిడ్, జోనాథన్‌లలా అన్యోన్యం అతిసన్నిహితులు. కొన్నినెలలయిన తరువాత క్లోమను కంపెనీకి మరికొంత డబ్బు కావలసివస్తే తమ్ముడి పేరుతో ఆండ్రూ కార్నెగీ ఆ డబ్బు నిచ్చాడు. అందువల్ల అతడు ఆ సంస్థలో భాగస్థుడైనాడు. అతిశీఘ్రకోపి, అనుమానగ్రస్తుడు అయిన క్లోమన్ కలతలు పెట్టే ధోరణిలోనే ఉంటూ వచ్చాడు. ఎవరో తన్ను మోసగించటానికి యత్నిస్తున్నారన్న భయంతో, దీనికి తరువాత కొద్ది కాలంలోనే అతడు అందరికీ చెందే ఒక తగాదాను పట్టుకొచ్చాడు. థామస్ యన్. మిల్లర్ తన ఇనుము సంస్థలో భాగస్థుడు కాదని పత్రికల్లో ఒక ప్రకటన చేశాడు. దాంతో విసుగువచ్చి మిల్లర్ ఆ కంపెనీలోని తన షేర్లను అమ్మేశాడు.

"టామ్, మనం సొంతంగానే ఒక రోలింగ్ మిల్లును ఆరంభిద్దా" మన్నాడు ఆండ్రూ కార్నెగీ. "అది మన బ్రిడ్జి కంపెనీకి, ఇతర సంస్థలకు కావలసిన ఇనప సామాన్లను తయారుచేస్తుంది."

"అయితే మనం, మీ తమ్ముడు టామ్ కంపెనీతో పోటీ చేయటమౌతుందేమో?" అని అభ్యంతరం చెప్పాడు. "మిల్లర్. ఇరువురికీ చాలినంత వ్యాపారముంది. వాళ్ళిప్పుడు యుద్ధపు కాంట్రాక్టుల పని చూస్తున్నారు. మనం విశేషంగా బ్రిడ్జీలకోసం కృషి చేద్దాం" అన్నాడు ఆండ్రూ.

అందువల్ల 1864లో సైక్లోప్స్ ఐరన్ వర్క్స్ ఆరంభింపబడ్డది. క్లోమనుకు నిజంగా తీవ్రకోపం వచ్చింది. అయితే ఆ కోపాన్ని దిగమ్రింగుకోవలసి వచ్చింది. యుద్ధం చివరి దశకు వచ్చింది. సైన్యానికి సంబంధించిన ఆర్డర్లు సన్నగిల్లిపోవటమే కాకుండా, చిన్నవైపోతున్నవి. కొద్దికాలం గడిచాక అతని భాగస్థులు తమ కంపెనీ సైక్లోప్స్‌తో అంతర్లీనం చేద్దామని సూచించారు. మార్పులు, అభివృద్ధులు తలకెక్కేటంత వేగంగా వచ్చేస్తున్నవి. అందుచేత తన కిష్టమున్నా, లేకపోయినా, యూనియన్ ఐరన్ వర్క్స్ అన్న క్రొత్త కంపెనీ డైరెక్టర్ల బల్లముందు టామ్ మిల్లర్, ఆండ్రూ కార్నెగీలతో పాటు అతడు కూర్చోవలసి వచ్చింది.

"టామ్, నీవు చింతించేటంతగా నీకు అపచారం జరిగింది. అయితే ఇప్పుడు నీవే విజేతవైనావు" అన్నాడు ఆండ్రూ కార్నెగీ.

కర్మాగారాలను రెంటినీ కలిపి వేయలేదు. రెండు విడివిడిగా కూతపెట్టి అతివేగంగా పనిచేస్తున్నవి.

యుద్ధపు చివరిదశలోఅతని రైల్ రోడ్ వుద్యోగం పై అధికారులయిన థామ్సన్, స్కాట్‌ల అభిలాషకు భిన్నంగా అంతమొందింది. ఆండ్రూ మార్చి 28, 1865లో రాజీనామా లేఖను అందజేశాడు. ఎవరి మధ్య పనిచేసి తానెవరి అనురాగాన్ని అనుభవించాడో, ఆ పిట్స్‌బర్గు డివిజనులోని వ్యక్తులను ప్రశంసిస్తూ ఒక వీడ్కోలు లేఖ వ్రాశాడు. వారు వీడ్కోలు వేళ అనురాగపూర్వకంగా ఒక అందమైన గడియారాన్ని బహూకరించారు. మరొక అలిఘనీ పూర్వబాలురలలో వాడు బాబ్ పిట్కైరన్, అతని తరువాత ఆ స్థానానికి అధిపతిగా వచ్చాడు. ఏవో డజను ఇతరమైన పనులు తాము అలవోకగా చేసినట్లే, కార్నెగీ మిల్లర్లు ఇద్దరూ కొద్ది యెత్తున పిట్స్‌బర్గులో లోకొమోటివ్ వర్క్సును స్థాపించారు. అది వీలునుబట్టి మధ్య మధ్య ఒక ఇంజినును తయారు చేస్తున్నది. ఇంతకు పూర్వసంవత్సరం కార్నెగీ, అతని ఇరుగు పొరుగైన విలియం కోలిమన్ సరిహద్దు దాటి, ఓహైయోలో ప్రవేశించి మరికొంత పెట్రోలియం నూనెభూమిని కొన్నారు. ఇది చాలా ఫలప్రదమైనది. దీనిమూలంగా క్రొత్త పెట్టుబడులకు ఎంతో ధనం చేకూరింది. తొలిసారిగా, రెండు మహాసముద్రాలను రైలు మార్గాల ద్వారా కలిపి వేయటానికి, పచ్చిక మైదానం, పర్వతశ్రేణిగుండా మార్గాన్ని వేస్తున్న పసిఫిక్ యూనియన్ రైల్ రోడ్ కంపెనీలో స్టాక్‌ను కొన్నది. ఇందువల్ల లభ్యమైన ధనం వల్లనే 1867 ఆరంభంలో సెయింట్ లూయీ వద్ద మిసిసిపీ నదిమీద మూడు ఆర్చీలు గల సుప్రసిద్ధమైన వంతెన పనిని కీస్టోన్ బ్రిడ్జి కంపెనీ ఆరంభం చేసింది. దానికి నమూనాను తయారు చేసింది. కెప్టెన్ బి. జేమ్స్ ఈడ్స్. అయినా కీస్టోన్ కంపెనీవారి మిస్టర్ లిన్విల్లీ కొన్ని మార్పులు చేశాడు. తరువాతి శతాబ్దంలో మూడుపాళ్ళు గడిచిన తరువాత కూడా, ఆ ఇనుపబ్రిడ్జి విస్తారంగా పెరిగిపోయిన రైలు బండ్ల రాకపోకల బరువును, ఆ మార్గానికి సంబంధించిన రాకపోకల భారాన్ని భరిస్తున్నది.

ఈ సమయంలో, రచయిత బేయర్డ్ టైలర్ యూరప్‌లో కాలినడకన చేసిన ప్రయాణాలను అభివర్ణించే "వ్యూస్ ఎఫూట్" అన్న పుస్తకం హోమ్‌వుడ్‌లలో ఎక్కువ ప్రీతిపాత్రమయిన గ్రంథంగా ఉంటుండేది. కార్నెగీ తీవ్రంగా దేశాటనం చేసినవాడు. ఎన్నో దృశ్యాలను దర్శించినవాడు. చరిత్ర, భూగోళవిజ్ఞానాలంటే ఆసక్తి గలవాడు. టైలర్ వంటి అనుభవాలు తనకు కూడా లభించాలని కుతూహలపడ్డాడు. ఒక రోజున జూన్ వాన్ డివోర్టుతో "ఇప్పటి నుంచి నీవు మూడువందల డాలర్లను కూడబెట్టుకొని నాతో పాటు యూరప్‌లో పాదయాత్ర చేయటానికి ఖర్చు చేస్తావా?" అన్నాడు ఆండీ. బాతు ఈదుతుందా? షాప్‌వాడు వుర్లగడ్డలు తింటాడా?

అప్పుడు నూనె షేర్ల విలువ రాకెట్‌లా పైకిపోతున్నది. జాన్ సలహామీద కార్నెగీ 'బ్లాక్ గోల్డు'లో పెట్టుబడి పెట్టాడు. అది అతివేగంగా ఎంతో డబ్బునిచ్చింది. వీళ్ళిద్దరూ హారీఫిప్స్‌ను ఆహ్వానించారు. అతనికిప్పుడు వీళ్ళతో వెంట వచ్చేందుకు కావలసిన డబ్బున్నది. వసంతారంభంలో స్టీమరెక్కారు.

సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ, కార్నెగీ మధ్య మధ్య దీర్ఘమైన సెలవులు పుచ్చుకుంటూ, ధనాన్ని పెంపొందించుకుంటూ, పెద్ద పారిశ్రామిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటూ ఉన్నాడు. పెట్టిన సెలవులను విశేషంగా దేశాటనతో గడిపి జీవిస్తున్నాడు. అతడు రచనల్లో, ప్రసంగాలలో, “చేసే చేతల్లో తన జీవితానికే కాదు, ఏ మానవుని జీవితానికైనా ప్రధానలక్ష్యం ఇనుము, లేదా ఉక్కు, లేదా మరొకటి ఏదైనా వుత్పత్తి చేయటం కాదు. సమగ్రమైన బుద్ధివికాసాన్ని, ఉత్తమశీలాన్ని సంపాదించటం, మానవజాతి సంక్షేమం కోసం తన సంపదను వినియోగించటం” అని స్పష్టం చేశాడు.

దేశంలో వున్నప్పుడు కష్టపడి, సత్యసంధతతో పని చేశాడు. అయితే అతడికి మరణపర్యంతం పని చేయాలన్న ఉద్దేశ్యం లేదు. కొద్ది జీతంకోసం వారానికి ఆరు రోజులు కొన్ని సందర్భాల్లో ఏడు రోజులు గంటలతరబడి తాను శ్రమపడటాన్ని అతడెన్నడూ మరిచిపోలేదు. ఇప్పుడాతడు తన ఆత్మకు పుష్టిని చేకూర్చుకోవడానికి పూనుకున్నాడు. వాళ్ళమీద విడిచిపెట్టి ఎక్కడకయినా తాను నెలల తరబడి వెళ్ళినా సామర్థ్యంతోను, సత్యసంధతతోను వ్యాపారాన్ని నడిపించగల ఉద్యోగివర్గం అతనికుంది. అట్టిది తనకు చేకూరిందని తన్ను గురించి తానెప్పుడూ గర్విస్తుండేవాడు. తనకు సహచరులుగా స్వీకరింపదగ్గ శక్తి విశ్వాసపాత్రత గల వ్యక్తులు చాలామంది తన బంధువర్గంలోను, బాల్యస్నేహితులలోను ఉండటమనేది, నిజంగా అతని అదృష్టం. అతడు వ్యాపారధోరణులు భవిష్యత్తులో ఎలా వుండబోయేది, వర్తమానంలో ఎలా నడుస్తున్నదీ గమనించటం ఎన్నడూ మానివేయలేదు.

ఫిప్స్‌కు బంధువయిన జాన్ ఫ్రాంక్స్, లివర్ పూల్ వద్ద ఈ ముగ్గురు యాత్రికులను కలుసుకొని, ఆ యాత్రికబృందంలో చేరుకున్నాడు. నిత్యమైన యువకోత్సాహంతో తరువాత ఈ యాత్రికచతుష్టయం ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ హంగేరీ, స్విట్జర్ లాండు, ఇటలీలలో పర్యటన చేశారు. ధరలు పెరిగిపోతుండటం, వెర్రిగా ఆర్డర్లు వచ్చి పడుతుండటం, కర్మాగారాలు రెండు అంచెలతో పనిచెయ్యటం, మొదలయిన

విషయాలతో స్వదేశం నుంచి, ఇంటిదగ్గనుంచి అతనికి వచ్చే వార్తలు ఎల్లవేళలో మంచివిగా వుంటుండేవి. యుద్ధానంతరోల్బణం పరిపూర్ణంగా వుంది. ప్రాచీనము, అధునాతనమూ అయిన చరిత్రను నిర్మించిన ప్రదేశాలలో పర్యటించటం, మంచి సంగీతాన్ని వినటం, కళాత్మకవస్తు ప్రదర్శనశాలను, మతవిషయక మహానిర్మాణాలను, దుర్గాలను సందర్శించటం అతడు సంతృప్తితో చేశాడు. వెనిస్ నగరంలోని డోజస్ రాజసౌధం, మధ్యయుగ మందలి వెనిటియన్ ప్రజారాజ్యంలోని ప్రముఖ న్యాయాధిపతులు, అతనిలో నిక్షిప్తమయి వున్న సాహిత్యశక్తిని మేల్కొల్పటం జరిగింది. పెద్ద అంతర్మందిరంలో వున్నప్పుడు అతడు తన సహచరులను ముగ్గురినీ పూర్వం పాలకవర్గసభ్యులయిన మహోద్యోగులు వాళ్ళను డోజస్ సింహాసనంలో ఫ్రాంక్సు అనేవారు కూర్చున్న మహాసనాల మీద కూర్చుండబెట్టి వారి ముందు నిలవబడి

'Most Potent, grave and renvered signiors-
My very noble and approved goodmasters'

(అతిశక్తిమంతులు, గంభీరులు, గౌరవనీయులయిన ప్రముఖులారా! ఘనత వహించిన ఉదారులయిన, ఉదాత్తులయిన నా యజమానులారా! అంటూ ఆరంభించి ఒథెల్లో చేసిన నివేదనాత్మ కోపన్యాసాన్ని) ఉదాత్తమైన అభినయభంగిమతో వినిపించాడు. యూరపులో ఎక్కడికి వెళ్ళినా అతడు అక్కడి వ్యాపారాలను, పరిశ్రమలను, రవాణారీతులను, పరిశీలించడం మరచిపోలేదు. అందువల్ల ఈ యాత్ర అతనికి వ్యాపారాత్మకదృష్టితో చూసినా ప్రయోజనకారి అయింది. అతడు క్రమంగా పసిఫిక్ సముద్రతీరం వంకకు త్రోసుకొని వస్తున్న యూనియన్ పసిఫిక్ రైలు రోడ్డును గురించి కూడా మరచిపోలేదు. అతడు స్కాట్‌కు వ్రాశాడు. "సెంట్రల్ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ – ది వూడ్రఫ్ స్లీపర్ కంపెనీ – యూనియన్ పసిఫిక్ కంపెనీ దగ్గరనుంచి స్లీపింగ్ కార్ల కాంట్రాక్టను పొందకూడదా?" అని రోమునుంచి వ్రాశాడు. స్కాట్ సమాధానాన్నిస్తూ యువకుడా! నీవు సమయ మేదో బహుచక్కగా ఊహిస్తావు ప్రతిస్పర్ధుల ఊహలను సమయానికి కనిపెడతావు" అని అన్నాడు. వూడ్రఫ్‌ల కార్లను పోలిన స్లీపింగ్ కార్లకు జార్జి. ఎమ్ పుల్మన్ పేటెంటు పుచ్చుకున్నాడు. అటువంటి పేటెంటు హక్కు అతనికి ఎలా లభ్యమైందని ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. అయితే పేటెంటు కార్యాలయం వారి వర్తన ఊహాతీతంగా వుంటుంది. పుల్మన్ కూడా యూనియన్ పసిఫిక్ కాంట్రాక్టుల కోసం యత్నిస్తున్నాడు. కానీ రైల్ రోడ్ కార్యవర్గం వారు మరి రెండు సంవత్సరాలవరకూ ఈ విషయాన్ని నిర్ణయించటం వాయిదా వేశారు.

తమ్ముడు టామ్ అయిదుగురు అందగత్తె లయిన సోదరీమణులలో ఒకతెను, లూసీ కోల్మన్‌ను, వివాహం చేసుకోవలసి వుంది. "నీవు ఎక్కడ నివసించదలచుకున్నావో నిశ్చయించుకొన్నావా?" అని యాత్రనుంచి తిరిగి వచ్చిన తరువాత అతడు, తమ్ముణ్ణి ప్రశ్నించాడు.

"లేదు" అన్నాడు టామ్.

"ఈ ఇంటిని నీవు పుచ్చుకోవటంలో నీ అభిప్రాయమేమిటి?"

అప్పుడు వాళ్ళు హోమ్‌వుడ్‌లోని ఇంట్లో ఉదయభోజనం చేస్తూ భోజనశాలలో వున్నారు.

"ఈ అభిప్రాయం లూసీకి నచ్చితే ఈ ఇల్లు నా కెంతో బాగుంటుంది" అన్నాడు టామ్. "కానీ నీవు ఎక్కడికి వెళ్లుతావు? న్యూ యార్క్‌కు వెళ్లుదామన్న ఉద్దేశించి ఇంకా నీలో ఊగిసలాడుతున్నదా?"

"ఔను. అది చేయదగ్గ పని. కడచిన కొన్ని సంవత్సరాలల్లో ఎన్నో పర్యాయాలు నేను అక్కడికి వెళ్ళి రావటం నీవు గమనించావు గదా? గ్రేట్ బ్రిటన్‌కు లండన్ ఎలా కేంద్రమో, యునైటెడ్ స్టేట్సుకు న్యూ యార్క్ అలా సమస్తానికీ కేంద్రం కాబోతున్నది. అక్కడి బ్యాంకర్లు ముఖ్యంగా ఆంగ్లేయ కంపెనీలతో సెక్యూరిటీల విషయంలో దౌత్యాలు నడపమని తరచుగా నన్ను అడుగుతున్నారు. అందు మూలంగా నాకు మంచి కమీషన్లు వస్తాయి. అమ్మా, నేనూ ఇక్కడికి తరుచుగా వస్తూ పోతూ వుంటాము."

"అయితే, ఆమె కూడా నీతోబాటు వస్తుందన్నమాట!" అన్నాడు టామ్.

"ఔను" అన్నది వాళ్ళ తల్లి. "ఇటువంటిది రానున్నదని నేను ఊహిస్తూనే ఉన్నాను గాని రాత్రే ఆండీ ఈ వార్త నాకు చెప్పాడు. హోమ్ వుడ్‌ను విడిచిపెట్టి వెళ్ళటం నాకిష్టం లేదు. కానీ అతని క్షేమానికి వుపకరిస్తే విడిచిపెట్టి వెళ్ళటం నాకిష్టమే."

"నీవు టామ్, హారీ ఫిప్స్‌ల వంటి భాగస్థులు – మిస్టర్ కొలమన్, ఫైప్, క్లోమన్‌లను గురించి చెప్పవలసిన పనిలేదు. ఉండటంచేత ఇక్కడ ఇక నాతో అవసరం లేదు. అయినా ఇక్కడి విషయాలు ఎలా నడుస్తుంటవో నేను కనిపెట్టే వుంటాను" అని అతడు సంభాషణను కొనసాగించాడు. ఇరవయ్యో పడిలోనే ఉన్నా ఆత్మశక్తితో సమర్థతతో కర్మాగారాలను నడిపించే నేర్పుగలిగి వ్యాపారమేధావి అని నిరూపించుకున్నప్పటికీ, టామ్ ఆ విషయాన్ని నవ్వి వదలివేశాడు.

లూసీకి, టామ్‌కు వివాహమయింది. అది చాలా సంతోషప్రదమయిన వివాహంగా పరిణమించింది. వాళ్ళు హోమ్‌వుడ్ గృహాన్ని తీసుకొన్నారు. ఆండ్రూ, అతని తల్లి న్యూ యార్కుకు వెళ్ళారు.

న్యూ యార్క్ మహానగరంలో కెల్లా పెద్దది అందమైన అయిన సెయింట్ నికొలాస్ హోటలులో ఒక వరుస తీసుకొన్నారు. మార్గరెట్ కార్నెగీ నూతన జీవితరీతికి యథాక్రమంగా అలవాటు పడ్డది. ఆ జీవనరీతిమీద పెద్ద ప్రీతిని ప్రదర్శింపకపోయినా, తృప్తితో వుండటానికి నిశ్చయించుకుంది. విశ్రాంతి కోసం ఆమె మొదటి రాత్రి ఘనంగా అమర్చిన శయ్యమీద వెన్ను వాలుస్తున్నప్పుడు, ఇరవై సంవత్సరాలకు పూర్వం ఒక పేద నేతపనివాడు భార్యను, తన ఇద్దరు చిన్న కుర్రవాళ్ళను తీసుకొని అప్పుచేసిన డబ్బుతో అమెరికాకు వలసవచ్చి, చుట్టూ వున్న అద్భుతాలను వెర్రిగా చూస్తూ న్యూ యార్క్ నగరవీథుల్లో తిరిగిన దృశ్యం ఆమెకు తప్పక జ్ఞప్తికి వచ్చి ఉంటుంది.

ఆండ్రూ కార్నెగీ వ్యాపారం తన దగ్గరకు వస్తుందని తన న్యూ యార్క్ కార్యాలయంలో కూర్చోలేదు. వెంటనే అతడు అక్కడి మిసిసిపీ నదిమీద వంతెనలను నిర్మించేటందుకు కాంట్రాక్టులను సంపాదించటం కోసం కెయెకుక్, ఆయోవాలకు పరుగెత్తాడు. కీస్టోన్ బ్రిడ్జిలను నిర్మించటంలో పోత ఇనుముకు బదులుగా దుక్క ఇనుమును వాడుతున్నదన్న వాదం చేసి, డుబుక్యూ అనే ప్రదేశంలో ఆ మహానది మీదనే జరుగుతున్న నిర్మాణానికి ఒక బ్రిడ్జిని అమ్మటం కోసం, తరువాతి సంవత్సరంలో అతడు మరొకమారు మిడ్వెస్టుకు వెళ్ళాడు.

1868 ముగియబోతున్నప్పుడు తన రాబడిని కూడుకోటం కోసం కూర్చున్న సమయంలో, అది 56,110 డాలర్లు అయినట్లు అతడు గమనించాడు. కుర్చీలో వెనక్కు వాలి  కలాన్ని త్రిప్పుతూ, దృష్టిని కొద్దిక్షణాలు గోడమీద నిలిపి, మనస్సులో కొంత కాలంనుంచి క్రమక్రమంగా ఘనీభవిస్తున్న ఒక తీర్మానాన్ని కాగితంమీద పెట్టటం కోసం నిర్ణయం చేశాడు. మళ్ళా ముందుకు వ్రాలి ఒక విశిష్టమై విజ్ఞాపికనిలా వ్రాసుకొన్నాడు.

సెయింట్ నికలాస్ హోటల్, న్యూ యార్క్

డిసెంబర్, 1868

“ముప్పది మూడేళ్ళ వయసు! రాబడి సంవత్సరానికి 50,000 డాలర్లు!! రెండేళ్ళకు, సరిగా ఈ సమయానికి, సంవత్సరానికి 50,000 డాలర్లకు తగ్గకుండా

నా వ్యాపారాన్నంతటినీ చక్కదిద్దుకుంటాను. ఇంతకుమించి సంపాదన చెయ్యను. ప్రతి సంవత్సరం అదనంగా వచ్చినదాని నంతటినీ ధర్మకార్యాలకు వినియోగిస్తాను. ఇతరులకోసం తప్ప వ్యాపారాన్ని పూర్తిగా పరిత్యజిస్తాను.

"ఆక్స్‌పర్డ్‌లో నివాస మేర్పరచుకొని ఉత్తమ సాహిత్యవేత్తలతో పరిచయం కలిగించుకొని, విద్యను పూర్ణంగా ఆర్జిస్తాను. ఇందుకు మూడు సంవత్సరాల తీవ్రకృషి అవసరం. ప్రజల ఎదుట నిల్చి ఉపన్యాసాలిచ్చే విషయాన్ని గురించి ప్రత్యేకశ్రద్ధ వహిస్తాను. తరువాత లండన్ నగరంలో నివాస మేర్పరచుకొని ఒక వార్తాపత్రికనో, సమీక్షాపత్రికనో పెట్టుబడి పెట్టుకొని, ప్రజావ్యవహారాలలో ముఖ్యంగా దరిద్రజన విద్యాభివృద్ధులకు సంబంధించిన వాటిల్లో పాల్గొంటూ, దాని జనరల్ మేనేజిమెంటు మీద శ్రద్ధ వహిస్తాను.

"మానవుడికి ఆదర్శం అంటూ ఒకటి వుండాలి. ధననిధులను ప్రోగు చేయటం కంటే నీచమైన ప్రతిమారాధనం మరొకటి లేదు. ధనపూజ కంటే నైచ్యాన్ని కల్పించే ఆరాధన మరొకటి లేదు. చేపట్టిన ప్రతి వ్యవహారంలో నేను అతిఘనంగా చొచ్చుకుపోవాలి. తన వర్తనలవల్ల ఉన్నతికి తీసుకుపొయ్యే జీవితాన్నే నేను ఎన్నుకోవాలి. అనతికాలంలోనే ఎక్కువ డబ్బును సంపాదించే మార్గాల నన్నింటినీ అన్వేషించటంలోనే బుద్ధి నంతటినీ వినియోగిస్తూ, మరింత కాలాన్ని వెచ్చించడమనేది నిత్యమూ త్రిప్పుకోవటమంటూ లేని రీతిగా నన్ను పడవేసి తీరుతుంది. ముప్పది ఐదవ యేట వ్యాపారాన్ని పూర్తిగా విరమిస్తాను. రానున్న రెండు సంవత్సరాల్లో శిక్షణను పొందుతూ, క్రమపద్ధతిలో గ్రంథపఠనం చేస్తాను."

రెండు సంవత్సరాల్లో కాదుగదా, జీవితంలో ఎపుడైనా సరే, వ్యాపారిక సమ్మోహనాలనుంచి తప్పించుకోవటం ఎంత కష్టమో అతడు ఆ సమయంలో కొంచెమైనా ఊహించలేదు. అతడు వ్యాపారానికి స్వస్తి చెప్పేందుకు ఇరవై ఏళ్ళు పట్టింది. అయినా ధనసంపాదన కంటే సంస్కృతి మీదనే విశేషాభిమానాన్ని వెలిబుచ్చే ఈ ప్రకటన, నిజానికి సంపద దాన్ని ఆర్జించిన ధనాధిపతిది కాదు, ప్రజాసంక్షేమం కోసం అతని పరంగా వున్న ట్రస్టు. తన ధనాన్ని గురించి అలాగే భావించాలి అన్న ధోరణితో అతడు తరువాతి కాలంలో చేసిన బోధల్లో, ఎంతటి మనఃపూర్వకత ఉందో అంతటి మనఃపూర్వకతనూ ప్రదర్శిస్తున్నది. మనుష్య ద్వేషులు కొందరిందులో ప్రకటితమైన తత్త్వాన్ని మోసకారితనమని అపహాస్యం చేశారు. కార్నెగీ దీని నంతటినీ హృదయపూర్వకంగానే ఉద్దేశించాడు. తన సంపదను అంతటినీ దానం

చెయ్యకపోయినా, తరువాతి కాలంలో చెప్పినదంతా కార్యరూపాన చేసి చూపించే సమయం వచ్చింది.

చదువుకోసం అతడు ఆక్స్‌ఫర్డ్ వెళ్ళలేదు. ఉపన్యాసాలివ్వటంలో, చరిత్ర, తత్త్వశాస్త్రం, సాహిత్యం, కళలు అన్న అంశాలలో తన జ్ఞానాన్ని పెంపొందించు కోవటానికి ఎంతో కృషి చేశాడు. వ్యాపారంతో బాటు, ఆత్మసంస్కృతిని అభివృద్ధి చేసుకోవటం కూడా ఒక ఉద్దేశంగా పెట్టుకొని, అతడు ఇంగ్లండుకు, తదితరదేశాలకు ఎన్నో మారులు యాత్ర చేశాడు. అతడ్ని రెండూ ఆకర్షించడం ప్రారంభించాయి. అంతరాత్మలో ఉన్నత విషయాలమీద ప్రగాఢమైన ప్రేమ వున్నప్పటికీ, అతడు వ్యాపారంలో కలుగుతున్న విజయ వ్యామోహాన్ని ఎదుర్కోలేకపోతున్నాడు. వ్యాపారానికి స్వస్తి చెప్పటం కోసం కేటాయించుకున్న రెండు సంవత్సరాల్లో అతడు హృదయపూర్వకమైన తీవ్రకృషి చేశాడు. అతడు, బాల్టిమోర్ ఓహైయో రైల్ రోడ్ పెట్టుబడిదారు, జాన్ డబ్ల్యు. గారెట్ దగ్గరికి వెళ్ళి హీలింగ్, పార్కర్స్‌బర్గు అన్న రెండు ప్రదేశాలల్లో ఓహైయో నదిమీద కట్టవలసిన రెండు బ్రిడ్జీలకు సంబంధించిన కాంట్రాక్టులను అతడికి అమ్మివేశాడు. చికాగోలో స్లీపింగ్ కార్లను ఉత్పత్తి చేస్తున్న జార్జి యం. పుల్మన్‌ను కలుసుకొన్నాడు. మనుష్యస్వభావ పరిశీలన విషయంలో కించిత్తయినా రోషం లేని తన సహజావబోధశక్తితో అతనికున్న వ్యాపారికమహత్తును గుర్తించాడు. కార్నెగీ సహచరులు అతనితో "మనం పుల్మన్ మీద స్వత్వోల్లంఘనం (Infringement) చేసినందుకు అభియోగం తీసుకురావా" లని తీవ్రధోరణిలో మాట్లాడారు.

"నా అభిప్రాయం అది కాదు. అభియోగాలు న్యాయస్థానం చుట్టూ ఎలా త్రిప్పుతాయో మీకు తెలుసు. డబ్బంతా న్యాయవాదుల పాలు కావటమే జరుగుతుంది. పుల్మన్‌కు చికాగో కార్యస్థానం కావటం వల్ల అతనికి మధ్య పశ్చిమ, దూర పశ్చిమ రైలు మార్గాలతో మనకంటే ఎక్కువ సాన్నిహిత్యమున్నది. అందువల్ల అతడికి మంచి అవకాశం, అంతే కాక ఆ యువకుడు పరిశ్రమ రంగంలో ఘనకార్యాల నెన్నింటినో నిర్వర్తింపనున్న అదృష్టశాలి. చేతనయినంత మనం అతనితో చేతులు కలుపుదాం" అని, కార్నెగీ వారి అభిప్రాయంతో వ్యతిరేకించాడు.

సెయింట్ నికొలస్ హోటల్ మెట్లముందు 1869లో ఒక వేసంగి సాయంకాలం కార్నె, జార్జి పుల్మన్ దరిదాపుగా ప్రక్కప్రక్కన నడుస్తున్నప్పుడు అదృష్టదేవత చిరునవ్వు

నవ్వినట్లు తోచింది. యూనియన్ పసిఫిక్ డైరెక్టర్లు, న్యూ యార్కులో కలుసుకొని స్లీపింగ్ కార్ల కాంట్రాక్టు ఇవ్వనున్నారు"

"సుసాయంతనం మిస్టర్ పుల్మన్!" అన్నాడు కార్నెగీ ఉత్సాహంతో.

పుల్మన్ "సుసాయంతనం" అన్నాడు చేదుగా. కానీ కార్నెగీ కలవరపడలేదు.

"ఇక్కడ మనం కలుసుకోవటం ఎంతో చిత్రంగా వుంది" అన్న గమనిక చేశాడు కార్నెగీ, కానీ అతడి దగ్గర నుంచి అందుకు సమాధానమైనా రాలేదు. క్షణకాలం కలవరపడి తెప్పరిల్లి, కార్నెగీ పసివాడిలా నవ్వి "బాగుంది, మనమిద్దరం ఇక్కడే కలుసుకోవటం. మనమిద్దరం మనకు మనమే బుద్ధిహీనులను చేసుకొంటున్నామన్న భావం నీకు కలగటం లేదా?" అన్నాడు.

ప్రతిద్వంద్వి అయిన ఆ ఉత్పత్తి దారు ఆగి ఈ విధంగా తన్ను ఎదిరిస్తున్న వ్యక్తిని పరకాయించి చూచి "ఐతే నీ ఉద్దేశ మేమిటి?" అన్నాడు.

"యూనియన్ పసిఫిక్ వ్యాపారవిషయం. దాన్ని గురించి రాగల అవకాశాల నన్నింటినీ పోగొట్టుకుంటూ, మన మిరువురమూ ఒకళ్ళతో ఒకళ్ళు పోట్లాడు కోటంలో ప్రయోజనమేముంది?"

ఈ మాట పుల్మన్ బుద్ధి కెక్కింది. "అయితే దీన్ని గురించి నీవేమి చేద్దామంటావు" అని అడిగాడు.

"కలిసి పోదాం" అని కార్నెగీ కొంత బిగ్గరగా అన్నాడు. "నీ బృందం, నా బృందం కలిసి ఒక కంపెనీని స్థాపించి, యూనియన్ పసిఫిక్ వారికి ఒక సమష్టి సూచన నిద్దాము."

"దాని పేరేమిటి?"

పేరు అతనికి ప్రధానమయిన ప్రశ్న ఔతుందని కార్నెగీకి తెలుసు. సమాధానం సంసిద్ధంగా వుంది. "ది పుల్మన్ పాలెస్ కార్ కంపెనీ" అన్నాడు.

మంచులా గడ్డకట్టి వున్న మోము వెంటనే వికసించింది. "నా గదిలోకి రా, మాట్లాడుకుందా" మని ఆహ్వానించాడు.

ఇలా ఆ వ్యాపారాన్ని సాధించటం జరిగింది. సుస్వభావం గల థియోడోర్ వూడ్రఫ్, క్రొత్త కంపెనీకి పేరు పెట్టటాన్ని గురించి కొంచెం అనిష్టం వ్యక్తం చేసినా,

ఇలా కలిసిపోవటం వల్ల కలిగేటందుకు వీలున్న ఆర్థిక ప్రయోజనాలను చూపించి చెప్పుకొన్నప్పుడు, ఆ పథకాన్ని అంగీకరించాడు.

కానీ చివరకు ఉక్కు, కార్నెగీని తన పాశాలలో కట్టి పడేసింది. కొద్ది పరిమాణాలలో ఉక్కును తయారుచేయటం పూర్వం నుంచీ జరుగుతూనే ఉంది. రైలు పట్టాలు, వంతెన దూలాలు, వంటి పెద్ద పెద్ద వస్తువులను తయారు చేసేటందుకు అనువుగా ఇంగ్లండులో హెన్రీ బెస్సిమర్ ఒక క్రొత్త విధానాన్ని కనిపెట్టేటంత వరకూ, ఉక్కు వుత్పత్తి ఎంతో నెమ్మదిగా జరుగుతుండేది. అప్పుడది ఎంతో కష్టమయిన పని, నిజంగా ఒక కళ, యిప్పటికి ఆంద్రూ భవిష్యజ్జీవితము నిశ్చింతగా రూపొందింది.

# 8. ఉక్కుయుగం

అంతర్యుద్ధ సమయం వరకూ అమెరికాలో రైలు బండ్లు ఇనుపపట్టాలమీదనే నడుస్తుండేవి. ఉక్కుపట్టాలు తొలిసారిగా 1863లో ఇంగ్లండునుంచి దిగుమతి అయినవి. అయితే యుద్ధం ముగిసిన తరువాత అమెరికాలో ఇనుమును ఉత్పత్తిచేసేవాళ్ళు తమ దృష్టిని బెస్సిమర్ విధానం మీదికి మార్చారు. బాండ్ల అమ్మకం కోసం కార్నెగీ ఇంగ్లండుకి రాకపోకలు సాగిస్తున్నప్పుడు ఒక సందర్భంలో, ఉక్కు ఉత్పత్తిని స్వయంగా చూడటం తటస్థించింది. అంతవరకూ అతడికి ఉక్కు విషయంలో ఆసక్తి లేదు. చూడగానే అతడికి ఉద్రేకం కలిగింది. న్యూ యార్కులో ఓడ దిగి రేవునుంచే ఆమాంతంగా పిట్స్‌బర్గు చేరుకున్నాడు. తన సంస్థలోని భాగస్థులను మహోల్లాసంతో ఇలా హెచ్చరించాడు.

“ఇనుముకు కాలం చెల్లిపోయింది. ఉక్కు! ఇక ఉక్కే రాజు! మనం ఉక్కు పట్టాలను తయారుచేయటం మొదలు పెట్టాలి. వెంటనే మొదలు పెట్టండి!”

మందకొడి అయిన క్లోమన్ తన అభిప్రాయానికి అడ్డుచెబుతాడని కార్నెగీ ముందే ఊహించాడు. కానీ తన ఇతరభాగస్థులు, తన సోదరుడు టామ్‌తో సహా తన్ను కాదంటారని అతడు అనుకోలేదు. ఏమైనా వాళ్ళందరికీ ఇనుమంటే ఇష్టం. తమ అలవాట్లను, అభిప్రాయాలను అంత హఠాత్తుగా మార్చుకోలేరు. వాళ్ళు అప్పుడే ఒక క్రొత్త కొలిమిని నిర్మించారు. టామ్ భార్య గౌరవార్థంగా దీనికి ‘ది లూసీ’ అని పేరు పెట్టారు. దీని నిర్మాణానికి ఎంతో పెద్ద మొత్తం వ్యయమైంది. ఎంతకూ భాగస్థుల్లో – ముఖ్యంగా టామ్‌లో, చలనం కలుగలేదు. వాళ్ళందరూ ఎక్కువ తాపీ అయినవాళ్ళు. ఆండ్రూ అకారణంగా ఉద్రిక్తు డవుతున్నాడన్న భావం వాళ్ళకు కలగక తప్పలేదు. ఆండ్రూ విజయానికి అతని ప్రతిభ, దృఢమైన కృషి ఎంతగా కారణాలో, అదృష్టం కూడా అంతగా హేతువని అతని సమకాలికుల్లో కొందరు నిరంతరం విశ్వసిస్తుండేవారు. సోదరుని నూతనభావాలను అనుసరించి వ్యవహరించటానికి తాను అన్ని వేళలా సంసిద్ధుడు కాకపోయినప్పటికీ, విషయమేమో టామ్ బాగా తెలుసుకున్నాడు.

“ఆండీ! త్వరపడకు. ఉక్కును గురించిన ఉద్రేకం ప్రస్తుతం ఎంతో విశేషంగా వుంది. అది ప్రమాదకరం. ఇక ఇనుమా, అన్ని అమెరికన్ పరిశ్రమలకూ అది పునాది. ఇంకా కొంతకాలం అది అలాగే వుండి తీరుతుంది. మన వ్యాపార మార్గంలోది కాని దానికోసం మనం అధికధనాన్ని కుమ్మరించటమెందుకు?” అని సుఖంగా కుర్చీలో వెనక్కు వ్రాలుతూ అతడు సలహా యిచ్చాడు.

ఇతర భాగస్థులంతా టామ్‌తో ఏకీభవించారు. ప్రయోజనం లేక వాదం కొంత సాగించిన పిమ్మట, ఆండ్రూ అన్నాడు. “సరే, నన్ను మీరు అనుసరించలేకపోతే, నేను క్రొత్తభాగస్థులతో ఒక బృందాన్ని కల్పించుకొని మరొక ప్రత్యేకసంస్థను ప్రారంభించవలసి వుంటుంది”

“అహఁహ అది కాదు ఆండీ! నేను నీ పథకంలో కొంత పెట్టుబడి పెట్టననటం లేదు. మిగిలిన మనవారు కూడా అందులో కొద్ది కొద్దిగా పెట్టుబడి పెడతారు. కానీ మన ప్రస్తుత సంస్థ ఈ పనికి పూనుకోవడం నాకు ఇష్టం లేదు, అంతే” అన్నాడు వెంటనే అందుకొని టామ్.

“బహుశః నీ వన్నది సమంజసమైనదే కావచ్చు” నని ఆండ్రూ అంగీకరించాడు :

అందువల్ల అతడు మరొక క్రొత్త బృందాన్ని సమకూర్చుకున్నాడు. హోమ్‌వుడ్ ఇరుగు పొరుగులైన కోల్మన్ స్టుసార్టులు, రైలు రోడ్డు కార్యకర్తలయిన థామ్సన్, స్కాట్‌లు ఆరబెట్టిన సరుకుల గుత్త వ్యాపార మెక్కాన్డ్ లెస్‌లు ఉన్నారు. వీరందరిలో మెక్కాన్డ్‌లెస్ ప్రధానభాగస్థుడు’ కార్నెగీ కుటుంబం పూర్వం రెబెక్కా వీధిలో అతిదారిద్ర్యదశను అనుభవస్తున్న దినాల్లో, ఆంట్ ఐట్కిన్ ద్వారా మెక్కాన్డ్‌లెస్ వారికి అప్పు కావలిసివస్తే ఇస్తానని మృదువుగా కబురు చేశాడు. అప్పుడు ఆ అప్పు అవసరం లేదని చెప్పటం జరిగింది. కానీ, ఆ సమయంలో మెక్కాన్డ్‌లెస్ చూపించిన దయను ఆండ్రూ ఎన్నడూ మరచిపోలేదు.

కార్నెగీ క్రొత్తగా స్థాపించిన సంస్థలో అతని ఇనుము సంస్థలో ఉన్న భాగస్థులందరూ స్వల్పంగా పెట్టుబడులు పెట్టారు. ఈ క్రొత్త సంస్థకు సోదరుడు టామ్ స్థల నిర్దేశం చేశాడు. ఇది పిట్స్ బర్గునుంచి మోనోన్గ హేలాకు పైన, పన్నెండు మైళ్ళదూరాన, బ్రాడ్డాక్ గ్రామం దగ్గర వుంది. 177.. లో ఫ్రెంచి - ఇండియన్ సైన్యం బ్రిటిష్ సైన్యాధికారి జనరల్ బ్రాడ్డాక్‌ను పరిపూర్ణవినాశాన్ని పొందేటట్లు ఓడించి

చంపివేసింది ఇక్కడే. ఈ ప్రదేశంలో వుండటం వల్ల ఉక్కు కర్మాగారానికి రెండు రైలు మార్గాలు, మోనోన్గ్ హోలా ద్వారా ఓహైయో నది అందుబాటులో వుంటవి.

కార్నెగీ "దీనికి రైల్ రోడ్డు కాలంనాటి నా పూర్వమిత్రుని గౌరవార్థం 'ఎడ్గర్ థామ్సన్ స్టీల్‌వర్క్స్' అని పేరు పెడతా" నన్నాడు. థామ్సన్ సంస్థలో పెద్దమొత్తం పెట్టుబడి పెట్టాడు. అయినా అతడు ఈ అభిప్రాయానికీ సుముఖత చూపించలేదు. "ఆండీ! అమెరికన్ ఉక్కు పటాలతో నా పేరుకు సంబంధం ఉండటానికి, నేను ఎంతవరకూ ఇష్టపడతానో నాకు బోధపడటం లేదు. ఇంతవరకు తయారైనవి ఎవరికీ గౌరవమిచ్చేటట్లు లేవు" అన్నాడతడు.

అందుకు అభ్యంతరం చెబుతూ కార్నెగీ "థామ్సన్! మనం మంచి పట్టాలను తయారు చేయబోతున్నాము. ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉక్కును ఎంత బాగా తయారు చేయటానికి వీలుందో, ఈ దేశంలో కూడా అంతగా అవకాశముంది. కీస్టోన్ వంతెనలకు, క్లోమన్ ఇరుసులకూ వచ్చినంత కీర్తిని మన పట్టాలకు కూడా సంపాదించగలమని నా అభిప్రాయ" మన్నాడు.

చివరకు థామ్సన్ తన పేరు పెట్టటానికి అంగీకరించాడు. 1873లో ఆర్థికమాంద్య భయోత్పాతం దేశం మీద వచ్చి పడేనాటికి కర్మాగారనిర్మాణం అట్టే సాగలేదు. అనేకులైన విమర్శకులు "ఆహా! పొంగులు వారిన ఆండ్రూ కార్నెగీ అదృష్టం చివరకు అతనికే ఎదురు తిరిగింది. ఈ దెబ్బతో అతడు నాశనం కాక తప్పదు!" అన్నారు. కార్నెగీ 2,50,000 డాలర్ల ధనాన్ని ఈ పథకంలో పెట్టుబడి పెట్టాడు. ఇందులో అధికాంశం అతనికి బాండ్ల అమ్మకం వల్ల, కమీషన్ల వల్ల చేకూరిన ధనం. విధివిలాసం కొద్దీ తన దానధర్మకార్యక్రమాన్ని ఆరంభించటం కోసం అతడు డన్ఫర్మ్ లైన్‌లో ఒక ప్రజా స్నానగృహదహనంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ధనం కోసం పుల్మన్ సంస్థలోని పెట్టుబడులను, ఇతర రక్షణనిధులను అమ్మివేశాడు. కర్మాగార నిర్మాణ పరిపూర్తికి మరికొంత ఆలస్యమైంది. కానీ ఎక్కువ కాలం గడవలేదు. అప్పటినుంచి అతడు ఉక్కు ఇనుముల మీదనే దృష్టిని కేంద్రీకరించటం కోసం ఇతరత్రా తనకున్న వాటాలను అన్నింటినీ ఒకదాని తరువాత ఒకదాన్ని అమ్మివేశాడు. "నా మంచి గ్రుడ్లను అన్నింటినీ ఒక గంపలోకి చేర్చి ఆ గంపనే చూచుకొంటూ వుండటం వివేచన గల విధానమని నేను నిర్ణయం చేసుకొన్నాను" అన్నాడు.

కార్నెగీ ఇప్పటికే ఒక రైలు మార్గానికి సంబంధించిన పెట్టుబడి విషయంలో చిక్కుబడ్డాడు. అది కొంతగా అతనికి వ్యథ కలిగించింది. అతని పూర్వమిత్రుడైన

స్కాట్ చేసిన నిర్బంధనల వల్ల అతడు రూపొందిస్తున్న టెక్సాస్ అండ్ పసిఫిక్ రైల్ రోడ్ సంస్థలో 2,50,000 డాలర్లు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం ఆ సంస్థ దివాలా తీసే పరిస్థితిలో వుంది. పెద్ద మొత్తం దానికి అప్పు తేలింది. న్యూ ఇంగ్లండులో పుట్టిన జూనియస్ యస్. మోర్గన్ లండన్‌లో బ్యాంకరుగా వున్నాడు. అతనికే ఈ సంస్థ అప్పు తీర్చాలి. కార్నెగీకి అతనితో ఎన్నో లావాదేవీలు ఉంటుండేవి. అతనికి టెక్సాస్ అండ్ పసిఫిక్ రోడ్ సంస్థ బాకీపడ్డ మొత్తం పెద్దది. అతడు కార్నెగీ కనక హామీ ఇచ్చి సంతకం చేసేటట్లయితే, ఋణపత్రాన్ని తిరిగి వ్రాయించుకొంటానన్నాడు. కానీ, కార్నెగీ అందుకు నిరాకరించాడు.

“ఆండీ! వాళ్ళకు అండగా వుండటానికి అంగీకరింపక నీ పూర్వమిత్రు లందరికీ వినాశనాన్ని తెచ్చి పెడతావా?” అని స్కాట్, కార్నెగీని నిందించాడు.

దీనికి ప్రతిగా సమాధానమిస్తూ “సరే, ఈ వినాశం నీ బృందానికి గాని, నా వ్యాపారానికి గాని, నా భాగస్థులకు గాని, వారి కుటుంబాలకు గాని సంబంధించింది అయితే, యీ సమస్య విషయంలో నేను అనుకూలమైన నిర్ణయం చేసి తీరవలసిందే. స్కాట్! మిక్కిలి తక్కువ మూలధనంలో రైల్ రోడ్ నిర్మాణానికి దిగవద్దనీ, యత్కాలికంగా పుట్టిన అప్పులమీద ఆధారపడి వేయి మైళ్ళు రైలు పట్టాలను వెయ్యవద్దనీ నీకు బోధించటానికి నేను ఎంతో యత్నించాను. అయినా, నా మాటలు నీవు విన్నావు కావు. తరువాత నేను యూరప్ నుంచి తిరిగి వచ్చిన వెనుక నా కోసం 2,50,000 డాలర్లు వాటాలు ప్రత్యేకంగా కేటాయించానని చెబితే, ఏదో పూర్వమైత్రిని పురస్కరించుకొని సరేనని ఒప్పుకున్నాను. ఇప్పటికి టి.అండ్ పి. సంస్థ కాలక్రమేణా లాభసాటిగా పరిణమిస్తుందనే నా విశ్వాసం. అయినా, ఆ ఋణపత్రం మీద నేను సంతకం పెట్టలేను. అలా చేస్తే మిల్లులలోని నా పెట్టుబడులకు, నా భాగస్థుల భద్రతకు ప్రమాదాన్ని కల్పించడమౌతుంది. కనుక ఆ పని నేను చేయకూడదు” అన్నాడు.

నిస్సంశయంగా ఈ నిర్ణయాన్ని చేసినప్పటికీ, కార్నెగీ ఎదుర్కొనవలసి వచ్చిన ఏ ఆర్థిక సమస్యా కూడా అతనికి దీని వల్ల కలిగినంతటి వ్యథను కల్పించలేదు. ఈ నిర్ణయం జరిగిన తరువాత స్కాట్‌తో మైత్రి పూర్వం వలె సాగకపోవటమే ఇందుకు కారణం, ఆర్థికమాంద్య భయోత్పాతం దెబ్బతీస్తున్న ఆ సమయంలో కార్నెగీ ఆ రీతిగా వ్యవహరించటం న్యాయమే. టెక్సాస్ అండ్ పసిఫిక్ సంస్థలో స్కాట్‌తో కార్నెగీకి కూడా సబంధం ఉన్న సంగతి అందరికీ విదితమైన విషయం. కార్నెగీ టెక్సాస్ అండ్

పసిఫిక్ సంస్థకు సంబంధించిన ఋణపత్రాలమీద సంతకాలు చేస్తే అతడు దాని వినాశం లోపలికి ఆకర్షింపబడినవాడౌతాడు. అందువల్ల పిట్స్ బర్గులోని అతని సంస్థలన్నింటికీ ప్రమాదస్థితి కొని తెచ్చుకున్నవాడవుతాడు అని ఊహించి, కార్నెగీ కంపెనీలకు ఆర్థికనిలయమైన ఏక్స్చేంజి బ్యాంకి ఎంతగానో ఆందోళన పడ్డది. ఈ బ్యాంకి కార్నెగీ కంపెనీలకు సంబంధించిన పత్రాలను పెద్ద మొత్తాలను తన దగ్గర కుదువబెట్టుకున్నది. అందుచేత ఆ బ్యాంకి డైరెక్టర్లు వెంటనే కనిపించవలసిందని కార్నెగీని పిలిపించారు. తగ్గ సమాధానం చెప్పుకోవటం కోసం అతడు వెంటనే న్యూ యార్క్ నుండి బయలుదేరాడు.

గంభీరమైన ముఖకవళికలతో కూర్చున్న ఆ డైరెక్టర్ల ముందు హాజరై కార్నెగీ అతి ప్రశాంతంగా ఇలా అన్నాడు.

"టెక్సాస్ ఆండీ పసిఫిక్ కంపెనీలోని రెండు వందల యాభైవేల డాలర్ల వాటాలకు నేను యజమానినైన మాట సత్యం. దీనినంతటినీ నేను సొంత ధనమిచ్చి కొన్నాను. ఎక్కడా నేను వారి పత్రాలమీద సంతకాలు పెట్టలేదు."

వారు దీన్ని నమ్మలేకపోయినారు.

"ఒక డాలరు విలువచేసే వారి సాహసిక వ్యాపార పత్రంమీద కూడా నా సంతకం లే"దని గట్టిగా నొక్కి చెప్పి, కార్నెగీ వాళ్ళతో ఇంకా ఇలా అన్నాడు – "వ్యాపార ప్రపంచానికి సాహసిక వ్యాపారం (Speculation) వంటి ఘనమైన అభిశాపం మరొకటి లేదని నా అభిప్రాయం. స్కాట్ ఎక్స్చేంజి ద్యూత గృహం కంటే ఇంచుక మంచిది లేదా దానితో తుల్యమైంది" ఈ అభిప్రాయమే అతనికి జీవితాంతము వరకూ నిశ్చలంగా వుంది. "మా సంస్థల సాధనసంపత్తిని వృద్ధి పొందించుకోటం కోసం. మీరిచ్చిన అప్పులకు తప్ప, నేను ఈ కంపెనీతో సహబాధ్యత వహించిన ఋణపత్రాలు ఏమీ లేవు. నా సంస్థలనుంచి నాకు తిరిగి వచ్చే ప్రతి డాలరును, మీ బాకీలను తీర్చటానికి నా ఆస్తులు చాలునని చూపించడానికి హామీ ఇవ్వటానికి నేను సంసిద్ధుడనై వున్నాను."

"కార్నెగీ! ఆ ఋణాలను గురించి మాకు అణుమాత్రమయినా ఆందోళన లేదు" అని బ్యాంకి అధ్యక్షుడు బయటపడ్డాడు. "ఇదంతా టెక్సాస్ అండ్ పసిఫిక్ కంపెనీ గురించి, వాళ్ళ ఋణపత్రాలమీద నీవు అనుమతి సంతకాలు చేస్తున్నావని మేము విన్నాము" అన్నాడు.

అప్పుడు కార్నెగీ అన్నాడు : "సాహసిక వ్యాపారంతో జోక్యం పెట్టుకొన్న నన్ను మీరు ఎన్నడూ చూడలేదు. వాల్ స్ట్రీట్‌లో నేను మీకు ఎప్పుడూ కనిపించను. ఇక ఋణపత్రాలమీద హామీ సంతకం పెట్టటం విషయమంటారా – ఋణం పక్వమైనప్పుడు నేను తీర్చటానికి మార్గం స్పష్టంగా కనిపిస్తుంటేగాని లేదా చెల్లించలేని స్థితి వస్తే దానికి తగినంత ఆస్తి నాకు వుంటేనే గాని ఏ ఋణపత్రం మీదా సంతకం చెయ్యకూడదని నా దీక్ష. నా పాశ్చాత్య మిత్రుడొకడు అన్నట్లు నడవలేనంతటి లోతున్న నీళ్ళలోకి నేను ఎన్నడూ వెళ్లను!"

ఆర్థిక – వ్యాపారిక ప్రపంచంలో కొత్తగా లభ్యమయిన ప్రగాఢగౌరవంతో కార్నెగీ ఈ సమావేశం నుంచి బయటికి వచ్చాడు. ఆ నాటి ఆర్థికభయోత్పాతం నుంచి ధ్వంసం కాకుండా బయటపడ్డ ప్రముఖ పారిశ్రామికుడు అతడు ఒక్కడే. ఈ సమయంలోనే చేతికి డబ్బుకు అక్కర కలిగిన తన సంస్థలోని భాగస్థులు కొందరు తమ షేర్లను అమ్మజూపితే అతడు తన పేర వాటిని పుచ్చుకొన్నాడు కూడాను. ఇనుము, ఉక్కు పరిశ్రమలు దరిదాపుగా స్తబ్ధస్థితిలో ఉన్న ఆ ఆర్థికమాంద్యం సమయంలో కూడా బ్రాడ్డాక్ నిత్యం క్రమాభివృద్ధిని పొందుతూనే వున్నది. వస్తుసామగ్రి ఆర్థికమాంద్య సమయంలో చౌకగా వుంటుంది. తిరిగి మంచిరోజులు వచ్చినప్పుడు వ్యాపారాన్ని విజృంభించి ఆరంభించటానికి అతిశయమైన అవకాశం వుంది.. మంచిదినాల కోసం ఆగినవాళ్ళు వస్తుసామగ్రి కోసం అధికధనం వెచ్చించవలసి వుంటుంది. అందువల్ల యంత్రాదికం ఖరీదు పెరిగిపోతుంది. వచ్చే లాభాలు తక్కువౌతవి. డబ్బు వుంటే సంస్థను వృద్ధి చేయటానికి ఆర్థికమాంద్యసమయమే తగిన కాలమన్న అంశాన్ని కార్నెగీ గమనించాడు. అందువల్లనే క్రమంగా ఆ మార్గాన్ని అనుసరించి వ్యహరించాడు.

కార్నెగీ కుశాగ్ర బుద్ధివల్లనే 1875లో పనిని తిరిగి విజృంభించి ప్రారంభించినప్పుడు ఎడ్గర్ థామ్సన్ కంపెనీ ఇతరమైన ఉత్పత్తిదారు లందరికంటే తక్కువ ధరలకు పట్టాలను విక్రయించగలిగింది. అందువల్ల అనేకకర్మాగారాలు పని లేక మందకొడిగా నడుస్తున్న దినాలలో ఈ కంపెనీ ఆర్డర్లను అసంఖ్యాకంగా పొందగలిగింది.

ఉక్కును ఉత్పత్తి చేయటంలో అమెరికాలోని అందరికంటే సమర్థుడైన వ్యక్తి కెప్టెన్ బిల్ జోన్స్. ఇతడు వెల్ష్ జాతివాడు. అంతర్యుద్ధ 'కురువృద్ధ' ఎడ్గర్ థామ్సన్ కంపెనీతో స్పర్ధ వహించి పనిచేసే మరొక సంస్థనుంచి, ఇతడు, యజమానులు తన సామర్థ్యాన్ని గుర్తించక పోవటం వల్ల విసుగు చెంది, బయటికి వచ్చేశాడు. ఇటువంటి

వ్యక్తిని కార్నెగీ తన ఉద్యోగిగా సంపాదించటంతో కంపెనీ విజయం మరింత నిశ్చితమయింది.

కార్నెగీ విజయ రహస్యాలలో మరొకటి వ్యక్తులను గురించి ఆతనికి ఉన్న అపూర్వ వివేచనశక్తి. ప్రసిద్ధిగన్న ఒక ఉత్పత్తి దారు అతన్ని గురించి “ఒక స్థానం నుంచి ఒక వ్యక్తిని ఎన్నుకొని అతనివలన అత్యుత్తమ ప్రయోజనం కలిగే మరొక స్థానంలో అతన్ని నిలిపే కౌశలం విషయంలో ఇతడు నేనెరిగిన వాళ్ళందరిలోనూ మేటి” అన్నాడు. “ఇతరులు యోగ్యతను కొద్దిగా గుర్తించటమో లేక అసలే గుర్తింపకపోవటమో జరిగిన వ్యక్తిని, కార్నెగీ ఒక ప్రముఖస్థానంలో నిలపటం నాకు తెలుసు. అతడు నిల్పిన వ్యక్తి ఆ స్థానంలో ఏల్ తాళపుడిప్పలాగా ఒదిగి పోతాడు. వ్యక్తులను ఎన్నుకోటంలో కార్నెగీకి సాటి అయినవాడు ఉన్నాడని నేను అనుకోను” అని అతడన్నాడు.

“నూతన యంత్రస్రష్టగా గాని, రసాయనికవేత్తగా గాని, పరిశోధకుడుగా గాని, యంత్రనిర్మాతగా గాని నాకొక స్థానమున్నదని అనటానికి నాకు అణుమాత్రమయినా యోగ్యత లేదు” అని కార్నెగీ విస్పష్టంగా చెప్పనే చెప్పాడు. అతడికి తెలిసింది యోగ్యులైన వ్యక్తులను గుర్తించటం, వారివల్ల అత్యుత్తమ సేవలను పొందటం మాత్రమే. “పొందవలసిన సేవ కేవలం బుద్ధి సంబంధమైనది హస్తసంబంధమైనదీ మాత్రమే కాదు” అన్నాడతడు. గణనకు వచ్చేది హృదయసంబంధి అయిన సేవ. అతని బుద్ధి అతిశయమైన కుశలతతో పని చేయటానికి ముందే నీవు నీ ఉద్యోగిలోని వ్యక్తిగత స్వభావాన్ని, హృదయాన్ని ఆకర్షించి ఆధీనం చేసుకోవాలి” అన్నది కార్నెగీ అభిప్రాయం.

ఇప్పటికే కార్నెగీ తన జ్ఞాతియైన డాడ్ హృదయ పూర్వక సహకారాన్ని సంపాదించాడు. అతడు డాడ్‌ను 1870లో సంస్థలోకి తీసుకువచ్చాడు.

డాడ్ ఈ నాడు సంస్థతో అవినాభావ సంబంధం గల వ్యక్తి. ఇతరమైన ఇనుప కంపెనీల బ్రిడ్జి కంపెనీలు లాగానే కార్నెగీ ఉక్కు సంస్థ కూడా, తన ఉపయోగం కోసం బొగ్గు గనులను సంపాదించింది. తన కంపెనీ బొగ్గు గనుల్లో వృథాగా పోతున్న పదార్థాన్ని గురించి, చిట్టెమును గురించి కోల్మన్ బహుకాలం ఆందోళన చెందాడు. ఒక సందర్భంలో అతడు ఇంగ్లండులో ఉన్నప్పుడు, జార్జి లాడర్ అనే వ్యక్తి అతనికి పైవిధంగా వ్యర్థమయ్యే పదార్థాన్ని అంతటినీ పరిశుభ్రం చేసి బొగ్గుకు బదులుగా వాడటం చెయ్యటం కోసం తాను కనిపెట్టిన ఒక విధానాన్ని చూపించాడు. దాన్ని

చూసి క్లోమన్ మహోత్సాహంతో ఇంటికి వచ్చాడు. "డాడ్! వెంటనే ఇక్కడికి వచ్చి నీ విధానాన్ని మాకు చూపించాలి" అని కార్నెగీ అతడికి వ్రాశాడు అతడు వచ్చి అమెరికాలో చిట్లెపు బొగ్గును పరిశుద్ధి చేసే మొట్టమొదటి కర్మాగారాన్ని నిర్మించాడు. ఇందువల్ల కంపెనీలకు ఎన్నో నిలువలు చేకూరాయి. కంపెనీలోని భాగస్థులందరూ "మనం ఇతన్ని తిరిగి ఇంటికి వెళ్ళనీయకూడదు" అని కూడబలుకుకొన్నారు. ఆ కారణం వల్ల లాడర్ అమెరికాలోనే నిలచిపోయినాడు. కార్నెగీ సంస్థలో భాగస్థుడయి చివరకు, మహాధనికుడుగా మరణించాడు.

ఉక్కు సైన్యంలో చేరటానికి డన్ఫర్మ్లైన్ ఎంతో మందిని చేకూర్చి యిచ్చింది. "మిస్టర్ కార్నెగీ, మీ బంధువొకడు ఇక్కడ పనిచేస్తున్నాడు. మీకు తెలుసునా?" అని ఒకనాడు కర్మాగారంలో నడుస్తున్నప్పుడు సూపరింటెండెంటు కార్నెగీని హెచ్చరించాడు.

"తెలియదే!" అని అతడు ఆశ్చర్యంతో సమాధానమిచ్చాడు.

"పైగా అతడు సిద్ధహస్తుడయిన మంచి యంత్రవేత్త కూడాను. అతడు మీకు జ్ఞాతి అని కొలదికాలం పూర్వం వరకూ నాకు కూడా తెలియదు."

"అతడితో నేను మాట్లాడవచ్చునా?"

"తప్పక" అని సూపరింటెండెంటు కార్నెగీని ఒక యంత్రం సరిచేస్తున్న యువకుడి దగ్గరికి తీసుకు వెళ్ళాడు. "ఇదిగో ఇతడే" అని అతడు "టామ్! వీరు మిస్టర్ కార్నెగీ" అని పరిచయం చేశాడు.

"నీ పేరేమిటి?" అని యజమాని ప్రశ్నించాడు.

"థామస్ మారిసన్. మా తండ్రి రాబర్టు" అని యువకుడు సమాధాన మిచ్చాడు.

"ఏమిటి? నా జ్ఞాతి బాబ్!"

"అవును."

"నీవు ఇక్కడికి రావటం ఎలా జరిగింది?"

"ఇక్కడికి వస్తే మేము బాగుపడగలమని భావించాను."

'మేము' అన్నమాటను తిరిగి ఉచ్చరించి "ఇంకా నీతో ఉన్నవాళ్ళెవరు?" అని కార్నెగీ ప్రశ్నించాడు.

"నా భార్య."

యజమాని అతన్ని చిత్రంగా పరికించి చూచాడు. "నేను నీకు బంధువును గదా. మొదట నా దగ్గర కెందుకు రాలేదు?" అని ప్రశ్నించాడు. "నీకొక పరిచయపత్రాన్ని వ్రాసియిచ్చి వుండేవాణ్ణి. ఇంతకంటే మంచి పనిలో చేరే అవకాశం కల్పించి ఉండేవాణ్ని" అన్నాడు.

ఆ యువకుడు "అవకాశం లభించింది గదా, అన్యసహాయం ఎందుకులే అనుకున్నా" నని సూటిగా ఆ పెద్దమనిషి కళ్ళల్లోకి చూస్తూ సమాధానమిచ్చాడు. ఈ ఉదంతాన్ని వర్ణిస్తూ "ఔను. అదే నిజమైన మారిసన్ స్వభావం" అని ఉల్లాసంతో కార్నెగీ పెద్దపెట్టున అన్నాడు. "స్వశక్తి మీదనే ఆధారపడటం లూసిఫర్ లాగా స్వతంత్రుడుగా ఉండటం నేర్చుకొన్నా" డన్నాడు.

శక్తిమంతుడైన జ్ఞాతి సహాయం లేకుండానే థామస్ కొద్ది సంవత్సరాలకే డూక్యూస్నీలోని క్రొత్త కర్మాగారానికి సూపరింటెండెంటు పదవిని అందుకొన్నాడు. భాగస్థుడైనాడు. చివరకు ఇతడు కూడా కోటీశ్వరుడయినాడు.

స్కాట్లండులోని హైలాండ్సును స్మృతికి తెచ్చే పెన్సిల్వేనియాలోని క్రెస్సన్ దగ్గర, కేవలం ఎలిఘనీస్ శిఖరం మీద, కార్నెగీ ఒక కుటీరాన్ని కొన్నాడు. వసంతపు తొలి చిహ్నాలు కనిపించగానే అతడు, అతని తల్లి అతివేగంగా అక్కడికే వెళ్ళేవారు. న్యూయార్క్, పిట్స్‌బర్గులకు మధ్య మధ్య అతివేగప్రయాణాలు చేస్తూ మాసమో, మరికొంత కాలమో అక్కడ గడిపిన తరువాత, సెలవులకని వారు స్కాట్లండుకో, యూరప్‌కో పోతూ వుండేవాళ్ళు. వేసవి చివరి దశలో తిరిగివచ్చిన ఆ పాంథుడు లేదా పాంథులిరువురూ మళ్ళీ క్రెస్సన్‌కు వెళ్ళి, అక్కడనే ఆకురాలు కాలం వరకూ వుండేవాళ్ళు.

క్రెస్సన్‌కు వెళ్ళి కార్నెగీ గోదాముతో ప్రవేశించబోతున్నప్పుడు, పటకా కట్టుకొన్న ఒక యువకుడు, పదునైదేళ్ళ వాడు తనంతట తానే వచ్చి అతని గుర్రాన్ని పట్టుకొనేవాడు. అశ్వారోహణ చేసి తిరిగి వెళ్ళిపోతూ ఆ 'ఉక్కు – అధిపతి' ఇచ్చిన పదిసెంట్లో, పావు డాలరో పారితోషికాన్ని పుచ్చుకొని, ఈల వేసుకొంటూ అతడు అక్కడనుంచి అంగలమీద వెళ్ళిపోతుండేవాడు. క్రెస్సన్‌కు, అతని నివాసనగరమైన లొరెట్టోకు మధ్య ఉన్న కొలది మైళ్ళ దూరం ఆ కుర్రవాడు అతివేగంగా పయనించేవాడు. అయితే కార్నెగీకి అప్పుడు అతడి పేరేమిటో కూడా తెలియదు కానీ, తరువాత తెలుసుకొనే సమయం వచ్చింది.

# 9. మరువరాని సంవత్సరం

1881 సంవత్సరమంతా ఆండ్రూ కార్నెగీ జీవితంలో ప్రత్యేకంగా గమనింపదగ్గ సన్నివేశాలతో నిండినది. ఐదు మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టి ఆ సంవత్సరారంభంలో కార్నెగీ బ్రదర్స్ అన్న మహాసంస్థను స్థాపించటంతో, ఆండ్రూ బాల్యంలో తమ్ముడి కిచ్చిన వాగ్దానాన్ని చెల్లించాడు. ఈ సంస్థలో కార్నెగీ పెట్టుబడి సగానికి కొంచెం ఎక్కువ. ఇది సామాన్యమైన సంస్థల వంటిది కాదు. దీని యజమానులు షేరు హోల్డర్లు కాదు. సహ వ్యాపారస్థులు. ఆండ్రూ కార్నెగీ ఎవడయినా పైకివచ్చే లక్షణం గల యువకుణ్ని చేర్చుకోటానికి నిర్ణయించిన సందర్భాలలో తప్ప, సామాన్యంగా ఈ బృందంలో వారు స్టాకును తమలో తమకు కాక ఇతరుల కెవ్వరికీ అమ్మరాదు. అంటే ఈ సంస్థ స్టాకు ఆండ్రూ కార్నెగీ విశేషంగా అసహ్యించుకొనే స్టాక్ ఎక్స్ఛేంజిలోకి ఎన్నడూ వెళ్ళదన్నమాట. ఈ మరో నూతన సంస్థలో ఎడ్గర్ థామ్సన్ స్టీల్ వర్క్స్, ది యూనియన్ ఐరన్ వర్క్స్. ఎన్నో కోల్‌మైన్లు, కోల్ ఒవెన్లుగా ప్రస్తుతంతో పరిణమించి వున్న లూసీఫర్నేసెస్ అన్న సంస్థలు విలీనం చెయ్యబడ్డాయి. కార్నెగీల స్టీలు, గ్రామసీమలలో వేల కొద్ది మైళ్ళు రైలు రోడ్లను నిర్మించటానికి, బ్రిడ్జిలను నిర్మించటానికి, అప్పటి కాలంలో యుగాద్భుతంగా భావింపబడ్డ న్యూ యార్కులోని ఈస్టునది మీది పెద్ద స్వానును నిర్మించటానికి తోడ్పడింది.

ఈ సంవత్సరమే తన తొలిదానంగా ఉచితజ్ఞుడై అతడు ఒక ప్రజాగ్రంథాలయాన్ని డన్ఫర్మ్‌లైన్‌కు ఇవ్వటం జరిగింది. ప్రపంచంలో మరే నగరమయినా సరే, తనకా దానాన్ని ఇచ్చినందుకు అతణ్ని ఆ నగరం ప్రవేశించినట్లు ప్రశంసించి ఉండేది కాదు.

అతడు వాస్తుశిల్పి (Architect) తో ఆ భవనపథకాలను గురించి ఆలోచిస్తున్నప్పుడు అతడు "మిస్టర్ కార్నెగీ! మీకు శలాచనం (కోట్–ఆఫ్ ఆమ్) చిత్రమొకటి నాకు కావాలి. అది ఈ భవనంలో ఎక్కడో ఒకచోట వుండాలి" అన్నాడు. ధనసంపాదనం చేసిన అమెరికన్లు తమకు పారంపర్యంగా వచ్చిన ఆ ప్రాచీనకాలపు 'లాంఛనాలు' లేకపోతే, వాటిని తయారు చేయటంలో ప్రత్యేక నైపుణ్యమున్న వాళ్ళను పిలిపించుకొని, కొత్తగా కల్పితమైన వాటిని చేయించుకుంటుండేవారు. కార్నెగీ కూడా

ఈ విధానాన్నే అనుసరించి, అటువంటి లాంఛనమేదో చేయించుకొని ఉంటాడని ఆ గృహనిర్మాత భావించి ఉంటాడు. అయితే అలా జరుగలేదు.

"నీకు శుభమగుగాక! నాకు అటువంటి లాంఛనాడంబరా లేవీ లేవు" అని ఆ నిత్య ప్రజాస్వామికవాది వెల్లడించాడు. "నీకు ఏదో విధమైన డిజైను కావాలంటే ద్వారం మీద ఉదయకాలరవి తన కిరణాలను అన్ని దిక్కులకూ ప్రసరిస్తున్నట్లు చిత్రించి దానిక్రింద తేజస్సు ప్రాప్తించుగాక! అన్న వాక్యాన్ని ఎందుకు వ్రాయకూడదు?" అని సూచన చేశాడు. చివరకు అలా చేయటమే జరిగింది.

దక్షిణాన్నుంచి ఉత్తరానికి, ఇంగ్లండునుంచి స్కాట్లండుకు, ఆ గ్రంథాలయ భవనానికి కొంణశిలను స్థాపించేటందుకు, డన్ఫర్మ్‌లైన్ చేరుకొనేటట్లు కార్నెగీ ఒక క్రోచ్ ప్రయాణాన్ని ఏర్పాటు చేయించాడు. ఉల్లాసకరమైన ఆ ప్రయాణబృందంలో తాను, తల్లితో సహా పదహారుమంది సభ్యులున్నారు. మిగిలినవారంతా తాత్కాలికంగా తమ పని కట్టిపెట్టి ఆఫీసు బల్లమీదినుంచి లేచి రావటానికి అవకాశం కలిగిన అతని సహచరులు, మిత్రులు. ఇందులో కొందరు భార్యలతో కూడా వస్తున్నారు. ఆ నాలుగు గుర్రాల కోచ్‌లో డ్రయివరు ప్రక్కన ఎత్తుగా కూర్చున్న డెబ్బది యేండ్ల మార్గరెటే కార్నెగీ బృంద మంతటిలోనూ ఎక్కువ ఉల్లాసంగా కనిపించి వుంటుంది. అనేకపర్యాయాలు ఆమె సెలయేళ్ళు దాటవలసి వచ్చినప్పుడు నీళ్ళలో కాళ్ళీడ్చుకుంటూ నడిచింది. ఒకమాటు ఆమె తన షర్టును పైకి మడిచి పచ్చిగడ్డి మైదానం కొండరువ్వులు (Highland Flings) నటించి చూపించింది. స్కాట్లండుకు ఇదే తన చివరి ప్రయాణమని తెలుసుకోవటం వల్ల ఇందువల్ల ఆమె అందరికంటె అధిక ప్రయోజనాన్ని పొందదలచింది.

అంకుల్ లాడర్ ఈ బృందాన్ని ఫిర్త్ ఆఫ్ ఫోర్తు దగ్గరకు వచ్చి కలుసుకున్నాడు. గ్రామసీమ యావత్తూ డన్ఫర్మ్‌లైన్‌కు మూగుతున్నదని వీళ్ళు తెలుసుకున్నారు. ఈ బృందం పాత నగరాన్ని చేరేటప్పటికి గుంపులు బాగా పెరిగిపోతున్నవి. స్కాట్లండ్, ఇంగ్లండ్, యునైటెడ్ స్టేట్ల పతాకాలు ప్రాత రాజభవనం మీద ప్రక్కప్రక్కగా ఎగురుతుండటం వీరి కంటబడ్డది. పెద్ద అందమైన తోరణం ఒకటి ఊరి బయట ఏర్పాట్లు చేయబడింది. ఇక్కడ ప్రోవోస్ట్, నగర కౌన్సిలు సభ్యులు, న్యాయాధికారులు వారి వారి ఔద్యోగికమైన దుస్తులతో ఈ బృందం వారి రాకకోసం ఎదురు చూస్తున్నారు. స్వాగతం చెబుతూ ప్రసంగాలు చేశారు. ప్రధాన స్వాగత ప్రసంగం చేసింది ఒక ఉద్యోగి కాదు, ఔచిత్యశోభితంగా ఈ పనిని ఒక నేత పనివాడు నిర్వర్తించటం జరిగింది.

ఇందతడెంతో సమర్థతను ప్రదర్శించాడు. బ్యాండు వాయించేవారు, బాగ్ పైపర్లు, లాడ్జీలు, కార్మికుల సంఘాలు. వీళ్ళలో చాలామంది లినెన్ మిల్లులో పనిచేసే స్త్రీలు, బాలికలు ఉన్నారు. వీళ్ళందరితో గూడిన వుత్సవం మైలు పొడుగున నడిచింది. ఇందులో పాల్గొన్నవారు బ్రిటిష్ అమెరికన్ జెండాలను, బానర్లను పట్టుకొని "కార్నెగీకి స్వాగతము!" అని వ్రాసిన ఆర్చిల క్రిందుగా ఊరేగింపును నడిపించాడు. ఈ ఉత్సవం ఆండ్రూ జన్మించిన శిలాకుటి (Stone Cottage) దగ్గర, అతని తల్లి పెట్టిన స్వీట్ షాపు (మిఠాయి దుకాణం) దగ్గర రెండుచోట్ల ఆగింది. రెండోచోట ఆగినప్పుడు ఏర్పడ్డ నిశ్శబ్దంలో వినిపించిన అబ్బీ గంటల తీయనైన ధ్వనులకు, "ఉక్కురాజు" కన్నులలో ఆనందబాష్పాలు పొంగిపొరలాయి.

తరువాత విందు జరిగింది. పరిచితాలైన పూర్వప్రదేశాలను, ఇతర ముఖ్యస్థలాలను తిరిగి చూశారు. శంకుస్థాపనోత్సవ సమయంలో ఏరిల్ ఆఫ్ రోస్బరీ ప్రసంగించాడు. ధర్మకర్తలందరూ వుత్సవపు తంతును కార్నెగీ తానే నిర్వహిస్తున్నాడని వుద్దేశపడ్డారు. కానీ, అతడు ఆ గౌరవాన్ని తన తల్లి కివ్వవలసిందని ప్రార్థించాడు. సంవత్సరం సంవత్సరం ఆమె మీద అతని గౌరవం వృద్ధి కావడమే యిందుకు కారణం. అతడు అప్పుడప్పుడు ఆమె నొసటిని వ్రేలితో తాకి 'టామ్‌కు, నాకు మేధాశక్తి నిచ్చిన తావు యిక్కడ వుంది' అనేవాడు. అతడు తలచినట్లే సితకేశకిరీటంతో వినీలమైన సిల్కు వస్త్రాలలో విశిష్టమైన మూర్తిని వహించిన అతని తల్లి, అమలినమయిన ఆత్మశక్తిని, అత్యుదాత్తతను ప్రకటిస్తూ తంతు నంతటినీ పూర్తిచేసింది. సున్నాన్ని వెండి తాపీతో పరచి, ఎత్తిన రాతిమీద ముమ్మారు మూడు దెబ్బలు కొట్టి అక్కడ సమావేశమయిన వారందరికీ వినిపించేటట్లు స్పష్టమయిన కంఠంతో "స్మృతి చిహ్నామయిన ఈ శిల సశాస్త్రీయంగాను, సక్రమంగాను నిక్షిప్తమయినదని నేను ప్రకటిస్తున్నాను. పరమేశ్వరుడీ ప్రయత్నాన్ని ఆశీర్వదించుగాక!" అన్నది.

తానొక రచయితననే భావాన్ని ఎల్లప్పుడూ వహించే ఆమె పుత్రుడు "ఆన్ అమెరికన్ ఫోర్ – ఇన్ – హాండ్ యిన్ బ్రిటన్" అన్న గ్రంథంలో ఈ కోచ్ ప్రయాణాన్ని వర్ణించాడు. ఈ గ్రంథం 1882లో ప్రకటితమైంది.

ఆ 1881 సంవత్సరంలోనే పిట్స్‌బర్గు పెట్టుబడి దారులు ప్రతిద్వంద్వంగా, హోమ్‌స్టెడ్‌లో ఎడ్గర్ థామ్సన్ వర్క్స్‌కు కొంచెం క్రిందుగా, మోనాంగహేలా నది ఆవలి ఒడ్డున మరొక ఉక్కు కర్మాగారాన్ని నిర్మించారు. కానీ కొత్త సంస్థకు కార్మికసంబంధమైన ఇబ్బందుల వల్ల దెబ్బ తగిలింది. కొంత వెనక్కు తగ్గి వచ్చిన

ఆర్డర్లను తగ్గించుకోవలసి వచ్చింది. దానిమీదట డైరెక్టర్లు వాళ్ళలో వాళ్ళు తగాదాలు పడ్డారు. చివరకు అందరూ వెళ్ళిపోవటానికి ఒప్పుకున్నారు. ఒక మధ్యవర్తి వచ్చి కార్నెగీని కలుసుకున్నాడు. ఈ పరిణామాలను మొదటినుంచీ జాగ్రత్తగా పరిశీలిస్తున్న కార్నెగీ, ఇటువంటి పరిస్థితి వస్తుందని ఊహిస్తూనే వున్నాడు. ఆ మధ్యవర్తి అతన్ని హోమ్‌స్టెడ్‌ను పుచ్చుకుంటారా అని అడిగాడు. అతడు తీసుకుంటానన్నాడు. తరువాత ఒక ప్రతినిధి సంఘం అతడిక్కడ తమను స్కాచ్ సంప్రదాయనుగుణంగా పిండివేస్తాడో అన్న భయంతో అతని కార్యాలయానికి వచ్చారు.

"మీ షరతు లే" మని వారు ప్రశ్నించారు.

"కార్నెగీ కార్పొరేషన్‌లోని స్టాకు మూలంగా గాని, విడిగా డబ్బురూపంలో గాని మీరెలా కోరితే అలా, ఆ కర్మాగారంలో మీరు పెట్టిన ప్రతి డాలరూ మీకు తిరిగి ఇచ్చివేస్తాం"

పడ్డ తబ్బిబ్బులోనుంచి తట్టుకొని ఊపిరి సలుపుకోవటానికి వాళ్ళకి కొన్ని క్షణాలు పట్టింది. వారు తమకు డబ్బే కావాలని గట్టిగా కోరారు. తిరిగి ఆలోచించుకోవటానికి క్షణకాలమైనా ఇమ్మని అడగలేదు. వారిలో ఒక్కడికి తప్ప తక్కిన వారందరికీ వేరే ఉక్కు వ్యాపారాలున్నాయి. ఆ ఒక్కడూ మిస్టర్ సింగర్. ఇతడు మాత్రం ఆలోచించుకోటానికి ఇరవై నాలుగు గంటల కాలవ్యవధి నిమ్మని కోరాడు. అతడు మర్నాటి ఉదయం తిరిగి వచ్చి "నిన్న నీవన్నది నిజంగా చెల్లించే మాటేనా? నీవు నన్ను భాగస్థుడిగా తీసుకొంటావా?" అని.

"తప్పక తీసుకుంటాను" అని నవ్వుతూ సమాధానమిచ్చి, "ఏది, కరచాలనం చెయ్యి భాగస్వామీ!" అన్నాడు.

తరువాత అతని పూర్వభాగస్థులు తమకు దూరదృష్టి లేకపోయినందుకు ఎంతో చింతించారు. అయితే మిస్టర్ సింగర్ మాత్రం తాను తీసుకొన్న నిర్ణయానికి ఎన్నడూ చింతించలేదు. ఉక్కు అప్పుడప్పుడే తన స్థితికి తాను వస్తున్నది. రైలు పెట్టెలు, కార్లు, వంతెనలు, యంత్రసామగ్రి, బాయిలర్లు, పైపు, కేబిల్, బార్బుడువైరు, అన్నిటికీ మకుటాయమానంగా కొత్తగా వచ్చి, అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్న స్కైస్క్రేపర్లకు చట్ర నిర్మాణం పూర్వపుపట్టాలకు తోడయినది. వీటన్నిటికీ ఉక్కు కావాలి.

1881లో విశేషప్రాముఖ్యాన్ని పొంది అందరి దృష్టినీ ఆకర్షించినవాడు పశ్చిమ పెన్సిల్వేనియా నుంచి వచ్చిన ఒక యువకుడు హెన్రీ క్లేఫ్రిక్. ఇతడు తెలివిగా కోల్‌ను

నిర్మించటానికి  పూనుకున్నాడు. 1881 వచ్చేటప్పటికల్లా ప్రపంచ మంతటిలోనూ మంచి కోకింగ్ బొగ్గును తయారుచేసే కోనెల్స్ విల్లీలోని ఎనభైవంతుల వ్యాపారాన్నంతటినీ ఇతడు హస్తగతం చేసుకొన్నాడు. అయితే చాలా అప్పుల్లో పడ్డాడు. అంతేకాకుండా ఈ సంవత్సరం ఇతడు ఒక పిట్స్‌బర్గ్ కన్యను వివాహమాడదలిచాడు. కొంతకాలం నుంచీ కార్నెగీ దృష్టి ఫ్రిక్‌మీద పడ్డది. ఇతణ్ణి భాగస్వామిని చేసుకోవాలనుకుంటున్నాడు. సర్వం ఇతని మీద విడిచిపెట్టి సంస్థకు బయట ఉండదగినంతటి సామర్థ్యం గలవాడితడు. వీళ్ళిరువురూ కలుసుకొని ఒక వ్యాపారపుటొడంబడిక చేసుకున్నారు. హనీమూన్ కోసం ఫ్రిక్, అతని భార్య న్యూయార్క్‌కు వచ్చినప్పుడు కార్నెగీ వాళ్ళను విందుకాహ్వానించాడు. ఆ సమయంలో తల్లి తప్ప మరెవ్వరూ అతిథులు లేరు. భోజనం ముగియబోయేముందు ఆతిథేయి లేచి నిలిచి, అతడు తన ఉత్తమమిత్రుడైన ఫ్రిక్ దంపతులకు శుభాకాంక్షలు చెప్పాడు. అందులో "మిస్టర్ ఫ్రిక్, నేను భాగస్వాములము కాబోతున్నామని" చేర్చాడు.

ఇలా చేర్చి చెప్పటం ఈ రహస్యాన్ని ఇంతవరకూ ఎరుగని తల్లి ఉపయోగం కోసమే ఉద్దేశించబడ్డది.

"ఆండ్రా, ఇది ఫ్రిక్‌కు ఎంతో మంచి విషయం" అని ఆమె వెంటనే సంతోషించింది. "ఇందువల్ల మనకేమి వస్తుంది?" అన్నది.

కొద్దికాలానికే జనవరి, 1, 1982న పదవ వంతు కార్నెగీ వర్గం వారి యాజమాన్యం గల స్టాకుతో హెచ్.సి. ఫ్రిక్ కోక్ కంపెనీ స్థాపితమైంది. ఈ సంస్థలో ఇలా ప్రారంభమైన కార్నెగీల యాజమాన్యం కాలక్రమేణా, ఫ్రిక్ కంపెనీ విధానాన్నంతటినీ నిర్ణయించేవారయినప్పటికీ, అది వారికి అత్యధికప్రతిపత్తి నిచ్చేటంతవరకూ పెరిగింది. ఈ మధ్య కాలంలో ఫ్రిక్, కార్నెగీ స్టీల్ కంపెనీలోని తన పెట్టుబడులను పెంచుకొన్నాడు.

లండన్‌కు వచ్చి బ్రిటిష్ ఐరన్ అండ్ స్టీల్ ఇన్‌స్టిట్యూట్ ముందు అతని రచనను చదవవలసిందిగా ఆహ్వానింపబడేటంతటి ఖ్యాతి నార్జించుకున్న కెప్టెన్ బిల్ జోన్స్, ఈ నాడు ఉక్కు లోకంలో సుప్రసిద్ధుడయినాడు. అతడిప్పుడు హోమ్‌స్టెడ్‌లోని వ్యవహారాలను చూస్తున్నాడు. తనకు ప్రియమైన మార్గాన్ని అనుసరించి జోన్స్‌కోసం కొంత స్టాక్‌ను వేరుచేసి, అతడు డివిడెండ్ల ధనంతో దాని విలువను చెల్లించుకొనే పద్ధతి మీద అతన్ని భాగస్వామిని చేద్దామనుకొన్నాడు. ఇందుకు ఇలా జరిగితే తాను

కంపెనీలో ఒకడై పోవటం చేత, తనకు కార్మికులకు మధ్య వుండే సంబంధం చెడిపోతుందని జోన్స్ అభ్యంతరం చెప్పాడు.

అతడు "వారు, నేను ఏవో పోకిళ్ళు పోతున్నానను కొంటా"రన్నాడు.

"అయితే ఇందుకు నీ సూచన ఏమి?" టన్నాడు కార్నెగీ.

"చాలా పెద్ద మొత్తం మీరు జీతంగా నా కివ్వవచ్చు" అని అతడు సమాధాన మిచ్చాడు.

"మంచిది. ఆ పని చెయ్యి" అని బల్లగుద్దాడు యజమాని.

"ఇప్పటినుంచి నువ్వు అమెరికా అధ్యక్షుడెంత జీతం తీసుకుంటాడో అంత తీసుకో. అది సంవత్సరానికి యాభై వేల డాలర్లు"

"అది కేవలం చెప్పుకోటం మాత్రమే ఆండీ!" అన్న మాటే బిల్ ఇచ్చిన అంగీకారం.

సౌమ్యస్వభావుడయినా ఎళ్ళవేళలా కార్నెగీ పొడిచి పని చేయిస్తుంటాడు. అభివృద్ధులను గురించి, ఇతర విషయాలను గురించి రిపోర్టులు అడుగుతుంటాడు. "ఉక్కును ఉత్పత్తి చేయటంలో గడచిన వారం మనం పూర్వపు లెక్కలను అన్నింటినీ అధిగమించాము" అని తెలియజేస్తే అతడు సమాధానమిస్తూ "శుభాకాంక్షలు. ప్రతి వారం మన మిలా ఎందుకు చెయ్యకూడదు" అని అడగడమో లేక విలువల పట్టికలను (Cost Sheets) పంపమనటమూ చేసేవాడు. "8వ నెంబరు కొలిమి ఈ రోజున పూర్వపు రికార్డు నంతటినీ మించింది" అని తెలియజేస్తే "వెంటనే మిగిలినవి ఏం చేస్తున్న" వని ప్రశ్నించేవాడు. బిల్ జోన్స్ ఈ సూదిపోట్లతో కొన్ని సమయాలలో నలిగిపోతుండేవాడు. విపులమయిన రిపోర్టులు, మూల్యపు పట్టికలు తయారుచెయ్యటమంటే అతనికి అసహ్యం. అతడు గొప్ప ఉక్కు నిర్మాత కానీ గణనాంక (Statistics) మంటే అతనికి తలనొప్పి. తన వేసవి యాత్రలను గురించి చెపుతూ ఒకమాటు కార్నెగీ అతనితో "నేను ఎంత అలసిపోయినా స్టీమ రెక్కిన తరువాత అర్ధగంట గడిచి న్యూ జెర్సీ ఉన్నతభూములు నా వెనుక క్షితిజరేఖలోకి దిగజారినవంటే నా బాధ్యతలు, అలసట నన్ను విడిచి జారుకుంటాయి. బిల్, అది ఎంత ఉపశమనమో నీకు తెలియదు" అన్నాడు.

"అది మిగిలిన మా అందరికీ ఎంత ఉపశమనమో నీకు తెలియదు" అని సరసత లేని ఆ కెప్టెన్ జోన్స్ బదులు పలికాడు.

యజమాని కార్యాలయానికి రిపోర్టులను తీసుకొని రావలసిన ఒక రోజున జోన్స్ బదులుగా ఆరడుగుల ఎత్తు వాడు, తేజోవంతుడు అయిన ఒక యువకుడు హాజరై కెప్టెన్ పంపితే వచ్చానన్నాడు. అతడు సంక్షిప్తరూపంలో వున్న రిపోర్టును అందిస్తే తల యెత్తబోయేముందు కార్నెగీ కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా పరిశీలించాడు.

"కర్మాగారాన్ని గురించి నీకంతా తెలుసునని కెప్టెన్ అంటున్నాడు" అన్నాడు కార్నెగీ.

"ఔను. దాన్ని గురించి నాకు బాగా తెలుసును" అని ఆ యువకుడు సమాధానం చెప్పాడు. అందమయిన చిరునవ్వు యథాప్రకారంగానే అతని ముఖాని కందాన్నిచ్చింది.

"నీ పేరేమి?" అంటూనే మహావ్యాపారి కెప్టెన్ వ్రాసిన చీటీకి క్రిందభాగాన్ని చూస్తున్నాడు.

"ఛార్లెస్ యం. స్క్వాబ్."

"మంచిది. చార్లీ, అక్కడ మన స్థితి ఎలా వుందో చెప్పు. నాకు చాలు" అన్నాడా వ్యాపారప్రముఖుడు. విపులమయిన నివేదికను వినటానికి అతడు కుర్చీలో వెనక్కు వాలాడు. నివేదిక అతనికి ఆశ్చర్యాన్ని కలిగించేటంత విపులంగా వచ్చింది. ఈ యువకుడు నిశ్చయంగా కర్మాగారాన్ని గురించి అంతా తెలిసినవాడు. కార్నెగీ ఎన్నో ప్రశ్నలను కురిపించాడు. అతడు వెంటనే అన్నిటికీ పూర్తిగా సమాధానం చెప్పాడు. ఈ మధ్యకాలంలో కార్నెగీ అతని ముఖం ఎక్కడో కొంత పరిచితమయినట్లు తోచింది.

"మనం పూర్వం ఎప్పుడయినా కలుసుకొన్నామా?" ఇది తరువాతి ప్రశ్న.

"ఔను. క్రెస్సన్‌లో మీ గుర్రాన్ని పట్టుకుంటుండేవాణ్ని."

అక్కడే, ఆ క్షణాన క్రొత్త భాగస్వామి ఇంకొకడు ఏర్పడ్డాడు.

ఉక్కు వ్యామోహం ఆకర్షించటం వల్ల స్క్వాబ్ పద్దెనిమిదేళ్ళ వయస్సులో బ్రాడ్డాక్ వరకు వచ్చి, అక్కడ ఒక చిల్లరకొట్టులో ఉద్యోగానికి కుదిరాడు. అప్పుడు అతడు కెప్టెన్ జోన్సుకు నిత్యం చుట్టలు సప్లయి చేస్తుండేవాడు. "కెప్టెన్ జోన్సు, మిల్లులో నా కేదైనా వుద్యోగమివ్వగలవా?" అని ఒకరోజు ఆయనను అడిగాడు.

అప్పటికే జోన్స్‌కు ఆ యువకుడి మీద ప్రీతి ఏర్పడి వుంది. "ఏమిటి? చార్లీ, తప్పక యిస్తా" న్నాడు.

అది అంతగా తేలికగా జరిగిపోయింది. తెలుసుకొంటున్న కొద్దీ అతడు చార్లీని మెచ్చుకోటం ప్రారంభించాడు. స్వాబ్ మంచి బుద్ధికుశలత కలవాడు. పని విషయంలో అలసటంటూ ఎరగడు. శ్రద్ధ విశేషం. జీవించి ఉన్నవారిలో కల్లా మనోహరమయిన వ్యక్తి. వెంటనే అతడు వుక్కును నిర్మించటాన్ని గురించిన రసాయనికశాస్త్రగ్రంథాలు చదవటం ప్రారంభించాడు. కెప్టెన్ బిల్ అన్నట్లు అనతికాలంలోనే అతడు ఆ కర్మాగారాన్ని గురించిన అన్ని విషయాలు తెలుసుకొన్నాడు. ఇటువంటి వ్యక్తులే కార్నెగీకి ప్రీతిపాత్రులు కాగలిగే అర్హత గలవాళ్ళు తొలి సమావేశమయిన క్షణంనుంచీ అతడు ఆ వుక్కు రాజు 'అంతరంగ ప్రముఖుల'లో ఒకడయినాడు. తుదకు వారందరికంటే అతడికి అతిసన్నిహితుడయినాడు. జోన్సు అతనికి వుద్యోగమిచ్చిన తరువాత ఆరు నెలలలోనే స్వాబ్ బ్రాడ్డాక్‌లో అసిస్టెంటు మేనేజరయినాడు. అతడు కేవలం స్వశక్తి వల్ల ఆ స్థానాన్ని సంపాదించుకున్నాడు. తరువాత ఐదు సంవత్సరాలకు కెప్టెను జోన్సు కర్మాగారంలో కలిగిన ఒక హఠాత్సంభవం వల్ల మరణించినప్పుడు, చార్లీ హోమ్‌స్టెడ్ కర్మాగారానికి సూపరింటెండెంటు అయినాడు. అతని పర్యవేక్షణ క్రింద ఉత్పత్తి ప్రశంసనీయంగా పెంపొందింది.

కార్నెగీ తరువాత ఒక కాంగ్రెషనల్ కమిటీలో ప్రసంగిస్తూ "మిస్టర్ స్వాబ్ ఒక మేధావి. అతనితో సమానమయినవాణ్ణి నేనెన్నడూ కలుసుకోలేదు" అన్నాడు.

అనేక సంవత్సరాలలో అనేకులైన యువకులకు భాగస్వామ్యం ఇచ్చినట్లే తరువాత స్వాబ్‌కు కూడా భాగస్వామ్యమిచ్చి, భాగస్థుణ్ణి చేయటం జరిగింది. అతని కోసం కార్నెగీ కార్పొరేషనులోని కొన్ని వాటాలను అసలు విలువకు అమ్మటం జరిగింది. వాటినే స్టాక్ ఎక్స్‌చేంజిలో పెడితే ఎంత వచ్చేదో చెప్పటం కూడా జరగలేదు. డివిడెండ్ల నుంచి ఈ డబ్బును అతడు అతివేగంగా చెల్లించాడు. అతడు తరువాత మహాభాగ్యవంతుడయినాడు. ఇలా ఎన్నుకోబడ్డ యువకభాగస్థులందరూ భాగ్యవంతులయినారు. 'కార్నెగీ గ్లౌసెస్టర్ ఫిషింగ్ ఫ్లీట్' తన దృష్టిలో ఆదర్శమయిన వ్యాపార సంస్థ అని చెబుతూండేవాడు. అందులో జీతం పుచ్చుకొనేవాళ్ళంటూ లేరు. అందరూ లాభాలు పంచుకొనేవాళ్ళే.

మనుష్యుల గుణనిర్ణయం చెయ్యటంలో కార్నెగీ మహా ఘటికుడు. అతడు ఒకణ్ణి మంచివాడని నిశ్చయించుకున్న తరువాత అతడిమీద తప్ప విశ్వాస ముంచేవాడు. స్వాబ్ మీద అతడుంచిన విశ్వాసం దరిదాపుగా పరిపూర్ణమయినది. అతని పై

అధికారిని కార్నెగీ స్కా ్వబ్‌ను క్రొత్త కన్వర్టింగు మిల్లును కట్టనీయవలసిందని త్వరపెట్టాడు. "ఆ మిల్లును నిర్మించటం వల్ల మనం టన్నుకు యాభై సెంట్ల ఉక్కును పొదుపు చెయ్యగల" మని అతడు వాగ్దానం చేశాడు.

అది కార్పొరేషన్ దేశంలో మిక్కుటంగా ధనమున్న సమయం కాదు, అయినా తుదిమాటగా కార్నెగీ "మంచిది. సాగిపొండి!" అన్నాడు.

మిల్లును నిర్మించటం జరిగింది. ఒకనాడు యజమాని దానిని చూడవచ్చాడు. ఎప్పటిలాగానే తేజస్సుతో, పొంగి పొరలే ఆత్మవిశ్వాసంతో, మోయవలసి వున్న మహాకార్యభారాన్ని వహించే ఉత్సాహంతో స్క్వాబ్ తనకు కనిపిస్తాడని అతడు ఆశించాడు. కానీ కార్నెగీ అన్నిటినీ పరిశీలిస్తూ నడుస్తున్నప్పుడు అతడి కుశాగ్రమయిన బుద్ధి స్క్వాబ్ ఉత్సాహంతో లేడని గమనించింది. ఛార్లీ అక్కడ కేవలం ఉద్యోగానికి వున్న ప్రదర్శకుడి (Guide) లా వున్నాడు. ఏదో నిత్యం గడిచిపోతున్న పనిలాగానే ఈడ్పుగొట్టు ధోరణిలో అతడికి విషయాలను తెలియజేస్తున్నాడు.

చివరకు ఆ ప్రముఖుడన్నాడు : "చార్లీ, ఇక్కడ ఏదో లోపం కనిపిస్తున్నది. నీకేదో ఆశాభంగం కలిగినట్లు నాకు తోస్తున్నది. ఈ కర్మాగారంలో ఏదో దోషమేర్పడ్డది. అటువంటిదేమీ లేదా?"

"లేదు కార్నెగీ!" అని సమాధాన మిచ్చాడు స్క్వాబ్.

"ఇది ఎలా వుంటుందని నేను చెప్పానో అలాగే వచ్చింది. నేను చెప్పినట్లు మనం ఖరీదులను తగ్గించుకున్నాము. అయితే దీన్ని నేను మళ్ళా నిర్మించమంటూ వస్తే కొద్ది కాలానికి పూర్వమే క్రొత్తగా కనిపెట్టబడ్డ మరొక దాన్ని ప్రవేశపెడతాను. అందుమూలంగా మనం టన్నుకు పదిసెంట్లు కాదు, డాలరు పొదుపు చేసుకోవచ్చును" అన్నాడు.

"అయితే నీ అభిప్రాయ మేమిటి? ఈ మిల్లును నీవు మార్చగలవా?"

"మార్చలేను. బ్రద్దలుకొట్టి మళ్ళీ కట్టటమే నా ఉద్దేశం."

క్షణమాలోచించకుండా కార్నెగీ "అది చెయ్యదగ్గ పని. కంటికి తప్పిపోయిన దానిని సరిదిద్దుకోవటం వల్ల, పని జరిగిపోయిన తరువాత కనిపెట్టబడ్డం, దానివల్ల ప్రయోజనం లభిస్తుంటే దాన్ని పొందకపోవటం తెలివితక్కువ. దీన్ని పడగొట్టించి మళ్లీ కట్టు!"

అతడు క్రొత్తగా కనిపెట్టింది ఏమిటని కూడా ప్రశ్నించలేదు. అయితే స్వాబ్ దానిని వెంటనే తెలియజేశాడు. ఈ విషయాన్ని గురించి ముందుగా నీ వెందుకు ఆలోచన చెయ్యలేదని అతడు అడుగకపోవటం కృతజ్ఞతాపూర్వకంగా జ్ఞాపకం పెట్టుకున్నాడు. తరువాతి కాలంలో స్వాబ్ తన ఛాయాచిత్రాన్ని యజమానికి పంపిస్తూ "నా అత్యంత ప్రియమిత్రునకు, యజమానికి" అని వ్రాయటంలో ఆశ్చర్యమేమీ లేదు.

కానీ కార్నెగీ కొన్ని మాట్లు తన 'బాలుణ్ణి' దుబారాతనం విషయంలో మెత్తగా చీవాట్లు పెట్టటం జరిగింది. "చార్లీ, నీవు నాకు అర్థం కావడం లేదు. పేద కుర్రవాడివి. గ్రామ సీమలో పుట్టినవాడివి. అయినా డబ్బు విలువ నీకు తెలియలేదు. నీకు పరిమితి లేనంత ధనం వున్నట్లు నిరంతరం క్రొత్త పనులను పెంచటం వ్యయం చేస్తుంటావు" అని అతడన్నాడు. కాని చార్లీ అతనితో ఎదురువాదం చేస్తుండేవాడు. అయితేనేం యజమాని ఎన్నడూ తనకు ఆప్తుడైన ఆశ్రితుని పథకాలను వేటినీ నిషేధించకపోవటం కనిపిస్తుండేది.

ఒక మధ్యాహ్నం వేళ జరిగిన సంఘటనను గురించి చెపుతూ స్వాబ్, తరువాతి కాలంలో ఎంతో సంతోషిస్తుండేవాడు. స్వాబ్ తానే న్యూ యార్క్ చేరి, తరువాత ఒక వ్యాపార విషయాన్ని గురించి కార్నెగీ సలహా పొందటం కోసం అతని యింటికి వెళ్ళాడు. అలా వెళ్ళినది ఇంకా స్వయంచోదకాలయిన బండ్లు ఏవీ లేని రోజులు. అతడు తనకు సహజమైన రీతికి తగినట్లుగా అందమయిన "కాబ్"ను గాని, లేదా ఒంటి గుర్రపు బండినిగాని పిలవకుండా ఒక "కారేజి"ని పిలిచాడు. యజమానితో మాట్లాడటానికి యింట్లోకి వెళుతూ, శకటచోదకుడితో వేచివుండవలసిందని చెప్పాడు. వాళ్ళ సమావేశం అనుకున్న దానికంటె ఎక్కువసేపు పట్టింది. చివరకు అతణ్ని తనతో భోజనానికి వుండిపొమ్మని కార్నెగీ ఆహ్వానించాడు. బండిని గురించిన పూర్తిగా మరచిపోయిన చార్లీ, ఆహ్వానాన్ని అంగీకరించాడు. భోజనానంతరం తన సంభాషణను యింకా పొడిగించాడు. చివరకు బట్లరు వచ్చి ద్వారం దగ్గర నిలచి అన్నాడు.

"క్షమించండి మిస్టర్ స్వాబ్. బండిని మీరు యింకా వుండమంటారా?" చార్లీ ముఖం బీటు దుంపలా ఎర్రవారిపోయింది. తిరిగి స్వస్థాయిని పొందేలోగా అతడు కలవరపాటును పొంది మాటల్లో నోటి తుంపరలు రాల్చాడు. అతని యజమాని ఒక మాటయినా అనలేదు. ఊరక కూర్చుని హఠాత్తుగా తోచిన హాస్యాస్పదమయిన అభినయంతో అతనివైపు చూశాడు. మాటలతో పనిలేకపోయింది.

# 10. వివాహం ఐశ్వర్య సువార్త

కార్నెగీకి గుర్రపు స్వారీ అంటే చాలా యిష్టం. రకరకాల యువతులతో కలిసి అతడు కేంద్రారామంలో (Central Park) స్వారీ చేశాడు. ఈ యువతుల్లో లూయావిట్ఫీల్డ్ ఒకతె. ఈమె న్యూ యార్క్‌లో ఒక టోకు వ్యాపారస్థుని కుమార్తె. ఈమె అంటే ఆండ్రూకు ఎక్కువ మక్కువ. ఒకటి రెండు సంవత్సరాల సాహచర్యం కలిగిన తరువాత, ఆమె అంటే తనకు ప్రేమ వున్నట్లు అతడు గ్రహించాడు. జీవితంలో ఆమెతో పూర్వానురాగ ప్రేమోదంతం ప్రశాంతంగా నడిచింది. చివరకు మిస్ విట్ఫీల్డు అతడు చేసిన వివాహ సూచనకు అంగీకరించింది. కొంతకాలం వారు ఒడంబడిక సమయంగా గడిపారు.

ఈ మధ్య కాలంలో కార్నెగీ ప్రతి సంవత్సరం చేసే విదేశయాత్రల సందర్భాలలో గ్రేట్ బ్రిటనులోని అనేకులతో స్నేహసంబంధాలు, ఇతర సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. మాథ్యూ ఆర్నాల్డు, తాత్త్వికుడు హెర్బర్టు స్పెన్సర్ వైకౌంట్ మోర్లే, ఎరల్ ఆఫ్ ఎల్జిన్, సర్ విలియం వెర్నాన్ హార్ కోర్ట్, నార్డు బ్రైస్, గ్లాడ్ స్టన్, రోజబరీ, బాల్ఫోర్ కాంబల్ బానర్‌మన్ ప్రభృతులయిన ప్రధానమంత్రులు, ప్రముఖులయిన పారిశ్రామికులు, బ్యాంకర్లు అతని ఆప్తమిత్రవర్గంలోని వారయినవారు. అతడు ఒక మారు బ్రిటిష్ ఐరన్ అండ్ స్టీల్ ఇన్‌స్టిట్యూటుకు అధ్యక్ష పదవిని నిర్వహించారు. అనేక విషయాలమీద తన అభిప్రాయాలను వెల్లడిస్తూ బ్రిటిష్ పత్రికల కెన్నిటికో వ్యాసాలు వ్రాశాడు. 1886లో ప్రకటితమైన అతని "ట్రయం ఫేంట్ మార్చి" అన్న గ్రంథంలో అతడు పూర్వప్రపంచం కంటె అమెరికాకున్న ఆధిక్యాన్ని విశేషంగా పొగడి, ఇప్పటికీ అతని మీద బ్రిటిష్ మంత్రులతో అతడు సంభాషించిన సమయాలలో అతడు రాచరికాన్ని రద్దుచేసి గణతంత్ర రాజ్యవ్యవస్థను నెలకొల్పుకోవలసిందని ఎంతో తీవ్రంగా వాదించాడు. తన అతివాదభావాలను ప్రచారం చెయ్యటం కోసం అతడు యునైటెడ్ కింగ్డమ్‌లోని అనేకపత్రికలను కొన్నాడు. అతని దృష్టిలో బ్రిటిషువారు కేవలం మితవాదులు అయినప్పటికీ, అతడు ఆ బ్రిటిషువారి ప్రేమను విశేషంగా చూరగొన్న అమెరికన్ అని అనిపించుకొన్నాడు. ఇంగ్లీషు, స్కాచ్, ఐరిష్ జాతులవారు, ఒకరి తరువాత ఒకరు, అతనికి "ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ" ఇచ్చి గౌరవించారు. ఈ సమయంలో వారు సుదీర్ఘాలైన "స్క్రోల్సు" (సన్మానపత్రాలు) ఇచ్చి అవసరమయిన తంతును అతి

ఘనంగా జరిపించారు. ఇతరులందరికంటె ఇతడు ఈ జాతి గౌరవాలను విశేషంగా పొందాడు. అవి ఏబది తొమ్మిది. ఈ గౌరవాలను పొందినవారిలో ఇతని తరువాతి వాడు మిస్టర్ గ్లాడ్ స్టన్. ఇతని కబ్బిన ఇట్టి గౌరవాలు పదిహేడు మాత్రమే. ఈ అమెరికన్ ఘన వ్యాపారిని పార్లమెంటుకు ఎన్నుకోవాలన్న వదంతి కూడా ఇంగ్లండులో బయలుదేరింది.

మిస్ విట్‌ఫీల్డ్ ఇదంతా చూసి భయపడిపోయింది. ముఖ్యంగా ఆమె భీతికి కారణం ఇతడు బ్రిటిష్ పార్లమెంటులో కూర్చోబోతున్నాడని వినటం. చివరకు ఇంత విశేషంగా విస్తృతిని పొందిన అతని జీవితానికి తాను ఉపకరించలేదనే నమ్మకంతో, ఆమె ఒడంబడికను (Engagement) భగ్నం చేసింది.

1886లో క్రెప్సన్ పర్వతశిఖరం మీద ఉన్నప్పుడు కార్నెగీకి టైఫాయిడ్ జ్వరం పట్టుకున్నది. ఆ సమయంలో దుఃఖం అతణ్ని విశేషంగా క్రుంగదీసింది. అతని తల్లి, సోదరుడు ఇరువురూ జబ్బుచేసి మరణించారు. మిసెస్ కార్నెగీ మరణానికి విశేషంగా వృద్ధాప్యం కారణం. కానీ నలభై మూడేళ్ళ వయసులోనే టామ్ చనిపోవటం ఆండ్రూకు అనుకోని ఉపద్రవం. ఈ వార్తను అతనికి తెలియజేసినప్పుడు అతడు ఇక తాను జీవిస్తేనేం మరణిస్తేనేమన్నంత నిస్పృహ చెందాడు. అఖిలప్రపంచంలో అతని కత్యంత ప్రియతములయిన ఇద్దరినీ అతడు కోల్పోయినాడు. ఆ ఇరువురూ అతనికి విలువయిన సలహాదారులు, సహాయకులు. టామ్ కార్నెగీ సంస్థలన్నింటికీ అధ్యక్షుడు. అతనికి కుడిభుజం. అతడు లేకుండా జీవితాన్ని ఎలా సాగించాలో అతనికి అర్థం కాలేదు.

కొంతకాలం అతడు ఎంతగానో క్రుంగిపోయాడు. క్రమంగా అతడు శారీరక మానసిక బలాలను రెంటినీ కొద్దిగా పొందుతున్నాడు. అతడికి మరొక “ప్రియతమయిన వ్యక్తి లూయీ విట్ఫీల్డ్. ఆమెను గురించి మరల మరల వచ్చే మనోభావాలను త్రోసిపుచ్చలేకపోతున్నాడు. బహుశః ఆమె ఇప్పుడు కొంత తేరుకొని లేచి కూర్చోగలిగిన వెంటనే అతడు తమ ఒప్పందాన్ని పునరుద్ధరించవలసిందని కోరుతూ ఒక లేఖ వ్రాశాడు. అతనికి ప్రయాణం చేయగల పరిస్థితి చేకూరింది. అప్పుడు అతనికి వైద్యం చెయ్యటం కోసం ఆహ్వానింపబడ్డ అతి సమర్థుడయిన న్యూ యార్క్ వైద్యుడు డాక్టరు ఎఫ్.ఎస్. డెన్నీ అతణ్ని న్యూ యార్క్‌లోని డెన్నీ హోమ్‌కు తీసుకొనిపోయాడు. అక్కడ ఆ వైద్యుడు, అతని భార్య చూపిన శ్రద్ధ వల్ల అతడు బాగా కోలుకోవడం జరిగింది. మిసెస్ విట్ఫీల్డు అక్కడికి వచ్చి అతని దుఃస్థితిని, దైన్యాన్ని చూసి, పునఃపరిశీలన చేశానని, ఇప్పుడు అతణ్ని వివాహమాడటానికి తన కిష్టమేనని చెప్పింది. ఆమె అతణ్ని

ప్రేమించింది కదా మరి! “ఇప్పుడు నా అవసరం నీకున్నదని నేను భావిస్తున్నాను. ఇప్పుడు నేను నీకు నిజమైన సహాయకురాలుగా ఉండగలను” అని ఆమె అతనితో చెప్పింది.

ఏప్రిల్, 1887న వారిరువురూ వివాహం చేసుకున్నారు. విగ్ట్ ద్వీపంలో ‘హనీమూన్’ గడిపారు. అంకుల్ లాడర్, మరొక మారిసన్ కజిను అక్కడికి కొలది కాలం విహారయాత్ర కోసం వచ్చారు. అంకుల్ లాడర్ వారికోసం స్కాట్లండ్‌లోని గ్రాంపియన్ కొండల్లోని గ్రాంటుల పూర్వీకుల ఇల్లయిన కిల్ గ్రాస్టన్ కాజిల్‌ను, వేసవి గృహంగా ఉపయోగించుకోటానికి అద్దెకు సంపాదించి పెట్టాడు. ఉత్తరదిక్కుగా పయనిస్తున్నప్పుడు మార్గమధ్యంలో వారు పూర్వం నగరానికి వచ్చిన గ్రంథాలయానికి కార్నెగీ శంకుస్థాపన చేసిన ఎడింబరోలో ఆగారు. అతనికి “ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ” అనే గౌరవాన్ని ప్రసాదిస్తున్నప్పుడు లార్డు సాలిస్‌బరీ ముఖ్యప్రసంగం చేశాడు. ఎడింబరో నుంచి వారు డన్ఫర్మ్‌లైన్‌కు వెళ్ళారు. అక్కడ వధువు ఆ నగరాన్ని, బంధువర్గాన్ని చూసి ఆనందించింది. బంధువర్గం కూడా ఆమెను చూచి ఎంతో సంతోషించారు. వాళ్ళలో చాలామంది ఆమె భర్తతో అన్నారు “ఆండ్రూ! ఆమె నిన్ను వివాహం చేసుకొన్నందుకు నాకాశ్చర్యంగా ఉంది” అని. అందుకు అతడు “మీరు నాకంటే విశేషమైన ఆశ్చర్యాన్ని పొంది ఉండరు!” అని ప్రతిభాషణం చేశాడు.

ఈ వివాహం కంటే ఏదీ ఆనందప్రదంగా వుండదు. మిసెస్ కార్నెగీ తనకంటే కూడా ఎక్కువ స్కాచ్ అయిపోతున్నదని ఆమె భర్తే అన్నాడు. ప్రాత నగరాలు, కొండలు, సరస్సులు, పూలు అన్నీ ఆమెకు సంతోషప్రదాలైనాయి. ఆమెకు ముఖ్యంగా బాగ్ పైప్ సంగీతమంటే ఇష్టం కలిగింది. నిద్ర మేల్కొనేటప్పటికల్లా ప్రతిదినం బాగ్ పైప్ సంగీతజ్ఞుడు తమకు పాడుకుంటూ ఎదురురావటం, భోజనవేళల్లో ఆ వాద్యసంగీతాన్ని వినిపించటం ఎంతో ఉల్లాసకరాలుగా ఉంటాయని ఆమె సూచించింది. ఆమె కోర్కె వెంటనే తీర్చబడింది. తన శాఖకంతటికీ ప్రముఖుడయిన క్లరీమొక్ఫర్ సన్ గొప్పగా సిఫారసు చేస్తూ ఒక లేఖను వ్రాసియిచ్చి, ఒక బాగ్‌పైపర్ కళాకారుణ్ణి కార్నెగీల దగ్గరికి పంపించాడు. వారు కిల్గ్రాస్టన్ దుర్గంలో ప్రవేశిస్తున్నప్పుడు తన సంగీతంతో అతడు వారికి ముందు నడిచాడు.

ఆ వేసగి ఎంతో సంతోషంగా గడిచిపోయింది. గుంపులు గుంపులుగా అతిథులు వారి సౌధంలో మూగుతున్నారు. డన్ఫర్మ్‌లైన్ బంధువర్గం వారితో చేరారు. వీరందరూ వస్తూపోతూ ఉండటంతో కాలం గడచిపోతూండేది. ఆకురాలు కాలంలో కార్నెగీలు

న్యూయార్కుకు తిరిగి వచ్చేటప్పుడు వెంట పైపరును కూడా తీసుకువచ్చారు. ఫీఫ్టీ ఫస్టు స్ట్రీట్‌లో ఫిఫ్త్ ఎవెన్యూలో అతివిశాలమైనదీ, ఆడంబరం లేనిది అయిన తమ యింట్లో అతన్ని ఒదిగించటం కొంచెం కష్టమని వారు గమనించినప్పటికీ, అతన్ని తీసుకు వచ్చారు. తరువాత వచ్చిన వేసగికి మెక్ ఫర్సన్ దగ్గరినుంచి క్లనీ కాజిల్‌ను అద్దెకు పుచ్చుకొని, అక్కడికి వచ్చినప్పుడు కార్నెగీలు తిరిగి వారి దేశంలోకి వచ్చినట్లు భావించారు. ఇలా వారు వేసగి ఋతువులు గడిపారు.

కొన్ని సంవత్సరాల నుంచి కార్నెగీ పెద్ద మొత్తాలుగా డబ్బు దానం చేస్తున్నాడు. 1887లో గ్లాడ్ స్టన్‌తో ఒక మాటు "ఒక మనిషి ధనికుడిగా మరణించడం అవమానకరమైన విషయ" మన్నాడు. ఇది జీవితాంతం వరకూ నిలుపుకోలేకపోయిన ప్రకటన అని అతడు గుర్తించాడు. 1889లో అతడు నార్తు అమెరికన్ రివ్యూలో రెండు వ్యాసాలు వ్రాశాడు. వీటిలోని సారాంశమే చివరకు అతని "ఐశ్వర్యసూత్రం" (స్త్రళిరీచీలిజి ళితీ ఇలిబిజిశినీ) అన్న పేరుతో ప్రసిద్ధికెక్కింది. అతడు ధనాన్ని బంధువులకు తన అనంతరం వారసత్వంగా చెందేటట్లు ఇచ్చి వెయ్యవచ్చు. తన మరణానంతరం ప్రజా సంక్షేమ కార్యాలకు దానిని వినియోగించటం కోసం విడిచిపెట్టవచ్చు. లేదా దాన్ని తన జీవితకాలంలోనే ఇచ్చి వేయవచ్చు. ఈ మూడింటిలో కార్నెగీ చివర మార్గాన్ని మిగిలిన రెంటి కంటె మంచిదిగా భావించాడు. ధనాన్ని ప్రజావారసత్వంగా విడిచిపెట్టి వెడితే దాతకు గల వాస్తవమైన ఆదర్శంగానీ, లేదా ఆకాంక్ష గానీ కొన్ని సందర్భాలో సఫలం కాకపోవచ్చు. అతడిలా అన్నాడు : "లోకానికి ఎక్కువ ప్రయోజనకారి కాకపూర్వమే అతడు మరణించేటంతవరకూ ఆగి వుండటానికి తృప్తి వహించగలిగితే, ఆస్తిని మరొకరి పరం చేయడానికి ఇది ఒక సాధన మాత్రమే ఔతుంది." ఇటువంటి ఆచారాలను నిరుత్సాహపరచటం కోసం వారసత్వాల మీద విశేషంగా పన్నులు విధించాలనీ అతడు అభిప్రాయపడ్డాడు. "తనవెంట తీసుకుపోలేని దానిని విడిచిపోయినందుకు ఒక వ్యక్తిని స్తుతించటం అసాధనం. వ్యక్తి మరణవేళ ఎంత విడిచిపెట్టి వెళ్ళినా అది పరిగణనీయమయింది కాదు. అట్టి ధనం అతడి దగ్గర నుంచి బలవంతంగా లాగుకోబడ్డది గాని దానమివ్వబడినది కాదు" అన్నాడతడు.

నగరం కనుక 15,000 డాలర్లు ప్రతి సంవత్సరం కేటాయించి దానితో సక్రమ నిర్వహణకు ఏర్పాటు చేయిస్తామంటే తాను ఒక ప్రజాగ్రంథాలయానికి 2,50,000 డాలర్లు ఇస్తానని, కార్నెగీ పూర్వం 1881లో పిట్స్‌బర్గు మేయరుకు ఒక లేఖ వ్రాశాడు. నగర ప్రముఖులు కొందరు ఈ సూచనను వ్యతిరేకించటం చాలా వింతయిన విషయం.

పిట్స్‌బర్గ్ టైమ్స్, పుస్తకాలు, మాగజైన్లు, వార్తాపత్రికలు పెద్ద ఖరీదు లయ్యేవి కావు కాబట్టి గ్రంథాలయం అనవసరమని, ప్రజాపార్కు అవసరమని, అందువల్ల కార్నెగీ దానికి ఇస్తే బాగుంటుందని సంపాదకీయం వ్రాసింది. అంతేకాకుండా గ్రంథాలయం కోసం పన్నులు వేసి డబ్బులు చేకూర్చటానికి నగరానికి అధికారం కూడా లేదని అది సూచించింది. అందువల్ల శాసనసభ గ్రంథాలయాన్ని నెలకొల్పి దానిని పాలన చేయించే విషయంలో ఒక శాసనం చేసేటంత వరకూ ఈ విషయం ఆరేళ్ళపాటు వెనకబడ్డది. అప్పటికి ఇంకా పిట్స్‌బర్గ్‌తో చేరిపోని అలీఘను ఈ మధ్యకాలంలో కార్నెగీని అభ్యర్థించి, కల్నల్ ఆన్డర్ సన్ మోమోరియల్‌తో బాటుగా దానిని కూడ పొందింది. ఆ వుత్సవసమయంలో ప్రసంగించటానికి ప్రెసిడెంటు బెంజిమిన్ హారిసన్ వాషింగ్టన్ నుండి వచ్చాడు.

పిట్స్‌బర్గ్ 18, 87 చివరిలో ఆ దానాన్ని పుచ్చుకోటానికి సంసిద్ధమైనప్పుడు, కొలది సంవత్సరాలలోనే ఆ నగరం బాగా వృద్ధి పొందనున్న అంశాన్ని గమనించి, దానికి ఆ దానశీల, తాను ముందు భావించిన దానికంటె పరిశోధన, సంచరణ (Circulation) గుణాలకు అవకాశాన్నిచ్చే బృహద్గ్రంథాలయం, కళాఖండ నివేశనగృహం, (Art Gallery) ఆడిటోరియంలు అవసరమని గుర్తించాడు. నగరపాలనకోసం 40,000 డాలర్లు వ్యయం చేస్తానని వాగ్దానం చేస్తే తాను పదిలక్షల డాలర్లు ఇస్తానన్నాడు. తరువాత త్వరలోనే దానికి మరో 1,00,000 (లక్ష) డాలర్లు చేర్చాడు. ఆర్టు గ్యాలరీ కోసం ఒక పదిలక్షల డాలర్‌లు యిచ్చాడు. కార్నెగీ ఇన్‌స్టిట్యూట్ పెరిగిపోయింది. ఒక పావు శతాబ్దిలో దాని దాత, దానికోసం 2,80,00,000 (రెండుకోట్ల ఎనభై లక్షలు) డాలర్‌లు వ్యయం చేశాడు.

అతని దానాలు విస్తృతిలోను, సంఖ్యలోను క్రమంగా పెరిగిపోతున్నవి. కొంతకాలంగా అతడు క్రొత్త భవనాలలో నిర్మించుకోవటానికి గ్రంథాలయాలను, ఇతరమయిన అవకాశాలను చేర్చుకునేటందుకు కళాశాలలకు 10,000 మొదలు 1,00,000 డాలర్‌ల వరకూ, కొన్ని సందర్భాలలో ఇంకా ఎక్కువ మొత్తాలు ఇస్తూ వచ్చాడు. అతడు నగరంలో ఇదివరకే ఉన్న గ్రంథాలయాలను పెంపొందించు కొనేటందుకు డబ్బు ఇచ్చిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు అట్లాంటాలో యంగ్ మెన్స్ లైబ్రరీ ఎసోసియేషన్ ముప్పది సంవత్సరాలనుంచి ఒక ప్రజాగ్రంథాలయాన్ని నెలకొల్పి నడిపించడానికి ఎంతగానో తికమక పడుతున్నది. దాన్ని పెంపొందించి మంచి స్థితిలో నిలపటం కోసం, కార్నెగీ వారికి 1,25,000

డాలర్‌లు ఇచ్చాడు. వారికీ పనిని పూర్తి చేయటానికి చాలా సంవత్సరాలు పట్టింది. ఆ భవనాన్ని తిరిగి తెరిచినపుడు అల్టూనాలోని చిన్న పిల్లలు పెన్నీలు పెన్నీలుగా ఇచ్చిన ద్రవ్యంతో తయారు చేయించిన చిన్న పాలరాతి కార్నెగీ విగ్రహం (Bust) కృపాళువైన ఆ దాత జ్ఞాపక చిహ్నంగా ప్రవేశద్వారానికి వెనక ప్రక్కన ఉంచబడింది.

అతడు న్యూ యార్క్‌లోని ఇంజినీరింగ్ సంస్థలకు, ప్రతి ఒక్క స్థలం ప్రత్యేక నివేశనాన్ని ఏర్పాటు చేసుకోవటానికి, గ్రంథాలయం, ఆడిటోరియం ఏర్పాట్లతో సహా, కేంద్ర మన్హట్టన్‌లో పదునైదంతస్తుల క్లబ్‌ను నిర్మించే ఉద్దేశంతో 1,00,000 డాలర్లు దానమిచ్చాడు.

ఎల్లవేళలా సంగీతమంటే అతనికి ఎంతో ప్రీతి కనుక సంపాదించుకోలేక కష్టపడుతున్న చర్చీలకు 'పైపు' వాద్యాలను ఇవ్వటం ప్రారంభించాడు. అతని దానాలల్లో కెల్లా కోట్ల జనాలకు సంతోషాన్ని కలిగించింది, న్యూ యార్క్ యాభై యేడవ వీథిలో ఏడవ ఎవెన్యూలలో, అతడు కట్టించిన సంగీతసౌధం. కొన్ని సంవత్సరాలవరకు సంగీతప్రపంచంలో ప్రముఖులైనవారి సంగీతం, అందులో వినిపించింది. దాత దానికి 'నూ యార్క్ మ్యూజిక్ హాల్' అని పేరు పెట్టాడు. కానీ చిరకాలం జనం దాన్ని "కార్నెగీ హాల్" అని వ్యవహరించటం వల్ల, తరువాతి ధర్మకర్తలు అదే పేరును దానికి నిర్ణయించారు. ప్రసిద్ధుడయిన రష్యన్ వాగ్గేయకారుడు పీటర్ ట్చైకోలి స్కీని అతడు 1891లో, దాని ప్రారంభోత్సవ సమయంలో ఏర్పాటైన సంగీత సమ్మేళనాన్ని నడిపించటానికి పిలిపించాడు. అతడు ఏర్పాటు చేసిన సంగీత సమ్మేళనంలో ఆ రష్యన్ సంగీతజ్ఞుడు కూర్చిన తౌర్యత్రికాలు (Symphonies) కూడా ఉన్నాయి. ట్చైకోవిస్కీ బృందాన్ని కార్నెగీ తన యింటికి విందుకు పిలిచాడు. అందులో అతడు పూర్వం సంగీత సౌధ ప్రారంభోత్సవ సమయంలో వినిపించిన సంగీతాన్ని కార్నెగీ అనుకరించి విన్పించాడు. ఇలా అతిథేయి వినిపించిన సంగీతాన్ని గురించి తరువాత ట్చైకోవిస్కీ "నేనే మహానంద పడేటట్లుగా, అంత ఉదాత్తంగా అసలు నేనే సంగీతాన్ని వినిపిస్తున్నట్లుంది" అని వ్రాశాడు.

ఉక్కును, ఆయుధసామగ్రిని నిర్మించేవాళ్ళు స్వలాభాల కోసం యుద్ధాలను తెచ్చి పెడుతుంటారు. ఇది సత్యమయినా, కాకపోయినా ఆండ్రూ కార్నెగీ యుద్ధోత్సాహి కాడు. యుద్ధాలను కల్పించేవాళ్ళలో ఒకడు అతడు ఎన్నడూ కాలేదు. అతడు కాంగ్రెస్‌లో తనతో బాటు సహప్రతినిధి అయిన మిస్సోరీ సెనెటర్ హెన్డర్‌సర్‌ను కలుసుకొన్నాడు.

అతడు అప్పుడే షోర్ హోమ్ హోటల్‌లో ప్రవేశిస్తున్నాడు. వాళ్ళు మాట్లాడుతుండగా వీధిలో ఒక వంకకు చూస్తూ "అడుగో అధ్యక్షుడు. నిన్ను పిలుస్తున్నాడు" అన్నాడు.

ఆ రోజుల్లో అమెరికా అధ్యక్షులు ఒకడైనా అంగరక్షకుడు ప్రక్కన లేకుండానే తమ ఇష్టం వచ్చిన చోటికి, తమ ఇష్టం వచ్చిన సమయంలో వెళ్ళుతుండేవాళ్ళు.

వీధిని అడ్డంగా దాటి అధ్యక్షుడి దగ్గరకు వెళ్ళి కార్నెగీ అతని కరచాలనం చేశాడు.

"ఓహో! కార్నెగీ, ఎప్పుడు వచ్చావు?" అన్నాడు అధ్యక్షుడు.

"ఇప్పుడే హోటల్‌లోకి రిజిస్టరు చేయించుకోటానికి వెళ్తున్నాను."

"నీవు ఇక్కడికి ఏం పనిమీద వచ్చినట్లు?"

"మీతో మాట్లాడటానికి."

"అయితే రా!" అని అతడి చేతిని చేతిలోకి తీసుకొని "నడుస్తూ మాట్లాడుకుందాం. మాట్లాడు" అన్నాడు అధ్యక్షుడు.

సాయంత్రం చీకటి పడబొయ్యేటంతవరకూ వాళ్ళు వీధుల్లో గుండా నడుస్తూనే మాట్లాడుకున్నారు. ఇరువురి మధ్య చర్చ ఎంతో ఉల్లాసకరంగా సాగింది.

"మిస్టర్ ప్రెసిడెంట్, ఆ శాంతి సమావేశం దరిదాపుగా విఫలమయినట్లే. అయినప్పటికీ శాంతి వహించి క్షమించటం మనకు కర్తవ్యమనుకుంటాను. మీరు లాటిన్ అమెరికన్ ప్రతినిధులతో, వారి గౌరవార్థంగా ఆ చిన్న సైనికసమీక్ష చేసి చూపించామేగాని ఇంత సైన్యం మనకుందని చూపించటం కోసం కాదు. పైగా మనకు సైన్యం లేదనీ, అవసరం లేదనీ చూపించటంకోసమే అని నిష్కర్షగా చెప్పారు. ఇది మీకు జ్ఞప్తి ఉందనుకుంటాను. మనది గణతంత్ర రాజ్యకుటుంబంలో జ్యేష్ఠసోదరుడివంటిది మాత్రమే. అని వారితో చెప్పారు. ఇలా చెప్పిన మీరు విభిన్నమార్గాన్ని స్వీకరించి వ్యవహరించటం చూసి నేను ఆశ్చర్యపడటమే కాదు, ఎంతో చింతిస్తున్నాను."

"అయితే ఇది తగాదా, కేవలం అభిప్రాయభేదం కాదు" అని అధ్యక్షుడు అభ్యంతరం చెప్పాడు. "మన పౌరులను వాళ్ళు కావాలని చంపారు. గాయపరిచారు. విదేశాలలోని పౌరులకు రక్షణ కల్పించే విషయంలో మనకు ఎంతో ప్రఖ్యాతి వుంది."

"ఆ మాటకు వస్తే ఆ నావికుల్లో చాలామంది అమెరికన్లు కాదు విదేశీయులు. ఒక చిన్న వీధి కలహాన్ని ఆధారం చేసుకొని, చిలీవంటి చిన్న దేశం మీద కఠినచర్య తీసుకుందామని మీరు ఆలోచిస్తున్నట్లు విన్నందుకు నేను ఎంతో చింతిస్తున్నాను."

"న్యూ యార్క్ పురవాసులు వ్యాపారం, డాలర్లను గురించి తప్ప మరొక విషయాన్ని దేన్ని గురించీ ఆలోచించరని" అన్నాడు అధ్యక్షుడు లౌక్యంతో. "ఇదే న్యూ యార్క్ వారి రీతి. గణతంత్ర రాజ్యగౌరవం కంటే వారు తమ ధనపుసంచీలను గురించి ముందు ఆలోచిస్తారు."

"మిస్టర్ ప్రెసిడెంట్! యుద్ధం వస్తే విశేషలాభాలను పొందే యునైటెడ్ స్టేట్సు వాళ్ళల్లో నేనొకణ్ణి. ఉక్కును ఉత్పత్తి చేసేవాళ్ళలో పెద్దవాణ్ని కావటం వల్ల యుద్ధం, నా జేబుల్లో కోట్లు క్రుమ్మరిస్తుంది" అని కార్నెగీ నెమ్మదిగా మనసు కెక్కేటట్లు మాట్లాడాడు.

"బహుశః ఇది నీ విషయంలో సత్యమయి వుండవచ్చు" అని అధ్యక్షుడు హారిసన్ అంగీకరించాడు.

"కానీ పోరాడటమంటూ వస్తే నేను సరివుజ్జీని చూసుకుంటాను."

"చిన్నది గదా, అదీ నిన్ను యే దేశమయినా అవమానిస్తే ఊరుకుంటావా?"

"నన్ను నే నవమానించుకోవలసిందే గాని ఇతరులు ఎవరూ నన్ను అవమానించలేరు. గౌరవానికి సంబంధించిన గాయాలను ఎవరికి వారే చేసుకుంటుంటారు."

"మన నావికుల నిద్దరిని తీరంమీద ఎదుర్కొని వాళ్ళు చంపివేశారు. అయితే నీవీ చర్యను సహించగలవన్న మాట!"

"మిస్టర్ ప్రెసిడెంట్! త్రాగుబోతులయిన నావికుల మధ్య జరిగిన చిన్న కలహం వల్ల యునైటెడ్ స్టేట్స్ అవమానితమయిందని నేను అనుకోను. ప్రజాశాంతి భంగమయి నగరంలో కొట్లాటలు జరుగుతున్నప్పుడు నావికులను తీరం మీదికి తిరగనిచ్చినందుకు నేనయితే ఆ నావ కెప్తానును కాల్చేయిస్తాను!"

వైట్ హౌస్ ద్వారం దగ్గర వాళ్ళిద్దరూ విడివడి పోయే వేళకు చీకటి పడ్డది. "ఇవాళ రాత్రికి నేనో విందుకు వెళ్ళుతున్నాను. రేపు సాయంత్రం వచ్చి నాతో భోజనం చెయ్యి. అప్పుడు నా కుటుంబం తప్ప ఇంట్లో ఎవ్వరూ వుండరు. మనం విపులంగా మాటాడుకోవచ్చు" అన్నాడు అధ్యక్షుడు.

మరునాటి ఉదయం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బ్లెయిన్ ఆఫీసుకు వెళ్ళి కార్నెగీ అతన్ని పిలిచాడు. అతడు సంతోషంతో అతన్ని ఆహ్వానించాడు.

“గడచిన రాత్రి నీవు యిక్కడ వున్నట్లు మాకు తెలియజేయలేదేం?” అని అడిగాడతడు. “అధ్యక్షుడు మిసెస్ బ్లెయిన్‌తో నీవు నగరంలో వున్నావని చెప్పినప్పుడు ఆమె ఎంతో చింతపడ్డది. మిస్టర్ కార్నెగీ, నీవు ఎప్పుడీ నగరానికి వచ్చినా, మా గృహంలో నీకు ఒక ఖాళీ స్థానమున్నదని భావించు”

“రాత్రి మీ ఇంటి విందును పొందలేకపోయినందుకు ఎంతో చింతిస్తున్నాను” అన్నాడు కార్నెగీ. “కానీ నిన్ను నిన్నటి రాత్రి కలుసుకోకపోవటం ఒక విధంగా నా అదృష్టం. ఇప్పుడు చూడటం వల్ల నేను అధ్యక్షుడు హారిసన్‌తో చేసిన చర్చను గురించిన విడిగా నీకు చెప్పడానికి అవకాశం కలిగింది.”

“అవును అది అదృష్టమే” అని కార్యదర్శి అంగీకరించాడు.

“అప్పుడు మనం కలిసి వున్నట్లయితే అధ్యక్షుడు ముందుగానే మనం కలిసే కూడబలుక్కున్నామని అనుకునే అవకాశముండేది”

అలా వాళ్ళు పిచ్చాపాటిగా మాట్లాడుకునే సమయంలో పశ్చిమ వర్జీనియా సెనేటర్ ఎల్కిన్స్ లోపలికి వచ్చాడు. వచ్చిన ఆ వ్యక్తి కార్నెగీని చూడగానే నవ్వాడు. “నేను అధ్యక్షుడి దగ్గరనుంచి ఇప్పుడే వస్తున్నాను” అని అతడు, “ఆయన చిలీ విషయంలో నిన్న నీతో దీర్ఘమైన సంభాషణ చేశానని, ఆ విషయాన్ని గురించి నీవు ఆయనమీద విరుచుకు పడేటందుకు వచ్చావనీ అన్నాడు. శాంతిని గురించి కార్నెగీ అతితీవ్రంగా భావిస్తాడు అని నేనన్నాను. అతడు మీతో అంత గట్టిగా మాట్లాడితే నాతో ఎలా మాట్లాడుతాడో వినాలని ఉంది. నాతో మాట్లాడినట్లుగా మీతో అతడు అంత స్వేచ్ఛగా మాట్లాడడు. మాట్లాడినప్పుడు కొంత దాచుకొన్నట్లు మాటాడివుంటాడను కొంటాను అన్నాను. అధ్యక్షుడు “అతనిదగ్గర దాచుకోవటమన్న ఆ గుణం అణుమాత్రమైనా నాకేమీ కనిపించలేదని చెప్పాడు” అన్నాడు.

ఆ తరువాత బ్లెయిన్, ఎల్కిన్స్ ఇద్దరూ హృదయపూర్వకంగా నవ్వుకున్నారు.

మరునాటి సాయంత్రం భోజనం దగ్గర ఈ విషయం చర్చకు వచ్చింది. అయితే చర్చ ఎంతో మృదువుగా నడిచింది. అధ్యక్షుడి ఉద్రేకం కొంతగా చల్లబడుతున్నట్లు కార్నెగీ గమనించాడు. కార్యనిర్వాహక వర్గంవారు కూడా అధ్యక్షుడికి అనుకూలంగా లేనట్లు అతనికి అర్థమైంది.

"ఈ విషయాన్ని తెచ్చినందుకు క్షమించండి మిస్టర్ ప్రెసిడెంట్! మీరు బాగా అలసిపోయినట్లున్నారు. మీకు మంచి విశ్రాంతి అవసరమనిపిస్తున్నది. మీరు కొంత సెలవు తీసుకొని ఎక్కడికైనా దూరంగా కొన్నాళ్ళు ఎందుకు వెళ్ళగూడదు?" అన్నాడతడు.

"పన్ను వసూలు చేసే పడవమీద కొన్నాళ్ళు ఎక్కడికైనా వెళ్ళుదామనుకుంటున్నాను. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రాడ్లీ కొద్ది రోజులకు పూర్వమే మరణించారని నీకు తెలుసుననుకుంటాను. న్యాయవృత్తిని అనుసరించేవాళ్ళల్లో అతనికి 'అనుగామి'గా ఉండదగ్గవాడు ఎవడా అని నిశ్చయించడం కోసం ఆలోచిస్తున్నాను" అన్నాడు అధ్యక్షుడు హారిసన్ సమాధానంగా.

"ఆ స్థానానికి తగిన యోగ్యతగలవాడు పిట్స్‌బర్గ్‌లో ఒకడున్నాడు. అతడూ, నేనూ పూర్వం చేపలు పట్టటంలో సహచరులం. అందువల్ల అతనిమీద నేను అనుచితమైన పక్షపాతాన్ని వహిస్తున్నానని మిత్రులయిన మీరు అనుకోకుండా వుంటే, ఈ ఉద్యోగానికి అతణ్ని నేను సూచిస్తున్నాను., అయితే అతడు నాకు అతిసన్నిహితుడైన మిత్రుడు కావటం వల్ల అతన్ని గురించి నేను సక్రమమైన పరిశీలన చేసి ఉండకపోవచ్చు. అతను బాగా చదువుకున్నవాడు, సత్యనిరతుడైన న్యాయవేత్త అని మాత్రం ఎరుగుదును," అన్నాడు కార్నెగీ.

"అతని పేరు?"

"జార్జి షిరాస్."

అధ్యక్షుడు తల పంకించాడు. "నీ సలహాను తీసుకొని అతన్ని పరిశీలిస్తాను" అన్నాడు.

అధ్యక్షుడు అలాగే చేశాడు. ఒక సుప్రసిద్ధుడయిన సుప్రీంకోర్టు న్యాయమూర్తిని నియమించటం ఈ రీతిగా జరిగింది, మధ్యకాలంలో చిలీ తగాదా సద్దుమణిగింది. సౌమనస్యం వల్ల అది పరిష్కారమైంది. అంతర్జాతీయశాంతికి తానుకూడా కొంత తోడ్పడ్డానన్న తృప్తి కార్నెగీకి కలిగింది. ఇలా అతని వాషింగ్టన్ ప్రయాణం ఎంతో ప్రయోజనకారి అయింది.

# 11. హోమ్‌స్టెడ్ - స్కిబో

ఇనుము, ఉక్కు, వాటిని ఉత్పత్తి చేయటానికి కావలసిన బొగ్గు, కోల్, ఇనుప ఖనిజాలు అన్నవాటికి తప్ప కార్నెగీ కార్పొరేషను ధనాన్ని ఇతరమైన వేటిమీదా పెట్టకూడదు అని పూర్వం తాను నిర్ణయించుకున్న పథకానికి, ఆండ్రూ కార్నెగీ మరీ మరీ కట్టుబడి పోతున్నాడు. హెన్రీ ఫిప్స్‌తో కలిసి ఒకనాటి ఉదయం అతడు బండిలో పిట్స్‌బర్గ్‌కు వెళ్ళుతున్నాడు. అప్పుడు అతడు ఒక ట్రస్ట్ కంపెనీవారి వ్యాపారప్రదేశంలో నుంచి ప్రయాణం చెయ్యటం జరిగింది. ఆ కంపెనీ పేరు అతని మనసులోని తంతువులను కదిలించటం మొదలు పెట్టింది. "పెట్టుబడిదారులు వ్యక్తిగతంగా బాధ్యులు" అన్న వాక్యం లీలగా అతని స్మృతికి తగిలింది.

"ఈ వ్యాపారసంస్థకు సంబంధించిన ఇరవై షేర్లు మన ఎస్టేటు ఆస్తిగా వున్నట్లు మన పుస్తకాల్లో వుండటం నేను చూశాను కదూ?" అని ఫిప్స్‌ను అతడడిగాడు.

"ఔ" నని ఫిప్స్ సమాధానమిచ్చాడు.

"ఈ సాయంత్రం నీవు కార్యాలయానికి వెళ్ళగానే వాటిని అమ్మివేసేయి."

ఫిప్స్ దానిని అంత శ్రద్ధగా కాకుండా ఏదోగా 'సరే' అన్నాడు. "అయితే అంత తొందర లేదు. ఎప్పుడయినా చెయ్యవచ్చు" అన్నాడు.

"అలా కాదు హారీ. వెంటనే జరగాలి! నా మాటను మన్నించు" అన్నాడు యజమాని. ఆ బ్యాంకు కొద్ది నెలలు కాగానే పెద్ద మొత్తం లొంగుడు పడి దివాలా తీసింది. అప్పుడు అతడు షేర్లను అమ్మివేయటం మంచిదైందని సంతోషించాడు. 1888లో మిల్లులు, కొలుములు రోజు ఒకటికి రెండువేల టన్నుల ఉక్కు, ఇనుమును ఉత్పత్తి చేస్తున్నవి. "కొన్నిలిస్ విల్లీ' లోని నలభై రెండు వేల ఎకరాల అందమైన కోహింక్ కోల్ గనుల ప్రాంతానికి మీద ఫ్రిక్ కోక్ కంపెనీ యాజమాన్యం వహిస్తున్నది. తన బాల్యమిత్రుడయిన హారీ ఆలివర్ ద్వారా మిన్నెసోటాలో కొత్తగా కనుక్కోబడ్డ మిస్సబీ ఇనుప ఖనిజభూమిని ఎన్నో ఎకరాలు కార్నెగీ గుత్తకు తీసుకొన్నాడు. వందల కొద్దీ చిన్న ఉక్కు వస్తువులను తయారుచేసే మరొక కర్మాగారాన్ని స్థాపించటం జరిగింది.

దాని ద్వారా వారి ఆ జాతి వ్యాపారం కూడా వృద్ధి పొందింది. ఇదైనా 'ఎ.సి.'కి తమ మార్గానికి కొంత దూరమైందిగానే కనిపించింది.

కార్నెగీకి కార్మికుల వల్ల ఎన్నడూ ఎటువంటి తీవ్రమైన ఇబ్బందీ కలుగలేదు. బహుసంఖ్యాకులైన కార్మికులతో అతడు సూటిగా సంబంధం పెట్టుకొనేవాడు. వాళ్ళ నాయకులందరినీ సాన్నిహిత్య సూచకంగా వాళ్ళ మొదటి పేర్లతో పిలుస్తుండేవాడు. వాళ్ళు వినిపించవచ్చిన కష్టాల నన్నింటినీ జాగ్రత్తగా, ఓపికతో వినేవాడు. ఎక్కడయినా కలతలు, అన్యాయాలు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దేవాడు. అయితే కార్నెగీ సంస్థలు విపరీతంగా పెరిగిపోయినప్పుడు కొత్త వ్యక్తులు, కొత్త ప్రభావాలు పరిపాలకవర్గాలలో ఉన్న శ్రామికుల్లోనూ ప్రవేశించాయి. కార్నెగీ దీర్ఘకాలం స్కాట్లండులో ఉండిపోతుండడం వల్ల కలత లారంభమై పెరగటం ప్రారంభిస్తున్నవి. ఇప్పుడు వివేక దాక్షిణ్యాలను జోడించి తన ప్రభావాన్ని పాలకవర్గ – శ్రామికవర్గాల రెంటి మీద నెరపశక్తి గల టామ్ కార్నెగీ, బిల్ జోన్స్ – ఇరువురూ లేకపోవటం బాగా అనుభవానికి వస్తున్నది. బోర్డు ఆఫ్ మేనేజర్లకు అధ్యక్షుడయిన ఫ్రిక్ కఠినుడు, కరుణారహితుడు అని రూఢిగా నిరూపితమైంది. హెన్రీ ఫిప్స్‌కు వయసు పెరుగుతున్నకొద్దీ అతడు ఫ్రిక్ అభిప్రాయాల వంకకు మొగ్గు చూపటం ఆరంభించాడు.

హోమ్‌స్టెడ్ కర్మాగారంలోని హిటర్లు, రోలర్లు అన్న చిన్న శ్రామికవర్గం వారు ప్రస్తుతం ఇబ్బంది కల్పిస్తున్నారు. ఉన్నతవర్గం నుంచి వచ్చిన క్రొత్త సూపరింటెండెంటు అసంతృప్తితో అల్లరి చేస్తున్న వీళ్ళతో వ్యవహరించే విషయంలో ఎక్కువ వివేకాన్ని ప్రదర్శింపలేకపోయాడు. ఈతని చెడ్డభావాలే ఇతరులలో కూడా ప్రవేశించి వ్యాప్తి పొందటం ప్రారంభించాయి. బ్రాడ్డాక్ వర్క్సును సక్రమంగా పాలించటం వల్ల సంస్థలో చాలా ఉన్నతస్థాయికి చేరుకొన్న ఛార్లెస్ స్క్వాబ్ హోమ్‌స్టెడ్‌లో ఆ చిన్ని శ్రామికవర్గంతో దౌత్యాలు నడిపించే స్థితిలో లేడు. అందువల్ల అల్పసంఖ్య అయిన మూడు వేలమంది కార్మికులకు సంబంధించిందే అయినప్పటికీ, 1892 వేసగిలో హోమ్‌స్టెడ్ కర్మాగారంలో సమ్మె వచ్చింది. కార్నెగీ స్కాట్లండులో ఉన్నాడు. ఈ అవకాశం వల్ల చేకూరిన ఉత్సాహంతో సమ్మెను బ్రద్దలు కొట్టేవాళ్ళకు ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించటానికి ఫ్రిక్, సూపరింటెండెంటు ఇద్దరూ నిర్ణయించారు. ఇది వాళ్ళ అధ్యక్షుడయిన ఆండ్రూ కార్నెగీకి హృదయప్రియాలయిన సిద్ధాంతాలల్లో ఒకదానికి పూర్తిగా వ్యతిక్రమం. ఈ విషయం అతడు పూర్వమే లిఖితరూపంగా వెల్లడి చేశాడు. "ఎవరయినా పనిచేసేవాళ్ళు పనిమానివేస్తే మాననివ్వటమే కంపెనీ కృతనిశ్చయమని వారికి తెలియజేయాలని నా

ఊహ. అట్టివారితో స్వేచ్ఛనిచ్చి సంప్రదింపులు సాగించాలి. వాళ్ళు తిరిగి పనిలోకి వెళ్ళుదామని నిశ్చయించుకొనేదాకా ఓపిక పట్టి ఆగాలి. కానీ కొత్తవాళ్ళను పెట్టుకోవటం ఎన్నడూ పనికిరాదు, పనికిరాదు!"

ఫ్రిక్స్ ఉద్దేశాన్ని గురించిన కింవదంతులు విని సమ్మె చేసిన శ్రామికు, సాయుధులై కర్మాగారానికి ప్రక్క వీథుల్లో పికెటింగ్ చేశారు. సమ్మెను బ్రద్దలు కొట్టేవారు కర్మాగారంలో ప్రవేశించేటప్పుడు వారికి రక్షణను ఇచ్చేటందుకు కాంటీషరీఫ్ ఒక పెద్ద డిటెక్టివ్ ఏజన్సీని ఏర్పాటు చేశాడు. సమ్మె చేసినవాళ్ళు వీథులను అడ్డివేయటం వల్ల జులై 1న రక్షణ యిచ్చి క్రొత్త పనివాళ్ళను పడవలమీద తీసుకోవచ్చి మిల్లులోపలికి మోనోంగ్‌హోలా నదిమీదుగా వెనుకభాగం నుంచి ప్రవేశపెట్టటం జరిగింది. అప్పుడు కలిగిన కలహంలో ఉభయపక్షాలలో చాలా మంది వ్యక్తులు గాయపడ్డారు. కొందరు మరణించారు. చివరకు క్రొత్తగా ఎత్తివచ్చినవాళ్ళను దెబ్బకొట్టి తరిమివేయటం జరిగింది.

ఉభయవర్గాలవారు తాము చేసిన దానికి తల్లడపడ్డారు. సంధి చేసుకోవటం సముచిత మనిపించింది. ఈ విషయం రెండు రోజులు గడచిన తరువాత గాని స్కాట్లండులో వున్న కార్నెగీకి తెలియలేదు. అప్పుడు అతడు తనకు లభ్యమయిన మొదటి నౌకమీద బయలుదేరి వస్తున్నానని నిస్తంత్రీవార్త (కేబిల్) పంపించాడు. ఫ్రిక్స్, ఫిప్స్ ఇద్దరూ కంపెనీ క్షేమం కోసం ఈ తడవ అక్కడే అమెరికాకు దూరంగా ఉండవలసిందని కోరుతూ, సమాధానం పంపించారు. ఇందుకు కారణమేమిటో ఊహింపలేకపోయినప్పటికీ కార్నెగీ వారి అభ్యర్థనను మన్నించి అక్కడే వుండిపోయినాడు. "మమ్మల్ని ఏమి చెయ్యమని మీరు కోరుతారో తెలియజెయ్యండి. మీకోసం మే మా పనిని చేసి తీరుతాం" అని కలహం అయిపోయిన తరువాత కార్మికుల యూనియన్ ఉద్యోగులు యిచ్చిన నిస్తంత్రీవార్తవల్ల విషయం తెలుసుకొని కార్నెగీ ఎంతో చలించిపోయాడు. ఏం ప్రయోజనం? కాలం గడిచిపోయింది. నష్టం జరిగిపోయింది. తరువాత పన్నెండు సంవత్సరాలకు తాను కార్నెగీని అక్కడ ఉండిపొమ్మని అడగటానికి కారణం "వారు కోరేవి యెంత అనుచితంగా వున్నా ఆయన ఎల్లప్పుడూ శ్రామికుల కోర్కెలనే అభిమానించి తీర్చే మనఃప్రవృత్తిలో వుంటాడు గనుక, వాళ్ళు వాళ్ళ యిష్టప్రకారంగా వ్యవహారాన్ని సాధించదలచుకొన్నారు గనుక" అని న్యూ యార్క్ న్యూస్ పేపర్ విలేకరులతో ఒప్పుకున్నాడు.

కొన్ని సంవత్సరాలయిన తరువాత కార్నెగీ ఈ విషయాన్ని గురించి తన ఆత్మకథలో ఇలా వ్రాసుకొన్నాడు : "నా జీవితంలో ఇంతకు పూర్వంగాని, తరువాత

గాని ఎన్నడూ ఇటువంటి సమస్యను ఎదుర్కొనవలసి రాలేదు. ఏదీ యింత తీవ్రంగా నన్ను వ్యథ పెట్టనూలేదు. ఈ హోమ్‌స్టెడ్ వ్యవహారంలో తప్ప నా వ్యాపార జీవితంలో నే పొందిన మరొక గాయమేదీ లేదు."

ఆకురాలే కాలం రాగానే అతడు అమెరికాకు వచ్చినప్పుడు కర్మాగారానికి వెళ్ళి ఆ కొట్లాటలో పాల్గొనని కొందరు వృద్ధులతో మాట్లాడాడు. "మీరు ఇక్కడ ఉన్నట్లయితే సమ్మె వచ్చేదేకా"దని వారతనికి సమాధానం చెప్పారు. "కర్మాగారం యిచ్చిన 'నజరు' చాలా సముచితంగా వుందిగదా!" అని అతడన్నప్పుడు, ఆ వృద్ధుల్లో ఒకడు "మిస్టర్ కార్నెగీ! ఇది డాలర్లకు సంబంధించినది కాదు. ఆ పిల్లలను నీవు తన్నినా ఒప్పుకుంటారు, కానీ ఇంకొకడు జుత్తుమీద చెయ్యి వేసి తట్టినా ఊరుకోరు!"

ఏమైనా అమెరికాలో అనేకులు ఈ ప్రమాదాన్ని గురించి విన్న వెంటనే అతడు తిరిగిరాకపోవటం పిరికితనాన్ని ప్రదర్శించటమని అనుకొన్నారు. అతన్ని విమర్శించే స్వభావం గలవాళ్ళు తరువాత చాలాకాలం వరకూ ఇలాగే అతనికి వ్యతిరేకంగా అంటూ వచ్చారు. తనకు ప్రియమైన షరతులమీద సమర్థులని తోచిన యువకులను భాగస్థులనుగా తీసుకోవటం యింకా అతడు కొనసాగిస్తూనే వస్తున్నాడు. ఇంతవరకూ అటువంటివాళ్ళు ముప్పదిమంది దాకా ఐనారు. వీళ్ళలో ప్రతి ఒక్కరికీ అనంతసంఖ్యలో 'స్టాఫ్' ఉంది. ఇలాంటివాళ్ళల్లో ఒకడయిన ఒక స్కాచ్ యువకుణ్ణి భాగస్వామిగా గ్రహింపబోయేముందు తన ఉద్దేశాన్ని తెలియజేస్తూ అతడు, "పీకాక్, నిన్నొక మిలియనీరును చేస్తే నాకేమిస్తావు" అన్నాడు కార్నెగీ. ఆ డబ్బుకు తగ్గట్లు ధారాళమైన డిస్కౌంటు ఇస్తానని వెంటనే ఆ యువకుడు చమత్కారంగా సమాధానం చెప్పాడు. అది ఆ ప్రముఖవ్యాపారిని విశేషంగా గిలిగింత పెట్టింది.

మార్చి 30, 1897 నాడు కార్నెగీకి ఒక కుమార్తె కలిగింది. ఈ బిడ్డ చాలా అందమైంది. ఈమె తరువాత అతనికి మరెవ్వరూ బిడ్డలు కలుగలేదు. తన ఏకైకసంతానమైన ఈ బిడ్డను అతడు తొలిసారిగా చూచినప్పుడు భార్య అతనితో అన్నది "ఈ బిడ్డ పేరు మార్గరెట్. మీ తల్లి గారి పేరు ఆమె జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకుందాము. నాదో చిన్న అభ్యర్థన."

"లౌ, ఏమిటది?" అని అడిగాడతడు.

"మనకు పరమేశ్వరుడిచ్చాడు. గనుక మనకొక వేసగి గృహమంటూ ఉండాలి. ప్రతిసారి మరొకరి ఇంటిని అద్దెకు పుచ్చుకొంటూ, ఒక తేదీనాటికిందులో ప్రవేశించటం,

మరొక తేదీనాటికి ఖాళీ చెయ్యటం మనం చెయ్యలేము. అది ఇక మన ఇల్లే ఐ ఉండాలి.”

అతడు వెంటనే అంగీకరించాడు.

“ఈ విషయంలో నాదొక నియమముంది” అన్నది ఆమె.

“ఏమిటది?”

“అది స్కాట్లండు పర్వతప్రాంతంలోనే ఉండాలి.”

ఆమె అతనికి అంతకంటే సంతోషాన్ని కలిగించే మరొకదాన్ని దేన్నీ సూచించలేదు. ఎలా వున్నప్పటికీ వారు క్లనీ కాజిల్‌ను వేసవి గృహంగా ఉంచుకోలేరు. మాక్ఫర్ సన్ వివాహం చేసుకుంటున్నాడు. ఇక ఆ గృహం అతని ఉపయోగం కోసం అతనికే అవసరం. పది వేసగి సమయాలు కార్నెగీలు అక్కడ నివసించటం వల్ల వారితో అతనికి సన్నిహిత మైత్రి ఏర్పడింది. బిడ్డ కలిగిన వెంటనే వారు అతనిని పిల్చి తెలియజేశారు. అతడు ఆ సంతోష వార్త విని అతడు తన ప్రాంతంలో గొప్ప ఉత్సవం చేయించాడు. తొమ్మిది కొండలమీద మంటలు వేయడం, విందులు జరపటం, కార్నెగీల ఆరోగ్యం కోసం మధుపానాలు చెయ్యటం ఆ ఉత్సవంలోని విశేషాలు.

అందువల్ల ఈ ‘నూతనపిత’ అద్దెకుగాను క్రొత్త మిరాసీని (Manor) వెదకకుండా సొంత ఆస్తినే కొనటానికి యత్నిస్తున్నాడు. డ్యూక్ ఆఫ్ సథర్ లాండ్‌కు స్కివో అనే పేరుతో ఉత్తరస్కాచ్ పర్వతప్రదేశంలో ఒక ఎస్టేటు ఉన్నదనీ, అతడు దాన్ని అమ్మదలుచుకున్నాడనీ అతడు తెలుసుకున్నాడు. అడవులు, సుందరమైన నిమ్నోన్నతాలు ప్రీతికరమైన వాహ్యాళిస్థలాలు, ఆరోహణాలు, మంచి మత్స్యసంపద గల సరస్సులు, విశ్వసించదగిన సమస్థితి గల వాతావరణం. జనవరిలో వికసించే పుష్పకుంజాలు అన్నీ దానికి వున్నట్లు అతడు తెలుసుకున్నాడు. ఆ ఆస్తికి వున్నవాటన్నిటిలో అత్యుత్తమమైంది ఉన్న శిలాప్రదేశం పైనిల్చి నదీ సాగర సంగమం వంకకు తిలకిస్తూ ఉన్న గొప్ప ప్రాచీన శిలాసౌధం చూచిన వెంటనే, కార్నెగీకి ప్రీతి కలిగింది. అతడు దాన్ని కొన్నాడు. కొన్ని మార్పులు చేసి క్రొత్తరూపమిచ్చాడు. ఎలివేటర్‌ను ఏర్పాటు చేయించాడు. విద్యుద్దీపాలను పెట్టించాడు. ఆధునికమైన ‘ప్లంబింగ్’ను పెట్టించాడు. టర్కిష్ స్నానశాలలను నిర్మించాడు. అందులో మేలుజాతి పశువులు గల ‘శానిటరీ డెయిరీ’ని నెలకొల్పాడు. అందలి పూదోటలు అమితఖ్యాతి వహించాయి.

ఆ సౌధం కార్నెగీల ఇంటికి ఎందరు అతిథులు వచ్చినా ఒక్కమాటుగానే ఆతిథ్యమివ్వటానికి తగినంత విశాలంగా వుంది. అతిథులు అసంఖ్యాకంగా వస్తుండేవారు. వయోవృద్ధులైన మిత్రులు గ్లాడ్‌స్టన్, మేథ్యూ ఆర్నాల్డు వంటివారు వెళ్ళిపోయినారు. తరువాతి తరంవారైన రుడ్డియర్డు కిప్లింగ్, పాడెరివిస్కీ, సర్ ఎడ్వర్డు గ్రే, స్కాబ్, ఉక్కు నిర్మాత సర్ ఛార్లెస్ టెన్నెంట్, ఇలిహురూట్, ఉన్నతవర్గం వారైన ఇంకా ఇతరులు అతిథులుగా వస్తుండేవారు. వారి పూర్వమిత్రులు లార్డు, లేడీ మోర్లే ఋతువుకు రెండు మార్లో మూడు మార్లో వచ్చి వెళ్ళుతుండేవారు. స్కిబోకు పదిమైళ్ళ దూరాన ఉన్న రైలు స్టేషను దగ్గర విక్టోరియా యుగపు తొలిరోజులనాటి నాలుగు గుర్రాల బండి ఒకటి క్రొత్త వార్నీషు మెరుపుతో నీటుగా నిలచి అతిథులకు స్వాగత మిస్తుండేది. ఎర్రకోటు వేసుకొన్న చోదకుడొకడు దాన్ని నడుపుతుండేవాడు. ఇతని లాగానే ఎర్రకోటు తొడిగి బండి వెనక ఎత్తయిన ఆసనంమీద కూర్చొని, 'కాలరి' (Footman) ఒకడు 'శృంగా'న్ని (Horn) ఊదుతుండేవాడు.

స్కిబోయిలర్డ్ అనిపించుకున్న కార్నెగీ వంశవృక్షాన్ని వంశలాంఛనాలను అసహ్యించుకున్నాడు. కాని స్కాచ్ దేశీయులు ధరించే దుస్తులను కొద్ది మార్పులు జేసి 'కార్నెగీ ప్లయిడ్' అన్న ఉడుపును రూపొందించుకున్నాడు. చిన్న మార్గరెట్ ఇంట్లో తిరుగుతున్నప్పుడు, తండ్రి చేయి పట్టుకొని నడుస్తున్నప్పుడు, కొండ లెక్కుతున్నప్పుడు, స్కాట్లండు లోని పర్వతప్రాంతీయులు ధరించే రంగురంగుల తార్తాను ధరిస్తుండేవాడు. ఆ ఎస్టేటులో పనిచేస్తున్న సేవకులు, శ్రామికులు కూడా దీన్నే ధరిస్తుండేవారు. స్కిబో పరిసరాలలో ఈ గుడ్డను కుటీరాలలోని మగ్గాలమీద చేత్తో నేస్తుండేవారు. అక్కడ స్కాచ్ పనితనానికి విశేష ప్రాముఖ్య మివ్వబడింది. స్కాచ్ గృహపాలకుడు, స్కాచ్ ఉగ్రాణోద్యోగి (Butler), ఒకరో ఇద్దరో స్కాచ్ ఉపసేవకులు. పైపరు కూడా వీరివలె స్కాచ్. ఇతడు ఉదయవేళ మేల్కొల్పుతూ, భోజనసమయాల్లో తన జంత్రంమీద పార్వతేయగీతాలను అటూ ఇటూ తిరుగుతూ వినిపిస్తుండేవాడు. ఇతడు ఆ ప్రదేశంలోని ప్రముఖవ్యక్తులలో ఒకడు. వీళ్ళందరూ చలికాలాలకు ఆ కుటుంబంతో బాటు అమెరికా వెళ్ళేవాళ్ళు. ఆ ఎస్టేటులోని శ్రామికుల ఉద్యోగాల లాగానే వీరివి కూడా జీవితపర్యంతోద్యోగాలు.

జులై నాల్గవ తేదీన ఆ సౌధం మీద బ్రిటిష్ – అమెరికన్ జెండాలు రెండూ ఎగురుతున్నవి. ఈ రీతిగా రెండు జెండాలు కొత్తజెండాను ఎగురవేసేటంతవరకు ఎగిరాయి. ఈ క్రొత్తజెండా తొలుతొలుతగా వచ్చిన అతిథులకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

వారు దానివంక జాగ్రత్తగా పరిశీలించి చూచినమీదట తమ 'ఆతిథేయి' గ్రేట్ బ్రిటన్ – అమెరికాల జెండాలను రెంటినీ కలిపి విశిష్టంగా రూపొందించుకున్న సమ్మిళితపతాకమని వారర్థం చేసుకున్నారు. ఆ పతాకం బహుశః ఉద్దేశించినది కాకపోయినా, ఒకనాటికి గ్రేట్ బ్రిటన్, అమెరికా రెండూ కలిసి ఒక గణతంత్రరాజ్యం లాగా సమ్మేళనాన్ని పొందబోతున్నవన్న ఉద్దేశాన్ని వ్యక్తీకరిస్తున్నట్లుండేది.

కార్నెగీ వన్యమృగాలను చంపటం సహించలేడు. జింకలు, కుందేళ్ళు, అడవి కోళ్ళు అతని ఎస్టేటులో అసంఖ్యాకంగా వున్నవి. అయితే అతడు వాటిని ఎన్నడూ వేటాడలేదు. అతడు అతని అతిథులు చేపలను పట్టడానికి వెళ్ళుతుండేవాళ్ళు. "వెళ్ళండి, మీకు ప్రియమైనదైతే వేటకు వెళ్ళండి. కానీ చంపవలసి వస్తే తప్ప చంపవద్దు. దాన్ని గురించి నాకు ఏమీ తెలియనివ్వద్దు" అని అతిథులతో అనేవాడు. అటువంటి పరిస్థితిలో ఏ కొద్దిమందో తప్ప వేటాడటానికి పూనుకునేవాళ్లు కారు. మానవులది గాని, జంతువులది గానీ రక్తపాతమంటే కార్నెగీ అసహ్యించుకొనేవాడు.

ఈ మధ్యకాలంలో అతడు నింపాదిగా చిన్న కళాశాలకు, చర్చిలకు సినొగాగ్‌లకు, ఆర్గనులను కొనుక్కోవటానికి, జంత్రవాద్య సమ్మేళనాలను పెంపొందించుకోవటానికి గ్రంథాలయాలను నిర్మించుకోవటానికి డబ్బు ఇస్తుండేవాడు. స్కిబోకు పదిమైళ్ళ మేరలో వున్న ప్రతి చిన్న గ్రామంలోను, కొన్ని సందర్భాలలో ఇంకా చిన్న గ్రామాలల్లోను కార్నెగీ గ్రంథాలయం ఏర్పడింది. అతడు న్యూ యార్క్‌లోని కూపర్ ఇన్స్‌టిట్యూట్‌కూ, మర్చంట్స్ అండ్ ట్రేడ్‌మన్ ఇన్స్‌టిటూషన్‌కు ఒకొక్క దానికి 7,50,000 డాలర్లు ఇచ్చాడు. పాత మిత్రత్వాలను అంటిపెట్టుకునే కార్నెగీ, 1859 మొదలు 1963 వరకూ పెన్సిల్వేనియా రైల్ రోడ్డు పిట్స్‌బర్గు డివిజన్‌లో తన క్రిందపని చేసిన వారందరికీ, పించను (Pension) లిచ్చాడు. వారిలో కొందరు సమయానికి దరఖాస్తులు పెట్టుకొన్నారు. చివరకు అందరినీ వెతికి వారికి, వారి వితంతువులను కూడా కలిపి పించనుల పట్టికలు తయారు చేయమని తన మిత్రుడయిన టామ్ మిల్లర్‌ను నియమించాడు. "వీరి మధ్యలోకి వెళ్ళినప్పుడు నేను చిన్న కుర్రవాడను. వీరంతా నా యెడ ఎంతో దయాళువులై ప్రవర్తించారు. వీరు నా ప్రియమిత్రులు" అని వీరిని గురించి వివరించాడు. మిల్లరు ప్రతివ్యక్తి గురించీ రిపోర్టు పంపినప్పుడు చాలావాటిమీద "జాన్ నాకెంతో బాగా గుర్తు" అన్నాడు. "బిల్ మా మంచి ట్రాల్‌మన్‌లలో ఒకడు" "హెన్రీకి నా శుభాకాంక్షలను అందజెయ్యి" – ఈ రీతిగా లఘుటికలు వ్రాశాడు.

అంతర్యుద్ధ కాలంనాటి సైన్యంలోని టెలిగ్రాఫర్లంటే కార్నెగీకి ప్రీతి, విశేషం. అతనికి వారితో కొంత లీలగా సంబంధమున్నది. వారు నిర్మించుకొన్నదీ, చారిత్రిక ఖ్యాతిగన్నదీ అయిన సమాజంలో కార్నెగీ ఒకప్పుడు సభ్యుడు. కొన్నిమాట్లు వారి వార్షిక సమావేశాలకు హాజరైనాడు. వార్తాహరి బాలుడుగా వున్న తన తొలినాటి అనుభవాలను గురించి అతడు ఆ సభల్లో ప్రసంగించాడు. సైన్యానికి వీరిసేవ అత్యంత ప్రధానమైంది కనుక, వీరికి కూడా పింఛనులు ఇవ్వాలని ఎంత చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు గనుక, అతనికి కోపం కలిగింది. సైనికుల లాగానే వీళ్ళల్లో చాలామంది యుద్ధభూమిలో ప్రాణాలను కోల్పోయినారు. వికలాంగు లయినారు. గాయాలు తగిలి, వాతావరణం పడక ఆరోగ్యాన్ని చెడగొట్టుకున్నారు. శత్రువుల కారాగారాలలో బంధితులయినారు. వారి దేశప్రభుత్వం దగ్గరనుంచి వారు పుచ్చుకోవలసినంత మొత్తాలు వారికి చెల్లించటానికి వీలు కలిగేటట్లు అతడు 'కార్నెగీ నిధి'ని ఏర్పాటు చేశాడు.

చిత్రమైన చిక్కుల్లో పడ్డ వ్యక్తులమీద కార్నెగీ తప్పనిసరిగా చూపించే దయకు క్రింది దొక ఉదాహరణం మాత్రమే.

మిస్టర్ గ్లాడ్స్టన్ ఒకమారు అతనితో అన్నాడు. "మన మిత్రుడు లార్డు ఆక్టన్ ఆర్థిక సముద్రంలో మునిగిపోయే స్థితిలో వున్నాడు. అది నన్ను బాధ పెడుతున్నది. అతడికి ఎంతమంచి గ్రంథాలయముందో నీకు తెలుసు. చూశావు కూడాను. అయితే, దాని విలువ అంతా అతనికి తిరిగి రాకపోయినప్పటికీ దాన్ని విడిచిపెట్టటమంటే దరిదాపుగా అతని గుండె బ్రద్దలయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ, విక్రయిద్దామను కుంటున్నాడు."

కార్నెగీ "దాన్ని నేను కొంటాను. అయితే..."

గ్లాడ్స్టన్ మధ్యలో ఆపి "నన్నొక సూచన చెయ్యనీ. అతని జీవితపర్యంతం దాన్ని అతనిదగ్గరే ఉండనీ. అతని అనంతరం దాన్ని నీవు నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యనీయవచ్చు.

ఆ రాజనీతిజ్ఞుడుతో కరచాలనం చేస్తూ "తప్పక చేస్తాను. మీ సూచనకు నా నమస్సులు."

ఆక్టన్ చెప్పిన ఖరీదుకు అతడు అతని గ్రంథాలయాన్ని కొన్నాడు. అయితే గ్లాడ్స్టన్ చెప్పినట్లు ఆ ఉదాత్తుడయిన లార్డ్ బహుకాలం జీవించలేదు. 1902లోని అతడు మృతికి పిమ్మట అనతికాలానికే కార్నెగీ, మోర్లే కలుసుకొన్నారు. కార్నెగీ

మిత్రునితో "మీకో విషయం చెప్పాలి. కొద్ది సంవత్సరాలకు పూర్వం లార్డు ఆక్టన్ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అతని గ్రంథాలయాన్ని అమ్ముతానని సూచనచేస్తే..."

మోర్లే మొగాన ఉదయించిన చిరునవ్వు ఆ వాక్యాన్ని మధ్యలో ఆపింది. "ఈ విషయం మీరు కొన్న రోజునుంచి నేనెరుగుదును" అన్నాడతడు.

"మీకు తెలుసునా?"

"అవును. గ్లాడ్‌స్టన్ రహస్యాన్ని నిలుపుకోలేకపోయినాడు. దానిని అతడు లార్డు ఆక్టన్‌కు జీవితపర్యంతం దక్కించగలిగినందుకు మహానందపడ్డాడు."

"బాగుంది. దాన్ని నేనిప్పుడు మీ పరం చెయ్యబోతున్నాను."

"నా పరమా?" ఆశ్చర్యపడటం ఇప్పుడు మోర్లే వంతుకు వచ్చింది.

"ఔను. దానివల్ల సక్రమమైన ప్రయోజనాన్ని పొందటం మీకు బాగా తెలుసు. మీరు తరువాత దానిని విచ్ఛిన్నం కాకుండా చూసి, కావాలని మోహపడే ఒక సంస్థకు ఇచ్చివేస్తారని నమ్ముతున్నాను."

# 12. సంకటస్థితి - పరిష్కారం

కార్నెగీ వాటాలలో కొన్నింటిని స్టాక్ మార్కెట్టులో ప్రవేశపెట్టేటందుకు యితరుల చేతుల్లోకి - వాస్తవానికి బ్రోకర్ల చేతుల్లోకి, ప్రవేశపెట్టాలని ఫ్రిక్స్ ఎప్పుడూ వుద్దేశపడుతుండటం కార్నెగీకి తెలుసు. చివరకు పీట్స్‌బర్గు బ్యాంకరయిన ఒక కోటీశ్వరుడికి కార్నెగీ కంపెనీ వారి రెండు శాతం వాటాలను అమ్మి కొన్ని అభివృద్ధులను సాధించవలసిందని ఫ్రిక్స్ కంపెనీ కోశాధికారికి సూచన చేసినప్పుడు, దీనిని మించేటట్లుగా కోక్ ధరను గురించి కార్నెగీతో నోటిమాటగా చేసుకొన్న ఒడంబడికను బొత్తిగా త్రోసి పుచ్చినప్పుడు, సహజంగా శాంతస్వభావుడయిన ఆ స్కాచ్ దేశీయుడు ఉన్మత్తుడయినాడు.

హెన్రీ, ఫిప్స్, ఫ్రిక్స్ పక్షం వహించటం కార్నెగీని అన్నిటికంటె అధికంగా గాయపరచింది. ఫ్రిక్స్‌ను కంపెనీ నుంచి తొలగించాలని నిశ్చయించుకొని 1899 శరత్తులో కఠినముఖుడై ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంతకు పూర్వం ఎన్నడూ భాగస్థులతో అతనికి తీవ్రమయిన వివాదాలేవీ రాలేదు. అయినా కార్నెగీ తప్పనిసరి అయి తాను తీసుకోవటానికి నిశ్చయించుకొన్న చర్యను అసహ్యించుకున్నాడు. తన స్టాకును యితరభాగస్థులకు అమ్మి, కంపెనీలో నుంచి ప్రశాంతంగా విరమించుకోమని అతడు ఫ్రిక్స్‌కు సూచన చేశాడు. అందుకు ఫ్రిక్స్ నిరాకరించాడు. ఈ కారణంగా ఖరీదయిన దావా నడించింది. అతన్ని పంపించి వేయటం కోసం రాజీ పడవలసి వచ్చింది. చివరకు ఫ్రిక్స్ వెళ్ళిపోయినాడు. తరువాత ఫ్రిక్స్ కార్నెగీతో సంధి యత్నాలు చేశాడు. వారిరువురూ తిరిగి మిత్రులయినారు. అయినా వెనుకటి సంవత్సరాలలో కనుపించిన సౌమనస్యం వారికి మళ్ళీ ఎన్నడూ చేకూరలేదు. తన్ను ఎన్నోరెట్లు మించిన కోటీశ్వరుడయి కూడా, తన పథకాలను నిరంతరం భగ్నం చెయ్యటమనే పనిగా పెట్టుకుంటాడని కార్నెగీ అంటే ఫ్రిక్స్‌కు అనిష్టం.

ఈ కలహం కార్నెగీని వ్యథ పెట్టింది. ఒక వంక అతడు వ్యాపారికమయిన బాధ్యతలనుంచి విడుదల పొందాలని అతిగా కుతూహలపడుతున్నాడు. మరొక వంక తన జీవితమంతా దేన్ని సాధించాడో దాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోవటమన్న భావాన్ని

ఎదుర్కోలేక పోతున్నాడు. మహాశక్తిమంతుడయన జె. పియర్ పాంట్ మోర్గన్ ఆధ్యక్షాన నడుస్తున్న మోర్గన్ బ్యాంకింగ్ హౌస్, ఉక్కు వ్యాపారపు పెట్టుబడులను కొనటం ప్రారంభించింది. ఈ సమయంలో కార్నెగీ సంస్థకు స్వాబ్ అధ్యక్షుడు. కార్నెగీ సంస్థ ఓహియా రాష్ట్రంలో ఈరీసరస్సు వొడ్డున కోన్నియాట్ దగ్గర క్రొత్త ఉక్కు కర్మాగారాన్ని నిర్మించి, దానికి ఎదురుదెబ్బ తీసింది. మిస్సాబి ఇనుప ఖజానాన్ని ఈ క్రొత్త కర్మాగారానికి సూటిగా పడవలమీద చేర్చటానికి వీలుంది.

మోర్గన్ ఇప్పుడు కార్నెగీని కొనివెయ్యగలమా అని అబ్బురపడటం ప్రారంభించాడు. ఇతడు జాన్ డబ్ల్యు. గేట్సు దగ్గరనుంచి బార్బుడువైరు, ఉక్కు వ్యాపారాలను కొన్నాడు. అతడు మోర్గన్‌తో ఇలా చెప్పాడు. "కార్నెగీ దగ్గర పలుకుబడి గల వ్యక్తి ఒక్కడే వున్నాడు. అతడు చార్లీ స్వాబ్. అతన్ని పట్టగలిగితే మీ పని జరుగుతుంది."

మోర్గన్, స్వాబ్‌ను, ప్రముఖులయిన యితర ఉక్కు వ్యాపారస్థులను సమాలోచనలకోసం ఆహ్వానించాడు. ఒక రాత్రంతా మరపురాని సమావేశం జరిగింది.

స్వాబ్ వారితో 'వ్యాపారిక బాధ్యతవల్ల ఆయన అలసిపోతున్నాడు. అయినా ఉక్కుతో ఉన్న సమస్తసంబంధాన్నీ వదులుకోటానికి ఆయన యిష్టపడడు" అన్నాడు. ధరలను గురించి, కర్మాగారాల మూల్యాలను గురించి కొన్ని గంటల చర్చలు సాగిన తరువాత, స్వాబ్ "ఈ విషయంలో నేను చేయగలిగింది చేస్తాను" అని వాగ్దానం చేశాడు.

అతడు ఎంతో తెలివిగా మొదట మిసెస్ కార్నెగీని కలుసుకున్నాడు.

"ఆయన యిక విరమించుకోవాలి" అని ఆమె అంగీకరించింది. "ఈ భావం అప్పుడప్పుడూ ఆయన మనస్సుకు రావటం నాకు తెలుసు. అయినా దానినుంచి పూర్తిగా విడివడడమనే భావాన్ని ఆయన అసహ్యించుకొంటుంటాడు" అన్నది.

కొంతసేపు వాళ్ళిద్దరూ దాన్ని గురించి చర్చించుకొన్నారు. "ఆయనను ఏ గోల్ఫ్ ఆటకో తీసుకుపోయి, అక్కడ ఉల్లాసంగా ఉన్నప్పుడు ఈ విషయాన్ని నీవెందుకు సూచించగూడదు?" అన్నదామె చిరునవ్వుతో. ఇంకా ఇలా అన్నది. "ఈ భావాన్ని ఆయనకు నచ్చజెప్ప గలవాడెవడయినా ఉన్నాడంటే, చార్లీ, అది నీవొక్కడవే!"

అందువల్ల చార్లీస్ స్వాబ్ తనయజమానిని వెస్ట్‌ఛెస్టర్ కౌంటీలోని గోల్ఫ్ క్లబ్‌కు తీసుకుపోయినాడు. ఇద్దరూ అక్కడ ఒక పచ్చిక బీడుల మీదుగా నెమ్మదిగా అడుగులు

వేసుకుంటూ నడుస్తున్నప్పుడు స్వ్కాబ్ విషయాన్ని ఎత్తుకున్నాడు. మొదట అతడు ఏ మాత్రం సుముఖుడుగా లేడు. "కాదు. కాదు విరమించుకోటం నాకు యిష్టం లేదు" అని కళవళ పడుతూ అన్నాడు. ఆ తత్తరపాటు అతడు మనసులో ఒక అంతర్యుద్ధాన్ని సాగిస్తున్నట్లు వెల్లడి చేస్తున్నది. ఇప్పుడు ఆయనను ముట్టడించినవాడు, 'చరిత్రలోకెల్లా ప్రసిద్ధుడయిన సేల్స్‌మన్' అని సమకాలికుల చేత అనిపించుకొన్న వ్యక్తి. అతని అందానికి తరిమి ఒప్పించే నేర్పునకు దరిదాపుగా తట్టుకోగలగడం అంటూ వుండదు.

"వ్యాపారం పెట్టేందుకు మోర్గన్‌కు వందలకొద్దీ మిలియన్లున్నాయి. అతడు మనకు చాలా క్లేశకరమయిన ప్రతిద్వంద్వి అయితీరుతాడు. అంతేకాదు, అతడూ, మీరే మడిగితే అది దరిదాపుగా ఇవ్వటానికి సంసిద్ధుడయినాడు" అన్నాడు స్వ్కాబ్.

"కావచ్చు. నాకు డబ్బుతో పని లేదు. వ్యాపారం నుంచి బయటకు వెళ్ళి నేను చేసేదేముంది?" అన్నాడు కార్నెగీ అడ్డు చెబుతూ.

"డబ్బును దానం చేస్తూ మహానందాన్ని అనుభవించవచ్చు. మీ ఐశ్వర్య సువార్తను నిరూపించి చూపవచ్చు." ఇలా అతడు యజమాని నిశ్శబ్దంగా వింటూంటే వాక్యపరంపరను క్రుమ్మరించాడు.

చివరకు కార్నెగీ అడిగాడు "దీన్ని గురించి ఇతరభాగస్థుల అభిప్రాయ మేమిటి? మరి, వాళ్ళతో నీవు సంప్రదించావా?"

"మేము ముగ్గురమో, నలుగురమో ఒకరితో ఒకరు ఏదో చెప్పుకున్నాము" అని స్వ్కాబ్ ఒప్పుకున్నాడు. "అయితే వాళ్ళంతా అంగీకరిస్తారని నా నిశ్చయం. మాలో ఉక్కు వ్యాపారంలో ఉండిపోదలచుకొన్న వాళ్ళెవరయినా వుంటే, మోర్గన్ రూపొందిస్తున్న ఆ యునైటెడ్ స్టేట్స్ స్టీల్ కార్పొరేషన్‌లో స్టాకును, బాండ్లను పుచ్చుకొంటాము. మీరు వెంటనే డబ్బు రూపంలోకి మార్చుకొనేందుకు గాని దానధర్మాల కుపయోగించు కొనేందుకు గాని అనువైన బాండ్లను తీసుకోవచ్చు."

మధ్యాహ్నమైంది. వాళ్ళు కొద్దిసేపటికి విడిపోబోయేటంతవరకూ కార్నెగీ ఇంకా కొంత మాట్లాడాడు. "ఇతరభాగస్థులను కలుసుకో. వారి అభిప్రాయా లేమిటో తెలుసుకో" అని అతడు ఆదేశించాడు.

ఇతరభాగస్థులందరూ అమ్మకానికి అంగీకరించారు. స్వ్కాబ్ ఆ విషయాన్ని మోర్గన్‌కు తెలియజేశాడు. అప్పుడు ఆ బ్యాంకరు కార్నెగీని టెలిఫోన్ మీద పిలిచాడు.

ఇరువురూ శుభాకాంక్షలను చెప్పుకున్న తరువాత, అతడు అతిముఖ్యమయిన విషయాన్ని ప్రారంభించాడు. "మీరు ఇక్కడికి వచ్చి ఎందుకు దాన్ని గురించి మాటాడకూడదు?" అని ఆ బ్యాంకరు సూచన చేశాడు.

"మిస్టర్ మోర్గన్, ఫీఫ్టీఫస్ట్ స్ట్రీట్ నుంచి వాల్ స్ట్రీటు ఎంతదూరమో, వాల్ స్ట్రీటునుంచి ఫిఫ్టీ ఫస్ట్ స్ట్రీటూ అంతే దూరం" అని ఆ ఉక్కురాజు మధురంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

అందులో వున్న అంతరార్థమేమిటో మోర్గన్ గమనించాడు. ప్రపంచంలోని ఉక్కు ఉత్పత్తి దారుల్లో కెల్లా పెద్ద అయినవాడు, ప్రపంచంలోని బ్యాంకర్లలో కల్లా పెద్ద అయినవాడి చేత పోషింపబడదలచలేదు. ఉక్కు డబ్బుకంటె గొప్పది కొండే మహమ్మదు దగ్గరికి రావాలి.

"సరే! నేను వస్తా" నని మోర్గన్ గుర్రుమన్నాడు.

అతడు బండిని పిల్చి కార్నెగీ ఇంటికి వెళ్ళాడు. పదిహేను నిమిషాలలో పర్వతమంత లావాదేవీకి ఒప్పందం కుదిరింది. వాళ్ళు మాట్లాడుకుంటున్నప్పుడే కార్నెగీ చిన్న కాగితపు ముక్కమీద నలభై కోట్ల డాలర్లు అని అంకె వేసి మోర్గన్ చేతికిచ్చాడు. ఇది అతని భాగపు ధర.

అతికఠిన శిలవంటి మోర్గన్ ముఖంలో అణుమాత్రమైనా మార్పు కనిపించలేదు. "అది తృప్తికరంగానే వున్నది" అన్నాడు. మరికొంతసేపు మాట్లాడి, బండి యెక్కి వాల్ స్ట్రీట్‌కు వెళ్ళిపోయినాడు. "అడిగినట్లయితే ఆయన కింకో పదికోట్ల డాలర్లు ఎక్కువ ఇచ్చివుండేవాణ్ణి" ఆ పని తరువాత మోర్గన్, స్క్వాబ్‌తో అన్నాడు.

కనుక మోర్గన్ నూట పదికోట్ల డాలర్ల కాపిటల్ షేర్లతో యునైటెడ్ స్టేట్స్ కార్పొరేషన్ అన్న మహాసంస్థను నిర్మించాడు. ఇరవై అయిదు సంవత్సరాలకు పూర్వం, పదిహేను పదహారు సంవత్సరాల వయసులో పెన్సిల్వేనియా కొండల్లో బండి తోలి బ్రతికిన కుర్రవాడయిన స్క్వాబ్ దీని కధ్యక్షుడు. ఈ వ్యాపారాన్ని ఇంతకంటే అధికశక్తిమంతుడయిన వ్యక్తి చేతుల్లో పెట్టేందుకు అవకాశం లేదని, చార్లీ పూర్వయజమాని అంగీకారపూర్వకంగా భావించాడు.

వ్యాపారాన్ని విడిచిపెట్టటం వల్ల కలిగిన క్రుంగుబాటు తలపు కార్నెగీలో ఎక్కువ కాలం నిలువలేదు. తరువాత వెంటనే అతడు తాను చేయదలచుకున్న పనులను

గురించి ఆలోచన ప్రారంభించాడు. చార్లీ చెప్పిన మాట సత్యం. తన ధనాన్నంతటినీ దానం చెయ్యటం వల్ల అతడెంతో ఆనందాన్ని అనుభవించబోతున్నాడు. అతని వయసిప్పుడు అరవై ఆరు సంవత్సరాలు. ఇక ఎక్కువ కాలం మిగిలి వుండకపోవచ్చు.

దానం చెయ్యటంలో వెనుకంజ లేని మాట నిజం. తన నలభై కోట్ల డాలర్ల ధనాన్ని దానం చెయ్యటం ప్రారంభించిన సరసమైన, దయాన్వితమైన గుండ్రని మోము, తెల్లని గడ్డం గల ఈ కురుచైన లావైన చిన్న మనిషి, అతని గడ్డమే మరికొంత నిడివిగలదైనదైతే శాంటాక్లాస్‌కు ఆదర్శమయిన ప్రతిమూర్తిని వహించినట్లుండేవాడు. అయితే ప్రతిఫలరహితంగా అతడు సహాయం చేసిన వేలకొలది పాఠశాలలకు కళాశాలలకు, ధర్మసంఘాలకు వ్యక్తులకు అతడు ఇప్పుడే శాంటా క్లాస్.

అసంఖ్యాకంగా శాఖలను నిర్మించే విషయంలో అతడు ఇప్పుడు కూడా న్యూయార్క్ ప్రజాగ్రంథాలయ ధర్మకర్తలతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. తొలుతగా మిలియను డాలర్లు ఇచ్చి ఇంతకు పూర్వపు సంవత్సరం ఫిట్స్‌బర్గులో కార్నెగీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ప్రారంభం చేశాడు. తరువాత తరువాత అతడు తన జీవిత కాలంలో ధర్మాలుగా యిచ్చిన మొత్తం ఒక కోటి అరవై లక్షల డాలర్లు అయినది. స్కెలెన్ల పార్క్‌లో అతడు కట్టించి ఘననిర్మాణానికి నాలుగు శాఖలున్నవి. స్కూల్ ఆఫ్ అప్లయిడ్ ఇండస్ట్రీస్, మార్గరెట్ మారిసన్ కార్నెగీ స్కూలు. ఇవన్నీ యువకుల గృహ శాస్త్రంలోను, దానికి సంబంధించిన అనుబంధ విషయాల్లోను శిక్షణ ఇచ్చే సంస్థలు. ఇవన్నీ ఆయా శాస్త్రాలల్లో పట్టభద్ర బిరుదాలిచ్చేవే.

వ్యాపారం నుంచి విరమించుకొన్న తరువాత కార్నెగీ చేసిన మొదటి పనులలో ఒకటి, ఉక్కు కర్మాగారాలు, కొలుముల్లో పనిచేసిన వారి సంక్షేమం కోసం 50,00,000 (యాభై లక్షల) డాలర్‌లు ప్రత్యేకించి వుంచటం. అతడు ఇందులో ఒక మిలియను డాలర్‌లు తాను వారికోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయ పాలనకోసం వేరుగాపెట్టి వుంచాడు. మిగిలిన ధనమంతా వయోవృద్ధుల పింఛనుల కోసం, కర్మాగారంలో వికలాంగులయినవారికి సహాయమివ్వడం కోసం, మృతి నొందిన కార్మికుల కుటుంబాలకు సహాయ మివ్వటం కోసం వుద్దేశింపబడింది.

ఆ సంవత్సరం వసంతంలో నాలుగు స్కాచ్ విద్యాలయాలలోను అతి ప్రాచీనమై ప్రబలప్రతిష్ఠను గడించుకొన్న సెయింటు ఆండ్రూస్‌కు లార్డు రెక్టరుగా నియమితుడు కావటం కోసం స్కాట్లండు వెళ్ళాడు. విశ్వవిద్యాలయాలలో లార్డు రెక్టర్ ఒకప్పుడు

ప్రముఖోద్యోగిగా వుండేవాడు. ఐతే శతాబ్దులు గడచిన తరువాత అది ఒక గౌరవపదవిగా మారిపోయింది. ప్రతి సంవత్సరం విద్యార్థులు ఎన్నుకొన్న ఒక ప్రముఖవ్యక్తి ఆ పదవిని స్వీకరిస్తుండేవాడు. సెయింటు ఆండ్రూస్ చరిత్రలో గడచిన అయిదు శతాబ్దాలలో ఈ పదవిని నిర్వహించిన విశిష్టవ్యక్తులు సుదీర్ఘ పట్టికలో తాను ఒకడుగా వుండే అవకాశమిచ్చిన ఈ గౌరవానికి కార్నెగీ గర్వించటం ఎంతో సమంజసం. ఈ ఎన్నుకోబడటం విషయంలో ఇతడు బ్రిటిష్ పౌరుడు కానివారిలో ప్రథముడు. తరువాత 1902లో కూడా విద్యార్థులు అతన్ని మరోమారు కూడా ఈ రెక్టర్ పదవికి ఎన్నుకొన్నప్పుడు, అతడు ఇంకా విశేషంగా గర్వించాడు.

రెక్టర్స్ నైట్స్‌లో అతడు ఎంతో సంతోషించాడు. వీటిలో రెక్టర్ సంపూర్ణంగా విద్యార్థులతో కలిసిమెలసి చరిస్తాడు. ఎంతో ఆదానప్రదానం జరుగుతుంది. వీటిలో ఉండటానికి అధ్యాపకవర్గంలో ఒకడికయినా అనుమతి దొరకదు. మొదటి రెక్టర్స్ నైట్ గడచిన తరువాత, ప్రిన్సిపాల్ డొనాల్డ్‌సన్ "ఫలానా రెక్టరు మాకు ప్రతిగా మాటాడాడు. మరొక రెక్టర్ మాకు అనుకూలంగా మాటాడాడు. వారిద్దరూ వేదికనుంచే మాటాడారు. రెక్టరు కార్నెగీ చక్రాకారంగా వున్న మా మధ్య కూర్చుని మాతో మాట్లాడారు" అని విద్యార్థులు చెప్పుకొన్నట్లు అతనికి తెలియజేశాడు. సెయింట్ ఆండ్రూస్‌లో దరిదాపు రెండువందల మంది విద్యార్థులే వుండటం వల్ల, ఇలా చేయటం ఏమంత కష్టమయిన పనికాదు.

ఆబర్‌డిన్, ఎడింబరో, గ్లాసో, సెయింట్ మాథ్యూస్ అన్న నాలుగు విశ్వవిద్యాలయాలు ఆర్థికంగా స్తోమత తప్పివున్నవని, శక్తి వుండి కూడా విశ్వవిద్యాలయ విద్యను అనేకులైన బాలురు పొందలేకపోతున్నారనీ గమనించి, కార్నెగీ కోటి డాలర్‌ల నిధితో స్కాచ్ యూనివర్శిటీ ట్రస్టును ఏర్పాటు చేశాడు. ఇందులో సగభాగం పై నాలుగు సంస్థల ఉపయోగం కోసం, మిగిలిన సగభాగం విద్యార్జనను ఆశించే యువకులకు సహాయం చెయ్యటం కోసం ఉద్దేశింపబడ్డాయి. విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులను వారి కుటుం బాలతో వచ్చి ఒక వారం రోజులు గడిపిపోవలసిందని ఆహ్వానించారు. యూనివర్సిటీ ట్రస్టుకు అధ్యక్షుడయిన ఎరల్ ఆఫ్ ఎల్జిన్, బ్రిటిష్ మంత్రివర్గంలో స్కాట్లండు తరఫున కార్యదర్శి అయిన లార్డు బాల్ఫోర్ కూడా వారు వచ్చినపుడు విచ్చేశారు. తరువాత తరువాత 'ప్రిన్సిపాల్స్ వీక్' అన్నది స్కిబోలో ప్రతి సంవత్సరం జరిగే ఒక వుత్సవమయింది. అది ఎప్పుడూ ఒక సంతోషకరమైన సమయంగా వుంటుండేది.

మొదట ప్రిన్సిపాల్స్ వీక్ అయిన తరువాత ప్రిన్సిపాల్ లాంగ్ వెళ్ళేటప్పుడు, కార్నెగీతో కరచాలనం చేస్తూ "స్కాట్లు విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్‌కు ఎలా మా సమావేశాలను ప్రారంభించుకోవాలో తెలుసుకోవటానికి అయిదు వందల సంవత్సరాలు పట్టింది. ఇందుకు అందరూ ఒక వారాన్ని కలిసి గడపటమే పరిష్కారం" అన్నాడు.

తానిప్పుడు సంపూర్ణస్వేచ్ఛ కలవాడు కనుక విశ్రాంతిని పుచ్చుకొన్న ఆ పారిశ్రామికుడు, తను చేయదలచుకొన్నది ఎంత వుందో గమనించి మనోహరమైన ఆశ్చర్యాన్ని పొందాడు. అమెరికన్ బ్రిటిష్ పత్రికలకు తాను వ్రాసిన వ్యాసాలు కొన్నింటిని సమకూర్చుకొని, మరికొన్ని అదనపు విషయాలను చేర్చి 1901లో "ది ఎంపైర్ ఆఫ్ బిజినెస్" అన్న పేరుతో ఒక సంపుటిని ప్రచురించటం ఈ చేయదలచిన పనులలో ఒకటి. అతడు జేమ్స్‌వాట్ జీవిత చరిత్ర వ్రాయటమనే అభిలాషతో ఉర్రూత లూగుతున్నాడు. ఫిఫ్త్ ఎవెన్యూకు రెండు మైళ్ళకు పైన, నైన్‌టీన్త్ నైన్‌టీఫస్టు స్ట్రీట్లకు మధ్య అతడొక నూతనగృహాన్ని నిర్మించాడు. కుటుంబం 1902లో ఒక నవమందిరానికి మారింది. అది చాలా విస్తీర్ణం కలది. దాన్ని నిర్మించుకొన్న యజమానిలా బలిష్ఠము చౌకము అయినది దాని నమూనా అతిసామాన్యమయినది. దానిచుట్టూ ఉన్న నేల వసంతం మొదలు వేసగి వరకూ వుండే పూలతో కళకళలాడు తుండేది. ఆ గృహయజమాని శయ్యాగృహంలో గోడమీద ఒక బొమ్మ వ్రేలాడుతుండేది. అది బిల్ జోన్స్ చిత్రం.

కార్నెగీ కార్పొరేషన్ రద్దయిన తరువాత పూర్వం దానిలో భాగస్థులయినవాళ్ళు, మొత్తం నలభైమంది. వారిలో చివరివాడు కూడా మరణించేటంత వరకు పూర్వపు జీవిత స్మృతులను నిలుపుకోవటం, కోసం కార్నెగీ వెటర్నెన్సు ఎసోసియేషన్ అన్న పేరుతో ఒక సంస్థను స్థాపించుకొన్నాడు. నూతనగృహనిర్మాణం పూర్తి అయిన తరువాత మిసెస్ కార్నెగీ తన భర్తకు, సంతోషకరంగా ప్రథమంగా కార్నెగీ "వెటరన్లను ఆహ్వానిద్దాం" అన్నది. వారు విందుకు వచ్చినప్పుడు గృహానికి శుభాకాంక్షలు పలికారు. 'వెటరన్సు డిన్న' రన్నది, తరువాత ప్రతి సంవత్సరం ఆ క్రొత్త యింట్లో ఒక ఆచారంగా జరుగుతూ వచ్చింది. అందరూ దీనికోసం ఎదురుచూస్తుండేవాళ్ళు. సంవత్సర మంతటిలో అనుభవించే ప్రముఖమైన ఆనంద సమయాలలో ఇది ఒకటి కావటం వల్ల అలా ఎదురుచూసేవాళ్ళల్లో అగ్రగణ్యుడు ఆతిథేయి కార్నెగీ. ఆ వెటరన్లను "నా బాలులారా!" అని కార్నెగీ పిలుస్తుండేవాడు. వారు తనయెడ అతిప్రీతిని ప్రదర్శిస్తుంటే

ఆనందం అనుభవిస్తుండేవాడు. ఆ ప్రేమ వాళ్ళ కన్నుల్లో మెరుస్తుంటే తిలకించి పరవశుడౌతుండేవాడు. తన ఆత్మకథ టిప్పణిలో అతడు ఇలా వ్రాశాడు. "సంపద లేకపోయినా ఇది కావాలి. బహుకోటీశ్వరత్వం కంటె ఇది ముఖ్యం. ఔను, వేయిమారులు ఔను!"

మొదటి విందు వేళ వారు మిసెస్ కార్నెగీని వెటరన్స్ ఎసోసియేషన్స్‌లో గౌరవ సభ్యురాలుగా ఎన్నుకొన్నారు. వెంటనే ఒకరు "చిన్న మార్గరెట్‌ను కూడా ఎన్నుకుందా" మని సూచన చేశారు. ఈ సూచన వెంటనే అంగీకరింపబడింది.

వెటరన్లలో ఒకడయిన చార్లెస్ స్క్వాబ్, ఒకనాటి గ్రామీణ దరిద్రబాలుడు, నేటి స్టీల్ ట్రస్టు సంస్థకు ప్రధాని రివర్ సైదు డ్రైవ్‌మీద, ఒక బలిష్ఠమైన సౌధాన్ని నిర్మించాడు. దీన్ని ఇతడు తన కతిప్రియమైన ఫ్రాన్సులోని లొయిరీ నదిమీది దుర్గపు నమూనా ననుసరించి కట్టాడు. ఇది గోపురశిఖరాలతో ఒప్పే ఒక గృహనిర్మాణం.

అతని పూర్వ యజమాని అప్పుడప్పుడూ ఎవరైనా మిత్రుణ్ణి "నీవు చార్లీ నూతన భవనాన్ని చూశావా?" అని తనలో తాను నవ్వుకుంటూ అడిగేవాడు. "దానితో పోల్చి చూస్తే నా ఇల్లు చిన్న కుటీరంలా కనిపిస్తుంది" అనేవాడు.

# 13. పంపకం

న్యూ యార్క్ ప్రజాగ్రంథాలయం డైరెక్టరు మిస్టర్ జె.యస్. బిల్లింగ్స్ మన్‌హట్టన్, బ్రాంక్స్‌పేటల్లో శాఖాగ్రంథాలయాలను నెలకొల్పే విషయంలో కొంత కాలం నుంచి కార్నెగీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. 1901లో ఒక్కొక్క దానికి 80,000 డాలర్ల ఖర్చుతో అరవై అయిదు శాఖలను యేర్పాటు చేస్తానని సద్దులేకుండా సూచన చేశాడు. ఇతర ఖర్చులు కాక ఇందుకయ్యే మొత్తం యాభై రెండు లక్షల డాలర్లు.

"యాభై రెండు లక్షలు పెద్ద ఆర్డరు!" అన్నాడు కార్నెగీ. కానీ "ఈ భవనాలు అవసరమని తోస్తే తప్పక కట్టి తీరవలసిందే!" అందువల్ల నగరం తగిన నివేశనస్థలాలను వెదకటం ఆరంభించింది. డబ్బు లేకపోవటం వల్ల చాలా పర్యాయాలు ఆగటం వంటి సాధారణ ప్రతిబంధకా లేమీ లేకుండా, డబ్బు ఇవ్వటానికి పారిశ్రామిక అల్లాడీన్ ఉండటం వల్ల పని వేగంగా జరిగింది. అయితే కావలసిన డబ్బు అంత మొత్తమే కాదు. ఇంకా మొదటి అంచనాను అతిక్రమించి మరి మూడు క్రొత్త భవనాలు చేర్చబడ్డాయి. తరువాత మరొక ప్రత్యేక సంస్థ అయిన బ్రూకిలిన్ గ్రంథాలయానికి ఇరవైశాఖ లివ్వబడ్డాయి. ఈ గ్రంథాలయాలన్నింటికీ కొన్ని లక్షణాలుండాలి. ప్రతి ఒక్కదానికీ రిఫరెన్స్ శాఖ, సంచారశాఖ వుండాలి. పిల్లల కక్ష్య, పత్రికల సంచికలు వుండాలి. బయటికి ప్రతి భవనం ఇది గ్రంథాలయమని ఎరుకపడే రూపంతో వుండాలి. అయితే వీటిలో ఒక్కటీ రెండోదాన్ని పోలి వుండటానికి వీల్లేదు.

వీటిలో అనేకమైన కట్టడాలలో అన్ని సౌకర్యాలూ గల బేస్‌మెంటు నాటకశాల లుండేవి. వీటిలో తరువాత కొన్ని సమయాలలో నాటకప్రదర్శనలు జరిగేవి. తరువాతి సంవత్సరాల్లో వీటిమీద ఇంగ్లీషులోను, ఇతర విషయాలలోను రాత్రి తరగతులు నడిచేవి. తరువాత కొన్ని సంవత్సరాలు ఒక లోకోపకారి అయిన న్యూ యార్క్ నాటక ప్రదర్శకుడు జాన్ గోల్డెన్ లైబ్రరీ థియేటర్ల పైనే పేరుపెట్టి, కొన్ని నాటకసంస్థలను నడిపాడు. మంచి నటకులున్న సంఘాలకు ఉద్యోగాలిచ్చి నిలిపి ఈ లిటిల్ థియేటర్లకు వెళ్ళి, వీటిలో క్రొత్తగా బ్రాడ్వేలో ప్రదర్శించిన నాటకాలను ప్రదర్శింపజేస్తుండేవాడు. ఈ

నాటకాలు చూడటానికి, పరిమితమైన పట్టికలో స్థానాన్ని పొందిన పోషకులకు, ప్రవేశ రుసుము వుండేది కాదు.

1919లో కార్నెగీ తన దానధర్మాలను పూర్తిగా నిలుపుదల చేసిన నాటికి, 6,03,64,808 డాలర్ల ఖర్చుతో అతడు 2,811 స్వేచ్ఛాప్రజాగ్రంథాలయ భవనాల ఏర్పాటుకి దానం చేశాడు. వీటిలో 1946 సంయుక్త రాష్ట్రాలలోను, మిగిలినవి విదేశాలలోను ఉన్నవి. ఈ గ్రంథాలవల్ల ప్రయోజనం అనేకవేల మిలియన్ల మానవులకు అవి ఇచ్చిన అపరిమితమయిన విజ్ఞానానందాలు.

ఈ దాతే ఇలా చెప్పాడు : "గ్రంథాలయం ముఖ్యమైన ప్రయోజనం తానివ్వ లేనివారికి అది ఏమీ ఇవ్వదు. యువకులు తమంత తామే విజ్ఞానాన్ని సంపాదించు కోవాలి. దీనిలోనుంచి తప్పించుకోవటమంటూ ఏమీ లేదు." ఇంకా అతడిలా అన్నాడు : "నేను నా చిన్ననాటి అనుభవాన్ని బట్టే తమలో మంచి ఉండి దాన్ని వృద్ధి పొందించుకునే శక్తి, ఆసక్తి ఉన్న బాల బాలికలకు శ్రేయాన్ని చేకూర్చే గ్రంథాలయాలను, పురపాలక సంఘాన్ని ఎలాగో అలా, సాయపడి నిలుపుకోగల ఇచ్ఛ వున్న సమాజమధ్యంలో వాటిని స్థాపించటం కంటే డబ్బును వినియో గించుకోవటానికి మంచి మార్గం లేదని నిశ్చయించాను. స్థాపించిన గౌరవాన్ని నాకు దక్కించిన ఈ గ్రంథాలయాల భవిష్యత్తు ఈ అభిప్రాయం ఎంత సత్యమైందో నిరూపించి తీరుతుంది. ఎందువల్లనంటే ప్రతి గ్రంథాలయంలో ఒక్క వ్యక్తి అయినా దానిని ఉపయోగించుకొని, కల్నన్ అండర్సన్ నాలుగు వందల మాసిపోయిన సంపుటాల గ్రంథాలయం వల్ల నేను పొందిన లాభంలో సగమైనా పొందగలిగితే వీటిని స్థాపించటం వ్యర్థంగా నేను భావించను."

న్యూ యార్క్‌లో ఈ గ్రంథాలయాలను నిర్మిస్తున్న దినాలలోనే "వాషింగ్టన్ కార్నెగీ ఇన్‌స్టిట్యూటు, ప్రారంభమైంది. దానికి స్థాపనోత్సవం జరిగినది జనవరి 28, 1902న. "పరిశోధన, క్రొత్త విషయాలను కనుక్కోవటం, మానవాభ్యుదయానికి విజ్ఞానాన్ని వినియోగించటం అన్న విషయాలను పెంపొందించటం కోసం" నిర్మాత దీనికి రెండు కోట్ల ఏభై లక్షల డాలర్లు దానమిచ్చాడు. థియెడోర్ రూజ్‌వెల్టు క్రింద సెక్రెటరీ ఆఫ్ స్టేట్‌గా వున్న జాన్ హో దీని బోర్డుకు మొదటి అధ్యక్షుడు. వాషింగ్టన్‌లోని దీని ఆర్థిక – సాంఘికశాస్త్రం, చారిత్రక పరిశోధన, జియోఫిజికల్ డిపార్టుమెంటులే కాక, దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఎన్నోచోట్ల నడుస్తున్నవి. ఆరీజోనా ఎడారిమీది బొటానికల్ లాబొరేటరీ, ఫ్లారిడా తీరానికి దూరంగా డ్రైటార్టుగస్ ద్వీపాల్లోని మెరైన్ బయొలాజికల్ లాబొరేటరీ, దాని గొప్ప టెలిస్కోపుతో కాలిఫోర్నియాలోని మౌంట్

విల్సన్ లాబొరేటరీ, న్యూ యార్క్ ఆల్బనీలోని ఆబ్జర్వేటరీ, సముద్రాలపై ప్రయాణం చేస్తూ పూర్వం రూపొందించబడ్డ సర్వే పటాలను సరిదిద్దుతున్న చిన్న నౌక – ఇంకా యిందులోనివి  ఎన్నో వున్నవి.

తరువాత తనకు అతిప్రియమైనది కానున్న హీరోఫండు కమీషను నెత్తుకున్నాడు. 1904లో యాభై లక్షల డాలర్లు ఇచ్చి దీనిని ప్రారంభించాడు. ఈ వంకకు అతని బుద్ధి మరలించినది పిట్సుబర్గుకు సమీపంలో ఉన్న బొగ్గు గనిలో జరిగిన విషాద సంఘటన. గనిలో ఒక ప్రేలుడు కలిగి లోపల ఉన్న జనమంతా సమాధి చెయ్యబడ్డారు. ఆ గనికి పూర్వపు సూపరింటెండెంటు మిస్టర్ టైలర్. ఇతడు ప్రస్తుతం మరొక వ్యాపారంలోకి వెళ్ళాడు. ఆ గనిని గురించి తనకున్న జ్ఞానం, అనుభవం ఎందుకైనా ఉపకరిస్తాయన్న ఆశతో, అతివేగంగా ఆ దృశ్యం జరిగిన చోటికి వెళ్ళాడు. అతడు నాయకత్వానికి పేరెన్నిక గన్నవాడు. ఆదుర్దాతో చుట్టూ మూగిన వలంటీర్లును చేర్చుకొని నాయకత్వం వహించి అతడు గనిలోకి దారితీశాడు. వాళ్ళు మృతి జెందకుండా ఉన్న అనేకులను బయటకు తీసి బ్రతికింప గలిగారు. కానీ ధీరుడయిన టైలర్ మాత్రం ఆ చర్యలో తన ప్రాణాలను కోల్పోయినాడు.

మిత్రులకోసం తన ప్రాణాలను అర్పించిన ఆ వ్యక్తి కంటే ప్రేమ మరెవ్వరిలో అధికంగా వుండి వుండదు. ఈ వాక్యం ఈ విషాదసంఘటన తరువాత చిరకాలం వరకూ కార్నెగీ మనస్సులో మారుమ్రోగింది. గొప్ప సమయంలో ఈ హీరోఫండు పట్టింది. అతడు తరువాత ఇలా వ్రాశాడు. “నాకు దానిమీద పితృప్రేమ వుంది. ఎందువల్ల నంటే ఇది నాకు ఎవరూ సూచించింది కాదు. నాకు తెలిసినంతవరకూ దీన్ని గురించి ఎవరూ సూచించటం జరగలేదు. నిశ్చయంగా ఇది నా మేధాప్రియపుత్రిక.”

ఇది యుద్ధసమయంలోని వీరవరులకు, వీరనారీమణులకు కాకుండా, శాంతి సమయంలోని వీర స్త్రీపురుషులకు ఉద్దేశింపబడటం వల్ల దీని గుణాధిక్యాన్ని గురించి కొందరు శంకించారు. వీరోచితకృత్యాలకు ఇది ఉద్బోధకంగా ఉండటం చేత బహుమతి కోసం సాహసచర్యలను ప్రేరేపించటం దీని ప్రయోజనమౌతుందని ఈ పథకాన్ని విమర్శించే వారు ఊహించారు. అయితే దాత మనసులోకి అటువంటి అభిప్రాయం ఎన్నడూ రాలేదు. “నిజమైన వీరులెన్నడూ బహుమతి గురించి ఆలోచించరు!” అని కార్నెగీ అన్నాడు. వారు దివ్యోద్రేకం కలవాళ్ళు. తమను గురించి కాకుండా ఎల్లవేళలా వారు ప్రమాదస్థితిలో వున్న తమవాళ్ళను గురించి ఆలోచిస్తారు.

పరిశీలకులు వెదికి తనముందుకు కొన్ని సంఘటనలు తీసుకోవచ్చినప్పుడే ఈ కమీషన్ వ్యవహరిస్తుంది. “మానవుల ప్రాణాలను రక్షించటంలో వీరోచిత యత్నం చేసి దెబ్బతిన్నవాళ్ళకు తిరిగి పనిచేసుకోగలిగేటంతవరకూ ఇది ఆర్థికసహాయమిస్తుంది. ఇటువంటి యత్నంలో మరణించినప్పుడు అతని భార్యకు, బిడ్డలకు, ఇంకా అతనిమీద ఆధారపడే వాళ్ళకు – ఆమె పునర్వివాహం చేసుకుండేదాకా పిల్లలు తమ్ము తామే పోషించుకునే వయస్సు వచ్చేదాకా, జీవితయాత్రకు వీలు కల్పిస్తుంది. వీరుడు గాయపడకపోయినప్పటికీ ఇటువంటి పారితోషికం ఇవ్వటం ఉచితమని కమీషన్ భావిస్తే అతనికి కొంత డబ్బును ఇవ్వవచ్చు. ఆ వీరకృత్యాన్ని తెలియజేసే రచనతో ఒక పతకాన్ని ఆ వీరుడికి గాని, అతని భార్యకు గాని, లేదా తరువాతి సన్నిహిత బంధువులకు గాని ఇవ్వవచ్చు.

హీరో ఫండ్ కమీషన్‌కు అధ్యక్ష పదవి పూర్వం కార్నెగీకి భాగస్థుడైన చార్లెస్ టైలర్ మీద పడ్డది. మనలో మాట ఎవరి ఆత్మత్యాగం ఈ నిధినిర్మాణానికి కారణభూతమైందో ఆ వ్యక్తి ఇతని బంధువు కాదు. టైలర్ ఇంతకు పూర్వమే పూర్వపు ఉక్కు కర్మాగారంలోని కార్మికులకోసం ఏర్పాటు చేసిన రిలీఫ్ నిధిని, ఎంతో పూర్వం కార్నెగీ క్రింద పనిచేసిన పెన్సిల్వేనియా రైల్‌రోడ్డు కార్మికులకోసం ఏర్పాటు చేసిన ఫండును చూస్తున్నాడు. ఎట్టి దుష్ప్రచారాలనైనా త్రోసి పుచ్చుతూ, ఏ పనికీ ఒక సెంటు ప్రతిఫలం పుచ్చుకోకుండా ఇప్పుడితడు తగిన శ్రద్ధతో, సమర్థతతో ఈ మూడు నిధుల వ్యవహారాలూ చూస్తున్నాడు. ఆయనవంటి వ్యక్తిమీద పూర్వయజమానికి అంతగాఢమైన అనురాగముండటం సహజం. లెహై విశ్వవిద్యాలయానికి భక్తి శ్రద్ధలు గల పూర్వ విద్యార్థి ఇతడు. ఆ విశ్వవిద్యాలయానికి క్రొత్త లాబొరేటరీ కావలసి ఉందని చెప్పటం ప్రారంభించాడు. “ఓహో! చార్లీతో గూడా సంబంధం పెట్టుకోవటానికి ఇది అవకాశం” అనుకున్నాడు, ఆ లోకోపకారి.

ట్రస్టీలు ఆ లాబొరేటరీకి తాను పేరు పెట్టటానికి అంగీకరిస్తే దానికి కావలసిన ధనాన్ని తానిస్తానని కార్నెగీ లెహై అధ్యక్షుడు డ్రింకరుకు లేఖ వ్రాశాడు. “తప్పక అంగీకరిస్తా”మని సమాధానం వచ్చింది. దాత దానికి “టైలర్ హాల్” అన్న పేరును ప్రత్యేకించి ఉంచాడు. తరువాత కొంతకాలానికి చార్లీ తబ్బిబ్బులు పడుతూ కార్నెగీ దగ్గరికి వచ్చాడు.

“మిస్టర్ కార్నెగీ ఈ పేరు వద్దు. ఈ భవనాన్ని నేను ఇవ్వటం లేదు. అదీగాక ప్రసిద్ధి పొందిన ప్రముఖుడను కాదు. కేవలం ఈ విద్యాలయంలో విద్యార్థిని మాత్రమే.

ఇంతటి గౌరవాన్ని పొందటానికి నేను చేసిందేమీ లేదు" అని అతను అభ్యంతర చెప్పాడు.

"ఈ భావాన్ని నాకు కల్పించినవాడివి నువ్వు" అని కార్నెగీ అడ్డుపడి అన్నాడు. "నీవు నన్ను ఆ భవనానికి డబ్బు ఇచ్చేదాకా నా వెంటబడి నేను సగం చచ్చేటంతగా పీడించావు. సెంటు అయినా పుచ్చుకోకుండా నాకు ప్రియమైన మూడు పథకాలకు ఆధిపత్యం వహించి నైలర్‌లా (మేకులు చేసేవాడు) పనిచేస్తున్నావు. ఇంతకుమించి నేను నీకు ఏమీ చెయ్యలేదు."

"అటువంటి చిన్నపనులకు ప్రతిఫలం పుచ్చుకుండేవాణ్ణి కా" నని టైలర్ "మీరు ఇటువంటి సంస్థలకు లక్షలాది ధనమిచ్చారు. నేను దీనికోసం కొద్ది గంటల కాలాన్ని వినియోగించగలను. ఇది అదికాదు. ఆ భవనానికి నామరూపాలు లేని నా పేరు పెట్టడం, అన్నభావం, దానికి గాను నేను ఏమీ ఇవ్వలేదని అందరికీ తెలుస్తుంది. అప్పుడు నేను పరిహాసపాత్రుడ నౌతాను. క్రొత్తవాళ్ళెవరైనా ద్వారం మీద ఆ పేరు చూస్తే "ఈ టైలర్ వర్తమానకాలం వాడా? భూతకాలం వాడా అని అడగరా?"

జేబుల్లో చేతులు పెట్టుకొని కార్నెగీ వేడితగ్గి మాటలైపోయేటంత వరకూ వెనక్కు వ్రాలి కుర్చీనానుకొని కూర్చున్నాడు. అతని ప్రసంగం పూర్తి అయిన తరువాత అతని వంకకు వ్రేలి నాడిస్తూ, "నేను చెయ్యననుకో, కాని నేను టైలర్ హాల్ అని పేరు పెట్టవలసిందేనని పట్టుపట్టితే అప్పుడు నీవు పరిహాసపాత్రుడివి కావా? అయితే నీవు లెహై కోసం అట్టి ఆత్మత్యాగాన్ని చెయ్యటానికి అంగీకరించటానికి సిద్ధపడవలసిందే! అది నీ విద్యామాతకు తోడ్పడుతున్నది. ఆ సందర్భంలో నిన్ను ఏదో గర్వం ఆవరించకపోయినట్లయితే నీ పేరును ఎవరు ఎలా ఉపయోగించుకొన్నా నీవు పట్టించుకుండేవాడివి కావు. టైలర్ అన్న పేరులో ఏముంది? ఇక్కడ యిబ్బంది పెడుతున్నదల్లా నీ తాళలేని ఆత్మగర్వం. నీవు దాన్ని జయించి తీరాలి!"

"యజమానీ! ఇక ఆపండి ఇలా వెఱ్ఱిపని చేయటం!" అన్నాడు టైలర్ జేవురించిన మోముతో. "విషయాన్ని పెడత్రోవ పట్టిస్తున్నారు. ఇది మీకు తెలుసు."

"సరే మంచిది. నీవు ఒక నిర్ణయానికి రా" చేయి చాచుతూ అన్నాడు కార్నెగీ "టైలర్ అన్న పేరును విడచిపెడతావో, లెహైని విడిచిపెడతావో నీ యిష్టం వచ్చింది చెయ్యి. కానీ టైలర్ లేకపోతే హాలు లేదు – చార్లీ, ఇది నీ తుది నిర్ణయం!"

టైలర్ చివరకు లొంగిపోయినట్లు చేతులెత్తాడు.

కార్నెగీ ఇలా వ్రాశాడు. "తరువాతి రోజుల్లో ఆ నిర్మాణాన్ని చూసి టైలర్ ఎవరని ఆశ్చర్యపడ్డారు. అతడు లెహైకి భక్తితత్పరతగల పుత్రుడనీ, సోదరమానవసేవను గురించి కేవలం బోధలు చేసేవాడు కాక కార్యరూపంలో చేసి చూపించాడనీ, జీవించిన అత్యుత్తమ మానవుల్లో అతడొకడనీ నిశ్చయం చేసుకొన్నారు."

మొదటి హీరోఫండు కమీషన్ యునైటెడ్ స్టేట్స్, కెనడా, న్యూఫౌండులాండుకు మాత్రమే వర్తించింది. కానీ 1908లో కార్నెగీ బ్రిటన్, ఐర్‌లందులకు హీరోఫండును నెలకొల్పాడు. గ్రేట్ బ్రిటన్ పాలకుడు కింగ్ ఎడ్వర్డు VII జర్మన్ పాలకుడు కైజర్ గిల్హెల్మ్ II ఉన్నత వర్గంవారు అతన్ని మెచ్చుకుంటూ స్వయంగా లేఖలు వ్రాశారు.

కొన్ని సంవత్సరాలపాటు, మధ్య మధ్య ఘనదానాలలో, సంవత్సరానికి ఒక నిర్మాణాన్ని ఉద్దేశించి దానాలు చేశాడు. చర్చిపీస్ యూనియన్‌కు ఇరవై లక్షలు డాలర్లకు మించి, హోగ్‌లో పీస్‌పాలెస్ నిర్మాణానికి పదిహేను లక్షల డాలర్‌లు, ఇంటర్ నేషనల్ చోరో ఆఫ్ అమెరికన్ రిపబ్లిక్స్‌కు ఎనిమిదిన్నర లక్షల డాలర్‌లు ఇతనికి ఘనదానాలు. ఇవికాక చర్చి ఆర్గన్లు, గ్రంథాలయాలు, కళాశాల భవనాలు, లాబొరేటరీలు, ప్రొఫెసర్ షిప్పులు ఎన్నో దానం చేశాడు.

కరుడుగట్టిన పూర్వవాసన విశేషంగాగల హైలాండ్ స్కాచ్ ప్రెస్బిటీయన్లు చర్చిలలో సంగీతవాద్యాలుండటం మతవిశ్వాసానికి విరుద్ధమని భావించేవాళ్ళు. వీరు కార్నెగీ చర్చిలలో ఆర్గన్లను ప్రవేశపెట్టి క్రైస్తవపూజావిధానానికి నైతికపతనాన్ని కల్పిస్తున్నాడని గొణిగారు. 'మానవకంఠంలో వినిపించేదే పవిత్రసంగీతం. 'క్రీస్తువాద్యపు' ఈలలు అట్టివి కావని వారన్నారు.

దీని గురించి ఎక్కువగా విన్న తరువాత కార్నెగీ స్కాట్లండుకు ఇలా వ్రాశాడు : "ఇది నన్ను చాలా బాధపెట్టింది. ఇకముందు నేను చేయబోయే ఈ పాపానికి తోడుగా ఒక భాగస్వామి వుండాలి. ఇకనుంచి సమావేశాలలో ఆర్గన్ ఖరీదులో సగమిచ్చుకోమని కోరదలిచాను." ఇందువల్ల స్కాటిష్ పార్వతేయుల్లో ఆర్గన్ వాద్యాల నిమ్మని కోరటం కొంత తగ్గింది.

కళాశాలలకు ఇచ్చే దానాలకు తాను గౌరవించే వాళ్ళ పేర్లుగాని, తన మిత్రుల పేర్లుగాని, స్మృతిపాత్రులైన వాళ్ళ పేర్లుగాని పెట్టటమంటే కార్నెగీకి ఇష్టం. బ్రౌన్ యూనివర్సిటీలోని జాన్ హో గ్రంథాలయం, హామ్బిల్టన్ కాలేజీలో ఎలిహో ఫౌండేషను,

వెస్టర్న్ రిజర్వు యూనివర్సిటీలోని హెన్నాబైరు, వెలస్లీ (వెల్లస్లీ) లోని ఫ్రాన్సిస్ క్లీవ్‌లాండ్ లైబ్రరీ ఇందు కుదాహరణాలు.

ఓహాయోలోని కెన్‌యూన్ కాలేజీలో వున్న స్టాంటన్ ఛైర్ ఆఫ్ ఎకనమిక్స్, అధ్యక్షుడు లింకన్‌కు యుద్ధకార్యదర్శి అయిన ఎడ్విన్ ఎం. స్టాంటన్ పేర నెలకొల్పినది. ఇతడు మొదట, ముక్కోపి అని ఎక్కువమంది అభిప్రాయం. అయినా, ఉక్కురాజు ఇతణ్ణి పిట్స్‌బర్గులోని న్యాయవాదిగా జ్ఞప్తి కుంచుకున్నాడు. న్యాయవాదిగా వున్న ఆ రోజుల్లో ఇతడు, ఆండ్రూ కార్నెగీ అన్న తంతి వార్తాహరి బాలుడితో ఎల్లప్పుడూ ఉల్లాసంగా మాట్లాడుతూ ఉంటుండేవాడు.

అతడికి ఎక్కువ ఇష్టమైన దానాలలో ఒకటి అతడు డన్ఫర్మ్‌లైన్ పార్కు, దానిలో వున్న చరిత్రాత్మకభవనాలను ఇవ్వటం. అక్కడివారు పార్క్ కావాలని బహుకాలం నుంచి వ్యామోహ పడుతున్నారు. కొన్ని తరాలుగా హంట్సు లైయర్డ్, ఫిట్టెన్, క్రీఫ్ గ్లెన్‌ల యాజమాన్యం క్రింద ఉంటున్న తమ ప్రాచీన వారసత్వాన్ని – పాత్ర అబ్బీ, దాని మైదానాలు, రాజభవనశిథిలాలు – తిరిగి పొందటం కోసం తమ గ్రామస్థులు చేసిన దీర్ఘయుద్ధాలను గురించిన కథలు, వాళ్ళకు పెద్దలు చెప్పగా విన్నవి, వాళ్ళు చెప్పటం వల్ల తాను విన్నవి ఆండ్రూకు బాల్యస్మృతుల్లోని అంశాలుగా మిగిలిపోయినవి. పిట్టెన్ క్రీఫ్ గ్లెన్ ఆ తగాదాకు చెందిన భూభాగంలో చేరిందే. ఇది నగరానికి సంబంధించిన రెండు ప్రధానవీథులచే చుట్టబడింది. అరవై యెకరాలకు మించిన అందమైన రాతి ప్రదేశం. ఇందులో చిన్న అడవి వుంది. ఆండ్రూ చిన్ననాడు ఇది అతనికి ఎంత అందంగా కనిపించేది. అతనికి దీనితో పోల్చదగ్గది ఒక స్వర్గం మాత్రమే అని అనిపించేది. అతడు అందులో ప్రవేశించటానికి ఆటంకం వుంది. కనుక అతడు దాన్ని బయట నిలబడి మాత్రమే చూడగలిగాడు. హంట్స్‌మీద జరిగిన పోరాటానికి అతని మాతామహుడు  మారిసన్ నాయకుడు, ఇతని మేనమామ బైలీ తరువాత నడచిన కోర్టే యుద్ధానికి నాయకుడు. అంతేకాదు. అతడు లైయర్డు కట్టిన కంచెలు బ్రద్దలుకొట్టడానికి గుంపును కూర్చినందుకు శిక్ష అనుభవించాడు కూడాను. ఆ తరువాత లైయర్డు గ్లెన్ లోపలికి ఏ మారిసన్‌నూ ప్రవేశింపనీయరాదని ఆజ్ఞాపించాడు. ఈ మారిసన్ అన్న పేరుతో కార్నెగీకి ఒక వర్గం బంధువులు కూడా చేరుతారు. అందువల్ల అంకుల్ లాడర్ డాడ్‌నైగ్‌లను ఇద్దర్నీ ఒక ఆదివారం మధ్యాహ్నవేళ ఆగ్లెన్ అంచు చుట్టూరా త్రిప్పి, దాని లోపలి భాగాన్ని చూడడానికి వీలయిన ఒక ఎత్తు ప్రదేశానికి తీసుకుపోయాడు.

కొంతకాలం డన్ఫర్మ్‌లైన్ నివాసి, కార్నెగీ చేసిన కొన్ని ధర్మాలకు యితరమయిన తన ఆస్తులకు అతని ప్రతినిధి - డాక్టర్ జాన్ రాస్ 1900 ప్రాంతంలో కార్నెగీలను చూడడానికి వచ్చి, వారితో ఏకాంతంగా, "కల్నల్ హంట్ డన్ఫర్మ్‌లైనులోని తన ఆస్తులను అమ్మేసే సమయం వచ్చినట్లు తెలిసింది" అన్నాడు.

"మంచిది! వాటిని నేను కొంటాను" అన్నాడు కార్నెగీ సంతోషంతో.

"అయితే, అతడు చెబుతున్న ధర చాలా ఎక్కువగా ఉన్నట్లు తోస్తున్నది" అన్నాడు రాస్.

ఇరువురూ ఈ విషయాన్ని గురించి మరి కొంతసేపు చర్చించారు. పరిస్థితి కనిపెట్టడానికి డాక్టర్ రాస్ స్కాబ్ జాగరూకతతో వ్యవహరించాలని ఇరువురూ నిశ్చయించారు. ఒక సంవత్సరం కాలం కాచుకున్న తరువాత డాక్టర్ రాస్ కార్నెగీ దగ్గరికి వచ్చాడు.

అతడు "ఎరోడింబరోలోని మిస్టర్ షాతో, (ఇతడు పూర్వం డన్ఫర్మ్‌లైన్‌వాడు) కల్నల్ హంట్ ఏజంట్లతో కదల్చమని మనం చెప్పవచ్చు ననుకొంటున్నాను" అన్నాడు.

"బాగుంది. నాకు ఇచ్చి వేయకపోవడం వల్ల తరువాత వారి యజమాని చింతపడవలసి వస్తుంది. దాన్ని కొనటానికి మరొకడెవ్వడూ అంత చులకనగా రాడు. నేను మనస్సును మార్చుకోటానికిగాని, మరణించటానికి గాని అవకాశముంది అని వాళ్ళకు చెప్పండి" అన్నాడు కార్నెగీ.

"ఆ విషయంలో ఎలా జాగ్రత్త పడాలో టాయ్ షా బాగా ఎరిగినవాడు" అన్నాడు రాస్.

దీనితరువాత కొద్దికాలానికే కార్నెగీ న్యూ యార్క్ వెళ్ళాడు.

కొన్ని వారాలు గడిచాయి. ఒకనాడు షా దగ్గర నుండి కేబిల్ వచ్చింది. "కల్నల్ హంట్ 45,000 పౌన్లకు ఒప్పుకుంటాడు. బేరం నిశ్చయించనా?"

"సరే. ఇది రాస్ పెట్టే షరతులన్నిటికీ అనుకూలంగా వుంటే అంగీకరించవచ్చు" అని సమాధానమిచ్చాడు.

కొద్ది రోజులు గడిచాయి. మధ్యాహ్నం బాగా గడిచిన తరువాత అది క్రిస్మస్ సాయంత్రం. షా దగ్గరనుంచి మరొక కేబిల్ వచ్చింది. "హెయిల్, లైయర్డ్ ఆఫ్

పిట్టెన్ క్రీప్” ఇది ఒక కథను తెలియజేస్తుంది. “నేను యింతకంటే మంచి క్రిస్మస్ బహుమానాన్ని పొందలేను” అన్నాడు లైయర్డ్. నేను జగత్తులోని బిరుదాలన్నిటిలోకి అత్యుత్తమమైన బిరుదును పొందినవాణ్ణి. రాజా అతడు కేవలం రాజే. అతడికి మాల్కొం రాజు శిఖరం లేదు. సెయింటు మార్గరెటు ఆలయం లేదు. పిట్టెన్ క్రీఫ్ గ్లెన్ లేదు. అతడు ఏమీ చూపలేదు. నేను అతడు డన్ఫర్మ్‌లైన్‌కు యాత్రకు వస్తే, నేను దిగివచ్చి ఉదాత్తధోరణిలో అతడికి ఇవన్నీ చూపెడతాను. ఇది నాకెంతో ఆనందప్రదమైంది.”

ట్రస్టీలలో రాస్ ప్రథముడు కావటం తప్పదు కదా! వారికి వ్రాసి యిచ్చిన పత్రంలో కార్నెగీ తన వుద్దేశాన్ని ఇలా వెల్లడించాడు. “డన్ఫర్మ్‌లైన్‌లో కష్టపడే శ్రామికజనుల విసుగుదలతో గూడిన జీవితానికి కొంత తీయదనాన్ని, కొంత వెలుగును ఇవ్వటానికి, ముఖ్యంగా యువకులకు ఇతర ప్రాంతాల్లో వసించేవారు పొందలేని కొంత తేజం, కొంత ఆనందం, కొంత ఉన్నతిని చేకూర్చేటందుకు, నా జన్మస్థానంలో బిడ్డ అనంతరకాలంలో అనంతర జీవితంలో వెనుకకు చూచుకొని, ఇంటి దగ్గరనుంచీ ఎంత దూరం తిరిగినప్పటికీ కేవలం తాను అక్కడ ఉండటమనే సుగుణం వల్ల, జీవితాన్ని ఆనందప్రదంగాను ఉత్తమంగాను చేసుకొనేటట్లు కల్పింపబడ్డదని భావించుకోవటం కోసం” అని వ్రాశాడు.

ఆస్తిని పెంచి దాని నిత్యపాలన కోసం ఒక ఫండును ఏర్పాటు చేసేటందుకుగాను ఇరవయ్యైదులక్షల డాలర్లు ఇచ్చి అతడు ట్రస్టీలను ఆశ్చర్యచకితులను చేశాడు. అతడు మరికొంత ఇచ్చిన తర్వాత ఆ మొత్తం ముప్ఫయ్యేడు లక్షల యేభైవేల డాలర్లు అయింది. ప్రజల ఆస్తి ఏదీ ఇంత జాగరూకతతో పాలింప బడలేదు. ప్రజలకు ఏదీ ఇంత ప్రీతిపాత్రమూ కాలేదు.

విశ్వవిద్యాలయం ట్రస్టీగా ఉండటం చేత, కార్నెగీ అక్కడ చదువు చెప్పేవారికి చాలా తక్కువ జీతాలు ఇస్తున్నట్లు గమనించాడు. అతడు ఆతురతతో “ఇది అత్యుత్తమవృత్తిగా పరిగణింపబడవలసింది. అయినా అన్ని వృత్తులలోకీ ఉపాధ్యాయవృత్తికి చాలా అన్యాయంగా, నీచంగా ప్రతిఫలం ముడుతోంది. యువకులకు విద్య చెప్పటం కోసం జీవితాన్ని అంకితం చేసిన విద్యావంతులు మరీ అల్పభృతులను తీసుకొంటున్నారు.” అందువల్ల అతడు ఏప్రిల్ 16, 1905న విద్యాబోదనాభివృద్ధి కోసం అయిదు శాతం బాండ్లు రూపాన కోటి డాలర్లతో యునైటెడ్ స్టేట్స్ కెనడాల్లో ఉన్నతవిద్యకు దోహదమివ్వదలచి, విశ్వవిద్యాలయ కళాశాలలోపాధ్యాయులకు

పించనుకు యేర్పాట్లు చేసి వారి విధవలకు పెన్షన్ల ఏర్పాటుతో కార్నెగీ పౌండేషన్ ఏర్పాటు చేశాడు.

దాని ధర్మకర్తృత్వ సంఘంలో ఇరవై అయిదుమంది విశ్వవిద్యాలయాధ్యక్షులు, కళాశాలాధ్యక్షులు వున్నారు. వీరిలో చాలామంది అతనికి పూర్వమే మిత్రులైనవారు. ఈ నిర్మాణ సందర్భంలో వీరు కార్నెగీ గృహంలో సమావేశమైనప్పుడు, వీరికి కలిగిన భావాల్లో ఒకదానిని తాను మెచ్చుకొని, కార్నెగీ తాను ఎంతో ప్రీతిని వహించే మిత్రుల పట్టికలో వారిని చేర్చటం జరుగుతుంది. కార్నెగీ మిత్రుల పట్టికకు ఎప్పుడూ అంతు అనేది లేదు.

రెండు సంవత్సరాలైన తరువాత మరికొంత మొత్తం యాభై లక్షల డాలర్లు తరువాత మరొక మారు పన్నెండు లక్షల యాభైవేల కార్నెగీ ఆ ఫౌండేషనుకు చేర్చాడు. 1913లో కార్నెగీ కార్పొరేషను దానికి ఒక కోటి ఇరవై లక్షల డాలర్లు విరాళమిచ్చింది. మొదటి పాతిక సంవత్సరాలల్లో ఇది పదకొండు వందలమంది ఉపాధ్యాయులకు, వారి విధవలకు ఎలవెన్సు, పెన్షన్ల రూపంలో రెండు కోట్ల డాలర్లు వినియోగించింది. కార్నెగీ ఫౌండేషను, జాన్ డి. రాక్ ఫెల్లర్ జనరల్ ఎడ్యుకేషన్ బోర్డు అన్న సంస్థలు ఒకటి చేస్తున్న పనినే మరి రెండవది చేస్తున్నట్లు కన్పించినపుడు మిస్టర్ రాక్ ఫెల్లర్ “మీరు మా బోర్డులో యెందుకు సభ్యులుగా చేరకూడదు. అప్పుడు రెంటిలో ఏమి జరుగుతుందో మీకు తెలుస్తుంది. దానివల్ల చేసిన పనిని తిరిగి చెయ్యటమనే దాన్ని నిలిపి వెయ్యవచ్చు” అని కార్నెగీతో అన్నాడు. కార్నెగీ ఉభయనిధులకు ఉపయోగించే టందుకుగాను రాక్ ఫెల్లర్ జనరల్ ఎడ్యుకేషన్ బోర్డులో సభ్యుడైనాడు.

ప్రసిద్ధ సంపాదకుడు, విమర్శకుడు, అతనికి సన్నిహితమిత్రుడు అయిన రిచ్చర్డు వాట్సిన్‌గిల్డర్ ఒకమారు కార్నెగీ గురించి ఇలా వ్రాశాడు : “ఎ.సి. అనంతమైన సామర్థ్యం, అద్భుతమయిన భావనాబలం గలవాడు. అతని భావాలన్నీ అతివిశాలములైనవి. అంతేకాదు, భవిష్యదర్థసూచకములు. నేను ఇచ్చే అభిప్రాయం పొరబాటైంది. కాకపోతే అతడి కళంకరహితమయిన నైతికశీల మున్నది. అతడు పరిపూర్ణుడు కాకపోవచ్చును. కానీ అతడు మన అభిలాషను చూరగొన్న గలవాడు. విశిష్టత గలవాడు. సత్యమైన ప్రజాస్వామిక పౌరుడు. అతని లోకోపకార కృత్యాలన్నిటికీ మూలం ఉత్తమసిద్ధాంతాలు, శీలము అన్న గుణాలు రెంటిలో కన్పిస్తుంది.” అతడే మరొక సందర్భంలో వ్రాస్తూ “ఎ.సి. నిజంగా ఒక మహావ్యక్తి, రసాత్ముడు, పట్టుదల గలవాడు. దయాళువు. అనేకవిషయాల మీద బుద్ధిని ప్రసరింపచేసేవాడు. కొన్ని

సందర్భాలల్లో ఇతడు తన అభిప్రాయాన్ని రుద్దటానికి యత్నిస్తుంటాడు. ఆ సమయాలల్లో ఇతడు దరిదాపు క్రూరుడుగా వర్తిస్తుంటాడు. మళ్ళీ కోమలహృదయం లేకపోలేదు. నిండు ప్రేమ గలవాడు. ఉద్వేగి, నిరంతభావుకుడు. అసాధారణ విశాలదృక్పథం, అభిప్రాయాలూ గలవాడితడు. జీవితచరిత్ర వ్రాయదగ్గవాడు. 'నీకు నీవే బాస్వెలువు క'మ్మని (జీవిత కథాకారుడు) నేను ప్రబోధిస్తున్నాను. అతడిలో అన్ని విషయాల్లోను పరస్పరవ్యతిరేకత గోచరిస్తుంది. అయితే ఇది మహోన్నతవిషయాలమీది అత్యంతప్రీతివల్ల కలుగుతున్నది. మానవసౌభ్రాతృత్వం, వివిధజాతుల మధ్య శాంతి మత విషయికమైన పవిత్రత..."

కార్నెగీ పరస్పర విరుద్ధధోరణిలో ప్రవర్తించి వుండవచ్చు. అయితే అతడెల్లప్పుడూ తన ఆత్మవిశ్వాసాలకు సన్నిహితుడయి జీవించాడు. అయినా తన అభిప్రాయాల విషయంలో ఎన్నడూ మొండిపట్టు కలవాడు కాడు. అతడిచ్చిన దానాల నన్నిటినీ దానోద్దేశాలను వెల్లడించిన తరువాత, మిగిలిన పాలనవ్యవహా రాల నన్నింటినీ పాలకవర్గం వారి నిర్ణయాలకు విడిచిపెట్టేవాడు. అవి ఆచరణయోగ్యాలు కావని, ఎవరి అభిప్రాయాలకు అతడు విలువ యిస్తాడో వాళ్లు నిర్ణయించినప్పుడు, తనకు ప్రియమయిన పథకాలను ఎన్నింటినో అతడు వదులుకున్నాడు. కాన్ఫెడరేట్ బాండ్లు ఇందుకు వుదాహరణం. 1880లో, అంతర్యుద్ధపు చివరదశలో, ఓడిపోయిన అమెరికా కాన్ఫెడరేటెడ్ రాష్ట్రాలవారు ధనవిషయికంగా, ఆర్థికంగా, సంపూర్ణ వినాశనాన్ని పొందినపుడు, వారు గవర్నమెంటు బాండ్లను ఇందులో ఎక్కువభాగం డబ్బు యూరప్‌ది – పరిత్యజించే విషయంలో నిర్బంధితులైనారు. దక్షిణ రాష్ట్రాలను తరువాత తిరిగి సమాఖ్యలో ప్రవేశపెట్టిన తరువాత కార్నెగీ యూరప్‌లో సద్భావాన్ని కలిగిద్దామనే వుద్దేశంతో వాటికి చెల్లించి వేద్దామన్నాడు. కాని రాజనీతిజ్ఞులు, ధనికవర్గంవారు, న్యాయనిపుణులు అది చాలా కష్టమని, దానివల్ల – సద్భావం కలగటం కంటే, కలత వృద్ధి పొందుతుందని, దాన్ని నిర్వర్తించటమేమీ అసాధ్యకృత్యం కాకపోయినా అతికష్టమైన పని అని చెప్పినప్పుడు, ఆ బాండ్ల విషయం కార్నెగీ తనకు ఇష్టం లేకపోయినా వదులుకున్నాడు.

1906లో కొద్దికాలం గడచిన తరువాత సెయింట్ ఆంద్రూస్‌కు కార్నెగీని మూడోమారు డైరెక్టరుగా ఎన్నుకున్నారు. ఆ వేసవిలో జరిగిన ప్రిన్సిపాల్స్ వారోత్సవాలలో మిస్ ఆగ్నెస్ ఇర్విక్ కార్నెగీల యింట్లో అమెరికన్ అతిథిగా వుంది. ఈమె రాడ్‌క్లిఫ్ కాలేజికి డీన్ బెంజిమిన్ ఫ్రాన్‌క్లిన్‌కుముని మనుమరాలు. సెయింట్

ఆండ్రూస్ ప్రిన్సిపాల్ డొనాల్డ్ సర్, అతడే కాదు మిగిలిన అతిథులందరూ, స్కిబోకు అతిథిగా వచ్చిన ఈమె వల్ల ప్రభావితులైనారు. సెయింట్ ఆండ్రూస్ 1759లో బెంజిమిన్ ఫ్రాన్క్లిన్‌కు అతని మొదటి గౌరవపట్టాన్ని ఇవ్వటం జరిగింది.

ఆ సంవత్సరమే ఫిలడెల్ఫియాలో ఫ్రాన్క్లిన్ ద్విశతవారోత్సవం జరుగుతుంటే, నూట నలభై యేడు సంవత్సరాలకు పూర్వం ఆమె ముత్తాతకు ఇచ్చిన గౌరవ పట్టాన్ని మిస్ ఇర్విన్‌కు పంపించింది. ఆ విశ్వవిద్యాలయం తమ రెక్టర్ పదవిని అనుభవిస్తున్న ఆండ్రూ కార్నెగీని, ఆమె కా ఉత్సవసందర్భంలో పరిచయం చేసి, ఆమె భుజాలమీద ఆ హుడ్‌ను ఉంచవలసిందిగా కోరారు.

ఇప్పుడు ఆండ్రూ కార్నెగీ తీరికైన సమయాలలో తన ఆత్మకథకు సంబంధించిన ప్రకరణాంతర్భాగాలను, ప్రకరణాలను వ్రాసుకుంటున్నాడు. ఈ సమయాలల్లో అతడు ఎవరిని గురించి తాను వ్రాయటం జరుగుతున్నదో అట్టి తన ప్రియమయిన మిత్రులు, బంధువులు, ఇతరులనేకులు మృతి నొందిన అంశాలను చింతతో స్మృతికి తెచ్చుకున్నాడు.

అతడు ఒక పర్యాయం ఇలా అన్నాడు : "నేనిప్పుడు ఏ ఉక్కు కర్మాగారాన్నీ చూసి భరించలేకపోతున్నాను. అక్కడికి వెళ్ళితే నాకు నాకంటె ముందు వెళ్ళిపోయిన వ్యక్తులెందరో జ్ఞప్తికి వస్తారు."

"అందుచేత వెనుకటివలె ప్రగాఢప్రేమతో నా హస్తాన్ని బంధించగల నా తొలినాటి మిత్రులు కొద్దిమంది మాత్రమే నాకు అక్కడ మిగిలి లభిస్తారు. 'ఆండీ' అని నన్ను పిలిచే వృద్ధులు ఒకరో, ఇద్దరో మాత్రమే అక్కడ వుంటారు."

# 14. అస్తమయం

యుద్ధాన్ని క్రమక్రమంగా రద్దు చేయగలుగుతుందనే ఉద్దేశంలో న్యూ యార్క్ శాంతి సమాజం నిర్మితమైంది. ఈ ఆశయం విషయంలో తనకు అత్యంతశ్రద్ధ ఉన్నట్లుగా కార్నెగీ తెలియజేయటం వల్ల ఆ సమాజం వారు అతన్ని అధ్యక్ష పదవిని స్వీకరింపవలసిందని కోరారు.

"వద్దు, నాకు వ"ద్దన్నాడతడు. "హృదయపూర్వకంగా నేను మీతో వుంటాను. ఇది మీకు తెలుసును. నాకు శక్తి వున్నంతవరకూ మీకు తోడ్పడతాను. అయితే, నాకున్న యితర వ్యవహారాలవల్ల ఈ శాంతిసమాజాధ్యక్ష పదవిని స్వీకరించలేను. తీరుబడి వుండదు. నేను నాకున్న కాలంలో ఎక్కువభాగం ఇందుకు వినియోగించాలని వుంది. అయితే ఆ పని చేయలేకపోతున్నాను."

తన్ను అభ్యర్థించ వచ్చిన శాంతి సమాజ సభ్యులు వెళ్ళిపోయిన తరువాత, కార్నెగీని అంతరాత్మ బాధపెట్టటం మొదలెట్టింది. ఎంత తీరుబడి లేదనుకుంటున్నానో అలాగే తీరుబడి లేకుండా ఉన్నానా? అది ఎలా వున్నా, మరి శాంతికి కాకపోతే నేనెందుకుపయోగపడేటట్లు?

కొన్నాళ్లు గడచిన తరువాత డాక్టర్ లైమన్ బీచర్‌ను వెంట బెట్టుకొని, ముందు వచ్చిన వున్నవారిని కూడా కలుపుకొని, కార్నెగీని చూడటానికి వెళ్ళారు. కార్నెగీ వారే పనిమీద వచ్చారో ముందే ఊహించాడు.

"మీరు ఒక మాటైనా చెప్పవలసిన పని లేదు" అంటూ వారిని లోపలికి రమ్మని ఆహ్వానించాడు. "మీరిక్కడికి ఎందుకు వచ్చారో నాకు తెలుసు. మొన్న నేను మీరు ఇస్తామన్న అధ్యక్షపదవిని కాదని త్రోసిపుచ్చినప్పటినుంచీ నా అంతరాత్మ నన్ను బాధిస్తున్నది. ఇప్పుడు నేను మనస్సు మార్చుకొన్నాను. ఆ అధ్యక్ష పదవిని స్వీకరిస్తాను. నా కర్తవ్యాన్ని నిర్వహిస్తాను."

ఆ తరువాత వచ్చిన వసంతంలో ఆ సమాజం న్యూ యార్క్‌లో శాంతి మహాసభ జరిపించింది. సమాఖ్యలోని రాష్ట్రాలన్నింటిలోనుంచి ప్రతినిధులు, విదేశాలనుంచి

అనేక ప్రఖ్యాత పురుషులు సభకు విచ్చేశారు. మానవజాతి మధ్య శాంతిని నెలకొల్పాలంటే సభలు జరపటం, వుపన్యాసాలివ్వటం, తీర్మానాలు చెయ్యటం కంటే ఇంకా మించిన పని ఏదయినా చెయ్యాలన్న విషయం స్పష్టపడింది. ఇందుకు మరొక మార్గమేదీ గోచరించకపోవటం వల్ల తన చేతిలో ఉన్న శక్తిమంతమయిన సాధనాన్ని ధనాన్ని ప్రయోగించటానికి నిశ్చయించాడు కార్నెగీ. అది ఆయన ఇతరాశయాలను సాధించడానికి అతిశక్తిమంతమయినదని రూఢిగా నిరూపిత మయింది. ధనాన్ని వెచ్చించటం వల్ల శాంతి లభించేటట్లయితే, అతడు దాన్ని నీరులా ప్రవహింప చేసేటందుకు నిశ్చయించుకున్నాడు.

అందువల్ల డిసెంబరు 14, 1910 నాడు అంతర్జాతీయ శాంతి కోసం కార్నెగీ ఎండోమెంటు అన్న ఒక నిధిని ఏర్పాటు చేశాడు. అతడు తలపెట్టిన వాటిలోకెల్లా ఒక్క ఈ విషయంలోనే అతనికి కొంత అపజయం కలిగింది. ధర్మకర్త సంఘానికి అధ్యక్షుడుగా అతడు ఎలహూటీన్ ఎన్నుకొన్నాడు. ఇతడంటే అతనికెక్కువ మక్కువ. ఇతణ్ణి ఎక్కువగా మెచ్చుకుంటుండేవాడు. కార్యక్రమాన్ని నిర్ణయించే పని నంతటినీ ధర్మకర్త వివేకానికి విడిచి పెట్టేశాడు.

ధర్మకర్తలు తమకు చేతనయినంత చేశారు. వారు కార్యకలాపాన్నంతటినీ మూడు శాఖలుగా విభజించారు. ఇందులో ఒక శాఖ "ది డివిజన్ ఆఫ్ ఇంటర్ కోర్స్ అండ్ ఎడ్యుకేషన్. ఇది అంతర్జాతీయ విధానాలను గురించిన భోగట్టాను సంపాదిస్తుంది. అంతర్జాతీయ సుహృద్భావాన్ని వృద్ధి పెంపొందించటం కోసం తగినన్ని ఏజెన్సీలను స్థాపించి వాటిని నడిపిస్తున్నది. ఇది వివిధదేశాలల్లో శాస్త్ర నిష్ణాతులయిన విద్వాంసులను, రచయితలను పరస్పరం వినిమయం చేసుకొనే ఏర్పాట్లు చేస్తుంది. ఏవైనా శాంతి సంస్థలు పూర్వమే ఏర్పడి వున్నట్లయితే వాటికి తగిన సహాయమిచ్చి తోడ్పడుతుంది. దీని ఆర్థిక - చరిత్రశాఖ, "ది డివిజన్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ హిస్టరీ." శాంతి - సమరం అన్న రెండు విషయాలమీద తమ ప్రభావాన్ని నెరపుతున్న రాజకీయ, సాంఘిక, ఆర్థికకారణాల స్థితిగతులను గురించిన పరిశోధనలను చేస్తుంది. ఆయా రంగాలలో శాంతిదృష్ట్యా అనుసరించవలసిన మార్గాలను, కార్యక్రమాలను సూచిస్తుంది. అంతర్జాతీయ న్యాయశాఖ "ది డివిజన్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ లా" వివిధదేశాల న్యాయశాస్త్రాలను పరిశీలించి, అంతర్జాతీయ న్యాయసూత్రాలను నిర్మించి వివిధజాతులమధ్య ఏర్పడే తగాదాల విషయంలో వాటిని అమలుపరచేటందుకు

యత్నిస్తుంది. ఈ అంతర్జాతీయ న్యాయశాస్త్రమనేది కొన్ని నిబంధనలు, ఒడంబడికలు అన్నవాటి సముదాయం తప్ప మరేమీ కాదు.

అంతర్జాతీయ శాంతికోసం తన మిత్రుడు నిలిపిన నిధి విషయంలో అడ్డులేని ఆశావాదికి కూడా విశ్వాసం కలగటానికి కొంత కాలం పడుతుందనీ, కార్నెగీ చర్చా ప్రచారాలొక్కటే అంతర్జాతీయ యుద్ధాలను నిషేధించటాన్ని సాధించలేవనీ, క్రొత్త మార్గాన్ని స్వీకరించిన కార్నెగీ దుఃఖాత్మకమయిన ప్రత్యక్ష గుణపాఠాన్ని నేర్చుకోవటం విధినియమితమని లార్డు మోర్లే భావించాడు.

మోర్లే వెల్లడించిన భావాన్ని గురించీ కార్నెగీ ఇలా వ్యాఖ్యానించాడు. "వ్యతిరేకాభిప్రాయాలు గల వాళ్ళు పరస్పరం స్నేహం చేస్తే అది అన్యోన్య ప్రయోజనకారిగా వుంటుందని మేము ఒకరికొకరం సాన్నిహిత్యాన్ని పెంచుకున్నాము. అతడు నిరాశావాది. రానున్న ఆపదల విషయంలో అతడు చింతాత్మకంగా, కొన్ని మారులు అంధకారప్రాయంగా చూస్తుంటాడు. కొన్ని సందర్భాలలో లేనిపోని వేవో అర్థరహితమయిన వాటిని ఊహిస్తూ వుంటాడు. నా పిల్లలన్నీ అంచబిడ్డలైనా యికనొక నేను ఆశావాదిని. నాకు లోకం తేజోవంతంగా కనిపిస్తుంది. పలుమారులు ఈ అవనియే సత్యమయిన అమలిన స్వర్గంగా నాకు గోచరిస్తూంది. నేను యింత సంతోషంతో వుంటాను. దయామయులయిన 'విధి దేవతలకు కృతజ్ఞుణ్ణి' ఎన్నడూ మోర్లీ దాన్ని గురించి కూడ వుద్రేకి కాలేదు. అతని నిర్ణయాలెప్పుడూ ఆలోచనా పూర్వకములయినవి. అతని కన్ను లెప్పుడూ ఆదిత్యుని లోని మచ్చల మీదనే దృష్టి నిలిపి చూస్తుంటాయి."

అయినా మోర్లీ తన మిత్రుని ఆశాభావం, వుత్సాహం అన్న వాటిని చూచి ఎంతో యిష్టపడుతుండేవడు. ఆ ఆశాభావంతో ఎల్లవేళలా అతడు ఏకీభవించలేక పోతుండేవాడు. అతడు అన్నాడు "విజ్ఞానం విజ్ఞానతృప్తి, నూతనవస్తువులలో కనుగొనటం, భావజ్యోతిని ప్రసాదించటం, సాంఘిక సంబంధాలను వృద్ధి పొందించటం, తుల్యప్రజ్ఞకు తుల్యమయిన అవకాశాలు కలిగించటం, శాంతిప్రియత్వం అన్న ప్రపంచమందలి ఉత్తమాశయాల కోసం అతడు పొందిన విస్తారమైన అనుభూతికి తగిన న్యాయాన్ని జరిపించటం వివేకం. ఇవన్నీ మహోన్నత విషయాలు. వాటిని గురించి ప్రకటించేటప్పుడు అత్యుక్తిలేశం వుంటే వుండ వచ్చును. దాన్ని సర్దుకోటం చాలా సులభం." ఈ ఆదర్శాల విషయంలో కార్నెగీకి గల దృష్టి మహోదాత్తమైందని మోర్లీ అంగీకరించాడన్నమాట!

శాంతిని నెలకొల్పడానికి యత్నిస్తూన్నందుకు ప్రపంచంలోని వివిధదేశాలూ కార్నెగీని గౌరవించాయి. ఫ్రెంచి ప్రభుత్వం అతణ్ని నైట్ కమాండ్ ఆఫ్ ది లీజియస్ ఆఫ్ ఆనర్ అన్న స్థానమిచ్చి గౌరవించింది. హాలండ్ దేశం అతనికి "గ్రాండ్ క్రాస్ ఆర్డర్ ఆఫ్ ఆరెంజ్ – నాసౌ" బిరుదంతో సత్కరించింది. డెన్మార్క్ దేశం "గ్రాండ్ క్రాసు ఆర్డర్ ఆఫ్ డెన్నిబ్రాగ్ ఇచ్చి అతన్ని గౌరవించింది. ఇరవై ఒక్క అమెరికన్ రిపబ్లిక్కులు స్వర్ణపతకాలను బహూకరించినవి. అసంఖ్యాకములయిన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, అతనికి 'డాక్టరేట్' పట్టమిచ్చి గౌరవించాయి. నూట తొంబదికి పైగా సంస్థల్లోను, వైజ్ఞానిక సమాజాలలోను క్లబ్బులలోను, అతడు సభ్యుడుగా వ్యవహరించాడు.

తన మరణశాసనాన్ని (VViII) వ్రాస్తూ అందులో అమెరికా ప్రజల ప్రయోజనం కోసం ఒక మహాపథకాన్ని అమలులో పెట్టేందుకుగాను బృహన్నిధి నొక దానిని ఏర్పాటు చేస్తున్నట్లు అందులో వ్రాస్తున్నాడు.

ఈ విధంగా అమెరికావాసుల కిస్తున్న అవకాశాన్ని గురించి అతడు ఎలిహూరూట్‌తో చెప్పటం తటస్థించినప్పుడు, అతడు తల పంకించి ఇలా అన్నాడు.

"కొన్ని సంవత్సరాల క్రితం మీరన్నది మీరే మరచిపోయినారా? అది కార్యాచరణలోగాని, న్యాయస్థానాలలో గాని తరచుగా అపమార్గాన్ని పడుతుంది. ఎప్పుడో భవిష్యత్తులో ఆచరణలోకి రాబొయ్యేదాన్ని ఇప్పుడు మీరు మీ మరణశాసనంలో ఏర్పాటుచేసి వుంచటం ఎంతో ప్రమాదకారి అయిన విషయం. శామ్యూయిల్ జె. టిల్డన్ చేసిన పొరబాటు తిరిగి చెయ్యవద్దు. ఇప్పుడు మీ సంపత్తితో మీరెలా చెయ్యాలని భావిస్తున్నారో అప్పుడు అతడలా చేశాడు. అది న్యాయస్థానానికి వెళ్ళినప్పుడు వ్యతిరేకమైంది. మరణశాసనాలు అందమైనవేగాని అల్లట తల్లట కలిగించే వాహనాలు" అని, రూట్ ఇంకా ఇలా అన్నాడు. "జీవితకాలంలోనే ఈ నిధిని ఏర్పాటు చేసి, అందుకుగాను మీరు ఏర్పాటు చేసి వుంచిన సంపత్తిలో అధికాంశాన్ని దాని పరంచేసి ఆ వ్యవహారం, మీరు సజీవులై వున్నప్పుడు కొంత నడుస్తుండటాన్ని ఎందుకు కల్పించగూడదు? అప్పుడు అది సక్రమంగా తరువాతి కాలంలో నడిచిపోతుందనే నిశ్చయం మీకు కలుగుతుంది. అంతేకాదు, మీరు ఉద్దేశించిన పనులను ఆచరణలో పెట్టించిన ఆనందాన్ని మీరు పొందటం కూడా జరుగు తుంది"

అతడు రూట్ ఇచ్చిన సలహాను పాటించాడు. 1911లో యునైటెడ్ స్టేట్సు స్టీల్ కార్పొరేషన్‌లోని 5% మొదటి రాబడినిచ్చే రెండుకోట్ల ఏభై లక్షల డాలర్ల

మూలధనంతో, అతడు న్యూ యార్క్ కార్నెగీ కార్పొరేషనును న్యూ యార్క్‌లోని శాసనసభచేత చట్టబద్ధం చేయించి స్థాపించాడు. ఇందుకు ధర్మకర్తలుగా వ్యవహరించవలసిందని అతడు కోరిన ప్రముఖవ్యక్తుల సంఘం నవంబరు 11న కార్నెగీ గృహంలో సమావేశమైంది. అతడు వారికి తాను ఈ ధర్మనిధిని స్థాపించటంలో ఉద్దేశమేమో తెలియజేసే పత్రాన్ని ఇలా చదివి వినిపించాడు. సాంకేతిక పాఠశాలకు, ఉన్నత విద్యాసంస్థలకు గ్రంథాలయాలకు, శాస్త్రీయ పరిశోధనకు, వీరనిధులకు, ప్రయోజనకరములైన ప్రచురణలకు, వీటికిగాను కాలక్రమేణ ఏర్పడే ఇతర సంస్థలకు సాధనాలకు తోడ్పాటు నిచ్చి "విజ్ఞానాభివృద్ధి వ్యాప్తులను పెంపొందించటం, ప్రజలమధ్య సుహృద్భావాన్ని పోషించటం" ఈ నిధి లక్ష్యం.

ఈ నిధి అమెరికాలోని వైజ్ఞానిక సాంఘికాభివృద్ధికి సంబంధించిన ఉద్య మాలకు తోడ్పడటమే కాకుండా, అతడు నెలకొల్పిన ఇతర సంస్థలకు సహాయ మవసరమైనప్పుడు ధనసహాయం చేయటానికి కూడా ఉద్దేశింపబడింది. అతడు ఈ కొర్పొరేషనును ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే తొలుతటి మూలధనం చాలదని గుర్తించాడు. తానుద్దేశించిన సర్వం ఆచరణలోకి వస్తే చూడవలెనంటే ఇంకా ఎంతో అదనపు ధనం అవసరమని తోచింది. అయితే ఇప్పుడు భార్య, కుమార్తెకు విడిచిపెట్టవలెనని ఉద్దేశించినది బాండ్ల రూపంలో గాని, ధన రూపంలోగాని వున్నది పన్నెండు కోట్ల యాభై లక్షల డాలర్లు మాత్రమే. మరొక ఐదుకోట్లు లేదా పదికోట్ల డాలర్లు యివ్వటానికి వారు అంగీకరిస్తారా? క్షణమైనా వెనుదీయకుండా మిసెస్ కార్నెగీ అందుకు అంగీకరించింది. ఇక కుమార్తె ఇంకా పదిహేను పదహారు సంవత్సరాల వయసు కన్యక మాత్రమే. ప్రియమైన తన తండ్రి ఏది చేసినా ఆమె కిష్టమే. అందుకే తృప్తి పడుతుంది. అందువల్ల 1912లో కార్నెగీ కార్పొరేషన్ నిధి 12,50,00,000 డాలర్ల వరకూ వృద్ధి చేయబడింది. ఈ లోకోపకార పరాయణుడు ఒక సంవత్సరంలోనే పదమూడు కోట్ల పై చిలుకు డాలర్లు దానం చేశాడు.

కాంగ్రెసు మాజీ అధ్యక్షులకు, వారి భార్యలకు తగిన ఏర్పాట్లను చేయలేకపోయినందుకు కొన్ని సంవత్సరాలనుంచి అతడు వ్యాకులపడుతున్నాడు. అమెరికాలోకల్లా అత్యున్నతమైన గౌరవస్థానానికి, గణతంత్ర ప్రజారాజ్యంలో అతినిపుణయుతములు, బాధ్యతాయుతములు అయిన ఉన్న పదవులకు వారిని నియోగించి, వారి విరమణ కాలంలో గౌరవయుతంగాను, క్లేశరహితంగాను జీవించే విరామభృతుల నివ్వకపోవటం కృతఘ్నత అనీ, అనాగరికమనీ అతడికి తోచింది.

ప్రభుత్వం వారికి తగ్గ ఏర్పాటు చేసేటంతవరకూ కార్పొరేషన్ ప్రతి సంవత్సరం ఇందుకుగాను 25,000 డాలర్లు యివ్వనుందని కార్నెగీ సూచన చేశాడు.

ఈ అభిప్రాయం ప్రకటితం కాగానే ప్రజల్లో నుంచి వ్యతిరేకభావం వెలువడ్డది. ప్రభుత్వం స్వీకరింపదగ్గ బాధ్యతను ఒక ప్రత్యేకవ్యక్తి గ్రహించటం అనుచితమని వారన్నారు. ఇలా వారికి సిగ్గును కల్పించి విజయబోధ చెయ్యటమే ఈ పథకంలోని రహస్యం. ఈ చర్యవల్ల ప్రపంచదృష్టిలో దేశం అవమానిత మౌతుందని వారు భయపడ్డారు. అందువల్ల కార్నెగీ మనసులో యిష్టం లేకపోయినప్పటికీ ఈ ఉద్దేశాన్ని కొంత విరమించుకోవలసి వచ్చింది. దీన్ని పూర్తిగా విడిచిపుచ్చకపోవటం మనం ముమ్ముందు గమనిస్తాము.

1911–12ల శీతకాలం అతడికి ఆ బాల్యమిత్రుడైన టామ్ మిల్లర్ మృతివల్ల అతివేదనతో గడిచిపోయింది. ఇంతకు కొద్ది నెలలకు పూర్వమే అతడు ఆత్మకథలో “అతడు యింకా సజీవుడై వుంటే మిక్కిలి ప్రేమపూర్వకమైన వెలుగును, మాధుర్యాన్ని క్రుమ్మరిస్తున్నాడు. ఎన్ని సంవత్సరాలు గడచినా అతడు ఇంకా యింకా విలువైన మిత్రుడని అనిపిస్తున్నాడు” అని వ్రాశాడు. ఇప్పుడు టామ్ వెళ్ళిపోయినాడు. అందువల్ల మరో వాక్యం చేర్చాడు. “ఇకనుంచీ జీవితానికి ఏదో లోటు తీరని లోటు – అతడు నా బాల్యజీవితంలోని సహచరుడు. వృద్ధాప్యంలో అతి ప్రియుడైన మిత్రుడు. అది ఎలాటిదైనా ఇప్పుడత డెక్కడున్నా నేను అక్కడికి వెళ్ళవచ్చునా?”

అతడు తా నేర్పాటు చేసిన అన్ని నిధులను గురించి, సంస్థలను గురించి యెంత గర్వించినా తన దానాల పట్టికలలో కల్లా అతడి కతిప్రియమైంది అతని విరమణ భృత్యపట్టిక (Pension List). ఆర్థిక సహాయార్థం ప్రతి సంవత్సరం అతనికి వేలకొలది లేఖలు వస్తుంటాయి. ఈ ఉత్తరాలు వ్రాసినవారిలో ఎందరు వంచకులో, వారు చెప్పే స్థితిగతులెన్ని కల్పనలో తెలుసుకునే అవకాశం అతడికి సహజంగా లేదు. అయితే ఈ ఉత్తరాల నన్నిటినీ అతడు జాగ్రత్తగా పరిశీలించి, సత్యాలని తోచిన కొన్నిటిని ఎంచి, వాటిమీద “ఇతణ్ణి నెలకు ముప్పదిడాలర్ల మీద వుంచండి”, “ఈ వృద్ధురాలు సుఖంగా జీవించడానికి యే లోపం కలుగకుండా చూడండి” ఈ రీతిగా కార్యదర్శి పొయిన్టన్ వుపయోగార్థం సూచనలు వ్రాస్తుండే వాడు. వృద్ధాప్య జీవన భృతిపట్టికలో చేర్చేవారిలో ఎందరో పూర్వం అతడెరిగిన వాళ్ళు. యౌవనంలోనో, బాల్యంలోనో అతనితో ఏదో విధమైన సంబంధం కలవాళ్ళను చేర్చటం తప్పక జరిగేది.

అట్టివారిలో కొందరు మాత్రమే అతడికి వ్రాసుకొనేవారు. ఇందులో ఎక్కువమంది గురించి ఇతరులు వ్రాయటమో, అతడే ఎన్నటమో జరిగేది. వీరిలో కార్నెగీకి ప్రథమంగా ఉద్యోగమిచ్చిన వ్యక్తి కుమార్తె కూడా వుంది. అతడు ఒకప్పుడు పిట్స్‌బర్గ్‌లో మంచి ఉచ్చదశను అనుభవించిన వ్యాపారస్థుని కుమారుడు, అతనికి బాల్యంలో కార్నెగీ ఆండీగా తంతివార్తలను అందజేస్తుండేవాడు. కాని ఇప్పుడతడు అశక్తుడు, పేదవాడు. పూర్వం అలిఘనీలో స్వీడన్బొర్జియన్ సంగీతసమ్మేళనంలో సహ సభ్యులుగా వుండేవాళు ్లు. ఇరువురూ వృద్ధకన్యలు, 'నేను యౌవనోల్లాసంతో వారితో కలిసి నృత్యం చేస్తుండేవాణ్ని' అని కార్నెగీ వ్రాశాడు.

ఆయన మృతి నొందే వేళకు పూర్వమే ఆ పట్టికలో ఐదు వందల పేర్లకు మించి వుండేవి. కాలం గడిచిన కొద్దీ ఇందుకు ఎక్కువ ధనం అవసరమని గ్రహించి ఈ భృతిని స్వీకరించేవారు. తమ కాభృతి జీవించినంత కాలం భృతి ముడుతుందనే నమ్మకాన్ని కల్పించటం కోసం, కార్నెగీ యాభై లక్షల డాలర్లతో మరొక ధర్మనిధి ఏర్పాటు చేశాడు. దీనికి తోడు స్కాట్లండులో మరొక పట్టిక ఏర్పాటు అయింది. దీనికి ధర్మకర్త డన్ఫర్మ్‌లైనులోని డాక్టర్ రాస్. ఈ పట్టికలోనే రాబర్టు బరన్స్ మునిమనుమరాలి పేరు, బాల్యంలో కార్నెగీకి అతిప్రియమిత్రుడైన డన్ఫర్మ్‌లైన్ పోస్ట్‌మేన్ కుమార్తె పేరు వున్నవి.

ఒకరోజున న్యూ యార్క్ కార్నెగీ కార్పొరేషన్ అధిపతి అయిన కార్పొరేషన్ డాక్టర్ హెన్రీ యస్. ప్రిట్చెట్‌ను ఇంటికి రమ్మని పిలిపించటం జరిగింది. అతడు వచ్చేటప్పటికల్లా కార్నెగీ తన డ్రాయింగ్ రూములో అటూ యిటూ తిరుగుతున్నాడు.

"డాక్టర్ ప్రిట్చెట్, అమెరికాలోని అధ్యక్షత క్రింది నడుస్తున్న సంస్థవంటి నొకదానిని కొద్ది ఎత్తులో నేను గ్రేట్ బ్రిటన్ కోసం ఏర్పాటు చేయదలిచాను. నిశ్చయంగా దాని కెక్కువ డబ్బు అవసరం లేకపోయినప్పటికీ, అది ఇవ్వటానికి కూడా నా దగ్గర డబ్బు లేదు. నా భార్య కుమార్తెల కోసం విడిచిపెట్టిన డబ్బులో నుంచి నేను మళ్ళా ఒక పది మిలియన్లు తీయదలచలేదు. అందువల్ల మీ కార్పొరేషన్ ధనంలో నుంచి పది మిలియన్లు తీయదలిచాను" అన్నాడు.

డాక్టర్ ప్రిట్చెట్ కొంత సంకటపడ్డట్లు కనిపించి అన్నాడు : "మిస్టర్ కార్నెగీ, మీరా పని చేయటానికి వీలు లేదనుకుంటాను"

"వీల్లేదా?"

"లేదు. 'కార్నెగీ కార్పొరేషన్ ఆఫ్ న్యూ యార్క్" అన్నది స్థిరమైపోయింది. దాన్ని మార్చటానికి వీలుండదు."

కార్నెగీ ఆ చెప్పినది నమ్మలేకపోయినాడు.

"మీరు మిస్టర్ రూట్‌ను విచారించవచ్చు. నేను చెప్పింది నిజమని నా నిశ్చయం. అయినా ఆయన్ను అడగండి, తెలుస్తుంది."

కార్నెగీ మిస్టర్ రూట్‌ను పిలిపించాడు. అప్పుడు అతడు శాసనసభాసభ్యుడు. 'నిశ్చయంగా వీల్లేదు' అని ఆ ప్రముఖ న్యాయశాస్త్రవేత్త అన్నాడు. "మీరు ఇప్పుడు కార్పొరేషన్ నుంచి ధనాన్ని తీయటానికి వీల్లేదు. జరిగి పోయిందేదో జరిగిపోయింది. మార్పుకు వీలుండదు.'

ఇందుకు అతడు వెలవెలపోయాడు. ఏమయినా అతని బుద్ధి బ్రిటిష్ నిధిమీద లగ్నమై వుంది. తనకు మిగిలిన రెండు కోట్ల యాభైలక్షల డాలర్లు భార్యకు, కుమార్తెకు యిచ్చాడు.

మరి నిజానికి వాళ్ళకు అంత డబ్బుతో అవసరముందా? ఎంతోసేపు మథనపడి, ఏర్పడ్డ పరిస్థితిని మిసెస్ కార్నెగీకి ఎరుక పరిచాడు. "మీ బాండ్లలో నుంచి ఈ నిధి కోసం పదిమిలియన్లు నేను తీసుకోవడం మీ కిష్టమేనా?" అన్నాడు.

క్షణమాత్రమైనా ఆమె వెనుకాడలేదు. ఆమెతో సమానురాలు వెనుక పుట్టలేదు, ఇక ముందు పుట్టబోదు అన్న అభిప్రాయాన్ని వెయ్యోమారు నిరూపిస్తూ, ఆమె చిరునవ్వుతో "ఆండ్రూ! ఏమీ అనుకోము" అన్నది చిరునవ్వుతో.

బ్రిటిష్ కార్నెగీ ఫండు ఏర్పడ్డది.

కొన్ని సమయాల్లో అతడు తన కార్యదర్శిని "పోయిస్టన్, ఇప్పటికే నేనెంత దానం చేసి వుంటాను?" అనేవాడు.

అతడికి ఎప్పుడూ అంకెలు నాలుక చివరన సిద్ధంగా ఉండేవి. అతడు సమాధానం చెప్పాడు : "ముప్ఫయి నాలుగు కోట్ల డెబ్బయి రెండు లక్షల ఎనభై ఐదువేల ఐదువందల డాలర్లు." (లేదా అప్పటికి ఎంత అయితే అంత)

''ఓహో!'' అని సంతోషించేవాడు కార్నెగీ. ''ఈ డబ్బంతా నేనెలా సంపాదించాను?" అనేవాడు.

ఆగస్టు 29, 1913న హేగ్‌లోని శాంతిసౌధంలో నిలిచి, అతడు తన అభిప్రాయాన్ని ఇలా వెల్లడించాడు.

"ప్రపంచశాంతిని నిలువబెట్టటానికి కావలసింది ప్రముఖమైన మూడు నాలుగు నాగరిక ప్రభుత్వాల మధ్య యింకా ఎన్ని దేశాలు చేరదలచుకున్నవనుకుంటే వాటి అన్నిటిమధ్య" ప్రపంచశాంతికి భంగాన్ని కల్పించేవారికి, లేదా వానికి ఎదురు నిల్వటం విషయంలో ఒక సహకారాన్ని గురించిన ఒక ఒడంబడిక ఏర్పడటమే. అటువంటిది జరుగుతుందా?"

పదకొండు నెలల తరువాత జులై 28, 1914న ఆస్ట్రియా సెర్బియా యుద్ధాన్ని ప్రకటించింది. ఈ సంఘటనను గ్రహించటానికి కార్నెగీ మనస్సు ఎంతో కష్టపడింది. అతడు 1907లో జర్మనీ అధినేత కైజరు విల్హెలమ్‌ను కలుసుకున్నాడు. అతడిచ్చిన విందుచిన్న నారగించినపుడాతడు చేసినప్రసంగాన్ని బట్టి అతడు ప్రపంచశాంతికి, పురోభివృద్ధికి నిజంగా ఆతురత వహిస్తున్నాడని నమ్మి, అతడంటే మంచి గౌరవభావాన్ని కుదుర్చుకున్నాడు. ఇప్పుడు ప్రథమ సంగ్రామసమయంలో ఉక్కిరిబిక్కిరి అయినాడు. దృఢమైన నమ్మకం కలవాడు కాలేకపోయాడు. క్రమంగా మానవస్థితిని జూచి హృదయాంతరాళంలో దుఃఖితుడౌతున్నాడు. భయానక తీవ్రమై స్పష్టమైన రూపరేఖలతో సందర్శనమిచ్చినప్పుడు, తాను శాంతి కోసం చేసిన కృషి, వెచ్చించిన ధనం వ్యర్థమైపోయాయని గ్రహించాడు. శాంతియుతము, ఆనందమయము అయిన ప్రపంచాన్ని గురించి అతడు కన్న కలలన్నీ భగ్నమైనాయి.

యుద్ధం ప్రారంభం కావటం వల్ల కార్నెగీ కుటుంబం వేసగి కాలంలో స్కాట్లండులో ఎక్కువ కాలముండటం తగ్గించుకోవలసి వచ్చింది. ఇంటికి తిరిగి వెళ్ళటం కోసం స్టీమరెక్కడానికి వారు వేగంగా లివర్ పూల్ చేరుకున్నారు. మోర్లే వాళ్ళను పంపించడానికి వెంట వచ్చాడు. అన్యోన్యశ్రద్ధగల ఆ మిత్రులిద్దరూ కరచాలనం చేసి సెలవు చెప్పుకున్నారు. అదే వారి తుదిసారి కరచాలనం!

తరువాత కార్నెగీ బలం, తేజం నెమ్మది నెమ్మదిగా తరిగిపోవటం ప్రారంభించాయి. తరువాత వేసగిని కనక్టికట్‌లోని నోరోటన్‌లోను గడిపారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు యుద్ధంలో ప్రవేశించిన తరువాత కార్నెగీ ముప్పది రెండు సైనికశిబిరాలకు గ్రంథాలయాలను ఏర్పాటు చేశాడు. 1917 ప్రారంభంలో అతడు లెనాక్స్ దగ్గర వున్న బెర్క్‌షైర్ కొండల్లోని 'షాడో బ్రూకె' అన్న మీరాసీ (Estate) ని కొన్నాడు. చివరి మూడు వేసగి కాలాలను అతడు అక్కడే గడిపాడు. చార్లీ స్క్వాబ్,

టామ్ మిల్లర్, మార్క్ ట్వైన్, రిచ్చర్డ్ వాట్సన్ గిల్డర్, జాన్ బిగలౌ, జోసస్ జాయట్‌లు మరణించారు. చార్లీయే యింకా సజీవుడు. ఈ మిత్రు లిరువురూ ప్రతి ఆదివారం ఒకరి కొకరు వుత్తరాలు వ్రాసుకుంటుండేవారు.

ఏప్రిల్ 22, 1919 – నిన్న మొన్నటి వరకూ స్కిబో పర్వతప్రదేశపు కోనల్లో తండ్రి చేయి పట్టుకొని మెల్లగా వెంట వచ్చిన 'చిన్న పిల్ల' మార్గరెట్‌ను – రోజ్ వెల్ మిల్లర్ అనే మంచి న్యూ యార్క్ యువకిడికిచ్చి వివాహం చేశారు. ఇదే ఆమె తండ్రి యింట జరిగిన చివరి శుభకార్యం.

ఆ వేసగిలో జార్జి లాడర్, జూనియర్ షాడో బ్రూక్‌ను చూడటానికి వచ్చాడు. ఇరువురూ కలిసి తీరుబడిగా షికారుకు వెళ్ళారు. చేపలు పట్టారు. చెక్కర్స్ ఆట లెన్నో ఆడారు. చివరకు కజిన్ డాడ్ కూడా "గుడ్ బై" చెప్పి వెళ్ళాడు.

ఆగస్టు మొదట్లో కార్నెగీ న్యూమోనియా వల్ల బాధ పడుతున్నాడు. మిసెస్ కార్నెగీ ఒక విశ్వాసపాత్రుడయిన సేవకుడు, ఒక మారిసన్ వంశీయుడు, మూడువేళలా అతడికి సేవ చేస్తున్నారు. వ్యాధి ఆరంభమైన రెండవ రోజు, ఆదివారం కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి ఆదివారం మోర్లేకు వ్రాసే ఉత్తరం వ్రాయలేదు. ఆ నాటి సాయంత్రం అతడు చాలా నిస్సత్తువగా వున్నా అతని స్థితి సంతృప్తికరంగానే వున్నట్లు కనిపించింది. రాత్రి సెలవు తీసుకుంటూ, "ఆండ్రూ, నీవు సుఖంగా నిద్రిస్తావని ఆశిస్తున్నా" నన్నది భార్య.

"ఔను, నేను అలాగే ఆశిస్తున్నాను" అని అతడు సమాధానం చెప్పాడు.

అనతి కాలంలోనే గాఢము, ప్రశాంతము అయిన నిద్ర అతన్ని ఆవరించింది. దాని నుంచి తిరిగి మేల్కోలేదు.

న్యూ యార్క్ టారీ టౌనుకు కొంత ఉత్తరంగా వున్న 'స్లీపీ హోల్ సెమెట్రీ'లో వాషింగ్టన్ ఇర్వింగు విశ్రాంతి ప్రదేశానికి అనతిదూరంలో అతన్ని సమాధి చేశారు. అతని సమాధి మీద స్కాచ్ దేశపు నీలశిల (Granite) తో చేసిన ఒక కెల్టిక్ క్రాస్ నిలచి వుంది. స్కిబో ఎస్టేటులో సహచరులుగా వుంటున్న కార్మికులు ఆ గనుల్లో దానిని మలచి త్రోసికొని తెచ్చి పట్టామీదుగా రైలుమార్గం దగ్గరికి చేర్చారు. ఒక గ్లాస్గీ కళాకారుడు ఆ క్రాస్‌ను రూపొందించాడు. మిసెస్ కార్నెగీ దానిమీద చెక్కవలసిన మాటలను నిర్ణయించింది. అది సర్వసాధారణమైన వాఖ్య. ఆడంబరం అణుమాత్రం లేనిది. అంతకంటే ఔచిత్యశోభితమైనది మరొకటి వుండే అవకాశం లేంది.

ఆండ్రూ కార్నెగీ

జన్మ, డన్ఫర్మ్‌లైన్, స్కాట్లండ్

25 నవంబరు 1835

మృతి : లెన్నాక్స్, మసాచ్యుసెట్సు

అంతే!

అతడు తన మరణశాసనాన్ని స్వయంగా వ్రాసుకున్నాడు. భార్యకు, కుమార్తెకు తగిన ఏర్పాట్లు చేశాడు. న్యూ యార్క్ గృహంలోని సేవకులను, స్కిబోమిరాసీలోని సేవకులను, శ్రామికులను జ్ఞప్తి ఉంచుకొని, కొన్ని సంస్థలకు సేవకులను అధిపతులను చేశాడు. చివరకు మాజీ అధ్యక్షులను గురించి తాననుకొనినట్లుగానే జరిపించాడు. తన మరణకాలంలో సజీవుడుగా వున్నవాడు ఒకే మాజీ అధ్యక్షుడు, విలియం హెచ్. ట్రాఫ్టుకు జీవితపర్యంతం ప్రతి సంవత్సరం 16,000 డాలర్ల వార్షికం లభించింది. మిసెస్ గ్రోవర్ క్లివ్‌లాండ్, మిసెస్ థియొడోర్ రూజ్వెల్టు ఒక్కొక్కరికి సంవత్సరానికి 5,000 డాలర్ల చొప్పున ఏర్పాటు చేశాడు. వై కౌంట్ మోర్లే, దేవిడ్ లాయడ్ చార్జి సంవత్సరానికి 10,000 డాలర్లు చొప్పున స్వీకరించారు. పార్లమెంటులో లేబర్ సభ్యుడైన జాన్ బరన్స్ సంవత్సరానికి 5000 డాలర్లు చొప్పున తీసుకున్నాడు. ఇతడు హోమ్స్‌స్టెడ్ సమ్మె సమయంలో కార్నెగీని గట్టిగా ఎదిరించినప్పటికీ, ఇంగ్లండుకు ఇతడు గొప్ప సేవ చేశాడని కార్నెగీ భావించాడు. కార్నెగీని బరన్స్ విమర్శనుంచి రక్షించిన థామస్ బర్టు అన్న మరొక సభ్యుడికి కూడా సంవత్సరానికి 5,000 డాలర్లు ఇవ్వటం జరిగింది.

కార్నెగీ తమకిచ్చిన భవనంలో న్యూ యార్క్ ఇంజినీరింగ్ సంఘాలు అతని జ్ఞాపక చిహ్నంగా ఏర్పాటు చేసిన సభలో ఎలాహూరాట్ మాట్లాడుతూ ఇలా అన్నాడు : “అమెరికా దేశాభివృద్ధిని ప్రపంచాని కొక అద్భుత విజయంగా చేసిన జాతినిర్మాతల కోవకు చెందినవాడు కార్నెగీ. నేనెరిగినంతలో అంతటి దయాళువు లేడు. ధనం అతని హృదయాన్ని గడ్డ కట్టించలేదు. యౌవనకాలం నాటి స్వప్నాలను మరిచిపోయేటట్లు చేయలేదు. కరుణాన్వితుడు, ప్రేమహృదయుడు, నిర్ణయాల విషయంలో దృఢచిత్తుడు. అతడిని గురించి తనకు అవసరం లేని డబ్బును దానం చేసిన ఒక మహాదయావంతుడు అన్న భావం గల వారందరూ, కరుణాన్వితుడై ప్రపంచం కనివినీ ఎరుగని ఎన్నెన్ని ఘనకార్యాలు చేశాడో తెలుసుకోవటం ఎంతో అవసరం!”

# నాలంద

# తొలిపలుకు

ఆదర్శ విద్యార్థి జీవితకథను వస్తువుగా గ్రహించి నవలా రూపమున పుట్టిన గ్రంథము లాంధ్రభాషలో నవరూపములుగనున్నవి. 'నాలంద' యట్టి యత్నములలో నొకటి. శిఖిశాతకర్ణియను నుత్తమ విద్యార్థి జీవితమిందు చిత్రితము.

ప్రాచీన భారతదేశమున 'నాలంద' యుత్తమ విశ్వవిద్యాలయముగ ప్రఖ్యాతి గడించుకొనినది. ఆ విశ్వవిద్యాలయ వాతావరణమును స్వీకరించి యుత్తమ విద్యార్థి జీవిత కథాకల్పన మీ 'నాలంద'లో నొనర్పయత్నించితిని. క్షమాది యుత్తమగుణ ప్రభావమువలన విద్యార్థులెట్లుపాధ్యాయులకు వశ్యులై వారి యాదరానురాగములతో ఉత్తమ వ్యక్తులుగ పరిణమించి విద్యాస్వీకరణమొనర్చిన సంస్థను క్రమశిక్షణము వలనను, నున్నత నీతివలనను జగత్ప్రసిద్ధము కావింప సమర్థులగుదురో యీ యాఖ్యాయిక యందు నిరూపితమైనది.

ఈ కథారచనమున కావశ్యకములైన చరిత్రాంశములను సాంక్లియా మహాశయుని 'నాలంద విశ్వవిద్యాలయ'మను పరిశోధన గ్రంథమునుండి నేను స్వీకరించితిని. ఫారార్ మహాశయుని 'సెయింట్‌విని ఫ్రేడ్సు' బృహత్కథాపఠనము నా యాఖ్యాయికారచన కుద్బోధకము.

ఈ నవలను వారి గ్రంథమాలలో నొక కుసుమముగ గైకొని నన్నభిమానించి ముద్రణాస్థితిని గల్పించిన ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ యజమానులగు శ్రీ యం.యస్. శర్మగారికి నేను సర్వదాకృతజ్ఞుడను.

**రచయిత**

# నాలంద

"శిఖీ! మనకు శుభశకునమైనది. నాలంద పవిత్రఘంటిక బుద్ధపూజకై యందఱ బిలచుచున్నది. మనమును త్వరితముగ బ్రవేశించి, చైత్యగృహమున కేగి యందుఁ బాల్గొందము".

నాలంద విద్యాలయ బహిఃప్రదేశమునం దుత్తరద్వారమున నశ్వశకట మాగినది. అందుండి చండశ్రీశాతకర్ణి పదునైదు వత్సరముల బాలుని చేయూత యిచ్చిదింపినాడు.

చండశ్రీ పూర్వమొక శతాబ్ది కాలము మగధ సామ్రాజ్యము నేకచ్ఛత్రముగ బాలించిన శాతవాహన వంశమున జన్మించిన రాజపుంగవుడు. ఆ సామ్రాజ్యము పతన మొందిన పిమ్మట వారి వంశస్థులు గౌతమీపుత్ర శాతకర్ణి నేతృత్వమున దక్షిణాపథాధిపతులై మహత్తర వైభవముతో రాజ్యపాలన మొనర్చినారు.

గౌతమీపుత్రశాతకర్ణికి సవతితమ్ముడు మేఘల శాతకర్ణి. ఇతడు మహావీరుడు. పాటలీ పుత్ర ప్రాంతమును స్వశక్తితో రక్షించుకొని బహుకాలము పాలించినాడు. అతనికిఁ బది యవ తరమువాడే యీ చంద్రశ్రీశాతకర్ణి.

శిఖి చంద్రశ్రీశాతకర్ణి ప్రథమపుత్రుడు. సుగుణరాశి, స్ఫురద్రూపి. తండ్రియతని బాల్యము నుండి గారాబముతో బెంచినాఁడు. విద్యాబుద్ధులు గరపుటలో కడు శ్రద్ధ వహించినాడు. అది క్రమబద్ధమైనదికాదు కాని శిఖి శ్రద్ధతో గొంత విద్య గడించినాడు. అతని వయస్సులో నున్న నాలంద విద్యాలయ విద్యార్థులకంటె నతడు విజ్ఞాని, అయినను వారుపొందిన విద్యకును, శిఖి స్వీకరించిన విద్యకును విశేష విభేదమున్నది.

స్వార్థ మెరుగని యుత్తమాచార్యుల సేవాత్యాగముల ఫలితముగ నాలంద విఖ్యాతి యుత్తరాపథమున దశదిశల వ్యాపించుచున్నది. కుమారు నుత్తమధర్మవీరునిగ, నుదాత్త మానవునిగ దీర్చిదిద్దుటయే జీవితాశయముగ నెంచుకొనుచున్న చండశ్రీని యాకీర్తి యాకర్షించినది. కుమారు నా విద్యాలయమున నుత్తమాచార్యులకడ జదివించుట యుక్తమని తలపోసి నేడతనినందు బ్రవేశ పెట్టుటకు దీసుకొని వచ్చినాడు.

వారు దీర్ఘప్రయాణ మొనర్చినారు. కాని విసుగు జనింపలేదు. నిరంతర సంభాషణతో చండశ్రీ కుమారుని కనేక విషయముల దెలియజెప్పినాడు.

సందర్భవశమున శిఖి తండ్రిని నాలందయన నేమని ప్రశ్నించినాడు. 'న-అలమ్-ద' పూర్ణముగ నిచ్చునది కాదు. విద్యార్థులకు జీవిత మార్గమును జూపించి విడిచిపెట్టునది. 'ఇదియే విద్యాలయమునకు బరమధర్మ' మని తండ్రి కుమారునికి జెప్పినాడు.

"నాలందలో నాచార్యులు, నుపాధ్యాయులు విజ్ఞాన మహోదధులు. వారి విద్యాగర్భముల నెన్నెన్నో రత్నరాశులున్నవి. వారిని సేవించి వాటిని గ్రహించుటయే విద్యార్థుల కర్తవ్యము" అని చెప్పి యందున్న రత్నోదధి, రత్నసాగర, రత్నరంజక గ్రంథ నిలయముల గుఱించి చండశ్రీ ప్రస్తావించినాడు. అందలి యాలయముల, విహారముల, విద్యామందిరముల స్వరూపమును గోచరింపజేసి కుమారుని కత దాసక్తి గల్పించినాడు.

ఉన్నత శిఖరముపైనుండి శకటము దిగుచున్నప్పుడు దూరముగ గన్పించిన నాలందను జూపించుచు "ప్రకృతి హృదయ దేశమున పసిపాపవలెనున్న యీ విద్యాలయ మెంత రమణీయముగ నున్నది? ఈ ప్రశాంత వాతావరణమున సత్సాంగత్యమును బొంది శ్రద్ధాభక్తులతో విద్య నార్జించియుదాత్త మూర్తివై నీవు తిరిగి వచ్చుటయే నా చిరకాల వాంఛ"యని పలికినాడు.

"శక్తివంచనలేక శ్రమించి మీ కోరిక నీడేర్చెదను" అనురాగమునకు బాత్రుడ నౌటకే యత్నింతు"నని శిఖిశాతకర్ణి తండ్రికి సమాధానము జెప్పినాడు.

త్వరిత గమనమున చైత్యగృహమును జేరుకొని బుద్ధపూజానంతరము తండ్రి కుమారులిరువురు నాలంద ప్రధానాచార్యుడు శీలభద్రుని ప్రత్యేకమందిరమును జేరుకొని నారు. ఒకయున్నత వేదికపై గూర్చొని యతడు గ్రంథపఠన మొనర్చుచున్నాడు. చండశ్రీ కుమారునిచే నాచార్యునకు బాదాభివందనము జేయించినాడు.

అవసరోచిత సంభాషణలు సాగినవి. శిఖిని శీలభద్రుడు విద్యార్థిగ స్వీకరించి 'నీ కాచార్యుడు, కాశ్యపుడు, గయాశీర్షుడుపాధ్యాయుడు' నని చెప్పి బంపించినాడు.

ఆదినమే సాయంత్రము చండశ్రీ మఱల నింటికి బ్రయాణమైనాడు. నాలంద ప్రథమ ప్రాకార ద్వారము వరకు ననుసరించి వచ్చిన కుమారునకు బుద్ధులు గఱపి శకటముపై నధిరోహింపబోవుచు 'శిఖీ! మన వంశగౌరవమును, బేరుప్రతిష్ఠలు నీవలన నిలువ వలసియున్న' వనిన వాక్యము శిఖి హృదయమున గాఢమున హత్తుకొనినది. 'భద్ర'మని పలుమారులు పలికి కుమారుని నిలువుమని యాజ్ఞాపించి చండశ్రీ శకటమును సాగించినాడు. కనుజూపున కందునంతవఱకు ననురాగముతో జూచి శిఖి శాతకర్ణి తండ్రి నుద్దేశించి కరాంజలి ముకుళించి వెనుదిరిగి వచ్చినాడు.

కామాయనీ భిక్కుని శిఖిశాతకర్ణికి వినయ విహారమున నివాసగృహ కక్ష జూపించినది. వస్తువులకు స్థాన నిర్దేశ మొనర్చుకొని యనుగుణముగ వాని నమర్చుకొనినాడు. విశేషము లేమియు లేక నా దినము గడచినది.

మరుసటి దినమున ప్రభాతవేళ మేల్కొని కాలకృత్యముల దీర్చుకొని బుద్ధపూజానంతరము శిఖి విద్యామందిరమున కరిగినాడు. విద్యార్థు లొనర్పరాని కార్యపత్రిక 'ప్రతిమేక్షము'ను శ్రద్ధతో బఠించినాడు.

చ్ఛదరలపై గూర్చుండి విద్యార్థులు ముచ్చటలు జెప్పుకొనుచు కాలక్షేప మొనర్చుచున్నారు. ప్రాత విద్యార్థులకు నూతనముగ బ్రవేశించువారిని బేరులుపెట్టి యాటలు బట్టించుట పరిపాటి. శాతకర్ణి కక్ష్యలో విజితావి యట్టివారిలో మేటి. శిఖిని జూచిన తక్షణమే "ఏమోయి 'ఎట్టితేలు!' నీ పేరేమి?"టని ప్రశ్నించినాడు. అది కేవలము ధూర్తత. శాతకర్ణి జంకలేదు. నిశ్చలముగ 'శిఖి'యని సమాధానము జెప్పినాడు. అతని సంబంధ బాంధవ్యముల దెలుసుకొనిగాని యేడ్పింపరాదని నిశ్చయించుకొని విజితావి శాతకర్ణిని జేరబిలచి విచారించినాడు. అతని యొద్దనుంచి విలక్షణమైన సమాధానములు వచ్చినవి. విజితావి కాశ్చర్యము కలిగినది. అయిన దానిని బహిరంగ మొనర్పక నూతనముగ వచ్చిన మరియొక విద్యార్థి కుబ్జునకు, శాతకర్ణికిని 'కజ్యము'ను గల్పించి యానందింపదలచి యిరువురను గవ్వించినాడు.

వారికి రోషము హెచ్చ కుబ్జుడు విజితావి యిచ్చుచున్న స్తోమతను జూచుకొని శిఖి ముఖముపై నొక దెబ్బకొట్టినాడు. ప్రతిగ నతడు చేయినెత్తబోవ 'చిన్నవానిపై జేయి చేసుకొనుచున్నావా?' యని విజితావి బెదరించినాడు.

"క్రొత్తగా జేరిన వారికి 'పుల్లింగములు' పెట్టి పోరాడించి యానందించుట సిగ్గుచేటు" అని దూరముననుండి చూచుచున్న మంగళుడు విజితావిని నిందించినాడు.

"పిఠికివాడు వాడేమి పోరాడు" ననుచు కుబ్జుడు శాతకర్ణి మీదికి తరుముకొని యొంటి కాలిపై వచ్చుచున్నాడు.

'నేను నీతో తలపడ'నను శాతకర్ణి మధురకంఠస్వరము విద్యార్థుల నెందులకో యాకర్షించినది. మంగళుడు ముందుకు వచ్చి 'కారణమే'మని ప్రశ్నింప శిఖి యిట్లు సమాధానము చెప్పినాడు.

'కారణము లేనిది కలహమెందులకు? అయిన నా చిన్నవాడు నాకు 'ఉజ్జీ'కాడు.' కొందరు బాలకులతని యుదాత్తతను గుర్తించి గౌరవింప నారంభించినారు. విజితావి

యతని సమాధానముల సహింపలేకున్నాడు. అత డూరకొనలేదు. ఉజ్జీ యౌనో కాదో పోరాడిన గాని తెలియదు. ఇది 'యాడ లేక మద్దెల యో'డన్నట్టున్నది. "ఒడ్డు పొడుగును జూచి మా కుబ్జుడు భయపడు ననుకొనినా వేమో! వాడు నీ వలె పిఱికిపంద కాదు. కుబ్జా!"అని యతడు పురియెక్కించినాడు.

విజితావి యండజూచుకొని కుబ్జుడు శాతకర్ణి ముక్కుపై నొకదెబ్బ కొట్టినాడు. అతనికి బట్టరాని కోపము వచ్చినది. తగిన శాస్తి యొనర్చవలెనని ప్రథమమున నూహ పొడమినది. మఱల మనస్సును జిక్కబట్టుకొని కుబ్జుని వల్లెవాటుగ రెండు చేతులతో నెత్తుకొని, యతని పాదతాడనముల లెక్కింపక కక్ష్యలో నొకమూల గూర్చుండబెట్టి 'మిత్రుడా! మూర్ఖుడవుగాకు'మని బుద్ధిజెప్పినాడు.

అతనిరక్త ముడుకెక్కియున్నది. సూటిగ విజితావి దగ్గరకు దిరిగివచ్చి 'ఏమంటివి? నేను పిఱికిపందనా? కాను. కాని వ్యర్థకలహములన్న నాకపేక్షలేదు. మిత్రుడా! నీవు మాటకారినని మనమున సంతోషించుచున్నట్లున్నావు. దానివలన నీకే ప్రమాదము. నిన్ను జూచి నేనణుమాత్రమైన వ్యాకులత నొంద'నని ఖండితముగ బలికినాడు.

'అయిన నాతో గలహింపుము'.

విజితావి మండిపడి శిఖిపై తలపడి దక్షిణ శ్రవణముపై నొక దెబ్బకొట్టినాడు. అతడు మరుక్షణమున శక్తికొలది విజితావి యుత్తర శ్రవణముపై దాని నొప్పజెప్పినాడు. విజితావి గూబగింగురుమనినది. ఆ దెబ్బతో నతని దయ్యము పారినది. మఱల నతడు తూలలేదు. పగసాధింప నిది సమయముగాదని యూరకొనినాడు.

"శక్తియున్న ముందునకు రమ్ము. పిఱికివాడు నీవా నేనా? అట్లు మరెన్నడు ననకుము. జాగరూకతతో మెలగుము" అని గట్టిగ గద్దించి పలికినాడు.

ఇంతలో విద్యార్థు లుపాధ్యాయ కాశ్యపుడు మందిరమునకు వచ్చుచుండుట గమనించి వారి స్థానముల గుక్కిన పేలవలె గూర్చొనినారు. శాతకర్ణి యౌదార్యధైర్య సాహసములకు ముగ్ధులై మంగళుడు, ధ్వజకేతువు నతనితో మైత్రిగావింప నిశ్చయించుకొనినారు.

## 2

ప్రప్రథమముననే శాతకర్ణికికి మంగళుని స్నేహము లభించినది. అతనివలన నతడు విద్యార్థుల లక్షణములు, నాలందా విద్యా ప్రధానవిధానము, నాచార్యపాదుల స్వరూప స్వభావములను, విద్యావైదుష్యములను దెలుసికొనినాడు. అతడొక యాచార్యుని

పర్యవేక్షణ క్రింద నొక కక్ష్యలో విద్యామందిరమున మరికొందరు విద్యార్థులతో గలసి విద్యనేర్చు కొనవలెను. పదిమంది విద్యార్థులతో నొక నివాసగృహకక్ష్యలోవసించి నిద్రింపవలెను. అయిన నతడింతకు బూర్వమిట్టి విద్యకు గాని, నివాసమునకుగాని యలవాటు పడినవాడు కాడు.

'ఆచార్యపాదులు నిన్ను బరీక్షించినారా?'

'లేదు! శీలభద్రులు నన్నేమేమి జదువుకొనినావని యడిగినారు. నా సమాధానములు విని కాశ్యపుల గలిసికొని వారియొద్ద విద్య నభ్యసింపుమని యాదేశించినారు'.

'కాశ్యపుడా!' యని ధ్వజకేతువు ముఖము చిట్లించినాడు. 'వా రెటువంటివా'రని శాతకర్ణి ప్రశ్నింప "ఆయన మనిషికాడు. కేవలమొక యంత్రము. నేనును మొదట కొంతకాలము వారికడ జదివినాను. అప్పుడు నా జాతకమున శని బాగుండలేదని పించిన"దని ధ్వజకేతువు వ్యంగ్యముగ బలికినాడు.

"ఛీ! నోరుమూసుకొనుము. ఆచార్యపాదుల గుఱించి యవ్యక్తముగ మాటాడుట యనుచితమని యతని సంభాషణమును మాన్పించి మంగళుడు శాతకర్ణితో నిట్లనినాడు.

"మిత్రుడా! తినబోవుచు రుచి యడుగనేల? వారి సద్గుణములు స్వల్పకాలములోనే నిన్నాకర్షించునని నా విశ్వాసము. నీయుపాధ్యాయు లెవరు?"

"గయాశీర్షులు."

మరల కల్పించుకొని ధ్వజకేతువు 'గయాశీర్షులా?' యని యాశ్చర్యమును వెలిబుచ్చి నాలుక కొఱికినాడు. బాగున్నది. ఇరువురు మహాత్ములును తగ్గవారు దొఱకినారు అనినాడు.

"వారి స్వభావమెట్టి?"దని శిఖి శాతకర్ణి మంగళుని బ్రశ్నించినాడు.

"నీవు వినయవిధేయతలతో సక్రమముగా ప్రవర్తించి సకాలమునకు బాఠముల వల్లించిన నాయన నీజోలికి రాడు. నిన్నుదయతో బాలించును. ఆయనకు మాంద్యము గిట్టదు: చిలిపి తనము సహింపలేడు. అట్టి విద్యార్థులతో మాటాడుటకైన నిష్టపడదు అసహ్యించుకొనును" అని మంగళుడు గయాశీర్షుని స్వభావమును విశదపరచినాడు.

"అడుగో! ఆ మఱ్ఱిచెట్టు నీడలో 'పృథువుల'తో మాటాడుచున్న వ్యక్తి గయాశీర్షుడు"అని ధ్వజకేతువు నూతన మిత్రుని కతని యుపాధ్యాయుని జూపించినాడు. శిఖి యాయనను గుర్తు పెట్టుకొనినాడు.

విద్యాలయ ఘంటిక మ్రోగినది. కట్టలు దెగిన క్రొత్తనీరు వలె విద్యార్థులు విద్యామందిరము లోని వివిధకక్ష్యల నుండి బయటబడి నలుదెసలకు బోవుచున్నారు. మంగళుడు నూతన మిత్రునితో నతని నివాసకక్ష్య కేగి మరికొంతసేపు స్నేహముగ బ్రసంగించినాడు.

సాయం సమయమున కొందరు విద్యార్థులు చెట్లనీడలలో మరునాటి పాఠముల 'చింతన' జేయుచున్నారు. శాతకర్ణి సహపాఠుల గమనించినాడు. వారు గుంపుగ జేరి సంభాషించుకొనుచున్నారు. అందువలన దనకు బాఠములు లేవనునుద్దేశముతో మంగళుడు వెళ్ళిన తరువాత నతడు వెంట దెచ్చుకొనిన గుణాఢ్యుని 'బృహత్కథ' జదువుకొనుచున్నాడు. ఇంతలో మిత్రుడు ధ్వజకేతువు వచ్చినాడు. శాతకర్ణి యతనిని వేయి ప్రశ్నలడుగ వలసి యున్నది ఆరంభించినాడు. బహుకాలము సంభాషణ సాగినది. మంగళుని వలె నతడును శాతకర్ణి కాప్త మిత్రుడైనాడు.

బుద్ధపూజకు ఘంటిక మ్రోగినది. విద్యార్థులందరును చైత్యగృహమువైపున కేగుచున్నారు. ధ్వజకేతువుతో గలసి శాతకర్ణి బుద్ధపూజలో బాల్గొనినాడు. భోజనానంతరము వసతిగృహ కక్ష్యలకు వచ్చి విద్యార్థులందరును నిద్రకు సిద్ధపడినారు.

శాతకర్ణికి ప్రయాణపు బడలిక యింకను దీరలేదు. గాఢ నిద్ర తూలి వచ్చినది నిద్రవోవ నారంభించి యెంతోసేపు కాలేదు. అతని మంచము క్రిందికి బైకి లేచిపడుచున్నది. మేల్కొని యతడు నిదురమత్తులోనే మంచము క్రిందకు దూరి యొకని కాలు గట్టిగ పట్టుకొనినాడు. కాలుజాడించి యవతల వ్యక్తి తప్పించుకొని పారిపోవుచున్నాడు. అతని పాదరక్ష శిఖి చేత చిక్కినది. వెంటబడి యతనిని చీకటిలో తరిమి కొట్టినాడు.

ప్రక్కనున్న వసతిగృహ కక్ష్యలో నుండి అమితాభుడు వెక్కివెక్కి రోదించు కంఠము వినిపించినది. అతని నట్లే యెవడో నిద్రనుండి లేపినారు. అతడు భయస్థుడు. గడగడ వడకుచు గట్టిగ బోరగిలబడి ప్రక్కను గౌంగిలించుకొని మధ్యమధ్య వెరపుచే కలవరించు చున్నాడు. ఆ దుష్కృత్య మొనర్చిన మాంజిష్ఠుడే మంచముపై నతని తిరిగి బరుండబెట్టి తన కక్ష్యకేగి శయ్యపై జేరినాడు.

నివాస గృహపాలిక అళింద మేల్కొని కాగడాతో నొక మాటు నటు నిటు తిరిగి నిశ్శబ్దముగ నుండుట గమనించినది మరల గృహమున కేగి నిద్రించినది.

'ఈ దినమునకు నీకీ శాస్తి చాలును. నీవిక నిద్రపొమ్ము' అని యొకకఠిన కంఠస్వరము శాతకర్ణికి వినిపించినది. కాని యతనికి గొంతసేపటి వరకు నిద్రపట్టలేదు.

తనలో తాను క్రుంగిపోవుచు దుఃఖించుచున్న అమితాభుని గురించి యతడాలోచించు చున్నాడు.

నిశ్శబ్దముగ నతడమితాభుని కక్ష్యలో బ్రవేశించి యనురాగముతో నిట్లనెను. 'మిత్రుడా! భయపడకుము. ఎవరో విద్యార్థి చిలిపితనమున నీపరిహాసకృత్య మొనర్చినాడు. మరియొక రాత్రి యిట్టిపనికి బూనుకొనిన బ్రక్కపై నొక దిక్కున కొరుగుము. అందువలన నీ కెవ్విధమైన బాధయును కలుగదు.'

'నీవు దయగలవాడవు. నీవంటి వ్యక్తి నాకీ నాలందలో గనిపింపలేదు. నెచ్చెలీ! నీపేరేమి?'

'శిఖిశాతకర్ణి'యని యతడు సమాధానము జెప్పినాడు. అమితాభుడు శిఖిని గౌరవ పురస్సరముగ బంపించి మరల శయ్యపై జేరినాడు.

బ్రాహ్మీముహూర్తమున నాలంద ఘంటిక మ్రోగినది. విద్యార్థులందరును మేల్కొని కాలకృత్యముల నిర్వర్తించినారు. వారు బుద్ధపూజకై చైత్యాలయమును జేరుకొన సిద్ధపడుచున్నారు.

శిఖిశాతకర్ణి యొద్ద కొక విద్యార్థి దూకుడుగ వచ్చి "ఓరీ! క్రొత్తకుంక! నీయొద్ద నా పాదరక్ష యున్నదా?" యని ప్రశ్నించినాడు.

"అవును ఉన్న"దని యతివినయముతో నతడుబలికినాడు.

క్రోధరసము వెలిగ్రక్కుచు 'ఇటు తెమ్ము'అని వాడు శాసించినాడు. 'రాత్రి నామంచము క్రింద దూరిన యొక దుష్టుని కాలినుండి దానిని నేను లాగుకొనినాను'.

'రాత్రి నీ వేమొనర్చినావో జ్ఞప్తియున్నాదా?'

"అవును, పాదరక్షలతో నా వ్యర్థునకు బుద్ధిచెప్పినాను. మరల నొక మారట్లే యొనర్చిన నతడుచిత 'గౌరవమును' బొందగలడు"అని శాతకర్ణి సమాధానము జెప్పినాడు.

"అబ్బో! వీరుడ వీనాటికి గ్రొత్తగా నూడిపడినావు! తాదూర నొక క్రంతలేదు మెడలో డోలన్నట్లు నీవా అమితాభుని బుజ్జగించుచున్నావట! జాగ్రత్త" అని ఏకశృంగుడు పాదరక్ష పైకెత్తి శిఖిని గొట్టబోయినాడు. అతడు గట్టిగ నాదుష్టుని జేయిపట్టుకొని మెలిద్రిప్పినాడు. బాధకు దాళజాలక ఏకశృంగుడు హస్తమునుండి పాదరక్షను గ్రిందబడవేసినాడు.

'సరే కానిమ్ము. ఇది సమయము గాదు. నేను బుద్ధపూజ కేగవలె'నని సాకుజెప్పి యతడు వెళ్ళిపోయినాడు.

అమితాభుని గలుపుకొని శిఖి శాతకర్ణి బుద్ధపూజ యొనర్చి తిరిగి విద్యామందిరము జేరుకొనినాడు.

"శిఖీ! మనమెక్కడి కేగవలెను?"

"నేనును క్రొత్తవాడను. నాకును దెలియదు." వారిరువురకును దూరమున మంగళుడు కనిపించినాడు. అతనిని బిలచి ప్రశ్నింపనాతడు వారికి కాశ్యపుని విద్యామందిరమును జూపించినాడు. ఇరువురు మిత్రులును నటకు జేరుకొనినారు.

కంఠస్థ మొనర్చిన పాఠముల విద్యార్థులు గయాశీర్షునకు వినిపించుచున్నారు. శాతకర్ణివంతు వచ్చినది.

"క్షమింపుడు. నేను క్రొత్తవాడను. గ్రంథము లేదు".

"క్షమింపుడు. క్రొత్తవాడను. గ్రంథము లేదు" అని యా యుపాధ్యాయుడు శిఖిని వెక్కిరించి యధికార పూర్వకముగ 'రేపటికి వినిపింపకున్న నూరుకొనను. ఆదిలోనే హంసపాదా? ఈనాటి పాఠములన్నియు ఫలకముపై వ్రాసిజూపింపు'మని కఠినముగ శాసించినాడు.

'చిత్త'మని నమస్కరించి శాతకర్ణి యథాస్థానమున గూర్చొనినాడు.

అది శుక్లపక్షమే కాని శాతకర్ణికి కృష్ణపక్షము వలె నున్నది. పూర్వమాతడు కంఠస్థ మొనర్చుట కలవాటు పడలేదు. వ్యాకరణమనిన నతనికి వెగటు. అతని మూల పురుషులలో నొకడైన హాలశాతకర్ణి సంకలన మొనర్చిన 'సప్తశతి'లోని గాథలన్న నతని కభిమాన మధికము. వానినే యతడు ముఖస్థ మొనర్పలేదు. నాలందలో వ్యాకరణమునకు విశేష ప్రాధాన్యము. శబ్దార్థ వివరణమున సమస్త ప్రపంచమును విద్యార్థులకు బరిచయ మొనర్చు నవకాశము గలుగును. అందువలన దాని కాచార్యులు ప్రథమస్థాన మిచ్చినారు. నాలంద విద్యావిధానము శాతకర్ణికి నచ్చలేదు. మనస్సు వ్యాకులపడ జొచ్చినది. అతని కసంతృప్తి యారంభించినది.

విద్యార్థులెవరైన బాఠముల ముఖస్థ మొనర్చి వినిపింపలేకున్న గయాశీర్షునకు మరుసటిదిన మొప్పజెప్పిన జాలదు. వారిచే ఫలకముపై వానిని వ్రాయించును. పెట్టిన గడువులో వ్రాసుకొని రాకున్న మరల మరల వ్రాయించును. అట్టి విద్యార్థుల

నాటపాటలలో బాల్గొన నీయడు. ఆయన విధానమునకు మార్పులేదు విద్యార్థుల శక్తి సామర్థ్యముల గమనించిగాని, వారి మానసిక స్థితిగతుల బరిగణించిగాని యది పరివర్తన నొందదు.

చింతన యన శాతకర్ణి మనస్సు చెప్పినమాట వినదు. అతడు పదిమందిలో గలసి చదువుట కలవాటు పడలేదు. నిశ్శబ్దమున గాని యతని చిత్తము నిశితముగ బనిచేయదు. అతడు సకాలమున కొకమారైన పాఠముల బూర్తియొనర్పలేక పోవుచున్నాడు. నిరంతరమును వల్లింపలేని పాఠముల జూచి వ్రాయుటలో నతనికాలమంతయు వ్యర్థమగుచున్నది. గయాశీర్షుడతని 'నిరర్థకు'డని నిర్ణయించి శీలభద్రునితో విన్నవించినాడు. ఆ సంగతి చెవినిబడిన తరువాత శిఖి చిత్తము పరిపరి విధముల బరితపింప నారంభించినది.

ఆనాడతడు కక్ష్యలో వేదికపై నేకాంతముగ కూర్చుండి దీర్ఘముగ నాలోచించు చున్నాడు. అతని ముఖమున దైన్యము తొణికిసలాడుచున్నది.

విద్యార్థులందరును కనుల యెదుట క్రీడాభూమిలో కందుక కేళి కాయత్తపడు చున్నారు. మంగళుడు, ధ్వజకేతువు శిఖిని బిలుచుకొనిపోవనతని కక్ష్యకు వచ్చినారు.

"ఆటలో నీవు పాల్గొనుట లేదా?"

"లేదు. పాల్గొనవచ్చునని తెలియదు" "ఇప్పటికైన మించిపోయినది లేదు. కామాయనీ భిక్కునికి జెప్పి నీ పేరును జేర్పింతుము రమ్ము" అని శాతకర్ణి నుత్సాహపరచి వారిరువురు నతనితో క్రీడాభూమిని చేరుకొని రంగస్థలమున బ్రవేశించినారు.

ధ్వజకేతు వొక పక్షమునకు, ఏకశృంగుడొక పక్షమునకు నాయకులు. 'జాగ్రత్తగ నాడవలె సుమా! మనలో నొకరైన మరణింపరాదు' 'మా శక్తికొలది యత్నింతు'మని మంగళుడు, శాతకర్ణి యతనికి సమాధానమిచ్చినారు.

కందుక క్రీడలో రెండు పక్షములుండును. నేలమీద చిన్నగుంటను ద్రవ్వి దానియొద్ద నుండి యొక పక్షమువారు విసరుచుండును మరియొక పక్షము వారు కోలతో గురితప్పక గొట్టవలెను. ముమ్మారు తప్పిన నా పక్షమున నొకరొకరే మరణింతురు. రెండవ పక్షము వారు కందుకమును వారిలో వారి కందించుకొనుచు గుంటకు కొంతదూరమున నిల్పిన కోలకు దగులునట్లు వేయవలెను. తగులకున్న మరలను జెండుకొట్టుదురు. తగిలిన, వారిలో నొకరు చనిపోయినట్లు. ముమ్మారు

గురిపెట్టి చెండుకోలకు దగులునట్లు కొట్టలేకున్న పక్షమున మరణించిన వారొకరు జీవింతురు.

చెండును గొట్టుట ధ్వజకేతువు పక్షమువారికి వచ్చినది.

ఆట ప్రారంభమైనది. కొలది కాలములోనే ధ్వజకేతువు పక్షమున మంగళుడు, శాతకర్ణి, యతడు తప్ప నందరును మరణించినారు. మంగళుడు కోలతో గుంటయొద్ద నిలిచి యిరువుర బ్రతికించినాడు. కాని వెంటనే వారు మరణించినారు. తరువాత మంగళుడు ధ్వజకేతువు మరణించినారు.

ఆట యంతయు శిఖిపై నాధారపడియున్నది. అతడు కందుకమును జుక్కలు జూచునట్లు కొట్టినాడు ఏకశృంగుని పక్షము వారు పరుగెత్తిదానిని పట్టుకొనుటలో శ్రమపడి యలసి పోవుచున్నారు. వారి గురి తప్పిపోవుచున్నది. శాతకర్ణి క్రమముగ నందర బ్రతికించినాడు. ధ్వజకేతువు పట్టరాని సంతోషముతో గేకలుపెట్టినాడు.

సూర్యాస్తమయమైనది. ఆట చాలింపుడని కామాయిని భిక్కుని యాదేశించినది. ధ్వజకేతువున కాదిన మాటలో నఖండ విజయము. ఏకశృంగుని పక్షము పూర్వమెన్నడు నట్టోడిపోలేదు. శాతకర్ణిని మంగళుడు, ధ్వజకేతువు భుజములపై నెక్కించుకొని కొందరు విద్యార్థుల హర్షనినాదములతో నాలంద వీథులం దూరేగించినారు.

## 3

క్రీడారంగమున నతడెంతటి ప్రజ్ఞ జూపించిననేమి? శాతకర్ణి విద్యావిషయికముల వెనుకబడియున్నాడు. అతని కాత్మగౌరవములు లుప్తమగుచున్నవి నిరాశ యతని గలత బెట్టుచున్నది. గయాశీర్షుడొసగుచున్న శిక్షలకంతము లేదు. కొయ్యపలకపై నిత్యము తేనెబలపము లరిగిపోవునట్లు పాఠముల వ్రాయుటచే జేతులు కాయలు గాయుచున్నవి. విద్యలో నిరర్థకుడనిపించుకొనుట కతని కిష్టములేదు. ఎంత శ్రమించిన నతడు స్నేహితులతో సరిపోలలేకున్నాడు. 'చంద్రమొద్దు' 'చాకిబండ' మొదలైన తిట్లకు దలబొప్పులు కట్టుచున్నది. 'నన్నుకాదని' త్రోసి వేసుకొని తిరుగగల తత్త్వమతనికి లేదు. సహజముగ నతడు తెలివితక్కువ వాడైన నెంతో బాగుండెడిది!

అట్టిస్థితిలో దండ్రి యొద్దనుండి యుత్తర మొకటివచ్చినది. అదియతని వ్యాకుల హృదయమును మరింత కలత బెట్టినది. తన సంగతి తండ్రికి దెలిసినందు కతడు చింతపడి కన్నీరుగార్చినాడు. 'పాణినీయ శిక్ష'లో బాఠమును గంతస్థ మొనర్చనందు

కాదినమున గయాశీర్షుడతని రెండు ఘడియల కాల మేకాంత గృహమున బంధించి యవమానించినాడు.

శిక్షననుభవించి బయటకు వచ్చిన తక్షణమే చెట్లనీడల బుద్ధపాదముల కడ జదువుకొనుచున్న మంగళ, ధ్వజకేతువు లతనికిగనుపించినారు. అతివేగమున వారికడకు వచ్చి యుద్రిక్త మానసములతో 'ధ్వజకేతూ! నేనీ గయాశీర్షుని శిక్షల, నవమానములను భరింపలేకున్నాను. నాలంద యన నాకసహ్యాము కలుగుచున్నది. గయాశీర్షునకు విద్య నేర్పు విధానము తెలియదు' అని తీక్షణముగ బలికినాడు.

ధ్వజకేతువు సహజమగు చమత్కార లక్షణములతో 'ఉఁ సాదు రేగినది. తల పొలమున గాని నిలువదన్నమాట!' యనినాడు. మంగళుడు గ్రంథపఠనమును జాలించి "శాతకర్ణీ! ఈ గొడవంతయు నేమి"టని ప్రశ్నించినాడు.

"ఏమున్నది? నా నిత్యజీవితము నరక ప్రాయముగనున్నది. సంస్కృత వ్యాకరణము, సూత్రచింతన, కంఠస్థమొనర్పనందున చూచివ్రాత, వినయ పాఠములు, చూచివ్రాత ప్రాకృత వ్యాకరణము, సూత్ర చింతన. చూచివ్రాత అటు పిమ్మట ఖగోళము మీనమేషముల లెక్కించుట తరువాత – దెబ్బలు, ఏకాంత గృహనివాసమను నవమానము, నా పాలిటి యమునివలె నా గయాశీర్షుడవతరించినాడు. నేనిక నీ శిక్షణావిధానమునెంతో కాలము భరింపలేను" అని శిఖిశాతకర్ణి దుఃఖముతో బలికినాడు.

మంగళుడిట్లనినాడు. "నీవు నుపాధ్యాయులనిందింప జూచుకొనకుము. దానివలన నణుమాత్రమును బ్రయోజనములేదు. కంఠస్థ మొనర్పకున్న గయాశీర్షుడు పాఠములు వచ్చినట్లంగీకరింపరు. అది వారి మార్గము.

కరుణతో నతని మిత్రులోదార్తురని శాతకర్ణి యుద్దేశించినాడు. మంగళుని వాక్యములతని కసంతృప్తికలిగించినవి. "అట్లే కానిమ్ము. ఈ రసవిహీనమైన మొరటుపద్ధతి నాయన యెన్నాళ్ళు సాగించునో జూచెద"నని శాతకర్ణియట నిలువ లేక వెనుదిరిగినాడు.

శాతకర్ణి ప్రవర్తన మంగళునకు నచ్చలేదు. వ్యతిరేకాభిప్రాయమును జెప్పినంతనే మిత్రునిపై నంతటి కోపమును దెచ్చుకొనుట విద్యార్థి జీవితమునకు బనికిరాదని యతని నమ్మకము. అయినను మిత్రునసంతృప్తిపరచుట కిష్టపడక మరల దగ్గఱకు బిలిచి 'శిఖీ! తొందర పడకుము. పాఠక్రమము నీకు గొత్తగ నున్నట్లున్నది. కాలము, గడచిన నీవే దాని రుచిని గ్రహింతువు. ఆనాడు గయాశీర్షుని విధానమును వేనోళ్ళ పొగుడుదు'వని స్నేహ పూర్వకముగ బలికినాడు.

శాతకర్ణి కతని మాటలు మనస్సున కెక్కినట్లు లేదు.

మరునాడు విద్యామందిరమునకు బయలుదేరుచు గయాశీర్షుని విద్యావిధానము నసంతృప్తిని బ్రకటింపనతడు నిశ్చయించుకొనినాడు. ఆదినమున నతని 'కంఠస్థము' మరింత నధ్వానముగనున్నది. గయాశీర్షుడు సూత్రపాఠముల బదిమారులు పలకపై వ్రాసిజూపు మని శిక్షజెప్పినాడు. శిఖికి పట్టరాని కోపము వచ్చినది. చేతిలో నున్నకొయ్య పలకను నేలకు విసరికొట్టి పక్కున వికటముగ నవ్వినాడు.

ఆ యవినయమును సహింపలేక గయాశీర్షుడు మండిపడి 'శిఖీ! మదించి ఒడలు మరిచినట్లున్నావు. నీవంటి నూతన విద్యార్థికడ నిట్టి యవినయము సహింపరానిది. నీకు పది దెబ్బలు శిక్ష విధించి'నా ననినాడు.

శిఖ 'చిత్త'మని చిత్రమైన గొంతుకతో వెటకారముగ బలుక నదివినిన విద్యార్థులు కలకల నవ్వినారు. గయాశీర్షునకు గౌరవి ద్రిప్పినట్లైనది.

"నీవింత మూర్ఖుడవని నేననుకొనలేదు. ప్రతి దుష్టచేష్టకును శిక్ష పెరుగునని నీ వెఱుగవు కాబోలును. కక్ష్యనుండి వైదొలగి నిలువుము. పృథువు వచ్చియట శిక్షను దీర్చును".

శిఖి భయపడుటకు ప్రతిగ గ్రంథములను, ఫలకమును జంకన బెట్టుకొని విద్యార్థుల నవ్వించుచు విలక్షణమైన నడకలతో బయటికి వెళ్ళినాడు.

గయాశీర్షుడు తోకద్రొక్కిన త్రాచువలె రోజుచున్నాడు. నూతనశిక్ష యేమీయవలెనని యాలోచించెనేగాని, యాయుపాధ్యాయుడు శాతకర్ణి ప్రస్తుతమానసిక స్థితి నణుమాత్రమైన నర్థమొనర్చుకొనుటకు బ్రయత్నింపలేదు. అతనిశిక్షలనుచితములని, నవమాన కరములని శాతకర్ణి నిర్ణయము. అట్టి సమయమున నతని నెంత కఠినముగ శిక్షించినను ప్రయోజన ముండదు. 'ఈ దినము నీమతి క్రమముగ లేనట్లున్నది. నిన్ను నేను క్షమించుచున్నా'నని గయాశీర్షుడొక మా రౌదార్యముతో బలికిన నెంత బాగుండెడిది! మరునటి దినమునుండి శిఖి కాలుగాలిన పిల్లివలెనతని ననుసరించెడివాడు.

కక్ష్యలో ప్రథమ విద్యార్థిని పృథువని వ్యవహరింతురు. ఉపాధ్యాయులు, నాచార్యులు జెప్పు శిక్షను పృథువులొసగుట నాలందలో పద్ధతి. అందువలన గయాశీర్షుడు శాతకర్ణికి దగ్గర నుండి పృథువుచే శిక్షనిప్పించినాడు. ఆ సమయమున నతడు బెదరలేదు చెదరలేదు. కంట తడిబెట్టలేదు. హృదయమును శిలాసదృశముగ

గఠినమొనర్చుకొని శిక్ష ననుభవించినాడు. ఉపాధ్యాయునిపై దనకు నిరసనభావ మధిక మైనట్లు వ్యక్తపరచినాడు. గయాశీర్షుడు దానిని గమనించినాడు.

మధ్యాహ్నవేళ నుపాధ్యాయ మందిరమున గయాశీర్షుడాలోచనా పరవశుడై యొంటిగ గూర్చొనియున్నాడు. ఆయన యుపాధ్యాయ జీవితమున మున్నెన్నడు నట్టిక్లిష్టస్థితి యేర్పడలేదు. 'ఏమో యోచించుచున్నా'రని సమోపాధ్యాయుడమృతవర్షుడు ప్రశ్నించినాడు.

"ఈదిన ముదయము, నూతన విద్యార్థి, శాతకర్ణికి శిక్షజెప్పినాను. అందువలన నతనిలో మార్పేమియును గలుగలేదు నాపై నిరసనభావ మధికమైనది. అందువలన నేను కలత పడుచున్నాను."

"ఖగోళ పాఠముల నతడు నాయెద్ద చదువుచున్నాడు, ప్రవేశించినది మొదలు నాకు నతనికి శిక్షజెప్పని దినములే"దని అమృతవర్షుడనినాడు.

"అతని యవినయము నాకు నచ్చలేదు. శిక్షించినను బ్రయోజనము పొడకట్టదు. అయిననూ నతడు తెలివిగలవాడు.

కాశ్యపుడు దూరమునుండి యాయుపాధ్యాయుల సంభాషణమును విని మృదువుగ నిట్లనినాడు:

"ఆ బాలుని గురించి మీరిరువురును దురభిప్రాయ పడుచున్నారు. అతడనిన నాకు విశేషాభిమానము. విద్యాబుద్ధులలో మన యుత్తమ విద్యార్థులలో నతడెవ్వరికిని దీసిపోవువాడు కాడు. అతని వినయగౌరవము లితరులకు లేవని నా నిశ్చయము, వినయపిటక పాఠముల బౌద్ధసంప్రదాయకములైన నీతిపాఠములకై నా యొద్దకు వచ్చినప్పుడతనిని గమనించినాను. అతని కాత్మవిశ్వాస మధికము. ఇంచుక దయానురాగములతో నతని వశమొనర్చుకొన నేను మిమ్ము ప్రార్థించుచున్నాను."

"అతనిని నేనెన్నడును నిర్దయతో జూడలే"దని గయా శీర్షుడనినాడు. "నేను నతనియెడ ననురాగమునే బ్రకటించినా"నని అమృతవర్షుడు పలికినాడు.

"అయిన నతనికై మీ విద్యావిధానమును గొంత మార్చి చూడుడు" అని ఆచార్య కాశ్యపు డభిప్రాయమిచ్చెను.

"మా విధానమును నతనికొరకు మార్చుట కవకాశముండ"దని వా రేకగ్రీవముగ బలికినారు.

“కఠినమార్గ మైనంత మాత్రమున నది యుచితము, నుపయుక్తము, నుత్తమమని నేనునమ్మను. క్షమింపు”దను కాశ్యపుని వాక్యముతో వారేకీభవింపలేకపోయినారు.

సాయంత్రము బుద్ధ పూజావేళకించుక బూర్వమే శాతకర్ణి నాలందా ప్రధానాచార్యుడు శీలభద్రుని దర్శించినాడు. తన జీవితమును మొరబెట్టుకొనినాడు. శిఖి తప్పిదము, గయాశీర్షుని శిక్షణ విధాన మాయన కవగతమైనవి. అనురాగ పూర్వకముగ నాయన యాలోచించినాడు. పూర్వము గయాశీర్షుడాయనతో జేసిన ప్రసంగములు కొన్ని జ్ఞప్తికి వచ్చినవి. విద్యార్థులసత్యవాదులు, శిఖియవినయము సహింపరానిదని నిశ్చయ మొనర్చుకొనినాడు. నాలంద చరిత్రలో నిట్టి విచిత్ర విద్యార్థి పూర్వమెన్నడును గోచరింపలేదు. ‘ఆయన నీకు తగిన శిక్ష జెప్పినగాని వీలులేదు. లేకున్న విద్యార్థి లోకమున నవినీతి ప్రాకిపోవును’ అని శాతకర్ణితో బలికి బంపించినాడు.

శిఖి కెటుజూచినను జుక్క యెదురుగ నున్నది. అతనిది లొంగిపోవు స్వభావము కాదు. ధైర్యముతో జ్వలిమంటల గాచుకొనుచున్న విద్యార్థుల జేరి గత రాత్రి జరిగిన దంతయు వారికిజెప్పినాడు. అతనికి శీలభద్రాచార్యుని యెడ గోపములేదు. ఆయన దమృత హృదయము. దానిలో విషము గలిపి చెడగొట్టినవాడు గయాశీర్షుడు. పూసగ్రుచ్చినట్లు శాతకర్ణి జెప్పినవాక్యముల విని విద్యార్థులు మండిపడి యుపాధ్యాయుని కారుకూతలనినారు.

‘ఆ పాషాణమును నాలంద నుండి బయటకు బంపలేమా?’ యని మంజీరుడనినాడు.

‘గొఱ్ఱెలు బిడ్డనొప్పులే మెరుగును? విద్యార్థుల మనస్సులా ‘మంగలికత్తి’కి తెలుసునా’ అని ప్రగతి యనినాడు.

‘నాకొక మంచి యూహతోచినది’.

‘ఏమది?’

‘పరశురామప్రీతి’.

‘దేనిని’.

‘గయాశీర్షుడు మనపై గత్తిగట్టి ప్రాణాధికముగ దాచి పెట్టుచున్న మన ‘శిక్షణ పత్రికలు’.

‘బాగున్నది! జంఝామారుతముగనున్నది!! ప్రగతికి జై! శిఖిశాతకర్ణికి జై!’ అను నినాదములతో విద్యార్థులు కేకలు పెట్టినారు. గయాశీర్షుడు చైత్యగృహమున నుండుటను గమనించి విద్యామందిరమునకు వారు బయనమైనారు.

కాషాయ వస్త్రముతో జుట్టిపెట్టిన తాళపత్ర గ్రంథములనన్నిటిని నేలపై గ్రుమ్మరించి నిప్పంటించినారు.

‘ఇది మనకందరకు బ్రమాదము. మీరు నిప్పుద్రొక్కిన కోతులవలె ప్రవర్తించుచున్నా’రని సునేత్రుడనిన మాటనెవ్వరును పాటింపలేదు.

ధ్వజకేతు ‘శిఖీ! మన ‘శిక్షణ పత్రికలు’ కావు. ఆచార్యుని ‘పారమిత గ్రంథము’ అనినాడు. వానినెట వెదకి దహింపగలము. అన్నిటి రూపుమాపిన నవియును నశించు’నని శాతకర్ణి శివమెత్తినట్లు తాళపత్రముల దహించుచు సమాధానము జెప్పినాడు.

అన్నిమూలల వెదకివెదకి గ్రంథజాలములకు నిప్పంటించినారు. అవి సమస్తమును స్వల్పకాలమున భస్మరాసులై రూపుమాసి పోయినవి.

వారి యుద్రేకము చల్లారినది. భయోత్పాత మారంభించినది. ఎవరికివారెట్లు తప్పించుకొనుటయా యని యాలోచింపసాగినారు. ‘నూతన విద్యార్థి శాతకర్ణి గయాశీర్షుని గ్రంథజాలమును భస్మమొనర్చినా’డని నాలంద నలుదెసల ననతికాలములో దెలిసిపోయినది.

ఎటుజూచిన నదియే సంభాషణ. కాని విద్యార్థులెవ్వరు నుపాధ్యాయులకు గాని’ యాచార్యులకుగాని యా వార్తను దెలియపరచలేదు.

“శిఖిశాతకర్ణి కిక నాలందలో విద్యార్జన మొనర్పతావుండునా?” యనునదియే ప్రతి విద్యార్థి హృదయమును గలవరపెట్టుచున్న ప్రశ్న.

## 4

మరుసటిదిన ముదయము, భోజనాంతరము విద్యార్థులెవరి కక్ష్యలో వారు ప్రవేశించినారు. విద్యార్థులలో ‘నుప్పిడి చప్పిడి’లేదు. గయాశీర్షుడు యథాక్రమముగ జేత పేపబెత్తముల కట్టతో ప్రవేశించినాడు. ముందొక భస్మరాశి కనుపించినది.

‘ఈ పని చేసినదెవరు?’ అని ప్రశ్నించినాడు. సమాధానము రాలేదు. ఆయన దృష్టి మరియెక వంకకు బ్రసరించినది. అట మరియొక భస్మరాశిలో సగము తగులబడిన

తాళపత్రములు కనుపించినవి. భయోత్పాతము కలిగినది. స్మృతిదెచ్చుకొని యన్ని దిక్కుల పరికించి చూచినాడు. మరికొన్నిభస్మరాశులు కంటబడినవి.

ఆయన కన్నులు చంద్రనిప్పులైనవి. కక్ష్యలో నిశ్వాసము వినిపించు నంతటి నిశ్శబ్దము నిబిడమై యున్నది.

'నా గ్రంథము లేమైన'వని బిగ్గఱగ గయాశీర్షుడు ప్రశ్నించినాడు.

ఆయనకు 'దగ్ధమైన'వని యొక భయ కంపిత గాత్రము సమాధానమిచ్చినది.

ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు కావటిపెట్టె నెత్తిజూచుకొనినాడు అందును గ్రంథజాలము లేదు.

'నా పారమిత గ్రంథమును దగ్ధమైనదా?' కోపము మిన్ను ముట్ట గంపిత స్వనముతో బ్రశ్నించినాడు.

'అవును. వాటిని నేనుదహించి నా'నని శిరమువంచి నిలువబడి శిఖిశాతకర్ణి అనినాడు.

క్రోధము నాపుకొనలేక గయాశీర్షుడు గద్దెపైనుండి దిగివచ్చి శాతకర్ణి చెంపపై గట్టిదెబ్బ కొట్టినాడు. మరుక్షణమున నది బురబుర చేతివెంట పొంగినది. ఆ ధ్వనికి కక్ష్య మార్మోగినది. ప్రతి విద్యార్థికి నా దెబ్బ యతని చెంపపై బడినట్లనిపించినది.

గయాశీర్షుని కోపము క్రమముగ జల్లారినది. ఏమియొనర్చుటకును దోచక నాయన కక్ష్యనుండి వెళ్ళిపోయినాడు.

ప్రక్కనున్న కక్ష్యలలో నాచార్య కాశ్యపుడు వినయపాఠముల జెప్పుచున్నాడు. గయాశీర్షుని గదిలో జెలరేగిన కలకలమువిని యచటికి వచ్చినాడు. విద్యార్థుల సంభాషణమువలన సమస్తమాయన కవగతమైనది.

'శిఖి, గయాశీర్షుని గ్రంథజాలమును దహించినా'డన్న వార్త నాయాచార్యుడు నమ్మలేకపోయినాడు. తన విద్యార్థుల నందఱ రత్నోదధి గ్రంథాగారమున జదువుకొన వెడలుడని శాసించి గయాశీర్షుని వెదుక నారంభించినాడు.

అతడుపాధ్యాయ మందిరమున మూర్తీభవించిన దుఃఖమువలె నొక మూల గూర్చొని యున్నాడు. కాశ్యపాచార్యుడతని సమీపించి "ఖిన్న వదనులై యున్నారు, ఏమి జరిగిన"దని ప్రశ్నించినాడు.

“ఏమియును లేదు. ఇరువదియైదు సంవత్సరముల నా జీవిత కృషి సమస్తము మంటగలసినది“.

“మీ పారమిత గ్రంథములైన మిగిలినవా?”

“లేదు. కాశ్యపాచార్య! వానికై నా జీవితమునంతయు ధారవోసినాను. శ్రమయంతయు బిడికెడు బూడిదగ నాకు దక్కినది”.

“దుష్కృత్యము నొనర్చినవాడు శిఖియేనా?“

“అవును. మీ ప్రియశిష్యుడా శిఖియే! అతడు పేరునకు దగినపనిచేసినాడు”.

“అతడింత బుద్ధిహీనుడని పూర్వమెన్నడును నేనూహింపలేదు. మఱల గ్రంథరచన మారంభింపలేరా?”

“మఱలనా? – ఇరువదియైదేళ్ళనాటి ధైర్యసాహసము లెవరిత్తురు. ఆ శక్తి సామర్థ్యములు లభింపవలెనన్న మఱల పుట్టవలసినదే”.

కాశ్యపున కేమనుటకు దోచలేదు. దీనావస్థలో నున్న గయాశీర్షుని విడిచిపెట్టి పోవుటకు హృదయ మంగీకరింపలేదు.

ఉపశమనవాక్యముల జెప్పవచ్చును దుఃఖమును జేతితో దీసిపారవేయ తరముగాదు. ‘ఆచార్యా! నన్నేకాంతముగ నుండనిం’దని గయాశీర్షుడు గాశ్యపుని గోరినాడు.

ఆచార్య కాశ్యపుడు త్వరితగతిని గయాశీర్షుని విద్యామందిర కక్ష్యకు విచ్చేసినాడు. భక్తిసూచకముగ విద్యార్థులందఱు లేచి నిలువబడినారు. గురుపీఠమలంకరించి యాయన యిట్లు ప్రవచించినాడు.

“విద్యార్థులారా! మీరెట్టి ఘోరమైన తప్పిదమీనాడొనర్చినారో మీరెఱుగరు. గయాశీర్షుని యిరువదియైదు సంవత్సరముల కృషిని బూడిదకుప్ప జేసినారు. దానివలన విజ్ఞానమునకు దీరని విద్రోహ మొనర్చితిరి. మీరందఱును దోషులుగారని నేనెరుగుదును. దోషియొక్కడే! అందును నతడు క్రొత్తవాడని వినుటకు నాకు సంతోషముగ నున్నది.”

ఆచార్యుని వచనముల కడ్డువచ్చి మాటాడుట సామాన్యకృత్యము కాదు. అట్టిస్థితిలో ధ్వజకేతువు ధైర్యముతో ఆచార్యోత్తమా! మేమందరమును దోషులమే. శిఖిశాతకర్ణి మాత్రమే దోషికాదు. గయాశీర్షుడు మాపై విధించిన శిక్షలనన్నిటి నొక

గ్రంథముగ జేసినాడు. వాటిని దహింపవలెనను కోరిక యందఱికిని గలిగినది. దహించినాము” అని పలికినాడు.

కాశ్యపుడు ధ్వజకేతువుపై దృష్టినిల్పి “శిక్షా పత్రికలా?” వాని సంగతి నాకు తెలియదు. వానిని దగ్ధమొనర్చుట మహాదోషము! శిక్షణకు బద్ధులు కాకుండుటయే మీ యుద్దేశమన్న మాట! యనినాడు.

“శిఖీ! క్షంతవ్యముగాని నీ తప్పిదమెంత ప్రమాదకారియో నీ కర్థమైనదా! నీ దుష్టచేష్టలవలన గయాశీర్షుడు క్రుంగిపోయినాడు. ఛీ! ముఖమెత్తుకొని యుపాధ్యాయుల నెట్లు చూడగలవు? సతీర్థులలో నెట్లు ప్రవర్తింపగలవు? సత్ప్రవర్తనగల విద్యార్థుల మధ్య నుండుటకు నీ వర్హుడవుకావు. నీకేమి శిక్ష కలుగనున్నదో నేనెరుగుదును. వ్యక్తిగతముగ నిన్నీ నాలంద యావరణమునుండి పంపివేయవలయునని నాకున్నది” అని పలికినాడు.

కాశ్యపాచార్యుని యొక్కొక మాట యొక బాణపుములికివలె శిఖి హృదయమున నాటుకొనినది. నిశ్చేష్టుడై నేలపై దృష్టి నిల్పియట్లే నిలువబడినాడు. అతని కన్నుల నుండి యొకటి రెండు దుఃఖాశ్రువులు నేలపై బడినవి. ఆచార్యుడు కక్ష్యనుండి వెడలిపోవుచున్నాడు.

“శిఖీ! కాశ్యపులవారి ననుసరించి ‘అవి ప్రాతశిక్షా గ్రంథము’లని భ్రమపడి దహించినామని చెప్పుము” – ధ్వజకేతువు శాతకర్ణితో ననురాగపూర్వకముగ జెవిలో జెప్పినాడు. కాని యతడు కదలుట కిష్టపడలేదు. అతని ముఖమున దైన్యదేవత తాండవించుచున్నది.

“నీ మనస్సు బాధపడుచున్నట్లున్నది. ఘోరమైన తప్పిదమునే జేసినావు. చింతించి ప్రయోజన మేమున్నది? గయాశీర్షుని కడకేగి నా తప్పిదము క్షమింపుడని వేడుకొనుము. ఆయన దయాసాగరు’డని ధ్వజకేతువు ప్రేమతో మఱల నొకమారు చెప్పిచూచినాడు.

శాతకర్ణి యప్పటికిని కదలలేదు. వెనుకనుండి యతనిచేయినెవరో పట్టుకొనినారు. అతడు ‘పృథువిద్యార్థి’, ‘శీలభద్రులు నిన్ను వెంట బెట్టుకొని వారి ప్రత్యేకమందిరమునకు దీసుకొని రమ్మనినార’ని జెప్పినాడు. శిఖి చింతాదైన్యములతో నతని ననుసరించినాడు.

పృథువు ప్రధానాచార్య మందిరము ముందు శిఖి శాతకర్ణిని నిలువబెట్టి వెళ్ళిపోయినాడు. లోపలనుండి కామాయనీ భిక్కుని వచ్చి ‘ఆచార్యపాదులు నీతో

నిప్పుడు మాట్లాడరు. అళిందా! ఈ బాలకుని నాల్గుదినములు ఏకాంత గృహమున బంధించి యన్నపానములిచ్చి జాగరూకతతో గాపాడుచుండు'మని వెడలిపోయినది.

శిఖి అళింద ననుసరించినాడు. ఆమె యతని ఏకాంతమందిరమున బంధించినది. అచటికి మిత్రులెవ్వరును మాటాడుటకైన రాకూడదు. భయముకంటె నవమానమతని బాధించుచున్నది. హృదయము బ్రద్దలగునట్లత డేడ్చినాడు. చుట్టుకొంతమేర నేల తడసి పోయినది. దుఃఖించిన ప్రయోజనమేమని నచ్చజెప్పి యోదార్చుట కెవ్వరును లేరు.

అపరాహ్ణమైనది. అళింద యన్నపానాదులతో ప్రవేశించిన తోడనే శిఖిదైన్యమును జూచి దయతో 'నాయనా! దుఃఖము వలన శాంతిలేదు. ధైర్యమును దెచ్చుకొనుము. ఈ శిక్ష నీ మంచి కొఱకే వచ్చినది. సత్ప్రవర్తన నలవాటుజేసుకొని గురుదేవుల యనురాగమునకు బాత్రుడవు గమ్మని పలికినది.

శిఖి భోజన మొనర్ప నిరాకరించినాడు. బలవంతము జేసి యతనిని బుజ్జగించి అళింద యన్నము దినిపించినది. అతనికి గావలసిన గ్రంథముల గొన్నిటిదెచ్చియిచ్చి కవాటమును బంధించి వెడలిపోయినది.

మధ్యాహ్న మంతయు నెట్లో గడచినది. శిఖి గదిలో నొంటిగ నున్నాడు. గ్రంథకాలక్షేప మొనరించుట కాతని బుద్ధిదానిపై బ్రసరింపలేదు. వాతాయనమునుండి సంధ్యారుణ కాంతులతనిపై బడినవి. స్మృతి దెచ్చుకొనియందుండి విశాల ప్రకృతిని దర్శించి యతడు యుత్సాహమును జేకూర్చుకొనినాడు.

ఇంతలో కవాటమును దట్టి యెవరో దానిసందునుండి యొక లేఖను లోపల బడవేసినారు. వచ్చి లేఖను విప్పి జదువుకొనినాడు.

"మిత్రుడా! శిఖీ! నీకై నేనెంత దుఃఖపడుచున్నానో నీ వూహింపలేవు. నీతో బాటీ శిక్షణలో బాలు పంచుకొనవలెనని నాకున్నది. నీవంటి ధైర్య సాహసములు గల మిత్రుని జూచి హృదయమున నేను గర్వించుచున్నాను. నీతో నెన్నడును నేను గలహింపను. నీ యూహలకు విముఖుడను గాను – మంగళుడు"

చీకటి పడినది. అళింద యొక దీపపు ప్రమిద నామందిరమున నుంచి యతనికి భోజనము పెట్టి మఱల కవాటము బంధించినది. రాత్రియంతయు శాతకర్ణికంటికి నిద్రలేదు. అతడాలోచనా సాగరమున మగ్నుడైనాడు.

ఈరీతి నాల్గుదినములు గడిచినవి. తెల్లవారిన తరువాత బుద్ధ పూజానంతర మాచార్యులాతనికి శిక్ష జెప్పవలసియున్నది. దానిపై నతనిభవిష్యజ్జీవిత మాధారపడినది. నాలందా విద్యాలయమున బ్రవేశపెట్టుచు తండ్రి పలికిన మాటలతనికి జ్ఞప్తికి వచ్చినవి. తండ్రి కోరికకును తనకు నెంతదూరము!

పొంగి పొరలివచ్చిన దుఃఖము నాపుకొనలేక బిగ్గఱగ నేడ్చినాడు.

ఆ యేకాంతమందిరము కడకెవరో వ్యక్తి ప్రభాత కాలమునకు బూర్వమే వచ్చిన యలికిడి యైనది. అతడు కవాటము దగ్గఱకు జేరినాడు. తలుపుసందునుండి యొక లేఖను లోపల బడవైచి యావ్యక్తి భయముతో మందమందముగ పరువెత్తినట్లున్నది. శిఖిని జూడరాదని శీలభద్రాచార్యుని యనుశాసనమే దీనికికారణమైయుండును.

శిఖి యుత్తరమును జదువ నారంభించినాడు.

"ప్రియసోదరా! శిఖీ! నిన్ను నాలం దావరణమునుండి బయటకు పంపరని నిర్ణయమైనది. ఈ వార్త నిన్నటి సాయంకాలమునుండి నీకెట్లు చేర్తునాయని హృదయమారాటపడినది. ఇప్పటి కవకాశము చిక్కినది. ఇంతకు బూర్వమే యీ వార్తవినిపించి నీ మనః క్లేశము నుపశమింప జేయలేక పోయినందుకు క్షమింపుము. గయాశీర్షుని దర్శించి మేమందరమును నిన్ను క్షమింపవలసినదని ప్రార్థించినాము. శిక్షవలన గల్గు భయముచే గడచిన మూడు దినములు నీతో మాటాడుటకు రాలేదు – నీ మంగళుడు."

లేఖను జదువుకొను నప్పుడొక యవ్యక్తానందమతని హృదయము నావరించినది. సంతోష రేఖలు ముఖమునద్యోతకమైనవి. 'ఆవరణమునుండి నన్ను బహిష్కరింపరు. ఇకనాచార్యపాదు లొసగు నెట్టి శిక్షనైన నిక నేననుభవింపగలను' అని యనుకొనినాడు.

అతని దృష్టి వాతాయనము వంకకు మఱలినది. దూరమున చైత్యాగార శిఖరము కనుపించినది. అతడు నమ్రభావముతో సాష్టాంగ దండ ప్రణామ మాచరించినాడు. ఏదో యనుమానము తోచి లేఖను మఱల జదువుకొన నారంభించి 'మేము గయాశీర్షులను నిన్ను క్షమింపమని వేడుకొనినాము' అనునర్థము గల వాక్యమును మఱల మఱల జదివినాడు. "ఇది నిజమేనా? నా తప్పిదమును గయాశీర్షులు మన్నించినారా? నిజమైన నాయన యెంతటియుదారుడు! ఏ మహాత్ముని హృదయమున కార్చిచ్చు రగిల్చినానో యాయనయే నన్ను క్షమించినాడా? అతని మనస్సు యాతాయాతముగ నున్నది.

కవాటమును దెరచుచప్పుడు వినిపించినది, తలుపు విడివడినది. మూర్తీభవించిన దయాదేవతవలె గయాశీర్షుని యున్నత మూర్తి యెదుట నిలువబడినది. శిఖి నిలువెల్ల చలించి ప్రత్యుత్థాన మొనర్చి' మోకాళ్ళపై నిలిచి "ఆచార్యోత్తమా! నన్ను క్షమింపుడు. మీకు నేను తీరని యపచార మొనర్చినానని నా కర్థమైనది" అనినాడు. పిమ్మట చేతులు జాచి పాదస్పర్శ యొనర్చి 'మీరు కనిపించిన తక్షణమే నా తప్పిదమును జెప్పుకొని మన్నింప వేడుకొన హృదయ మెంత యారాటపడినదో యందు కిదియే సాక్షి' యని నతశిరస్కుడైనాడు.

"నీవు నాకెంతటి యపచార మొనర్చి దుఃఖమును గల్పించి నావో యిప్పటికైన నిశ్చయముగ గుర్తించినావా?" అని గయాశీర్షుడు రుద్ధ కంఠముతో బలికినాడు.

ఆయనలో వెనుకటి ధోరణిలేదు. 'మహాత్మా! నాదోషమవగతమైనది. కాశ్యపాచార్యుల వలన మీరిరువదియైదు సంవత్సరములు దీక్షగ నొనర్చిన కృషిని దగ్ధ మొనర్చినానని తెలుసుకొని బాధపడినాను. నన్ను క్షమింపరా?' అని కన్నీరు మున్నీరుగ నేడ్చియుపాధ్యాయుని పాదముల దడిపినాడు.

'బుద్ధభగవానుల క్షమాపణ నర్థించినావా? అని గయాశీర్షుడు గంభీరస్వరమున శిఖిని బ్రశ్నించినాడు.

'దయాసాగరుడు భగవానుడు నన్ను తప్పక క్షమించును. ఒకనాడు నేనిట్టి క్రూరుడ నౌదునని మున్నెన్నడును భావింపలేదు. మహాత్మా! మీయనురాగమున కేరీతిగ బాత్రుడనౌదునో దయయుంచి సెలవీయుడు. నా పరితప్త హృదయమునకు శాంతి చేకూరు'నని శిఖి గయాశీర్షునితో మొరబెట్టుకొనినాడు.

ఉపాధ్యాయునితో బ్రసంగించు సమయమున శాతకర్ణి ముఖమును జూచి మాటాడ లేకపోయినాడు. అతని హృదయ పరివర్తనమును గయాశీర్షుడు గమనించినాడు. ఆయన హృదయమున నిద్రించుచున్న దయాసాగర ముప్పొంగి పోయినది. శిఖిశిరముపై జల్లని చేయినిల్పి నిమురుచు గయాశీర్షుడు సంతతధారగ గపోలములపై స్రవించుచున్న కన్నీరును దుడిచినాడు. పట్టరాని సంతోషముతో నొకమా రాయన ముఖమున దృష్టి నిల్పినాడు. ఆయన ముఖమును దుఃఖదేవత క్రీడారంగముగ నొనర్చుకొనిది. అయినా నా తేజోమూర్తి యాననమున దయారేఖలు వానకారు మెరపులవలె మెరయుచున్నవి. శాతకర్ణి యాయద్భుత ప్రభావమునకు ముగ్ధుడై సాష్టాంగదండ ప్రణామ మొనర్చి గురుదేవున కాత్మార్పణ మొనర్చుకొనినాడు.

అతనిని లేవదీసి గయాశీర్షుడిట్లు వాగమృతమును వర్షించినాడు. “లెమ్ము! నాయనా శిఖీ! లెమ్ము! నిన్ను నేను హృదయపూర్వకముగ క్షమించినాను! నీ వొనర్చిన దాని వలన నేను నొక గుణపాఠమును నేర్చుకొనినాను. నీవు నొక పాఠమును నేర్చుకొంటివి. నా వయస్సు వచ్చునాటికి నీవు సమస్త క్రోధమును జయించి భగవానుని యిచ్ఛనెరిగి వర్తింతువని నేను నమ్ముచున్నాను. నీ తప్పిదమును సరిదిద్దుట కేమైన నొనర్చుటకు సిద్ధముగ నున్నాననినావు. నీ కృషివలన నాకు గలిగిన నష్టము తీరునది కాదు. నీ వుత్తమ విద్యార్థి వనిపించుకొనిన నాకదియే పదివేలు”.

ఉపాధ్యాయుని ప్రశాంత మధుర కంఠములో నౌదార్యము వెల్లువలై పారినది. “హృదయ పూర్వకముగ నిన్ను నేను క్షమించినా” నన్న వాక్యము శాతకర్ణి యంతరాంతరముల హత్తుకొనినది. అతడు కన్నీటితో కృతజ్ఞతను వెల్లడించినాడు.

‘శిఖీ! నీవిక స్వేచ్ఛగ వర్తింపుము. పూజావేళయైనట్లున్నది. చైత్యగృహమున కిరువురమును గలసిపోదముర’మ్మని యతని భుజముపై శీతలహస్తముంచి గయాశీర్షుడు నడిపించుకొని పోవుచున్నాడు. త్రోవలో విద్యార్థులు బారులు దీర్చి నిలువబడి నమస్కరించుచు నుపాధ్యాయునియెడ గౌరవమును బ్రదర్శించుచున్నారు. ఆ దృశ్యమువలన నాలందా విద్యార్థులకు క్షమయెంతటి మహత్తర శక్తియో యవగతమైనది.

సిగ్గుచే విద్యార్థుల జూడలేక నేలజూచుచు నడచినాడు. చైత్యగృహముననైన నతడు తలయెత్తలేదు. భోజనవేళ నతని ముఖమున నెత్తురుబొట్టులేదు. చింతాయత్తుడై యితరులతో గలసి మెలసి తిరుగలేకున్నాడు. విద్యార్థులు ధైర్యమొసగి యతనిని బలుకరించుట లేదు. అతని నొక మహాదోషిగ పరిగణించి కొందఱుపాధ్యాయులును, నట్లే ప్రవర్తించినారు. ఆచార్య కాశ్యపుడైన ననురాగ పూర్వకముగ బూర్వమువలె నతనితో సంభాషింపలేదు.

పాపము! శిఖి కవి యన్నియు కాళరాత్రులు! ధ్వజకేతువతనితో మైత్రి యొనర్పమానలేదు. మంగళుడు, అమితాభుడు ననురాగముతో స్నేహము నెరపుచునతని కానందమొనగూర్చ బాటుపడుచున్నారు. గయాశీర్షుడతనిని బుద్ధ పూజాసమయమున, వాహ్యాళి వేళలనప్పుడప్పుడు వెంటగొని పోవుచున్నాడు.

పది దినములైన తరువాత చంద్రశ్రీశాతకర్ణి నాలందకు వచ్చినాడు. దీనికి కారణము ప్రధానాచార్యుడు శీలభద్రుడాయన కొకలేఖ వ్రాయుటయే. కుమారుని చరిత్ర సమస్తమునుపాధ్యాయుల వలన వినినాడు. రెండు దినములచటనేయుండి యతని నేకాంతముగ నడిపించుకొనిపోయి యేమేమో ప్రసంగించినాడు.

ఆ తండ్రికి నూతన పరిణామముతో దొణికిసలాడుచున్న శిఖిశాతకర్ణి యెడ నమ్మకము, నవ్యానురాగము జనించినది.

## 5

గయాశీర్షుని గ్రంథజాల మగ్నిదగ్ధ మొనర్చుటవలన శిఖిశాతకర్ణి మంచిపేరు కొంతకాలము మరుగుపడినది. తిరిగి దానిని సంపాదించుకొన ధైర్యముతో నతడు విశ్వ ప్రయత్నము లొనర్చుచున్నాడు.

విజితావి, యతని బృందము నేడు శిఖితో మాటాడుట లేదు. అతడు కనుపించిన ప్రక్కకు దప్పుకొని పోవుచున్నారు. ఉదాత్తులు, ఉత్తములు నగు బ్రహ్మయువు, గుణస్వామి యతనికి నూతన మిత్రులైనారు. వారి సుస్నేహమువలన మఱల శిఖిశాతకర్ణి యుత్తమ బాలుడనిపించుకొనుచున్నాడు. దానికతడు గ్రంథభాండారమున నొనర్చుచున్న విశేషకృషి, బలవిద్యాప్రదర్శనములు సహకారులైనవి.

బుద్ధ జయంత్యుత్సవములలో విద్యార్థుల సమస్త ప్రజ్ఞా విశేషములను బరిశీలించి వారికి బహుమానములొసగు టాచారము. కొన్ని ప్రదర్శనములు జరిగినవి, మరికొన్ని జరుగవలసియున్నవి.

క్రీడాభూమి యంతయును జనసమ్మర్దముతో కళకళలాడుచున్నది. ఆచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి స్థానముల బలవిద్యా ప్రదర్శనమును జూచుటకై రంగ స్థలమునకు నాలుగు దిక్కుల గూర్చొనినారు.

"నీ విందులో బాల్గొనకదప్పదు. బహుమతి నీదే"నని ధ్వజకేతువు శాతకర్ణిని హెచ్చరించినాడు. "నీవు పాల్గొనుము. 'ఎందుకో నాకందు బ్రవేశింపనిష్టములే'దని శాతకర్ణి యతనితోననినాడు.'ఇతరులందఱును నన్ను బహిష్కరించినారు. ఇందరిలో నన్ను బలుకరించి నీ మంచి పేరును జెడగొట్టుకొనకుమని' ఖిన్న ముఖముతో నతడు బలికిన వాక్యము ధ్వజకేతును గలతపెట్టినది.

ఉఫ్. నీతో మాటాడక వారొక యుత్తమ మిత్రుని గోల్పోవుచున్నారు. నేను నా హృదయము చెప్పు నట్లొనర్చువాడను. ఇతరుల జూచి వెరచి సత్యము నాచరింప భయపడను. – శిఖీ! ఈ ప్రదర్శనమున నీవు బ్రవేశింపకదప్పదని ధ్వజకేతువతని నిర్బంధించినాడు.

"విద్యార్థులందఱును నన్ను గేలిచేతురని భయపడుచున్నాను."

"ఆ దుష్టుల గురించి నీవాలోచింపవద్దు. నీవు బాల్గొనకున్న నేనును బాల్గొనను".

"సోదరా! నన్ను బలవంత పెట్టవద్దు. నాకేమో సిగ్గుగ నున్నది."

"శిఖీ! నా మాట వినవా? తప్పదు. లెమ్ము! రంగస్థలమున బ్రవేశింప సిద్ధపడుమని జెప్పిన ధ్వజకేతు"వతనిని క్రీడాభూమికి గొనిపోయినాడు.

కార్యకర్త బ్రహ్మాయువు 'బలప్రదర్శనమున బాల్గొనువారు పదిమందియేనా?' యని ప్రశ్నించి ధ్వజకేతువు, శాతకర్ణుల వైపు చూచినాడు. 'మేమిరువురమును బాల్గొందుము' అని ధ్వజకేతువు వారి నామముల బ్రహ్మాయువునకు జెప్పి పత్రము వ్రాయించినాడు.

వారిరువురును మల్ల విద్యాప్రదర్శనకు యోగ్యమైన రూపములతో రంగస్థలమును బ్రవేశించినారు. విద్యార్థుల దృష్టి నాకర్షించి, సమయమునకై వేచియున్నారు.

ప్రదర్శనములు కొన్నిసాగినవి. చిల్లర విద్యార్థుల నందఱనేకశృంగు డోడించినాడు. నేడు రంగస్థలమున నలువురు మాత్రమే యున్నారు. ఏకశృంగుడు, కాత్యాయనుడు, ధ్వజకేతువు, శాతకర్ణి.

కాత్యాయనుడు ఏకశృంగునోడించినాడు. తరువాత కాత్యాయనుడు ధ్వజకేతువుతో పోరాడి యోడిపోయినాడు. ఇక నిలిచిన వారిరువురు మాత్రమే – ధ్వజకేతువు. శాతకర్ణి.

ధ్వజకేతువు పొడగిరి. శాతకర్ణి యించుక కురచ. కాని యతడు కాయపుష్టిగలవాడు. ఇరువురిలో నెవరికి విజయము చేకూరునో ముందు నిర్ణయించుట కవకాశము లేదు. శాతకర్ణి గెలుచుననియన్న నేమి ప్రమాదము జేకూరునో యని యెవ్వరు నతని పేరు బయటికి జెప్పుటలేదు.

ధ్వజకేతువు పోరాటమున మల్లబంధ ప్రావీణ్యమును జూపినపుడెల్ల – విద్యార్థులు సంతోష సూచకముగ గరతాళ ధ్వనులొనర్చు చున్నారు. అతనిచెవులలో నుత్సాహ వాక్యములు రింగుమని మార్మోగుచున్నవి. అతనికంటె నధిక నైపుణ్యమును శాతకర్ణి బ్రకటించి తప్పుకొని నపుడొక్కరును బలుకరు, అంతటితో నూరకున్నజాలును, గేలిచేసి వారతని నేడ్పించుచున్నారు. వారిమనస్తత్త్వమునకు ధ్వజకేతువునొచ్చుకొని యొకటి రెండుమారులు తానే శిఖిని బహిరంగముగ మెచ్చుకొనినాడు.

“ధ్వజకేతుని సంతోష పరచినట్లు శాతకర్ణిని విద్యార్థులెవరు నుత్సాహ పరచుట లేదు. నిజముగ నతడేమేటిమల్లు”డని అమృతవర్షోపాధ్యాయుడు ప్రక్కనకూరుచున్న కామాయిని భిక్కునితో ననినాడు.

“దీనికంతటికి వెనుకటి యాతని దుష్కృత్యమే కారణమైయుండు”నని యామె పలికినది.

ఆమె వాక్యము రంగస్థలమున నున్న శాతకర్ణి చెవులబడినది. ఒకమారు దీనముగ విద్యార్థుల నందఱజూచినాడు. వారు గేలిచేసినారు. అతనికి దుఃఖము వెల్లివిరిసి వచ్చినది. సహింపలేక జనమధ్యమున బ్రవేశించినాడు.

‘శాతకర్ణి పోరాటమును జాలించి బయటకు వెళ్ళిపోవుచున్నాడు.’

“వెడలి పోవుటలో నాశ్చర్యమేమున్నది? మనము మూర్ఖులవలె వ్యవహరించి యతనిని గేలిచేసినాము. నిరుత్సాహ పడినట్లున్నాడు”.

“అతడే మేటి మల్లుడు. అతనిచే పోరాడింపవలసినదే. మన కుత్సితము నతడు గ్రహించినాడు. మఱల రంగస్థలమును ప్రవేశింపడేమో!” – అను వాక్యములు విద్యార్థుల నుండి వినిపించుచున్నవి.

మంగళుడు శాతకర్ణి దగ్గఱకు వచ్చి ‘ఈ దుష్టులతో నీకేమి! ధైర్యము వహించి పోరాడి బహుమానమును బొందుము అనిచెప్పినాడు. శాతకర్ణీ! నీవు మల్లరంగమును వీడి పోవల’దని యుత్సాహముతో నమితాభుడు ప్రోత్సహించినాడు. శిఖి యామాటల లెక్కపెట్టక గుంపులోనికి వెళ్ళిపోవుచున్నాడు.

కార్యకర్త బ్రహ్మాయువు ‘ధ్వజకేతూ! నీవు గెలిచినట్లు విద్యార్థులకెరుక పరతు’నని నాడు. అందుల కతడంగీకరింపలేదు.

‘శిఖీ! ఈ పని యేమియు బాగుగ లేదు. నన్నవమానింపదలచినావా? యని కేక పెట్టినాడు. మిత్రునిమాట యతని చెవినిబడినది. కపోలముపై జారుచున్న కన్నీటి బిందువుల దుడుచుకొనుచు దగ్గఱకు వచ్చి ‘మిత్రమా! ధ్వజకేతూ! నన్నెందుకు పరీక్షించెదవు? నా మానసికస్థితి యనుకూలముగ లేదు’ అనినాడు.

‘నీవు పోరాడి బహుమానము పొందక తప్పదు. లేకున్న నన్నవమానింప దలచినట్లు భావింతును. అరుగో! నిన్నుత్సాహపరుప గయాశీర్షోపాధ్యాయులు రంగస్థలమునకు వచ్చుచున్నా’రని ధ్వజకేతువు పలికినాడు.

'నీకవమానముగ భావించిన దప్పక పోరాడుదును. కాని నా కానందము లేదు. అన్న వాక్యము గయాశీర్షుని చెవినిబడినది. “నీ కేమియును భయము లేదు. పోరాడు'మని యా యుపాధ్యాయుడు శాతకర్ణిని బుజ్జగించి దుఃఖోపశమనము గావించినాడు.

శాతకర్ణి మఱల రంగస్థలమున బ్రవేశించి యాక్రోశముతో బోరాడుచున్నాడు. మల్ల విద్యలో శిఖి కంతటి ప్రజ్ఞయున్నదని ధ్వజకేతువునకు బూర్వమెన్నడును దెలియదు. ఆకలిగొన్న కొదమసింగమువలె నతడు ధ్వజకేతువుపై లంఘించినప్పుడు విద్యార్థులిక నుత్సాహనినాదము లొనర్పక నూరకొనలేకున్నారు. ఒకమారతడు ప్రయోగించిన బంధ విశేషమునకు ధ్వజకేతువు పడబోయినాడు. అప్పుడు కరతాళధ్వనులు మిన్నుముట్టినవి. శిఖి ముఖమున నానందము పొడకట్టినది.

మిత్రునకు ప్రథమ బహుమానముపై నాశయున్నదేమోయని యూహించి తానోడి పోయినట్లని బ్రహ్మోయువుకు జెప్పి తాత్కాలికముగ ధ్వజకేతువు నొప్పించి శిఖి వెడలినాడు. నెమ్మదిగ జెప్పి ప్రథమబహూకృతి నతనికే యిప్పింపవచ్చునను నుద్దేశముతో ధ్వజకేతు వపుడంగీకరించినాడు.

ప్రేక్షకులు, విద్యార్థులు, నుపాధ్యాయులు రత్నోదధి భాండాగారమునకు ముందున్న విశాలస్థలమున జేరుకొనినారు. బహుమాన ప్రదాన సమయమున శాతకర్ణి పేరు బిలిచినప్పుడతడు రాలేదు. ప్రథమ బహుమాన మతనికిప్పించి ధ్వజకేతువు ద్వితీయ బహుమానమును తీసికొని, యిరువుర బహూకృతులతో శాతకర్ణిని వెదకుచు నివాసగృహకక్ష్యకు వచ్చినాడు.

శాతకర్ణి ప్రథమ బహుమానమును స్వీకరించుట కంగీకరింప లేదు. ధ్వజకేతువు నేను ద్వితీయబహుమానమును దప్ప స్వీకరింపనినాడు. కొంత సంఘర్షణ జరిగిన తరువాత 'ఈ రెండును మన బహుమానములు ఇరువురకును ప్రథమ ద్వితీయ బహుమానములు వచ్చినట్లు భావింతుమని సంధి జేసుకొనినారు'. ఈ వార్త నాలంద విద్యార్థులందఱలో బ్రాకి పోయినది. ఆ యిరువురు మిత్రుల ఖ్యాతి విస్తరించినది. అందు విశేషముగ శాతకర్ణి నేడు లోపరహితుడు. ఆచార్యులకు నుపాధ్యాయులకు బ్రియశిష్యుడు. కాని యతని దుఃఖమింకను బూర్తిగ నివారణ కాలేదు. కాశ్యపాచార్యుడింక నతనిని పూర్వగౌరవముతో జూచుట లేదు. క్రమముగ శిఖియా యాచార్యునకు బ్రీతిపాత్రుడైనాడు. కాని యతడింకను 'నిన్ను క్షమించినా'నని పలుకలేదు. నేడతడొనర్చుచున్న యత్నమంతయు దాని కొరకే.

# 6

భోజనాంతరము శాతకర్ణి వసతిగృహ కక్ష్యకు దిరిగివచ్చినాడు. అమితాభుడు మేల్కొని వెక్కివెక్కి రోదించుచున్నాడు. అతనికడ కేగి శిఖి శయ్యపై గూర్చొని దయతో, 'నెందు కేడ్చుచున్నా'వని బ్రశ్నించినాడు.

'వాని కదియొక రోగము. ప్రతిస్వల్ప విషయమున కెవరో పైనబడి కొట్టినట్లేడ్చును. ఈ సంగతి కామాయనీ భిక్కునికి జెప్పిన నీ మర్యాద దక్కనీయ'మని విజితావి, ఏకశృంగులనినారు.

'చిన్నవానిని జేసి మీరతని నేడ్పించుచున్నారా! జాగ్రత్త'యని కోపముతో శిఖియందఱ బెదరించినాడు.

'మాకు తెలియదు' ఉత్తరుడు, సుధానుడు ననినారు. నేనతని పల్లెత్తుమాట యనలే'దని విజితావి యనినాడు.

'పాపము! వాని కల్లబొల్లి యేడ్పులకు గరగిపోవుచున్నట్లున్నావు. పొట్టివానికి పుట్టెడుబుద్ధులు. వాడొనర్చు చిలిపితనము నీవే మెరుగుదువు. తొందరపడి సక్రమముగ బ్రవర్తింపకున్న నీకును 'కాయశుద్ధి' కాగల'దని ఏక శృంగుడు దుడుకుగ నుడుకుమోతు తనముతో బలికినాడు.

'నాయెడ మీరెట్లు ప్రవర్తించినను భయములేదు. చిదిమిన పాల్గారు నీ చిన్నవాని నిట్లేడ్పించుటన్యాయమా, లేక సభ్యమా? ఈ తడవ మీరితనిపై జేయిజేసుకున్న నేను సహింపను'.

'అమ్మో! భయము పుట్టుచున్నది. బావురు పిల్లివలె పైబడుదువు గాబోలు'నని విజితావి యనినాడు. 'సహింపకున్న మొనగాడివేమొనర్తు'వని పాదరక్ష నతనిపై కెత్తినాడు. వానిపై కలియబడి దానిని లాగుకొని దూరముగ బారవైచి 'ఉదయము వెదకితెచ్చుకొనుము' అని శిఖి యొళ్ళువిరిచినాడు. 'ఉదయము కానిమ్ము! నీకు తగినబుద్ధి చెప్పకున్న నా పేరేక శృంగుడు కాదన 'గోడపై వ్రాసుకొనననా?' అని శిఖి తిరస్కార భావముతో బలికినాడు. 'రేపుదయ మీ వెట్టివారు నన్నేమో యొనర్తురట! అమితా! ఈ దినమునకు మనము సుఖముగ నిద్రింపవచ్చును. ఏమి? మాటాడవు? నేను వచ్చునప్పటికి వీరు నిన్నేమి చేసినారు?' అని శిఖి యమితాభుని బ్రశ్నించినాడు. తెల్లవారిన తరువాత విశదీకరింతునని యతడు భయముతో సమాధానము చెప్పినాడు. నిద్రపట్టించుకొనుము. ఏకశృంగుడుగాని, మరియొకడుగాని నన్నేమి చేయగలరు?'

అని యతనికి ధైర్యముజెప్పి తనకక్ష్యకు బయలుదేరబోవుచున్నాడు. స్నేహపురస్సరముగ శాతకర్ణి హస్తములలో శిరముంచి అమితాభుడు బిట్టుగ రోదించినాడు. శాతకర్ణి బుజ్జగించి వెళ్ళిపోయినాడు. రాత్రియంతయు నమితాభునకు నిద్రపట్టలేదు. అతని తలగడ కన్నీటితో దడిసిపోయినది.

శిఖిహృదయము అమితాభుని దుఃఖకథ నెల్లవిన తహతహపడుచున్నది. ఉదయమే మేల్కొనిన తరువాత నమితాభుని మంచమునుండి బయటకు రమ్మనిపిలిచి వెంటబెట్టుకొని కొంత దూరమునకు దీసికొని పోయినాడు. శాతకర్ణి ప్రక్కన నడచు నపుడమితాభుడెంత యానంద మనుభవించినాడో చెప్పుటకవకాశము లేదు.

పది యడుగులు నడచిన తరువాత 'అమితా! నీకీ నాలందలో నివాసము సంతోషకరముగనున్నట్లు కనుపించదు. నిజమేనా?' అని శాతకర్ణి అమితాభుని బ్రశ్నించినాడు.

"ఔను. సంతోషము లేదు. విద్యార్థి సోదరులలో నెటజూచినను దౌష్ట్యము, నిర్దయ కనుపించుచున్నది. నా కక్ష్యలోనున్నవారందఱును నాయెడ నతినీచముగ బ్రవర్తించుచున్నారు. వారు పశువుల కంటెహీనులు, నాకు మిత్రుడన్నవాడు లే"దని అమితాభుడు దీనముగా బలికినాడు.

"నన్ను నీవు మిత్రునిగ నెంచుకొనుట లేదా?"

"నీవే యిటలేకున్న నేనిక్కడ నుండగలిగెడు వాడనే కాను" శిఖి పెదవులపై నొక చిరునవ్వు నర్తించినది. రాత్రి నేను శీలభద్రాచార్యుని యొద్దనుండి వచ్చుచున్నప్పుడు నీ కక్ష్యలో విద్యార్థులొక బరుపుచుట్టను లాగుచున్నారేమిటి? "అది పరుపుచుట్టగాదు. నన్నే యొక్క దుప్పటిలో జుట్టి నేలపైలాగి చివరకు వాతాయనమునుండి క్రిందకు బడద్రోసినారు.

'ఉ. మఱల నెట్లు కక్ష్యకు రాగలిగినావు?' 'వారిలో నొకడు వచ్చికట్టు విప్పి నన్ను నడిపించుకొని వచ్చినాడు. ఈ సంగతి నెవరికైన జెప్పిన నీ ప్రాణముల దక్కనీయమని వారు నన్ను బెదిరించినారు.

"ఎంత ప్రమాదము! వారిట్టి ప్రాణమోసములకు బాల్పడుచున్నా రన్నమాట!".

"ఇట్లు పూర్వమెపుడైన నొనర్చినారా?" "లేదు. కాని, యొకమారు కత్తిజూపినన్ను బెదరించినారు." "ఎందుకు?" "వారిచ్చిన మత్తుపదార్థమును దాగుట కంగీకరింప

లే”దని. “మత్తుపదార్థమా? – వారికెట్లు లభించినది?” “నాలందలో ఫలము లమ్ము నెపమున వచ్చి కొందఱుబేరగాళ్ళు వారికి దెచ్చిపెట్టుచుందురు.” “ఇట్టివి చెడ్డ యలవాట్లని నీవు వారితోనన లేదా?”

‘లేదు, భయపడియేమియు ననలేకపోయినా’నని సిగ్గుతో అమితాభుడు తల వంచుకొనినాడు.

‘అట్టి దుష్టకృత్యముల మనమేనాడైనా నెదిరింపవలయును’.

“బలవంతుడవు నీవేమైనా యొనరింపగలవు. – ఉపాధ్యాయుల కివన్నియును దెలియవు.” “తెలియజెప్పిన నేమగును?”

“ప్రాణములపై నాశ వదలుకొనిన గాని యిట్టిపని జేయరాదు.” “పొరబాటు పడుచున్నావు. ఏకశృంగుడు, విజితావి, సుధన్వాదులు నీవలెనే బలహీనులుగను, ధైర్యరహితులుగ నిచ్చుటకు వచ్చినారు. వెరగు పడుకుము. ముందెన్నడైన వారట్టి దుష్టక్రియలకు బూనుకొనిన వ్యతిరేకింపుము. బలవంతపెట్టిన ధైర్యము వహించి తిరుగబడు”మని చెప్పి శాతకర్ణి అమితాభునిచే బ్రమాణము చేయించుకొనినాడు.

ఉత్తమ శీలుర కళ్ళయెదుట నాలందలో నిట్టి దుష్కృత్యములు సాగిపోవుట కతడిష్టపడలేదు. అమితాభునెట్లైన వారి బారినుండి తప్పించి యీపవిత్రభూమిలో దుష్కృత్యములు సమస్తమును ధ్వజకేతువు, మంగళుల వంటి మిత్రుల సహాయముతో మాన్పింపవలెనని శాతకర్ణి కృతనిశ్చయుడైనాడు.

ఇరువురును మఱల వారికక్ష్యల జేరుకొనునప్పుడు శాతకర్ణి ‘అమితాభా! దుష్టుల బారినుండి దూరునొనర్చి రక్షింప భగవానుని బ్రార్థింపు’మని జెప్పి యతనిని పంపించినాడు. అతని కష్టముల జెప్పుకొని హృదయభారమును దీర్చుకొన నొక యాప్తమిత్రుడు దొరికినాడను సంతోషముతో నమితాభుడు కళకళలాడుచు కక్ష్యను బ్రవేశించినాడు.

## 7

సంవత్సరాంతము కొలది కాలములోనున్నది. విద్యార్థులకు శబ్దవిద్య పూర్తియైనది. కావ్య పాఠములు స్వల్పముగ మిగిలినవి. జాతకకథాగుచ్ఛము పూర్తి కావచ్చుచున్నది. ‘న్యాయద్వార తర్కము’న గావలసిన భాగములైనవి. విద్యార్థులు పరీక్షలకు శ్రమించి జదువుచున్నారు.

శిఖి శాతకర్ణి పాఠప్రవచనానంతరము విద్యామందిర కక్ష్యనుండి యమితానందముతో బయటకు వచ్చి 'రేపు మనకనధ్యయన'మనినాడు.

"శిష్టులెవరైన వచ్చుచున్నారా?" అని ధ్వజకేతువడిగినాడు.

"మొన్నటివలె అధ్యాపకుల వాగ్వివాదములు జరుగునా?" అని మంగళుడు బ్రశ్నించినాడు.

"లేదు. మన పూర్వవిద్యార్థి ప్రమతి యోగశాస్త్రమున నూతన బరిశోధనల నొనర్చి బిరుదము నొందినాడట. జీవిత పర్యంతమాతడు నాలందలో నుండి యతని పరిశోధనల గొనసాగించుటకు బాటలీపుత్రాధిపతి యొక పారితోషికము నేర్పాటుజేయించినాడు. ప్రమతి మహామేధావి. అతడు నేటివిద్యార్థుల కెల్ల నాదర్శమూర్తియని శీలభద్రాచార్యులుదయము నాతో ననినా"రని శాతకర్ణి జెప్పెను.

కంటక శిఖరమున విహారమొనర్ప నైదుగురు మిత్రులు మరునాడుదయమే బయలుదేర నిశ్చయించుకొనినారు.

"అయిన నీమాట మనమిత్రులు బ్రహ్మాయువు, గుణస్వాములకు దెలియునా? వారంగీకరింతురో లేదో?" యని మంగళుడనినాడు. వారిని గొనివచ్చు భారమునాపై బెట్టు"డని శాతకర్ణియనెను.

అశ్వశకటముపై కంటక పర్వతపాద ప్రదేశమును జేరుకొని సూర్యోదయారంభ వేళలో గొండనెక్కనారంభించినారు. వారైదుగురు నొక యున్నత శిఖరముపై దృష్టినిలిపి దాని నధిరోహింపవలెనని నిశ్చయించినారు. కొంతదూర ముత్సాహముతో కాలుసాగినది. త్రోవలో శాతకర్ణి ప్రకృతి రమ్యదృశ్యముల మిత్రులకు జూపుచు రమణీయమైన వ్యాఖ్యాన మొనర్చుచున్నాడు. గుణస్వామి చిత్రకారుడు. కొన్ని దృశ్యముల నిలిచి చూచుచు మనోగ్రంథమున వాని రూపముల లిఖించుకొనుచున్నాడు.

పర్వతారోహణ మారంభించి రెండు ఘడియలైనది. ఇంకను జేరవలసిన లక్ష్యము కడుదవ్వుగనున్నది. శాతకర్ణి, మంగళుడు, ధ్వజకేతువులు ముందు నడచుచున్నారు. వెనుక బ్రహ్మాయువు, గుణస్వామి నిలుచుచు వచ్చుచున్నారు. బ్రహ్మాయువునకు బర్వతారోహణము క్రొత్త, అత దలసిపోయినాడు.

"గుణస్వామి! నేను ముందుకు సాగిరాలేను. మీరు తిరిగి వచ్చునంతవర కిటకూర్చొండెదను. లేదా వెనుకకు మఱలి నెమ్మదిగ దిగిపోదును".

"నీ పాదములు తడబడుట గమనించినాను. నిన్ను ముందుకు నడిపించుట యుక్తముగాదని నాకును దోచుచున్నది. శాతకర్ణి యేమనునో!"

'శిఖీ' 'శిఖీ'! –

కరతాళధ్వనులొనర్చి గుణస్వామి ముందున్న వారి నాపినాడు. చేయూతనిచ్చి బ్రహ్మయువును వారిని జేరుకొనునంతవరకు నడిపించి యతడు "మిత్రుడు బ్రహ్మయువు బాగుగ నలసిపోయినాడు. అతని కన్నులు తిరుగుచున్నవి. అతనిని నెమ్మదిగ నడిపించుకొనుచు నేను దిగిపోయెదను" అనినాడు.

"నే నొంటిగ దిగిపోగలను. మీరందరును శిఖరమును జేరుకొనుడు. మీ యుత్సాహము భంగమగుట నా కిష్టములే"దని బ్రహ్మయు వనినాడు.

బ్రహ్మయువును క్రిందికి దింపుటకు బ్రతిమిత్రుడును దన్నర్పించు కొనినాడు. అందఱకును శిఖరమునకు జేరుకొనియట నుండి విశాల భూభాగమును, రమణీయ ప్రకృతిని దర్శించుకోరిక మిక్కుటముగ నున్నది. అదియునుగాక నాశిఖరమును జేరుకొనుట నాలంద విద్యాలయ విద్యార్థులొక వీరకృత్యముగ భావింతురు. ఆ కీర్తియును బోగొట్టు కొనరానిది. కాని వారిలో నొక్కరికిని కీర్తిపై నభిమానము లేదు. స్వార్థ త్యాగమే వారి జీవితలక్ష్యము.

బ్రహ్మయువు నెవరు ననుసరింతురను సమస్య తేలలేదు. అందఱును "నేను నే"నని ముందుకు వచ్చిన చిక్కు తీర్చునది ఎవరు? ఒక భూర్జపత్రము నైదు విభాగము లొనర్చి వానిలో నాల్గింటిపై "సిరి" వ్రాసి యొక దానిమీద బుద్ధపాదము నుంచి యెగురవైచినారు. బుద్ధపాదమున్న పత్రఖండము నెత్తుకొనినవారు బ్రహ్మయువు ననుసరింపవలెనని నిర్ణయము.

ధ్వజకేతువు "బుద్ధపాదము" నెత్తుకొనినాడు. అవసరమగు భోజన పదార్థమును దీసికొని యతడు బ్రహ్మయువుతో పర్వతము నవరోహింప నారంభించినాడు. పదియడుగులు ముందుకు సాగలేదు. వెనుకనుండి బ్రహ్మయూ! పాపమా అమితాభుని నీకక్ష్యలో జేర్చుకొని చదివించుము. అతడు కడు మంచివాడు. దుష్టులలోబడి బాధపడుచున్నా"డని శిఖి పలికినాడు.

"నీవు చెప్పినట్లే యెనర్ప యత్నింతును. ప్రస్తుత మతడేస్థితిలో నున్నాడో!"

"ఏ స్థితిలో నున్నను నీకతని విషయమున శ్రద్ధ వహింపకతప్పదు. అతడతి సాధువు. కక్ష్యలోని విద్యార్థులందఱు నతనిని నీచముగ జూచుచున్నారు. మృగ

మాఏకశృంగుడతని నెంతకష్టపెట్టుచున్నాడో మీతో జెప్పవలెననుకొనినాను. వీలున్న నతనిని నీకక్ష్యలోనికి మార్పించుకొనుము. నా కక్ష్యకు జేర్పించుకొందమన్న నన్ను శీలభద్రులు కొంత కాలము వారి సేవకు వినియోగించినా'రని శాతకర్ణి యనుపస్థితిని వెల్లడించినాడు.

"కామాయనీ భిక్కునితో నీనాడే తప్పక యతనిని గుఱించి మాటాడెదను. అతనిని నా కక్ష్యకు మార్పింతును".

"అమితాభుని విషయమున శ్రద్ధవహించుట వలననతడు బ్రతికి బయటపడ గలడు. పృథువువైన నీకది ముందు ప్రయోజనకారి కాగలదు".

శిఖి శాతకర్ణి నాలందకు వచ్చి విశేషకాలము కాలేదు. కాని యతని శీలముత్తమము, వాక్యములు సత్యయుతములు సాహసోపేతములు. ఇంతవరకు పృథువులై యుండి ధ్వజకేతువు, బ్రహ్మాయువు నిట్టి కరుణకృత్యముల నెన్నడును దలపెట్టలేదు. శాతకర్ణి ప్రేరేపించి కర్తవ్యపాలనమున కుద్యుక్తుల గావించినందుకు వారిరువురును హృదయములనతని గౌరవించిరి.

మిగిలిన ముప్పురు మిత్రులును ముందుకు సాగిపోయినారు. కొంతదూరము మార్గము బాగుగనున్నది. తరువాత కొంతదూరము వారు బ్రాకి పోవలసివచ్చినది. కష్టపడి వారు గిరి శృంగమును జేరుకొని సమతలమున గొంతసేపు సంభాషించుకొనినారు. నాలందలో విద్యార్థులు మున్నెన్నడు నొనర్పని సాహసకృత్య మొనర్చినామన్న విజయగర్వము వారి ముఖములలో నిండుకొనియున్నది.

మధ్యాహ్న భానుని గ్రమ్ముకొని మేఘములు వారికి శీతలత్వమును జేకూర్చుచున్నవి. చల్లనిగాలి వీచుచున్నది. వారుత్సాహముతో కేకిసలు గొట్టుచు లోయలు ప్రతిధ్వనింప గీతిక లాలాపించినారు. కేకలు బెట్టినారు.

అదిగో! ఆ మేఘమాలిక లెంత రమణీయములుగ నున్నవి! మనపై నెండకాయుచున్నాడని సూర్యుని ముందుకు సాగి రానీయకుండ యతనిపై జైత్రయాత్ర కేగుచున్నట్టున్న'వని శాతకర్ణియనినాడు.

"శిఖీ! అటు చూచినావా? కారు మొగులెట్లు క్రమ్మివచ్చుచున్నవో! వర్షించి సెలయేరుల బారించిన మనము మరల విద్యాలయమును జేరుకొనగలమా?" అని మంగళుఁడనినాడు.

“శిఖికి నట్టి యూహాయే దోచినది. తానధైర్యపడిన మిత్రులిరువురు భయగ్రస్తులగుదురు. ‘ఈ పొగమబ్బులు క్షణములో మటుమాయము కాగలవు. అయినను మన మది క్రమ్ముకొని వచ్చులోపల నీ శిఖరము దిగి యాసమతలముపై జేరుకొనుట యుక్త”మని జెప్పినాడు. వారు కొంతదూరము దిగివచ్చినారు.

మేఘములు దట్టముగ క్రమ్ముకొని వచ్చుచున్నవి. క్షణములో చిమ్మచీఁకటులు చెలరేగినవి. దారితెన్నులు తెలియుట లేదు.

“మనము నడచునది క్రమమైన మార్గమేనా శిఖీ!” దారితప్పినట్లు నాకనుమానముగ నున్నది.”

‘దారి తప్పినామా?– మనము శిఖర మెక్కిన త్రోవన దిగినట్లు లేదు” అని మంగళుఁడు భయమును వెలిబుచ్చినాఁడు.

‘ఈ లోయ దిగి యవతల శిఖరము జేరుకొన్న మనకు ముందుదారి కనుపించును’.

ఆ పర్వతశ్రేణిలో నెక్కడనో వర్షము క్రుమ్మరించినట్లున్నది. గద్గదళన ధ్వనులతో సెలయేఱులు పారుచున్నవి. ‘ఇక మనము ముందుకు సాగుట ప్రమాదము. అదిగో వర్ష మారంభమైన”దని మంగళుఁడనినాఁడు.

కుంభవృష్టికురియుచున్నది. బాలురుముద్వురును దడిసి పోయినారు. ఎటుజూచిన నొకసెలయేఱు వారిని బంధించి పర్వులెత్తుచున్నది. ‘భగవానుని నమ్మి ముందుకు సాగిపోవుటయే మనకర్తవ్యమని యొకరిచేయి యొకరు పట్టుకొని పదియడుగులు వేసినారు. వాన వారి నడుగుదీసి యడుగు బెట్టనీయలేదు.

ఎదురుగ గనబడుచున్న శిఖర మెక్కిన దారికనబడునని వారాశించినారు. చేరుకొని జూడ నాపర్వత మేటవాలుగసాగిపోయినది. బడలికచే చలిలో గడగడ వణుకుచు నా వర్షమున క్షణకాలమట విశ్రమించినారు. ‘ఆ మబ్బుతెర తప్పువరకు మనమిట ధైర్యముతో నున్నజాలును. దానిశక్తియైపోయినది. భగవంతునియిచ్ఛ యెట్లున్న నట్లుజరుగును. భయపడి యేమి ప్రయోజనము?’ అని శాతకర్ణి మిత్రులిరువురకు మఱల ధైర్యము జెప్పినాడు.

ఇంతలో నొక వెలుతురుపాయ యాకసమునఁ బొడకట్టినది. వారి హృదయమున నాశారేఖలుదయించినవి. కాని మఱుక్షణముననే యవి మటుమాయమైనవి.

శాతకర్ణి సహజమైన ధైర్యమును గోల్పోలేదు. "మిత్రులారా! నేనీ శృంగమును నొంటరిగ దాటి యెవరినైన దెలిసిన వారి బిలచుకొనివత్తును. మనకు మరియొక మార్గము లేదు. జీఁకటి బడుచున్నట్లున్నది. వర్షమాగినను రాత్రి యీ పర్వత ప్రదేశముల నుండుట ప్రమాద'మని శాతకర్ణియనినాఁడు.

"నీవైన నట్టి సాహసమునకు బూనుకొనకుము. అది ప్రమాదకారి. శృంగమెంత యేటవాలుగ నున్నదో నీవు గమనించినట్లు లేదు".

'లేకున్న మన మీరాత్రి గడచి బ్రతుకుట దుర్లభ'మని శిఖి దిగుట కారంభించినాడు. గుణస్వామి రోదింప నారంభించినాఁడు. "మిత్రుఁడా! నీ దుఃఖముతో నన్ను బంధింపవల'దని వారించి మంగళునితో 'ధైర్యము కోలుపోకు'డని జెప్పి – శాతకర్ణి దిగిపోవనారంభించెను.

వర్షము కొంత వెనుకబట్టినది. కాని జీఁకటి తగ్గలేదు. సూర్యాస్తమయమై పోయినట్లున్నది. రెండు మూడు క్షణములైన తరువాత శాతకర్ణి భగవత్ప్రార్థనా గీతములు మిత్రులకు వినిపించుట లేదు.

సాహసముతో శాతకర్ణియొక మార్గమును బట్టి కొంతదూరము నడచి యొక మెలిక తిరిగినాడు. అతనికొక క్రమమైన మార్గము కనిపించినది. కొండ మొదటికిజేరి విచారింప నస్తమయమై ఘడియ దాటినదని దెలిసినది. వర్షమాగినది.

ఆ పర్వతపాద ప్రదేశమున నున్న గ్రామము జేరుకొని మొదటి గుమ్మము కడ నిలచి 'ఈ కొండపై నన్నిమార్గములతోబరిచయముగలవారెవర'రని బ్రశ్నించినాఁడు. ఆ యింటి యజమాని యతనికి 'పిండికుఁ'డను పర్వతకుని గృహమును జూపించెను.

పిండికుఁడు కంటకపర్వత శ్రేణులతో విశేష పరిచయముగల వాఁడు. పశు పాలకుఁడు. శాతకర్ణి కరుణకథ విని యతడు శిఖిమిత్రులను క్షేమముగ దింపి నాలంద మార్గమును జూపింతునని యభయమిచ్చెను.

"అయిన నాలస్య మొనర్పకుము. నీ కష్టమును మేముంచుకొనము".

"ఆ ప్రశ్న లేదు. విద్యార్థులు మీరు చిక్కుపడినారని కావలసిన సాధన సామగితో నతడు బయలుదేరినాడు. శాతకర్ణి దారిజూపింప పిండికుఁడతని ననుసరించినాడు. కొంత దూరము నడచిన తరువాత పిండికుఁడు దగ్గర దారిని జూచి శాతకర్ణి మిత్రులున్నచోటకి నడిపించు చున్నాఁడు.

"శిఖీ! శిఖీ!" యను కేకలు వినిపించినవి.

"అరుగో నా మిత్రులు దగ్గఱలోనున్నారు".

"మంగళా! స్వామీ?"

"ఇటు, ఇటు".

ముప్వురు మిత్రులును మఱల కలుసుకొనినారు. సహాయము లభించినది. వారు వేగముగ పిండికుఁడు కొనివచ్చిన యల్పమగు నాహారమును స్వీకరించినారు.

"మార్గము క్లిష్టమైన నుదయము దిగుదము".

"రాత్రి నిద్రించుట యతి ప్రమాదము".

నాలందకు నాముప్వురు బాలురున్న స్థలమునుండి ప్రయాణమతి భయంకరమైనది. పిండికుఁడు త్రాటితో మంగళ, గుణస్వాముల నడుముల బిగించి రొండికి కట్టుకొనినాడు. శాతకర్ణిని జాగరూకతతో వెనుక నడువుమని చెప్పి యతఁడు ముందు నడుచుచున్నాడు.

చీఁకటి కొలది కాలముండిపోయినది. కుఱువెన్నెలవచ్చినది. సెలయేఱు లడ్డము వచ్చిన చుట్టు దిరుగుచు, ప్రాకుచు, వారు కొంతదూరము నడచినారు. దుర్గమ ప్రదేశముల శిఖి గుణస్వామి నెత్తుకొనినాడు. మంగళుఁడు ధైర్యము దెచ్చుకొని నడచినాడు. మిత్రుడెక్కడ తప్పుటడుగు వేయునోయని జాగరూకతతో శాతకర్ణిని కనిపెట్టుచున్నాడు.

అనతికాలములో వారు నాలందమార్గ ప్రారంభమును జేరుకొనినారు. విశేషముగ ప్రొద్దుబోలేదు. 'అమ్మయ్య! బ్రతికినాము' అని ధైర్యముతో మంగళుఁడు దీర్ఘ నిశ్వాస మొనర్చెను. వారికిదూరముగ నాలంద చైత్య గృహమునందలి యాకాశదీపము కన్పించినది. ఆ వంకకు దిరిగి నమస్కరించినారు.

పారితోషికముగ శాతకర్ణి పిండికునకు గొంతధన మీయనతడెంత బలవంత పెట్టినను గ్రహింప నంగీకరింపలేదు. శిఖి జ్ఞాపకార్థముగ దన మొలలోనున్న చిఱుకత్తి నతనికిచ్చి యతని యనుమతితో నాలందమార్గమున మిత్రులగూడి పయనించినాడు.

ఉత్తర ద్వారమును జేరువేళ కర్ధనిశీథమైనది. శీలభద్రాచార్యుఁడు విద్యార్థి మిత్రుఁలెంతకును దిరిగి రానందున వెనుదిరిగి వచ్చిన ధ్వజకేతువు, బ్రహ్మాయువుల వలన శాతకర్ణి యతని మిత్రులవార్త విని యాతురతతో నట నిలువబడియున్నాడు.

శాతకర్ణి గురుదేవునికి నమస్కరించి వారికథ చెప్పెను.

అతని భుజముపై దట్టి "నీవువీరుఁడ"వని యాచార్యుఁడభినందించినాడు. నూతన విద్యార్థులనేకులతని సగౌరవముగ ప్రోత్సాహముతో సంభాషించినారు. గయాశీర్షుని నమస్కరింప 'నిన్నుజూచి గర్వించుచున్నా'నని యతని నొక చిఱునవ్వుతో నాశీర్వదించినాడు 'మఱల నెన్న డిట్టి సాహస ప్రదేశములలో బయనింపవల'దని యాదేశించినాడు.

ఆచార్య కాశ్యపు డేకాంతమున నతనితో "వెనుక నొకదోషిగ నిన్నుచూచినాను. ఈనాడు నీవు విద్యార్థులలో సాహసి వనిపించు కొనినావు. కొలదికాలము నుండి నీలో మార్పు వచ్చినదని వినుటకు నాకమితానందముగ నున్నది"అని నాడు.

శాతకర్ణి భరింపరాని సంతోషముతో నతనికి బాదాభివందన మాచరించినాడు.

## 8

పరీక్షలందు బ్రథమ శ్రేణిలో నుత్తీర్ణులగుటకై విద్యార్థులు విశేషముగ గృషి యొనర్చుచున్నారు. శిఖి యొక దినమైన వృథాబోనిచ్చుట లేదు. శరీర స్వాస్థ్యము లేక నేదినమైన బాఠము వినకున్న గయాశీర్షుని యింటికేగి ప్రత్యేకముగ నతఁడు జెప్పించుకొనుచున్నాడు. రాత్రింబవళ్లు నిద్రాహారము లెఱుగక నతడొనర్చిన విద్యాశ్రమకు దగిన ఫలితమేమికానున్నదో!

గడచిన సాయంత్రముతో బరీక్షలైపోయినవి. ఆచార్యులు నుపాధ్యాయులు, ఫలితాంశములు వెల్లడించుటకు ముందు సభలుగావించి సంప్రదింపులు జరిపినారు. ఉత్తీర్ణతకు కేవలం విద్యావైదుష్యములు చాలవు. వారి విద్యాబుద్ధులు, నీతి నియమము దానికి తోడ్పడును. రత్నోదధి గ్రంథ భాండాగారమునకు ముందున్న స్థలమున సాయంతన వేళ పెద్ద సభ జేసినారు. ఫలితాంశముల విన గుతూహలముతో విద్యార్థులందఱునట జేరినారు.

ఉన్నత వేదికపై శీలభద్రు లుపవిష్టులైనారు. గయాశీర్షుఁడు, మౌద్గల్యాయనుఁడు, కాశ్యపుఁడు, అమృతవర్షుఁడు, ధారాపీయూషుఁడు మొదలైన యాచార్యులు, నుపాధ్యాయులు వారి స్థానముల నలంకరించినారు.

శిఖి శాతకర్ణి యతని కక్ష్యలో బ్రథముడుగ నుత్తీర్ణుడైనాడు. మంగళుని కక్ష్యలలో నతడు ప్రథముడు. ధ్వజకేతువు ద్వితీయుఁడు. 'ప్రమతిని' నాలంద ప్రథమ విద్యార్థిగ

బట్ట భద్రులొనర్చినారు. ఆచార్యులు స్నాతకోపన్యాసమొనరించిన పిమ్మట సభ ముగిసినది.

మఱుసటి దిన ముదయమైనది. విద్యార్థులు స్వగ్రామముల కేగుచున్నారు. నాలంద నాల్గుద్వారముల కడ జనసమ్మర్దము విస్తారముగ నున్నది. కుమారుల గొనిపోవ కొందఱు తండ్రులు విచ్చేసినారు. అనాథ బాలురు నాలందలోనే యాచార్యుల యొద్ద నివసించుట కేర్పాటు జరిగినది.

శిఖి సెలవులలో నింటికేగక నమృతవర్షునికడ బ్రత్యేక పాఠముల జదువుకొన దలచినాడు. కాని మంగళుఁడతనిని 'పదిదినముల సెలవులు మాయింట గడుపుదువు ర'మ్మని యాహ్వానించినాడు. మిత్రునకు గోపమువచ్చునేమో యని యతఁడంగీకరించినాడు.

"మంగళా! నీమాటను దీసివేయలేక వచ్చుటయే. కాని నాకు నాలందలోనే యీ కాలము గడుపవలెనని యున్నది."

"మఱుసటి సెలవుల కట్లే చేయువచ్చును. నన్ను తృప్తిపఱచుటకై నీవంగీకరించినందుకు సంతోషము."

విద్యార్థులందఱును వెళ్ళిపోయిన తరువాత మంగళుఁడు శాతకర్ణితో స్వగ్రామమునకు బయనమైనాడు. అతడు దరిద్రుఁడు. ఆ కారణమున వారు ఖరరథముపై బ్రయాణ మొనర్ప వలసి వచ్చినది. అతడు నిర్ధనుడని గ్రహించిన నేమనుకొందురోయని యతనికి జెప్పరాని యభిమానము.

'మన రథము నెవ్వరును జూచుట లేదు గద? యని మంగళుడు శాతకర్ణిని బ్రశ్నించినాడు.

"జూచిన వచ్చు లోపమేమున్నది? అందుకింత తత్తరపడెదవేల'? యని యతడు బలికినాడు.

రథము కొంతదూరము సాగినది.

వెనుక నొక 'మృగరథము' వచ్చుచున్నది. 'శిఖీ! మనబ్రతుకు బయటపడినది. అదిగో! ఏకశృంగుని మృగరథము. వానినోట నువ్వుగింజయు దాగదు. తిరిగి వచ్చిన తరువాత నా ధనమదాంధుడు నలువురకు జెప్పి నన్నేడ్పించును.' అని మంగళుఁడు

చిన్నబుచ్చుకొనినాడు. శాతకర్ణి "మిత్రుఁడా! నీ వింతటి వ్యర్థుడవనుకొనలే"దని శిఖి గర్భితముగ ననివాడు.

మంగళుని ఖరరథమును జూచినంతనే ఏకశృంగునికి గడుపుబ్బ నవ్వువచ్చినది. ఎప్పుడు తిరిగివచ్చి మిత్రులజేరి యాఖరరథమును వర్ణించి యేడ్పించుదునా యని యతఁడుబలాట పడినాడు.

'అదిగో! దూరముగ నావనమునకు వెనుక నున్నదే మా గ్రామము. అంత నిష్ప్రయోజనమైనది మరి యీ దేశమున నెచ్చటను గన్పింపదు. చూచిన పగలు మండిపోవుచున్నట్లుండునని మంగళుఁడు స్వగ్రామమును గుఱించి శాతకర్ణికి జెప్పినాడు.

"ఏమైననది నీకు జన్మభూమి గదా! అట నివాసమున నీకు సంతోషముండక తప్ప'దని శాతకర్ణియనినాడు.

రాచబాట గడచి రథము డొంకబట్టినది. కొలది దినముల క్రితమే మూడు నాల్గు దుక్కుల వర్షము పడుటచే దారియంతయు బురదగ నున్నది. ఖరములు లాగలేకున్నవి. "మంగళా! వాటిని బాధపెట్టుటకంటె నీ కొంచెము దూరమును మనము నడుచుట మంచిది గదా" యనినాడు.

ముందు మిత్రులిరువురును నడచుచున్నారు. వెనుక రథము వారి మూటలతో వచ్చుచున్నది.

ఖరరథముతో వారిరువురు మంగళుని కుటీర ద్వారముకడ నాగినారు. పిలుపువిని యతని తల్లి సునీథాదేవి కాళ్ళకు నీళ్లుదీసికొని వచ్చినది. పాదప్రక్షాళన మొనర్చి మంగళుఁడు, శాతకర్ణితో నింటిలో బ్రవేశించినాడు.

"ఇతడు నా మిత్రుడు శాతకర్ణి" అని శిఖిని తల్లికి బరిచయము జేసినాడు. 'శిఖీ! మేము పేదవారమని నీకీపాటి కర్థమైయుండును. మా యింట సేవకులుండరు. మూటలు లోపల తెచ్చి పెట్టెదను. కొంచెము విశ్రమింపు'మని యరుగుపై బరచియున్న చిరిచాప జూపించినాడు. 'నేనును నీకు సాయమొనర్తు'నని శాతకర్ణి వెంట బయలుదేరినాడు.

సర్దుకొనుట పూర్తియైనది.

కుమారుఁడు మిత్రునితోననినమాటలకు సునీథా దేవి హృదయము కలతనొందినది. ఆమె వచ్చిన బాలకుఁడు ధనికకుటుంబమునకు జెందినవాఁడని గ్రహించినది. సాయశక్తుల నాతని సంతోషపెట్ట మనమున నిశ్చయించుకొనినది.

"మా మంగళుఁడు పేదఱికమునకు సిగ్గుపడుచున్నట్లున్నాడు. అదియొక దోషము కాదని గుర్తించినట్లు లేదు. నాయనా శిఖీ! మాయింట నెట్టిలోపములున్నను నీవు లెక్క పెట్టవద్దు".

"అమ్మా! మంగళుఁడు నాకు సోదర ప్రాయుడు. అతని గృహము నా గృహమే"యని ప్రియపూర్వకముగ శాతకర్ణి ప్రత్యుత్తరమిచ్చెను.

ఏకాంతమున తల్లితో 'అమ్మా! మనము పేదవారమని యంగీకరించుట నీకంతరోష మెందుకు? అని కోపముతో బలికినాడు.

'మంగళా! మన నిర్భాగ్య ప్రశంసయొనర్చినవాడవు నీవే కదా! పేదఱికము భగవదేచ్ఛ. ఈ విషయమును నీవేనాటికైన గ్రహింతువు. దానివలన కొన్ని సుగుణములబ్బును. సౌఖ్యము లభించును. దాని గుర్తించుటకు జ్ఞాననేత్ర మవసర'మని సునీథాదేవి కుమారునకు బుద్ధులు చెప్పినది.

ఈ ప్రసంగము శాతకర్ణి చెవులబడినది. నాలంద జీవితమున మంగళుఁడెంతమంచివాడు! ఇంటియొద్ద నతఁడిట్లు ప్రవర్తించునని శిఖిమున్నెన్నడు నూహింప లేదు. గౌరవ ప్రేమల బ్రకటించి పూజింపవలసిన మాతృదేవతను మిత్రుడు మాటిమాటికి దిరస్కరించుట యతనికి నచ్చలేదు. ఆతఁడాశ్చర్యపడినాడు.

విభేదభావములేక కుమారునకు, శాతకర్ణికి నన్నపానముల జేకూర్చియిచ్చిన సునీథా దేవిపై నతనికి గౌరవభావమేర్పడినది. ఆమె యౌదార్యము నిరుపమానమైనది. ఆమె ముఖము శాంతిదేవతకు నిలయము. ఆమె సదాచారపుంజము.

మిత్రుడు మంగళునితో సునీథాదేవి యున్నతిని బ్రశంసించినాడు. వ్యంగ్య గర్భితముగ నామెను గౌరవింపుమని యాదేశించినాడు.

'మంగళా! మీయింట నివసించుట నాకు మహానందమును గల్గించినది. మీ మాతృదేవత చూపించిన యనురాగమునకు నేను ముగ్ధుడనైనాను. నీవామెను గౌరవింప నింకను నేర్చుకొనవలసి యున్నది".

చివర వాక్యమును వినిపించుకొననట్లు ప్రవర్తించి “శాతకర్ణీ! నీ వాక్యము వినుటకు నాకెంతో సంతోషముగ నున్నది. ఈ గ్రామమున నొక కుటీరములో నిరంతరము నివసింప వలసివచ్చిన నీవంగీకరింతువా?

“నిశ్చయముగ దాని నొక సౌఖ్యభూమిగ నొనర్పయత్నింతును”.

“అప్పుడు నీయత్నము కేవలము మృణ్మయమును ముద్దజేసి స్వర్ణపిండమని భావించుటయే యగును”.

మిత్రునికి సౌఖ్య స్వరూప మెట్టిదో యర్థము కాలేదు. అందుకు గొంతకాలము పట్టునని తలపోసి శాతకర్ణి సంభాషణమును మరియొక నూతనాంశమునకు మార్చినాడు.

పది దినములు సంతోషముతో గడచినవి. సునీథాదేవి యాశీర్వాదముతో నా మిత్రులిరువును మఱల నాలందకు బయనమైనారు.

## 9

సకాలమునకు నాలంద జేరుకొనవలెనని మిత్రులిరువురును నిశ్చయించుకొని బయలు దేరినారు. కాని మార్గమధ్యమున గొన్ని చారిత్రాత్మక ప్రదేశములున్నవి. వానిలో రాజగృహమతి ముఖ్యమైనది. దానిని దర్శించుటకొక దినము పట్టినది. మూడుదినము లాలస్యముగ జేరుకొనినారు.

వారి నాహ్వానింప నుత్తరద్వారముకడ సుజాతుడు, బ్రహ్మాయువు కొంతదూర మెదురు వచ్చినారు. ధ్వజకేతువు, గుణస్వామి ద్వారముదగ్గఱ నున్న తోరణ శిల్పఖండముల బరిశీలించుచు వారి కొఱకు నిలచియున్నారు.

ఆచార్యులు, నుపాధ్యాయులు తిరిగి వచ్చిన విద్యార్థుల యోగక్షేమముల, వారి తల్లిదండ్రుల మంచిచెడ్డల సంభాషించినారు. గృహపరిసరములు, వారి బంధు, మిత్ర, స్వరూప స్వభావములు విద్యార్థుల భావనావీథులనుండి యింకను దొలగి పోలేదు. ఇంటి నుండి నూతనోత్సాహముతో, నవానందముతో, నూతనాశయ లక్ష్యములతో వారు తిరిగి నూతన వ్యక్తులవలె వచ్చినారు.

నాలంద నివాసకక్ష్యలలో మార్పువచ్చినది. నేడు శిఖిశాతకర్ణి ఆచార్య కాశ్యపుని ప్రత్యేక మందిరమున నుండి కొంతకాలమాయనకు బరిచర్య యొనర్పవలసియున్నది. మంగళుఁడు వినయవిహారమున ద్వితీయ కక్ష్యలో నివసింపవలెను. కంటక విహారమున

బ్రహ్మాయువు నివసింపవలెను. మంగళుఁడు ఛన్న విహారములో నేకశృంగ విజితావులతో నుండవలెను.

కొలది కాలమునకే మంగళునికి, శాతకర్ణికి మధ్య మనస్పర్ధలేర్పడినవి. ఇరువురకును మిత్రులైన విద్యార్థులెంత యత్నమొనర్చిననవి సమసిపోలేదు. తన పేదఱికమును శాతకర్ణి విద్యాలయములో నందఱకును వెల్లడించినాడని మంగళుని యనుమానము. కాని శిఖి యేమియు నెఱుగడు. లేకున్న విజితావికెట్లు తెలిసినది? ఏమైననేమి?

తల్లియెడ మంగళుని ప్రవర్తనము శాతకర్ణి కణుమాత్రమును నచ్చలేదు. ధైర్యముతో నామెను మన్నింప నేర్చుకొనుమని యతనికి జెప్పినాడు. ఇంతకు బూర్వము శాతకర్ణికి మంగళుఁడు పరమమిత్రుడు. నేఁడాతనికి ధ్వజకేతువు ప్రథమమిత్రుడు. బ్రహ్మాయువు ద్వితీయ స్థానము నొడుచుకొనినాడు. శాతకర్ణి మిత్రత్వమున నేఁడతనిది తృతీయస్థానము. ఇట్టి పరివర్తనమును మంగళుఁడు సహింపలేకపోయినాడు. పూర్వమతనిపై జూపు ననురాగమును నేడు నాలందలో నుపాధ్యాయవర్గము శిఖిశాతకర్ణికి గట్టబెట్టుచున్నది.

శాతకర్ణికిని గష్టములు లేకపోలేదు. అవి ప్రధానముగ సాధువగు నమితాభునికి సాయపడుట వలన గలిగినవి. అయిననతడు వానిని లక్ష్యపెట్టుట లేదు. విజితావి, ఏకశృంగుల బారినుండి వానిని దప్పించుటకతఁడు బద్ధకంకణుఁడైనాడు. ఈ విషయము వారికిని దెలిసినది. అతఁడున్న వేళల వారు వానిజోలికి బోవుటలేదు. అతఁడు కాశ్యపుని యింటికి బయనమైన మఱుక్షణమునుండి ప్రతి నిత్యమతని నేడ్పించుట వారికి బరిపాటియైనది.

గాఢనిద్రలో నున్న అమితాయువు నెవరో బంధించినారు. అతఁడు చుట్టనుండి విడివడి తన్నుకొనుచున్నాడు. ఇట్టి దుష్కృత్యమునకు 'పశుబంధ'మని నాలంద విద్యార్థులలో వ్యవహారనామము. పశుబంధమున జిక్కుకొనిన అమితాభునికాలి కొక త్రాడుగట్టి లాగునపుడెల్ల నతడు కెవ్వున కేక బెట్టుచున్నాడు. అవి క్రమముగ బెద్దవి గాజొచ్చినవి. భూతముపైబడి పీకినట్లు అమితాభుఁడు పెద్ద బొబ్బపెట్టినాడు.

ధ్వజకేతువు త్రుళ్ళిపడి లేచి 'ఏమది అమితాభా!' అని లేచికూర్చొనినాడు. ఆ మాటవినిన నతని నోట మాట రాలేదు. మఱల నొక బొబ్బపెట్టినాడు. ధ్వజకేతువు నిదురమత్తు వదలించుకొని ద్వారముకడకు వచ్చి చూచినాడు. అతనికి అమితాభుని

కాలికిగట్టిన త్రాడు కనిపించినది. దంతకాష్ఠముల కుపయోగించు కత్తితో దానిని త్రెంపినాడు.

ఏకశృంగుడు, విజితావి – యిరువురు మిగిలిన త్రాటి ముక్కతో ద్వారదేశమున వెల్లికిలబడినారు. లేచివచ్చి చూచువేళకు ధ్వజకేతువు 'పశుబంధనము' నుండి అమితాభుని విప్పి తప్పించినాడు.

అదుష్టులిరువురు నంతటితో బోలేదు. ధ్వజకేతువును బెదరింపదలచి లోపలికి వచ్చినారు.

"ఏమిటా దుష్టచేష్ట! విద్యాలయములో మీ వంటి మూర్ఖులుండుటకు వీలులేదు. మీ చరిత్ర సమస్తమును మా పృథువులకు దెలిసినది. మీ సంగతిని త్వరలో తేల్చెదము" అని ధ్వజకేతువు వారితో ననినాడు.

వారిరువురు నతనిని రూక్షముగ జూచి "జాగ్రత్త"యన్నట్లు సంజ్ఞ యొనర్చినారు. ధ్వజకేతువు రౌద్రమూర్తియై "దుష్టులారా! ఇక తొలగిపొం'దని కేక బెట్టినాడు.

నిదురమత్తు గొంతుకతో 'ఏమదిధ్వజకేతూ!' అని యుత్పలుఁడు లేచివచ్చినాడు. 'ఈదుష్టులిరువురు నమాయకుని జేసి మన యమితాభుని పశుబంధన మొనర్చినారు'. 'సిగ్గు సిగ్గు – పశుబంధనమా?'

'ఈవిషయమును బయటపెట్టిన మీ ముప్వుర ప్రాణములును దక్కవు', అని ఏకశృంగుడు బెదరించినాడు. విజితావి హస్త సంజ్ఞతో నామాటకు దాళము వేసినాడు.

"మే మూరక బోనిచ్చువారముకాము. నిరర్థకముగ నొక సోదర విద్యార్థి నిట్లేడ్పించుట కంటె మరియొక క్రీడ మీ కేమియును గన్పింపలేదా? మీరు పశు వులు".

"ఛీ! నోరుమూయుము. ఆ శిఖి వెధవ మీ యరజేతికి పండ్లు పెట్టినాడు. ఇప్పుడు మీపై చేయిజేసుకొనిన గ్రుద్దుకు జాలరు. మీయబ్బ యెవడడ్డము వచ్చునో కాచుకొనుడు" ఏకశృంగుడు విసరిన పాదరక్ష ఉత్పలుని గుండెపై దాకి క్రిందబడినది. అతడు ముందుకు వచ్చినాడు. ధ్వజకేతువు 'వానియొంటిపై దెబ్బపడిన 'నీ వప' యొలిపించెద ననినాడు.

ఇప్పుడు రభస పెట్టుకొనిన జిక్కుకపోవుదు మను భయముతో ఏకశృంగ విజితావులు 'రేపు మీపని బట్టింతు'మని సర్దుకొని పోయినారు. కేతుధ్వజుఁడు గజగజ

వడకుచున్న అమితాభుని శయ్య కడ కేగి యతని నోదార్చి కన్నీరు దుడిచి నిద్రబుచ్చినాడు.

మరుసటి దిన ముదయమే బుద్ధపూజకు చైత్యాలయమున కేగుచు నొకరి నొకరు కోరచూపులు జూచుకొనినారు. అమితాభుఁడు ఉత్పల ధ్వజకేతువుల మధ్య శిరమువంచి బెదురుచు నడుచుచున్నాడు. అతని నుద్దేశించి 'ఓరీ! పునుఁగు పిల్లీ! కులుకకుము, తప్పించుకున్నామనుకోకు. మావల పెద్దది' అని ఏకశృంగుడు పలికినాడు.

భయముచే అమితాభుని ముఖ మెఱ్ఱవారినది సమాధానముజెప్ప వెరచినాడు. ధ్వజకేతువు పొగరుకొని యిట్లనినాడు.

"పక్షులు, మీపన్నాగము లికసాగవు. శీలభద్రాచార్యులకు సమస్తము నివేదింపక నూరకొనము. ఇకనైన బుద్ధి తెచ్చుకొని సత్ప్రవర్తన నలవరచుకొనిన నీకు నాలందలో నిలువ నీడ యుండును. లేదా జాగ్రత్త!'

## 10

అమితాభుని తనకక్ష్యలో నివసింప నంగీకరింపవలసినదిగ శాతకర్ణి శీలభద్రాచార్యుని వేడుకొనినాడు. ఆయన యంగీకరించినాడు. అమితాభుడది విని యానంద పారవశ్యము నొందినాడు. ఇక విజితావి, ఏకశృంగుల గాలి యతనికి సోకదు. వారతని జోలికి రాలేరు. శాతకర్ణి యన వారికి సింహస్వప్నము.

కంటికి సుఖనిద్రలేక బక్షము దినములు పైబడినది. ఆనాటి రాత్రి అమితాభుఁడు మైమఱచి దారుఖండమువలె నిద్రపోవుచున్నాడు. అర్ధనిశీధమున నతని కక్ష్యలో నాముదపు దీపమునకు మించిన వెలుతురు కనిపించింది. మిలమిల మను నా కాంతిలో నతఁడు మేల్కొని శయ్యపై సగములేచి జూచినాడు.

ఒక విచిత్రవ్యక్తి రేగిన జుట్టుతో ముఖమున రక్తవర్ణ బిందువుల ధరించి ప్రక్కన నిలువబడి నాడు. మఱియొక వ్యక్తి 'ప్రతిముఖము' ధరించి నల్లనిగుడ్డలు కట్టుకొని మారురూపుతో సానబట్టిన చిఱుకత్తి చేతబుచ్చుకొని యెదుట నిలువబడియున్నాడు.

భూతాకారముతో నున్న యా 'యిరువుర' వ్యక్తుల జూచిన తక్షణమే అమితాభుని గుండె దిగజారినది. వారతని నొక దెబ్బకొట్టినారు. అది గుండెపై దగిలినది. ఒక బొబ్బ పెట్టి వెనుకకు పడిపోయినాడు. వెంటనే కక్ష్యలోని సహపాఠులు మేల్కొనినారు. క్షణకాలమే మొనర్చుటకును వారికి దోచలేదు.

ఏకశృంగ, విజితావులు దుష్కృత్యమేదో తలపెట్టిమారు రూపముతో వచ్చియుందురని ధ్వజకేతువు బుద్ధికి తోచినది. ముందు నిలిచిన వ్యక్తిపైబడి యతని ప్రతిముఖమును లాగి వైచినాడు అతని హృదయదేశమున నొక గ్రుద్దు పడినది, దిమ్మరపోయి యతడు నాలుగడుగులు వెనుకకు వేసినాడు.

శాతకర్ణికి మొదటకొంత మాంద్యము, భయానకత తోచినని, ధ్వజకేతువు వారితో దలపడినప్పుడు సమస్తమతనికర్థమైనది వారిపైబడినాడు. కలహము సాగినది.

ఇరుపార్శ్వములనున్న కక్ష్యలలోని విద్యార్థులు మూగినారు. ధ్వజకేతువు భయముచే గంపించుచున్న యమితాభుని జేరి "గట్టిదెబ్బ తగిలినట్లున్నది. దిమ్మరపోయినాడు' అనినాడు.

'అమితాయువునకు బ్రాణమున్నదా?'

'వాడు వట్టి టక్కరి దొంగ తొఱ్ఱు! ఎత్తెత్తినాడు' విజితావీ! మనకక్ష్యనుండి చల్లని నీరు దెమ్ము. వీని మత్తువదలించెద'నని ఏకశృంగుఁడనినాడు.

శాతకర్ణి కఠినకంపిత స్వనమున నిట్లనినాడు.

"మీరతని ముట్టుకొనవద్దు. దూరముగ నుండుడు. నేను, ధ్వజకేతువు నితనిని సుస్థితికి దీసుకొని రాగలము. మీ సంగతి శీలభద్రాచార్యుల వారి కెరిగింపక నిక తప్పదు. ఇటనుండి త్వరితము బొండు స్మృతివచ్చి మిమ్ముజూచిన అమితాభుఁడు మఱల భయపడును. మీరు రాక్షసులు! క్షణకాలములో గదలకున్న కామాయని భిక్షుని బిలిచుకొనివత్తును."

అతని వాక్యములు ఏకశృంగ విజితావుల హృదయముల గలతపెట్టినవి.

అట్టిస్థితిలో శాతకర్ణి యొకరిమాట వినువాడు కాదు సంధికంగీకరింపడు. భయవిహ్వలతతో నాదుష్టులిరువురును వెడలి పోయిరి. గుమిగూడిన విద్యార్థులు అమితాభుని యథాస్థితిని గొని వచ్చుట కెన్నోయత్నము లొనర్చినారు. కాని స్మృతిరాలేదు.

శాతకర్ణి, ధ్వజకేతువులు భయపడ నారంభించిరి. ఇరువురునతని చేతులపై నెక్కించుకొని వైద్యశాలలో జేర్చినారు. ఆవశ్యకమైన ప్రథమచికిత్స యొనర్చి వైద్యోపాధ్యాయుఁడు 'ప్రాణభయములే'దని నపుడామిత్రులిరువురకును గలిగిన యానందమునకు మేరలేదు.

తిరిగివచ్చి శాతకర్ణి శయ్యపై నిద్రించుటకు సిద్ధపడుచున్న సమయమున మఱల విజితావి, ఏకశృంగు లతని కక్ష్యకు వచ్చినారు.

"నేను మీరొనర్చిన సమస్తమును ప్రధానాచార్యునకు విన్నవింపక దప్పదు".

'అయిన నీ హృదయమున మాపై నీర్ష్యయున్నదన్నమాట!'

"ఈర్షయా? ఎందుకు? దుష్కృత్యముల మీయంతటిఘనులు లేరనియా? వాని కడ్డువచ్చుట యీర్ష్యకాదు. అది నా విద్యుక్త ధర్మము! పవిత్ర కర్తవ్యము!!

"అయిన నీకును 'ఛిందంతాం' జరుగవలెనన్న మాట!".

'ఈధూర్తుల బెదరింపులకు వెఱచు పిఱికిపందను గాను'.

అరుణోదయమునకు బూర్వమే ఏకశృంగ, విజితావులు మఱల శాతకర్ణి కక్ష్యకు వచ్చి చేతితోదట్టి యతనిని నిద్రమేల్కొలిపినారు.

'అయిన రాత్రి యుదంతమును పృథువులకు, ఆచార్యులకు విన్నవింప నిశ్చయించినావన్న మాట!'

'అవును. విన్నవింపకున్న నా హృదయమూరుకొనదు. అసత్యముతో దౌష్ట్యముతో నది సంధి కంగీకరింపదు'.

'ప్రతీకార మొనర్పగల శక్తిగలవారమని మఱచిపోయినట్లున్నావు'.

'లేదు. మీ దుష్టశక్తిని రూపుమాపదలచి యిట్టి నిశ్చయముకు వచ్చినాను'.

'లేదు'.

మఱుక్షణముననే ఏకశృంగుఁడు దూలి శాతకర్ణి ముఖముపై పిడికిలి మడిచి దెబ్బకొట్టినాడు. త్రిప్పుకొని యతడు మఱల దారుణ హస్తచాలనముచే సమాధానము జెప్పినాడు. తన కంటె బలమున నధికుఁడైన ఏకశృంగునితో ధైర్యమే బలముగ శాతకర్ణి పోరాడినాడు. కాని యాయువు పట్టుల మంచిదెబ్బలు తగిలినవి. ఒక దెబ్బకు శాతకర్ణి నాసిక బెదరి రక్తము స్రవించినది. అతడు నేలపై బడినాడు. లోగడనే మేల్కొనిన విద్యార్థులందరును గగ్గోలుగ రోదించినారు.

అది విని వాహ్యాళికేగుచున్న అమృతవర్షుడు కక్ష్యలోప్రవేశించి ఏకశృంగునితో శిఖిని జూపించుచు, "ఈ దుష్టక్రియకు బూనుకొన్నది నీవేనా?"యని ప్రశ్నించినాడు.

‘శిఖి నాపై ముందుగ దుముకబోయి నేను తప్పుకొన, గోడకు కొట్టుకొని పడిపోయినా’డని ఏకశృంగుడు సమాధానము జెప్పినాడు.

“అబద్ధము” అని ధ్వజకేతువు అతని ముఖమువంక తీక్షణమగు దృష్టిని బరపినాడు.

‘నా యెదుట మీరిట్లుకలహింపరా’దని వారిరువుర వాగ్వివాదము నాపి దీర్ఘ బాహువు పీనవక్షుఁడునగు కాలకూటునిపై దృష్టినిల్పి “పెద్దవాఁడవు నీవిట్టి దుష్కృత్యము జరుగుచున్న కన్నుల నప్పగించి యూరకున్నావా?”యని యుపాధ్యాయుఁడు గద్దించి పలికినాడు.

“ఏకశృంగ! నీవు కేవలము పశువువు. ఒక పది దినములు నిన్నేకాంతగృహమున బంధింప శిక్షజెప్పినాను.”

తేరుకొనుచున్న శిఖిశాతకర్ణి మూలుగు చెవినబడినది. ఆచార్యున కాశారేఖ పొడకట్టినది. అతని శిరోభాగమున తగిలినట్లున్నవి. నీవంటి యుత్తమ విద్యార్థిపై తలపడినందు కాదుష్టునకు దగిన శిక్ష జెప్పి నీ గౌరవమును కాపాడినాను.” అని యతఁడు పలికినాడు. అప్పటికిని శాతకర్ణికి స్మృతిరాలేదు. అతనిని వైద్యశాలకు గొనిపొమ్మని ధ్వజకేతువున కాదేశమిచ్చి అమృతవర్షోపాధ్యాయుడు కక్ష్యను వీడినాడు.

ధ్వజకేతు విరువురు మిత్రుల సహాయముతో నతనిని వైద్యశాలకు చేర్చి చికిత్స జేయించి కొంతస్మృతివచ్చిన తరువాత తిరిగివచ్చినాడు.

అతడు విజితావి, ఏకశృంగుల కక్ష్యలో ప్రవేశించి ధైర్యముతో నిట్లనెను. ‘ఏకశృంగ! నీవు మిత్రుడు శాతకర్ణిపై జేయిచేసికొనినావు. అభము శుభమెరుగని సాధువు నమితాభుని పశుబంధ మొనర్చి చంపయత్నించినావు. సమస్తమును నేను పృథువులకు, విన్నవింతును. నిన్ను నాలందనుండి పంపి వేయకున్న నీ దౌష్ట్యములతో మేము బ్రతుకలేకున్నాము.”

తన దౌష్ట్యము కొంత బహిరంగమైనదను భయముననో యేమో ఏకశృంగుడు కొలదిగ తగ్గి ‘ఆ పృథువులు నన్నేమి చేయగలరు? అమృతవర్షులు నాకు జెప్పవలసిన శిక్ష జెప్పి నారు’ అనినాడు.

వెఱ్ఱివాఁడవన్నట్లు ముఖాభినయ మొనర్చి ధ్వజకేతువిట్లనినాడు.

“అంత సులభముగ దప్పిపోవు ననుకొనకుము.”

“కుందేటి కొమ్ములు వచ్చినప్పుడు చూచెదను లెమ్ము.’

# 11

అమితాభుఁడు, శాతకర్ణి యెట్లున్నారో చూడవలెనని మఱుసటిదిన ముదయవేళ బ్రహ్మాయువు వైద్యశాల కేగెను. అమితాభుని ముఖము వివర్ణమైయున్నది. భీతావహమతనినింకను వీడినట్లు లేదు. మృత్యు వావహించిన వానివలె శాతకర్ణి శయ్యపై బరుండియున్నాడు. కాని కనులు మూసికొని నిశ్చలముగనేవో యతఁడాలోచించుచున్నాడు.

బ్రహ్మాయువు నిశ్శబ్దముగ వైద్యశాలలో బ్రవేశించి శాతకర్ణిని చేతితో మృదువుగ తట్టిలేపినాడు. అతఁడు చిఱునవ్వుతో శయ్యపై గూర్చుండమని యాహ్వానించినాడు.

'శిఖీ! బాధ కొంత తగ్గినదా?'

'నాకేమియు విశేషముగ దెబ్బలు తగులలేదు'

'పాపము! అమితాభుఁడెట్లున్నాడు'?

'అతని స్థితియే నన్ను గలత పెట్టుచున్నది'.

స్వల్పకాలములో నతనికి స్వాస్థ్యము చేకూరుననుకొందును'.

'బుద్ధానుగ్రహమెట్లున్నదో! కాని యతని యెడ మనము కడు శ్రద్ధవహింపవలెను'.

'మిత్రుడు ధ్వజకేతువు వారిని గురించి పృథువులతో జెప్పినాడా?'

'నీ వా విషయముల నాలోచించుచు మనస్సు జెడగొట్టు కొనకుము.'

'ఈ విషయమున నీవెరిగిన దంతయును దెలియపఱచుమని శాతకర్ణి బ్రహ్మాయువు నాతురతతో నడిగినాడు.

"మిత్రుఁడు ధ్వజకేతువు పృథువులతో సంభాషింపక పూర్వమే ఏకశృంగుని దుష్టచేష్టలు నాలంద నలుమూలల బ్రాకిపోయినవి. పూజానంతరము మేము విద్యామందిరమున మా కక్ష్యలలో బ్రవేశించినాము. ద్వితీయపృథువు శిక్షింప ఏకశృంగుని బిలచి 'కోదండమును' సిద్ధమొనర్చినాడు. వాఁడా శిక్షను స్వీకరింప నిరాకరించినాడు.

'అంతటితో ద్వితీయ పృథు వూరకొనినాడా?'

'లేదు. ప్రథమ పృథువునకు నివేదించినాడు. అతనితో 'నీ తలబిరుసు తనమున శిక్ష పెరుగునేగాని తరుగ'దని బెదరించినాడు. ప్రథమ పృథువు సమస్తకక్ష్యల పృథువుల బిలచి రత్నసాగర భాండాగారావరణమున నొకసభగావించి సంప్రదించి యొక తీర్మానమునకు వచ్చినాడు. ఆ సభ కొందరు విద్యార్థులలో గలవరము గలిగించినది. వారందరును దానికి బ్రతిగనొక సభ గావించినారు. పృథువుల నిందించినారు. ఏకశృంగ విజితావు లొనరించినవి పరిహాసకృత్యములట! వాటిని మనము దుష్కృత్యములని గిట్టకబ్రచార మొనర్చినామట! మనల నాడిపోసినారు, దీని కంతకును నాయకుఁడెవరై యండునో నీ వూహింపగలవా!

శిఖికి తెలియకపోలేదు. బ్రహ్మాయువుచే జెప్పింపదలచి 'ఎవ'రని ప్రశ్నించినాడు. "మన మంగళుడు. మరలనిపుడొక సభ జరుగనున్నది. సాధ్యమైనంతవర కీవిషయముల నాలోచింపవలదని నా ప్రార్థన. లేకున్న నీకారోగ్యము చేకూరదు" అని బ్రహ్మాయువు వైద్యశాల నుండి గ్రంథభాండాగారములున్న ధర్మగంజుకు పోవుచున్నాడు.

కొన్ని క్రుద్ధ కంఠములు వినిపించుచున్నవి. సభాంగణమున గొందఱు విద్యార్థులు సభ జేయుచున్నారు. ప్రతి విద్యార్థియును లేచి 'విద్యార్థుల శిక్షింప పృథువుల కధికార మెవరిచ్చినారు? వారి యధికారమును శక్తితో నెదుర్కొనకున్న విద్యార్థి లోకమున కెంతటి యపకీర్తి! ఎంతటిప్రమాదము!!' అని రేగిన గండుతుమ్మెదలవలె రొదపెట్టుచున్నారు.

'మనమిట్లు శిక్షణరహితముగ మాట్లాడుకొని ప్రయోజనము లేదు. ఒక యధ్యక్షునెన్నుకొని క్రమముగ సభ సాగింతమని యొక విద్యార్థి వేదికపై కెక్కి బిగ్గరగ బిలచుచు నందర నిశ్శబ్దముగ నుంచినాడు. సభవారేక గ్రీవముగ, మంగళుని సభాపతిగా నాహ్వానించినారు.

అతఁడు వేదికపై నిలచి ప్రస్తుత క్లిష్టస్థితిని గురించితన యభిప్రాయముల వెల్లడించినాడు.

"ఏకశృంగుడు జిలిపితనమున కమితాభుని పశుబంధన మొనర్చి యేడ్పించినాడని ద్వితీయపృథువు కోదండముతో శిక్షింప నిశ్చయించినాడు. ఆ శిక్షను స్వీకరింప నేకశృంగుడంగీకరింపలేదు. అందులకై విద్యాలయ పృథువులందఱునుజేరి యతనిని శిక్షించుట ఎట్లని యొక సభజేసినారు. కాని వారికి విద్యార్థుల నిష్టానుసారముగ శిక్షించు నధికారము లేదని నామతము. దీనిని మన మందఱ మొకటై యెదుర్కొనక తప్పదు.

“జరిగిన విషయ మొక పరిహాసకృత్యము. కాని దాని ఫలితములు కొన్ని దుఃఖావహములుగ బరిణమించినవి. దానికి మన మందఱమును జింతింపవలసినదే. అట్టి యవాంతరములు సంభవించునని ముందెవ్వరును గలగనలేదు.”

“పృథువుల కిట్టి యధికారము లేదని నా నిర్ణయము” అను మంగళుని వాక్యమునకు విద్యార్థిసభలో హర్షనినాదములు, కరతాళధ్వనులు జెలరేగినవి. పరిహాసకృత్యముగ నొనర్పబోయిన దాని ఫలితాంశము నెవరు కల గనగలరను నతని వాక్యము విద్యార్థుల హృదయమున నాటినది. “నిజము. ఏకశృంగుని శిక్షించు నధికార మా పృథువులకు లేదు” అని విద్యార్థు లేకగ్రీవముగ దీర్మానించినారు.

మంగళుని దూరమునుండి ధ్వజకేతువు తీక్షణ, క్రోథ దృష్టులతో జూచుచున్నాడు. ఆపాద మస్తక మతని నసహ్యించుకొనినాడు. మంగళుని వాక్యావసానమున నతడుద్రిక్త హృదయముతో లేచి యతని యభిప్రాయములకు ముదముగ నొక మాటల సెలయేఱు నొలికించినాడు. లేచి నిలువబడిన వెనువెంటనే సభలో కలకలము బయలుదేరినది. కాని యతఁడు వెఱువలేదు. కృతనిశ్చయముతో సభ నలుమూలల బరికించుచు.

“మీలో గొందఱు నన్ను పరిహసింతురని నేనెరుగుదును. నేనే ఏకశృంగుని దుష్టచేష్టల గుఱించి ద్వితీయ పృథువున కెఱుకబఱచినానని మీరనుకొనుచున్నట్లున్నారు. కానియది సత్యము కాదు. అయిన నేను జెప్పుటకు వెఱచువాడనుగాని, సిగ్గుపడువాడను గాని కాను, అతని ముఖముననే నానిశ్చయమును వెల్లడించినాను.

“ఇది విద్యార్థి సభ గావున నిందు ప్రసంగించుటకు నాకునధి కారమున్నది. మనలో బ్రతివ్యక్తికి నట్టియధికారమున్నది. మంగళుఁడు మీ కన్నులలో దుమ్ము చల్లుచున్నాడు. సత్యమొకటి అతఁడు మీకు నివేదించినది మఱియొకటి. ఏకశృంగుఁడొనర్చినది పరిహాసకృత్యమా? అది యట్టిదని త్రోసిపుచ్చుట కష్టముగాదు. అంత స్వల్పముగ దానిని బరిగణించిన నిక మనలో నేవిద్యార్థి నిర్భయముగ నీయావరణమున బ్రతుకగలడు. ఆ దుష్కృత్యమును పరిహాస క్రియగ హృదయ పూర్వకముగ మంగళుఁడు బఱికించినాడా?నేను నమ్మలేదు. అతఁడు కేవలము స్వల్పమైన ‘పేరునకు’ సత్యమును మఱుగు పఱచుచున్నాడు. వ్యక్తిగతముగ నతనికిని శిఖిశాతకర్ణికి నున్న మనస్పర్థల మఱచి పోలేకనిట్లు ప్రవర్తించు చున్నాడు. ఇది యతని హృదయము సంతోషింపవలసిన సమయము కాదు సిగ్గుపడవలసిన వేళ.

సభాపతి పదవి నలంకరించి మంగళుcడు కోపముతో ద్రుళ్ళిబడి లేచి ధ్వజకేతువుతో.

"నేను మీవలన దిట్లుతినుట కీసభాపతిగ నుండ నంగీకరింపలేదు. మన యధికారముల నప్రమత్తులై మెలగి పృథువులకు దాసులు కావలదని హెచ్చరింపదలచినా"నని చెప్పి "వ్యక్తి దూషణకు బూనుకొనిన నీ సభలో నీవు ప్రసంగింప నిక నవకాశమొసగుటకు వీలులే''దని నాడు. ధ్వజకేతువు మఱల నతని యుపన్యాసమును బ్రారంభించినాడు.

"అయిన అమితాభుని పశుబంధన మొనర్చుట యొక పరిహాసకృత్యమా? పరిహాసకృత్యముగ నుద్దేశితమునుగాదు. అది కేవలము హృదయపూర్వకముగ నొనర్చిన యొక కిరాత కృత్యము! పాశవ కృత్యము!!

"అట్టివారి నీ పరమపునీత నాలందా విద్యాలయములో విద్యార్థులుగ నుండ నిచ్చుట సంస్థ కపకీర్తి. వారిని పృథువులు శిక్షించుటకు సర్వవిధముల నధికారులు".

అతని వాక్యముల కొక మూలనైన నంగీకారము కనుపించలేదు. బ్రహ్మాయువు వచ్చి యతని భుజముపై దక్షిణ హస్తముంచి 'ధ్వజకేతూ! సంతోషము! ధర్మవీరుని వలె ప్రసంగించినావు. మన శాతకర్ణియు నిట్లు బ్రసంగించునాయని నాకనుమానముగ నున్న'దనినాడు. ధ్వజకేతువున కాతని యొక్క వాక్యము చాలును. ఇతరులంగీకరించిన నేమి? లేకున్ననేమి?"

అటుపిమ్మట అచలుcడు లేచి కఠిన వాక్యముల మరి కొన్నిటి గ్రుమ్మరించి 'తనకంటె రెండింతలు చిన్నవారితో పరిహాసమేమిటి? పసివానిని భయపెట్టుట వీరమా? వివేకమా?- అది పిఱికితనము!- అతcడెవరను బ్రమేయములేదు హృదయము కోమలము. చిదిమిన పాల్గారు చిన్నారిపై చేయిజేసుకొనుటలో నేమానందము?' అని ప్రశ్నించినాడు.

సుధానుcడు లేచి 'నేటి సమస్య మంగళుcడు చెప్పినది కాదు. మరియొకటి? ఏకశృంగుని వంటి కర్కోటకుల స్వేచ్ఛగ బ్రవర్తింపనిచ్చి సాటి విద్యార్థుల బెదరించి భయపెట్టి వెట్టి వారిని చేయుట కంగీకరించుటా? లేకవారిని పృథువులచే శిక్షింపజేసి క్రమశిక్షణకు లోబడి వర్తించుటా?' అనునది. సోదరులారా! ఈ రెంటిలో విద్యార్థిలోకమున కెయ్యది మేలొనగూర్చునది? మీరే యాలోచింపుడు'.

తరువాత నా సభలో గలకలము జెలరేగినది. కొందఱు పృథువుల వెక్కిరించినారు కొందరు ఏకశృంగుని బొగడినారు. శాతకర్ణి ధ్వజకేతువులు, కొందఱు వ్యక్తులపై నున్న కక్షదీర్చుకొననొక గొప్ప పన్నాగమును బన్నినారని కొందఱనినారు. కొందఱు వారిని మెచ్చుకొనినారు.

అధిక సంఖ్యాకులు ''పృథువుల శిక్షలనుధిక్కరింపవలసినదే''యని నిశ్చయించినారు.

కలకలము మధ్య బ్రహ్మాయువు వేదికపై నిలువబడినాడు. సభ నిశ్శబ్దమైనది. అతడు విద్యా విషయకముగ విజయబుద్ధి సంపన్నుఁడు, శీలయుతుఁడు. ఈ గుణము వలన నతఁడనిన విద్యార్థుల కభిమానము. ఇంతకు ముందెన్నఁడు నతఁడు సభలలో ముందుకు వచ్చి ప్రసంగింపలేదు. అతని యూహ లెట్లుండునో విన విద్యార్థులకు గుతూహల మధికముగనున్నది.

జరిగిన చర్చల నన్నిటిని సమన్వయించి బ్రహ్మాయువు మంగళుని ప్రశ్నలకు సమాధాన మొసగ నారంభించెను. ''అమితాభుని బంధించుట కేవలము పరిహాసకృత్యమా? అంతటి పసివానితో పరిహాసమేమిటి? అది దుష్టకృత్యము! శిక్షణపొంది తీరవలసినదే. లేకున్న విద్యార్థులకే ప్రమాదము. వ్యతిరేకించిన విద్యాలయమున సదాచారము నశించు''నని పలికినాడు. వైద్యశాలలో శాతకర్ణి, అమితాభుల దుస్థితి వారి కన్నుల గట్టినట్లతడు ప్రదర్శించి విద్యార్థుల హృదయ వీథులలో దుష్టులయెడ క్రోధమును, సాధులయెడ కరుణ ప్రేరేపించినాడు. సభలో హర్షధ్వానములు కరతాళధ్వనులు జెలరేగినవి. పట్టరాని కోపముతో 'ఏకశృంగునిది తప్పిదము కావచ్చును. పృథువుల కేమి జోక్య'మని బ్రహ్మాయువును కొందఱు ప్రశ్నించినారు.

"పృథువులు మనమెన్నుకొన్న పెద్దలు, బుద్ధిమంతులు, అనుభవజ్ఞులు. వారికి మనల శిక్షించు నధికారము మనమే యొసగినాము. ఆచార్యపాదులు దాని నంగీకరించినారు. దుష్ట కృత్యములొనర్చు వారికి పృథువుల ధిక్కరించి యాచార్యులలో వారిపై నభియోగ మొనర్ప లేశమైన నైతికాధికారము లేదు. పశుశక్తి వారి కధికారము కావచ్చును. "పృథువులు విద్యాలయమున క్రమశిక్షణ నిల్పి పేరు ప్రతిష్ఠల గడియించి యిచ్చువారు. వారిని ధిక్కరింప బూనుటవలన మనకే నష్టము. పృథువులు లేరనుకొనుడు. మన విద్యాలయ స్థితి యెట్లుండునో యూహింపుడు. శక్తిహీనులైన విద్యార్థుల జీవితమెట్లుండునో యాలోచింపుడు!! వారిట్టి దుష్టులకు

బలియైపోవలసినదేనా? 'పృథువులకు విద్యార్థుల శిక్షించునధికారము లేదనిన మంగళుని తీర్మానమును నేను హృదయ పూర్వకముగ వ్యతిరేకించుచున్నా'నని బ్రహ్మయువు నిర్భయముగ బలికి విరమించినాడు.

అతని శక్తివంతమైన సంభాషణకు సభలో హర్షధ్వానములు మఱల చెలరేగినవి. అనేకుల హృదయములు మారినవి. మంగళుని మానసవీథిలో ననంత భావమేఘములు పయనించినవి. పూర్వమిత్రుఁడు శాతకర్ణి వైపునకు హృదయము పర్వులెత్తుచున్నది. లేచి తీర్మానమును జదివి యభిప్రాయ మొసగినాడు. విద్యార్థుల శిక్షించుటకు పృథువుల కధికార మున్నదా లేదాయను ప్రశ్నమునకు ననుకూలురు, వ్యతిరేకులు సమసంఖ్యాకులైనారు.

వ్యతిరేకపక్షమున నొకవ్యక్తి సభాపతి యిష్టము సమస్యను దెల్పగలదని పలికినాడు.

మంగళుడు కొంతసేపు నిశ్చలముగ గూర్చొని, విద్యార్థులతో తనకీ లోటు మాసిపోవునో యన్న భయమున "నాయభిప్రాయము పృథువులకు వ్యతిరేక"మనినాడు. సభలో హర్షనాదములు కరతాళ ధ్వనులు జెలరేగినవి.

బ్రహ్మయువు మరల నిలచి మంగళు నుద్దేశించియిట్లనినాడు.

"ఈసభ పరిపూర్ణమైనది గాదు. విద్యాలయమున నున్న విద్యార్థులలో నిటజేరినవా రల్పసంఖ్యాకులు. అందువలన తీర్మానమును నీ యొక్కని వ్యతిరేకతతో నెగ్గించి పృథులకును విద్యార్థులకును మధ్య నంతఃకలహముల బ్రేరేపించుట యుక్తముగా"దని "అంతఃకలహము మాట తరువాత నాలో చింతము. తీర్మానము నెగ్గినది. పృథువులకు విద్యార్థుల శిక్షించు నధికారము లేదు" అని మంగళుఁడు ఖండితముగ బలికి సభ జాలించినాడు.

## 12

ధ్వజకేతువు శాతకర్ణిని జూచి యొకదినము గడచినది. సభ ముగిసిన తక్షణమే సభా వృత్తాంతముల విన గుతూహలపడుచున్న యాతనికి సమస్తమును దెలియబరుప నతఁడు వైద్యశాలకు వెడలినాడు. అమితాభుని మనశ్చాంచల్యమింకను కుదుటబడలేదు. మధ్యమధ్య వెఱ్ఱిగ కేకలు వేయుచున్నాడు. శాతకర్ణి యతని శయ్యపై గూర్చుండి యతని కుపచారము లొనర్చుచున్నాడు. బ్రహ్మయువు ముందేయటకు జేరినాడు.

ధ్వజకేతువు శాతకర్ణితో సభావృత్తాంతములు విశదీకరించినాడు. "నేడు మన బ్రహ్మయు మిత్రుడొక మహావక్తవలె నుపన్యసించినాడని పలికినాడు. ఇరువురును సత్యమునకై పోరాడినందుకు శాతకర్ణి వారి కభినందన వాక్యములు పలికినాడు.

"నేనొనర్చినదేమియు లేదు. మంగళుఁడు మనకు బూర్తిగ వ్యతిరేకియైనాడు. లేకున్న నీనాడు ఏకశృంగుని బ్రతుకు బయటపడెడిది. మంగళుఁడు క్షణములో మారుట చిత్రముగ నున్నది".

బ్రహ్మయువపుడే మందు తీసికొని వైద్యుని కక్ష్యనుండి బ్రవేశించినాడు. అతనిని జూచి ధ్వజకేతువు "సభావృత్తాంతమెల్ల మిత్రునికి విశదపరిచినాను" అనినాడు.

"అందుకణుమాత్రము మనకు కీర్తివచ్చిన నది నీది?" యని బ్రహ్మయువనినాడు. 'నీవు బహిరంగంలో సత్యమువైపు ధైర్యము వహించి ప్రసంగించినందుకు నాయభినందనము' లని శిఖి శాతకర్ణి బ్రహ్మయువును గౌరవించినాడు.

'నా వాక్యములకు వెనుకనున్న సమస్తశక్తియును నీవిచ్చినదే'.

'నీయభిప్రాయము నాకవగతమగుట లేదు'.

'నీ మైత్రి లేకున్న నేను కేవలము స్వార్థపరత్వముతో వెనుకటివలె వ్యవహరించెడి వాడనే' మీ యిరువురకు నేనొక ముఖ్యవార్త గొనివచ్చినాను"అని ధ్వజకేతు వనినాడు. "ఏమిటది?" యని శాతకర్ణి, బ్రహ్మయువు లాతురతతో యతని బ్రశ్నించినారు.

"ప్రథమ పృథువు మధ్యాహ్నము వారికి శిక్ష చెప్పును. శీలభద్రాచార్యులు పాఠ ప్రవచనానంతరము విద్యార్థులను వారి వారి ప్రవచన కక్ష్యలలో నుండ నాజ్ఞాపించినాడు".

సాయంత్రము పాఠప్రవచన మైపోయినది. బుద్ధపూజకు బయలుదేరు వేళ, ఆచార్యులు కక్ష్యలనుండి వెడలిపోయినారు. ప్రథమ పృథువు వేదికపై నిలచి యిట్లడిగినాడు.

"ఏకశృంగుఁడున్నాడా? -- ఇతరులు వారి స్థానముల నుండి కదలవద్దు".

'నేనిక్కడనున్నా'నని జంకుచు లేచి యతని స్థానమున నేకశృంగుడు నిలచినాడు.

'నీవతి దుష్టముగ వ్యవహరించుచున్నావు. నీవంటి పెద్దవిద్యార్థి పసిబాలురపై గ్రౌర్యమునకు బూనుకొనుటకు సిగ్గు, నీబోటి వారిని శిక్షించుట మాకర్తవ్యము. అది శీలభద్రాచార్యుల వారి యనుశాసనము. నీకు 'కోదండము'ను శిక్షజెప్పినారు.

'నేను దానిని తిరస్కరింతునని' ఏక శృంగుఁడనినాడు. విద్యార్థిలోకమున బహిరంగధిక్కారమును గలకలము చేకొనినది. మఱల ప్రథమ పృథువు చలింపని కంఠముతో ననినాడు. 'శిక్షను ధిక్కరించుట వలన నది వృద్ధి పొందుటయేగాని మరియొక ప్రయోజనము లేదు. కోదండము దగ్గరకు జేరుము' అనెను. మిత్రులెవ్వరు వాక్సహాయ మొనర్పకుండుట వలన అతని కఠిన కంఠస్వరము విని ఏకశృంగుడు మొదట భయపడినాడు. కాని యతని యాజ్ఞను పాలింపలేదు,

'నీవు మా యాజ్ఞను తిరస్కరించినావు. సర్వసామాన్యముగ శిక్ష ననుభవింప నంగీకరింపకున్న బలవంతముగా నీకు శిక్షజెప్పవలసివచ్చును. వచ్చెదవా? రావూ? ఎవరైన నతని నిటకు బట్టితెండు.

ద్వితీయపృథువు, మరియొక స్థూలకాయువైన విద్యార్థి యతనిని బలవంతముగ కోదండముకడకు జేర్ప లేచివచ్చినారు. ఏకశృంగుని హృదయము చలించినది.

'శిక్షననుభవించి నాలంద గౌరవమును కాపాడుము. శిక్షను స్వయముగ స్వీకరింపకున్న నిక నీయావరణమున నీవు విద్యార్థివిగనుండుట కవకాశముండదు అని ప్రథమ పృథువు పలికినాడు.

తప్పదని యతడు లేచి కోదండము దగ్గఱకు వచ్చి నిలువబడుట జూచి మంగళు ఁడు "ఇట్టి శిక్ష యనుచితము. నేనంగీకరింప" ననినాడు.

'అంగీకరింపకుండుటకు నీవెవరు?' అని పృథువు తిరస్కార దృష్టితో జూచినాడు.

"ఇది విద్యార్థిలోకమున నధిక సంఖ్యాకుల యభిప్రాయము"

"ఆ విషయమును గూర్చి తరువాత నాలోచింతము. 'నీవు నీ స్థానమున నుపవిష్టుడ వగుము అధిక సంఖ్యాకులు వారి యభిప్రాయమును జెప్పుకోగలరు."

'ఏకశృంగుని గౌరవమును మనమే రక్షింపవలెను' అని మంగళుఁడు విద్యార్థులవంక జూచినాడు. దానికి సమాధానముగ గొందఱు ముందుకు వచ్చినారు. వారితో సమయోచిత సంభాషణ మొనర్చి పృథువు వారిని శాంతింపచేసినాడు.

అపజయమువలన మంగళుని ముఖ మెఱ్ఱవారినది క్రోధమును దిగమ్రింగుకొని కూర్చొనినాడు.,

పృథువు కోదండమును పట్టి ఏకశృంగుని శిక్షించినాడు. మొదట కొన్ని దుష్టవాక్యములు పలికినందుకతనికి శిక్షయదనమైనది. అతనిని దింపించి "ఇప్పుడు నీవు పో"మ్మని పృథు వాజ్ఞాపించినాడు.

నాలంద విద్యార్థులందఱియెదుట నాగర్వికట్టి శిక్షజరిగినది. 'మునుపెన్నడు నతడొకరివలన నిట్లు శిక్షితుడునగుదు'నని కలనైన భావింపలేదు. అతని హృదయమున బ్రతీకార బీజములు నాటుకొనినవి. విద్యార్థులందఱునిది యతని క్రూర కృత్యములకు దగిన శిక్షయని యామోదించినారు. నిశ్శబ్దముగా వారు జూచుచుండ పృథువు

'మంగళా! నీస్థానమున నిలువుము. నిలువవా?' మంగళుఁడామోదరహితముగ దృష్టి సారించినాడు. 'ఇటురమ్ము! నీతో కొంత మాటాడవలసియున్నది' ద్వితీయపృథు వానిచేయి నెమ్మదిగ పట్టుకొని పృథువునొద్దకు దీసుకొనివచ్చినాడు.

"విద్యాలయమున నధిక సంఖ్యాకులు ఏకశృంగుని శిక్షకు వ్యతిరేకులా?" మంగళుఁడు సమాధానము నీయలేదు.

"నీ యొక్కని యభిప్రాయమే యధికసంఖ్యాకుల యభిప్రాయమా?" సమాధానము లేదు.

"మీ సభను గుఱించి వినినాము. నీ నిర్ణయము దెలిసినది. ఆ సభలోని వ్యక్తులు మాత్రమే నాలంద విద్యార్థులు కారు. విద్యార్థులలో నధిక సంఖ్యాకులు వ్యతిరేకించినను నిట్టి క్రూరకృత్యము లొనర్చిన వారిని శిక్షింపకుండుట మా ధర్మము కాదు. నీవు స్వతస్సిద్ధముగ దుష్టుఁడవు కావు. నిన్నెవరో తప్పుత్రోవన నడిపించుచున్నారు. తిరిగి యాలోచించుకొని సత్ప్రవర్తన నలవరచుకొనుము. నీ మిత్రుడు బ్రహ్మాయువు ననుసరింపుము. పొమ్ము! విద్యార్థులలో శాతకర్ణి, ధ్వజకేతువులుదాత్తులవలె బ్రవర్తించి యాచిఱుతవాని ప్రాణములగా పాడినారు. మీరును సత్ప్రవర్తకులై మన విద్యాలయమునకు బేరుప్రతిష్ఠల నినుమడింప జేయుఁడు."

విద్యార్థులు వెడలిపోవుచుండ "ఒక క్షణకాలము నిశ్శబ్దముగ నుండు"దని పృథువు వేదికదిగిన తరువాత ద్వితీయ పృథువు వేదికపై నిల్చియిట్లనినాడు.

"ధైర్యముతో వేదికపై నిలచి మన యధికారములను, కర్తవ్యములను గుఱించి గంభీరముగ నుపన్యసించిన బ్రహ్మాయువునకు మా పృథువుల యభినందనములు. పృథువులమైన మేము మీ స్వేచ్ఛకు సర్వసామాన్యముగ భంగము గలిగింపము. కొందఱు వ్యక్తుల స్వేచ్ఛకు భంగము వాటిల్లునపుడు మా జోక్యము తప్పదు. అది మీ క్షేమమునకే. 'కోదండము' వంటి కఠినశిక్షలు విధించుటలో మాకుత్సాహము లేదు. కాని దుష్టకృత్యములకు దగిన శిక్ష నొసంగవలెగదా! మనమందర మైకమత్యముతో వర్తించి మన విద్యాలయ గౌరవమునకు భంగమగునట్టి ప్రవర్తనము నెటనైన నెదుర్కొందము".

“తప్పక”నని కొన్నిగొంతుకలు వినిపించినవి. విద్యార్థులు పృథువులకు జయ వెట్టిసభా భవనమునుండి వెడలిపోయినారు’.

## 13

ఒకనాడు సాయంకాలమున గయాశీర్షుడు, కాశ్యపుడిరువురు నేకాంతముగ భదంత శైలముపై పర్యటించుచుండ మంగళుఁడు, కుబ్జుడు నొకరి భుజముపై నొకరు వాలుచు, సోలుచు దూరమున నతి మైత్రితో నడచుట వారు గమనించినారు.

కాశ్యపుఁ డాదిక్కుననే జూచుచున్నాడు. విద్యార్థులపై దృష్టినిలిపి గయాశీర్షుఁడు ‘అంత తీక్షణముగ జూచుచున్నారట నేమున్న’దని ప్రశ్నించినాడు. మంగళునిలో నేఁడింతటిమార్పునకు గారణమేమిటో నా కర్థమగుట లేదు.

‘మార్పేమిటి?’

‘అతఁడిపుడెవరితో మైత్రి యొనర్చుచున్నాడో మీరు గమనించినారా?” “మీవలె నేనంత తీక్షణముగ విద్యార్థుల గమనింపను”.

కాశ్యపుడు కుశ్రాగ్రబుద్ధి. విద్యార్థుల మనస్తత్వ మెట్లు మారుచున్నదో గమనించుటలో నతినిపుణుడు. మంగళుని నూతనమిత్రుల నతఁడు పలుమారులు పరికింపలేదు. కాని యాతని యూహలన్నియును సత్యములు.

మంగళుఁడు తెలివిగలవాడు. విద్యావిషయముల నతని శ్రద్ధలో గొన్ని దినముల నుండి లోపము గనుపించుచున్నది. అతని ముఖమున పూర్వవర్చస్సు రూపుమాసి పోవుచున్నది. అనుమానమున కవకాశము గల్పించు కృత్యములలో నతడు పాల్గొనుచున్నట్లు తోచుచున్నది.

కాశ్యపుఁడెట్లయిన మంగళుని యతఁడనుసరించుచున్న దుష్టమార్గము నుండి తప్పింపనెంచి యొక మారేకాంతముగ నతనితో సంభాషింప రమ్మని కోరినాడు.

‘‘మంగళా! రమ్మ’’ అని దీనమగు చిఱునవ్వుతో నాయాచార్యుఁడతని నాహ్వానించినాడు. దగ్గరకు పోయి యతని భుజద్వయముపై హస్తములుంచి ముఖములోనికి జూచినాడు. మంగళుఁడాగురువర్యుని కన్నులు సూటిగ జూడయత్నించినాడు కాని జూపునిలుపలేక పోయినాడు. ఆచార్యుని కీ స్వల్పపరీక్షతో సర్వమవగతమైనది. అతఁడు దుష్టమార్గముల ననుసరించు చున్నాఁడనుట నిశ్చయము.

'మంగళా! నీ ముఖమొక నిగూఢ గ్రంథముగనున్నది. అందేమో విచిత్ర విషయములు ద్యోతకమగుచున్న'వని యాచార్యుఁడు గర్జితముగ బలికినాడు.

శాతకర్ణి, అమితాభులకు మఱల మిత్రులతో యథాక్రమముగ సంచరించుటకు బక్షము దినములు పట్టినది. అమితాభుఁడు నేడు శాతకర్ణి కక్ష్యలో నుండవీలులేదు. మఱల నమితాభుని హృదయమున భయము స్థానము కల్పించుకొనినది. శాతకర్ణి నెట్లైన నతని కక్ష్యలోనే నివసించు నవకాశమును గల్పించుమని వేడినాడు. మిత్రుఁడతని కోర్కెను దీర్చినాడు.

ఇట్టి చిత్రములతో సంవత్సరమంతము కావచ్చినది. మఱల పరీక్షలలో బ్రహ్మాయువు ప్రథముడైనాడు. శాతకర్ణియతని కక్ష్యలో నుత్తముడు. కేతుధ్వజుఁడు శాతకర్ణి తరువాత స్థానమాక్రమింపలేకపోయినను చతుర్థస్థానమును స్వీకరించినాడు. మంగళుఁడు పరీక్షలలో బాగుగ వెనుకబడినాడు.

బిరుదు ప్రదానదినము వచ్చినది. ఆనాఁటి బిరుదు ప్రదానమొనర్చు వారు రేవా సంస్థానాధిపతి, యతని ధర్మపత్ని గోమతీదేవి. శాతకర్ణికి వారిపరిచయ భాగ్యము లభించినది. బ్రహ్మాయువు వారి కుమారుడు. నాలందలోనతడు నొక సామాన్యవిద్యార్థి. అనేక పర్యాయములు తల్లిదండ్రులకు వ్రాసినలేఖలలో నతఁడు శిఖిశాతకర్ణి శిక్షణశీలముల గురించి వ్రాసి, యతనిని "విద్యార్థివీరు"డని పొగడినాడు.

నాలందకు విచ్చేసి ఆచార్యుల స్వాగతమును స్వీకరించిన యనతి కాలముననే రేవా ప్రభువు నతని ధర్మపత్ని, శాతకర్ణి పరిచయము నర్థించినారు. బ్రహ్మాయువు తక్షణమే యతనిని బిలచుకొనిపోయి వారికి పరిచయము జేసినాడు. శిఖి నాలందలోని సమస్తవైచిత్ర్యముల నా మిత్రుని తల్లిదండ్రుల కెఱిగించుటలో విశేష సాయమొనర్చి వారి యనురాగమునకు బాత్రుడైనాడు.

ఈ రీతిగ శాతకర్ణికి నాలంద విద్యాలయమున బ్రథమవత్సరము గడచినది. మొదట కొన్ని కష్టముల నెదుర్కొనవలసి వచ్చినను నాతని కాజీవితము సంతృప్తికరముగ నున్నదని తండ్రికి వ్రాసిన లేఖలోనతఁడు పేర్కొనినాడు. నాలంద నాల్గు ద్వారములకడ మృగరథములు, ఖరరథములు, శిబికలు, నశ్వశకటములు దశదిశలనుండి వచ్చి నిలచినవి. విద్యార్థులందఱును సెలవులకు స్వగృహముల కరుగుచుండుటయే యిందుకు గారణము. ప్రతి వాహనమునుండియు హర్షనినాదములు వినిపించుచున్నవి.

శాతకర్ణి చనువుతో 'మిత్రులగు బ్రహ్మాయువు సెలవులకు మా యింటికి వచ్చి కొంత కాలముండుట కంగీకరింపుఁ'డని రేవా ప్రభువును గోరినాడు. అతని వినయవిధేయతల కతఁడు ముగ్ధుడై యందుల కంగీకరించినాడు. 'మరల, శిఖీ! నీవును బ్రహ్మాయువుతో మాయింటికి దప్పకరావలెను సుమా'యని గోమతీదేవి యతనిచే 'తప్పకవత్తు'నని వాగ్దానము గైకొని కుమారుని బంపుట కనుమతించినది.

కొంతకాలము శాతకర్ణియింట, మఱికొంత కాలము బ్రహ్మాయువు గృహమున నాయిరువురు మిత్రులు సంతోషముతో సెలవులు గడిపి తదనంతరము నాలందకు జేరుకొనినారు.

## 14

శిఖిశాతకర్ణికి విద్యార్థి జీవితమున నాలందలో రెండు సంవత్సరములు గడచినవి. ఈ వర్షద్వయమున నెన్నో పరిణామములు సంభవించినవి. వయోవృద్ధులైన విద్యార్థులు, 'పృథువులు' విద్య పూర్తిజేసుకొని వెళ్ళిపోయినారు. బ్రహ్మాయువు, మంగళుఁడు, ధ్వజకేతువు,మరి యితర మిత్రులు కొందరు పృథువులైనారు. విజితావి, ఏకశృంగుఁడు వంటి దుష్టవిద్యార్థులు సమస్త దుష్కృత్యముల బాల్గొనుచున్నారు. కాని బయటపడక తప్పించుకొనుచున్నారు.

రేవా సంస్థానాధీశ్వరుని కోరిక ననుసరించి కాశ్యపుఁడు సామాన్య జీవితధర్మముల బ్రచారమొనర్ప నా దేశమున కేగినాడు. గయాశీర్షుడు బుద్ధగయలో కొంతకాలము విశ్రాంతి గైకొందునని ప్రార్థించి శీలభద్రాచార్యుని యనుమతితో నటనివసించు చున్నాడు.

పూర్వోక్తకారణముల మూలమున నాలందలో వెనుకనున్న క్రమశిక్షణము కనుపించుట లేదు. నూతనముగ బ్రవేశించిన విద్యార్థులలో శాతకర్ణిసోదరుడు శ్రీముఖుడు చిత్రమైన వాడు. అతడు ప్రవేశించిన కక్ష్యకు పృథువు నేడు మంగళు ఁడు. మంగళుడు ఏకశృంగాది దుష్టుల సహాయముతో బ్రత్యేకముగ నొక విచిత్రమార్గము ననుసరించి విద్యాలయమందలి యాచారములకై విప్లవమొనర్పయత్నించుచున్నాడు. వారి కుటిల తంత్రములకు శ్రీముఖశాతకర్ణి యొకయాటంకము. అతఁడా మిత్రబృందమున నొదుగువాఁడు కాదు. అతని నెట్లైన దమపక్షమునకు ద్రిప్పుకొననొక జిత్తులమారి విద్యార్థినతనితో నేస్తమొనర్చ మంగళుఁడు బ్రోత్సహించినాడు. కాని లాభము లేకపోయినది. మంగళుఁడతనిని తన కక్ష్యనుండి పంపివేసినాడు.

శ్రీముఖుఁడతని కక్ష్యలో నున్నప్పుడు మంగళుడు మత్తును గల్పించు నాసవముల ద్రాగుమని బలవంత పెట్టించినాడు. అతడంగీకరింపకున్న నతని ముఖముపై నాసవ ముమియించుట, పాదతాడన మొనర్చుట జేయించినాడు. వారి దుష్కృత్యముల నెల్ల శ్రీముఖుడు వీరునివలె భరించినాడు. స్థిరచిత్తముతో వారి నెదుర్కొనుటకతనికి సాయపడిన మిత్రుడే సుజాతుఁడు. ఇతర సహపాఠకులు శ్రీముఖుని శిక్షించు విధానమును గూర్చి యతఁడెన్నో మారులు మంగళునితో జెప్పినాడు. అట్టి క్రూరచర్యలు జరుగకుండ జూడవలసినదని కోరినాడు. ఆచర్యల వలన నతనికి విశేష ప్రయోజన మున్నదని మంగళుఁడు సమాధానముజెప్పి 'శ్రీముఖుని విషయమును నా యొద్ద పదేపదిగ బ్రస్తావింప'కు మని పలికినాడు.

కౌముదీచాతుర్మా సాంత్యదినమున విద్యార్థులు మత్తతగల్పించు పుష్పాసవముల దెచ్చి త్రాగుచుండుట కలవాటుపడినారు. ఎవరైన నుపాధ్యాయులు వచ్చి వాసనను గ్రహించి ప్రశ్నించిన నెవ్వరును సమాధానము జెప్పకుండునట్లు నిశ్చితమైనది. వారు ప్రమాణము లొనర్చినారు.

అందుకు శ్రీముఖుఁడంగీకరింపలేదు. ప్రతిదినము రాత్రియతనిని ప్రమాణమొనర్పుమని వారు బలవంతపెట్టినారు. ఒకదినమాతనిని కఠినముగ కొట్టి తిట్టినారు. అతఁడంగీకరించుటకు సిద్ధపడి ప్రమాణమొనర్ప పారమిత గ్రంథమును శిరము పైకెత్తికొన బోవుచున్నాడు. మఱియొక విద్యార్థి 'అతడొనర్చిన నేను నంగీకరింతు'నని యన్నమాట చెవిబడినది. వెంటనే యతనికి మఱియొకఁడు తనతో బతనమగుట కష్టము గల్గించినది. అతడు "నేను ప్రమాణ మొనర్పలేను. నా జీవితమున నెన్నడు నేనసత్యమాడలేదు. నన్ను బలవంత పెట్టకుఁ"డని ప్రార్థించినాడు. దుష్టవిద్యార్థుల ముఖమున క్రోధరస ముప్పొంగినది. అతనిని యనరాని మాటలనినారు నిదురించు శయ్యపైనుండి పాదముల బట్టుకొని క్రిందికి దిగలాగినారు. పాదతాడనములతో నతని శరీర మాపాదమస్తకమును నొప్పించినారు. కాని యతడు లొంగలేదు ఉదాత్త వ్యక్తివలె నా కష్టములనెల్లభరించినాడు.

తన కష్టముల శ్రీముఖుఁడింతకు బూర్వమెన్నడును శిఖిశాతకర్ణికి జెప్పుకొనలేదు. నేడతనితో జెప్పుకొని హృదయావేదననపనయించుకొన నిశ్చయించి సోదరుని నివాసగృహమున కేగినాడు. అతనితో నెట్టియభియోగ ముల శ్రీముఖుఁడెవ్వరిపైనను జెప్పలేదు. తండ్రి యతనిని మరియొక విద్యాలయమునకు బంపుట కవకాశమున్నదేమోయని సోదరునడుగ నేగినాడు.

"శ్రీముఖా! నీ విద్య బాగుగ సాగుచున్నదా?"

"నేనతి క్లిష్టస్థితిలో నున్నాను" 'ఎట్టిదోషమునొనర్పలేదుగద. నా యెదుట నెట్టి విషయమైన జంకులేక నీవుచెప్పవచ్చును'.

"లేదు. దుష్టకృత్యమున కంగీకారము నీయలేదని వారు నన్ను కష్టపెట్టుచున్నారు."

"అంతేనా? కన్నీరు తుడుచుకొనుము. కష్టము నీదేర్పభగవానుని బ్రార్థింపుము. నీవంగీకరింపకున్న నీచే నెవరైననెట్టిదుష్కృత్యమును జేయింపలేరు".

"నా నివాసగృహ మొక నరకముగ నున్నది. సుజాతుఁడు తప్ప నన్ను దయతో జూచు సహపాఠి యొక్కఁడునందులేడు".

"వారు నీకెట్టి కష్టముల గల్గించినను దుష్కృత్యములకు లొంగకుము".

"నాచే వారెన్నడూ బలవంతముగ నట్టిపనులు జేయించుటకు బూనుకొనినారు? నేను దిరిగియింటికి పోదలచుచున్నాను. ప్రతి నిత్యము త్రికాలముల నన్ను వారు దూషించుచున్నారు పాదతాడన మొనర్చుచున్నారు హింసించుచున్నారు."

"నిజమా! నిన్ను వారంత నొప్పించుచున్నారా? అమితాభుని వలన వారు నిన్ను కష్టపెట్టుచున్నారని వినినాను. కాని వారి ప్రవర్తనమింత దుష్టముగనున్నదని నేను భావింపలేదు. వారిలో నెవ్వరైన నా కంటబడిన నాడు వారి పని బట్టించెదను."

"అన్నా! భరింపశక్యముగాక జెప్పుకొనినానుగాని వారు నీకు నివేదింపవలదని నాచే బ్రమాణము జేయించుకొనినారు".

"నిన్నా కక్ష్యనుండి మార్పింప యత్నింతును. కొంతకాలము నీవోపిక బట్టవలయును వారి దుష్కృత్యమునకు లొంగకుము. బ్రమాణమొనర్పుము."

నమ్రభావముతో శ్రీముఖుడు సోదరుని హస్తమున జేయినుంచి బ్రమాణ మొనర్చినాడు.

"నీవిషయమై నేను బ్రహ్మాయువుతో మాటాడెదను. అతఁడు నేడు వృథులకెల్ల బెద్ద. మంగళునితో జెప్పి యేమైన జేయింపగలఁడు".

"మంగళుఁడా? వారి కండగనున్నాడు. నాకుసాయమొనర్పనిచ్చగింపడు".

"కానిమ్ము! నీవు వీరాధివీరులు జన్మించిన వంగడమున బుట్టినావు. ధైర్యము వహింపుము".

ఘంటికానాదము విని సోదరులిరువురును భోజనశాలవైపు ప్రయాణ మైనారు.

శ్రీముఖుఁడు భోజనానంతరము వసతి గృహమున కేగి శయ్యపై బరుండినాడు. కొలది కాలములోనతని సుఖనిద్రకు భంగము వాటిల్లునని యతఁడెరుగును.

కుశద్రుముఁడు తన దుష్టపరివారముతో నతని కక్ష్యలో బ్రవేశించినాడు. "ఇది కడసారి ప్రశ్న. ప్రమాణ మొనర్పనంగీకరింతువా? లేదా?"

"ఆ ఉత్పలుఁడును, మొనగాడు. జాగ్రత్త! ఒడలు దగ్గర నుంచుకొని మరి యాలోచించి ప్రమాణ మొనర్చుడు" అని యొక గొంతుక వినిపించినది.

కుశద్రుముఁడు వీపువెనుక దాచిన వెదురుబెత్తమును దీసి ఝళిపించినాడు. ఉత్పలుని ముఖమున నెత్తురు చుక్కలేదు. భయపడి వెంటనే ప్రమాణ మొనర్చినాడు.

"బాగున్నది శ్రీముఖా! నీవునిట్లు దారికిరమ్ము. మిత్రువని యింతకాల మశ్రద్ధ జేసినాము" అని ఫణియనినాడు.

"నీవు నాకు మిత్రుఁడవు కావు"

ఫణి క్రోధముతో బడగవిప్పిబుసలు గొట్టుచు బైబడునాగము వలె నతనిపై బడినాడు. శ్రీముఖుడు శక్తికొలది పోరాడి యతనిని క్రిందబడవైచినాడు. కుశద్రుముఁడు రెండు చేతులతో నతని బట్టుకొని 'మఱల నొకమారు వానిపై కేగిన బ్రాణములు దక్కవు' అని బెదరించినాడు. 'ప్రమాణమొనర్పు'మని గద్దించినాడు.

"కుత్తుకలో బ్రాణమున్నంతవర కాయకృత్య మొనర్పను". అని నిశ్చయముగ శ్రీముఖుడు పలికినాడు.

కుశద్రుముఁడు వెదురుబెత్తముతో నతని వీపుపై నొకదెబ్బకొట్టినాడు. శ్రీముఖుడు పెద్దపెట్టున కేకపెట్టి నెలపైబడి నురుగులు గ్రక్కుచున్నాడు. అతనికి స్మృతిదప్పినది. ద్వారమును ద్రోసికొనివచ్చి సుజాతుఁడు పట్టరాని కోపముతో బ్రవేశించినాడు. వెంటనే మంగళుడు నచ్చటికిజేరుకొనెను.

"ఇతనిని మీరే మొనర్చినారు? రక్తము కదుము గట్టినదే. మంగళా! చూడు. వీరు రాక్షసులు" ప్రక్కవారిని జేతులతో నెట్టిపారవేయుచు బలమైన చేతులతో కుజధ్వజుని యంస భాగముల బట్టుకొని, "ఈ క్రూరకృత్యమొనర్చినది నీవేనా?"యని సుజాతుఁడడిగినాడు.

"మా జోలి నీకెందుకు? నీపని యేదో యేడ్చుకొనుము".

'ఔను, ఏడ్చుకొందును. నిన్ను నేడ్పింతుచూడు'మని యతని చేతనున్న వెదురు బెత్తమును లాగుకొని యతనివాచి పోవునట్లకొట్టినాడు. మంగళుడడ్డువచ్చుటకు వెఱచినాడు.

కుజధ్వజుడు బాధతో, నవమానముతో నటనుండి నెమ్మదిగ తప్పుకొని పారిపోయినాడు.

"మీరును మీకక్ష్యల కేగు"దని కఠినముగ నతఁడు బెదరింపనటనొక పురుగైన మిగుల లేదు.

"మంగళా! పృథువు వయ్యు నీవు నీకర్తవ్యమును సక్రమముగ నిర్వర్తించుట లే"దని యతఁడన నా యుద్రేకమున బెత్తముతో దన్నును 'బూజించు' నేమో యనుభయమున సమాధానమీయక మంగళుఁడు నెమ్మదిగ జారుకొనినాడు.

శ్రీముఖునికి స్మృతి వచ్చినది.

"ఇక ముందెవ్వరైన శ్రీముఖుని యొంటిపై జేయివైచిన జాగ్రత్త!"యని సుజాతుఁడా విహారమున నున్న ప్రతి కక్ష్యకు నేగి విద్యార్థుల బెదరించినాడు. కన్నీరు మున్నీరుగ నేడ్చుచున్న శ్రీముఖునోదార్చి యతఁడు శాతకర్ణిని గలుసుకొననేగినాడు.

శ్రీముఖుని మిత్రుడొకఁడువచ్చి గౌరవమును వెలిబుచ్చుచునతనితో నిట్లనినాడు.

"మిత్రుడా! నీవే జయించినావు."

## 15

నాలందలో నాతతాయుల ప్రభావమస్తమించుచున్నది. వారు పృథువులపై బెద్దయెత్తుగ నొక కుట్ర పన్నుచున్నారు. విహార, విద్యాలయ ప్రాకారములపై నిలిచి ఏకశృంగుఁడు నతని మిత్రులు వారిపై నొంటిగజూచి రాళ్ళు రువ్వుచున్నారు. మొదటనవి పరిహాస ప్రాయములని వారు భావించినారు. దుష్టులంతటితో నాగలేదు.

ఉపాధ్యాయులపై నట్లే శిలల బ్రయోగించుచున్నారు. పృథువులు సమస్త కక్ష్యలలో నీశిలావృష్టుల గురించి ప్రసంగించినారు. విద్యార్థులిట్టి ప్రకటన 'లవమానకరము'లని యొక విప్లవమును ఏకశృంగుని నాయకత్వమున లేవదీసినారు. కాని బ్రహ్మాయువు, నతని మిత్రులైన యితర పృథువులు దానిని ప్రారంభదశలోనే తుదముట్టించినారు.

'నాయకుల నందఱ బట్టుకొని కఠినముగ శిక్షింపవలసిన'దని శాతకర్ణి బ్రహ్మాయువుతో జెప్పి యొప్పించినాడు.

మఱునాడుదయమున మరల స్వల్పముగ శిలావృష్టులారంభమైనవి. పృథువులు జాగ్రత్తగ నన్నిమూలల గంటిలో వత్తిడుకొని గమనించుచున్నారు. దొంగలు పట్టుబడినారు.

"ఏకశృంగా! నీకేమి దుర్బుద్ధి. పెద్దవాఁడవై యిట్టి దుష్కృత్యము లొనర్చి యితరుల బ్రేరేపించి దుర్నీతిని బోధించుచున్నా"వని శాతకర్ణి గద్దించిపలికినాడు.

"నా యిష్టము. నీవు నోరుమూసుకొను"మని ఏకశృంగుఁడొక విషపు నవ్వునవ్వినాడు.

"స్వల్పకాలములోనే దీనికి తగిన ఫలమనుభవింతువు. రమ్ము! లేకున్న నెదుర్కొనసిద్ధపడు" మని శాతకర్ణి తిరస్కృత దృష్టులతనిపై బరపినాడు. ధ్వజకేతువు ముందుకువచ్చి "నీవు బ్రహ్మాయువుపై శిలల బ్రయోగింప నేను కళ్ళారజూచినాను. పృథువుల యొద్దకుర"మ్మని కుశద్రుముని బిలచినాడు.

"నేనచటికి మహానందముతో వచ్చెదను. ఆ 'దుక్కిపిట్టలు' నన్నేమి జేయగలరు?"

"అవును మహానందముతో వచ్చెదవు. నాలంద నుండి యంతకంటె మహానందముతో వెళ్ళిపోయెదవు". ఈ వెక్కిరింపుకు విద్యార్థులు పగలబడి నవ్వినారు.

"విజితావీ! నీవు విసరిన రాయి శాతకర్ణి ముఖమున దగిలినది. నిన్న నమృతవర్షోపాధ్యాయులపై శిలావృష్టి కురిపించినది నీవేనని నా నమ్మకము."

"నేను విసరలేదు"

"నీ వసత్యవాదివి".

"నీకు నాపై నీర్ష్య".

"నా జీవితమున నిన్ను గుఱించి కలలోనైన యోచింపలేదు. నిన్న నాచార్య కాశ్యపులపై రాయివిసిరినది నీవుకాదందువా?" యన్న బ్రహ్మాయువు కఠినోక్తికి విజితావి ముఖము వివర్ణమైనది. భయకంపిత స్వనముతో నతఁడు 'నేనెఱుఁగ' నినాడు.

'నీవు పిఱికిపందవు. ధైర్యముతో నంగీకరింపలేవు. విద్యార్థుల ప్రేరేపించు నిన్ను గనులార జూచినాను. నీవునా ఏకశృంగుఁడు లేకున్న విద్యార్థులిట్టి యకృత్యముల

దలపెట్టువారుకారు. నీవు విసరిన రాయికి ఉత్తరుని శిరముపై బొప్పికట్టినది.' అని తుందిలుఁడు తొందరపడినాడు.

'అతనిని శిక్షించుట మాకు వదలిపెట్టుము' అని శాతకర్ణి యతనిని వారించి, 'విజితావీ! నీ తప్పిదమునిప్పటికైన నంగీకరించినావా'యని బిట్టుగ బలికినాడు.

'నేను విసరినది స్వల్పమగు శిలాఖండము' శాతకర్ణి తిరస్కారముతో బెదవి విరిచినాడు.

'అవసరము లేదు. క్షమాపణ వారికొక లెక్కయా! ఇటువంటి వాటికి యీదుష్టులెన్నడో సిద్ధపడినారు. వారి పతనమునకు లోతందదు. లేకున్న నిట్టి దుష్కృత్యమునకు బూనుకొందురా' అని తుందిలుఁడనినాడు.

"నీవు వలదనినను నతడు క్షమాపణ జెప్పకతప్పదు. అది నాలంద నిలయాచార"మని శాతకర్ణియనినాడు.

కుశద్రుముఁడు 'దాని నంగీకరింపవల'దని విజితావితోననినాడు.

'ఎవరది? కుశద్రుముఁడా?' అతడు నీవలన చెడిపోవు చున్నాఁడని ధ్వజకేతువనినాడు.

'క్షమాపణపత్రమును బఠింపుము' – అని పత్రికను ధ్వజకేతువు విజితావి చేతికిచ్చినాడు.

విజితావి నెమ్మదిగ దానిని జూచి యేమో గొణిగినాడు. మాకు వినిపింపలేదు' 'పెద్దగ మోకాళ్ళపై నిలచి సాష్టాంగముగ'యని మిత్రులు గొడవపెట్టినారు. వెనుకనుండి కోపముతో తుందిలుఁడు వచ్చి యతనిని మోకాళ్ళపై కూర్చుండబెట్టి క్షమాపణ పత్రమును జదివించినాడు.

'ఇక ముందిట్టి వెన్నడును జరుగవని మేమాశించుచున్నాము. పృథువులుండుట మీ క్షేమమునకే. లేకున్న విజితావి వంటి దుష్టులచేతులలో మీకెంత ప్రమాదము. మీరు పృథువుల నెందుకు ధిక్కరింపనెంతురో నాకర్థమగుట లేదు. మిమ్ములను బ్రేరేపించు వారు మూర్ఖులని మున్ముందుమీరు గ్రహింపగలరు. మీరు సత్ప్రవర్తకులైయుండ నిశ్చయించుకొనిన మిమ్ము దుర్మార్గమున నడుపగలవాడెవ్వడు?'

విద్యార్థులందరు బ్రహ్మయువు పలికిన యీసామాన్య వాక్యముల కమితానంద మొందిరి. అట్టివారు తమ పృథువులలో బెద్దగనుండుట వారి యదృష్టమని భావించిరి.

బ్రహ్మాయువు వంటి విద్యార్థి పూర్వమెన్నడును నాలందలో విద్య నేర్చుకొన రాలేదని యేకగ్రీవముగ వారు నిశ్చయించిరి.

'కనిష్ఠసోదరులారా! మిమ్ములను వారి దౌష్ట్యములకు సాధనములుగ కొందఱుపయోగించుచున్నారు. వారి వలలో జిక్కు పడకుడు. స్వతస్సిద్ధముగ మీ హృదయముల క్రూరతలేదు. అందువలన మిమ్ము ముందు జూచినను శిక్షింపక నౌదార్యముతో విడిచి పుచ్చుచున్నాను. దీనిని గ్రహించి బుద్ధిమంతులై ప్రవర్తింపుఁ"డని శాతకర్ణి వయస్సున జిన్నవారితో బలికినాడు.

విద్యార్థులందఱును సభా భవనమునుండి వెళ్లిపోవుచున్నారు. ధ్వజకేతువు మయూరుని భుజముపై హస్తముంచి యాప్యాయముగ నెటకో బిలచుకొనిపోయి 'నీతిమంతుఁడవుగ'మ్మని యుద్బోధించినాడు.

ఏకశృంగుడు, కుబ్జుఁడు పృథువులు పిలిచిన, వారిని తిరస్కరించి యగౌరవించుట కవకాశము లభించుననుకొనినారు. కాని వారు తమకంటె శారీరక శక్తివంతులు, నైతిక బలము గల పృథువర్గము గౌరవముతో వారి యాజ్ఞల బాలించుట గమనించిన తరువాత నట్టి క్రియకు బూనుకొనవారికి ధైర్యముచాలలేదు. పృథువులు వారిచే మఱల నిట్టి దుష్క్రియలకు బూనుకొనమని ప్రమాణ పత్రికలు వ్రాయించుకొని యూరక వదలి పెట్టినారు.

## 16

శీలభద్రాచార్యుడు తిరిగి నాలందకు విచ్చేసినాడు. ఆ గురుదేవుడు లేని కాలముల పుట్టిన చెడుగుల నన్నిటి నాయన స్వల్పకాలములో నిర్మూలించినాడు. సమస్తము నొక నూతన పరిణామము నొందినది. శ్రీముఖ శాతకర్ణివంటి విద్యార్థులకును నాలంద యన నభిమానము, మమకారము కలుగనారంభించినది.

దుష్టులునంత వేగముగ పృథువులకు లొంగిపోదలపక 'నవకాశము లెపుడు వచ్చునా'యని కాచుకొని కూర్చొనినారు. మంగళుని సహాయమును లభించి నపుడెల్ల వారొక 'రభస' జేయదలపెట్టినారు.

పరిసర గ్రామముల నుండి విద్యార్థులకై తినుబండారముల నమ్ముకొన పేదవారు గంపలతో వచ్చి వ్యాపారము జేసికొని క్షేమముగ వెడలుచుండుట యనాదినుండి పరిపాటియైనది. విద్యార్థులు వారితో బేరములు కావించి కావలసిన ఫలాదుల విలుచుకొని సగౌరవముగ వారికి ధనమిచ్చి పంపుచుందురు.

సుజాత కడు పేదరాలు వృద్ధు. పోషించి పాలించు 'నా'యను వారెవ్వరు నామెకు లేరు. ఆమె ఫలములతో నింపిన బరువైన గంపనెత్తుకొని నాలంద వీథులలో బ్రవేశించి యమ్మ కొనుచున్నది. ఒక మాసము కష్టపడిన యామె గ్రామములో మూడు మాసములలో వచ్చిన డబ్బుతో జీవితము గడుపుకొన దలపోసినది. నేడో రేపో పండు పండి రాలిపోనున్న సుజాతయన విద్యార్థుల కమితాభిమానము. ఆమె నొకచోట కూర్చుండబెట్టి ఫలముల నన్నిటిని నొకరమ్మి ధనమిచ్చి యింటికి బంపుచుండెడి వారు. తట్ట నెత్తుకొనునప్పుడు, దించుకొనునప్పుడు నామెకు జేయూత నిచ్చుచుండెడివారు. మార్గమధ్యమున గొంతదూరము వారే మోసికొనివచ్చుటయు గలదు.

శిఖిశాతకర్ణి కామెపై ప్రత్యేకాభిమానము. అతని మిత్రులతో నామె కెట్టికష్టముల గల్గింప వలదని యనేక పర్యాయములు హెచ్చరించినాడు.

ఆనాడు సుజాతను శ్రీముఖ శాతకర్ణి తన నివాసగృహమునకు బండ్లుకొన బిలిచినాడు. అతఁడామెతో బేరమాడు సమయమున గొందఱు దుష్టులామెను జుట్టుముట్టి ఫలముల నెత్తుకొని తలకొక దిక్కున కేగినారు. మిగిలిన పళ్ళగంపను నేలపై బోర్లించి గగ్గోలు పెట్టి కిలకిలలతో గంతులు వేసినారు.

శ్రీముఖ శాతకర్ణికి బట్టరాని కోపము వచ్చినది. ఏమిచేయగలడు? అన్ని ఫలముల ధనమును బుచ్చుకొనుమని సుజాతకు దన యొద్దనున్న ధనమిచ్చినాడు. అది చాలదు. శతపుష్పుఁడు దూరముగ విద్యార్థులెత్తుకొని పోయిన ఫలములనన్నిటిని రాసిబోయించి సమానముగ బంచిపెట్టుచున్నాడు.

ఆ దృశ్యము శ్రీముఖి శాతకర్ణి కంటఁబడినది. అట్టి దుష్కృత్యము నతఁడు సహింపలేక నతివేగముతో నచటికి బరుగెత్తి శతపుష్పుని పైబడినాడు. అతడు మొదట నిర్ఘాంతపోయినాడు. తెలివి దెచ్చుకొని జుట్టునున్న దుష్టుల నుసికొల్పినాడు. కాని వారు పృథువులు విన్న గఠినముగ శిక్షింతురను భయముతో నతనికి తోడ్పాటొసంగ వెనుదీసినారు.

శతపుష్పుఁడు బయటపడు మార్గమాలోచించి 'ఇవి సుజాత ఫలములు గావు. మేము వీనిని మరియొకని యొద్ద నిన్న విక్రయించుకొనినా'మని యసత్యమాడినాడు. శ్రీముఖుడు "పేదరాలి ధనమపహరించుట మహాపాతకము. అబద్ధమాడుటలో నేమానందమో నా కర్థమగుట లేదు. ఈ ఫలములు సుజాతవి కావా? మీరామె

గంపపై బడి వీని నెత్తుకొని పారిపోవుట నాకళ్ళతో జూచినా"నని ఖండితముగ బలికినాడు.

"అయిన నీకన్నులలో దృష్టిదోషమున్నదన్నమాట? జరుగనివి జరిగినట్లు వానికి కనుపించునేమో?"యన ప్రక్కనున్న వారు శతపుష్పుని మాటలకు శ్రీముఖిని గేలిచేసినారు.

"నీవు ప్రతి స్వల్ప విషయమునకు జోక్యము గల్గించుకొని మాపై లేడిపిల్లవలె దుముకుచున్నావు. మీ సోదరుని జూచి వెరతు మనుకొనుచున్నా వేమో! మేము పిఱికివారము కాము, జాగ్రత్త"యని మయూరుఁడు ముందుకువచ్చి బెదరించినాడు.

"వీడికి తగినశాస్తి జేయక జూచెదవేమి? శతపుష్పా! వీనిపై నీవొక మారైన జేయి జేసుకొనకున్న వీడు నోరు మూసుకొనడు".

"నీ యభిప్రాయమేమిటో యర్థమగుట లేదు" "నీవు సుజాత ఫలములఁగా జేసినావు".

అతని నోటివెంట వాక్యము పూర్తిగాకమునుపే మయూరుఁడు శాతకర్ణి చెంపపై నొక దెబ్బకొట్టినాడు.

"మయూరా! ఇందు నీప్రసక్తిలేదు. నేను నీతో మాట్లాడలేదు. అకారణముగ నన్నిట్టు కొట్టినావు నన్ను పోరాటమునకు బురికొల్పుచున్నా"వని శ్రీముఖుడు మఱలనతనికి చెంపదెబ్బతో సమాధానము జెప్పినాడు.

ఆయిరువురును సమానశక్తి బలసంపన్నులు. పోరాటము కొంతసేపు సాగినది. ఇరువురి శరీరములు రక్తప్లుతములైనవి. ఇంకను బోరాడుచున్నారు. దూరముగ ధ్వజకేతువు, స్వాతిరత్నోదధి భాండారమునుండి తిరిగి వచ్చుచు విద్యార్థులగుంపును జూచినారు.

ధ్వజకేతువు 'శ్రీముఖుఁడు – మయూరుఁడు!' వీరిరువురును బోరాడుకొనుటలో యుక్తము లేకున్న శ్రీముఖుడుఁను వారిలో నొకడై చెడిపోగలడనినాడు.

"పాపము! బహుకాలమునుండి పోరాడుచున్నట్లున్నారు. నీవు పృథువువు. వారి పోరాటము మాన్పించి యిరువురు మఱల మిత్రులుగా బంపివేయ యత్నింపు"మని స్వాతియనినాడు.

గుంపును జేతులతో బ్రక్కకు సర్దుచు 'రంగస్థలమున' బ్రవేశించి "ఇఁక చాలింపుడు!" అని కేకపెట్టి "కలహమెందుకు వచ్చినది?" అని యడిగినాడు.

'ఇరువురకు నుజ్జీకుదిరినది. పోరాటమును మాన్పింపవద్ద'ని యెవరో పలికినారు.

'కారణమేమిటి? నాకు తెలియవలెను' అని ధ్వజకేతువు ప్రశ్నింప 'తప్పుగాడు' సుజాత ఫలముల దొంగిలించినావని శతపుష్పుని నిందించి 'పైబడబోవ నితడడ్డుపడినాఁ'డని కుశద్రుముడనినాడు.

"తప్పుగాడెవరు?" "శ్రీముఖుడు".

స్వాతి "మీరిరువురు నిటు రండు - మిత్రుల మైనామని పలికి యాలింగనమొనర్చు కొనుడు" అని శ్రీముఖ మయూరుల గోరినాడు.

శ్రీముఖుడు క్షణకాలము వెనుదీసి చిరుతకరముల జాచినాడు. మయూఁరుడు 'శతపుష్పుని వృథగనిందించిన యసత్యవాది నాలింగన మొనర్చుకొనుటకు నా మానస మంగీకరించుట లే'దనినాడు.

"నీవే యసత్య వాదివి. ఆ ఫలములతో సుజాత కడకేగిన నెవ్వ రసత్య వాదులో తేలగలదు" అని శ్రీముఖుఁడనినాడు.

స్వాతి వారిరువురతో సుజాతకడకేగి ఫలముల జూపించి 'ఇవి నీవేనా?' యనినాడు. సుజాత పట్టరాని సంతోషముతో నాతనికి మ్రొక్కుచు ఫలములు పోయినవను దుఃఖముతో గార్చిన కన్నీరు దుడుచుకొని ముఖముపై నాశాజ్యోతి బ్రకటించినది. స్వాతి యామెకు గొంతధనమిచ్చి 'యిక బొమ్ము మరల నిన్నెవ్వ రీయావరణమున నిట్లుకష్టపెట్ట'రనినాడు. దొరకని మరికొన్ని పండ్లకై స్వాతి, ధ్వజకేతువులు దుష్ట విద్యార్థుల వెదకుచున్నారు. వారందుకు వ్యతిరేకించినారు. ఈ వాక్కలహము చెవినబడి దూరముగ పోవుచున్న మంగళుఁడు వచ్చి 'వారిని వెదుకుటకు మీకేమియు అధికారము లేదు.'

"అరుగో మన పృథువులలో పెద్దలు - బ్రహ్మాయువు, శాతకర్ణి వారే వీరిని వెదుకుదురు" అని వచ్చుచున్న వారిని జూపించి ధ్వజకేతువనినాడు.

"అతి స్వల్పవిషయమునకింత రాద్ధాంతమెందులకు?- శ్రీముఖుఁడును సామాన్యుఁడుగాఁ"డని మంగళుఁడనినాడు.

"శ్రీముఖా! ఏమిటది?"యని శాతకర్ణి దగ్గరకు వచ్చి తమ్ముని క్షతగాత్రమును, రక్తసిక్తముఖమును బరిశీలించినాడు.

“కలహించుకొనినాము. సుజాత ఫలములు శతపుష్పుడు దొంగిలించి పారిపోవుచుండ నేనతనిని బట్టుకొనినానని మయూరుడు నాపైబడినాడు”.

‘అతడు దొంగిలించి పారిపోవుట నీవు కన్నులారా చూచితివా?’

‘చూచితిని, సుజాత యీ ఫలములు తనవేనని యంగీకరించినది. ఇంకను నొక కొన్ని యతని యొడిలో నున్నవి.

‘అయిన బ్రహ్మీయూ! ఇతని యొడి వెతికింతము’

“అతని పృథువు మంగళుడు – అతనిచే వెదకింతము”

అతని నెవరు వెదుకుటకైన శతపుష్పుడంగీకరింపలేదు. బ్రహ్మీయువు బలవంతంగా నతనియొడి వెదకమని ధ్వజకేతువు నాజ్ఞాపించినాడు.

ధ్వజకేతువతనిని బట్టుకొనినాడు. ఆ దుష్టబాలకులు దానిని భగ్నమొనర్పదలచి ముందుకు రెండడుగులు వైచినారు. కాని ధైర్యము చాలలేదు. స్వాతియతని యొడిలో జేయివెట్టి ఫలములు బయటకు దీసినాడు.

“శతపుష్పా! నీవు దొంగవు. అసత్యవాదివి. నీవంటి వారున్న నాలంద కెంతటి యపకీర్తి?”

“ఇతనికేమి శిక్ష” యని బ్రహ్మీయువు విద్యార్థులలో నున్న పృథువుల జూచి పలికినాడు.

‘ఏశిక్ష తరువాత బాలకులకు పాఠము కాగలదో యట్టిశిక్ష నొసగుట యుచిత’మని శాతకర్ణి యభిప్రాయమిచ్చినాడు.

‘నిజము – ఉత్తరా ఒక బెత్తమును దెచ్చిపెట్టుము’.

మంగళుడు ముందుకువచ్చి ‘నీకతని శిక్షించు నధికారము లేదు. అతనిని వెదకించుటయే తప్పు’ అనినాడు.

‘అతనిని నే శిక్షింపదలచినాను. ఎవరడ్డు రాదలచినారో చూచెదను.’

‘మేము’ అని కొన్ని గొంతుకలు వినిపించినవి. వానిలో ఏకశృంగ, కుశధ్వజుల కంఠములు విస్పష్టముగ వినిపించినవి.

‘అయిన మీరు పశుబలముతో నన్ను ధిక్కరింపదలచినారన్నమాట!’ “ఔను” ‘మంగళా! దానికి నీవంగీకరింతువా?’

మైమరచి మంగళుడు 'అంగీకరింతు' ననినాడు "శిక్షించుట నా కర్తవ్యము. దీని నెర వేర్చ నేను జంకువాడనుగాను" అని బ్రహ్మాయువనినాడు. ఉత్తరుడుబెత్తముతో దిరిగివచ్చినాడు.

ఏకశృంగుని పశుబలము నెదుర్కొన కాటాయనుడు నతని మిత్రులు సిద్ధపడినారు. మంజీరుడు, మహిముడు పృథువుల పక్షమున నున్నారు. ఒక పృథువు శతపుష్పుని వెనకనిల్చి యతని హస్తమును దక్షిణముఖముగ చాచినాడు. బ్రహ్మాయువు మొదటదెబ్బ కొట్టినాడు.

ఏకశృంగుని పక్షమువారు ముందుకు సాగివచ్చినారు. వారి వెనువెంట మంజీర మహిమలు కదలి మిత్రులతో వారిని హస్తముల బంధించినారు. మంగళుడు త్రోసుకొని ముందుకు వచ్చి బ్రహ్మాయువుపైబడ నుంకించుచున్న సమయమున బలిష్ఠములగు హస్తములతో వెనుకనుండి శిఖిశాతకర్ణి యతని నటనుండి దూరముగ దొలగించి సకరుణముగ.

"మంగళా! నీవంటి మిత్రునిట్లు బంధింపవలసి వచ్చినది. క్షమించు. లేకున్న ననవసరముగ నీ జీవితము భగ్నముకాగలదు. కాలము గడచిన తరువాత నీవు నన్నభినందింతు"వని నాడు.

అతని కరుణాపూరిత వాక్యములు మంగళున కాశ్చర్యము కలిగించినవి. మూడు సంవత్సరముల నుండి యొకనాటి తనయాప్తమిత్రుడాతని శరీర మెన్నడును స్పృశింపలేదు ఒకమాట మాట్లాడలేదు. మంగళుని హృదయమున శాతకర్ణిపై నెంతో క్రోధమున్నది. అతడనిన వైరము.

కాని యా వాక్యములలో మంగళునికి గొంతసత్యము గోచరించినది. అతడేమియు వ్యతిరేకముగ మాటాడ లేక పోయినాడు రంగస్థలమును వీడి వెడలినాడు.

మాంజిష్ఠునితో నెట్టి సంబంధమునైన బెట్టుకొనిన విద్యార్థుల కఠినముగ శిక్షింతునని శీలభద్రాచార్యుడనేక పర్యాయములు విద్యార్థుల హెచ్చరించినాడు. ఏకశృంగ, కుశధ్వజ, విజితావు లాయాచార్యుని వాక్యముల గౌరవించుటలేదు. అందువలన నాచార్యుడొక విద్యార్థి సభగావించి వారిని నాలంద విద్యాలయావరణమునుండి నిష్కరుణముగ బహిష్కరించినాడు. పిమ్మట నొకనాడు మంగళు 'నేకాంతముగ సంభాషింపర'మ్మని బిలిపించి ప్రథమమున నతని దుష్టసాంగత్యమును తెగడి చీవాట్లు పెట్టినాడు. విద్యార్థి లక్షణములను,

జీవితాదర్శస్వరూపము నటు పిమ్మట ననురాగముతో నతని కవగత మగునట్లు గంభీరముగ ప్రబోధించినాడు. ఆనాటి సంభాషణమును శీలభద్రాచార్యుని యౌదార్యమును జీవితాంతము వరకును మంగళునకు మరపు రాలేదు.

ఆయాచార్యుడు సంభాషించువేళ మంగళునినోట మాట రాలేదు వంచిన శిరము నెత్తలేదు. మనస్సు నానావిధ భావపరంపరలకు నిలయమైనది.

“నా హృదయము నిత్యము నీ శుభజీవితము నాకాంక్షించుట వలన నేను నిన్ను నాలందనుండి బహిష్కరింపలేదు. వ్యక్తి గతముగ నీకు నాపై గౌరవమున్నదని నేనెఱుగుదును. నీ యెడ నాకున్న యనురాగము కొంతకాలము నుండి సడలినది. మరల నీకు దానిని నే ప్రసాదించుచున్నాను. కాలమును వ్యర్థపుచ్చకుము. నీవు పృథువు వని నిరంతరమును మఱచిపోకుము. నీ కర్తవ్యపాలనముపై నితర విద్యార్థుల జీవితములు, నాలందా విద్యాలయ కీర్తి ప్రతిష్ఠలు నిలచి యున్నవని గుర్తెరుంగుము. నీ దుష్టప్రవర్తనమును దిద్దుకొనుట కీ సదవకాశమును కనికరించి నాచే నిప్పించినందుకు భగవానుని భక్తితో సేవింపుము. నిన్ను పృథువులతో తుదివానిగ నొనర్చినాను. నీ శీలమును మఱల కొంతకాలము పరిశీలింప వలసియున్నది. పొమ్ము” అని శీలభద్రాచార్యుడు మంగళుని పంపించినాడు.

ఆచార్యుడతనిని ‘తుది పృథువుగ’ తగ్గించినాడు. పృథువులు సభజేసి తన్నునుమానించుచున్నట్లొక తీర్మానము కావించినారు. దానిపై శాతకర్ణి స్వహస్తము లేదు. మంగళుడు తన పతనమును గుఱించి చింతింప నారంభించినాడు. శాతకర్ణి తీర్మానముపై సంతకమెందుకు పెట్టలేదు? వారిరువుర స్నేహచరిత్రయొక మారతని కన్నుల ముందు శరవేగమున గదలి పోయినది. అతని కన్నుల నీరు క్రమ్మినది. ‘నేనెట్టిమిత్రుని స్వదోషమున గోల్పోయినా’నని చింతించినాడు.

కుబ్జుడతని నివాసగృహములో ప్రవేశించి “ఇదుగో – నీవు మన బుద్ధపాదములకడ నీ ‘పాణినీయ శిక్ష’ మఱచి పోయినా”వని యతనిచేతి కా గ్రంథము నందించినాడు.

“ఈ గ్రంథము నాదే. దీనిని నేనిప్పుడు పోగొట్టుకొనలేదు బహుకాలమైనది సత్యము చెప్పనా? నేను నీతో మాటాడదలచి యిట్టి యవకాశమును గల్పించుకొనినాను”.

“తప్పక మాటాడుము”.

“నీ గృహ నిర్భాగ్యముల ననేక విద్యార్థులకు శాతకర్ణి చెప్పినాడని నీతో జెప్పి విజితావి నమ్మించినాడు. పాపము! శాతకర్ణియేమియు నెఱుగడు. అతడనిన గిట్టక నీవతనికి దోద్పడుచున్నావని మీ యిరువుర జీలదీయ నిట్టి పన్నాగము బన్నినాడు”.

“విజితావి నాతో నసత్యమాడునా? అయిన నా గృహస్థితులతనికెట్లు తెలిసినవి. శాతకర్ణివలన దప్ప మఱియొకరీతిగ నవి బయటబడుటకు వీలులేదు. అతడు బ్రహ్మీయువుకు దప్పనెవ్వరికిని జెప్పలేదని వెనుకయనినాడు. అతడే యసత్యమాడియుండు”నని మంగళుడు నిశ్చయముగ బలికినాడు.

‘శాతకర్ణి యతని జీవితమున నసత్యమెరుగడు. విజితావికి మీ గ్రామమున దూరబంధువులున్నారు. వారివలన నతడు నీ స్థితిగతుల తెలుసుకొనినానని నాతో జెప్పినాడు.”

‘ఓరి దుష్టుడా!’ అని మంగళుడ ప్రయత్నముగ ననినాడు. ‘కుబ్జా! ఇన్ని దినములు నేనొక మూర్ఖునివలె బ్రవర్తించినాను. అమృతమూర్తి నా ప్రియమిత్రుని శిఖిని దూరమొనర్చుకొనినా’నని యతడు చింతించినాడు.

‘కాలమనంతము. మరల మీ మైత్రి యథాక్రమముగ పూర్వరూపము నొంది వర్ధిల్లుగాక’యని కుబ్జుడు వెళ్ళిపోయినాడు. భోజనానంతరము మయూరుడు నివాసగృహమునకు దిరిగి వచ్చువేళ మంగళుడు తీక్ష్ణముగ నతని ‘పాణినీయశిక్షా’ గ్రంథమున ప్రథమపత్రముపై నున్న యొక రచనపై దృష్టినిల్పి మరలమరల జదువుకొనుచున్నాడు. అది మిత్రుడు శిఖిశాతకర్ణి వ్రాసిన క్షమాపణలేఖ. అందు బ్రత్యక్షరమున మిత్రుని యమృత హృదయము చిందులాడుచున్నది. మంగళుని మానసము చలించిపోవుచున్నది.

మంగళా! యని మయూరుని పిలుపు వినిపించినది. ‘ఇది యెంతటి శుభదిన’మను పరిశుద్ధ భావముతో గ్రంథమును చుట్టిపెట్టి యతని వైపునకు తలద్రిప్పినాడు.

## 17

ఒకానొక సమయమున నుత్తమ పృథువులలో నొకడనిపించు కొనిన మంగళు నకు నేడు తుదిపృథువుగ వర్తించుటకు మొగము చెల్లుటలేదు. మిత్రుడు శాతకర్ణి యాత్మీయతతో వ్రాసినలేఖ చదివి బాధపడినాడు. అతడు తనహృదయ కోశమతనికి

గలుసుకొని విప్పియొప్ప జెప్పుటకు సిగ్గుపడుచున్నాడు. కొంతపరివర్తన గలిగినది గాని వెనుకటి మిత్రులనంత త్వరితముగ దూరమొనర్చుకొనలేకున్నాడు.

శాతకర్ణిని గురించి సంభాషణలలో నతడు విశేష గౌరవమును బ్రకటించుట కొందరు దుష్టమిత్రుల కాశ్చర్యము గలిగించినది. వక్తృత్వవేళల శిఖి యభిప్రాయములతో నేకీభవించి యతడు ప్రసంగింపనారంభించినాడు. దుష్టవిద్యార్థుల శిక్షించుపృథువుల నీర్ష్యాదృష్టితో జూచుట మానినాడు. నేడతని మానసమున నెవ్వరిపై నను బ్రతీకార వాంఛలేదు. సమస్తము నతడొక పతనమొందిన వీరునివలె భావించి భరించుచున్నాడు.

ఒక సందర్భమున నతనిపై పృథువు లొనర్చిన తీర్మానమును గురించి విద్యార్థిసభలో “మిత్రులారా! మీకెంత వ్యతిరేకముగ నున్నను నేను పృథువుల కనుకూలముగ మాటాడ నిశ్చయించినాను. నాకంటె ముందు వేదికపై కెక్కి ప్రసంగించిన ‘మిత్రుని’యని యప్రయత్నముగ శాతకర్ణినుద్దేశించి వచ్చిన యా పదమును మరల దిద్దుకొని ‘పృథువు’ స్వహస్తము లేకుండుట గమనించినాను. నా హృదయమున నూతన పరివర్తన మారంభమైనది. నేను మీ యెదుట బహిరంగముగ బలుక నవసరము లేదు. కాని పృథువు లొసగిన శిక్షకునే బాత్రుడననియే నానిశ్చయము. కొందఱు నన్ను తప్పుత్రోవల నడిపించినారు. నా పూర్వ వృత్తమును మఱచి క్షమింపుడని పృథువుల వేడుకొనుచున్నా’నని ప్రియపూర్వకముగ మంగళుడు పలికినాడు.

‘ఆనాడు మంగళుని మాటలు విన్న ప్రతి విద్యార్థియు నతని మెచ్చుకొనినాడు. బ్రహ్మాయువు లేచి ‘సోదరులారా! నేడు మీ ముందు నిలచి మాటాడిన వ్యక్తివాక్యములు దాత్తములు గౌరవప్రదములు. నేడు పూర్వపత్రికను నిరర్థకమొనర్చు మఱియొక పత్రికను వ్రాసి యతని కందించుటకు మీరు మాకనుజ్ఞనిండు’ అని వేడుకొని వారి యేకగ్రీవమైన యంగీకారముతో మంగళునకు నూతన గౌరవ పత్రిక నంపినాడు.

మంగళుడొకపరి యేకాంతముగ శీలభద్రాచార్యుని నివాసగృహమున కేగి గడచిన నాల్గుమాసములలో నతని జీవిత విధానము నంతయును బూసగ్రుచ్చినట్లు నివేదించి కనికరమర్థించినాడు.

అతడు నాలందలోని యుత్తమ విద్యార్థి వేతనమును స్వీకరించుటకు విశేషకాలము నేడు శ్రమించుచున్నాడు. అది లభించినచో నతని విద్య పరిపూర్ణము కాగలదు. మిగిలిన విద్యార్థి వేతనములన్నిటికంటెనిది విలువైనది. పేదవాడైన మంగళుడు దానిని స్వీకరించుటకై కృషి యొనర్చుట సముచిత కృత్యము.

పరీక్షలైనవి. కాని ఫలితాంశములు వెలువడలేదు.

బుద్ధజయంతికి సెలవులు వచ్చినవి.

సునీథాదేవి మంగళునితోమరల సంతోషముగ గొంతకాలము గడుపవచ్చునని యాశపడుచున్నది. అతని లక్షణములలో గొంతమార్పుగలిగి నూతనవ్యక్తిగ వచ్చునని యామెయువ్విళ్ళూరుచున్నది. మంగళుడు గృహమున కేగి మాతృమూర్తిని సర్వవిధముల సంతోషపెట్టినాడు.

మరల విద్యార్థులు నాలందకు దిరిగివచ్చిన వెనువెంటనే వేతన పరీక్షా ఫలితాంశములు వెలువడినవి. శీలభద్రాచార్యులు వానిని క్రిందినుండి పైకిచదివినాడు. ధ్వజకేతువు నాల్గవ వాడు. మంగళుడు మూడవ వాడు. శాతకర్ణి ద్వితీయుడు, బ్రహ్మాయువు ప్రథముడు. బ్రహ్మాయువు నాకా వేతనమవసరము లేదనినాడు. అందువలన నది శాతకర్ణిదయినది.

కొంచెమాశాభంగము వాటిల్లినను దానిని లెక్కింపక మంగళుడు నివాస గృహమునకు దిరిగివచ్చి గ్రంథపఠన మొనర్చుచున్నాడు. అట్టిస్థితిలో "మంగళా" యను మధురమైన శిఖి శాతకర్ణి గొంతు వినిపించినది. 'శాతకర్ణీ!' యని యాశ్చర్యోద్వేగములతో లేచి యెదురువచ్చి యతనిని యుచితస్థానమున సగౌరవముగ మంగళుడు కూర్చుండబెట్టినాడు.

"మనము బహుకాల మిత్రులము. తాత్కాలికముగ గొంతకాలము మన మొకరొకరికి దూరముగ నున్నాము. నా హృదయమున నీపై నెట్టి విరోధ భావమును లేదు. ప్రస్తుతము నీయనువర్తనమును బరికించిన నీ మానసమును స్వచ్ఛమని నేను భావించుచున్నాను."

"నీకు నేనపకార మొనర్చినాను. నన్ను ప్రథమమున క్షమింపుము".

"క్షమించుట కేమైన నున్న నట్లే. వైమనస్యము వలన మన మిరువురమును యెడబాటను శిక్ష నొందినాము.

"ప్రస్తుతము నేనొక ప్రత్యేక కార్యమునకై వచ్చినాను. ఈ విద్యార్థి వేతనము వలన నీకేమైన విశేష ప్రయోజనమున్నదా!"యని శాతకర్ణి ప్రశ్నింపమంగళుడు దానికి సమాధానము యీయలేదు.

"నేను నాలందలో మరియొక వత్సరముందును. నీ వుండెదవా?"

"లేదు దానికిదగిన ధనము నాకు మాతల్లి యిచ్చెడు స్థితిలో లేదు".

"మేము ధనికులము. మా తండ్రి మమ్ముల జదివింప గలడు. నాకు దక్కిన విద్యార్థి వేతనమును స్వీకరించుట కేవలము స్వార్థము. అందువలన బ్రహ్మాయువు విడిచి పెట్టుట వలనను ఆ వేతనమును నీవు గ్రహింపుము".

శాతకర్ణి వాక్యములు మంగళున కాశ్చర్యము గలిగించినవి. ఆ త్యాగబుద్ధి మున్నెన్నడాతడు చూడలేదు. విననైన లేదు. మిత్రుడు గ్రహించుటయాతనికి వేయి రెట్లానందమట! అతడు లేచి చిరునవ్వుతో పోబోవు సమయమున నతనిని చేయిబుట్టుకొని మంగళుడు 'శిఖీ! నీ యౌదార్యముతో నన్ను విక్రయించుకొనినావు. నేను బ్రతిక్రియగ నేమొనర్పగలనో యర్థమగుట లే'దనినాడు.

'మిత్రుల మధ్య ప్రతిక్రియల ప్రసక్తిలేదు. ఇక ముందెన్నడును మనము దూరదూరముగ నుండరాదు. బ్రహ్మాయువు సాయం సమయమున పచ్చికబయళ్ళకు వాహ్యాళి కేగుదమనినాడు. నీవును మాతో వచ్చుటకు సిద్ధపడుము' అని శిఖి వెడలినాడు.

శిఖి తన నివాసగృహమును దాటిన తరువాత మంగళుడు పొందిన యానందమునకు మేరలేదు! అతనికి వేతనములభించినది. చెడిన స్నేహము మరల సుస్థిరమైనది. ఈ వార్తల దెలియపరచుచు నతడు తల్లికొక లేఖ వ్రాసినాడు. కనబడిన మిత్రులకెల్ల జెప్పినాడు.

ఇట్టి సంతోష సమయమున నతని కొక లేఖవచ్చినది. అందలి యక్షరముల లస్తవ్యస్తములుగ నున్నవి. అది యెవరి లేఖనమో యతడు గుర్తుబట్టలేదు.

"హృద్రోగము కారణమగ మీతల్లి మంగళవారము నాడు మరణించినది" అతని పిన తండ్రి యీలేఖ నెవరిచేనైన వ్రాయించి యుండవచ్చును.

మంగళుడు నిలువెల్ల క్రుంగి కూలబడినాడు. శాతకర్ణియెద్ద కతడు పూర్వము పంపిన విద్యార్థి సమాధానముతో దిరిగి వచ్చువరకతడట్లే యున్నాడు.

శిఖి తాను పంపిన సమాధానమును మంగళుడెట్లర్థ మొనర్చుకొనునో యను భయమున వెనువెంటనే యటకు వచ్చెను. మంగళుడింటినుండి వచ్చిన లేఖ నతని చేతికందింప, నతడు చదివి మిత్రునికి గలిగిన కష్టమునకు నిశ్చేష్టుడైనాడు. మరల తెలివి దెచ్చుకొని మంగళునకు రోదింపవలదని సమస్త విధముల ధైర్యము జెప్పియోదార్చెను.

మంగళుడు తల్లికంత్యక్రియలు గావింప నాచార్యుల యనుమతితో బ్రహ్మయువు, శాతకర్ణి యొసగిన ధనసహాయముతో స్వగ్రామమునకు పయనమైనాడు.

## 18

అంత్యక్రియలు పూర్తిగావించి మంగళుడు మరల నాలందకు బయలుదేఱువేళ నతని పినతండ్రి "నీవిక బహుకాలము విద్యార్జన యొనర్చుట కవకాశముండదు. మీ కుటీర మమ్మిన వచ్చునది స్వల్పము. నేనెటనైన నీకు దగిన యుద్యోగమొక ధనికునియొద్ద జూచెదను. దానితో నీపొట్ట పోసుకొనవచ్చు"నని చెప్పినాడు.

అతనియాశలు సమస్తమును దారుమారైనవి. దుఃఖము పొంగి పొరలివచ్చినది. నాలందకు వచ్చిన తరువాత ఒంటరిగ గ్రంథపఠన మొనర్చుట, యేకాంతముగ వాహ్యాళి కేగుట దప్ప నితరక్రియ లేవియు నతనికి రుచించుట లేదు. చదివిన నర్థమగుట మానినది ఆటపాటలలో నాసక్తి శూన్యమైనది.

బ్రహ్మయువు, శిఖిశాతకర్ణియతని దుస్థితిని గురించి పలుమారులు ప్రసగించుకొనినారు. ఒక మాసము గడచినది. మంగళుని ముఖమున దైన్యమధికమగుచున్నది గాని లోపించుట లేదు. బ్రహ్మయువతని దుస్థితిని గుఱించి శీలభద్రాచార్యుని యేకాంత గృహమున కేగి నివేదించినాడు.

కరుణతో శీలభద్రాచార్యుడు మంగళుడెట్లు కృశించుచున్నాడో పరీక్షించినాడు. 'మన మంగళుని నిరాశయొక మహావ్యాధి వలె పట్టుకొనినట్లున్నది. అతడు నిన్న నాతో నొక వాక్యమైన పూర్వమువలె బలుకలేక పోయినాడు. అతనికి జీవితమున నెందును సంతోషము కన్పించుట లేదట! అతనినెట్లైన నొంటరిగ దిరుగ నీయక మీ వెనువెంట సంచరింపజేయు'డని బ్రహ్మయువుతో నాచార్యుడు బలికినాడు.

"నేను, శాతకర్ణి, కేతుధ్వజుడు నెంతో యత్నించినాము. మాతరము గాలేదు. అతడు మమ్ము జూచిన తప్పుకొని తిరుగుచున్నాడు. అతడు సంవత్సరానంతర మింటికిబోయి ధనికునింట నొక యుద్యోగివలె నుండటను గురించి బెంగపెట్టుకొనినట్లున్నాడు.

"అతని దుస్థితికదే కారణమైన కష్టము లేదు. అతని పినతండ్రి ధనమీయకున్న నతడిచ్చట నెన్నాళ్లైన విద్య నేర్చుకొనవచ్చును. నాలంద యర్థులకు విద్యాదానమొనర్చుట కేర్పడిన మహాసంస్థ" అని శీలభద్రాచార్యుల వారనివారు.

శాతకర్ణి యీ శుభవార్తను మరుక్షణము మంగళునికి జేర్చినాడు. ఆ వార్త వినిన మరుక్షణమున మంగళుని దీనముఖమున నాశారేఖ యొకటి వర్తించినది. కొలదికాలము తరువాత నొక సంస్థానాధీశ్వరుడొక విద్యార్థి వేతనము నేర్పాటు జేయించినాడు. అంతటి వేతనము మునుపు నాలందలో లేదు. ఈ వేతన మొనర్చినవారిని దెలుసుకొన నాలందలో బ్రతివ్యక్తియు కుతూహలముతో నున్నారు. అట్టి వేతనము తండ్రితో జెప్పి నిప్పించినవాడు బ్రహ్మయువు.

అయినను మంగళుని మానసిక స్వాస్థ్యము చేకూరలేదు. మరల నాలోచనా పరవశతతో నేకాంతముగ దిరుగుచున్నాడు. అప్పుడప్పుడతని కాత్మహత్య యొనర్చుకొనవలెనను నూహలు జనించినవి. అతని ప్రయాణములకొక నియమము లేదు నిశ్చయము లేదు నిర్ణయమును లేదు.

మఱుసటి నెలలో కంటకశైలమునకు నాలంద విద్యార్థులు విహారయాత్ర కేగ నిశ్చయమైనది. సమస్త సన్నాహములు నేర్పాటైనవి.

విద్యార్థులందరును సంతోషమున కేరింతలు గొట్టుచు శిబికలలో వాహనములపై రథములపై యా పర్వతపాద ప్రదేశమున కేగుచున్నారు. మంగళుడును, వారిలో నున్నాడు. పూర్వమాతడట నొకయున్నత శిఖరమధిరోహించియొక రమ్య దృశ్యమును జూచినాడు. అట తనకు ప్రశాంతి లభించుననుకొనుటయే నేడతనిరాకకు కారణము.

కంటకశైల పాదప్రదేశమును జేర విద్యార్థులు భోజనాదికముల బూర్తిగావించుకొని పర్వతారోహణమారంభించినారు. మంగళుడు కొంతదూరము వారిననుసరించి ప్రక్కదారిని బట్టి తప్పుకొని యాతడనుకొనిన శిఖరమార్గమును బట్టిపోవుచున్నాడు. అతని నెవరును గమనింపలేదు.

సాయంత్రము వరకును విద్యార్థులు పర్వత శిఖరముపై నాటపాటలతో గడపినారు. సూర్యాస్తమయవేళ వారుమరల దిగిరావలసి యున్నది. అందరు నున్నారు. మంగళుడు కనుపింపలేదు.

'మంగళుడేడి'? యను ప్రశ్న విద్యార్థినుండి విద్యార్థికి ప్రాకినది. మంగళు డేమైనాడు?

మంగళుడేకాంతముగ నుండగోరిన శిఖరమునకు దీసుకొనిపోవు దారిదప్పినాడు. ఆ పర్వత శిఖరముల నెక్కుచు దిగుచు నడిచినాడు. ఎంతనడచిన నతడనుకొన్న శిఖరము గనుపింపలేదు. కానియంతకంటె నొక యున్నతశిఖరము పొడకట్టినది.

అటనుండి యొక కొలను కన్పించింది. ఒక శిఖరము నెక్కి దానికడ కేగవలెను. ఆరంభించినాడు. మార్గమతి కఠినమైనది. పాదములు జారిపోవుచున్నవి. అట్టే ప్రాకి శిఖరతలమును జేరినాడు. బహుకాలమట ప్రశాంతముగ గూర్చుండి కమలాకరమునుదర్శించినాడు. సూర్యాస్తమయము వేళ నరుణ కిరణములలో నా సరోవరమతి రమ్యముగ నతని హృదయ మాకర్షించినది. ఎంత జూచిన నతనికి దృప్తి కలుగలేదు.

మంగళుని వెదకుచు 'పృథువులు' శిఖిరములపై కెక్కి "మంగళా! మంగళా!!" అని కేకలు బెట్టుచున్నారు. వారి పిలుపు చెవినబడినది. తాము తిరిగి నాలందకు బయలుదేరవలసిన సమయము దాటినదని యతనికి స్ఫురణకు వచ్చినది.

మంగళుడు శిఖరమును దిగుట కారంభించినాడు. మార్గమతి క్లిష్టముగ నున్నది. చినికినందువలన బాదములు జారి పోవుచున్నవి. ఒకమారు కాలుజారి కొండరాయి యొకటి యడ్డుట వలన నాగగలిగినాడు.

మార్గమేమియు దోచక మరలపైకెక్క నారంభించినాడు. శిఖరముపై నిలచుటకైన నవకాశములేదు.

ఒక వంక నుండి మేఘములు దట్టముగ గ్రమ్ముకొన వచ్చినవి. వర్షమారంభమైనది. గాలి యాపాదమస్తకమును గదల్చివేయుచున్నది.

'మంగళా', 'మంగళా', యను శిఖిపిలుపుతో బర్వతములు బ్రతిధ్వనించు చున్నవి.

ప్రాణములపై నాశవదలుకొని మంగళుడు సరోవరములపై దృష్టి నిల్పినాడు. ఒక తామరతూడు మరల మరల గాలి నెదిర్చి నిల్చుచున్నది. ఆ దృశ్యమతని కొక పాఠము నేర్పినది. మరుక్షణమున నతడు కమలాకరమున దుమికి యీద నారంభించినాడు.

దూరమున నావలిగట్టుననున్న శిఖిరమున నొక త్రాటిపై శిఖి, శ్రీముఖుడు, ధ్వజకేతువులు దిగుచున్నారు. 'అడుగో! మంగళుడు మనల జూచి యీదివచ్చు చున్నట్లున్నాడు. 'లోతుకు భయపడనవసరము లేదు. కాని గాలి యతనికి వ్యతిరేకముగనున్నది. అతడు పూనుకొనినది సాహసకృత్యము' అని శాతకర్ణియనినాడు.

'చిన్న తెప్పకొయ్యయున్న నెంత బాగుండును? ఇందు చేపలుబట్టుపల్లెవారు దాని నీ ప్రాంతమున నుంచి యుందురు. దానిని నేను నడుపుచు నెదురేగి యతనికి సాయమొనర్ప గలనని శాతకర్ణి పలుక శ్రీముఖుడు, ధ్వజకేతువు వెదకుచున్నారు.

అదృష్టవశమున తెప్పకొయ్య కనుపించినది. కాని తెడ్లులేవు. పల్లెవారు దాచియుందురు. కృత్రిమమగు తెడ్లు త్వరితముగ నేర్పాటు జేసుకొనినారు. శాతకర్ణి శ్రీముఖుని తోడు దీసుకొని నీరమున ప్రవేశింపసిద్ధపడినాడు.

కొండలోయలు పర్వతములు బ్రద్ధలగునట్లు రొదపెట్టుచున్నవి. ఝంఝామారుత మాగునట్లు లేదు. వర్షమును బెద్దదగుచున్నది.

సరస్సును మంగళుడు సగ మీదినాడు. బాగుగ నలసినట్లున్నాడు. అలలు అతని వెనుకకు దరుముచున్నవి. నిస్పృహ ప్రారంభమైనది. వెనుదిరిగి యనుకూల వాతమొనర్చు సహాయమున బయలుదేరిన స్థలమునకు జేరదలచినాడు. ఒక మూల నుండి వేగముగ నదియొకటి యాసరస్సులో వచ్చిపడుచు నటనొక కల్లోలినివలెనున్నది.

వర్షము వెనుకబట్టినది. 'మంగళా'యను పిలుపు వినిపించినది. ఎదురుగ నెవరో యీదుకొనుచు వచ్చుచున్నారు. మంగళుడు ధైర్యముతో మరల ముందుకు వచ్చినాడు.

గాలి యనుకూలమున నుండుట వలన శాతకర్ణి తెప్పమునుగుట వలన నొకదుంగతో నీదుచున్నాడు. శ్రీముఖుడును దానిపై కూర్చున్నాడు. "సోదరా! భయపడకు".

"అన్నా! నీవున్న నాకేమీ భయము?"

మంగళునికిజేతులు కాళ్లు తేలిపోవుచున్నవి. ఇంతలో నొక కొండకొననుండి సరస్సులోని కొక నూతన ప్రవాహమతివేగముగ వచ్చిపడినది. ఇరువురకును పది గజముల దూరమున్నది.

మంగళుడు "మూర్ఛితుడైనాడు. నోటమాట లేదు." – 'మంగళా'యన్న పిలుపునకు సమాధానము లేదు."

మన ప్రయత్నమంతయు నిష్ప్రయోజనమా? మనస్సులో భగవానుని ప్రార్థించి మరల వేగమధిక మొనర్చినాడు. దుంగతో మంగళుని చేరినాడు. కానియతడు స్వశక్తితో దానిని గ్రహించి యెక్కివచ్చుస్థితి లేదు. శ్రీముఖుడును నీరమున దిగినాడు. ఇరువురు క్రమముగ నతనిని దుంగపైనెక్కించి పడిపోకుండ వస్త్రములతో బిగించి తిరిగి యెదురీద నారంభించినారు.

"శ్రీముఖా! మంగళునిపై దృష్టి నిలుపవద్దు. ముందు జూచుచు నీదుము".

"అన్నా ఇకనైన వర్షమాగిన నెంత బాగుండును!"

"భగవానుని బ్రార్థింపుము".

వర్షము క్రమముగ వెనుకబట్టినది. గాలి యింకను నట్లేయున్నది. కొందఱు విద్యార్థులు శిఖీ, ధ్వజకేతువుల వెదకుచునటకు వచ్చి సమస్తమును దెలిసికొనినారు. శ్రీముఖుని శక్తియై పోయినది. శిఖియతనిని గూడ దుంగపై నెక్కమనినాడు. ధ్వజకేతువు నితర మిత్రుల యుత్సాహజనక వాక్యములతనికి వినిపించినవి.

ప్రాణములుగ్గ బట్టుకొని యతడీదుచు దుంగను ముందుకు నడిపించుకొని వచ్చుచున్నాడు. గట్టు కొన్ని గజముల దూరమేయున్నదని గ్రహించి శ్రీముఖుడు మరల దిగిస్వయముగ నీదుచున్నాడు.

"మేలు! మేలు!! శాతకర్ణీ మేలు!!! హర్షధ్వనులు వినిపించినవి.

మంగళుని గట్టుజేర్పునప్పటికి శిఖిశాతకర్ణికి స్మృతిదప్పినది.

## 19

గయాశీర్షుని స్థానమున నుపాధ్యాయ పదవిని స్వీకరించిన మౌద్గల్యాయనుడు శిఖి శాతకర్ణి ప్రభృతులకంటె ముందుగ కంటకశైల పాదదేశమును చేరుకొన్న కొలదిమంది విద్యార్థులతో నాలంద జేరుకొని జరిగిన యుదంత మంతయు శీల భద్రాచార్యులకు విన్నవించినాడు.

ఆయన మనస్సు మనస్సున లేదు ద్వారముయొద్ద నిలచి వెనుకబడిన విద్యార్థుల రాకకై యాతురతతో జూచుచున్నాడు. శాతకర్ణి తల్లి యొకమారు కుమారుని జూచిపోవుదమను కోరికతో వచ్చి సంగతి దెలుసుకొని యాచార్యుననుసరించి ద్వారము కడ నిలచి వ్యాకులత నొందుచున్నది. కన్నీరు మున్నీరుగ నేడ్చుచున్నది.

"అమ్మా! భయపడ నవసరము లేదు. శిఖి యసామాన్యుడు. మంగళునితో బయలుదేరి వచ్చుచుండును. చింతింపకు''మని బ్రహ్మోయు వావెుకు ధైర్యముజెప్పుచుండెను.

దూరమున అమితాభుడేకాంతముగ దిరిగివచ్చుటనందఱు గమనించినారు. ఏదో పుట్టి మునిగి నట్లున్నది? లేకున్ననితడొంటరిగ వచ్చుటయేల? శాతకర్ణి తల్లి బిట్టుగ దుఃఖింప నారంభించినది. శీలభద్రుడు కళవళపడుచున్నాడు.

'వారు క్షేమముగ నున్నారు. అతిగ నలసిపోవుట వలన స్మృతిదప్పినది. ప్రక్కనున్న గ్రామమందలి యౌషధశాలలోనున్నారు. అందఱును రేపటి సాయంత్రమునకు బయలుదేరి రాగలరు' అని అమితాభుడు వారి కెరుక బరచినాడు.

శాతకర్ణి మంగళునితో నాలందజేరి యాచార్యపాదుల కభివందన మాచరించి తల్లి యొడిలో నొదిగినాడు. ఆమెకు మంగళుని బరిచయ మొనర్చినాడు. 'ఇతని నామము నాకు సుపరిచితము' బ్రహ్మాయువును జూపించుచు 'అతడే నాకుధైర్యము జెప్పి ప్రాణముల గాపాడినాడు' అని యామె పలికినది.

ధ్వజకేతువు విద్యాలోకమునకు శాతకర్ణి వీరకృత్యమును జాటినాడు. శీలభద్రుడు బ్రత్యేకముగ సభ నేర్పాటుజేసి యందతని వీరకృత్యమునుబొగడి 'విద్యార్థివీరు'డని బిరుదమిచ్చి నాలంద చిహ్నముతో నున్న పతకమును బహూకరించినాడు. విద్యార్థులతనికి జయవెట్టి యుత్సవమొనర్చినారు.

మంగళుడు నూతనవ్యక్తిగ మార్పునంది శాతకర్ణి యభినందనసభలో నొక గంభీరోపన్యాస మిచ్చినాడు. శాతకర్ణితన్నెందుకు రక్షించినాడో యతని కవగతమైనది. సమస్త సత్కార్యముల మిత్రుని కండగనిలచి యతడు నిర్వహించినాడు.

అభినందన సభలో 'నాలందపాలన' విద్యార్థుల పరమొనర్చుచున్నా'నని శీలభద్రాచార్యుడు పలికినాడు. 'ఆ భారమును నిర్వహించి మీ మన్ననల బొందగల'మని శాతకర్ణి యాచార్యునకు విద్యార్థుల పక్షమున 'ప్రథమ పృథువు'గ బలికినాడు. గయాశీర్షోపాధ్యాయుడు తనపై జూపిన క్షమయే యతని జీవితమును దిద్దినదని వేనోళ్ళ నతడు జాటినాడు. ఆ క్షమయే మంగళుని శాతకర్ణి బ్రతికించుటకు గారణమైనది.

'నాలందయే మా సమస్తము. దాని విఖ్యాతి మాయుత్తమ శీలమున లోకమున వెల్లడింప బద్ధకంకణులమైనాము'. అని శిఖి నాయకత్వమున విద్యార్థులు ప్రమాణ పత్రముల స్వీకరించినారు. శీలభద్రాచార్యు డానా డొందిన యానందమునకు మేరలేదు.

శాతకర్ణి, బ్రహ్మాయువు, ధ్వజకేతువు, మంగళులాదర్శ విద్యార్థులై నాలందలో జీవితమును గడపినారు. ఆశయమున కనుగుణముగ నాలంద ఖ్యాతి విశ్వఖ్యాతమైనది. ఆచార్యుల సహాయమున వారేర్పాటు గావించిన జీవిత విధానములు లోకరంజకములైనవి. విద్యా విధానమును గొలదిగ మార్పునొందినది. నాలంద చరిత్రలో మరల నొక నూతనాధ్యాయ మారంభించిన వారా నలువురు విద్యార్థి వీరులు!

వారి నాయకత్వాన శిక్షణ విధానమును నూతనమార్గము ననుసరించినది విశాల దృక్పథము ప్రాప్తించినది. కేవల బౌద్ధ ధర్మములుగాక సమస్తములైన యుత్తమధర్మముల శిక్షణకందు తావు కల్పితమైనది.

అనతికాలములో నా విద్యాలయము ఫాహియాన్, ఇత్సింగుల వంటి విదేశీ యాత్రికుల నాకర్షించినది. విదేశ విద్యార్థులు వేనవే లచటికి వచ్చి విద్యార్జన మొనర్చి జ్ఞానులై స్వదేశముల కేగుచున్నారు. విక్రమాదిత్య, శక్రాదిత్య, బుద్ధగుప్త, తథాగత గుప్తాది రాజన్యులు వైషమ్య విరహితముగ నపరిమిత దానముల నా విద్యాలయమును బోషించి పెంపొందించినారు. ఆచార్యుల కమ్మని కంఠములటు పిమ్మట నారు శతాబ్దుల కాలమిట్లు వినిపించినవి.

‘సమస్త నదులెట్లు సాగరమును జేరుచున్నవో యట్లు విద్యార్థులు నలుదెసల నుండి నాలంద చేరుదురుగాక! ప్రశాంత కాసారమున శిలాఖండ పతనముచే వ్యాపించు తరంగముల వలె దశ దిశలకు విద్యార్థులు జ్ఞానముతో నాలంద నుండి తరలుదురుగాక!

# అగ్రగాములు

# తొలిపలుకు

వీర వనితలు, వీర మహాపురుషులు కర్తవ్యతా విమూఢములైన జాతుల నుద్ధరింప నావశ్యకములైన సమయములందవతరింతురు. కారణ జన్ములైన వారు కార్య సాధనానంతరము నిర్వాణ పథము నొందినను మృతజీవులై నిత్యమును జాతి నుజ్జీవింప జేయుదురు.

అట్టివారు గుణ గరిష్ఠులు, ఆదర్శమూర్తులు, ఇట్టి వీరుల జీవిత చరిత్ర పఠనము వలన నుత్తమ లక్షణములు, నున్నతా దర్శములు వ్యక్తుల కలవడి వారిని దివ్య జీవన మార్గముల నడిపించుననుట నిస్సంశయము.

ఝాన్సీ లక్ష్మీబాయి ప్రథమ భారత స్వాతంత్ర్య సమర నేతాజిని. తిలక్ మహాశయుడు ప్రప్రథమమున స్వరాజ్య శంఖారావ మొనర్చి పరదాస్య శృంఖలాబద్ధులై మ్రగ్గుచున్న సోదర భారతీయుల మేల్కొల్పిన వీర వైతాళికుడు. గాంధీజీ స్వాతంత్ర్యనౌక నహింసా సమర సాగరములందు సామర్థ్యముతో నడిపించి తీరమును చేర్చిన యద్వితీయ మహా నావికుడు. జీవిత సర్వస్వమును భారత దాస్య విమోచనా కృషి కర్పించి విదేశముల వసించు భారతీయుల సమైక్యమొనర్చి వారిని సంగ్రామ రంగమునకు పురోగామియై నడిపించిన యసమాన సమర నాయకుడు నేతాజీ.

వీరు నలువురును స్వాతంత్ర్య సమరయోధులు–అగ్రగాములు. వీరి జీవితా దర్శములను, కార్యసాధనారంగములను విజయ విశేషములను నిరూపించు గ్రంథమే నా 'అగ్రగాములు'. ఈ వీరమూర్తుల జీవిత చారిత్రక ఘట్టముల పఠించి స్వతంత్ర భారత బాలబాలికలు దేశసేవా తత్పరతతో పురోగమింతురు గాక యని నా ఆకాంక్ష.

నన్నభిమానించి యీ గ్రంథమును వారి గ్రంథమాలలో నొక కుసుమముగ స్వీకరించి పాఠక లోకమున కర్పించిన ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ యజమానులగు శ్రీ యం.ఎస్. శర్మగారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

**– రచయిత**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఝాన్సీరాణి | 795 |
| 2. | లోకమాన్యుడు | 816 |
| 3. | గాంధీజీ | 834 |
| 4. | నేతాజీ | 854 |

# 1. ఝాన్సీరాణి

"పృథ్వీ! జననీ! నీ గర్భమునుండి జన్మించినాము నీ గర్భమునే చేరుకొందుము. మా శరీరములు నీవి. మమ్మెట్లు పాలింతువో! మా సేవ లెట్లందుకొందువో!! నేనార్థిక సంపద నణుమాత్ర మర్థింపను. నా దామోదరుని మహావీరునిగ తీర్చిదిద్దు శక్తిని ప్రసాదించి వీరమాతయను కీర్తి దక్కింపుము, ధన్యురాల నగుదు" నని యుదయపూజావేళ వినమ్ర భావముతో కర కమలములు ముకుళించి లక్ష్మీబాయి భూదేవి నర్థించినది.

తరువాత పురాణశ్రవణ మారంభము కావలసి యున్నది. 'ప్రారంభింపు' డన్నట్లు లక్ష్మి పౌరాణికునివైపు దృష్టి మరల్చినది. పురాణ పఠనమును వినవచ్చిన నగర ప్రజలును, పౌరాణికుడును మరియొక వైపునకు చూచు చున్నారు. ఆమె యా దిక్కునకు చూచినది. దివాన్జీ లక్ష్మణరావు, మోరోపంతులు వచ్చి నిలచియున్నారు.

అత్యవసరమైన రాచకార్య మున్నగాని వారట్లు వచ్చువారుగారు. గమనించి బాయిసాహెబ్ లేచి యేకాంత మందిరము వైపునకు బయలుదేరినది.

అట నేకాంత మందిరములో వారి సంభాషణము పూర్తియైనది.

బుందేలు ఖండములోని ఝాన్సీ రాజ్యమును మోసముతో నాంగ్లేయులు లక్ష్మీబాయి భర్త గంగాధరరావు కాలముననే కాజేసినారు. ప్రస్తుతము భర్త మరణానంతర మామె దత్తపుత్రుడు దామోదరునకు పోషకురాలుగ దుర్గపాలన మొనర్చుచున్నది. ఈ దుర్గమునైన వారికి దక్కకుండ జేయుటకు వారేమైన నెత్తు నెత్తి రాయేమి?

దివాన్జీ మోరోపంతుల రాక కొకానొక రాచకార్యమున గవర్నర్ జనరల్ డల్హౌసీకి దక్షిణ భారతమున ప్రతినిధిగ నున్న మాల్కొమ్ వద్దనుండి 'ఎల్లిస్' అను నాంగ్లేయ ప్రముఖుడొకడు వచ్చుటయే కారణము. కుశల ప్రసంగములై పోయినతరువాత నతడు మాల్కొమ్ వ్రాసిన లేఖను దివాన్జీ చేతికిచ్చి చదివించినాడు. రాణి వినినది.

"ఝాన్సీ నా కౌస్తుభము. నేను లక్ష్మిని, నా ఝాన్సీని నేను మీకీయలే" నని తెరవెనుక నుండి గంభీర స్వరమున నామె పలికినది. ఇట్టి మాట నాంగ్లేయుడు శతాబ్దము నుండి యెన్నడును వినలేదు. పాపం హృదయమును కుదుట బఱచు కొని ఎల్లిస్ ఇట్లనినాడు:

"తల్లీ! ఇది గవర్నరు జనరులుగారి యాజ్ఞ. ఇందులో మీకు క్రోధము కలుగవలసిన కారణము నాకేమాత్రమును గనుపించుట లేదు. ప్రజాపాలనా భారము వలన మీరు శ్రమ పడుచున్నారు. దానిని తొలగించి మాసమున కైదువేల రూప్యములు మీకుటుంబమునకు మనోవృత్తి నిచ్చుట కాయన నిశ్చయించినాడు" అని మరియు నతడేమో చెప్పబోవు చున్నాడు. రాణి "మీ మనోవృత్తి నాకెందుకు? నే గ్రహింపగల దేదో స్వీకరింతు" నని గద్దించి పలికినది.

ఆంగ్లేయుల దౌర్జన్యములను, కఠిన శాసన పాలనా పద్ధతులను విన్న సభలో కలకలము చెలరేగినది. స్త్రీలు రోదన ధ్వనులారంభించినారు. ఎల్లిస్ దివాన్జీని పిలుచుకొని పోయి మరికొంతసేపు సంభాషించినాడు. ప్రయోజనము లేదు. రాణి మాటలకు తిరుగులేదు. యుద్ధమున కప్పుడే యనుజ్ఞ నొసగవలసినదని వేడుకొనిన సరదారుల 'కిది సమయము కాదని' వారించి యామె దర్బారునుండి వెడలిపోయినది.

ఈ వార్త యొకటి రెండు దినములలో ఝాన్సీ రాజ్యమంతయు బ్రాకిపోయినరది. ప్రజ లెల్లరును దీని ఫలితాంశ మేమగునో యని యాతురత వహించుచున్నారు.

"నాకు దత్తస్వీకారమున కధికారము లేదట! ఏ దేశ స్మృతి ననుసరించి? భారతదేశ స్మృతులలో దత్తపుత్రుడు పుత్రుడు కాడని యెక్కడనున్నది? లుప్త సిద్ధాంతముతో దేశీయుల కేమిపని? ఈ ఆంగ్లేయుల లుప్త సిద్ధాంతముతో బాటు వారి పాలనము నంతమొందవలసినదే!" అని రాణీ సాహెబ్ నిశ్చయించినది. దివాన్జీతో సంప్రదించినది. అతడు రాజ్యపాలనమున నరువది వత్సరములు గడిపి సమస్త మవగత మొనర్చుకొన్న వృద్ధమూర్తి, ప్రతిభావంతుడు, మహామేధావి, ఆంగ్లేయ ప్రభుత్వ మారంభమైనదాని మొదలు భారతదేశ చరిత్ర మతనికి హృత్కవిలె.

"నా ఝాన్సీని వారి హస్తగత మొనర్పవలెనా? కుత్తుకలో ప్రాణమున్నంత వరకది సాగదు" అన్న రాణినిశ్చయమునకు వృద్ధమూర్తి లక్ష్మణరావు సత్త్వప్రధాన మానసముతో నాలోచించి –

"అమ్మా! ఆంగ్లేయుల బలమత్యధికము. వారికి దేశమున మూడు లక్షల సైన్యమున్నది. దీనికితోడు ఫిరంగి సైన్య మరువది వేలమంది యున్నారు. వారితో దలపడుటన్న సామాన్య కృత్యము కా"దని పలికినాడు.

"అయిననేమి? అందులో విస్తారము దేశీయ సైన్యము. తాత్కాలికముగ వారి శక్తికి లొంగి మిత్రులైన దేశీయ సంస్థానాధీశ్వరులు సమయము వచ్చిన నేనాడైన వ్యతిరేకింప వచ్చును. వారిలో నేడంతఃకలహములున్నమాట నే నెరుగుదును. మీరు వారందరును భారత మాతృగర్భమున జనియించిన యేకోదరులని మరచిపోవుచున్నారు"

"బాయి సాహెబ్! మీరు మహమ్మదీయల మాట మరిచిపోయినట్లున్నారు. మొగలాయీ ప్రభుత్వాంత కాలమున సిక్కుల మతగురువుల వారవ్యక్తముగ చిత్రవధ గావించినారన్న స్పర్థ సిక్కుల కడుపులో గార్చిచ్చువలె రగుల్కొను చున్నది. వారుభయు లేకపక్షమున జేరి యొక విశ్వాసముతో పోరాడుట కల్ల"

ఇట్లు రాణికిని లక్ష్మణరావుకును సంభాషణ నడచినది. ఎదుర్కొన వలసినది ప్రబల శత్రువు తానొక చిన్న దుర్గమున కధికారిణి! తనలో మొలకెత్తిన విప్లవ బీజముల సమస్త భారతమున వెదవెట్టి పండించిన నెంతటి ప్రభుత్వమైన నేమి?

పీష్వా నానాసాహెబును నిట్లే దత్తపుత్రుడగుట వలన నతని తండ్రి పీష్వా బాజీరావునకు ప్రభుత్వ మిచ్చుచున్న యెనుబదివేల పౌనులు భరణము నాపుదల చేసినారు. అతడు నేడు బిథూరు సంస్థానములో కోరలు దీయ యత్నింప పసిబట్టిన కాలసర్పమువలె కాలమునకై వేచి సమయ మాసన్న మైనదని పగ సాధింప పూనినాడు.

నానాసాహెబు యావద్భారతమున విప్లవశక్తుల మేల్కొల్పి ప్రభుత్వ భవనముల దహింప బద్ధకంకణుడై శ్రమించుచున్నాడు. ఆంగ్లేయ ప్రభుత్వము నెదుర్కొనవలెనన్న కేవలము దేశీయుల విప్లవశక్తి చాలదని గమనించి మారు వేషములో దేశీ సైన్యములతో పరిచయము లేర్పరచుకొని వారిని విప్లవ సన్నద్ధుల గావించినాడు. అతని సైన్యాధ్యక్షుడు తాతియాతోపే పీష్వాయెడ నచంచల భక్తి విశ్వాసములతో యావద్భారతమును పర్యటించి స్వాతంత్ర్య సైన్యముల చేకూర్చు కొనుచున్నాడు.

దేశీయ సైన్యమున విప్లవ భావములు పొడగట్ట నారంభించినవి. ముప్పది నాల్గవ దేశీయ సైన్యము సింధులో నధిక వేతన మిచ్చినది గాని పోరాడ మనిన వెడలగొట్టి యాంగ్లేయ సైన్యోద్యోగులు వారిని శిక్షించినారు. అరువది యారవ

పటాలము పంజాబు యుద్ధరంగములో ప్రవేశించి పోరాడమని సంచలన మొనర్ప వారిని వెడల గొట్టినారు. అరకాన్ రంగమున బలవంతముగ వారిచే పోరాడించినారని దేశీయ సైన్యములు విసిగినవి. వీరిలో స్వాతంత్ర్య కాంక్ష ప్రవేశించిన చాలును. భారతజాతికి విముక్తియని నిశ్చయించి తాతియా దేశీయ సైన్యములతో బ్రసంగించి వారి సంసిద్ధతను చేకూర్చుకొని యాంగ్ల పాలనము వలన క్షతి నొందిన సంస్థానములన్నిటికి వచ్చి వారిని పీష్వా సాగింపనున్న స్వాతంత్ర్య సమరమున సాయమొనర్ప నర్థించుచున్నాడు.

మహావీరుడు తాతియా ఝాన్సీకి వచ్చి రాణితో బ్రసంగించినాడు. "ఒక శతాబ్ద కాలము మనము నిద్రపోయినాము. ఆంగ్లేయులు స్థానబలమును జిక్కించుకొని యినుప వలలు యావద్భారతమున పన్నినారు. దానిలో మనము మత్స్యములమై బయటపడ తన్నుకొనుచున్నాము. వ్యక్తిగతముగ మనమెన్ని యత్నముల ఒనర్చిననవి నిష్ప్రయోజనములు. నేడీ తెరను దెంపవలెను. పీష్వాకు సాయపడ మిమ్ముల వేడుచున్నా"నని తాతియా ఝాన్సీ దర్బారులో భవిష్యత్స్వాతంత్ర్య సమర సేనానాయకునివలె మేఘ గంభీరముగ బ్రసంగించి నాడు.

దర్బారులో సరదారులు, సిలేదారులు, నుద్యోగులు, ఫిరంగీ సైన్య నాయకుడు గుల్మహమ్మదు, సైన్యాధ్యక్షుడు ఖుదాబక్షు నున్నారు. వారందరు విన ఝాన్సీరాణి ప్రసన్న గంభీరముగ నిట్లు పలికినది.

"శత్రువులకు కాలమాసన్నమైనది. ఈ పరప్రభుత్వము నింకెంత కాలము మనము సహింపగలము? మన యాచార వ్యవహారములకు స్వస్తి చెప్పి, మన భావనాలోకముల విషయమొనర్చి ప్రభుత్వము కళ్ళెముల పట్టుతప్పనీయక కాలము గడుపుచున్నారు. వీరమున ప్రపంచమున ప్రథమగణ్యమైన మన జాతి బానిసవృత్తి కలవాటు పడ ప్రారంభించినది. దీనినిక సహించుట కవకాశము లేదు. పీష్వాసాహెబ్ పూనుకొనిన స్వాతంత్ర్య సమరమున విజయము మనకు లభింపగలదని నా దృఢవిశ్వాసము. ఝాన్సీ సమస్తము నావీరుని యడుగు జాడలలో నడువగలదని మీకు నేను వాగ్దానము జేయుచున్నా"నని రాణి ప్రసంగము చాలింప సభలో జయ శబ్దములు చెలరేగినవి. ఈ మాటలు సత్యము లన్నట్లు ఝాన్సీ కోటలోని మహాదేవాలయ ఘంటిక మ్రోగినది. తాతియా రాణియెడ కృతజ్ఞతా వాక్యములు పలికిన తరువాత సభ ముగిసినది.

తాతియా దక్షిణ దిక్కునకు వచ్చినపుడు నానా సాహెబు కాన్పూరు, లక్నో, సంబాల్ పురము, మరికొన్ని స్వదేశ సంస్థానములను మరల దర్శించి గూఢచారుల

నియమించి తిరిగివచ్చినాడు. స్వాతంత్ర్య సమర సన్నాహము లతిగూఢముగ సాగిపోవుచున్నవి.

గవర్నరు జనరల్ డల్‌హౌసీ ఇంటికి తిరిగి వెళ్ళినాడు. బ్రిటిష్ ప్రభుత్వము కానింగ్ ప్రభువు నతని స్థానమున నియమించినది. ఆంగ్లేయులు డల్‌హౌసీ లుప్తసిద్ధాంతము వలన కలిగిన రాజ్య లాభమునకు సంతసించుచున్నారేగాని, భారత దేశమున తత్ఫలితముగ కలిగిన మార్పులు గమనించుట లేదు. భయముతో వారి పాలన సాగుచున్నది. ప్రజలలో సమస్త వర్గములందు నసంతృప్తి బయలుదేరినది. దాని నేకముఖమొనర్చుటకై ప్రథమ స్వాతంత్ర్య వీరులు నానాసాహెబ్, తాతియా , ఝాన్సీ రాణీలు పూనుకొనినారు.

దేశమునం దెల్లెడ వృద్ధులు శివాజీ, సురాజిద్దౌలా, నానాఫడ్నవీస్, టిప్పు సుల్తానుల దేశభక్తి త్యాగములు, శక్తి సామర్థ్యము లింకను యువకలోకమునకు గాథలుగ జెప్పి శౌర్యరసమున వీరగుణ ముగ్గుబాలతో రంగరించి పోయుచున్నారు. ఆంగ్లేయులెన్ని యత్నము లొనర్చినను దేశీయాచార మూలస్తంభము లించుకైన గదలలేదు. దేశీయ విద్యా విధానమున మార్పు లేదు. తమ పూర్వ చరిత్రను జ్ఞప్తి యొనర్చుకొనుటకు జాతి చరిత్రలో నెన్ని పుటలో వెనుకకు త్రిప్పవలసిన యగత్య మానాటికి కలుగలేదు.

“త్వరలో మన యుద్ధ మారంభము కానున్నది. మీరు సిద్ధపడు”దని లక్ష్మీబాయికి చారుని ముఖమున లేఖవచ్చినది. ‘‘నే నెన్నడును సంసిద్ధమే’’నని యామె సమాధానమంపినది.

లక్ష్మీబాయి తెల్లని ‘పైజమా’ తొడిగినది. ‘అంగరఖా‘ వేసినది. మయూర శ్యామలమైన కంచుక మొకటి పైన దొడిగినది. తలపై టోపీ ధరించి తెల్లని జరీకుచ్చుల తలపాగ జుట్టినది. నడుమునకు సరిగంచుల దుప్పటి బిగించి మణులు పొదిగిన కైజారందు నిలిపినది. పురుష వేషముతో శ్వేతాశ్వ మధిరోహించి ఝాన్సీ రాజ్యమునను బుందేల్ ఖండమునను గ్రామముల కేగి ప్రజా హృదయక్షేత్రముల బ్రభుత్వముపై విప్లవ బీజముల నాటి పండించినది.

‘‘అదిగో! పర ప్రభుత్వము పటాపంచలు కానున్న దివ్య సమయ మాసన్నమగుచున్నది. లెండు! మేల్కొనుడు!! మీలో నిద్రించుచున్న సమస్త శక్తుల కేంద్రీకరించి పోరాటమునకు సంసిద్ధులు కండు. పూర్వ వైరములకు నేడు తావు లేదు. సమయము తప్పెనా మనకు బానిసతనము తప్పదు. నిత్య లక్ష్మీమందిరమైన దేశమున దారిద్ర్యదేవత కరాళ తాండవ మొనర్చును.

"బానిసవృత్తిలో బ్రతుకుటకంటె స్వచ్ఛంద జీవనమునకై చావు మేలు"

"ఈనాడు మనము జీవించునది మన పూర్వుల పునీత భారతమున కాదు. నరలోకమున ముందెన్నడును కనీవినీ యెరగని నరక కూపమున మన సంస్కారము జీర్ణించుచున్నది. ఎట జూచిన దౌర్జన్యము! దురాగతము!! దౌష్ట్యము!!!

"ఆంగ్లేయ ప్రభుత్వమును శతవర్షములు సాగనిచ్చినాము. అయ్యో! మన మెంతటి యశక్తులము. శివాజీవంటి స్వేచ్ఛా జీవుల రక్తనాళముల స్రవించిన మన జాతి రక్తమున నీనాడు వేడి చల్లారినదా? మన శక్తి సామర్థ్యములు, పౌరుష పరాక్రమములు గంగలో కలసినవా?

"పీష్వా సాహెబ్ నాయకత్వమున స్వాతంత్ర్య సమర మారంభమైనది. ఆ తల్లిసేవలో మీరును పాల్గొనుడు. మీ వీరమును లోకవిఖ్యాత మొనర్చుకొనుడు. మీ సమస్తమును ధారపోయుడు. స్వేచ్ఛను నిలువ బెట్టుకొనుడు."

"ఈ పిలుపు వినరా! ఇక మిమ్ము పిలుచువారుండరు. పిలచినను మున్ముందు శ్మశానవాటిక జేరిన శవములవలె బలుకలేరు" అని ప్రణయానురాగముతో, బరమ వీరముతో, 'నసూర్యంపశ్య" యైన రాణీ సాహెబ్ గ్రీష్మవేళల గ్రామ గ్రామముల పర్యటన మొనర్చి నిద్రాహారము లెరుగక, భారత స్వేచ్ఛా శంఖారావ మొనర్చుచు విజయయాత్ర యొనర్చి తిరిగి ఝాన్సీ దుర్గమును చేరుకొనినది.

బుందేల్ ఖండము సమస్తమును మేల్కొన్నది. రాణి నడచిన నీడల ననుసరించుటకు ప్రజ ప్రమాణముల స్వీకరించినది. వర్తకులు కావలసిన ధనసహాయ మొనర్చుటకు నిశ్చయించినారు. వారాంగ్లేయవర్తకుల చేతులలో యమ యాతనలు పడుచున్నారు బలవంతపెట్టి ప్రభుత్వ సహాయముతో జెప్పినంతకు వస్తువులు కొనిపించుచున్నారు. రాణి యాజ్ఞ ననుసరించి శత్రువుల కాహార పదార్థములు లభించునన్న భయముతో గృషీవలులు పైరుల బండింపక భూములు నూషర క్షేత్రముల గావించినారు. కొన్ని వత్సరములకు గావలసిన యాహారపదార్థముల దుర్గమునందు భద్రపరచినారు. స్వచ్ఛందముగ సైన్యమున జేరి శిక్షణ పొందుచున్నారు. స్త్రీలు కందకములలో నిలచి సైన్యమునకు సహాయ మొనర్ప ప్రతినలు గైకొనినారు.

నానాసాహెబ్ ఢిల్లీ, కాన్పూరు, లక్నో, ఆగ్రాల మధ్య తోకచుక్క వలె తిరుగుచున్నాడు. ఔథ్‌లో బ్రచారమొనర్చు సందర్భమున కొంత ప్రథమమున వ్యతిరేకత

పొడకట్టి సమసిపోయినది. అతని చారులనేక రీతుల యావద్భారతమున వ్యవహరించుచున్నారు.

నైజాములో గదలిక కలుగలేదు. 1800లో నాంగ్లేయులతో నతడొక సంధి చేసుకొనినాడు. దానిననుసరించి వారి కతడు సైన్య సహాయ మొనర్పక తప్పదని పలికినాడు. కాని యతనిదేశములో సంచలనము కలిగినది. గ్వాలియర్ ప్రభువు దేశద్రోహమునకే నిశ్చయించి నాడు. కొలది కాలము క్రిందట జరిగిన నేపాలయుద్ధములో నాంగ్లేయులకు ఔథ్ రాజు నవాబు వజీరు సమస్త సహాయమొనర్చి గెలిపించినాడన్న క్రోధముతో వారిని నురుమాడవలెనను కోరికతో పఠానులు కాచుకొని కూర్చొనినారు. మహమ్మదీయులు శిక్షింప సిక్కులు సర్వదా సంసిద్ధులుగ నున్నారు. ఆంగ్లేయులు 'విడదీసి పాలించుట'లో గడు నేర్పరులు.

ఒక దినమున ఝాన్సీరాణికి నానాసాహెబ్ స్వహస్తముతో నున్న లేఖ వచ్చినది. అందు–

"మన యత్నములెల్ల ఫలించుచున్నవి. తంత్రములనుకూలించుచున్నవి. నామ మాత్రా వశిష్టుడుగ రుగ్మతతో వృద్ధాప్యముతో కాటికి గాళ్ళు చాచుకొని కూర్చొనిన మొగలాయీ చక్రవర్తి బహదూర్‌షా కాశాజ్యోతి గల్పింప గలిగినాము. పర్షియా రాజు మీరట్ వరకు దండెత్తి వచ్చినట్లు ఢిల్లీలో వార్తలు ప్రబలుచున్నవి. ఆంగ్లేయ సైన్యముల దరిమవేయ కృతనిశ్చయుడై యతడు భారతదేశమునకు సైన్య మంపుచున్నాడు. మహమ్మదీయులందరు నందు జేర సంసిద్ధులు కావలసినదని మషీ పంకములతో నేను వ్రాయించిన లేఖనములు వారిలో సంచలనము గలిగించినవి. మౌల్వీ వేషములతో దర్గాలలో బ్రవేశించి నానమ్మినబంట్లు జాగరూకతతో విప్లవ దూతలుగ వ్యవహరించుచున్నారు.

"దేశీయ సైన్యములలో మనము కలిగించిన సంచలనము కారణముగ నిశీధివేళల సభలు జరుగుచున్నవి. గుసగుసలు సాగుచున్నవి. మౌల్వీ వేషముతో నేను ఫైజాబాదు, ఢిల్లీ, మీరట్, పాట్నా, కలకత్తా పర్యటించుచున్నాను. పోగులు పోగులుగ నున్న విప్లవమును గలిపి దార మల్లుచున్నాను.

"మన సమరము రాజపుత్ర స్థానమున నారంభము కానున్నది. జైపూరు, జోధపూర్, బికనీర్ మొదలైన ప్రముఖులు, దుర్గాధీశ్వరులు రాబోవు సమరమున దటస్థులుగ నుండుట కంగీకరించినారు.

“కాని యా ప్రాంతమున స్వాతంత్ర్య సేనల నడిపింప సమర్థుడగు నాయకుడెవ్వడును గనిపించుట లేదు. మీ ప్రయత్నముల నప్రమత్తులుగ నుండు”దని యున్నది.

1857 మార్చిలో దేశీయ సైన్యమున జనించిన కలకలముతో స్వాతంత్ర్య సమర మారంభమైనది. ఆంగ్లేయుల పందొమ్మిదవ కాల్బలము బారక్‌పూరులో తిరుగుబాటు చేసినది. అందు నిగ్గుదేరిన సిపాయీలను సైన్యముల నుండి వెడల గొట్టినారు. వారు నానాసాహెబ్ సైన్యమున చేరినారు. వెనువెంటనే అంబాలా, కాన్పూరు, లక్నోలలో విప్లవమారంభమైనది. మీరట్‌లో నాంగ్లేయుల మూడవ యాశ్విక దళము పదకొండు, నిరువదవ పటాలములు విప్లవ మొనర్చి జాతీయ స్వేచ్ఛా సైన్యమును గలుసుకొనినవి. మే నెల 11న నాంగ్లేయ కమీషనరును బలిచేసి, ‘యాంగ్లేయ ప్రభుత్వ మంతరించిన’దని విజయ నాదము లొనర్చుచు నానాసాహెబును కొందరు సైనికులు గలిసుకొనినారు. ఇట్లనేక సైన్యములు తిరుగుబాటు చేసి స్వచ్ఛందసేనలతో జేరినవి.

ఆంగ్లేయులతో విప్లవవీరులనేక యుద్ధము లొనర్చినారు. నానాసాహెబు మహారాజపురము, కాన్పూరు, బిథూరులలో వారి నెదుర్కొని బలము చాలనందున తిరోగమించినారు. మహమ్మదీయులు బహదూర్ షాను చక్రవర్తిని గావించి ప్రమత్తులై యున్న సందర్భమున హాడ్సన్ సేనా నాయకుడు వారిపై కెత్తివచ్చి యతనిని బందీ గావించి నిర్వంశమొనర్చినాడు.

అనుక్షణమును పెరిగిపోవుచున్న నానాశక్తి కాంగ్లేయులు వెఱగుపడినారు. తమ సర్వస్వము నొడ్డి సంరక్షించుకొన నిశ్చయించి బ్రిటిష్ ప్రభుత్వమున కాంగ్లేయులు మొరపెట్టినారు. 17 ఆగష్టు 1857న భారత స్వాతంత్ర్య యుద్ధ వీరుల నెదుర్కొని కాలిన్ కాంబెల్‌ను సర్వసేనాపతిగ నియమించి యతని యాజ్ఞానుసారముగ వర్తింప నా ప్రభుత్వము సేనల కాజ్ఞ నొసగినది. సమస్త భారతమున నున్న సైన్యముల వారు జేకూర్చుకొనినారు. ఆంగ్లదేశమునుండి నూతన సేనల రప్పించినారు.

బహుకాలము సమరములు సాగినవి. 15 మార్చి 1858న లక్నోలో మహాభయంకర యుద్ధము జరిగినది. నానా సేనలు, ఔద్ నవాబువజీరు సేనలు శత్రువు నెదుర్కొని ధైర్య సాహసములతో బోరాడినవి. కాని చివరకు గోమతీ నదీ మార్గమున తిరోగమింప వలసి వచ్చినది. శత్రువులు వారిని వెన్నాడ నారంభించినారు. అరణ్యములలో నష్టకష్టముల కోర్చి పోరాడుచు తుద కవి నేపాళమును బ్రవేశించినవి. ఆనాటినుండి నానాసాహెబే మైనదియును దెలియదు.

తాతియా కొంత సైన్యముతో యమునానదిని దాటి స్వాతంత్ర్య సమరమున సాయమొనొర్ప నిరాకరించిన చర్కారీ రాజుపై బడి యతనిని శిక్షించినాడు. అందువలన నతనికి బదునైదు ఫిరంగులు, మూడు లక్షల రూప్యములు లభించినవి. శరణు జొచ్చిన యారాజు కొంత సైన్య సహాయ మొనర్చుట కంగీకరించినాడు. నేడు శత్రువులపై స్వాతంత్ర్య సమరము సాగించు వీరులకు ముఖ్యస్థానము కాల్పీ.

నానాసాహెబు వార్తలు తెలియకపోవుటవలన సర్వసేనాపతి తాతియా శ్రీమంతును పీష్వా నొనర్చి సమర మొనర్ప సిద్ధముగ నాంగ్లేయుల రాకకై వేచియున్నారు.

సంయుక్త ప్రాంతముల యుద్ధము కాలిన్ కాంబెల్ నడిపించుటకును, మధ్య భారతమున సర్ హ్యో రాస్ నడిపించుటకును నిశ్చితమైనది. రాస్ యుద్ధనీతి విశారదుడు. ముందు ఝాన్సీని వశమొనర్చుకొని కాల్పీ పైబడ నిశ్చయించినాడు. శత్రువులు ముందు కాల్పీలో యుద్ధమొనర్చి తనపై బడుదురని రాణి తలపోసి కొంత సైన్యమును తాతియాకు సహాయార్థమంపినది.

ఇట్టి స్థితిలో శత్రువుల మహోదయము నాటి సముద్రపు కెరటముల వలె పొంగిపొరలివచ్చి ఝాన్సీ నలుదెసల ముట్టడించిరి. రాణియందుకు సిద్ధపడినది. మోరోపంతు, గుల్ మహమ్మదు, ఖుదాబక్ష్ మరియు నితర ప్రముఖ సరదారులను దుర్గరక్షణకై నిలిపినది. సుబేదారులు బురుజులపై జాగరూకతతో బ్రవర్తించుచున్నారు. దుర్గభిత్తికలపై దూసిన కరవాలములతో, ముద్గర, పరశు, పాశాది సాధనములతో వారప్రమత్తులై యున్నారు.

శత్రు సైన్యములలో రణఘోషలు మార్మోగినవి. ఫిరంగులు ప్రేల్చ మొదలు పెట్టినారు. రాణి దుర్గమునుండి ధ్వనికి బ్రతిధ్వనిగ ఫిరంగులు మ్రోయుచున్నవి. ఆమె ఫిరంగులలో విఖ్యాతిగన్న 'శత్రు సంహారము', 'నలదారము', 'ఘన గర్జ', 'అగ్నివృష్టులు' కురియుచున్నవి. ఆరు దినము లట్లు గడచినవి. శత్రువు తలచినట్లుగ రాణికి ఫిరంగి సామాగ్రి పూర్తి కాలేదు. తనకై పోవునన్న భయముతో నాంగ్లేయ సేనాధిపతి 'రాస్' ఫిరంగి యుద్ధము మానినాడు. బహు యుద్ధములలో నలిగిన సైన్యమునకు గొంత విశ్రాంతి చేకూరినదను ధైర్యముతో కోట కెగబ్రాక నాజ్ఞాపించినాడు.

దుర్గ మూలమునకు వారు చేరుకొనిన వెంటనే రాణి సైన్యము శిలావృష్టులు కురిపించినారు. ఆ దిశను ప్రయోజనము లేదని మరియొక దిక్కున లగ్గల తగిలించి కోటగోడల పై జేర యత్న మారంభమైనది. తుముల యుద్ధములు ప్రారంభించినవి.

రాణి పంపిన వార్త కాల్పీ చేరినదో! లేదో! ఆమె సైన్యములు రాలేదు. ఆహారమును గైకొనుటకైన నామె సైన్యములకు శత్రువులవకాశ మిచ్చుట లేదు.

రాణి సాహెబ్ మందహాసములతో, మహోద్రేక ప్రసంగములతో దుర్గము నలుదెసల దానెయై యుద్ధము సాగించుచున్నది. ఉభయ పక్షముల నష్టములు విశేషముగ నున్నవి.

ప్రమాదము లొకదాని వెనుక నొకటి రాణికి సంభవించుచున్నవి.

ఆమె యొక వంకకు మరల మరల చూచుటలో నభిప్రాయ మేమి? ఆ దిక్కున నేమున్నది? అదుగో, తాతియా! స్వరాజ్య సమర సేనానాయకుడు మొదలు కాకలు తీరిన కదనయోధుడు దూరముగ బేత్వానది కావలగట్టున బహు బలముతో గనుపించుచున్నాడు. లక్ష్మీబాయి ముఖమున సంతోష రేఖలు నర్తించుచున్నవి.

ఆంగ్లేయ సైన్యాధ్యక్షుడు తాతియా సైన్యమును గమనించినాడు. అతనిపై యుద్ధ మొనర్చుటకు సైన్యము వ్యతిరేకించుచున్నది. పూర్వ మతని చేతిలో నది దెబ్బలు తినినది. అతడు ధైర్యశాలి, నిరుత్సాహ మెరుగని వ్యక్తి. కేవల మాంగ్లేయ పటాలముల ముందుకు రప్పించి వారి నుద్దేశించి "ప్రపంచ యుద్ధ రంగముల నెన్నిటినో ఖ్యాతి గడించిన బ్రిటిష్ సైన్యమునకు నేడీ కుయుద్ధమున పేరు ప్రతిష్ఠలు మంట గలియనున్నవి. ఏ మహత్తర సామ్రాజ్యమునకై మన పూర్వులు ప్రాణముల బలికావించినారో, రక్తనదము లింకించినారో, దానిని నల్పిన ఖ్యాతి మీకు దక్కనున్న" దని యుద్బోధించినాడు. మరణమో, యశమోయని సాహసించి సమస్త సైన్యము నతడు తాతియా కెదురు నడిపించినాడు.

ఝాన్సీరాణి దీనిని గమనించి దుర్గద్వారములు దెరపించి వెనుకనుండి వారిపై బడ నిశ్చయించి కొన్ని పటాలముల గదిలించునంతలో ఫిరంగి సైన్యము శత్రుపక్షము నుండి యగ్ని పిండముల గురిపింప నారంభించినది. ఆమె సైన్యములకు దిగి వచ్చుట కవకాశము లేకపోయినది.

తాతియా సైన్యములో నర్ధభాగము బేత్వానది దాటినది. మిగిలిన యర్ధభాగము దాటవలసి యున్నది. అట్టి స్థితిలో రాస్ సైన్యములు వారి నెదుర్కొనినవి. అతని సైన్యములు తికమక పడసాగినవి. మరుక్షణముననే ధైర్యస్థైర్యములతో నెదుర్కొనినవి. అందు రాణి శిక్షణ మిప్పించిన ఝాన్సీ సైన్యముతో నాంగ్లేయ యోధులు, నాశ్విక దళములు తలపడినారు. శత్రు సైన్యమున ననేకులు మృతి నొందినారు.

‘రోజ్’ దేశీయ సైన్యమును ముందుకు బంపినాడు. ఆ యిరువదియైదవ పటాలము నేపాలదేశ సైన్యము. అది హిమవత్పర్వత శ్రేణుల పాద ప్రదేశమున ప్రభవించిన గూర్ఖాజాతులతో నిండినది. ఇంతలో కర్నల్ నేపియర్ నూతన సేనలతో వచ్చి యాంగ్లేయుల గలసికొనినాడు. యుద్ధము మహాభయం కరముగ కొలది కాలము సాగినది. ప్రస్తుత స్థితిలో నేను ఝాన్సీ కెట్టి సాయము చేయలేనను నిశ్చయముతో తాతియా తిరిగి కాల్పీ వైపునకు వెడలిపోయినాడు. ఆంగ్లేయ సైన్యములో నొక పటాలమును దరుము కొనుచు వచ్చిన కాల్పీ సైన్యము ఝాన్సీ దుర్గములో ప్రవేశించినది.

ఝాన్సీ రాజ్యమున, శత్రువుల కాహార పదార్థములు లభించుట లేదు. తాతియా సైన్య తిరోగమనముతో వారికి కావలసినంత పదార్థము లభించినది. మరల ఝాన్సీ ముట్టడికి బూనుకొనినారు. సన్నాహముల సిద్ధ మొనర్చు కొనుచున్నారు.

ఝాన్సీ రాణి చిత్తము ప్రథమమున నించుక చలించినది. దైవము తన కనుకూలముగ లేదని తలపోసినది. మరుక్షణముననే ధైర్యమవలంబించి దుర్గ రక్షణోద్యోగమున మానసమును సుస్థిర మొనర్చుకొనినది సైన్యములను హెచ్చరించినది. సరదారులకు, ఖలేదారులకు నావశ్యకములైన యనుజ్ఞల నొసగినది. సైన్యము నుద్దేశించి యుద్బోధక వాక్యముల బలికినది.

“మిత్రబలము మనకు సాయమొనర్చునన్న యాశ తీరినది. నేడు మనము స్వశక్తిపై నాధార పడవలెను. మరణమునకు మనము సంసిద్ధులమైననాడే భవిష్యత్తున బ్రతుకున్నది. మీ హృదయ కుహరములలో నూతనాశాజ్యోతులు వెలిగింపుడు. మన పూర్వవీరుల స్మృతి పథముల నిల్పుడు. పోరాడుడు. మిమ్ము రక్షించుకొనుడు. స్వదేశమును, స్వజాతిని, స్వధర్మమును రక్షింపు” డనిన యామె వీరోచిత వాక్యములకు సైనికులు జయజయ ధ్వానము లొనర్చిరి. మిన్నులు మార్మోగ వీరారావము లొనర్చిరి. దుర్గము లోని హర్షోద్వేగ నినాదములతో శత్రుహృదయములు దద్దరిల్లుచున్నవి.

3 ఏప్రియలు 1858 ఉదయారంభమునుండి యాంగ్లేయులు ఝాన్సీపై ముట్టడి నారంభించినారు. ముఖద్వారము పై ఫిరంగి సైన్య మగ్ని వృష్టి గురిపించుచున్నది. ఝాన్సీ దుర్గము నుండి “మారో ఫిరంగీకో” అని గుల్మహమ్మద్ ప్రచండ కంఠస్వరము వినిపించినది. మరుక్షణమున శత్రుసేనపై నొక యగ్ని కెరటము పయనించి వారిని జెల్లా చెదరొనర్చినది. ఆనతి కాలములో వారు మరల తేరుకొని మృత్యువును తిరస్కరించుచు ముందుకు సాగివచ్చినారు.

ఆంగ్లేయులు కోటగోడ లెగ్రాకుటలో సుశిక్షితులు. అందు జాను, మైకేల్, డిక్, ఫాక్సులు అందెవేసిన చేతులు. ఝూన్సీరాణి సైన్య ప్రధానులలో నొకడైన రఘునాథ సింగు నిలచిన బురుజును బట్టుకొను యత్నములో గోడలపై నిచ్చెన గొలుసుల వేసివారు ఎక్కి వచ్చుచున్నారు.

దుర్గ మేటవాలైన గిరిశిఖరిపై నుండుట ఝూన్సీరాణి కుపకరించినది. వారి నామె సైన్యము ఖడ్గములతో నెదుర్కొని రూపుమాపినది. ఇట్టి యత్నములు నిష్ప్రయోజనములని వారు మరొకవైపునకు వెడలినారు. ఇంతలో కోట లోపలినుండి 'హర హర! మహాదేవ!!' యను నార్తనాదములు రాణి చెవుల బడినవి. లంచమిచ్చి మోసముతో నాంగ్లేయులు దక్షిణ దుర్గ ద్వారమును బట్టుకుని ప్రవేశించి తుముల యుద్ధము లొనర్చుచు ప్రజల చిత్రవధ జేయుచున్నారు. భయకంపిత గాత్రులై ప్రజలు నలుదెసల పరుగిడుచున్నారు.

'ఇక మృత్యువు తప్పదు' అని ఝూన్సీ నిశ్చయ మొనర్చినది. కాళీమూర్తివలె నాకృష్ణ కృపాణముతో నశ్వమును నలుదెసల బర్వులెత్తించు చున్నది. ప్రజల చిత్రవధ కన్నుల కనబడినది. ఆమె కన్ను లెఱ్ఱవారినవి. ఆమె యున్మత్తురాలైనది.

సంకుల సమర మారంభమైనది. ఖడ్గ యుద్ధము భయంకరముగ సాగుచున్నది. హాహారావములు, సైన్య నిర్ఘోషలు కరాళాట్టహాసములు, దుర్మరణా రావములు తమలో దాము పోరాడుకొనుచున్నవి. ప్రధాన ద్వారము శత్రువుల వశమైనది. బురుజుల గాపాడు మంత్రులు కొందరు మరణించినారు. మోరోపంతు మొండెము తన ముందు నడచి నేలపై దొరలుచున్నది.

ఝూన్సీరాణి శరీరము రక్తసిక్తమైనది. ఖడ్గము కఱకు వారినది. శత్రువులు నలుదెసల మూగి ముందుకు సాగి వచ్చుచున్నారు. ఆలస్యమైన నష్టకష్టములబాలు గావించిన యా మహావీర మూర్తికి వారేమి యపాయ మొనర్తురో!

అశ్వమధిరోహించి గుల్మహమ్మద్, ఖుదాబక్షులు వచ్చి యెదుట నిలచినారు.

"రాణి సాహెబ్! దుర్గమును శత్రువులకు స్వాధీన మొనర్చుట యుక్తము"

"ఝూన్సీని! నాకౌస్తుభమును! శత్రువుల హస్తముల కందించుటా! బొంది ప్రాణ మున్నంతవరకును జరుగదు" రాణి యున్మత్తురాలివలె ననినది.

"మీరు పీష్వా సైన్యముల కలుసుకొని మరల స్వాతంత్ర్య సమరమును సాగింపవచ్చును గదా! మీ ఝూన్సీ మీకు దక్కవలెనన్న..."

"ఔను, పీష్వా సైన్యముల చేరుకొనుటయే మన కర్తవ్యము" రాణి నిశ్చయమున కాసైన్యాధిపతు లిరువురును సంతసించినారు. రాణి కంగరక్షకులుగ పదునైదుగురాశ్వికుల దీసుకొని నిశీథ వేళ వారుత్తర ద్వారమును ప్రవేశించినారు.

గవని కాపలాదారడ్డుపడి ప్రశ్నింపగా నతనికి, "మేము టెహ్రి సంస్థానాధీశ్వరు డాంగ్లేయులకు హరణమిచ్చిన సైనికులము. సర్ హ్యూ రాస్ యాజ్ఞానుసారముగ సైన్యరక్షణ కేగుచున్నా"మని మోసగించి దుర్గమునుండి బయటపడినారు.

రాణి బేత్వానదిని దాటి యగాధ మార్గమున నిశీథమందు కాల్పీ మార్గములో నడచుచున్నది. వెన్నుపై దత్త పుత్రుని దామోదరుని పట్టు సెల్లాలో గట్టుకొనినది. ఒకచేత నశ్వపల్యాణములు, మరియొక చేత నుద్ధృతఖడ్గము నున్నవి. పదునైదశ్వములును నొక శలాకవలె వెంట నడుచుచున్నవి. ఒక ప్రక్క గుల్మహమ్మద్, మరొక వంక ఖుదాబక్ష్, మధ్యన రాణి పయనించు చున్నారు.

రాణి దుర్గమును వదలి కాల్పీ పోవుచున్నదన్న వార్త సరదారులకు తెలిసినది. వారును సైన్యముల మరలించి రాణి వెనువెంట బయనమైనారు. ఆంగ్లేయులు సమస్తమును దెలుసుకొనినారు. లెఫ్టినెంటు బౌకర్ రాణిని కాలవిలంబన మొనర్పక వెన్నాడ నారంభించినాడు. ఇరువుర సైన్యమునకు గనుజూపు మేర దూరము లేదు. మరుసటిదినముదయవేళకు రాణీ కాల్పీ రాచబాటకు చేరినది. వెనుకవచ్చు రాణీ సరదారులు బౌకరుతో దలపడి యతనిని సైన్య సమేతముగ యమపురి కంపినారు.

కొంత సైన్యముతో, సరదారులతో, రాణీ కాల్పీ జేరినది. ముట్టడి ప్రారంభమైనది మొదలామె నిద్రాహారము లెరుగదు. నేడు కొంత స్వస్థత చిక్కినది. ఉషోదయ వేళ వరకును నిద్రించి మేల్కొనినది. తాతియా మరికొన్ని విప్లవ సేనల కూర్చుకొని శత్రువుతో సమర మొనర్ప సన్నద్ధపడినారు. ఝాన్సీరాణి రాక యతనికి నూతన చైతన్యమును గల్పించినది.

ఇరువురును స్వాతంత్ర్య సమరమును ఆమరణాంతము సాగింప పునః ప్రమాణములొనర్చినారు. కొంత సైన్యమునకు తాతియా నాయకత్వము వహించినాడు. మరికొంత సైన్యమును ఝాన్సీరాణి నడుపుట కంగీకరించినది. పీష్వా ప్రతినిధి శ్రీమంతు మరికొంత సైన్యమును బాలించుటకు బూను కొనినాడు. కాల్పీనుండి నలుబది మైళ్ళు ముందుకు వచ్చి 'కుంచి' యొద్ద సైన్యములు నిలచినవి.

లక్ష్మీబాయి సైన్యము బందానవాబు, సాగర మహారాజు, వనపుర రాజులు పంపినది. వారు క్రమశిక్షణ మొందిన వారు కారు. కేవల ముత్సాహులు. ఆ సైన్య నిర్మాణ మామెకు నచ్చలేదు. కాని వారిని నడిపింపక తప్పదు. శత్రువుల క్రమశిక్షణ మత్యున్నతమైనది. సాధన సామగ్రిలో వారధికులు. అందు జనరల్ 'రాస్' యాజ్ఞ కెట్టి యాటంకమును లేదు.

అట్టి గ్రీష్మ సమయమును బ్రజ మున్నెన్నడును గని విని యెరుగరు. ఆంగ్లేయ సైన్యము లావేసగిని భరింపలేరని రాణి గమనించినది. ఫిరంగి యుద్ధము పగలు పన్నెండు గంటలు దాటిన తరువాత ప్రారంభమొనర్పవలె నని శాసించినది.

యుద్ధ మారంభమైనది. ఆంగ్లేయుల పక్షమున నూతన సేనానాయకుల నేకులు యుద్ధ మొనర్చుచున్నారు. స్వాతంత్ర్య సైన్యము శక్తి కొలది పోరాడినది. వ్యక్తిగతములైన ధైర్యోత్సాహ క్రియలనేకములు సైనికులు ప్రకటించినారు. ప్రయోజనము లేకపోయినది. 7 మే 1858న కుంచియొద్ద జాతీయ సైన్యమునకు మరల నొక యపజయము!

సమరము సాగుచున్న సమయమున తాతియా కొంత సైన్యముతో నదృశ్యుడైనాడు. తిరోగమించుటలో రాణీ నాయకత్వమున స్వాతంత్ర్య సైన్యము, ప్రకటించిన ధైర్య సాహసములను శత్రువులు వేనోళ్ళ పొగడినారు. రెండు మూడు మైళ్ళవరకును తుముల యుద్ధములు సాగించినారు. వారి ధైర్యము వీగిపోవుట లేదు చెదరుట లేదు. విప్లవ సైన్యములో నాశ్విక బలము కాల్బలమును, కాల్బల మాశ్వికమును నిందించుకొనుట కారంభించినారు. కొందరు ఝాన్సీని నిందించినారు. మరికొందరు బందా నవాబును నిందించినారు.

రాణి ముందునకు వచ్చి కాల్పీ మైదానములో సమస్త సేనల నుద్దేశించి "మహాయోధులారా! ఒకరినొకరు నిందించుట కిది సమయము కాదు. మన సర్వస్వము వినాశము నొందుచున్న సమయమున నీ యనైకమత్యమునకు దావీయకుడు. తాత్కాలికముగ దిరోగమించినాము – మరల శత్రువుపై బడక తప్పదు" అని వారిని రాణి యాశ్వాసించినది.

మే 22న ఝాన్సీరాణి సమస్త సేనలతో యమునా నదియొద్దున నిలచి నూతనోత్సామును రగిల్చినది.

"సైనికులారా! అదుగో యమునామాయి! ఆ పవిత్ర నీరముల గ్రహించి మాతృదేశము కొఱకు, స్వధర్మము కొఱకు, మా సర్వస్వముల బలిగావించుటకు

సంసిద్ధులమని ప్రమాణ మొనర్చు" డని శాసించినది. ఆమె యాజ్ఞానుసార ముగ విప్లవ సైన్యములు ముమ్మారు ప్రమాణ మొనర్చినారు. వారి వీర శంఖధ్వానములకు యమునా కాళిందీ నదులు ప్రతి శబ్దించుచున్నవి.

ఆశ్విక చమూధాటికి రేగిన కెంధూళుల నకాలాస్తమయములు పొడకట్టుచున్నవి. దానిని దిలకించిన శత్రువులకు గుండెలు చెదురుచున్నవి.

జనరల్ రాస్‌కు సహాయార్థము సర్వ సైన్యాధ్యక్షుడు కాలిన్ ఓర్ సేనానాయకుని బంపినాడు. అతడసామాన్య యోధుడు. బర్మా, నేపాళ యుద్ధములలో బ్రాభవము, ప్రజ్ఞ గడించి ఖ్యాతి గన్నవాడు. ఆంగ్లేయ సైన్యము కాల్పీ మైదానముల విడిసినది. ఎవరును ముందునకు వచ్చుటకు సాహసింప లేదు.

ఎంత కాలమిట్లు? రాణి యానాడాశ్విక సైన్యమును నడుపుచున్నది. తన యాశ్విక సైన్యమును ముందుకు దూకించినది. పదునైదు నిమిషముల కాలము శత్రువు లనిశ్చితులుగ నున్న వారి సేన సమస్తమును యమదర్శనమున కేగియుండెడిది. 'ఓర్' తన వెంట నూతనముగ తెచ్చిన యుష్ట్రబలమును ముందునకు గదలించినాడు. దానితో స్వాతంత్ర్య సైన్యమున గల్లోలము చెలరేగినది. మునుపు వారట్టి యుష్ట్రబలమును జూడలేదు. ఇదే సమయమని యాంగ్లేయులు సమస్త బలముల దరలింప నుభయ పక్షములకు ఘోరయుద్ధము జరిగినది.

సర్వసైన్యమున నీతి తరిగిపోవుచున్నది. శత్రువులు మహోత్సాహముతో బోరాడుచున్నారు. సమస్త వాహినిని హతమొనర్చుకొన్న నిక యాశకైన తావుండదు. మరల నొకరంగమున నెదుర్కొన యూహించి రాణి సైన్యమును మరియొక మార్గమును బట్టించి నడిపించినది.

శత్రువుల యదృష్టము పండినది. కాల్పీ వశమైనది. నానాసాహెబు, తాతియాలు శ్రమపడి సంపాదించిన యాహార పదార్థములు వారి వశమైనవి. భూగర్భముల దాచియుంచిన యిరువది వేల పౌనుల మందు సామాను చిక్కినది. విజయోత్సాహముతో దన సైన్యముల కిట్లు జనరల్ రాస్ పలికినాడు.

"సైనికులారా! మీరు వేయి మైళ్ళు జయించినారు. మనకు నేటికి నూరు ఫిరంగులు చిక్కినవి. నదుల నీదినారు, వనముల గడచినారు, పర్వతశ్రేణు లెగబ్రాకినారు. మహా సైన్యముల నురుమాడినారు. మీ క్రమశిక్షణ ఫలితముగ నర్మద మొదలు యమున వరకునున్న స్వర్ణ ఖండము మనకు వశమైనది. మన సైన్య చరిత్రలో మీ వీరోచిత

కృత్యములు సువర్ణాక్షరముల లిఖితములు కాగలవు. మీ పరిశ్రమకు తగిన ప్రతిఫలము బహుమాన రూపమున ననతి కాలముననే పొందగలరు"

సైన్యముల కభినందన వాక్యములు పలికి యారోగ్యమును జేకూర్చుకొనుటకై జనరల్ రాస్ బొంబాయికి బయనమైనాడు. కాని ఝూన్సీరాణి యతని కట్టి యవకాశము నొసగ నిచ్ఛగింపలేదు.

కాల్పీ శత్రువులకు వశమైన తరువాత విప్లవ సైన్యములకు నిలువ నీడలేదు. ఆహార పదార్థములు లేవు. నానా సాహెబ్ వార్తలు వినిపించుట లేదు. తాతియా యెట కదృశ్యుడైనాడో తెలియదు. గోపాలపురమును జేరుకొని సైన్యములు కర్తవ్య మాలోచింపసాగినవి.

"అపజయములపై నపజయములు, ఇట్లెంత కాలము!" అని బందా నవాబు పలికినాడు.

"మాతృదేశమునకు ముక్తి యికలేద"దని సాగర మహారాజనినాడు.

ఆ మాట చెవిన బడిన మరుక్షణమే ఝూన్సీరాణి కొదమ సింగమువలె "నా కుత్తుకలో బ్రాణమున్నంతవరకట్టి యూహలు రాకూడ"దని గద్దించి పలికినది.

"ఈ స్థితిలో తాతియా యున్న నెంత బాగుండెది!"

"తాతియా ఏమైనాడు?"

"తండ్రిని చూచుటకు చర్కికి వెడలి యుండవచ్చును"

"ఇది నేను నమ్మలేను. అతడచంచల దేశభక్తుడు. మాతృసేవలో మహత్తర కార్యదీక్షతో సైన్యములు వ్యవహరించుచున్న యీ సమయమునందా స్వార్థ త్యాగి తండ్రిని దర్శింప నేగునా? ఇది కల్ల! అతడట్టి తుచ్ఛుడు కాడు" అని రాణీసాహెబు పలికినది.

కాల్పీ యుద్ధ రంగమునుండి గ్వాలియర్ మార్గమున తాతియా యా మహానగరము చేరుకొనినాడు. గ్వాలియర్ మహారాజు శత్రువులకు మిత్రుడు. నేటిస్థితిలో గ్వాలియర్ వంటి దుర్గము చేతనున్నగాని యాంగ్లేయులతో సమరము సాగించుట కవకాశము లేదు. తాతియా గ్వాలియర్ చేరుకొనిన మరుక్షణమునుండి సైనికోద్యోగులలోను, రాజోద్యోగులలోను విప్లవ బీజముల వెదజల్లినాడు. మహారాజును మోసగించియైన

గ్వాలియర్ కోటను తాతియా వశము గావించి స్వాతంత్ర్య సమరము సాగింప సాయపడుటకు వారు ప్రమాణము లొనర్చినారు. ఈ రాచ కార్యమున కొక మాసము కాలము పట్టినది. ఈ మహత్తర రాజకార్యమునకే యతడు కాల్పీ యుద్ధ రంగమునుండి యదృశ్యుడైనాడు.

స్వాతంత్ర్య యోధులకు గ్వాలియర్ తుది సమరాంగణము. దానిని స్వీకరించుటలో మొదట గ్వాలియర్ బాలె ఘాట్ దళముతో లక్ష్మీబాయి పోరాడవలసి వచ్చినది. పోరాటమున నోడిపోయినను సింధియా మహారాజు వారికి సాయపడ నిచ్చగింపక నాంగ్లేయ సహాయ మర్థించుచు తప్పించుకొని పారిపోయినాడు. ఝాన్సీరాణి యతనిని వెన్నంటు సైన్యముతో "అతడు ద్రోహి, పిఱికిపంద, పారిపోనిం"డని పలికినది.

గ్వాలియర్ పీష్వా నానాసాహెబు ప్రతినిధి. శ్రీమంతు వశమైనది. 'ఫుల్ బాగ్'లో దర్బారు జరిగినది. అందు మంత్రులు, రాజనీతిజ్ఞులు, సరదారులు, ఖిలేదారులు, రాజపుత్రులు, పఠానులు, రోహిలాలు, నరబ్బులు వారి స్థానముల నధివసించినారు. అమరచందు వశమొనర్చిన సింహాసనమున పీష్వా ప్రతినిధిగ 'శ్రీమం' తాసీనుడైనాడు. ఆయన రామారావు గోవిందుని ప్రధాన మంత్రిగను, తాతియాను సర్వ సైన్యాధ్యక్షునిగను పట్టభద్రుల నొనర్చినాడు. శ్రీమంతు పీష్వా సైన్యములకు రెండు లక్షల ధనమును బహూకరించినాడు. గ్వాలియర్ దుర్గము పట్టాభిషేకోత్సవములతో గన్నుల పండువుగ నొప్పినది.

ఆ సందర్భమున ఝాన్సీరాణి పీష్వాకు గప్పము చెల్లించుచు సామంత సంస్థానాధీశ్వరిగ నుండుట కంగీకరించినది. ఆమె యొనర్చిన వీరోద్రేక ప్రసంగమునకు సభ యెల్ల ముగ్ధమైనది.

జనరల్ రాస్‌కు సమస్తమును తెలిసినది. మహారాష్ట్రములో గాక పీష్వా గ్వాలియరులో బలము చిక్కుట విచిత్రమైన విషయము. అతడాశ్చర్యపడినాడు. శివాజీ, నానాఫడ్నవీస్ మొదలైన మహారాష్ట్ర వీరుల స్వాతంత్ర్యాకాంక్షయే వీరి హృదయముల సుస్థిరమైయుండవచ్చునని యతడూహించినాడు.

అతడు నూతన సైన్యముతో, నవ్యోత్సాహముతో సింధియా రాజ్యమున ప్రవేశించి 'గ్వాలియర్ మహారాజుకు సాయ మొనర్చుటకు దాను వచ్చినా'నని, "ప్రభువున కనురక్తులై సాయపడు"డని ప్రజల నుద్బోధించినాడు. పాప మతనియాశలడుగంటినవి. కాలము మారినది. ప్రజాక్షేమము నూహించి పాలింపజాలని ప్రభువునకు సాయ

మొనర్చుజాలమని ప్రజలు నిశ్చయముగ పలికినారు. గ్వాలియర్ ప్రభువును 'దేశ ద్రోహి'యని ముఖమున వాకొనిరి.

మత ప్రసక్తితో విప్లవ వీరుల నుండి బందాను విడదీయ యత్నించి యా ప్రయత్నమందాంగ్లేయులు విఫలులైనారు. బందా స్వేచ్ఛావీరుడు! మతోద్రేకి కాడు. హిందూ మహమ్మదీయ సమైక్యతకు బాటుపడిన ప్రథమ వ్యక్తి!!

జూన్ 17న గ్వాలియర్ కోట ముట్టడి యారంభమైనది. ప్రారంభమున పీష్వాపై బందా తిరుగబడినాడు. రాణి మన పరమాశయము స్వేచ్ఛాపతాకము యావద్భారతమున ప్రతిష్ఠాపించుట. ఇట్టి సమయమున మనలో వైమనస్య ములు పొడకట్టిన మొదటికి మోసము వచ్చును. శత్రువుల కుతంత్రములలో జిక్కివారిని నమ్మి మోసపోకు' మని బందా నవాబుతో మంతనములు సలిపినది. అతడు తప్పిదమును గమనించి పీష్వాను క్షమాపణ వేడుకొనినాడు. వారిరువుర మిత్రుల నొనర్చి 'యొకరి నొకడు మోసగింప' మని రాణి ప్రమాణము స్వీకరించునట్లొనర్చినది.

యథాక్రమముగ ఝాన్సీరాణి యుద్ధరూపము ధరించినది. తెల్లని పైజామా, అంగరకాపై నెర్రని జుబ్బా, జరీ కుచ్చుల తెల్లని తలపాగ, నడుమునకు దెల్లని పట్టు సెల్లాదట్టీ బిగించినది. దుర్గ పూర్వ దక్షిణ దిశల రక్షణభార మామె వహించినది. ఆమె యాంతరంగిక సేవికులు కాశీ బాయి, మందరలును యుద్ధ వేషముల నున్నారు. గుల్మహమ్మద్ ఖాను, ఖుదా బక్షు లామె పార్శ్వచరులుగ సేనలతో ననువర్తించుచున్నారు. రాణి సాహెబు శ్వేతాశ్వ మధిరోహించి యాకృష్ణ కరవాలముతో స్వసైన్యముల బర్యవేక్షణ మొనర్చు చున్నది.

ఆంగ్లేయ సైన్యములు కనుచూపు మేరలోనికి వచ్చినవి. అవి బ్రిగడీరు స్మిత్ నాయకత్వమున శరవేగముతో వచ్చి పడుచున్నవి. రాణి రణవాద్యముల మొరయించినది. ఆమె సరదారులు సైన్యముల నుత్తేజ పరచుచున్నారు. ఫిరంగీ సైన్యములు వారి కార్యక్రమము నారంభించినవి. వాని నిర్ఘోషముల కాకాశము భిన్నించుచున్నట్లున్నది.

ఉభయ సైన్యములును దారసిల్లినవి. రఘునాథసింగు శత్రు సైన్యములో జొచ్చుకొని వారిని చెల్లాచెద రొనర్చుచున్నాడు. ఆంగ్లేయ సైన్యమున హాహాకారము లతిశయించుచున్నవి. రాణి రక్త ముప్పొంగి పొరలిపోవుచున్నది. ఎటు చూచిన నభోమాస శంపాలతవలె నామె మూర్తియే శత్రువుల కన్నుల యెదుట మెరయుచున్నది.

ఆంగ్లేయులు విశ్రాంతి దళముల రప్పించి రాణి సైన్యముపై నడిపినారు. ఆమె సైన్యము ధైర్యముతో నెదుర్కొని తరిమికొట్టినది. జనరల్ స్మిత్ ప్రయోజనము లేదనుకొని సైన్యమును మరలించి మరియొక వంకకు తప్పుకొనినాడు.

మరునాడు 18 జూన్, జ్యేష్ఠ శుక్ల సప్తమి, శుక్రవారము ఆంగ్లేయులు జనరల్ స్మిత్, హ్యూరాస్‌ల నాయకత్వమున మరల రాణి సైన్యము నెదుర్కొన వచ్చినారు. వారి రాకను దూరము నుండి గమనించిన గుల్మహమ్మద్ వేగముగ వచ్చి "రాణీ సాహెబ్! శత్రువులు మరల మనపై బడవచ్చు చున్నా"రని పలికినాడు. రాణి మందస్మిత మొనర్చి 'రానిమ్ము. మన బలసాహసముల దెలుసుకొందు' రనినది. 'మీ మీ స్థానములలో నప్రమత్తతతో వర్తింపు' దని వారి కనుజ్ఞ నొసగి శ్వేతాశ్వమును యుద్ధభూమిని పరవళ్ళు త్రొక్కించుచు నానందించుచున్నది.

ఆనాటి పగలెల్ల యుద్ధము మహాభయంకరముగ సాగినది. ఆనాడామె ప్రకటించిన ధైర్యసాహసముల గన్నుల పండువగ జూచిన జనరలు 'పాశ్చాత్య లోకమునందిట్టి వీరవనిత యొక్కతెయైన జన్మించినదా?' జోన్ ఆఫ్ ఆర్కు ఈమె కొనగోటికి జాలదు. ఈమె మూర్తీభవించిన వీరము గాని యన్య ముగా'దని మనస్సున సంభావించినాడు.

సాయంసమయ మాసన్న మగుచున్నది. రాణి పక్షము నుండి ఫిరంగి మ్రోతలు వినిపించుట లేదు. సకాలమునకు సామాగ్రి యందియుండదు. ఆమెపైబడుట కిదియే సమయమని జనరలు స్మిత్ యెనిమిదవ 'హుస్సారు' లను ముందుకు జేరి రాణిని జుట్టుముట్టుడని యాజ్ఞాపించినాడు. శత్రువుల యాశ్విక సైన్యమామెను వేటకుక్కల వలె వెన్నాడుచున్నారు.

దూరమునుండి గమనించిన ఖుదాబక్ష్ యాశ్విక సైన్యముతో వారిపై బడ వచ్చునంతలో నొక నూతన సేన యాతనిపై పడినది. రాణిని శత్రువులు వలయాకారమున బంధించుచున్నారు. ఆమె సైన్యమున భయోత్పాతములు పొడజూపినవి. హాహారావములు మిన్ను ముట్టినవి. రాణి యిప్పటికిని లొంగలేదు. అచంచల విశ్వాసముతో బోరాడుచున్నది.

వెనుకనుండి యొక స్త్రీ కంఠమున నార్తారావము వినిపించినది. అది మందర గొంతుక. బాయిసాహెబును రక్షించుటకు వచ్చుచున్న యామెపై నొక యాంగ్లేయుడు తలపడి కంఠచ్ఛేద మొనర్చినాడు. రాణి యాతనిని మరుక్షణమున యమసదనమున

కంపినది. 'హర హర మహాదేవ' నినాదములతో రాణి కరాళ కాళీమూర్తివలె విజృంభించి గతిపయనిమేషముల కాలము తాండవించినది.

ఆమె యశ్వము నొక తిన్నెపై నడిపించుచున్నది. అది యొక దుముకు దుమికిన నా వ్యూహమునుండి యామె తప్పించుకొనెడిది. నేడామె యధిరోహించినది నూతనాశ్వము. క్రిందటి దినమున యుద్ధములో నామె యనురాగముతో బెంచి పాలించు కొనుచున్న యశ్వరాజము మరణించినది. ఆంగ్లేయుల యదృష్టము ఫలించినది. చుట్టుముట్టిన యాంగ్లేయులతో నామె ఖడ్గయుద్ధ మొనర్చు సమయమున యొకని గుండెనుండి చిమ్మిన రక్తమామె కంటబడినది. కనులు మూతబడుచున్నను, హస్తమున ఖడ్గము విహరించుట మానలేదు. ఇట్టి విషమస్థితిలో నొక యాంగ్లేయుడు శక్తినంతయు వినియోగించి యామె శిరస్సున మోదినాడు. ఆమె దక్షిణ నేత్రము ముందుకు వచ్చినది. అప్పటికిని రాణి 'శర'ణన లేదు. మరల నొక కత్తిపోటు హృదయ భాగమున దగిలినది. రాణికి స్మృతి తప్పినది. నిశ్వసించుట గమనించి దేశముఖు రామచంద్రరావు మెరికల వంటి యోధులతో నా ప్రదేశమును చేరి రాణిని నిజాశ్వముపై జేర్చుకొని శిబిరమునకు వచ్చినాడు.

గుడారమున గంగాదాసు బావా తల్ప మమర్చి విశ్రమింపజేసి శీతల జలమును దాహమిచ్చి యామెకు సేవ యొనర్చుచున్నాడు. రక్తస్నాన మాడిన యా వస్త్రముల తోనే రాణి పర్యంకముపై మేను వాల్చినది.

"తాతియా!... సమరమును సాగింపుము. తల్లి దాస్య విముక్తికై తనువు లర్పింపు"మని యాజ్ఞాపించి తుది క్షణమున దత్తపుత్రుని దామోదరుని దరి జేర్చుకొని ప్రేమ పొంగులు వార 'దామోదరా!' యని శిరము నిమురుచు తుది నిశ్వాస మొనర్చినది.

సూర్యకాంతి ప్రపంచము వీడినది. లక్ష్మి శరీరమును వదలినది.

రాణి యాశయము ఫలించినదా? లేదు, స్వాతంత్ర్య యుద్ధమున విజయము సంశయాస్పదముగ నున్నది. ఫలింపలేదా? ఫలించినది. భారతజాతి నిర్వీర్యము కాలేదని ప్రచండ పరప్రభుత్వము నెదుర్కొని యామె నిరూపించినది.

జూన్ 19న గ్వాలియరును జనరల్ రాస్ పట్టుకొనినాడు. రాణి మరణవార్త విన్న తాతియా సమరము సాగింప లేకపోయినాడు. మరల మరల రాణి మాటల జ్ఞప్తికి దెచ్చుకొని శత్రువుల జెండాడనెన్ని యత్నము లొనర్చిన నాతని హృదయము

వెలుగులేని శూన్యగృహమై పోవుచున్నది. మానసిక వ్యథ కారణముగ నతడు బ్రిగడీరు నేపియరుకు జిక్కిపోయినాడు.

ప్రథమ స్వాతంత్ర్య యుద్ధ మంతటితో ముగిసినది. ఆ సమరవీరుల చరిత్రలు వీరగాథలై వెలసి భవిష్యత్కాలమున ననేక స్వాతంత్ర్య వీర హృదయ క్షేత్రముల స్వేచ్ఛాబీజముల నాటి, వనముల పెంచి, ఫలముల పండించినవి.

అచంచల దేశభక్తికి, సేవాత్యాగములకు, ధైర్య సాహసములకు, ప్రజానురాగమునకు సంజ్ఞామూర్తియై లక్ష్మీబాయి నేడును కీర్తి శరీరముతో నారాధ్య దేవతయై నిలచినది.

# 2. లోకమాన్యుడు

ఆంగ్లేయ ప్రభుత్వము మంచిదా? చెడ్డదా? అను ప్రశ్నలేదు. దాని గుణదోషములతో మనకేమి సంబంధము? అది పరప్రభుత్వము. అందును నదృశ్యము. రాజునకును బ్రజలకును సంబంధము లేని ప్రభుత్వము! ప్రభుత్వోద్యోగుల పశు బలము తోడ్పాటుతో పాలించు ప్రభుత్వము!!

"పాలనా వ్యవహార నిర్వాహకత్వము ప్రజాహస్త గతమై యుండుటయే స్వరాజ్యము"

"స్వరాజ్య కాంక్ష ప్రతి వ్యక్తికిని జన్మహక్కు అది చట్ట సమ్మతమైనది"

ముక్తకంఠముతో నీ రీతిగ బ్రథమ స్వాతంత్ర్య యుద్ధానంతరము భారతీయ ప్రజల నుద్దేశించి కేక పెట్టిన మహావ్యక్తి 'మహారాష్ట్ర కేసరి' బాలగంగాధర్ తిలక్!

బ్రిటిష్ ప్రభుత్వము దేశమాతను క్రమక్రమముగ శృంఖలాబద్ధ గావించినది. శక్తి సామర్థ్యములు క్షీణింప సామాన్య ప్రజానీకము కర్తవ్యతావిమూఢమై పర ప్రభుత్వ పాద తాడనములకు శిర మొగ్గుచున్నది. వివేకులమని విఱ్ఱవీగువారు విదేశ సంస్కార వ్యామోహితులు. దేశమున విద్యాగంధము లేదు. జాతీయ భావములు లేవు. సుహృద్భావము శూన్య మైనది. విచక్షణా జ్ఞాన మావశ్యక మనిపించుచున్నది. ఎటు చూచిన నంధ కారము! ఈ యంధకారమును తరిమికొట్టి స్వాతంత్ర్య భానూదయమున కనూరుడై యవతరించిన మహాతేజస్వి తిలక్ మహాశయుడు!!

ఆయన జన్మభూమి, ఛత్రపతి శివాజీవంటి వీరాధివీరుని కన్నతల్లి, మహారాష్ట్రము! శతాబ్ద కాలము భారత సామ్రాట్టుగ దేశమును వీరోచితముగ పాలించిన బాలాజీ విశ్వనాథుని జననసీమ కనతిదూరమున నున్న రత్నగిరి యా వీరుని జన్మగ్రామము!! మొగలాయీ ప్రభుత్వాంతమున మహా యోధులని ప్రఖ్యాతిగన్న పీష్వాల 'చిత్పావన' వంశమున నతడు జన్మించినాడు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అను మహామంత్ర ముపదేశించి కుమారుని మహావీరునిగ దీర్చిదిద్దిన మాతృమూర్తి జిజియా

నాదర్శముగ స్వీకరించి వర్తించు వీరవనిత యాయన తల్లి!! పురాతన భారతీయ సంస్కారమెల్ల గరడు గట్టిన పుంభావ సరస్వతీ మూర్తి తండ్రి – గంగాధర రామచంద్ర తిలక్!!

"తిలక్ మహాశయుడు శతాబ్దమునకు బూర్వము పుట్టియున్నచో నొక స్వతంత్ర రాజ్యమును సృష్టించుకొని సామ్రాజ్యము నొడుచుకొన బోరాటము సాగించి యుండెడివా"డని యొక సందర్భమున గోపాలకృష్ణ గోఖలే తన యాంగ్లేయ మిత్రునితో ననినాడట! ఇది తిలక్ మహాశయుని జీవిత సర్వస్వమును వ్యక్త మొనర్పగల యభినందన వాక్యము. తిలక్ బాల్యమాదిగ జీవితాంతము వరకును ధర్మయోధుడు! కర్మవీరుడు!!

23 జూలై 1856 నాడొక శుభలక్షణమున జన్మించి బాల్యము నెల్లనొక వీర కుసుమముగ బాలగంగాధర తిలక్ గడిపినాడు. తండ్రికడ విద్యాభ్యాస మొనర్చు సమయమున నాతడు జాతీయ భావముల పెంపొందించుకొనినాడు. పట్టుదల యతనికి నిరంతరమును ప్రథమ ప్రాణము.

తండ్రి గంగాధర రామచంద్ర తిలక్ తన బాలునికి సంస్కృతమును, గణిత శాస్త్రమును నూరిపోసినాడు. అతని మేధా సంపన్నతకు, కార్యశూరత కతడు మనమున మెచ్చుకొనుచు, 'నెన్నటికైన నా పుత్రుడొక విఖ్యాత పురుషుడు కాగల'డని యువ్విళ్ళూరి, తని విద్యాశీలముల విషయమున విశేష జాగరూకత వహించినాడు. రామచంద్ర తిలక్ కమ్మని కంఠముతో వినిపింప మహాకవి బాణ భట్టారకుని కాదంబరీ మహాకావ్యమును విని యొకనాడు బాలగంగాధరుడా గ్రంథమును తన కిమ్మని పట్టుబట్టి నాడట! తండ్రి కఠినములైన గణితముల నిచ్చి వానిని మరల తిరిగివచ్చు వేళకు దోషరహితములుగ జేసిజూపిన నట్లే యా గ్రంథము నిత్తునని కార్యాలయమునకు వెడలిపోయినాడు. బాలగంగాధరుడు, వీరుడు, పట్టుదలతో దండ్రి కోరికను నెరవేర్చి బహుమతిని గ్రహించినాడు. ఇది తిలక్ మహాశయుని జీవితమున ప్రథమ విజయ సోపానము!

తల్లి యతి బాల్యముననే మృతి నొందినది. ఆగష్టు 1872లో తండ్రి షోడశ వర్షములు ముగియక మునుపే మరణించినాడు. తదుపరి నాలుగు మాసములకు మెట్రిక్యులేషను పరీక్షలో నుత్తీర్ణుడై, 1876వ సంవత్సరమున బి.ఏ. డిగ్రీ స్వీకరించి బొంబాయి విశ్వవిద్యాలయమున 1879లో న్యాయవాద పరీక్షయందు గంగాధరుడు పట్టభద్రుడైనాడు.

పూవునకు బరిమళము లక్షణము. ప్రతిభావంతుడైన యోధునియందు ప్రాథమిక దశలోనైన వీరము దాగ నేరదు. విద్యార్థి దశయందును తిలక్ వీరుడు, స్వేచ్ఛా ప్రియుడు, ప్రేమ పాత్రుడు. సోదర విద్యార్థుల ప్రేమను గ్రహించి వారిని ప్రేమింప నతడు నేర్చుకొనినాడు. ఆవశ్యకములగు సందర్భముల వారి నెల్లర గూడకట్టుకొని నడిపించినాడు. అతడు వారి హృదయ క్షేత్రముల జాతీయ భావ బీజముల నాటి వానిని పోషించి యంకురింప జేసినాడు. మాతృదేశ సేవోద్యోగమున వారి నెల్లర తిలక్ కృతనిశ్చయముల గావించినాడు.

బాలగంగాధరుడు సూక్ష్మగ్రాహి. ఉపాధ్యాయ వర్గముల ప్రాత పద్ధతు లతనికి నచ్చవు. వారిచ్చు టిప్పణుల నతడు గౌరవింపడు. స్వేచ్ఛా ప్రియత్వ మతనికి నూతన మార్గముల వెదకి పెట్టినది. అనువాదములన్న నతని కభిమానము లేదు. గణితమునందు క్రమవిధానమును నిరూపింపక కేవల ఫలితాంశములను మాత్రమే లిఖించువాడు. 'నీ క్రమ' మేదని వారు ప్రశ్నింప 'నది నా బుద్ధియందున్న' దన్నట్లు శిరము జూపించెడువాడు. అతని విప్లవ తత్త్వము పూర్వమార్గముల ననుసరించు నుపాధ్యాయులకు నచ్చలేదు. కాని యతని బుద్ధి కౌశలమునకు వారాశ్చర్యపడుచు నతనిని ప్రేమతో బాలించినారు.

సమస్త కార్యనిర్వహణమునకు సౌష్ఠవమగు శరీర మావశ్యకమని గంగాధరుని నమ్మకము. శరీర పోషణము లేని వ్యక్తి మాతృసేవ కనర్హుడగుటయే గాక నబలుడునని యతడనేక పర్యాయము లుద్ఘోషించి పలికినాడు. మనస్సుతో బాటు శరీర పరిశ్రమ యొనర్చి సేవాత్యాగములకు తిలక్ బాల్యదశ నుండి క్రమశిక్షణ మొనర్చుకొనుట వలననే జీవితాంతము వరకెంతటి దీర్ఘకృషికైన నతడు వెనుదీయలేదు. ఆయనను మహత్తర స్వేచ్ఛావీరు నొనర్చిన శక్తులలో నతని శారీరిక బలమొకటి.

దేశీయుల శక్తి నానాటికిని క్షీణించుచున్నది. ప్రభుత్వోద్యోగుల దురా గతములును బెచ్చు బెరుగుచున్నవి. ఎట జూచిన మృత్యువు! దేశమాత దుర్భర దారిద్ర్యము నతడు భరింపలేకపోయినాఁడు. స్వతంత్రమే సమస్తమునకు శరణ్యమని తిలక్ మానసమున తీర్మానించుకొనినాడు.

17,18 శతాబ్దములలో స్వాతంత్ర్య సముపార్జనకై శక్తివంచన లేక పాటుపడిన మహారాష్ట్ర వీరయోధుల చరిత్రను తిలక్ 'జాతీయ గీతి'గ బఠించినాడు. కురుక్షేత్ర మహాయుద్ధమున కర్తవ్యతా విమూఢుడైన యర్జునునకు రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణ భగవానుడుపదేశించిన గీతను కంఠస్థ మొనర్చినాడు. అందు కర్మవీర మతనికి

ద్యోతకమైనది. 'భావుకలోకమున విహరించుటవలన బ్రయోజన మేమున్నది? కర్మక్షేత్రమున బ్రవేశించి నేను ధర్మయోధుడను గావలసిదే' యని తీర్మానించుకొనినాడు.

దుర్భర దుష్ట పరిపాలనకు దోడుగ భారతమున 1877వ సంవత్సరమున క్షామ దేవత వికటాట్ట హాసములతో గరాళనృత్య మొనర్చుచున్నది. గంగాధరునికి నిద్ర లేదు ఆహారమంతకు మునుపే లేదు. ఆలోచనా పరవశత్వమున సమస్తమును మఱచినాడు. ప్రభుత్వము ప్రబలమైనది. దేశ ప్రజలు శక్తిహీనులు, విజ్ఞాన రహితులు, దరిద్రులు, నిద్రితులు. జాతీయ విద్యలో స్వరాజ్య సమరారంభమునకు గృతనిశ్చయుడైనాడు. యువకలోకమును మేల్కొల్పినాడు.

'ప్రజల కాత్మను ప్రసాదింపుడు. వారిని మేల్కొల్పు'దని మహారాష్ట్ర సీమలో యువక నాయకుడు విష్ణుచిత్త చిపళూనకర్ శంఖధ్వానమొనర్చుచున్నాడు. అదియు నతని గొంతుకను బోలినది. ప్రభుత్వముతో సమరమారంభింపవలె నన్న సమరయోధుల గూడకట్టుకొనవలెను. కళాశాలలో సహపాఠి గోపాల గణేశ అగర్కార్ గంగాధరుని కుడిభుజమై నిలుతునని ప్రమాణము చేసినాడు. ఇరువురును ప్రభుత్వోద్యోగముల స్వీకరింపమని ప్రతినలు గైకొనినారు. వారికి మరియొక మహారాష్ట్రవీరుడు నామజోషీ సహయోధుడైనాడు.

"ప్రభుత్వ విద్యా విధానము నెదుర్కొనవలెను. విజ్ఞాన వంతులలో బొడసూపుచున్న వెర్రితలలకు బ్రభుత్వ విద్యా విధానము కారణము. జాతీయ విద్యను ప్రసాదించిన కొలది కాలములో బ్రభుత్వము నెదుర్కొనగల యోధులుద్భవింపగలరు"

ఈ నిశ్చయముతో మిత్రుల తోడ్పాటు వలన తిలక్ 2 జనవరి 1880న జాతీయ పాఠశాలను బ్రారంభించినాడు. భవిష్యత్తున త్యాగమూర్తుల, దేశభక్తుల, సేవాతత్పరుల సృజింప యోగ్యమగునట్లు బుద్ధిబలమును సమస్తమును వినియోగించి యందలి విద్యావిధానము నేర్పాటొనర్చినాడు. సర్వస్వమును ధారవోసి పాఠశాలను నడుపుచు మహారాష్ట్రమును దీర్ఘ నిద్ర నుండి మేల్కొల్ప గంభీరోపన్యాసము లొసంగుచు కొంతకాలము తిలక్ మహాశయుడు గడపినాడు.

ఆధునిక సమరాంగణములలో వార్తాపత్రికలు ప్రముఖ రంగభూములని తిలక్ ఏనాడో గ్రహించినాడు. పత్రికా సంపాదకుడై దేశమున కొంత ప్రచారము సాగింప దలపెట్టినాడు. ఆయన యాంగ్ల విద్యా వాసనలతో మునిగి తేలుచు కేవల మాంగ్లేయ మానసపుత్రులై విద్యాధికులమని విర్రవీగువారి మనోవీథుల జాతీయ విప్లవ

బీజాంకురముల నాటి నాంగ్లేయ భాషలో 'మహారాష్ట్ర' యను వార పత్రికను స్థాపించినాడు. ప్రజా చైతన్యము కలుగవలె నన్న ప్రాంతీయ భాషలో బ్రచార మవసరమని గుర్తించి మహారాష్ట్ర భాషలో 'కేసరి' యను పత్రికను బ్రకటించినాడు.

ఆయన నూతన ఆంగ్ల పాఠశాల యనతి కాలమున మహారాష్ట్రములోని ప్రథమ శ్రేణి పాఠశాలలో ప్రథమ గణ్యమైనది. జాతీయ తత్వముతో, స్వార్థ త్యాగముతో, శ్రమించి ప్రజాహితమునకై తిలక్ ప్రకటించుచున్న పత్రికలు రెండును ప్రజల హృదయముల నాకర్షించి యందు ప్రధాన స్థానమును గల్పించుకొనినవి. ఇందుకు ముఖ్య కారణము తిలక్ సామాన్య ప్రజల దృష్టియందుంచుకొని వ్యవహరించుటయే! వారికి స్వాతంత్ర్యేచ్ఛను, రాజకీయ విజ్ఞానమును బ్రసాదింప బూనుకొనుటయే!!

సామాన్య జనుల కపచారము లొనర్చువారు పర దేశస్థులైనను స్వదేశస్థులైనను వారిని నిశిత లేఖనీ ఖడ్గముతో నెదుర్కొనుటకా జాతీయ వీరు డెన్నడును పత్రికా రంగమున వెనుదీయలేదు. దేశద్రోహుల విషయమున నీ స్వ పర విభేద రహితతయే తిలక్ మహాశయుని నాయకాగ్రేసరు నొనర్చిన మహాగుణము.

ఈ నూతన నాయకుడు దేశమున విప్లవ బీజావాప మొనర్చుచున్నాడని పర ప్రభుత్వము గమనించినది. కాలమునకై వేచి యున్నది. తిలక్ మహాశయుడు సామాన్యముగా శత్రువులకు తేలికగ వశమగు శక్తిరహిత సమరవీరుడు కాడు.

తిలక్ మహాశయునకు సంస్థానాధిపతులన్న నభిమానము విస్తారము. జీర్ణించిన భారతీయ సంస్కృతి నల్ప మాత్రముగ నైన నాయన వారిలో నానాడు చూడగలుగుచున్నాడు. ఆ సంస్థానాధీశ్వరుల పూర్వ చరిత్రలలో నాయన కుత్తేజక శక్తి లభించుచున్నది. ఆ కారణముగ సంస్థాన ప్రభుత్వ విషయముల తిలక్ విశేష శ్రద్ధ వహించుచున్నాడు. అందునను కొల్హాపుర మనిన నాయనకు ప్రత్యేకాభిమానము.

ఆనాడు శివాజీరావు కొల్హాపుర సంస్థానాధీశ్వరుడు. ఇతడు పూర్వ సంస్థానాధీశ్వరుడగు రాజారాం దత్త పుత్రుడు. తల్లి శక్వరీబాయికి నీతనికి బాల్యముననే మనస్పర్థలు కలుగుట వలన నతనికి మత్తు పదార్థములు పెట్టించి, యున్మత్తుడనియో, మృతినొందినాడనియో, రాజ్యమును మరియొక బంధువున కామె కట్టిపెట్ట దలపెట్టినది. ఆ కుతంత్రమున 'బార్వే'యను నాంగ్లేయ దర్బారీ యామెకు సాయమొనర్చుచున్నాడు. బార్వేకును రాణికిని మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరము లెట్లో బయటపడి తిలక్ మహాశయుని పత్రికాలయమును జేరుకొనినవి.

ఇది విద్రోహక చర్య. తిలక్ రక్తనాళము లుప్పొంగినవి. అందులకు శివాజీ వంశస్థుడగు శివాజీరావు పక్షము దాను వహింపక తీరదని నిశ్చయించుకొనినాడు.

'నేను పూర్వజన్మమున మహారాష్ట్ర ఛత్రపతి శివాజీ స్వాతంత్ర్యసేనలో నొక యోధుడ'నని తిలక్ నిరంతరమును మనమున భావించు చుండెడివాడు. అతని వంశస్థుని కపచారము జరుగుట కెట్లు సహించును?

మరుక్షణముననే పత్రికా ముఖమున లేఖల ప్రచురించి సంపాదకీయమును వ్రాసినాడు. అందు జాతీయ హృదయ ముట్టిపడ నాంగ్లేయ పాలనను ఖండించినాడు. సమస్త మహా రాష్ట్రమునను మరుదినమున నిది పొక్కి పోయినది. దేశీయ ప్రభుత్వ పక్షపాతము వహించి రచన యొనర్చి నందుకు తిలక్‌ను మహావీరునిగ బ్రజ పొగడినది. ఆయన పత్రికల ఖ్యాతి విస్తరించినది.

బార్వేదొర యా లేఖలు కల్పితములని తిలక్‌పై అభియోగము తెచ్చినాడు. ఆంగ్లేయ ప్రభుత్వమతని కనుకూలము. కేసు నడుచుచున్నది. ఆయన యొద్ద ధనము లేదు. అట్టి స్థితిలో ధర్మవీరుడగు తిలక్‌కు బ్రజ ధన సహాయమిచ్చినది. ప్రఖ్యాత నాయకుడు గోపాలకృష్ణ గోఖలే నాటకము లాడి తాను స్త్రీ పాత్రలు ధరించి వచ్చిన ధనమును తిలకున కిచ్చినాడు.

న్యాయాధికారి 'అనాలోచితముగ నీ లేఖల బ్రచురించినా'వని తిలక్‌కు నాల్గు మాసములు శిక్ష విధించినాడు. తిలక్ నిరపరాధి. పత్రికాలయమునకు వచ్చిన లేఖల ప్రచురించినాడు. లేఖల సత్యాసత్యములతో నాయనకు బని లేదు. అయినను శిక్ష తప్పలేదు.

ఈ శిక్ష దేశమును మేల్కొల్పినది. పూనా కళాశాల ప్రధానాధ్యాపకుడు వర్డ్సువర్తు, అధ్యాపకుడు మాండలిక్‌లు తిలక్‌ను, నాయన మిత్రుడు అగర్కారును శిక్షనుండి తప్పింప విశ్వ ప్రయత్నము లొనర్చిరి. కాని యా విప్లవ వీరుని విడిచి పెట్టుటకు ప్రభుత్వమంగీకరింపలేదు. ప్రజలు వారు నిర్దోషులని సంక్షోభ మొనర్చినారు. వారి కేకలనది పెడచెవిన బెట్టినది. 'ప్రభుత్వము నీరీతిగ వేడుకొనుట కంటే విముక్తులై వచ్చిననాడు వారి కుచిత స్వాగత మిచ్చి సత్కరించుట యుక్తమని 'దీనబంధు' వంటి పత్రికలు పలికినవి.

కఠిన శిక్ష ననుభవించి మిత్రుడు అగార్కరుతో తిలక్ డోంగ్రే జైలునుండి విముక్తుడైనాడు. ప్రజలు పుర ప్రముఖులు నఖండ స్వాగత మొసగినారు. సమాధాన

మొసగుచు తిలక్ "మేము కారాగారములకు వెరచువారము కాము, ధర్మరక్షణము మా విధి. దానికై యెన్ని సమరములనైన యొనర్చుటకు మేము వెనుదీయము. మా జీవితాశయమును, కర్తవ్యమును మరచిపోము. ధైర్య సాహసములతో వీరులమై వర్తింతు" మని పలికినాడు. ప్రజలకు దమపై గల ప్రీతి నుగ్గడించుచు గృతజ్ఞతాపూర్వక వాక్యములు పలికి వారి జోహారులతో నిరువురును సెలవు గైకొనినారు.

తిలక్ 1884 నుండి మహారాష్ట్ర యువకలోకమును నడిపించు నాయకుడైనాడు. పూర్వము సృజించిన పాఠశాల, తరువాత నేర్పాటు చేసిన కళాశాల దేశమున జాతీయ భావముల వెదజల్లుచున్నవి. పూనాలో దక్కను విద్యాసంస్థ నేర్పాటు చేసి దాని యధ్వర్యమున విద్యావిధానము సాగుటకు బ్రయత్నము లొనర్చినాడు. ఆ విద్యాసంస్థలు రెండును దినదిన ప్రవర్ధమానము లగుచున్నవి. దాన తిలక్ మహాశయుని సమరాంగణములు వర్ధిల్లుచున్న వన్నమాట!

స్వాతంత్ర్యమునకును, సంఘ నిర్మాణమునకును సన్నిహిత సంబంధ మున్నదని తిలక్ మహాశయుడేనాడో గమనించినాడు. కాని ప్రభుత్వ సహాయముతో నూతన సంస్కరణలను గొనివచ్చుట కాయన యిష్టపడెడివాడు కాదు. సాంఘిక పరివర్తనమునకు మనస్సులు మారవలె నని యాయన యభిప్రాయము.

సంఘసంస్కరణవాదులాయన నపార్థ మొనర్చుకొని 'పండిత పక్షపాతి, పూర్వాచార పరాయణు' డని తూలనాడుచు వచ్చినారు. సంఘసంస్కరణ విషయమున నాయనకును మిత్రుడు అగర్కార్‌నకును మధ్య మనస్పర్ధ లేర్పడినవి. నిజాశయములు క్రమములైనవని నమ్మిన తిలక్ అగర్కార్ వంటి యాప్త మిత్రునైన విడనాడుటకు వెనుదీయలేదు. ఆ సమయమున అడ్డువచ్చిన నాత్మబంధువులనైన బరిత్యజించుటయే యావీరుని లక్షణము.

మనస్పర్ధలు కారణముగ అగర్కారు 'కేసరి' పత్రికా సంపాదకత్వమునకు రాజీనామా నిచ్చినాడు. కర్మవీరుడగు తిలక్ ఆ భారమును దానే వహించు చున్నాడు. దక్కను విద్యాసంస్థ జీవిత సభ్యులకు, కార్యనిర్వాహక వర్గమునకును గల పరస్పర సంబంధ నిర్ణయమున అభిప్రాయ భేదము లేర్పడినవి. జీవిత సభ్యులు తమ కాలమును విద్యా సంస్థకే వినియోగింప వలెనని తిలక్ అభిప్రాయము. అట్లైనగాని యాసమర భూములు శత్రువిజయ సాధనములు గావు అందు వీరులుద్భవింపరు.

ఆయనది స్వరాజ్య సమర ప్రచారక సంఘ తత్వము. అట్టి సేవాత్యాగములు గల వ్యక్తులు లభింపరను నిర్ణయముతో మిగిలినవారు దానికి వ్యతిరేకించినారు.

ప్రభుత్వ సహాయ మర్థించి సంస్థను పెంపొందించుట వారి అభిప్రాయము. పర ప్రభుత్వ సహాయ మర్థించుట వలన జాతీయతా భావము నశించునని తిలక్ నమ్మకము.

తిలకు మహాశయునికి వ్యతిరేకులధిక సంఖ్యాకులైరి. ఆ విద్యా సంస్థ ప్రభుత్వ పరము కాక తప్పదని నిశ్చయించుకొని నూతన ప్రచారావకాశముల నన్వేషింప నా సంస్థకు 1890 నవంబరు నెలలో రాజీనామా నిచ్చినాడు. అందువలన కళాశాలకొక జాతీయ భావనా సంపన్నుడు, గణిత శాస్త్రనిధి, యుపజ్ఞగల సంస్కృత భాషా శాస్త్రాధ్యాపకుడు కరవైనాడు.

ప్రభుత్వ మింతలో 'నూత నాంగీకార చట్టమును' బ్రవేశపెట్ట తలపెట్టినది. దీని మూలమున సంఘసంస్కరణ మెట్లున్నను విభేదములు పొడజూపుచున్నవి. నాయకుడు గమనించినాడు. అతనికి స్వతస్సిద్ధమగు విప్లవశక్తితో జాతీయైక్యతకై దానిని వ్యతిరేకించినాడు.

వైవాహిక విషయికమగు నీ చట్టమును బ్రవేశపెట్టిన దేశమున కలతలు పుట్టింప వచ్చుననియు, తమ పాలన మందువలన నిరభ్యంతరముగ సాగిపోవు ననియు ప్రభుత్వము తలచినది. కాని మహారాష్ట్ర కేసరి వానిని సింహబలముతో నెదుర్కొనినాడు.

దేశమున ధర్మరక్షణము కొనసాగవలెనన్న న్యాయ శాస్త్ర విజ్ఞాన మావశ్యకమని గుర్తించి తిలక్ పండితుడు న్యాయ పరీక్షల కొందర నుత్తీర్ణుల నొనర్ప న్యాయశాస్త్ర పఠనమందిరమును బ్రారంభించినాడు. ప్రజా క్షేమకరము లగు రచనలతో 'కేసరి' మహారాష్ట్ర పత్రికలను నడిపి ప్రజలనుద్రేకించుచున్నాడు.

1894లో తిలక్ మహాశయుడు పూనాలో బాపత్ కేసును గురించి విశేషముగ శ్రమించినాడు. అది బరోడా సంస్థానమునకు సంబంధించినది. బరోడా సెటిల్మెంటు శాఖోద్యోగి బాపత్ పై ప్రభుత్వ రాజకీయ శాఖ ఘోరమగు నభియోగము తెచ్చినది. అందు నిరర్థకముగ నసత్యమునకు గుఱియై యొక వ్యక్తి బలియైపోవుట సహింపలేక తిలక్ అతని పక్షము వహించి న్యాయవాదిగ న్యాయస్థానమున బ్రభుత్వమునకు వ్యతిరేకముగ నతని రక్షింప యత్నించినాడు. అది బరోడా మహారాజు ప్రతిష్ఠను కాపాడుటయైనది. న్యాయస్థానమున బాపతును రక్షించు సందర్భమున తిలక్ జేసిన కృషి యాయన శక్తి సామర్థ్యములను, కార్యశూరతను వేనోళ్ళ చాటుచున్నది. ఇందు తిలక్ విజయమును నొందినాడు ప్రభుత్వ మోడినది కాని పగ పట్టినది.

బాపత్ కేసు మూలముగ తిలక్ రాజకీయ సమరాంగణమునుండి తాత్కాలికముగ తొలగుట గాని, శ్రద్ధతో గార్యనిర్వహణ మొనర్పకుండుట గాని జరుగలేదు. ప్రస్తుతమాయన జాతీయ కాంగ్రెసు కార్యదర్శిగ లేడు. బొంబాయి రాష్ట్రీయ సభ నేర్పాటు చేసి దానికి తానే కార్యదర్శియై యైదు మహాసభలు చేయించి తిలక్ మహారాష్ట్రమున రాజకీయ స్వరాజ్య వాతావరణమును సృజించినాడు.

1898లో హిందూ మహమ్మదీయుల కంతఃకలహములు చెలరేగినవి. అనేక నూతన సమస్యలు ప్రారంభమైనవి. తిలక్ వీరుడు మరల రంగస్థలమున నగ్రగామియై నిలచినాడు. సమైక్యతకు పాటుపడినాడు.

"ఈ విద్వేషములకు ముఖ్య కారకులు దూరదృష్టి లేని కొలదిమంది ఆంగ్లో-ఇండియన్ ఉద్యోగులు. దీనికి ముఖ్య కారణము లార్డు డఫ్రిక్ నెలకొల్పిన విభజించి పాలించు సిద్ధాంతము. ఇట్టి సందర్భమున పక్షపాతము వహింపకుండుట ప్రభుత్వ కర్తవ్యము. ప్రభుత్వోద్యోగులు హిందువుల పక్షము వహించి మహమ్మదీయులను, మహమ్మదీయుల పక్షము వహించి హిందువు లను రెచ్చగొట్టుట వలన కలిగిన ఫలితాంశమే ఇది" యని ముక్త కంఠముతో నిర్భయముగ పలికినాడు.

ఈ సందర్భమున ప్రత్యేకముగ బొంబాయి గవర్నరు హారిస్ ప్రభువును, నతని కార్యదర్శిని దోషులని ప్రకటించినాడు. ప్రభుత్వోద్యోగులు కనులెర్ర జేసినారు. దానికి ప్రతిగ మహారాష్ట్ర కేసరి మరల గర్జించినాడు. 'కేసరి' పత్రికా ముఖమున హిందూ ముస్లిముల సఖ్యతకు యత్న మొనర్చినాడు. వారిలో నూతనోజ్జీవనమును బోసి సోదర భావముతో మెలగ నేర్పినాడు.

1885 నాటికి తిలక్ విద్యాధికులందును వీరవర్యుడని ఖ్యాతి గడించు కొనినాడు. రాష్ట్రీయ శాసనసమితికి రెండు మారులు ప్రజలాయనను సభ్యునిగ నెన్నుకొనినారు ఆయన సేవాత్యాగముల యెడ భక్తి సూచకముగా పూనానగర పురపాలక సంఘాధ్యక్షునిగ వరించి గౌరవించినారు. ఈ సదవకాశముల స్వీకరించి తిలక్ ప్రజాజీవిత రంగముల బ్రవేశించి వానిని స్వరాజ్య యుద్ధ రంగములుగ మార్చుకొనినాడు లోకమాన్యుడైనాడు.

అనతికాలముననే మహారాష్ట్రమునందంతటను జాతీయ సంస్థలు ప్రారంభమైనవి. జాతీయ నాయకుల జన్మ దినోత్సవము లొనర్చుట పరిపాటియైనది. సమస్తమును నడిపించు మహాశక్తి తిలక్ పండితుడు.

పూనా నగరమున శివాజీ జన్మదినోత్సవములో నొక సందర్భమున మూర్తీభవించిన జాతీయతవలె మహోపన్యాసముగావించి యాయన యిట్లన్నాడు:

"మన దేవతలను, జాతీయ వీరులను గౌరవించి పూజించుట వారి కొరకు కాదు మన కొరకే. అందువలన మనలో దేశభక్తి, జాతీయ భావములు పెంపొందును. ఉన్నతాదర్శములు, జీవిత లక్ష్యములు మనకు ద్యోతకము లగును.

నేటి యువకులు జాతీయులుగ గాని విదేశాశయములను, విదేశాచారములను వెఱ్రిగ ననుకరించుచున్నారు. దాని వలన విశేష ప్రమాదములు సంభవింపగలవు. ఈయంధానుకరణము జాతి నైతిక శీలమునకు గొడ్డలిపెట్టు. చిరకాలము వీని నిట్లే సాగనిచ్చిన గల్గు ఫలితాంశము జాతి పతనము! దేశ దౌర్భాగ్యము!!

"మనలను మనము గౌరవించుకొనుట నెరుగవలెను. అది మన ప్రాచీనులను, మన సంస్కృతిని గౌరవింప నేర్చిననాడే యలవడగలదు. ఆత్మనింద సన్న్యాసి జీవితమున కుపకారి కావచ్చును. కాని జీవిత క్షేత్రమున కర్మవీరునకు నిరుపయోగము.

అత్యధికమైన స్వోత్కర్షయును దూష్యమే. అది దేశమాతయెడ నైనను ప్రమాదకారి. దానివలన వృద్ధి లేదు. వృద్ధి లేకున్న మరణ మన్నమాట" ఇట్టి వాక్య రత్నముల నెన్నిటినో యా గంభీరోపన్యాసమున నాయన యొలికించినాడు.

శివాజీ జన్మదినోత్సవముల జరిపించుటకు తిలక్ ఒక యుద్యమము నారంభించినాడు. కేసరి పత్రికలో ఒక వ్యాసమును బ్రకటింప (23 ఏప్రియల్ 1895) మహారాష్ట్రులు రాయఘడ దుర్గములోనున్న శివాజీ స్తూపమును బునర్నిర్మాణ మొనర్చుట కిరువదివేల రూప్యముల నిచ్చినారు. నిర్మాణ మైనది. ప్రతి వర్షమున నచ్చట నాజాతీయ వీరుని స్మారకోత్సవములు జరుగుచు వచ్చినవి. ఆ పద్ధతి ననుసరించి గ్రామగ్రామముల శివాజీ పండుగలు ప్రజలు లోకమాన్యుని యాదేశమున జరుపుకొనుచున్నారు.

1896లో బొంబాయి రాష్ట్రమున మున్నెప్పుడును బ్రజలెరుగని ఘోర క్షామము వచ్చినది. వారష్ట కష్టములు పడుచున్నారు. వారి నాయకుడు చూచి సహింపలేకపోయినాడు. ప్రభుత్వ మౌదాసీన్యము వహించినది. తిలక్ రణరంగమున లేఖినీ ఖడ్గముతో బ్రవేశించినాడు. పీడిత ప్రజానీకము నుద్దేశించి గంభీరముగ నిట్లు 'కేసరీ' పత్రికా ముఖమున గర్జించినాడు:

"క్షామదేవత వికట హాసములు వినిపించుచున్నవి. ఆమె కరాళ తాండవమున మిన్ను మన్నెరుగక మీరు తల్లటపడుచున్నారు. ఈ చావు బ్రతుకుల సంధిలోనైన ప్రభుత్వోద్యోగులు మిమ్ము పీడింప మానలేదు. భయపడకుడు!

విక్టోరియా మహారాణి మనల నందర క్షేమముగ నుండుడని కోరుచున్నది. భారత ప్రభుత్వ వాంఛయు నదియే. ధైర్య విరహితులు కాకుడు. క్షామమునకు బలికావకుడు. పన్నులు చెల్లింప మీయొద్ద ధనము లేకున్న ప్రభుత్వోద్యోగులకు వెరచి సమస్తమును అమ్ముకొనకుడు.

మృత్యు ముఖమున బ్రవేశించుచున్నను మీకు ధైర్య సాహసములబ్బలేదా? ఔను! లేదు. మనది కేవలము గొఱ్ఱెజాతి. ఇట్టి క్షామ మింగ్లండు దేశమున వచ్చిన బ్రభుత్వ మెంత యాందోళన పొందెదిడిది? ఆ ప్రధానమంత్రిని ప్రభుత్వమును వారము దినములలో ప్రజలు తారుమారొనర్చెడు వారు"

క్షామ నివారణార్థము తిలక్ ప్రభుత్వమున కనేక సూచనల నొనర్చినాడు 'క్షామ చట్టము' నమలు పరచ వలసినదని ప్రభుత్వమును వేడుకొనినాడు. పూనా నగరమున దక్కువ ధరలకు ధాన్యమమ్ము విపణి వీథుల నేర్పాటు చేయించినాడు. స్థానిక నాయకులతో సంప్రదించి ప్రభుత్వ సహకారముతో క్షామ నివారణ మొనర్పనొక ప్రణాళికను సిద్ధము చేసి ప్రభుత్వమున కందజేసినాడు.

ఇట్టి యాందోళన మెన్నడును ప్రభుత్వము సహింపలేదు. అందును ప్రజా హృదయమును జూరగొని విప్లవ తత్వముతో బ్రజలకు బ్రభుత్వము నెదుర్కొన శక్తి నిచ్చు తిలక్ ప్రణాళికను బ్రభుత్వోద్యోగు లంగీకరింతురా? మహారాష్ట్ర సార్వజనిక సభచే నొత్తిడి జేయించినాడు. ప్రభుత్వమే పెడమొగము పెట్టి 'వీలుకా'దని పలికినది. లోకమాన్యుడు నిరుత్సాహ మెరుగనివాడు. ఆనాడు జాతీయ కాంగ్రెసు పాశ్చాత్య సంస్కార వ్యామోహితుల చేతులలో నున్నది. సామాన్య ప్రజలకందు స్థానము లేదు.

కేసరి పత్రికలో "క్షామము దేశమున నూతన దృక్పథమును గల్పించినది. ప్రజలు మేల్కొనినారు. ఇకనైన జాతీయ మహాసభా నాయకుల దృష్టి మార్పునొందక తీరదు."

"మా యార్తరవములు చెవియొగ్గి వినుడని ప్రభుత్వముతో ద్వాదశ వర్షములు మొరబెట్టుకొనినాము. ప్రయోజనము గగనకుసుమమైనది. మన తీర్మానములు వారి హృదయమున నాటుకొనలేదు. ప్రజా సహకారముతో చట్ట సమ్మతమైన పోరాటము సాగించి వానిని వారి చెవులలో బలవంతముగ నైన బ్రవేశపెట్ట వలసిన

కాలమాసన్నమైనది. మనము విద్యాధికులమను గర్వ ముజ్జగించి యజ్ఞానులైన గ్రామీణులతో నిరంతర సంబంధ మేర్పరచుకొనవలెను. వారికి సమాన గౌరవ ప్రతిపత్తుల నిచ్చి పోరాటములకు వారిని మేల్కొల్పుటయే నేడు నాయకుల కర్తవ్యము.”

“ఆనాడుగాని జాతీయ మహాసభయను నామము సార్థకము కాదు నాయకులకు విజయము చేకూర”దని మోమాటము లేక పలికినాడు. “ఉబుసుపోకకు రాజకీయ రంగమున బ్రవేశించిన వ్యక్తుల హృదయముల నీ మాటలు భయోత్పాతములు కలిగించిన మాట వాస్తవము” ఇట్టి వీరోచిత వాక్యములతో నే తిలక్ మహాశయుడు ప్రజాహృదయ సింహాసనమున నధినేతగ పట్టభద్రుడైనాడు.

క్షామము వెనుకపట్టినది. పూనాలో ‘ప్లేగు’ తుడిచి పెట్టుచున్నది. నాయకుల మనుకొనిన మహనీయులందరును భయరహిత ప్రదేశములకు పలాయన మంత్రము పఠించుచున్నారు. లోకమాన్యుడు నమ్మిన సేవాదళముతో ప్లేగు నెదుర్కొనినాడు. పత్రికా ముఖమున ప్రభుత్వమును “బ్రజలకు సేవాధర్మముగ భావించి సాయమొనర్పవలసిన”దని కోరినాడు.

శివాజీ పండుగలు గ్రామ గ్రామమున బరిపాటియై పోయినవి. దాని మూలమున జాతీయ భావ వ్యాపన మొనర్చి ప్రజానీకమును స్వరాజ్య సమరవీరులుగ దీర్చిదిద్దుట కవకాశము గలిగినది. పూనా నగరమున తిలక్ మహాశయు డొసగిన యొక యుపన్యాసము కేసరి పత్రికలో బ్రకటితమైనది. (15 జూన్ 1897)

తరువాత గొంత కాలమునకు పూనా నగరమున 25 జూన్ 1897 న ‘రాండు’, ‘అయెర్స్టు’ అను నిర్వు రాంగ్లేయుల నెవరో హత్య గావించినారు. తత్ఫలితముగ తిలక్ మీద రాజద్రోహ నేరమును బ్రభుత్వము మోపినది.

ఆర్గు రాంగ్లేయులను, ముప్వురు దేశీయులను జ్యూరర్లు (పంచాయితీదార్లు)గ న్యాయస్థానము నియమించినది. ఆంగ్లేయులు తిలక్ ‘దోషి’యని, దేశీయులు ‘నిర్దోషి’ యనియు అభిప్రాయపడుట వలన ముఖ్య న్యాయాధికారి దోషియని కఠిన శిక్ష జెప్పి పదునెనిమిది మాసములు కారాగార వాసమును విధించినాడు.

తిలకు ఈ కేసు మూలమున కొంత ప్రచార మొనర్ప ‘ప్రీవీ కౌన్సిలు’కు గొనిపోయినాడు. ప్రయోజనము కనుపించలేదు. కాని తిలకు వీరుడు విఖ్యాతుడైనాడు. జగద్విఖ్యాత పండితులు, తిలకు మిత్రులు, మాక్సుముల్లరు, విలియం మాంటర్లు

విక్టోరియా మహారాణి నొత్తిడి జేయుటవలన బ్రభుత్వ మా 'మహారాష్ట్ర సింహము'ను కారాగారమున బంధింప లేక 6 సెప్టెంబర్ 1898న విముక్తు నొనర్చినది.

ఆరు నెలలలో శరీర స్వస్థతను జేకూర్చుకొని చెన్ననగరమున జరిగిన జాతీయ కాంగ్రెసు మహాసభ కేగి స్వరాజ్యోపన్యాసము లిచ్చి తిలకు సింహళ దేశ భారతీయుల దర్శించి వారిని మేల్కొల్పినాడు.

తాయి మహారాజుకు తిలకు స్నేహితుడు. మరణ సమయమున నత డాయన నొక 'ట్రస్టీగ' నియమించినాడు. ఆ మహారాజు దత్త పుత్రుని విషయమున తిలక్ ఆంగ్లేయుల నెదుర్కొనవలసి వచ్చినది. ధర్మవీరుడగు నాయన వెనుకంజ వేయలేదు. తిలకుపై తప్పుడు సాక్ష్యమిచ్చెనను నిర్ధారణము జరిగినది.

జిల్లా జడ్జి ఆష్టను తిలక్ చిక్కినచో శిక్షింప కాచుకొనినాడు. తిలకును 'దోషి' యని తీర్మానించి చట్ట సమ్మతములు గాని సభ లేర్పాటు చేయించుట, మోసము, కొట్లాటలు మొదలగు వానిలో నాయన పాల్గొనుటచే వానిని గురించియును విచారణ జరుగవలసినదని ప్రభుత్వము నర్థించినాడు. ఇది కేవల మాంగ్లేయ దౌర్జన్యము. తిలకు సహింపలేదు. 'ప్రీవీ కౌన్సిలు' కప్పీలు జేసినాడు అందు పరిపూర్ణ విజయమొందినాడు. ఇది ప్రభుత్వోద్యోగులపై లోకమాన్యుని మొదటి విజయము!

1905లో వంగరాష్ట్ర విభజన జరిగినది. అందువలన యావద్భారతమున నూతనాందోళన మారంభమైనది దేశమున స్వదేశ, స్వరాజ్య, బహిష్కరణ, జాతీయ విద్యలను నవీన శక్తుల ఉద్భవించినవి. తిలక్ రాజకీయ రంగమున మహావీరునివలె దుమికినాడు. కార్యశూరతతో స్వదేశ వస్తు ప్రోత్సాహమునకు, విదేశ వస్తు బహిష్కారమునకు బూనుకొనినాడు గంభీరోపన్యాసము లొసగి స్వరాజ్యమన భారతదేశ పరిపాలనమున భారతీయులకు స్వేచ్ఛ గలిగి యుండుటయని నిర్వహించి యాయన స్వరాజ్య స్వరూపము కన్నులకు గట్టునట్లు విశదమొనర్చినాడు.

కాంగ్రెసు రాజకీయములు కర్మవీరుడగు తిలక్ మహాశయునకు దృప్తి కలిగింపలేక పోయినవి. కర్జన్ ప్రభువు దౌర్జన్య యుతముగ బ్రభుత్వమును సాగించుచు సామ్రాజ్య తత్వముతో స్వేచ్ఛగ సంచరించుచున్నాడు. మితవాదులు ప్రభుత్వమును ధిక్కరింపలేరు. అత్యావశ్యకముగ యోధులు కాంగ్రెసు సంస్థలో బ్రవేశించి తీవ్రముగ కార్య నిర్వహణ మొనర్ప వలసిన సమయమిది.

మితవాదులు భారత రాజ్యాంగ చట్టము ననుసరించి చట్టసమ్మతముగ ప్రభుత్వ విధానమున మార్పులు గొని రావలెనని పలికినాడు. తిలకు తీవ్రవాది, తీవ్రవాదులకు నాయకుడు. భారతమునకొక రాజ్యాంగమున్నదా? – చట్టము లొనర్చువారాంగ్లేయులు. వారికిని మనకును విరోధమైన జట్ట సమ్మతమగు పోరాట మెట్లు సాధ్యపడునని మితవాదుల నాయన ప్రశ్నించినాడు. కలకత్తా కాంగ్రెసు మహాసభలో "దేశము పూర్ణ స్వరాజ్యమును, స్వపరిపాలనమును బొందుటయే కాంగ్రెసు పరమ లక్ష్యము. ఒక వంక ప్రభుత్వమును బ్రార్థించుచు, జట్టసమ్మతమైన పోరాటమును సాగింపవచ్చును. అది చాలదు. స్వదేశీ, బహిష్కరణ, జాతీయవిద్యయను మహాస్త్రత్రయమును బ్రయోగించి యొకవంక స్వదేశీతో స్వరాజ్య స్థాపన మొనర్చుటయును నత్యావశ్యకమని యుద్ఘోషించిన వాక్యములు జాతీయ వాదుల నాకర్షించినవి. వారికి సమరాగ్రేసరుడు, మహానాయకుడు లోకమాన్యుడైనాడు.

1886లో మితవాదులు తిలకులేని సందర్భమున స్వదేశ, బహిష్కరణ, జాతీయ విద్యల త్రోసిపుచ్చినారు. తరువాత తిలకు మహావీరుడు "ఇది యాత్మహత్య" యని ఘంటాపథముగ బలికినారు. సూరత్‌లో జాతీయ వాదుల ముందర జేర్చి అరవిందఘోష్ నాయకత్వమున నొక మహాసభ ఆయన జరిపించినాడు.

"ఇరువురము (అతివాదుల, మితవాదులు) దేశాభ్యుదయమునకు బాటు పడువారమే. మనమధ్య స్పర్ధలుండనవసరం లేదు. జాతీయ వాదులొక యడుగు ముందుండదలచినారు. 'బహిష్కరణ' జాతీయవాదుల సమర సాధనము. ఇది కేవల మాంగ్లేయ వస్తు బహిష్కరణతో నాగునది కాదని" సుహృద్భావముతో గర్మవీరుడు తిలకు పలికినాడు.

తిలకు 1908లో రాష్ట్రమంతటను యాత్ర జేసి 'రాష్ట్రమాత' యను నూతన పత్రికను స్థాపించి, జాతీయ విద్యతో బ్రభుత్వము నెదుర్కొన 'సమర్థ' జాతీయ విద్యాలయమును నిర్మించినాడు. పూనా మండల జాతీయ మహాసభ జరిపించి 'ఇక స్వరాజ్య మిమ్మని ప్రభుత్వము నర్థింపను. ఇందలి తీర్మానము లెల్ల ప్రజల కనుశాసనము' అని ప్రకటించినాడు.

ప్రభుత్వాదాయముపై ప్రజాదృష్టిని మరలించి మద్య పానమును నిరోధింప యువకుల ప్రేరేపించినాడు. స్వయం సేవక వీరుల సృజించుకొని కల్లు దుకాణముల సమరాంగణముల గావించి తిలకు ప్రభుత్వము నెదుర్కొనినాఁడు. ఫలితాంశము సేవకుల 'పికెటింగు', ప్రభుత్వపు 'లాఠీచార్జి'లు అరెస్టులు.

వంగదేశ విభజనము వలన యువకరక్త ముప్పొంగి వారిలో గొందరు సాయుధ విప్లవ వాదులు కసిపట్టలేక నాంగ్లేయుల భయపెట్టుటకై హత్య లొనర్చినారు. మితవాదులు వారిని ద్రోహులని తెగడినారు. సమర ప్రియుడు తిలకు మనమున వారి దేశభక్తిని శ్లాఘించియు పైకి పొగడలేదు తెగడలేదు.

"వంగ దేశములలోని కొందరు యువకుల రక్త ముప్పొంగినది. హత్యలు జరిగినవి. ప్రజాభిప్రాయమును లెక్కింపక పాశవశక్తితో నణగద్రొక్క నాంగ్లేయోద్యోగులు యత్నించుటయే వీనికి ముఖ్య కారణము. ఇది మా విశ్వాస" మని యాయన ప్రకటన యొనర్చినారు. బొంబాయి గవర్నరీ రచనను జూచి 'ఇది నిప్పుతో చెరలాట' మనినాడు. బ్రిటిష్ కుటిల పాలనమును సహింపలేక తిలకు ఈ కాలమున లేఖినికి బదునెక్కించి బ్రయోగింప నారంభించెను. తత్కారణముగ బ్రభుత్వ మాయనపై రాజద్రోహ నేర మారోపించి విచారించుచున్నది. మనో నిశ్చయముతో తిలకు 'నేను నిర్దోషి' నని ప్రకటించినాడు. 'ఇందు మరణించిన స్వర్గము జయించిన 'రాజ్యపాలన' మనునర్థముగల గీతావాక్యమును జూడవచ్చిన స్నేహితుల నుద్దేశించి యాతడు పలికిన దీ సందర్భముననే.

విచారణ ముగిసినది. ఆరు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష ప్రభుత్వ మాయనకు విధించినది.

'నీవేమైన జెప్పదలచితివా!" యని న్యాయాధిపతి లోకమాన్యుని బ్రశ్నించినాడు.

"మీ తీర్మాన మెట్లున్నను నేను చెప్పదలచిన దొకటే. నేను నిర్దోషిని. ఈ న్యాయస్థానమును మించిన పరమేశ్వర న్యాయస్థాన మొకటున్నది. నేను స్వేచ్ఛగ నుండుటకంటే నిట్లు బాధితుడనౌట వలననే నా జీవితాదర్శము వృద్ధి పొందునని భగవాను డుద్దేశించినట్లున్నా" డని తిలకు సమాధానములు చెప్పినాడు.

బర్మాదేశములోని మాండలే కారాగారమున ఆరు సంవత్సరముల శిక్ష అనుభవించి తిలకు 1914లో విముక్తుడైనాడు. చెఱసాలలో నున్నపు డాయన స్వదేశమును గురించియు, స్వరాజ్యమును గూర్చియు తీవ్రముగ నాలోచించి నాడు. భారతదేశమునకు ప్రముఖ తత్త్వగ్రంథమని పరిగణిత మగుచున్న గీతను బరిశీలించి యా కర్మవీరుడది కర్మ ప్రతి పాద్యమగు గ్రంథమని నిరూపింప 'గీతారహస్యమును'ను రచించినాడు.

తిలకు పండితుడు సమస్తమును విమర్శనా బుద్ధితో దిలకించు స్వభావము గలవాడు. ఇంతకు బూర్వమున్న సిద్ధాంతమును విప్లవ దృష్టితో బరికించి సత్యాన్వేషణ మొనర్చుట యన నాయనకు విశేష కుతూహలము. ఆర్యుల ప్రథమ నివాసము మధ్య 'ఆసియా' యను పాశ్చాత్య సిద్ధాంతముపై దండెత్తి యది యుత్తరధ్రువ ప్రాంతమని నిరూపించుట కాయన పూర్వమే 'ఆర్కిటెక్ హోమ్ యిన్ ది వేదాస్' అను నుద్గ్రంథమును బ్రచురించి జగద్విఖ్యాతి గనినాడు.

తిలక్ మహావీరుని యరువది యొకటవ జన్మదినోత్సవమును మహారాష్ట్రమున వైభవోపేతముగ 1915లో మిత్రులు జరిపించినారు. ఆ సందర్భమున నాయన భూత భవిష్యద్వర్తమాన భారతమును విమర్శనాత్మక బుద్ధితో బరిశీలించి యిట్లు పలికినాడు:

"నా దృష్టికి నిరంతరమును శ్రమ, కష్టనిష్ఠురములు మాత్రమే కనిపించు చున్నవి. మన స్వప్న స్వరాజ్యమున కింకనెన్నియో సమరములు సాగింపవలెను. ప్రజా క్షేమకరములైన కార్యకలాపముల జక్కపెట్టుటకు పరమేశ్వరు డాయురారోగ్యములు ప్రసాదించుగాక!"

జన్మదినోత్సవమునాడు ప్రజ లొసగిన లక్ష రూప్యములు బహుమానమును తిలకు స్వరాజ్యోద్యమునకే వినియోగింతునని పలికినాడు. ఆ సందర్భమున నొనర్చిన గంభీరోపన్యాసమునకును, బెల్గాము –1 మే '16 అహమ్మదాబాదులో –'31, మే '16 స్వపరిపాలనను గురించి చేసిన ప్రసంగములకును బ్రభుత్వము గగ్గోలు పడినది.

"ఈ యాంగ్లేయ ప్రభుత్వపు నీడను మనము నిలువవలెను. కాని యల్లునివలె నేర్పడిన రాజకీయ కార్యదర్శి మన కక్కర్లేదు. భారతదేశ ద్రవ్యము నెవరు వ్యయింపవలయునో, పన్నుల నెట్లు విధించవలయునో మనము తీర్మానింపవలెను.

"నేటి ప్రభుత్వము లోపభూయిష్ఠము. ఇందుకు కారణము మనకు స్వరాజ్యము లేకపోవుటయే. రాణి ప్రకటన మొకరీతిగ నున్నది. ఉద్యోగుల పాలన మొకరీతిగ నున్నది."

"మా కధికారము కావలయును. అది మా చేతులలో నుండవలె" నని చెప్పుటకు దగిన ధైర్యసాహసములైన నధమపక్షము మీకుండవలయును. ప్రభుత్వ సేవకులు ప్రజా సేవకులమని భావించునట్లొనర్పవలెను. ప్రయత్నించిన మీకిది సుసాధ్యము"

1 జూను 1916న అహమ్మదాబాదులో నొసంగిన మరియొక యుపన్యాస మున 'తిలక్ మహారాజ్‌కు జై' యను, నినాదముల మధ్య –

"స్వరాజ్య మబ్బనియెడల స్త్రీ విద్యాభివృద్ధి కలిగినను, పారిశ్రామికాభివృద్ధి కలిగినను, సంఘ సంస్కరణము కలిగినను నిష్ప్రయోజనము. ఇవన్నియును స్వరాజ్య భాగములు. మనకు స్వేచ్ఛ కావలయును. దానివలన నధికారము, జ్ఞానము లభించు"నని ముక్త కంఠముతో దీక్షాపరుడై యాయన స్వరాజ్యాందోళన మొనర్చినాడు.

ఈ యుపన్యాసములలో ప్రభుత్వోద్యోగులను ధాన్యపు కొట్ల కాపలాదార్లు' 'దేవతలకును మనకును మధ్య పూజారులు' అని పేర్లు పెట్టుట వలన వానిని గఠిన వాక్యములుగ ప్రభుత్వము భావించినది. సర్కారు తిలకుపై జామీను కేసు తెచ్చిరి. విచారణ జరిగినది. ప్రథమమున 'దోషి' యని తీర్పు వచ్చినది. హైకోర్టువారు నిర్దోషియని తీర్మానించి జామీను శిక్షను దొలగించినారు.

ప్రభుత్వమున 'తిలక్ కాలమునాడే హిందూ ముస్లిములకు సఖ్యత లేదు, స్వరాజ్య మిచ్చుట యెట్లు పొసగునను చున్నది. 'రాష్ట్ర ప్రభుత్వములను కేవలము మా ముస్లిము సోదరులకిచ్చిన నాకు సంతోషము. కేవల నిమ్న జాతులకిచ్చిన నాకు పరమ సంతోషము' అని రాజనీతిజ్ఞతతో తిలక్ ప్రభుత్వ కుటిలత నెదుర్కొనినాడు.

1916వ సంవత్సరమున స్వపరిపాలనను గురించి విశేష ప్రచారము సాగించి తిలకు ఇంగ్లండుకు రాయబారమున కేగ నిశ్చయించినాడు. ప్రజలామోదించినారు. అనేకములైన యంతరాయముల మూలమున గొంతకాలము ప్రయాణ మాగినది. నిరాశ పొందక నాంగ్ల దేశమున కేగి లోకమాన్యుడాంగ్లేయులతో భారతభూమి నెంత యవినీతికరముగ ప్రభుత్వోద్యోగులు పాలించుచున్నారో వెల్లడించినాడు. విషయ విస్తర పరిజ్ఞానముతో గన్నుల గట్టినట్టు భారతీయుల దుస్థితిని వారికి విశద పరచినాడు. ఆ మహనీయుని గంభీరోప న్యాసములకు లండను ప్రజ మంత్ర ముగ్ధులైనారు. విజయముతో నాయన తిరిగి వచ్చినాడు.

ప్రపంచ ప్రథమ సంగ్రామము సాగుచున్న కాలము స్వరాజ్య సంపాదనమున కనుకూలమని గ్రహించి తిలకు నాయకత్వమున మేల్కొన్న భారతీయులు స్వపరిపాలనకై చేయు నాందోళనము తీవ్రతరముగ సాగుచున్నది. ప్రభుత్వము జాతీయ సంస్థలను సభలను నిషేధించినది. తిలకు సమరము సాగింప బ్రోత్సహించి కాంగ్రెసుచే 'అసహాయోద్యమ', 'చట్టతిరస్కార' తీర్మానములు చేయించినాడు. 'రాజ్యాంగమున మార్పుల కొన్నిటినైన బ్రవేశపెట్టునట్లు బ్రయత్నింప వలసిన'దని మాంటెంగు, ఛెమ్సుఫర్డులను భారతదేశమునకు ప్రభుత్వమంపినది. వారి ప్రణాళికను జూచి తిలకు "తిలకు దర్శించిన స్వరాజ్యమిందు లేదు. ఇది రవిలేని యుషస్స"ని పలికినాడు.

తిలకు మహాశయుని లేఖినినుండి 1895లో 'స్వరాజ్య'మను శంఖారావము వినిపించినది. జాతీయ కాంగ్రెసును బహుళ సమరములు సాగించి ప్రజాసంస్థగ జేయ నా మహాత్ముడు యత్నించినాడు. అది 1916లో లక్నో కాంగ్రెసు కాయన యధ్యక్షుడగుటతో నీడేరినది. ఆ సంవత్సరమున మిత వాదుల, జాతీయ తీవ్రవాదుల సమైక్యమొనర్చి 'ఐక్యసమర మారంభింప వలసినదని యాదేశించినాడు. ఇంతలో 'క్రొత్త గొంతుక'తో భారత రాజకీయ రంగమున గాంధీజీ నూతన నాయకుడుగ నవతరించినాడు. వృద్ధాప్యము కారణముగ సమరాంగణము నుండి విరమింపదలచిన తిలకు మహాశయు డాయన కత్యానందముతో స్వాగత వాక్యములు పలికినాడు.

తిలకు సమరాంగణమున నిలచినాడు. 'ప్రభుత్వమున కాయనయన్న వెఱపు మితవాదులకు జంకు ఉద్యోగుల కసహ్యము. కాని లోకమాన్యుడు దేశీయులకు దేవతామూర్తి!

"అతని ప్రభావ మతినిశితమైనది. అతని పాండిత్యము ప్రాక్పశ్చిమముల వినుతిగన్నది. అతడొక అయస్కాంతము. నాయకుని కత్యావశ్యకములైన దయాదాక్షిణ్యములు, కార్య, నిశ్చయ, పరిజ్ఞానము, స్థిర సంకల్పము, నీతి విచక్షత, కార్యాచరణము, సామాన్య జనాదరము నతనిలో బుంజీభవించినవి. రాజకీయ రంగమున బ్రవేశించి యతడు విప్లవ శంఖారావ మొనర్చుచున్నాడు. ఇక భారతము నిద్రించుట కల్ల"

ఇవి యాంగ్లేయ ప్రభుత్వము, భారతీయాసంతృప్తికి గారణముల బరిశీలింప నంపిన శత్రుపక్షమువాడగు సర్ వెలంటైన్ షిరోలు మాటలు.

స్వేచ్ఛా సమరయోధుడై భారతమును మేల్కొల్పిన వాడు లోకమాన్యుడు!

మరణ సమయమాసన్నమైనపుడా మహానుభావుడు సోదర భారత స్వరాజ్య వీరులను, ప్రజల నుద్దేశించి 'భయపడకు'డని పునీత విశ్వాసముతో నొక మహాసందేశమిచ్చినాడు. అది గీతలోని క్రింది ప్రవచనము.

"యదా యదా హి ధర్మస్యగ్లాని ర్భవతి భారత

అభ్యుత్థాన మధర్మస్య తదా–త్మానం సృజా మ్యహమ్"

'ఏనాడు ధర్మగ్లాని సంభవించునో యా ధర్మమునుద్ధరించుటకై నేనవత రింతు'నని కృష్ణ పరమాత్ముడన్న పలుకులివి!

# 3. గాంధీజీ

జీవితమున నిరువది వత్సరములు సత్యముతో బరిశోధనల సల్పి సత్యాగ్రహ సమరముల లభించిన విజయములతో మహాత్ముడు 1915 జనవరి నెలలో ఆఫ్రికానుండి స్వదేశము దిరిగి వచ్చినాడు. సామ్రాజ్యతత్త్వపు టినుపపాదముల క్రింద గ్రుగ్గుచున్న భారతీయ సోదరుల నుద్ధరింప నూతన సాధనములతో నా యనుభవజ్ఞుడు విచ్చేయుచున్నాడని సమస్త భారత ముప్పొంగుచుండెను.

నౌక దిగిన మరుక్షణముననే గాంధీజీతో సంప్రదింపనొక పార్సీ పత్రికా విలేఖరి వచ్చి యాంగ్లేయభాషలో సంభాషణ నారంభించినాడు. గాంధీజీ మొట్టమొదటనే “సోదరా! నీవు భారతీయుడవు. నేను భారతీయుడను. నా మాతృభాష గుజరాతీ. ఆంగ్లేయ భాషలో నన్నెందుకు ప్రశ్నించుచున్నావు? దక్షిణాఫ్రికాలో నివసించుటవలన నా మాతృభాషను మరచి పోయినానని భావించినావా? నేను బారిష్టరును గనుక నా భాషలో మాట్లాడుట యుదాత్త మని తలచినావా?” యని యడిగెను. ఇట్టి స్వదేశాభిమానముతో మహాత్ముడు మాతృదేశమునకు తిరిగి వచ్చినాడు.

గాంధీజీ వెలుగు కాగడావలె విదేశమునుండి వచ్చినాడు. ఆయన దేశము నకు నేర్పిన ప్రథమ పాఠ మభయము. బ్రిటిష్ ప్రభుత్వ భయము, సైన్య భయము, భూస్వాముల భయము, ఋణదాతల భయము, నిరుద్యోగ భయము, సర్వ వ్యాప్తమైన యీ భయము నెదుర్కొని ధిక్కరింపుమని మహాత్ముడుచ్చ కంఠమున నాసేతు హిమవత్పర్యంతము వినునట్లు కేకపెట్టినాడు. భయనిద్రనుండి మేల్కొల్పుటయే యా విశిష్ట సమరనేత ప్రథమ విజయ విధానము.

“నేను బానిసగనుండ నంగీకరింపలేను. నిర్భాగ్యుడైన నిది నా దేశమని సగర్వముగ వ్యవహరింపగల భారతమునకై నే బాటుపడుదును. నా భారతమున వర్గభేదములుండవు. సహజ సౌహార్దముతో సమస్త ప్రజలందు సుఖజీవన మొనర్తురు. అందస్పృశ్యత లేదు. సమాన ప్రాతినిధ్యమే దాని ముఖ్యసూత్రము.

భారతీయ సంస్కృతి కేవలము హిందూ సంస్కృతి కాదు. అట్లే ఇస్లాం సంస్కృతియును గాదు మరే యితర సంస్కృతియును గాదు. వీటన్నిటిని సమ్మేళన

మొనర్చుకొని యుద్భవించిన విచిత్ర సంస్కృతి, విశిష్ట సంస్కృతి, సమస్త సంస్కృతి వాయువులు నా యింటిముందు వీచుగాక! కాని వాటి శక్తికి నేనెగిరిపో దిరస్కరింతును. నేను మరియొకని యింట చోరునివలె చొరపడి జీవింపలేను. భిక్షుకుడనై గాని, బానిసనైగాని బ్రతుకలేను"

ఇవి మహాత్ముడు భారతదేశమునకు వచ్చిన ప్రథమ వర్షమున గావించిన మహోపన్యాసములలోని ప్రముఖాంశములు. ఈ వాక్యములలో మహాత్ముని సమరదృక్పథము సమస్తమును వ్యక్తమగుచున్నది. సమైక్య మొనర్చుకొని ప్రబల శత్రువును స్వాతంత్ర్యేచ్ఛతో, సౌభాగ్య భారత నిర్మాణమునకై సమర మొనర్ప నీ వాక్యములు జాతిని ప్రేరేపించినవి. ఆ మహానుభావుని కల్మష రహితము, సత్యయుతము, భయవిరహితమునైన వాగమృతమును గ్రోలి యనతికాలమున దేశము 'సమరనేత'గ వరించినది.

ప్రథమ ప్రపంచ మహాసంగ్రామ మైపోయినది. బ్రిటిష్ ప్రభుత్వము స్వరాజ్యము నర్థించుచున్న భారతీయుల కన్నుల నీరు తుడుచుటకై ఫిబ్రవరి 1917న మాంటేంగు, ఛెమ్సుఫర్డు సంస్కరణలు బ్రకటించినది. రాజప్రతినిధి యంగీకారమును బొందిన మరుక్షణము నుండి యవి వ్యవహారములోనికి వచ్చును. దేశమున నా సంస్కరణలకు వ్యతిరేకోద్యమ మారంభమైనది. మహాత్ముడు వీని కంగీకారము నీయవలదని రాజప్రతినిధిని బ్రార్థించినాడు. ప్రభుత్వ మంగీకరించినచో సత్యాగ్రహ మారంభింతునని ప్రకటించినాడు.

ఆయన సత్యాగ్రహ మొక యసమాన సాధనము. దానిని ప్రయోగించుట యందు మహాత్మునికి సాటిలేదు. అందాయన కచంచల విశ్వాసము. అది శక్తిమంతము. పవిత్రము. మాంట్-ఫర్డు సంస్కరణలు వచ్చినవి. 1 మార్చి 19న మహాత్ముడు "మేము వీనిని తిరస్కరింతు" మని ప్రభుత్వమును హెచ్చరించినాడు. భారత ప్రజల నందులకై ప్రమాణమును స్వీకరింపవలసి నదిగా ప్రబోధించినాడు. యావద్భారత మా మహానాయకుని పిలుపు వినినది. ప్రభుత్వమునకీ నూతన నాయకుని భాష క్రొత్తది. దానిని గలత పెట్టినది. మహాత్ముడు ప్రకటించిన 'హరతాళ్' (6 ఏప్రియల్ 19) జయప్రదముగ జరిగినది. దీనితో మహాత్ముని నాయకత్వమున స్వాతంత్ర్య సమర చరిత్రలో నూతనాధ్యాయ మారంభమైనది.

గాంధీజీ ప్రథమమునుండి బ్రిటిష్‌వారికి మిత్రుడు. భారతదేశమునకు దిరిగి వచ్చిన నాటినుండి ప్రపంచ మహాయుద్ధమున వారికి సాయపడుడని దేశీయ ప్రజల

నుద్బోధించినాడు. మాంట్‌ఫర్డు సంస్కరణలు రాబోవుముందు ప్రభుత్వమునకు సంస్కరణల విషయమున దోడ్పడుమని దేశమును గోరినాడు. అట్టివాడు పంజాబును రక్తస్నాన మాడించిన జలియన్ వాలాబాగ్ హత్యలు, పంజాబు దురంతములు చూచి బ్రిటిష్ ప్రభుత్వమును 'సైతాను ప్రభుత్వ' మని ముక్తకంఠముతో బలికినాడు.

బ్రిటిష్ ప్రభుత్వము పరుసదనము వహించుచున్న కొలది భారతజాతి రక్తముడుకెత్తుచున్నది. వారొనర్చుచున్న యవమానములిక భరింపశక్యములు కావని నిశ్చయించుకొనినది. కష్టసాగరముల స్వాతంత్ర్య నౌకను నడిపింప సమర్థుడగు నావికుడు మహాత్ముడేయని తీర్మానించుకొనినది.

1920లో కాంగ్రెసు ప్రత్యేక మహాసభ జరిగినది. దేశమున వివిధ ప్రాంతములనుండి మహానాయకులనేకులు విచ్చేసినారు. స్వాతంత్ర్య సమరమునకై ప్రముఖ తీర్మానము లొనర్తురని దేశము కాచుకొని కూర్చొనినది. 'సహాయ నిరాకరణోద్యమము' తీర్మానమును బ్రవేశపెట్ట మహాత్ముడు మూర్తీభ వించిన భారత హృదయమువలె వేదికపై జేరినాడు. 'మహాత్మా గాంధీకి జై', 'ఇంక్విలాబ్–జిందాబాద్' అను వీర నినాదములతో సభ కల్లోలిత మగుచున్నది. ఆనాడగ్రనాయకులుగ బరిగణితులగుచున్న పాల్, బిసెంటు, జిన్నాలు మహాత్ముని కేవల మాశావాదిగను, స్వప్నవీథుల విహరించు నున్మత్తునిగను, కార్యవివేక విహీనునిగను భావించినారు.

నాగపురము కాంగ్రెసులో మహాత్ముని సహాయనిరాకరణ తీర్మానమునకు బూర్ణవిజయము చేకూరినది. మితవాదులు, కేవల రాజతంత్రజ్ఞులు, సమరవ్యతిరేకులు కొందరు కాంగ్రెసునుండి వెడలిపోయినారు. నూతన నాయకుని యడుగు జాడల నడువ జైతన్యయుతులు, సమరవీరులు స్వాతంత్ర్యాభిలాషులు నయిన పండిత మోతీలాలు నెహ్రూ, దేశబంధు, చిత్తరంజను దాసు, హకీం అజ్మలుఖాను, డాక్టరు అన్సారీ, ఆలీ సోదరులు ప్రతినలు గైకొనినారు.

"మాంట్–ఫర్డు సంస్కరణలననుసరించి రాబోవుచున్న యెన్నికలను బహిష్కరింపు" డని సత్యాగ్రహ సమరనేత మహాత్ముడాదేశించినాడు. శాసనసభలలో బ్రవేశించి ప్రభుత్వముతో బోరాడుట కింతటితో నాయన స్వస్తి జెప్పుటలో విజయమొందినాడు. ప్రతిభావంతులెవ్వరును వాటిలో బాల్గొనలేదు. శాసనసభలను, కేవల ముద్యోగ ప్రియులకు, బిరుద వ్యామోహితులకు, భూస్వాములకు 'జో హుకుము' లకు వదలిపెట్టినాడు. రాజప్రతినిధి సలహా సంఘ మేర్పాటైనది. అందలి వ్యక్తులందరును

బ్రభుత్వ సామ్రాజ్య తత్త్వమునకు దాళము వేయువారు. నూతన సంస్కరణలు బ్రారంభోత్సవ మొనర్ప భారత ప్రభుత్వము వేల్సు యువరాజు నాహ్వానించినది. ప్రజా హృదయముల నగ్నిజ్వాలలు చెలరేగినవి. సత్యాగ్రహోద్యమమునకు నిశ్చితమైనది.

మహాత్ముని సందర్శన సంభాషణా ఫలితముగ చిత్తరంజనదాసు నాగపుర కాంగ్రెసునుండి తిరిగివచ్చిన తరువాత న్యాయవాదవృత్తికి తిలోదకమిచ్చినాడు. పూర్వము తాననుసరించు నాంగ్లో–ఇండియన్ జీవిత విధానమును మార్చుకొని కేవలమొక 'రాజకీయ సన్న్యాసి' యైనాడు. వంగ దేశీయ విద్యార్థులకు కేక పెట్టినాడు. వారు కళాశాలను బహిష్కరించి బయటకు తండోపతండములుగ విచ్చేసినారు. మహాత్ముడా సందర్భమున కలకత్తా కేగి నూతన జాతీయ విద్యాలయ నిర్మాణ మొనర్చినాడు. ప్రభుత్వము జాతీయ వాదులపై జేయి చేసుకొనుచున్నది.

వంగదేశమున చిత్తరంజనుడు కారాగారమున నున్నాడు. మహమ్మదాలీని ప్రభుత్వము పంజాబు కారాగారమున బంధించినది. ఆనాడు దేశమున హిందూ మహమ్మదీయ విభేదములు లేవు.

మహాత్ముని నాయకత్వమున సత్యాగ్రహ సమరము సాగుచున్నది. రాజప్రతినిధి రీడింగు ప్రభువు యువరాజు రాకకు దేశస్థితిగతులను కూలముగ లేవని గ్రహించినాడు. మానుకొనిన బ్రిటిష్ గౌరవమునకు భంగము వాటిల్లును.

17 నవంబరు 1921న యావద్భారతమున యువరాజు రాకను గురించి మహాత్ముని యాదేశానుసారముగా 'హరతాళ్' జరిగినది. రీడింగు ప్రభువేమి యభాస కానున్నదో యని భయపడి జాతీయ నాయకులతో సంప్రదింప నొక సభ నేర్పాటు జేయ నిశ్చయించుకొనినాడు. చిత్తరంజనునితో తంతి సంప్రదింపులు జరిపినాడు. 'మహాత్ము డంగీకరించినాడా?'యని రాజప్రతినిధిని దేశబంధువు ప్రశ్నించినాడు.

వెంటనే యతడు మహాత్మునర్థించినాడు. మహాత్ముడంగీకరించినాడు. కాని యా సమరనేత యుక్తిపరుడు. సభకు మౌలానా మహమ్మదాలీ వచ్చి తీరవలె నని నిబంధన మేర్పాటు చేసినాడు. ఇది వంచనమని గ్రహించి రీడింగు ప్రభు వంగీకరింపలేదు.

నూతన సంస్కరణల ప్రారంభోత్సవ మొనర్ప యువరాజు బ్రిటన్ నుండి వచ్చెను. జాతీయ భారత మందుకు వ్యతిరేకతను బ్రకటించి యుత్సవములలో బాల్గొన విరమించినది. అతనికి నిర్జనము, నిరలంకృతమునైన ఢిల్లీ స్వాగతమిచ్చినది, క్రోధము రాజ ప్రతినిధిని బాధించుటచే జాతీయ వాదుల తీవ్రముగ బ్రభుత్వము శిక్షించుచున్నది.

ఇట్టి స్థితిలో అహమ్మదాబాదున కాంగ్రెసు మహాసభ జరిగినది. గాంధీజీ సహాయ నిరాకరణ తీర్మానమును కార్య వర్గమువారిచే నౌద్యోగికముగ నంగీకరింపజేసినాడు. మరియొకమారు తన సాధనాశక్తిని బ్రభుత్వమునకు బ్రదర్శింప గృతనిశ్చయుడై సత్యాగ్రహ సమరయోధుల జేకూర్చుకొనుచున్నాడు.

బొంబాయిలో గొలది కాలమునకే సర్వపక్ష మహాసభ యొకటి శంకర నాయరు అధ్యక్షతన సమావేశమైనది. ప్రభుత్వముతో సంప్రదింపులు జరిపి సంధి యొనర్చుకొనుటకు దీర్మానమైనది. మహాత్ముడు 'మొదట సమరమును సాగించుటయే యుచిత' మని పలికినాడు. బ్రిటిష్ వారి తత్త్వ మా నాయకుని కవగత మైనట్లు మరెవ్వరికిని కాలేదు. శక్తిని జూచిగాని వారు భయపడరని గాంధీజీ నిర్ణయము. కాని సంధిపద్ధతి కాయన వ్యతిరేకి కాడు. రాజ్యతంత్రజ్ఞత వెల్లడి యగునట్లు 'వ్యక్తిగతముగ నేనీ తీర్మానమున కంగీకరించుచున్నాను' అని పలికినాడు.

ప్రభుత్వమీ తీర్మానమును లెక్కబెట్టలేదు. పాశవ శక్తితో భారతమును బాలింపగలమను ధైర్యము దానికణుమాత్రమును దరుగలేదు.

భారత హృదయమును జూరగొన్న మహానాయకుడు గాంధీజీ భారతము కంటె విచిత్ర వ్యక్తి. తొలగ ద్రోసుకొని బ్రతుకువాడు కాడు. శక్తి సంపన్నుడు. తన్ను నడిపించుకొనుటయే కాదు, ఇతరులను నడిపింపగలడు. ఆయన శంఖ ధ్వానము వినిపించిన మరుక్షణమున యావద్భారతమును సత్యాగ్రహ సమర రంగము కాగలదు. నిరంతరము తన్ను, దేశమును, సాధనమును బరీక్షించు కొని యగణితశక్తిని సంపాదించుకొనిన మహాత్మునకు బ్రభుత్వ మన్న భయమేమున్నది? ఆ దేశ భక్తుడు నిజసేవా త్యాగ ధర్మములు కారణముగ కిరీటము లేని చక్రవర్తియైనాడు.

నూతన సంస్కరణ రద్దుగావింప యత్నింపని పక్షమున 'సత్యాగ్రహ సమర మారంభించి బార్డోలీలో చట్టతిరస్కార మొనర్తు' మనియు, 'నిది ప్రజావాంఛిత' మనియును 1 ఫిబ్రవరి 1922న రాజప్రతినిధికి దెలియ పరచినాడు.

చట్ట తిరస్కార మన నేమో ప్రభుత్వ మెరుగును. మహాత్ముడు పూర్వము 'చాంపరాన్, కైరాలలో వ్యక్తిగతముగ దానిని ప్రదర్శించి చూపినాడు. రాజప్రతినిధి రీడింగు ప్రభువు భయపడి మహాత్ముడు సూచించిన గడువులో నొక సర్వపక్ష మహాసభ నేర్పాటు చేసి బ్రిటిష్ ప్రభుత్వ పక్షమున స్వరాజ్యమును గురించి వెనుకటిపాట పాడినాడు.

మహాత్ముడు నిజ నేతృత్వమున నడిపింప దలపెట్టిన బార్డోలీ సమరా రంభమునకై సమస్త దేశము నత్రులెత్తి జూచుచున్నది. సంయుక్త రాష్ట్రములలో గోరక్ పూరు యొద్ద చౌరీచౌరాలో కాంగ్రెసు సేవాదళ మూరేగుచుండ బ్రభుత్వ మాపినది: క్రోధోద్వేగమైన ప్రజ కొందరుద్యోగులపై బడి 'హింసాకాండ' జరిపినారు.

మహాత్ముడహింసావాది. ఆయన మతమున నది మానవ విముక్తి సాధనము. ప్రేమ రూపము. చౌరీచౌరావార్త మహాత్ముని చెవిని బడినది. భరింపలేకపోయినాడు. తన యుద్ధ విధానమున కింకను గొలది కాలము బట్టునని నమ్మి బార్డోలీ యుద్యమము నాపించినాడు. కారాగారమున నున్న జవ్హారు వంటి మహానాయకులిందుకు క్రుద్ధులైనారు. మహాత్ముడు తానొనర్చిన దుచితకృత్యమని వాదించినాడు. ప్రభుత్వముతో 'నేనోడిపోతి'నని పలికినాడు. 'అపజయము నంగీకరింపని వ్యక్తికి విజయ మనునది కల్ల'యని మహాత్ముని సిద్ధాంతము.

అటుపిమ్మట మహాత్ముడు పత్రికాముఖమున బ్రభుత్వముతో సమర మారంభించినాడు. ఆయనది పదునుగల భాష, పలుకు భావగర్భితము, అవక్రము, సత్యయుతము, భయరహితము.

ఆయన జాతీయోద్యమ సాధనముగ 'యంగ్ ఇండియా' యను పత్రికను స్థాపించి యా పత్రికాముఖమున దేశమున కుద్బోధించు చుండెడివాడు. అందు 'నిగళ విచ్ఛేదము', 'భక్తి విధానము' మొదలైన ప్రముఖ వ్యాసముల బ్రచురించినాడను నేరమున ప్రభుత్వ మాయనపై రాజద్రోహమునకై న్యాయ స్థానమునందభియోగము గొనివచ్చినది. న్యాయాధిపతి 'నీవు నిప్పుతో నాడుకొనుచున్నావని యెరుగుదువా?' అని గద్దించినాడు. 'ఔను నిప్పుతో నాడుకొనుచున్నానని నే నెరుగుదును. అదే నా చిరకాంక్ష. స్వేచ్ఛగ నన్ను వదలిపెట్టిన మరియు నిట్లాడుకొందును. అది నా కర్తవ్యము. నెరవేర్పకున్న దేశమునకు దప్పినవాడ నగుదు' నని గాంధీజీ సమాధాన మొసంగినాడు. ఎంతటి స్థిరచిత్తము! ఎంతటి చిత్తశుద్ధి!!

ప్రభుత్వము ఆ మహావీర పుంగవున కారు సంవత్సరములు కారాగార శిక్ష విధించినది. కొంతకాలము మహాత్ముడు రాజకీయ రంగమునుండి యదృశ్యు డైనాడు. ఆరోగ్యమున నసంతృప్తి కలుగుటవలన బ్రభుత్వము భయపడి బాపూజీని రెండు వత్సరముల తరువాత కారాగారమునుండి విముక్తు నొనర్చినది. మధ్యకాలమున కాంగ్రెసులో మరల మార్పు వచ్చినది. శాసన సభలలో బ్రవేశించి ప్రభుత్వము నెదుర్కొన నిశ్చితమైనది.

మహాత్ముని మనస్తత్త్వమున నెట్టి మార్పును గలుగులేదు. అహింసా, సత్యాగ్రహ, నిరశనవ్రత సాధనములపై నాయనకు నమ్మకము దినదిన ప్రవర్ధమాన మగుచున్నది. సబర్మతీ ఆశ్రమమును స్థాపించి యట తన నూతన మతమున బరిపూర్ణ విజ్ఞానమును జేకూర్చుకొన దపమొనరించుచు కాలము గడుపుచున్నాడు.

'భారతీయులు స్వరాజ్య ప్రదానమున కెంతవర కర్హులో బరిశీలింప వలసిన'దని బ్రిటిష్ ప్రభుత్వము సైమన్ నాయకత్వమున 27 నవంబరులో నొక వర్గము నేర్పాటు జేసి భారతదేశమున కంపినది. వారితో సంప్రదిం చుటకు ముందుగ జాతీయ నాయకులొక సర్వపక్ష మహాసభ నేర్పాటు జేసుకొనినారు. ఆ సందర్భముననే చారిత్రాత్మకమైన 'నెహ్రూ ప్రణాళిక' యవతరించినది.

కాంగ్రెసు మహాసభ దీని నంగీకరింపవలసి యున్నది. మోతీలాలు నెహ్రూ కలకత్తా మహాసభ (1927)లో దానిని బ్రవేశ పెట్టుటకు బూనుకొనినాడు. ఆ సభలోని యభ్యుదయ వర్గమువారు శ్రీనివాస అయ్యంగారు, జహ్వారులాలు, సుభాష్ బాబుల నాయకత్వమున వ్యతిరేకించినారు. 'అధిని వేశ స్వాతంత్ర్య మిచ్చిన జాలు' నన్న నెహ్రూ ప్రణాళికలోని యంశముతో వారేకీభవింపలేదు. ఈ స్వాతంత్ర్యవీరులలో నిట్టి భేదాభిప్రాయములు పొడజూపుటవలన దేశమునకు బ్రమాదము పర ప్రభుత్వమునకది నూతన శక్తి.

స్వాతంత్ర్య సమరనేత గాంధీజీ యిది గుర్తించినాడు. ఇరువురకును సంధి గావించుట కర్తవ్యమని యుచితజ్ఞతతో 31 డిసెంబరు 1929 లోపల ప్రభుత్వ మధినివేశ స్వాతంత్ర్యమును బ్రకటించిన స్వీకరింతుము లేకున్న పూర్ణ స్వరాజ్యవాదులు ప్రచార మొనర్చి సమరము సాగింపవచ్చు' నని యొక తీర్మానమును బ్రవేశపెట్టి విషమ స్థితినుండి కాంగ్రెసు సంస్థను, దేశమును దప్పింప యత్నించినాడు.

నూతన రాజప్రతినిధి ఇర్విన్ ప్రభువు సీమకేగి బ్రిటిష్ లేబరు ప్రభుత్వముతో సంప్రదించి భారతభూమికి తిరిగివచ్చి 'భారతీయుల కధినివేశ స్వాతంత్ర్య మొసంగ ప్రభుత్వము నిశ్చయించి'నట్లుగ నొక దీర్ఘ ప్రకటన గావించినాడు. అందెట జూచినను రాజ్యతంత్రము ద్యోతక మగుచున్నది.

మహాత్ముడాశావాది. ఢిల్లీలో సర్వపక్ష మహాసభ నొకదాని నేర్పాటు చేయించి భారతీయులు వాంఛించు 'అధినివేశ స్వాతంత్ర్య స్వరూపమును' వ్యక్తమొనర్చుచు నొక తీర్మానమును వ్రాసి యందు బ్రవేశపెట్టినాడు. సర్ తేజ్ బహదూర్ సప్రూ

వంటి రాజకీయవేత్తలా తీర్మానమున కనుకూలించిన పిమ్మట నాయకుడు దానిని ప్రభుత్వమున కందజేసినాడు.

రాజప్రతినిధి గృహమున 23 డిశంబరు 29న జాతీయ నాయకులతో సంప్రదింపులు జరిగినవి. మూడు గంటలు చర్చలు సాగినవి. ఆంగ్లేయులు హిందూ ముస్లిములను విడదీయుటొక తంత్రముగ బెట్టుకొనినారు. సారాంశము సమస్తమును విఫలమైనది.

ఉద్రేకోల్బణ మప్రతిహతముగ నున్న సమయమున లాహోరులో కాంగ్రెసు మహాసభ జరిగినది. పండిత జహ్వారులాలు నెహ్రూ అధ్యక్షోపన్యాసమున ధైర్య సాహసముల వెదజల్లినాడు. మహాత్ముడు స్వయముగ "పరిపూర్ణ స్వరాజ్యమే కాంగ్రెసు చరమలక్ష్య" మని యుద్ఘాటించి యొక తీర్మానమును బ్రవేశ పెట్టినాడు. అందు 'ఈ తీర్మానముతో నెహ్రూ రాజ్యాంగ ప్రణాళిక రద్దయినది సమస్త సభ్యులును రాబోవు సమరమున పాల్గొన వలసిన'దని గోరినాడు.

"స్వాతంత్ర్యోద్యమ ప్రథమ సోపానముగ, నూతన సిద్ధాంతమున కనుగుణముగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాసనసభల బహిష్కరింప వలసినదని, కాంగ్రెసు సభ్యుల నాదేశించుచున్నది. కాంగ్రెసు నిర్మాణాత్మక కార్యక్రమమును సాగింపవలసినదని యీ సంస్థ దేశమును కోరుచున్నది. అవసరమని తోచిన ప్రదేశమున 'పన్నుల నిరాకరణ' ప్రారంభించుటకు 'చట్ట తిరస్కారము'ను నడిపించుటకు అఖిల భారత కాంగ్రెసు కార్యవర్గమున కధికార మీ ప్రజాసభ కల్పించుచున్న"దని మహాత్ముడు తీర్మానము చేయించినాడు.

రాజప్రతినిధి శాసనసభలో లాహోరు తీర్మానమును వినిన తరువాత నొక ప్రసంగ మొనర్చినాడు. మహాత్ముడు దానిపై 'కాంగ్రెసువాదియైన ప్రతి వ్యక్తియును నేటి సంభాషణకు రాజప్రతినిధికి నమస్కరించ వలసి యున్నది. అందువలన వాతావరణము విశదమైన'దనినాడు.

యుద్ధారంభమునకు పూర్వము మహాత్ముడు సంధికై మరల నొక యత్నము చేసినాడు. పదకొండు ముఖ్య సూత్రములు గల యొక పత్రమును బ్రభుత్వమునకు బంపినాడు. అందు ముఖ్యమైనవి పరిపూర్ణ మద్యనిషేధము, భూమిపన్ను తగ్గింపు, ఉప్పుపన్ను రద్దు, ఉద్యోగి వేతనముల తగ్గింపు, స్వరక్షణమున కాయుధ ప్రదానము.

"అతి స్వల్పములు, నత్యావశ్యకములైన నీయంశముల ప్రసాదించి మమ్ము తృప్తి పరచని రాజప్రతినిధికి 'అసహాయోద్యమము', 'సత్యాగ్రహ'మను మాటలు వినిపింపవు. అప్పుడు పరిపూర్ణ వాక్స్వాతంత్ర్యమున్న నే సభయందైనను కాంగ్రెసు పాల్గొనగల"దని మహాత్ముడా లేఖలో నిష్కర్ష జేసినాడు.

ప్రభుత్వము వీటికే సమాధానమును జెప్పలేదు. లాహోరు కాంగ్రెసు మహాసభలో సమస్త జాతికి నేకైక ప్రతినిధివలె 'పరిపూర్ణ స్వరాజ్యమే తక్షణ లక్ష్య'మని ముక్త కంఠముతో యావద్భారతమును, బ్రపంచమును విన గాంధీజీ పలికినాడు. స్వాతంత్ర్య దినోత్సవము వచ్చినది. కోటికంఠములు ప్రమాణ పత్రముల స్వీకరించినవి. మహాత్ముడు శక్తిని కొలుచుకొనినాడు, సమర ఆరంభమునకు సిద్ధపడినాడు.

1930 ఫిబ్రవరిన కాంగ్రెసు కార్యవర్గము అహమ్మదాబాదులో సమా వేశమై మహాత్ముని సత్యాగ్రహ సమరనాయకునిగ బట్టభద్రు నొనర్చి స్వేచ్ఛానుసారముగ యుద్ధమును సాగింపుడని కోరినది.

"కార్యవర్గ తీర్మానము నా స్వేచ్ఛానుసారముగ సమరమును సాగింప ననుజ్ఞ యిచ్చినది. భంగ్యంతరముగ నిది నన్ను బంధించినది. దీనినే బహుకాలమునుండి నే వెదకుచున్నాను. వ్యక్తిగతముగ నాకీ తీర్మానము రాజకీయ మనుట కంటె మత విషయకము... ఇతఃపూర్వ మెన్నడును నేనిట్టి కార్య భారము వహింపలేదు. అట్టిస్థితి యేర్పడక పోవుటయే యిందుకు కారణము. నన్ను నడిపించునది 'అహింస' యైన సమస్తమును సంపన్నము కాగలదు. నా చట్ట తిరస్కారము ప్రేమాభ్యర్థనము. అది ప్రమాదకరమైనది. కాని చుట్టుకొని యున్న హింసకంటె బ్రమాదకారి కాదు. చట్ట తిరస్కారముతో బాటు – వెన్నాడు హింసయున్న దెసనుండి ప్రమాదము కలుగవచ్చును. అది యే దిక్కునుండి వచ్చినను బార్డోలీ వలె వెనుబాటు లేదు. తుది ప్రాణివరకును సమరము సాగిపోవలసినదే. ఇంతకుమించి మానవుడొనర్ప గలిగిన దేమియు లే"దని గాంధీజీ లోకము విన నుద్యమారంభవేళ ననినాడు.

మహాత్ముడు కేవలము యోధుడు కాడు రాజనీతిజ్ఞుడు. ప్రపంచ దృష్టిలో బ్రభుత్వమును గించపరచుటవలన నైతిక బలము చేకూరునని యా మహానాయకుని నమ్మకము. అది యాయన రాజనీతి! మరల నొక యత్న మొనరించిన నెట్లుండును?

రాజప్రతినిధికి సమస్తమును విస్తరించి గాంధీజీ యొక లేఖ వ్రాసినాడు. అతడు ముక్తసరిగా "న్యాయవిరుద్ధమును, ప్రజాశాంతికి భంగకరమునైన మార్గము నవలంబింప మీరు నిశ్చయించినందుకు నేను చింతించుచున్నా"నని సమాధానము నంపినాడు.

"ప్రభుత్వ పదదళిత భారతమున న్యాయము, ప్రశాంతి యెట నున్న?" దని గాంధీజీ యనుకొనినాడు.

మహాత్ముడు సత్యప్రియుడు. తంత్రజ్ఞుల దలక్రిందు జేయగల మేధాశక్తి యాయన కున్నది. స్వచ్ఛంద హృదయముతో లోకమెల్ల మెచ్చుకొన భయరహితుడై యిట్లు సమాధానమిచ్చినాడు.

"వినమ్రుడనై నేను రొట్టె నిమ్మని ప్రభుత్వమును బ్రార్థించినాను. ప్రతిగా నాకొక పాషాణము లభించినది. రాజ ప్రతినిధిగ సమాధానము నా కాశ్చర్యము కలిగింపలేదు. నా లేఖలోని వాక్యముల నక్షరశః జరిగించి తీరుదును. న్యాయ విరుద్ధము, ప్రజాశాంతికి భంగకరమునైన మార్గమును నే నూహించిన మాట వాస్తవమే.

"నేడు భారతమందున్న న్యాయము బ్రిటిష్ ఉద్యోగుల యిచ్ఛ తప్ప వేరేమున్నది? దేశ మెరిగిన శాంతి కారాగార ప్రశాంతి. నేడు భారత మెల్ల నొక విశాల కారాగారము. నేనీ న్యాయమును దిరస్కరింతును ఈ ప్రశాంతిని భగ్న మొనర్తును.

"స్వేచ్ఛకై నేడు భారతదేశ ముక్కిరిబిక్కిరి యగుచున్నది. దానికి క్రమోచ్ఛ్వాస, నిశ్శ్వాసముల నొడగూర్చుటకై దుఃఖ భూయిష్ఠమగు నీ నిర్బంధ శాంతిని భగ్నమొనర్పక తప్పదు. ఇదే నా పవిత్ర కర్తవ్యమని నే భావింతును"

సోదర సత్యాగ్రహ సమరవీరుల నుద్దేశించి సమరనేత గాంధీజీ "మన యాదర్శము బలయుతము విధానము పునీతము. సత్యమును పరిత్యజింప నంత వరకు సత్యాగ్రహుల కపజయము లేదు. రేపారంభము కానున్న మన సమరము విజయవంత మగుటకు భగవానుని వేడుకొనుచున్నా" నని సబర్మతీ యాశ్రమము నుండి సందేశ మిచ్చినాడు.

12 మార్చి విజయమో, మృత్యువో! సూర్యోదయారంభవేళ సబర్మతీ యాశ్రమమునుండి 'దండయాత్ర' మహాత్ముడు ప్రారంభించినాడు. కాకలు దీరిన నూతన కదన యోధులు కొందరు సత్యాగ్రహు లాయన వెనుక నడుచుచున్నారు. 'మహాత్మాగాంధీకి జై' నినాదములతో నొక మహాజన సముద్ర మాయన వెనుక మహోత్సాహముతో ననుసరించుచున్నది.

మహాత్ముడు డెబ్బది తొమ్మిదిమంది సమర సైనికులతో నస్తి, బరేజా, నవగ్రాం, వస్న, మతర్, నాడియడ్, బెరైలి, దభన్, ఆనంద్‌ల మీదుగ 18 మార్చినాడు బొర్సద్ చేరినాడు. ప్రతి గ్రామమునందును బ్రజలా మహానాయకునఖండ స్వాగత వాక్యములతో నాహ్వానించినారు. గాంధీజీ సేవా, ధన సహాయ మర్థించినాడు. ఊహకు మించి

యవి లభించినవి. ఆయన సేవలో నున్న క్రమశిక్షణము మున్నెన్నడును కనీవినీ యెరిగినది కాదు.

6 ఏప్రియలు 1930 ఉదయము 8-30 గంటలకు మహాత్ముడు సత్యాగ్రహ సైన్యముతో కలిసి ఉప్పు చట్టముల దిరస్కరించినాడు. ఒక మృణ్మయపాత్రతో సహజ లవణమును గ్రహించి, "ఉప్పు చట్టము ననుసరించి ప్రభుత్వ మిచ్చు శిక్షణను ధిక్కరింపగల ప్రతి వ్యక్తియును యిచ్చ వచ్చిన ప్రదేశమున స్వేచ్ఛగ నుప్పు చేసుకొనవచ్చు" నని ప్రకటించినాడు.

అర్ధ నిశా సమయమున మహాత్ముడు కరోలీ కాంగ్రెసు శిబిరములో నిద్రించు సమయమున బ్రభుత్వ మాయనను బందీ నొనర్చి ఎర్రవాడ కారాగారమునకు దీసుకొని పోయినారు. అంతటితో సమస్తము సమసిపోవునని ప్రభుత్వము తలచినది.

యావద్భారతమున చట్ట తిరస్కారములు జరిగినవి. ప్రతి రాష్ట్రమునను కాంగ్రెసు శిబిరములపై బ్రభుత్వోద్యోగులు ముట్టడులు సాగించినారు. నాయకులు, సేవాదళములు లాఠీ చార్జీలకు, కారాగృహ నిర్బంధములకు గురియైనారు. ప్రముఖ నాయకులైన వల్లభాయి, జవ్హారు ప్రభృతులు జైళ్ళలో మ్రగ్గుచున్నారు, అయినను ప్రజల యుద్రేకము తరుగలేదు. స్త్రీ, బాల, వృద్ధ భేదములు లేక సమస్త వర్గముల వారును మహాత్ముని యడుగుజాడల నచంచల విశ్వాసముతో నడచినారు.

ఆసేతు హిమాచల పర్యంత భారతమున నుప్పుచట్టముల దిరస్కరించుటతో బాటు విదేశవస్త్ర బహిష్కరణము, మద్యపాన నిరోధములు సాగినవి. లక్షలాది గ్రామములు గార్చిచ్చువలె బ్రజ్వరిల్లి ప్రభుత్వ భవనముల దహింప దలకొన్న యుద్యమమును రూపుమాపుటకు బ్రభుత్వము సమస్త శక్తుల వినియోగించి నది. దౌర్జన్యమునకు బూనుకొనినది.

ఎర్రవాడ జైలులో నున్నను మహాత్ముని మూర్తియే సమరము సాగించు చున్నది. ప్రతి గ్రామమొక యుద్ధరంగ మైనది. అయిదు నెలలు సత్యాగ్రహ సమరము సాగినది.

మహాత్ముడు స్వాతంత్ర్య గురుదేవుడై యర్జునుల వంటి మహాయోధులను, కృష్ణ భగవానుని వంటి రాజనీతిజ్ఞులను సృష్టింపగలిగినాడు. ఇది సమస్తమును మహాత్ముని విజయము! నిరుపమాన విజయము!!

కారాగారమున నున్నపుడు విదేశ పత్రికా విలేఖరులాయనను దర్శింప వచ్చినారు. వారితో 'నేడైనను నేను సంధికి సంసిద్ధుడనే' యని మహాత్ముడు వాక్రుచ్చినాడు.

వారా మహాత్ముని యాత్మబలమునకు, సత్య ప్రియత్వమునకు, నిరుపమాన త్యాగమునకు ముగ్ధులై 'కారాగారమున బద్ధుడైన మహాత్ముడు భారతీ యావతారమూర్తి. ఈనాడైన ప్రభుత్వ మాయనతో సంధిగావించు కొనుట ప్రభుత్వమునకును, బ్రపంచమునకును లాభదాయక'మని యుద్ఘోషించినారు.

సత్యాగ్రహ సమరమున మహాత్ముడు ఝుళిపించిన 'మెత్తని కత్తి' బ్రిటను హృదయాంతరాళమున బొడిచినది. ఆర్థిక బహిష్కరణముతో బ్రిటిష్ వర్తకము దెబ్బతినినది. 'ఖద్దరు' వ్యాపనముతో లాంక్‌షైర్ కార్మికులు కడగండ్ల పాలైనారు. ప్రభుత్వమునకు లొంగక తప్పినది కాదు. విప్లవ నేత మహాత్మునితో ప్రభుత్వము స్నేహపూర్వకముగ సంధి యత్నము లారంభించినది. తత్ఫలితమే 12 నవంబరు 38 నాటి రెండవ రౌండు టేబిల్ సమావేశము.

గాంధీజీ యాశయసిద్ధి యా సమావేశమువలన జేకూరలేదు. అఖిల భారత జాతీయ కాంగ్రెసున కేకైక ప్రతినిధిగ నా సమావేశమున భారతదేశ స్థితిగతులు సామాన్య బ్రిటిష్ ప్రజలు విన, ప్రపంచము విన బలుకుట కవ కాశము లభించినది. గాంధీజీ మృదుల వక్తృత్వము, సముచిత పరిహాసము, నచంచల విశ్వాసము, సత్య వాక్ప్రియత్వము – ఇన్ని మాటలేల. నా మహామూర్తి దివ్యత్వము ప్రపంచ దృష్టిని భారత దేశముపై కేంద్రీకరించనది.

సమావేశాంతమున మితవాద పక్షనాయకుడు సర్ తేజ్ బహదూర్ సప్రూ 'భారతదేశమున శాంతియుత వాతావరణమును గల్పించి రాజకీయరంగమును జక్కదిద్దుకొనుట కవకాశమి'మ్మని బ్రిటిష్ ప్రధానమంత్రి మేక్డొనాల్డును వేడుకొనినాడు. తత్ఫలితముగ బ్రభుత్వము కాంగ్రెసు కార్యవర్గ సభ్యులను 25 జనవరి 31 న విడుదల జేసినది. మితవాదులు కొందరు మహాత్ముని దర్శించి కాంగ్రెసు ప్రభుత్వముల మధ్య సంధి ప్రయత్నము లొనర్చినారు.

గాంధీజీ రాజప్రతినిధిగ ఇర్విన్‌ను జూడగోరినారు. పక్షము దినములు సుదీర్ఘములుగ సంభాషణలు సాగినవి. 'గాంధీ–ఇర్విన్' సంధి జరిగినది. మహాత్ముడు సత్యాగ్రహ సమరమాపినాడు.

కాలచక్రము పరిభ్రమించుచున్నది. మహాత్ముని సుదీర్ఘ సమర విధాన ముప్పొంగెడు ఉడుకు రక్తముగల యువలోకమునకు సంతృప్తి గలిగించుట లేదు. కార్మిక లోకమును మేల్కొల్పిన కాంగ్రెసు సంస్థను ధనిక వర్గ సంస్థ యని వారు నిందింప నారంభించినారు. వారిలో జైతన్యము సముజ్జ్వలమై పొడకట్టు చున్నది.

28 మార్చి 1931న కరాచీ కాంగ్రెసు సమావేశములో 'గాంధీ-ఇర్విన్' సంధి షరతులను విమర్శించి వ్యతిరేకించినారు. అధ్యక్షుడు వల్లభాయిపటేల్ 'నేను కర్షకాధ్యక్షుడ'నని ప్రకటించినాడు. మహాత్ముడు 'ధనికవాది'యను నిందను భరింపలేకపోయినాడు. భవిష్యత్స్వరాజ్యమున సర్వమానవుల ప్రాథమిక హక్కుల నుద్ఘాటించుచు కొన్ని తీర్మానముల బ్రవేశపెట్టి వారిని శాంతపరిచి నారు.

కరాచీ కాంగ్రెసు నుండి తిరిగివచ్చి నాయకులు సత్యాగ్రహ సమరమున శాంతిరంగమగు నిర్మాణ కార్యక్రమమునకు బూనుకొనినారు. మద్య నిషేధము, విదేశ వస్తు వస్త్ర బహిష్కరణము దేశమున దీవ్రతరముగ సాగుచున్నవి. వివిధ రాష్ట్ర ప్రజలు గాంధీ-ఇర్విన్ సంధి షరతుల పాటించి మహాత్ముని యాజ్ఞానుసారముగ చట్టసమ్మతముగ బ్రవర్తించుచున్నారు. ప్రభుత్వ పక్షమునుండి సంధి కనేక వ్యతి క్రమములు జరుగుచున్నవి. "మీ ఆంగ్లేయ ప్రభుత్వ నైతికబలమింతేనా?" యని మహాత్ము డుచ్చైస్వనముగ గర్జించినాడు.

తత్కారణముగ నూతన రాజప్రతినిధి వెల్లింగ్టన్ - గాంధీజీ మరల నొక సంధి గావించుకొనినారు. పిమ్మట నొక 'రౌండ్ టేబిల్ సమావేశము' బ్రిటిష్ ప్రభుత్వ వాంఛ ననుసరించి జరిగినది. అదియును భారతీయ ప్రజలకు బ్రయోజనకారి కాలేదు. కాని శాంతియుతముగ పాలన మొనర్తుమని మహాత్ముడు వాగ్దానమును గైకొని లండను నుండి తిరిగి వచ్చినాడు.

లండనులో బ్రభుత్వము చెప్పిన దొకటి భారతమున ననుసరించుచున్న విధానమొకటి. వంగ, సంయుక్త రాష్ట్రములలో నది దురంతములకు బూనినది. నిత్యమును వాయవ్య సరిహద్దు రాష్ట్రమున కాల్పులతో ప్రజల విప్లవమునకు పురికొల్పు చున్నది. ప్రముఖ నాయకుల నందరి ననతి కాలములో గారాగారముల బంధించినది.

మహాత్ముడు 'బ్రిటిష్ ప్రభుత్వము భారతదేశమునకు స్వేచ్ఛను బ్రసాదింప దలపలే'దని నిశ్చయ మొనర్చుకొనినాడు. మరల నొకమారు జాతిశక్తిని ప్రదర్శింపక తప్పదని దలపోసినాడు. 'ఈ ప్రభుత్వ చర్యలన్నిటి తాత్పర్యము మన మధ్య సుహృద్భావము లుప్తమైన దనియేనా? భవిష్యత్కాలమున వ్యవహ రింపవలసిన విధానమును గూర్చి కాంగ్రెసుకు నా సలహా నిచ్చుటకు ముందు మిమ్ము కొలుసుకొన మనినారా?' యని రాజప్రతినిధికి తంతివార్త నంపినాడు.

సమాధానము వచ్చినది. ప్రభుత్వము 'నా విధానమున నెట్టి లోపము లే'దని సమర్థించుకొనినది. కాంగ్రెసు అగ్ర నాయకులను నిందించినది. 'విప్లవాంతమును

జూచిగాని విశ్రమింప'నని బెదిరించినది. గత సత్యాగ్రహ సమరము 4 మార్చి 1931తో నంతమైనది. శాంతిసమయముననది సర్వవిధముల సత్యాగ్రహ సమరయోధుల నెదుర్కొన సన్నాహము లొనర్చుకొని తానే కాలు దువ్వి కయ్యమున కాహ్వానించినది.

1930లో జరిగిన సమరమున గుజరాత్‌లోని గ్రామములు ప్రభుత్వ దౌర్జన్యములకు విశేషముగ గురియైనవి. గాంధీజీ ప్రియానుచరుడగు వల్లభాయితో నా గ్రామముల కేగి ప్రజల నాశ్వాసించి రావలెనని తలపెట్టి నాడు. నేడో రేపో వారు బయలుదేరవలసి యున్నది. ప్రభుత్వము వారిరువురను నిర్బంధించి కారాగారమునకు జేర్చినది.

ప్రియ నాయకుల నిర్బంధ వార్తలు భారతదేశము నలు దెసల జేరుకొనిన మరుక్షణముననే సమరారంభమైనది. తీవ్ర రూపమున నెదుర్కొని యోధవరుల ప్రభుత్వము శిక్షించుచున్నది.

బ్రిటిష్ ప్రధానమంత్రి మాక్డొనాల్డు కుటిల రాజనీతి నిష్ణాతుడు. మతకలహ బీజముల బ్రభుత్వము దేశమున పూర్వమే నాటినది. అవి నేడంకురించినవి. వాటి నండ చేసుకొని మతప్రాతినిధ్య సూత్రమును బ్రయోగించి సమర సైనికుల విడదీసి విప్లవమును రూపుమాపనెంచి యితడు 17 ఆగస్టు 1932న 'కమ్యూనల్ ఎవార్డు'ను బ్రయోగించినాడు. దీనికి మహాత్ముడు వ్యతిరేకింపక మానడు. 'మీకు స్వపరి పాలన మొసగువేళ మీ నాయకుడే యడ్డుపడుచున్నా'డని చెప్పవచ్చునని యతడు భావించినాడు. శాసనసభలలో నిమ్న జాతులకు ప్రత్యేక స్థానముల గల్పించినాడు. 'విభజించుచు పాలించు' నీ బ్రిటిష్ రాజనీతిని మహాత్ముడు కనిపెట్టినాడు.

గాంధీజీ సెప్టెంబరు 22 నుండి దీనిని ధిక్కరించుచు నామరణాంత 'ముపవాసదీక్ష' స్వీకరింప నిశ్చయించినట్లు ప్రభుత్వమున కెరుక పరిచినాడు. ఈ నిరశన వ్రత మహాస్త్రముతో బ్రపంచము సమస్తమును కలత పడినది. తీవ్రముగ బ్రిటిష్ ప్రభుత్వ చర్యను ఖండించినది. బ్రిటిషు ప్రధానమంత్రి నిజ నిశ్చయమును మార్చుకొనక తప్పినది కాదు.

హరిజనోద్ధరణ వ్యాప్తికి సేవాదళమును వృద్ధిచేయుటకై మహాత్ముడు బహుకాలము నుండి కృషి చేయుచున్నాడు. అయినను కావలసి యున్న సేవకులు లభింపలేదు. దానికిని, హృదయ మాలిన్య క్షాళనార్థమును గాంధీజీ యిరువది యొక్క దినములు నిరశన వ్రతదీక్ష నారంభించినాడు. దీక్షారంభ ప్రథమ దివసముననే ప్రభుత్వ మాయనను

కారాగారము నుండి విముక్తు నొనర్చినది. మహాత్ముడు కొంతకాలము సత్యాగ్రహ సమర మాపినాడు.

నిగ్గు దేరిన సమర యోధ బలమును సేకరించుకొని మరల మహాత్ముడు వారికి వ్యక్తిసత్యాగ్రహ మహామంత్ర ముపదేశించి 1930 ఆగష్టు 1న రాస్ గ్రామమునకు యాత్రకై బయలుదేరువేళ ప్రభుత్వ మాయనను బంధించినది. ఆ నాలుగు దినముల తరువాత నెర్రవాడ గ్రామమును దాటి పూనా నగరమున నివసింపవలసినదని శాసించినది. మరుక్షణముననే మహాత్ముడా శాసనమును ధిక్కరించినాడు. తిరిగి బంధించి ప్రభుత్వ మొక సంవత్సరము గాంధీజీకి కారాగార వాస శిక్ష జెప్పినది.

నాయకుని యాదేశానుసారముగ కాంగ్రెసు సేవకు లొకరి వెంట నొకరు వ్యక్తి సత్యాగ్రహ మారంభించినారు. సమస్త కారాగారములును గాంధీ సేనలతో నిండిపోయినవి. దౌర్జన్యముతో నెంత యెదుర్కొన యత్నించినను బ్రభుత్వము పొంగిపొరలి పైబడుచున్న చైతన్య మహాసముద్రముల నాపలేకపోవుచున్నది.

ప్రభుత్వమును దల్లడిలజేయుచు మహాత్ముడు జైలులో నిరశనదీక్షా మహాస్త్రమును బ్రయోగించినాడు. ప్రభుత్వము చలింపలేదు. మహాత్ముని శరీర స్థితి నీరసించినది. ప్రభుత్వోద్యోగులు శ్రద్ధ వహించి యాయనను పూనా వైద్యశాలకు జేర్చినారు. ప్రాణభయ కారణముగ ప్రపంచమున గగ్గోలు ప్రారంభమైనది. ప్రభుత్వము మహాత్ముని 23 ఆగష్టున విడుదల చేసినది. సత్యాగ్రహ సమర నేతకిది మరియొక విజయము.

1934లో కాంగ్రెసులో మార్పు వచ్చినది. సత్యాగ్రహ సమరవిధానము మాని తాత్కాలికముగ శాసన సభా ప్రవేశ మొనర్ప నిశ్చయమైనది. అది విని ప్రభుత్వముతో సహకరింప నిచ్చగించినారను నమ్మకముతో నది కాంగ్రెసుపై నిషేధము తొలగించినది.

1935లో రాజ్యాంగ చట్టమును సిద్ధ మొనర్చి ప్రభుత్వము దానిని 1937లో నమలుకు కొనివచ్చినారు. ఎన్నికలు జరిగినవి. కాంగ్రెసు పాల్గొనినది. అఖండ విజయము చేకూరినది. నిత్య వ్యవహారములలో గవర్నర్లు జోక్యము కలిగించుకొనమని వాగ్దాన మొనర్చిన పక్షమున మంత్రివర్గముల నేర్పాటు గావింతు మనినారు. ప్రభుత్వాంగీకారముతో కాంగ్రెసు మంత్రివర్గము లేర్పాటైనవి. ప్రభుత్వము నడుచుచున్నది.

ద్వితీయ ప్రపంచ మహాయుద్ధ మారంభమైనది. ప్రభుత్వము భారత దేశమును యుద్ధమున దింప యత్నించుచున్నది. మహాత్ముడు గమనించినాడు. "ప్రజాభీష్టము

లేక భారతమును యుద్ధములోనికి దింపరాదు, 'యుద్ధము–శాంతి' రెంటిని నిర్ణయింప ప్రజలు శక్తివంతు" లని సబర్మతీ యాశ్రమమునుండి గద్దించి పలికినాడు. ప్రభుత్వము కాంగ్రెసును యుద్ధ సహాయమర్థించినది. కాంగ్రెసు కార్యవర్గము సమావేశమై నాయకుని పలుకున కనుగుణముగ నిట్లు పలికినది:

"మీకు సాయమొనర్ప సర్వదా సంసిద్ధులము. కాని యొక మహోన్నతాశయమునకై పోరాడు సమయమున సరిసమానుల మధ్యనే సహకారము లభింపగలదు. ప్రజలు మహాత్ముని నాయకత్వమున స్వాతంత్ర్యమును సంపాదింప మహోన్నత త్యాగము లొనర్చినారు. వారు సర్వదా ప్రజా ప్రభుత్వమును, స్వేచ్ఛను కాంక్షింతురు. మీరొనర్చు యుద్ధము సామ్రాజ్యవాదుల వలస రాజ్యముల రక్షణార్థమైనచో దానితో భారతీయ ప్రజ కెట్టి సంబంధమును లేదు. భారత దేశమునకు స్వాతంత్ర్యమును ప్రకటింపుడు. మీకు సమస్త సహకారమును లభించును"

సమాధానముగ "యుద్ధానంతరము సర్వపక్షములతోను, సమస్త వర్గములతోను, సంస్థాన ప్రభుత్వ వర్గములతోను సంప్రదించి 1935 ఇండియా చట్టమున నవసరమగు మార్పుల చేతు" మని రాజప్రతినిధి లిన్లిత్‌గో యతిజాగరూకతతో నొక ప్రకటన గావించినాడు. అంతట మహాత్ముని సత్యాగ్రహము అవతరించినది.

ఆయన "బ్రిటిష్ ప్రభుత్వ మాపగలిగినంత వరకును భారతమునకు ప్రజా ప్రభుత్వము కల్ల" అని వ్యాఖ్యానించినాడు. ప్రజా ప్రభుత్వమును పొందవలె నన్న ప్రభుత్వము నెదుర్కొని దాని శక్తిని క్షీణింప జేయుటయే కర్తవ్యమని మహాత్ముని భావము. కాంగ్రెసు కార్యవర్గముచే గాంధీజీ 'ఇది కేవలము సామ్రాజ్య తత్వము. మీతో యుద్ధమున సహకరింప' మని తీర్మానము చేయించినాడు. యుద్ధ విషయమున బ్రిటిష్ ప్రభుత్వమున కెట్టి సహకారము నీయవలదని మంత్రివర్గములకు తాకీదు లందజేయించినాడు.

ప్రభుత్వమునకు కాంగ్రెసుకును బెడిసినది. కాంగ్రెసు మంత్రులు పదవులకు రాజీనామా లిచ్చినారు.

మహాత్ముడు సమర మొనర్చు చున్నను బ్రిటిషు వారి సుహృద్భావమును లుప్తమొనర్చు కొనలేదు మైత్రి సూత్రమును ఛేదింపలేదు. ఇట్టి క్లిష్టస్థితి యందును "బ్రిటన్ వినాశనమున మేము స్వాతంత్ర్యమును గోర" మని ఘంటాపథముగ పలికినాడు. 7 జులై 1940న భారత స్వాతంత్ర్యమును బ్రకటించి కేంద్రమున 'తాత్కాలిక జాతీయ ప్రభుత్వము' నేర్పాటు జేయించిన తామేనాడైన యుద్ధమున బ్రిటన్‌తో

సహకరించుటకు సిద్ధముగ నున్నామని కార్యవర్గముచే బలికించినాడు. యుద్ధాగ్నుల మధ్య దహించుకొనిపోవుచున్న బ్రిటిష్ ప్రభుత్వమునకిందులో కొంత శీతలత్వము ద్యోతక మైనది. రాజ ప్రతినిధిని బిలిపించి సంప్రదించి బ్రిటిషు యుద్ధకాల ప్రధానమంత్రి చర్చిల్ అతనిచే 8 ఆగష్టు 1940న నొక నూతన ప్రకటన జేయించినాడు.

గాంధీజీ సునిశిత బుద్ధితో నా ప్రకటనను బరిశీలించి 'బ్రిటన్ నిరూపించు స్వతంత్ర భారతమునకును, కాంగ్రెసు నిరూపించు స్వేచ్ఛా భారతమునకును మధ్య నొక యఖాత మున్నది. రాజ ప్రతినిధి ప్రకటనతో నది విస్తరించిన' దని యొక మహావాక్యమును బలికినాడు. సమర నేత భావము సమస్త భారతమున కవగతమైనది.

భారతమునకు యుద్ధాగమనము మహాత్ముని సంచలింపజేసినది. నూతన పరిణామమున సత్యాగ్రహ సమరవిధాన మెట్లనుగుణ మగునో గాంధీజీకి బోధపడలేదు. ఆయన యనుచరులలోనే ప్రముఖులైన కాంగ్రెసువాదులు దానిని వ్యతిరేకించుచున్నారు. సాయుధ బలముల నెదుర్కొన సత్యాగ్రహ సమరవీరులు సమర్థులు కారని వారి వాదము. గాంధీజీ కెవ్విధమైన హింసాత్మక చర్యలన్న నిష్టము లేదు. కాని కాంగ్రెసునకు స్వయం నిర్ణయ మొనరించుకొన ననుజ్ఞ యిచ్చినాడు. ఇతరు లెట్టి తీర్మాన మొనర్చినను సమరనేత గాంధీజీ యిష్టమే భారత ప్రజానీకమున కభీష్టము.

ఆ క్లిష్టస్థితిలో గార్యరహితతను మహాత్ముడు సహింపలేక పోయినాడు రచనలు సాగించినాడు. అవి దేశమునకు నూతన చైతన్యమును బ్రసాదించినవి. 'కేవల వాక్స్వాతంత్ర్యమున కైనను నాయకత్వము వహించి సత్యాగ్రహ సమరమును సాగింపు' డని యనుచరులు మహాత్ముని వేడికొనినారు. ముందు వెనుక లాలోచించి ప్రజోద్యమ మారంభించుట క్షేమకరము కాదని మహాత్ముడు నిర్ణయించి 'మే మొనర్చు సమరము కేవలము బ్రిటిష్ ప్రభుత్వము పట్ల నైతిక వ్యతిరేక భావమును బ్రకటించుటయే' యని వ్యక్తి సత్యాగ్రహ మారంభించినాడు.

ప్రభుత్వము బ్రిటిష్ మంత్రి వర్గములోని క్రిప్సును భారతదేశమునకు రాయబారిగ నంపినది. అతడు 1942 మార్చి నెలలో భారతదేశమునకు వచ్చి సంప్రదింపులు విఫలమగుట వలన ఏప్రియలు నెలలో నింగ్లండు చేరినాడు. అతని మూలమున నైనను ప్రభుత్వము యుద్ధానంతరము భారతదేశమునకు బ్రజాస్వామికమును బ్రకటింప యత్నింతుమని వాగ్దానము మాత్రమే యొనర్చినది. మహాత్ముడు క్రిప్సు ప్రతిపాదనను "ముందు తారీఖు వేసి దివాల తీయనున్న బ్యాంకుపై నిచ్చిన చెక్కు" అని ముక్తసరిగ

నొకమాటతో పరిహసించినాడు. కాంగ్రెసు అధ్యక్షుడు ఆజాద్ "ఇట్టి ప్రతిపాదనలకు కాంగ్రెసు అంగీకరింప నేర"దని విస్పష్టముగ మహాత్ముని వాక్యముల కనుగుణముగ పలికినాడు.

క్రిప్సు దేశము నుద్వేగములో ముంచి వెడలిపోయినాడు. ఒక వంకనుండి బర్మారంగమున నవిజేయులై జపాను వారు భారతము పైబడ వచ్చుచున్నారు. ఇట్టి స్థితిలోనైన ప్రభుత్వ విధానమును వ్యతిరేకింపక తప్పదని మహాత్ముడు నిశ్చయించినాడు.

సబర్మతీ యాశ్రమమున కొంతకాలము నిశ్చల మానసముతో తపస్సు సాగించినాడు. ఒక 'నూతన తారక మంత్రము'ను దర్శించినాడు. అప్రయత్నముగ నా మహానాయకుని నోట 'ఇండియాను విడిచి పొం'డను మహావాక్య ముద్భవించినది.

8 ఆగష్టు 1942న కాంగ్రెసుచే 'ఇండియాను విడిచిపొం'డను తీర్మానమును చేయించి ప్రభుత్వమున కందజేసినాడు. జాతీయ భారతమున నది నూతన యుద్ధనినాదమైనది. ఈ తీర్మానము ననుసరించి బ్రిటిష్‌వారు తక్షణమే భారత ప్రభుత్వమును పరిత్యజించి వైదొలగనిచో నాయకత్వము వహించి 'యావద్భారతమును సమర రంగము గావించి యహింసాశక్తితో నెదుర్కొనక తప్ప' దని గాంధీజీ ఉద్ఘాటించినాడు. 'తీర్మానమున పరదేశీయుల పట్ల నాచరణలో ద్వేషమున కేమాత్రము ఆస్కారము లేదు. వీరు పరదేశీయులన్న భయమున్ననే ద్వేషమునకు దావున్నది. ఆ భయము లేనినాడు ద్వేషమే లేదు' అని తీర్మానమును సమరనేత సమరసభావముతో వివరించినాడు.

"భారతము కొరకును, సంయుక్త రాష్ట్రముల క్షేమము కొరకును బ్రిటిష్ రాజ్యపాలన మంతమొందు టావశ్యకము. ఆ పాలనము నింకను కొనసాగించుట భారతమును శక్తి విహీన మొనర్చుట. మా దేశాభ్యుదయము నరికట్టుట స్వరక్షణకును ప్రపంచ స్వేచ్ఛకును, భారతజాతి సహాయపడనేరని స్థితిని కల్పించుట" అని మహాత్ముడు కాంగ్రెసు కార్యవర్గముచే దీవ్రమగు తీర్మానమును జేయించినాడు.

'విడిచి పొం'డను తీర్మాన మెంత సాహసోపేతము! అందును యుద్ధ సమయమున! సంప్రదింపుల కవకాశము లేదు. ప్రభుత్వము మండిపడినది. మహాత్ముని, కాంగ్రెసు కార్యవర్గమును, నితర ప్రముఖ నాయకుల బందీల నొనర్చినది. కేంద్ర, రాష్ట్ర, పట్టణ, గ్రామ కాంగ్రెసు సంస్థల రాజద్రోహ సంస్థలుగ నిషేధించినది. ప్రచండములగు శిక్షల పాల్జేయ సిద్ధపడినది.

నాయకుల కారాగార నిర్బంధముతో దేశ ముద్రిక్తమైనది. యావద్భార తమున విప్లవము చెలరేగినది. హింసాత్మక చర్యలారంభించినవి. సాయుధ బలములతో కొందరు వీరుల సైనికోద్యోగు లెదుర్కొనినారు. సమస్త విధముల బ్రభుత్వమును తారుమారొనరింప యత్నించినారు. వారు తరలి మార్గముల విచ్ఛేదించి, తపాలాఫీసుల దహించి, రైలు మార్గముల నెదుర్కొనినారు.

"భారతమున జరుగుచున్న హింసా ప్రతిహింసల కేమాత్రము నేను బాధ్యు డను కా"నని విస్పష్టముగ గాంధీజీ ప్రకటించినాడు. అది 'విడిచిపొం'డను తీర్మానమును నిరాకరించి నాయకుల బందీలొనర్ప నుద్రిక్త పరవశులైన ప్రజలొనర్చిన యున్మత్తకములు కాని సత్యాగ్రహ సమరనేత యాజ్ఞానుసార మనుయాయు లొనర్చిన సమరము కాదు.

'మహాత్ముని విడుదల యొనర్పు'డని వర్గ, మత వైషమ్యము లెల్ల మాని సమస్త భారతమును బ్రభుత్వము నేక కంఠమున వాంఛించినది. వారు పెడచెవి బెట్టినారు. తత్కారణముగ రాజప్రతినిధి, కార్యవర్గ సభ్యులెల్లరును రాజీనామా లిచ్చినారు. ఇది మహాత్మునకు వినూతన విజయము.

'విడిచిపొం'డను మహాత్ముని శాసనమునకు భిన్నముగ ముస్లింలీగ్ అధ్యక్షుడు జిన్నా 'విభజించి – విడిచిపొం'డని పట్టుబట్టినాడు. నూతన రాజప్రతినిధి వేవెల్ 'రాజకీయముగ నార్థికముగ భారత మేకైకము, అవిభాజ్య'మని యును, దాని భౌగోళిక స్థితిని మార్చ వీలులేదనియును బ్రకటించినాడు.

గాంధీజీ చెరసాలనుండి విముక్తుడైన తక్షణమే జిన్నాతో 'భేటీలు' జరిపినాడు. సఖ్యము కలుగలేదు. 'మీలో మీకభిప్రాయ భేదములున్న స్వాతంత్ర్యము నిచ్చుటె'ట్లని బ్రిటన్ మరల పాత పాట పాడినది. ప్రభుత్వ మేర్పాటు చేసిన సిమ్లా సమావేశమును నిష్ప్రయోజనమైనది.

1945–46లో క్రొత్త యెన్నికలు జరిగినవి. సింధు, వంగరాష్ట్రములలో దప్ప మిగిలిన సమస్త రాష్ట్రములలోను కాంగ్రెసున కఖండ విజయము చేకూరినది. రాష్ట్ర ప్రభుత్వముల కాంగ్రెసు నడుపుచున్నది.

మహాత్ముని సమర ఫలితముగ నమాత్యత్రయము – పెథిక్‌లారెన్సు, అలెగ్జాండరు, క్రిప్సు – భారతదేశమునకు రాయబారమునకై వచ్చినారు. క్రమముగ 'రాజ్యాంగ నిర్మాణ సభ' యేర్పాటైనది.

1947 జులై నెలలో బ్రిటిష్ పార్లమెంటు 'ఇండియా స్వాతంత్ర్య చట్టమును' ప్రకటించినది. మహాత్ముని సమర ఫలితముగ భారతీయులకు స్వాతంత్ర్య మవతరించినది. 'అధినివేశ రాజ్యాంగముగ' కొంత కాలముండి నేడా మహావీరుడు నెహ్రూ నాయకత్వమున స్వతంత్ర ప్రతిపత్తితో 'గణరాజ్య' (రిపబ్లిక్) మైనది.

మహాత్ముడు భారత స్వాతంత్ర్య నౌకను మహా సముద్రముల నడిపించి యొక యొడ్డునకు జేర్చిన నావికుడు. సమర సత్య ప్రియత్వము, అచంచల విశ్వాసము, అనుపమాన కార్యదీక్ష, త్యాగము, సేవ, నిర్భీతి, గాంధీజీలోని మహానాయక లక్షణములు.

ఆయన సమరవిధాన మాశాపూరితము అపూర్వము మైత్రీయుతము, 'సత్యాగ్రహ' మాయన పరమ పవిత్ర సాధనము.

బాపూజీ వీరపుంగవుడు! అగ్రగామి!! పురుషోత్తముడు!!

# 4. నేతాజీ

ద్వితీయ ప్రపంచ మహాయుద్ధము తీవ్రతరముగ సాగుచున్నది. కలకత్తా ప్రెసిడెన్సీ కారాగారమునుండి ప్రభుత్వమున కొక లేఖ (26–10–1940) చేరినది. అందిట్లున్నది:

"బ్రిటిషు ప్రభుత్వము నన్ను పశుశక్తితో కారాగారమున బంధింప నిశ్చయించినది. ఇందుకు నేనంగీకరింపలేను. విడుదల యగుటయో మరణించుటయో నిశ్చయము కావలెను. మృతి నొందుట వలన దాత్కాలిక ప్రయోజన మణుమాత్రముండదని నేనెరుగుదును. అయినను నా జాతి జీవించి యున్నంత వరకు నది నిరర్ధకము కాదు.

"నా మృతి భవిష్యద్భారతమున స్వాతంత్ర్య యోధుల కుత్సాహ బీజము కాగలదు..."

"జగత్తులో సమస్తమును నశింపక దప్పదు. కాని భావములు ఆదర్శ ములు, స్వప్నములు వినాశము నొందవు. ఏ యాశయమున కొక త్యాగి ప్రాణముల బలి ఇచ్చునో యది సహస్ర హృదయ క్షేత్రముల బునరుజ్జీవింప చేయును..."

"జాతి బ్రతుకునకు వ్యక్తుల బలి యావశ్యకము. నా పునీత భారతము పౌరుషోపేతమై స్వాతంత్ర్య సముపార్జన మొనర్పవలెనన్న నేను మరణింపక దీరదు..."

"బానిస బ్రతుకొక మహాశాపము. అన్యాయముతో, నక్రమముతో సంధిగావించి జీవించుట మహాదోషము జీవింప దలచిన జీవము లర్పిం చుట సనాతన ధర్మము. వీనిని మరచిపోకుడని స్వదేశీయుల నేను హెచ్చరించుచున్నాను"

మూర్తీభవించిన స్వాతంత్ర్యేచ్ఛ వలె నిట్టి లేఖను వ్రాయగలవాడెవరు? – బోసుబాబు!

ప్రభుత్వ మాయనను విడుదల జేయకున్న యామరణాంతము నిరశన వ్రతదీక్ష బూనునట! బలవంతముగ నాహారము నిప్పింప యత్నించిన సమస్త శక్తితో వ్యతిరేకించునట!! 29 నవంబరు 1940న దీక్ష నారంభించునట!!!

ప్రభుత్వము తాఖీదు మరల మరల జదువుకొన్నది. ఆయన దృఢనిశ్చయమున కాశ్చర్యపడినది. ఆయన యొక యసామాన్య వ్యక్తి. సమస్త ప్రపంచమున స్వాతంత్ర్య వీరుడని ప్రసిద్ధిగన్న మహాపురుషుడు! విడుదల జేసిన నూరకొనువాడు కాడు. మరణింప నిచ్చగించిన యావద్భారతమున కార్చిచ్చు రగుల్చుకొన్నట్లు. దాని జల్లార్ప నెవరి తరముగాదు.

తమ యసమర్థత లోకమునకు వెల్లడి కాకుండ బోసుబాబును ప్రభుత్వము కారాగారమునుండి విముక్తుని జేసి, యనేక నియమముల విధించి, కలకత్తాలో గృహపరిసరములు దాటరాదని శాసించినది. కన్నుల వత్తి నిడుకొని కనిపెట్టు చున్నది. భారత స్వాతంత్ర్యమే జీవిత లక్ష్యముగ నిరంతరము కృషి యొనర్చుచు, శారీరక మానసిక వ్యథలతో నా మహాశూరు'డాశయ సిద్ధికై యుపాయాన్వేషణ మొనర్చుచు కాలము గడుపుచున్నాడు.

బోసుబాబు కలకత్తానుండి 1941 ఫిబ్రవరి నెలలో నంతర్ధానమైనట్లు వార్తాపత్రికలు ప్రకటించినవి. స్వల్ప కాలమునకు బూర్వమే యాయనతో సంప్రదించిన సర్దారు శార్దూల సింగ్ కనషీర్ "భారతమునకిక స్వాతంత్ర్యము కల్లయని విసిగి వేసారి బోసుబాబు సన్న్యసించి దక్షిణ దేశములో నేపుణ్య క్షేత్రముననో కాలము గడుప వెడలియుండు" నని యొక ప్రకటన జేసినాడు. ప్రభుత్వము కురుక్షేత్రమున సన్న్యాసి వేషముననున్న బోసుబాబును పట్టుకొన్నట్లు ప్రథమమున నొక ప్రకటన గావించి తరువాత దిద్దుకొన్నది. భారత స్వాతంత్ర్య సమరాంగణమున నగ్రగామియై నేడు సన్న్యసించినాడన్న వార్తలను దేశము నమ్మలేకపోయినది. మహాభారత కురువృద్ధుల యాత్మలు దన్నావహింప వేడుకొన యాయన వెడలి యుండునని భావించినది.

దేశమున కొంతకాలము బోసుబాబు మాట వినిపింపలేదు. అచంచల కార్యాచరణ దీక్షతో నా దేశభక్తుడు కష్టనిష్ఠురముల కోర్చి కాబూల్ మార్గమున జర్మనీ ముఖ్య పట్టణమగు బెర్లిన్ నగరమును జేరుకొనినట్లు జర్మన్ ఆకాశవాణి ప్రకటించినది. అది విన్ననాడు జాతీయ భారతమానంద తరంగ డోలికల నోలలాడినది. బోసుబాబు సైన్యముతో సరిహద్దుల బ్రవేశించి సమరము సాగించునని నిశ్చయించినది.

బోసుబాబు దూరాలోచనపరుడు. స్వప్నవీథుల విహరింపని కార్యశూరుడు. ప్రపంచ రాజకీయముల సూక్ష్మ పరిశీలనా జ్ఞానమున నవగత మొనర్చుకొన్న రాజనీతిజ్ఞుడు. ఆయన ప్రథమ ప్రపంచ మహా సంగ్రామానంతరము జరిగిన వర్సెల్సు సంధికి గ్రమముగ వ్యతిక్రమములు కలుగుట గమనించి దూరదృష్టితో ద్వితీయ

మహాయుద్ధము తప్పదని గట్టిగ నమ్మినాడు. అట్టి సమయము భారత స్వాతంత్ర్య సముపార్జనమునకు యోగ్యమైనదని నమ్మి యాశుభక్షణము నకై వేచి యున్నాడు. అట్టి స్థితిగతులేర్పడినవి. దేశమున సాగుచున్న సమరమునకు సహాయకారిగ సాయుధ విప్లవము కొంత సాగింపవలెనని యూహించి యాయన జర్మనులతో సఖ్య మొనర్చుకొని యుండును.

తూర్పు ఆసియాలో 1942లో మార్చిలో భారత స్వాతంత్ర్య సమితి యేర్పాటైనది. దాని పర్యవేక్షణ క్రింద భారత జాతీయ సైన్యము (ఆజాద్ హింద్ ఫౌజు) దేశవిముక్తికై స్వాతంత్ర్య సమరము సాగింపదలచినది. వారికి సాయ మొనర్పవలసిన జపానువారితో సంబంధ బాంధవ్యములు సక్రమముగ లేవు. అట్టి స్థితిలో వారు జర్మనీనుండి సుబాస్ బాబును తూర్పు ఆసియాకు వచ్చి భారత జాతీయ సైన్యముతో సమరము సాగింపుడని యాహ్వానించినారు.

అఅచేత ప్రాణములతో నత్యుపద్రవకరమైన ప్రయాణ మొనర్చి బెర్లిన్ నుండి జర్మను, జపాను జలాంతర్గాములలో బోసుబాబు సింగపూరు జేరినాడు. ఆంగ్లేయ పాలనలో నున్న సముద్రములలో నతని జలాంతర్గాములు నడచినవి. విశ్వాస మాయనను కాపాడినది! దేశభక్తి యాయనచే నట్టి సాహస కృత్య మొనరింపజేసినది!!

1943 జులై 2న దేశీయులకు దర్శన మిచ్చుటకు ముందు ఆయన పినాంగు మీదుగ జపాను ముఖ్య నగరమగు టోకియో కేగి, యా ప్రభుత్వముతో నత్యావశ్యకములగు సంప్రదింపులు జరిపి, సర్వయత్నములును మాతృదేశ స్వాతంత్యమున కనుకూలములని గ్రహించి సింగపూరుకు విచ్చేసినాడు.

4 జులై – రంగూన్‌లో కాథీభవనములు జనసమ్మర్దముతో గిటగిట లాడిపోవుచున్నవి. బోసుబాబు దర్శనార్థము విదేశములవారు చైనీయులు, జపానీయులు, మలయావాసులు నితరులు వచ్చినారు. మిత్ర రాజ్యముల పతాకముల మధ్య త్రివర్ణాంచిత భారత పతాకము స్వాతంత్ర్య విదాహము ననాయన్నట్లు కొసలాడించుచున్నది. అలంకృతమైన యున్నత వేదికపై నుదయ భారతమును దిలకించి మందహాస మొనర్చుచున్న మహాత్ముని తైలవర్ణ చిత్రమున్నది. వేదికకు ముందు భారతజాతీయ సైన్యము, వారి వెనుక తూర్పు ఆసియా రాజ్యముల నుండి యా మహాసభకు బ్రతినిధులుగ నచ్చిన భారతీయులు నుపవిష్టులై యున్నారు.

‘ఇంక్విలాబ్–జిందాబాద్’, ‘మహాత్మాగాంధీకి జై’ ‘బోసుబాబుకు జై!’ యను హర్ష నినాదములతో భవనములు ప్రతిశబ్దించుచున్నవి. మూర్తీభవించిన

శౌర్యగర్వమువలె నవనతముగాని శిరముతో, సమదృష్టితో, సాలప్రాంశువైన శరీరముతో, సభాంగణమును ప్రవేశించి వేదిక నలంకరించి ఎదుట నున్న సమస్త మానవలోక హృదయముల బోసు బాబు మందస్మితముతో జూరగొనినాడు.

ఆ మహాయోధుని బుష్ప మాలాలంకృతు నొనర్చి, స్వాగత వాక్యములు పలికి భారత స్వాతంత్ర్య సమితి పూర్వాధ్యక్షుడు రసబిహారీ ఘోష్ నిరుపమానత్యాగముతో జాతీయ స్వాతంత్ర్యోద్యమ నాయకత్వమును స్వీకరింపుడని యర్థించినాడు. మహోజ్జ్వల శిల్పమూర్తివలె వేదికపై నిలిచి బోసుబాబు కార్యభారము వహింప నంగీకారమును దెలిపిన మరుక్షణమున 'నేతాజీకి జై', 'ఇంక్విలాబ్ – జిందాబాద్' అను వీర నినాదములతో నాభవనములు ప్రతిధ్వనించినవి.

నేతాజీ రస బిహారీ నభినందించి భారతీయ సోదరుల నుద్దేశించి యొక మహోపన్యాస మొసగినాడు.

"స్వరాజ్యాకాంక్షులైన భారతీయులకు గార్య రంగమున ప్రవేశింపవలసిన సమయమాసన్నమైనది. నేటి యుద్ధ పరిస్థితులలో గార్యాచరణమునకు గ్రమశిక్షణ మావశ్యకము. ఈ తూర్పు రాజ్యములలోని భారతీయు లెల్లరు నేక వాహినియై రాబోవు మహాసమరమునకు సిద్ధము కందు.

"స్వదేశమున బోరాడుచున్న సమరయోధులకు గార్యకర్తలుగ దేశభక్తులైన భారతీయులు నేడెందరో విదేశములలో వ్యవహరించుచున్నారు. వారు మును పొనర్చినదియును ముందొనర్ప బోవునదియును భారత స్వేచ్ఛ కొరకే. దేశీయుల యాశయములకు వ్యతిరిక్తముగ గాని, భారత సౌభాగ్యమునకు వ్యతిరేకముగగాని మనమెన్నడును బ్రవర్తింపము.

"కేవల స్వయంకృషి మూలకములైన సేవాత్యాగముల వలన సముపార్జించిన స్వేచ్ఛనే మనము చిరస్థాయిగ నిలుపుకొన గలము అంతమున విజయము మనదే. అంత మాత్రమున శత్రువుల శక్తి యల్పమని మనము భావింపరాదు. మన సంకల్పములకు దాత్కాలికముగ నెట్టి యాటంకములు కలిగినను వానికి మనము సర్వదా సంసిద్ధులము.

"ముందున్నది శత్రువులతో మహాసమరము. మన శత్రువు శక్తిమంతము, నీతి విరహితము, గుటిలము, క్రూరము. మన స్వాతంత్ర్యమునకై నేడు సాగింపనున్న యీచరమ యాత్రలో నాకలి దప్పుల నెదుర్కొనవలెను కష్టముల గరకు బారవలెను బలవంతముల బయనింపవలెను మృత్యువును బరిహసింపవలెను.

"ఇట్టి యగ్ని పరీక్షల కాగిననాడే విజయము మీది. మీరిందులకు సంసిద్ధులై వర్తించి బానిస వృత్తిలో గ్రమ్గి నిర్భాగ్యమైన మన పవిత్ర భారతమునకు స్వేచ్ఛా సౌభాగ్యముల సంపాదింతురని నా దృఢ నిశ్చయము"

నేతాజీ ప్రసంగమును విన్న భారతీయు లెల్లరును మంత్రముగ్ధులైనారు. వారి రక్త ముడుకెత్తినది. శరీరము లుప్పొంగినవి. పురాతన భారత ప్రాభవము, నేటి దౌర్భాగ్యస్థితి కన్నుల గట్టినది. భవిష్యత్తు వారికి ద్యోతకమైనది. వారాయనలో నొక స్వాతంత్ర్య సమరయోధుని మహానాయకుని దర్శించినారు. ఆత్మవిశ్వాసము గల యామహాత్ముని పిలుపునకు నిలువెల్ల జలించి సమస్తమును ధారవోసి నడపిన బాటను నడువ నిశ్చయించినారు.

అమెరికా స్వాతంత్ర్య నేత జార్జి వాషింగ్టనుకు బ్రత్యేక సేన యున్నది. ఇటలీ స్వేచ్ఛా ప్రదాత గారిబాల్డీకి సమర శిక్షణ పొందిన సేవాదళమున్నది. భారతమునకు జాతీయ విముక్తి సైన్యము లేదన్న కొరత యొకటి పూర్వము నేతాజీని బాధపెట్టుచుండెడిది. కెప్టెన్ మోహన్ సింగు కృషి ఫలితముగ నాయనకది యప్రయత్నపూర్వకముగ లభించినది.

25 ఆగష్టు 1943న నేతాజీ భారత జాతీయ సైన్యమునకు సర్వసైన్యాధ్యక్ష పదవిని స్వీకరించినాడు. సైన్యముల నిట్లుద్బోధించినాడు:

"భారత విముక్తి సేనకు నాయకత్వ పదవిని స్వీకరించుట కన్నా భారతీయుడై పుట్టినందుకు సార్థకత యేమున్నది? ఇది నాకు మహదానంద కారణము! గర్వకారణము!!"

"ఎత్తుకొన్నది మహత్తర కార్యభారమని నేనెరుగుదును. ఎట్టి విషమ స్థితిలోనైనా నా భారతీయులకై కర్తవ్యపాలనమున నావశ్యమగు శక్తిని బ్రసాదింపవలసినదని భగవంతుని వేడుకొనుచున్నాను. భారతీయ నాయకత్వమున నీ సేన నిర్మితమైనందుకు బ్రతి భారతీయ హృదయమును గర్వింప వలసినదే.

"ఛలో ఢిల్లీ" మీ యుద్ధ నినాదము. మనలో నెందరీ స్వేచ్ఛా సమరమును గడచి జీవింతురో నేనెరుగును. కాని యంతిమ విజయము మనదేయని నే నెరుగుదును. మనలో మిగిలిన వీరులు బ్రిటిష్ సామ్రాజ్య శ్మశాన వాటిక యగు 'ఎర్రకోట'లో విజయ ప్రదర్శనములు జరిపిన నాడుగాని మన కార్యభారము తీరదు."

"మీరు భారత జాతీయ గౌరవమునకు గార్యకర్తలు. మీరే మూర్తీభవించిన భారతీయాశయములు: ఏ సైన్యమునకు మాతృదేశముపై నచంచల భక్తి విశ్వాసములో,

సర్వకాల సర్వావస్థలయందే సైన్యము కర్తవ్యమును నిర్వర్తిం చునో, యే సైనికులు నిరంతము ప్రాణత్యాగ మొనర్ప సంసిద్ధులో వారజేయులు. ఈ యాదర్శ త్రయమును మీ హృదయ కోశముల లిఖించుకొనుడు.”

నేతాజీ దృక్పథము సమస్తము వారి కవగతమైనది. వారి హృదయమును నాత డొడుచుకొనినాడు. భక్తి ప్రేమతో దమ సర్వస్వమును వారాయన కర్పించినారు.

సైనికుల భోగట్టాలు సిద్ధమైనవి. సైన్య విభాగములు జరిగినవి. సేనా నాయకులు ఏర్పాటైనారు. వారికి నేతాజీ శిక్షణ శిబిరముల నేర్పాటు చేయించినాడు వారిని దేశ సేవాతత్పరులుగను, స్వార్థ రహితులుగను, త్యాగమూర్తులుగను దీర్చిదిద్దినాడు. వారిలో జాతి, మత, ప్రాంతీయ వైషమ్యాలు లేవు. శిక్షణము నవ్య భారతమున కనుగుణము.

“స్వయముగ నేను భారత జాతీయ సైన్యమున జేరినాను. భారత దాస్యవిముక్తికి నా జీవితము నంకిత మొనర్చు చున్నాను. నా సర్వస్వము నొడ్డి మాతృదేశమునకై పోరాడుదును. ఈ సేవలో నేనెట్టి స్వార్థము నాశించను. సమస్త భారతీయులు నాకు సోదరులు, సోదరీమణులు – నా దృష్టిలో మత, భాషా రాష్ట్ర విభేదములు లేవు”

అని ప్రతి సైనికుని యొద్దనుండి ప్రమాణమును గైకొని నేతాజీ సైనికులను సంసిద్ధులు కండని యనుజ్ఞ మిచ్చినాడు.

ప్రపంచమునకింతకు బూర్వమే ఆజాద్ హింద్ ఫౌజును గురించి యాకాశవాణీ ముఖమున 5 జులై 1943న నేతాజీ ఎఱుకపరిచినాడు.

బ్రిటిష్ వారితో యుద్ధమును బ్రకటించుటటయన్న సామాన్యము కాదు. అంతర్జాతీయములగు ననేక విషయముల బరిశీలించిన గాని యొప్పదు. కేవల సైన్యము చాలదు. ప్రత్యేక ప్రభుత్వము కావలెను. అందుకై నేతాజీ యొనర్చిన కృషి ఫలించినది.

21 అక్టోబరు 1943 నాడు తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వోత్సవమును వైభవోపేతముగ సింగపూర్‌లో జరిపించిదానికి నధ్యక్ష పదవిని నేతాజీ స్వీకరించినాడు.

“తుది నిశ్వాస ముందువరకును భారతదేశమును, ముప్పది యెనిమిది కోట్ల భారతీయులను దాస్యవిముక్తుల నొనర్ప సుభాస్ చంద్రబోసు అను నేను పవిత్ర యుద్ధము కొనసాగింతునని పరిపూరిత ప్రమాణమును పరమేశ్వరు సాక్షిగ స్వీకరించుచున్నాను. నిరంతరమును భారతీయ సేవకుడనై భారత సోదర సోదరీమణుల సౌభాగ్యమునకే శ్రమింతును. ఇది నా పవిత్ర కర్తవ్యము. స్వేచ్ఛా సంపాదనా నంతరము దానిని సుస్థిరము గావింప నా శరీరములోని తుది రక్త బిందువువర కొలికింతును”

– ఇది బోసుబాబు గైకొనిన ప్రమాణము.

తదుపరి తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు నేతాజీ యెడ సంపూర్ణ విశ్వాసమును బ్రకటించుచు నుపన్యసించి యాయన యడుగుజాడల నడుతుమని ప్రతిన జేసినారు. నేతాజీ యొక దీర్ఘ ప్రకటన జేసినాడు. అందు 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర స్మృతమైనది. సురాజుద్దౌలా, హైదరాలీ, టిప్పుసుల్తాన్, వేలుతంబి, అప్పాసాహెబ్, బాజీరావు, లక్ష్మీబాయి, తాతియా తోపీ, కుంవరసింగ్, నానాసాహెబుల వంటి విప్లవవీరుల పవిత్ర నామములు అంకితములైనవి. కాంగ్రెస్ జన్మమాదిగ స్వేచ్ఛా సంపాదనకై కావించిన వివిధ యత్నముల నాయన పేర్కొనినాడు.

"దొంగ తనములతో, దోపిడీలతో, క్షామములతో, మోసములతో, మృత్యు వులతో, దేశీయుల హతాశుల గావించి సుహృద్భావమును కోల్పోయి, బ్రిటిష్ ప్రభుత్వము భారతదేశమున నేడు మహోపద్రవమున నున్నది. ఈ దుర్బల ప్రభుత్వ చరమ చిహ్నమును రూపుమాపుట కొక యగ్నిజ్వాల చాలును. భారత విముక్తి సైన్యము తలపెట్టిన మహత్తర కార్యమిదియే!

"స్వాతంత్ర్యమునకు ఉషస్సనదగు నీనాడు తాత్కాలిక ప్రభుత్వము నేర్పాటు జేసుకొని యా ప్రభుత్వపు పతాకచ్ఛాయలలో తుది సమరము సాగించుట భారతీయుల కర్తవ్యము, మహానాయకులందరును స్వదేశమున కారాగారములలో నున్నారు. ప్రజలా నిరాయుధులు. అందువలన నట్టి ప్రభుత్వమును భారతమున నెలకొల్పుటకు గాని, దాని నిర్వహణమున స్వాత్రంత్య సమరమును సాగించుటకు గాని యవకాశము లేదు. అందువలన భారతీయులకు తూర్పు ఆసియాలోని భారతీయ సోదరుల తోడ్పాటుతో 'ఆజాద్ హింద్' తాత్కాలిక ప్రభుత్వమును స్థాపించి, తామే నిర్మించుకొనిన ఆజాద్ హింద్ ఫౌజు సహాయమున చరమ స్వాతంత్ర్య సమరమును సాగించుట కర్తవ్యము.

"ఈ తాత్కాలిక ప్రభుత్వము ప్రతి భారతీయుని భక్తి భావముపైనను సర్వాధికారి. ప్రతి పౌరునికీ ప్రభుత్వము సమాన ప్రాతినిధ్యమును, మత స్వాతంత్ర్యమును వాగ్దాన మొనర్చు చున్నది. దేశమందలి సమస్త ప్రాంత ములను శాంతి సౌఖ్య సౌభాగ్యముల వృద్ధి పొందించుట, కుతంత్రములతో విదేశీయ ప్రభుత్వము సృష్టించి పెంచిన వైమనస్యముల రూపుమాపుట కీ ప్రభుత్వము తీర్మానించినది.

"పరమేశ్వర నామ ముచ్చరించి, వెనుకటి తరముల భారతీయుల నేకజాతిగ మలచిన మహాదేశ భక్తుల నామముల నుచ్చరించి, భారతీయ సంస్కృతికై త్యాగముల

నొనర్చి మరణించిన మహావీరుల నామముచ్చరించి, యీ ప్రభుత్వపు జెండానీడల నిలచి పోరాడవలసినదని భారతీయ మహాప్రజను నేను పిలుచుచున్నాను”

చారిత్రాత్మకమగు నీ పత్రికపై నేతాజీ తాత్కాలిక ప్రభుత్వ సభ్యుల స్వహస్తముల వ్రాలు జేయించినాడు. ఆయన ప్రభుత్వమును ప్రపంచములోని యనేక ప్రభుత్వము లంగీకరించినవి. జపాను ప్రభుత్వము యుద్ధ సమయమున బ్రిటిష్ వారినుండి కైవస మొనర్చుకొనిన అండమాను, నికోబార్ ద్వీపముల నేతాజీ పరమొనర్చినది. ఈ ద్వీపములలో విప్లవ వీరుల నందర బ్రిటిష్‌వారు బంధించి బాధలు పెట్టుచువచ్చిరి. ఆ ద్వీపములు నేతాజీకి వచ్చుట వలన తాత్కాలిక ప్రభుత్వమునకు స్థానము చిక్కినది. అవి నేడు స్వరాజ్య దీవులు! నేతాజీ దీవులు!!

నేతాజీ సింగపూరు వచ్చిన తరువాత కొలది కాలమునకు మహోపన్యాసము లొనర్చినాడు. తూర్పు ఆసియా రాజ్యములలోని స్వాతంత్ర్య పిపాసను నాశాసించుచు, ఘన ఘర్జన లొనర్చినాడు. ‘నాకు మూడు కోట్ల డాలర్లు కావలెను. మీ సమస్తము నాకిండు. ‘ఫకీరులు’ కండు, మీకు నేను స్వాతంత్ర్య మిత్తునన్న గర్జన ఫలించినది. ధనరాసులు తండోప తండములుగ వచ్చి పడినవి. ఏప్రియలు 1944లో నేతాజీ ఆజాద్ హిందూ బ్యాంకి’ని స్థాపించి నాడు. సైన్యముల కాహారాది పదార్థముల సేకరించి వ్యవహరించుటకు ‘సరఫరా సంఘము’ నొక దాని నేర్పాటు చేసినాడు. జాతీయ సేన లాక్రమించిన ప్రదేశములలో శాంతి స్థాపన మొనర్చి పాలించుటకు ‘ఆజాద్ హింద్ దళము’ను నిర్మించినాడు దానికి క్రమశిక్షణ మిప్పించినాడు.

ఒకానొక ప్రసంగమున నేతాజీ ‘ప్రథమ స్వాతంత్ర్య యుద్ధములో వీరఝాన్సీ పట్టిన ఖడ్గమును ధరించి మృత్యువును దిరస్కరింపగల భారత నారీమణుల శాఖ యొకటి నాకు గావలె’ నని కోరినాడు. మహిళల నుద్దేశించి గంభీరముగ నొనర్చిన ప్రసంగములలోని కొన్ని వాక్యము లివి:

“ఆయుధముల ధరించి యుద్ధభూమిని బ్రవేశించుట స్త్రీ స్వభావము కాదని యెవరైనా భావించు చున్నారా? మన పూర్వ చరిత్ర నొకమారు దిలకింపుడు. అశ్వమధిరోహించి, వీర పురుషోచిత వేషము ధరించి సైన్యముల కగ్రేసరియై ఝాన్సీ రాణి వానిని నడిపింపలేదా? మన దురదృష్టమున నామె పతనమైనది ఆనాటి భారతమే పతనమైనది. 1857లో నామె యారంభించిన కృత్యమునే నేడు మనము సాగింప వలసి యున్నది. ఈ కడసారి కదనమున నొక ఝాన్సీరాణి చాలదు. వేనవేలు కావలెను.

మీరు ధరించి పోరాడు నాయుధములు నాకు ముఖ్యములు గావు, మీ పోరాటమే నాకు నైతిక బలము”

తూర్పు ఆసియా భారత మహిళామణులు ‘శిలలు ద్రవింప’ పలుక నేర్చిన నేతాజీ కేక వినినారు. స్వచ్ఛంద సేనలలో బ్రవేశించి శిక్షితులై యుద్ధరంగమున శత్రువు నెదుర్కొన బ్రతిన జేసినారు. నేతాజీ 22 అక్టోబరు 1943న సింగపూరులో వారికొక ప్రత్యేక శిక్షణ శిబిరమేర్పాటు జేయించినాడు.

భావి భారత పౌరులగు బాల బాలికలన్న నాయన కభిమానము విశేషము. వారికి స్థానిక స్వాతంత్ర్య సంఘముల పర్యవేక్షణలో సైనికోద్యోగులచే శిక్షణ మిప్పించినాడు. స్వాతంత్ర్య సమరమున ‘మీరును యుద్ధమొనర్తు’రని నేతాజీ వారి కుత్సాహము గల్పింప బలికినపుడు వారు పొందిన యానందమునకు మేరలేదు. వారిలో ననేకులు ‘ఆత్మహత్యా దళము (జన్ బజ్)’లో జేరినారు.

ఒకమారు ‘బాలసేన’ మేము ‘ఆజాద్ హింద్ ఫౌజ్‌లము కామా? నేతాజీ!’ యని ప్రశ్నింప నేతాజీ “కాదనియన్న వారెవరు? వారితో రణరంగమున మేమే ముందు ప్రవేశింతుమని పలుకు” దని ప్రోత్సహింప, వారు పొందిన యుత్సాహమును చూచి నేతాజీ కనులవెంట నానంద బాష్పము లొలికించి నాడు. ‘భారతమిక స్వతంత్రము కాకెట్లుండు’నని తలపోసినాడు.

24,25 అక్టోబరు 1943 రాత్రి నేతాజీ తాత్కాలిక ప్రభుత్వము బ్రిటను, అమెరికాలపై యుద్ధమును బ్రకటించినది.

యుద్ధ ప్రకటనానంతర మరుక్షణముననే నేతాజీ మహాత్మాగాంధీజీ నుద్దేశించి ‘ఆకాశవాణి’లో

“జాతిపితా! మాతృదేశ స్వాతంత్ర్యమునకై మేమీ మహాయత్నమునకు బూనుకొనినాము. ఇట్టి స్థితిలో మమ్మాశీర్వదించి నడిపింపు” మని వేడుకొనినాడు.

ఆయనకు నెహ్రూ, ఆజాద్ వంటి నాయకులపై గౌరవము మెండు. కొన్ని దళములకు వారి నామములుంచి వ్యవహరించినాడు.

‘ఛలో ఢిల్లీ!’ వీరనినాదములతో ఆజాద్ హింద్ ఫౌజు పురోగమన మారంభించినది. ప్రారంభవేళ సర్వసైన్యాధ్యక్షుడు నేతాజీ ఢిల్లీ యున్న దిశకు జూపించుచు–

“అదుగో ఆ దూరమున, ఆ నది వెనుక అరణ్యముల కావల, ఆ పర్వత శ్రేణి కవతల, అదే మన పుణ్యభూమి! ఏ చల్లని తల్లి గర్భమున మనము జన్మించినామో ఆ స్వర్గసీమ అదియే! మనము చేరుకొననున్న చిన్మయ భూమి!!

“వినుడు! భారతము పిలుచున్నది. వినుడు!! మేల్కొనుడు!! అవసరమగుచో దేశమునకై తనువు లర్పించి త్యాగధనులమై మనము ప్రాణము విడనాడుదము. మన కడసారి నిద్రలో మన సేనలను ఢిల్లీకి గొనిపోవు రాచబాటను ముద్దిడుకొందుము. ఢిల్లీ మార్గమే స్వతంత్ర మార్గము – ఛలో ఢిల్లీ” యని యుద్రిక్త మానసుల గావించి ముందుకు సాగిపోనాజ్ఞాపించినాడు.

స్వాతంత్ర్య విదాహముతో మరుమరీచికల జూచి భ్రమపడి పరువెత్తు భయంకర ప్రాణికోటివలె సైన్యము పర్వులెత్తుచున్నది. పరవశత్వమున నేతాజీ కన్నుల నానంద బాష్ప స్రవంతు లొలికినవి.

ఇంఫాల్ ప్రథమ రంగస్థలము. అత్యున్నత ప్రదేశములు, అగాధమగు లోయలు, కారడవులు అవేవియు ఆజాద్ హింద్ సైన్యము నాపలేకపోయినవి. గ్రీష్మమున రగుల్కొనిన కార్చిచ్చువలె గ్రమ్ముకొని వ్యాపించుచు నవి నడచు చున్నవి. కోహీమా, తమూ, మణిపూర్, కలదన్ లోయ, ఆ క్యాబ్ వరకు సైన్యములు ప్రాకినవి.

మేజర్ జనరల్ కియానీ నాయకత్వమున కొంతసేన శత్రువుల వెన్నాడు చున్నది. ఒక్కొక్క స్థానమును వదలి శత్రువులు కాలికి బుద్ధి చెప్పుచున్నారు. అజ్మీర్ సింగు కోహీమాను బట్టుకొనినాడు. కలదన్ లోయలలో మేజర్ లాటూరి పశ్చిమాఫ్రికా సేనలను దరిమికొట్టి చిట్టగాంగుపై బడినాడు. మేజర్ మిశ్ర ఆక్యాబ్ రంగమున శత్రువుల తంతిమార్గము భగ్నమొనర్చినాడు.

ప్రధానసేన ఇంఫాల్ మైదానములో బ్రవేశించి శత్రువుల తిరోగమింప జేసినది. సుబాసు దళముతో కర్నల్ షా నవాజ్ మణిపుర మార్గమున శరవేగముతో పయనించు చున్నాడు. కియానీ గాంధీదళముతో ఇంఫాల్ దుర్గ ప్రధాన కవాటముల దుత్తునియుల జేసినాడు. తమ మార్గమున శత్రువుల కందకముల చెల్లాచెదరొనర్చిన లెఫ్టినెంటు కర్నల్ ప్రీతమసింగుకు పాలేల్ వశమైనది. కర్నలు గుల్జారా సింగు ఆజాద్ సేనతో పశ్చిమ దిశను శత్రువుల రక్షణ శిబిరములపై బడినాడు. నెహ్రూ దళము కర్నలు అజీజ్ నాయకత్వమున విశ్రాంతి సైన్యముగ వెనుక వచ్చుచున్నది.

శత్రువుల ముఖ్య స్థానములలో జొచ్చికొని పోయి, బహదూర్ శాఖలు, ఆత్మహత్యాదళములు నత్యావశ్యకములైన వార్తలు దెచ్చుచున్నవి.

స్వేచ్ఛను ప్రసాదించిన గ్రామములలో శాంతిస్థాపన మొనర్చి క్రమపాలనమును నెలకొల్ప మేజరు జనరల్ ఛటర్జీ వెనువెంట వచ్చుచున్నాడు.

కర్నలు మాలిక్ జాతీయ పతాకారోహణ మొనర్చుచు విజ్ఞాన శాఖను నడుపుచున్నాడు.

ఇంఫాలు నగరము కనుచూపు మేరలో నున్నది. అది శత్రువుల ప్రధాన స్థానము, అటనుండి వారు నేతాజీ సేన నెదుర్కొనుచున్నారు. వారి 14వ సైన్యము జాతీయ సైన్యధాటి కాగలేక రూపుమాసి పోవుచున్నది. శత్రువులు రక్షణ వ్యూహమును చక్రాకృతిగ నిర్మించుకొనినారు. ముందు టాంకులు, తరువాత ఫిరంగులు. ఆ వెనుక సేనయు నున్నది. వాయు విమానములపై నూతన సైన్యములు వచ్చి వారిని జేరుకొనుచున్నవి. కాని యేమి ప్రయో జనము? వారికి నైతిక బలము లేదు.

అయినను తప్పనిసరిగ ముందుకు సాగివచ్చినారు.

12 ఫిబ్రవరి 1944న సేనానాయకుడు షా నవాజ్ ఉత్తర బాల్మాలోని జపాను సైన్యాధ్యక్షునితో సంప్రదించినపుడాతడు జాతీయ సైన్యమునకు గావలసిన వాయు విమానములు, నాహార పదార్థముల నిత్తునని వాగ్దానము చేసినాడు. వాయు విమానములు రాలేదు. తినుటకు తిండియైన లేదు. కందమూలముల తినుచు మహారణ్యములలో నేతాజీ వీరులు నాయకుని యెడ నచంచల భక్తి విశ్వాసములతో ధైర్య సాహసములతో భయంకర యుద్ధములు గావించినారు.

శత్రువు నెదుర్కొనలేక జపనీయులే పారిపోవుచున్నారు. ఆకలిబాధల కోర్వలేక ఆజాద్ హిందు సేనలో ననేకు లాత్మహత్య జేసికొనినారు.

ఇట్టి క్లిష్టస్థితిలో ద్రోహులు కొందరు శత్రు పక్షముతో సంధి జేసికొని వారి కత్యావశ్యకములైన సమాచారము లందజేసినారు. దైవమును దాత్కాలికముగ వారి కనుకూలించినది – కుంభవృష్టులు కురిసినవి.

స్థితిగతుల నవగత మొనర్చుకొని నేతాజీ తిరోగమింప సేనల నాజ్ఞాపించి నాడు. ఇందాతని యుద్ధవిశారదత్వ మంతయును వెల్లడియైనది.

తిరోగమనమున సేనలపారనష్టముల పాలైనవి. మనోవేగమున మాండలే, మైమ్యోల వరకు జేరినవారికి మాత్రము విశ్రాంతి జేకూరినది. మిగిలినవారు శత్రువులకు జిక్కుటో, యాత్మహత్య గావించుకొనుటో జరిగినది.

21 ఆగష్టు 1944న తిరోగమనమున కనుజ్ఞ నొసగినాడు. ఈ తిరోగమనము తాత్కాలికము. నేతాజీ ధైర్య మణుమాత్రము క్షీణించలేదు. తిరోగమన మొనర్చి తిరిగివచ్చిన సైనికులతో నిట్లు పలికి వారికి సంతోష మొనగూర్చినాడు:

"భారత స్వేచ్ఛా సమరమును భారత భూమిలో బ్రవేశించి సాగించినాము. అనేక కష్టములకు లోనై మనసేన పోరాడినది. సన్నాహ మణుమాత్రమే లేక కేవల నైతిక బలముతో బోరాడిన మనల నెదుర్కొన శక్తిమంతము, సర్వ సంపన్నము నైన బ్రిటిష్ సైన్యము లెంత గిజగిజ లాడినవి. మన యుద్యోగుల, సైనికుల వీరకృత్యములు జగద్వినుతికి బాత్రములైనవి."

ఇట్టి సంతృప్తికర వాక్యముల పలుకుట మహానాయక లక్షణములు!

తిరోగమించిన సైన్యముతో నేతాజీ మాసముదినములు గడిపి వారికి గలిగిన క్షతములను సమస్తమును మాంత్రికునివలె మటుమాయ మొనర్చి నాడు. వైద్యశాలలన్నియు రోగులతో నిండియున్నవి. నానారకములైన రుగ్మతలతో సైన్యము బాధ పడుచున్నది.

ఝూన్సీ దళములోని వీరవనితలు వారి కుపచారము లొనర్చి తేర్చుచున్నారు. వారిపై శత్రు విమానములు దాడులు చేయుచున్నవి. బ్రాణముల దక్కించుకొనుటకు వారు ప్రయత్నించుచున్నారు.

ఇది బ్రతుకుపై నాశవలన గాదు మాతృదేశ సేవా పరత్వమున!

వరద లాగినవి. బ్రిటిష్‌వారి 14వ సేన ముందుకు సాగి వచ్చుచున్నది. నేతాజీ తిరోగమించి వచ్చిన సైన్యమును మార్చి రంగమున నూతన సైన్యమును జేర్చినాడు. గడచిన యుద్ధముల వలన కొన్ని యనుభవములు కలిగినవి. ఆజాద్ హింద్ ఫౌజ్ యుద్ధము పర్యవేక్షింప 26 అక్టోబరు 1944న యుద్ధ సమితి నొకదానిని నేర్పాటు జేసినాడు. సైన్యములకు గావలసిన యాహార పదార్థముల సకాలమున కందింపవలసిన బాధ్యత వారిపై బెట్టినాడు. యుద్ధభూముల బ్రవేశించుటకు ముందు వీరితో నిట్లు ప్రసంగించినాడు:

"భవిష్యత్తును గురించి యొక రమ్య రూపమును బ్రదర్శింప దలపలేదు. శత్రువు సమస్త సన్నాహములతో మనపై బడ సంసిద్ధుడైనాడు. మనమును సన్నాహముల జేకూర్చు కొనుచున్నాము.

“ఇండియా రక్షణమునకు శత్రువులు అస్సాములో యుద్ధమొనర్ప నిశ్చయించి నట్లున్నారు. వానిని భారతదేశమునన స్టాలిన్ గ్రాడ్ నగరము గావించినట్లున్నది. ఈ సంవత్సరమున ప్రపంచ యుద్ధ ఫలితమే నిర్ణీతము కానున్నది. ఇంఫాల్ కొండలందును, చిట్టగాంగు మైదానములలోను మన భారతీయ స్వాతంత్ర్య జాతకము తేలిపోగలదు.

“ఛలో ఢిల్లీ’తో బాటు రక్తము మరింత ‘రక్తము’ – అను మరియొక యుద్ధ నినాదము చేర్చినాము. భారతదేశ స్వేచ్ఛకై మనము రక్త మొలికింతుము. శత్రురక్తము నొలికింతుము.

“రాబోవు నూతన స్వేచ్ఛా యుద్ధ ఘట్టమున పూర్వ మీ సమర యాత్రలో మృతినొందిన మహావీరుల పవిత్రాత్మలు మనల నావహించి వీరోచిత కృత్యముల నొనరింప నుద్బోధించుగాక”

నేతాజీ సైన్యములకు యుద్ధారంభ మొనర్ప మరల 1945 మార్చి ప్రథమ వారమున ననుజ్ఞ నొసగినాడు.

1945 ఆరంభమున విజయ గర్వముతో అమెరికా సేనలు ముందుకు సాగివచ్చుచున్నవి. పురోగమించుటకంటె నేటి స్థితిలో ఆజాద్ హింద్ ఫౌజ్ కర్తవ్యము స్వరక్షణమని నేతాజీ గమనించినాడు. ఇంఫాల్ రంగమున దీవ్రతరముగ బోరాడిన సైన్యమును వెనుకకంపి నూతన సైన్యమును ముందునకు దరలించినాడు.

గత వత్సర యుద్ధమునందు జాతీయ సైనికులు, దేశ భక్తియుతులై, వీరాధి వీరులవలె పోరాడిరి. కాని కొందఱి దేశద్రోహము, పందతనము వలన నష్టము ప్రాప్తించినది.

అట్టి యవకాశములు ముందెన్నడును గలుగకుండుటకు నేతాజీ జాగరూకత వహించినాడు. కాని సైన్యమున దేశ ద్రోహ బీజములు పొడకట్టుచునే యున్నవి. అట్టివారిని శిక్షింప నుద్యోగుల కనుజ్ఞ నొసగినాడు. సైన్యములో నున్న పందతనము బాప నాటకము లాడించినాడు మహమ్మద్ బక్ష్, రైయద్, మదనుల వంటి దేశద్రోహుల విగ్రహముల జేయించి యవ మానముతో నూరేగింప జేసినాడు. పూర్వవీరుల శౌర్య పరాక్రమములను బ్రశంసించుచు నుపన్యాసము లిప్పించినాడు. యుద్ధారంభ దశలో షానవాజ్ ఖాను సైన్యము నుద్దేశించి యిట్లు పలికినాడు:

“ఇందు ముఖ్యులైన సైనికులు నుద్యోగులు నున్నారు. యుద్ధమన్న కష్టపరంపరలతో, మృత్యువుతో గూడినది. దానికెవరైనా వెఱచువారున్న నిప్పుడే

నిలచిపొండు. మనము సాగింప బోవునది స్వేచ్ఛాసమరము. ఇందు పందలకు తావులేదు. భారతము స్వతంత్రమైన వెనుక నేడు మనకు సాయ మొనర్చుచున్న జపనీయులు మనల లొంగదీయ యత్నించినచో వారితో గూడ మనము సమర మొనర్పవలసినదే! మనము జపనీయుల కేవిధముగ ననుచరులము కాము”

1945 మార్చి మూడవ వారము నెహ్రూసేన బ్రిటిష్ వారి 19వ సేనతో దలపడి స్వతంత్రముగ న్యాంగు, వాగను నదీముఖముల ఘోర సమర మొనర్చుచున్నది. షానవాజ్ నాయకత్వమున గొంతసేన ‘పోపా’ ప్రాంతమున పోరాడుచున్నది. ఫిరంగులు లేవు. వాయు విమానములు లేవు. నెల దినములు సైన్యము ‘పోపా’ను రక్షించుకొనినది.

ఆజాద్ హింద్ ఫౌజు బ్రిటన్ సేనల పురోగమనమును గొంతకాల మాపగిలిగినది. కాని యది కేవల నైతిక బలముతో బోరాడ లేకున్నది. ఇంతలో బర్మా జాతీయ సైన్యము లొంగిపోయినది. జపాను బలములు యుద్ధ రంగమును బరిత్యజించి యేనాడో పారిపోవ నారంభించినవి.

నేతాజీ సైన్యమొంటిగ మహత్తర శత్రు సైన్యము నెదుర్కొని పోరాడవలసి వచ్చినది. ‘నేతాజీకీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, ఆజాద్ హిందూస్తాన్ – జిందాబాద్, చలో ఢిల్లీ’ నినాదములు శత్రువులు కురిపించిన యగ్ని వర్షములపై నాకసమున ప్రతిధ్వనించుచున్నవి.

యుద్ధముల వ్యక్తిగతములైన వీరోచిత కృత్యములనేకములు. ముష్టి యుద్ధములలో రామసింగ్, గ్యానీసింగుల వంటి వీరాధివీరుల పోరాటముల జూచి శత్రువులు భయకంపితులైనారు. వారు నేతాజీ యాదర్శముల కనుగుణముగ పోరాడినారు. సాహసమే గాని సాధన సంపత్తి లేదు. ఎంత కాలము యుద్ధమును సాగింపగలరు?

మోల్‌మీన్ వరకు తిరోగమింప వలసినదని నేతాజీ సేనల కాజ్ఞ నొసగినాడు. సైన్యమును శత్రుపక్షమునుండి పెగూ యోమో సైన్యములు చుట్టు ముట్టుచున్నారు. మే 13 తేదీన షానవాజ్ సైన్యము చక్రవ్యూహమున జిక్కుకొనినది. ఆనాడతని సైన్యములో నలుబది తొమ్మిది మంది మాత్రమున్నారు. వారికతడు తమస్థితిని విశదీకరించినాడు. కాని వారు లొంగిపోవుట కిష్టపడలేదు? పోరాడుచున్నారు.

జనరల్ స్లిమ్ నాయకత్వమున బ్రిటిష్ శత్రుసైన్యములు వర్షాకాల జలదములవలె గ్రమ్ముకొని వచ్చుచున్నవి. ఒక యరణ్యమునుండి మరియొక యరణ్యమునకు ఆజాద్ హింద్ ఫౌజు నవి వెంటబడి తరుముచున్నవి. అంతలో మైటికినా పడిపోయినది.

జపానువారు రంగూను వదలిపెట్టినారు. నేతాజీ "తుదిప్రాణి యున్నంత వరకును రక్షించి తీరవలె" నని యాజ్ఞాపించినాడు.

యుద్ధమంత్రుల కోరికపై నేతాజీ రంగూను నగరమును వదలిపెట్టివలసి వచ్చినది. అట్టిస్థితిలో నారువేల జాతీయ సైన్యమును నగర ప్రజల రక్షణార్థము నియమించి నేతాజీ వెడలినాడు. ఆయన వెంట నమ్మిన సేన, రెండువేల బలముతో, బాంకాక్ వఱకనుసరించినది. స్వరాజ్య దీవుల హై కమీషనరు జనరల్ లోకనాథము 'బర్మా రంగములోని జాతీయ సైన్యమును, భారతీయ సైన్యమును, భారతీయ ప్రజలను గాపాడెద'నని నేతాజీకి వాగ్దానము చేసినాడు.

సింగపూరుకు వెడలుచు 24 ఏప్రియలు 1944న నేతాజీ సైన్యమున కీప్రత్యేకాదేశ మిచ్చినాడు:

"వీరోద్యోగులారా! సైనికులారా!! భరింపరాని హృదయ భారముతో నేను బర్మానుండి వెడలిపోవుచున్నాను. 1944 ఫిబ్రవరినుండి స్వాతంత్ర్య సమరము సాగించినాము. ఇంఫాల్ బర్మారంగములలో మనకు విజయము చేకూరలేదు. ఇంక నిట్టి సమరము లెన్నియో సాగింపవలసి యున్నది.

"ఎట్టి విషమస్థితియందైన నేనపజయము, నంగీకరింపనేరని యాశావాదిని. ఇంఫాల్ మైదానము లందును, బర్మా రంగములోను, అరకాన్ అరణ్యములలోను శత్రువులతో పోరాడి మీరు నిరూపించిన వీరోచిత సాహస కృత్యములు చిరస్థాయిలుగ మన స్వాతంత్ర్య సమర చరిత్రలో సజీవములై నిలువ గలవు.

"సోదరులారా! ఈ క్లిష్టస్థితిలో నా యాదేశ మొకటి మాత్రమే. తాత్కాలికము మీరు లొంగవలసి వచ్చిన నా కృత్యమును వీరులవలె నొనర్పుడు. మీరు పొందిన యున్నత శిక్షణమున కనుగుణ్యముగ వ్యవహరింపుడు. మీ యనంత త్యాగము వలన భవిష్యద్భారతమున నిక బానిసలు జన్మింపరు. అట్టి స్వేచ్ఛామూర్తుల మహోదయమునకు గారకులు మీరని గర్వింపుడు!

"వారు మీ సమర చరిత్రను స్వర్ణాక్షరములతో లిఖించి లోకమున బ్రకటింతురు. విజయకీర్తికి వైచిన మీ రాచబాటలో మీ పదచిహ్నముల ననుసరించి పురోగమింతురు.

"భారతదేశ విముక్తియెడ నాకచంచల విశ్వాసము. అది యీనాడైన నణుమాత్రమును జలింపలేదు. మన జాతీయ త్రివర్ణ పతాకను, జాతిగౌరవమును, భారత వీరుల మహత్తర సంస్కృతిని మీ హస్తగత మొనర్చినాను. మీరు సర్వస్వమును

ధారవోసి భావియుగముల కాదర్శమూర్తులై వర్తింతురనుటలో నాకేమాత్రమును సందేహము లేదు."

"నా యిష్టానుసారముగ నైన మీతోనుండి తాత్కాలికమగు నపజయమున గలిగిన కష్టముల బాలు పంచుకొనువాడనే కాని నా మంత్రులు, నిత రున్నతోద్యోగులు బర్మాను వదలి స్వాతంత్ర్య సమరమును సాగింపవలసినదని కోరినారు. తూర్పు ఆసియాలో నున్న నాదేశీయు లెట్టి క్లిష్టస్థితిలో నైన సమరము సాగింతురు. వారు మీ ధైర్య సాహసముల, సత్త్వ, త్యాగముల మరచిపోరు."

"21 అక్టోబరు 1943న నే గైకొనిన ప్రమాణము నెన్నడును విస్మరింపను. ముప్పది యెనిమిది కోట్ల భారతీయుల క్షేమ సౌభాగ్యములకే నేను యత్నింతును. ఈ యాశతోనే మీరును బ్రవర్తింపుడు. ఉషస్సునకు ముందెన్నడును నంధకారమే కనుపించును – జైహింద్"

నేతాజీ యా దేశము ననుసరించి జాతీయ సేన బోరాడుచున్నది మరొక మాసము కాలము శత్రువుల పురోగమన మాపగలిగినది. అందున్నవారు శారీరకముగ యుద్ధమునకు నిరుపయోగులు, రోగగ్రస్తులు.

నలుబది యైదుగురు సేనతో కర్నలు మెహరు దాసు, షానవాజ్ ఖానులు, మరి యితరోద్యోగులు తుముల యుద్ధములు సాగించినారు. కర్నలు ధాకూరు సంగు 'యక్సు పటాలము' నేతాజీని బాంకాకు వరకు జేర్చినది. దీనిని శత్రువులే మెచ్చుకొనినారు.

కెప్టెన్ లక్ష్మి నాయకత్వమున ఝాన్సీ దళము మోల్‌మీన్ యొద్ద శత్రుసేనలతో దలపడి విశేష నష్టము లేకుండ దిరోగమించినది. తుట్టతుదకు 16 మే 1945న సమస్త సైన్యములును శత్రువులకు లొంగిపోయినవి.

నేతాజీ అంగరక్షక సైన్యము మాత్రము వారికి లొంగలేదు. 9 ఆగష్టున జపనీయులు లొంగిపోయినారు. "జపనీయులు లొంగినారు, మేము లొంగ" మని నినాదములతో జాతీయ సైనికులు బాంకాకున గగ్గోలొనర్చుచున్నారు.

17 ఆగష్టున నేతాజీ బాంకాకు వచ్చి వారిని చూచినాడు. వారి యుత్సాహ నినాదములను విన్న తరువాత "మీరు లొంగిపొం"దని చెప్పుట కాయనకు మనస్కరింపలేదు. "నిజము మనము లొంగ"మని వారు చేయు నినాదములకు సమాధానము చెప్పి, తరువాత నెట్లైన వారిని బ్రిటిషువారికి లొంగిపోవునట్లు

చెప్పవలసినదని భోన్లే కాజ్ఞాపించి వెళ్ళిపోయినాడు. చౌల్పురి శిబిరములోని సైనికులు, ఒకటి రెండు (జనబజ్) ఆత్మహత్యాదళములు లొంగమని చెప్పివచ్చిన వారి ప్రాణముల హరింతుమని ప్రతిన గైకొనినారు. బ్రిటిష్ ఉద్యోగులు వారి శిబిరములలో బ్రవేశింపని షరతుతో తుట్టతుదకు వారు లొంగుటకంగీకరించిరి. వానికి కర్నలు శివదత్త సింగు ముఖమున బ్రిటిష్వా రంగీకరించిరి. కాని తరువాత అందులకు తప్పినారు.

6 ఆగష్టున 'హిరోషిమా' మీదను, 9 ఆగష్టున 'నాగసాకి' మీదను ఆటంబాంబులు ప్రయోగించి నందున కలిగిన ప్రమాదముచే సమస్తమును తారుమారైనది.

15 ఆగష్టు 1945న జపానువారు భేషరతుగ లొంగిపోయినారు.

అందువలన ఆజాద్ హింద ఫౌజుకును, తూర్పు ఆసియా రాజ్యములలోని భారతీయులకును బ్రమాదము సంభవించునట్లున్నది. ఆ సందర్భమున టోక్యో కేగి కొన్ని విషయముల నిర్ధారణ జేసుకొనుటకు పయనించుచుండ విమానము వ్యత్యస్తమగుటచే బోసుబాబు మరణించినాడని యాయన ననుసరించిన కర్నల్ హబిబుర్ రహమాన్ వలన తెలియుచున్నది. కొందఱా మహాపురుషుడు నేటికిని సజీవుడని విశ్వసించుచున్నారు.

స్వర్గము చేరినను, సజీవుడైనను నేతాజీ భారతజాతి బ్రతికియున్నంత వరకు సజీవుడు! అమరుడు!!

నేడు మన మనుభవించు స్వాతంత్ర్యమున కా మహాత్ముని యత్నము దోహద మిచ్చినది. మనము కృతజ్ఞతతో నా మహానాయకుని శిలా విగ్రహముల గ్రామ గ్రామముల స్థాపించి యచంచల భక్తిభావమున నాయగ్రగామికి జోహారు లర్పించుచున్నాము.

**–జైహింద్**

# కదంబము

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | త్యాగఫలము | 875 |
| 2. | అడవిరాజు | 881 |
| 3. | పరీక్ష | 886 |
| 4. | మిత్రద్రోహి | 891 |
| 5. | బుద్ధి బలము | 898 |
| 6. | దేశాభిమానము | 906 |

# తొలిపలుకు

ఏ దేశసౌభాగ్యమైనను నీతియుతులైన తన యందలి పౌరులపై నాధారపడు ననుట నిస్సంశయము. నేటి బాలబాలికలే భావి పౌరులు. వారిలో నీతిని కల్పించి పెంపొందించుటకు కథా సాహిత్యము కంటే మేలైన సాధనము లేదు. ప్రపంచమునందలి జాతులన్నియు నీ సాధనము మూలముననే తమ బాలబాలికలకు నీతిపై ననురాగము చేకూర్తురు.

ఆంధ్ర బాలబాలికల కత్యుత్తమ నీతులను జూపించి, ప్రబోధించు నుద్దేశముతో నీ “కదంబము” ను కూర్చితిని. ఇందలి కథలలో త్యాగము, భ్రాతృప్రేమ, అహింస, ధర్మబుద్ధి, దేశాభిమానము, ముఖ్య నీతులు. వీటిని పఠించిన విద్యార్థిలోకము విశేష ప్రయోజనములను తప్పక పొందగలరని నా విశ్వాసము.

**– రచయిత**

# 1. త్యాగఫలము

కశ్యప ప్రజాపతికి కద్రువ వినత అను ఇరువులు భార్యలు ఉండిరి. వారిలో వినత గరుత్మంతుని తల్లి, గరుత్మంతుడు మహాబలశాలి. తల్లి దాస్యమును పోగొట్టుటకు దేవతలకు రాజైన ఇంద్రునితో పోరాడి ఇతడు అమృతకుంభమును కొని వచ్చెను. ఇతనికి అన్న అనూరుడు. సూర్యుని రథమునకు సారథి. ఆ రథమునకు ఒకటే చక్రము. ఐనను అనూరుడు దానికి ఏడు గుఱ్ఱములను పూన్చి దినమునకు కొన్ని లక్షల యోజనములు నడుపును. వీరు ఇరువురు పక్షికులమునకు మూలపురుషులు.

ఈ వంశమున కొంతకాలమునకు జటాయువు సంపాతి అను ఇరువురు అను ఇరువురు బలశాలులు జన్మించిరి. వారు ఇద్దరును అన్నదమ్ములు, హిమపర్వత శిఖరములలో ఉన్న ఒక గుహలో వారు పుట్టిరి. ఇందు సంపాతి పెద్దవాడు, జటాయువు చిన్నవాడు.

సంపాతి జటాయువులకు ఒకరిపై మరి ఒకరికి గల ప్రేమ ఇంత అంత అనరాదు. క్షణకాలము ఐనను ఒకరిని విడిచి మరి ఒకరు ఉండలేరు. చిన్నతనము నుండియు వారు మంచుకొండ గుహలలో కలిసి నివసించుచుండిరి. ఆకాశమున కలసి ఆటలాడుచుండిరి. ఇరువురు తెచ్చిన ఆహారమును సమముగ పంచుకొని భుజించుచుండిరి. రూపమునందు ఇరువురకును ఎట్టి భేదము లేదు. సంపాతి ముఖమున తెల్లని మచ్చ మాత్రము ఉన్నది.

సంపాతి మంచి అనుభవశాలి. తొందరపాటు లేనివాడు. ఆలోచించి గాని ఏ పనికిని పూనుకొనడు. జటాయువు నందు ఉద్రేకము అధికము. ఏ వింత కనబడినను అక్కడికి వెళ్ళి అతడు చూచి రావలయును. హిమవత్పర్వత ప్రాంతమున ఎప్పుడు ఏవియో వింతలు కన్పట్టుచుండును. జటాయువు వానిని చూచుటకు బయలు దేరుచుండును. సంపాతి తమ్ముడు ఎక్కడ ఏ ప్రమాదము తెచ్చుకొనునో అను భయమున అతనిని అనుసరించుచుండును.

ఆనాడు సూర్యోదయము అతిసుందరముగ ఉండెను. జటాయువు అన్నకంటె ముందు నిద్ర మేల్కొనెను. ఆకాశము అరుణకాంతులతో ప్రకాశించుట అతడు చూచెను. అతనికి చెప్పరాని ఉత్సాహము కలిగినది. రెక్కలు తటతటలాడించి అన్నను మేల్కొల్పెను. సంపాతి కన్నులు తెరచి చూచునప్పటికే జటాయువు ఆకసమునకు ఎగిరెను. సంపాతి ఎప్పటివలె అతని వెంట పరుగెత్త మొదలిడెను.

"జటాయూ! సూర్యోదయమైన కాలేదు. మన ప్రయాణము ఎక్కడికి?" అని సంపాతి తమ్ముని ప్రశ్నించెను. "అన్నా! అటు చూడు. మన పెద్దతాతగారు అనూరులు ఎంతప్రేమతో మనను రమ్మని పిలుచుచున్నారో! త్వరగా రమ్ము! వారిని కలిసికొందుము" అని జటాయువు సమాధానము చెప్పుచు తన వేగమును హెచ్చించెను.

"వెఱ్ఱివాడా ! తాతగారిని కలిసికొనుటకా మన ఈ ప్రయాణము? నీవు చిన్నవాడవు ఏమియును తెలియదు. వారికిని మనకును ఎన్ని యోజనముల దూరము ఉన్నదో ఎరుగుదువా? మనము ఇంతకంటె వేగముగా పయనించినను వారిని సంవత్సరమునకు కలిసికొన జాలము. వెనుకకు తిరుగుము. మానస సరోవర ప్రాంతమున మనకు మంచి ఆహారము లభించును" అని సంపాతి తమ్మునితో అనెను.

జటాయువునకు ఆ మాటలు నచ్చలేదు. "అన్నా ! నీవు మహాబలశాలివి. కాని ప్రయోజనము ఏమున్నది? నీకు సాహసము లేదు. నీ శక్తిసామర్థ్యములు నాకున్న ఈ నాటికే సప్తలోకములను చూచి వచ్చెడివాడను. అన్నా! తాతగారు మనకు చాలా దగ్గరలో ఉన్నారు. కొంచెము వేగమును హెచ్చింపుము. వారిని కలసికొని ఆశీర్వచనమును పొంది వెంటనే వెనుదిరుగుదము" అని జటాయువు అన్నతో పలికెను.

"భయపెట్టినగాని తమ్ముడు వెనుదిరుగడు" అని సంపాతి తలపోసెను. "జటాయూ! నీ ఉత్సాహము నీదే కాని ముందువెనుకలు ఎరుగవు. మనము తాతగారికడకు వెడలుట అన ఏమో నీకు అర్థము అగుట లేదు. మిడుత నిప్పుపై ఉరుకుట. తెలిసినదా? మనము కొన్ని యోజనముల దూరమున ఉండగనే సూర్యుని శక్తి సోకి మన రెక్కలు కాలిపోవును. నా మాట వినుము. వెనుదిరుగుము" అని సంపాతి తమ్మునితో స్పష్టముగ పలికెను.

భయపెట్టిన అంతమాత్రమున జటాయువు ఉత్సాహము వీడువాడు కాదు. దిక్కులు మార్మ్రోగునట్లు 'కూ, కూ అని కూతబెట్టుచు ముందుకు సాగిపోవుచుండెను. 'తెలివి

గలవారు ఊహించి తెలిసికొందురు: మూర్ఖులకు అనుభవించిన గాని అర్థము కాదు' అనుకొనుచు సంపాతి తమ్మునిపై అతనికిగల ప్రేమచే అనుసరించెను.

సూర్యాగ్నికి తాళజాలని అంతవరకును జటాయువు పయనించెను. ఐనను పైకి పోవుట మానలేదు. వేడిమి సహించుచు పైకి పోవుచుండెను. తుదకు రెక్కలు కాలిపోవు స్థితి వచ్చినది.

సంపాతి ఇంతవరకును వెనుక ఉన్నాడు. ఇక చూచుచు ఊరకున్న ప్రయోజనము లేదు. తమ్ముని రెక్కలు కాలిపోవును. అతనిని ఎట్లైన రక్షింపవలయును. సంపాతి వేగమును హెచ్చించి జటాయువు పై కెగసి రెక్కలతో అతనిని కప్పెను.

జటాయువుకు ప్రాణాపద తప్పినది. కాని సంపాతి రెక్కలు సంపూర్ణముగా కాలిపోయినవి. అతడు క్రిందపడుచుండెను. అన్న కూతను జటాయువు వినెను. వేగముగా క్రిందకి దిగివచ్చుచుండెను. 'అన్నా! అన్నా!!' అని దుఃఖముతో కేకలు పెట్టెను. ప్రయోజనము ఏమున్నది? అతివేగముగ దేవతలు నేలపైకి విసరిన మాంసపుముద్దవలె కమిలిపోయిన సంపాతి భూమిమీదకు పడిపోవుచుండెను. జటాయువునకు తన తప్పిదము అర్థమైనది. 'పెద్దవారి మాటల పెడచెవిని పెట్టరాదు' అని తెలిసివచ్చినది.

సంపాతి ఆకాశమునుండి వింధ్యపర్వతముపై పడెను. దిమ్మరవోయెను. కొంతకాలమునకు అతనికి స్మృతి వచ్చినది. ముక్కుచు మూల్గుచు నలుదిక్కులు అతడు పరికించెను. తమ్ముడు లేడు. అంతయును పరిచితముగాని ప్రదేశము. ఏమియు తోచలేదు.

ఆ సమీపమున నర్మదానది ప్రవహించుచుండెను. ఒక ఋషిపుంగవుడు మధ్యాహ్నస్నానమునకై ఆ నదీతీరమునకు వెడలుచుండెను. సంపాతి మూలుగు ఆ మహర్షికి వినబడెను. కరుణామూర్తి అగు అతడు దగ్గరకు వచ్చి :

"వత్సా! నీవు ఎవ్వడవు? నీ కథ ఏమి? ఇట్టి కష్టము నీకు ఎట్లు సంప్రాప్తము ఐనది?" అని సంపాతిని ప్రశ్నించెను.

అమృతబిందువులు చిలుకరించినట్లు తోచిన ఆ యోగిపుంగవుని మాటలకు సంపాతి హృదయము లేచివచ్చినది. అతడు మహర్షితో తన కథ అంతయు నివేదించెను.

“ఆర్యా ! నిష్ప్రయోజనము ఐన నా జీవితములో ఇక ఎవ్వరికి ఏమి పని? ఈ రీతిగ బాధపడుట కంటె నాకు మరణము మేలు. దయ ఉంచి నాకు ఏదైన ఒక మంత్రము ఉపదేశింపుడు. మృత్యుదేవతకు నాపై అనుగ్రహము కలుగునట్లు కావింపుడు” అని వేడుకొనెను.

మహర్షి “పుత్రా! నీవు త్యాగమూర్తివి. త్యాగమునకు తగిన ప్రతిఫలము లభించి తీరును. మృత్యువు వలన ఫలము ఏమి ఉన్నది? శాంతి వహింపుము. నా దివ్యదృష్టితో పరికించితిని. అనతికాలమునందు నీ వలన ఒక మహాత్మునికి మేలు చేకూరును” అనెను.

సంపాతి ఆశ్చర్యముతో “మహాత్మా! ఎగుర రెక్కలు లేవు. అట్టి నా వలన ఒక మహాత్మునికి ఒక ప్రయోజనము చేకూరునా? ఎంత వింత!” అని అనెను.

“కాలము ఒకరీతిగ ఉండదు. పడినవారు అందరును చెడరు. నీకు మరల రెక్కలు వచ్చును. నీ బంధువులు నిన్ను చేరెదరు. ఇదిగో! ఈ మంత్రమును జపించుకొనుచు నీవు మనశ్శాంతి పొందుము” అని మహర్షికి సంపాతికి ఒక మహామంత్రము ఉపదేశించి తన దారిన పోయెను.

కొంత కాలములో అన్నను వెదికికొనుచు జటాయువు ఆ వింధ్యపర్వతమునకు వచ్చెను. సంపాతి కుమారుడు సుపార్శ్వుడు అతనికి ఆహారము తెచ్చిపెట్టుచుండెను. సంపాతి మహర్షి మాటలపై నమ్మకము ఉంచి మహామంత్రమును పఠించుచు కాలము వెళ్ళబుచ్చుచుండెను.

ఒకనాడు జటాయువు ఆకాశమున విహరించుచుండగా రావణుడు విమానముపై ఎక్కించుకొని సీతను ఎత్తుకొని పోవుచుండెను. సీత సహాయము వేడి మొరపెట్టగా ఆ ఆర్తనాదము జటాయువు చెవినపడెను. జటాయువు రావణుని ఎదుర్కొనగా అతడు తన కత్తితో అతని రెక్కలు త్రుంచి వేసెను. అతడు క్రిందపడి అట్లే ఉండి, సీతను వెదకికొనును వచ్చు రామలక్ష్మణులకు రావణుని వార్తను తెల్పి మరణించెను. వారు అట్టి ఉత్తమవీరునికి పరలోకక్రియలు కావించిరి. జటాయువునకు స్వర్గము కలిగెను.

రామునకు సుగ్రీవునితో మైత్రి కలిగినది. సుగ్రీవుడు వానరసైన్యములకు “సీత ఎక్కడ ఉన్నదో తెలిసికొనిగాని మరల నా కడకు రావలదు. వచ్చిన మీకు

మరణదండనము!” అని కఠినముగ ఆజ్ఞాపించెను. ఆ సైన్యముకు నాయకుడు అంగదుడు.

అంగదుడు వానరసైన్యముతో సూర్యకిరణములు చొరలేని చోటులను గూడ వెదికెను. సీత ఎచ్చటను వారికి కనబడలేదు. తుదకు వారు వింధ్యపర్వతమునకు చేరి సభ చేసి “ఒక మహత్కార్యమును సాధించుటలో మరణించిన మనకు స్వర్గము చేకూరును. ఇంటికి వెడలి సుగ్రీవుని శిక్షకు పాత్రులము అగుట కంటె ఇచ్చట నిరాహారులమై మరణించుట మేలు” అని నిశ్చయము చేసిరి.

వారి నిశ్చయము గుహముందు కూర్చొని ఉన్న సంపాతి చెవినబడెను. వారు జటాయువు మరణవార్తను గూర్తి ప్రసంగించిరి. తమ్ముని గూర్చి తెలిసికొనుటకు సంపాతి మూల్గుచు వారికడకు వగ్చెను. వారివలన జరిగిన కథను విని తమ్ముని మృతికి చింతించి, అతనికి వానరసహాయమున ఉత్తరక్రియలు కావించెను.

అంగదుడు సంపాతితో “పక్షీంద్రా! నీకు సీత వార్త ఏమైనను తెలియునా?” అని ప్రశ్నించెను. సంపాతి “సీత! రాముని భార్య! దశరథుని కోడలు!! ఆమెయేనా?” అని ప్రశ్నించి, వారు ‘ఔను’ అని అనగా, సంపాతి వారితో ఇట్లు చెప్పెను.

“నిన్న నా కుమారుడు సుపార్శ్వుడు నాకు ఆహారమును తెచ్చిపెట్టలేదు. వానిపై నాకు అమితమగు కోపము వచ్చినది. వాడు భయపడి “తండ్రీ! క్షమింపుడు. నాకు ఈనాడు జీవించిన జంతువు ఒక్కటైన కనబడలేదు. పదితలల రాక్షసుడు ఒకడు నేడు త్రిలోకసుందరియైన ఒక పుణ్యస్త్రీని విమానముపై బలాత్కరించుచు లంకకు కొని పోవుచుండెను. ఆమె ‘రామా! రామా!!’ అని మొరపెట్టెను. ఆ ఆర్తధ్వని వినజాలక జంతువులు అన్నియు గుహలలో దాగికొనినవి. ఆ రావణుడు దక్షిణసముద్రము మీదుగా వెళ్ళుటను నే చూచి అతని వెంటబడితిని. కాని వాడు నేను నీకు అపకార మొనర్పలేదు. నాతో పోరాడుట నీకు ధర్మము కాదని శరణు వేడి వెడలిపోయెను” అని చెప్పినాడు. కావున సీత నేడు “రావణుని లంకలో ఉన్నది” అని చెప్పెను.

వానరసైన్యమునకు సీతవార్త తెలిసినందున అమితానందము కలిగెను. “మహానుభావా! పక్షీంద్రా! మాకీ వార్త చెప్పి మా ప్రాణములను కాపాడినావు. భగవంతుడు నీకు మేలొనర్చుగాక!” అని వారు సంపాతికి కృతజ్ఞతను తెలిపి కిష్కింధకు పయనమైపోయిరి.

ఆ సమయమున వారిని సాగనంపుటకు సంపాతికి ఎగురవలెనని కోర్కెకలిగెను. రెక్కలు చాచెను. సూర్యాగ్ని సోకి పూర్వము కమలి ముడుచుకొనిపోయిన రెక్కలు విడివడినవి. సంపాతి ఆశ్చర్యపడెను. సంతోషముతో ముమ్మారు ఆకాశమున మూడు పరుగులు తీసెను. అప్పుడు అతనికి పూర్వము 'మరణింపవలదు' అని చెప్పిన మహర్షి మాటలు జ్ఞప్తికి వచ్చెను. అతడు "మహాత్ముల మాటలు ఎన్నటికిని వృథా కావు. చచ్చి సాధించునది లేదు. బ్రతికి ఉన్న శుభములను ఎన్నిటినైనను పొందవచ్చును" అని తలపోసెను. అతడు వింధ్యము నుండి హిమవంతమునకు వెడలెను. నిత్యమును మానససరోవరమందలి ఆహారమును భుజించుచు మేఘమాలికలపై విహరించు చుండెను.

త్యాగము ఊరకపోదు. ఓర్పు వలన ఎన్ని శుభముల నైనను పొందవచ్చును.

# అడవిరాజు

ఆనాడు సూర్యుడు అతితీక్షణముగ ప్రకాశించుచుండెను. ఆఫ్రికా అరణ్యములందు సూర్యుని ఎండవేడిమికి తాళజాలక సింహములు గుహలు మార్మ్రోగునట్లు గర్జించుచుండెను. ఏనుగులు నీటిపడియలలో చేరి తాపమునకు తాళజాలక నీరు చిమ్ముకొనుచు ఘీంకరించుచుండెను.

గ్రీసురాజు అలెగ్జాండరుకు ప్రపంచమును జయించి చక్రవర్తి కావలెనని చిన్ననాటి నుండియు కోర్కె గాఢముగా ఉండెను. నేల ఈనినట్లు నడచి వచ్చుచున్న ప్రచండ సైన్యముతో అతడు అనేక దేశములను జయించి ఆఫ్రికాలోని రాజ్యములపై బడుటకు వచ్చుచుండెను.

ఎండ తీక్షణమునకు సైన్యములు వేగముగా పయనించుట లేదు. సైన్యమధ్యము నందు ఉన్నతమైన ఏనుగును ఎక్కివచ్చుచున్న అలెగ్జాండరు ఈ విషయమును గమనించెను. ఇంతలో సైన్యాధిపతి వచ్చి "కొంతకాలము ఎచ్చటనైన విడిసి విశ్రాంతి తీసికొనినగాని సైన్యములు ముందుకు సాగలేవు. కావున త్వరలో ఆజ్ఞనిండు" అని ప్రార్థించెను.

ఆ ప్రాంతమున ఒక బూరుగుచెట్టు క్రింద బలశాలి ఐన ఒక మనుజుడు అటునిటు తిరుగుచుండెను. అతని చేతియందు కత్తి ఉన్నది. వీపున విల్లును అమ్ములును ఉన్నవి. అలెగ్జాండరు దృష్టి అతనిపై బడెను.

ఇరువురు సైనికుల రావించి చెట్టు క్రింద పహరాకాయుచున్న వానిని జూపించి అలెగ్జాండరు "అతనిని ఇక్కడకు పట్టుకొనిరండు!" అని ఆజ్ఞాపించెను. భటులు వేగముగ వెడలి వానిని పిలుచుకొనివచ్చి అలెగ్జాండరు ముందు నిలువబెట్టిరి.

అలెగ్జాండరు "నా సైనికులు నడచి నడచి కడు బడలి ఉన్నారు. దగ్గరలో ఏదైన నీటిపడియఉన్నదా, వారు దాహము తీర్చుకొందురు" అని వానిని అడిగెను.

"ఓ రాజా! అదిగో దూరమున కనబడుచున్న ఆ గుబురు ఒక అరటితోట, అందు ఒక మంచి కొలను ఉన్నది. కావలసినంత సమ ప్రదేశము ఉన్నది. నీ సైన్యమును అక్కడ విడిది చేయ ఆజ్ఞాపింపుము" అని అతడు అలెగ్జాండరుతో అనెను.

అలెగ్జాండరు సైన్యమునకు అదేరీతిగ ఆజ్ఞాపించెను. సైన్యములు అరటితోట వంకకు బయలుదేరెను.

అలెగ్జాండరు పట్టి తెప్పించిన వ్యక్తి ఆ అరణ్య ప్రాంతమును పాలించు రాజునకు సేవకుడు. ఆ రాజు దగ్గర ఉన్న ఒక పల్లెలో నివసించుచుండెను. అతని కడకు ఎవరైన అతిథులు వచ్చి దారి తెలియక ఇబ్బంది పడుదురు అని, గ్రామమునకు నలువైపుల సేవకులను ఉంచెను. అట్టి వారిలో ఇతడు ఒకడు.

అలెగ్జాండరు సైన్యము అరటితోట కడకు దరిదాపుగ చేరువరకు వెడలిరి. అడవిరాజు సేవకుడు అలెగ్జాండరును చూచి "మహాప్రభూ! నీవును కడు బడలి ఉన్నావు. అదిగో అది మా పల్లె. అందు మా రాజు ఉన్నాడు. అక్కడకి పోవుదుము రమ్ము. మాకు అతిథివై సేదతీర్చుకొని మరల రావచ్చును" అనెను. అలెగ్జాండరు అందుకు అంగీకరించెను.

అడవిరాజు భటుడు దారిచూపింపగా, అలెగ్జాండరు ఆ పల్లెకు బయలుదేరెను. ఒక క్రోశము దూరము వారు పయనించిన పిమ్మట పల్లె వచ్చెను. అందు పక్షుల కలధ్వనులు అలెగ్జాండరుకు ఆనందమును కల్గించెను.

ఆ పల్లెజనము అందురును నల్లనివారు. జుంజురు జుట్టు. మాట మొరటు. వారి ఇండ్లు పర్ణశాలలు. అలెగ్జాండరు ఆ పల్లెలోని జనమును వారి ఇండ్లను చూచి మనస్సున అసహ్యించుకొనుచుండెను. వారిని నీచులుగ భావించెను.

అడవిరాజు సేవకుడు అలెగ్జాండరును ఆ పల్లెలోని ఒక పెద్ద పర్ణశాలకడకు కొనిపోయెను. అచ్చట ఒక అరుగుమీద చాపపై కూర్చొని ఉన్న ఒక వ్యక్తి దూరము నుండి చూపించి "అతడే మమ్ము పాలించు రాజు, దయానిధి" అని చెప్పెను. దగ్గరకు వెళ్లిన తరువాత అతనికి మ్రొక్కి అలెగ్జాండరును అతనికి పరిచయము చేసెను.

అడవిరాజు తనకు అతిథిగ వచ్చిన అలెగ్జాండరును విశేషముగ గౌరవించి తాను ఎరిగిన మర్యాదలతో ఆహ్వానించెను. ఉచితమైన ఆసనమును ఇచ్చెను. అతనికి కావలసిన సేవలు చేయుటకు తగినవారిని నియమించెను.

కొంతసేపటికి అడవిరాజు బంగారు ఫలములను ఒక పళ్ళెరము నిండా నింపి స్వయముగ కొనివచ్చి అలెగ్జాండరు ముందు పెట్టెను. "రాజోత్తమా! వీనిని భుజింపుము. నీ ఆకలి తీర్చుకొనుము. మమ్ము అనుగ్రహింపుము. నీవు మా అతిథిదేవుడవు" అని తన సంప్రదాయమును అనుసరించి పలికెను.

అలెగ్జాండరు తినుటకు తనముందు పెట్టిన బంగారుపండ్లను జూచి ఆశ్చర్యపడెను. "మీరు బంగారమును తినెదరా?" అని వింతపడి ప్రశ్నించెను.

ఆ ప్రశ్నకు అడవిరాజు "లేదు. మీ దేశమున షడ్రసములతో కూడిన భోజనము ఉన్నది. ప్రజలు సర్వవిధముల సుఖముగా ఉన్నారు. కాని మీరు సైన్యముతో ఇతర దేశములపై దండెత్తి ధనము సంపాదించుచున్నారు. కావున మీరు బంగారుపండ్లు తినెదరు అని నేను తలచితిని" అని సమాధానము చెప్పెను.

అడవిరాజు మాటలకు అలెగ్జాండరు కొంత సిగ్గువడెను. కాని తెప్పరిల్లి "రాజా ! నేను ధనాశచే దండయాత్రలు చేయుట లేదు. దేశ దేశములందు ఆచారములు ఎట్లున్నవో జూచిపోవుటకు వచ్చితిని. ప్రమాదము కలుగును అను భయమున సైన్యమును వెంటగొని వచ్చితిని" అని చెప్పెను.

"అయినచో సంతోషము. మీరు మాకు అతిథులుగ ఇచ్చట ఎన్ని దినములు ఉన్నను మాకు కష్టము లేదు. మీకు ఎట్టి ఇబ్బందులును కలుగవు" అని అడవిరాజు అనెను.

అలెగ్జాండరు అడవిరాజు మరల తెప్పించిన పండ్లను తినెను. పాలు త్రాగెను. అతని భోజనము ముగిసిన పిమ్మట ఆ రాజులు ఇద్దరు ఏమేమో సంభాషించు కొనుచుండిరి. ఆ సమయమున అచ్చటికి ఇరువురు వచ్చి అడవిరాజుకు సాగిలపడి నమస్కరించిరి. తమ తగవును తీర్పుడు అని ప్రార్థించిరి. అడవిరాజు "అది ఏమో విన్నవింపుడు" అని ఆజ్ఞాపించెను.

తగవుబడి వచ్చినవారిలో ఒక వ్యక్తి రెండవవానిని చూపుచు రాజుతో ఇట్లు విన్నవించెను. "ప్రభూ ! కొంత కాలము క్రిందట నేను ఇతనికడ ఒక పొలమును కొంటిని. ఈ సంవత్సరము వర్షములు పడిన తరువాత విత్తనములు వేయుటకు ఆ భూమిని దున్నుచుండగా నాకు అందు నాణెముల కుండ దొరికినది. దానిని ఇతనికి చేర్చుటకై ఇంటికి వెళ్ళితిని స్వీకరింపుము అని ఎంత ప్రార్థించినను ఇతడు 'అది నీది, నాది కాదు. పొలమును నీకు నేను అమ్మితిని. ఈ భాండము అందు నీకు లభించినది. కావున నేను దీనిని గ్రహింపను' అని ఎదురు తిరుగుచున్నాడు. ఎట్లైనను ఇతడు దానిని గ్రహించునట్లు అనుగ్రహింపుడు. నన్ను పరధనమును పొందుటవలన కలుగు పాపము నుండి విముక్తుని కావింపుడు."

అడవిరాజు తన ప్రజలలో ఉన్న ధర్మబుద్ధికి మనస్సున సంతోషించుచు రెండవవానిని చూచి, "దీనికి నీవు ఏమైన చెప్పదలచితివా?" అని ప్రశ్నించెను.

రెండవవ్యక్తి అడవిరాజుతో ఇట్లు పలికెను. "ప్రభూ ! నేను ఇతనికి నా పొలమును అమ్మితిని. ఏనాడు అతడు నా యొద్ద విక్రయించుకొనెనో ఆనాడే అందలి నిధులు, నిక్షేపములు అన్నియు అతనివి. ఈ బంగారు నాణెములకుండ నాది ఎట్లగును? నాకు ఉన్నది నాకు చాలును. లేకున్న తమబోటి ధర్మప్రభువుల కొలువుచేసి బ్రతికెదను. పరులధనమును గ్రహించి పరలోకమున బాధలు పడజాలను. పరధనము నాకు వలదు. న్యాయము విచారించి తాము తీర్పునిండు."

ఆ వ్యక్తులు ఇరువురు వినిపించిన తగవు అడవిరాజు శ్రద్ధతో వినెను. కొంతసేపు ఆలోచించి ఇట్లు తీర్పు చెప్పెను.

"సోదరులారా ! అతడు నేను పొలమును మాత్రమే కొంటిని. నిధి, నిక్షేపములు నావి కావు అని అనుచున్నాడు. నీవు పొలమును కొనిననాడే నిధినిక్షేపములు అతనివి ఐనవి. వానిపై నాకు హక్కు లేదు అని అనుచున్నావు. బాగున్నది. నా ఒక న్యాయము తోచుచున్నది. నీకు ఒక కుమార్తె ఉన్నది. అతనికి ఒక కుమారుడు ఉన్నాడు. వారిద్దరికి వివాహము చేయుడు. ఆ సమయమున ఈ భాండమును కాన్కగా వారికి ఇండు, మీ వివాదము తీరును."

అడవిరాజు చేసిన నిర్ణయమునకు ఇరువురు వ్యక్తులును సంతోషించిరి. తమ బిడ్డలకు వివాహము చేయుటకు రాజు ఎదుట శపథము చేసి నమస్కరించి వెడలిపోయిరి.

అడవిరాజు చేసిన నిర్ణయమును చూచి అలెగ్జాండరు ఆశ్చర్యనిమగ్నుడయ్యెను. అతడు ఆశ్చర్యపడుట అడవిరాజు గమనించెను.

"ఓ మహారాజా! నా నిర్ణయమున అన్యాయము ఏమైన ఉన్నదా? ఏల ఆశ్చర్యపడుచున్నారు ? ఇట్టి తగవు వచ్చిన మీరు ఏ రీతిగ ధర్మనిర్ణయము చేసెదరు?" అని ప్రశ్నించెను.

అలెగ్జాండరు "సువర్ణభాండములు సామాన్యజనులవి కావు. అందుచే ఇది తగవుపడి వచ్చిన ఇరువురు వ్యక్తులకును చెందరాదు. మా దేశమున రాజులమైన మేము దీనిని స్వీకరింతుము" అని బదులు చెప్పెను.

"ఇట్టి నిర్ణయము సామాన్యులకు అధర్మముగ తోచవచ్చును, అందుచే మేము ఈ వార్త బయటకు పొక్కకుండుటకై ఇరువురను కొంతకాలము కారాగారమునందు బంధించెదము" అనియును అలెగ్జాండరు అడవిరాజుకు తెలిపెను.

అలెగ్జాండరు మాటలకు అడవిరాజు కటకటపడెను. ఆశ్చర్యముతో "మీ నిర్ణయము ఎంతదారుణము! మీ దేశమున సూర్యుడు ఉదయించుచున్నాడా? వెన్నెలలు కాయుచున్నవా? మీకు పాడిపంటలు సమృద్ధిగ ఉన్నవా? మీ చెట్లు తీయని పండ్లు ఇచ్చుచున్నవా?" అని ప్రశ్నించెను.

ఈ ప్రశ్నలకు అలెగ్జాండరు "మీరు చెప్పినవి అన్నియును జరుగుచున్నవి. మాకు ఎట్టి లోపమును లేదు" అని సమాధానము చెప్పెను. అడవిరాజు "ఇంతటి అధర్మపరులైన రాజులు భూమిపైఉన్న ఇక ఇది బహుకాలము నిలువదు. నేడు సూర్యుడు కాంతిని ప్రసాదించుట వీరి ధర్మము వలన కాదు. మేఘములు వర్షించుట, వెన్నెలలు కాయుట సాధు జంతువుల మంచితనము వలన గాని ఇట్టి రాజుల గొప్పదనము వలన కాదు. ప్రజలక్షేమమును అరయువాడు రాజుగాని వారి ధనమును అపహరించువాడు రాజు కాజాలడు. బందిపోటు దొంగ, ఈశ్వరుడు ఇట్టి పాపకృత్యములు చేయువారిని ఐనను క్షమించుగాక!" కనికరము ఉట్టిపడ పలికెను.

అడవిరాజు మాటలకు అలెగ్జాండరు సిగ్గుపడెను. అతడు ధర్మమూర్తి వలె కనువిందుగ అడవిరాజు ముఖమును సూటిగ చూడజాలకపోయెను. పీఠము నుండి దిగి నెమ్మదిగ తన సైన్యము కడకు ఆలోచనానిమగ్నుడై వెడలెను. "నిజము. ప్రజలను రంజింపజేయువాడు రాజుగాని నేను రాజును ఎట్లగుదును? కీర్తికాంక్షతో ఎన్నో దేశములను రక్తముతో తడిపితిని. చరిత్ర నన్ను గూర్చి ఘనుడని చెప్పుకొనుగాక ! నేను కిరాతుడను! "పిట్ట కొంచెము కూత ఘనము" అన్నట్లు ఇంత చిన్న దేశమునకు రాజైన ఇతడు నాకంటె ఎన్నో రెట్లు దొడ్డరాజు, ఇతని సంస్కారము నాకు కొన్ని జన్మలకైన అందుకొనరానిది. నేను నాగరకుడనా?" అని మనస్సున అడవిరాజుకు జోహారు పలికెను.

గొప్పతనము గుణమును బట్టి గాని కులము, బలముల బట్టి కలుగదు.

# పరీక్ష

గజనీ మహమ్మదు మహావీరుడు, ఇతడు రాజ్యమునకు వచ్చిన వెంటనే గొప్ప సైన్యములతో పరదేశములపై దండయాత్రలు చేసెను. అనేక దేశములను కొల్లగొట్టెను. ఆ విధముగా సంపాదించిన ధనముతో పెద్ద సామ్రాజ్యమును నిర్మించెను. దానిని కడుజాగరూకతతో పాలించుచుండెను.

విశాలమైన అతని సామ్రాజ్యమును పాలించుటలో మహమ్మదుకు కొందరు మంత్రులు తోడ్పడుచుండిరి. వారిలో ముఖ్యుడు అయాజ్.

అయాజ్ కడు సమర్థుడు. అతని రాజభక్తి సాటిలేనిది. ఇతడు దేశములోని ప్రజలు అందరును క్షేమముగా జీవించుటకు తగిన ఏర్పాటులను ఎన్నో కావించెను. రాచకార్యములందును, ప్రజలను పోషించుటయందును ఇతడు శ్రద్ధ వహించుట ప్రభువగు మహమ్మదు గమనించెను. ఆ కారణమున చక్రవర్తి గజనీ మహమ్మదుకు అతనిపై మిక్కిలి అభిమానము, అధికగౌరవము.

ఇతర మంత్రులు అయాజ్‌పై చక్రవర్తి ఇంతటి అభిమానమును గౌరవమును చూపుట సహింపలేకపోయిరి. వారు ఈర్ష్య వహించిరి. అయాజ్ యెడ చక్రవర్తి మనస్సును విరుచుటకు ఎన్నెన్నో కుట్రలు పన్నిరి.

కాని సత్యము ఎన్నడును దాగదు గదా ! వారి ప్రయత్నములు అన్నియును వ్యర్థమైనవి. ఇందరును చేరి అయాజ్‌ను పడగొట్టదలచుటకు మూలమైన గారణమేమో చక్రవర్తియగు మహమ్మదు గమనించెను. వారి ఈర్ష్య అతనికి అర్థమెనది. అతడు అయాజ్‌ను పూర్వముకంటె అధికముగా ప్రేమించి గౌరవించుచుండెను.

మంత్రుల పన్నుగడలు అన్నియును నిరుపయోగములైనవి. మీదుమిక్కిలి మహమ్మదు తమ శత్రువగు అయాజ్‌పై ఎక్కువ ప్రేమను గౌరవమును చూపుచుండెను. వారు ఇందుకు కారణము ఏమైయుండునో తెలిసికొనుటకు కుతూహలపడిరి.

వినయము, భయము, భక్తి తొణికిసలాడుచుండగా వారు ఒకమారు చక్రవర్తి మహమ్మదును సందర్శించిరి. కొంతసేపు ఇతర విషయములు ప్రసంగించిరి. తరువాత:

“ప్రభూ ! మీరు అయాజ్ ఎడ అధిక ప్రేమను అనురాగమును చూపుచున్నారు. దానికి గారణము తెలిసికొని మా మనస్సు ముచ్చటపడుచున్నది” అని వేడిరి.

చక్రవర్తికి వారు ఇట్లు ఎందుకు ప్రశ్నించిరో అర్థమైనది. అతడు చిరునవ్వు నవ్వి “మీరును ఆ ఉత్తమ గుణములను నేర్చుకొని నా సేవచేయదలచినారా? మంచిది. సమయము వచ్చినప్పుడు నేనే మీకు ఆ గుణములను తెలియ చెప్పెదను” అని వారికి సమాధాన మొసంగెను.

తరువాత కొంతకాలము గడిచినది. మహమ్మదు చక్రవర్తి మంత్రులను పిల్చి వారితో ఇట్లు పలికెను. “మంత్రులారా! నా కోటకు బయట ఒక ఉద్యానవనము ఉన్నది. మీరు అందరును ఎరుగుదురు. ఒక కారణమున నేను ఈ రాత్రి మొదలు రేపు రాత్రి వరకు అక్కడనే ఉందును. మీరు ఒక్క మారు రేపు సూర్యుడు అస్తమించుటకు పూర్వము వచ్చి నన్ను కలసికొనుడు. మీరు ఇంటియందు లేకపోవుట వలన మీ కుటుంబములకు ఎట్టి లోపములును జరుగవు. ఆ విషయమున అవసరమైన చర్యలను నేను తీసికొందును.”

మంత్రులకు ఏమనుటకును పాలుపోలేదు. కాని మహమ్మదు చండశాసనుడు. తప్పనిసరి అగుటచే వారు “చిత్తము” అని అట్లే చక్రవర్తిని ఉద్యానవనమున మరుసటినాడు సూర్యోదయము మొదలు సూర్యాస్తమయమగు లోపల ఒక మారు సందర్శించుటకు అంగీకరించిరి.

చక్రవర్తి ఆనాటి రాత్రే కోటనుండి ఉద్యానవనమునకు పోవు మార్గమునందు ఎన్నెన్నో వింతలు వినోదములు ఏర్పాటు చేయించెను. రాజు తలచుకొనిన కొదువ ఏమున్నది? దేశమున ఎన్ని చిత్రవిచిత్ర వస్తువులు ఉన్నవో వానిని అన్నిటిని ఆ రాజమార్గమున ప్రదర్శించిరి. వివిధ వస్తుప్రదర్శనములతో పాటుగ వింతయైన జంతు ప్రదర్శనములు ఏర్పాటు కావింపబడెను. సంగీతసభలు, నాట్యశాలలు, కావ్యగానములు లెక్కకు మిక్కిలిగ ఉదయమునుండి జరుగుచున్నవి. గారడివాండ్రు చూపుచున్న విచిత్రమగు ప్రదర్శనములు చూచుటకు సామాన్యజనము గుంపులు చేరుచుండిరి.

ఆ రాజమార్గమునందు ఎచ్చట చూచినను స్వర్గభోగము తాండవించుచుండెను. మధ్యాహ్న భోజనములు కూడా అందే ఏర్పాటై ఉండుటచే జనము ఇంటికైన పోవలసిన పని లేకుండెను. ఈ కారణమున జనము ఇసుక వేసిన రాలుట లేదు.

తెల్లవారినది. సూర్యోదయమైనది. మంత్రులు చక్రవర్తిని కలిసికొనుటకు ఉద్యానవనమునకు పోవలయును. అందరు వారిలో పెద్దవాని ఇంటికి చేరిరి. అతనితో గూడ ఉద్యానవనమునకు బయలుదేరిరి.

దారి పొడుగున ఎటుచూచినను వింతలు, వినోదములు వారిలో కొందరు జీవితములో పూర్వము ఇట్టివానిని ఎన్నడును చూడలేదు. నెమ్మదిగా ఒక్కొక్క వింతను చూచుచు వారు చక్రవర్తిని దర్శించుటకు వెడలుచుండిరి.

"ఆహా ! మన రాజ్యమున ఎన్ని వింతలు ఉన్నవి. ఈ వినోదములు మన దేశమున ఉన్నవని నేను పూర్వము విననైన లేదు." "ఆ చిత్రమైన జంతువులను చక్రవర్తి ఎచ్చట నుండి తెప్పించినారో?" "అన్నింటికంటె నాకు భోజన పదార్థములు ఎంతో తృప్తిగా ఉన్నవి." "ఇన్ని రకముల పిండివంటలు నేను ఎరుగను!"

ఈ రీతిగ సంభాషించుకొనుచు కంటికి నచ్చిన వింతలను తిలకించుచు, వినోదములలో పాల్గొనుచు వారు మధ్యాహ్నవేళకు రాజమార్గమున నాల్గవభాగమైన దాటలేదు.

"మరచిపోతిమి. మనము వేగముగా వెడలి చక్రవర్తిని కలిసికొనవలయును" అని ఒక మంత్రి జ్ఞప్తి చేసెను. కాని ఇతరులు "ఇక్కడనే గదా ఉద్యానవనము! ఎంతసేపు పట్టును? ఇట్టి వింతలను మరల మన జీవితమున చూడలేము" అనిరి. ఎంతకాలము చూచినను ఆ వింతలు తరుగుట లేదు. వారికి తృప్తి కలుగలేదు. ఇంకను వినోదములు చూచుచుండిరి.

సాయంకాలము ఆరంభమైనది. మంత్రులకు చక్రవర్తిని త్వరగా చూడవలెను అను స్పృహ కలిగినది. ఆ రాజమార్గమున వేగముగ నడుచుచుండిరి. అప్పుడు వారికి కంటిముందు ఒక అద్భుతము కనుపించెను.

అందు అద్దము వెనుకనుండి కొందరు ఫకీరులు వారిని పిలుచుచుండిరి. మంత్రులు "ఈ ఒక్క వింతను చూచిపోవుదుము" అని నిశ్చయించుకొని ఆ ఫకీరుల యొద్దకు వెడలిరి. ఒక్కొక్క ఫకీరు ఒక్కొక్క మంత్రి పూర్వచరిత్రను పూసగ్రుచ్చినట్లు చెప్పుచుండెను. వారికి అదెల్ల ఆశ్చర్యము కొలుపుచుండెను. ఆ మహానుభావుల వలన ముందు వారికి ఏమి శుభములు కలుగునో తెలిసికొనదలచి వారు ఎన్నెన్నో ప్రశ్నలు వేసిరి. ఫకీరులు వానికి సమాధానములు చెప్పుచుండిరి.

ఒక మంత్రికి ఫకీరు కొలది కాలములో అశుభము జరుగును అని చెప్పెను. అతడు తోచక ఒక దిక్కునకు చూచెను. అతనికి అస్తమించు సూర్యుడు కన్పించెను. అతడు సూర్యాస్తమయమును గూర్చి ఇతరులకు చెప్పెను.

మంత్రులందరును అప్పటికి తెలివి తెచ్చుకొనిరి. సూర్యుడు అస్తమించెను. "ఇంటికి తిరిగిపోవుట మంచిది. సూర్యుడు అస్తమించిన వెనుక ప్రభువును దర్శించిన ఆయనకు కోపము వచ్చును" అని ఒక మంత్రి తన అభిప్రాయమును వెలిబుచ్చెను.

"కనుపింపక ఇంటికి తిరిగిపోయిన మరింత కోపము వచ్చును. ప్రభుదర్శనము చేసి క్షమాపణ వేడుట ఉచితము" అని మరియొక మంత్రి అభిప్రాయపడెను. తుదకు అందరును ప్రభువును దర్శించుటకే నిశ్చయించిరి.

మంత్రులు ఉద్యానవనములో ప్రవేశించిరి. మహమ్మదు చక్రవర్తి ఆ వనములో ఒక మామిడిచెట్టు క్రింద అందమగు ఒక అరుగుపై సుఖముగ కూర్చుండెను. అతని ప్రక్కన అయాజ్ వినయముతో నిలువబడియుండెను. వారు ఇరువులు ఇష్టగోష్ఠిలో ఉండిరి.

ఆ దృశ్యమును చూచి మంత్రులు సిగ్గుతో తలవంచుకొని, చక్రవర్తి కడకు చేరిరి. చక్రవర్తి వారినిచూచి అభిప్రాయగర్భితముగ ఒక చిరునవ్వు నవ్వెను. ఆ నవ్వునకు అర్థము ఏమో మంత్రులకు తెలిసినది.

ఒక మంత్రి అయాజ్‌ను చూచి "అమాత్యా! మీరు ఇక్కడికి ఏ దారిన వచ్చితిరి? రాజమార్గమున ఉన్న వింతలు చూడలేదా? వినోదములలో పాల్గొనలేదా?" అని ప్రశ్నించెను.

"వింతలా? నాకు ఏమియును కనబడలేదు. వినోదములతో నా కాలమును నేను ఎన్నడును వ్యర్థము చేయను. సూర్యోదయము ఐన వెంటనే ప్రభుదర్శనమునకు బయలుదేరితిని. సూటిగ నిటకు వచ్చితిని. ఉదయమునుండి నేను ప్రభువువారి సన్నిధినే ఉన్నాను" అని అయాజ్ సమాధానము చెప్పెను. అయాజ్ పలికినది అంతయు "సత్యము" అన్నట్లు చక్రవర్తి తల ఆడించెను.

మంత్రులు అందరి పక్షమున ఒక వృద్ధమంత్రి మహమ్మదు చక్రవర్తితో "ప్రభూ ! క్షమింపుడు. మన రాజమార్గమునందు ఉన్న వింతలు చూచుచు వినోదములలో

పాల్గొనుచు తమ దర్శనమునకు వచ్చునప్పటికి సూర్యుడు అస్తమించెను. క్షమింపుడు" అనెను.

చక్రవర్తి ఔదార్యముతో "ఇందు క్షమించుటకు ఏమి ఉన్నది? కాని కష్టస్థితిలోనైన మీకు నా మీద ఉండు అభిమానము ఇంతే కదా!" అనెను. మంత్రులు సమాధానము చెప్పలేకపోయిరి. సిగ్గుతో తలవంచుకొనిరి.

"అయాజ్‌ను నేను ఎందుకు అధికముగా ప్రేమించి గౌరవించుచున్నానో మీకు ఈనాడైనా అర్థమైనదని అని అనుకొందురు. అతనికి నేను నా రాజ్యము తప్ప ఇతర లోకము లేదు. అతడు విశ్వాసపాత్రుడు. స్వామిభక్తిపరాయణుడు" అని చక్రవర్తి అయాజ్‌ను ప్రశంసించెను.

మంత్రులకు అయాజ్ గొప్పదనము అర్థమైనది. వారి శ్రద్ధను భక్తిని పరీక్షించుటకు చక్రవర్తియే మార్గములోని వింతలను వినోదములను ఏర్పాటు కావించెనని, అప్పుడు వారు తెలిసికొనగలిగిరి. ఆనాటినుండి అయాజ్‌పై ఈర్ష్య వహించుట మాని రాజ్యపాలన యందు సంపూర్ణముగ అతనికి తోడ్పడుచుండిరి.

శ్రద్ధకు మించిన సాధనము లేదు. శ్రద్ధ వలన సర్వము చేకూరును. ఈర్ష్య ఎంతటివారినైనను చెరచును.

# మిత్రద్రోహి

పూర్వము భారతదేశమున రత్నపేశల అను ఒక పట్టణము ఉండెను. అందు నందివర్ధనుడు అను వైశ్య శిఖామణి ఉండెను. అతడు విదేశములతో ఓడ వ్యాపారము చేసి విశేషముగ ధనమును ఆర్జించెను.

అంతటి ధనవంతుడు ఆ పట్టణమున లేకపోవుటచే నగరములోని జనము అతనిని "కుబేరుడు" అను మారుపేరుతో పిలుచుచుండిరి. దానములు ధర్మములు చేయుచు అతడు పేదసాదలను కనికరించుటచే అతనిపై ప్రజలకు మిక్కిలి గౌరవము, అభిమానము.

సంపదలు అన్నియు అతనికి ఉన్నవి. కాని పాపము, అతనికి సంతానము లేదు. అది ఒక్కటే లోపము. అతని భార్య ప్రభాదేవి. ఉత్తమ ఇల్లాలు. ఆమె సంతతికై చేయని వ్రతములు దానములు లేవు. ఆ పుణ్య దంపతులు తిరుగని పుణ్య క్షేత్రములు లేవు.

తుదకు వారు రామేశ్వరమున కేగిరి. అచ్చట నాగప్రతిష్ఠ కావించిరి. రామలింగేశ్వరస్వామి వారి భక్తిశ్రద్ధలకు మెచ్చి వారికి ఒక పుత్రుని ప్రసాదించెను.

ఆ కుమారునికి ధర్మగుప్తుడు అని నందివర్ధనుడు నామకరణము చేసెను. అతడు ఆ ధనికుని ఇంట అల్లారుముద్దుగ పెరుగుచుండెను. బాల్యము గడిచినది. అందచందములు, విద్యాబుద్ధులు గల ధర్మగుప్తునిపై తల్లిదండ్రులకు ప్రేమ మెండు. పట్టణములోని ప్రజలు అతని వినయము విధేయత చూచి మెచ్చి అతనిని కడు ఆదరముతో చూచుచుండిరి.

ఇట్లుండగా రత్నపేశలకు ఒక జ్యోతిష్కుడు వచ్చెను. అతడు జాతకములను చూచి రాబోవు విషయములను పూసగ్రుచ్చినట్లు చెప్పుటయందు కడునేర్పరి. అతడు చెప్పినది ఎల్ల జరిగితీరును. నగరమందలి ప్రజలు అతనిని మిక్కిలి పూజించెదరు. అతడు చెప్పినవి అన్నియు చేసెదరు.

నందివర్ధనుడు ధర్మగుప్తుని భావిజీవితము ఎట్లుండునో తెలిసికొనతలచి ఆ జ్యోతిష్కుని కడకు వెడలెను. జ్యోతిష్కుడు, నందివర్ధనుడు ఇచ్చిన దక్షిణ తాంబులములను గ్రహించి –

"మిత్రమా! స్వల్పకాలములో నీకు ఒక గండము ఉన్నది. త్వరపడుము. నీ దానధర్మములకు దేవతలు మెచ్చిరి. నీకు త్వరలో పిలుపు వచ్చును" అని చెప్పెను.

నందివర్ధనుడు ఆలోచనలోపడెను. అతనికి మరణము అన్న భయములేదు. కాని కుమారుడు ఇంకను పెద్దవాడు కాలేదు. తనకు ముద్దుముచ్చటలు తీరలేదు. తనది గొప్ప వ్యాపారము, ధర్మగుప్తుడు పెరిగి పెద్దవాడై స్వయముగ వ్యవహారములను చక్కబెట్టుకొను వరకును వానిని చూచువారు ఎవరు? కుటుంబమునకు ఎవరు దిక్కు? ఆశ్రయించుకొని ఉన్న ఉద్యోగులు ఎట్లు బ్రతుకుదురు? తాను నిలిపిన దేవాలయము లందు పూజలు ఉత్సవములు సాగించువారు ఎవరు?

నందివర్ధనుని మనస్సు కొంతకాలము బాధపడినది. ప్రయోజనము ఏమున్నది? "మృత్యువు రాక మానదు. ఎట్టి కష్టములు వచ్చినను ఎదుర్కొనుటయే ధీరుని లక్షణము" అని అతడు నిశ్చయించుకొనెను.

మరునాడు తన భార్యను పిలిచి దుఃఖముతో అతడు ఆమెతో ఇట్లనెను, "ప్రభా! రామేశ్వరుని కృపచే కలిగిన మన ముద్దుబిడ్డను చూచుకొనుచు కాలము వెళ్ళబుచ్చ తలచితిని. కాని దైవము వేరు విధముగ తలచెను. నాకు త్వరలో పిలుపు రానున్నది. మన బిడ్డడు ఇంకను చిన్నవాడు. ఇక మీద వానిని ఎట్లు పెంచి పెద్దవానిని చేసెదవో? జాగ్రత్త సుమా!"

నందివర్ధనుని భార్య ప్రభాదేవి మహాసాధ్వి. భర్తకు పిడుగు వంటి అశుభము వినినంతనే ఆమె మూర్ఛిల్లినది. ఆమె గుండె నీరైనది. కొంత కాలమునకు తెప్పరిల్లినది. ఏమి పలుకుటకును ఆమెకు తోచలేదు. భర్త పాదములపై పడి మోకరిల్లి కన్నీరు మున్నీరుగ ఏడ్వసాగెను.

నందివర్ధనుడు ఆమె కన్నీరు తుడిచి "ప్రియా! చింతించి ప్రయోజనము ఏమున్నది? కానున్నది కాకమానదు. కష్టసమయముల ధైర్యము వహించుట ధీర లక్షణము. నీవు సామాన్యురాలవు కావు. సర్వమును తెలిసినదానవు. ధైర్యము వహింపుము. ఇంటిని చక్కబెట్టుకొనుము. బిడ్డను తీర్చిదిద్దుకొనుము" అని బుజ్జగించెను.

ప్రభాదేవి గద్గదకంఠముతో “నాథా! మీరు లేని ఈ పాడులోకమున నా బ్రతుకు ఎందులకు? మన బిడ్డ నా తమ్ముని ఇంట పెరుగును. అనుజ్ఞ ఇందు. సహగమనము చేసి నేనును మీతో దేవలోకమునకు వచ్చెదను” అని వేడుకొనెను.

అట్టి స్థితిలో నందివర్ధనుని ఇంటికి ఒక ఆప్తమిత్రుడు వచ్చెను. వాడిపోయిన మిత్రుని మొగము చూచి:

“మిత్రమా ! ఏమిటి? నీ ముఖమున ఎన్నడును శోకమును చూచి ఎరుగును. ఇందుకు కారణము ఏమి? అని ప్రశ్నించెను.

నందివర్ధనుడు “మిత్రమా హరిగుప్తా! మనము ఇరువురమును బాల్య స్నేహితులము. ఆటలయందైనను కలహించి ఎరుగము. నాకు నేడో రేపో మృత్యువు ఆసన్నమై ఉన్నది ఒక్క సహాయము చేయుము.

“నా కడ కొంత ధనము ఉన్నది. ఇది దొంగలపాలో దొరలపాలో, నా కుమారుడు ధర్మగుప్తుడు చిన్నవాడు. ఈ ధనమును నీ యొద్ద ఉంచి కాపాడి వాడు పెద్దవాడు ఐన తరువాత ఇష్టము వచ్చినంత ఇమ్ము” అని అడిగెను.

మిత్రునకు ధనము అనగా ఆశ పుట్టినది. “ముందు చేజిక్కించుకొనిన మూడవనాటి మాట! ఇవ్వవలసి వచ్చినప్పుడు జూడవచ్చును” అని మనస్సున అతడు తలపోసెను. అతడు “మిత్రమా! అది ఎంత పని! తప్పక నీ కోర్కె నెరవేర్చెదను” అని పలికెను.

నందివర్ధనుడు మిత్రునికి పదివేల బంగారు నాణెములను ఇచ్చి “తప్పక నా కుమారునికి ఇష్టము వచ్చినంత ఇవ్వవలయును సుమా!” అని చెప్పి చేతిలో చేయి వేయించుకొనెను. తరువాత కొలది కాలమునకే మరణించెను.

భర్త అంగీకరింపకపోవుటచే నందివర్ధనుని భార్య ప్రభాదేవి సహగమనము చేయలేదు. కుమారుని మంచిచెడ్డలు చూచుచుండెను.

ధర్మగుప్తుడు పెరిగి పెద్దవాడు అయ్యెను. విద్యలు నేర్చెను. వ్యాపారరహస్యములు నేర్చికొనెను. స్వతంత్రముగ వ్యాపారము సాగింపతలచెను. చేత ధనము లేదు. తల్లి అతనికి, అతని మిత్రునికడ తండ్రి దాచి ఉంచిన డబ్బు సంగతి తెలియజెప్పెను.

ధర్మగుప్తుడు తన తండ్రి స్నేహితుడైన హరిగుప్తుని కడకు వెడలెను. అతడు ధర్మగుప్తుని మీద మిక్కలి ప్రేమ నటించుచు ఆహ్వానించెను. కొంతసేపు కుశలవార్తలను గూర్చి వారు ప్రసంగించిరి.

తరువాత ధర్మగుప్తుడు, "ఇంత కాలము మా కుటుంబ క్షేమమును కనిపెట్టినవారు. మీకు నేను ఎంతయు కృతజ్ఞుడను. ఇక నేను వృత్తికై ఒక వ్యాపారము పెట్టదలచితిని. దయ ఉంచి నా తండ్రి మీ కడ దాచిన ధనము నాకు ఇందు" అని హరిగుప్తుని వేడెను.

హరగుప్తుడు కపటి. "నాయనా ! స్వయముగా నీవు వ్యాపారమును చూచుకొనెదను అని అనుచున్నావు. నా మిత్రుని పుత్రుడు పెద్దవాడై ఇంత ప్రయోజకుడు ఐనందుకు నా మనస్సు ఎంతో ఆనందము పొందుచున్నది. ఇంతకంటే నాకు కావలసినది ఏమి ఉన్నది?" అని ఆ కపటి, ధర్మగుప్తుని శిరస్సును ముద్దు పెట్టుకొనెను. తుదకు హరగుప్తుడు, ధర్మగుప్తునితో నాయనా ! నీ తండ్రి మరణించువేళ నా కడ పదివేల బంగారు నాణెములు దాచిపెట్టెను. పెద్దవాడవు ఐన తరువాత నీకు ఇష్టము వచ్చినంత ఇమ్మని కోరెను. నీకు వేయినాణెములు ఇచ్చుట నా ఇష్టము" అని పలికెను.

తేనె పూసిన కత్తివలె ఉన్న అతని మాటలు ధర్మగుప్తునికి అర్థమైనవి. అతని మోసము తెలిసినది. వెంటనే కోపముతో :

"ఇది అధర్మము! నీవు ఈ రీతి మోసగింతువు అని నా తండ్రి ఊహింపలేదు. పదివేల నాణెములతో నీవు వ్యాపారమొనర్చి ఎంతో లాభము గడించితివి. నా పదివేల నాణెములను నాకు ఇమ్ము. అపకీర్తికి పాల్పడకుము!" అని ధర్మగుప్తుడు పలికెను.

ఈ మాటలకు హరగుప్తుడు సమాధానము చెప్పలేదు. ధర్మగుప్తుడు "ఇది మిత్రద్రోహము! పరుల ధనమును అపహరించుటకంటె మహాపాపము మరియొకటి లేదు. ఈ పాపపుణ్యములు నాకు లేవు అని అనుకొనకుము. అట్లు అనుకొనినను నిన్ను ఊరకపోనీయను. ధర్మసభకు ఈడ్చించి విచారణ చేయించి నా ధనము నేను పుచ్చుకొనెదను!" అని స్పష్టముగ పలికి, కోపముతో హరగుప్తుని ఇంటి నుండి వెడలిపోయెను.

హరిగుప్తుడు కావించిన ద్రోహమును ధర్మగుప్తుడు తల్లికి నివేదించెను. ఆమె అనుజ్ఞతో ధర్మాధికారియగు మర్యాద రామన్న కడ హరగుప్తునిపై ఫిర్యాదు కావించెను.

మర్యాద రామన్న ఫిర్యాదులు విని న్యాయమును విచారించి తీర్పు చెప్పుటలో మేటి. దోషులను అట్టె గుర్తు పట్టగల నేర్పు అతని సొమ్ము.

అతడు ధర్మగుప్తుని కథను జాగరూకతతో వినెను. హరగుప్తుని న్యాయస్థానమునకు పిలిపించెను.

అతడు మర్యాదరామన్న కడకు భక్తివినయములు తొణికిసలాడ వచ్చి నమస్కరించి నిలచెను.

మర్యాద రామన్న అతనిని ఒక మారు పైనుండి క్రింది వరకును పరికించి చూచెను. ఆ చూపుతోనే హరిగుప్తుడు కొంత చలించెను.

ధర్మగుప్తుని చూపించుచు మర్యాద రామన్న హరగుప్తునితో "ఇతని తండ్రి నీ కడ పదివేల బంగారు నాణెములను దాచినమాట సత్యమేనా?" అని ప్రశ్నించెను. హరగుప్తుడు తలఊపి "నిజము" అని అంగీకరించెను. క్షణము ఆలోచించి "ఆ ధనమును కుమారుడు పెద్దవాడు అయిన తరువాత ఇమ్మని చెప్పలేదా?" అని మర్యాద రామన్న గద్దించి పలికెను.

హరగుప్తుడు అధర్మము సహింపని వానివలె "చెప్పినాడు. కాని నా విన్నపమును ధర్మాధికారులు విన ప్రార్థించుచున్నాను" అనెను. రామన్న అతడు "చెప్పదలచినదానిని చెప్పవలసినది" అని హరగుప్తుని ఆజ్ఞాపించెను.

హరిగుప్తుడు "నా మిత్రుడు నందివర్ధనుడు మరణించువేళ నాకు పదివేల సువర్ణములు ఇచ్చిన మాట సత్యము. అతని కుమారుడు పెద్దవాడు ఐన పిమ్మట నీవు ఇష్టము వచ్చినంత ధనమును ఇమ్ము అని చెప్పినాడు. అందుకు నేను కాదు అని అనలేదు. ఆ విషయమును నేను ఈ ధర్మగుప్తునితోనే చెప్పితిని. అతడు అందులకు అంగీకరింపక గౌరవప్రతిష్ఠలతో బ్రతుకుచున్న నన్ను సభకు రప్పించి మర్యాద తీసివేసినాడు" అని చెప్పెను.

"ధర్మగుప్తా! అతడు ధనము ఇచ్చుటకు అంగీకరించిన నీవు ఫిర్యాదు చేయుట ఎందులకు?" అని ధర్మాధికారి రామన్న ప్రశ్నించెను.

ధర్మగుప్తుడు "ఆర్యా ! ఆ పదివేల సువర్ణములకు ఈ హరగుప్తుడు నాకు ఎంత ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నాడో విచారించి న్యాయము చేకూర్చుడు" అని నివేదించెను.

మర్యాద రామన్న “ఇందుకు సమాధానము ఏమి?” అన్నట్లు హరగుప్తుని వంక చూచెను. హరగుప్తుడు “నా మిత్రుడు ఇష్టము వచ్చినంత కుమారునికి ఇమ్ము అనినాడు. నాకు ఈ వేయినాణెములను ఈ ధర్మగుప్తునికి ఇచ్చుట ఇష్టము. ఇవిగో! నా వెంటనే కొని వచ్చినాను. వీనిని అతడు తీసికొనునట్లు చేయుడు. నన్ను అల్లరిపాలు చేయకుడు” అని నివేదించెను.

సూక్ష్మబుద్ధితో ఆలోచించి మర్యాదరామన్న “హరగుప్తా ! నీ మిత్రుడు కుమారుడు పెద్దవాడు ఐన తరువాత తాను ఇచ్చిన పదివేల సువర్ణములకుగాను ఇష్టమైనంత ఇమ్ము అనినాడు. నీవు అంగీకరించితి. కాని యిప్పుడు దానికి నీవు విపరీతమైన అర్థమును చెప్పుచుంటివి” అనెను.

హరగుప్తునకు మిత్రుని వాక్యములలో మరియొక అర్థము ఉన్నట్లు అప్పుడు బోధపడినది. సూక్ష్మబుద్ధియైన రామన్న ఏమి అర్థము చెప్పునో అని సభలోనివారు అందరు చెవులు రిక్కించి వినుటకు కుతూహల పడుచుండిరి.

మర్యాద రామన్న “హరిగుప్తా ! నీ మిత్రుడు కడు తెలివిగలవాడు, నీ కుటిలబుద్ధి ఊహించియే ఇష్టము వచ్చినంత ఇమ్ము అనినాడు. ఇష్టమునకు నీవు ఇతరులకు ఇచ్చునది అని ఉద్దేశించి పుచ్చుకొనునాడే ఎక్కువగ కాజేయతలచితిని. నీవు పుచ్చుకొనునదియే నీ ఇష్టము. తన కుమారునికి ఇష్టమైనది ఇమ్మని నీ మిత్రుడు నందివర్ధనుని అభిప్రాయము. నందివర్ధనుని పుత్రుడైన ఈ ధర్మగుప్తునికి అతని తండ్రి నీ పరముగ ఇచ్చిన పదివేల సువర్ణములను ఈయక తప్పదు. ఇంతకాలమును ఆ ధనమును నీ కడ ఉంచుకొని వ్యాపారము చేసి లాభముల గడించితివి. కావున దానికై మరి రెండువేల సువర్ణములను అధికముగా నిమ్ము. అకారణముగా అధర్మపరుడివై ధర్మగుప్తుని సభకు కొనివచ్చి శ్రమ పెట్టినందుకు మరియొక వేయినాణెములను ఇమ్ము. నీ మిత్రద్రోహబుద్ధిని ప్రభుత్వము సహింపజాలదు. కావున ఈ దోషమునకు ప్రభువువారి కోశమునకు అయిదు వందల నాణెములను అదనముగ చెల్లింపుము. ఇకముందు ఎన్నడును ఇట్టి అధర్మమునకు పాల్పడకుము. పై పద్ధతిని పాటింపకున్న నిన్ను శూలముపై ఎక్కింతును!” అని తీర్పు చెప్పెను.

మర్యాద రామన్న ఒక్కొక్క శిక్ష చెప్పినపుడెల్ల హరగుప్తుని ముఖము పాలిపోవుచుండెను. తుదకు అతని ముఖమున నెత్తురుబొట్టు కూడ  ఉన్నట్లు లేదు.

ధర్మగుప్తుడు మర్యాదరామన్న తీర్పునకు సంతోషించి జయకొట్టెను.

సభాసదులు "ఇది ఘనమైన తీర్పు! ఇట్టి మిత్రద్రోహులు రాజ్యద్రోహముకైన వెనుదీయరు. ఇట్టివారు సంఘమున ఉన్న అనుమానము ప్రబలిపోవును. జనుల జీవితమునకు ఆటంకము కలుగును. రామన్నగారు తగిన శిక్ష చెప్పిరి" అని ప్రశంసించుచు ఇండ్లకు వెడలిరి.

హరగుప్తునికి తన మిత్రద్రోహము, దురాశ తెలిసి వచ్చినవి. తల తాకట్లు పెట్టి ఐనను పదమూడు వేల అయిదు వందల నాణెములను చెల్లింపవలయును. లేకున్న శూలమును ఎక్కవలెను. చేసిన తప్పిదమునకు శిక్ష చెల్లించుట ధర్మము. కాని అతనికడ నేడు ధనము లేదు. అతడు దానిని సంపాదించుటకు ఎంతయో కష్టపడెను. దుఃఖముల పాలయ్యెను.

మిత్రద్రోహము మహాపాపము, దురాశ దుఃఖమునకు చేటు.

# బుద్ధిబలము

అప్పుడు అక్బరు చక్రవర్తి రాజ్యము చేయుచుండెను. అతని సామ్రాజ్యము అతి విశాలమైనది. భారతదేశములోని అధిక భాగము అందు ఇమిడి ఉన్నది. సమర్థులైన మంత్రుల సహాయమున ఆ గొప్ప సామ్రాజ్యమును అక్బరు కడు సమర్థతతో పాలించుచుండెను.

ఆనాటి ప్రజలు శాంతిసౌఖ్యములను అనుభవించుటకు ఆ చక్రవర్తి ఏర్పాటుచేసిన చట్టములు కట్టుదిట్టములు కారణము. రాజోద్యోగులు ప్రజలకు అన్యాయము చేయుటకు గాని, లేని ఆపదలను కల్పించుటకు గాని, లంచములు పుచ్చుకొనుటకు గాని జంకుచుండిరి.

వారి ప్రవర్తనమును గూర్చి తనకు నివేదించుటకు అక్బరు గూఢచారులను నియమించెను. అంతటితో అతడు తృప్తి పడలేదు. మారు వేషములతో తానే ప్రజలమధ్య తిరుగుచు వారి సంభాషణములను వినుచుండెడివాడు. అవసరము ఐనచో వారి కష్టములను తీర్చుటకు తగిన చర్యలు తీసుకొనుచుండెడివాడు.

ప్రతినిత్యమును రాత్రులందు కొంతకాలము ముఖ్యపట్టణము ఐన ఢిల్లీలో మారువేషమున తిరుగుట అతని దినచర్యలలో ఒకటి. అట్టి సమయములందు అక్బరు పాదుషాను రాజా బీర్బల్ అనుసరించేవాడు.

బీర్బల్ సంభాషణమున కడు చతురుడు. ఇతని ప్రతి వాక్యమున హాస్యము ఉట్టిపడుచుండును. అందుచే ఇతనిపై పాదుషాకు ప్రేమ మిక్కుటము, క్రమముగ ఇతడు చక్రవర్తికి వేడుక చెలికాడు అయ్యెను.

ఒకనాడు అక్బరు చక్రవర్తి రాజా బీర్బల్ ఇరువురును నగరమున రాత్రివేళ సంచారము బయలుదేరిరి. ఆ పట్టణమున ఒక బ్రాహ్మణవీధికి వచ్చిరి. ఆ వీధిలో ఒక పూరింటినుండి చిన్న వాక్కలహము వినుపించుచుండెను. అక్బరు చక్రవర్తికి అచ్చట ఆగి దానిని వినుటకు కుతూహలము కలిగెను.

వారు నిలచిన ప్రాంతమున ఉన్న ఆ పూరింటియందు ఆచారపరుడు ఐన ఒక బ్రాహ్మణుడు నివసించుచుండెను. అతడు సంపాదనము సంసారమునకు కావలసినంతగ చేయజాలకుండెను. అందువలన అతని భార్యకు అసంతృప్తి కలిగినది. ప్రతి దినమును ఆమె అతనితో చిన్న కలహము చేయుచుండెను.

"ఈ దారిద్ర్యమును ఎంతకాలము భరింపగలము? ఇక నిత్రుపాసములు చేయలేము. నిజమే. మీకు ఆచారపరులు అని గొప్పకీర్తి వచ్చుచున్నది. ఎందుకు? ఇంటిపేరు కస్తూరివారు, ఇంట గబ్బిలముల కంపు అన్న సామెతగా ఉన్నది. మీరు ఎక్కడనైన ఉద్యోగము చేయుడు. ఉద్యోగము పురుషలక్షణము అన్న సంగతి తెలియనిది కాదు!" అని భార్య గ్రుక్క త్రిప్పుకొనక భర్తతో అనుచుండెను.

"ఉద్యోగము" అను మాట చెవినబడిన వెంటనే బ్రాహ్మణుడు తోకత్రొక్కిన త్రాచు వలె మండిపడుచు :

"వెర్రిదానా! ఎప్పుడును ఉద్యోగము ఉద్యోగము అని కొట్టుకొందువు. అది సదాచారము కాదు. బ్రాహ్మణునికి ఉద్యోము ఏమిటి? పదిమంది విద్యార్థులకు భోజనము పెట్టి విద్య చెప్పుటయే అతని ఉద్యోగము" అని అనెను.

ఆ మాటలను భార్య సహింపజాలక "పదిమందికి ఏమి, పూర్వులు ఆర్జించిన మడిమాన్యములు ఉన్న వేయిమందికి భోజనము పెట్టి విద్య చెప్పవచ్చును. "కులపతి" బిరుదము పొందవచ్చును. బ్రాహ్మణులము అన్నమాట నిజము. నేడు మనస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బగ ఉన్నది" అనెను.

"ఈ దెప్పిపొడుపులకు ఏమి కొదువ ? నీవు అన్నట్లు ఆ ఉద్యోగము చేయుటకే సిద్ధపడుదును అనుకొనుము. ఇచ్చువారు ఎవరు? మన హిందూరాజుల పాలన పోయినది. ప్రభుత్వము మహమ్మదీయులది, ఉద్యోగములు అన్నియును వారివి" అని బ్రాహ్మణుడు భార్యతో అనెను.

"అక్బరు పాదుషా ధర్మపాలకుడు. ఆయన కాలమున ఈ జాతిభేదము లేదు. మీరు పొరబడుచున్నారు. వారి దర్బారుకు పోయి మీరు వేడుకొనిన తప్పక ఉద్యోగము ఇచ్చెదరు. మీ దగ్గర చురుకుతనమే లేదు" అని భార్య కొంత చులకనగ మాట్లాడెను.

ఆ రీతిగ భార్య తనను చులకన చేసినందుకు బ్రాహ్మణునికి కోపము హెచ్చెను. "నా తెలివితేటలు తెలియుటకు నీకు కాదు గదా నీ అబ్బకును తెలియలేదు. ఆ పాదుషా నాకు ఏడు రూపాయల జీతము ఇచ్చిన నిన్ను ఏడు అంతస్తుల మేడ ఎక్కింతును. ఇది అబద్ధమైన నా చెవి కోసికొందును!" అని ధీమాతో పలికెను.

ఈ మాటలు మారువేషమున ఉన్న అక్బరు చెవినబడెను. ప్రక్కన ఉన్న వేడుక చెలికాడగు రాజా బీర్బలుతో "మిత్రమా! వినినావా? ఈ బ్రాహ్మణుడు ఏడురూపాయల జీతము ఇచ్చిన భార్యకు ఏడు అంతస్తుల మేడ ఎక్కించునట ! వీని తెలివితేటలు ఏమో పరీక్షింపవలయును" అని అక్బరు మరియొక వీధికి వెడలిపోయెను.

మరునాడు బ్రాహ్మణునికి అక్బరు పాదుషా ఒక తాఖీదు పంపెను. అందు "నీవు సాయంత్రము నాలుగు ఘడియలకు దర్బారుకు రావలెను" అని ఉన్నది.

బ్రాహ్మణుడు దానిని చదువుకొనెను. తనను ఏమిటి? పాదుషా పిలిపించుట ఏమిటి? అతనికి ఏమియు అర్థము కాలేదు. భార్యతో ప్రతి నిత్యమును రాత్రులందు గడచిన రాత్రివలె మాట్లాడుట అతనికి పరిపాటి. రాత్రి ఏమి మాట్లాడునో ఉదయము అతనికి జ్ఞప్తి ఉండదు.

పాదుషా కడనుండి వచ్చిన తాఖీదుకు తన భార్య కారణమును ఏమైన చెప్పగలదేమో అను ఉద్దేశ్యముతో భార్యను పిలిచి ఆ సంగతిని ఆమెకు చెప్పెను.

ఆమె "రాత్రి మీరు పెద్ద గొంతుకతో నేడు ఉద్యోగములు అన్నియు మహమ్మదీయులని అని పలికినారు. రాత్రులందు పాదుషా నియమించిన చారులు గ్రామము అంతటను తిరుగుచుండుట మీకు తెలియును గదా! ఒక వేళ ఏ చారుడైన రాత్రి మీ ప్రవర్తనను గూర్చి పాదుషాకు విన్నవించి ఉండును" అని తాఖీదుకు తనకు తోచిన అర్థమును చెప్పెను.

తన భార్య చెప్పిన విషయము నిజము కావచ్చును అని బ్రాహ్మణునకు తోచినది. కాని ఆమె చెప్పినది నిజము అని ఆమె ఎదుట అంగీకరించిన తాను తెలివి తక్కువవాడు అగును. అందుచే అతడు:

"నీవు చెప్పినది నిజమని నేను అనుకొనను. పాదుషా ఇట్టి స్వల్పవిషయములను పట్టించుకొనువాడు కాదు. ఆయనను నన్ను పిలిపించి శిక్షించిన మాత్రమున పాదుషా లోకులు అందరి నోళ్ళు మూయకలడా?

"అది కాదు. జ్ఞప్తికి వచ్చినది. నీతో ఉద్యోగమునకు వ్యతిరేకముగ ఉన్నట్లు ఎన్ని మాటలు పలికినను దానికై నేనును ప్రయత్నించుట మానలేదు. కొలది కాలము క్రిందట ఒక మిత్రుని మూలమున నా తెలివితేటలను గూర్చి జహంగీరు యువరాజుకు చెప్పించితిని, అతడు పాదుషాకు తెలియచేసి ఉండును. అందువలననే పాదుషా

నన్ను పిలిపించుచున్నాడు. మనకు మంచి దినములు వచ్చుచున్నవి" అని భార్యకు ధైర్యము చెప్పెను.

బ్రాహ్మణుడు మరునాడు సాయంకాలము నాలుగు ఘడియలకు పాదుషా దర్శనము చేయవలయును. ప్రతి నిత్యమును అతనికి అనుష్ఠానమును పూర్తి చేసికొని దేవతార్చన చేసి భుజించువేళకు నక్షత్రదర్శనము అగుచుండును.

ఉదయము లేచి అనుష్ఠానము కొంత తగ్గించుకొనెను. దేవతార్చన క్లుప్తముగ పూర్తి కావించి భుజించెను. దర్బారుకు బయలుదేరెను.

తాఖీదు చూపించుటచే ఆ బ్రాహ్మణుని పహరావారు వాకీరులలో అడ్డు పెట్టలేదు. దర్బారు ప్రాంతమునకు వచ్చిన తరువాత ప్రభువు అతనిని ఎందుకు పిలిపించి ఉండును? అను ఆలోచన కలిగినది. ఏమైనను తప్పదు తాఖీదు వచ్చినది. ధైర్యముతో గుండె రాయి చేసికొని పాదుషా దర్శనము చేయ నిశ్చయించెను.

భయభక్తులతో బ్రాహ్మణుడు అనేకమార్గములు గడచి దర్బారు కడకు చేరెను. పాదుషాకు దూరమునుండి మర్యాదను అనుసరించి సలాము చేసి వినయము ఉట్టిపడ నిలువబడెను.

ఆ బ్రాహ్మణుడు కడు పొట్టివాడు, పాదుషా దృష్టి అతనిపై బడెను. ప్రక్కన నిల్చిన నజీరు, తాము తాఖీదు పంపి పిలిపించిన బ్రాహ్మణుడు ఇతడే అని విన్నవించెను. ఆ బ్రాహ్మణుడు ఎవరో పాదుషాకు జ్ఞప్తికి వచ్చినది. పరికించి చూచి "పొట్టివానికి పుట్టెడు బుద్ధులు అందురు. వీని సామర్థ్యము ఏమో, ఏడురూపాయల జీతముతో ఎట్లు భార్యను ఏడు అంతస్తుల మేడపై నిల్పునో చూచెదను" అని పాదుషా మరల నిశ్చయించెను.

"ఏమయ్యా! బ్రాహ్మణుడా! మా యొద్ద ఉద్యోగము ఒకటి ఉన్నది. జీతము ఏడు రూపాయలు మాత్రమే. నీకు ఇచ్చిన చేసెదవా?" అని పాదుషా బ్రాహ్మణుని ప్రశ్నించెను.

ప్రభువు తనను పిలిపించినది భార్యతో కలహించు వేళ ఉద్యోగములు అన్నియు మహమ్మదీయులవే అని అన్నందుకు శిక్షించుటకై కాదని ఆ ప్రశ్నతో అర్థమైనది. లేచి వచ్చిన పంచ ప్రాణములతో అతడు:

“చిత్తము. ఆ ఉద్యోగము నాకు ఇప్పింపుడు. తమ అనుగ్రహము ఉన్న చాలును, జీతము ఎంతైన ఏమి?” అని బ్రాహ్మణుడు పాదుషాతో వినయమున పలికెను.

“ఏడు రూపాయల జీతమునకు ఇతడు అంగీకరించుచున్నాడు. ఏడు అంతస్తుల మేడలో భార్యను ఎట్లు నిలుపునో చూచెదను” అనుకొని పాదుషా, అతనికి “ఉద్యోగమును ఇచ్చితి” అనెను. ఏమి ఉద్యోగమును ఇచ్చును? ఆ సమయమునకు పాదుషాకు ఒక ఊహ తోచెను.

“నీవు ప్రతి దినమును మన రేవు పట్టణమున ఒకచోట కూర్చొనుము. సూర్యోదయము మొదలు సూర్యాస్తమయము వరకును మనతీరమును ఎన్ని అలలువచ్చి తాకిపోవుచున్నవో లెక్క పెట్టి వ్రాసి వానిని ప్రతి మాసాంతమునను ఢిల్లీకి తెచ్చి కార్యాలయమున ఒప్పజెప్పుము. ఫర్మానా మంత్రి వారివలన పుచ్చుకొనుము. జీతము ఖజానాలో ఇచ్చెదరు” అని పాదుషా ఆజ్ఞాపించెను.

మంత్రితో పాదుషా “ఈ బ్రాహ్మణునికి రాకపోకలకు ఖర్చులు ప్రతిమాసమును జీతముతో పాటు ఇప్పింపుడు” అని పలికి ఆ నాటికి సభ చాలించెను.

బ్రాహ్మణునికి అతి తెలివిగలవాడను అని గర్వము. కాని పాదుషా తనకు ఇచ్చిన ఉద్యోగమునకు అర్థము ఏమో అతనికి బోధపడలేదు. “ఏమైన ఏమి? అది తనకు ఎందుకు? ప్రభుత్వోద్యోగము లభించినది. నాలుగు రాళ్ళు చేసికొనలేకపోను” అని అతడు తలపోసెను.

ప్రభుత్వపు ఖర్చుతో బ్రాహ్మణుడు సంసారమును తీసికొని రేవు పట్టణమును చేరెను. ఒక స్థలమున మంచి అరుగును ఒక దానిని ఏర్పాటు చేయించెను. నిత్యమును అతడు జపమాలతో వచ్చిపోవుచున్న అలలను లెక్కించుచుండెను.

అతడు ప్రభుత్వోద్యోగి అని అందరకును వెల్లడిఐనది. అతనికి పట్టణమున గౌరవమర్యాదలు లభించుచుండెను. కాని శుష్కగౌరవములతో ప్రయోజనము ఏమి ఉన్నది? ఏడు రూపాయల జీతము ఎట్లు చాలును? “పై సంపాదనము చేయుట ఎట్లు?” అని అతడు తీవ్రముగ ఆలోచించెను. బుద్ధికుశలత గల అతనికి ఒక చక్కని ఉపాయము తోచినది. ధనము ఆర్జించుటకు ఉపాయము తోచిన ఆ క్షణమున అతనికి కలిగిన సంతోషమునకు మేర లేదు.

ఆ ఆనందమును పట్టజాలక భార్యను పిలిచి "ఇదుగో ! ఇక చూడు నా తెలివితేటలు! ఇంతవరకు చూపించుటకు ఉద్యోగములో నిలువత్రొక్కుకొన వలసి వచ్చినది. రేపటి నుండియు మనకు అంతయును డబ్బే!" అనినాడు.

మరునాడు ప్రతిదినము కంటె పెందలకడ లేచి అతడు సముద్రతీరమునకు పోయెను. తన అరుగుపై కూర్చుండి అలలను తీక్షణముగ లెక్కించుచు పెద్ద పుస్తకముపై లెక్క వ్రాయుచుండెను.

ఒక ఓడ నిండుగ నిలువైన సరుకులు నింపుకొని తీరము మీదుగ పోవుచున్నది. దానిని చూచి బ్రాహ్మణుడు ఉగ్రుడై ఓడ కెప్తానును కేకపెట్టి పిలచెను.

అతడు దగ్గరకు వచ్చిన తరువాత "నీవేమి కొంత కాలము బ్రతుకదలచ లేదా? పాదుషాగారి పని పాడైపోవుచున్నది. నీ ఓడ వలన అలల లెక్క చెడిపోవును. ఓడను ఇటు రానీయకుము. అటు దూరముగ ఆ కొండల వెనుకనుండి తీసుకొని పొమ్ము! లేకున్న ఓడపై జోడుగుండ్ల బారు వేయింతును!" అని గర్జించి పలికెను.

ఓడ కెప్తానుకు ఆ బ్రాహ్మణుడు ప్రభుత్వోద్యోగి అని తెలియును. అతడు ఏమి చెప్పిన పాదుషా అది నమ్మును. కొండల వెనుక నుండి పడవ నడిపించుకొని పోవుదుము అన్న ఏ కొండ రాయికో కొట్టుకొనును. ఓడ దెబ్బ తినును. నష్టము వచ్చును. ఓడపై విలువ గల సరుకులు ఉన్నవి. వానిని తీరగ్రామములకు చేర్చుచు పోవలయును. ఎన్నియో ఇబ్బందులు. తుదకు కొంత లంచమిచ్చి ఆ మార్గముననే పోవుటకు కెప్తాను నిశ్చయించెను.

బ్రాహ్మణుడు మొదట లంచము గ్రహించుటకు అంగీకరింపనట్లు నటించెను. తుదకు కెప్తాను బలవంతముపై దానిని స్వీకరించినట్లు గ్రహించెను.

ఈ రీతిగ బ్రాహ్మణుడు ఓడలను అన్నిటిని ఆపుచుండెను. కెప్తానులు లంచమిచ్చి పోవుటకు అలవాటు పడిరి. ఈ వ్యవహారము ప్రతినిత్యమును కొంతకాలము సాగినది. బ్రాహ్మణుని ఇల్లు అంతయును బంగారము ఐనది. అతని యింట లక్ష్మి తాండవించు చుండెను.

ఢిల్లీలో వెనుక భార్యతో ఆనాడు కలహించునపుడు "పాదుషా నాకు ఏడు రూపాయల ఉద్యోగము ఇచ్చిన నిన్ను ఏడు అంతస్తుల మేడలో నిలుపుదు" నని

పల్కెను. ఆ మాట అతనికి ఒకనాడు జ్ఞప్తికి వచ్చినది. కెప్తానులు కావలసిన రాయి, సున్నము, కలప, తెచ్చియిచ్చిరి. దేశదేశముల నుండి చిత్రవిచిత్రములైన అలంకారములను కొనివచ్చి ఇచ్చిరి.

బ్రాహ్మణుని ఏడు అంతస్తుల మేడ పూర్తి ఐనది. అందు ఏడవఅంతస్తున వెండి చేరుల తూగుటుయ్యాల ఒక దానిని అతడు ఏర్పాటు చేయించెను. అతని భార్యకు కావలసినంత మంది దాస దాసీజనమును ఏర్పాటు చేయించెను. అతడు భార్యతో ఇంద్రభోగములు అనుభవించుచుండెను.

కొందరు ఉద్యోగులకు అతనిపై ఈర్ష్య కలిగినది. కాని బ్రాహ్మణుడు పాదుషా ప్రత్యేకముగ పిలిపించి ఇచ్చిన ఉద్యోగము చేయుచుండెను. అందువలన వారు అతనిని గూర్చి పైకి మాట్లాడుటకు భయపడుచుండిరి.

ఇట్లుండ అక్బరు పాదుషాకు అస్వస్థత ఏర్పడినది. ఈ అనారోగ్యము పోవుటకు కొంతకాలము సముద్రపుగాలి తగులవలయును అని వైద్యులు చెప్పిరి.

పాదుషా కొలది పరివారముతో మన బ్రాహ్మణుడు ఉన్న రేవు పట్టణమునకు వచ్చెను. ఆ సందర్భమున పాదుషా బ్రాహ్మణుని ఏడంతస్తుల మేడను చూచెను. తన సామ్రాజ్యమునందు అంతటను అతనికి అట్టి మేడ కనుపించలేదు. ఆశ్చర్యముతో స్థానికముగ ఉన్న ఉన్నతోద్యోగులను పిలిపించి "ఈ మేడ ఎవరిది?" అని వారిని ప్రశ్నించెను.

వారు "ఈ మేడ తమ అలల లెక్కల బ్రాహ్మణునిది" అని చెప్పిరి. ఆ మాటలు విన్న తరువాత పాదుషాకు ఆ బ్రాహ్మణుడు ఎవరో జ్ఞప్తికి వచ్చెను. అతని చాకచక్యమునకు, ధైర్యసాహసములకు పాదుషాకు ఆశ్చర్యము కలిగెను. "అతడు ఏదో అధర్మమార్గమున ధనము సంపాదించి ఉండును. లేకున్న ఇట్టి మేడ ఎట్లు కట్టగలడు?" అను భావము కలుగగా పాదుషాకు కోపము వచ్చెను.

పాదుషా ఆ బ్రాహ్మణుని మరునాడు సన్నిధికి పిలిపించెను. బ్రాహ్మణుడు భయభక్తులతో పాదుషా దర్శనము చేసెను.

"నీవు కడు పేదవాడవు. నీకు ఏడంతస్తుల మేడ కట్టుటకు ధనము ఎట్లు వచ్చినది? నిజము చెప్పుము. నిన్ను క్షమింతును. లేకున్న మరణదండన విధింతును!" అని పాదుషా బ్రాహ్మణుని భయపెట్టెను.

బ్రాహ్మణుడు జరిగిన కథ అంతయును దాచక పాదుషాకు విన్నవించెను. అక్బరు పాదుషా మనసున ఇట్లు తలపోసెను.

“నిజమే, ఇతడు చేసిన అధర్మమునందు నాకును కొంత పాలున్నది. భార్యతోడ ప్రగల్భములుగ పలికిన మాట పట్టుకొని ఏడు రూపాయల ఉద్యోగమును ఇచ్చితిని. ఏ మోసము చేయక ఇతడు ఎట్లు సంసారమును ఈదును? లంచము పట్టుటకు నేనే దారి చూపితిని. అతడు అలవాటు పడినాడు.”

పాదుషా బ్రాహ్మణునితో “నిన్ను క్షమించితిని. కాని నీ బుద్ధిబలమునకు మెచ్చుకొంటిని. నిన్ను నా మంత్రివర్గమున ఒకనిగ నియమించుచున్నాను. నీకు ఇష్టమేనా?” అనెను.

బ్రాహ్మణుడు చక్రవర్తి తనయెడ జూపిన ఔదార్యమునకు పరమానంద భరితుడయ్యెను. తరువాత మంత్రి వర్గమున చేరి చక్రవర్తికి కలిగిన అనేకములైన ఆపదలు తన బుద్ధిబలమున నివారించెను.

తెలివి కలిగిన దేశములను ఏలవచ్చును.

# దేశాభిమానము

పూర్వము రాజపుత్రస్థానమున అనేక రాజ్యములు ఉండెను. అట్టివానిలో చిత్తూరు ప్రసిద్ధికెక్కినది. చిత్తూరు మహారాజా మిక్కిలి బలవంతుడు.

చిత్తూరు రాజ్యము చుట్టుపట్ల హారావతి, బుందీ అను రెండు చిన్న సంస్థానములు ఉండెను. ఈ రెండు సంస్థానములను పాలించు ప్రభువులు పరమమిత్రులు.

బుందీ సంస్థానాధిపతి హమీ అతి ధైర్యసాహసములు కలవాడు. ఆడిన మాట తప్పనివాడు. ఇతడు పూర్వము హారావతి ప్రభువుకు "నీకు ఎట్టి ఆపద వచ్చినను నేను సాయమొనర్తును" అని వాగ్దానము చేసెను. ప్రాణములనుకూడ ఇచ్చి అతనికి తోడ్పడుటకు ఎల్లవేళల అతడు సంసిద్ధుడుగా ఉండెను.

చిత్తూరు మహారాణాకు 'బలవంతుడను నా కేమి?' అను గర్వము అధికము. అతనికి కావలసినంత సైన్యబలము ఉన్నది. కలహమునకు కాలుద్రువ్వి చిన్న సంస్థానములపై దండెత్తి ఆ సంస్థానప్రభువుల యొద్దనుండి అతడు కప్పములు విపరీతముగ గ్రహించుచుండెను. అందుచే చిన్న సంస్థానములలోని ప్రభువులు ప్రజలు విపరీతముగ బాధలు పడుచుండిరి.

'హారావతి మిక్కిలి చిన్న సంస్థానము. రాణా కన్ను దానిపై బడినది. దానిని జయించి చిత్తూరు రాజ్యమున కలుపవలయును' అని అతనికి కోర్కె కలిగెను. ఆ అభిలాషను తీర్చికొనుటకు గొప్ప సైన్యమును సిద్ధమొనర్చెను. "చిన్న పామె ఐనను పెద్ద కఱ్ఱతో కొట్టవలయును" అని అతని సిద్ధాంతము.

చిత్తూరు రాణా తన సైన్యముతో బుందీ సంస్థానము మీదుగ హారావతి పైకి దండెత్తిపోవుచుండెను. ఈ వార్త చారుల వలన బుందీప్రభువగు హామోకు తెలిసినది.

"ఎట్టి ఆపదలు వచ్చినను నీకు నేను సాయపడుదును" అని బుందీరాజు పూర్వము మిత్రుడైన హారావతి ప్రభువుకు మాట ఇచ్చెను కదా! తప్పుట ఎట్లు?

తనకడ ఉన్న కొలది సైన్యముతో బుందీప్రభువు మరణమునకు కూడ సిద్ధపడి చిత్తూరు రాణా సైన్యముపై బడెను. అర్ధరాత్రి సమయము, స్థలము రాణా సైన్యమునకు పరిచితము కానిది. బుందీ సైన్యము ప్రమథగణములవలె పోరాడిరి.

చిత్తూరు రాణాసైన్యము వారి ధాటికి ఆగలేకపోయిరి. ఓడిపోయిరి. చిత్తూరుకు పారిపోయి, ప్రాణములు కాపాడుకొనుట తప్ప వారికి మరియొక మార్గము లేకపోయినది. సేనకు నాయకుడైన రాణాకును పలాయనమే గతియయ్యెను.

బుందీ సంస్థానము తన రాజ్యముతో పోల్చిన ఎంత చిన్నది! దాని సైన్యము ప్రచండమైన తన సైన్యముతో పోల్చిన ఎంత? అట్టి స్థితిలో తనకు ఓటమి కలిగినది. చిత్తూరు రాణాకు ఇది భరింపరాని అవమానముగ తోచెను. ఆ అవమానము అతని యందు క్రోధముగ పరిణమించినది.

"బుందీకోట దహించి నేలమట్టము అగుట చూచిగాని నేను భుజింపను, అంతవరకును ప్రాయోపవేశమొనర్చెదను!" అని చిత్తూరు రాణా మనస్సున నిశ్చయించెను. మంత్రులకును సేనాధిపతులకును ఈ విషయము తెలియజేసెను.

వారు రాణా చేసిన ఘోరమగు నిర్ణయమునకు భయముచే కంపించిరి. అనేక విధముల చెప్పి ఆ నిర్ణయమును మాన్పుటకు వారు ప్రయత్నించిరి. కాని ప్రయోజనములేదు. రాణా ప్రాయోపవేశ మొనర్చెను. 'దండయాత్రకు బయలుదేరుడు' అని సైన్యమునకు ఆజ్ఞ నొసంగెను.

రాణా ప్రాణములు దక్కవలయునన్న స్వల్పకాలములో బుందీని జయింప వలయును. అది అంత సులభముగ సాధ్యపడదు. అదియునుగాక రాణా ప్రాయోపవేశమును గూర్చిన వార్త బుందీ ప్రభువుకు తెలిసినది. బుందీని ధైర్యము సాహసము కల సైనికులు కడు జాగరూకతతో రక్షించుచున్నట్లును వార్తలు వచ్చినవి. నిప్పుకు గాలి తోడ్పడినట్లు బుందీ ప్రభువునకు హారావతి పాలకుడు సాయము వచ్చెను. ఈ వార్త చిత్తూరు చేరెను.

చిత్తూరు రాణా ప్రాయోపవేశమును గూర్చి మంత్రులు ఆందోళనపడిరి. సభచేసి మంచి చెడ్డలు తర్కించిరి. ఎట్లైనను వారు బుద్ధికుశలత కలవారు. రాజు మాట అబద్ధము కాకూడదు. బుందీ సైనికులలో ఒక్కని కుత్తుకయందు ప్రాణము ఉన్నంత

వరకు ఆ కోట చిత్తూరు సైన్యమునకు చేజిక్కదు. మంత్రులు రాణా ప్రాణములను కాపాడుటకు ఒక ఉపాయమును ఆలోచించిరి.

"బుందీని పోలిన దుర్గమును ఒకదాని చిత్తూరుకోట బయట నిర్మింతుము. ప్రభువు దానిపై దండెత్తి పట్టుకొని దహించి నేలమట్టము చేయును. ప్రభువు ప్రతిజ్ఞ నెరవేరును. వారి ప్రాణములు దక్కును. తరువాత బుందీ పైకి పోయిన సైన్యము దానిని జయించి వచ్చి ప్రభువుకు ఆ వార్త చెప్పెదరు" అని చిత్తూరు మంత్రులు నిశ్చయించిరి.

చిత్తూరు దుర్గమునకు బయట బుందీకోటను పోలిన కోటను నిర్మించుట ప్రారంభించిరి. ఈ మాయబుందీ దుర్గమున బాటలు, తోటలు, సౌధములు, కోటగోడలు, బురుజులు అన్నియును నిజమైన బుందీ దుర్గమునకు ఉన్నట్లు ఏర్పరచిరి. మాయ బుందీ నిర్మాణము పూర్తియైనది. ప్రాయోపవేశము చేయుచున్న రాణాకు మంత్రులు ఈ పన్నుగడను తెల్పిరి. అతడు కొలది కాలములో అల్పసైన్యముతో వచ్చి మాయబుందీ దుర్గమును పట్టుకొనుటకు అంగీకరించెను.

చిత్తూరు రాణాకడ హారాశాఖవారు కొందరు ఉద్యోగములు చేయుచుండిరి. వారి జన్మస్థానము బుందీ వారికి నాయకుడు కూంబీ బైర్సీ.

బైర్సీ కొండజాతివాడు. ఇతనికి ఇతని శాఖవారికిని జంతువులను వేటాడుట అన మిక్కిలి ఇష్టము. మాయబుందీ పూర్తియగు వేళకు బైర్సీ లేళ్ళ వేట నుండి తిరిగి వచ్చెను. వచ్చినపుడు చిత్తూరునకు బైట నిర్మింపబడిన బుందీ దుర్గము అతని కంటబడినది. దానిని అక్కడ ఎందుకు కట్టిరో మొదట అతనికి అర్థము కాలేదు.

విచారించిన పిమ్మట "చిత్తూరు రాణా దానిపై దండెత్తి దానిని దహించి నేల మట్టము చేయును" అని అతనికి తెలిసినది. మరు క్షణమున అతనిలోని దేశాభిమానము పొంగి పొరలినది. ఉద్రేకముతో "రాణా బుందీని పట్టి దహించి నేలమట్టము చేసికొని భుజింపడట! నా జన్మదేశపు దుర్గము ఎట్లు పతనము అగునో, దానిని రాణా ఎట్లు నాశనమొనర్చునో చూచెదను" అని బైర్సీ మనస్సున తలపోసెను.

బైర్సీ చిత్తూరులో ఉన్న హారాశాఖీయులను అందరను ఒక ఏకాంత ప్రదేశమున సమావేశమొనర్చెను. అతడు వారికి జన్మదేశమగు బుందీకి కలుగనున్న అవమానమును గూర్చి తెలియచెప్పెను.

“మాయ బుందీని నాశన మొనర్చి ఒకటి నిజమైన బుందీని దహించిన ఒకటియా? మీ సర్వశక్తులతో రాణాను ఎదుర్కొనుటకు సిద్ధము కండు. మన జాతి ప్రతిష్ఠ దేశ గౌరవము నిలువ బెట్టుడు” అని బెర్సీ తన హారాశాఖీయులను ఉద్బోధించెను.

“బొమ్మ బుందీ కట్టిన మట్టికైనను అవమానము జరుగరాదు. బైర్సీ! ఈ పోరాటమున మాకు నాయకత్వము వహింపుము. మమ్ము నీ ఇష్టము వచ్చినట్లు నడిపింపుము” అని హారాశాఖీయులు బైర్సీని వేడిరి.

నాయకత్వము వహించుటకు బైర్సీ అంగీకరించెను. ‘జై! బైర్సీకి జై!’ జై! బుందీకి జై!’ అను వీర నినాదములు మిన్ను ముట్టెను.

చిత్తూరు రాణా తన దుర్గమునుండి కొలది సైన్యముతో బయలుదేరి మాయబుందీని నాశనముచేయ వచ్చెను. అతడు బొమ్మబుందీ యందు హుళక్కి పోరాటము జరుగును అని తలచెను.

యుద్ధమర్యాదను బట్టి ముందు ఒకనిని “దుర్గమును మాకు స్వాధీనము చేయుడు. లేకున్న నేలమట్టము కావింతును” అని కోటలోని వారితో చెప్పుటకు పంపెను.

అతనితో మాయబుందీ రక్షకులు “మేము మా ప్రాణములు ఉండగా మా దుర్గమును రాణాకు స్వాధీనము చేయుము. ఆయనకు శక్తి ఉన్న పోరాడుటకు సిద్ధపడి రమ్మనుము” అని వార్త పంపిరి.

ఈ వార్త విని రాణా అదియును మంత్రులు ఏర్పాటు చేసిన దానిలో భాగము అని తలచెను. రాణా ముట్టడిని ఆరంభించి తుపాకులను దుర్గముపైకి ప్రేల్పించెను. రాణా వారికి సమాధానముగా గుండ్లు లేని తుపాకులు ప్రేలునని అనుకొనెను.

బైర్సీ సైన్యము మాయబుందీ దుర్గమును కాపాడుచు గుండ్లు గల తుపాకులను ప్రేల్చిరి. ఈ విషయమును చూచి మంత్రులను రాణాయును ఆశ్చర్యపడిరి. విషయము ఏమో తెలిసికొని రావలసినది అని ఒకనిని బుందీదుర్గములోనికి పంపిరి.

అతడు దుర్గములోనికి ప్రవేశించి హారాశాఖీయుల నాయకుడైన బైర్సీని కలిసెను. “మీ ఎదుర్కోలు అపూర్వముగ ఉన్నది. దీనికి కారణము ఏమి?” అని ప్రశ్నించెను.

హారాశాఖీయుల నాయకుడు “బుందీ మా జన్మదేశపు దుర్గము. మాలో కొన ఊపిరి ఉన్నంతవరకును బుందీ రాణాకు చిక్కదు. ఈ వార్తను రాణాకు ఎరిగింపుము” అని అతని ప్రశ్నకు సమాధానము చెప్పెను.

ఆ సమాధానమును విని మంత్రులును రాణాయును ఆశ్చర్యమున మునిగిరి. రాణాకు తప్పునది ఏమియు లేదు. తనను కడుభక్తితో కొలుచుచున్న హొరాశాఖీయులు అందరును నేడు మరణింతురు. లేదా తన ప్రతిజ్ఞ నెరవేరవలెనన్న ప్రాణములు పోగొట్టుకొనవలయును. తనకు మించిన దానము ఏమి ఉన్నది?

రాణా కట్టుదిట్టములలో ఆ దుర్గమును ముట్టడించి హొరాశాఖీయులను తుదముట్టించి దుర్గమును గ్రహింప నిశ్చయించెను. లేకున్న అతని ప్రాణములు నిలుచునట్లు లేదు.

మరికొంత క్రొత్త సైన్యమును తెప్పించి ముట్టడి ప్రారంభించెను. యుద్ధము భయంకరముగ సాగినది. బైర్సీ సైన్యము తగిన శిక్షణ లేనివారు అయ్యును వారు కాలాగ్నిరుద్రుల వలె పోరాడిరి. వారి ధాటికి తాళజాలక రాణా సైన్యములో ఎందరో మడసిరి.

రాణా ఘోరముగ పోరాటము సాగించెను. హొరాశాఖీయుల సంఖ్య క్రమముగ తరిగిపోవుచుండెను. కాని వెన్నిచ్చి ఒక్కరును పారిపోవుట లేదు. తుదివరకు బైర్సీ సైన్యము సాహసముతో పోరాడెను. కొంతకాలము తీవ్రయుద్ధము జరిగిన పిమ్మట నాయకుడగు బైర్సీ తప్ప అందరును మడిసిరి. బైర్సీకి తీవ్రముగా గాయములు తగిలెను.

రాణా దుర్గమును స్వాధీనము చేసికొని వేగముగ బైర్సీని కలుసుకొనెను. బైర్సీ బాధతో "ప్రభూ! ఇంతకాలము మీ కొలువులో  ఉంటిమి. మీ ఉప్పు తింటిమి. తుదకు మీతో పోరాడితిమి. దేశభక్తి మమ్ము ఇట్లు ప్రేరేపించినది" అని వినయముతో పలికెను.

ఈ యుద్ధము రాణా హృదయమున గొప్ప మార్పును కలిగించెను. "బైర్సీ! నీ జాతి సాహసమునకు మెచ్చితిని. దేశముకంటె మించినది ఏమున్నది? జననియును జన్మభూమియును స్వర్గముకంటె అధికమైనవి. మీ బాధ నాకు అర్థమైనది. చింతపడకుము, ఈ నాడు నాతో పోరాడిన నీ మిత్రులు వీర స్వర్గమును అలకరింతురు" అని బైర్సీని మంచిమాటలలో రాణా సంతోషపెట్టెను.

బైర్సీ గాయములో బాధపడుచు "ప్రభూ! నన్ను మృత్యువు ఆహ్వానించుచున్నది. ఈ తుది క్షణమున నాదొక కోరిక ఉన్నది. దానిని తాము కాదనక తీర్పవలయును" అని రాణాకు ప్రార్థించెను.

రాణా “తప్పక సంతోషముతో తీర్చెదను” అని పలికెను. “మేము ఎంతకాలము మిమ్ము సేవించితిమి! మా జన్మ దేశమును నాశనము చేయకుడు. వాగ్దానమును ఇండు. తృప్తితో మరణింతును” అని బైర్సీ తన కోర్కెను రాణాకు తెలిపెను.

“నిన్ను పోలిన వీరులను ఎందరినో కన్న దేశమును పాడుచేయుటకు నా మనస్సు ఒప్పుట లేదు. నీకు వాగ్దానము చేయుచుంటిని. మీ దేశముపై దండెత్తను. ముందు పంపిన సైన్యములను ఇప్పుడే పిలువనంపెదను. మీ రాజుకు మీ వీరకథ చెప్పి పంపించి నేడో రేపో అతనితో సంధి కావించుకొనెదను. ఇదిగో ప్రమాణము” అని బైర్సీ చేతిలో చేయి ఉంచెను.

“మహాప్రభూ!” అని మహానందముతో రాణాను సంబోధించి, ఆయన చేతిని గుండెపై నిడుకొని బైర్సీ ప్రాణములు విడచెను.

దేశ గౌరవమే జాతి గౌరవము, వ్యక్తి గౌరవము!